# నందమూరి తారక రామారావు

# అసెంబ్లీ ప్రసంగాలు

**NTR LITERATURE, SOUVENIR & WEBSITE COMMITTEE**

Hyderabad


ప్రచురణ

Jayaprada Foundation

Hyderabad

**NANDAMURI TARAKA RAMA RAO**
**ASSEMBLY PRASANGALU**

©Jayaprada Foundation

**Edited by:**
Vikram Poola

**First Edition:**
April, 2023

**Copies:** 5000

**Price:** Rs.750 / $40

Published by:

Jayaprada Foundation

3A, Akshara Grand, Spaces & More Business Park,
Gachibowli, Hyderabad, Telangana - 500 032.
Phone: +91-96180 90983, 9885587666,
e-mail: support@jayapradafoundation.org
ntrc1923@gmail.com

**Cover Design:**
Srinivas K.

**Layout Design:**
Prasad P.

**DTP:**
Ismaiel Baig

**Printed at: Caxton Offset Pvt Ltd**
11-5-413, Hari Nagar, Red Hills,
Lakdikapul, Hyderabad - 500 004 (TS). Ph: 040-2339 5969

Copies Availabile at: All book stores

---

**Disclaimer:** All rights reserved for Jayapradha Foundation, Hyderabad. This book or parts thereof may not be reproduced in any form, stored in any retrieval system or transmitted in any form by any means electronic, Print, Web Channels, recording or otherwise without prior written permission of the Writer.

# స్మృత్యంజలి



నందమూరి తారక రామారావు గారి తల్లిదండ్రులు

**నందమూరి లక్ష్మయ్య - వెంకట రామమ్మ**

# పుణ్యదంపతులు



నందమూరి తారక రామారావు
శ్రీమతి బసవతారకం దంపతుల దివ్యస్మృతికి...



# ఎన్టీఆర్ స్ఫూర్తి ముందుకు నడిపిస్తోంది

నందమూరి తారకరామారావు గారి శతజయంతి సందర్భంగా **'ఎన్టీఆర్ లిటరేచర్, సావనీర్ అండ్ వెబ్‌సైట్ కమిటీ'** శాసనసభలో, వివిధ వేదికలపై ఎన్టీఆర్ చేసిన ప్రసంగాలను సంకలనం చేసి రెండు గ్రంథాలుగా వెలువరించడం, అదేవిధంగా ఆయనతో సాన్నిహిత్యం కలిగిన సినీ రాజకీయ ప్రముఖుల వ్యాసాలతో ఓ సావనీర్‌ను, ఆయన సమగ్ర జీవితానికి అద్దంపట్టే ఓ వెబ్‌సైట్‌ను తీసుకురావడం అభినందనీయం.

ఎన్.టి.రామారావు గారు అసెంబ్లీలో, విభిన్న వేదికలపై నుంచి చేసిన ప్రసంగాలు ఎప్పటికీ సజీవంగా చరిత్రలో నిలిచిపోతాయి. **'సమాజమే దేవాలయం-ప్రజలే దేవుళ్లు'** అని, **'పేదవాడికి పట్టెడన్నం పెట్టడమే తన విధానం'** అని రాజకీయాలకు అంతకు ముందెన్నడూ ఎవరూ చెప్పని తనదైన నిర్వచనం ఇచ్చిన నాయకుడు ప్రపంచంలో ఎన్.టి.రామారావు గారు ఒక్కరే. గంగా ప్రవాహంలా సాగిపోయే ఎన్.టి.రామారావు గారి ఉపన్యాసాలలో ఆయన అద్భుతమైన తెలుగు భాషా కౌశల్యంతోపాటు, సమాజాన్ని సమూలంగా మార్చాలన్న తపన, నిబద్ధత ప్రతిపదంలో ప్రతిధ్వనిస్తాయి.

ఎన్టీఆర్ గారి జీవితం అసాధారణమైనది, వైవిధ్యమైనది. ఊహకు అందని విలక్షణత ఆయన సొంతం. ఒక రంగంలో అత్యున్నత శిఖరం అధిరోహించి వేరొక రంగంలో ప్రవేశించి అక్కడ కూడా మహోన్నత స్థాయికి చేరడం భారతదేశ చరిత్రలో ఒక ఎన్.టి.రామారావు గారికే సాధ్యమైంది. క్రమశిక్షణ, పట్టుదల,

అంకితభావం, సమయపాలన, ఆత్మీయత, అభిమానం, నిర్భయత్వం, సాహసం.. వీటన్నింటి కలబోత ఎన్టీఆర్. ఆయన గురించి ఎంత చెప్పుకున్నా తరగదు. నిత్య చైతన్య స్రవంతిగా సాగిన ఆయన జీవితంలో అనేక కోణాలు, పార్శ్వాలు ఉన్నాయి. సినీరంగంలో ఆయన సాధించిన విజయాలు అసామాన్యం. రాజకీయ రంగంలో ఆయనొక సంచలనం. నిరంతరం పేదలు, బలహీన వర్గాలు, మహిళల గురించి ఆలోచించిన మానవతావాది, సంస్కరణాభిలాషి ఎన్టీఆర్. కనుకనే, రాజకీయ పార్టీ పెట్టిన 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చి పేదలు, బడుగుబలహీన వర్గాలు, మహిళల కోసం ఎన్నో వినూత్న కార్యక్రమాలు ప్రారంభించి వారి దిశ, దశను మార్చారు. దేశంలోని మిగతా రాజకీయ పార్టీలు సైతం సంక్షేమబాట పట్టాల్సిన అనివార్యతను కల్పించిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్. ఆయన స్వయంగా రూపొందించిన తెలుగుదేశం జెండాలోని నాగలి, చక్రం, గుడిశె గుర్తులు, పసుపురంగు చాలు ఆయన లక్ష్యమేమిటో చాటిచెప్పడానికి. రాజ్యాంగం రాష్ట్రాలకు కల్పించిన హక్కుల కోసం కేంద్రంతో ఆయన చేసిన రాజీలేని పోరాటం దేశ రాజకీయాలను మలుపు తిప్పాయి. నేషనల్ ఫ్రంట్ చైర్మన్‌గా దేశంలోని కాంగ్రేసేతర పార్టీలన్నింటిని ఏకతాటిపైకి తెచ్చి శిఖరాగ్ర సమావేశాలు (కాన్‌క్లేవ్)లు నిర్వహించి దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చివేశారు.

ఎన్టీఆర్ జీవితం నాతోపాటు ప్రతి ఒక్కరికీ గొప్ప ప్రేరణ. ఎన్టీఆర్‌తో కలసి పనిచేయడం నా జీవితంలో గొప్ప అనుభవం. ఆయన స్ఫూర్తి తెలుగుదేశం పార్టీని నిరంతరం ముందుకు నడిపిస్తోంది. ఎన్టీఆర్ ఆశయాల సాధన కోసం కృషి చేయడమే ఆయనకు మనం అందించే గొప్ప నివాళి.

**'ఎన్టీఆర్ లిటరేచర్, సావనీర్ అండ్ వెబ్‌సైట్ కమిటీ'** చేస్తున్న ఈ ప్రయత్నం విజయవంతం కావాలని కోరుకుంటూ సభ్యులందరికీ పేరుపేరునా అభినందనలు తెలియజేస్తున్నాను.



**నారా చంద్రబాబునాయుడు**

# నిత్యస్ఫూర్తి ప్రదాత



సాహసం, సంకల్పం, నైతిక బలం, లక్ష్యశుద్ధి పుష్కలంగా కలిగి ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సమాజంలో ఉన్నత ప్రజాస్వామిక విలువల పునరుద్ధరణే లక్ష్యంగా తన జీవితాన్ని అంకితం చేసిన అరుదైన మహానేత శ్రీ నందమూరి తారక రామారావు. రాష్ట్ర, జాతీయ రాజకీయాలలో శ్రీ ఎన్.టి. రామారావుది ఎన్నటికీ చెరిగిపోని ఓ విశిష్టముద్ర. పేదవాడి కన్నీటిని తుడవడమే తన పార్టీ సిద్ధాంతమని ప్రకటించి 'ఎన్టీఆర్ ఇజం'ను మించిన 'ఇజం' ప్రపంచంలోనే మరొకటి లేదని ఆచరణలో చూపించిన మానవతావాది ఎన్టీఆర్. పార్టీ స్థాపించిన 9 నెలల్లో అధికారంలోకి వచ్చిన శ్రీ ఎన్.టి.రామారావు **'సమాజమే దేవాలయం - ప్రజలే దేవుళ్లు'** అనే సిద్ధాంతం ప్రాతిపదికపై అధికారంలోకి వచ్చాక ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల లక్ష్యం ఏమిటన్నది ఆయన అసెంబ్లీ వేదికగా చేసిన ప్రసంగాలు తెలియజేస్తాయి. అధికారం చేపట్టిన తొలినాళ్లల్లో ఎన్టీఆర్‌కు ఎదురయిన అడ్డంకులు, అవరోధాలు.. వాటిని అధిగమించిన తీరు ఆయన ప్రసంగాలలో కనిపిస్తాయి. ఎన్టీఆర్ విశిష్టతను, పాలకుడిగా ఆయన గొప్పతనాన్ని తెలుసుకోవాలంటే ఆయన అసెంబ్లీ ప్రసంగాలను తప్పక చదవాలి. ఈ ప్రసంగాల గతానికే పరిమితం కాదు. అది వర్తమానం, భవిష్యత్తుకూ వర్తించే విషయం. అసెంబ్లీ వెలుపల వివిధ చారిత్రక సందర్భాలలో ఎన్టీఆర్ చేసిన స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలను సంకలనం చేసి 'ఎన్టీఆర్ చారిత్రక ప్రసంగాలు' గా మరో పుస్తకాన్ని అందిస్తున్నాము.

రాజకీయ రంగ ప్రవేశం చేయకముందు వరకు సినీనటుడిగా శ్రీ నందమూరి తారకరామారావు తెలుగు ప్రజలకు ఆరాధనీయుడు. చాలామందికి భగవత్‌స్వరూపుడు. ప్రపంచ సినీచరిత్రలో ఓ శిఖర ప్రాయుడు. ఆయన జీవితంలోని రెండు పార్శ్వాలైన సినీ జీవితం, రాజకీయ జీవితానికి సంబంధించిన అనేక విశేషాలు ఫోటోలు, వ్యాసాలు, పుస్తకాలు, ఆడియోలు, వీడియోల రూపంలో ఉన్నాయి. ఎన్టీఆర్‌పై వచ్చినన్ని పుస్తకాలు తెలుగునాట మరే ఇతర సినీ నటుడు, రాజకీయ నాయకుడి పేరిట రాలేదు.

ఎన్టీఆర్‌తో సన్నిహితంగా మెలిగే అదృష్టం పొందిన వ్యక్తులకు ఆయనకు సంబంధించిన సమగ్ర సమాచారం తెలుసు. అయితే రాబోయే తరాలవారికి శ్రీ ఎన్.టి.రామారావు గారి సినీ, రాజకీయ జీవితాలకు సంబంధించిన సమాచారాన్ని తెలియజేయాలనే ఉద్దేశంతో ఆ విశేషాలను సేకరించి ఆ మొత్తాన్ని ఎన్టీఆర్ వెబ్‌సైట్ ద్వారా అందరికీ అందుబాటులోకి తెస్తున్నాము. ఈ వెబ్‌సైట్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ ఉంటాము. క్లుప్తంగా చెప్పాలంటే ఎన్టీఆర్ సినీ, రాజకీయ, సాంస్కృతిక, రాజకీయ, సేవా రంగాలకు సంబంధించి ఎవరికి ఏ విశేషం కావాలన్నా ఈ వెబ్‌సైట్‌లో లభ్యం అవుతుంది. పైగా చాలా సులభంగా వెబ్‌సైట్ నుంచి సమాచారాన్ని పొందే వెసులుబాటు కల్పిస్తున్నాం. ఎన్టీఆర్ పేరుతో ఓ పూర్తిస్థాయి వెబ్‌సైట్ తేవడం ఇదే ప్రథమం.

శ్రీ నందమూరి తారకరామారావు గారి అసెంబ్లీ ప్రసంగాలు, చారిత్రక ప్రసంగాలు, ఎన్టీఆర్ వెబ్‌సైట్‌లతోపాటు 'శకపురుషుడు' అనే సావనీర్‌ను కూడా వెలువరిస్తున్నాం. ఇందులో ఎన్టీఆర్‌తో ఆయన సినీ, రాజకీయ రంగాలలో సన్నిహితంగా మెలిగిన సినీ నటులు, సాంకేతిక నిపుణులు, నిర్మాతలు, దర్శకులు, పంపిణీదారులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, బంధువులు, సహచర రాజకీయ నాయకులు, జాతీయ నాయకులు, పాత్రికేయులు.. ఇలా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో వ్యాసాలు రాయించాము. ప్రత్యేకంగా వీడియోలు చేయించాము. ఆ వీడియోలను వెబ్‌సైట్‌లో ఉంచుతాము. వాటిని అక్షరీకరించి సావనీర్‌లో అందిస్తున్నాము. ఎన్టీ రామారావు గారి బహుముఖ వ్యక్తిత్వాన్ని దర్శించిన ఆయా రంగాలలోని ప్రముఖులు తమ అభిప్రాయాలను, స్పందనను వ్యాసాల రూపంలో అందించారు. శ్రీ ఎన్.టి.రామారావు గారు ఓ మహోన్నతమైన వ్యక్తి అని అందరూ ఒప్పుకొంటారు. అయితే, ఆ మహోన్నతమైన వ్యక్తిత్వంలోని విశేషాలు ఏమిటన్నవి సమగ్రంగా ఆవిష్కరింపజేసి భావితరాలకు వాటిని అమూల్యమైన కానుకలుగా అందించడం మా ఉద్దేశం. అందుకు ఎన్టీఆర్ శతజయంతి సంవత్సరాన్ని మించిన గొప్ప సందర్భం మరొకటి ఏముంటుంది?

ఈ బృహత్ కార్యక్రమం ఇలా రూపుదిద్దుకోవడంలో **'ఎన్టీఆర్ లిటరేచర్, సావనీర్ & వెబ్‌సైట్ కమిటీ'** సభ్యుల కృషి, పట్టుదల, అంకితభావం ఉన్నాయి. తొలుత ఒకరిద్దరు మిత్రులం ఈ ఆలోచన చేశాము. క్రమంగా మరికొంత మంది మిత్రులను కలుపుకొన్నాం. అందరం కలిసి ఓ కమిటీగా

ఏర్పడ్డాం. తలా ఒక బాధ్యత స్వీకరించాము. కమిటీలో ఆంధ్రప్రదేశ్ శాసనమండలి మాజీ చైర్మన్ శ్రీ ఎం.ఏ.షరీఫ్, మాజీ రాజ్యసభ సభ్యులు శ్రీ రావుల చంద్రశేఖర రెడ్డి, ఎన్టీఆర్ వెబ్‌సైట్ అండ్ యాప్స్ సిఈవో శ్రీ అశ్విన్ అట్లూరి, తెలుగువన్ చానెల్ చైర్మన్ శ్రీ కంఠమనేని రవిశంకర్, సీనియర్ నిర్మాత, పంపిణీదారులు శ్రీ కాట్రగడ్డ ప్రసాద్ గార్లు వైస్‌చైర్మన్లుగా ఉండగా, పాత్రికేయుడు రాజకీయ విశ్లేషకులు శ్రీ విక్రమ్ పూల, పాత్రికేయుడు రచయిత శ్రీ భగీరథలు సెక్రటరీలుగా ఉన్నారు. సేవారంగ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనే సోషల్ యాక్టివిస్ట్ సినీ నిర్మాత శ్రీ అట్లూరి నారాయణరావు కన్వీనర్‌గా, ఆల్ ఇండియా ఎన్టీఆర్ ఫాన్స్ అధ్యక్షుడు శ్రీ శ్రీపతి సతీష్, శ్రీ రఘురామ్ కాసరనేని, శ్రీ సతీష్ మండవలు జాయింట్ సెక్రటరీలుగా ఉన్నారు. ట్రెజరర్‌గా ప్రముఖ పారిశ్రామిక వేత్త శ్రీ కె.వి.ఎస్. మధుసూదనరాజు ఉన్నారు. కమిటీలోని సభ్యులందరికీ ఎన్టీఆర్‌తో ప్రత్యక్షంగా, పరోక్షంగా అనుబంధం ఉంది. తీపి జ్ఞాపకాలున్నాయి. ఎన్టీఆర్ శతజయంతిని వినూత్నంగా నిర్వహించి ఆయన స్మృతులను శాశ్వత పర్చాలనే ఆలోచనే అందర్నీ ఈ మహత్‌కార్యానికి పురిగొల్పింది. ఎన్టీఆర్ స్ఫూర్తి అందర్నీ ముందుకు నడిపింది.

ఈ యజ్ఞంలో మాతోపాటు పాల్గొని మాకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించిన సినీ జర్నలిస్ట్ శ్రీ యు.వినాయకరావు, బాపట్ల విద్యా సంస్థల అధినేత శ్రీ రామ్మోహనరావు, మనసు ఫౌండేషన్ అధినేత శ్రీ రాయుడు, సాహితీ పరిశోధకులు శ్రీ పారా అశోక్ కుమార్, తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ కార్యాలయ కార్యదర్శి శ్రీ సత్యనారాయణ, శ్రీ పోశాల విజయభాస్కర్‌లకు మనఃస్ఫూర్తిగా ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

ఎన్.టి.రామారావు గారికి ఓఎస్డీగా పనిచేసిన గోటేటి రామచంద్రరావు గారు మాకెంతో ప్రోత్సాహం అందించారు. ఇటీవల ఆయన పరమపదించడం దురదృష్టకరం. ఆయనకు మా నివాళి.

ఈ మహాయజ్ఞంలో పాల్గొనడం మా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాం. ఈ కార్యక్రమం చేస్తున్నందుకు మమ్మల్ని వెన్నుతట్టి ప్రోత్సహించిన తెలుగుదేశం అధ్యక్షులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి కమిటీ తరఫున మనఃపూర్వక నమస్కారాలు తెలియజేస్తున్నాము.



**టి.డి. జనార్దన్**

చైర్మన్

*ఎన్టీఆర్ లిటరేచర్, సావనీర్ & వెబ్‌సైట్ కమిటీ*

# ఎన్టీఆర్ లిటరేచర్, సావనీర్ & వెబ్‌సైట్ కమిటీ



టి.డి. జనార్ధన రావు,
చైర్మన్

శ్రీ తొండపు దశరథ జనార్ధన్ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక సభ్యులు. నాగార్జున విశ్వ విద్యాలయంలో ఎం.ఏ. ఎకనామిక్స్ పూర్తిచేసి, మండల పార్టీ అధ్యక్షునిగా, 9 సం॥ కృష్ణాజిల్లా డిసిసిబి అధ్యక్షులుగా, 9 సం॥ పాటు రాష్ట్ర సహకార బ్యాంక్ చైర్మన్‌గా, 6 సం॥ పాటు అఖిల భారత వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకుల సమాఖ్య చైర్మన్‌గా పని చేసి జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక అవార్డులు పొందారు. ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులుగా 6 సం॥ ఉన్నారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ రాజకీయ కార్యదర్శిగా, పొలిట్‌బ్యూరో సభ్యులుగా సేవలందిస్తున్నారు.

---

న్యాయవాదిగా వృత్తి జీవితాన్ని ప్రారంభించిన శ్రీ ఎం.ఏ.షరీఫ్ ఎన్టీఆర్ పిలుపు మేరకు తెలుగుదేశం పార్టీలో సభ్యులుగా చేరారు. పార్టీలో వీరు అనేక పదవులు నిర్వహించారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా మూడు పర్యాయాలు పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ శాసన మండలి చైర్మన్‌గా ఉన్నప్పుడు పార్లమెంటరీ సంప్రదాయాలు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు కృషి చేసి జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు.



ఎమ్.ఏ. షరీఫ్,
వైస్ చైర్మన్

---



రావుల చంద్రశేఖర రెడ్డి,
వైస్ చైర్మన్

న్యాయవాదిగా వృత్తి జీవితాన్ని ప్రారంభించిన శ్రీ రావుల చంద్రశేఖరరెడ్డి ఎన్టీఆర్ పిలుపునందుకొని తెలుగుదేశం పార్టీలో సభ్యులుగా చేరి పార్టీలో పలు కీలకమైన పదవులు నిర్వహించారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఒక పర్యాయం రాజ్యసభ సభ్యులుగా, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థకు చైర్మన్‌గా రెండు పర్యాయాలు పని చేశారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులుగా ఉన్నారు.

---

శ్రీ అశ్విన్ అట్లూరి 2000 సంవత్సరం నుంచి అమెరికాలో నివసిస్తున్న ప్రవాసాంధ్రుడు. ఎన్.టి.ఆర్ వెబ్ సైట్ సి.ఈ.ఓ. కరోనా సమయంలో అమరావతిలో ఆరోగ్య శిబిరాలని ఏర్పాటు చేసి ఎందరికో సాయం చేశారు. అలాగే ఆ ప్రాంతాల్లో ప్రాణాలు కోల్పోయిన రైతు కుటుంబాలకు కూడా సహాయం అందించారు. సంగీత ప్రియుడైన అశ్విన్ ఆంధ్ర ప్రదేశ్‌లోని ప్రస్తుత పరిస్థితులపై పాటలు వ్రాసి ప్రజలను చైతన్య పరుస్తున్నారు.



అట్లూరి అశ్విన్,
సి.ఈ.ఓ., ఎన్టీఆర్ వెబ్‌సైట్



శ్రీ కంఠమనేని రవిశంకర్ తెలుగు వన్ సంస్థ వ్యవస్థాపకులు మరియు మేనేజింగ్ డైరెక్టర్. ఎమ్.బి.ఎ. చదివిన రవిశంకర్ కొంతకాలం పాటు టాటా కన్సల్టెన్సీలో పనిచేసి తరువాత అప్పుడే ప్రారంభమౌతున్న సాఫ్ట్‌వేర్ రంగంలో అడుగుపెట్టారు. తెలుగు ప్రజలకు వినోదంతో పాటు సమాచారాన్ని అందించే లక్ష్యంతో తెలుగు వన్ పోర్టల్‌ను ప్రారంభించారు. తెలుగు వన్ ఫౌండేషన్ ద్వారా ప్రాణాంతక వ్యాధితో బాధపడే రెండు వేల మంది ప్రజలకు శస్త్రచికిత్స చేయించి ప్రాణాలు నిలబెట్టారు.

**కంఠమనేని రవిశంకర్,**
వైస్ చైర్మన్



శ్రీ కాట్రగడ్డ ప్రసాద్, సినిమా రంగంలో ఐదు దశాబ్దాల అనుభవం వుంది. తెలుగులో 18, తమిళంలో 10, కన్నడంలో 5 చిత్రాలు నిర్మించారు. కృష్ణా జిల్లాలో ఎన్నో తెలుగు సినిమాలను పంపిణీ చేశారు. దక్షిణ భారత చలన చిత్ర వాణిజ్య మండలి గౌరవ కార్యదర్శిగా, గౌరవ అధ్యక్షుడుగా, తెలుగు నిర్మాతల మండలి గౌరవ కార్యదర్శిగా, ఫిలిం ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యవర్గ సభ్యుడుగా పనిచేశారు.

**కాట్రగడ్డ ప్రసాద్,**
వైస్ చైర్మన్



ఎం.ఏ, ఎల్.ఎల్.బి. చేసిన శ్రీ విక్రమ్ పూల వివిధ పత్రికలకు సంపాదకులుగా పనిచేశారు. వందకు పైగా కథలు, వందలాదిగా వ్యాసాలు రాశారు. 1993లో పల్లకి వారపత్రికలో ఎన్టీఆర్ జీవిత చరిత్రపై ధారావాహిక రాశారు. రాజకీయాల నేపథ్యంగా 3 పుస్తకాలు రాశారు. తెలుగుదేశం పక్ష పత్రికకు ఎడిటర్‌గా పని చేశారు. ప్రస్తుతం ఫ్రీలాన్స్ జర్నలిస్ట్‌గా, పొలిటికల్ ఎనలిస్ట్‌గా పని చేస్తున్నారు.

**విక్రమ్ పూల**
కార్యదర్శి



శ్రీ భగీరథ, సీనియర్ జర్నలిస్ట్, ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభలో పనిచేశారు. 16 పుస్తకాలు రచించారు. 25 అవార్డులు వచ్చాయి. నంది, జాతీయ, ఆస్కార్ సినిమా అవార్డుల కమిటీ సభ్యుడుగా పనిచేశారు. 'ప్రియమైన శ్రీవారు', 'సామాన్యుడు', 'స్వాగతం' చిత్రాలకు ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్‌గా పనిచేశారు. 2007 నుంచి దక్షిణ భారత చరిత్రపై పరిశోధన చేస్తున్నారు. 2014లో వంగూరి ఫౌండేషన్ ఆహ్వానంపై అమెరికా సందర్శించారు.

**భగీరథ,**
కార్యదర్శి



శ్రీ అట్లూరి నారాయణ రావు ఎమ్మెస్సీ, ఎమ్.ఫిల్ చేసి అధ్యాపకుడుగా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో జీర్ణావస్థలో వున్న దేవాలయాలకు సహాయం చేశారు. కరోనా కాలంలో అన్నార్తులకు ఆహారాన్ని అందించారు. శ్రీరామ్ మూవీస్, వైష్ణవీ ఫిలిమ్స్‌పై నాలుగు సినిమాలు నిర్మించారు. 20 సినిమాలకు పైగా పంపిణీ చేశారు. అట్లూరి నారాయణ రావు ట్రస్ట్ వ్యవస్థాపకులు.:

**అట్లూరి నారాయణరావు,**
కన్వీనర్

---

అల్ ఇండియా ఎన్.టి.ఆర్. అభిమాన సంఘానికి వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ మంత్రి శ్రీపతి రాజేశ్వర రావు, వారి కుమారుడు శ్రీ శ్రీపతి సతీష్ కుమార్ ప్రస్తుతం అల్ ఇండియా ఎన్.టి.ఆర్. అభిమాన సంఘానికి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వున్నారు.



**సతీష్ శ్రీపతి,**
సంయుక్త కార్యదర్శి

---



శ్రీ మండవ సతీష్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ చేసి డిజిటల్ మార్కెటింగ్, బ్యాంకింగ్ మరియు ఆర్థిక రంగాలలో గత రెండు దశాబ్దాలుగా సేవలు అందిస్తున్నారు. వాల్యూ ప్రాప్ మీడియా వర్క్స్ వ్యవస్థాపకులు. ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉపాధి మరియు విద్యకు ప్రోత్సాహాన్ని అందించే సంస్థలతో కలిసి పని చేస్తున్నారు.

**మండవ సతీష్,**
సంయుక్త కార్యదర్శి

---

శ్రీ కాసరనేని రఘురామ్ ఇంజనీరింగ్ పట్టభద్రులు. ప్రస్తుతం వీరు ఆండ్స్ కన్సల్టింగ్ సంస్థ డిజిటల్ మార్కెటింగ్ విభాగానికి ఇన్‌ఛార్జ్‌గా ఉన్నారు. చాలా సంవత్సరాలుగా వ్యాపార రంగాలకు సంబంధించిన సంస్థలకు సలహాదారుగా పనిచేశారు. ప్రస్తుతం జయప్రద ఫౌండేషన్‌కి ఎగ్జిక్యూటివ్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు.



**కాసరనేని రఘురామ్,**
సంయుక్త కార్యదర్శి

---



శ్రీ కె.వి.ఎస్. మధుసూదన రాజు, ప్రముఖ ఇంటీరియర్ కంపెనీ ఐకాన్స్ వ్యవస్థాపకులు. సామాజిక కార్యక్రమాలు, లలిత కళల పట్ల ఆసక్తి, అభిరుచి ఉన్న మధుసూధన రాజు వాటికి ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు.

**కె.వి.ఎస్. మధుసూదన రాజు,**
కోశాధికారి

# లోపలి పేజీలలో...

## ముఖ్యమంత్రిగా..

1. పాలనా యంత్రాంగంలో స్పీకర్‌ది మకుట స్థానం ........................................ 1

2. ఇది రైతును రక్షించే రాజ్యం ........................................ 3

3. ప్రభుత్వ రంగ సంస్థలను స్వయం పోషక సుస్థిర సంస్థలుగా తీర్చిదిద్దుతాం ........................................ 7

4. ప్రణాళికా బద్ధంగా రైతు సంక్షేమం ........................................ 9

5. కేంద్ర, రాష్ట్ర సంబంధాలను సమీక్షించి వనరులను సమతుల్యమైన రీతిలో పంపిణీ చేయాలి ........................................ 11

6. రైతుకు గౌరవ స్థానాన్ని, ఆర్థిక పరిపుష్టిని కల్పించడమే మా విధానం ........................................ 14

7. ఎవరి మీదా ఒత్తిడి తెచ్చే ప్రసక్తి లేదు ........................................ 18

8. రాజకీయ పవిత్రతకు పట్టం కడదాం! ........................................ 20

9. ప్రజాధనం పైసా దుర్వినియోగం అయినా అది ఆమోదయోగ్యం కాదు ........................................ 23

10. అందరికీ న్యాయం చేయటం ఈ ప్రభుత్వ విధానం ........................................ 26

11. చేనేత వారి సంక్షేమం ఈ ప్రభుత్వ బాధ్యత ........................................ 28

12. బాధితుల కన్నీళ్లు తుడుస్తాం, అండగా నిలబడతాం ........................................ 31

13. విశాఖ స్టీల్‌కు కేంద్రం పరిమితంగా నిధులు కేటాయించడం ఆందోళనకరం ........................................ 37

14. పరిశ్రమలను గ్రామాల వద్దకు తీసుకొని వెళ్లడం ఈ ప్రభుత్వ పారిశ్రామిక విధానం ........................................ 39

15. తుపాకీ చూపించి శాంతి నెలకొల్పబడుతుందని అనడంలో నాకు నమ్మకంలేదు ........................................ 50

16. 'ఉద్యోగుల పట్ల మాకు సోదర భావం ఉంది' ........................................ 54

17. ఈ చర్య ఆరంభం మాత్రమే, అంతం కాదు ........................................ 62

18. పేదవారి ఆకలిని గమనించండి, సహకరించి పుణ్యం కట్టుకోండి ........................................ 65

19. పోలవరంను జాతీయ ప్రాజెక్టుగా చేపట్టవలసిన ఆవశ్యకతను వివరించాను........................................ 69

20. ఎన్నైనా రాయితీలు ఇవ్వవలసిందే!
పేద ప్రజల విషయంలో సందేహం అవసరం లేదు ................................ 72
21. కాలే కడుపులతో అలమటిస్తున్న వారి కోసమే
రూ. 2లకు కిలో బియ్యం................................................................ 75
22. మాతృభూమి రుణం తీర్చుకోమని ప్రవాసాంధ్రులను కోరాను ................ 79
23. ఒక కప్పు కాఫీ కోసం కూడా ఒక్క పైసా అక్కడ ఖర్చుచేయలేదు ............... 85
24. కన్నీటితో కడుపు నింపుకొనే ప్రజానీకం సంక్షేమానికి
మా ప్రభుత్వం అంకితమైనది ........................................................... 90
25. పరిశుద్ధమైన పరిపాలనను ప్రజలకు అందిస్తాము ................................ 101
26. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతీకలు పాత్రికేయులు ................................ 103
27. వృత్తిపరమైన విద్యాబోధనతోనే నిరుద్యోగ సమస్య పరిష్కారం .................... 106
28. సింగిల్ విండో సిస్టమ్ రైతులకు చాలా సదుపాయంగా ఉంటుంది................ 111
29. హైదరాబాద్‌లో చక్కని సౌకర్యాలు కల్పిస్తాం ........................................ 113
30. అధికార వికేంద్రీకరణ మా విధానం, ఆదర్శం........................................ 115
31. ప్రజల కన్నీళ్లను తుడిచే ప్రభుత్వం మాది............................................ 127
32. సమపాళ్ల సమన్వయ సిద్ధాంతంతో నడిపించడం
ఈ ప్రభుత్వ ధ్యేయం ...................................................................... 130
33. పరస్పర విశ్వాసంతో, గౌరవంతో, అభిమానంతో
ఈ సమస్యను పరిష్కరించుకోవాలి .................................................. 138
34. సమాన హక్కులు, అవకాశాలు సమాజంలో సర్వులకు
సంప్రాప్తింప జేయాలనేదే ప్రభుత్వ సంకల్పం ...................................... 142
35. చెట్టుకూ, పుట్టకూ, గుట్టకూ, నీటికీ,
ప్రతిదానికి కేంద్ర ప్రభుత్వం దగ్గర చేయి చాచాలా?! ............................. 158
36. పరిశ్రమ కుంటుపడినప్పుడు దాన్ని శ్రామికులకే అప్పగించాలి ................... 179
37. సమాజాన్ని పోషించే ప్రతి వర్గానికి స్వాతంత్ర్యం ఉండాలి ....................... 185
38. ప్రజలే మాకు దేవుళ్ళు, సమాజమే మాకు దేవాలయం ............................ 189
39. ఈ కార్యక్రమాలు చరిత్రలో
సువర్ణాక్షరాలతో శాశ్వతంగా ఉండగలవు.......................................... 204
40. అందరి యెడల సరైన భావం, బాధ్యత మాకు ఉన్నది.............................. 209

41. ప్రతీ చుక్క నీటిని సద్వినియోగం చేసుకోడానికి అవకాశం ఉంది ................ 215
42. అన్ని ప్రాంతాల ప్రజానీకం ఎంతో నమ్మకముతో
తెలుగుదేశాన్ని గౌరవించారు. ........................................................ 221
43. అనుమానాలు లేకుండా సరియైన అవగాహనతో
రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకొందాం ........................................................ 225
44. N.T.R. is the only leftist in this country ........................ 231
45. 'హంద్రీ – నీవా సుజల ప్రవంతి' బహుళార్ధ సాధక పథకం రాయలసీమ
ప్రజలందరికీ సంతృప్తి చేకూర్చగలదు ........................................................ 243
46. సమాజములో అసమానత్వం పోవాలి,
పేదవారిపట్ల నిర్లక్ష్య భావం పోవాలి................................................ 245
47. మన రాష్ట్రం యొక్క హక్కులను కాపాడడానికి, వినియోగించుకోడానికి
ప్రవేశపెడుతున్న తీర్మానాన్ని అందరూ బలపర్చాలి ................................ 262
48. రాష్ట్ర అభివృద్ధి కోసం అందరం కృషి చేద్దాం........................................ 265
49. హామీలను గౌరవించడం ధర్మంగా భావించాలి.......................................... 270

## ప్రధాన ప్రతిపక్ష నేతగా..

1. మా పథకాలు కొనసాగించండి, మీ హామీలు నెరవేర్చండి! ...................... 275
2. పేదవాళ్లకు లక్షల్లో పక్కా గృహాలు కట్టించిన ఘనత మాదే ....................... 297
3. కుప్పంలో ద్రావిడ విశ్వవిద్యాలయాన్ని పెట్టాలని
వెయ్యి ఎకరాల భూమిని కేటాయించాం ................................................ 299
4. ప్రభుత్వమన్నది ప్రజాస్వామ్య పచారీ దుకాణం కాదు .............................. 301
5. తెలుగుదేశం మేధస్సులో పుట్టిన బిడ్డ తెలుగుగంగ.................................. 326
6. అమాయకులు దుర్మరణం చెందటం ప్రభుత్వ వైఫల్యంగా
అంగీకరించక తప్పదు ........................................................................ 334
7. రైతులపై బనాయించిన కేసులను వెంటనే ఉపసంహరించాలి.
ఎరువులను పాత ధరలకే అమ్మే విధంగా చర్యలు తీసుకోవాలి.................... 337
8. పశువులను కసాయివాళ్ళకు అమ్ముకుని బ్రతికే
దుస్థితి వచ్చింది. ప్రభుత్వం కళ్లు తెరవాలి ............................................ 347
9. అన్నం పెట్టే రైతుకు మీ పాలనలో అన్యాయం జరుగుతోంది........................ 353

10. కాంగ్రెస్ పాలనలో ఇప్పటికి 100 మంది
చేనేత కార్మికులు చనిపోవడం దారుణం!........................................ 358
11. ముడుపులు తీసుకుని ఈ కాలేజీలు ఇచ్చారని ఘంటాపథంగా అంటున్నారు ........ 362
12. ఎవరిది ఈదేశం? ఎవరిది ఆ డబ్బు? పేదవాడిది కాదా? ....................... 375
13. రైతుల నోటి ఎంగిలి కూడు తినే
ఈ ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగా గర్హిస్తున్నా!........................................ 393
14. మనకు అధికారం ఉన్నది పాపాలు చేసిన వారిని,
దుర్మార్గులను సమర్థించడానికి కాదు ................................................ 398
15. ట్యాంపరింగ్ ఆఫ్ రికార్డ్స్ ఎందుకు చేశారు? రికార్డ్స్ ఎందుకు మార్చారు?.......... 402
16. మతసామరస్యం మంట కలిసింది.
సహెూదర భావము కుప్పకూలిపోయింది ............................................ 405
17. సూచనలు ఇవ్వమన్నారు, నేను సొల్యూషన్
ఇస్తున్నాను. తీర్మానం పెట్టండి! .................................................... 417
18. వివాధాస్పదమైన ఫైల్స్ అన్నీ స్పీకర్ ఛాంబర్‌లో ఉంచాలి ....................... 420

## సంతాప తీర్మానాలు..

1. ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ హత్యపై సంతాపం ................................ 423
2. పుచ్చలపల్లి సుందరయ్య గారి మృతికి సంతాపం ................................. 425
3. శ్రీ ఆరుట్ల రామచంద్రారెడ్డి మృతికి సంతాపం........................................ 427
4. మాజీ ముఖ్యమంత్రి టి అంజయ్య మృతికి సంతాపం .................................. 429
5. మాజీ ప్రధాని శ్రీ చరణ్ సింగ్ మృతికి సంతాపం ..................................... 432
6. ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ సభ్యురాలు
శ్రీమతి జె. ఈశ్వరీబాయిగారి మృతిపట్ల సంతాపం .................................. 434
7. ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ సభ్యులు
శ్రీ రావి నారాయణ రెడ్డి మృతిపట్ల సంతాపం ......................................... 436
8. ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభ్యులు
శ్రీ నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మృతిపట్ల సంతాపం ................................ 438

**చరిత్ర సృష్టించిన ఎన్టీఆర్ పథకాలు** .......................................................... 441

## సమున్నత చరిత్ర - సజీవ సాక్ష్యాలు



పార్టీ జెండాకు వందనం



ప్రభంజనం సృష్టించిన సైకిల్ ప్రచారం



అన్నకు వీరతిలకం



వృత్తిదారుడి వెతలను శ్రద్ధగా వింటున్న 'అన్న'



అభిమాని ఆత్మీయ ఆలింగనం



గిరిజనుల మహిళలకు ఆత్మీయ పలకరింపు



అన్నగారిపట్ల ఆడపడుచుల అభిమానం - పార్టీకి విరాళంగా చెవికమ్మలు



ఎన్టీఆర్ చైతన్య యాత్రలో ఉరకలెత్తిన ప్రజల ఉత్సాహం




చైతన్యరథం లోపల విదేశీ పాత్రికేయులకు ఇంటర్వ్యూ





రాజకీయాలలో కొత్త పుంతలు





సామాన్యుడిగా రోడ్లపైననే స్నానాదికాలు



పోటెత్తిన జన సందోహం



అన్నను చూసి ప్రజల పులకింత




పోలింగ్ బూత్‌లో ఎన్టీఆర్, శ్రీమతి బసవ తారకమ్మ దంపతులు





ఓటు వేస్తున్న ఎన్టీఆర్



9-1-1983న హైదరాబాద్ లాల్ బహదూర్ స్టేడియంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ అబ్రహాం
శ్రీ యన్.టి. రామారావు గారిచే ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయిస్తున్న దృశ్యం



ప్రజల సమక్షంలో చరిత్ర సృష్టించిన ఎన్టీఆర్ ప్రమాణ స్వీకారం



9 మార్చి, 1985న ఎన్టీఆర్‌తో రాష్ట్ర ముఖ్యమంత్రిగా
ప్రమాణం చేయిస్తున్న గవర్నర్ శంకర్‌దయాళ్ శర్మ



12 డిసెంబర్, 1994న రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్‌తో ప్రమాణం
చేయిస్తున్న గవర్నర్ కృష్ణకాంత్



శాసనసభా నాయకుడిగా ముఖ్యమంత్రి ఎన్టీఆర్



ప్రధాన ప్రతిపక్షనేతగా ఎన్టీఆర్



ముఖ్యమంత్రిగా అసెంబ్లీలోకి ప్రవేశిస్తున్న ఎన్టీఆర్, చంద్రబాబు తదితరులు




శాసనసభా నాయకుడిగా ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అసెంబ్లీలో ప్రసంగం



ముఖ్యమంత్రి ఎన్టీఆర్ సమక్షంలో అసెంబ్లీలో ప్రసంగిస్తున్న చంద్రబాబునాయుడు



కాంగ్రెస్ పార్టీ నియంతృత్వ వైఖరికి నిరసనగా అసెంబ్లీ బయట
తన సహచర శాసనసభ్యులతో ఎన్టీఆర్ ధర్నా



తెలుగు కుటీరంలో ధర్మపత్ని శ్రీమతి బసవ తారకమ్మతో ఎన్టీఆర్



తెలుగు కుటీరంలో జాతీయ నేతలతో సమావేశమైన ఎన్టీఆర్



వాజ్‌పేయి, అజిత్‌సింగ్ తదితరులతో ఎన్టీఆర్




రాష్ట్ర ప్రతినిధుల సభ 'మహానాడు'



విజయోత్సవ సభలో ఎన్టీఆర్, తదితర నేతలు



చంద్రబాబునాయుడు, దగ్గుబాటి వెంకటేశ్వరరావుతో ఎన్టీఆర్

## ఎన్టీఆర్ సంక్షేమ పథకాలు





విశిష్ట పథకాలకు శ్రీకారం



పేదవాళ్ల ఆకలి తీర్చిన రూ. 2లకే కిలో బియ్యం



పేదలకు ఇళ్లపట్టాల పంపిణీ



పక్కా ఇళ్లకు ప్రారంభోత్సవం



వ్యవసాయానికి రూ. 50కే హార్స్‌పవర్ విద్యుత్



సగం ధరకే జనతా వస్త్రాల పంపిణీ



పేద మహిళలకు స్వయం ఉపాధి

ముఖ్యమంత్రిగా

# శ్రీ నందమూరి తారక రామారావు

# అసెంబ్లీ ప్రసంగాలు



జనవరి 18, 1983

# పాలనా యంత్రాంగంలో స్పీకర్‌ది మకుట స్థానం

*(ముఖ్యమంత్రి, ఇతర రాజకీయ పక్ష నాయకులు శ్రీ తంగి సత్యనారాయణను అధ్యక్ష స్థానానికి సగౌరవంగా తీసుకువచ్చి ఆసీనులను గావించారు)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, సహచరులకు, సోదర సోదరీమణులకు నిన్నటి నుంచి ఏడవ శాసనసభ సమావేశం ప్రారంభమైన సంగతి తెలిసినదే. తాత్కాలిక సభాపతిగా శ్రీ కాటూరి నారాయణస్వామి గారు అధ్యక్షత వహించి నిన్నటి సమావేశంలో సభ్యుల పదవీ స్వీకార కార్యక్రమాన్ని, నేడు తమ ఎన్నిక కార్యక్రమాన్ని జయప్రదంగా నిర్వహించడం కూడా జరిగింది. శ్రీ నారాయణ స్వామి గారు చాలా హుందాతో, నిండుతనంతో తమ కర్తవ్యాన్ని నిర్వహించి సభా మర్యాదకు, వారు అలంకరించిన పదవికి వన్నె తెచ్చారు. వారు ఎంతో అద్భుతమైన నిపుణతతో, గౌరవ భావంతో ఆ పదవికి వన్నె చేకూర్చినందుకు వారికి సభాపక్షాన హృదయపూర్వకమైన కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ప్రజాస్వామ్యం అంటే రాజకీయ పక్షాలు, శాసనసభ మనకు గుర్తుకు వస్తాయి.

శాసనసభ అనగానే సభాధ్యక్షులు ఎవరు అని అడుగుతారు అందరూ. మహారాజుకు కిరీటం ఎటువంటిదో శాసనసభకు అధ్యక్షులుగా ఉన్నవారు అటువంటి హుందాతనాన్ని కలిగించే వారు, గౌరవాన్ని కలిగించేవారు, వన్నె చేకూర్చేవారు అనే అవగాహన అందరిలో ఉంది. ప్రజాస్వామ్యంలో

ఇది అత్యంత ఉత్కృష్టమైనది కూడా. ప్రాచీన కాలంలో ఆంగ్ల దేశమందు ఆయన ప్రజలకు, రాజులకు మధ్య ఒక సంధాన కర్తగా వారికి, వీరికి సమన్వయం చేకూర్చే ఒక వ్యక్తిగా, శక్తిగా వ్యవహరిస్తూ ఉండేవారు. కనుక వారికి పాలనా యంత్రాంగంలో మకుట స్థానం ఇవ్వడం జరిగింది. అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం కూడా జరిగింది. శాసనసభలోని సభ్యులు ఏ రాజకీయ పక్షాలకు చెందిన వారైనప్పటికీ వారందరి హక్కులను పరిరక్షించే గురుతరమైన బాధ్యత స్పీకర్ మీద ఉంది.

**శాసనసభలోని సభ్యులు ఏ రాజకీయ పక్షాలకు చెందిన వారైనప్పటికీ వారందరి హక్కులను పరిరక్షించే గురుతరమైన బాధ్యత వారి మీద ఉంది. ప్రజాస్వామిక సంస్థలపైన, వాటి సిద్ధాంతాలపైన ప్రజలకు విశ్వాసం కలిగించే, గౌరవాన్ని ఇనుమడింపచేసే మహత్తర బాధ్యత వారిపై ఉంది. మీరు ఈ ఉన్నతమైన పదవికి ఎన్నిక కావడం మా అందరికీ సంతోష కారణం.**

ప్రజాస్వామిక సంస్థలపైన, వాటి సిద్ధాంతాలపైన ప్రజలకు విశ్వాసం కలిగించే, గౌరవాన్ని ఇనుమడింపచేసే మహత్తర బాధ్యత వారిపై ఉంది. మీరు ఈ ఉన్నతమైన పదవికి ఎన్నిక కావడం మా అందరికీ సంతోష కారణం. 1967-72 కాలంలో ఐదు సంవత్సరాలు శాసన సభ్యులుగా మీ విద్యుక్త ధర్మాన్ని అతి సమర్ధవంతంగా నిర్వహించిన సంగతి, ప్రజాస్వామ్య విధానాలను గౌరవించిన సంగతి, ప్రజలకు సేవ చేసిన సంగతి అందరికీ తెలిసినదే. మీ అనుభవం, మీ సమయస్ఫూర్తి, సహృదయతతో కూడిన మీ భావాలు, అభ్యుదయకరమైన ఉత్కృష్టమైన మీ భావనలు, సౌమ్యమైన ఆలోచనలు, నిష్పక్షపాత వైఖరి అత్యంత క్లిష్టమైన ఈ భాధ్యతను, కర్తవ్యాన్ని నిర్వహించడానికి పరిపూర్ణమైన దోహదం కలిగిస్తాయని, మీరు అందుకు సమర్ధులని నేను పరిపూర్ణంగా విశ్వసిస్తున్నాను. మీ ఆధ్వర్యంలో మేమందరం ఎటువంటి సమస్యలు లేకుండా వ్యవహరించగలమని మాకు పరిపూ-ర్ణమైన విశ్వాసం, నమ్మకం ఉంది. ఈ సందర్భంలో మా రాజకీయ పక్షం నుంచి శాసనసభ పరంగాను మీకు హృదయపూర్వకమైన అభినందనలు తెలియచేసుకుంటున్నాను.

◆◆



మార్చి 16, 1983

# ఇది రైతును రక్షించే రాజ్యం

*(ఆహార ధాన్యాలపై ప్రభుత్వ విధానాన్ని ప్రకటిస్తూ చేసిన ప్రసంగం)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆహార విధానం మిల్లర్లకే అనుకూలంగా ఉందని, ఫలితంగా ధాన్యం తగ్గి రైతు కుంగిపోతున్నాడని, బియ్యం ధర ఆకాశాన్నంటి వినియోగదారుని వేధిస్తోందని, పరిస్థితి ఇలా ఉన్నా, దొంగ రవాణాను అరికట్టడానికి ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు గైకొనడం లేదని కొన్ని వర్గాల వారు పదే పదే ఆరోపిస్తున్నారు. అందుకే ఈ విషయాన్నంతా సమగ్రంగా పరిశీలించి నిజానిజాలను సభ ముందుంచుతున్నాను.

1982–83వ సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం మిల్లర్లకు 1:1 లెవీ సూత్రాన్ని వర్తింపజేసింది. దీని ప్రకారం మిల్లర్లు భారత ఆహార సంస్థకి ఒక క్వింటాలు బియ్యం లెవీగా ఇస్తే మరొక

క్వింటాలును యధేచ్ఛగా స్వేచ్ఛా మార్కెట్‌లో అమ్ముకోవచ్చు. అయితే ఈ యధేచ్ఛగా అమ్మే మొత్తంలో సగాన్ని మన రాష్ట్రంలోనే విక్రయించవలసి ఉంటుంది. మిగతా సగాన్ని మాత్రమే ఇతర రాష్ట్రాలకు తరలించుకోవచ్చు. ఇక్కడ ఒక విషయం స్పష్టం చేయాలి. భారత ఆహార సంస్థకు లెవీ ఇవ్వగా మిగిలిన ధాన్యంలో సగ భాగాన్నీ రాష్ట్రంలోని స్వేచ్ఛా మార్కెట్‌లో విధిగా అమ్మాలన్న నిబంధన 1981-82 సంవత్సరంలో లేదు. అంతేకాదు. కొన్ని జిల్లాలలో రబీ పంట కాలంలో తమకు నిర్ణయించబడిన లెవీ కోటాను పూర్తి చేసిన మిల్లర్లకు అంతకు మూడు రెట్లు బియ్యం యధేచ్ఛగా ఎక్కడైనా అమ్ముకోడానికి కూడా అప్పటి ప్రభుత్వం అనుమతించింది.

అందువల్ల 1981-82 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం అనుసరించిన ఆహార విధానం కంటే 1982-83లో మా ప్రభుత్వం అనుసరిస్తున్న ఆహార విధానం కట్టుదిట్టమైనదన్న విషయం దీనివల్ల సుస్పష్టం అవుతోంది. మరో ముఖ్యమైన విషయం, లెవీ ఇవ్వగా మిగిలిన బియ్యంలో సగాన్నీ రాష్ట్రంలో విక్రయించాలన్న నిబంధనను పరిస్థితులకు అనుగుణంగా అమలు జరపడం ద్వారా స్వేచ్ఛా మార్కెట్‌లో బియ్యం ధరను అదుపు చేయడం మాత్రమే గాక ధాన్యం ధర పెరగడం సాధ్యం అవుతుందని కూడా మనవి చేస్తున్నాను. 1982-83 ఖరీఫ్ ఆహార విధానాన్ని గట్టిగా అమలు జరపడం వల్ల ఎటువంటి సత్ఫలితాలనిచ్చిందో వివరిస్తాను. 1981-82 సంవత్సరంలో పంట పుష్కలంగా పండింది. అయినా ఆ ఏడాది బియ్యం సేకరణ 7 లక్షల 17 వేల టన్నులు మాత్రమే జరిగింది. ఈ ఏడాది అనావృష్టి తీవ్రతతో పంట దిగుబడి బాగా తగ్గింది. అయినా ఇప్పటికే 8 లక్షల 87 వేల టన్నుల బియ్యాన్ని ప్రభుత్వం సేకరించింది. మార్చి ఆఖరుకు మొత్తం 10 లక్షల టన్నులు సేకరించగలమని మా నమ్మకం. ఇంతటి సేకరణ మున్నెన్నడూ జరుగలేదు. మరి మా ఆహార విధానం మిల్లర్లకు అనుకూలమైనదన్న ఆరోపణ ఏ ఉద్దేశాలతో కూడుకున్నదో తెలియడం లేదు.

రబీ పంట సేకరణ ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి ఆరంభమవుతుంది. దీని క్రింద కనీసం 5 లక్షల టన్నుల బియ్యం సేకరించగలమని ప్రభుత్వం ఆశిస్తున్నది. 1981-82లో ఈ సేకరణ 3 లక్షల 62 వేల టన్నులు మాత్రమే. అంటే 1981-82 కంటే ఇది ఒకటిన్నర రెట్లు ఎక్కువన్నమాట. దీనితో ఈ ఏడాది పంట కాలంలో మొత్తం బియ్యం సేకరణ 15 లక్షల టన్నులకు వీలుంటుంది. ఈ లక్ష్యాన్ని తప్పక సాధించి తీరుతామన్న పరిపూర్ణమైన విశ్వాసం ప్రభుత్వానికి ఉన్నది. చౌక దుకాణాల ద్వారా వినియోగదారులకు అందించడానికి భారత ప్రభుత్వం నుంచి తగినంత ఎక్కువ బియ్యాన్ని రాబట్టాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం బియ్యం సేకరణ లక్ష్యాన్ని గరిష్ఠ స్థాయిలో నిర్ణయించింది. ఈ అధిక సేకరణ వల్ల ప్రభుత్వం రాష్ట్రంలో మిల్లర్ల వద్దనున్న బియ్యం రవాణాను కూడా క్రమబద్ధం చేయగలుగుతుంది. దీనివల్ల స్వేచ్ఛా మార్కెట్‌లో బియ్యం ధరను స్థిరపరచగలం.

ప్రభుత్వ పంపిణీ వ్యవస్థను కట్టుదిట్టం చేసి పేద వర్గాలకు ఎక్కువ మొత్తంలో బియ్యాన్ని అందించాలన్నది రాష్ట్ర ప్రభుత్వ ప్రగాఢ వాంఛ. అందుకే ఆదాయ ప్రాతిపదికగా కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి రేషన్ కార్డులు పంపిణీ చేయాలన్న కార్యక్రమం చేపట్టాం. మార్చి 27 నాటికి ఇది పూర్తవుతుందని భావిస్తున్నాం. అప్పటికి సరైన వివరాలు కూడా అందుతాయి. ఈ పేద వర్గాలకు నెలకు 25 కిలోల బియ్యం చొప్పున సరఫరా చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. దీని క్రింద ప్రభుత్వ పంపిణీ సంస్థ ద్వారా 10 లక్షల టన్నుల బియ్యం సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యొక్క ఆశయం. అందుకోసం కేంద్రానికి నచ్చజెప్పి మున్నెన్నడూ లేనంత బియ్యాన్ని మన రాష్ట్రానికి కేటాయింప చేయించగలిగాం. ఈ ఏడాది మన రాష్ట్రానికి 10 లక్షల టన్నుల బియ్యం కేటాయిస్తామని కేంద్రం చెప్పింది. 1981-82వ సంవత్సరంలో కేంద్రం మనకు కేటాయించిన మొత్తం బియ్యం 4 లక్షల 11 వేల టన్నులు మాత్రమే. 1982లో జనవరి నుంచి ఏప్రిల్ వరకు కేంద్రం మన రాష్ట్రానికి విడుదల చేసిన బియ్యం ప్రతి నెలా 35 వేల టన్నుల చొప్పున ఉండగా ఈ ఏడాది జనవరిలో 75 వేల టన్నులు, ఫిబ్రవరిలో 45 వేల టన్నులు విడుదల చేసింది. మార్చి, ఏప్రిల్‌లో 73 వేల టన్నుల చొప్పున విడుదల చేస్తున్నది. రానున్న కొద్ది నెలల్లో ఇది 90 నుంచి 95 వేల వరకు పెరుగుతుందని భావిస్తున్నాం.

**పేదవారి కోసం ఒక వంక ఇంత చేస్తూనే మరో వంక ప్రభుత్వ పంపిణీ వ్యవస్థకు అధిక మొత్తం బియ్యం లభింప చేయడం వల్ల ధాన్యం ధర తగ్గకుండా ఆహార విధానం సమతులంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు గైకొన్నది. దాదాపు అన్ని జిల్లాలలోను రైతుకు లభిస్తున్న ధాన్యం ధరలు భారత ప్రభుత్వం నిర్ణయించిన ధర కన్నా ఎక్కువగా ఉండడమే దీనికి నిదర్శనం.**

పేదవారి కోసం ఒక వంక ఇంత చేస్తూనే మరో వంక ప్రభుత్వ పంపిణీ వ్యవస్థకు అధిక మొత్తం బియ్యం లభింప చేయడం వల్ల ధాన్యం ధర తగ్గకుండా ఆహార విధానం సమతులంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు గైకొన్నది. దాదాపు అన్ని జిల్లాలలోను రైతుకు లభిస్తున్న ధాన్యం ధరలు భారత ప్రభుత్వం నిర్ణయించిన ధర కన్నా ఎక్కువగా ఉండడమే దీనికి నిదర్శనం. భారత ప్రభుత్వం ముతక ధాన్యం ధర క్వింటాలుకు 122 రూపాయలు, మేలిరకం ధాన్యం ధర క్వింటాలుకు 126 రూపాయలుగాను, అత్యంత మేలిరకం ధాన్యం ధర క్వింటాలుకు 130 రూపాయలుగాను నిర్ణయించింది. అయితే దాదాపు అన్ని జిల్లాలలోను రైతుకు లభిస్తున్న ధాన్యం ధర క్వింటాలుకు 140 రూపాయలపైనే ఉన్నదని కలెక్టర్ల ద్వారా అందిన సమాచారం వల్ల తెలిసింది. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది ధాన్యం ధరలు సంతృప్తికరంగా ఉన్నాయని కూడా విదితమవుతుంది. 1982లో ధాన్యం ధరలు క్వింటాలుకు పశ్చిమ గోదావరిలో రూ.140, కృష్ణాలో 143, నిజామాబాదులో 138, కర్నూలులో 145, ప్రకాశంలో 138 రూపాయలు ఉండగా 1983లో పశ్చిమ గోదావరిలో 141, కృష్ణాలో 145, నిజామాబాదులో 157, కర్నూలులో 155, ప్రకాశంలో 143 రూపాయలుగా ఉంది. ఈ ధరలను ప్రభుత్వం

జాగ్రత్తగా కనిపెట్టి ఉంటున్నది. ఈ విషయంలో ప్రస్తుతం ఎట్టి ఆందోళనకు ఆస్కారం లేదని కూడా భావిస్తున్నది. ఒకవేళ ఏ కారణాల వల్లనైనా ధాన్యం ధరలు తగ్గుముఖం పడితే ఆ తగ్గుదలను ఆరికట్టి రైతును కాపాడటానికి సకల చర్యలు గైకొనగలమని ప్రభుత్వం యొక్క దృఢ విశ్వాసం.

పేదలకు బియ్యం సరఫరాను పెంచినప్పటికీ స్వేచ్ఛా మార్కెట్లో బియ్యం ధరను అదుపు చేయాలని కూడా ప్రభుత్వం భావిస్తున్నది. అందుకే లెవీయేతర బియ్యంలో సగభాగాన్నే రాష్ట్ర వెలుపలకు తీసుకొని పోవచ్చునని మిల్లర్లకు చెప్పింది. దీని వల్ల రాష్ట్రంలో ఎక్కడైనా బియ్యం ధరలు ఎక్కువగా వుంటే అక్కడకు తగినంత బియ్యాన్ని తరలించడానికి వీలుంటుంది. ఖరీఫ్ ధాన్యం నుంచి తీసిన బియ్యం ధర సగటున క్వింటాలుకు 230 నుంచి 240 రూపాయల వరకు వున్నదని ప్రభుత్వానికి సమాచారం అందింది. ఈ ధరను ప్రభుత్వం ఎప్పటికప్పుడు కనిపెట్టి వుండి పెరగకుండా చూస్తుంది. వీటన్నింటితోపాటు దొంగ రవాణా, దొంగ నిల్వలను అరికట్టి స్వార్థ పరశక్తుల ఆటలు కట్టించే చర్యలను కూడా ప్రభుత్వం ఉధృతం చేసింది. ప్రస్తుతం రాష్ట్ర సరిహద్దుల్లో 116 చెక్ పోస్టులు ఉన్నాయి. ఇవిగాక దొంగ రవాణాను అరికట్టేందుకు రాష్ట్ర సరిహద్దులలో సంచార దళాలను కలెక్టర్లు నిర్వహిస్తున్నారు. నిఘా విభాగం చర్యలను కూడా తీవ్రతరం చేయాలని ఆదేశించాం. గత ఏడాది, ఈ ఏడాది నిఘా విభాగం పట్టుకున్న నిత్యావసర వస్తువులు మున్నగు వాటి విలువ ఈ విధంగా ఉంది. 1982 జనవరి ఒకటవ తేదీ నుంచి మార్చి 15 వరకు పట్టుకున్న వాటి విలువ 97 లక్షల రూపాయలు. 1983 జనవరి ఒకటవ తేదీ నుండి మార్చి 13 వరకు పట్టుకున్న వాటి విలువ 187 లక్షల రూపాయలు. ప్రభుత్వం ఎంతటి శ్రద్ధతో ఈ వ్యవహారంలో పని చేస్తున్నదో తెలియజెప్పటానికి ఇంతకన్నా ఏం నిదర్శనం కావాలి?

కనుక దాళ్వా గిట్టుబాటు ధర లభించదేమోనని రైతు సోదరులు ఆందోళన చెందనవసరం ఎంత మాత్రం లేదని మనవి చేస్తున్నాను. ధాన్యం పండించి దేశానికింత కూడు పెట్టే రైతు సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయం. పేదలకు కిలో బియ్యం రెండు రూపాయలకు సరఫరా చేసినా కూడా ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర లభింప చేస్తుందని మరోసారి నేను హామీ ఇస్తున్నాను.

ప్రభుత్వం ఉద్దేశించిన ఈ ధరలు కొనుగోలుదారుల నుంచి రైతులకు లభించకపోతే రైతు సోదరులు నిరాశపడి అమ్ముకోవాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం చర్యలు తప్పకుండా గైకొంటుందని, తగిన కట్టుదిట్టాలు చేస్తుందని తెలియజేస్తున్నాను. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. రైతు సంక్షేమమే దేశ సంక్షేమం. ఇది రైతును రక్షించే రాజ్యం. అన్నదాత ఆనందంగా ఉండాలన్న ధ్యేయంతోనే ఈ చర్యలు తీసుకుంటున్నామని మనవి చేస్తున్నాను.

◆◆

మార్చి 18, 1983

# ప్రభుత్వ రంగ సంస్థలను స్వయం పోషక, సుస్థిర సంస్థలుగా తీర్చిదిద్దుతాం

*(కార్పొరేషన్‌ల క్రమబద్దీకరణపై చేసిన ప్రసంగం)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కార్యకలాపాల సమీక్ష, సమన్వయం, మార్గదర్శనం కోసం ప్రభుత్వం ఒక కేంద్ర వ్యవస్థను నెలకొల్పింది. రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థలను సమర్థవంతం చేయటానికిగాను, 1983 జనవరి నుండి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం ప్రారంభించింది. ప్రభుత్వరంగ సంస్థలను స్వయం పోషక, సుస్థిర సంస్థలుగా తీర్చిదిద్దే ఉద్ధేశంతో ప్రభుత్వ రంగాన్ని సువ్యవస్థీకృతమొనరించింది. సంస్థల నిర్వాహక మండలాలు మరింత ధృఢతరంగా వుండే నిమిత్తం వాటి పరిమాణాన్ని తగ్గించింది.

31 కార్పొరేషన్లకు బోర్డులను ఏర్పాటు చేశారు. తొమ్మిదింటికి కంబైండు బోర్డ్స్. వీటిలో నాన్ అఫీషియల్ మెంబర్లు ఉంటారు. వాటిపై నాన్-అఫీషియల్స్‌ను మెంబరుగా వేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయమై ఉంది. సమర్థులను తీసుకుని వీటిని ఏర్పాటు చేయడం జరుగుతుంది.

రాజకీయ పక్షంగా తీసుకుంటామని చెప్పలేను కానీ సమర్థులైన వారిని తీసుకుంటాము. ఎంత పొదుపు తీసుకురావడానికి వీలుంటే అంత పొదుపు చేయడానికి, అవినీతిని నిర్మూలించడానికి ప్రయత్నం చేస్తామని తెలియజేస్తున్నాను. పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ మేనేజ్‌మెంట్ బోర్డు ఉంది. ఈ సంస్థల నిర్వహణలో వారు సలహాలు ఇవ్వడానికి, వాటిని పరిశీలించి ప్రభుత్వం ఆచరణలో పెట్టడానికి వీలుంది. బ్యూరో ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ అనేది ప్రొఫెషనల్ బాడీ. వారు సలహాలు ఇస్తూంటారు. వాటిని సమగ్రంగా పరిశీలించి ఒక నిర్ణయానికి రావడం జరుగుతుంది.

48 కార్పొరేషన్లలో లాభాలతో నడుస్తున్నవి 24. వాటిలో వచ్చిన లాభం 1790.47 లక్షల రూపాయలు. నష్టంలో నడుస్తున్నవి 18. వాటివల్ల వచ్చే నష్టం 6215.40 లక్షల రూపాయలు.

మొత్తం వచ్చిన నష్టం 4,424.93 లక్షల రూపాయలు. నష్టం కానీ లాభం కానీ లేకుండా నడుస్తున్నవి 6 రద్దు చేసిన వాటిలో 10 లాభసాటిగా నడుస్తున్నవి. లాభం 428.14 లక్షల రూపాయలు. నష్టం మీద నడుస్తున్నవి 4 వస్తున్న నష్టం 1432.41 లక్షల రూపాయలు. మొత్తం వచ్చిన నష్టం 1004.27 లక్షల రూపాయలు.

రద్దు అయ్యే సంస్థల వల్ల మూడు కోట్ల రూపాయలు పొదుపు అవుతుంది. ఇకపోతే ఆ సంస్థల రద్దు వల్ల వచ్చేటటువంటి ఉద్యోగస్తులను ఇతర సంస్థల నిర్వహణలో తీసుకోవడం జరుగుతుందని మనవి చేస్తున్నాను.

అన్ని విధాలా పొదుపు చేయడం జరుగుతుందని గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను. ఒక బోర్డుకు ఒక ఎం.డి. వుంటాడు. రెండు మూడు కార్పొరేషన్స్‌ను కలిపి ఒక బోర్డును తయారు చేసినప్పుడు దానికి చైర్మన్ వుంటాడని తెలియజేస్తున్నాను. కట్టుదిట్టమైనటువంటి, పటిష్టమైనటువంటి వ్యవస్థగా నడవడానికి ఇది బాగా పనిచేస్తుంది. ఈ ఆర్గనైజేషన్ బాగా ఉందనే భావముతో 19 బోర్డ్సు చేశాము. 10 సింగిల్, 9 కంబైన్డ్. రెండు మూడు కార్పొరేషన్స్‌కు బోర్డు వేసినప్పుడు దానికి ప్రత్యేకంగా చైర్మన్ ఉంటారు. వాటిని పరిపూర్ణంగా, సమర్థవంతంగా చేసేందుకు పొదుపును పాటించడానికి కృషి జరుగుతున్నదని తెలియజేస్తున్నాను.

◆◆



మార్చి 18, 1983

## ప్రణాళికా బద్ధంగా రైతు సంక్షేమం

*(వ్యవసాయ పంటలకు మద్ధతు ధర నిర్ణయంపై చేసిన ప్రకటన)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** ప్రణాళికా బద్ధంగా ఎప్పటికప్పుడు రైతు సంక్షేమానికి ప్రయత్నం చేయగలమని మనవి చేస్తున్నాను. మా ప్రభుత్వం జనవరి 9వ తేదీన ప్రమాణ స్వీకారం చేసేసరికే కొంత పంట అమ్మకం జరిగింది. ఎప్పటికప్పుడు అనుక్షణం ఏ విధంగా రేట్లు ఉన్నాయన్న విషయాన్ని తెలుసుకుంటున్నాము. 75 కిలోల బస్తాకు ముతక ధాన్యం 107, 105 రూపాయలుంది. సూపర్ ఫైన్ రకం క్వింటాల్‌కు రూ.142, ఫైన్ రైస్ రూ.135, ముతక రకం రూ.132 ఉంది. అప్పటికీ కూడా మాకు సంతృప్తికరంగా లేదు.

ఈనాడు అన్ని విధాల రైతును రక్షించాలనే ఉద్దేశంతోనే ఉన్నాము. సగము దాటిన పరిస్థితి ఇది. రైతు సంక్షేమం చూడాలనే భావంతో అన్ని విషయాలు పరిశీలిస్తున్నామని సభ్యులకు మనవి

చేస్తున్నాను. పేదలను రక్షించడానికి అనుక్షణం కృషి చేస్తామన్న సంగతి సభ్యులకు తెలియజేస్తున్నాను. కాలము దాటిపోయింది. దాళ్వా పంట కూడా అయిపోతోంది. దాళ్వా పంట అంటే 3, 4 వంతు ఉంటుంది. అయినా కూడా రైతు సంక్షేమం ఏ రకంగా చేయాలనే దాని గురించి పరిశీలన జరుగుతోంది. ఎంత వరకు వీలు అవుతుందో అంత వరకూ ప్రభుత్వ పరంగా సక్రమమైన ధర నిర్ణయించడానికి కృషి జరుగుతోందని మనవి చేస్తున్నాను.

రెండు, మూడు రోజులలో ఈ విషయంలో ఒక ప్రకటన చేస్తాను. పొగాకు విషయంలో ఎస్.టి.సి. రావాలి. రైతుల ఉత్పత్తిని ఖరీదు చేయాలి. స్టేట్ గవర్నమెంట్ కృషి వలన సెంట్రల్ గవర్నమెంట్ మార్కెట్‌లోకి వచ్చింది. వెంకయ్యనాయుడు గారి ముందే పొగాకుకు 14 వందల నుంచి 15 వందల వరకు ఇవ్వాలని అనుకోవడం జరిగింది. ఎప్పటికప్పుడు వీలున్నంత చేస్తామే కానీ రైతు సంక్షేమాన్ని ఏ మాత్రం నిర్లక్ష్యము చేయము అని తెలియజేస్తున్నాను.

◆◆



మార్చి 22, 1983

# కేంద్ర, రాష్ట్ర సంబంధాలను సమీక్షించి వనరులను సమతుల్యమైన రీతిలో పంపిణీ చేయాలి

*(బెంగళూరులో జరిగిన దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశ వివరాలను శాసన సభలో తెలియపరుస్తూ చేసిన ప్రసంగం)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం 20-3-83 తేదీన బెంగుళూరులో జరిగిన విషయం సభ వారికి విదితమే. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ సమావేశానికి హాజరు కాలేకపోయారు. దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశమంటే ఇది ఏదో కేంద్రానికి వ్యతిరేకం, కాంగ్రెసేతర ముఖ్యమంత్రులు ఒక త్రాటిపైకి తెచ్చే యత్నం అని కొన్ని అపోహలు సృష్టించడానికి యత్నిస్తున్నారని మాకు తెలుసు. ఈ సమావేశంలో పాల్గొన్న వారెవరమూ కేంద్రానికి వ్యతిరేకులము కాము. భరత భూమి మనది. మనందరం అందులో అంతర్భాగం. భరత మాత మన తల్లి. మనమందరం ఆమె బిడ్డలం. ఇది మా నిశ్చితాభిప్రాయం. శరీరం బలంగా ఉండాలంటే శరీరంలోని అన్ని అవయవాలు బలంగా ఉండాలి. కేంద్రం బలంగా ఉండాలంటే రాష్ట్రాలు మౌలికంగా బలంగా ఉండాలన్నదే మా భావన.

వివిధ కార్యక్రమాల అమలులోను, ఆర్థిక వ్యవహారాలకు సంబంధించినంతవరకు, రాష్ట్రాలు మరింత స్వేచ్ఛ కలిగి ఉండాలని నిన్నటి సమావేశంలో భావించాము. చర్చలు సుహృద్భావ వాతావరణంలో జరిగాయి. ఎనిమిదవ ఆర్థిక కమిషన్‌కు సమర్పించవలసిన విషయాల గురించి విస్తృతమైన ఏకాభిప్రాయం వ్యక్తమైనది. సమావేశంలో తీసుకున్న కొన్ని నిర్ణయాలు సభ వారికి

తెలియజేస్తున్నాను. ప్రజా సంక్షేమం కోసం ఆరోగ్యం, విద్య, నీటిపారుదల, విద్యుచ్ఛక్తి మున్నగు సౌకర్యాల కల్పన, వాటి అమలు రాష్ట్ర ప్రభుత్వాల భుజస్కందాలపై ఉంది. వీటికి అయ్యే వ్యయభారం చాలా ఎక్కువ. రక్షణ శాఖను మినహాయిస్తే కేంద్ర ప్రభుత్వం చేయవలసిన ఖర్చు తక్కువ. అయినప్పటికీ వనరులు మాత్రం కేంద్ర ప్రభుత్వం వద్దనే ప్రధానంగా కేంద్రీకృతమై ఉన్నాయి.

కేంద్రానికి రాష్ట్రాలకు మధ్య ఆర్థిక పరిస్థితులకు సంబంధించి రాజ్యాంగంలోని నిబంధనలను సవరించుతున్న తీరు చాలా అసంతృప్తికరంగా ఉంది. ఆదాయం పన్ను, ఎక్సైజ్ పన్ను మున్నగు వాటిలో కేంద్రం రాష్ట్రాలకు ఇస్తున్న వాటా ఏ మాత్రం సంతృప్తికరంగా లేదు. ఈ పరిస్థితుల దృష్ట్యా రాష్ట్రాలకు తగినంత ప్రాతినిధ్యం కల్పించే ఒక ప్రత్యేక ఆర్థిక కమిషన్ (ఫిస్కల్ కమిషన్) నియమించాలని కేంద్రానికి సిఫారసు చేయదలచాము. గత 30 సంవత్సరాల అనుభవం దృష్ట్యా ఆర్థిక వ్యవహారాలలో కేంద్ర, రాష్ట్ర సంబంధాలను సమీక్షించి వనరులను బాధ్యతలకు సమతుల్యమైన రీతిలో పంపిణీ చేసేందుకు వీలుగా రాజ్యాంగానికి సవరణలు ప్రతిపాదించే చట్టబద్ధమైన అధికారాలు ఈ కమిషన్‌కు ఉండాలని సమావేశంలో నిర్ణయించాము. ప్రస్తుతం వ్యవసాయ ధరల విధానం అసంతృప్తికరంగా ఉంది. రైతుకు గిట్టుబాటు ధరను పరిగణనలోనికి తీసుకోవడం లేదు. సబ్సిడీలపై హెచ్చు మొత్తాలను రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చు చేయవలసిన అగత్యం ఇది స్పష్టీకరిస్తున్నది. ఉత్పత్తి వ్యయం, ఉత్పాదక స్థాయి, మార్కెట్ సరళి మున్నగు అంశాలను గురించి రైతు ప్రతినిధులతో చర్చించి రాష్ట్ర ప్రభుత్వాలే వ్యవసాయ ఉత్పత్తుల ధరల నిర్ణయించే పద్ధతి ఈనాడు అవసరం.

**గత 30 సంవత్సరాల అనుభవం దృష్ట్యా ఆర్థిక వ్యవహారాలలో కేంద్ర, రాష్ట్ర సంబంధాలను సమీక్షించి వనరులను బాధ్యతలకు సమతుల్యమైన రీతిలో పంపిణీ చేసేందుకు వీలుగా రాజ్యాంగానికి సవరణలు ప్రతిపాదించే చట్టబద్ధమైన అధికారాలు ఈ కమిషన్‌కు ఉండాలని సమావేశంలో నిర్ణయించాము**

రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించే గిట్టుబాటు ధరలకు వీలుగా సమైక్య పరచాలి. రాష్ట్ర ప్రభుత్వాల అజమాయిషీ తప్పి మార్కెట్‌లో ధరలు పడిపోతే ప్రణాళికేతరంగా కేంద్ర నిధుల నుంచి సబ్సిడీలు రైతులకు సమకూర్చాలి. మధ్య దళారీల అధిక లాభార్జనను నిర్మూలించడానికి రైతు సంఘాలు తమ ఉత్పత్తులను తామే ఎగుమతి చేసుకోడానికి పూర్తి అవకాశాలు రైతు సోదరులకు కల్పించబడాలి. ప్రపంచ బ్యాంకు నుంచి, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి విదేశాల నుండి దొరికే రుణాలను కేంద్ర ప్రభుత్వం తాను ఆ సంస్థల నుండి పొందిన వసతుల మీదనే రాష్ట్ర ప్రభుత్వాలకు బదిలీ చేయాలి. సర్వీస్ చార్జీల నిమిత్తం కేంద్రం నామ మాత్రం మొత్తాన్ని మాత్రమే స్వీకరించాలి. ప్రధానమైన ఖనిజాల మీద రాయల్టీ ద్వారా కొన్ని రాష్ట్రాలకు చాలా ఆదాయం లభిస్తున్నది. ప్రధానమైన ఖనిజాల మీద రాయల్టీ సవరించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే

ఉంది. ఇప్పటివరకు ఉన్న అనుభవాల దృష్ట్యా ఈ సవరణలు క్రమబద్ధంగా లేవు. అందువల్ల ఈ రాయల్టీని ఎప్పటికప్పుడు సవరించే అధికారం రాష్ట్రాలకు బదిలీ చేయాలి. ఆంధ్రప్రదేశ్ వరదల వల్ల, అనావృష్టి వల్ల నష్ట పడుతున్నది. అనావృష్టి కార్యక్రమాల క్రింద అందచేస్తున్న సహాయంలో 70 శాతాన్ని రుణంగా పరిగణిస్తున్నారు. నిజానికి ఈ సహాయ కార్యక్రమాలు అనేక ప్రకృతి వైపరీత్యాలకు గురి అయిన ప్రాంతాలను ఆదుకోడానికి ఉద్దేశించబడినవి. భవిష్యత్తులో ఇటువంటి సహాయంలో 75 శాతం గ్రాంట్‌గాను, 25 శాతం రుణంగాను పరిగణించాలి. తుఫాన్, వరదల వల్ల వచ్చే నష్టాన్ని కేంద్రమే పూర్తిగా భర్తీ చేయాలి. ఇటీవల బడ్జెట్‌లో ప్రధాన మంత్రి గ్రామీణ అభివృద్ధి నిధిని ఏర్పాటు చేసారు. అది కొంత గందరగోళాన్ని సృష్టించింది: ఆదాయం పన్ను చట్టంలో సెక్షన్ 35 సవరించడం ద్వారా గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలలో పాలు పంచుకోడానికి పరిశ్రమలను ఇంతవరకు ప్రోత్సహించారు.

ప్రధాన మంత్రి గ్రామీణ అభివృద్ధి నిధి ఏర్పాటు వల్ల ఇది కొంత వెనుకబడవచ్చును. కనుక పాత రాయల్టీలు కొనసాగించవలసిందిగా కోరుతున్నాను. ధర్మకర్తృత్వ విధులను ప్రభుత్వ సెక్యూరిటీలుగా బ్యాంకులలో ఉంచాలని మొన్నటి బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం పేర్కొన్నది. ధర్మకర్తృత్వ నిధులను చిన్నతరహా పొదుపు పథకాలలో పెట్టాలని సూచించాము. దీనివల్ల రాష్ట్రాలకు తమ వాటా లభిస్తుంది. ఉమ్మడిగా ప్రయోజనకరమైన అంశాలు ఎప్పటికప్పుడు చర్చించడానికి ముఖ్యమంత్రులతో ఒక మండలి ఏర్పాటు చేయడం భావ్యమని భావించాము. అందుకు తొలిమెట్టుగా దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల మండలి ఏర్పాటు చేయాలని నిర్ణయించాము. ఈ మండలి ఇందుకోసం ఎప్పటికప్పుడు సమావేశాలు జరుపుతుంది. ఇది కేంద్ర రాష్ట్ర సంబంధాలలో మరింత సుహృద్భావ వాతావరణాన్ని సృష్టించడానికి ఆరంభించిన యత్నాలలో తొలియత్నం మాత్రమే. పరస్పరం ఇచ్చి పుచ్చుకునే ప్రతిపాదనలు సాగించి ముమ్ముందు అనేక సమస్యలు ఈ విధంగా పరిష్కారం చేసుకోగలమని ప్రజా జీవితం వెలుగు బాటలో పయనించడానికి ఇది నాందీ వాచకం కాగలదని ఆశిస్తున్నాం.

◆◆

మార్చి 22, 1983

# రైతుకు సంఘములో గౌరవ స్థానాన్ని ఆర్థిక పరిపుష్టిని కల్పించడమే మా విధానం

*(ఆహార ధాన్యాలపై ప్రభుత్వ విధానాన్ని ప్రకటిస్తూ చేసిన ప్రసంగం)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, గౌరవ సభ్యులారా, ఈనాడు ప్రభుత్వం అనుసరించబోయే ఆహార విధానాన్ని స్థూలంగా మీకు చెప్పి దానికో రూపకల్పన చేసి, దానికో పరిపూర్ణమైన నిండుతనం తెచ్చి అమలు జరపాలని సభ వారికి తెలియచేస్తున్నాను. ఇప్పుడు రైతు సమస్యలు మీరందరికీ తెలుసు. ఏవిధంగా వారిలో అసంతృప్తి ఉన్నదో, ఏ విధంగా గిట్టుబాటు ధర లభించక రైతు సోదరులు బాధ పడుతున్నారో, ఏ విధమైన అసంతృప్తి ఆ వర్గంలో ఉన్నదో మనం నిత్యం చూస్తూనే ఉన్నాము. నిన్న మొన్న జరిగిన దురదృష్టకరమైన విధానం వల్ల ప్రభుత్వం వారికి సహాయం చేయాలని అనుకున్నా ఏ విధంగా కూడా సహాయం చేయలేని స్థితిలో ఉన్నదన్న సంగతి మీ అందరికీ తెలిసిందే. ఈనాడు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరలను ప్రోత్సహించడమే రాష్ట్ర ప్రభుత్వాల కర్తవ్యం కానీ, ఏ మాత్రము ఎక్కువ ధర మేము ఇస్తామని అన్నా.. సబ్సిడీగా కానీ, ఇంకో రూపంలో కానీ మేము రైతులకు అందజేస్తాము అంటే వెంటనే రిజర్వుబ్యాంకు నుండి వచ్చే క్రెడిట్‌ను ఆపు చేయడం, ఆ విధంగా మనకు ఆ ఆస్కారం లేకుండా చేసి రైతులకు సహాయపడకుండా చేస్తున్న సంగతి మీ అందరకూ తెలుసు. గత అనుభవాలను కూడా నేను వేరే చెప్పనవసరం లేదని మనవి చేస్తున్నాను. పొగాకు విషయంలో ఎన్ని ప్రయత్నాలు జరిగాయో ఎప్పటికప్పుడు మీకు తెలియజేస్తూనే వున్నాను.

పై దేశాలకు ఏ ఏ పరిమాణంలో ఎగుమతి చేయబడుతున్నదో కేంద్రం దృష్టికి తెచ్చి ఇక్కడి రైతులకు గిట్టుబాటు అయ్యే ధర నిర్ణయించండి అని కేంద్రాన్ని కోరడం జరిగింది. 'ఎన్.టి.సి.ని పంపి ఇక్కడ వున్న క్రింది తరహా పొగాకును కొనే ప్రయత్నం చేయండి.. కొంత వరకూ రైతులను ఆదుకోవడానికి వీలు అవుతుంది' అని ఎంత చెప్పినా కూడా వినకుండా కేంద్ర ప్రభుత్వం ఏ

విధంగా పెడచెవిన పెట్టిందో, ఎలాంటి సవతి తల్లి ప్రేమను మన రైతుల పట్ల చూపిస్తున్నదో మీ అందరకూ తెలుసు. ఈనాడు ధాన్యం ధర 92 రూపాయల చిల్లర ప్రభుత్వం ప్రకటించింది. కానీ ప్రభుత్వ పరంగా సబ్సిడీ ద్వారా కొంత ఎక్కువ ధర నిర్ణయించినప్పుడు కేంద్రం అనుమతించకుండా బ్యాంకు రుణాలను ఫ్రీజ్ చేసిన సన్నివేశాలు ఇదివరకు జరిగాయనీ మనవి చేస్తున్నాను. అదేవిధంగా పత్తి ఉత్పత్తిదారుల విషయం చూస్తే మనది లోప్రయారిటీ ఏరియాగా డిక్లేర్ చేశారు. ఏ విధంగా చేశారో, ఎందుకు చేశారో తెలియదు. మనకు నూలు మిల్లులు ఎక్కువ కావాలన్నా లోప్రయారిటీ ఏరియాగా పరిగణించినందువల్ల మిల్లులకు లైసెన్స్ ఇవ్వడం లేదు. హై ప్రయారిటీ ఏరియాగా చేయవలసినదని మొన్న ఢిల్లీ వెళ్లినప్పుడు నేను కేంద్ర ప్రభుత్వాన్ని కోరానన్న విషయాన్ని ఇదివరకే తెలియజేశాను. ఇన్ని ప్రయత్నాలు ప్రభుత్వపరంగా జరిగినప్పటికీ రైతులకు పరిపూర్ణంగా సంక్షేమం గానీ, తృప్తి గానీ కలగడం లేదన్న సంగతి ప్రభుత్వానికి తెలుసు. ఈనాడు వారి సంక్షోభాన్ని నివారించాలి. ఇది ఈనాటిది కాదు. ఎన్నో సంవత్సరాల నుండి వస్తున్నది. ఈనాటికి కూడా అది పరిష్కారం కాని సమస్యగా మిగిలిపోయిందని సభ్యులందరికీ తెలియజేస్తున్నాను. ఈ జటిల సమస్యను ఏ విధంగా పరిష్కరించాలి. రైతుకు సంఘములో గౌరవ స్థానాన్ని కల్పించాలి?

ఈనాడు అన్ని పరిశ్రమల వారు, వారు తయారు చేస్తున్నటువంటి వస్తువులకు ఏ విధంగా అయితే వారే ధరలను నిర్ణయించుకోగలుగుతున్నారో అదే విధంగా రైతు కూడా తాను పండించిన ధాన్యానికి పంట యొక్క విలువను కట్టుకోగలిగి వుండాలి. తన శ్రమకు తగిన ఫలితాన్ని ముట్టజెప్పగలిగిననాడే రైతుకు క్షేమం జరుగుతుందని సభ్యులందరికీ తెలుసు. ఏ పద్ధతి అవలంబిస్తే రైతుకు ఆ విధమైనటువంటి గౌరవ స్థానం కలిగించగలుగుతాము, ఏ విధంగా రైతును తృప్తి పరచగలుగుతాము, ఏ విధంగా వారి పంటకు పరిపూర్ణమైన విలువను యివ్వగలుగుతామనేది ఆలోచిస్తే వారికి పరిపూర్ణమైనటువంటి స్వాతంత్ర్యం ఇవ్వాలి. వారి పంటకు ధర నిర్ణయించుకునే విధానం రూపొందించాలి. ఈ మధ్యన వున్న దళారీలను తుడిచి పెట్టాలి. ఈనాడు రైతుల మధ్యన ఉన్నటువంటి ఫ్యాక్టరీ వారిని గానీ, పొగాకు విషయములో కొనుగోలు చేసే సంస్థల వారినిగానీ, అట్లా మధ్యన వున్న వారిని తీసివేసిన నాడు వారికి ఇష్టమైన రేటు లభ్యం అవుతుంది. మధ్య దళారీలు వున్నంతవరకు రైతు సమస్యలు పరిష్కారం కావు. రైతు ఉత్పత్తికి సరైన గిట్టుబాటు ధర రాదని మన అనుభవం వల్ల తెలుసు. ఈ పరిస్థితుల దృష్ట్యా స్వయం నిర్ణయాధికారం రైతులకే ఇచ్చివేయాలి. తన శ్రమకు తగిన ఫలితాన్ని

**ఈనాడు అన్ని పరిశ్రమల వారు, వారు తయారు చేస్తున్నటువంటి వస్తువులకు ఏ విధంగా అయితే వారే ధరలను నిర్ణయించుకోగలుగుతున్నారో అదే విధంగా రైతు కూడా తాను పండించిన ధాన్యానికి పంట యొక్క విలువను కట్టుకోగలిగి వుండాలి. తన శ్రమకు తగిన ఫలితాన్ని ముట్టజెప్పగలిగిననాడే రైతుకు క్షేమం జరుగుతుందని సభ్యులందరికీ తెలుసు.**

నిర్ణయించుకోవాలనే భావముతో రైతన్న గౌరవాన్ని కోరి రైతులతో కూడిన ఒక కార్యక్రమాన్ని రూపొందించదలచామని మనవి చేస్తున్నాను. దానికి పరిపూర్ణమైనటువంటి రూపకల్పన జరగలేదని, నా మనస్సులో ఉన్న ఊహలను నా మెదడులో వున్న భావాలను మీ అందరికీ తెలియజేస్తున్నాను.

రాష్ట్ర స్థాయిలో రైతులతో కూడా సమన్వయ సంఘం ఒకటి కేంద్రం నుండి పనిచేస్తుంది. సెక్రటేరియట్ స్థాయిలో అక్కడ ప్రభుత్వ అధికారులు ఎవరూ వుండరు. రైతులతో కూడిన వివిధ పంటలు పండించేవారు, పొగాకు పండించే రైతులు, పత్తి పండించే రైతులు, ధాన్యం పండించే రైతులు, వేరుశనగ పండించే రైతులు, పప్పుధాన్యాలు పండించే రైతులతో కూడిన కేంద్రీకృతమైనటువంటి రాష్ట్ర స్థాయిలో సంఘం ఉంటుంది. దాని తరువాత రాష్ట్ర స్థాయిలో పని చేసే మార్కెటింగ్ ఫెడరేషన్ వుంటుంది. దాని నుండి జిల్లా వారీ మార్కెటింగ్ ఫెడరేషన్స్ తాలూకా వారి మార్కెటింగ్ ఫెడరేషన్స్ వుంటాయి. బ్యాంకింగ్ విధానానికి సంబంధించి సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంకు రాష్ట్ర స్థాయిలో ఉంటే, జిల్లాస్థాయిలో జిల్లా కోఆపరేటివ్ బ్యాంకు ఉండి, గ్రామీణ స్థాయిలో కోఆపరేటివ్ బ్యాంకులు ఉండి, ఇటు తాలూకాల నుండి అటు మార్కెటింగ్ ఫెడరేషన్‌కు సమన్వయ పరచడం జరుగుతుంది. ఎరువులుగానీ మిగతా కావలసిన వస్తువులు గానీ రైతులకు ఎవరికైనా సరే బ్యాంకు ద్వారా, మార్కెటింగ్ ఫెడరేషన్ ద్వారా, గ్రామీణ బ్యాంకుకు అందజేయబడతాయి. రైతులకు రెండు పాస్‌బుక్కులు ఇవ్వడం జరుగుతుంది. ఏదైనా తనకు కావలసివచ్చినప్పుడు రుణాలు గానీ ఎరువులు గానీ తనకు దగ్గరలో వున్న ఊరు బ్యాంకుకు వెళ్లి పుస్తకములో వ్రాయించుకొని తీసుకుంటాడు. ఒక ప్రతిని బ్యాంకు వారు పెట్టుకుంటారు. రెండవది రైతు వద్ద ఉంటుంది. ఆ విధంగా నోటు చేసి ఎప్పటికప్పుడు రైతుకు కావలసిన వనరులు సమకూర్చడం జరుగుతుంది. రాష్ట్రస్థాయిలో వున్న కమిటీ పంటలకు ఏ ధర ఉండాలి అనేది ఆనాటి పరిస్థితులను గుర్తించి, ఖర్చులను పరిశీలించి ఏ వస్తువుకు ఏ ధర ఉండాలనేది.. పత్తికి గానీ, చెరుకుకు గానీ, పొగాకుకు గానీ వారే నిర్ణయించుకొని ఆ నిర్ణయం ప్రకారం వారే అమ్ముకోడానికి పరిపూర్ణమైనటువంటి అవకాశం కల్పించబడుతుందని మనవి చేస్తున్నాను. రాష్ట్రానికి కావలసిన ఆహార పదార్థాలను మన మట్టుకు ఒక ప్రక్కనపెట్టి మిగిలిన పదార్థాలను వారి వారి ఇష్టమొచ్చిన ధరలకు ఏ రాష్ట్రంలోనైనా ఏ విధంగానైనా వారే అమ్ముకోడానికి పరిపూర్ణమైన స్వాతంత్ర్యం వారికి కలిగించడానికి నిర్ణయించబడుతుందని మనవి చేస్తున్నాను.

ఇప్పుడున్న ఫ్యాక్టరీల వారిని, మధ్య దళారులను తీసివేయాలనే ఉద్దేశముతో, కొనుగోలుదారులను తీసివేయాలనే ఉద్దేశముతో రైతులకే ప్రాతినిధ్యం ఇవ్వాలని, రైతు పంట రైతే అమ్ముకోవాలని చేయడం జరుగుతోంది. తన గిట్టుబాటు ధర తానే నిర్ణయించుకోవాలనే భావముతో ఈ విధమైనటువంటి పరిష్కార మార్గం ఆలోచించాలి. రైతులకు గౌరవ స్థానం

కలిగించాలి, తృప్తిని కలిగించాలి. లేకపోతే ఇదే విధంగా కేంద్ర ప్రభుత్వం మీద మన రైతులు ఆధారపడి ఉండాలి. వారి నిర్ణయాలకు బద్ధులై ఉండాలి. ఇదే విధంగా అశాంతి వారిలో ఎప్పుడూ వుంటుంది. ప్రతి సంవత్సరం ఈ సమస్యలు అపరిష్కృతంగా ఉండిపోతున్నాయి గానీ రైతు సోదరులకు ఒక గౌరవ స్థానం కలిగించబడడంలేదు. దానికొరకే ఇదొక పరిష్కార మార్గము, గౌరవ స్థానం. ఈనాడు అభ్యుదయ భావాలు కలిగిన దేశాలలో ఎవరైతే పంట పండిస్తారో వారే వారి ఉత్పత్తులకు ధరలు కట్టుకుంటూ వారి సంక్షేమం చూసుకుంటూ ఏ విధంగా అయితే వారి అభ్యుదయాన్ని సాధించిగలుగుతున్నారో అదే ఉద్దేశ్యంతో, ఇదే ధ్యేయంతో ఈనాడు మన రాష్ట్రంలో ఆ విధానాన్ని ఆచరణలో పెట్టాలని అనుకుంటున్నామని గౌరవ సభ్యులందరికీ తెలియజేస్తున్నాను.

వ్యవసాయధరల కమిషన్ ఢిల్లీలో ఉందని మీకందరికీ తెలుసు. అక్కడ మనకు తగినటువంటి ప్రాతినిధ్యం లేదు. రైతు పండించే ఆహార ధాన్యాలకు ఏ విధమైన ధర ఉండాలి? ఈనాడు ఎరువుల రేట్లు ఎలాగున్నాయి? ఖర్చు ఎంత అవుతున్నదనే విషయాలు గమనించడం లేదు వారు. అక్కడ మన రాష్ట్రానికి ప్రాతినిధ్యం లభించడం లేదని మనకందరికీ తెలుసు. ఆ విషయంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ప్రభుత్వపరంగా కొనాలి. లెవీ ధాన్యం ఇచ్చిన తరువాత "Co-operatives can take maximum advantage of marketing conditions, if Government does not interfere, the ryots are given freedom" అందుకు ప్రభుత్వం ఏవిధంగాను, రేపు ఈ విధంగా నిర్ణయించే వ్యవస్థలో ఏ మాత్రం జోక్యం కలుగజేసుకోదని, దీనిని నిర్ణయించబోతున్నామని మనవి చేస్తున్నాను.

◆◆

మార్చి 23, 1983

# ఎవరి మీదా ఒత్తిడి తెచ్చే ప్రసక్తి లేదు

*(కడప జిల్లాలో ప్యునిటివ్ పోలీస్ టాక్స్ రద్దుపై చేసిన ప్రసంగం)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** కడప జిల్లాలోని కోమనూతల గ్రామం, ముచ్చుమర్రి, రేమాడ గ్రామాలలో కక్షలు ఉన్నందుకు, దండనాత్మక పోలీసు దళాన్ని ఉంచడానికి వరుసగా 24-1-79వ తేదీ ప్రధాన పరిపాలన శాఖ ఎం.ఎస్. నెం.38 జి.ఒ. 21-8-79వ తేదీ ప్రధాన పరిపాలన ఎం.ఎస్. నెం.589 జి.ఓ. తేది 20-8-79వ తేది, ప్రధాన పరిపాలనా శాఖ ఎం.ఎస్. నెం. 597 జి.ఒ.లలో ఉత్తర్వులు జారీ చేశారు. దరిమిలా ఈ దళాన్ని రేమాడ గ్రామం నుండి, కోమనూతల గ్రామం నుండి 3-9-78వ తేది లగాయతు, 4-6-82 లగాయతు ఉపసంహరించారు. ముచ్చుమర్రి గ్రామంలో ఇప్పటికీ కక్షల మూలంగా పరిస్థితి ఉధృతంగా ఉన్నందువల్ల, ఆ గ్రామంలో దండనాత్మక పోలీసు దళం ఇప్పటికీ కూడా కొనసాగుచున్నది. రేమాడ, కోమనూతల గ్రామాలలో అనావృష్టి పరిస్థితుల కారణంగా దండనాత్మక పన్నును రద్దు చేయాలని కోరుతూ ఆ గ్రామాలలో ఆయా ముఠాలకు చెందిన కొంతమంది 1982 ఫిబ్రవరిలోనూ, 1982 ఆగస్టులోనూ, విన్నపాలు చేసుకున్నారు.

అప్పటి విద్యాశాఖా మంత్రి అయిన వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారు కూడా 1-10-82వ తేదీన డి.ఒ. లేఖలో, ఆ మూడు గ్రామాలలో వరుసగా అనావృష్టి పరిస్థితులు నెలకొని ఉన్నందువల్ల, ఆ గ్రామాలలో వుంచిన దండనాత్మక పోలీసుకు అయ్యే వ్యయము తాలూకు, పన్నును రద్దు చేయవలసిందిగా కోరినారు. దీనిని పురస్కరించుకొని కడప కలెక్టర్ రిమార్క్సు రాస్తూ, దండనాత్మక పన్నుకు రద్దు చేసే విషయం గురించి సిఫార్సు చేయలేదు. కలెక్టర్ సిఫారసు దృష్ట్యా, ఆ అభ్యర్థనలను ప్రభుత్వం పరిశీలన చేసింది. దండనాత్మక పోలీసు దళానికి అయ్యే వ్యయాన్ని చెల్లించవలసిన గ్రామస్తుల నుండి ఆ మొత్తం వసూలు చేయవలసి వుంది. ఈలోగా ఆ మొత్తాన్ని ప్రభుత్వమే భరించినందువల్ల, దాన్ని వసూలు చేయకపోతే, అందుమూలంగా

అవాంఛనీయ పరిణామాలు ఉత్పన్నము కావచ్చు. ఇతర గ్రామాలలోని ముఠాదారులు కూడా ఇదే విధమైన అభ్యర్థనలు చేసేదానికి దారితీసే అవకాశాలు ఉన్నందువల్ల, ఈ ప్రభుత్వం ఈ పన్నును రద్దు చేయటానికి వ్యతిరేకతతో రేమాడ, కోమనూతల, మచ్చుమర్రి గ్రామాల నుండి ఇంతవరకు వరుసగా వసూలు చేయవలన రూ. 1,89,615, రూ. 49,635, రూ. 1,39,959 మొత్తాలకు గాను, ముచ్చుమర్రి గ్రామ ముఠా దారుల నుండి ఇంతవరకు రూ. 28,830 మాత్రమే వసూలు చేశారు. ఈ మాసంలో స్వచ్ఛంద వసూలు నిమిత్తం సంబంధించిన మొత్తం నుండి తహశీల్దారు కూడా కోమనూతల గ్రామాలను సందర్శించారు. ఈ విషయంలో ఏ విధమైన బలవంతమైన చర్యలు ఇంతవరకు తీసుకొనబడలేదు.

ప్యునిటివ్ టాక్స్ అనేది కట్టలేని వారి నుంచి వసూలు చేయాలనేది లేదు. కట్ట కలిగిన వారినుండే లెవీ వసూలు చేస్తారు. గ్రామాలలో ఉన్నవారి చేతుల్లోనే ఉంటూ వారు చెప్పినట్లుగా నడుస్తూ ఉంటారు. కాబట్టి ఇటువంటి దౌర్జన్య కాండను, ఎవరైతే ఆ లెవీని భరించగలరో వారి లిస్ట్ తయారు చేయడం, వారినే కట్టమని చెప్పడం జరిగింది. గౌరవ సభ్యులు చెప్పినట్లుగా, వారి పరిస్థితిని గమనించి, ఏ విధమైన కరువు వుందో, ఈ విధంగా వారు కట్టలేని విధంగా ఉన్నారో పరిశీలన చేసి చర్య తీసుకొంటామని మనవి చేస్తున్నాను. వారి మీద ఒత్తిడి తెచ్చే ప్రసక్తి లేదు. ఇప్పుడు ఏ మాత్రం ఒత్తిడి తేవడం లేదు. వారు చెప్పిన విషయాలను గమనిస్తానని మనవి చేస్తున్నాను.

◆◆



మార్చి 23, 1983

# రాజకీయ పవిత్రతకు పట్టం కడదాం!

*(ఎమ్మెల్యేల ఫిరాయింపు నిరోధంపై ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానంపై చేసిన ప్రసంగం)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి.రామారావు:** అధ్యక్షా, ప్రతి పార్టీకి నైతిక విలువలు కాపాడుకోవలసిన ధర్మం ఉంది. ఈనాడు నేను ఎవరి పేర్లు చెప్పదలచుకోలేదు. ఎవరు, ఏవిధంగా జరిగింది అనేది చెప్పాలన్నప్పుడు ఈ గౌరవమైన హౌస్‌లో పేర్లు చెప్పకుండానే పాలసీ మాత్రమే చెప్పదలచుకున్నాను అని మనవి చేస్తున్నాను. సహజంగా, ఎప్పటికప్పుడు మారుతున్న సమాజంలో, అనేకమైన మార్పులు వస్తున్న సమాజంలో ఎవరికీ వారే మేమున్న పార్టీ ఏమిటి, మేము చేస్తున్న విధానం ఏమిటి, మా పార్టీ పద్ధతులు ఏమిటి? మేము అనుకున్నవి ఏమిటి? అవి జరుగుతున్నవి, జరిపింపబడుతున్నవి సరిగా జరిపించబడడం లేదా అని ఎప్పటికప్పుడు ఆలోచించుకొంటూ ఆ పార్టీని వదిలిపెట్టవలసి వస్తే అది వారి విజ్ఞతకు చిహ్నమే కానీ మరొకటి కాదని, ఎవరైనప్పటికీ ఆత్మ ద్రోహము చేసుకొని పార్టీలోనే ఉండవలసిన పని లేదని నేను భావిస్తున్నాను.

మరొక పార్టీలోనికి వచ్చి ఆ సిద్ధాంతాలను పట్టుదలతో చేయడానికి ఉపక్రమిస్తున్నట్లు నమ్మకం కలిగినప్పుడు ఆ పార్టీలో చేరడానికి ఎవరికైనా హక్కు ఉందని నేను మనవి చేస్తున్నాను. తెలుగుదేశం పార్టీలోనికి వచ్చిన ఏ కొద్దిమందో ఏ మాత్రం అంటూ సొంటు లేకుండా ఉన్న వారున్నారు. మిగిలిన వారు ఎప్పటికప్పుడు ఏదో ఒక పార్టీలో నుంచి వచ్చిన వారేనని

సవినయంగా మనవి చేస్తున్నాను. అంత మాత్రం చేత వారి చిత్తశుద్ధిని శంకించడానికి వీలు లేదు. ఒక నెల ముందు వచ్చిన వారు, ఒక నెల తరువాత వచ్చిన వారు అనే భేదం తప్ప ప్రత్యేకంగా ఎవరికీ రాజకీయమైన అంటూసొంటూ లేదని అనుకోవడానికి వీలు లేదు. మేము తెలుగుదేశం పార్టీ పెట్టినప్పుడు వచ్చిన వారందరూ చాలా మంది ఇదివరకు ఏదో ఒక పార్టీలో ఉండి వాటి సిద్ధాంతాలు నమ్ముకుని, కొంత కాలం అక్కడ ఉండి, తరువాత తమ భావాలు మార్చుకొని ఆ పార్టీ, అనుకొన్న విధంగా ప్రజా సమస్యలను పరిష్కరించలేక పోయిందని ప్రజాసేవ చేయవలసిన రీతిగా చేయలేకపోయిందనే ఉద్దేశంతోనే మా పార్టీలోనికి ఆదిలోనే వచ్చారు. తరువాత వచ్చిన వారు చాలా పెద్ద మనుష్యులు, వయోవృద్ధులు. వారందరూ ఆనాడు మేము తెలుగుదేశం పార్టీలో చేరి సేవ చేయదలచుకున్నాం, మాకు పదవులు అక్కరలేదు, కావాలంటే వ్రాసి ఇస్తాం అని ముందుకు వచ్చిన వారిని మీరు ఎందుకు కాదనాలి? మీరు ముందుకు వెళుతున్నారు, మేము ఎవరి రాజకీయ జీవితాలనూ వమ్ము చేయదలచుకోలేదు, మేమున్న పార్టీ సిద్ధాంతాలు మాకు నచ్చడం లేదు. ప్రజలు మీకు మాండేటు ఇచ్చారు. మీరు ప్రజలకు దగ్గరగా వెళుతున్నారని తెలుసుకొని, మీకు అండదండలుగా ఉంటామని పదవులు అక్కరలేదని వ్రాసి ఇచ్చి వచ్చారు. అటువంటి వారిని నిరోధించడానికి ఎవరికీ హక్కు లేదని సవినయంగా మనవి చేస్తున్నాను.

ఎవరైనా ఒక పార్టీ వదలి మా పార్టీలో చేరడానికి వచ్చినప్పుడు ఆ పార్టీ మెంబర్‌షిప్‌తో పాటు ఆ పార్టీ ద్వారా వారికి సంక్రమించిన పదవులు కానీ, అధికారాలు కానీ వదలిపెట్టి రావాలని మేము చేసుకొన్న నిర్ణయం. ఆ నిర్ణయం ప్రకారమే ఈ నాటికి ఆ పద్ధతిలోనే నడుస్తున్నామని సవినయంగా మనవి చేస్తున్నాను.

ఎవరైనా ఒక పార్టీ వదలి మా పార్టీలో చేరడానికి వచ్చినప్పుడు ఆ పార్టీ మెంబర్‌షిప్‌తో పాటు ఆ పార్టీ ద్వారా వారికి సంక్రమించిన పదవులు కానీ, అధికారాలు కానీ వదలిపెట్టి రావాలని మేము చేసుకొన్న నిర్ణయం. ఆ నిర్ణయం ప్రకారమే ఈనాటికి ఆ పద్ధతిలోనే నడుస్తున్నామని సవినయంగా మనవి చేస్తున్నాను. సమితి ప్రెసిడెంట్‌లను నేను ఎవరినీ ఆహ్వానించలేదు. రమ్మని కౌగిలించుకోలేదు. ఈ ఆరోపణ నిరాధారమైనది, ఎవరినీ చేర్చుకోదలచుకోలేదని మనవి చేస్తున్నాను. మా పార్టీలో చేరినంత మాత్రంచేత ఎవరికీ ఏ పదవులు రావు. మానవ సేవ చేయడానికి చేయదలచుకుంటే ఎవరికైనా పరిపూర్ణమైన స్వతంత్రం ఉంది. మా పార్టీలో కాకపోయినా, మరొక విధంగానైనా సేవ చేయవచ్చు. మా అనుభవం వృధా చేసుకోదలచుకోలేదు, మా అభిప్రాయాలకు, సిద్ధాంతాలకు అనుగుణంగా చెప్పిన విధంగా నడుచుకోవడం లేదు, వైషమ్యాలతో రాజకీయ ద్వేషాలతో ఈనాడు వ్యవహరిస్తున్నారు కనుక ఆ పార్టీలో ఉండటానికి ఇష్టం లేదు, మీ సిద్ధాంతాలు నచ్చాయి. కనుక సేవ చేస్తామని ముందుకు వచ్చారు. గత చరిత్రలో పదవులలో ఉంటూ పార్టీలలో ఉంటూ సేవ చేసిన వారే ఈనాడు సభ్యత్వంతో పాటు పదవులకు

రాజీనామా ఇచ్చి వచ్చారు. వారందరూ ఈనాటికి సేవ చేస్తున్నారు. ఏ పదవులూ వారికి కట్టబెట్టడం లేదు. వారు ఏమీ ఆశించకుండానే ఈ విధంగా ప్రజాసేవలో నిమగ్నులై ఉన్నారు. బాంధవ్యము ఉన్నంత మాత్రం చేత ఇలా చేస్తున్నామని ఆరోపణ చేయడం భావ్యము కాదు. ఒక పద్ధతి ప్రకారం జరుగుతున్నది. ఏదో పదవులను ఆశించి తెలుగుదేశం పార్టీలోకి వస్తే పదవులను కట్టబెట్టే మా పార్టీ లేదు. ఈ విధంగా వచ్చిన వారికి ఎవరికీ ఏ పదవి గానీ, ఏ సభ్యత్వం గానీ మా పార్టీ ఇవ్వలేదు. ఇది తెలుగుదేశం పార్టీ చిత్తశుద్ధికి ఒక తార్కాణమని తెలియచేస్తున్నాను. మంచి సంప్రదాయాన్ని నెలకొల్పాలనే ఆలోచన తప్ప మరేమీ కాదు. ఏ రాజకీయ పార్టీ అయినా ఒక్కటే. ఈ సంప్రదాయం మాకు వర్తించదు, మీకు వర్తిస్తుంది అనే భావములో ఈ తీర్మానమును తీసుకురాలేదు. రాజకీయ జీవనములో వున్న ప్రతివారు గుర్తించే విధానమని మనవి చేస్తున్నాను. ఒకరికి వర్తిస్తుంది. మరొకరికి వర్తించదనే భావము లేదు. మా పార్టీ తప్పు చేసినప్పటికీ ఆ చేసిన తప్పులను ఒప్పుకొంటాము. మానవ సేవ చేయడానికి ప్రతి వారికి అధికారము ఉంది. రాజకీయ వాతావరణం కలుషితం కాకుండా ప్రజాసేవ చేయవచ్చుననే విధానమును బలపరచడానికి ఈ తీర్మానము ఉపయోగపడుతుంది. ఎవరైనా ఒక పార్టీ నుంచి మారి ఇంకొక పార్టీలో చేరాలనుకొన్నప్పుడు అంతకు ముందున్న పదవిని వదలి ఇంకొక పార్టీలో చేరుతున్నారు అంటే అది త్యాగము క్రిందకు వస్తుంది. అటువంటి సేవా ధర్మము లేకపోతే రాజకీయ వాతావరణములో తిరిగి ఇమడ లేరు. కాబట్టి సేవా ధర్మముతో చేర్చుకొనడమే తప్ప ఏదో బంధుప్రీతితోనో, ఆశ్రిత పక్షపాతముతోనో చేర్చుకొనలేదు. ఈ తీర్మానమును మన రాజకీయ పవిత్రతకు ఒక రూపుగా తీర్చిదిద్దుకొందామని మనవి చేస్తూ ఈ తీర్మానమును సభ ఏకగ్రీవముగా ఆమోదించాలని తెలియచేస్తున్నాను.

విధాన పరిషత్తును రద్దు చేయబోతున్నాము. మేము దానిపైన ఆశ పెట్టుకొనలేదు. విధాన పరిషత్తు సభ్యులు మా పార్టీని బలపరచాలనేది లేదు. సేవే పరమార్థముగా పెట్టుకొన్నవారు పెద్దవారు వచ్చారు. సుంకర సత్యనారాయణ గారు మా పార్టీలోకి వచ్చారు. అంటే అంత వయస్సులో తెలుగుదేశం పార్టీలోకి ఎందుకు వచ్చారు అనేది సభ్యులు గుర్తించాలి. ఏదైనా పదవి కోసం ఆశించి వస్తే వారి దగ్గర సేవా ధర్మము వుంటుందా? నిస్వార్థముతో పార్టీ ఆశయాలతో పని చేస్తున్నారనేది గుర్తించడం అందరి ధర్మము. స్వార్థం ఉంటే మొదలంటా నరకడం అందరి ధర్మము.

◆◆

మార్చి 24, 1983



# ప్రజాధనం పైసా దుర్వినియోగం అయినా అది ఆమోదయోగ్యం కాదు

*(ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిల్ రద్దు చేస్తూ తీర్మానం ప్రవేశపెట్టిన సందర్భంగా చేసిన ప్రసంగం)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, ఈనాడు శాసన పరిషత్తు రద్దు విషయం ఒక మంచి ఉద్దేశ్యంతోనే నిర్ణయించబడింది. ఎవరిమీదనో ద్వేషభావముతో ఈ విధంగా చేయాలని మా ప్రభుత్వం నిర్ణయించినదని గౌరవ సభ్యులెవరూ అనుకోకూడదని విజ్ఞప్తి చేస్తున్నాను. ఇది ఒక్క మన ఆంధ్రప్రదేశ్‌లోనే జరగబోయేది కాదు. ఇదివరకు పశ్చిమ బెంగాల్‌లో కానీ, పంజాబ్‌లో కానీ కౌన్సిల్‌ని రద్దు చేసిన సంగతి అందరికీ తెలుసు. ముఖ్యంగా కౌన్సిల్‌కు ఉన్న అధికారాలేమిటో మీ అందరికీ తెలుసు. శాసనసభ ఏదైనా ఒక విధానమును నిర్ణయిస్తే ఆ విధానమును వారి ఆమోదం కొరకు అక్కడకు పంపినపుడు, వారు దానిని ఆమోదించకపోతే తిరిగి అసెంబ్లీకి వచ్చి అది ఒక చట్ట రూపమును దాలుస్తున్నపుడు, దానికి ఎక్కువ అధికారాత్మకమైన అధికారాలు లేకపోవడం ఒకటి. వివిధ రంగాలలో విజ్ఞులైన వారిని, మేధావి వర్గాలను ప్రభుత్వానికి సహాయపడడానికి ఎన్నుకొంటూ రాష్ట్రాభివృద్ధిని చేసుకొనగలుగుతున్నాము. అటువంటప్పుడు కౌన్సిల్ అవసరం వుండదేమో అనే భావము ఒకటి.

ఈనాడు కౌన్సిల్‌కి నామినేషన్స్ వచ్చినపుడు ఎవరు అధికారములో ఉంటే వారి ఇష్టులను నామినేట్ చేసుకోవడం జరుగుతుంది. కానీ విజ్ఞతకు పరిపూర్ణమైన పరమార్థము కల్పించబడడము లేదనేది అందరకూ తెలుసు. సదుద్దేశ్యంతో దానిని ఉపయోగించుకొనలేకపోతున్నాము. దాని, అవసరము అంతగా కనపడుటలేదు. పొదుపు విషయంలో చూసినప్పుడు అనవసరం

అనుకొంటున్న పనిచేయటానికి తగిన ఆస్కారంలేని ఈ కౌన్సిల్ ఉండటం వల్ల ప్రత్యేకమైన పరమార్థం ఏమీ లేదనే భావంతో ఈ నిర్ణయాన్ని మా ప్రభుత్వం తీసుకొనడం జరిగింది. ఈనాడు కౌన్సిల్ లేని రాష్ట్రాలు సమర్థవంతంగా నిర్వహించుకొనగలుగుతున్నపుడు అదే విధానమును మనం కూడా అనుసరించడంలో తప్పులేదని గౌరవ సభ్యులకు తెలియచేస్తున్నాను. ఏ మాత్రమూ ద్వేషభావముతో కాకుండా ఒక పవిత్రమైన దృష్టితో చేయబడుతున్నది. ఏ వర్గాన్నీ కించపరచడానికి చేయబడింది కాదు అనే ఉద్దేశ్యంతో ఈ ప్రతిపాదన చేయడం జరిగింది. అందరూ కూడా మా ప్రభుత్వం తెచ్చిన ఈ ప్రతిపాదనను బలపరచాలని ప్రతి ఒక్క గౌరవ సభ్యుణ్ణి కోరుతూ శెలవు తీసుకొంటున్నాను.

అధ్యక్షులకు, గౌరవనీయులైన సభ్యులకు ఈనాడు ప్రభుత్వపరంగా ప్రవేశపెట్టిన తీర్మానం చిత్తశుద్ధితో చేసిన ప్రయత్నం అని సభకు మనవి చేస్తున్నాను. అతి ప్రాముఖ్యం కలిగిన, సమాజము నివాళులు యిచ్చిన సామాజిక దేశ భక్తి నిష్ణాతులైన మహనీయులు, మహానాయకులు, శాసన సభ్యులు న్యాయాధికారులు ఉద్యోగులు, అధికారులు, అధ్యాపకులు ఎవరయినా వారి సమాజము నుంచి వెలుగులోకి వచ్చిన దీప్తులేనని మరచిపోకూడాదని మనవి చేస్తున్నాను. ఏ ఒకరో మంచికి దూరం అయినంత మాత్రాన సమాజంలో మంచి లేదనడం సాహసం. చెడుకు దూరం అయి మంచిని పెంచుకోవడమే మానవాదర్శం. అత్యధిక సంఖ్యాక వర్గాల విజ్ఞాన విధానంతో ఏకీభవించడం మా ఆదర్శంగా భావిస్తున్నాము. మొత్తం ఇండియన్ యూనియన్‌లో గల భాగస్వాములుగా 23 రాష్ట్రాలలో 6 రాష్ట్రాలలో తప్ప మిగిలిన 17 రాష్ట్రాలలో లేని ఈ వ్యవస్థ మనకు అగత్యం లేదని, ఆదర్శం కాదని, దీనిని రద్దు చేయాలనుకున్నాము. కానీ ఎవరి మీద ద్వేషంతోను, ఏ వ్యవస్థపై ఆక్రోశంతో కాదని విజ్ఞప్తి చేస్తున్నాను. సూటిగా ప్రజలు చెప్పే తీర్పు ప్రభావితం కాని వ్యక్తి అభీష్టాలకు, ఆచరణకు గుర్తింపు లభించదని మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, గత అనుభవంలో దీనివల్ల మనము సాధించిందేమిటి, సాధించగల్గిందేమిటి? ఆలోచించండి. పరమార్థం లేని పాత వ్యవస్థ పరిపూర్ణమైన వ్యవస్థే కాదు. కనుకనే ఈ ఆధునిక ప్రజాస్వామ్య పరిధిలో ఈ వ్యవస్థకు జీవం పోయడం కేవలం అనుచితం అని మా ప్రభుత్వం భావిస్తున్నదని మనవి చేస్తున్నాను. ప్రజాధనం పైసా దుర్వినియోగం అయినా అది ఆమోదయోగ్యం కాదు, కాజాలదు. కనుక ఇటువంటి ఏ వ్యర్థ ధన దుర్వినియోగాన్నీ సహించకూడదు, బలపరచకూడదు. ప్రజావాణి ప్రతిబింబించే వ్యవస్థ పని చేస్తూ ఉండగా దాని పక్కనే ఇటువంటి వ్యవస్థ ఉండడం అనవసరం అని మా ప్రభుత్వం భావిస్తున్నది. ప్రజలందరూ ఎంతో ఆశ, నమ్మకం ఉంచి గెలిపించిన ప్రజావాణిని కానీ, ప్రజాభీష్టాలకు ప్రతీకగా నిలిచిన తెలుగుదేశం ప్రభుత్వాన్ని కానీ ఈనాడు మీ ముందు ఉన్నటువంటి తెలుగు యువతకు విజ్ఞానానికి ప్రతీకగా నిలిచినటువంటి ఈ గౌరవ సభ్యులను ప్రశ్నించేటటువంటి హక్కు ఎవరికీ లేదని మనవి చేస్తున్నాను. ప్రతిపక్షం

అంటే దేనిని అయినా విమర్శించడమో, వీగిపోయే విధానాన్ని అనుసరించడమో ఆదర్శంగా పెట్టుకోవడం, మా ప్రభుత్వాన్ని క్రూర ప్రభుత్వం అనో, క్రొత్త ప్రభుత్వం అనో చులకన చేయడం అనుభవజ్ఞులైన పెద్ద రాజకీయవేత్తలకు ఆదర్శం కాకూడదని మనవి చేస్తున్నాను. ఇది తెలుగునాటి శాసనసభ. తెలుగువారి అభ్యుదయ భావాలకు ప్రతీకగా నిలిచే సంస్కృతీ సభ. స్వార్థానికి, స్వప్రయోజనాలకు స్వస్తి చెప్పి, ప్రజల సంక్షేమానికి బహుళ పరమార్థ సాధనకే ప్రోత్సాహం ఇచ్చే పవిత్ర వ్యవస్థ గానే ఇది కృషి చేయాలి. అందువల్ల ఈ వ్యవస్థ నిర్ణయాలకు అంత విలువ ఉంది. అంతటి పవిత్ర తీర్మానాన్ని చర్చించే అర్హత ఈ సభకు కలిగిందని మనవి చేస్తున్నాను. దీనికి యేవో విపరీత భావాలు అంటగట్టడం ధర్మం కాదు. నిష్ప్రయోజనం అయిన, వ్యర్థమయిన, స్వార్థ పూరితమయిన తన ఉనికికే కారణభూతమైన ఆదర్శాలనే విస్మరించిన ఈ నిరంకుశత్వ వ్యవస్థకు ఈనాటి రాజకీయ సమాజ వ్యవస్థలో చోటు లేదని, ఏ ఒక్క ముఖ్యమంత్రి వల్లనో, 15 మంది మంత్రివర్గం వల్లనో సుమారు 200 మంది శాసన సభ్యుల వల్లనో ప్రభుత్వ నిర్వహణ జరగడం లేదని 6 కోట్ల ప్రజానీకం మనోభీష్టం, అభిరుచులే, సమస్యలే ఈనాటి ప్రభుత్వానికి మార్గదర్శకులని మనవి చేస్తున్నాను. వారి అంగీకారమే ప్రభుత్వ మనుగడకు ప్రత్యక్ష నిదర్శనం అని తెలియజేస్తున్నాను.

మూడున్నర దశాబ్దాలుగా అనుభవం అధికారం సాధించలేని, చేయలేనిది ఈ ప్రభుత్వం సాధించడం, చేయబూనడం మీకెవ్వరికి కూడా కన్నెర్ర కాకూడదు. ఈర్ష్య, ద్వేషాలతో వక్రీకరించకూడదు. ఇది ఈనాటి అనుభవం కాదు. ఇది మా కర్తవ్యం. ఇది మా ప్రభుత్వ విధానం. ముందే ప్రధానికి చెప్పడం జరిగింది. ఇది ఈనాటిది కాదు. ఇది ఏనాడో మా మనసులో మెదిలిన భావం. దీనికి ఈనాడు మేము ఇచ్చిన ప్రతిరూపం, ఈనాడు తెచ్చిన తీర్మానం. అధ్యక్షా, ఒక సత్సంప్రదాయం నెలకొల్పి, ఈనాడు మంచికి నివాళులు ఇచ్చే మన ఆదర్శాన్ని వెలికి తెచ్చిన గౌరవ సభ్యులకు, ఈ తీర్మానాన్ని బలపరచి గెలుపొందే విధంగా సహాయపడిన మిత్రులందరికీ, ముఖ్యంగా గౌరవ ప్రతిపక్ష సభ్యులు శ్రీ ఓంకార్, రజాబ్ అలీ, ఒవైసీ, సంజయ్ విచార్ మంచ్ సభ్యులందరికీ, ఇండిపెండెంట్స్ శ్రీ రామచంద్రారెడ్డి, మోహన రెడ్డి మొదలైన వారికి, మన ప్రభుత్వ పక్షాన ఉన్న తెలుగుదేశం సభ్యులందరికీ వారెంతో గౌరవంతో, అభ్యుదయ భావాలతో ఈ తీర్మానాన్ని బలపరచినందుకు ప్రభుత్వం తరపున హృదయపూర్వకమైన కృతజ్ఞతాపూర్వక నమస్సులు తెలియచేస్తున్నాను.

**మూడున్నర దశాబ్దాలుగా అనుభవం అధికారం సాధించలేని, చేయలేనిది ఈ ప్రభుత్వం సాధించడం, చేయబూనడం మీకెవ్వరికి కూడా కన్నెర్ర కాకూడాదు. ఈర్ష్య, ద్వేషాలతో వక్రీకరించకూడాదు. ఇది ఈ నాటి అనుభవం కాదు. ఇది మా కర్తవ్యం. ఇది మా ప్రభుత్వ విధానం. ముందే ప్రధానికి చెప్పడం జరిగింది. ఇది ఈ నాటిది కాదు. ఇది ఏనాడో మా మనసులో మెలిగిన భావం.**

◆◆

మార్చి 24, 1983

# అందరికీ న్యాయం చేయటం ఈ ప్రభుత్వ విధానం

*(ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థుల వయోపరిమితిపై చేసిన ప్రసంగం)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర, సబార్డినేట్ సర్వీస్ నియమావళిలోని 12 (ఇ) నియమం షెడ్యూలు ప్రాంతాలలోని ఆదిమ జాతులు లేదా వెనుకబడిన తెగలు లేదా షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల విషయంలో ఇతర వర్గాల వారికి నిర్ణయించిన గరిష్ట వయోపరిమితి కంటే 5 సంవత్సరాలు ఎక్కువ రాయితీని ఒకే విధంగా కల్పిస్తున్నది. ఈ విషయంలోని 2.4 మినహాయింపు నిబంధనలు వెనుకబడిన తరగతుల వారి వయస్సు 40 సంవత్సరాలకు షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల వారి వయస్సు 45 సంవత్సరాలకు మించరాదనే షరతుకు లోబడి పైన తెలిపిన రాయితీని వర్తింప చేయాలని నిబంధిస్తున్నాయి.

అనేక కారణాల మూలంగా 1967 నుండి 1975 వరకు ప్రభుత్వ ఉద్యోగాలలో నేరు నియామకాలపై నిషేధం ఉన్నది. ఫలితంగా వారు నేడు నియామకానికి అనర్హులైనారు. ఎందుచేతనంటే వాస్తవానికి ఎప్పుడు నియామకాలు జరగాలో అప్పుడు నియామకాలు జరిగి ఉండేటట్లయితే వారికి మామూలుగా వయోపరిమితి అర్హత లభించి ఉండేది. అందువల్ల ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరిధి క్రింది ఉద్యోగాలలో నియామకాలు జరగవలసి ఉంది. నియామకాలు జరగవలసిన కాలపరిమితి వరకు ఒకే విధంగా నేరు నియామకం తాలూకు గరిష్ట వయోపరిమితిని తాత్కాలికంగా పెంచుతూ 21.10.1970 తేదీ ప్రధాన పరిపాలన (సర్వీసులు-ఎ) శాఖ ఎం.ఎస్. నెం. 827 జి.ఓ.లో ఉత్తరువు చేయడం జరిగింది. దరిమిలా కమీషనరు పరిధిలోనికి రాని ఉద్యోగాలకు 30.9.1976 కు పూర్వం నియామకం జరగవలసి ఉన్న సందర్భంలో గరిష్ట వయోపరిమితిని ఆరేండ్లు పెంచుతూ 15-6-1976 తేదీ ప్రధాన పరిపాలన (సర్వీసులు-ఎ) శాఖ ఎం.ఎస్. నెం. 479 జి.ఓ.లో ఉత్తర్వులు జారీ అయినాయి. కమిషన్ పరిధి క్రిందకు వచ్చే ఉద్యోగాలకు, కమిషన్ పరిధి కిందకు రాని ఉద్యోగాలకు

31.12.1977 కు పూర్వం నియామకం జరగవలసి ఉన్నట్లయితే వాటి విషయంలో గరిష్ఠ వయోపరిమితిని ఆరేండ్లు పెంచుతూ 27-4-1977 తేదీ ప్రధాన పరిపాలన (సర్వీసులు-ఎ) శాఖ ఎం.ఎస్.నెం. 315 జి.ఓ.లో మళ్లీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గరిష్ఠ వయోపరిమితిని ఆరేండ్లు పెంచుతూ ఆయా సమయాలలో తాత్కాలికంగా ఉత్తరువులు జారీ చేయడం జరిగింది. ఈ పెంచిన గరిష్ఠ వయోపరిమితి ఉత్తర్వు గడువు 1.7.1982లో ముగిసింది.

ఈ విషయాన్ని కమిషన్‌కు తెలియజేసినప్పుడు మొదట అంగీకరించలేదు. నియామకపు పరీక్షలు ఏటేటా జరుపుతూ ఉండటమే ఇందుకు కారణం. అయితే, ఈ విషయాన్ని మరలా పరిశీలించవలసిందని రెండవసారి కమిషన్‌ను కోరడం జరిగింది. కమిషన్ చివరకు అంగీకరిస్తూ ఎట్టి పరిస్థితులలోను 1982 జూలై మొదటి తేదీ దాటి ఈ వయోపరిమితి రాయితీని పొడగించ కూడాదని తెలియజేసింది. కమిషన్ సలహాను దృష్టిలో ఉంచుకొని పై వయోపరిమితి ఇంకనూ పొడగించాలా వద్దా అనే విషయాన్ని ప్రభుత్వం పరిశీలించి చివరకు వయో రాయితీని ఇక ఏ మాత్రం పొడిగించరాదని నిర్ణయించింది.

ఇతర వర్గాల అభ్యర్థులకు 1వ గ్రూప్ ఉద్యోగాల విషయంలో 26 సంవత్సరాలు, 2వ గ్రూప్ ఉద్యోగాల విషయంలో 28 సంవత్సరాలు గరిష్ఠ వయోపరిమితిని అనుమతిస్తున్నారు. ఆయా సర్వీసులలోని ఉద్యోగాలకు నిర్ణయించిన ఈ గరిష్ఠ వయోపరిమితులకు నుంచి 5 సంవత్సరాల గరిష్ఠ వయోపరిమితి రాయితీని షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు, వెనుకబడిన తరగతుల వారికి అనుమతించడం జరిగింది. సర్వీసులో ఉన్న వారికి 5 సంవత్సరాల గరిష్ఠ పరిమితికి లోబడి ఈ రాయితీని మరికొంత మేరకు అనుమతించడము జరుగుతున్నది. లోగడ ప్రభుత్వం అనుమతించిన ఆరేండ్ల తాత్కాలిక గరిష్ఠ వయోపరిమితి రాయితీ 1.7.1982 తేదీన ముగిసింది. ఇప్పుడున్న నియమావళిలో తెలిపిన రాయితీల ప్రకారం వయోపరిమితిని నిర్ణయిస్తూ ప్రకటించింది.

**ఆయా సర్వీసులలోని ఉద్యోగాలకు నిర్ణయించిన ఈ గరిష్ఠ వయోపరిమితులకు నుంచి 5 సంవత్సరాల గరిష్ఠ వయోపరిమితి రాయితీని షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు, వెనుకబడిన తరగతుల వారికి అనుమతించడం జరిగింది. సర్వీసులో ఉన్న వారికి 5 సంవత్సరాల గరిష్ఠ పరిమితికి లోబడి ఈ రాయితీని మరికొంత మేరకు అనుమతించడము జరుగుతున్నది**

ఇది వరకే చెప్పినట్లుగా ఏదో ఒక కారణాన్ని పురస్కరించుకొని 8 సంవత్సరాలపాటు పబ్లిక్ సర్వీసులలో నియామకాలు జరగనందున గరిష్ఠ వయోపరిమితి విషయంలో ఆరేండ్ల తాత్కాలిక రాయితీ అనుమతించడం జరిగింది. 1975 తరువాత కమిషన్, ఇతర అన్ని నియామక అధికార వర్గాలు పబ్లిక్ సర్వీసులకు నియామకాలు చేస్తున్నాయి. అందుచేత వయోరాయితీని పొడిగించవలసిన సందర్భం కనిపించదు.

◆◆

ఆగస్టు 26, 1983

# చేనేత వారి సంక్షేమం ఈ ప్రభుత్వ బాధ్యత

*(ప్రాథమిక చేనేత సహకార సంఘాలలో పేరుకుపోయిన నిల్వలపై ఇచ్చిన జవాబు)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా! పండుగలు, వివాహాల కాలంలోనే చేనేత వస్త్రాల అమ్మకాలు ఎక్కువుగా వుంటాయి. పండుగ రోజుల్లో ప్రభుత్వం రిబేటు ఇచ్చినప్పుడు మాత్రమే వినియోగదార్లు సాధారణంగా చేనేత వస్త్రాలను కొనుగోలు చేస్తారు. ప్రాథమిక చేనేత సహకార సంఘాల వస్త్రాలకు సంవత్సరంలో 7 నెలలు మాత్రమే అమ్మకాలు వుంటాయి. సెప్టెంబర్ నుండి జనవరి వరకు అంటే ఈ అయిదు నెలల్లో వచ్చే పండుగల కాలంలోనూ, మిగిలిన రెండు నెలలు పెళ్ళిళ్ళ సీజనులోనూ వుంటాయి. సాధారణంగా ఏప్రిల్ నుండి ఆగస్టు వరకు చేనేత వస్త్రాల అమ్మకాలు తక్కువగా వుంటాయి. పై కారణాల వల్ల ఆ కాలంలో ఉత్పత్తి అయ్యే సరుకు అమ్మకం కాకుండా నిల్వ ఉండి పోవడం అన్నది సర్వసాధారణం.

2. చేనేత వస్త్రాలు మార్కెట్‌లో అమ్మకాలు జరగని కాలంలో దీర్ఘకాలం నిల్వ వుండిపోయే అవకాశం వుంది. ఈ ప్రత్యేక పరిస్థితిని జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు గుర్తించింది. అందుచేత చేనేత సహకార సంఘాలు సంవత్సరంలో ఉత్పత్తి చేయగలవని భావించిన దానిలో 40 శాతాన్ని అప్పుగా మంజూరు చేస్తున్నాయి. సాధారణంగా ఇతర రంగాలలో 25 శాతం వరకు మాత్రమే మంజూరు చేస్తాయి.

3. 1982-83లో ప్రాథమిక సహకార సంఘాలు రూ.45 కోట్ల విలువ చేసే చేనేత వస్త్రాన్ని ఉత్పత్తి చేశాయి. నెలకు సరాసరిన రూ.3.75 కోట్లు విలువ చేసే వస్త్రాన్ని ఉత్పత్తి చేశాయి. 30-6-83 నాటికి ఈ సంఘాల వద్ద రూ.9.16 కోట్లు విలువ చేసే నిల్వలు వున్నాయి. ఆ విధంగా నిల్వ ఉన్న వరకు 3 నెలల సగటు ఉత్పత్తి కంటే తక్కువగా ఉంది. 1983 ఏప్రిల్, ఆగస్టు మధ్యకాలంలో చేనేత వస్త్రాల అమ్మకం ఎక్కువగా జరగదు. ప్రాథమిక సంఘాల వద్ద నిల్వ ఉన్న రూ.9.16 కోట్ల సరుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవలిసినంత ఎక్కువ సరుకు కాదు.

4. ప్రస్తుతం నిల్వ ఉన్న సరుకు 1983 సెప్టెంబరులో వచ్చే వినాయక చతుర్థి పండుగ కాలంలో మామూలుగా అమ్ముడవుతుందని ఆశిస్తున్నాము. వినాయక చతుర్థి సందర్భంగా చేనేత వస్త్రాలను చిల్లరగా కొనుగోలు చేసే కొనుగోలుదారులందరకు 20 శాతం ప్రత్యేక రిబేటును ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం అర్హత కలిగిన అన్ని వర్గాల ప్రాథమిక సంఘాలను అనుమతించింది. అదే విధమైన రిబేటు సౌకర్యం దసరా, దీపావళి, సంక్రాంతి పండుగలకు కూడా అనుమతిస్తారు.

5. 1-4-83 నాటికి ప్రభుత్వం ఆప్కోకు, ప్రాథమిక నేత పనివారల సహకార సంఘాలకు రిబేటు కింద రూ.61284 లక్షలు, సబ్సిడీ కింద 132.48 లక్షలు, మొత్తం రూ.745.13 లక్షలు బకాయిలను చెల్లించవలసిందిగా ఆయా సంఘాల వారి నుండి అనేక విజ్ఞప్తులు అందాయి. అందుచేత, ప్రాథమిక, ఎపెక్సు నేత పనివారల సహకార సంఘాలకు బకాయి ఉన్న రిబేటు క్లెయిములను చెల్లించడానికి గాను రాష్ట్ర ప్రభుత్వం 1982-83లో రాష్ట్ర ప్రణాళికా నిధి నుండి రూ.300.00 లక్షలు, కేంద్ర ప్రభుత్వ నిధి నుండి రూ.194.14 లక్షలు, మొత్తం రూ.494.14 లక్షల మొత్తాన్ని విడుదల చేసింది. చేనేత, జౌళి శాఖ డైరెక్టర్ వాస్తవంగా రూ.473.49 లక్షల మొత్తాన్ని పంపిణీ చేశారు. 31-3-82 వరకు బకాయి ఉన్న రిబేటు మొత్తంలో ఇంకా రూ.139.15 లక్షలు చెల్లించాల్సి ఉంది. రూ.139.15 లక్షల బకాయి క్లెయిములను కూడా ఈ ప్రస్తుత సంవత్సరంలోనే చెల్లించడమవుతుంది.

6. 1983-84లో పరిష్కరించవలసిన 1982-83 రిబేటు క్లెయిములు రూ.284.75 లక్షలు. ఈ మొత్తంలో ఇప్పటికే రూ.120.65 లక్షలు ఆప్కోకు పంపిణీ చేశారు. ఇంకా రూ.164.10 లక్షలు ఇవ్వవలసి ఉంది. 1-4-1983 నాటికి పరిష్కరించవలసిన రిబేటు క్లెయిములు బకాయి రూ.903.25 లక్షలు (బకాయి క్లెయిములు రూ.139.15 లక్షలు ప్రస్తుత క్లెయిములు రూ.164.10 లక్షలు).

7. రాష్ట్ర ప్రణాళిక క్రింద 1983-84 సంవత్సరానికి రిబేటు క్లెయిముల క్రింద రూ.165.00 లక్షలు కేటాయింపు ఉన్నది. అదే మొత్తంలో భారత ప్రభుత్వ వాటాగా రావలసిన మేకింగ్ విరాళం, ఇప్పటికీ కేంద్రం విడుదల చేసిన రూ.230.00 లక్షలలో మిగిలిన రూ.130 లక్షలు కలిసి 1983-84 సంవత్సరానికి ఈ పథకం క్రింద లభ్యమయ్యే మొత్తం రూ.480.00 లక్షలు ఉంటుంది. ఈ మొత్తం 1982-83 వరకు ప్రాథమిక, అపెక్స్ సంఘాల బకాయి క్లెయిములను పరిష్కరించటానికి సరిపోతుంది.

8. జనతా వస్త్రాలపై సబ్సిడీకి సంబంధించి 1-4-1982 నాటికి మిగిలి వున్న మొత్తం రూ.132.49 లక్షలు భారత ప్రభుత్వం ఆప్కోకు విడుదల చేసింది. 31-3-1983కు అంతమయ్యే మూడు నెలల క్లెయిముకు చెందిన మొత్తం రూ.37.17 లక్షలు రావలసి ఉన్నది.

9. అందుచేత చెల్లించని సబ్సిడీ బకాయిలు, ఆప్కోకు, ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం నుండి రావలసిన రిబేటు నేటికి చాలా వరకు తీర్చబడింది. గతంలో ప్రభుత్వం నుండి బకాయిలు రాని కారణంగా సంఘాలకు వాటిల్లే ఆర్థిక సమస్యలు ఇప్పుడు లేవు.

అధ్యక్షా.. చేనేత బట్టగానీ, ఖాదీ బట్టగానీ కొనదలచుకున్న ప్రభుత్వోద్యోగులకు అడ్వాన్స్ ఇవ్వడం జరుగుతుందని కూడా ఆర్డర్ ఇవ్వడం జరిగింది. ఈ నిర్ణయాల వల్ల చేనేత వస్త్రాలకు, ఖాదీ బట్టలు కొనుటలో ప్రోత్సాహం కలిగించడం జరిగింది. 1982 నాటికి చూస్తే రూ. 62.64 లక్షలు వుందని ఇదివరకే మనవి చేశాను. 1982-83 నాటికి మొత్తం రూ. 494 లక్షలు వుంది. ఈ విషయంలో మంజూరు చేసిన దానిలో 300 లక్షలు స్టేట్ గవర్నమెంటు నుండి వస్తే.. ఈ మొత్తంలో నుండి రూ. 473.49 లక్షలు పాత బకాయి క్రింద ఇచ్చాము. రూ. 139.15 లక్షలు మాత్రమే బాకీ ఉంది. ఈ సంవత్సరము చూస్తే రూ. 284.75 లక్షల రిబేటు వాటి కింద ఇవ్వవలసి వుంటుంది. రూ. 164.10 లక్షలు బాకీ ఉంది. ఈ సంవత్సరానిది రూ. 139.15 లక్షలు. 81-82 లోది మాత్రం బాకీ వుంది. రూ. 303.85 లక్షల మొత్తం ఈ సంవత్సరము నుండి బాకీ పేరుకుంటూ వచ్చింది. యదార్థానికి అక్కడ పరిస్థితి చూస్తే, చేనేత పనివారి బకాయిల విషయం చూస్తే మెరుగ్గా ఉంది. ఈ సంవత్సరం బాకీలు కూడా పూర్తి చేయటానికి వీలు అవుతుంది ఈ ప్రభుత్వము అవలంభిస్తున్న విధానం వల్ల.

**చేనేత బట్టగానీ, ఖాదీ బట్టగానీ కొనదలచుకున్న ప్రభుత్వోద్యోగులకు అడ్వాన్స్ ఇవ్వడం జరుగుతుందని కూడా ఆర్డర్ ఇవ్వడం జరిగింది. ఈ నిర్ణయాల వల్ల చేనేత వస్త్రాలకు, ఖాదీ బట్టలు కొనుటలో ప్రోత్సాహం కలిగించడం జరిగింది. 1982 నాటికి చూస్తే రూ.62.64 లక్షలు వుందని ఇదివరకే మనవి చేశాను. 1982-83 నాటికి మొత్తం రూ.494 లక్షలు వుంది.**

చేనేత వారి సంక్షేమం చూడవలసిన బాధ్యత ప్రభుత్వము మీదుంది. ఇతర దేశాలకు సంబంధించిన బట్టకు, వారి జీవనోపాధికి సంబంధము లేదు. నేత లుంగీలు నైజీరియాకు ఇదివరకు రవాణా చేయబడేవి. ఇప్పుడు వాటికి కూడా ఆర్డర్ రావడం లేదు. ఈనాడు అక్కడ మార్కెట్ లేదు. అక్కడివారే కోరడం లేదు. అందువల్ల ఆర్డరు రావడం లేదు. అంతేగానీ ప్రభుత్వము అవలంభిస్తున్న విధానం వల్ల ఎగుమతి ఆగిపోలేదని మనవి చేస్తున్నాను. వారి సంక్షేమాన్ని చూస్తామని మరోసారి వారికి తెలియజేస్తున్నాను.

◆◆



ఆగస్టు 26, 1983

## బాధితుల కన్నీళ్లు తుడుస్తాం, అండగా నిలబడతాం

*(రాష్ట్రంలో వరద పరిస్థితిని, ప్రభుత్వ చర్యలను వివరిస్తూ చేసిన ప్రసంగం)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, ఆనాడు నేను స్వయంగా కన్నీటి కెరటంలా ఉన్నటువంటి ఆ వాతావరణాన్ని చూశాను. వేరే గతి లేక రెండు రోజుల నుండి ఇండ్ల మీద కాపురం ఉంటూ బిడ్డలతో బిక్కుబిక్కుమంటూ వున్నటువంటి ఆ కన్నీటి కడలిలో వున్న అభాగ్యుల గాథలు కూడా చూశాను. అదేవిధంగా నిజామాబాదు పట్టణంలోని వీధులన్నీ నీళ్లమయం అయి ఉండడం కూడా చూశాను. చెరువులు గండ్లు పడి మొత్తమంతా జలమయమై, ఇదేమన్నా ప్రళయం వచ్చిందా అన్నట్లు ఉన్నటువంటి విపరీతమైన పరిస్థితిని కూడా చూశాను. బిడ్డలను చంకలో పెట్టుకొని భర్త ఎక్కడ వున్నాడో, ఏమి అయినాడో తెలియకుండా, అక్కడున్నటువంటి ఉదారులు, ఆఫీసర్లు ఏర్పాటు చేసినటువంటి విడిదిలో కాలం గడుపుతూ వారు పెట్టిన ముద్దతో కడుపు నింపుకుంటూ అలో లక్ష్మణా అనే ఆడపడచులను చూశాను.

ఈనాడు ముఖ్యంగా 294 మంది శాసన సభ్యులు, వివిధ పక్షాల వారు ఉన్నప్పటికీ అందరము తెలుగువారము, ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారము, భిన్న మత సంస్కృతులతో కూడిన ఈ పరిశుద్ధమైనటువంటి వాతావరణములో అన్నదమ్ముల్లాగా మెలుగుతున్నటువంటి వారము,

ఈనాడు ఎవరి హృదయము నుండి బయటకు చెప్పినా ఏమి చెప్పినా ఆవేదన ఒక్కటే ప్రస్ఫుటిస్తున్నది. ఈనాడు ఎంత పోయింది ఆస్తి, ఏవిధంగా ప్రజలు వున్నారనేది కాదు. మన సోదరసోదరీమణులు ఏ విధంగా కడగండ్ల పాలైనారు, ఏ విధంగా అతివృష్టికి గురై బాధపడుతున్నారనేది ప్రతి గౌరవ సభ్యుడి హృదయములో, మనస్సులో వున్నటువంటి బాధ. ఎంతో ఆర్ధ్రతతో వ్యక్తం చేశారు సోదరులందరూ. ఈనాడు వరదల బాధకు గురి అయినటువంటి అనేక వేల కుటుంబాల వారు నిరాశ్రయులై ఆస్తి పోగొట్టుకున్న వారికి, కడగండ్లు పడుతున్న వారికి నష్టపోయినవారందరికీ కూడా ఈ సభ పక్షాన పరిపూర్ణమైనటువంటి సానుభూతిని, ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నానని మనవి చేస్తున్నాను.

ముఖ్యంగా ఎంతో మంది ఉదారులు ముందుకు వస్తున్నారు. ఈనాడు ప్రభుత్వమే గాదు ప్రజలను ఆదుకోవడం కోసం, ప్రతివారూ బాధ్యతను గుర్తించి కొన్ని చెక్కులు కూడా సమర్పించారు. ఆ విధంగా ఉదారులైన ప్రజా సేవాపరాయణులైనటువంటి వారు, సంస్థలు కూడా ముందుకువచ్చి ఈ ఆపద వేళ ఆదుకోవాలని ఈ సభా ముఖంగా అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. ఈనాడు సుమారు మూడు వేల గ్రామాలు, పది వేల లోపు గొర్రెలు గానీ, పశువులు గానీ 4 లక్షల ఎకరాల పల్లపు చేలో ఉన్నటువంటి పంట, 4 లక్షల పైచిలుకు మెట్ట చేలో ఉన్నటువంటి పంట, సుమారు 40 వేల ఇండ్లు పూర్తిగా ధ్వంసం అయిపోయినవి. ఇంకా 45 వేల ఇండ్లు పాక్షికంగా నష్టపోయినవి. ఇసుక మేటవేసిన ప్రాంతాలు సుమారు 10 వేల ఎకరాల పొలం ఉంది. చెరువులు గండ్లు పడి ఒక జలపాతంగా ఆ ప్రాంతాలన్నింటినీ నింపివేసినవి. సుమారు వేయి చెరువులు వున్నవి. పిడబ్ల్యుడీ పంచాయతీ రోడ్స్ సుమారు రూ.1900 లక్షలు వున్నవి. డ్రైనేజీ పథకాలు సుమారు 300 లక్షలు పోగొట్టుకున్నాము. ఎలక్ట్రిసిటీ వల్ల 125 లక్షల నష్టం వచ్చింది. పబ్లిక్ భవనాలు గానీ, భవంతులు గానీ కూలిపోవడం వల్ల మరమ్మతులకు రూ.200 లక్షల నష్టం సంభవించింది. ఈనాడు ఎక్కువ గానీ, తక్కువ కానీ అంచనా ప్రకారం 110 కోట్లు సుమారు నష్టం వచ్చిఉంటుందని తాత్కాలికపు అంచనా వేయబడిందని గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను.

ఏమి సహాయం చేశారంటే చేసినవారు చేశారు. వెంటనే వారికి పునరావాసం కల్పించారు ఆఫీసర్లు. నిజామాబాదులో దగ్గర దగ్గర ఆరేడు వేల నిరాశ్రయులకు ఉండడానికి ఆధారం కల్పించి వంట సదుపాయాలు ఏర్పాటు చేసి మూడు రోజులపాటు భోజనాలు ఏర్పాటు చేశారు. ఒకటి రెండు హెలికాప్టర్సు నుండి ఇండ్ల మీద ఉన్నటువంటి వారికి చుట్టూ జలమయంగా, శోకసముద్రంగా ఉన్నటువంటి వాతావరణములో కనీసం పిల్లలకు కూడు అయినా పెట్టుకోడానికి వీలుగా వుండేట్లు... ఆహార పదార్థాల పొట్లాలను వేయడం జరిగింది. అదేవిధంగా గోదావరిలో ఒక రాత్రి అంతా బిక్కుబిక్కుమంటూ ఉన్నటువంటి 13 మంది ఆఫీసర్స్‌తోసహా ఉన్నటువంటి నిస్సహాయులను రక్షించడం జరిగింది. ఈ విధమైనటువంటి రక్షణ చర్యలు గానీ, ఆహార

పొట్లాలను పంపిణీ చేసే విధానాలను గానీ అమలుపరచటం జరిగింది. 16 మిలటరీ బోట్సు కూడా ఆపదలో వున్న వారిని దరి చేర్చడానికి వీలుగా ఉపయోగించబడినాయని గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను. నిజంగా దురదృష్టం. రోడ్స్ పోయినవి, రవాణా సౌకర్యాలు పోయినవి, ఇంచుమించుగా హెలికాప్టర్స్ పెట్రోలు అయిపోయి ఏ విధంగా తిరిగివస్తవి, తిరిగి రావడానికి ఏ విధంగా అనుకూలత ఉంటుందనే వాతావరణములో ప్రజలు ఏ విధంగా బాధపడ్డారో అని ఒకసారి ఆలోచిస్తే నిజంగా మనం ఎంత చేసినా, ఎంత బాధ వ్యక్తం చేసినా, చాలదేమోననే భావన కలుగుతున్నదని గౌరవ సభ్యులందరికీ ప్రభుత్వ పరంగా తెలియజేస్తున్నాను.

ఇకపోతే, ప్రభుత్వపరంగా ఏమి చేశామో చెప్పడం నా ధర్మం, నా బాధ్యత. అనుభవం వున్న ఆఫీసర్స్‌ను, ఇంజినీర్సును గోదావరి వద్ద కాపలా పెట్టాము. ఏ క్షణములో ఏమి జరుగుతుందోనని. నేను వెళ్లినప్పుడు ఆనకట్టపైన 17 అడుగులు పొంగి ప్రవహిస్తున్న ఆ గోదావరి తల్లి, ఆ తరువాత ఒక అడుగు రెండు అంగుళాలు కనుక వస్తే కట్టలు తెగిపోయేవి. తెగే పరిస్థితి వస్తే ఎంత నష్టం వస్తుందో, ఎన్ని వేల మంది పోతారోనని భయభ్రాంతులైన ఆఫీసర్స్ నాకు చెప్పడముతో, అక్కడ అనుభవజ్ఞులైన ఇంజనీర్లను వేసి ఏ క్షణానికి ఆ క్షణము కనిపెట్టుకొని ఉండాలని, ఏవిధంగా నివారణ చర్యలు ఎప్పటికప్పుడు తీసుకోవాలో ఆ విధంగా చేయాలని కోరడం జరిగింది. తరువాత అనుక్షణం వస్తున్న ఆపదను తెలియపరచడానికి మన సెక్రటేరియేట్‌లో ఒక కంట్రోలు రూమ్‌ను ఏర్పాటు చేశామని గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను. ఆ తరువాత అక్కడ ఉన్నటువంటి చెరువుల వల్లగానీ, నూతులవల్ల గానీ అంటువ్యాధులు సోకకుండా బ్లీచింగు పౌడరు వాడడం జరిగింది.

**ప్రభుత్వపరంగా ఏమి చేశామో చెప్పడం నా ధర్మం, నా బాధ్యత. అనుభవం వున్న ఆఫీసర్స్‌ను, ఇంజినీర్సును గోదావరి వద్ద కాపలా పెట్టాము. ఏ క్షణములో ఏమి జరుగుతుందోనని. నేను వెళ్లినప్పుడు ఆనకట్టపైన 17 అడుగులు పొంగి ప్రవహిస్తున్న ఆ గోదావరి తల్లి, ఆ తరువాత ఒక అడుగు రెండు అంగుళాలు కనుక వస్తే కట్టలు తెగిపోయేవి.**

నిరాశ్రయులైనటువంటి వారికి కలరా మొదలైన వ్యాధులు సోకకుండా ఇంజక్షన్లు, వ్యాధి నివారణ వైద్య సదుపాయాలు కలిగించడం జరిగింది. బావులను క్లోరిన్‌తో శుభ్రపరచడం జరిగింది. తరువాత వారు ఎక్కువ బాధపడతారనే భావముతో ఈ విధమైనటువంటి శ్రద్ధ తీసుకోవడం జరిగింది. ఈనాడు అవసరాన్ని బట్టి టి.ఆర్. 27 క్రింద ప్రజల సౌకర్యం కొరకు ధన సౌకర్యం ఏర్పాటు చేసుకొని ఉపయోగించుకోవలసిందిగా జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. అక్కడి నుండి ఇంత కావాలని హైదరాబాద్‌కు వ్రాయడానికి గానీ, టెలిఫోనులో చెప్పడానికి కానీ సౌకర్యాలు లేవు. అందువల్ల ప్రభుత్వపరంగా చెప్పడానికి ఆలస్యం

కావచ్చుననే భావముతో ఆ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. తక్షణ సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి పరిపూర్ణమైనటువంటి అధికారాలు వారికి ఇవ్వడం జరిగింది.

ఈనాడు తీసుకున్నటువంటి చర్యలు, రిలీఫ్ వర్క్సు, ఎంత డబ్బు అనే విషయం వచ్చినప్పుడు ఇంత వరకు ఉన్నటువంటి అంచనా ప్రకారం ఆ సౌకర్యం చేయడం జరిగింది, అంతటితో సరిపోదని నాకు తెలుసును. చనిపోయిన వారికి వేయి రూపాయలు, ఇండ్లు పోయిన వారికి 250 రూపాయలు, సగం లేకపోతే కొంతవరకు ఇండ్లు పోయిన వారికి 75 రూపాయలు, బట్టలకు 75 రూపాయలు అంటే ఈనాడు ఉన్నటువంటి మార్కెట్ రేట్సును బట్టి గానీ, జీవిత పరిస్థితులను బట్టి గానీ ఏ మాత్రం చాలదు. అంతకు మించి పేదవారికి, ఏ మాత్రం ఆసరా లేనటువంటి వారికి శ్రమ మీద బతికే కష్టజీవులకు, వారి ఇండ్లుపోతే ప్రభుత్వం తలపెట్టినటువంటి శాశ్వత గృహ నిర్మాణ పథకములో చేర్చి శాశ్వత గృహ నిర్మాణాలు చేయడానికి అవకాశం వుంటే వాటి అన్నింటినీ శాశ్వత గృహ నిర్మాణ పథకము క్రింద చేరిస్తే బాగుంటుందేమో ఆ విషయం ఆలోచించమని అధికారులకు ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందని మనవి చేస్తున్నాను. అదేవిధంగా పది కిలోల బియ్యం వెంటనే ఇవ్వడం జరిగింది. వరద అంటే యించుమించుగా అంతా కొట్టుకుపోయినట్టే లెక్క. ఏమి మిగిలింది తరువాత చూసుకుంటే తెలియాలి కానీ అసలు ఈనాడు మనం వేస్తున్న అంచనాలు అన్నీ తప్పు అంచనాలే. బయట చూచినా పంటలను మెరక వేసిన భూములను చూసి అనుకుంటున్నా కానీ ఇంటిలో గుడ్డ పోయినా నష్టమే. పెట్టెలో డబ్బు పోయినా నష్టమే. అఖరుకు పడుకునే మంచం పోయినా నష్టమే, పాలిచ్చే పశువు పోయినా నష్టమే. అంచనా ఎంత ఉందో వేయలేము. యధార్థంగా ఆ బాధలు తీర్చడానికి ఎంతో కాలం పడుతుందని సవినయముగా మనవి చేస్తున్నాను.

**వరద అంటే యించుమించుగా అంతా కొట్టుకుపోయినట్టే లెక్క. ఏమి మిగిలింది తరువాత చూసుకుంటే తెలియాలి కానీ అసలు ఈనాడు మనం వేస్తున్న అంచనాలు అన్నీ తప్పు అంచనాలే. బయట చూచినా పంటలను మేరక వేసిన భూములను చూసి అనుకుంటున్నా కానీ ఇంటిలో గుడ్డ పోయినా నష్టమే. పెట్టెలో డబ్బు పోయినా నష్టమే.**

అదేవిధంగా వ్యవసాయం. ముఖ్యంగా ఈనాడు ఖరీఫ్ పంటకు నీరు పుష్టిగా వుంది. గోదావరిలో, పోచంపాడులో నీరు తృప్తిగా వుంది. కాబట్టి ఈ ఖరీఫ్ పంటను పండించే విధానము ఆలోచించమని గట్టిగా ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది. పోయింది పోగా వెంటనే నాట్లకు ఏదైనా అవకాశం కలగజేసి ఆహార సమస్య విషమంగా పరిణమించకుండా వెంటనే ఖరీఫ్ పంటకు తగిన సౌకర్యాలు ఆలోచించమని అధికారులకు ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది. అదే విధంగా రాబోయే రబీ పంటకు నీరు సమృద్ధిగా ఇవ్వడానికే ఏర్పాట్లు చేయబడుతున్నాయి. ఏమైనా దీనివల్ల ఆహార సమస్య విషమించకుండా సరిచేసుకోవలసిన అవసరం వుంది. ఖరీఫ్ పంట

పోగొట్టుకోడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదు. ఆ విషయంలో శ్రద్ధ తీసుకోవలసిందిగా అధికారులకు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని మనవి చేస్తున్నాను. అట్లాగే ఐ.ఎం.ఎస్. లోన్సు వారికి వెంటనే ఏర్పాటు చేయమని చెప్పాము. పేదవారు అయితే హెక్టారుకు 170 రూపాయల చొప్పున ఇవ్వాలని, 25 పర్సంట్ నుండి 33 పర్సంట్ వరకు పేదలు వుంటే వారికి రాయితీ ఏర్పాటు చేయమని చెప్పడం జరిగింది. తరువాత ఈనాడు తిరిగి తట్టుకునే పరిస్థితిలో పంటలు ఉంటే వారికి ఎరువుల సదుపాయం ఏర్పాటు చేయాలని అధికారులకు ఉత్తర్వులు చేయడం జరిగింది. ముఖ్యంగా కొద్ది కాలములో వచ్చే పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పాము. నెల, నెలా 15 రోజుల ఊడ్పుల కాలం గడిచింది. కాబట్టి త్వరితంగా వచ్చే పంటలైతే ముఖ్యంగా ఖరీఫ్ కాలములో వేసుకున్న పంటలు నష్టపోయినా వాటిని పూడ్చుకోడానికి వీలుగా వుంటుందని ఈ విధంగా ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది.

ఇకపోతే, ముఖ్యంగా చెప్పవలసింది, దీనివల్ల వచ్చిన నా అనుభవం కూడా సభ వారికి వ్యక్తం చేయడం నా బాధ్యత. ఈనాడు నష్టపడేది ఒక గోదావరి వరద ప్రాంతమే కాదు. మురుగు సదుపాయాలు పోయినటువంటి పల్లపు ప్రాంతాలు అన్నీ దెబ్బ తిన్నవి. గోదావరి డెల్టా మాత్రమే కాదు, కృష్ణా డెల్టా కూడా దెబ్బ తిన్నది. ఎందుకంటే ప్రత్యేకంగా వరద వచ్చి కాదు. వర్షం కురిసిన నీరు పోవడానికి సౌకర్యం లేక. ఇంతవరకు ఏ విధంగా మైనరు ఇరిగేషను ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశామో, దానివల్ల ఎటువంటి అనర్థాలను మనం అనుభవిస్తున్నామో కూడా, ఇది మంచి అనుభవమని మనవి చేస్తున్నాను. ఈనాడు చెరువులకు మరమ్మతులు లేవు, డీసిల్టింగ్ మరచిపోయినారు. కాలవలు అన్నీ పూడిపోయినవి, ఎక్కడ చూసినా లోతు లేక, చెరువులు అన్నీ నిండిపోయినవి, గట్లే లేవు, ఉన్న పాత గట్లు కొట్టుకుపోయినవి. అసలు మురుగు కాలవలను, డీసిల్టింగ్ విధానమును ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ఫలితంగా ఈనాడు వర్షం వల్ల పంటలు అన్నీ ముంపుకు గురి అయినవని మనవి చేస్తున్నాను. వచ్చే సంవత్సరము ఏ విధంగా మైనరు ఇరిగేషను ప్రాజెక్టులు గానీ, మేజరు ఇరిగేషను ప్రాజెక్టులు గానీ మనం చేపట్టాలనేది ఈనాడు ప్రభుత్వానికి ప్రథమ సమస్యగా ఉంది. ఈనాడు సాంఘిక సంక్షేమ కార్యక్రమాల కంటే కూడా ఇటువంటి దురదృష్టకర సంఘటన జరిగినప్పుడు దానిని అదృష్టంగా తీసుకొనే విధానం ఏమంటే, చెరువులు అన్నీ బాగు చేసుకొని, గట్లను కట్టుదిట్టంగా వేసుకోగలిగితే ఉన్న నీటిని వృథా చేయకుండా నీరు సముద్రం పాలుగాకుండా, ఒక ఆధారంగా మలుచుకోడానికి అవకాశం వుంటుంది కాబట్టి మైనరు ఇరిగేషను ప్రాజెక్టులను తక్షణమే ప్రారంభించవలసిన అవసరం వుంది.

ఈనాడు మన ఇల్లును మనం చక్క బెట్టుకుంటున్నాము. ఒక భాగములో ఉన్న సోదరుడికి పట్టిన దుర్గతికి సానుభూతి చూపిస్తూ ఇంత సహాయం అందిస్తున్నాము, గానీ ప్రత్యేకంగా పోయినవారి ముఖాన 4 చుక్కల నీళ్లు చల్లడం అనే విధంగా కాకుండా పరిపూర్ణమైనటువంటి సానుభూతితో చేస్తున్న కృషి ఇది. సహాయం కాదు, మన బాధ్యత. ముఖ్యంగా ప్రభుత్వం ఆదుకోవడం ఈనాడున్న వ్యవస్థ యొక్క కర్తవ్యంగా నేను మనవి చేస్తున్నాను. కేంద్ర ప్రభుత్వం విషయం. మొన్ననే

వర్షాలు రావడం, దానితరువాత శాసనసభ సమావేశాలు వచ్చినవి. వాటిని వదలిపెట్టకుండా ఏ క్షణములో ఏ గడ్డు పరిస్థితి వస్తుందోనని ఇక్కడ ఉండవలసిన అవసరం ఉంది. ఈ సభా కార్యక్రమాన్ని చూచుకోవలసిన అవసరం ఉంది. కాబట్టి కేంద్ర ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు జరిగినటువంటి ఇబ్బందులను తెలియజేయడం జరిగింది. ఏమాత్రం ఈ విషయములో నిర్లక్ష్యం చేయలేదని మనవి చేస్తూ నేను ఇందిరాగాంధీ గారికి వ్రాసిన ఒక ఉత్తరమును చదివి విన్పిస్తాను.

Dear Smt. Indira Gandhi, May I request you to refer to my letter dated 18-8-83 in which I have briefly informed you of the grave situation arising out of the floods in the river Godavari and cyclone due to the heavy rains in the first fortnight of this month. Reports since reached the state Government so far indicate that the extent of damage to the public and private properties together exceeds Rs. 100 crores. Information so far received indicates that 56 lives have been lost and standing crop in over 2.75 lakh hectares has been totally damaged. Damages to over 75,000 houses have also been reported and several roads and irrigation sources and public buildings have suffered extensive damage. A memorandum seeking Central assistance to meet the grave situation is being sent to the Government of India separately. The State Government has issued orders for immediate relief to the affected population by providing shelter, clothing and foodgrain. Orders have also been issued for extending assistance to the cultivators where it is possible to revive the standing crop. We have also sought an advance of Rs. 15 crores from the Government of India for essential repairs to irrigation sources and for food relief. I shall be grateful for relief of advance assistance and also for a Central Study Team at the earliest for assessing the extent of damage so that the quantum of assistance from the Government of India may be decided quickly."

అందరం సమిష్టిగా కలిసి చేయవలసిన విషయం ఇది. ఇది మనందరి బాధ్యత, సభ బాధ్యత అని మనవి చేస్తున్నాను. మీరు ఒకటి, మేము ఒకటి అని అనుకోవద్దు. మనం ఇక్కడున్నంతవరకు మనది ఒక కుటుంబం. నేను మీలో ఒకడిని, మీరు మాలో ఒకరు అని సహకరించాలని మనవి చేస్తున్నాను. ఈ వరద బాధితులకు సహాయపడుటకు, వరద నివారణోపాయాలు మనకు అందుబాటులో ఉన్న సూచనలు ఇవ్వాలని గౌరవ సభ్యులందరినీ నేను అభ్యర్థిస్తున్నాను. ఈ విషయంలో అంతా ఒక్కటే. మన రాష్ట్రాన్ని మనం బాగు చేసుకోవాలి. ఈ శోక సముద్రం నుంచి మన వారిని మనం కాపాడుకొనడం మన ధర్మం అని విజ్ఞప్తి చేస్తున్నాను. ఈనాడు ఈ బాధాకరమైన విషయాన్ని ఈ సభముందు పెడుతూ ఎంతో బాధను వ్యక్తం చేస్తూ, సోదరీసోదరులకు, నిరాశ్రయులైన కుటుంబాల వారందరికీ నా ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నాను.

◆◆

సెప్టెంబర్ 1, 1983

# విశాఖ స్టీల్‌కు కేంద్రం పరిమితంగా నిధులు కేటాయించడం ఆందోళనకరం

*(విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నిధుల కోతపై చేసిన ప్రసంగం)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** విశాఖపట్నం కర్మాగారాన్ని రెండు దశల్లో ఏర్పాటు చేస్తున్నారు. మొదటి దశలో 12 మిలియన్ టన్నుల ఉక్కును ద్రవ రూపంలో ఉత్పత్తి చేయడానికి సదుపాయాలు కల్పిస్తారు. రెండో దశలో 3.4 మిలియన్ టన్నుల ఉత్పత్తిని అందుకోడానికి సదుపాయలు వుంటాయి. కేంద్ర ప్రభుత్వము ఈ ప్రాజెక్టు తాలూకు అంచనా వ్యయాన్ని 1982 జూలైలో ఆమోదించింది. దీని ప్రకారం, అంచనా వ్యయం రూ.2256 కోట్ల నుండి రూ.3897.28 కోట్లకు సవరించడం జరిగింది. విదేశీ మారక ద్రవ్యం రూ.500.20 కోట్ల నుండి రూ.679.57 కోట్లకు సవరించారు. 1982 ఫిబ్రవరి బ్లాస్టు ఫర్నేసు నిర్మాణం ప్రారంభం అయినప్పుడే ఈ ఉక్కు కర్మాగారానికి సంబంధించి రెగ్యులర్ పనులు ప్రారంభం అయ్యాయి. ప్రాజెక్టు మొదటి దశ నాలుగేళ్ళలో అనగా 1986, జనవరి నాటికి, రెండో దశ జనవరి నాటికి పూర్తికావచ్చు.

బ్లాస్టు ఫర్నేసు, కోర్ ఓపన్ ఉప ఉత్పత్తులు ప్లాంట్, మండే పదార్థాలను నిర్వహించే ప్లాంట్, ఉక్కును కరిగించే షాపులు వంటి పెద్ద పెద్ద నిర్మాణపు పనులు (సివిల్) చురుగ్గా సాగుతున్నాయి. మొత్తం సివిలు పనులలో 71 శాతం పనులు ప్రారంభించాలని ఆదేశించడమయినది. పరికరాలను బిగించే పనులు, రిఫ్రాక్టరీ ఎరక్షను పనులు ప్రారంభమయ్యాయి. ఆధునిక ఉక్కు కర్మాగార పట్టణ నిర్మాణం జోరుగా సాగుతున్నది.

కేంద్ర ప్రభుత్వం ఈ వర్తమాన సంవత్సరానికి రూ.187 కోట్లు కేటాయించిన సంగతి తెలుసుకొని ముఖ్యమంత్రి గారు ప్రధానమంత్రికి స్వయంగా లేఖ వ్రాశారు. ఈ కర్మాగారానికి

పరిమితంగా నిధులు కేటాయించడం వల్ల ప్రజలు ఎంతగానో ఆందోళన చెందిన విషయం ప్రధాన మంత్రి దృష్టికి తీసుకురావడం జరిగింది. అనుకొన్న సమయంలోగా ఈ కర్మాగారం పూర్తి కావడం, పనిచేయడం జరగదేమోనన్న ప్రజల భయ సందేహాలను తీర్చడానికి వీలుగా తగిన నిధులు విడుదల చేయవలసినదిగా ఈ కర్మాగారానికి ఎంత కావాలో కేంద్ర ప్రభుత్వానికి బాగా తెలుసునని ఇందుకు సమాధానంగా ప్రధానమంత్రి 1983 ఏప్రిల్‌లో ముఖ్యమంత్రికి ఒక లేఖ వ్రాశారు. ఈ కర్మాగారానికి తగినన్ని నిధులు అందేలా చూడడానికి కేంద్రం తన శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తుందని పై లేఖలో హామీ ఇవ్వడం జరిగింది.

ఈ ప్రాజెక్టు కేంద్ర ప్రభుత్వం నియంత్రణ క్రింద ఉంది. దీని ప్రగతిని ఉక్కు గనుల మంత్రిత్వ శాఖ జాగ్రత్తగా కనిపెడుతూ వుంది కనుక ఈ ప్రాజెక్టు సకాలంలో పూర్తి పని చేయడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వం తగినన్ని నిధులు అందేలా చూడగలదని ఆశిస్తున్నాం. పై లక్ష్య సాధనకు రాష్ట్ర ప్రభుత్వం సాధ్యమైన చర్యలన్నిటినీ తీసుకుంటున్నది.

ఇది సాధ్యమయినంత తొందరలో పూర్తి చేయాలని ఈ విధంగా జాప్యం జరగకుండా చూడడానికి ప్రభుత్వం నిశ్చయించింది. ఎప్పటికప్పుడు ఆలోచిస్తూ ఏ విధమైన చర్యలు తీసుకోవాలో అవి తీసుకుంటామని తమ ద్వారా మనవి చేస్తున్నాను.

◆◆

సెప్టెంబర్ 1, 1983

# పరిశ్రమలను గ్రామాల వద్దకు తీసుకొని వెళ్లడం ఈ ప్రభుత్వ పారిశ్రామిక విధానం

*(రాష్ట్ర పారిశ్రామిక విధానాన్ని వివరిస్తూ చేసిన బడ్జెట్ స్పీచ్)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** ఈనాడు ప్రభుత్వ విధానం పరిశ్రమలను ఎప్పటికప్పుడు ప్రమోట్ చేయడమే అని మనవి చేస్తున్నాను. ఏదైనా పరిశ్రమకు పెట్టుబడితో, సదుపాయాలతో, ఇన్‌సెంటివ్స్‌తో ప్రోత్సాహం ఇచ్చి అక్కడ సక్రమంగా నిర్వహించబడుతున్నదనేటటువంటి నమ్మకం కలిగిన దానిలో ఉన్న పెట్టుబడిని తీసి మరొక పరిశ్రమను ప్రోత్సహించడం, ఆ విధంగా పారిశ్రామికీకరణ విధానాన్ని ప్రభుత్వం పాటిస్తున్నదని మనవి చేస్తున్నాను. శ్రీ కిషన్ రావు గారు ఎక్స్‌పర్ట్ కమిటీని ఒకటి వేస్తే పారిశ్రామికీకరణం సూచించినారు. ఈ విషయంలో వారితో ఏకీభవిస్తున్నాను. దీని కొరకు పెట్రో కెమికల్ డెవలప్‌మెంట్లు కమిటీని ఒకటి వేసినాము, మైన్స్ అండ్ మినరల్ విషయంలో కూడా ఒక కమిటీని వేసినాము. రెండు సంవత్సరాల క్రితం ఈ మైన్స్ అండ్ మినరల్స్ కమిటీని వేయాలని నిర్ణయం జరిగింది.

కానీ ఇంతవరకు అది అమలు పరచబడలేదు. వెంటనే దీనిని అమలు పరచాలని విభాగానికి కూడా ఒక ఎక్స్‌పర్ట్ కమిటీని వేయడం జరుగుతుంది. వీటన్నిటినీ మించి పారిశ్రామికాభివృద్ధి విధానం ఆర్థికాభివృద్ధితో ముడిపడి ఉన్నది. కనుక అన్ని రంగాల ప్రముఖులతో కూడిన ఒక స్టేట్ ప్లానింగ్ బోర్డును డెవలప్‌మెంట్ బోర్డు అనే పేరుతో దానిని స్థాపించాలనే నిర్ణయం ప్రభుత్వం తీసుకున్నదని మనవి చేస్తున్నాను. ఈ డెవలప్‌మెంట్ బోర్డు ప్రత్యేకంగా ఏయే జిల్లాల్లో ఖనిజాలు ఉన్నాయి, ఏ విధంగా పరిశ్రమలు అభివృద్ధి చేసుకోవాలనే విషయంలో కృషి చేసి ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి తగిన సూచనలు ఇచ్చి, వీటిని ఏ విధంగా ప్రయారిటీ ప్రకారం అమలు జరపాలి, ఏ విధంగా రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలి అన్నటువంటి కృషికి, ప్రభుత్వానికి ఈ కమిటీ దోహద పడుతుందని సభ వారికి మనవి చేస్తున్నాను.

ప్రసూనగారు, మిగిలిన గౌరవనీయులైన సభ్యులు పరిశ్రమ వికేంద్రీకరణ గురించి ప్రశ్నించారు. గవర్నమెంట్ ఒక ముఖ్యమైన చర్య తీసుకోవాలని సూచన చేస్తూ ఉన్నాను. ఇప్పుడు ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్‌లో రానున్నది. ఇదివరకు జరిగినవి ఏవో జరుగుతూనే ఉన్నవి. ఇప్పుడు ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్ వస్తే అంటే అక్కడే ఏయే విభాగాలు ఏ విధంగా మాన్యుఫ్యాక్చర్ చేయబడుతున్నవో, దానికి ఆ రకమైన ఉద్యోగావకాశాలు ఉండేవి, ఆ రకమైన టెక్నికల్ క్వాలిఫికేషన్ ఉన్న ఉద్యోగాలు అవసరం అనేది ముందుగానే మనం అంచనా వేసుకుని ఆ మెదక్ జిల్లాలో, పరిసర జిల్లాల్లో అటువంటి యోగ్యతగల అభ్యర్థులు దొరుకుతారా లేకపోతే మరి శిక్షణ వెంటనే ప్రారంభించి అది వచ్చేసరికి తగిన ఇంటర్వ్యూలు జరిపి సరిగ్గా ఆ జిల్లాలో అయినా ప్రక్కన ఉన్న జిల్లా నుంచి మన అభ్యర్థులు టెక్నికల్లీ క్వాలిఫైడ్ అభ్యర్థులుగా మారిపోయి అక్కడ అవకాశాలు చేజిక్కించుకునే విధంగా చర్యలు తీసుకోవాలి.

**ఎప్పుడూ మట్టినే నమ్ముకుని, ఆ మట్టిలోనే కృషి చేస్తూ ఎప్పటికప్పుడు సామాజిక శ్రేయస్సుకి సామాన్య మానవ జీవిత విధానానికి పాటుపడేటటువంటి రైతన్నలు కష్టించి కృషించి చేసినటువంటి కర్మ భూమి మన రాష్ట్రం. ఈనాడు కాలానుగుణంగా మానవ దృక్పథంతో పాటు రాష్ట్ర దృక్పథం వాతావరణం కూడా మారిందని మీకు సవినయంగా మనవి చేస్తున్నాను.**

అధ్యక్షా, పారిశ్రామిక విభాగానికి సంబంధించిన 1983-84వ సంవత్సరపు బడ్జెట్ పద్దులను గౌరవనీయ సభలో ప్రవేశపెట్టిన సందర్భంలో గౌరవనీయులైనటువంటి సభ్యులు ఎంతో అమూల్యమైనటువంటి, విచక్షణాత్మకమైనటువంటి, ఆలోచన పరమైనటువంటి, మన రాష్ట్రాభివృద్ధికి తోడ్పడేటటువంటి ఎన్నో విలువైన సూచనలు చేసినందుకు వారందరికీ కూడా హృదయపూర్వకమైనటువంటి కృతజ్ఞతలు మీ ద్వారా సమర్పిస్తున్నాను. ముఖ్యంగా మన రాష్ట్రం అనాది నుంచి కూడా వ్యవసాయానికి సంబంధించినటువంటి రాష్ట్రం. ఎప్పుడూ మట్టినే నమ్ముకుని ఆ మట్టిలోనే కృషి చేస్తూ, ఎప్పటికప్పుడు సామాజిక శ్రేయస్సుకి, సామాన్య మానవ జీవిత విధానానికి పాటుపడేటటువంటి రైతన్నలు కష్టించి, కృషించి చేసినటువంటి కర్మ భూమి మన రాష్ట్రం. ఈనాడు కాలానుగుణంగా మానవ దృక్పథంతో పాటు రాష్ట్ర దృక్పథం, వాతావరణం కూడా మారిందని మీకు సవినయంగా మనవి చేస్తున్నాను. దీనికి కారణం నాగరికతే కాదు, ఇతర దేశాలతో వచ్చినటువంటి అనుభవం, సంబంధం కూడా దీనికి ఎంతో తోడ్పడింది. మన వారెందరో అభ్యుదయకరమైనటువంటి ఇతర పాశ్చాత్య దేశాలకో, మరొకచోటికో విజ్ఞానాత్మకమైనటువంటి కృషి కోసమో లేకపోతే వారి యొక్క జీవనోపాధి కోసమో వెళ్లి అక్కడ ఉన్నటువంటి ఆధునిక సంబంధమైనటువంటి పారిశ్రామిక విధానాన్ని గమనించడం, తద్వారా ఈనాడు జనసంఖ్యతోబాటు మానవ సమాజంలో పెరుగుతున్నటువంటి నిరుద్యోగ సమస్య ఇత్యాదులను పరిష్కరించుకోవడం కోసం ఒక్క వ్యవసాయం చాలదు, మన దృష్టి కూడా మారాలి. మనకు ఈనాడు ఉన్నటువంటి మన రాష్ట్రానికి

లభ్యము అవుతున్నటువంటి భూగర్భ నిధి నిక్షేపాలను మనము పరిపూర్ణంగా ఉపయోగించుకుని పారిశ్రామికమైనటువంటి అభివృద్ధిని సాధించాలి, జీవనోపాధి కలిగించాలి అనేటటువంటి ధ్యేయంతో, ఈ నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి. అందరి దృక్పథంతో అందరి దృష్టి మారుతున్నది అన్న సంగతి తెలియనిది కాదు. ఈ రాష్ట్రాభివృద్ధితోనే మనం ఇతర దేశాలతో సంబంధ బాంధవ్యాలు కానివ్వండి, ఆర్థిక వసతులు కానివ్వండి, ఆర్థిక దృక్పథం కానివ్వండి అన్నీ ముడి పెట్టుకుని ఉన్నవి. ఫలితంగా పారిశ్రామిక వృద్ధి ఒక్క మన దేశంలోనే కాకుండా అన్ని దేశాల యొక్క సహకారంతో, సహాయంతో జరుపుతున్న సంగతి గౌరవనీయులైన సభ్యులందరికీ తెలుసు. ఇది ఒక ఆగనటువంటి ఒక సమన్వయ కృషి. ఒక నాటితో ప్రారంభం అయింది కాదు. ఈనాటితో ఆగేది కాదు. ఏ ప్రభుత్వం ఉన్నా, ఎవరు ఉన్నప్పటికీ ఒక నిర్విరామమైనటువంటి పారిశ్రామికాభివృద్ధి మన రాష్ట్రంలో జరిగి తీరవలసిందే. ఇది ప్రత్యేకంగా ఒకరి ప్రోద్బలంతోనో, ఒక ప్రభుత్వము యొక్క ప్రోత్సాహముతోనో మాత్రమేకాదు. కొంతవరకు ప్రభుత్వ వ్యవస్థ దీని అభివృద్ధికి తోడ్పడవలసిన బాధ్యత ఈనాడు ప్రజాసామ్య యుగంలో ఉంది. అయినప్పటికీ ఎంతో మంది నిపుణులు, ఎంతో మంది విజ్ఞానాత్మక దృష్టి కలిగినటువంటి పారిశ్రామిక వేత్తలు మానవత్వంలో సహజంగా ఉండేటటువంటి ఆ కాంపిటీషన్ విధానంలో మనం ముందుకు వెళ్ళాలి. మన రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లాలి. మన విజ్ఞానాన్ని సరిఅయిన పథంలో మనం ఉపయోగించుకోవాలి అనేటటువంటి ఒక మంచి దృష్టితో ఎప్పటికప్పుడు ముందడుగు జరుగుతూనే ఉంది. ఆ కృషి ఫలితంగానే ఈనాడు మనం రూపొందించుకున్నటువంటిది ఈ ఆధునిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమని మీ అందరికీ సవినయంగా మనవి చేస్తున్నాను.

దీనికి మనలో మనకి భేదాలు లేవు. ఈ రాష్ట్రం ఏ ఒక్కరి సొత్తు కాదు. ఏ ఒక్కరిది కాదు. మన అందరిది. ఈనాడు పార్టీ విబేధాలు లేవు. ఈర్ష్యాద్వేషాలు లేవు. అన్నిటికీ అతీతమైనటువంటి దృష్టితో సమన్వయం అయినటువంటి, సహకారవంతమైనటువంటి, అభ్యుదయకరమైనటువంటి పథంలో మన రాష్ట్రం మనం అభివృద్ధి చేసుకోవాలి. పారిశ్రామికంగా ఇంక ఏ రాష్ట్రానికి కూడా తీసిపోనటువంటి విధానంలో మనం కృషి చేయాలి అనేటటువంటి సద్భావంతో పవిత్రంగా అందరమూ ఈనాడు ఈ పారిశ్రామిక విధానం మీద చర్చలు చేశాము. దీని ఫలితం ఎంతైనా ఉన్నది. ఇది ఈనాటితో ఆగేది కాదు. ఒక వేళ ఇప్పటికీ ఏదైనా కృషిలో లోపం ఉన్నా, ఏది చేసుకోపోయినా ఈనాడు మీరు ఇచ్చిన విలువైన సూచనలు భవిష్యత్ పురోభివృద్ధికి భవిష్యత్ పారిశ్రామికాభివృద్ధికి పరిపూర్ణంగా తోడ్పడతాయి అనేటటువంటి పరిపూర్ణమైనటువంటి విశ్వాసం నాలో ఉన్నది. ఈనాడు మీరందరూ ఇచ్చిన సూచనలకు మరొకసారి 'కృతజ్ఞతలు' మీకు తెలియజేస్తూ ప్రభుత్వం ఈనాడు తీసుకున్నటువంటి విధానాలను, తీసుకోదలచినటువంటి సిద్ధాంతాలను మీ అందరికీ తెలియజేయడం నా ధర్మం. ప్రభుత్వ పారిశ్రామిక విధానం

పరిశ్రమలను గ్రామాల వద్దకు తీసుకొని వెళ్లడం. కొన్ని పరిశ్రమలు వాటి వసతులు చూసినా కొన్ని పట్టణాల దగ్గరనే పెట్టవలసిన అవసరం ఉంది. ముఖ్యంగా ఈ భారీ పరిశ్రమలు, మధ్యతరహా చిన్నతరహా పరిశ్రమలు కొన్నింటిని మనము జిల్లాల్లో స్థాపించవలసిన అవసరం ఉంది. అదేవిధంగా చిన్న తరహా పరిశ్రమలు మరికొన్నిటిని గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. దీనివల్ల గ్రామంలో అక్కడున్నటువంటి ప్రజా సందోహానికి నిరుద్యోగ సమస్యను పరిష్కరించే విధానంలో వారికేదైనా భృతిని కల్పించడానికి అవకాశం ఉంటుంది. అంతేకాకుండా ఒకేచోట పరిశ్రమలన్నీ కేంద్రీకరించడం వల్ల ఎన్నో సమస్యలు ఉత్పన్నం అవుతాయి. అటువంటి వాటిని నివారించి ఒక సద్భావంతో మొత్తం రాష్ట్రాన్ని దృష్టిలో పెట్టుకొని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలంటే ఈ వికేంద్రీకరణ విధానాన్ని ప్రభుత్వం పాటించదలచిందని మనవి చేస్తున్నాను. ఒక్కొక్క ప్రాంతానికి ఒక్కొక్క పటిష్టమైన పారిశ్రామికాభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుంది. దానిలో పెద్ద తరహా, మధ్యతరహా, చిన్న తరహా పరిశ్రమలు కలిసి ఉంటాయి. పెద్ద పరిశ్రమకు చిన్నది అనుబంధంగా ఉంటుంది. ఏదైనా దీనికి కావలసిన వస్తువులు ఈ చిన్న పరిశ్రమల ద్వారా సరఫరా చేయడం, వీటిని అక్కడ అసెంబుల్ చేసుకొని ఆ విధంగా పెద్ద పరిశ్రమలు ఈ విధానంలో ఒక భారీ పరిశ్రమగా రూపొందించడానికి వాతావరణాన్ని కల్పించబడుతుందని మనవి చేస్తున్నాను. ఒక్కొక్క జిల్లాకు 3 పారిశ్రామిక కేంద్రాలు రూపొందించబడతాయి. దీనిలో చిన్న తరహా పరిశ్రమలు ముఖ్యంగా ఉంటాయి. ఒక్కొక్క గ్రామానికి కనీసం ఒక్కొక్క వ్యక్తికి చిన్న పరిశ్రమను అందించాలని ప్రభుత్వం ఆకాంక్ష. దీనిలో రూ.25,000లు పెట్టుబడితో ఒక విద్యాధికుడయిన నిరుద్యోగికి భృతి కల్పించాలని ప్రభుత్వ నిర్ణయం. ఇదే గ్రామోద్యోగ కార్యక్రమం.

రాష్ట్రంలో పరిశ్రమలకు ప్రభుత్వ సంస్థలకు అవసరమయినటువంటి వస్తువులు మన రాష్ట్రంలోనే తయారు చేస్తారు. ఈ రోజు మన పాల సప్లైయికి పాలిథిన్ బ్యాగ్స్ కావాలి. అదేవిధంగా ప్రభుత్వానికి కవర్లు ఇత్యాదులన్నీ కావాలి. వీటికి సంబంధించిన చిన్న తరహా పరిశ్రమల ద్వారా ప్రజా సందోహానికి భృతిని కల్పించి వీటిని మన రాష్ట్రంలోనే ఉత్పత్తి చేసుకొనే విధానాన్ని ప్రభుత్వం పరిపూర్ణంగా సమర్థిస్తున్నదని మనవిచేస్తున్నాను. మనకు అవసరమైన వస్తువులు, బట్టలు, మందులు, పరికరాలు మన రాష్ట్ర పరిశ్రమల నుంచి కొనాలనేది ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఇక కొబ్బరి పీచు పరిశ్రమ అభివృద్ధి కార్యక్రమం ఉంది. ఈనాడు రాజమండ్రిలో రీజినల్ కాయర్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ ఒకటి ఏర్పాటు చేయడం జరుగుతుందని మనవి చేస్తున్నాను. కోనసీమ ప్రాంతంలో కొబ్బరి ఎక్కువగా ఉత్పత్తి అవుతున్నది. ఈనాడు కొబ్బరి చెట్టు కల్ప తరువు అంటారు. ఎందుచేతనంటే దీనిలో ఉన్న ఏ ఒక్క భాగం వృథాగా పోయేది కాదు. కనుక వీటిని పారిశ్రామికంగా ఉపయోగించుకొని కుటీర పరిశ్రమల విధానంతో అక్కడ వారందరికీ పని కల్పించాలనే ఉద్దేశంతో పరిశ్రమలలో ప్రజలందరినీ

ఉత్తీర్ణులను చేయాలనే ఉద్దేశ్యంతో ఈ ట్రైనింగ్ సెంటర్ పారంభించబడుతున్నదని మనవి చేస్తున్నాను. ఇకపోతే చేనేత పరిశ్రమ అభివృద్ధి కోసం గ్రామీణ ప్రాథమిక సహకార సంస్థలను పటిష్టం చేయాలి. సమర్థవంతంగా నడపబడనటువంటి సంస్థలన్నిటినీ ఒక కూడలి క్రిందకు తీసుకొని వచ్చి సమర్థవంతంగా నడిచే విధానంతో చేనేత పరిశ్రమను ప్రోత్సహించాలనేది ప్రభుత్వ నిర్ణయం అని గౌరవ సభ్యులకు తమ ద్వారా మనవి చేస్తున్నాను.

నూలు మిల్లులను పటిష్టవంతంగా చేసి అక్కడ ఉన్నటువంటి దురదృష్టకరమైన, అసంతృప్తికరమైన విధానాన్ని రూపుమాపి ప్రత్తి కొనుగోలు నుంచి నూలు సరఫరా వరకు ఒక పటిష్టవంతమైన, ఆరోగ్యకరమైన విధానాన్ని అనుసరించి, ఏ నంబరు నూలు 20 నంబరా, 40 నంబరా ఆ ప్రాంతంలో ఉండే చేనేత పరిశ్రమల వారికి కావాలో ఆ విధంగా ఆ నూలు వారికి సక్రమమైన ధరకు అందించడం, ఆ విధంగా చేనేత పరిశ్రమను ప్రోత్సహించడం ప్రభుత్వ ధ్యేయం అని గౌరవనీయులైన సభ్యులకు మనవి చేస్తున్నాను. పట్టుపరిశ్రమ జలాధారము లేని పరిశ్రమిది. మెరక ప్రాంతాలకు ఇది పెద్ద కానుక లాంటిది. దీనికి ఎక్కువ నీరు అవసరముండదు. మల్బరీ చెట్లు పెంచి, తద్వారా పట్టు పురుగులను పెంచి ఈ పరిశ్రమను అభివృద్ధి చేసి, తద్వారా వెనుకబడిన తరగతుల వారికి, హరిజన గిరిజన అభ్యుదయానికి ఎంతైనా సహాయపడుతుంది ఈ పరిశ్రమ. పట్టు విత్తనాలను ఏ వ్యాధిసోకని ఒకే జాతికి చెందిన సంకరజాతి విత్తనాలను ఎక్కువ ఉత్పత్తి చేయడం, వాటిని రైతులకు అందించడం మన రాష్ట్రంలోనే కకూన్ పట్టును మార్కెటింగ్ చేసి, సరియైన ధరను రైతులకు అందించే విధానములో ప్రత్యేకంగా మార్కెట్లను స్థాపించడం పట్ల ప్రభుత్వం శ్రద్ధతో 8 కొత్త కకూన్ మార్కెట్లను స్థాపించిందని మనవి చేస్తున్నాను. పట్టు పరిశ్రమ వల్ల సుమారు 8 లక్షల మందికి ఈ విరామ కాలములో వారికొక కార్యక్రమం లభిస్తున్నది. ఎంతోమంది మహిళలు కూడా ఈ కార్యక్రమములో పాల్గొనడానికి అవకాశముంది. నేను స్వయంగా వెళ్లి చూసి వచ్చాను. ఎక్కువ అభివృద్ధి చేసుకోవలసిన పరిశ్రమయని నా అభిప్రాయం. మహిళలకు ఉపాధి ఏర్పడుతుంది. ప్రసూన గారు ప్రభుత్వం ఈ కార్యక్రమాలలో అత్యంత శ్రద్ధవహిస్తున్నది అన్నారు. ఆడపడుచులు వారున్న తావులో వుంటూ, ఇంకో చోటకు వెళ్లకుండా, గృహ కార్యకలాపాలు నిర్వహిస్తూ, అగరబత్తీలు చేయడంలో గానీ, నగిషీ కుట్టుపనులు చేయడంలో గానీ వాళ్లకు ఉపాధి సౌకర్యాన్ని సెట్విన్ సంస్థ ద్వారా కల్పించడానికి ఈ ప్రభుత్వము ఒక పథకాన్ని రూపొందిస్తున్నది. మిగతా జిల్లాలలో కూడా ఇటువంటి ఉపాధి కార్యక్రమాలను స్థాపించాలని ప్రభుత్వము పరిపూర్ణంగా ప్రయత్నం చేస్తున్నదని వారికి మీ ద్వారా మనవి చేస్తున్నాను.

విద్యాధికులకు పాలిటెక్నిక్‌లు ఏర్పాటుచేసి, గడియారాల నిర్మాణము, దానిలో జెమ్స్ సెట్టింగ్, ఆ వజ్రాలను రాపిడిజేసి, వాటిని సరియైన విధానంలో రూపొందించడం, తద్వారా

సోదరీమణులందరికీ ఉపాధి కల్పించే అవకాశముంటుంది. ఆల్విన్ సంస్థలో ఇటువంటి వారికి ఎక్కువ భాగము పని లభించడం ఈనాడు మనము చూస్తున్నాము. ఎలక్ట్రానిక్ పారిశ్రామికాభివృద్ధి కార్యక్రములలో మరింత ఎక్కువగా సోదరీమణులకు ఉపాధి అవకాశాలు ఉన్నాయి. వారి అభివృద్ధి కోసం పరిపూర్ణంగా ఒక ప్రగాఢ విశ్వాసముతో ఎలక్ట్రానిక్ శాస్త్ర పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించుకొన్నది.

ఇండస్ట్రియల్ ట్రైనింగ్ మరియు ఇండస్ట్రియల్ హౌసింగ్ విషయంలో పరిశ్రమల దగ్గరే దానికి సంబంధించిన అనుబంధ సంస్థలు, ఐటిఐ కోర్సులు అక్కడే నిర్వహించబడాలని గౌరవ సభ్యులు సూచించారు. ఇది ఎప్పుడో ప్రభుత్వము నిర్ణయము తీసుకొని, సంతృప్తికరంగా దీన్ని అమలు పరిచే విధానాన్ని ఆలోచిస్తున్నది. ఏ పరిశ్రమలైతే ఆ ప్రాంతములో వస్తాయో ఆ పరిశ్రమకు పరిజ్ఞానానికి సంబంధించిన ఆ కోర్సులే ఆ ఐటిఐ ఇన్స్టిట్యూట్‌లో నిర్వహించబడాలి. ఆ పరిశ్రమ అభివృద్ధి చెంది పరిపూర్ణమైన ఒక రూపాన్ని సంతరించుకొన్నపుడు ఆ పనులలో చేరటానికి, ఆ పరిశ్రమలో నిపుణత కలిగిన వారిని అందించడంలో కూడా ఈ ప్రభుత్వము తన విద్యుక్త ధర్మంగా భావిస్తున్నది.

పారిశ్రామిక లైసెన్సింగ్ విధానము గురించి, దానిలోని అవకతవకల గురించి గౌరవ సభ్యులు మాట్లాడారు. దీనిలో ఉన్న అసౌకర్యాన్ని ప్రభుత్వం గమనించింది. అందువల్లనే ఆంధ్రప్రదేశ్ అసెసింగ్ సెంటర్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్ అని ప్రభుత్వమే ఒక సంస్థను రూపొందించినది. దీనికి ఒకే ఒక మార్గము ద్వారా అన్ని సౌకర్యాలు పారిశ్రామిక వేత్తలకు కల్పించడం దీని ఉద్దేశ్యము. ఎవరు వచ్చినా సరే, వారి అవసరాలను అన్నిటిని గమనించి వాళ్లను ఇంకొక చోటకు వెళ్లనీయకుండా, లైసెన్సింగ్ దగ్గర నుండి అన్ని సమస్యలను పరిష్కరించటానికి ఈ వ్యవస్థ కృషి చేస్తున్నది. ఇది మన సెక్రటేరియట్‌లోనే స్థాపించబడింది. ఇదే పథకాలను జిల్లాలలో కూడా అమలు పరచాలని అక్కడ కూడా ఇదే వ్యవస్థను రూపొందించి, అక్కడ ఉత్సాహముతో వచ్చే పారిశ్రామిక వేత్తలను ఇబ్బంది పెట్టకుండా, వారికి కావలసిన అన్ని సౌకర్యాలు సమకూర్చాలనేది ప్రభుత్వ ధ్యేయమని మీ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

గోకా రామస్వామి గారు ఢిల్లీ నగరములో ఒక ప్రముఖుణ్ణి ఉంచితే బాగుగా పని జరుగుతుందని అన్నారు. ఈ విషయాన్ని ఒకప్పుడు నేను కూడా అనుకొన్నాను. ఒక వ్యక్తిని ఉంచితే పారిశ్రామికంగా గానీ, ఫ్లడ్స్ వచ్చిన సమయంలోగానీ, ఏ విషయం మీద నైనా గానీ అక్కడి ఆఫీసర్లతో సంప్రదింపులు జరపవలసిన అవసరముంది. ఇటువంటి విషయాలలో ఉత్తరప్రత్యుత్తరాలు జరిపినపుడు, మన ఉత్తరం అక్కడ సద్భావాన్ని పొందగలిగిందా అనే విషయంలో మన పరంగా కూడా ఒక గౌరవప్రదమైన హోదాలో వున్న వ్యక్తిని వుంచాలని అన్నారు. వారితో నేను ఏకీభవిస్తున్నాను. ఈ విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించే ఏర్పాటు చేస్తానని

మనవి చేస్తున్నాను. మంత్రివర్యులు పటిష్టంగా పని చేస్తున్నారా, ఏ విధంగా డిపార్టుమెంట్‌లన్నీ పని చేస్తున్నవి అన్న విషయంపై చూస్తే, దీనిని ఒక సంవత్సరము అయిన తరువాత గమనిద్దాం. ఏదైనా సరే ఏదైనా లోపం జరిగితే ప్రలోభానికి మనము పోకూడదు. రెండు మూడు జరిగితే పనిచేసే సోదరులు లభించారు పటిష్టంగా, ఉత్సాహంగా వీరు ఈ విషయంలో ఎక్కువగా కృషి చేసి, నిమగ్నతతో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేసి తోడ్పడాలని కోరుతున్నాను. ఈ సూచనకు కూడా మీతో నేను ఏకీభవిస్తున్నాను.

మంత్రులు, జిల్లాల విషయంలో సూచన చేశారు. ఇది ఎపుడో నిర్ణయం తీసుకొన్నాను. 15 మంత్రులము మేమున్నాము. 23 జిల్లాలున్నాయి. జిల్లాలకు ఒక్కొక్క మంత్రి చొప్పున పర్యవేక్షణ జరిపి, అక్కడ ఏ విధంగా కృషి జరుగుతున్నది, ఈ విధంగా ప్రభుత్వము తలపెట్టిన కార్యకలాపాలు పేద ప్రజానీకానికి సంబంధించిన కిలో రెండు రూపాయల బియ్యం గానీ, మరే కార్యక్రమమైనా గానీ పేద ప్రజానీకానికి అందుతున్న రీతిని గురించి వారు ప్రభుత్వానికి తెలియజేస్తారు. గృహ నిర్మాణ పథకాలు, మంచినీటి పథకాలు కూడా పేద ప్రజలకు ఉపయోగపడుతున్నవా, వాటివల్ల వాళ్లు ప్రయోజనం పొందుతున్నారా, వారి ఇబ్బందులు ఏమిటి? ఈ వివరాలతో పాటు, ప్రభుత్వ అధికారులు వారి బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తున్నారా వగైరా విషయాలను సేకరించడానికి పర్యవేక్షణ అధికారిగా ఒక మంత్రివర్యుని నియమించడానికి కూడా ప్రభుత్వము నిర్ణయం తీసుకొన్నదని మనవి చేస్తున్నాను.

**ఎక్కడ ఏ నిధినిక్షేపాలు ఉన్నాయి. వాటిని రాష్ట్ర అభివృద్ధికి ఏవిధంగా ఉపయోగించాలి? ఏ విధమైనటువంటి అనుబంధ పరిశ్రమలను అక్కడ నియమించుకోవాలి, మనము ఇకముందు కూడా జాగ్రత్తగా ఎక్కడెక్కడ ఏయే పరిశ్రమలు పెట్టాలో వాటి విషయంలో జాగ్రత్తతో నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని, ఆ విషయంలో నేను గమనిస్తానని మనవి చేస్తున్నాను.**

రాష్ట్రవ్యాప్తంగా ఇండస్ట్రియల్ సర్వే ఇదివరకే ఎప్పుడో జరిగింది. ఇదివరకే సర్వే సిద్ధం చేశారు. ఎక్కడ ఏ నిధినిక్షేపాలు ఉన్నాయి. వాటిని రాష్ట్ర అభివృద్ధికి ఏవిధంగా ఉపయోగించాలి? ఏ విధమైనటువంటి అనుబంధ పరిశ్రమలను అక్కడ నియమించుకోవాలి, మనము ఇకముందు కూడా జాగ్రత్తగా ఎక్కడెక్కడ ఏయే పరిశ్రమలు పెట్టాలో వాటి విషయంలో జాగ్రత్తతో వ్యవహరించవలసిన నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని, ఆ విషయంలో నేను పరిపూర్ణంగా గమనిస్తానని మనవి చేస్తున్నాను.

ఇంకో విషయం, శ్రీనివాసులు రెడ్డి గారు నేను ఇంచుమించు రాగానే వారితో నాకు పరిచయం ఏర్పడింది. మనవారు ఎవరైనా పెద్ద వారున్నారా? ఎక్కడున్నారు అనేది నా దృష్టికి వచ్చింది. ఎందుకంటే నేను పబ్లిక్ రంగం నుంచి వచ్చినవాణ్ణి కాను. సినిమా రంగము నుండి వచ్చిన వాణ్ణి. ఈనాడు అవకాశము వచ్చింది కాబట్టి ఎవరైనా సరే విజ్ఞానవేత్తలు ఎక్కడున్నారు?

మన రాష్ట్రంలో అటువంటి వారిని నేను కలుసుకోడానికి, వారితో సంప్రదించి మన రాష్ట్ర అభివృద్ధికి వారి సహకారాన్ని నేను లభింపజేసుకోవలెననే ఉద్దేశముతో నేను చాలా మంది పెద్దలను కలుసుకోవడం జరిగింది.

ఆ సందర్భములో శ్రీనివాసులు రెడ్డి గారిని కలుసుకోవడం తటస్థించింది. మన రాష్ట్ర అభివృద్ధికి గాను ఈ ప్రభుత్వం సంస్థలకు సహాయపడడంతో వారి కృషికి అనుగుణంగానే ఈ గోదావరి ఫర్టిలైజర్ కర్మాగారం సంస్థాపనలో భాగస్వాములుగా వారు వ్యవహరించారు. ఇకపోతే ఈ లిడ్ కాప్ వ్యవహారాల విషయం గౌరవనీయులైన సభ్యులు మాట్లాడారు. లిడ్ కాప్ కార్పొరేషన్ వారు ఇదివరకు ఎక్కడెక్కడో షోరూమ్స్ ఏర్పాటు చేసి డబ్బు ఖర్చు చేసారు. ఇకముందు అటువంటి తప్పులు జరగకుండా ఈ లిడ్ కాప్ సంస్థను పటిష్టము చేయవలసి ఉంది. మన సోదరీమణులు కూడా సహకారం ఉంటే చేతి సంచులు తయారు చేసుకోవడానికి వాటిని విదేశాలకు కూడా పంపించడానికి అనువుగా ఈ సంస్థ ఉంది. అటువంటి లిడ్ కాప్ కార్పొరేషన్‌ను ఏ విధంగా పటిష్టము చేయాలనేది ఈ ప్రభుత్వం కృషి చేస్తున్నదని మనవి చేస్తున్నాను.

ఇకపోతే లక్ష్మీనారాయణ గారు ఈ ఇండస్ట్రియలిస్ట్‌లకు ఇచ్చే ఇన్‌సెంటివ్స్ విషయంలో చెప్పారు, ఇన్‌సెంటివ్స్ అన్నది ల్యాండ్, వాటర్, విద్యుచ్ఛక్తి. ఇదివరకు ఈ విద్యుచ్ఛక్తికి ఇతర రాష్ట్రాలలో కొంత ఉందేమో కానీ మన రాష్ట్రంలో మాత్రం సంతృప్తికరంగా విద్యుచ్ఛక్తి లభ్యం అవుతున్నది. మన రాష్ట్ర అవసరములకే కాకుండా మనకు పోగా కొంత అయినా ఇతర రాష్ట్రాలకు కూడా సహాయం చేసే విధంగా మనము ఉన్నామని చెప్పడానికి సంతోషిస్తున్నాను. ఇంకా విజయవాడ థర్మల్ స్కీమ్ నెం.2, శ్రీశైలం హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు ఇవన్నీ పూర్తి చేయబడుతున్నాయి. అవన్నీ పూర్తి చేయబడినప్పుడు మనకు విద్యుచ్ఛక్తి లోపం అనేది ఉండదు. ఈ విద్యుచ్ఛక్తికి కొరత లేకపోవడం అనేది పారిశ్రామిక వేత్తలను ఆకర్షించింది. నేను ఢిల్లీ వెళ్లినప్పుడు అక్కడ ఉన్న పారిశ్రామిక వేత్తలను పిలిచాను. మన రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ముందుకు రమ్మని అడిగినపుడు అక్కడ పారిశ్రామిక వేత్తలు విద్యుచ్ఛక్తి కొరత లేదు. కాబట్టి మేము రావడానికి ప్రయత్నం చేస్తామని అన్నారు. ఇది సంతోషించవలసిన విషయం. తరువాత మన రాష్ట్రంలో ఇండస్ట్రియల్ డిస్ట్రిక్ట్ అనే దాని కింద ఏదీ లేదని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఈనాడు ఆదిలాబాద్, కరీంనగర్ మనము ఎంతో అభివృద్ధి చేసుకోవాలి. అవి ఇండస్ట్రియల్‌గా అభివృద్ధికరమైన జిల్లాలు అనడం నా మనసు అంగీకరించడంలేదు, అటువంటి వాటిని ఇండస్ట్రియల్ డిస్ట్రిక్ట్‌గా ప్రకటించి కేంద్ర ప్రభుత్వం వారు ఇచ్చే రాయితీలు తీసివేసినా ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వపరంగా ఇప్పుడు ఉన్న 14 జిల్లాలలో 82 బ్లాకులు అంటే హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ పట్టణాలు తప్ప మిగిలిన అన్నింటికీ 10 శాతం సబ్సిడీ 10 లక్షల రూపాయలకు మించకుండా పారిశ్రామిక వేత్తలకు ముట్టచెప్పబడాలని ఉందని మనవి చేస్తున్నాను.

కొత్త పరిశ్రమలు వచ్చినపుడు అంటే రైస్ మిల్స్, సామాన్య పరిశ్రమలు కాకుండా యితర కొత్త పరిశ్రమలకు రాష్ట్రంలో తగు ప్రోత్సాహం ఇవ్వడం జరిగింది. తరువాత ఇంటర్‌నేషనల్ ఫ్రీ ట్రేడ్ జోన్ విషయంలో గౌరవనీయులైన సభ్యులు ప్రస్థావించారు. ఈ విషయంలో అందరికంటే ముందే కేంద్ర ప్రభుత్వానికి ఉత్తరం రాయడం జరిగింది. ఇంటర్‌నేషనల్ ఫ్రీ ట్రేడ్ సౌకర్యం రాష్ట్రాల వారికి లభించిందని తెలిసి నేను ఉత్తరం వ్రాసాను. మన రాష్ట్రంలో విశాఖపట్టణం జిల్లాను ఫ్రీ ట్రేడ్ జోన్‌గా చేయాలని కోరాము. ఇంతవరకు అది జరగలేదు. ఇతర రాష్ట్రాలు మూడు, నాలుగు రాష్ట్రాలకు ఈ సదుపాయం ఇచ్చినపుడు మాకు ఎందుకు ఇవ్వలేదు అని రాయడం జరిగింది. ఈ ట్రేడ్ జోన్ సాధించేవరకూ ఏమరుపాటుగా ఉండను, దీనికొరకు కృషి చేస్తాను, గౌరవనీయులైన సభ్యులకు మనవి చేస్తున్నాను. పోతే రామకృష్ణారావుగారు కార్మిక సంక్షేమం విషయంలో విలువైన సూచనలు యిచ్చారు. కార్మికుల సంక్షేమం ఈ ప్రభుత్వం విస్మరించదు. ప్రభుత్వ విధానం పెట్టుబడుదారులకు అండగా ఉంటుందని అనుకోవడం కలలో మాట. ఈనాడు ప్రభుత్వ కార్యక్రమాలు అన్నీ పరిశీలన చేస్తే ఈ పేద వర్గానికి చేస్తున్నది కనబడుతుంది. ఈ రెండు రూపాయలు కిలో బియ్యం సరఫరా, బీదలకు శాశ్వత గృహ నిర్మాణ పథకాలు మెదలైనవి పేదవారి కొరకు ఉద్దేశించినవే. తరువాత వెంకటరత్నం నాయుడు గారు బంగారపు గనులు విషయంలో మాట్లాడారు. గోవర్ధన గోల్డ్ మైన్స్ వారు ప్రయివేటు రంగంలో కృషి చేసి ఉన్నది పోగొట్టుకుని వెళ్ళారు. తరువాత భారత గోల్డ్ మైన్స్ వారు కృషి చేశారు. ఇది వ్యయప్రయాసలతో కూడిన పని. ఒక టన్ను మన్ను నుంచి 1 గ్రాము నుంచి 4 గ్రాముల పెద్ద బంగారం వచ్చేది ఉంటుంది. అంత కష్టపడి శుద్ధి చేసి తీసిన బంగారం కూడా పెద్ద ధరకు అమ్ముకుందామంటే కేంద్ర ప్రభుత్వం వారే దాని ధర నిర్ణయం చేస్తారు. ఇది మనకు వ్యయప్రయాసలతో కూడిన పని. కేంద్ర విభాగమే అక్కడ పని చేస్తున్నది కాబట్టి వారిని చేయనివ్వండి. ఆ బంగారం మైన్స్ పని చేపట్టడం ఈ ప్రభుత్వానికి మోయలేని బరువని గౌరవనీయులైన సభ్యులకు మనవి చేస్తున్నాను.

శ్రీ మల్లేష్ గారు కూడా కార్మిక సంక్షేమం విషయంలో మాట్లాడారు, దానికి సమాధానం ఇదివరకే చెప్పాను. తరువాత కోచ్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ రేణిగుంటలో ఉంది. ఖాజీపేటలో ఈ కోచ్ మాన్యుఫ్యాక్చరింగు మొదలుపెడతామన్నారు. దీని నిర్మాణం విషయంలో కేంద్ర మంత్రులు ఎన్నో వాగ్దానాలు చేశారు. ఇది తెలుగు జాతి కోసము ఆంధ్రప్రదేశ్ ప్రజల వాగ్దానాలు కోసము ఈ కార్యక్రమాన్ని వెంటనే చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని అర్థించడం జరిగింది. తరువాత కె.వి. నారాయణ రావు గారు పేపరు మిల్లుల విషయంలో మాట్లాడారు. ఆ పేపరు మిల్లు వారు ఎప్పుడో అగ్రిమెంట్లు ప్రభుత్వంతో కుదుర్చుకున్నారు. దానివల్ల చౌకగా ఈ అడవి ఉత్పత్తులు వృక్షాలు, వాసాలు చాలా తక్కువ ధరకు ఇవ్వడం జరిగింది. వరదల సమయంలో, అగ్నికి గృహాలు తగులపడినపుడు బీద వారికి వాసాలు చౌకగా అందించడం పోయి పేపరు మిల్లుల వారికి ఈ

అటవీ సంపదను ఇచ్చే విధానాలకు అంతి పెట్టుకొని ఉండవలసి వచ్చింది. అసలు ఈ పేపర్ మిల్లులకు వాసాలు అక్కర లేదు. ఎండుగడ్డి, చెరకు పిప్పి మొదలైన ముడిసరుకుతో ఈ కాగితమును తయారు చేసుకోవచ్చును. అటువంటి ముడిసరుకు ఉపయోగించుకునే పేపరు మిల్లులు ఉండడమే మంచిది. ఏమైనా మేము కలుగుజేసుకుందామంటే ఈ పేపర్ మిల్లుల వారు కోర్టులకు వెడతారు. అందువల్ల పద్ధతి ప్రకారం ఈ పేపరు మిల్లుల వారితో వ్యవహరించి సామరస్యంగా దీనిని చక్కదిద్దవలసి ఉందని మనవి చేస్తున్నాను.

శ్రీ ఎం. రామచంద్రారెడ్డిగారు సిక్ యూనిట్ పునరుద్ధరణ కోసము ఆతృత చూపెట్టారు. సిక్ యూనిట్స్ ద్వారా పెట్టుబడి బ్లాక్ అవడం మంచిది కాదు. ఈ సిక్ యూనిట్స్ పునరుద్ధణ కోసము 92.34 లక్షల రూపాయలు ఈ బడ్జెట్‌లో కేటాయించడం జరిగిందని గౌరవనీయులైన సభ్యులకు మనవి చేస్తున్నాను. ఈ డబ్బును కుంటుపడిన పరిశ్రమలకు ఆర్థికంగా సహాయం చేయడానికి ఉపయోగిస్తామని తెలియజేస్తున్నాను. తరువాత చలనచిత్ర అభివృద్ధి విషయంలో గౌరవనీయులైన సభ్యులు సూచనలు చేసారు. ఈనాడు ఈ పరిశ్రమ అభివృద్ధికి ఎన్నో సూచనలు ఉన్నాయి. ఫిలిమ్ ఫైనాన్సింగ్ కార్పొరేషన్ ద్వారా కాకుండా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోలేదు. కేవలం ఇక్కడ స్టూడియోల నిర్మాణానికి ఆర్థిక వనరులు ఏర్పాటు చేయడం, తరువాత మన రాష్ట్రంలో తయారు అయిన చిత్రాలకు కొంత డబ్బు పారితోషికంగా ఇవ్వడం అనేవి నిష్ప్రయోజనకరంగా, సత్ ఫలితాలను సాధించలేనివిగా ఉన్నాయి. ఏదైనా సహాయం చేసినపుడు మన రాష్ట్రంలోని పారిశ్రామిక అభివృద్ధికి ఉపయోగపడాలి. ఈనాడు ఇంతవరకూ నడుస్తున్న చలనచిత్ర స్టూడియోలు ఆర్థికంగా బాగాలేవు. వయబుల్‌గా లేవు. కొన్ని స్టూడియోలలో అసలు పని లేదు. దానివల్ల పరిశ్రమకు మేలు జరగదు. సినిమా మనిషిగా దానిని నేను విశ్వసిస్తున్నాను. ఏమైనా సరే ఈ పరిశ్రమను నమ్ముకున్న శ్రామికుల జీవనోపాధికి మనం రక్షణ కల్పించాలి. మన కుటుంబం మనం పోషించుకోగలమనే నమ్మకం ఆ సినిమా పనివారికి కలుగజేయాలి. వచ్చే నటీనటులు కానివ్వండి, శ్రామికులు కానివ్వండి, నిర్మాతలు కానివ్వండి, సాంకేతిక నిపుణులు కానివ్వండి.. ఈనాడు మద్రాసులో పరిశ్రమ అభివృద్ధిలో వుంది అంటే మద్రాసు నాది అని వెళ్లినవారు లేరు మన తెలుగు వారు. కాక పోతే ఆనాడు వారి అవసరాలు కొరకు వారి ఉపాధి కొరకు వృత్తి ధర్మం కొరకు వెళ్లారు గానీ మద్రాసు నాది అని వెళ్లలేదు. ఎప్పుడైతే మనము ఆ వసతులు, వనరులు కల్పించి పరిశ్రమకు పరిపూర్ణమైనటువంటి మద్ధతును ఇవ్వగలుగుతామో, అది

**సిక్ యూనిట్స్ ద్వారా పెట్టుబడి బ్లాక్ అవడం మంచిది కాదు. ఈ సిక్ యూనిట్స్ పునరుద్ధణ కోసము 92.34 లక్షల రూపాయలు ఈ బడ్జెట్‌లో కేటాయించడం జరిగిందని గౌరవనీయులైన సభ్యులకు మనవి చేస్తున్నాను. ఈ డబ్బును కుంటుపడిన పరిశ్రమలకు ఆర్థికంగా సహాయం చేయడానికి ఉపయోగిస్తామని తెలియజేస్తున్నాను.**

నిలదొక్కుకోవడానికి అవసరమైన వనరులను మనము ఇవ్వగలుగుతామో అప్పుడు గానీ ఈ పరిశ్రమ భాగ్యనగరమునకు తరలిరాదని నా పరిపూర్ణమైనటువంటి విశ్వాసం. ఈ విషయములో పరిపూర్ణమైనటువంటి శ్రద్ధతో ప్రభుత్వం కృషి చేస్తుందని గౌరవనీయ సభ్యులకు మీ ద్వారా తెలియజేస్తున్నాను.

ఇక శ్రీ వెంకటేశ్వరరావు గారు ఆదిలాబాద్ జిల్లాలో పట్టు పరిశ్రమ అభివృద్ధి చెందే విషయాన్ని ప్రస్తావించారు. ఆదిలాబాద్ జిల్లాలో పరిశ్రమను అభివృద్ధి చేయడానికి సరైన వాతావరణం వుంది, అవకాశాలు వున్నాయి. టస్సార్ సిల్కు ఉత్పత్తికి మంచి భవిష్యత్తు వుంటుంది. అవకాశాలను పటిష్టంగా పరిశీలించాలన్న ధ్యేయంతో ఆ జిల్లాకు ప్రత్యేకంగా 22 లక్షలు పట్టు పరిశ్రమ అభివృద్ధికి మంజూరు చేయడం జరిగిందని మనవి చేస్తున్నాను. ఉట్నూర్, ఖానాపూర్ మొదలైన గిరిజన ప్రాంతాలను నేను స్వయంగా సందర్శించడం కూడా జరిగింది. అభివృద్ధి కార్యక్రమాలను చూడడం జరిగింది. సారవంతమైన మల్బరీ తోటలను వేయడం కూడా జరిగింది. ఉట్నూరులో నేను స్వయంగా ఒక సిల్కు రీలింగు విభాగానికి కూడా శంకుస్థాపన చేయడం జరిగింది. ఇప్పుడు గౌరవ సభ్యులు చెప్పినట్లుగా సిల్క్ పరిశ్రమ అభివృద్ధి కావడానికి ఎన్నో అవకాశాలు వున్నవి. ముఖ్యంగా గిరిజన సోదరుల అభివృద్ధికి సహాయపడుతుంది కాబట్టి ఆ విషయములో పరిపూర్ణమైన శ్రద్ధతో ప్రభుత్వం వ్యవహరిస్తుందని సభ్యులకు మనవి చేస్తున్నాను. ఎంతో సద్భావముతో, ఉత్సాహముతో, ఉల్లాసముతో ఈ రాష్ట్రం మాది, ఏ విధంగా అయినాసరే పరిశ్రమ మనము అభివృద్ధి చేసుకోవాలనే ఉత్సాహముతో సోదరులందరూ నాకు సూచనలు ఇచ్చినందుకు మరొకసారి ప్రభుత్వపరంగా, నాపరంగా వారందరికీ కృతజ్ఞతా పూర్వక నమస్కారాలు మీ ద్వారా అందజేస్తూ ఎంతో సద్భావముతో పరిశీలనాత్మకంగా నడిచిన ఈ సభకు నా అభివందనలు సమర్పిస్తూ మీ వద్ద శెలవు తీసుకుంటున్నాను.

◆◆




సెప్టెంబర్ 6, 1983

# తుపాకీ చూపించి శాంతి నెలకొల్పబడుతుందని అనడంలో నాకు నమ్మకంలేదు

*(రాష్ట్ర పోలీస్ శాఖపై జరిగిన చర్చ సందర్భంగా)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షులకు గౌరవనీయమైన సభకు నా నమస్కారములు. సర్వశ్రీ వి. నాగేశ్వరరావు గారు, కిషన్ రావు గారు, నరేంద్రగారు, ఓంకార్ గారు, లక్ష్మణ్ గారు చంద్రశేఖరరెడ్డిగారు, సలాఉద్దీన్ ఒవైసీ గారు, మోహన్‌రెడ్డి గారు మున్నగు వారు వీరందరూ ఎంతో అమూల్యమైన సలహాలు ఇచ్చినారు. వారి యొక్క అభిప్రాయాలు కూడా వెలిబుచ్చినారు. ముఖ్యంగా ఈనాడు మన రాష్ట్రానికి అవసరమైనది శాంతి భద్రతలను కాపాడడము. ఈ విషయంలో ప్రభుత్వానికి ఎంతో బాధ్యత ఉంది. ఇటువంటి ముఖ్యమైన విషయాలలో వారంతా ఎంతో ఉత్సాహంతో ఈ సభలో పాల్గొని సలహాలు ఇచ్చినందుకు ప్రతి ఒకరికి నా హృదయపూర్వకమైన అభినందనలు సమర్పిస్తున్నాను.

ఈనాడు ముఖ్యంగా ఇప్పుడున్నటువంటి ఈ హింసాత్మకమైన విధానానికి కారణం ఏమిటి? సమాజం ఎందుకు అల్లకల్లోలం అవుతున్నది ఆలోచిస్తే ఈనాడు ఉన్న పారిశ్రామిక విధానంలో పరిశ్రమల వికేంద్రీకరణ లేకుండా ఒకే చోట పట్టణం చుట్టూ పరిశ్రమలు అన్నీ రావడం, జనాభా

పెరిగిపోవడం మూలాధారం. సమాజంలో ఈనాడు ఉన్నటువంటి అశాంతి ఈనాడు ఉన్న నేరాల వల్లనే పెరిగిపోతోంది. మానసికమైనటువంటి నైతిక ప్రవర్తనలో మార్పు రావాలి. ప్రత్యేకంగా పోలీసు డిపార్టుమెంట్ ఏదో ఉంటుంది, ఏదో తుపాకీ చూపించి శాంతి నెలకొల్పబడుతుందని అనడంలో నాకు నమ్మకంలేదు. ప్రతి వారూ బాధ్యతాయుతమైన విధానంతో తన బాధ్యత ఏమిటి? రాష్ట్ర పౌరునిగా విద్యుక్త ధర్మం ఏమిటి అని ఆలోచిస్తే కనీసం కొంతయినా ఈ నేరాల సంఖ్య తగ్గుతుందని అనడంలో నాకేమీ సందేహం లేదు. ఈనాడు పోలీసు శాఖలో అవినీతి ఉందని చాలామంది చెప్పినారు. లేదని నేను అనను. కానీ వారిని నేను వెనకవేసుకొని రావడం ఆదర్శం కాదు. ఈనాడు ప్రభుత్వం యేదో గట్టిగా చేస్తున్నదని కొంతమంది గౌరవ సభ్యులు చెప్పినారు. దాని విషయంలో కూడా అంగీకరించను. ఎందుచేతనంటే ఈనాడు ప్రజావ్యవస్థ యొక్క బాధ్యత సరియైన కట్టుదిట్టాలతో శాంతిభద్రతలను కాపాడినప్పుడే కానీ ఊరికే ఇదేదో మాటలతో బాగా చేస్తున్నట్లు కానీ, మీరు చేయడం లేదని అనడంలో ఉన్నటువంటి విషయాన్ని గుర్తించి వారు ఆపోహలు పడుతున్నారు అనడం నా యొక్క ధర్మం కాదు, ఈనాడు రాష్ట్రంలో ఏ ఒక్క నేరం జరిగినా అది ప్రభుత్వం యొక్క బాధ్యత.

**ఈనాడు ప్రజావ్యవస్థ యొక్క బాధ్యత సరియైన కట్టుదిట్టాలతో శాంతిభద్రతలను కాపాడినప్పుడే కానీ ఊరికే ఇదేదో మాటలతో బాగా చేస్తున్నట్లు కానీ, మీరు చేయడం లేదని అనడంలో ఉన్నటువంటి విషయాన్ని గుర్తించి వారు ఆపోహలు పడుతున్నారు అనడం నా యొక్క ధర్మం కాదు, ఈనాడు రాష్ట్రంలో ఏ ఒక్క నేరం జరిగినా అది ప్రభుత్వం యొక్క బాధ్యత.**

దీనిని ప్రక్కకు పెట్టడం, దూరంగా ఉంచడం చేయను, ఏ ఒక్క నేరం జరిగినప్పటికీ వేల సంఖ్యలో నేరాల సంగతి చెప్పినారు. ఈనాడు ఏ ఒక్క నేరం జరిగినా దీనికి ప్రభుత్వం తప్పకుండా బాధ్యత వహించాలి. లేకపోతే ప్రజలందరూ నమ్మరు. శాంతి భద్రతలను కాపాడతామని, ఎవరికీ హాని కలిగినా, ఆడబడుచులకు అన్యాయం జరిగినా, విద్యార్థులకు అశాంతి కలిగినా అది ప్రభుత్వం యొక్క విద్యుక్త ధర్మమని తన నెత్తిన వేసుకొని వాటి నివారణ మార్గాలు యేవిధంగా ఉండాలన్న విషయం ప్రభుత్వం యొక్క ధర్మంగా భావిస్తున్నాను.

గౌరవ సభ్యులు ఎవరేమి సూచించినప్పటికీ, దానిలో నేను ప్రత్యేకంగా తప్పు పట్టడంగానీ, పొంగిపోవడంగానీ చేయడం లేదు. మీరు మంచి సూచనలు ఇచ్చారు. ఈనాటి వ్యవస్థను సరిదిద్దడానికి బాధ్యతగల ముఖ్యమంత్రిగా ఆలోచన చేస్తానని మనవిచేస్తున్నాను. పోలీసు శాఖను పటిష్టవంతంగా చేయవలసిన అవసరముంది. పోలీసుల సంఖ్య తక్కువగా ఉంది. కొంతవరకు పెంచాలి. ఇంచుమించుగా వెయ్యికి 9 మంది మాత్రమే పోలీసులున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పోలీసు సంఖ్యను పెంచవలసిన అవసరము చాలా వుంది. ఏనాడో ప్రభుత్వము దీనిని ఉద్ధేశించినదని మనవి చేస్తున్నాను. వారి జీవన ప్రమాణాలను తృప్తికరంగా మెరుగుపరచి,

వారిలో మార్పు తీసుకొని రావలెనని ప్రభుత్వముద్దేశించింది. క్షణంలోనే వారిలో స్వచ్ఛమైన శీలాన్నిగానీ, పవిత్రతను గానీ తెస్తానని నేను చెప్పలేను.

ప్రభుత్వము వారికి అందించే విధానాలవల్ల, వారిలో మార్పు తేగలుగుతాము. అందుకు ప్రజలు కూడా భాగస్వాములై సహకరించాలి. మనము డబ్బు కోసము పని చేయటం లేదు అనే ఒక పవిత్ర భావాన్ని వారిలో కల్గించడం మన పరమ ధర్మం, ప్రథమ కర్తవ్యము కూడా. వారికి చాలా సమస్యలున్నాయి. నిత్యావసర వస్తువులు చౌకగా లభించేటట్లు చూడవలసిన అవసరముంది. వారి దుస్తుల విషయంలో గానీ, వాహనాల విషయంలోగానీ, ప్రభుత్వము పరిపూర్ణంగా కొత్త విధానాలవల్ల వారి సమస్యలను పరిష్కరించడానికి పని చేస్తుందని సవినయంగా మనవిచేస్తున్నాను. జైళ్ల నిర్వహణలో ఎన్నో విధాలైన అవకతవకలు ఉన్నాయి. రాయలసీమ నాలుగు జిల్లాలలో జైళ్ల డిపార్టుమెంట్ ఆధీనం చేశారు. మిగతా చోట జ్యుడీషియల్ కస్టడీలో వున్నాయి జైళ్లు. న్యాయాధికారులు రోజూ అక్కడ జరుగుచున్న విధానాలను సమీక్షించడానికి వారికి అవకాశము వుండకపోవచ్చు. జైళ్ళ డిపార్టుమెంట్ ఆధీనంలో ఉంటే పరిస్థితులు మెరుగుపడతాయి. క్రమమైన పద్ధతిలో ప్రభుత్వము విశ్వసించి, ఈ సంవత్సరం కనీసం 8 సబ్ జైళ్లను అయినా జైలు డిపార్టుమెంట్‌నకు అప్పగించడానికి నిశ్చయించింది.

**న్యాయాధికారులు రోజూ అక్కడ జరుగుచున్న విధానాలను సమీక్షించడానికి వారికి అవకాశము వుండకపోవచ్చు. జైళ్ళ డిపార్టుమెంట్ ఆధీనంలో ఉంటే పరిస్థితులు మెరుగుపడతాయి. క్రమమైన పద్ధతిలో ప్రభుత్వము విశ్వసించి, ఈ సంవత్సరం కనీసం 8 సబ్ జైళ్లను అయినా జైలు డిపార్టుమెంట్‌నకు అప్పగించడానికి నిశ్చయించింది.**

బాల నేరస్తులున్నారు. వాళ్ళది ఎంతో మెత్తనైన మానసిక వ్యవస్థలో ఉన్న వర్గం అది. వారిని తీసుకొనే విధానంలో గానీ, జైళ్లలో ఉంచే విధానంలో గానీ, మానసికమైన మార్పు వాళ్లలో తీసుకొని రావలెను. అందుకు మంచి ప్రయత్నం చేయాలి. మహిళా నేరస్తులున్నారు. వారిని బయటపెడితే వారి పరిస్థితి ఏమి కావాలి? వాళ్ళు బయటకు వచ్చేసరికి, వాళ్ల కాళ్ళ మీద వాళ్ళు నిలదొక్కుకునే స్థోమతను వాళ్ళకు కలిగించాలి లేదా వాళ్ళు అక్రమమైన మార్గాన్ని అన్వేషించక తప్పదు అందువల్ల వాళ్లు బయటకు వెళ్ళినప్పుడు, వారి జీవనాన్ని వాళ్లు స్వయంగా నడుపుకొనేటందుకు వీలు కల్పించే అవకాశాలు కల్పించాలని ప్రభుత్వము యోచిస్తున్నది.

ముద్రణ విధానముంది. ఇది ఏ విధంగా లోపాలతో నడుస్తున్నదో అందరికీ తెలుసు దీనిని ఏ విధంగా పునరుద్ధరించాలి? అక్కడి తప్పులనుగానీ, అవకతవకలనుగానీ సరిదిద్దాలంటే నాలుగు ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. హైకోర్టు వారికి, డి.జి.పి. వారికి ప్రెస్ వికేంద్రీకరణ చేస్తే వారికి కావలసిన ముద్రణ వారే నిర్వహించుకోవచ్చు. మిగతా ముద్రణ విషయాలుగానీ, నిర్వహణ

భారంగానీ అది కూడా ఆలోచన చేస్తున్నాము. కావలసిన పేపరంతయూ ఈనాడు హైదరాబాద్ నుండే దొరుకుతున్నది. ఇకమీదట ఆ విధంగా కాకుండా, ఏ కేంద్రములో ఎవరెవరికి పేపరు కావాలో, వారికి అక్కడి గోడౌన్ నుండి పేపరు సప్లై చేస్తే సక్రమంగా నిర్వహించబడగలదని అనుకొంటున్నాము. విజయవాడలో ముద్రణాలయాన్ని ప్రారంభించాలని అనుకుంటున్నాము. ఈ సంవత్సరాంతంలో అక్కడ ముద్రణాలయాన్ని ప్రారంభిస్తామని అంటున్నాను. కర్నూలులోగానీ లేదా మిగతా ఏవైనా 1- 2 పట్టణాలలో ముద్రణ ప్రెస్సులు ఏర్పాటు చేస్తే అక్కడున్న నేరస్థులకు బోధన చేయడమే కాకుండా, మన పని కూడా సులువు అవుతుంది. అన్ని కేంద్రాల నుండి అప్పటికప్పుడు ప్రభుత్వపరమైన పనులను సులువు చేసుకోడానికి అవకాశముంటుందని గౌరవనీయ సభ్యులకు మనవిచేస్తున్నాను.

ఈనాడు 108 తాలూకాలలో అగ్నిమాపక దళాలున్నాయి. గౌరవ సభ్యులు చెప్పినట్లుగా, అగ్ని ప్రమాదం సంభవిస్తే, అది పూర్తిగా దగ్ధమైపోయిన తరువాతనే శకటాలు అక్కడికి వెళ్లగలుగుతున్నాయి. ముందుగా వెళ్ళే అవకాశాలు లేవు. అంటే అంత దూరంలో ఉన్నాయి. ప్రతి తాలూకాకు ఒకటి ఉండవలసిన అవసరముంది. ఈ సంవత్సరానికి 20కి తక్కువ కాకుండా ఆగ్నిమాపక దళాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వము యోచిస్తున్నది. హైదరాబాద్ నగరము పెద్దగా పెరిగింది. ఇక్కడ ఏడు అంతస్థుల భవనములో అగ్ని ప్రమాదం సంభవిస్తే, అక్కడకు వెళ్ళి ఆర్పడానికి మన అగ్నిమాపక దళానికి సరియైన సౌకర్యాలు లేవు. ఇప్పటికీ ఆఫీసులు అద్దె కొంపల్లో ఉంటున్నాయి. ఇంతవరకు ఒక స్వతంత్ర డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేసుకోలేదు. ఈ విషయం కూడా ప్రభుత్వము గుర్తించింది. రేస్ కోర్సుకు ఎదురుగా ప్రభుత్వ భూమి ఉంది. అక్కడ మెయిన్ ఫైర్ సర్వీసు ఆఫీస్‌ను ఆధునాతన ఇంజన్లతో ఏర్పాటు చేయాలని ప్రభుత్వము నిశ్చయించుకొన్నది. గౌరవసభ్యులు ఇచ్చిన సూచనలు అన్నీ గుర్తించాను. నేరాలు తగ్గించడానికి పోలీసు డిపార్టుమెంట్‌ను ఆధునీకరణంగా, పటిష్టవంతంగా చేయడానికి ప్రభుత్వము కృతనిశ్చయంతో వ్యవహరిస్తున్నది. ఈ సమస్య మనందరిది. డిపార్టుమెంట్‌లు కూడా క్రమశిక్షణతో ఆదర్శవంతంగా ఉండడానికి, వారికి అనువైన వాతావరణాన్ని కల్పించడానికి ప్రభుత్వము కృషి చేస్తున్నది. ఉన్న వనరులను బట్టి, సభా సమక్షంలో బడ్జెట్ లెక్కలను ప్రవేశపెట్టారు. మీ అమూల్య సలహాలకు నా కృతజ్ఞతలు తెలుపుకుంటూ, సెలవు తీసుకొంటున్నాను.

◆◆

సెప్టెంబర్ 14, 1983

# 'ఉద్యోగుల పట్ల మాకు సోదర భావం ఉంది'

*(వివిధ శాఖలకు గ్రాంట్స్ కొరకు చేసిన అభ్యర్థన సందర్భంగా)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, గౌరవనీయులైన సభ్యులు రాజశేఖరరెడ్డిగారు, ఓంకార్‌గారు, మదన్‌మోహన్‌గారు, ఒవైసీగారు, వెంకయ్యనాయుడుగారు, పూజ్యులు అంజయ్యగారు ఇంకా మిగిలినటువంటి సోదర సభ్యులు అందరూ కూడా ఎంతో గౌరవమైనటువంటి, ఆలోచనకి మేత వేసేటటువంటి సూచనలు ఇచ్చారు. చాలా సంతోషం. ప్రతి ఒకరిని కూడా నేను అభినందిస్తున్నాను. ప్రభుత్వాన్ని విమర్శలు చేసినందువలన నాకేమీ బాధ లేదు. ఎందుకంటే విమర్శలు చేస్తేనే ఏదైనా ఒక అభ్యుదయం బయటికి వస్తుందనే నమ్మకం నాలో ఉంది. వారు ఏమి అన్నప్పటికీ కూడా నేను సహృదయంతో గౌరవిస్తున్నాను. ఇక ముందు ఏమైనా భవిష్యత్తులో ప్రభుత్వ పథంలో ఆ గమనంలో ఏమైనా మళ్ళీ అటువంటి పొరబాట్లు జరగకుండా ఏ విధంగా చూడాలో అనే ధ్యాసతో నేను తదేకంగా వారు చెప్పినవి అన్నీ కూడా వింటున్నాను. కొన్ని యదార్థాలు కాకపోయినా కొన్ని యదార్థాలు అయినా ఏమైనప్పటికీ కూడా నేను దాని మీద ఏమీ విమర్శనలు చేయదలచుకోలేదు. ఎందుకంటే నా బాధ్యతల్లా వారిని గౌరవించడం, వారు చెప్పినటువంటి సూచనలు వినడం ఆచరించవలసినవి ఏవో నేను ఎన్నుకోవడం, తప్పకుండా వాటిని ఆచరించటం.

ఈనాడు నా పార్టీనిగానీ, నా ప్రభుత్వాన్నిగానీ, నన్ను గానీ రక్షించుకునే విధంగా ప్రజలు ఏ విధమైనటువంటి విశ్వాసం ఈ పార్టీలో ఉంచారు, నాలో ఉంచారు, మా ప్రభుత్వంలో ఉంచారు, అనేటటువంటిది మాత్రం దృష్టిలో పెట్టుకుని, ఈనాడు నేను కాదు, మా సభ్యులు కూడా ఎవరైనా వారి వారి దోషాలుగానీ, వారి వారి తప్పులుగానీ ఏదైనా ఉంటే వారిని కూడా వారిచ్చిన సూచనలతో సరిదిద్దుకోమని కోరుతున్నాను. మనమందరమూ కూడా అతి పరిశుభ్రముగా, నిర్మలముగా, నిశ్చయ భావంతో, ప్రజాసేవ భావంతో పని చేయడానికి

వచ్చినటువంటి ప్రభుత్వముగా దీనిని భావించాము. ఆ ధ్యేయంతో గౌరవనీయులైన సభ్యులు ప్రతిపక్ష నాయకులు, ఎంతో అవేశంతో మాట్లాడారు. యదార్థాన్ని కొంత మాకు విప్పి చెప్పారు. కొన్ని యదార్థాలు కాకపోయినప్పటికీ కూడా వారి ధ్యాస అది. వారి వారి ధర్మం అది కానీ మా ధర్మం మాత్రం దానిని సహృదయంతో స్వీకరించడంగా భావించి నేను వారు ఇచ్చినటువంటి సూచనలకు ప్రతి ఒక్కరికీ కూడా నా హృదయపూర్వక నమస్కారములు అందజేస్తున్నాను. ముఖ్యంగా ఉద్యోగుల సమ్మె విషయం ప్రస్తావించారు శ్రీ రాజశేఖరరెడ్డిగారు. యదార్థానికి ఆ ఉద్యోగుల సమ్మెకి ప్రభుత్వం ఏమీ ఈనాడు తలవంచుకోవలసిన అవసరం లేదు. అది గౌరవ ప్రదమైనటువంటి ఆరోగ్యవంతమైనటువంటి ప్రభుత్వ విధానంగా నేను ఇప్పటికీ కూడా భావిస్తున్నాను.

ఎందుకంటే దురదృష్టకరమైనటువంటి, ఏ మాత్రం అనుభవం లేని వారేదో వారికి కావలసినవి ఏవో వారు ఆడుగుతున్నారు అనేటటువంటి సహృదయంతో ప్రభుత్వ విధానాన్ని మేము కూడా పట్టించుకుంటూ సోదర భావమ-ంతోనే మొత్తం సమ్మె అంతా కూడా ఆ పర్యవేక్షణలో వారు ఏదో చేస్తున్నారు కాబట్టి వారిమీద మేము పగ తీర్చుకోవాలనిగానీ మాకు ఎప్పుడూ కూడా ఉద్దేశం కలగలేదు అధ్యక్షా. యదార్థానికి ఈ ప్రభుత్వ నిర్వహణలో వారికి ఉండవలసిన బాధ్యత వారికి ఉన్నది. ఈనాడు ఏదైనా కనుక ఈ రెండు వర్గాల మధ్యనే ఇద్దరు సోదరుల మధ్యన వచ్చినట్లుగా ఏదైనా విభేదాలుగానీ, భేదాభిప్రాయాలుగానీ వచ్చినప్పుడు నివారించుకోవడం మన ధర్మం. మానవులము కనుక ఏదైనా తప్పు చేయవచ్చు, తప్పు జరగవచ్చు. కాదని నేను అనను. కానీ తన తప్పు తాను తెలుసుకోవడం విజ్ఞుల లక్షణంగా భావిస్తూ నేను ఆ విధంగానే భావిస్తున్నానని  గౌరవనీయులైన సభ్యులందరికీ మనవిచేస్తున్నాను. అందుకే ఈనాడు సుప్రీంకోర్టు తీర్పు రాకపోయినప్పటికీ కూడా ఈ దురదృష్టకరమైన విధానంగానీ, ఈ అనారోగ్యకరమైన విధానంగానీ మన రాష్ట్రంలో సాగకూడదు అనే భావనతోనే వారిని సహృదయంతో వారితో కలిసిమెలసి సంప్రదించి రాజీలు చేసుకోవడం జరిగింది.

**యదార్థానికి ఈ ప్రభుత్వ నిర్వహణలో వారికి ఉండవలసిన బాధ్యత వారికి ఉన్నది. ఈనాడు ఏదైనా కనుక ఈ రెండు వర్గాల మధ్యనే ఇద్దరు సోదరుల మధ్యన వచ్చినట్లుగా ఏదైనా విభేధాలుగానీ, భేదాభిప్రాయాలుగానీ వచ్చినప్పుడు నివారించుకోవడం మన ధర్మం. మానవులము కనుక ఏదైనా తప్పు చేయవచ్చు, తప్పు జరగవచ్చు కాదని నేను అనను.**

ఈనాడు ప్రజల అంతర్భాగముగానే నేను వ్యవహరించాను గానీ స్వతంత్ర్యంగా వ్యవహరించలేదు. ఏదైతే ఒకటి రెండు విషయాలలో నాకు మ్రింగడానికి వీలు లేనటువంటి విధానాలు ఉన్నాయో వాటిని మాత్రం వ్యతిరేకించాము. వాటిని ఒప్పుకోలేదు. అన్నింటికంటే ముఖ్యమైన ఈ సూపరాన్యువేషన్ 58 నుంచి 55 సంవత్సరాలకు తిరిగి ఆ వయసు పరిమితిని

తీసుకురావడం, దీని విషయంలో ఏ మాత్రం కూడా కాంప్రమైజ్ కావడం లేదని మనవి చేస్తున్నాను. అది న్యాయస్థానానికే వదిలివేశాముతప్ప ఈనాడు ప్రభుత్వ పరముగా నిర్దేశించినటువంటి నిర్ణయించినటువంటి, విధానానికి మాత్రము ఇప్పటికీ కట్టుబడే ఉన్నాము అని చెప్పి గౌరవనీయులైన సభ్యులకు మనవి చేస్తున్నాను. సోదర ఉద్యోగులు కూడా ఈనాటికి అదే భావముతో ఎంతో ఉల్లాసముతో వచ్చి చాల సంతోషముతో మీరు ఆదరించారు అనే మాట అన్నారే గానీ మమ్మలను మీరు అవమానించారు అని ఎవరూ అనలేదు. ఒక విధంగా ఏదైనా దురుసుతనమైన ప్రవర్తన ఎవరివల్ల జరిగినప్పటికీ నేను దానికి బాధపడ్డాను. ఈ విధంగా అన్నారు అని అనలేదు. అంతేకాకుండా అది నా బాధ్యత. ఈనాడు ఇంత పెద్ద బాధ్యతను ప్రజలు అప్పగించినందుకు దానికి నాకు అర్హత ఉంది అని నిరూపించుకోవలసిన అవసరం నాకు చాలా ఉందని మీకు మనవి చేస్తున్నాను.

ఇకపోతే ముఖ్యంగా ఉద్యోగుల బదిలీల సంగతి చాలా మంది గౌరవనీయులైన సభ్యులు సూచన చేశారు. ఏదైనప్పటికీ యదార్థానికి ఎప్పుడో 30 ఏళ్లు, 20 ఏళ్లు నుంచి ఉన్నటువంటి వారు పాత విధానాలకు అలవాటు పడ్డవారు, ఈనాడు కొత్త విధానం అంటే గిట్టని వారు, ఈనాడు వారికి కావలసిన వసతులు వనరులు దొరకక బాధపడేవారు కొంత మంది ఏమైనా ఇబ్బంది పడవచ్చు గానీ, ఏదైనా అవగాహనతోనే అటువంటివి ఏమైనా జరిగినవి అని చెప్పి ఏమీ అవగాహన లేకుండా ఎవరో చెబితే ఈ ట్రాన్స్‌ఫర్‌లు చేయడం, మరొకటి చేయడంగానీ జరగలేదు అని నేను మనవిచేస్తున్నాను. దీంట్లో కొంత మా నిర్ణయంలోనే తప్పు రావచ్చు. నేను ఫలానా వ్యక్తి మంచి వాడు అని భావించవచ్చు. కానీ ఆ భావన రేపు పరిపూర్ణంగా జయప్రదం కానప్పుడు నేను బాధపడవలసి ఉంటుంది. కానీ ఈనాడు ఆ విధంగా చేశాను, నేను ఒక విధమైనటువంటి విచక్షణా దృష్టిలేకుండా ఎవరో చెప్పిన మాటలు విని చేశాను అంటే మాత్రం నేను బాధపడుతున్నాను అధ్యక్షా. ఆ విధంగా జరగలేదని వారికి మనవిచేస్తున్నాను. ఈనాడు ఈ ప్రభుత్వానికి కావలసినది సుశిక్షితులైనటువంటి అధికారులకు తగిన గౌరవం వారికి పరిపూర్ణంగా నేను ఇస్తున్నాను. ఈనాడు అధికారులుగా వారిని చూడడం లేదు, ప్రభుత్వం మీది అని చెబుతున్నాను. ఈనాడు ఏ విధంగా గౌరవనీయులైన సభ్యులందరికీ తెలియజేశానో అదే మీరు చెప్పాలి నేను వినాలి.

అదే విధంగా ప్రభుత్వ నిర్ణయం ఉన్నది. పరిశుద్ధమైన పరిపాలన ప్రజలకు అందిస్తాము అన్నాను. ప్రభుత్వ కార్యకలాపాలు ఈ విధంగా ఉన్నాయి మీరు సహకరించండి. మీ చేతిమీదుగా జరగాలి ఇవి అన్నీ కూడా. అధ్యక్షా, ఈనాడు పేదవారికి బడుగు వర్గాలవారికి ఏదైనా అభివృద్ధి జరగాలి అంటే ఆదేశించేది ప్రభుత్వమేగానీ జరపవలసినది మీరు, మీచేతుల మీదుగా కాబట్టి ఈ గౌరవాన్ని మీరు పొందాలి అనే భావముతోనే వారిని గౌరవిస్తున్నాము గానీ ఏదో దోషులుగానో,

దుర్మార్గులుగానో, ప్రజాద్రోహులుగానో వారిని చూడడం లేదని గౌరవనీయులైన సభ్యులకు నేను మనవిచేస్తున్నాను. ఇప్పుడు గౌరవనీయులైన సభ్యులు వెంకయ్యనాయుడుగారు చెప్పారు. కేంద్ర ప్రభుత్వానికి చెప్పాను మీ పట్టుదలే నాకు ఉన్నదని. కేంద్ర ప్రభుత్వం అంటే తలవంచవలసిన అవసరం నాకు లేదని మీకు మనవి చేస్తున్నాను. అదే విధంగా వారు సంతానంగారిని మళ్లీ తిరిగి ఉద్యోగంలో చేర్చుకోవాలి అంటే, కావాలంటే డబ్బు ఇస్తాముగానీ తిరిగి మాత్రం చేర్చుకోవడం ఉద్యోగం ఇవ్వడం ఏమీ జరగదు ఆ ఎంక్వయిరీ కమిషన్ పూర్తి అయ్యేవరకు అని చెప్పి నేను చెప్పాను. అదే విధంగా ప్రసాద్‌రావుగారి విషయం కూడా చెప్పాను. ఒక విధంగా వారు దోషి అని నిర్ణయించి వారి ఫైలు చూసి వారు ఉద్యోగానికి ఈనాడు ఉండే స్థితిలో అంత అర్హత లేదు అని వారి మీద మనం నింద మోపినప్పుడు ఆ విషయంలో పరిపూర్ణంగా న్యాయం జరిగిన తరువాత గానీ తిరిగి వారికి ఉద్యోగం ఇవ్వడం జరగదని కూడా నేను వారికి చెప్పడం జరిగింది. అదే విధంగా పి.వి.ఆర్.కె. ప్రసాద్ గారు, ఆయన బ్యాంకింగ్ కోర్సు చదవలేదు. డిప్లొమా ఇన్ డెవలప్‌మెంటల్ ఏక్టివిటీస్. ఈనాడు గౌరవనీయులైన సభ్యులే మనవి చేశారు.

ఎంత క్రమశిక్షణా రాహిత్యంగా కొంతమంది అధికారులు పత్రికా ముఖంగా వారి ఇష్టము వచ్చినట్లు ప్రకటనలు ఇస్తున్నారు. స్టేట్‌మెంట్‌లు ఇస్తున్నారు. ముఖ్యంగా ఆ ఇన్ఫర్మేషన్ డిపార్టుమెంట్ పటిష్టంగా ఉండాలి. ఏదైనా ఒక క్రమశిక్షణ దానిలో ప్రవేశ పెట్టాలి అనే భావనతోనే కమిషనర్ ఆఫ్ ఇన్ఫర్మేషన్‌గా దానిని ఏర్పాటు చేయడం జరిగింది. అర్హత ఉన్న వ్యక్తి అని, హుషారుగా పని చేస్తాడు, పది మందిని కూడ గట్టుకోగలడనే భావముతోనే వారిని ఏర్పాటు చేయడం జరిగింది గానీ ఏదో బ్యాంకింగు చదివి వచ్చారు కాబట్టి వారిని ఇన్ఫర్మేషన్‌లో వేద్దామని అంటే అజ్ఞానాత్మకంగా మాత్రం నియామకాలు జరపడంలేదని నేను సవినయంగా మనవి చేస్తున్నాను. ఇకపోతే భూసంస్కరణల విషయంలో మనవి చేశారు. భూసంస్కరణల విషయంలో తప్పకుండా పరిశీలించవలసిన బాధ్యత నాకు ఉన్నది. ఈనాడు మిగులు భూములు అన్నీ మిగుల్చుకొన్నది ఎవరు? సంపన్న వర్గాల వారికి అది తెలుసు. గతంలో హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పుల మధ్యన 5, 6 సంవత్సరాలు ఒక విధమైన గ్యాప్ వచ్చింది, ఆ గ్యాప్‌లో అక్రమమైనవంటి ఈ మార్పిడి విధానాలు అన్నీ కూడా ఆ మధ్య కాలంలోనే జరిగాయి ఆ వివరాలు నాకు తెలుసు. ఆ విషయంలో పునఃపరిశీలించి కేసులన్నీ తిరిగి విచారణ జరిపించాలనే ఉద్దేశము ఉన్నది. ఏ విధంగా కూడా ఆ సంక్షేమ కార్యక్రమాన్ని ఇంకొక విధంగా మరల్చడంగానీ దీనిని ఏ వర్గం వారి స్వప్రయోజనాలతో తాకట్టు పెట్టడంగానీ జరగదని మాత్రం గౌరవనీయులైన సభ్యులకు మీ ద్వారా మనవి చేస్తున్నాను.

ఇక మా ప్రభుత్వము ఏమీ చేయలేదు అంటే నేను చేశాము అని చెప్పవలసింది కాదు. చేసింది చేశాము. ఒకటే మీకు మనవి చేస్తున్నాను. ఆడబిడ్డలు నూటికి 80 శాతము ఈనాడు

మనతో పాటు ఉన్నారో వారికి సమానమైన హక్కులు కల్పించాలి అనేటటువంటిది ఎవరైనా ఆలోచించారా? మీరే ఆలోచించమని మనవి చేస్తున్నాను. ఒకటే చెబుతున్నాను. ఎక్కువ చెప్పదలచుకోలేదు. కిలో బియ్యం రూ.2లకు పేదవారికి అందిస్తాము. తప్పులు చేసి ఉండవచ్చును. మావల్ల అభివృద్ధికరమైన విధానాలు అనుకున్నంత చురుకుగా జరగకపోవచ్చును. మేము క్రొత్తవారము కావచ్చును. కానీ నా దగ్గర ఉన్నది ఒక్కటే. పరిశుద్ధ భావం, సత్యం, శీలం ఉంది. అనుభవం లేదంటే ఒప్పుకుంటాను. ఇది ఈ విధంగా చెయ్యండి అని చెప్పాలి. ఆ గౌరవం వారికి ఇస్తున్నాను. మన ప్రభుత్వం, ఇది మీది మాది కాదు అందరిదీ అనే భావంతో అందరూ కూడా సహకరించాలని పూజ్యులు పెద్దలకు విజ్ఞప్తి చేస్తున్నాను. అదేవిధంగా సోదరులు వాసుదేవరావుగారు అల్పసంఖ్యాక వర్గం వారి విషయం చెప్పినారు. నిజమే. ఏమీ చేయలేదన్న మాట వాస్తవమే. కేబినెట్, స్టేట్ మినిస్టర్స్ అని మాలో మాకు భేదం లేదు. అందరూ ఒకే సోదరభావంతోనే వ్యవహరిస్తున్నాము. అప్పుడేదో అనుకున్నాము. క్రొత్తవారము కదా అని. ఈనాడు వారందరికీ వారి అనుభవాలువున్నాయి.

**ఈనాడు ప్లానింగ్ బోర్డు ఒకటి నిర్మాణం జరపబోతున్నది. ఎవరైతే విజ్ఞులు ఉన్నారో వారి విషయంలో మతవర్గ భేదాలు లేకుండా ఇతర రాష్ట్రాలలో ఉన్న వారిని కూడా కలిపి మన రాష్ట్రం యొక్క అభ్యున్నతికి పరిపూర్ణమైనటువంటి అభివృద్ధికి ఇటువంటి ప్లానింగ్ బోర్డు ఒకటి ఏర్పాటు చేయాలని, అదేవిధంగా జిల్లావారీగా కూడా ప్లానింగ్ బోర్డు ఉండాలని, ఆ ప్లానింగ్ బోర్డులో ఈనాడు బాధ్యత కలిగిన వ్యక్తులు కూడా ఉండాలి.**

దీని విషయములో కేబినెట్‌కు, స్టేట్ మినిస్టర్స్‌కు పెద్ద తేడా లేదు. అల్పవర్గాల వారిని తగ్గించడానికి మా మంత్రివర్గంలో ఎవరు ఏఏ వర్గాల వారు ఉన్నారో ఒకసారి పరిశీలిస్తే ఏ విధంగా ఈ కాంపోజిషన్ కౌన్సిల్ ఆఫ్ మినిస్టర్స్‌దో కొంత అర్థం అవుతుంది. ఈనాడు కులం, మతం అన్నది వచ్చింది. దీని విషయం ఆలోచించాలి. దీనికి ప్రభుత్వపరంగా వచ్చేటటువంటి ఆర్డర్లలో ఆ పేర్లు కాకూడాదని; కులం, మతం అనేది కొట్టివేయాలని అన్నాము. ఇది చిన్నదైనప్పటికీ ఉదాహరణకు మాత్రం చెప్పినాను. ఏదో భగీరథ ప్రయత్నం చేసినామని కాదు. మేము సాధించినామని కాదు. సాధించవలసింది చాలా ఉంది. దీని విషయంలో కొన్ని మాత్రం క్లుప్తంగా మనవిచేస్తాను. ముఖ్యంగా నేను కోరుకున్నవి కొన్ని ఉన్నాయి. చేయాలనుకున్నవి కొన్ని ఉన్నాయి. ముఖ్యంగా ఈనాడు ప్లానింగ్ బోర్డు ఒకటి నిర్మాణం జరగబోతున్నది. ఎవరైతే విజ్ఞులు ఉన్నారో వారి విషయంలో మతవర్గ భేదాలు లేకుండా ఇతర రాష్ట్రాలలో ఉన్న వారిని కూడా కలిపి మన రాష్ట్రం యొక్క అభ్యున్నతికి పరిపూర్ణమైనటువంటి అభివృద్ధికి ఇటువంటి ప్లానింగ్ బోర్డు ఒకటి ఏర్పాటు చేయాలని, అదేవిధంగా జిల్లావారీగా కూడా ప్లానింగ్ బోర్డు ఉండాలని, ఆ ప్లానింగ్ బోర్డులో ఈనాడు బాధ్యత కలిగిన వ్యక్తులు కూడా ఉండాలి. అంతేకాకుండా దీనిలో వ్యవసాయంలో కానీ, మిగతా ఉత్పత్తులలోకానీ, పరిశ్రమలలో కానీ, ఆ జిల్లాల్లో ఏయే పరిశ్రమలు ఉన్నాయో, ఏయే పంటలు

ఉన్నాయో, ఏయే సాగులు జరపబడుతున్నాయో, వారి ప్రతినిధులు అందరూ కూడా దీనిలో ఉండాలి. పరిపూర్ణమైన అభివృద్ధి వారే చేసుకోవాలి. ఈ విధంగా ఒక వికేంద్రీకరణ ద్వారా ఇంచుమించుగా 10, 12 గ్రామాలు ఒక మండలిగా ఏర్పడి అందులో విద్య, వైద్య, బ్యాంకింగ్ ఈ సౌకర్యాలన్నీ కూడా అక్కడే ఏర్పడి, ఒక మినీ గవర్నమెంట్‌లాగ ఒక పోలీసు స్టేషన్ 10, 15 గ్రామాలకు ఒక కేంద్రంగా ఏర్పరుచుకుంటూ పటిష్టమైన శాంతి భద్రతల రక్షణ విధానం కానీ లేకపోతే బ్యాంకింగ్ సౌకర్యాలు కానీ సామాన్య రైతాంగానికి అందుబాటులో ఉంటాయనే ఒక అభ్యుదయకరమైన విధానం ఆలోచిస్తున్నాము. ఇంతవరకు ఒక నిర్ణయం తీసుకోలేదు. ఏమి చేయబోతున్నారని అడిగినారు. అనుకున్నవి అన్నీ చెప్పడానికి వ్యవధి లేక పోయినప్పటికీ ముఖ్యమైనవి 1, 2 మనవి చేస్తున్నాను. జిల్లా పరిపాలనా యంత్రాంగంలో మౌలికమైన మార్పు కోసం. ఈనాడు జిల్లాకు ఇంజినీర్లు ఏడుగురు ఉన్నారు. మొన్న నెల్లూరు జిల్లా పరిషత్ అనుకుంటాను, తప్పు అయితే క్షమించాలి. అక్కడకు వెళ్ళి వారిని ఎవరు ఉన్నారు అంటే ఏడుగురు ఇంజినీర్లు ఉన్నారు అన్నారు. అక్కడ మంచి నీటి విషయం ఏవిధంగా ఉందని అంటే ఆరుగురు ఆ విషయంలోనే జోక్యం చేసుకోలేదు. 7వ ఆయన ఎన్ని అని చేస్తాడు? కాబట్టి నా దృష్టిలో అది సక్రమంగా జరగలేదు.

కాబట్టి మంది ఎక్కువ అయినారు, మజ్జిగ పల్చన అయింది అన్నట్లుగా ఉద్యోగస్తులు చాలా మంది ఉన్నారు కానీ పనులు మాత్రం జరగలేదు. అటువంటి దురదృష్టకరమైన విధానానికి స్వస్తి చెప్పి వికేంద్రీకరణ ద్వారా రాష్ట్ర పరిపాలనను, ఈ విధముగానే జిల్లా పరిపాలనను ఆ విధముగానే గ్రామీణ వరిపాలనను కూడా పునరుద్ధరించి పటిష్టం చేయాలనే ఉద్దేశ్యంతో ఈ విధమైన కార్యక్రమం అనేకమైన మార్పులతో చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ మూడు విశ్వవిద్యాలయాల్లో అంటే ఉస్మానియా, ఆంధ్రా, వెంకటేశ్వర విశ్వవిద్యాలయాల్లో ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ కోర్సులు కొన్ని సబ్జెక్టు స్టడీచేసి, ఈనాడు మత్స్యపరిశ్రమ ఉంది. 1000 కిలోమీటర్లు సుదీర్ఘమైన తీరం ఉంది, అదే విధంగా పరిశ్రమలు, డెయిరీ డెవలప్‌మెంట్, ఈ విధంగా ఒక్కొక్క సబ్జెక్టు తీసుకొని మన రాష్ట్రంలో ఉన్నటువంటి పరిస్థితులను బట్టి మనము దీనిని ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలి, ఏ విధమైన కట్టుదిట్టమైన చర్యలు ప్రభుత్వం తీసుకోవాలి. ఏ విధంగా దీనిని పునర్నిర్మించుకోవాలనే విధానాలపై కృషి చేయడానికి ఆ యూనివర్సిటీవారికి ఆ సూచనలు ఇవ్వడం, వారేమో అప్పటికప్పుడు సుమారు 20 సబ్జెక్టు మీద కృషి చేసి ప్రభుత్వానికి వారి నివేదికను అందించడం జరిగింది.

అదేవిధంగా డెయిరీ డెవలప్‌మెంట్ ఉందంటే ఫెడరల్ పద్ధతిని ప్రవేశపెడితే ఈనాడు ఉత్పత్తిదారులంటారు. దీనిలో భాగస్వాములై ఏ విధంగా పటిష్టం చేయడానికి వీలుంటుందో ఆలోచిస్తున్నాము. అదేవిధంగా ఈనాడు పట్టణాలు ఉన్నాయి. ఈనాడు పల్లెటూళ్ళలో సరేకానీ,

గుడిసెలలో ఉండేవారు ఉన్నారు. వారికి ఎంత ధర పెడితే అందుతుందని ఆ విషయంలో సోదర మంత్రి జానారెడ్డిగారిని పరిశీలించవలసిందిగా చెప్పడం జరిగింది. ప్రతి క్షణం కూడా పేద ప్రజానీకానికి సేవచేయడం కొరకే పని చేస్తున్నామనేది నిర్వివాదాంశము. అది మా ఆత్మకు తెలుసు. కానీ ఎక్కువ విజయాలు సాధించలేకపోవచ్చును కాదనడం లేదు. వారు చెప్పింది తప్పు అనడం లేదు. వారు చెప్పింది గౌరవ భావంతో శిరసావహిస్తాను. నేను మంచి మనసుతో స్వీకరిస్తాను. కానీ కృషి చేయడం లేదంటే మాత్రం నా మనసు అంగీకరించడం లేదు. కృషి చేస్తున్నాను కాబట్టి. అదేవిధంగా పబ్లిక్ అండర్ టేకింగ్స్ విషయంలో ముఖ్యంగా ఒక బోర్డు ఏర్పాటు చేసినాము.

సభ్యులు వెంకయ్యనాయుడుగారు ఎన్నో సందర్భాలలో వారి విచారాన్ని వ్యక్తం చేసినారు. ఎప్పుడు 1976, ఎప్పుడు 1983? ఇప్పుడు వస్తున్నాయి. ఆ ఆర్థిక నివేదికలు ఏవైతే వస్తున్నాయో ఇవన్నీ ఎన్నో అవకతవకలు జరిగినాయో మీ అందరికీ తెలుసు. నాకంటే మీకు ఎక్కువ అనుభవం ఉంది. ఈ విధానాన్ని రూపుమాపాలంటే సాధ్యమైనంతవరకు కట్టుదిట్టంగా ప్రయత్నం చేస్తున్నాము. దీనికి ఒక మేనేజ్‌మెంట్ బోర్డును నిర్మాణం చేయడం జరిగింది. దీనిలో ఏదైనా అవకతవకలు జరిగితే చూడడానికి ఒక ఆడిటర్, అక్కౌంటెంట్, పరిశ్రమల విభాగానికి చెందిన 6 మందితో ఆ బోర్డు వేయడం జరిగింది. అక్కడ అక్కౌంట్స్ ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం ఆడిట్ జరిగి ఈ నష్టం ఎందుకు వచ్చిందని అడగడానికి, లెక్కలు తేల్చుకోవడానికి వీలవుతుంది. ఈనాడు 5, 6 సంవత్సరములకు వచ్చేటప్పటికీ ఏమి జరిగిందో మనకు తెలియని విధంగా దీనిని ఏదో పెడుతున్నారు. ఈ శాసనసభలో తప్ప దీని విక్రయాలు అవును, కాదు, నిజం, అబద్ధం అని తెలుసుకోవడానికి అవకాశం తెలియలేదు.

కాబట్టి అనుకున్న పనులు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి, అట్లాగే గోదావరి బేసిన్‌లో ఈనాడు చమురు వాయువు, ఇవన్నీ సమృద్ధిగా ఉన్నాయి. పైగా అక్కడ వ్యవసాయం, పరిశ్రమలు ఉన్నాయి. వీటన్నింటినీ పరిశీలించి అక్కడ ఏ విధమైన పరిశ్రమలు పెడితే రేపు ఎప్పుడైనా మంచి మన నేచురల్ పనులు వచ్చినప్పుడు ఏ పరిశ్రమలు అనుబంధంగా పెట్టుకోవాలనే విధానాన్ని పరిశీలించవలసిందిగా అక్కడ గోదావరి బేసిన్ బోర్డును ఒకటి ఏర్పాటు చేయడం జరిగింది. అదేవిధంగా ఈనాడు పరిశ్రమల విషయంలో కూడా వచ్చేవారినందరినీ మా రాష్ట్రంలో నీరు ఉంది, పవర్ ఉంది, నేల ఉంది మీ ఇష్టం వచ్చినట్లు దానిని ఉపయోగించుకొని పారిశ్రామికంగా అభివృద్ధి చేసుకోమని వారందరినీ కోరడం జరిగింది.

ముఖ్యంగా ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిశ్రమలను ప్రమోట్ చేసుకుంటూ వ్యాపారాత్మకంగా కాకుండా పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడడమే ఈ ప్రభుత్వ ధ్యేయం అని ఈ సభలో అనేకసార్లు చెప్పినాను కాబట్టి ఆ విధానంలో కూడా ప్రభుత్వం ఏమాత్రం నిర్లక్ష్యం చేయడం లేదు. అదేవిధంగా

ఈ సోడా ఫ్యాక్టరీలు, కార్బైట్ ఫ్యాక్టరీలు ఇవన్నీ పెద్దపరిశ్రమలుగా ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నాము. మేము ఇది సాధించామని కానీ, సాధించబోతున్నామని కానీ నేను చెప్పుకోలేదు. ఆ మాట నా నోట చెప్పవలసినది కాదు. అది రేపు వారు చెప్పాలి. కాబట్టి ఇది ప్రజల యొక్క నిర్ణయానికి వదిలివేస్తున్నాను. కానీ ఇదంతా మా కృషి అని మాత్రం చెబుతాను. అదేవిధంగా ఈనాడు శాంతిభద్రతల కోసం ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నామో గౌరవసభ్యులకు తెలుసు. దురదృష్టవశాత్తు ఈనాడు హైదరాబాద్ నగరంలోనే 2,3 సందర్భములలో ఈ మత విద్వేషాలు వచ్చినప్పుడు ఏవిధంగా సమర్థవంతంగా నిర్వహించినామో అనే మాటలు నా మాట నేను చెప్పుకోకూడదు. కాబట్టి ప్రభుత్వం అన్ని రంగాలలో ప్రయత్నిస్తున్నది.

ప్రభుత్వం పేదవారికి కూడా నీడ కల్గించాలని, వారి ప్రయోజనం కోసం ఒక నిర్దిష్టమైన విధానాలతో పరిపూర్ణమైన మనస్సుతో కృషి చేస్తున్నాము. ఎప్పటికప్పుడు విలువైన సూచనలు ఇవ్వండి. ఈనాడు పేరోల్ మీద ఒక కాగితం వేయండి. ఈ కాగితం మీద ఈ విధమైన చర్య తీసుకోవాలని వ్రాసి సంతకం పెట్టి పంపిస్తున్నాము. ప్రభుత్వం పరంగా జరగడం లేదంటే కొంత నిర్లిప్తత కూడా ఉంది నేను ప్రభుత్వాన్ని వెనక వేసుకొని రావడంలేదు. ఈనాడు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటానని. ఈ డిమాండ్ మీద వారు చెప్పిన మంచి విలువైన సూచనలు ఏవిధంగా అమలువరచడానికి ప్రభుత్వ పరంగా వీలవుతుందో ఆ విధంగా అన్నివిధాల చర్యలు తీసుకుంటానని మనవిచేస్తున్నాను. ఎంతో గౌరవంతో అభిమానంతో వెంకయ్యనాయుడుగారు మా ప్రభుత్వం మీద విశ్వాసం ఉందని అన్నారు. మరియు ప్రతిపక్షసభ్యులు మదన్‌మోహన్‌గారు కానీ, రాజశేఖరరెడ్డిగారు కానీ వారు ప్రతిపక్షం వారు అయినప్పటికీ వారిచేతనే మేము మేలు మేలు అనిపించుకోవాలని ప్రయత్నం జరుగుతుందని మనవిచేస్తూ ఈనాడు వారు ఇచ్చిన సూచనలకు, మరొకసారి కృతజ్ఞతలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

◆◆

ఫిబ్రవరి 20, 1984

## ఈ చర్య ఆరంభం మాత్రమే, అంతం కాదు

*(మంత్రి ఎం. రామచంద్రరావు తొలగింపుపై ప్రకటన)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, ముఖ్యమంత్రి పదవీ బాధ్యతలను స్వీకరించిన సమయములో ప్రజలకు స్వచ్ఛమైన, సమర్థవంతమైన పరిపాలనను అందించడానికి కృషి చేయగలను అని నేను వాగ్దానము చేసిన సంగతి గౌరవసభ్యులకు ముఖ్యముగా నా మంత్రిమండలి తమ విధి నిర్వహణలో నీతి నిజాయితీలో ఉన్నత ప్రమాణాలను నెలకొల్పాలనే అంశానికి నేను ఎంతో ప్రాధాన్యత ఇస్తూ వచ్చాను. నా మంత్రివర్గ సహచరుడు, కార్మిక, ఉపాధి శాఖను నిర్వహిస్తున్న శ్రీ ఎం. రామచంద్రరావుపైన కొంత కాలముగా ఆరోపణలు వస్తున్నాయి. శ్రీ రామచంద్రరావు నిజాయితీ సంశయాస్పదముగా ఉన్నట్లు అనుమానము కల్గినందున నా మంత్రివర్గములో కొనసాగించడము నేను ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలకు అనుగుణముగా లేదని భావించినందున వారిని మంత్రిమండలి నుంచి తొలగించవలసినదిగా నిన్న గవర్నరుగారికి సిఫార్సు చేశాను. ఆ సిఫార్సు మేరకే నిన్న శ్రీ రామచంద్రరావు గారిని గవర్నరుగారు మంత్రి మండలి నుంచి తొలగించారు. ప్రభుత్వ వ్యవస్థలో, ప్రజా జీవితములో ఉత్తమ నైతిక విలువలను పరిరక్షించి, ఉన్నత ప్రమాణాలను నెలకొల్పటానికి నాచర్య ఉద్దేశించబడినదన్న విషయాన్ని గౌరవ సభ్యులు గమనించగలరని నేను ఆశిస్తున్నాను. రాష్ట్ర ప్రజలకు స్వచ్ఛమైన, సమర్థవంతమైన పరిపాలనను అందించాలనే నా లక్ష్యసాధనకు శక్తివంచన లేకుండా మరింత ఉన్నత భావముతో కృషి సాధించగలనని గౌరవ సభ్యులకు నేను హామీ ఇస్తున్నాను.

ఈ రోజు ముఖ్యమైన దానిమీద సభ్యులందరూ తమ అమూల్యమైన అభిప్రాయాలు, సలహాలు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. ఒక్కటే నా ఆదర్శము, ధ్యేయము, అదేమిటంటే సమాజంలో ఈనాడు ఉన్న అసమానతను పారద్రోలి, అవినీతిని కడిగి వేయాలి. ఆక్రమాన్ని, లంచగొండితనాన్ని దూరం చేయాలనే నా భావంతో ఇక్కడ అందరూ ఏకీభవిస్తారు,

దానికి సందేహంలేదని భావిస్తున్నాను. ఈ సందర్భంలో ప్రాంతీయ విభేదాలు, కులమత తత్వాలు, స్వపర భేదాలు అనేవి నా మనస్సులో లేవని త్రికరణశుద్ధిగా తెలియజేస్తున్నాను. ఒక అధికారి కమ్మకావడమో మరొక అధికారి విజ్ఞుడు అయినవాడు కమ్మకావడము అనేది యాక్సిడెంట్ పూర్వకంగా జరిగింది. అధికారి బుద్ధిపూర్వకంగా చేసి తద్వారా అపఖ్యాతిపాలుకావడానికి కాదు నేను వచ్చింది. ఈనాడు సమాజంలో ఉన్న అవినీతిని, అక్రమాన్ని భరించలేక ఏదైనా సేవచేస్తూ తెలుగుజాతికి నా జీవితాన్ని అంకితం చేయడానికి వచ్చానని మనవిచేస్తున్నాను.

ఈనాడు నేను తీసుకున్న చర్య ఆరంభం మాత్రమే కానీ అంతం కాదని మనవిచేస్తున్నాను. తుదివరకూ దీని విషయంలో శ్రమించడం, కృషిచేయడం మానవసమాజం ఖ్యాతిని, గౌరవాన్ని ఇనుమడింపచేయడం జరుగుతుందని మనవిచేస్తున్నాను. ముఖ్యమంత్రి అధికారాలు ఏమిటో ఇక్కడ అందరికీ తెలుసు. ఎవరినైనా మంత్రిమండలిలో చేర్చుకోవచ్చును. తీసివేయవచ్చును. కానీ ఆ అధికారాన్ని నేను నాకు మనస్ఫూర్తిగా తృప్తిలేనిదే చేయాలని లేదు. ఏమైనా ఆరోపణలు మా మంత్రిమండలిమీద వచ్చినపుడు మా ప్రభుత్వం నైతిక విలువలను కాపాడాలనేది నా ధర్మంగా భావిస్తున్నాను. అంత మాత్రంతోనే ఏదైనా చర్య తీసుకోవడం సమంజసం కాదని నేను భావించాను. కనుక దీని విషయంలో ఒక వెరిఫికేషన్ కావాలని, నాకు నేను ఒక నిర్ణయానికి రావడానికి ముందు యదార్థాన్ని గుర్తించాలని అనుకున్నాను, ఇది ట్రాప్ కాదు, నేను డబ్బు ఇవ్వలేదు. ఆ నోట్లమీద నా సంతకం లేదు అని గౌరవ సభ్యులకు మనవిచేస్తున్నాను. కేవలం నా ఆత్మ సంతృప్తి కోసమే వెరిఫికేషన్ చేయుచున్నాను.

**ఏమైనా ఆరోపణలు మా మంత్రిమండలిమీద వచ్చినపుడు మా ప్రభుత్వం నైతిక విలువలను కాపాడాలనేది నా ధర్మంగా భావిస్తున్నాను. అంత మాత్రంతోనే ఏదైనా చర్య తీసుకోవడం సమంజసం కాదని నేను భావించాను. కనుక దీని విషయంలో ఒక వెరిఫికేషన్ కావాలని, నాకు నేను ఒక నిర్ణయానికి రావడానికి ముందు యదార్థాన్ని గుర్తించాలని అనుకున్నాను.**

ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు న్యాయమైన నిబంధన పాటించదలుచుకున్నప్పుడు పరిపూర్ణంగా అవగాహన చేసుకోవాలనే భావంతోనే ప్రభుత్వ పరంగా ఉన్న అధికారిని ఈ విషయం వాస్తవమా కాదా అని తెలుసుకుని చెప్పవలసినదిగా కోరడం అయింది. ఇది ట్రాప్ కాదు, ఆ రకంగా దానిని నడపలేదు అని నేను మనవి చేస్తున్నాను. ఎప్పుడైతే నాకు అనుమానం కలిగిందో, ఆ వ్యక్తి ఎవరైనా సరే క్షమించడం ధర్మంకాదనే చిత్తశుద్ధితో, ఆత్మ సాక్షిగా, ఒక విధమైన నిజం ఉందని రూఢీగా అనుకున్నప్పుడే, నా యొక్క మంత్రిమండలి సభ్యుడిని మంత్రిమండలి నుంచి తొలగించవలసిందిగా గవర్నరుగారిని కోరడమైంది. అంతే కానీ ఏదో దోషిగా నిర్ణయించి, శిక్ష విధించడం మాత్రం కాదని మనవిచేస్తున్నాను. ఇది కేవలం నా ఆత్మ

సంతృప్తికోసమే నేను చేస్తున్న పని సక్రమమే అనే నిర్ణయానికి రావడం కోసమే జరిపించిన వెరిఫికేషన్ అని మనవిచేస్తున్నాను. నేను నీతి చెప్పగలిగినంత పెద్దవాడను కాదని మనవిచేసుకుంటున్నాను. నాకంటే ఎంతో పెద్ద రాజకీయవేత్తలున్నారు. ప్రభుత్వాలు వేరైనా, పార్టీలు వేరైనా, సిద్ధాంతాలు వేరైనా తెలుగుదేశం మనది అని నేను చెబుతూ వచ్చాను. ఈ మాట మీదే నేను ఎప్పటికీ నిలబడతాను. ఒక మంచి పనిచేయాలి. ఆదర్శవంతమైన పరిపాలన చేయాలి. ప్రభుత్వం పట్ల ప్రజలకు మంచి నమ్మకం కలిగించాలనే ఉద్దేశంతో చేసిన చర్య మాత్రమే ఇది అని తెలియచేస్తున్నాను. అందుకే ముందుగా సభకు తెలియచేయాలనే ఉద్దేశంతో ఏ విధమైన ప్రకటనలు చేయలేదు. ముందుగా గౌరవ సభ్యులకు, సభకు, అధ్యక్షులవారికి తెలపడం నా కర్తవ్యంగా భావించి మీ ముందు ఉంచుతున్నాను. ఇంకా నా వెరిఫికేషన్ పూర్తి కాలేదు. ఆయిన తరువాత ఆ వివరాలన్నీ తెలుసుకుని, ఏ చర్య తీసుకోబడుతుందో తెలియచేస్తానని మీ ద్వారా సభకు తెలియజేస్తున్నాను.

ఇకపోతే నిమ్మకూరు భూముల విషయంలో నేను రెవెన్యూ అధికారులకు నిష్పాక్షపాతమైన అభిప్రాయాన్ని తెలుపవలసిందిగా కోరడం జరిగింది. కాబట్టి నాది అనేది నాకులేదు. మీ అందరిలో నేనూ ఒకడిని. నాచారం భూమి విషయంలో కూడా అంతా సక్రమంగానే ఉంది. నాకు దానితో సంబంధంలేదు. అది రామకృష్ణా స్టూడియోకు సంబంధించినది.

ఈ సమాజం నుంచి నన్ను నేను మినహాయించుకోవడం లేదు. నా బాధ్యత ఎంతో ఉంది. ప్రజలు నన్ను నమ్మారు. ఏదో క్రొత్త జరుగుతుందని ఆశించారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా నా బాధ్యతను నేను నిర్వహించడం, సత్య, ధర్మబద్ధంగా పరిపాలన సాగించడం నా యొక్క ఆధ్యాత్మికమైన నిర్ణయమని మనవిచేస్తున్నాను. ఎప్పుడైనా సరే ప్రభుత్వపరంగా జరిగిన ఏ చర్యకైనా నేను బాధ్యత వహిస్తానని మీ ద్వారా మనవిచేస్తున్నాను. ఈ విషయంలో విచారణ పూర్తి ఆయిన తరువాత ప్రభుత్వ పరంగా ఏ రకమైన చర్యను తీసుకోవడం జరిగిందో తెలియచేస్తాను.

◆◆

ఫిబ్రవరి 21, 1984

# పేదవారి ఆకలిని గమనించండి, సహకరించి పుణ్యం కట్టుకోండి

*(హోటల్ యజమానుల సమ్మెపై నిబంధన 329 క్రింద జరిగిన చర్చ)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, మా పార్టీకి చెందిన సభ్యులు కాకుండా రాఘవరెడ్డిగారు, జైపాల్ రెడ్డిగారు, వెంకయ్యనాయుడుగారు, ఓంకార్‌గారు, ఓవైసీగారు, మత్యుంజయగారు అమూల్యమైన అభిప్రాయాలు తెలిపినందుకు వారికి నా అభినందనలు తెలియచేస్తున్నాను. నేను హోటళ్ల వారిని కలిసినప్పుడు నేను చెప్పాను. ఇది కేవలం అంతస్థులలో ఉన్నవారికోసం అభ్యర్థించడంలేదని, ఈరోజు స్వల్పంగా పలహారం తీసుకోవడం, కాఫీ త్రాగడం ఒక నిత్యావసరంగా సమాజంలో మారిపోయింది. ఇది పేదవారి విషయంగా గుర్తించాలి. మీరు పెద్దవారి గురించి ఆలోచించనక్కరలేదు, వారు చేసే విలాసవంతమైన భోజనం గురించి మీరు ఆలోచించనక్కరలేదు, కానీ పేదవారికి సంబంధించి, అదికూడా కొన్ని అంశాలమీదనే మీరు సహకరించి పుణ్యం కట్టుకోండి అని నేను వారిని కోరాను.

ప్రభుత్వ పరంగా అదిరించడంకానీ, బెదిరించడంకానీ జరగలేదు. ఈ ప్రభుత్వం పేదలకు కిలో బియ్యం రెండు రూపాయలకు అందచేస్తున్నది. ఏడు అంతస్థుల భవనాలలో ఉన్నవారు కిలో నాలుగున్నర రూపాయల బియ్యంతో విలాసవంతమైన జీవితం గడుపుతూ వున్నప్పుడు ఆ ప్రక్కనున్న పేదవాడు కూడా కనీసం తన పొట్టనింపుకునే అవకాశం ఉండాలనే భావంతోనే ప్రభుత్వం ఆ నిర్ణయం తీసుకున్నది. నేతి పలహారాలు, మసాలాదోశ, మసాలా వడ, మైసూరుపాకంల ధర మేము నిర్ణయించలేదు. ఇడ్లీ, వడ, ఉప్మా, సాదాదోసె, కాఫీ, టీ, ఒక ప్లేటు భోజనంకు మాత్రమే నిర్ణయించాము. భోజనం కూడా విస్తరి నిండా భోజనం పెట్టటానికి నిర్ణయించలేదు. ఒక ప్లేటు భోజనం కోసం వస్తున్నారంటే దానితో పూర్తిగా కడుపునిండదని అందరకూ తెలుసు. ఎవరు ఆకలితో అన్నార్తితో వస్తారో వారికి కొంత ఆకలి తీర్చటానికి మీరు

ఈ కాస్త సహకారం ఇవ్వండి అని వారిని కోరాను. అధికారికంగా శాసించడం నా ఉద్దేశ్యంకాదు. ఇది ప్రభుత్వం నిర్దేశించిన విధానం, దానిని మీరు గౌరవించాలి అని నేను వారికి మనవి చేయడం జరిగింది. ప్రభుత్వ పరంగా పదకొండు సమావేశాలు జరపబడ్డాయి. నేను రెండు సమావేశాలు జరిపాను. రెండవ సమావేశంలో నేను వారికి మరీ మరీ విన్నవించడం జరిగింది. 15వ తేది నుండి అమలుపరుద్దామనుకున్న రేట్లను 23వ తేది వరకూ ఆపుతాము.

20వ తేది సాయంత్రం అయిదు గంటలకు సమావేశం ఆవుదాము అని వారికి చెప్పినప్పుడు బాలకోటయ్యగారు, సీతారామయ్యగారు వంటి పెద్ద హొటళ్లు నిర్వహించేవారు ఒప్పుకొని ఆ రోజు సాయంత్రమే మీటింగు పెట్టుకుని మేము 15వ తేది నుండే సమ్మె చేయడానికి పూనుకున్నామని చెప్పడం ఎంత దురదృష్టకరమైన విషయమో ఆలోచించాలని సభ్యులను కోరుతున్నాను. వ్యాపారస్థులను, పెద్దవారిని నమ్మి ప్రభుత్వం ప్రజలకు అసౌకర్యం కలిగించకూడాదని కొన్ని చర్యలు తీసుకున్నది కాబట్టి కొంతవరకూ సమర్థించుకోగలిగాము. ఆ ప్రయత్నాలే చేయకపోతే ఈనాడు ప్రజలు ఎంతో అసౌకర్యాలకు గురయ్యేవారని మనవిచేస్తున్నాను. నేను గౌరవ సభ్యులకు మనవిచేసేది ఈనాడు హొటళ్లు పెట్టుకున్న పెద్దవారు తమ స్వంత డబ్బుతో వాటిని పెట్టలేదు. ప్రభుత్వ పరంగా, పబ్లిక్ సెక్టార్ నుండి డబ్బు తీసుకుంటున్నారు. వారి పలుకుబడి ఉపయోగించి ప్రభుత్వం నుండి డబ్బు తీసుకుని ఈనాడు ప్రభుత్వ విధానాన్ని సమర్థించకుండా కేవలం ఆశతో, వ్యాపారపరంగా లాభాలు సంపాదించుకోవాలని ఆలోచిస్తున్నారు. అంతేగానీ ప్రజల విషయాన్ని గుర్తించకుండా, వారి పరిస్థితిని అవగాహన చేసుకోవడంలేదని మనవిచేస్తున్నాను.

**ఈనాడు హొటళ్లు పెట్టుకున్న పెద్దవారు తమ స్వంత డబ్బుతో వాటిని పెట్టలేదు. ప్రభుత్వ పరంగా, పబ్లిక్ సెక్టార్ నుండి డబ్బు తీసుకుంటున్నారు. వారి పలుకుబడి ఉపయోగించి ప్రభుత్వం నుండి డబ్బు తీసుకుని ఈనాడు ప్రభుత్వ విధానాన్ని సమర్థించకుండా కేవలం ఆశతో, వ్యాపారపరంగా లాభాలు సంపాదించుకోవాలని ఆలోచిస్తున్నారు. ప్రజల పరిస్థితిని అవగాహన చేసుకోవడంలేదని మనవిచేస్తున్నాను.**

ఎందుచేతనంటే కేవలం 4 ఐటెమ్స్ కొన్ని నిర్దిష్టమైన కాలాలలో మాత్రమే అవసరం పడుతుంది. ఎవరైనా ఆ కాలంలోనే చవకగా వస్తుందని వచ్చి తింటారు. ఎంతోమంది శ్రామికులు, కార్మికులు ఉన్నారు. వారి విషయం ఆలోచించాలని చెబితే వారు పెడచెవిన పెట్టినందుకు చాలా బాధపడుతూ సభ వారికి వ్యక్తం చేస్తున్నాను. వారు కూడా ఈ సమాజంలో సభ్యులై ఈ సమాజం శ్రేయస్సును కొంతవరకు అయినా తిరిగి ఆలోచించి పట్టుదలను విడిచిపెట్టి ఈ ప్రభుత్వంతో సహకరిస్తారని ఆశిస్తున్నాను. ఇకపోతే ఈనాడు 2 జోన్స్ ఎందుకు పెట్టినారని గౌరవ సభ్యులు వెంకయ్యనాయుడుగారు అన్నారు. ఈనాడు హైదరాబాద్‌లో ఎస్టాబ్లిష్‌మెంట్ వేరు. ఈనాడు

సామాన్యమైనంతి పట్టణాలలో ఉండే ఎస్టాబ్లిష్‌మెంటు వేరు. కాబట్టి పట్టణంలో ఉండేవారికి ఏమైనా ఫ్యాన్స్ మున్నగు సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో వారికి ఎక్కువ ఎస్టాబ్లిష్‌మెంట్ ఖర్చు ఉంటుందనే ఉద్దేశ్యంతో ఈ రెండు జోన్స్‌గా విభజించడం జరిగింది. కానీ మరొక ఉద్దేశ్యంతో కాదు. మీరిచ్చిన సూచన మరొకసారి ఆలోచిస్తాము. గౌరవసభ్యులు వి. నాగేశ్వరరావుగారు, త్రిపురాన వెంకటరత్నంగారు చెప్పినారు. సోదరీమణి కార్మికుల సంక్షేమం గురించి చెప్పినారు. కార్మికుల సంక్షేమం విషయం ప్రభుత్వం విస్మరించడంలేదు.

ఏదైనా దురదృష్టకరమైన నిర్ణయానికి కనుక హెూటల్ యజమానులు వస్తే గౌరవసభ్యులకు మనవిచేస్తున్నాను ప్రభుత్వం వెనుకకు మళ్లడం అనేది ఉండదు. ఆ సందర్భంలో కార్మికులకు సహకార జనతా పలహారశాలల్ని వారు ఒక సహకార పరంగా పెట్టుకోదలిస్తే వారికి అన్ని సౌకర్యాలు కల్గించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అది కాకుండా నిత్యావసర వస్తువులు సప్లయి విషయంలో ఇదివరకు ఒక ప్రకటన చేయడం జరిగింది. ఈనాడు జనతా కేంటిన్ పెట్టుకొన్నటువంటి వారందరికీ కూడా గోధుమరవ్వ కానీ, గోధుమపిండికానీ ఈ ప్రభుత్వం నిర్ణయించిన ధరకు సరఫరా చేయడం జరుగుతుందని తెలియజేయడం జరిగింది. ఈనాడు కార్మిక సోదరులు వచ్చి వారికి వారే ఇండిపెండెంటుగా వ్యాపారం పెట్టుకుంటామంటే వారికి అన్ని సౌకర్యాలు అందించడం జరుగుతుందని చెబుతున్నాను. ఇకపోతే పెద్ద హెూటల్స్ నిర్వహించడానికి కోట్ల రూపాయలు ప్రభుత్వ పరంగా ముట్టినప్పుడు ఈనాడు జీవనోపాధి పోగొట్టుకున్నటువంటి కార్మిక సోదరులు వారు ఇండిపెండెంట్‌గా చిన్నచిన్న హెూటల్స్ పెట్టుకోవడానికి వస్తే సాధ్యమైనంత వరకు ఆర్థిక సహాయం అందించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని మనవిచేస్తున్నాను. ఈనాడు క్రొత్తగా హెూటళ్లు పెట్టడానికి, ప్రభుత్వ విధానాన్ని సమర్థించడానికి ఎన్నో సేవా సంస్థలు, మహిళా సంఘాలు, వివిధ యువబృందాలు, ముస్లింలు కొంతమంది వస్తున్నారు. అంతేకాకుండా వారు ప్రజలకు తక్కువ రేట్లకు అందిస్తామని అన్నారు. ఏదైనా సామరస్య దృష్టితో పరిష్కరించడానికి ప్రభుత్వం అన్నివిధాల కృషి చేస్తుందని, ప్రభుత్వ విధానంలో వెనక్కు తిరగడం ఉండదని మనవిచేస్తూ ఈనాడు శ్రామికులు, కార్మికుల యొక్క సంక్షేమాన్ని ప్రభుత్వం ఏ మాత్రం విస్మరించడం జరగదని మనవిచేస్తున్నాను.

నేను చెప్పేదేమిటంటే ఈనాడు ఉన్నటువంటి ఇబ్బందులు గుర్తించే రు. 1 లక్షా 50 వేలపైన వ్యాపారం చేసే హెూటళ్లు ఏ మాత్రం కూడా బిల్లులు ఇవ్వవలసిన అవసరంలేదని ఆదేశాలు జారీ వేయడం జరిగింది. ఇదివరకు 4, 5 వ్యవస్థలు వారిమీద ఎప్పటికప్పుడు దాడులు చేయడంతో ఇబ్బంది కల్గుతున్నదని వారు చెప్పినప్పుడు ఈనాడు కేవలం సివిల్ సప్లైస్ శాఖవారు, అక్కడ ఉన్నటువంటి రెవెన్యూ శాఖవారు తప్ప మరి ఎవరూ ఇబ్బంది కల్గించకుండా ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఇదివరకు చెప్పినాను, స్టేట్ విజిలెన్స్ బోర్డు కనుక ఒక నిర్ణయానికి రాగల్గితే

ప్రభుత్వం ఇటువంటి శాఖలను నియమించవలసిన అవసరం ఉండదు. ఆ శాఖ ఒకటే నిర్వహించగల్గుతుంది. అంత వరకు కేవలం ఈ రెండు శాఖలు సివిల్ సప్లయిస్ శాఖ అక్కడే ఉండేటటువంటి రెవెన్యూశాఖ అధికారులు ముఖ్యం కనుక వారిద్దరి పర్యవేక్షణలో ఇవి చూడబడుతున్నాయని మనవిచేస్తున్నాను.

ఈనాడు హోటల్స్ మీద పెత్తనం చేయమని పోలీసులకు అధికారం ఇవ్వలేదు. గౌరవ సభ్యులకు మనవిచేస్తున్నాను. ఆనాడు అందరూ ఒప్పుకొన్నారు. రెండున్నర గంటలు నా కాలాన్ని తీసుకొని మేము 20వ తేదీన కలుస్తామని చెప్పి వెంటనే మీటింగు పెట్టుకొని మరునాడు నుంచి సమ్మె చేస్తామని ప్రభుత్వాన్ని ఇబ్బందిలో పెట్టిన వారి విషయంలో నేను అత్యంత ప్రాధాన్యం ఇవ్వను. ఎందుచేతనంటే ఇది ప్రతిష్ఠాకరమైన విషయం కాదు. ప్రభుత్వం అంటే ఒక గౌరవం ఉంది. ఆ గౌరవాన్ని ఈనాడు ఎవరికీ అమ్ముకొనే స్థితిలో ప్రభుత్వం లేదు. వారు కనుక వస్తే నేను మాట్లాడడానికి సిద్ధమే. ఏదైనా, వారు ఇచ్చిన మాటకు విరుద్ధంగా ప్రభుత్వానికి అప్రతిష్ఠ తేవడానికి వారు ఈ నిర్ణయం వెంటనే తీసుకున్నారు అనుకుంటున్నాను. వారు వస్తే గౌరవంగా వారిని ఆహ్వానించి వారితో సమావేశం జరుపుతాను.

◆◆

ఫిబ్రవరి 28, 1984

# పోలవరంను జాతీయ ప్రాజెక్టుగా చేపట్టవలసిన ఆవశ్యకతను వివరించాను

*(ఢిల్లీ పర్యటనపై చేసిన ప్రకటన)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, ఈ నెల 25వ తేదీన నేను ఢిల్లీ వెళ్ళినప్పుడు అక్కడ కేంద్ర వాణిజ్య శాఖమంత్రి శ్రీ వి.పి.సింగ్ గారిని కలుసుకొన్నాను. విశాఖపట్టణాన్ని స్వేచ్ఛామండలంగా చేయడానికి సంబంధించిన విషయాన్ని వారితో ప్రస్తావించాను. విశాఖపట్టణాన్ని స్వేచ్ఛామండలంగా ఏర్పాటు చేయడానికి బలమైన కారణాలు ఉన్నాయి. ఎందుకంటే ఈ ప్రాంతలో పెద్ద ఓడరేవు ఉంది. ఇంజినీరింగ్ పరిశ్రమలు, లోహ సంబంధమైన పరిశ్రమలు, రసాయనిక పరిశ్రమలు విస్తృతంగా నెలకొల్పడానికి తగిన అవకాశాలు ఉన్నాయి. విశాఖపట్టణం విషయంలో బలమైన కారణాలు ఉన్నప్పటికీ తగినన్ని నిధులు లేని కారణంగా ఈ వర్తమాన ప్రణాళికా కాలములో 4 స్టేట్ వాణిజ్య మండలాలను మాత్రమే చేపట్టడం జరుగుతుందని, అందువల్ల ఈ విశాఖపట్టణాన్ని ఈ నాలుగింటిలో ఒకటిగా చేర్చలేక పోతున్నామని వాణిజ్య మంత్రి చెప్పారు. అయితే ఇటుపైన స్వేచ్ఛా వాణిజ్య మండలాలను ఏర్పాటు చేసేటప్పుడు విశాఖపట్టణాన్ని తప్పక పరిగణనలోకి తీసుకొనడం జరుగుతుందని అన్నారు.

అక్కడ లభించే నిపుణులైన కార్మికులను దృష్టిలో పెట్టుకొని ఇప్పుడే ఈ దిశలో ప్రయత్నాలు ప్రారంభించాలని నేను చేసిన సూచనపై వాణిజ్య మంత్రి విశాఖపట్టణంలో నూటికి నూరుపాళ్ళు ఎగుమతి చేయడానికి వీలైన వస్తువులను ఉత్పత్తి చేసే పారిశ్రామిక వాడను ఏర్పాటు చేయమని సలహా ఇచ్చారు. పారిశ్రామిక వాడను ఏర్పాటు చేయాలన్న ఆయన సూచన, ఇక్కడ స్వేచ్ఛా వాణిజ్య మండలాన్ని ఏర్పాటు చేయాలన్న మన కోరికకు ప్రత్యామ్నాయం మాత్రం కాదని ముందు ముందు స్వేచ్ఛా వాణిజ్య మండలం ఏర్పాటుకు ఇది ఒక తొలిమెట్టు మాత్రమేనని నేను తెలియజేశాను. ఈ సూచనను పరిశీలించడానికి నేను అంగీకరించాను. పారిశ్రామిక వాడలో

కస్టమ్స్, ఎక్సైజ్‌శాఖ విభాగాలు, విదేశీమారకద్రవ్య అనుమతి కార్యాలయాలను ఏర్పాటుచేయాలని నేను వారికి సూచించాను. భారత ప్రభుత్వ ప్రత్తి సంస్థ ద్వారా పొడుగుపింజ, లాంగ్ స్టేపుల్ కాటన్ (ఎక్కువ పొడుగుపింజ) పత్తిరకాల కొనుగోళ్ళను ఎక్కువ చేయవలసిందిగా వాణిజ్య మంత్రిని కోరాను. గత ఏడాది కొన్నదానికన్నా ఈ ఏడాది 20 శాతం ఎక్కువే భారత ప్రభుత్వ ప్రత్తి సంస్థ ప్రత్తిని కొనుగోలు చేసిందని, ప్రత్తి మద్దతుధర కన్నా ఎక్కువగానే ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్తి ధరలున్నాయని వాణిజ్యమంత్రి అన్నారు. అయినప్పటికీ పరిస్థితిని ఒక కంట కనిపెట్టి ఉండమని, ప్రత్తిధరలు పడిపోతే కొనుగోలును ఎక్కువ చేయాలని భారత ప్రత్తి సంస్థను కోరడానికి వాణిజ్యమంత్రి అంగీకరించారు. ఆంధ్రప్రదేశ్‌లో టెక్స్‌టైల్ మిల్లుల్ని ఏర్పాటు చేయడానికి అవసరానికి మించివున్న ప్రత్తిని వినియోగించుకొనడానికి వీలుగా కొత్త నూలు మిల్లులకు లైసెన్స్‌లు మంజూరు చేయడానికి సంబంధించి నేను అడిగిన ప్రశ్నకు వాణిజ్యమంత్రి చెబుతూ అటువంటి మిల్లుల్ని ఇప్పుడు కొత్తవిధానం క్రింద, పరిశ్రమలు లేని జిల్లాల్లో ఏర్పాటుచేసుకోవచ్చును అన్నారు.

వెనుకబడిన ప్రాంతాలుగా కేంద్రం ప్రకటించిన చోట టెక్స్‌టైల్ మిల్లుల్ని ఏర్పాటుచేయడానికి లైసెన్స్‌లు ఇవ్వడం అవసరమేనన్న వాదంలో బలం ఉందని ఆయన అంగీకరించారు. సహకార రంగములోను, ప్రైవేటు రంగములోను నూలు మిల్లులు ఏర్పాటుకు సంబంధించి కేంద్రం అనుమతి కోసము అనేక దరఖాస్తులున్న విషయాన్ని ప్రస్తావించగా ఈ విషయం పరిశీలించగలమని అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించగలమని పేర్కొన్నారు. పొగాకు ఉత్పత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి ఆ విషయంలో రాష్ట్రప్రభుత్వం స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ తీసుకొన్న చర్యల గురించి చర్చించాము. మధ్య దళారీలను తొలగించడం కోసము రైతులకు లేదా ఉత్పత్తిదారులకు ఎగుమతి లైసెన్స్‌లివ్వాలన్న సూచనతో కేంద్ర వాణిజ్య మంత్రి ఏకీభవించారు. కేంద్ర పరిశ్రమల మంత్రి శ్రీ ఎన్.డి. తివారీగారిని కూడా కలిశాను. మన ప్రభుత్వరంగ పరిశ్రమలో ప్రధానమైన ఆల్విన్, ఆంధ్రప్రదేశ్ స్కూటర్స్ గురించి ఆయన అడిగి, ఆ సంస్థలు సాధిస్తున్న పురోభివృద్ధి గురించి తెలుసుకొని సంతోషించారు. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో విద్యావంతుల కోసము స్వయం ఉపాధిపథకాలను ఒక క్రమపద్ధతి ప్రకారం అమలుచేస్తున్న తీరుపట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇంకా నిర్ణయం తీసుకోవలసిన పారిశ్రామిక లైసెన్స్‌ల గురించి నేను ప్రస్తావించగా వాటినన్నింటినీ ఆమోదించే విషయంలో గల పరిమితుల గురించి ఆయన వివరించారు. అయినప్పటికీ విశాఖపట్టణం సమీపములో ప్రభుత్వ రంగములో సిమెంటు

**వెనుకబడిన ప్రాంతాలుగా కేంద్రం ప్రకటించిన చోట టెక్స్‌టైల్ మిల్లుల్ని ఏర్పాటుచేయడానికి లైసెన్స్‌లు ఇవ్వడం అవసరమేనన్న వాదంలో బలం ఉందని ఆయన అంగీకరించారు. సహకార రంగములోను, ప్రైవేటు రంగములోను నూలు మిల్లులు ఏర్పాటుకు సంబంధించి కేంద్రం అనుమతి కోసము అనేక దరఖాస్తులున్న విషయాన్ని ప్రస్తావించగా ఈ విషయం పరిశీలించగలమని పేర్కొన్నారు.**

ఉత్పత్తిచేసే కర్మాగారం స్థాపన, రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల్లో పాలిస్టర్ కర్మాగారం నిర్మాణంవంటి కొన్ని పెద్ద ప్రాజెక్టులకు లైసెన్స్‌లిచ్చే విషయాన్ని ప్రత్యేకశ్రద్ధతో పరిశీలిస్తామని వారు నాకు వాగ్దానం చేశారు. కేంద్ర నౌకాయాన రవాణాశాఖ మంత్రి శ్రీ కె. విజయభాస్కరరెడ్డిగారిని కలుసుకొన్నాను. గోదావరి బేసిన్లో నూనె నిక్షేపాలకై అన్వేషణ జరుగుతున్నందున అక్కడ త్వరలోనే ఎరువులు ఉత్పత్తి చేసే కర్మాగారమును నెలకొల్పనున్నందున కాకినాడ రేవును మేజర్‌పోర్ట్‌గా ప్రకటించమని నేను వారిని కోరాను. కృష్ణానదిపై రెండవ రోడ్ వంతెనకు 4 లైన్లకు సరిపడా పునాది నిర్మాణం మంజూరు చేయాలని ఆ ప్రాతిపదికపై 7వ ప్రణాళికలో 4 లైన్ల వంతెనను మంజూరు చేయాలని కేంద్రమంత్రిని నేను కోరాను. కేంద్ర నీటిపారుదల శాఖమంత్రి శ్రీ రామ్ నివాస్‌మీర్ధా గారిని నేను కలుసుకొన్నాను. వంశధార ప్రాజెక్టు గురించి చర్చించడానికి ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా ముఖ్యమంత్రుల సమావేశాన్ని త్వరలోనే ఏర్పాటు చేయవలసినదిగా వారిని కోరాను. గిరిజన ప్రాంతాలకు ఎంతో ప్రయోజనం చేకూర్చే ఈ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయవలసిన అవసరం గురించి వారికి వివరించాను. పోలవరం ప్రాజెక్టు జాతీయ ప్రాజెక్టుగా చేపట్టవలసిన ఆవశ్యకతను గురించి నేను వారికి చెప్పాను. దాదాపు 1200 కోట్ల రూపాయలు వ్యయంకాగల ఈ భారీ పథకాన్ని రాష్ట్రం భరించగలగడం సాధ్యంకాదని వివరించాను.

కేంద్ర ఆర్థికశాఖ మంత్రి శ్రీ ప్రణబ్‌ముఖర్జీ గారిని నేను కలుసుకొని రైతులకు రుణాలు, వ్యవసాయావసర వస్తువులు, నిత్యావసర సరుకులు, వ్యవసాయోత్పత్తుల ప్రాసెసింగ్, మార్కెటింగ్ వంటి అతిముఖ్య అవసరాలను అన్నింటినీ ఒకేచోట అందజేసే సేవా విభాగం ఏర్పాటుకు సంబంధించిన మా ప్రతిపాదనను ఆమోదించి పంపవలసిందిగా కోరాను. ఆంధ్రప్రదేశ్‌లో పేదప్రజలకు కిలో బియ్యం 2 రూపాయలకు పంపిణీ చేస్తున్న పౌరసరఫరాల వ్యవస్థ పెద్ద మొత్తాల్లో బియ్యం కొనుగోలుచేసి, నిల్వలు ఏర్పరచుకోడానికి ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల సంస్థకు 100 కోట్ల రూపాయల నగదు రుణాన్ని అందజేయడానికి రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియాకు భారత ప్రభుత్వం అధికారం ఇచ్చే అంశాన్ని కూడా నేను ఆర్థికశాఖమంత్రితో చర్చించాను. కేంద్ర ఇంధనశాఖామంత్రి శ్రీ శివశంకర్ గారిని కలుసుకొని రాష్ట్రంలో నూనె, సహజవాయువుల సంస్థ కార్యకలాపాల్ని త్వరత్వరగా కొనసాగించడానికి వీలుగా రాష్ట్రంలో ప్రత్యేకంగా పూర్తి స్థాయి ప్రాంతీయ కార్యాలయాలన్ని ఏర్పాటు చేయాలని వారిని కోరాను.

అధ్యక్షా, శివశంకర్‌గారితో ఈ విషయం నిర్దుష్టంగా చెప్పాను. ఏ వసరులు కావాలన్నా ఏర్పాటు చేస్తాము. ప్రభుత్వపరంగా అనికూడా మనవిచేసాను. ఒకసారి మీరు వీలు చూసుకుని వస్తే, వారు వచ్చే సమయానికి నేను కూడా వీలుచేసుకుని అసలు ప్రాంతాన్ని పర్యవేక్షించి ఎక్కడ నిర్ణయించాలో ప్రాంతీయ కార్యాలయానికి ఆ విధమైన నిర్ణయం తీసుకుని వారికి చెప్పడం జరిగిందని మనవిచేస్తున్నాను.

◆◆

మార్చి 2, 1984

# ఎన్నైనా రాయితీలు ఇవ్వవలసిందే! పేద ప్రజల విషయంలో సందేహం అవసరం లేదు

*(వ్యవసాయ కార్మికుల కోసం సమగ్ర కేంద్ర శాసనం కోరుతూ ప్రవేశపెట్టిన అనధికార తీర్మానం)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, ఈనాడు మనం ఎన్నో ప్రణాళికలు వేసుకొని గ్రామీణాభివృద్ధి అంటున్నాము. గ్రామీణాభివృద్ధి అంటే కేవలం రైతులు, రైతు సమస్యలేకాదు. ఈనాడు వ్యవసాయ కూలీలు కూడా దానిలో మిళితమై ఉన్నారనే సంగతి అందరికీ తెలుసు. పల్లె ప్రాంతాలలో ఉండే రైతాంగం మీద ఆధారపడిన రైతు కార్మికుల సంక్షేమం చూచినప్పుడే గ్రామీణాభివృద్ధి జరుగుతుంది. కనుక రైతుల గురించే ఈనాడు ఆలోచించడం లేదని గౌరవసభ్యులకు తెలియజేస్తున్నాను. ముఖ్యంగా మా ప్రభుత్వం తీసుకున్నటువంటి నిర్ణయాలు, శాశ్వత గృహ నిర్మాణ పథకముగానీ మిగతా విషయాలు గానీ చూస్తే ఏ విధంగా సామాన్య మానవుడికి సంక్షేమకరమైనటువంటి ఒకమంచి జీవితాన్ని అందించాలనే ఉద్దేశముతో తీసుకోబడినవిఅనేది గౌరవ సభ్యులందరికీ తెలుసు. కేవలం మురికి వాడల్లో, చివికిన పాకల్లో చింపిరి గుడ్డలతో కాలక్షేపం చేసే రైతులు, రైతు కూలీలు, కార్మికులకు ఒక సంక్షేమకరమైనటువంటి జీవితాన్ని కల్పించాలనే ఉద్దేశముతో కార్యక్రమాలు అన్ని చేపట్టడం జరిగింది.

ఈనాడు పై వర్గాల వారిని చూడనక్కరలేదని చెప్పాము. డబ్బున్నవారు, సంపన్నులు, వారి క్షేమాన్ని వారు చూసుకుంటారు. సామాన్య ప్రజానీకానీకి, తిండి, గుడ్డ లేనివారిని చూడడం ప్రభుత్వ ధర్మంగా భావిస్తున్నదని ఎన్నో సందర్భాలలో చెప్పి ఉన్నాము. రైతులకు, రైతు కూలీలకు సమస్యలు ఉన్నవని అంగీకరించడములో సందేహంలేదని మా పార్టీ భావిస్తున్నది. సామాన్యుడి జీవితాన్ని వికాసవంతం చేసినప్పుడే ప్రజాస్వామం అని చెప్పుకునే ఈ విధానానికి పరిష్కార మార్గం కలగదని భావిస్తున్నాము. స్వాతంత్ర్యం వచ్చి 35 సంవత్సరాలు గడిచినప్పటికీ 51 పర్సంట్ ప్రజానీకము 'ఏదీ మాకు దిక్కు' అని ఆడుగుతున్నారు. ఈ రోజు వారు ఇంకా దరిద్ర

రేఖకు దిగువనే ఉంటున్నారు. ఇన్ని రోజులు వారిపట్ల ఏ విధమైనటువంటి నిర్లక్ష్యం చేయబడిందో ఒకసారి ఆలోచిస్తే అందరికీ తెలుస్తుంది. ప్రభుత్వం బాధ్యతను గుర్తించి ఈ సమస్య విషయములో మా ప్రభుత్వ వైఖరి, పార్టీ వైఖరి ఏమిటో తెలియజేస్తున్నాను. ముఖ్యంగా ఒక విషయం మనవిచేస్తాను క్షమించాలి సభ్యులు, ఎవరినీ  ఉద్దేశించికాదు. ఏ ప్రభుత్వాన్ని ఉద్ధేశించికాదు. ఒకరిని విమర్శించడం కాదు. సంక్షేమ కార్యక్రమాలు ఎన్నో చేసుకోవాలి.

ఈనాడు ఒక ఇంట్లో కట్టు, బట్టతో ఉంటే సమానమైనటువంటి ప్రతిపత్తి సంఘములో కలుగుతుందా అనేది నాకు వచ్చినటువంటి అనుమానం. వ్యవసాయ కూలీల బిడ్డలు కూలీలుగానే వుండాలా? ఏమిటీ? అధికారుల బిడ్డలు అధికారులు కావాలా లేకపోతే డబ్బు ఉన్నవారి బిడ్డలే డబ్బు ఉన్నవారు కావాలా? డబ్బు ఉన్నవారి బిడ్డలే పరిశ్రమలు పెట్టాలా అనేది ఒకసారి ఆలోచిస్తే తరతరాలుగా వారి తలకు చుట్టబడిన దుర్విధానమని మనవిచేస్తున్నాను. ఏదైనా సరే మానవుడికి స్వతంత్ర భారత దేశములో సమానస్థాయి కల్పించబడినప్పుడే సమ సమాజ స్థాపనను మనం స్థాపించుకోగలమని మనవిచేస్తున్నాను. అటువంటి విధానాలు చేసుకోవాలి. ఇప్పుడు కేవలం మనం ఆలోచిస్తున్న కూడు, బట్ట విషయమే కాదు. వారి ఆత్మాభిమానం కూడా చూడాలి. వారి బిడ్డల ఉద్యోగాల విషయములో విజ్ఞానం విషయములో సమాన అవకాశాలు కల్పించబడినప్పుడే గానీ సమాజములో తృప్తిరాదని మనవి చేస్తున్నాను.

ఈనాడు వారి మూగ బాధను దిగమ్రింగి మనం చెప్పే హామీలను నమ్మి ఏదో ఒరగబడుతుందని ఎప్పటికప్పుడు రోజులు లెక్క పెట్టుకుంటూ గడుపుతున్న దురదృష్టవంతులైనటువంటి కర్షకులు, కార్మికులు, కూలీలు సమాజములో ఉన్నారు. ఈనాడు కర్షకులు పెద్దవారు అనుకోనక్కరలేదు. గౌరవసభ్యులు కొంతమంది చెప్పారు. ఎప్పుడైతే ల్యాండ్ సీలింగ్ వచ్చిందో అందరూ ఒకే మాదిరి అయ్యారు. ఎవరైతే నాగలి చేతబట్టి దున్నుకుంటారో వారికి కూలీ గిట్టుబాటు అవుతుంది. కానీ 15, 18 ఎకరాలు ఉన్నవారికి వచ్చే ఆదాయముతో వారి బిడ్డలకు సరైన విధంగా పెండ్లి కూడా చేసుకోలేని స్థితిలో ఈనాడు రైతులు ఉన్నారు. అందుకు అందరి సంక్షేమము ఆలోచించవలసి ఉంది. మనందరి బాధ్యత అయివుంది. నేను చెప్పేది, ఇది మనం పెట్టుకోవడమే కాదు. ప్రప్రథమంగా మనందరము భారతీయులం, ఆ తరువాతనే ఆంధ్రప్రదేశ్ వాసులము.

ఫెడరల్ సిద్ధాంతములో అన్ని రాష్ట్రాలు కలసిన కూడలి యూనియన్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం అంటే దూరముగా పెట్టి మాట్లాడడం ధర్మం కాదు. మనందరం కలిస్తేనే కేంద్ర ప్రభుత్వం అయింది. అన్ని స్టేట్స్ కలిసినప్పుడే యూనియన్ ప్రభుత్వం బాధ్యతగా కూడా ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతని మోస్తుంది అనే విషయాన్ని గౌరవసభ్యులు ఆలోచించాలని మనవిచేస్తున్నాను. ఈనాడు ఎన్నో ఆకాంక్షలు, ఆశలు ఉన్నవి, ఆవేశం ఉంది. కడుపులో మంట రగులుతుంది. ఇన్ని కార్యక్రమాలు అమలు చేస్తామని చెప్పడానికి గుండె ధైర్యం లేక రాష్ట్ర

ప్రభుత్వాలు బాధపడుతున్నాయంటే ఏ విధమైనటువంటి దుర్విధానం, రాజ్యాంగ పరిపాలన మన దేశములో అమలు పరచబడుతున్నదో ఒకసారి ఆలోచించమని కోరుతున్నాను.

ఎన్నైనా రాయితీలు ఇవ్వవలసిందే! పేద ప్రజల విషయంలో మనము సందేహించవలసిన అవసరం ఏమీలేదు. ఎందుచేతనంటే వారికి సమానమైన అవకాశాలు ఇచ్చి చేయూతను ఇచ్చి పైకి లేవనెత్తి మనతో పైకి తీసుకొనిపోతే కానీ మనము ప్రభావితమైన సమ సమాజాన్ని స్థాపించుకోలేమని మనవిచేస్తున్నాను. కనుక అటువంటి వికాసవంతమైన, చైతన్యవంతమైన సమాజానికి మనము కృషి చేయాలి. ఈనాడు యూనియన్ ప్రభుత్వం ఈ ప్రభుత్వం నాది కాదని తప్పించుకోపడానికి వీలులేదని మనవిచేస్తున్నాను. సాంఘిక సంక్షేమ కార్యక్రమం ఇది. సమాజంలో మనుష్యులు ఉన్నారు. కేవలం ఆ మనుష్యుల సమానత్వానికి అవకాశాలు కల్పించడం ప్రతి ప్రభుత్వం యొక్క ధర్మం. మన సమాజంలో ఉన్నటువంటి పేదవారి యొక్క విషయాలను ఆలోచించడానికి స్థోమత లేనటువంటి, ఆర్థికంగా తాహతులేనటువంటి రాష్ట్రాలకు సహాయం చేయడమే యూనియన్ ప్రభుత్వం ధర్మంగా భావించాలని తమ ద్వారా హెచ్చరిస్తున్నాను. కనుక నేను చెప్పేదేమిటంటే గౌరవసభ్యులు రజబ్ అలీగారు ఎంతో ఆవేశంతో ప్రవేశపెట్టిన దీని విషయంలో వారితో ఏకీభవిస్తున్నాను, మాకు ఏ మాత్రం భేదం లేదు. ఎప్పటికప్పుడు ఈనాడు సమాజంలో ఉన్నటువంటి స్థితిగతులను,అవసరాలను రాష్ట్ర ప్రభుత్వంలో ఉన్న పరిస్థితులను రాష్ట్ర ప్రభుత్వం యొక్క బాధ్యతను, ఆచరణ విధానాన్ని గుర్తించి సరియైనటువంటి ఆర్థిక పరిష్కారాన్ని రాష్ట్రానికి అందించడం కేంద్రప్రభుత్వం యొక్క ధర్మంగా భావించాలని యూనియన్ ప్రభుత్వానికి సవినయంగా మనవిచేస్తున్నాను. అందుకే రైతు కూలీల విషయంలో ఒక బిల్లు ప్రవేశపెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించుకున్నదని మనవిచేస్తున్నాను. యూనియన్ ప్రభుత్వం తప్పించుకోవడానికి ఒకసారి ప్రయత్నం చేసింది.

The Government of India requested the State Governments to form their own legislation after the Labour Ministers' Conference. మీకు కావలసింది మీరు చేసుకోండి అంటే, దేశంలో ఉన్న సమస్య ఇది. వ్యవసాయ మండలం మన రాష్ట్రంలో లేదు. వ్యవసాయ మండలం పంజాబులో, తమిళనాడులో ఇతర అన్ని రాష్ట్రాలలో ఉంది. అన్ని రాష్ట్రాలలో వ్యవసాయ కార్మికులు, కూలీలు ఉన్నారు. వారి అందరి క్షేమం గుర్తించడం ఈనాడు కేంద్రప్రభుత్వం ధర్మం. ఈనాడు ఉన్నటువంటి అవసరాన్ని గుర్తించి ఈనాడు ఏవిధంగా అభివృద్ధి చెందిన దేశాలు ముందుకు పయనిస్తున్నాయో అదే విధంగా మనదేశ ప్రగతిని చూడవలసిన బాధ్యత కేంద్రప్రభుత్వానికి ఉంది. కాబట్టి అటువంటి బిల్లు ఒకటి ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం యోచిస్తున్నప్పటికీ ఈనాడు గౌరవనీయులైన సభ్యులు రజబ్ ఆలీగారు ఎంతో అభ్యుదయ భావంతో, ఆందోళనతో ఈ బిల్లు సందర్భంలో కేంద్రప్రభుత్వానికి పంపించే విధానంలో నేను వారితో మా పార్టీ ప్రభుత్వం ఏకీభవిస్తున్నదని తెలియజేస్తున్నాను.

◆◆

ఏప్రిల్ 12, 1984

# కాలే కడుపులతో అలమటిస్తున్న వారి కోసమే రూ. 2లకు కిలో బియ్యం

*(సహకారం, వ్యవసాయం, పశుసంవర్ధకం, డెయిరీ, ఫిషరీస్, అడవులు, సివిల్ సప్లై శాఖలకు గ్రాంట్స్ కోరుతూ)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, గౌరవనీయులైన సభ్యులందరూ ప్రత్యేకమైన శ్రద్ధతో వారి, వారి అమూల్యమైన అభిప్రాయాలను తెలియజేశారు. ఇది సామాన్యమైన బీద ప్రజలకు సంబంధించిన సమస్య. ముఖ్యంగా ఈనాడు మనం తింటే చాలదు. లేనివాళ్ళకు పెట్టాలి. వాళ్ళ బ్రతుకులను ఉద్ధరించాలని ప్రభుత్వం ఆశయంగా తీసుకోవడం జరిగిందని ఇదివరకు ఎన్నోసార్లు మనవిచేసాను. సివిల్ సప్లయిస్‌కు సంబంధించినంత వరకు పేదవారికి రూ.2లకు కిలో బియ్యం కానీయ్యండి. మిగిలిన నిత్యావసర వస్తువులను అదుపులో పెట్టే విషయంలో కానీయ్యండి ప్రభుత్వం అత్యంత శ్రద్ధ తీసుకుంటుందని మనవి చేస్తున్నాను. పొగాకు ధర మనకు సంబంధించింది కాదు. ఇది సివిల్ సప్లయిస్ క్రిందకురాదు. కాబట్టి ఈ విషయంలో ఇచ్చిన ప్రకటనలోనే ఏ విధంగా చర్య తీసుకోవడం జరిగిందని కూడా మనవిచేయడం జరిగింది. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర లభింపచేయడం విషయంలో ప్రభుత్వం అత్యంత శ్రద్ధ చూపిస్తున్నది. సాధ్యమైనంతవరకు ప్రభుత్వం చేయగలిగినంత సహాయం రైతులకు చేస్తున్నది. క్రితం సంవత్సరం పొగాకు ధర క్వింటాల్ ఒక్కింటికీ రూ.175లు, రూ.180లు, రూ.185ల వరకు వెళ్ళింది. పొగాకు ధర క్వింటాల్‌కు రూ.20లు పెంచడం ప్రభుత్వం మొదలుపెట్టింది ఆనాడు.

మార్కెట్ ధర రోజు, రోజుకూ పెరిగి ఒక సంతృప్తికరమైన గిట్టుబాటు ధర రైతులకు లభింపచేయడం జరిగిందని మనవి చేస్తున్నాను. ఈ సంవత్సరం, వచ్చే సంవత్సరం ధరలు రూ.165లకు తక్కువకాకుండా ఉండాలి. మధ్యరకం రూ.167లు, మేలురకం రూ.170లకు ప్రభుత్వం ముట్టచెప్పే విధానాన్ని ఆలోచించమని కేంద్ర ప్రభుత్వానికి రెకమెండ్ చేయడం

జరిగింది. ముఖ్యంగా అహర్నిశలు కష్టపడి రెక్కలు, ముక్కలు చేసుకుంటూ దేశానికి ఇంత కూడు పెడుతున్న రైతులకు సరైన గిట్టుబాటు ధర లభింపచేయడం ప్రభుత్వం ధ్యేయమని మనవిచేస్తున్నాను.

హొటల్స్ సంగతి గౌరవసభ్యులు సూచన చేసారు. అన్నపూర్ణా క్యాంటిన్స్ ఇంకా కొన్ని ఓపెన్ చేయాల్సినవి ఉన్నాయి. సామాన్యంగా ఈనాడు హొటల్స్‌లో ఒక టిఫిన్ తీసుకోవడంకానీ, కాఫీ తీసుకోవడంకానీ నిత్యావసరం అయిపోయిన సందర్భంలో కనీసం నాలుగు వస్తువులైనా పేదవారికి తినే అవకాశాన్ని కల్పించడం ప్రభుత్వ ఉద్దేశ్యంగా నేను ఈ కాఫీ హొటల్ వారికి మనవిచేయడం జరిగింది. ఏదో ప్లేట్ భోజనం చాలినా, చాలకపోయినా ఏదో వాళ్ళకువున్న ఆర్థిక విధానంలో వారికి ఉన్న పేదరికంలో సరిపెట్టుకుంటారు. ఆ విధంగా వాళ్ళకు ఏదన్నా కొంచెం ఆసరా కల్పిస్తే సహాయం చేసినట్లు అవుతుంది. పుణ్యం, పురుషార్థం కలిసివస్తాయి. కాబట్టి హొటల్ వారిని ప్రభుత్వంతో సహకరించమని చెప్పడం జరిగింది. ఏ విధంగా అయినా కొంత అవకతవకలు ఉంటున్నవి. అన్నీ అనుకున్నట్లు జరగడం లేదు. కాబట్టి పునరాలోచన చేసే విషయంకూడా ప్రభుత్వం ఆలోచన చేస్తున్నది. ప్రత్యేమైన సమయంలో కాకుండా ఏదో 10 గంటలు దాటిన తరువాత మామూలు పరిస్థితికి పోకుండా ఆ వస్తువులు పూర్తిగా పరిపూర్ణంగా రోజంతాకూడా అదే ధరకు అమ్మే విధానంకూడా ఆలోచించాలని గౌరవ సభ్యులు వెంకయ్యనాయుడుగారు చేసిన సూచన విషయంలో మరొకసారి పునఃపరిశీలన చేయడం జరుగుతుందని, ఏదైనాసరే ఒక సంతుష్టికరమైన విధానం అవలంబించడం జరుగుతుందని వారికి మనవిచేస్తున్నాను. ముఖ్యంగా ధరలు పెరుగుతున్నవి. బియ్యానికి ధర పెరుగుతున్నదంటున్నారు. కానీ ఈనాడు పేపర్లలో చూస్తే బియ్యం ధర పడిపోయింది పెరగడంలేదని ఉంది. ప్రత్యేకంగా పాతబియ్యం కొనుక్కోవాలని ఆలోచిస్తే తప్ప మామూలు బియ్యం కొనాలంటే రూ. 3 ల లోపుకానీ, రూ. 2. 80, రూ. 2. 85లకు ఈనాడు బియ్యం దొరుకుతున్నవి.

**ఈనాడు హొటల్స్‌లో ఒక టిఫిన్ తీసుకోవడంకానీ, కాఫీ తీసుకోవడంకానీ నిత్యావసరం అయిపోయిన సందర్భంలో కనీసం నాలుగు వస్తువులైనా పేదవారికి తినే అవకాశాన్ని కల్పించడం ప్రభుత్వ ఉద్దేశ్యంగా నేను ఈ కాఫీ హొటల్ వారికి మనవిచేయడం జరిగింది. ఏదో ప్లేట్ భోజనం చాలినా, చాలకపోయినా ఏదో వాళ్ళకువున్న ఆర్థిక విధానంలో వారికి ఉన్న పేదరికంలో సరిపెట్టుకుంటారు.**

ఈ ధరల విషయం వచ్చినపుడు ముఖ్యంగా యూనియన్ ప్రభుత్వం మనకు సహకరించకపోవడం ఒక విధానమని తెలియజేస్తున్నాను. రూ. 2లకు కిలో బియ్యం విధానం బీద ప్రజలకు ఉద్దేశించబడింది. ఎవరైతే కడుపునిండుగా తినలేక కాలే కడుపులతో అలమటిస్తున్నారో వాళ్ళకోసం ఉద్దేశించబడింది. ఎన్నిసార్లు చెప్పినప్పటికీ కూడా కేంద్రం ఈ

రోజున లెవీ బియ్యం ఇష్యూరేటు రూ.20లు పెంచడంతో రూ.2-20 పైసలు కేవలం ఇంకొక 20 పైసలు కిలోకి పెరిగిందంటే ఈ రోజున అది ఎంతో దారుణమైన విషయం. ఈ విషయంలో కొంతవరకు బాధను ద్రిగమింగి ఊరుకోవలసి వస్తున్నది. కేంద్ర ప్రభుత్వమవలంబించే విధానానికి నా అసంతృప్తిని తెలియజేస్తున్నాము. బాధను వ్యక్తం చేస్తున్నాను. లెవీ బియ్యాన్ని ఎక్కువ తీసుకొంటామంటే 50 పర్సంట్ కంటే ఎక్కువ తీసుకొనడానికి వీలులేదన్నారు. 19 లక్షల టన్నులు మనకు ఆవసరము ఉండగా కేవలం 10 లక్షల టన్నులు లెవీ నుంచి తీసుకొనడానికి ఒప్పుకున్నారు.

మిగతా బియ్యము ఓపెన్ మార్కెట్ నుంచి కొనుక్కోవలసి ఉంటుంది. ఈ విధానము జయప్రదము కావాలి. 104 కోట్లు ప్రభుత్వం సబ్సిడైజ్ చేయవలసి వస్తున్నది. సక్రమముగా చేయాలనేది ప్రభుత్వ ఉద్దేశ్యము. జనతా ప్రభుత్వ కాలములో కంట్రోల్స్ తీసివేశారని వెంకయ్యనాయుడుగారు చెప్పారు. దేశమంతా ఒకే విధానమును అవలంబిస్తే బాగుంటుంది. మనము కంట్రోల్స్ తీసివేసినంత మాత్రాన ధరలు అదుపులో ఉండవు. దేశమంతా కంట్రోల్స్ తీసివేసి మామూలుగా ఉండేటట్లు చేస్తే జయప్రదముగా సాగుతుంది. మన రాష్ట్రంలో కంట్రోల్స్ తీసివేస్తే ఇతర రాష్ట్రాలకు తరలించి అక్కడ ఎక్కువ ధరకు అమ్ముకొనే అవకాశం ఉంటుంది. దీనివల్ల ఇక్కడ ఇబ్బంది ఏర్పడుతుంది. ధరలు పెరుగుతాయి. అందువల్ల కంట్రోల్స్ తీసివేసే విధానము గురించి ప్రభుత్వం ఆలోచించడంలేదని మనవిచేస్తున్నాను. కిలో రెండు రూపాయల బియ్యాన్ని అందరికీ అందచేయాలన్నారు. ఉద్దేశ్యము బాగానే ఉంది. ఆచరణలో పెట్టడం సాధ్యము కాదు. ఒక కోటి 30 లక్షల కుటుంబాలకు ఇస్తుంటేనే ఇంత అవుతున్నప్పుడు అందరికీ ఇస్తే ఎంత డబ్బు అవుతుందో ఆలోచించండి. ఏ విధంగా పూడ్చుకోగలుగుతామనేది ఆలోచించండి. కేవలము ఏదో ఆవేశముతో అనుకొనే విధానము కానీ నిజానికి సాధ్యపడే విషయం కాదు.

ఇప్పుడు కార్డులున్న వారికి ఇవ్వగలిగితే కొంతైనా మానవత్వముతో విజయాన్ని సాధించినట్లే అవుతుంది. నెల్లూరులో వచ్చిన వరదల మూలముగా రంగుపోయిన ధాన్యము విషయంలో ప్రభుత్వం చెప్పిన మాటను ఆచరించడం లేదని చెప్పారు. నా విచారాన్ని వ్యక్తము చేస్తున్నాను. ఎక్కువ శ్రద్ధ తీసుకోవడం జరుగుతుంది. ఎగుమతికి రైతులకు పర్మిట్స్ ఇవ్వడం, ఇతర రాష్ట్రాలనుంచి వచ్చేవారికి అవకాశం కల్గించడం జరుగుతుంది. ఉప్పుడు బియ్యానికి వాడుకొనేవారికి అవకాశం ఉంటుంది కాబట్టి ఎక్కువ శ్రద్ధ తీసుకొని రైతులకు ఇబ్బంది లేకుండా చేస్తాము. 20 వేల టన్నుల ధాన్యానికి, 15 వేల టన్నుల బియ్యానికి పర్మిట్స్ ఇవ్వడం జరిగింది. దీనిలో 2 వేల టన్నుల ధాన్యము ఇతర రాష్ట్రాలకు పంపించారు. 50 పర్సంట్ లెవీ ఇవ్వాలన్నప్పుడు 50 పర్సంట్ లెవీ తీసుకోకుండా ధాన్యాన్ని తమిళనాడులో అమ్ముకొనే అవకాశాన్ని కల్పించాలని తమిళనాడు ముఖ్యమంత్రిగారిని కోరినపుడు వారు దానిని ఆమోదించి లెవీ ఏమీ

లేకుండా ఈ ధాన్యాన్ని విడిగా అమ్ముకొనే అవకాశాన్ని కల్పించడం జరిగింది. ఇది హర్షించదగిన విషయం. సదరన్ చీఫ్ సెక్రటరీల సమావేశము జరిగినపుడు శ్రావణకుమార్ గారు 9వ తేదీన అక్కడకు వెళ్ళడం జరిగింది. ధాన్యము రవాణా విషయములో బియ్యము రవాణా విషయంలో ఎక్కువ శ్రద్ధ చూపాలి. మా వర్తకులు మీ వర్తకులు తెచ్చుకొనే విధానమును అంగీకరించాలంటే తప్పకుండా ఆలోచిస్తామని వారు అన్నారు. మనము ఉప్పుడు బియ్యాన్ని తినము, అక్కడ వాడే అలవాటు ఉంది.

కాబట్టి ధాన్యానికి రంగు తగ్గినా పరవాలేదు. అందుబాటు ధరకు దొరుకుతుంది కాబట్టి వారు ఆలోచిస్తామని చెప్పడం జరిగింది. దీనిని పట్టుదలతో ప్రయత్నం చేస్తాము. రాఘవరెడ్డిగారు ఈ ప్రభుత్వ విధానాలను సరిగా గుర్తించి హర్షించినందుకు ప్రత్యేకముగా వారికి అభినందనలు తెలియజేస్తున్నాను. 100 కోట్లు అప్పు 12 పర్సంట్ వడ్డీకి కాకుండా 18 పర్సంట్ వ్యాపారస్తుల వడ్డీకి ఇవ్వడం వల్ల ఎక్కువ ఇబ్బంది కలుగుతున్నది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకురావడం అవసరమనుకొంటాను. 100 కోట్లు ఉదారముగా ఇచ్చినందుకు వారికి అభినందనలు తెలియచేస్తున్నాను. నూనెలు మనకు 13,500 టన్నులు కావలసివుండగా కేవలము 5, 6 వేల టన్నులు మాత్రమే అందుతున్నాయి. ఒక లక్షా 30 వేల కార్డులకు నెలకు 1 కిలో చొప్పున ఇవ్వాలంటే 13,500 టన్నుల నూనె కావాలి. దానికి 6 వేల టన్నులు వస్తున్నపుడు ఇబ్బందిగా ఉంటుంది. రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చేయాలి. వేరుశెనగ పండించిన రైతు 20 బస్తాల వేరుశెనగను ఇతర రాష్ట్రాలకు తీసుకువెళ్ళడానికి అవకాశమిస్తూ ప్రభుత్వం ఆర్డర్స్ ఇచ్చింది. వారికి గిట్టుబాటు ధరవస్తే సంతోషించాలి నూనె ధర కొంచెము ఎక్కువ అయింది. గుజరాత్‌లో ఈ సంవత్సరం పంట దెబ్బతిన్న కారణముగా అక్కడ నూనె ధర కొంచెము ఎక్కువ అయినది. దీనిలో 2 విషయాలున్నాయి.

వేరుశెనగను బయటకు తీసుకువెళ్ళడంపైన నిబంధన పెడితే ధరలు కంట్రోలులో ఉంటాయి. సరియైన ధర లభించదు. ఫ్రీగా తీసుకువెళ్ళడానికి పర్మిట్ చేస్తే నూనె ధర పెరుగుతుంది. అటు రైతు, ఇటు కన్‌జ్యూమర్స్‌కు ఇబ్బంది లేకుండా పరిష్కార మార్గము చూడవలసివుంది. సోయాబీన్, ఇతర నూనెలకు సంబంధించి కోటాను పెంచే విషయంలో కేంద్ర ప్రభుత్వముపైన ఒత్తిడి తీసుకువస్తాము. అటు ఉత్పత్తిదారు, ఇటు కన్‌జ్యూమర్స్ యొక్క ప్రయోజనమును కాపాడే విధంగా ధరలను అదుపులో ఉంచడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. ఎంతో విలువైన సలహాలు ఇచ్చినందుకు గౌరవ సభ్యులకు మరొకసారి నా హృదయపూర్వకమైన ధన్యవాదాలు తెలియచేస్తూ సెలవు తీసుకొంటున్నాను.

◆◆

జూన్ 25, 1984

## మాతృభూమి రుణం తీర్చుకోమని ప్రవాసాంధ్రులను కోరాను

*(అమెరికా పర్యటనపై ముఖ్యమంత్రి ప్రకటన)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, అనేకమంది భారతీయులు భారత సంతతి ప్రజలు విదేశాల్లో ఉంటున్నారు. ప్రస్తుతం విదేశాల్లో అటువంటి భారతీయులు సుమారు ఒక కోటి మందివరకు ఉన్నారని అంచనా. విదేశాల్లో ఉంటున్న భారతీయుల్లో కొంతమంది భారతదేశానికి తిరిగి వచ్చేయాలని, ఏ వ్యాపారాన్నో, ఏ పరిశ్రమనో స్వంతంగా ఏర్పాటు చేసుకోవాలని చాలా ఆసక్తితో ఉన్నారు. విదేశాల్లోని భారతీయుల నుండి, ముఖ్యంగా అమెరికాలోని భారతీయుల నుండి విడివిడిగా సంస్థల ద్వారా నాకు ఉత్తరాలు వస్తున్నాయి. నన్ను వారి దేశానికి రమ్మని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక ప్రగతికృషిలో తాము కూడా పాలు పంచుకోవడానికి అవకాశాలు కల్పించమని ఉత్తరాలు, విజ్ఞప్తులు అనేకం నాకు అందుతున్నాయి.

ఈ ఆహ్వానాలను దృష్టిలోవుంచుకొని, మన రాష్ట్రం యొక్క సత్వర సాంఘిక, ఆర్థికాభివృద్ధికి వనరులను సమీకరించవలసిన అవసరాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ నుంచి వెళ్లిన వారు అత్యధిక సంఖ్యలో ఉన్న అమెరికా దేశాన్ని సందర్శించాలని ఆలోచించాను. రాష్ట్ర అవసరాలను, అమెరికాలోని భారతీయుల వనరులను వారి ఆర్థికమైనవేకాక సాంకేతికపరమైన, యాజమాన్యపరమైన శక్తిసామర్థ్యాలను – రాష్ట్రాభివృద్ధికి క్రోడీకరించుకోడానికి, సమన్వయ పరచడానికి ఈ పర్యటన ఉద్దేశించబడింది. కేవలం పరిశ్రమల స్థాపనకే ఈ పర్యటన పరిమితం కాలేదు. వైద్య ఆరోగ్య రంగాలకు, విద్యా రంగానికి, గ్రామీణాభివృద్ధికి, సాంస్కృతిక వ్యవహారాలకు సంబంధించిన రంగాలకు కూడా విస్తరింపజేయడం ఈ పర్యటన ఉద్దేశం.

పరిశ్రమలశాఖ కార్యదర్శి శ్రీ టి.యల్. శంకర్, ఐ.ఏ.ఎస్., ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శ్రీ యు.బి. రాఘవేంద్రరావు, ఐ.ఏ.ఎస్., నేరపరిశోధక విభాగం డి.ఐ.జి. శ్రీ వి. అప్పారావు, ఐ.పి.యస్., ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సహాయ సంస్థ అధ్యక్షులు శ్రీ బి. రామయ్య, ఆంధ్రప్రదేశ్

పారిశ్రామిక అభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ డా. పి. యల్ సంజీవరెడ్డి, ఐ.ఎ.ఎస్. ఫ్యాప్సీ అధ్యక్షులు శ్రీ డి. సీతారామయ్య, ఫెడరేషన్ ప్రతినిధులు మరికొంత మంది నా ఆధ్వర్యంలో 1984 జూన్ 6వ తేదీన అమెరికా పర్యటన సందర్భంగా హైదరాబాద్ నుండి బొంబాయికి బయలుదేరాం.

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అవకాశాలను గుర్తించి, అమలు జరపడానికి కొన్ని నిర్దిష్టమైన ప్రతిపాదనలను రూపొందించడానికి గాను 1984 జూన్ 8, 9 తేదీలలో పిట్స్‌బర్గ్‌లో అమెరికాలోని తెలుగు శాస్త్రవేత్తల తొలి సదస్సుకు ప్రారంభోత్సవంతో ఈ ఉత్తర అమెరికా పర్యటనకు శ్రీకారం చుట్టినట్టయింది. అమెరికాలోని భారతీయ శాస్త్రవేత్తలకు, వారి కుటుంబాలకు భారత ప్రజల తరఫున, మన ఆంధ్రప్రదేశ్ ఆరుకోట్ల ప్రజానీకం తరపున శుభాకాంక్షలను తెలియజేస్తూ, అమెరికాలోని భారతీయ ప్రజలను, ముఖ్యంగా అక్కడి తెలుగువారిని తమ సాంకేతిక, ఆర్థిక, యాజమాన్య వనరులను వినియోగించి తద్వారా రాష్ట్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలలో పాలు పంచుకోవలసిందిగా విజ్ఞప్తి చేశాను. కోకొల్లలుగా హామీలను ఇవ్వడానికి గానీ లేదా కోకొల్లలుగా రూపాయల్నీ, డాలర్లను మోసుకుపోవడానికి నేను అమెరికాకు రాలేదని విస్పష్టంగా అక్కడివారికి తెలియజేశాను. విదేశాల్లోని భారతీయులను ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి ఉత్పత్తిదాయకమైన పరిశ్రమలు వంటి వాటిలో పెట్టుబడులు పెట్టమని అడిగానంటే, ఈనాడు వారు ఈ స్థితికి రావడానికి దోహదం చేసిన తమ మాతృభూమి రుణం తీర్చుకోమని, రాష్ట్రంతో ప్రయోజనకరమైన సంబంధ బాంధవ్యాన్ని పునఃప్రతిష్ఠించుకోమని మాత్రమే అడుగుతున్నానని వారికి చెప్పాను.

రాష్ట్ర సత్వర పారిశ్రామికీకరణ, పేదరిక నిర్మూలన, పరిశ్రమల వికేంద్రీకరణ, యువజనులకు ఉపాధి సౌకర్యాల కల్పనకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ విధానాలను నేను నా ప్రారంభోపన్యాసంలో స్పష్టంగా వివరించాను. విదేశాల్లోని భారతీయులు తీసుకొనే చొరవకు ప్రోత్సాహకారిగా ఉండే విధంగా శీఘ్రంగా, శక్తివంతంగా ప్రయోజనకరంగా ప్రభుత్వం సహకరించేందుకు చేసిన సంస్థాగతమైన మార్పులను గూర్చి వారికి వివరించాను. ఆసక్తివున్న వారి కోసమని వివిధ విషయ వివరణ పత్రాలను అందజేశాం. అవి.. గడిచిన పాతికేళ్ళలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన పారిశ్రామిక అభివృద్ధిని వివరిస్తూ, విదేశాల్లోని భారతీయులు ఇక్కడ ఉన్నత సాంకేతికపరమైన పరిశ్రమ నెలకొల్పడానికి గల అవకాశాలను తెలియపరుస్తూ ముద్రించిన ఆంధ్రప్రదేశ్ పై చిన్న పుస్తకం; ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి సంస్థ కార్యకలాపాలను వివరిస్తూ ఒక చిన్న పుస్తకం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సహాయసంస్థ కార్యకలాపాలను వివరిస్తూ ఒక చిన్న పుస్తకం; “ఎన్‌రిచ్” కార్యకలాపాలను వివరిస్తూ ఒక చిన్న పుస్తకం; ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యకలాపాలను వివరిస్తూ ఒక చిన్న పుస్తకం;

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక వ్యవస్థలను ఏర్పాటు చేయడంలో సాంకేతిక విజ్ఞానాన్ని బదలాయించడానికి సంబంధించి విదేశాల్లో భారతీయులకు ఆసక్తి ఉండగల 138 ప్రాజెక్టులకు సంబంధించిన వివరణ సమాచారాలు.

వైద్య ఆరోగ్య రంగాలకు సంబంధించి విదేశాల్లోని భారతీయులు తోడ్పడడానికి వీలైన వివిధ పథకాలను వివరించే ఒక చిన్న పుస్తకం; విద్యారంగానికి సంబంధించి విదేశాల్లోని భారతీయుల తోడ్పాటు అవసరమయ్యే వివిధ పథకాలను గూర్చి వివరించే ఒక చిన్న పుస్తకం. ఈ ముద్రిత ప్రచురణలను ఆసక్తిగల విదేశాల్లోని భారతీయులకు అందజేయడం జరిగింది. గడచిన పాతికేళ్ళలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన పారిశ్రామికాభివృద్ధిని, విదేశాల్లోని భారతీయులకు ఇక్కడ లభించే పారిశ్రామిక అవకాశాలనూ వివరించే ఒక ఫిల్మును కొన్ని ఎంపిక చేసిన కేంద్రాలలో ప్రదర్శించడం జరిగింది. విదేశాల్లోని భారతీయులు చేపట్టదలచిన ప్రాజెక్టుకు సంబంధించి, పెట్టదలచుకొన్న పెట్టుబడులకు సంబంధించి స్థూలంగా వివరాలు తెలియపరిచే పత్రాన్ని నింపి అందించవలసిందిగా ఆసక్తిగల వారిని కోరాం. ఈ విధంగా వచ్చిన సమాచారాన్ని సూక్ష్మంగా పరిశీలన చేయడానికిగాను, కంప్యూటరైజ్ చేసి పారిశ్రామికాభివృద్ధి సంస్థలకు అందజేసి పరిశ్రమలశాఖ కార్యదర్శి అజమాయిషీలో తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

**వైద్య ఆరోగ్య రంగాలకు సంబంధించి విదేశాల్లోని భారతీయులు తోడ్పడడానికి వీలైన వివిధ పథకాలను వివరించే ఒక చిన్న పుస్తకం; విద్యారంగానికి సంబధించి విదేశాల్లోని భారతీయుల తోడ్పాటు అవసరమయ్యే వివిధ పథకాలను గూర్చి వివరించే ఒక చిన్న పుస్తకం; ఈ ముద్రిత ప్రచురణలను ఆసక్తిగల విదేశాల్లోని భారతీయులకు అందజేయడం జరిగింది.**

అక్కడి సమావేశాల్లో కొన్ని అంశాలనుగూర్చి అక్కడి భారతీయులు ప్రభుత్వ వివరణలు అడిగారు. అవి: ప్రభుత్వ యంత్రాంగంలో మందకొడితనం కారణంగా ప్రాజెక్టులను అమలు జరపడంలో ఆలస్యం, తద్వారా ఖర్చులు పెరగడానికి సంబంధించిన అపోహలను వారు వెలిబుచ్చారు. ప్రారంభ పెట్టుబడి, పెట్టుబడి రుణం మొదలైన వాటి కోసం పారిశ్రామిక ఆర్థిక సహాయ సంస్థలు, తదితర సాధారణ ఆర్థిక సహాయ సంస్థల నుంచి లభించే రుణ సౌకర్యానికి సంబంధించిన వివరాలను గూర్చి వారు అడిగారు. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త పరిశ్రమల స్థాపనకు ఇచ్చే ఆర్థికపరమైన ప్రోత్సాహక సహాయాలను గూర్చి వారు తెలుసుకోదలచారు. స్థలం, నీరు, విద్యుచ్ఛక్తి, సాంకేతికవేత్తలు, మొదలైన వాటికి సంబంధించి లభించే ప్రాతిపదిక సౌకర్యాలను గూర్చి అడిగారు. హైదరాబాద్ విమానాశ్రయాన్ని అంతర్జాతీయ విమానాశ్రయంగా చేయాలని, విశాఖపట్టణాన్ని స్వేచ్ఛా వాణిజ్య మండలంగా చేయాలని విదేశాల్లోని భారతీయులు ప్రధానంగా కోరారు. రిజిస్ట్రేషన్, పారిశ్రామిక లైసెన్సులు, కేంద్ర ఆమోదాలు వంటి వాటి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చేసే ప్రతిపాదనలకు

కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అపోహను వ్యక్తంచేసి దానిపై వివరణ కోరారు. విదేశాల్లోని భారతీయులతో జరిపిన వివిధ చర్చలతో వారితో వివరంగా అన్ని విషయాలు మాట్లాడి వారి అపోహలను తొలగించడం జరిగింది. పిట్స్‌బర్గ్‌లో చర్చల అనంతరం మా ప్రతినిధి వర్గం తెలుగువారు ఎక్కువగా ఉన్న మరికొన్ని పట్టణాలను జూన్ 9వ తేదీ నుండి 21 వరకు సందర్శించింది. ఆయా పట్టణాలలో కూడా పిట్స్‌బర్గ్‌లో మాదిరిగానే చర్చలు జరిగాయి.

న్యూయార్కు, హ్యూస్టన్, శాన్ ఫ్రాన్సిస్కో, లాస్‌ఏంజిల్స్, సెయింట్ లూఈస్, చికాగో, డెట్రాయిట్ నగరాలను మా ప్రతినిధి వర్గం సందర్శించింది. పిట్స్‌బర్గ్‌తో సహా ఈ ప్రాంతాలన్నిటిలో కూడా మన రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టడానికి ఆసక్తిగలవారు సుమారు 650 మంది చర్చా సమావేశాలకు హాజరయ్యారు. వారు నింపి ఇచ్చిన అంగీకార పత్రాలను ప్రతినిధి వర్గంలోని అధికార బృందం ప్రాథమికంగా పరిశీలించి, ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలను నెలకొల్పడానికి గట్టి పట్టుదలతో, ఆసక్తితో వున్న వారిని 172 మందిని గుర్తించింది.

**ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలను నెలకొల్పడానికి గట్టి పట్టుదలతో, ఆసక్తితో వున్న వారిని 172 మందిని గుర్తించింది. ఫైబర్, రెగ్జిన్ పరికరాలు, జర్మన్ సాంకేతిక పరిజ్ఞానంతో అత్యధిక ఉష్ణోగ్రతకు తట్టుకొనే పెయింట్లు, నాన్ డెయిరీ క్రీమర్లు, ఫుడ్ ప్రాసెసింగ్ కంప్యూటర్ సబ్ సిస్టమ్, సాఫ్ట్‌వేర్ రీసెర్చ్ ఆయిల్ ఫైడ్ కెమికల్స్ తయారీ మొదలైన వాటికీ సంబంధించిన ప్రాజెక్టులు ఈ ప్రతిపాదనల్లో ఉన్నాయి.**

ఫైబర్, రెగ్జిన్ పరికరాలు, జర్మన్ సాంకేతిక పరిజ్ఞానంతో అత్యధిక ఉష్ణోగ్రతకు తట్టుకొనే పెయింట్లు, నాన్ డెయిరీ క్రీమర్లు, ఫుడ్ ప్రాసెసింగ్ కంప్యూటర్ సబ్ సిస్టమ్, సాఫ్ట్‌వేర్ రీసెర్చ్ ఆయిల్ ఫైడ్ కెమికల్స్ తయారీ మొదలైన వాటికి సంబంధించిన ప్రాజెక్టులు ఈ అమెరికా భారతీయులు చేసిన ప్రతిపాదనల్లో ఉన్నాయి.

రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ పరిశ్రమను అభివృద్ధి చేయాలన్న మన లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని మా ప్రతినిధివర్గం ప్రపంచంలోని ఎలక్ట్రానిక్స్ పరిశ్రమకు ప్రసిద్ధికెక్కిన కాలిఫోర్నియా రాష్ట్రంలోని శాన్ ఫ్రాన్సిస్కో వద్దగల సిలికాన్ వ్యాలీని సందర్శించింది. శాన్ ఫ్రాన్సిస్కోలో హెవ్‌లెట్ పేకార్డ్స్ వారి కంప్యూటర్ తయారీ విభాగాన్నీ, వారి పరిశోధన అభివృద్ధి విభాగాల్ని మేము సందర్శించాం. భారతదేశం నుంచి వచ్చిన ఒక యువ పారిశ్రామికవేత్త నెలకొల్పిన భారీ సాంకేతిక విజ్ఞానం అవసరమయ్యే పరిశ్రమలను మేము సందర్శించాం. మోడ్యులర్ సెమి కండక్టర్లు సిలికాన్ చిప్స్ తయారు చేసే పరిశ్రమలు ఇవి. ఆ తరువాత కూపర్టినో టౌన్ హాలులో చర్చలు జరిగాయి. అక్కడ మేయరు ముఖ్యమంత్రికి స్వాగతం చెప్పారు. చర్చల సందర్భంగా పరిశ్రమల్ని స్థాపించడానికి సంబంధించి నిర్దిష్టమైన ప్రతిపాదనలను పరిశీలించడం జరిగింది. టెలీ కమ్యూనికేషన్స్ పరికరాల తయారీకి సౌకర్యాలను కల్పించడం, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఉత్పత్తికి ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయడం, మైక్రోవేవ్ ఓవెన్స్, రోబట్స్

ఫ్లాపీడిస్కులు, కంప్యూటర్ మాడ్యూల్స్, మెమరీ చిప్స్, కేబుల్ కేరియర్ సిస్టమ్స్ మొదలైన వాటిని తయారు చేయడం వంటి అంశాలకు సంబంధించిన ప్రతిపాదనలు ఇందులో ఉన్నాయి.

చికాగోలో జూన్ 18వ తేదిని "ఆంధ్రప్రదేశ్ దినోత్సవంగా" చికాగో మేయర్ ప్రకటించారు. డెట్రాయిట్‌లో ఫోర్డ్ వారి కార్ల తయారీ కర్మాగారాన్ని మా ప్రతినిధి వర్గం సందర్శించింది. వైద్య ఆరోగ్యరంగంలో ముఖ్యమైన పథకాలను ప్రకటించడం జరిగింది. పిట్స్‌బర్గ్ సమావేశంలో భారత – అమెరికా వైద్య నిపుణుల మార్పిడి కార్యక్రమాన్ని ఆరంభించి, కొనసాగించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను సమావేశం ఆమోదించింది. ఈ పథకం క్రింద అమెరికాలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలనుండి, వైద్య కేంద్రాలనుండి అక్కడి భారతీయ వైద్య నిపుణులు రాష్ట్రానికి ఎప్పటికప్పుడు వచ్చి ఇక్కడ పోస్టుగ్రాడ్యుయేట్ బోధనా కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉంటారు. ఈ వైద్య నిపుణులు వైద్య రంగంలో అభివృద్ధికి సంబంధించిన అంశాలను ప్రదర్శనాపూర్వకంగా వివరిస్తూ ఉంటారు. ఉదాహరణకు ఇన్వేజివ్, నాన్ ఇన్వేజివ్ కార్డియాలజీ, రీనల్ డయాలిసిస్ కార్డియో థొరాసిక్ సర్జరీ, న్యూరాలజీ, రేడియోలజీ వంటి అనేక విషయాలపై కొత్త కొత్త పరిశోధన ఫలితాలను వివరిస్తూ ఉంటారు. బోధనేతర విభాగాలలో వైద్య నిపుణులు – అంటే ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేసే డాక్టర్లను, ప్రైవేటుగా ప్రాక్టీసు చేసే డాక్టర్లకు అమెరికాలోని శాస్త్రవేత్తల సంఘం – వర్క్‌షాపులను, సదస్సులను నిర్వహిస్తుంది. ఆయా విభాగాలలో నైపుణ్యం సంపాదించడానికి ఆంధ్రప్రదేశ్ నుంచి వైద్యనిపుణులను అమెరికాకు పంపించడం కూడా ఈ కార్యక్రమంలో ఒక అంశం. అమెరికా పర్యటనకు వెళ్లే వైద్య నిపుణులు ప్రభుత్వ అతిథులుగా పరిగణింపబడతారు.

విదేశాలలోని భారతీయులు సహకరించడానికి ఉద్దేశించిన మరో రంగం– విద్యకు సంబంధించిన పరికరాలు, సాంకేతిక నైపుణ్యాలను మార్పిడి చేసుకోడానికి సంబంధించినది. వైద్య పుస్తకాలు, వైద్యరంగానికి సంబంధించిన ఉన్నత ప్రమాణాలు గల పత్రికలు తత్సంబంధిత ఫిల్మ్ టేపులువంటి వాటిని రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లోనే గ్రంథాలయాలకు అమెరికాలోని తెలుగుశాస్త్రవేత్తల సంఘం అందజేస్తుంది. ఎండోస్కోపీ పరికరాలు, అల్ట్రా సౌండ్ అండ్ పేస్‌మేకర్ పరికరాలు మొదలైన ఆధునిక పరికరాలను కూడా ఈ సంఘం విరాళంగా అందజేసే ఏర్పాట్లు చేస్తుంది. హైదరాబాద్‌లో వైద్య పరిశోధన, శిక్షణకోసం ఒక అంతర్జాతీయ కేంద్రం ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను షేర్ సంస్థ – అంటే సైన్స్ అండ్ హెల్త్ అప్లయిడ్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ అనే ఒక వైద్య పరిశోధన సంస్థ అందజేసింది. ఇక్కడ అభివృద్ధి చెందిన దేశాలకు సంబంధించిన నిపుణులు అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి వచ్చిన వైద్యరంగంలోని వ్యక్తులకు శిక్షణ ఇస్తారు. ఈ కేంద్రం శిక్షణతోపాటు అధునాతన వైద్య సేవలను అందించడమేకాక వైద్య రంగంలో పరిశోధనలను కూడా చేపట్టుతుంది. ప్రారంభంలో ఇక్కడ 250 పడకలు ఉంటాయి.

న్యూయార్క్‌లో రోచెస్టర్ మెడికల్ సెంటర్ యూనివర్సిటీకి చెందిన కార్నియా రీసెర్చ్ లేబొరేటరీ అసోసియేట్ డైరెక్టరూ, ఆప్తమాలజీ అసోసియేట్ క్లినికల్ ప్రొఫెసర్ అయిన డా. గుళ్లపల్లి ఎన్. రావు గారు ఇంకా మరికొంత మంది ప్రముఖ నేత్ర శస్త్రచికిత్సా నిపుణులు అత్యంత అధునాతన సేవలతో కూడిన 2000 పడకల నేత్ర వైద్యశాల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను అందజేశారు. ఈ ప్రతిపాదనలో అంధుల కోసం ఒక పాఠశాలను ఏర్పాటు చేయడం కూడా ఉంది. విద్యా రంగానికి సంబంధించి రెండు ప్రతిపాదనలు అందాయి. ఒకటి పిట్స్‌బర్గ్ విశ్వవిద్యాలయం నుండి, మరొకటి ఈస్టర్న్ మిచిగన్ విశ్వవిద్యాలయం నుండి. పిట్స్‌బర్గ్ విశ్వవిద్యాలయం చేసిన ప్రతిపాదనలో ఉన్నత విద్య, సైన్సు, సాంకేతిక విజ్ఞానం విషయాలలో పిట్స్‌బర్గ్ విశ్వ విద్యాలయానికి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మధ్య సన్నిహిత సహకారానికి సంబంధించినది. ఉన్నతవిద్య అందుబాటులోకి తేవడం, కొత్త కొత్త ప్రయోగాలను ప్రవేశ పెట్టడం, సాంకేతిక విషయాలలో సాధించిన పురోగతి వల్ల బోధన, పరిశోధన వ్యక్తులు, బోధనావృత్తిలో అధ్యాపకులు విషయం నుంచి వేరుపడిపోకుండా చూడడం, ఆంధ్రపదేశ్‌లోని శాస్త్రవేత్తలకు, ప్రపంచంలోని శాస్త్రవేత్తలకు సాన్నిహిత్యాన్ని, పెంపొందించే ఏర్పాట్లు చేయడం - ఇవి ఈ విశ్వవిద్యాలయం చేసిన ప్రతిపాదనలోని ముఖ్యాంశాలు, ఉన్నత పాఠశాల విద్యకు సంబంధించి వృత్తిపరమైన కోర్సులలో పాఠ్యాంశాలను మెరుగుపరచడానికి, వీడియో కేసట్లు మొదలైన వాటిద్వారా బోధనకు మెరుగుపరచడానికి అధ్యాపకులకు శిక్షణ ఇవ్వడానికి సంబంధించి ఈస్టర్న్ మిచిగన్ విశ్వవిద్యాలయం ప్రతిపాదనలు చేసింది.

పెప్పర్ డైన్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ నార్వెల్ యంగ్‌ను శాన్ ఫ్రాన్సిస్కోలోని మలిబులో నేను కలుసుకొన్నాను. ఉన్నత విద్యా రంగంలో ఇక్కడి మన విద్యాసంస్థలతో ఆ విశ్వవిద్యాలయం సహకరించడానికి ఆయన ఎంతో ఆసక్తి కనబరిచారు. జూన్ 21 వ తేదీన న్యూయార్కు నుంచి బొంబాయి మీదుగా హైదరాబాద్‌కు బయలుదేరడంతో మా అమెరికా పర్యటన ముగిసింది. 23 వ తేదీన హైదరాబాద్‌కు చేరుకున్నాం. మా ప్రతినిధి వర్గం అమెరికా పర్యటనకు అక్కడి భారతీ-యుల నుండి ముఖ్యంగా తెలుగు వారినుండి అనుకున్న దానికన్నా మించిన ప్రోత్సాహం లభించిందని తెలియజేయడానికి నాకెంతో సంతోషంగా ఉంది. మేము వెళ్లిన ప్రతి చోటా అసంఖ్యాకంగా ప్రజలు వచ్చారు. అక్కడి భారతీయుల ఉత్సాహాభినివేశాలు, పరిశ్రమల స్థాపనలో చూపిన ఆసక్తి ఎంతో ప్రోత్సాహకరంగా ఉన్నాయి. అమెరికాలోని భారతీయులు, ముఖ్యంగా తెలుగువారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభ్యుదయానికి గణనీయమైన విధంగా పారిశ్రామిక వ్యవస్థానిర్మాణ కృషిలో మనతో పాటు భాగస్వాములై పాలుపంచుకోగలరని నా దృఢవిశ్వాసం.

◆◆

జూన్ 29, 1984

# ఒక కప్పు కాఫీ కోసం కూడా ఒక్క పైసా అక్కడ ఖర్చుచేయలేదు

*(తన అమెరికా పర్యటనపై జరిగిన చర్చకు బదులిస్తూ చేసిన ప్రసంగం)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, సోదరీ సోదరులకు ఇతర ఇక్కడున్న అధికారవర్గానికి నా హృదయపూర్వక నమస్కారములు, ఎంతో చక్కగా ఉదాత్తంగా మాట్లాడారు. అందరికీ నా నమస్కారములు. అసలు నేను ఎందుకు వెళ్లాను. ఏ పరిస్థితిలో వెళ్ళవలసి వచ్చింది అనేటటువంటి విషయం తెలుసుకోకుండా, ఎవరో, ఎవరెవరో, వారి వారి మనసులలో ఉన్న అభిప్రాయాలనుబట్టి మాట్లాడినందుకు నా బాధను వ్యక్తం చేస్తున్నాను. నేను ఈ యాత్రకు వెళ్ళడానికి కారణం మా ప్రభుత్వం అధికారంలోకిరాగానే ఇతర దేశాలలో ఉన్న భారతీయులందరూ కూడా "ఇదొక కొత్తచరిత్రను సృష్టించారు మీరు, అసలు ఈ ఉద్వేగమైన వాతావరణం చూచి మేము అందరమూ గర్వపడుతున్నాము. దేశములో ఏదో క్రొత్తదనం వస్తుందని మేము అనుకొంటున్నాము. మా ఆలోచనలను మీతో కలపాలని అనుకొంటున్నాము కాబట్టి మీరు ఒకసారి మా దగ్గరకు రావడమో లేకపోతే మా అభిప్రాయాలను తెలుసుకొని మమ్ములను ఏవిధంగా మీరు మీ రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగించుకుంటారో మీరు రాష్ట్ర అభివృద్ధికి ఏదైనా ఆలోచన చేయమని" కోరడం జరిగిందని మీకు సవినయంగా మనవిచేస్తున్నాను. ముఖ్యంగా నేను వెళ్ళడానికి కారణం పిట్స్‌బర్గ్‌లో జరిగిన ఇండస్ట్రియల్ వర్క్‌షాప్స్ సెమినార్ – కారణం.

నాకోసం వారు రెండుసార్లు మీటింగు పోస్టుపోన్ చేసుకొన్నారు. నేను అధ్యక్షత వహిస్తానని చెప్పి, ఇతర దేశాలలో ఉన్న పారిశ్రామికవేత్తలందరూ పాల్గొనబోయే సదస్సును మీరు ప్రారంభించాలి" అని గౌరవప్రదంగా నన్ను కోరినారు. మీరు నా స్పీచ్ బహుశా చదవకుండానే ఉపన్యాసాలు చేసి ఉంటారు అనుకొంటున్నాను. I have not gone there with bag full of promiseses. Nor, I want to bring home rupees or dollars అని దానిలో చెప్పాను, "డబ్బు, డబ్బు" అని ఎందుకు అంటున్నారో నాకు అర్థము కావడంలేదు. యదార్థానికి

నాకు నిన్న, ఇవాళ ఈ సభలో కూర్చొని ఉంటే నా మైండు పిచ్చెత్తినట్లయింది. నేనే, అసలు ఏమి ఈ దురదృష్టకరము, జాతికి మన గడ్డకు ఎందుకు పట్టిందా అని అనుకొంటున్నాను. నేను డబ్బుకోసం వెళ్ళలేదు. డబ్బు తెద్దామని వెళ్ళలేదు. కేవలం వారు నన్ను హృదయపూర్వకంగా ఆహ్వానించారు. ఒక సదస్సుకు అధ్యక్షత వహించమని నన్ను కోరినారు. 'పారిశ్రామికవేత్తలతో మేము సమావేశము కాబోతున్నాము. మన దేశాన్ని గురించి ఆలోచన చేయబోతున్నాము. కాబట్టి, ఈనాడున్నటువంటి తెలుగుదేశం నాయకుడుగా మిమ్ములను రావలెనని మేము కోరుతున్నాము' అని వారు అర్థించడంవల్ల నేను వెళ్ళడం సంభవించింది. కేవలము నేను పరిశ్రమలన్నింటినీ మూటకట్టుకొని ఇక్కడకు తెద్దామని వెళ్ళలేదు. డబ్బు సంపాదించుకొని వద్దామని వెళ్ళలేదు.

కేవలం మనస్సుతో, మమకారంతో, ఆత్మీయతతో, వాత్సల్యముతో, ఒక భారతీయుడుగా నేను వెళ్ళానని సవినయంగా మనవిచేస్తున్నాను. కేవలం ఏ తెలుగువాళ్ళనో చూడలేదు. ప్రతి సమావేశములో తెలుగు వారున్నారు. ముస్లిం సోదరులు, తమిళ సోదరులు, పంజాబీ, గుజరాతీ సోదరులు ఇంకా ఎందరో సోదరులున్నారు. వారిలో నేను ఒకడిగా వెళ్ళాను. మాట్లాడడం కూడా హిందీ, ఇంగ్లీషు, తెలుగు భాషలలో జరిగింది. నేను తెలుగువాడిని నేను ప్రధానంగా భారతీయుడిని, నా దేశములో జరిగేటటువంటి ఏ విషయంలో కూడా నాకు జోక్యములేదని అనుకోవడం నా బుద్ధితక్కువ. నేను ముందే భారతీయుడిని కాబట్టి ఈ భారతదేశములో జరిగేటటువంటి ఏ సమస్యలపైనగానీ, ఏ విషయంలోగానీ నేను చెప్పించుకోనని నేనందుకే చెప్పాను. నేను ఇదే చెప్పాను అక్కడ కూడా. నేను కేవలం అక్కడ భారతదేశంలో ఒక్కడిగా మీ అందరి దగ్గరకు వచ్చాను.

ఎంతో అభిమానించారు, గౌరవించారు. మీరు కేవలం ఇక్కడకు తెచ్చింది ఈ యొక్క విద్యను, విజ్ఞానాన్నే కాదు, భారతీయ సంస్కృతిని, వికాసాన్ని కూడా మీరు అమెరికా దేశానికి తీసుకొని వచ్చారు. మీరందరూ మావారైనందుకు మేము గర్వపడుతున్నాము. సమాజములో ఈనాడు ఎంతో గౌరవప్రదమైన జీవితాన్ని భారతీయులందరూ, సుహృద్భావంతో నడుచుకొనేవారు మీరు ఒక సత్‌సాంప్రదాయాన్ని సృష్టిస్తున్నారు. మీరు ఈనాడు ఉంటున్న విధానాన్ని చూస్తూంటే నాకెంతో కన్నుల పండువుగా వుంది" అని చెప్పి, నేను ఆప్యాయతతో ఆదరణలో, మమతతో వాత్సల్యంతో మాట్లాడానుతప్ప, ఒక బిచ్చగాడిలాగా "మీరు పరిశ్రమలను తీసుకొని రండి"అనే దౌర్భాగ్యము నాకు పట్టలేదని మీకు మనవిచేస్తున్నాను. కేవలం వారు అమెరికాలో జరిగే పారిశ్రామిక సదస్సుకు నన్ను రమ్మన్నప్పుడు ఉత్త చేతులతో వెళ్ళకూడదని, ఏదైనా కార్యక్రమం మన భారతదేశానికి సంబంధించి జరుగుతున్నదని, ఆ విధంగా ఈనాడు ఫెడరల్ విధానంలో భారతదేశంలో ఈ ఆంధ్రప్రదేశ్ కూడా ఒక రాష్ట్రం కాబట్టి మన ధర్మం, బాధ్యతను మరచిపోకుండా అక్కడ ప్రవర్తించడం జరిగింది. మా అధికారులు నలుగురిని మాత్రమే నా వెంట తీసుకొని వెళ్ళాను.

నేను అక్కడికి కేవలం ఒక బిచ్చగాడిగా జోలి పట్టుకొని వెళ్ళలేదు. ఈ రాష్ట్ర ప్రభుత్వానికి అధినేతగా నా డిపార్టుమెంట్‌కు సంబంధించిన ఇండస్ట్రీస్ సెక్రటరీని, నా పర్సనల్ సెక్రటరీ రాఘవేంద్రరావుగారిని, ఏ.పి.ఐ.డి.సి. మేనేజింగ్ డైరెక్టర్ సంజీవరెడ్డిగారిని, ఈ ముగ్గురితో పాటు నా సెక్యూరిటీ ఆఫీసర్‌ను తీసుకు వెళ్ళాను. అసలు సెక్యూరిటీ ఆఫీసర్లు ఇద్దరిని తీసుకు వెళ్ళవలసి ఉంటే, ఒకరిని తీసుకుని వెళ్ళకూడదు అన్నపుడు కూడా నేను ఒక సెక్యూరిటీ ఆఫీసరునే తీసుకొని వెళ్లాను. ఈ నలుగురికి ట్రావెలింగు ఖర్చుల క్రింద ఒక లక్ష నాలుగువేల రూపాయలు ఖర్చు అయింది. ఎంటర్‌టైన్మెంటు కొరకు నాకు ఒక్కరికి మాత్రం 500 డాలర్లు అంటే 5 వేల రూపాయలు ఇచ్చారు. తరువాత రోజు భత్యం క్రింద ఆ దేశాలలో ఉన్నంతవరకూ రోజుకు 35 డాలర్లు భత్యాల క్రింద ముట్ట చెప్పబడింది. తరువాత ఈ యాత్ర జాతికి సంబంధించింది కాబట్టి రిక్త హస్తాలతో వెళ్ళకూడదని చెప్పి పేపర్ లాకెట్లు వెంకటేశ్వరస్వామివారివి తీసుకువెళ్ళడానికి 19,000 రూపాయలు, రాఘవేంద్రస్వామివారివి తీసుకువెళ్ళడానికి 5,000 రూపాయలు మొత్తం 24,000 రూపాయలు ఖర్చు అయింది.

ఈ రాష్ట్ర ప్రభుత్వానికి అధినేతగా నా డిపార్టుమెంట్‌కు సంబంధించిన ఇండస్ట్రీస్ సెక్రటరీని, నా పర్సనల్ సెక్రటరీ రాఘవేంద్రరావుగారిని, ఏ.పి.ఐ.డి. సి. మేనేజింగ్ డైరెక్టరు సంజీవరెడ్డిగారిని, ఈ ముగ్గురితో పాటు నా సెక్యూరిటీ ఆఫీసరును తీసుకు వెళ్ళాను. అసలు సెక్యూరిటీ ఆఫీసర్లు ఇద్దరిని తీసుకు వెళ్ళవలసి ఉంటే, ఒకరిని తీసుకుని వెళ్ళకూడదు అన్నపుడు కూడా నేను ఒక సెక్యూరిటీ ఆఫీసరునే తీసుకొని వెళ్లాను.

ప్రభుత్వ పరంగా అయిన ఖర్చులు ఇవి. ఇక్కడ సభ్యులందరికీ నేను మనవి చేసేది ఏమిటంటే నన్ను వారు ఆప్యాయతతో ఆహ్వానించారు. అక్కడ సభలో మతభేదం అనేది లేకుండా ముస్లిమ్ సోదరులు వచ్చారు. వారి ప్రార్థనా మందిరాలకు నన్ను ఆహ్వానించారు. ఆ దేశంలోని ముస్లిమ్ సోదరులకు నేను చార్మినార్ విగ్రహాన్ని బహుమతిగా ప్రదానం చేశాను, అదే విధంగా గజల్స్, మషైరాల కేసెట్లు ఇచ్చాను. అదే విధంగా వారు వారి మతాలకు సంబంధించిన ఖురానును ఇచ్చారు. క్రిస్టియన్ సొసైటీవారు బైబిలు పుస్తకాన్ని బహూకరించారు. ఈ విధంగా ఎంతో చక్కగా, సుహృద్భావంతో ఏ జాతి తారతమ్యం లేకుండా ఆదేశం ఈ దేశం అనే తేడా లేకుండా ఈ జాతి, ఆ జాతి అనే తారతమ్యం లేకుండా చక్కని మనస్సులతో ఆ కార్యక్రమం జరిగితే దానిని ఈ విధంగా ఎందుకు విషపూరితం చేస్తున్నారో నాకు అర్థం కావడంలేదు.

అక్కడ అమెరికాలో చికాగో మేయర్‌గారు ఆ పట్టణంలో సభ జరుగుతున్నపుడు మన గౌరవార్థం 'ఆంధ్రప్రదేశ్ డే 'అనే పేరుతో సెలవుదినంగా ప్రకటించారు. ఇంతకన్నా గౌరవం, గుర్తింపు మరొకటి ఏమి ఉంటుందో అర్థం కావడంలేదు. ఇంత చక్కగా సుహృద్భావంతో ఆ యాత్ర జరిగింది. ఇందులో స్వార్థం లేదు. వారు చెప్పారు మతం, మతం అని. మతం అంటే ఏమిటే? అభిమతమే నీ మతం, దేవుడుకి 4 చేతులు,మూడు కళ్లు ఉన్నాయని ఎవరు చెప్పారు?

ఎవరు ఇష్టం వచ్చినట్లు వారి వారి విధానాలను బట్టి మనసులో నిలుపుకుంటున్నారు. దేవుడికి పూజలు చేసుకుంటున్నారు. నా ఉద్దేశ్యం ప్రకారంగా మానవుడే దేవుడు. మనిషిలోనే దేవుడు ఉన్నాడు. నేను మానవ సమాజాన్ని, మానవత్వపు విలువలను గుర్తించే వాడిని తప్ప కేవలం ఈ మత మౌఢ్యాన్ని నాకు అంటకట్టవద్దు మనవిచేస్తున్నాను. ఇక డాలర్లు విషయం అంటారా – పత్రం, ఫలం, పుష్పం, తోయం అనుకుంటూ ఎందుకు నేను వచ్చినపుడు అందరూ పుష్పాలు ఇస్తున్నారు? ఎందుకు ఈ రోజు సోదరీమణులందరూ మంగళ హారతులిచ్చి నుదుట కుంకుమ బొట్టు పెడుతున్నారు? నేను వారిని అడిగానా? ఏ భావంతో వారు నాకు అవి ఇస్తున్నారు.

ఏ మతాన్ని బట్టి, ఏ కులాన్ని బట్టి నన్ను గౌరవిస్తున్నారు? అందువల్ల నేను ఈ సభవారిని కోరుతున్నదేమిటంటే ఇటువంటి దురదృష్టకరమైన విధానాలతో ఏ కార్యక్రమాలనైనా మతాలతో ముడిపెట్టవద్దని చెబుతున్నాము. ఈ ప్రజాస్వామ్య విధానంలో ఎవరి నమ్మకాలు వారివి. ఒకరి నమ్మకాలను ఒకరు కాదనడానికి ఎవరికీ అధికారం లేదు. అదే సెక్యులరిజం అంటే. మత ద్వేషం సెక్యులరిజం కాదు. మత సామరస్యం మాత్రమే సెక్యులరిజం అనిపించుకుంటుంది. దీనికి అంతా కారణాలు ఏమి చెబుతారో గౌరవ సభ్యులు నాకు తెలియజేస్తే నేను మతపరమైన విధానాలలోనికి వెళ్లానో లేదో అప్పుడు నేను చెప్పడానికి అవకాశం ఉంటుందని మనవిచేస్తున్నాను. నేను అందరికీ దయచేసి చెబుతున్నది ఏమిటంటే నేను ఈ రాష్ట్ర అభివృద్ధిని కోరే మనిషిగా అమెరికా వెళ్లాను. అక్కడకు వెళ్ళిన తరువాత నాతో వచ్చిన అధికారులు కూడా ఎన్నో వివరాలు సేకరించారు. అందుకు వారికి నేను కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

అందరూ ఎంతో ఉదాత్తంగా మెచ్చుకొనే రీతిలో ఆదర్శవంతమైన విధంగా ఈ విధానాలు జరిగాయి. మన రాష్ట్రంలో అనేక వనరులు ఉన్నాయి. ఇవన్నీకూడా ఉపయోగించుకోవడానికి మిమ్మల్ని రమ్మని అక్కడ ఉన్న మన భారతీయులను నేను కోరడంలేదు. కేవలం నేను బిచ్చగాడిగా రాలేదు. మీ వృత్తులను వదులుకొని అక్కడివారిని రమ్మని చెప్పడం లేదు. ఏమి అయినాసరే మీ మాతృదేశం అనేది ఒకటి ఉందనేది మాత్రం వారికి గుర్తుచేసాను. ఆ విషయం వారిని గ్రహించమని మాత్రమే చెప్పాను. కేవలం ఇదంతా సుహృద్భావ వాతావరణంలో జరిగింది. ఎక్కడాకూడా హొటలులో కప్పు కాఫీ కూడా నేను త్రాగలేదు. అక్కడ ఆడబడుచులందరూ కూడా వారి చేతులతో తెల్లవారుజామున 5 గంటలకు లేచి భోజనం, పిండి వంటలు మొత్తం 20 మంది ఆడబడుచులు 15 వేలమందికి వంటచేసి వారి ఇళ్ళనుంచి తెచ్చిపెట్టారు. ఫలానావారు పులిహొర, ఫలానావారు గారెలు, ఫలానావారు భోజనం అని వంతులు వేసుకొని చేసిపెట్టారు. కేవలం వినోదం కోసంకానీ, ఒక కప్పు కాఫీకి కానీ నేను ఒక్క పైసాకూడా అక్కడ ఖర్చుచేయలేదు. అంతటి చక్కని వాతావరణంలో ఎంతో జాతీయభావంతో నడిచిన ఆ సభలు ఈ విధంగా విమర్శించబడుతున్నాయంటే దానికి కారణం నాకు అర్థం కావడంలేదు. ఇంకా అరబ్ దేశాలకు

నన్ను వెళ్ళమంటున్నారు. ఆ విధంగా నన్ను ఎందుకు చంపుతారు? ఎందుకు ఈ కత్తులతో పొడిచి చిత్రవధ చేస్తారు? నేను ప్రాణంపోయినా ఇక ఏ దేశానికీ ఈ పరిస్థితులలో వెళ్ళను. ఎందుకు ఈవిధంగా వెళ్ళడం? నేను ఏ ఉద్దేశ్యంతో వెళ్లాను? ఏమి జరిగింది అక్కడ అనేది గ్రహించకుండా ఎవరి ఇష్టం వచ్చినట్లు ఎవరి పార్టీ విధానాలబట్టి వారు కేవలం నన్ను దుయ్యపట్టాలనే విధానంతో ప్రతిదానికి అపార్థం కల్పించినపుడు, ఈనాడు తెలుగుదేశంలో ఇటువంటి కార్యక్రమాలు ఆక్రమంగా జరుగుతున్నాయని అనుకున్నపుడు, అటువంటి విధానాలు అవలంభించవలసిన అవసరం నాకు ఉండదు. ముఖ్యంగా నేను సవినయంగా మతం విషయంలో ఒకటి మనవిచేస్తున్నాను.

అంతా హిందూ దేశంగానే చూస్తున్నాను. కేవలం తెలుగుదేశం మాత్రమే హిందూదేశం అని చెప్పడంలేదని మనవిచేస్తున్నాను. ఇంకా ఏదో ఏదో ఇక్కడ సభ్యులు అన్నారు. ఈ యాత్ర తప్పుగా చేసినదని నేను అనుకోవడం లేదు. నా హృదయానికి సంబంధించినంత వరకూ నేను మంచి భావంతోనే ఈ యాత్ర చేశాను. 6 కోట్ల ఆంధ్రప్రశ్ ప్రజానీకం ఉన్నారు. 60 కోట్లమంది భారతీయులు ఉన్నారు. ఇది మంచో, చెడో అనేది నిర్ణయించడానికి వారికే వదలి వేస్తున్నాను. దీని విషయంలో నేను ఎవరినీ విమర్శించాలని అనుకోవడం లేదు. ఇంత చక్కగా నన్ను గౌరవించినందుకు మాత్రం మరొకసారి ప్రతి ఒక్కరికి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

◆◆

మార్చి 14, 1985

# కన్నీటితో కడుపు నింపుకొనే ప్రజానీకం సంక్షేమానికి మా ప్రభుత్వం అంకితమైనది

*(గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చేసిన ప్రసంగం)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** గౌరవనీయులైన అధ్యక్షా, ఎంతో ఆదరంతో, అభిమానంతో, ఉత్సాహంకొద్దీ సుమారు 35 మంది వివిధ పక్షాలకు చెందిన గౌరవసభ్యులు సముచితమైన సూచనలిచ్చినందుకు నా హృదయపూర్వక కృతజ్ఞతా నమస్సులు అందజేస్తున్నాను. పార్టీలు వేరుకావచ్చు, సిద్ధాంతాలు వేరుకావచ్చు. రాష్ట్ర సమగ్రాభివృద్ధినే అందరమూ కోరుకొంటున్నాము. ఉత్తమోత్తమమైన రీతిలో చక్కబరచాలనేదే అందరి బాధ్యత. ఈ విషయంలో మా ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని అందరికీ సవినయంగా మనవిచేస్తున్నాను. వారి బాధ్యతను వారు నిర్వర్తించాలి. అర్థవంతమైన సూచనలిచ్చినప్పుడు సహృదయముతో స్వీకరించడానికి ఈ ప్రభుత్వం ఏమాత్రం వెనుకాడదు. మా ప్రభుత్వం కృషి చేస్తుందని మరొకసారి సవినయంగా తెలియజేస్తున్నాను. కుల, మత, వర్గభేదాలు కానీ, ప్రాంతీయ భేదాలు కానీ ఏమాత్రమూ సిద్ధాంతాలలో లేవు, మా పార్టీకి లేదు. ఏమైనా సరే ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి అంకితమైన ప్రభుత్వం ఏ విధంగానూ ఎవరికీ, ఏ అన్యాయం జరగకుండా, ఏ విధంగా సమగ్రాభివృద్ధిని చేసుకోగలము, ఉన్నతమైన స్థాయిలో కృషి చేయగలము, అట్టడుగు, బడుగు వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేయగలమని ఆలోచన చేస్తున్నాం

ఏ విధంగా సమాజానికి తృప్తిని, పుష్టిని ఇవ్వడానికి వీలు ఉంటుందో ఆ విధంగా అన్ని విధాల కృషి చేయాలనేది మా ప్రభుత్వ లక్ష్యం, ఆ విధంగా కృషి చేస్తుంది. ఎన్నికల గురించి మనవిచేశారు. ప్రభుత్వపరమైన విధానాన్ని చెబుతున్నాను, పోలీసు డిపార్టుమెంట్ వారికి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. శాంతిభద్రతలకు ముప్పు కల్గించేవారిని ఎవరినీ క్షమించడానికి వీలులేదు. నిర్దాక్షిణ్యముగా ధర్మము, న్యాయము అయిన పద్ధతిలో వ్యవహరించాలని పోలీసు డిపార్టుమెంట్‌కు

ఆదేశాలివ్వడం జరిగింది. ఎవరి దగ్గరైనా, మారణాయుధాలుంటే ముందే వాటిని సేకరించాలని ఆదేశాలివ్వడం జరిగింది. ఎన్నికలు శాంతియుత వాతావరణములో జరిగాయా లేదా అంటే ప్రతిచోట జరగకపోవచ్చు కానీ ఈ విధమైన ఆదేశాలు, చర్యలు తీసుకోకపోతే ఎన్నికలు ప్రశాంత వాతావరణములో అయ్యేవి కావు. మనము ఈ శాసనసభలో కూర్చొని ఉండేవారము కాదు. 78 పోలింగ్ కేంద్రాలలో మాత్రమే రీపోలింగ్ వచ్చింది. అంటే ఎంత చక్కగా, ఎట్లా జరిగాయనేది తెలుస్తుంది. గ్రామాలలో ఏ పార్టీవారు చేశారు. ఎవరు చేశారనే వివరాలలోకి వెళ్ళడం లేదు. ప్రభుత్వపరమైన విధానం గురించే మాట్లాడుతున్నాను. సంతృప్తికరమైన విధానాలను అవలంభించడం వల్ల ఈ ఎన్నికలు చాలా ప్రశాంతముగా జరిగాయని మనః పూర్వకంగా చెబుతున్నాను.

ప్రతి విషయానికి డిపార్టుమెంట్‌ను అవమానపరచడం మంచిది కాదు. వారి ధర్మాన్ని వారు నిర్వర్తించారు. కనుక ఈ విధంగా ఎన్నికలను జరుపుకోగలిగాం కొన్ని రిపోర్టులను బయట పెట్టదలచుకోలేదు. ఒక పార్టీ ఒక వ్యక్తి అని ప్రస్తావించడం నా పరంగా జరగదు. 6 కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజల ప్రతినిధిగా నా హుందాను నేను కాపాడుతాను. మంచి విధానాలకు అంకితమైనవారు ఆ అంకితమైన భావముతో మా ప్రభుత్వంతో సహకరించాలని కోరడం జరుగుతోంది. అభివృద్ధి కార్యక్రమాల విషయం చెప్పవలసివస్తే సామాన్య ప్రజానీకానీకి నిత్యావసర వస్తువులైన తిండి, బట్ట, నీడ కల్గిస్తామని హామీ ఇచ్చాము. అన్నార్థులై చావలేక బ్రతుకుతున్న ప్రజానీకము, కన్నీటితో కడుపు నింపుకొనే ప్రజానీకం సంక్షేమానికి మా ప్రభుత్వం అంకితమైనది. కాంగ్రెస్ పార్టీ 35 సంవత్సరాలు పాలన చేసింది. మేము వచ్చి 2 సంవత్సరాలైంది. వారి 35 సంవత్సరాల పాలనాకాలములో ఏవిధమైన న్యాయం జరిగింది చర్చించదలచుకొనలేదు.

ప్రతి విషయానికి డిపార్టుమెంట్‌ను అవమానపరచడం మంచిది కాదు. వారి ధర్మాన్ని వారు నిర్వర్తించారు. కనుక ఈ విధంగా ఎన్నికలను జరుపుకోగలిగాం కొన్ని రిపోర్టులను బయట పెట్టదలచుకోలేదు. ఒక పార్టీ ఒక వ్యక్తి అని ప్రస్తావించడం నా పరంగా జరగదు. 6 కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజల ప్రతినిధిగా నా హుందాను నేను కాపాడుతాను. మంచి విధానాలకు అంకితమైనవారు సహకరించాలని కోరడం జరుగుతోంది.

ఈనాటికి నూటికి 52 మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు. దానికి కారణమేమిటి? సమాజపరమైన న్యాయాన్ని ఎవరికి అందించాలి. ఆదర్శమైన ప్రభుత్వం ఏ విధంగా నడపాలన్నప్పుడు 52 శాతం ఓట్లు ఇచ్చి గెలిపించిన పేదవారి పట్ల విశ్వాసము ఉండాలి వారికి ఈ ప్రభుత్వం ద్వారా మంచి జరుగుతుందని వారు ఆశిస్తున్నారు. వారికి సంక్షేమ కార్యక్రమాలు అందించాలనే ఈ ప్రభుత్వ విధానంలో తప్పులేదు. కిలో రెండు రూపాయల బియ్యము ఇస్తున్నామంటే ఎన్ని ఇబ్బందులకు లోనై చేస్తున్నది తెలుసు. మనకు 22 1/2 లక్షల టన్నుల

బియ్యము కావాలి. కేవలం 10 లక్షల టన్నులు సెంట్రల్ పూల్ నుంచి తీసుకొంటున్నాము. ఒక లక్ష టన్నులు ముతక బియ్యము, 4 లక్షల టన్నులు మధ్యరకము, 5 లక్షల టన్నులు మేలు రకము వారి లెవీనుంచి తీసుకోడానికి అనుమతివుంటే ముతక బియ్యాన్ని 208 రూపాయలకు, మధ్యరకం బియ్యాన్ని బస్తా 220 రూపాయలకు, మేలురకం బస్తా బియ్యాన్ని రు. 235 రూపాయలకు సెంట్రల్ లెవీ పూల్ నుంచి మనకు అందుతున్నాయి. దీనికోసం 55 కోట్లు సబ్సిడీగా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వవలసివస్తున్నది. 12 1/2 లక్షల టన్నుల విషయం ఏమి చేయాలి? కొంతమందికి కూడు పెట్టి, కొంతమందికి కూడు పెట్టకుండా ఆకలితో చచ్చేటట్లు చేయాలని ఉద్దేశ్యంకాదు. మిగతా 12 1/2 లక్షల టన్నులు ఓపెన్ మార్కెట్ నుంచి సేకరించడానికి ఈనాడు రూ. 113 కోట్లు సబ్సిడీగా ఇవ్వవలసివస్తోంది. మొత్తము రూ. 168 కోట్లు కేవలం కిలో రెండు రూపాయల బియ్యానికి సబ్సిడీగా ఇవ్వవలసివస్తున్నది. ఇది వారి కార్యక్రమం అని కొంతమంది పెద్దలు, కేంద్రప్రభుత్వ ప్రతినిధులు అన్నారు. వారి పేర్లు చెప్పదలచుకొనలేదని ముందే మనవిచేశాను. వారి కార్యక్రమమే అయితే కాదనడంలేదు. రూ. 168 కోట్లు సబ్సిడీ ఇవ్వగలిగితే నేను వారికి అభినందనలు తెలియచేస్తాను.

అదేవిధంగా గృహ నిర్మాణ పథకం ఉంది. ఏ ప్రభుత్వమూ చేయని నూతన విధానాలను ఈ ప్రభుత్వం అనుసరిస్తున్నది. మనం మేడల్లో ఉండి, శాసనసభలో ఎ.సి. రూమ్స్‌లో కూర్చుని చర్చించడంకాదు, సామాన్య మానవునికి ఇండ్లు నిర్మించడమే ఈ ప్రభుత్వ ధ్యేయమని మనవి చేస్తున్నాను. ఒక పాకలో, ఒక గుడిసెలో పేదవారిని ఉంచడం మా ధ్యేయంకాదు. పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలనే ధ్యేయంతో ఈ రెండు సంవత్సరాలలో లక్షా డెబ్బైవేల ఇండ్లు నిర్మించి పేదలకు అందిచడం జరిగిందని మనవిచేస్తున్నాను. అంతేకాక 7లక్షల పైచిలుకు మందికి ఇండ్ల స్థలాలు ఇవ్వడం జరిగింది. అంతేకాదు, 13 లక్షలమందికి గ్రామాలలో ఉన్నవారికి వృత్తికి సంబంధించిన పరికరాలు, కుట్టు మిషనులు ఇచ్చి వారికి జీవనభృతి కల్పించడం జరిగింది. అదేవిధంగా విద్య ఉండి పని లేకుండా ఉన్నవారికి ప్రత్యేకంగా గ్రామాలలో ఉన్న వారికి గ్రామోదయ పథకం పెట్టి 25 వేల మందికి గ్రామాలలో సహాయపడటం జరిగింది. ఇది జాతీయ కార్యక్రమమే కావచ్చు. యూనియన్ ప్రభుత్వము, రాష్ట్ర ప్రభుత్వమూ అనే బేధభావం మాకులేదు. ఏ దేశమేగినా ఎందు కాలిడినా, పొగడరా నీ తల్లి భూమి భారతిని అన్నట్లు నేను ముందుగా భారతీయుడ్ని, భారతదేశంలో ఒక భాగం ఆంధ్రప్రదేశ్ అనే భావంతోనే నేను మాట్లాడుతున్నాను. యూనియన్ ప్రభుత్వంతో కన్‌ఫ్రంటేషన్ అనేది మా ఉద్దేశ్యంకాదు. మన రాష్ట్ర ప్రజల పేదరికాన్ని నిర్మూలించడం, వారి బాధలు తీర్చడం, వారికి కావలసిన అవసరాలు లభింపచేయడం, అదే మా ధ్యేయం అని సవినయంగా మనవిచేస్తున్నాను.

ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి విషయం వచ్చినప్పుడు అన్నదాత రైతు, దేశానికి వెన్నెముక రైతు. రెక్కలు ముక్కలు చేసుకొని కండలు విరిగేటట్లు పనిచేసే రైతుకు మేలుచేసే కార్యక్రమాలు

చేస్తున్నామా అంటే లేదనే చెప్పచ్చు. అది కేవలం రాష్ట్ర ప్రభుత్వం చేతిలో లేదు. ఈనాడు ధరలు నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వ చేతుల్లో లేదు. అగ్రికల్చరల్ ప్రైస్ కమిషన్‌లో మనకు ప్రాతినిధ్యంలేదు. టన్ను చెరకు ధర 250 రూపాయలు నిర్ణయిస్తే న్యాయంగా ఉంటుందని నేను ఉత్తరం వ్రాశాను. దానికి వారు నిర్ణయించింది 140 రూపాయలు. ఇది ఏవిధంగా న్యాయం, రైతుకు ఏవిధంగా సంక్షేమం జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం సలహా ఇవ్వగలదు. కానీ దానికి అధికారంలేదు. కేవలం ప్రభుత్వపరంగా ఉన్న కోఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీలలో, కండసారి ఫ్యాక్టరీలలో టన్నుకు 55 రూపాయలు, పర్చేజ్ టాక్స్‌లో పది రూపాయలు ముదరాగా ఇలా మొత్తం 65 రూపాయలు అదనంగా ఇవ్వడం జరిగింది. ఇది మా ప్రభుత్వం చేస్తున్నదని మనవి చేస్తున్నాను. అదే విధంగా ధాన్యం పండించే రైతుకు క్వింటాల్‌కు అదనంగా పది రూపాయలు ఇస్తున్నాము. పత్తి పండించే రైతుకు ధరలేదు.

మనకు ఎగుమతిచేసే అధికారంలేదు. కేంద్రం తన చేతుల్లో పెట్టుకున్నది. ఇందులో మధ్య దళారీలు ఎందుకు ఉండాలి? ఈ రోజు పొగాకు పండించే రైతులకు, ఉత్పత్తిదారులకు సహాయపడటానికి సహకార సంఘాల ద్వారా వారికి సరైన ధర ఇప్పించటానికి, కొనుగోలు చేసుకోటానికి వీలుగా రెండు కోట్ల రూపాయల పెట్టుబడితో వారికోసం నిధి ఏర్పాటు చేయడం జరిగింది. హార్స్‌పవర్‌కు సంవత్సరానికి 50 రూపాయలే విద్యుచ్ఛక్తికి వసూలు చేస్తూ రైతులకు ఈ ప్రభుత్వం సహాయపడుతున్నదని మనవిచేస్తున్నాను. కరువు కాటకాలూ, వరదలు వచ్చినప్పుడు ఏవిధంగా సబ్సిడీ ఇవ్వాలి, ఎరువులు, విత్తనాలు ఏవిధంగా సప్లయి చేయాలి అనే విషయాలలో వారికి చేతనైనంత సహాయం అందచేస్తుందని మనవిచేస్తున్నాను. గౌరవ సభ్యులు వేరుశెనగ గురించి చెప్పారు. మధ్యదళారీలే లాభాలు పొందుతున్నారు. అలాగాక పండించిన వారికే ప్రయోజనం దక్కాలని ఇరవై బస్తాల వరకూ వారు తీసుకోటానికి అనుమతి ఇవ్వడం జరిగిందని మనవిచేస్తున్నాను. గౌరవసభ్యులు ఇచ్చిన విలువైన సూచనలను ఈ ప్రభుత్వం గౌరవిస్తుందని, పరిశీలిస్తుందని, సభ్యులు చేసిన సూచనలన్నీ రికార్డు చేయబడ్డాయి కనుక వాటినన్నింటినీ పరిశీలించడం జరుగుతుందని మనవిచేస్తున్నాను. ఈనాడు మనకు పోలవరం, ఇచ్చంపల్లి, వంశధార, భీమా, జూరాల, వరదరాజస్వామి ప్రాజెక్టులు వంటివి అనేకం ఉన్నాయి. వీటికి సి.డబ్ల్యు.సి. వారి పర్మిషన్స్ లభించకపోవడంవల్ల ఆగిపోయాయి. ప్రతిదానికి వారి అనుమతి కావాలి. అలాగే తెలుగుగంగ ప్రాజెక్టు ఉంది. అలాగే వరదరాజస్వామి ప్రాజెక్టు ఉంది.

ఏదో 40 ఎకరాల విస్తీర్ణంలో చెట్లూ చేమలూ ఉన్నాయి కనుక ఆపామని అంటున్నారు. ఇది మానవతా ధర్మమా? ఇటు వంటి చిన్న ఆటంకాలు పెట్టినా మనం వాటిని సాధించాలి. దానికి మనమందరం కృషి చేయాలి. జాతీయ ప్రాజెక్టులుగా తీసుకొనే విషయం గురించి గౌరవసభ్యులు చెప్పారు. పోలవరం నిర్మించుకోవాలంటే దాని అంచనా 1200 కోట్ల రూపాయలు. ఇప్పుడు

రూ.1500 కోట్లకు దాటవచ్చు. రాష్ట్రానికి ఉన్న వనరులతో దీనిని ఏవిధంగా మనం నిర్మించగలమో మనం అందరం ఆలోచించాలి. ఏలేరు కాలువనుండి విశాఖ స్టీల్ ప్లాంటుకు నీరు అందించటానికి రూ.50 కోట్లు ఇవ్వండని కేంద్రాన్ని అడిగాము. మా దగ్గర నిధులులేవు కనీసం అప్పుగానైనా ఇవ్వండి అని అడిగినా ఇవ్వలేదు. ఎందుకు ఇవ్వలేదో అర్థం కావడంలేదు. అప్పుగానైనా ఇవ్వవచ్చుకదా మరి ఎందుకు ఈ విషయంలో జాప్యం అవుతున్నదో మాకు తెలియడంలేదు. ఇందులో దురభిప్రాయం ఉందనే భావం మా మనసులో లేదు. యూనియన్ ప్రభుత్వం ఇలా చేస్తున్నదని నేను అనడంలేదు, అనను అని కూడా మనవిచేస్తున్నాను. ఈనాడు అహార సమస్య కేవలం రాష్ట్ర సమస్యకాదు. మన రైతులు 110 లక్షల టన్నులకు పైగా ఆహారధాన్యాలు పండిస్తున్నారు. పండించిన్నంత మనం తినడంలేదు. మనం తినగా మిగిలింది ఇతర రాష్ట్రాలకు పంపిస్తున్నాము. ఇది జాతీయ సమస్య. మనకు సరిపడగా మిగిలింది పంపిస్తున్నాము.

సెంట్రల్ పూల్‌లో వారు ధాన్యం తీసుకుంటున్నప్పుడు ధాన్యాన్ని పండించే రైతుల సమస్యనుకూడా జాతీయపరంగా ఆలోచించాలని కోరడం జరిగింది. వంశధార విషయంలో ఆడ్డంకులు చెబుతున్నారు. కొంతభూమి మునిగిపోతుందంటున్నారు. ఒరిస్సా ముఖ్యమంత్రిని, నన్ను కలపండి మేము సంప్రదించుకొని ఒక ఏర్పాటు చేసుకుంటాము అని యూనియన్ ప్రభుత్వాన్ని కోరుతూనే ఉన్నాను.

ఇది జాతీయ సమస్య అయినప్పుడు సెంట్రల్ పూల్‌లో వారు ధాన్యం తీసుకుంటున్నప్పుడు ధాన్యాన్ని పండించే రైతుల సమస్యనుకూడా జాతీయపరంగా ఆలోచించాలని కోరడం జరిగింది. వంశధార విషయంలో ఆడ్డంకులు చెబుతున్నారు. కొంతభూమి మునిగిపోతుందంటున్నారు. ఒరిస్సా ముఖ్యమంత్రిని, నన్ను కలపండి మేము సంప్రదించుకొని ఒక ఏర్పాటు చేసుకుంటాము అని రెండు సంవత్సరాల నుండి యూనియన్ ప్రభుత్వాన్ని కోరుతూనే ఉన్నాను. అది ఇంతవరకూ వారు ఏర్పాటు చేయలేదు. ఇచ్చంపల్లి ఇంటర్‌స్టేట్ ప్రాజెక్టు, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ మూడు రాష్ట్రాలకు సంబంధించింది. మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులూ ఒకచోట కూర్చుని చర్చించుకొని ఒక జాయింటు బోర్డు ఏర్పాటు చేసుకుంటే, సంతకాలు పెట్టుకుంటే సిడబ్ల్యుసి పరిష్మన్ సాధించవచ్చు, పని మొదలుపెట్టవచ్చు అని రెండు సంవత్సరాల నుండి మేము చెబుతున్నా ఇందులో జాగు జరుగుతున్నది. ఇది మా ప్రభుత్వం చేతుల్లో లేదు. ఈ సభలోని అన్ని పక్షాలవారూ మాతో సహకరిస్తే ఇది పరిష్కారం అవుతుంది. అందర్నీ అభినందిస్తానని మనవిచేస్తున్నాను.

ఇకపోతే పరిశ్రమల విషయం. గోదావరి ఫర్టిలైజర్స్ ఫ్యాక్టరీ ప్రారంభించి పనిజరుగుతున్నది. అదేవిధంగా - నాగార్జున ఫర్టిలైజర్స్ ఫ్యాక్టరీ విషయములో కో-ప్రమోటరును ఏర్పాటుచేయడం, అది కూడా పని ప్రారంభించడం జరిగింది. మంగళగిరి టైర్స్‌ఫ్యాక్టరీ అనుమతి ఇవ్వడం కేంద్ర ప్రభుత్వం వారు పర్మిషన్ ఇచ్చారు. కాబట్టి వెంటనే దానికి కూడా కో-ప్రమోటరును ఏర్పాటు

చేయడం జరిగింది, అది పూర్తిగా పని ప్రారంభించడం జరుగుతుందని సోదరులకు మనవిచేస్తున్నాను. అభివృద్ధి కార్యక్రమాల విషయములో చెప్పారు. ముఖ్యంగా రాయలసీమ సమస్యల గురించి చెప్పారు. రాయలసీమ సమస్యల విషయంలో ఏ మాత్రం విస్మరించడం జరుగదు. ప్రాంతీయ భావాలు వద్దు, ఆ ప్రాంతీయ భాషనే మనం వాడనక్కరలేదు. అందరము తెలుగువారము, ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారము అని మనవిచేస్తున్నాను. ఏ విషయములోనైనా ప్రతి ఒక్కరికి బాధ్యత ఉంది. ప్రాంతీయ భావం మాట రాకుండా అందరం కూడా కలసి సమగ్రమైనటువంటి రాష్ట్రాభివృద్ధికి పాటుపడవలసిన అవసరం ఉంది.

ఈ రోజు మా రాయలసీమ, మా తెలంగాణ, మా కోస్తా అనే భేదభావం లేకుండా అందరం కలసి కృషి చేద్దామని మా ప్రభుత్వం మీ అందరినీ ఆహ్వానిస్తున్నది. మీ అమూల్యమైన సలహాలను ఆహ్వానిస్తున్నది. ఏదో ఒకరు చేసేది కాదు. ఇది ఆరు కోట్ల ప్రజానీకానికి సంబంధించిన సమస్య. కాబట్టి దీని విషయములో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావడానికి అవకాశం ఉంది, అధికారం ఉంది. మీరందరూ కూడా మా ప్రభుత్వ ఆలోచనలో పాలుపంచుకోవచ్చునని ప్రతి ఒక్కరికి మనవిచేస్తున్నాను. ఇందాక వారు చెప్పారు. ఆ కుడి కాలవ విషయంలో పూర్తిగా మైలవరం రిజర్వాయరు బుగ్గవంక వరకు కూడా దానిని తీసుకుపోయి అక్కడ సమృద్ధిగా అందించాలని ఉంది. అదే విధంగా 250 మె.వా. విద్యుచ్ఛక్తి కర్మాగారాన్ని కూడా అక్కడ నెలకొల్పాలనే నిర్ణయం ప్రభుత్వం తీసుకున్నది. ఆదే విధంగా ఎన్నో వనరులు అందించడానికి వీలుంటుంది. ప్రతి ప్రాంతాన్ని ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలో అది చేసుకోడానికి మా ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని మనవిచేస్తున్నాను. ఈనాడు పచ్చని పంటలతో పల్లెలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ఆదర్శం – అది వీలులేనప్పుడు పారిశ్రామికవంతంగా దానిని అభివృద్ధి చేయడానికి ఏ మాత్రం కూడా వెనుదీయకుండా కృషి జరుగుతుందని మనవిచేస్తున్నాను.

ఈనాడు ఎన్నో పరిశ్రమలను ఆ విధంగా ఎగువ ప్రాంతాల వారికి ఏర్పాటు చేయబడివున్నవి. ఆంధ్రప్రదేశ్ స్కూటర్స్ మోపెడ్ యూనిట్‌ను తిరుపతిలో పెట్టాలనుకుంటున్నాము. అట్లాగే స్పన్ సిల్క్, నెక్ట్ సిల్క్ రోలింగ్ యూనిట్ ఒకటి ఏర్పాటు చేయాలని, అదే విధంగా సిమెంటు ఫ్యాక్టరీ ఒకటి రాయలసీమలో, ఎలక్ట్రానిక్ కాంప్లెక్స్ ఒకటి తిరుపతిలో, అదే విధంగా 250 మె.వా. థర్మల్ స్టేషను రాయలసీమలో ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మనవిచేస్తున్నాను కాబట్టి ఎప్పుడూ ఏ ప్రాంతం వారికి అన్యాయం అనేది జరుగదు. అంతా మనదే, మనమందరం ఒకటే అనే భావం ప్రతివారు గుర్తించాలని మనవిచేస్తున్నాను. అదే విధంగా అభివృద్ధి కార్యక్రమాల విషయములో రెండు సంవత్సరాలలో ప్రభుత్వం ఎంత అభివృద్ధి చేసింది మీకు మనవిచేస్తాను. 1981–82లో మన యాన్యువల్ ప్లాన్ అవుట్ లే 538 కోట్లు ఉంటే 1984–85లో రూ.978.31 కోట్లకు పెరిగింది

అంటే దేనివల్ల పెరిగిందో దయతో ఆలోచించాలని కోరుతున్నాను. అదే విధంగా రాష్ట్ర ఆదాయం 1981-82లో రూ.3,896 కోట్లు ఉంటే ఇప్పుడు అది రూ.4,278.63 కోట్లకు పెరిగిందంటే ఎందుకు ఈ విధంగా పెరిగిందో దానికి కారణం ఏమిటో ఆలోచించమని మనవిచేస్తున్నాను. అట్లాగే తలసరి ఆదాయం 81-82లో 718 రూపాయలు ఉంటే ఇప్పుడు అది 755 రూపాయలకు పెరిగిందంటే దానికి కారణం ఏమిటో గుర్తించాలని మనవిచేస్తున్నాను. అదే విధంగా పవర్ జనరేషన్ ఆ రోజు 9,077 మిలియన్ కిలోవాట్స్ ఉంటే ఈనాడు 10,900 కిలోవాట్స్‌కు పెరిగిందంటే దానికి కారణం ఏమిటో అర్థం చేసుకోవాలని కోరుతున్నాను. 1981లో ఒక లక్షా 88 వేల ఇండ్ల స్థలాలు అయితే ఈ రోజు 3 లక్షల 17 వేలకు పెరిగాయంటే కారణం ఏమిటీ అనేది గుర్తించాలి. అదే విధంగా హరిజన సంక్షేమ కార్యక్రమాల కొరకు ఆర్థికపరమైనటువంటి సహాయం ఆరోజు లక్షా 50 వేల 431 కుటుంబాలకు జరిగితే ఈ రోజు 2 లక్షల 73 వేల కుటుంబాలకు ఆ కార్యక్రమం అందజేయబడింది. ఇలాగ లిస్టు ఉంది. ప్రభుత్వపరంగా జరిగినటువంటి వివరాలు అందిస్తున్నాను.

అట్లాగే ఈ రోజు మనకు యూనియన్ ప్రభుత్వం నుండి వచ్చే సహాయాన్ని గమనించాలని అన్ని పక్షాలకు విజ్ఞప్తి చేస్తున్నాను, 1980-81లో రూ.465 కోట్లు యాన్యువల్ ప్లాను ఉన్నప్పుడు రూ.190 కోట్ల సహాయం ఇచ్చారంటే అది 35.35 పర్సంట్ సహాయం అందజేయబడింది. అదే 1984-85లో రూ.978 కోట్లకు యాన్యువల్ ప్లాను పెరిగినప్పుడు కేవలం రూ.248 కోట్లు మాత్రమే ఇస్తే అది 25.35 పర్సంట్ అది కేంద్ర సహాయమని మనవిచేస్తున్నాను. పెరగవలసింది పోయి మనకు కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే సహాయం తరగడానికి కారణం ఏమిటి అనేది పెద్దలు, అనుభవజ్ఞులు మన రాష్ట్రాభివృద్దిని దృష్టిలో పెట్టుకొని ఆలోచించాలని ప్రతి ఒక్కరికి విజ్ఞప్తి చేస్తున్నాను.

ఇకపోతే మైనార్టీస్ సమస్యల గురించి చెప్పారు. 30 పర్సంట్ ముస్లిం సోదరులు ఉన్నచోట ఉర్దూను రెండవ అధికార భాషగా గుర్తించడం జరిగింది. 15 పర్సంట్ ఉన్న చోట వారి వ్యవహారాలు ఉత్తర ప్రత్యుత్తరాలు ప్రభుత్వపరంగా ఉన్నవి, ఉర్దూలో చేయడం జరుగుతుంది ఈనాడు ముఖ్యంగా మైనార్టీస్ కొరకు ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రారంభించడం జరిగింది. బీహార్ రాష్ట్రంలో ఉంది, మనది రెండవ రాష్ట్రం. కోటి రూపాయల పెట్టుబడితో అల్ప సంఖ్యాక వర్గాలవారికి ఆర్థిక సహాయం చేయాలని ఈ విధంగా చేయడం జరిగింది. 50 లక్షలు అడ్వాన్స్‌గా ఇవ్వడం, మిగతా 50 లక్షలు అది ఖర్చు పెట్టిన తరువాత వెంటనే అందించడం జరుగుతుంది. కోటి రూపాయల పెట్టుబడితో ఇవ్వడానికి నిర్ణయం జరిగింది. ఓల్డ్ సిటీ విషయంలో రూ.30 కోట్లు అభివృద్ధి కార్యక్రమాలకు మంజూరు చేయడం జరిగింది. కులీ కుతుబ్ షా ఆథారిటీస్‌తో చర్చించి చార్మినార్ నుండి ఫలక్‌నుమా వరకు ఉండే రహదారిని వెడల్పు చేయడానికిగానీ, మంచి

లైట్స్, డ్రైనేజ్, మంచినీటి సరఫరా విషయంలోగానీ ప్రభుత్వం తగిన శ్రద్ధ తీసుకుంటున్నది. అల్ప సంఖ్యాకులకు పరిపూర్ణమైనటువంటి రక్షణ కల్పించడములో వారి ఆచార కులకట్టుబాట్లను, వారి ధర్మాలను పరిరక్షించాలనే విధానం ప్రభుత్వం అవలంభిస్తున్నదని సవినయముగా మనవిచేస్తున్నాను. ఏ మతమైనా, ఏ కులమైనా పూజ్య బాపూజీ ఏదైతే చెప్పారో ఆ విధంగా కుల, మత, వర్ణ వర్గభేదాలకు అతీతమైనటువంటి సమ సమాజమే తెలుగుదేశ ప్రభుత్వ ధ్యేయమని మరొకసారి మనవిచేస్తున్నాను.

మైనార్టీ వర్గాల సంక్షేమం కొరకు పరిపూర్ణమైన ధ్యేయముతో అంకితమైనటువంటి భావంతో కృషిచేస్తున్నాము. అందరము కూడా సోదరభావముతో ఉండి అన్యోన్యమైన వాతావరణం కల్పించబడాలని సోదరులందరికీ మనవిచేస్తున్నాను. మిగిలిన అభివృద్ధి కార్యక్రమాలన్నింటి విషయములో కూడా మా ప్రభుత్వం పరిపూర్ణమైనటువంటి శ్రద్ధ తీసుకుంటున్నది. ఎవరు ఏ విధమైనటువంటి హానీ, విద్రోహ చర్యకు పూనుకున్నప్పటికీ, ఏ పార్టీవారైనా ఎవరైనప్పటికీ – సహించడం జరుగదు. శాంతి భద్రతల రక్షణ విషయములోగానీ ప్రతి విషయంలోగానీ సంపూర్ణమైనటువంటి న్యాయం అందరికీ లభింపజేయడం జరుగుతుందని సవినయముగా తెలియజేస్తున్నాను. మిగులు భూముల పంపకం విషయములో గౌరవసభ్యులు సూచనలు చేశారు. దాని విషయములో పూర్తిగా అమలు చేయడం జరుగుతుంది. మిగులు భూముల విషయములో మా ప్రభుత్వం శ్రద్ధ తీసుకొని ఎవరైనా ఏ విధంగానైనా దాచుకున్నారా చాటుగా పెట్టుకున్నారా అనే విషయాన్ని పూర్తిగా గమనించే విధానాన్ని అనుసరిస్తుందని సవినయముగా మనవిచేస్తున్నాను, పోతే మాండలిక విధానాన్ని గురించి అడిగారు. రాష్ట్ర ప్రభుత్వం అంటే కేవలము హైదరాబాద్‌లోనే లేదు. సామాన్య ప్రజానీకము వద్దకు పోయి పేదవాడి తలుపు తట్టి మీ సమస్యలు ఏమిటని తెలుసుకొని వాటికి పరిష్కారం అందించాలనే భావముతో అధికార వికేంద్రీకరణ చేసి అభివృద్ధి కార్యక్రమాలు ఎక్కడి వారికి అక్కడ అందించాలని, అలా చేసినప్పుడే సరైనటువంటి సక్రమమైనటువంటి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయనే భావముతో ఈ విధానాన్ని అవలంభించడం జరుగుతోందని మనవిచేస్తున్నాను.

ఈ రోజు సుమారు 1,100 మండలాలు వస్తున్నాయంటే ఏ విధంగా ఎక్కువ మందికి అవకాశం కలిగించబడుతుందో మీరే ఆలోచించండి. ఈనాడు డిస్ట్రిక్ట్ ప్లానింగ్ బోర్డు ఏర్పాటు చేయడం జరిగింది. ఏ జిల్లాకు ఆ జిల్లాకు సంబంధించినటువంటి ఒక మంత్రిని దానికి అధ్యక్షుడిగా ఏర్పాటు చేసి ఎం.ఎల్.ఏ.లను, ఎం.ఎల్.సి.లను, యం.పి.లను అందులో సభ్యులుగా ఉండేట్లుచేసి ఆ జిల్లా యొక్క అభివృద్ధి కార్యక్రమాలు వారి అజమాయిషీ క్రింద నిర్ణయించే ఏర్పాటు ప్రప్రథమంగా ఈ ప్రభుత్వం కలుగజేసిందని మనవిచేస్తున్నాను. ఇవన్నీ మనరాష్ట్రాన్ని ఒక సమగ్రమైనటువంటి, పద్ధతిలో తీసుకుపోవడానికి సమానమైనటువంటి,

న్యాయవంతమైనటువంటి అభివృద్ధి కార్యక్రమాలు అందరికీ అందించాలనే భావముతో తలపెట్టిన కార్యక్రమాలు అని ప్రతి ఒక్కరికి సవినయముగా తెలియజేస్తున్నాను.

ఈనాడు ఎంతో ఆదరణతో, అభిమానంతో విలువైన సూచనలు ఇచ్చినారు. ఆ సూచనలన్నీ పూర్తిగా పరిశీలించడం జరుగుతుంది. ఈనాడు కాలాభారంవల్ల అందరికీ పేరుపేరున సమాధానం ఇచ్చే అవకాశం కలుగకపోవచ్చును. కానీ అన్ని సమస్యలకు మీరిచ్చిన సూచనలు పరిశీలించబడతాయని, వాటిని సరియైన భావంతో అర్థం చేసుకొని వాటిని అమలుచేసే విధానంలో ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంటుందని మన సోదరులకు మనవిచేస్తున్నాను. ఈ సందర్భంలో మన 6 కోట్ల అశేష తెలుగు ప్రజానీకానికి మా ప్రభుత్వం తరపున హృదయపూర్వకమైనటువంటి కృతజ్ఞతా పూర్వకమైన నమస్కృతులు తెలియచేస్తున్నాను. ఈనాడు ఏదైతే ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలని ప్రతి ఒక్కరం కోరుకుంటున్నామో ఆ ప్రజాస్వామ్యమే దురదృష్టవశాత్తు ఒకప్పుడు దెబ్బతిన్నప్పుడు ఆ ప్రజాస్వామ్యంపట్ల మేము నిలుస్తామని ఎంతోమంది అమరజీవులు ఎంతోమంది ఆత్మత్యాగం చేసినారు. రక్తాన్ని ధారపోసినారు. ఈ సందర్భంలో వారందరికీ నా హృదయపూర్వకమైన శ్రద్ధాంజలి సమర్పిస్తున్నాను.

అదేవిధంగా ఈనాడు ప్రజాస్వామ్యం విషయంలో కూడా ఎంతో ఉత్సాహంతో వారందరూ కూడా ఎన్నికలలో పాల్గొని తిరిగి వారికి కావలసిన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నందుకు, వారిచ్చిన గౌరవానికి అనుగుణంగా ఏ మాత్రం కూడా తగ్గని రీతిలో అంకితమైన భావంతో మా ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి కృషి చేస్తుందని తెలుగుజాతి ఔన్నత్యాన్ని కాపాడడానికి పూర్తిగా అంకితమైన భావంతో పనిచేస్తుందని మరొకసారి తమద్వారా అశేష జనానికి తెలియజేస్తున్నాను. ఈనాడు ముఖ్యంగా మహిళా సంక్షేమం విషయం కూడా సోదరీమణులకు మనవిచేయవలసి ఉంది. ఈనాడు 100కి 50 మంది మన సమాజంలో ఉన్న సోదరీమణుల సంక్షేమం విస్మరించడం తెలుగుదేశం పార్టీ యొక్క ఆదర్శంకాదు. వారికి ఈనాడు వరకట్నంలాంటి పిశాచం ఇంకా సమాజంలోనుంచి పోలేదంటే అది కేవలం మన సమాజానికి సిగ్గుచేటు. దీనికి పరిష్కార మార్గం- కేవలం వారికి ఆర్థికపరమైన స్థోమతకానీ అధికారంకానీ కల్గించడమే ధర్మం అనే భావంతో మగవారితోపాటు ఆడవారికికూడా తల్లిదండ్రుల ఆస్తిలో సమానమైన హక్కు కల్గించాలనేదే మా ప్రభుత్వం ధ్యేయం.

అదేవిధంగా 30 పర్సంట్ ఉద్యోగాలు ఆడవారు చేయదగినవి కేటాయించడం జరిగింది. అదే విధంగా వృత్తి విద్యాపరమైనటువంటి విద్యా బోధనతో వారికి సంక్షేమ జీవితాన్ని ప్రసాదించాలనే ఉద్దేశ్యంతో ఈనాడు పద్మావతి విశ్వవిద్యాలయం తిరుపతిలో ప్రారంభించడం జరిగింది. ఒక తిరుపతిలోనేకాదు ప్రతి జిల్లాలో కూడా ఈ విధమైన మహిళా కళాశాల ప్రారంభించాలని దీనికి అనుబంధమైన కళాశాల ప్రతి జిల్లాలో కూడా ఆ యూనిట్ పని చేయాలనే

భావంతో ప్రభుత్వం అటువంటి నిర్ణయం తీసుకోవడానికి ఆలోచిస్తోందని మనవిచేస్తున్నాను. అదేవిధంగా ఈనాడు విధవరాంద్రకు ఎంత ఇస్తున్నాము అని అంటే - You must cut your coat according to the cloth you are having. ఏదో ఉన్నదానిలోనే ఈ ఆదర్శాలు కోసం పనిచేస్తున్న ప్రభుత్వం అందరికీ చేయాలి. అందరికీ ఇవ్వాలని అంటే అందరికంటే ఎక్కువ చేయాలనే ఉద్దేశ్యం ఉంది.

కానీ మనకు ఉన్నటువంటి ఆదాయ పరిమితిని సరిపెట్టుకోవడం వల్ల కొంతమందికి అంచెలవారీగా దానిని పూర్తిగా ఆచరణలో చేయవచ్చును కానీ ఒకేసారి సాధ్యం కాదనే భావంతో ఈనాడు సహాయం చేయవలసిన వారికి అందరికీ చేయడం జరుగుతుంది. అదేవిధంగా ఈనాడు వృద్ధ వ్యవసాయ కార్మికులు-ఎవరైతే జీవితం అంతా పంటలు పండించడం, రెక్కలు ముక్కలు చేసుకొని కండలు కరిగించుకుంటున్నారో, ఎవరైతే దిక్కులేక కేవలం కుంగి కృశించిపోతున్నారో అటువంటి వారికి సహాయపడడమే లక్ష్యంగా పెట్టుకొని పెన్షన్లు అందచేయడం జరుగుతోంది. అదేవిధంగా ఈ సంక్షేమ కార్యక్రమాలు-త్రొక్కే వానిదే రిక్షా, మధ్యదళారీ కమిషన్‌దారు ఆ శ్రమలో భాగం పంచుకుంటే ఆ శ్రామికుడు తన శ్రమను ఇంకెవరో పాలు పంచుకోవడానికి మూలం అవుతున్నారో, తన శ్రమను తన కుటుంబానికి వినియోగించుకోవాలనే ఉద్దేశ్యంతో ఆ పథకం ప్రారంభించడం జరిగింది. అదేవిధంగా ఈనాడు పేదవారి బిడ్డలకు పాఠశాల ఎక్కడనో ఉంటుంది. వారు అంతదూరం నడిచి వెళ్ళడం ఆరోగ్యవంతం కాదు. అటువంటి విజ్ఞానాత్మకమైన బోధనకు మనము ప్రోత్సాహం ఇవ్వాలనే ఉద్దేశ్యంతో మా ప్రభుత్వం ఉచిత ప్రయాణ సౌకర్యం 12 సంవత్సరములు లోపు ఉన్న పిల్లలకు కల్గించడం జరిగింది. అన్నింటికంటే ముఖ్యమైనది ఈనాడు ఉన్న విద్యాబోధన నిరుద్యోగానికి మూలకారణమైనదని, నిరుపయోగమైనదని, బ్రిటీష్ నిరంకుశత్వ విద్యా విధానానికి అవశేషంగా మిగిలిపోయినటువంటి ఆ బానిస విద్యా విధానం అవలంభించడం కేవలం దురదృష్టకరం అని భావిస్తున్నాను.

**మనకు ఉన్నటువంటి ఆదాయ పరిమితిని సరిపెట్టుకోవడం వల్ల కొంతమందికి అంచెలవారీగా దానిని పూర్తిగా ఆచరణలో చేయవచ్చును కానీ ఒకేసారి సాధ్యం కాదనే భావంతో ఈనాడు సహాయం చేయవలసిన వారికి అందరికీ చేయడం జరుగుతుంది. వృద్ధ వ్యవసాయ కార్మికులు ఎవరైతే దిక్కులేక కేవలం వంగి కృశించిపోతున్నారో అటువంటి వారికి సహాయపడడమే లక్ష్యంగా పెట్టుకొని పెన్షన్లు అందచేయడం జరుగుతోంది.**

ఈనాడు విద్య ఉన్నవారు అంతా ఉద్యోగం కావాలని అడగడం తప్ప తాను స్వంతంగా తన విజ్ఞానంతో తన కాళ్ళమీద తాను నిలబడాలనే ధ్యాసలేదు. కేవలం వృత్తిపరమైన విద్యా విధానంతో వారి జీవితాన్ని సంస్కరించాలి, ఎవరికివారు వారి విజ్ఞానంతో వారి కాళ్ళమీద నిలబడేటట్లు అవకాశం కల్పించాలి. అటువంటివారికి ఏ బ్యాంకులద్వారానో వడ్డీకి రుణాలు ఇచ్చి ప్రతి కుటీరాన్ని

ఒక పారిశ్రామిక కేంద్రంగా మార్చాలి. దానివల్లనే పారిశ్రామికాభివృద్ధిని సాధించగల్గుతాము, నిరుద్యోగ సమస్యను పరిష్కరించగల్గుతాము అని, అది మా ప్రభుత్వం యొక్క ఉద్దేశ్యం అని సభకు తమద్వారా తెలియజేస్తున్నాను. విద్య, విజువల్ సౌండ్ సిస్టమ్. అదికూడా ఒకవిధమైన ఈ టేప్స్ రికార్డుచేసి ఆ ధ్వనిద్వారా వారందరికీ ఈ విద్యను బోధించే విధానాన్ని అమలుపరచే దానిగురించి ప్రభుత్వం ఆలోచిస్తోందని మనవిచేస్తున్నాను. ఈవిధమైన విప్లవాత్మకమైన విధానంతో, సంస్కరణ భావంతో ఈనాడు ముందుకు సాగిపోవాలని ఎప్పుడో మిగిల్చిపోయినటువంటి బ్రిటిష్ విధానాన్ని అంటిపెట్టుకొని కూర్చుంటే దేశాభివృద్ధి సాగదని భారతీయ పౌరునిగా చెబుతున్నాను. జాతీయపరంగా మనం దిగుమతులను నిషేధించాలి, మన ఎగుమతులను పెంచుకోవాలి. అప్పుడుకానీ మనకు ఆర్థికపరమైన పరిపుష్టి రాదు. అటువంటి విధానాన్ని అవలంభించాలంటే వృత్తిపరమైన విద్యా విధానానికి తగినటువంటి ప్రాధాన్యత ప్రతిచోటా ఇవ్వాలి. విజ్ఞానధనులైన ప్రతి వ్యక్తి తన దేశానికి పారిశ్రామిక ప్రగతికి మార్గం వేసే వాడుగా తయారైతేకానీ మనము పరిపూర్ణమైన రాష్ట్ర ప్రగతిని, దేశ ప్రగతిని సాధించలేమని మనవిచేస్తున్నాను. కాబట్టి విద్య విషయంలో ప్రభుత్వం ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటున్నది. అదేవిధంగా వైద్యసౌకర్యాలు ఉన్నాయి. దీనిని గురించి కొంతమంది గౌరవసభ్యులు చెప్పినారు. ఆరోగ్యవంతమైన విధానాలు అవలంభించడం లేదన్నది ఒప్పుకుంటున్నాను. ఆ విధానాలు అవలంభించాలంటే ప్రతి మండలంలో ఒక హెల్త్ సెంటర్ ఉండాలి. మండలంలో వనరులు అన్నీ ప్రతి ఒక్కరికి లభించాలి. అక్కడున్న సౌకర్యాలు అందరూ పొందగలిగేవిధానం ఈ మాండలిక విధానం రాజ్యాంగ పరిపాలన విధానంలో ముఖ్యమైన విశేషం అని మనవిచేస్తున్నాను.

ఈనాడు విద్య, వైద్య సౌకర్యాలు లభింపచేయాలి. ప్రతివారికి విజ్ఞానం, ఆరోగ్యం చాలా అవసరం. ఈనాడు ప్రభుత్వ పరంగా ఇస్తున్నటువంటి డైటింగ్ చార్జీలు పెంచినాము, డాక్టర్లను పెంచినాము. ఇంకా ఎన్నో పెంచినాము. ఈ విధంగా ఎన్నో చేసినాము. కానీ అది తృప్తికరంగా లేదని చెబుతున్నాను. మా ప్రభుత్వాన్ని సమర్థించను. ఎన్నో చేయాలని ఉంది. మీ అందరి సహాయం కూడా కావాలి. మనము పరిపూర్ణమైన, ఆర్థిక పరమైన వనరులు సమకూర్చుకోవాలి. అప్పుడు కానీ అన్నీ పూర్తి చేయలేము. ఈ విధమైన కార్యక్రమాలతో నడిచే ఈ ప్రభుత్వానికి మీ ఆశీస్సులు, అండదండలు చాలా అవసరమని మనవిచేస్తున్నాను. మీరందరూ, తెలుగుదేశం వారు 200 మంది ఆ ప్రక్కన కూర్చున్నారు, మీరు ఆ ప్రక్కన కూర్చున్నారనే భావం లేకుండా మొత్తం 294 మంది సభ్యులు కలిసికట్టుగా ఒక దీక్షతో పనిచేసి మనరాష్ట్ర సమగ్రతకు మరింత కృషి చేయాలని కోరుతున్నాను. ఈనాడు మీరిచ్చిన సూచనలకు క్లుప్తంగా జవాబు ఇచ్చే అవకాశాన్ని కల్గించినందుకు గౌరవనీయులైన అధ్యక్షులకు నా అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేస్తూ మీ అందరికీ అభినందనలు తెలియజేస్తున్నాను. జై తెలుగునాడు. జై హింద్..!

◆◆

ఆగస్టు 12, 1985

# పరిశుద్ధమైన పరిపాలనను ప్రజలకు అందిస్తాము

*(మంత్రులచే ఆస్తుల ప్రకటనపై తమ విధానాన్ని వివరిస్తూ)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** నూతన మంత్రివర్గం వచ్చిన తరువాత ఆస్తులు బహిర్గతం చేయాలనే విషయంలో ఏ విధమైన విధానాన్ని అనుసరించాలనే దానిమీద నిర్ణయం తీసుకొనవలసిన అవసరం ఉంది. తమిళనాడు పేటరన్‌ని అడాప్ట్ చేయాలని నిర్ణయం చేయడం జరిగింది. ఆ పేటరన్‌ని అమలు చేయడానికి అందరు మంత్రులకు వ్రాయడం జరిగింది. వివరాలు అందచేస్తారని మనవిచేస్తున్నాను. వాటిని బయటపెట్టే విషయం ఏదైనా అవసరం వచ్చినపుడు, అవినీతికరమైన ఆరోపణలు వచ్చినపుడు ప్రత్యేకముగా బహిర్గతం చేయవలసిన అవసరం ఉంది. ఇప్పుడు చేయవలసిన అవసరం లేదని మనవిచేస్తున్నాను.

ప్రతి మంత్రి ఆస్తుల వివరాలు కవరులో పెట్టి సీలువేసి ఉంచడం జరుగుతుంది. అవినీతికర ఆరోపణలు వచ్చినపుడు సీలుతీసి పరీక్షింప చేయడానికి తగిన చర్య తీసుకొనబడుతుంది. ఇప్పుడు ఇక్కడ పెట్టడం భావ్యము కాదు.

అధ్యక్షా, నాకు చాలా సంతోషంగా ఉంది. ఎందుకంటే ఈనాడు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి మొత్తం ఈ విధానసభకు సంబంధించిన 294 మంది శాసనసభ్యులు కూడా ఒక కంఠముతో ఒక నిర్ణయానికి వచ్చి ప్రజాస్వామ్యాన్ని ఉద్ధరించడానికి మనమందరము బద్ధకంకణులమవుతామని పూనుకున్నప్పుడు వెనక్కుతగ్గడం అనేది తెలుగుదేశం ప్రభుత్వానికి లేదని మనవిచేస్తున్నాను. కాబట్టి దయచేసి మీద్వారా సభ్యులందరికీ మనవిచేస్తున్నాను. ఈ 294 మంది శాసనసభ్యుల ఆస్తిపాస్తులు కూడా వచ్చే సెప్టెంబరు నెల 15వ తేదీ లోపల మీకు అందజేయబడాలని వారిని మీద్వారా వినమ్రతతో అభ్యర్థిస్తున్నాను.

అధ్యక్షా, గత ప్రభుత్వాలు ఈ ఆచారాన్ని అవలంభించలేదు. ఇప్పుడు కూడా యూనియన్ ప్రభుత్వం అవలంభించడంలేదు. అయినప్పటికీ నూతన సాంప్రదాయాన్ని ప్రజాస్వామ్య పద్ధతులలో

ఏ అనుమానాలకు లోబడకుండా అతీతమైనటువంటి విధంగా నిర్వహించుకోవాలన్నది నేను పూర్తిగా భావిస్తున్నాను. అది మన గౌరవనీయ సభ్యులు తమద్వారా చేసిన సూచనగా నేను భావిస్తున్నాను. కాబట్టి ఏదైనా మంచి సాంప్రదాయం నెలకొల్పాలి. ఈనాడు ప్రతి ఒక్కరం ప్రజాప్రతినిధులమే – పరిశుద్ధమైనటువంటి పరిపాలనను ప్రజలకు అందిస్తాము. అవినీతి, అక్రమం, అన్యాయం ఏమీ లేనటువంటి పవిత్రమైనటువంటి పాలనా వ్యవస్థను, పరిశుద్ధమైన పరిపాలనా వ్యవస్థను ప్రజలకు అందిస్తారన్న భావముతో, నమ్మకముతో అందరూ ఎదురు చూస్తున్నారు.

ఈనాడు సందేహాలు వచ్చాయి. ఎందుకు ఆస్తులు ప్రకటించాలని అడగడములో నేను గ్రహించిన ఆంతర్యం ఏమంటే – ఏదో అధికారాన్ని, ఉన్నటువంటి పదవులను దుర్వినియోగం చేసి తమకు ఉన్నటువంటి వాటికంటే ఎక్కువ ఆస్తులు సంక్రమింపజేసుకుంటున్నారనే అనుమానంతో, ఈ విధమైనటువంటి సందేహాస్పదమైన ప్రశ్నలు ఉద్భవిస్తాయని మనమందరం కూడా ప్రజాప్రతినిధులమే మనం నూతన సాంప్రదాయం నెలకొల్పవలసిన బాధ్యత ఉంది. 294 మంది శాసనసభ్యులు మొత్తం సెప్టెంబరు 15వ తేదీ లోపల తమ ఆస్తిపాస్తులను డిక్లేర్ చేయవలసిన అవసరం ఉంది. ప్రజలకు అందించాలి, ప్రజలకు నమ్మకం కల్పించాలి. ఇంతకు మించి ఏమైనా ఆస్తిపాస్తులు సంపాదిస్తే ప్రజల ఆస్తులను దుర్వినియోగం చేసి సంపాదించినట్లుగా అవుతుంది.

◆◆

సెప్టెంబర్ 10, 1985

# ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతీకలు పాత్రికేయులు

*(జర్నలిస్టులకు పాలేకర్ అవార్డు అమలునకు సంబంధించి జరిగిన చర్చ)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, గౌరవ సభ్యులు, వారు ఈనాడు ఇలా పత్రికల మీద అనుమానాన్ని వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో పత్రికల వారు నిర్వహించే బాధ్యత ఏమిటి? పూర్తిగా వివరించారు. ఆ ప్రజాస్వామ్య విధానంలో వారి మీద గౌరవం ఉన్న వ్యక్తిగా నేను ఈనాడు లెజిస్లేచర్, ఎగ్జిక్యూటివ్, జుడీషియరీ మూడు స్టేట్స్ అయితే, నాలుగవ స్టేట్‌గా పత్రికలవారిని గుర్తించడం నేను స్వయంగా చేస్తున్నానని మనవిచేస్తున్నాను. ఇకపోతే, నిన్న పత్రికల వారందరూ ఊరేగింపుగా వస్తూ, ఉన్నటువంటి సమస్యల విషయంలో ముఖ్యమంత్రికి విజ్ఞాపనమిస్తాం అన్నారు.

వారి సమస్యలు ఏమిటో, వారికి ఉన్నటువంటి కోరికలు ఏమిటో నాకు పూర్తిగా తెలియవు. కాబట్టి వెంటనే వారి ప్రతినిధి వర్గాన్ని రావలసిందిగా సగౌరవంగా ఆహ్వానించడం జరిగింది. వారి సమస్య ఏమిటో తెలుసుకోకుండా, వాటిని పరిశీలించకుండా ఏ విధంగా, రాష్ట్ర వ్యాప్తంగా, నాలుగు మూలల నుండి వచ్చినటువంటి ఆ యొక్క జర్నలిస్టు సభ్యులకు ఏ విధంగా నేను ఉపన్యాసం ఇవ్వాలి? ఏవిధంగా సమస్యలు తీర్చుతానని చెప్పాలి? అందుకు ప్రతినిధి వర్గానికి చెప్పాను "మీరు ఇచ్చినటువంటి సమస్యలు సగౌరవంగా పరిశీలించడం జరుగుతుంది. ప్రభుత్వ పరంగా న్యాయం జరుగుతుంది" అని నేను గౌరవ భావంతో నేను వారికి అత్యంత సమాచారిణీయ పద్ధతిలో హామీ ఇవ్వడం జరిగిందని నేను మీకు మనవిచేస్తున్నాను. ఈ సమస్యల విషయంలో ఆనాడు గవర్నర్ గారి దగ్గర హామీ ఇచ్చారు ముఖ్యమంత్రిగారు అని అన్నారు. హామీ ఇచ్చినటువంటి విధానాలను అవలంభించడంలో ఏ మాత్రం అభ్యంతరం లేదని సభకు మీ ద్వారా నేను మనవిచేస్తున్నాను. ఆనాడు నేను చెప్పినట్లుగానే రెండు లక్షల రూపాయల నిధిని ప్రభుత్వం ఇవ్వడం జరుగుతుంది. వారు కూడా వారి తరఫున కంట్రిబ్యూషన్ ఇచ్చి హైదరాబాద్ స్టేట్

బ్యాంకులో ఆ మొత్తాన్ని పెట్టి దాని మీద వచ్చే వడ్డీ మొదలైన ఫలితాలను వారి యొక్క సంక్షేమానికి ఉపయోగించుకోవచ్చుననేటటువంటి విధానం ఆనాడు నా చేత ప్రకటించబడింది. దాన్ని పూర్తిగా అనుసరించడం జరుగుతుందని గౌరవనీయులైన సభ్యులకు తమ ద్వారా నేను మనవిచేస్తున్నాను.

తరువాత పాస్‌ల విషయం. పాస్‌ల విషయంలో పూర్తిగా అక్రెడిటెడ్ జర్నలిస్టులు ఎవరైతే ఉన్నారో వారందరికీ కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ప్రయాణ సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని మీకు నేను సవినయముగా మనవిచేస్తున్నాను. అదేవిధంగా కమిటీ విషయంలో, ఒక కమిటీ వేయడం జరిగింది, ఐదుగురు సభ్యులతో కూడినది. ప్రభుత్వంపరంగా గానీ, లేకపోతే వారికి ఉన్నటువంటి సమస్యలుకానీ, ఇవన్నీ కూడా పరిశీలించడానికి, నిర్ణయించడానికి పూర్తిగా కమిటీ ఉపయోగపడుతుంది. ఈనాడు గౌరవసభ్యులు ఏ భావనతో వారి ఉద్దేశాలను వ్యక్తం చేశారో కమిటీ ఉంటే మంచిదని, ఆ నిర్ణయానికే ప్రభుత్వం వచ్చింది. ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. 1) సెక్రటరీ, పొలిటికల్, జి.ఏ.డి, ఛైర్మన్ 2) ఎ రిప్రజంటేటివ్ ఆఫ్ ది జర్నలిస్టు 3) ఎ రిప్రజంటేటివ్ ఆఫ్ ది మేనేజ్‌మెంట్ ఆఫ్ న్యూస్ పేపర్స్ 4) ఎ రిప్రజంటేటివ్ ఆఫ్ ది గవర్నమెంట్ రిప్రజంటింగ్ ది డిపార్టుమెంట్ టు విచ్ ది మ్యాటర్ రిలేట్స్ 5) జాయింట్ కమిషనర్ ఫర్ లా, ఈ అయిదుగురు సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను. పాలేకర్ అవార్డు విషయంలో ప్రభుత్వం దాన్ని అమలుపరచడానికి ఏ మాత్రం వెనుకాడడం లేదు.

**అక్రెడిటెడ్ జర్నలిస్టులు ఎవరైతే ఉన్నారో వారందరికీ కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ప్రయాణ సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని మీకు నేను మనవిచేస్తున్నాను. కమిటీ విషయంలో, ఒక కమిటీ వేయడం జరిగింది, ఐదుగురు సభ్యులతో కూడినది. ప్రభుత్వంపరంగా గానీ, లేకపోతే వారికి ఉన్నటువంటి సమస్యలుకానీ, ఇవన్నీ కూడా పరిశీలించడానికి, నిర్ణయించడానికి పూర్తిగా కమిటీ ఉపయోగపడుతుంది.**

ఈనాడు మీ ద్వారా గౌరవ సభకు మనవి ఏమంటే పాలేకర్ అవార్డును పూర్తిగా ప్రభుత్వం సమర్థిస్తుందని నేను తెలియజేస్తున్నాను. ముఖ్యంగా సోదరులకు మనవిచేసేది ఏమిటంటే పత్రికా ప్రతినిధుల ఇళ్ళ స్థలాలు సంగతి చెప్పారు. ఇళ్ళ స్థలాల విషయంలో ప్రభుత్వం ఒక విధానాన్ని అవలంభిస్తున్నది. ఎవరైతే బలహీన వర్గాల వారు ఉంటారో పూర్తిగా వారికి ఇల్లు కట్టించి ఇవ్వాలనేది ప్రభుత్వ నిర్ణయం. ఆ పరిధిలోకి వచ్చే వారికి ప్రభుత్వం చేస్తుంది. అందుకు ఏ మాత్రం కూడా వెనుకాడదని నేను సభకు మనవిచేస్తున్నాను. ఒక ఇంచ్ నేల కూడా ఇవ్వను అనేది నా సొత్తు ఏమీ నేను ఇవ్వడం లేదు. అలాంటి దురుసు మాట మాట్లాడవలసిన అవసరం లేదు. గౌరవ సభ్యులు నా మీద చేసిన అభియోగానికి తమ ద్వారా నేను వారికి సమాధానం ఇస్తున్నాను. కేవలం ఈనాడు శాసనసభ్యులకు గానీ, ఐ.ఎ.ఎస్. అధికారులకుగానీ ప్రభుత్వ పరంగా ఇళ్ళ స్థలాలు మంజూరు చేయడం అనేది మేము ఆపడం

జరిగింది. ఆ విషయం పరిశీలిస్తామన్నాము తప్ప ఒక్క అంగుళం మేర కూడా మేము ఇవ్వము అనే దురుసు మాట ప్రయోగించే అవివేకిని కాదని సవినయంగా మనవిచేస్తున్నాను. ముఖ్యంగా ఈ సభ ద్వారా తెలియజెప్పేది ఏమంటే, ఇక్కడ పత్రికా ప్రతినిధులు ఉన్నారు.

వారందరికీ కూడా నేను తెలియజెప్పేది ఏమిటంటే ప్రభుత్వం ఏవిధంగా వారిని గౌరవించాలి. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతీకలుగా వ్యవహరించడానికి వారు ఏవిధంగా దోహదం చేస్తున్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి, ప్రభుత్వ సిద్ధాంతాలను ప్రజల దగ్గరకు తీసుకురావడానికి ఏవిధంగా వారు కృషి చేస్తున్నారు, వారి యొక్క త్యాగం, దీక్షను ప్రభుత్వము ఎప్పుడూ మరచిపోదని నేను సవినయంగా మనవిచేస్తున్నాను. ఏ సమస్యలు వచ్చినప్పటికీ సహృదయంతో వాటిని పూర్తిగా పరిశీలించడానికి ప్రభుత్వం తప్పకుండా కృషి చేస్తుందని ప్రభుత్వ విధానాన్ని తన ఎదుట నేను ప్రకటిస్తున్నాను. అంతేకాకుండా ఈనాడు లేబరు మినిస్టరు చెప్పవలసిన దాన్ని వారిపట్ల ఉన్న గౌరవంతోనే నేను సమాధానం చెబుతున్నాను. నిన్న "ముఖ్యమంత్రిగారికి మేము విజ్ఞప్తి ఇవ్వాలి. మా ప్రతినిధి వర్గం వారం వస్తాము" అని ఏ గౌరవంతో నాతో అన్నారో, ఆ గౌరవంతో నేను వారికి సమాధానం ఈ సభ ద్వారా చెప్పాలనే ఉద్దేశంతో నాకు వారిపట్ల ఉన్న గౌరవ భావాన్ని వ్యక్తం చేస్తూ వారి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వము ఏమాత్రం వెనుకాడదు, ఈ యొక్క కమిటీ ద్వారా అన్ని సమస్యలను తగు విధంగా పరిష్కరించడం జరుగుతుందని వారికి నేను సవినయంగా మనవిచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

◆◆

సెప్టెంబర్ 16, 1985

# వృత్తిపరమైన విద్యాబోధనతోనే నిరుద్యోగ సమస్య పరిష్కారం

*(బడ్జెట్ డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్‌పై జరిగిన చర్చ)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, గౌరవ సభ్యులకు అందరికీ కూడా పారిశ్రామికాభివృద్ధిమీద తమ అమూల్యమైన అభిప్రాయాలు ఇచ్చినందుకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

అధ్యక్షా, గౌరవనీయ సభ్యులు రామచంద్రారెడ్డిగారు చెప్పారు. వారి అభిప్రాయముతో నేను ఏకీభవిస్తున్నాను. ఇప్పుడు నో ఇండస్ట్రీ డిస్ట్రిక్ట్ అనేది మన రాష్ట్రంలో లేదని కేంద్ర ప్రభుత్వము ప్రకటించింది. ఆ విధానము గౌరవనీయ సభ్యులకు తెలిసేవుంటుంది. నో ఇండస్ట్రీ డిస్ట్రిక్ట్ కాదు, నో ఇండస్ట్రీ బ్లాకుస్గా నిర్ణయము తీసుకోవాలి ప్రభుత్వము అనేటటువంటి విధానము రాష్ట్ర ప్రభుత్వము కేంద్ర ప్రభుత్వానికి తెలియచేయడము జరిగింది. కాస్త ఏదో రూ.5 కోట్లు ప్రతి జిల్లాలోను ఉన్నంతమాత్రముచేత ఆ జిల్లాలో పరిశ్రమలు ఉన్నట్లే లెక్క అనుకోవడము పొరబాటు. ఈనాడు వెనుకబడిన ప్రాంతాలు జిల్లాల్లో ఎన్నో ఉన్నాయి కాబట్టి నో ఇండస్ట్రీ బ్లాకుస్గా పరిగణించాలి అనేది ఈనాడు ప్రభుత్వ సిద్ధాంతముగా తెలియచేయడము జరిగిందని మనవిచేస్తున్నాను. ఇక టాక్సేషన్‌కి సంబంధించినంతవరకు పన్నులు రాయితీ చేయడము వల్ల ఉత్పత్తులు పెరగడానికిగానీ, మిగిలిన పన్నులు కూడా ఎక్కువకావడానికిగానీ, లభించడానికిగానీ అవకాశముంది అన్నారు.

రాష్ట్రాభివృద్ధికి కావలసింది పారిశ్రామికవంతము చేయడం కాబట్టి అది ఏవిధంగా చేస్తే బాగుంటుందనేది పరిశీలన చేస్తామని మనవిచేస్తున్నాను. తరువాత రామచంద్రారెడ్డిగారు ఈ పారిశ్రామిక అభివృద్ధి పెట్టుబడికి 20 కోట్ల రూపాయలు అదనంగా ఇవ్వాలన్నారు. మేము కేంద్రప్రభుత్వంనుంచి ఏమైనా డబ్బు సంపాదించగలిగితే తప్పకుండా ఈ 20కోట్ల రూపాయలు రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి కేటాయింపు పెంచుదామని మనవిచేస్తున్నాను.

మైనారిటీస్ అభివృద్ధి కొరకు వారికి 1 కోటి రూపాయలు ఇచ్చాను. హైదరాబాద్ నగర అభివృద్ధికి 30 కోట్ల రూపాయలు మంజూరుచేయడము జరిగింది. చార్మినార్ నుంచి ఫలక్‌నుమాకు కూడా అదనముగా నిధులు కేటాయించి మంచి నీటి వసతి, డ్రైనేజీ స్కీముల కొరకు కొంత డబ్బు ఇవ్వాలనే ఉద్దేశ్యముంది. ఈ ట్విన్ సిటీస్‌ను ఆరోగ్యకరమైన, సుందరవంతమైన పట్టణముగా చేయాలనుకుంటూ, దానికి కృషిచేస్తున్నాము. ఈ విషయములో చార్మినార్ ప్రాంతానికి చెందిన ఇతర ప్రాంతాల సభ్యులు ఏవిధముగానూ సంకోచించవలసిన అవసరములేదు. ఈ హైదరాబాద్, సికిందరాబాద్ నగరాభివృద్ధికి పూర్తి చర్యలు తీసుకుంటాము.

సభ్యులు చెప్పిన విషయాన్ని నేను గమనించాను. చల్లపల్లిలో చక్కెర ఫ్యాక్టరీకి ఆల్కహాల్ కాకుండా కెమికల్స్ కొన్ని ఇంటర్‌డ్యూస్ చేయించాము. చక్కెరకంటే కూడా ఈ చక్కెర ఫ్యాక్టరీలలో తయారయ్యే మొలాసిస్ నుండి ఆల్కహాల్ ఎక్కువ తయారుచేస్తే మంచిదని ఆ విధంగా ఆలోచనలు చేస్తున్నాము. తరువాత ప్రభుత్వంతో సంప్రదించి మాత్రమే పరిశ్రమలు పెడితే మంచిదని చెప్పాము. ప్రజలకు ఉపయోగపడే వస్తువులనే ఈ ఫ్యాక్టరీలలో ఉత్పత్తి చేయడం మంచిదని ఫ్యాక్టరీలు పెట్టుకునేవారికి సూచన చేయడం జరిగింది. గౌరవసభ్యులు సూచించినట్లుగా తప్పకుండా సింగరేణి మేనేజింగ్ డైరెక్టరు శ్రీ కె.పి. రావుగారితో సంప్రదించి ఏ విధముగా ఆ మిల్లును ఓపెన్ చేయించాలో పరిశీలన చేయిస్తాను.

**చల్లపల్లిలో చక్కెర ఫ్యాక్టరీకి ఆల్కహాల్ కాకుండా కెమికల్స్ కొన్ని ఇంటర్‌డ్యూస్ చేయించాము. ఈ చక్కెర ఫ్యాక్టరీలలో తయారయ్యే మొలాసిస్ నుండి ఆల్కహాల్ ఎక్కువ తయారుచేస్తే మంచిదని ఆ విధంగా ఆలోచనలు చేస్తున్నాము. ప్రభుత్వంతో సంప్రదించి మాత్రమే పరిశ్రమలు పెడితే మంచిదని చెప్పాము. ప్రజలకు ఉపయోగపడే వస్తువులనే ఉత్పత్తి చేయడం మంచిదని ఫ్యాక్టరీల వారికి సూచన చేయడం జరిగింది.**

మేము ఈ డి.బి.ఆర్. మిల్స్‌ను తెరిపించడానికి ఏ విధముగా ప్రయత్నాలు చేస్తున్నామో తెలుసు. గౌరవ సభ్యులకు ఎంత ఆసక్తి ఉందో, అంతే ఆసక్తితో ఆ మిల్లును తెరిపించాలని మాకు ఉంది. దానికి అన్ని విధాలా ప్రభుత్వము కృషిచేస్తున్నది. దానిని తిరిగి ప్రారంభించడము కోసము 75 లక్షలు రన్నింగ్ కేపిటల్ కొరకు అడిగితే కృష్ణంరాజు అనే ఎంటర్‌ప్రెన్యూర్‌కు ప్రభుత్వము సహాయము చేయడానికి ప్రయత్నిస్తున్నామని వారికి కూడా తెలుసు. వీలైనంత త్వరలో ఆ డి.బి.ఆర్. మిల్లును తెరిపిస్తామని మనవి చేస్తున్నాను.

మంగళగిరి టైర్ల ఫ్యాక్టరీ విషయంలో ప్రభుత్వం శ్రద్ధతో పనిచేస్తోంది. దానికి కో-ప్రమోటర్స్ కోసం ప్రయత్నం చేయడం జరుగుతోంది. దీని విషయంలో ఆసక్తి చూపుతూ ఇద్దరు, ముగ్గురు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారు. కాబట్టి వెంటనే ఈ విషయమై నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని మనవిచేస్తున్నాను.

మూడు కోట్ల రూపాయల పెట్టుబడితో నాగార్జునసాగర్ ప్రాంతములో డ్రగ్స్ కర్మాగారాన్ని నెలకొల్పాలనే నిర్ణయము తీసుకోవడము జరిగింది. అవసరమైన సామాన్య మందుల తయారీ ఇక్కడ చేయడము జరుగుతుంది. దీనివల్ల సక్రమమైన ధరలకు మందులు సమకూర్చడానికి అవకాశము కలుగుతుందని మనవిచేస్తున్నాను.

వ్యవసాయోత్పత్తిపై ఆధారపడిన పరిశ్రమ గురించి అంటే తవుడునుంచి నూనె తీసే పరిశ్రమ స్థాపనకు ప్రభుత్వము కృషిచేస్తోందని మనవిచేసాను. అదేవిధముగా ఎరువుల కర్మాగారము గురించి కూడా మీకు తెలుసు. ఇలాంటి పరిశ్రమల గురించి ప్రభుత్వము శ్రద్ధవహించడము జరుగుతోంది. ఇక ఇలాంటి పరిశ్రమలు ఏర్పాటుచేసేవారికి ఇన్సెంటివ్ ఇవ్వాలని అడిగారు. వెనుకబడిన ప్రాంతాలలో పరిశ్రమలను ఏర్పాటుచేయదలచుకొన్న వారికి తగిన ఇన్సెంటివ్స్ ఉన్నాయి. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ఎంతోమంది పరిశ్రమలను స్థాపిస్తున్నారు. అందువల్ల ప్రత్యేకముగా ఎక్కువ ఇన్సెంటివ్ ఇవ్వవలసిన అవసరములేదేమోనని భావిస్తున్నాను. ఇక వివిధ పరిశ్రమలలో, ఆయా రంగాలలో పరిజ్ఞానము ఉన్నవారినే నియమించాలని చెప్పారు. దీనితో నేను ఏకీభవిస్తున్నాను. ఐ.ఏ.ఎస్., ఐ.పి.ఎస్. ఆఫీసర్స్‌ను అడ్మినిస్ట్రేషన్‌లో ఉపయోగించుకొని, పరిశ్రమలలో మాత్రము ఆయా రంగాలలో పరిజ్ఞానము కలవారినే నియమించడము జరుగుతుంది. ముఖ్యముగా కో-ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీస్ విషయములో ఈ విధముగా చేస్తాము. ప్రభుత్వము వారినుంచి అప్లికేషన్స్ కూడా తీసుకోవడము జరిగింది. వెంటనే ఒక నిర్ణయము తీసుకొని, ఎంపిక చేయడము జరుగుతుందని మనవి చేస్తున్నాను. డి.బి.ఆర్. మిల్స్ విషయంలో రిజర్వు బ్యాంకు నుంచి ప్రభుత్వానికి మూడు రోజుల క్రితమే ఒక ఉత్తరం వచ్చింది. దాని ప్రకారం ప్రభుత్వం రూ.75 లక్షలు పెట్టడానికి సిద్ధంగా ఉంది. కృష్ణంరాజుగారికి ఈ విషయం వెంటనే తెలియజేసి దానిని తెరిపించడానికి ఏర్పాట్లు చేస్తామని మనవిచేస్తున్నాను.

అధ్యక్షా, ఈనాడు మానవ వనరులు ఉపయోగించాలంటే, కేవలం పరిశ్రములయొక్క స్థాపనవల్ల కాదు, విద్యావిధానం మారాలి. నేను ఎన్నోసార్లు, ఎన్నోసభల్లో చెప్పడం జరిగింది. ఈనాడు వృత్తిపరమైన విద్యాబోధన ఉంటేగానీ సంపూర్ణమైన నిరుద్యోగ సమస్య పూర్తికాదని నా అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తున్నాను. చదువుకున్నవారు ఉద్యోగం కోసం ఎగబడడం కాకుండా, స్వతంత్రంగా తన కాళ్ళ మీద తాను నిలబడి, తనచేతిలో ఉన్నటువంటి ఆ విజ్ఞానంద్వారా తాను పొందుపరచుకున్నటువంటి ఆ విజ్ఞానంద్వారా స్వతంత్రంగా జరగడానికి దేశ సౌభాగ్యానికి దోహదపడడానికి ఉపయోగపడాలని నేను కోరుకుంటున్నాను. ఇక ప్రభుత్వపరంగా ఈ మానవశక్తిని వినియోగించుకునే విధానం ఏవిధంగా ప్రభుత్వం అవలంభిస్తుందో గౌరవసభ్యులకు తెలుసు. ఈ రోజు తెలుగుగంగ విషయం వచ్చినా, కర్నూలు జిల్లాలో కాంట్రాక్టర్లను నివారించి అక్కడున్నటువంటి సామాన్య ప్రజానీకానికి త్రవ్వకం పనులు మొదలు శ్రమ శక్తితో కూడిన

పనులలో ఉపయోగించడం, మానవశక్తిని పూర్తిగా మన రాష్ట్రాభివృద్ధికి వాడుకోవడం ప్రభుత్వ విధానంగా వారికి మనవిచేస్తున్నాను. మధ్య కాంట్రాక్టర్లను నివారించి సాధ్యమైనంతవరకు ఈ మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు కొన్నిగానీ, అన్నింటినీ ఈ మానవశక్తితో సాధించాలనేది ప్రభుత్వ ధ్యేయం అని వారికి సవినయంగా మనవిచేస్తున్నాను.

ఇకపోతే, ఈ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ విషయంలో కూడా మేనేజింగ్ బోర్డు కూడా ఉంది. అది ప్రభుత్వం ఏర్పరచిందని మనవిచేస్తున్నాను. సకాలంలో ఆడిట్ చేయించడం సరియైన విధానంలో నష్టాలు లేకుండా చూడడానికి సరియైన సలహాలు అందించడానికి ఈ మేనేజింగ్ బోర్డు ఉపయోగించేందుకు ఇదికూడా చేయడం జరుగుతుందని మనవిచేస్తున్నాను. ఇంకా ఎక్కువ చర్యలు తీసుకోవడం జరుగుతుంది. పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ కూడా నష్టంకాకుండా ఈ పరిశ్రమలలో ఉపయోగకరంగా ఉండే విధానాన్ని ప్రభుత్వం ఆలోచిస్తుందని కూడా వారికి మనవిచేస్తున్నాను. ఇకపోతే, ముఖ్యంగా వారికి ఈ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ ఏవిధంగా నడపాలనే విధానం ఏమిటో ముఖ్యంగా ఇదివరకు మనవిచేశాను. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ కాకుండా ఆ పరిశ్రమలో మంచి అనుభవం ఉన్నవారిని టెక్నోక్రాట్స్‌ను, ఆ విజ్ఞానవేత్తలను కూడా ఆ కార్పొరేషన్ ఛైర్మన్‌లుగాకానీ, మేనేజింగ్ డైరెక్టరుగాగానీ, ఏర్పరచడం జరుగుతుందని మనవిచేస్తున్నాను. ఇక ఎన్.టి.సి. విషయం అడిగారు, నిజంగా వారితో ఏకీభవిస్తున్నాను. ఎన్.టి.సి. ఈనాడు అనుకున్నటువంటి ఫలితాలు సాధించలేకపోతున్నది. ఏ విధంగా అయినాసరే దాన్ని పటిష్టవంతంగా చేసి ఎక్కువ వ్యాపారాత్మకమైన విధానానికి అనుగుణంగా ఉండేటట్లుగా రూపొందించాలన్నదే ప్రభుత్వం యొక్క ఆశయంగా మనవిచేస్తున్నాను. ఇపుడు బొగ్గు ఎన్.టి.సి. ద్వారా సరఫరా, ఎర్రచందనం, మినరల్స్, రిసోర్సెస్‌ను కూడా ఆ ఎన్.టి.సి. ద్వారానే వ్యాపారం చేయాలి. ఆ గనులు కానివ్వండి, మిగిలిన వ్యాపారాత్మకమైన వస్తువులు కానివ్వండి జాతీయం చేయాలనేటువంటి ప్రభుత్వపరమైన విధానంగా వారికి నేను సవినయంగా మనవిచేస్తున్నాను.

అధ్యక్షా, ఇప్పుడు ఆ విమల్ బట్టలు వ్యాపారానికి సంబంధించినవారు ఒకరు, తరువాత మరొక ఇద్దరు కూడా వస్తున్నారు. సుమారు రూ.100 కోట్లకు పైగా పెట్టుబడి ఉంటుంది. అటువంటి పెద్ద మొత్తాన్ని పెట్టవలసిన సమర్థులు వచ్చినపుడు, కనీసము దాని విషయము పరిశీలించడము జరుగుతుందని నేను వారికి మనవిచేస్తున్నాను.

అధ్యక్షా, గౌరవ సభ్యులకు మీద్వారా నేను మనవిచేస్తున్నాను. చంద్రారెడ్డిగారు ప్రశ్నించారు. నా నియోజకవర్గం, ఏ నియోజకవర్గం అయినా ఒకటే మనందరికీ కూడా. సంపూర్ణమైన మన రాష్ట్ర సంక్షేమం కావాలి. ఈనాడు తిరుపతికి సంబంధించినంత వరకు అక్కడ ఎన్నో పరిశ్రమలను ప్రోత్సహించడం జరుగుతుంది. ఈనాడు వారు మనవిచేసినటువంటి ట్రాన్స్‌ఫార్మర్స్ ఫ్యాక్టరీ చాలా మంచి ఉత్పత్తులను తయారుచేస్తూ మంచి ఉత్పత్తులతో, మంచి పురోభివృద్ధిలో ఉందని నేను

వారికి మనవిచేస్తున్నాను. ఇదివరకు నా స్పీచ్‌లో చెప్పాను – తిరుపతిలో ప్రత్యేకంగా ఎలక్ట్రానిక్ కాంప్లెక్స్ కూడా కట్టి అభివృద్ధిచేయాలనే ప్రభుత్వ విధానాన్ని వారికి నేను తెలియ జెప్పాను. అదేవిధంగా మొజాయిక్ టైల్స్ ఫ్యాక్టరీ ఇలా ఎన్నో పరిశ్రమలు తిరుపతిలో రావడానికి తగినటువంటి ప్రోత్సాహం ప్రభుత్వం ఇస్తుందని వారికి మనవిచేస్తూ. వారు గనుక ఏదైనా పరిశీలనను ఇచ్చినట్లయితే ప్రభుత్వం సహాయం చేస్తుందని నేను వారికి సవినయంగా మనవిచేస్తున్నాను. మెరక ప్రాంతాలుగా ఇరిగేషన్ డ్రై ప్రాంతాలలో ఈనాడు సెరీకల్చర్ అతి ప్రాముఖ్యమైనది. ముఖ్యముగా అనంతపురము జిల్లాలో, మదనపల్లి ప్రాంతములో దీని అభివృద్ధిని గురించి ఈనాడు ప్రభుత్వము ఆలోచిస్తుందని మనవిచేస్తున్నాను. ముఖ్యముగా నేను ప్రత్యేకముగా అనంతపురం జిల్లా కలెక్టరుగావున్న మిసెస్ ఛటర్జీగారికి ఆ జిల్లాలో పరిస్థితి వారికి పూర్తిగా తెలుసును. కనుక ఆమెను సర్ సిల్క్ కార్పొరేషన్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌గా ఏర్పరచడము, సర్ సిల్క్ అభివృద్ధిని చేపట్టడము, అదేరీతిగా ఈనాడు హిందూపూర్‌లో స్పన్ సిల్క్ ఫ్యాక్టరీని కూడా ప్రభుత్వము ఆమోదించడము జరిగింది. పూర్తిగా ఆ పరిశ్రమను ప్రోత్సహించడము జరుగుతుంది. ఏ మాత్రము విస్మరించలేదని మాత్రము గౌరవసభ్యులకు మీ ద్వారా మనవిచేస్తున్నాను. గౌరవ సభ్యులు, సోదరులు సీతారామ్‌గారు ఉత్సాహముతో అడుగుతున్నారు. నా స్పీచ్‌లోనే ఉంది. అదిలాబాద్ జిల్లా, శ్రీకాకుళము జిల్లా, అనంతపురము జిల్లాలు పూర్తిగా వెనుకబడిన జిల్లాలు అని, పూర్తి సునిశిత విధానముతో వాటిని ప్రోత్సహించడము జరుగుతుంది. ఈనాడు వారు రిఫ్రిజిరేషన్ డిపార్ట్‌మెంట్ ఒకటి – అక్కడ ఒక యూనిట్ పెడతారా, ఆ విషయము ఆలోచించండని ఇదివరకే వారు చెప్పడము జరిగింది. ఆ విషయము ప్రభుత్వము ఆమోదిస్తుంది, ఆలోచిస్తుందని మనవిచేస్తున్నాను.

**మెరక ప్రాంతాలుగా ఇరిగేషన్ డ్రై ప్రాంతాలలో ఈనాడు సెరీకల్చర్ అతి ప్రాముఖ్యమైనది. ముఖ్యముగా అనంతపురము జిల్లాలో, మదనపల్లి ప్రాంతములో దీని అభివృద్ధిని గురించి ఈనాడు ప్రభుత్వము ఆలోచిస్తుందని మనవిచేస్తున్నాను. ముఖ్యముగా నేను ప్రత్యేకముగా అనంతపురం జిల్లా కలెక్టరుగావున్న మిసెస్ ఛటర్జీగారికి ఆ జిల్లాలో పరిస్థితి వారికి పూర్తిగా తెలుసును.**

అధ్యక్షా, మెదక్ జిల్లాలో చక్కెర ఫ్యాక్టరీ నెలకొల్పాలనేటటువంటి ఆలోచన ఉన్నది అన్న సంగతి గౌరవనీయ సభ్యులకు మనవిచేస్తున్నాను. నిజాం షుగర్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో కూడా అటువంటిది ఏమైనా ఏర్పరిస్తే బాగుంటుంది అది ఎక్కడ ఏర్పరిస్తే బాగుంటుంది అనేటటువంటి విధానం ఆలోచించి మాంజిపల్లి, పోతంసెట్టిపల్లి, రంగంపేట, పోర్సెట్టిపల్లి మొదలగు అయిదు ప్రాంతాలలో ఎక్కడ పెడితే బాగుంటుందనే ఆలోచన ప్రభుత్వానికి ఉంది. రూ.10 కోట్లతో కూడిన ఆ పరిశ్రమను వెంటనే ఏర్పాటుచేసే విధానం గురించి ప్రభుత్వం ఆలోచిస్తుందని గౌరవసభ్యులకు మీ ద్వారా మనవిచేస్తున్నాను.

◆◆

సెప్టెంబర్ 19, 1985

# సింగిల్ విండో సిస్టమ్ రైతులకు చాలా సదుపాయంగా ఉంటుంది

*(కో-ఆపరేటివ్ సొసైటీస్ (అమెండ్‌మెంట్) బిల్, 1985పై జరిగిన చర్చ)*

**SRI Y. RAMAKRISHNUDU:** Sir, I beg to move that: "The Andhra Pradesh Co-operative Societies (Amendment) Bill, 1985 (as reported by the Select Committee) be taken into consideration".

Mr. Deputy Speaker: Motion moved.

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, ఈ సింగిల్ విండో సిస్టమ్ రైతులకు చాలా సదు-పాయంగా ఉంటుంది. కావలసిన సదుపాయాలు అన్నింటికీ - ఎరువులుకానీ, లోన్స్ కానీ, మీడియమ్ టర్మ్ లోన్సుకానీ, కొన్నిచోట్లకు వెళ్ళకుండా, ఒకచోట లభ్యం అయితే సదుపాయంగా ఉంటుందని, ఒక నూతన విధానం ప్రభుత్వం ప్రవేశ పెట్టదలచుకుందని గౌరవనీయ సభ్యులకు అందరికీ తెలుసు. దానికోసం ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తోంది. రిజర్వ్ బ్యాంకు అనుమతి ఇవ్వాలి, వారు ఇంతవరకు అనుమతి ఇవ్వలేదు. పైగా ఒక సంఘంకూడా ఏర్పాటు చేశారు. అందులో మన అధికారులు కూడా సభ్యులుగా ఉన్నారు. పరిశీలిస్తున్నాం అన్నారు. నేను ప్రైమ్ మినిస్టర్‌గారికి రెండు మూడు ఉత్తరాలుకూడా వ్రాసాను. వెళ్ళినప్పుడు పర్సనల్‌గా దీని విషయంలో అతి ముఖ్యంగా ఎన్నికలు దీనివల్ల ఆగిపోయాయి అందువల్ల దీని విషయంలో త్వరితంగా క్లియరెన్సు ఇస్తే ఎన్నికలు జరుపుతామని నిర్దిష్టంగా వారికి చెప్పడం జరిగింది. ముఖ్యంగా బూటాసింగ్‌గారు, ప్రైమ్ మినిస్టర్‌గారు ఇది బాగా ఉన్నది మేము హర్షిస్తున్నాము. ఇటువంటి విధానం అమలుపరచుకుంటే బాగుంటుందేమో తప్పకుండా మీ ఆంధ్రప్రదేశ్‌లో అమలుపరిస్తే, మిగతా రాష్ట్రాలలో కూడా మేము చర్య తీసుకోడానికి వీలుగా ఉంటుంది మీరు ఎలా

అమలుపరుస్తారో అని మేము ఆతృతతో ఎదురుచూస్తున్నాము అని మాట్లాడి నమ్మకం కలిగించారు నాకు వారు. మొన్న వెళ్ళినప్పుడు పైలట్‌గా ఏదన్నా చేస్తాం అన్నారు. దేశానికి ఆంధ్రరాష్ట్రాన్ని పైలట్‌గా పెట్టండి కానీ మళ్ళీ కొన్ని జిల్లాలలో పైలట్‌గా అంటే బాగుండదు – రాష్ట్రమంతా అమలుపరచి చూస్తాం మీరు ఎట్లాగూ ఆంధ్రలో రెండు, మూడు జిల్లాలలో పైలట్‌గా పెట్టమంటున్నారు.. మళ్ళీ క్లాష్ వస్తుంది. మాకు ఈ ప్రోగ్రామ్స్‌లో మీరే చెప్పారు ఇది బాగుందని – కనుక త్వరలో అనుమతి ఇవ్వాల్సిందనీ మీరు ఈ విషయంలో క్లియరెన్సు ఇవ్వండనీ, వారికి ప్రత్యేకంగా మనవిచేయడం జరిగింది. దీని విషయంలో ఎదురుచూస్తున్నాం. కమిటీకి నవంబర్ వరకు టైము ఉంది. నవంబరు లోపల ఒక నిర్దిష్టమైన విధానానికి వారు రావలసిన అవసరం కూడా ఉంది. దాని విషయం చూసి, ఇంకా ఆలస్యమయ్యే పక్షంలో గౌరవ సభ్యులు సూచించినట్లు – కోపరేటివ్స్‌ను అధికారుల చేతిలో పెట్టాలని ప్రభుత్వానికి ఉద్దేశం లేదు. ఆదర్శవంతమైన విధానాలు అవలంభించాలనే ధ్యేయంతోనే ఈ నిర్ణయం చేయడం జరుగుతుందని వారందరికీ సవినయంగా మనవిచేస్తూ – దీని విషయంలో తగినటువంటి నిర్ణయం అక్కడి నుండి రాగానే తీసుకోవడం జరుగుతుందని మనవిచేస్తున్నాను.

**శ్రీ ఎన్. రాఘవరెడ్డి:** నవంబర్ వరకు రాకపోతే – అప్పుడైనా ఎన్నికలు పెడతారా?

**శ్రీ ఎన్.టి. రామారావు:** తప్పకుండా చూస్తాం – రాఘవరెడ్డిగారు చెప్పారు. ఇది ప్రజాస్వామ్యం – కోపరేటివ్స్‌ను అధికారుల చేతిలో ఉంచాలని ప్రభుత్వానికి ఎప్పుడూ లేదు. ఆ విషయం నిర్ధారణ కాగానే నిర్ణయం తీసుకోవడం, ఎన్నికలు జరపడం జరుగుతుందని మనవి చేస్తున్నాను.

**శ్రీ సిహెచ్. రాజేశ్వర్ రావు:** సింగిల్ విండో సిస్టమ్‌కు మారడానికి రాజ్యాంగపరమైన, మౌలికమైన అడ్డంకులు ఏమీ లేవు. రిజర్వ్ బ్యాంకు ఒప్పుకోవడం – రాష్ట్రమంతా అంగీకరించినప్పుడు, రాష్ట్ర శాసనసభ అంగీకరించినప్పుడు, మనం ఆ కార్యక్రమానికి ఎందుకు పురోగమించకూడదు? నవంబర్‌లో అయినా సెంటర్ నుంచి అది రాకపోతే, మనంతట మనం చొరవ తీసుకొని, అన్ని జిల్లాలలో ఎందుకు అమలు చేయకూడాదు? – సెంటర్ దగ్గరకు అందుకు పోకుండానే.

**శ్రీ ఎన్.టి. రామారావు:** ఇది స్టేట్ సబ్జెక్టయినా రిజర్వ్ బ్యాంకు అడ్డు తగులుతున్నది. ఒకవేళ ఖర్చయినా మేము భరిస్తాం – రైతులకు సహాయం అందించే విధానం మా ప్రభుత్వ ధ్యేయం అనికూడా వారికి తెలియజేయడం జరిగింది. వారు ఆమోదించారు కూడా, మరి ఎందుకు జాగు చేయబడుతున్నదో దురూహ్యంగా ఉందని సభ్యులకు మనవిచేస్తూ – దీని విషయంలో వారి నిర్ణయం రాగానే – ప్రభుత్వపరంగా నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని మనవిచేస్తున్నాను.

◆◆

సెప్టెంబర్ 19, 1985

# హైదరాబాద్‌లో చక్కని సౌకర్యాలు కల్పిస్తాం

*(హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సవరణ) బిల్ -1985పై మాట్లాడుతూ)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, నేను ఒక విషయము మనవిచేస్తున్నాను. ఏదైనాకానీ రాష్ట్రానికి మేలు జరగాలి. ఆరోగ్యకరమైన విధానాన్ని అవలంభించాలనే ఉద్దేశ్యముతో పాతగా, స్లమ్ ఏరియాలలోవున్న లావెట్రిస్‌మీద, టాయిలెట్స్ మీద పన్ను వేయడం జరిగిందని సుస్పష్టముగా మనవిచేస్తున్నాను. ఎవరైతే పట్టణాలకు వస్తారో అటువంటివారి సౌకర్యార్థము - వారు స్నానము చేయడానికి కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఇబ్బంది లేకుండా చేయడానికి మాత్రమే దీని ఉద్దేశ్యమని మనవిచేస్తున్నాను. ఈ కనీస అవసరాలు ఏ పెద్ద హెూటల్స్‌లోనో ఉంటే తప్ప సాధ్యముకావు కనుక సులభమైన విధానములో, ఆధునికమైన పద్ధతులలో ఈ మరుగు దొడ్లను, టాయ్‌లెట్స్‌ను నిర్మాణము చేయడము జరగుతుందని, నగర పారిశుద్ధ్యానికి కృషి చేయడము జరుగుతుందని సవినయముగా మనవిచేస్తున్నాను.

ప్రస్తుతము ఉన్నటువంటి లావెట్రీలమీద ఏ మాత్రము పన్ను విధించడము జరగదని సుస్పష్టము చేస్తున్నాను. ప్రత్యేకముగా ఆధునికమైన విధానములో, పెద్ద ఎత్తున వేడి నీరు వగైరాలు సరఫరాచేసి, ఆరోగ్యకరమైన విధానములో ఏవైతే నిర్వహించడానికి ఉద్దేశించబడినాయో, వాటిమీద మాత్రమే పన్ను ఉంటుంది కానీ మిగిలిన వాటిమీద ఉండదు. ఈ పన్ను వేయడముకూడా ఏదో లాభము పొందాలని కాదు. ఒక మంచి క్రమశిక్షణా పద్ధతిలో చక్కని పారిశుద్ధ్యానికి బయటనుంచి వచ్చేవారికి సౌకర్యాలు అందించడము కోసము, ఆరోగ్యకరమైన విధానానికి, వసతులు కల్పించడానికి మాత్రమే కానీ ఏదో లాభార్జన కోసము కాదని మనవిచేస్తున్నాను. క్రమశిక్షణ విధానములో కట్టుదిట్టముతో ఈ కృషి జరగాలనే భావములో మాత్రమే ప్రభుత్వము దీనిని ప్రవేశపెడుతున్నది. ఇక ఎన్నికల విషయము - తప్పకుండా ఎన్నికలు జరిపించడము జరుగుతుందని చెప్పాను.

ఓటర్ల లిస్టు తయారైన వెంటనే ఎన్నికలు జరిపించడము జరుగుతుందని పదే పదే చెబుతూ వచ్చాను. ప్రజాస్వామ్య విధానము మరచిపోవడము కాదు. తప్పకుండా ఈ తెలుగుదేశము ప్రభుత్వము ఎన్నికలను జరుపుతుందని మరొకసారి సవినయముగా మనవిచేస్తున్నాను. గ్యాప్ ఉంటుంది కనుక స్పెషల్ ఆఫీసర్ పదవి ఉండడము ధర్మము. ఎన్నికలు జరిగే వరకూ ఉండడము బాధ్యత, ఉండవలసిన అవసరము ఉంది. కనుక అంతవరకూ పొడిగించడము జరిగింది. ప్రభుత్వము సదుద్దేశ్యముతో ప్రవేశపెడుతున్న ఈ బిల్లును ఆమోదించాలని గౌరవ సభ్యులను కోరుతున్నాను.

అధ్యక్షా, గౌరవ సభ్యులు పట్టణ పారిశుద్ధ్యం విషయము కూడా చెప్పారు. దానికి ఏమాత్రం కూడా అభ్యంతరం లేదు. పట్టణ పరిశుభ్రత అందరిమీద ఉంది. అన్ని పక్షాలకు బాధ్యత ఉంది. ముఖ్యంగా పాలక పక్షానికి మరింత బాధ్యత ఉంది. తక్షణం ఆలోచించడం జరుగుతుందని మనవిచేస్తున్నాను. ఇక లావెట్రీల పన్ను 5 పైసలు, 10 పైసలు వసూలు చేయడంవల్ల ప్రయోజనం లేదన్నారు. కానీ ఏదో పన్ను వేయడంకోసం అని కాదు. ఒక క్రమశిక్షణా పద్ధతిలో నిర్వహించాలంటే, వాడుకునే వారు కొద్దిగా డబ్బు కట్టడం భావ్యం. పట్టణాలలో ఉండేవారు కట్టనక్కరలేదు. ప్రత్యేకంగా రైల్వే స్టేషన్లవద్ద, బస్ స్టాండులలో ఏర్పాటు చేసినవాటికీ, ఎక్కడైతే ప్రయాణీకులు వస్తుంటారో వారి సౌకర్యంకోసం వేసినదే కానీ కేవలం పన్ను కోసం ఉద్దేశించబడలేదని మనవి చేస్తున్నాను.

**ఇక ఎన్నికల విషయం:** వెంటనే ఎన్నికలు నిర్వహించబడతాయని మనవిచేస్తున్నాను. సుహృద్భావంతో స్వీకరించి ప్రభుత్వం ఎన్నికలు జరిపిస్తుందనే విషయం సభ్యులు విశ్వసిస్తారని మనవిచేస్తూ, ఈ బిల్లును ఆమోదించవలసిందిగా కోరుతున్నాను.

◆◆

సెప్టెంబర్ 23, 1985

## అధికార వికేంద్రీకరణ మా విధానం, ఆదర్శం

*(రాయలసీమ ఐక్య కార్యాచరణ సంఘం ఇచ్చిన*
*విశ్లేషణ పత్రంపై - తీసుకున్న చర్యలను వివరిస్తూ)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** శ్రీ డి. రెడ్డప్పరెడ్డి ఆధ్వర్యాన రాయలసీమ ఐక్య కార్యాచరణ సంఘం, 6-9-1984వ తేదీన అప్పటి ముఖ్యమంత్రిగారికి ఒక విజ్ఞాపన పత్రాన్ని సమర్పించింది. విజ్ఞాపన పత్రం తెలుగులో ఉంది. ఈ విజ్ఞాపనా పత్రంలో పేర్కొన్న తీర్మానాలు, వాటిని అనుసరించి, ఒక్కొక్క దానిపై ప్రభుత్వం తీసుకొన్న చర్యలు ఈ క్రింద తెలియజేయడమైంది.

**1వ తీర్మానం:**
రాయలసీమ ప్రాంతానికి నీటికోటాను నిర్దిష్టపరచాలి. తుంగభద్ర నుండి 150 టి.ఎం.సిల నీటిని, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు కేటాయించవలసి ఉంది. శ్రీశైలం లింకుకాలువ నుండి వచ్చే కృష్ణానది నీరు, మిట్టకొండకు డీప్‌కట్ వద్దవున్న హెడ్ రెగ్యులేటరు నీటి నిలువ పరిమాణాన్ని పెంచి రాయలసీమ ప్రాంతానికి 35 వేల క్యూసెక్కుల మేరకు మళ్లించేందుకు వీలుగా తెలుగుగంగ కుడికాలువను తిరిగి రూపొందించాలి.

**తీసుకొన్న చర్య:**
కృష్ణానదీ జల వివాదాల ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు ప్రకారం, ఏదైనా జల సంవత్సరంలో, తుంగభద్ర రిజర్వాయరు ద్వారా సుమారు 230 టి.ఎం.సి.ల నీటిని క్రమబద్ధీకరించాల్సి ఉంది. ఈ నీటిలో, ఆంధ్రప్రదేశ్ వాటా 78.51 టి.ఎం.సి.లు మిగిలిన, 151.49 టి.ఎం.సి.ల నీరు కర్ణాటకకు చెందుతుంది. పోగా మిగతా నీరు నది దిగువన, ఆంధ్రప్రదేశ్ వైపు ప్రవహిస్తుంది. ఈ నీటిని, దిగువ ప్రవాహపు సేద్యపునీటి పారుదల వాటా క్రింద వినియోగించుకొనవచ్చును. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు, తుంగభద్ర సబ్‌బేసిస్‌లోని నీటిని వినియోగించుకొనడంపై కూడా కృష్ణానదీ జలవివాదాల ట్రిబ్యునల్ నిర్బంధాలు విధించింది. ఈ నిర్బంధాల ప్రకారం, తుంగభద్ర సబ్

బేసిన్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చేసిన మొత్తం కేటాయింపులు 126.26 టి.ఎం.సిలు (తుంగభద్ర రిజర్వాయరు నుండి పొందే 78.51 టి.ఎం.సిలు కూడా ఇందులో చేరి ఉన్నాయి) కాగా, ఏదేని జల సంవత్సరంలో 127.5 టి.ఎం.సిల గరిష్ట పరిమాణం మేరకు నీటిని పొందవచ్చును. తుంగభద్ర డ్యామ్ రిజర్వాయరు నుండి పొందే నీటితో సహా సాధ్యమైనంత ఎక్కువగా కృష్ణాజలాలను పొందడానికి వీలుగా కర్ణాటక ప్రభుత్వంతో చర్చలు జరుపుతూ, ప్రభుత్వం కృషిచేస్తోంది. కె.సి. కాలువలోని 10 టి.ఎం.సిల నీటిని, ఎగువ కాలువ గుండా పెన్నార్ ఆహోబిలం రిజర్వాయరు ఆనకట్టలోకి, దానికి సమాంతరంగా ఉన్న ఎగువ కాలువ, మొదలగు వాటిలోకి పంపడానికి ప్రభుత్వం కృషి సలుపుతున్నది. మిగులు నీరు లభించే కాలువల్లో, శ్రీశైలం రిజర్వాయరు నుండి మద్రాసు నగరానికి నీటిసరఫరాతోబాటు తెలుగుగంగ ప్రాజెక్టుకు కుడికాలువకు అవసరమైన నీటిని సరఫరా చేయాలని ప్రతిపాదించడమైంది.

అన్ని అంశాలను పరిశీలించిన తరువాత, రెగ్యులేటరు, కాలువల రూపకల్పన చేయడం జరిగింది. ప్రస్తుతం సమకూర్చిన నీటి పరిమాణం సేద్యపు నీటి పారుదల, మద్రాసు నగరానికి నీటిసరఫరా అవసరాలను తీర్చేవిధంగా ఉంది. అయినప్పటికీ, శ్రీశైలం కుడికాలువ క్రింద, ఇకముందు ఏర్పడే అవసరాలను దృష్టిలో ఉంచుకొని, సాధ్యమైనంతమేరకు, ప్రధాన కాలువ, బనకచర్ల క్రాస్ రెగ్యులేటరు నీటిపరిమాణం పెంచడం జరిగింది.

**శ్రీశైలం రిజర్వాయరు నుండి మద్రాసు నగరానికి నీటిసరఫరాతోబాటు తెలుగుగంగ ప్రాజెక్టుకు కుడికాలువకు అవసరమైన నీటిని సరఫరా చేయాలని ప్రతిపాదించడమైంది. అన్ని అంశాలను పరిశీలించిన తరువాత, రెగ్యులేటరు, కాలువల రూపకల్పన చేయడం జరిగింది. ప్రస్తుతం సమకూర్చిన నీటి పరిమాణం సేద్యపు నీటి పారుదల, మద్రాసు నగరానికి నీటిసరఫరా అవసరాలను తీర్చేవిధంగా ఉంది.**

**2వ తీర్మానం:**

రాయలసీమ నీటి అవసరాలను తీర్చేటంతవరకు, రాయలసీమలో ప్రారంభించిన నీటి పారుదల ప్రాజెక్టులు పూర్తి అయ్యేటంతవరకు కృష్ణానదిపై నీటి పారుదల ప్రాజెక్టులను వేటిని గానీ చేపట్టరాదు.

**తీసుకొన్న చర్య:**

కృష్ణానదిపై ఇదివరకే చేపట్టిన ప్రాజెక్టులైన తెలుగుగంగ ప్రాజెక్టు, శ్రీశైలం కుడికాలువ, శ్రీశైలం ఎడమకాలువ, జూరాల ప్రాజెక్టుల పనులు కొనసాగుతున్నాయి. నీరు, నిధుల లభ్యతనుబట్టి, ఇకముందు కొత్తగా ప్రాజెక్టులను చేపట్టే విషయాన్ని పరిశీలించడం జరుగుతుంది.

**3వ తీర్మానం:**

శ్రీశైలం కుడి కాలువను, కడపలోని తెలుగుగంగ కాలువలో కలపాలి. ఈ రెండు కాలువల పనుల కోసం కడపలో చీఫ్ ఇంజినీరు కార్యాలయం ఉండాలి. చీఫ్ ఇంజినీరు కార్యాలయం

కడప నుండి మద్రాసు నగరానికి నీటిని సరఫరా చేసే నిర్మాణపు పనిని పర్యవేక్షిస్తున్నది. ఈ కార్యాలయాన్ని శ్రీకాళహస్తిలో ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం ఉన్న ఛీఫ్ ఇంజినీరు శ్రీ పి. రామకృష్ణయ్యను బదిలీచేసి, ఈ స్థానంలో, రాయలసీమకు చెందిన ఇంజినీరును నియమించాలి.

**తీసుకున్న చర్య:**
శ్రీశైలం కుడి కాలువ పనిపై అజమాయిషీ వహించే ఛీఫ్ ఇంజినీరుకు, తెలుగుగంగ ప్రాజెక్టుకు అజమాయిషీ వహించే ఛీఫ్ ఇంజినీరుకు పనుల కేటాయింపులు, పరిపాలన సౌలభ్యం, ప్రతి ఇంజినీరుకున్న పని భారం ఆధారంగా జరుగుతుంది. పెన్నార్ దక్షిణం వైపు పనుల కోసం తెలుగుగంగ ప్రాజెక్టు ప్రత్యేక విధి నిర్వహణాధికారి కార్యాలయాన్ని శ్రీకాళహస్తిలో ఏర్పాటు చేయడం ద్వారా మద్రాసు నగరానికి నీటి సరఫరా పథకంకోసం శ్రీకాళహస్తిలో ఛీఫ్ ఇంజినీరు కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలనే కోరికను ఇదివరకే తీర్చడం జరిగింది. తెలుగుగంగ ప్రాజెక్టు ప్రత్యేక విధి నిర్వహణాధికారి రామకృష్ణయ్య, ఇప్పుడు శ్రీకాళహస్తిలో పనిచేస్తున్నారు. అతడిని ఇటీవల కడపలో ఛీఫ్ ఇంజినీరు పోస్టులో అడిషనల్ చార్జ్‌గా మాత్రమే ఉంచడం జరిగింది.

**4వ నెం. తీర్మానం:**
రాయలసీమలో చేపట్టనున్న ప్రాజెక్టుకు సంబంధించి, వాటిపనులను వెంటనే చేపట్టేందుకుగాను అవసరమైన నిధులను విడుదల చేయాలి.

**తీసుకున్న చర్య:**
రాయలసీమలో కట్టదలచిన పనులకుగాను అవసరమైన నిధులను కేటాయించేందుకు కృషి చేయడం జరుగుతుంది.

**5వ నెం. తీర్మానం:**
ఆరు సూత్రాలు పథకాన్ని రద్దు చేయాలన్న భావనకు ప్రాముఖ్యం ఏమీ ఇవ్వకుండా, ఈ పథకం అమలులో ఉత్పన్నమైన వ్యత్యాసాలను సరిదిద్దడానికి కమిటీలను ఏర్పాటు చేయడంలో అమూల్యమైన సమయాన్ని వృథా చేయడంకన్నా రాయలసీమేతరులను, వారివారి జోన్లకు తరలించవలసిందిగా ప్రభుత్వం శాఖాధిపతులకు వెంటనే ఆదేశాలు జారీచేయాలి.

**తీసుకున్న చర్య:**
ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి, ఆరు సూత్రాల పథకాన్ని అమలుపరచడంలో అనేక లోపాలు జరిగాయని ప్రభుత్వం దృష్టికి తీసుకుని వచ్చినందువల్ల వాటిని పరిశీలించి వాటి నివారణకు తగు సిఫారసులు చేయడానికి ప్రభుత్వం, ముఖ్యమంత్రిగారి అధ్యక్షతన శాసనసభలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో అఖిలపక్ష కమిటీ ఒకదానిని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సిఫారసుల ఆధారంగా ఆఫీసర్ల కమిటీ ఒకదానిని ఏర్పాటు చేయడం జరిగింది. ముగ్గురు సీనియర్

ఐ.ఏ.ఎస్. అధికారులు సర్వశ్రీ కె. జయభారతరెడ్డి, సి.ఆర్. కమలనాథన్, కె. ఉమాపతిగార్లతో ఈ కమిటీ ఏర్పడింది. ఆరు సూత్రాల పథకాన్ని అమలు చేయడంలో ఏమైనా పొరపాటు జరిగివుంటే వాటిని పరిశీలించేందుకు ఈ కమిటీ ఏర్పడింది. అంతేకాకుండా ప్రభుత్వ పదవీ విరమణ చేసిన ఐ.ఏ.ఎస్. ఆఫీసరు శ్రీ వి. సుందరేశన్ గారితో ఏకసభ్య సంఘాన్ని కూడా నియమించింది. ఆఫీసర్ల కమిటీ నివేదికను ఏకసభ్య సంఘానికి పంపగా ఆ సంఘం, దానిమీద తన అభిప్రాయాలను వ్యక్తం చేసింది.

రాయలసీమేతరులను, వారి వారి జోన్లకు పంపివేయవలసిందిగా కోరుతూ రాయలసీమ ఉద్యోగుల సంఘం, ఏకసభ్య సంఘానికి వినతి పత్రం సమర్పించింది. దానిమీద ఏకసభ్య సంఘంలోని అభిప్రాయాలను వ్యక్తంచేస్తూ, రాష్ట్రపతి ఉత్తరువు అమలు కావడానికిముందు, ఆంధ్రప్రాంతంలోని (రాయలసీమతో) నివాసానికి సంబంధించి సర్వీసు నిబంధనల్లో ఎలాంటి అర్హతలు నిర్ణయించలేదని పేర్కొంది. చారిత్రక కారణాల దృష్ట్యా, తెలంగాణ ప్రాంతానికి కొన్ని రక్షణలు మంజూరు చేయటం జరిగింది. ఇవి ఆరు సూత్రాలు పథకం, రాష్ట్రపతి ఉత్తరువు ప్రారంభం అయ్యేదాకా అమలులో ఉన్నవి. కానీ రాయలసీమ విషయానికి వస్తే ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలకు సంబంధించి అలాంటి ప్రత్యేక నిబంధనలు ఏవీ లేవు. ఏ స్థానిక కేడరుకైనా ఒక ప్రభుత్వోద్యోగిని కేటాయించడానికి, అతని నివాసాన్ని ఒక ప్రధాన అర్హతగా రాష్ట్రపతి ఉత్తరువులో నిర్ణయంలేదు. రాష్ట్రపతి ఉత్తరువు ప్రకారం, 18-10-1975 నాటికి సర్వీసులో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులనందరిని వారి సొంత నివాసప్రాంతాలతో నిమిత్తం లేకుండా, ఒక్కమాదిరిగా పరిగణించడం జరిగింది.

అంతేకాకుండా, రాష్ట్రపతి ఉత్తరువులలో పేర్కొన్న కారణాల ఆధారంగా వారిని వారి వారి స్థానిక కేడర్లకు, కేటాయించాల్సి ఉంటుంది. రాష్ట్రపతి ఉత్తరువు జారీకావడానికి ముందు, ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో, రాయలసీమకి చెందినవారే ఎక్కువగా ప్రభుత్వ సర్వీసులో ఉండటానికి అవకాశం ఉంది. 4వ జోన్ వెలుపల ప్రాంతాల్లో ఉన్న ఉద్యోగాల కంటే వారు ఎక్కువగా ఉండవచ్చు. మరోవిధంగా చెప్పాలంటే స్థానిక కేడర్లను వ్యవస్థీకరించేటప్పుడు రాయలసీమకి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు, ఆ ప్రాంతంలోని పదవులకంటే తక్కువ సంఖ్యలోఉండవచ్చు. అందువల్ల అట్టివారిని 'బయటవారుగా' వ్యవహరించడం పొరపాటని ఏకసభ్య సంఘం పేర్కొంది.

అంతేకాకుండా వారిని రాయలసీమ ప్రాంతానికి కేటాయించడం వల్ల, రాష్ట్రపతి ఉత్తరువును ఉల్లంఘించినట్టయిందని చెప్పడం కూడా సరికాదని, అట్టి 'బయటివారిని' వారి జోన్లకు తిరిగి పంపే ప్రసక్తే లేదని.. ఆ సంఘం అభిప్రాయపడింది. ఆఫీసర్ల కమిటీ చేసిన సిఫారస్సులను ఏకసభ్య సంఘం అనే అభిప్రాయాలతోపాటు తిరిగి ఏర్పాటు చేసిన అఖిలపక్ష సంఘం ముందు ఉంచగా ఈ క్రింది 3 ముఖ్య అంశాలను తదుపరి పరిశీలనకు ఆ సంఘం అంగీకరించింది:

1. రాష్ట్రపతి ఉత్తరువుల క్రింద జరిగిన కేటాయింపులను తిరిగి ప్రారంభించడం.
2) అంతర్ స్థానిక కేడరు బదిలీ విధానాన్ని సరళీకరించడం.
3. ప్రాంతీయ ప్రాతిపదికపైన సచివాలయం, ఇతర రాష్ట్రస్థాయి కార్యాలయాలకు నియామకాలు చేయడం.

ఈ అంశాలను సర్వీసు సంఘాలతో చర్చించడం జరిగింది. తదుపరి చర్యలను తీసుకోవటం జరుగుతున్నది.

**6వ తీర్మానం:**
వరదలు, ఉప్పెనలు సంభవించినప్పుడు కోస్తా జిల్లాలలోని ప్రజలకు సహాయాన్ని అందించి, ప్రభుత్వం ఆదుకుంటున్న విధంగానే కరువు, అనావృష్టి పరిస్థితులకు గురైనప్పుడు రాయలసీమ ప్రాంతపు ప్రజలకు కూడా ఇటువంటి సహాయాన్ని అందించాలి.

**తీసుకొన్న చర్య:**
తుఫాను, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలవల్ల నష్టపడిన రైతులను నష్ట పరిహారం చెల్లించేవిధంగా తీవ్ర అనావృష్టి వల్ల నష్టపడిన రైతులకు నష్టపరిహారం చెల్లించే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వంవద్ద లేదు. అయితే, అనావృష్టి పీడిత ప్రాంతాలలోని రైతులను, వ్యవసాయ కూలీలను, చేతిపనివారలను, బలహీన వర్గాల వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం సాధ్యమైనన్ని చర్యలను తీసుకొంటున్నది. కలెక్టర్ల నుండి నివేదికలు అందిన వెంటనే, ప్రభుత్వం ఆయా ప్రాంతాలను అనావృష్టి పీడిత ప్రాంతాలుగా ప్రకటించి, భూమిశిస్తు, రుణాలు సెస్‌లు, మురుగు పారుదల సెస్, ప్రత్యేక భూమిపన్ను, వాటిపైన బకాయిల వసూలును నిలిపివేయడం లేదా వాయిదా వేయడానికి ఉత్తరువు చేస్తుంది. భూమిశిస్తు మాఫీని కూడా ప్రభుత్వం మంజూరు చేస్తుంది. అనావృష్టి పీడిత ప్రాంతాలలోని భూమిలేని పేదలు మొదలైన వారికి ఆర్జనోపాయాన్ని, జీవనోపాయాన్ని కల్పించడానికి వీలుగా, రాష్ట్ర ప్రభుత్వం స్వంతంగాను, కేంద్ర ప్రభుత్వ సహాయంతోను, నేరుగా లేదా ఆర్థిక సంస్థలద్వారా అధిక మద్దతు పథకాలకు, వ్యవసాయక తదనుబంధ కార్యకలాపాలకు, కుటీర గ్రామీణ పరిశ్రమలకు నూతనకాలిక రుణాలను మంజూరు చేస్తుంది. అంతేకాక వ్యవసాయ రుణాలు, ఇతర స్వల్పకాలిక రుణాల గడువును తిరిగి నిర్ణయించడం ద్వారా ఆ ప్రాంతాల్లోని సన్నకారు, పేద రైతులకు తోడ్పడుతుంది.

గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాలు రెండింటిలోను నీటి ఎద్దడికి గురైన ప్రజలకు ఎటువంటి అంతరాయం లేకుండా తగినంత మంచినీరు సరఫరా అయ్యేటట్లు చూడడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతున్నది. పశువులను అయినకాడికి అమ్మడాన్ని నివారించడానికి, సబ్సిడీ ధరలకు పశుగ్రాసాన్ని కూడా సమకూరుస్తున్నది. ఖరీఫ్ కాలంలో ఉత్పత్తిలో ఏర్పడిన

లోటును భర్తీచేయడానికి వీలుగా, రబీ కాలంలో అదనపు ప్రాంతాలను సాగుచేయడానికి వ్యవసాయ ఆగంతుక ఉత్పత్తి ప్రణాళికను రూపొందించింది. దీనికి తోడు సబ్సిడీ ప్రాతిపదికపై విత్తనాల కొనుగోలు, పంపిణీ, ఉమ్మడి సస్యరక్షణ చర్యలు అవసర వస్తువులు కొనుగోలు చేయడానికి రైతులకు స్వల్పకాలిక రుణాలు సమకూర్చడంవంటి చర్యలు కూడా చేపట్టింది. ప్రజారోగ్యం కోసం తగు సౌకర్యాలు కల్పించడంతోపాటు, అనావృష్టి పరిస్థితులు ఏర్పడినపుడు అంటువ్యాధులు ప్రబలకుండా నివారించేందుకు ముందు జాగ్రత్తలు తీసుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది.

**7వ తీర్మానం:**
రాయలసీమలోని తుంగభద్ర ఎగువ కాలువ ప్రధానంగా మూడు జిల్లాలలో అంటే అనంతపురం, కడప, కర్నూలు జిల్లాలే కాకుండా మరికొన్ని జిల్లాలలో కూడా ప్రవహిస్తుంది. ఈ కాలువను వెడల్పు చేశారు. కాగా, కర్ణాటక ప్రాంతం నుండి రాయలసీమకు వచ్చే కాలువను వెడల్పు చేయలేదు. ఈ కాలువ గట్లను కూడా సక్రమంగా పరిరక్షించలేదు. ఆ ఫలితంగా రాయలసీమ ప్రాంతానికి రావలసిన పూర్తి వాటా అంటే 32.5 టిఎంసిల నీరు ఆ ప్రాంతానికి పూర్తిగా అందటంలేదు. కాబట్టి, ప్రతి సంవత్సరం ఈ నీటికొరతవల్ల పంటలు దెబ్బతింటున్నాయి, నష్టం వాటిల్లుతున్నది, కాబట్టి. ఈ కాలువను వెడల్పుచేసి, గట్లను పరిరక్షించవలసిందిగా కోరడమైంది.

**తీసుకున్న చర్య:**
ఎగువ కాలువలోని 105 కి.మీ.ల హెడ్‌రీచ్ కర్ణాటక రాష్ట్రంలో ఉంది. ఎగువ కాలువలోని మిగిలిన భాగం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉంది. తుంగభద్ర ప్రాజెక్టు ఎగువ కాలువ 2వ దశ క్రింద ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలలో ఎగువ కాలువను వెడల్పుచేసి, రైజింగ్ చేశారు. కేటాయించిన 32.5 టి ఎం.సి.ల నీటిని తీసుకోవడం జరుగుతున్నది. పూర్తిగా స్థిరీకరించిన ఆయకట్టు ఇంకా అభివృద్ధి చెందనందున, ఎగువ కాలువలోని నీటిని తీసుకోవడంపై ఇంతవరకు ఎట్టి ఫిర్యాదు అందలేదు.

అధ్యక్షా, ఈనాడు ఎంతో మంది గౌరవనీయ సభ్యులు మన విధానసభ సభ్యులు ఎన్నో వ్యవస్థలు, ఎంతో మంది వ్యక్తులు, ఎంతోమంది రాజకీయ వేత్తలు ఎంతో మంది ప్రజలు, తరువాత నేను స్వయంగా చూచిన విషయాలు, నేను అవగాహన చేసుకున్న విధానాలు ప్రభుత్వ పరంగా చేస్తున్నటువంటి కార్యక్రమాలు అన్నీ చెప్పవలసిన అవసరం ఈ సందర్భంలో ఉంది కాబట్టి నేను నాకు కావలసినంత కాలము తీసుకుంటాను. ఎవరూ నన్ను ఇంటరప్టు చేయకుండా అనుమతించాలని దీనికి నేను ముఖ్యంగా మిమ్ములను దయచేసి ఇది అంగీకరించవలసిందిగా కోరుతున్నాను.

అధ్యక్షా, తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు కేవలం ఒక ప్రాంతానికి, ఒక కులానికి, ఒక మతానికి సంబంధించిన వ్యవస్థ కాకుండా పూర్తి సంపూర్తిగా మన ఆంధ్రప్రదేశ్ సర్వతోముఖాభివృద్ధికి, సర్వజన సంక్షేమానికి పాటుపడే వ్యవస్థగా రూపొందించబడిందని మీకు నేను సవినయంగా ప్రప్రథమంగా విజ్ఞప్తి చేస్తున్నాను. అప్పటినుంచి తీసుకున్న కార్యక్రమాలు, చేస్తున్నటువంటి కార్యక్రమాలు, అవలంభిస్తున్నటువంటి విధానాలు అందరు ప్రజలకు, అన్ని ప్రాంతాలకు, ముఖ్యంగా వెనుకబడి ఏ ప్రాంతాలైతే ఉన్నాయో, ఏ ప్రాంతాలైతే సామాజిక పరమైనటువంటి సంక్షేమం అందకుండా ఈనాడు వెనుకబడి ఉన్నాయో, మాకు అభివృద్ధి జరగడంలేదు స్వతంత్రం తర్వాత ఈ 35 సంవత్సరాల నుంచి కూడా మాకు తగినటువంటి కార్యక్రమాలు అందించబడడంలేదని ఏ ప్రజలైతే అసంతృప్తితో ఉన్నారో, ఎవరైతే క్రుంగిపోతున్నారో వారికి అందరికీ సరైనటువంటి అభివృద్ధి జరపాలన్నదే మా ప్రభుత్వం యొక్క ఆదర్శం, ధ్యేయం అని తమకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను.

ఈ విధానాన్ని ముఖ్యంగా ఈ విషయంలో చూస్తే ఈనాడు ఏ ప్రాంతానికి అని కాకుండా వెనుకబడినటు వంటి ప్రాంతాల వారిని తీసుకున్నట్లయితే ఇదివరకు మన రాయలసీమకు ఏడున్నర శాతము ప్లానింగ్‌లో అభివృద్ధి పథకాలకు కేటాయింపబడితే ఈ రోజున 22.46 శాతము వారికి కేటాయించబడ్డాయని మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను. ఇకపోతే సర్వీసెస్ విషయంలో ప్రెసిడెన్షియల్ ఆర్డరు 18 అక్టోబరు 1975వ సంవత్సరంలో వచ్చింది అన్న విషయం గౌరవ సభ్యులకు తెలుసు. ఈ సందర్భంలో ముఖ్యంగా ఇప్పటికీ ఉన్నటువంటి అవకతవకలు సరిచేయడానికి ఆ ప్రెసిడెన్షియల్ ఆర్డరును అనుసరించి ఇప్పటికే ఒక ఆచరణ ప్రారంభమైంది. అందులో 92 వేలమంది ఉద్యోగస్తులకు ఎలాట్ మెంట్‌లు జరపవలసి వచ్చినప్పుడు 63 వేల మందికి ఎలాట్‌మెంట్ చేయడం జరిగింది. మిగిలిన వారికి ఏదైనా అసంతృప్తి ఉన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ద్వారా వారికి ఉన్నటువంటి సమస్యలు సంక్షిప్తముగా పరిష్కరించుకోవచ్చుననేటువంటి అవకాశము కూడా వారికి కలిగించబడింది అని మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను.

**ఏ ప్రాంతానికి అని కాకుండా వెనుకబడినటువంటి ప్రాంతాల వారిని తీసుకున్నట్లయితే ఇదివరకు మన రాయలసీమకు ఏడున్నర శాతము ప్లానింగ్‌లో అభివృద్ధి పథకాలకు కేటాయింపబడితే ఈ రోజున 22.46 శాతము వారికి కేటాయించబడ్డాయని మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను. సర్వీసెస్ విషయంలో ప్రెసిడెన్షియల్ ఆర్డరు 18 అక్టోబరు 1975వ సంవత్సరంలో వచ్చింది.**

ఈ ఉద్యోగస్తుల సమస్యను పరిష్కారం చేయడానికి ముగ్గురు సభ్యులతో ఒక కమిటీని జైభారతరెడ్డి, ఉమాపతిరావు మొదలైన వారితో వేసి వారిని రిపోర్టు అడగడం జరిగింది. వారు రిపోర్టు ఇచ్చారు. దానిమీద అందులో ఏవి ఆచరణయోగ్యమైన అంశాలు అనేవి

పరిశీలించడానికిగాను సుందరేశన్ అనే ఆయనను వన్‌మేన్ కమిటీగా వేయడం జరిగింది. వారి రిపోర్టు ప్రకారంగా 18.10.1975న ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌కు ముందున్న ప్యానల్‌ను పరిశీలించవలసిన అవసరంలేదు అన్నారు. ఇక ముందు మాత్రం ఏమైనా లోపాలు జరిగితే పరిశీలన చేయవచ్చును అన్నారు. సుమారు దీనిమీద 554 రిప్రజెంటేషన్స్ రాగా అందులో 160 కేసులు డిస్‌పోజ్ చేసారు. ప్రభుత్వ పరిశీలనలో 8 కేసులు ఉన్నాయి. మిగిలిన కేసుల విషయంలో వన్‌మేన్ కమిటీ వారి రిపోర్టు అందిన తరువాత ఉద్యోగస్తులకు న్యాయం చేయడం జరుగుతుందని మనవిచేస్తున్నాను. దీనిమీద అఖిలపక్ష కమిటీని కూడా వేసారు. ప్రభుత్వం అంటేనూ, ప్రజా ప్రతినిధులు అంటేనూ, నాకు గౌరవం ఉంది.

ఏదో అన్యాయాన్ని సహించాలని కానీ అవకతవకలు చేయాలని కానీ ప్రభుత్వ ఉద్దేశ్యంకాదు. రెండు వందల తొంభై నాలుగు మంది శాసనసభ్యులలో నుండి అఖిలపక్ష కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. వారు ఈ విషయాన్ని సమగ్రంగా చర్చించి ఒక వైట్ పేపరు ఇచ్చారు. ఒక మెమోరాండం కూడా ఇచ్చారు. వారు సమీక్షించి సరైన అవగాహనకు రాగలరని ఆశిస్తున్నాను. తరువాత వ్యవసాయానికి సంబంధించిన ఇరిగేషన్ ప్రాజెక్టుల విషయంలో ఈ తెలుగుదేశం ప్రభుత్వం ఇపుడు తెలుగుగంగ ప్రాజెక్టుకు 480 కోట్ల ఖర్చులో ఇంతవరకూ 80 కోట్ల రూపాయలవరకూ ఖర్చు చేసాము. ఈ సంవత్సరం బడ్జెట్‌లో 75 కోట్ల రూపాయలు ఈ తెలుగుగంగ ప్రాజెక్టు కొరకు కేటాయించడం జరిగింది. అందులో రైట్ బ్యాంకు కెనాల్‌కు 390 కోట్ల రూపాయలు ప్రత్యేకంగా కేటాయించడం జరిగింది. ఈ సంవత్సరానికి 20 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగింది. ధర్మవరం హైలెవల్ కెనాల్‌కు ఈ సంవత్సరం 6 కోట్ల రూపాయలు కేటాయించాము. అదేవిధంగా ఇప్పుడు 10 టి.ఎం.సి., కె.సి. కెనాల్, తుంగభద్ర కెనాల్స్ మీద పనులకు గాను చర్యలు తీసుకోవాలని మా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మిడ్ పెన్నార్ నుంచి మైలవరం ప్రాజెక్టుకు 4 టి.ఎం.సి.ని అనంతపురం జిల్లాకు ఇవ్వాలనేదే ఈ ప్రభుత్వ విధానంగా ఉందని స్పష్టం చేస్తున్నాను. తరువాత ఈ రైట్ కెనాల్ కేవలం ఇదివరకు ఉన్నచోట కాకుండా మైలవరం రిజర్వాయర్ ద్వారా ఒక లక్ష ఎకరాలకు సరిపోయే నీరు వదలడం ద్వారా కడప జిల్లా సస్యశ్యామలం అవుతుంది.

ఈ విషయంలో కర్ణాటక ప్రభుత్వంతో నెగోషియేషన్స్ జరుపుతున్నాము. అదనంగా తుంగభద్ర కెనాల్ నుంచి పోయే నీరును అనంతపురం జిల్లాలో ఉపయోగించుకోవాలని కర్ణాటక ప్రభుత్వంతో సంప్రదించాలని చూస్తున్నాము. ఇకపోతే పరిశ్రమల స్థాపన విషయంలో ఎక్కడైతే ఇరిగేషన్ అవకాశాలు ఉండవో ఆ ప్రాంతాలను పారిశ్రామికవంతం చేయాలని వాటికీ పథకాలు వేయాలని ఈ తెలుగుదేశం ప్రభుత్వం యోచిస్తున్నది. ఇపుడు తెలుగుదేశం ప్రభుత్వం మణుగూరు థర్మల్ విద్యుత్ కేంద్రమును 200 కోట్ల రూపాయల ఖర్చుతో 250 మె.వా. విద్యుచ్ఛక్తి తీయడానికి

నిర్ణయం తీసుకున్న విషయం అందరికీ తెలుసు. దీనివల్ల ఎక్కువగా రాయలసీమ ప్రాంతంలోనూ ఉద్యోగ అవకాశాలు కలుగుతాయి. ఇపుడు గౌరవనీయులైన సభ్యులందరూ కూడా ఒకే ప్రాంతానికి చెందినవారుకాదు. ఏ పరిశ్రమలు వారి జిల్లాలలో ఏర్పాటు చేయాలి, ఏ పరిశ్రమ ఆ ప్రాంతానికి అనుగుణంగా ఉంటుంది, అక్కడ ఏ ముడిపదార్థము ఎక్కువగా లభ్యమవుతుంది వీటన్నింటినీ అంచనా వేసుకొని ప్రభుత్వం ఈ సంక్షేమ కార్యక్రమం ప్రజలకోసం వేసుకొంటున్నది. ఈనాడు బాగా వెనుకబడిన ప్రాంతాలుగా ఉన్న అనంతపురం, ఆదిలాబాదు, శ్రీకాకుళం జిల్లాలలో ఎక్కువగా పరిశ్రమలు స్థాపించాలని ఇక్కడ చాలామంది గౌరవసభ్యులు చెప్పడం జరిగింది. కాబట్టి ఈ మూడు జిల్లాలను ఏవిధంగా అభివృద్ధిలోకి తీసుకురావాలి. ఏ సంక్షేమ కార్యక్రమాలు జరపాలి, ఏ పరిశ్రమలు స్థాపించాలి అనేది పరిశీలన చేస్తున్నాము. రాయలసీమలోని తిరుపతిలో, తెలంగాణాలోని వరంగల్‌లోనూ, కోస్తా జిల్లాలకు విజయవాడలోనూ ఎలక్ట్రిసిటీకి సంబంధించిన కార్పొరేషన్స్ ఏర్పాటు చేస్తున్నాము.

1500 టన్నుల ప్లాంట్ రాయలచెరువులో రూ.65 కోట్ల వ్యయముతో నిర్మాణం చేయడానికి ఆలోచన జరిగిందని తమ ద్వారా మనవి చేస్తున్నాను. అంతేగాకుండా ఈనాడు హిందూపూర్‌లో మోపెడ్ మేన్యుఫాక్చరింగ్ యూనిట్ రూ.30 కోట్లతో నిర్మించడం జరుగుతుందని మనవిచేస్తున్నాను. ఇంటిగ్రేటెడ్ సిల్క్ యూనిట్ ప్రత్యేకంగా ఒక 500 టన్నుల కెపాసిటిది 2500 స్పిండిల్ కెపాసిటిది రూ.8 కోట్ల వ్యయముతో అనంతపురం జిల్లాలో స్థాపించడం జరుగుతుందని వ్యక్తం చేస్తున్నాను. ఈ సందర్భములో రా సిల్క్‌కు సంబంధించినంతవరకు ఎక్కడైతే సరైన నీరు అవసరం లేదో, తక్కువ నీరు వినియోగం ఉన్నచోట ఎక్కువ పారిశ్రామిక అభివృద్ధి జరిపించాలని రా సిల్క్ అభివృద్ధి కోసం అనంతపురం, మదనపల్లి ప్రాంతాలలో పరిపూర్ణమైన కృషి జరుగుతున్నది. ఒక కార్పొరేషన్ ప్రారంభించడం జరుగుతుంది. మార్కెటింగ్ విధానాలు, సౌకర్యాలు, సలహాలు ఉత్పత్తిదారులకు కలిగించడం జరుగుతుంది. ఫ్యాక్టరీలు నిర్మించడం జరుగుతుందని, మీకు సవినయముగా వ్యక్తం చేస్తున్నాను. ఆటోఎలక్ట్రికల్ ప్లాంట్ ఒకటి 3.5 లక్షల మెంబర్స్‌కి అవకాశం కలిగించే విధానముగా రూ.5 కోట్లతో నిర్మించబడుతున్నదని మనవిచేస్తున్నాను. అలాగే క్రాంక్ షాఫ్ట్ యూనిట్ రిపబ్లిక్ ఫోర్జ్ వారితో 25 వేల మంది శ్రామికులకు ఉపాధి కల్పించే విధానములో సుమారుగా రూ.11 కోట్ల వ్యయముతో నిర్మించబడుతున్నదని సవినయముగా మనవిచేస్తున్నాను.

స్టార్చ్ బేస్ట్ ఇండస్ట్రీస్ ఏవైతే రావాలో వాటికి ఎక్కడ ఉత్పత్తులు పెంచాలో వాటికి సమగ్రమైన అభివృద్ధి పథకాలు అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని సవినయముగా మనవిచేస్తున్నాను. ఇక ఫ్లోరసెంట్స్ ట్యూబ్ ప్రాజెక్టు ఒకటి రూ.4 కోట్ల వ్యయముతో నిర్మించబడుతున్నది. సోడా వాటర్ ప్రాజెక్టు ఒకటి రూ.4 కోట్ల వ్యయముతో నిర్మించబడుతున్నది. కడప జిల్లాలో రూ.4

లక్షల మెంబర్స్‌కి ఉపాధి కల్పించేటటువంటి కార్పొరేటర్ ప్రాజెక్టు ఒకటి రూ. 4 కోట్ల వ్యయముతో నిర్మించబడుతున్నది. పిస్టన్ రింగ్స్ అండ్ పిస్టన్ పిన్స్ ప్రాజెక్టు ఒకటి రూ. 8 కోట్ల వ్యయముతో అక్కడ నిర్మించబడుతున్నది. కాస్టిక్ సోడా ప్రాజెక్టు రూ. 28 కోట్ల వ్యయముతో కర్నూలు జిల్లాలో నిర్మించబడబోతున్నది. ఇవన్నీ ఒక ప్రాంతానికి ఎందుకు అంటున్నారు. ఎవరో కొంతమంది దీనిని ఒక సమస్యగా తీసుకొని అభివృద్ధి కార్యక్రమాన్ని తెలుగుదేశం ప్రభుత్వం అందించడంలేదని ఉద్యమాలు లేవదీస్తున్నందుకు, ఆ ఉద్యమాలను సమర్థించే ఎవరైనా అమాయకులు ఉంటే వారికి సమాధానం చెప్పాలి.

ప్రభుత్వ విధానాలు వారికి తెలియచేయడములో ఏవిధముగా తెలుగుదేశం ప్రభుత్వం సమగ్రతకు కృషి చేస్తున్నది అనేటటువంటి ప్రభుత్వ విధానం తెలియజేయాలనే భావముతో ఈ వివరాలు ప్రత్యేకంగా అందించడం జరుగుతోందని గౌరవనీయులైన సభ్యులకు మనవిచేస్తున్నాను. అదే విధంగా ఎడ్యుకేషన్‌కు సంబంధించినంత వరకు ఈనాడు విద్యావకాశాలు కల్పించడానికి, కాలేజీలు పెట్టడానికి వెనుకబడిన ప్రాంతాలు, అభివృద్ధి చెందని ప్రాంతాలలో ఉన్న వారికి సరైన అవకాశాలు కల్పించాలన్న విధానాన్ని తెలుగుదేశం ప్రభుత్వం అవలంభించబోతున్నది. కార్పస్ ఫండ్ కూడా అవసరమైన వాటికి రాయితీలు ఇచ్చి ఈ విధంగా విద్యాభివృద్ధికి కూడా తోడ్పాటు జరుగుతోందని మీకు నేను సవినయముగా మనవిచేస్తున్నాను.

**ఈనాడు విద్యావకాశాలు కల్పించడానికి, కాలేజీలు పెట్టడానికి వెనుకబడిన ప్రాంతాలు, అభివృద్ధి చెందని ప్రాంతాలలో ఉన్న వారికి సరైన అవకాశాలు కల్పించాలన్న విధానాన్ని తెలుగుదేశం ప్రభుత్వం అవలంభించబోతున్నది. కార్పస్ ఫండ్ కూడా అవసరమైన వాటికీ రాయితీలు ఇచ్చి ఈ విధంగా విద్యాభివృద్ధికి కూడా తోడ్పాటు జరుగుతోందని మీకు నేను సవినయముగా మనవిచేస్తున్నాను.**

ఈనాడు అధికార వికేంద్రీకరణ మన ఆదర్శము. కేవలం అధికారం అంటే హైదరాబాద్‌లో ఉండకూడదు, ప్రతి పౌరుడు ఈ రాష్ట్రాభివృద్ధి కార్యక్రమములో పాల్గొనేటటువంటి అవకాశం కలుగచేయాలి, అధికార వికేంద్రీకరణ జరగాలి అనే భావముతో ప్రాంతాల అభివృద్ధి బోర్డులు అన్నీ సరిగా పని చేయడం లేదనే భావముతో, ఇంకా ఎక్కువ వికేంద్రీకరణ జరగాలనే ఉద్దేశముతో ప్రతి జిల్లాకు ఒక ప్లానింగ్ బోర్డు పెట్టి ప్రభుత్వ విధానంగా ఆ కార్యక్రమం జరుగుతున్నదని సవినయముగా మనవిచేస్తున్నాను. అభివృద్ధి కార్యక్రమాలు అంటే పారిశ్రామికంగా, వ్యవసాయపరంగా, విద్యాపరంగా, మన సంస్కృతిపరంగా ఏమైనా కార్యక్రమాలు కావలసినప్పుడు ఆయా డిస్ట్రిక్ట్ ప్లానింగ్ బోర్డులు ప్రత్యేకముగా సమీక్షించుకోడానికి, వారి రికమెండేషన్స్ ప్రభుత్వానికి ఇవ్వడానికి, ఏమైనా కొత్త కార్యక్రమాలు వెంటనే వారు చేపట్టి అమలుజరుపుకోడానికి వారికి సంపూర్ణమైన అధికారాలు ఇవ్వడం జరిగిందని, పూర్తిగా రివ్యూయింగ్ పవర్స్ ప్రతి

విషయములో ఈనాడు ప్రభుత్వం తీసుకున్న కార్యక్రమాలు ఏ విధముగా నిర్వర్తించబడుతున్నాయో, వ్యవస్థలు ఏవిధముగా నడపబడుతున్నాయో విచారించి ఎప్పటికప్పుడు వారు సమీక్షించుకొనేటటు వంటి అవకాశం ఈ డిస్ట్రిక్ట్ ప్లానింగ్ బోర్డులకు ఇవ్వడం కూడా జరిగింది. కాబట్టి ఎవరూ ఏమీ అనుమానపడవలసిన అవసరంలేదు. రాష్ట్రాభివృద్ధికి, 23 జిల్లాలతో కూడిన ఈ రాష్ట్రానికి 23 అభివృద్ధి మండళ్లు ఏర్పరచి పూర్తిగా సమీక్షించుకొనే అవకాశం ఇచ్చి అభివృద్ధి కార్యక్రమాలు అందించే ప్రయత్నం చేస్తున్నప్పుడు వ్యక్తులుకానీ, ఏ వ్యవస్థకానీ అనుమానించవలసిన అవసరం లేదు. అన్నీ గౌరవనీయమైన సభకు మనవిచేశాను, అఖిలపక్ష సమావేశం తిరిగి ఏర్పాటు చేస్తాము.

వారికి ఇంకా ఏమైనా అనుమానాలు, ఇంకా సమస్యలు ఉంటే వాటిని సుహృద్భావముతో, సహోదరభావముతో, సరైన అవగాహనతో మనమందరం పరిష్కరించుకోవచ్చును. ఎవరి మనస్సులోను ఏ విధమైన అనుమానాలకు ఆస్కారం ఉండకూడదు, లేదని తమరి ద్వారా నేను సవినయముగా మనవిచేస్తూ ఆంధ్రప్రదేశ్ సర్వతోముఖ వికాసమే తెలుగుదేశం ఆదర్శమని మరొకసారి గౌరవనీయమైన సభకు తమ ద్వారా తెలియజేస్తున్నాను.

*(ఇంటరప్షన్)*

ఇది యదార్థానికి సర్వపక్ష సమావేశములో చర్చించవలసిన విషయం అయినప్పటికీ నేను ఈనాడు సభ్యుల అనుమానాలు – తెలిసినంతవరకు వివరాలకు వెళ్లకుండా కూడా – తీర్చడం నా ధర్మముగా భావించి మనవిచేస్తున్నాను. 800 టిఎంసి మనకు రావలసిఉండగా, 700 టిఎంసి కర్ణాటకకు ఉండగా 560 టిఎంసి సుమారుగా మహారాష్ట్రకు ఉండగా ఈనాడు ఆ 800 టిఎంసి ఏ విధంగా విభజించాలి, ఏ ప్రాంతానికి ఎంత ఇవ్వబడింది అన్నది మేము చేసినది కాదు. ఆరు కోట్ల తెలుగు ప్రజానీకం ఆనాడు ఆమోదించిన బచావత్ కమిషన్ ఇచ్చిన అవార్డు అని కూడా నేను సవినయముగా మనవిచేస్తున్నాను.

మనకు అది కాకుండా ఇంకా 300 టిఎంసిలు సుమారుగా అధిక జలం ఉన్నదని ఈనాడు గేజ్ రీడింగువల్ల తెలిసింది. ఆ మూడు వందల టిఎంసిల నీరు వృథాగా సముద్రంలోకిపోయే దానికంటే ఈనాడు మనకు ఉన్న హక్కు, అధికారాన్ని ఉపయోగించుకొని మన రాష్ట్రాభివృద్ధికి ఉపయోగించాలనే భావంతో తెలుగుదేశం ప్రభుత్వం ఈ సమస్య వెలికి తీసిందన్న విషయాన్ని తమకు నేను మనవి చేస్తున్నాను. ఆ సందర్భంలో ఈ అదనపు నీటిని ది అష్యూర్డ్ టు దోజ్ ప్రాజెక్ట్స్ విచ్ వి ఆర్ స్టార్టింగ్. లేకపోతే ఈనాడు రూ.480 కోట్ల వ్యయంతో తెలుగుగంగ నిర్మిస్తున్నాం అంటే నీరు లేక కాదు. నీరు ఇవ్వలేక కాదు. వాటర్ ఈజ్ అష్యూర్డ్ ఫర్ దోజ్ ప్రాజెక్ట్స్. మనకు ఉన్నటువంటి మిగులు నీటిని మనం ఏవిధంగా వినియోగించాలనేటటువంటి విధానమేకానీ, తిరిగి పాత సమస్యలు తోడడం కానీ, 800 టిఎంసిలు ఏవిధంగా పంచి పెట్టబడిందనేది కానీ ఈనాడు ప్రభుత్వం యొక్క అభిప్రాయంకాదు. ఎప్పుడో జరిగిన విధానం,

ఆనాడు అందరూ అంగీకరించిన విధానం కాబట్టి దాని ప్రసక్తిలేదు. ఇంతవరకు మిగులు జలాలు మాత్రం అందరూ వాడుకోవడానికి అవకాశం కల్పించబడుతుంది. వాటర్ ఈజ్ అష్యూర్డ్ టు ఆల్ దోజ్ ప్రాజెక్ట్స్ విచ్ గవర్నమెంటు ఈజ్ ప్లానింగ్. అది మాత్రం తమద్వారా గౌరవ సభ్యులకు మనవిచేస్తున్నాను.

*(ఇంటరప్షన్)*

అధ్యక్షా, 75 శాతం డిపెండబిలిటీ మీద బచావత్ కమిషన్ వారు ఇచ్చినటువంటిది మనకు 800 టిఎంసిల నీరు. యదార్థానికి ఎప్పుడైనా వరదలు రానప్పుడు, సరియైన నీరు రానప్పుడు నష్టపడేది ఆంధ్రప్రదేశ్ కాబట్టి, దిగువన ఉన్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కాబట్టి, ఈ మిగులు నీటిని ఏదైనా ఉంటే, దానిని పూర్తిగా వాడుకొనేటటువంటి అధికారం ఆంధ్రప్రదేశ్‌కు సంక్రమించబడిందని అవార్డులోనే సుస్పష్టం చేయబడింది. ఆఉన్నటువంటి ఆ క్లాజులను తీసుకుని ఈనాడు తెలుగుగంగ ప్రారంభించడం కానీ, మొదలైన కార్యక్రమాలు చేపట్టడం కానీ జరిగిందని కూడా మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను. అష్యూర్డ్ వాటర్ ఇట్ ఈజ్ ఓన్లీ 800 టిఎంసి. దానికి పైన 300 టిఎంసి మనకున్నటువంటి నిర్ధారణ కాబట్టి, అదనంగా ఉన్నటువంటి ఆ నీటిని 'ది వాటర్ ఈజ్ అష్యూర్డ్ ఫర్ ఆదర్ ప్రాజెక్ట్స్ విచ్ ది గవర్నమెంట్ ఈజ్ ప్లానింగ్'.

◆◆

సెప్టెంబర్ 24, 1985

# ప్రజల కన్నీళ్లను తుడిచే ప్రభుత్వం మాది

*(రాష్ట్రస్థాయి కరువు పరిస్థితులపై స్వల్పకాలిక చర్చ సందర్భంగా చేసిన ప్రసంగం)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, ఈనాడు ఉన్నటువంటి పరిస్థితి గౌరవనీయమైన సభకు మీ ద్వారా చెప్పవలసిన బాధ్యత నాకు ఉన్నదని నేను సవినయంగా మనవిచేస్తున్నాను. ఈనాడు అతి విచారంగా, బాధావహంగా ఉన్నటువంటి పరిస్థితులు మీ ద్వారా సభ దృష్టికి తెస్తున్నాను. ఈ సమయంకల్లా మన ఆంధ్రప్రదేశ్‌లో నేల పచ్చగా పరిమళించి, సస్యశ్యామలంగా ఉండవలసిన తరుణం. అటువంటి పరిస్థితిలో ఈ సంవత్సరం తొలకరి వానలు కొంత ముందుగానే ప్రారంభమయ్యాయి.

ఈ సంవత్సరం ఆశాజనకంగా ఉంటుందని ఉప్పొంగిపోయాము. కానీ ఆ తరువాత సంభవించిన పరిస్థితులవల్ల, భూగర్భజల ప్రవాహంవల్ల గానీ వర్షాలు ముమ్మరంగా పడకపోవడంవల్ల గానీ మనకు పంటలు అంతా బాగాలేవని చెప్పడానికి బాధపడుతున్నాను. కొన్ని ప్రాంతాలలో ముఖ్యంగా వేరుశెనగ వేసినచోట్ల – కొన్ని రోజుల్లో వర్షాలు రాకపోతే ఆ పంటలు ఎండిపోతాయి అనడంలో అతిశయోక్తిలేదని మనవిచేస్తున్నాను. వేరుశెనగకు ముఖ్యంగా మెట్ట ప్రాంతంలో ఉన్న పైరులకు నీటి ఆదాయం లభించకుండా ఉన్నాయని ప్రభుత్వపరంగా సభకు మనవిచేస్తున్నాను. కీడెంచి మేలెంచాలనేది మన సిద్ధాంతం కాబట్టి భగవంతుడి దయవల్ల పదిహేను, ఇరవై రోజుల్లో మంచి వర్షాలు పడితే కొంతమందికి ఈ బాధ తప్పుతుంది కానీ దురదృష్టవశాత్తు అది జరగకపోతే ఏర్పడబోయే పరిస్థితులను ఎదుర్కొవలసి వస్తుందని సభకు సవినయంగా మనవిచేస్తున్నాను. పరిస్థితులు మనకు ఎదురైనప్పుడు ఏమి చేయాలని అనుకునేకంటే ముందే అటువంటి పరిస్థితులు వస్తే అలాంటి కరువు ప్రాంతాలను ఆదుకోడానికి ఏయే సంక్షేమ పనులకు పూనుకోవాలి అనేది ఆలోచించాలని సభకు మనవిచేస్తున్నాను. అప్పటికప్పుడే 25 లక్షల రూపాయలు సుమారు పదిహేను రోజుల క్రితమే ఎగువ ప్రాంతములు

ఉన్నచోట ఎక్కడైతే త్రాగడానికి నీరు కూడా లేక ప్రజలు బాధపడుతున్నారో, అక్కడ విడుదల చేసి మంచి నీరు కార్యక్రమం అందించాలని ఆదేశించడం జరిగింది. ఎప్పటికప్పుడు సంభవించిన పరిస్థితిని యూనియన్ ప్రభుత్వానికి కూడా ఎరుకపరచడం మంచిదనే ఉద్దేశంతో గౌరవనీయ ప్రధానమంత్రికి ఈ విషయం కూడా వ్రాయడం జరిగింది. పరిస్థితులు ఈ విధంగా ఉన్నాయి – ముందు ముందు ఎట్లా పరిణమిస్తుందో తెలియదు. ఒక ఇరవై కోట్ల రూపాయలు తక్షణ సహాయంగా పంపించవలసిందిగా కోరుతూ ప్రైమ్ మినిస్టర్ రాజీవ్‌గాంధీ గారికి నేను స్వయంగా వ్రాయడం జరిగింది. ఆ తరువాత ఈ 25 లక్షల రూపాయలవల్ల ఏమీ జరగదు – నానాటికి బాధావహమైన పరిణామాలు ఏర్పడుతున్నాయి కాబట్టి అయిదు కోట్ల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేయడానికి సిద్ధపడిందని మనవిచేస్తున్నాను.

**ప్రజలు జీవనభృతి సముపార్జించుకునేందుకు, వారిని ఆదుకునే కరువు పనులుగా వాటిని తీసుకోవాలని, వారికి తగినటువంటి పనులు కల్పించడమేకాకుండా వారికి సహాయం అందించే విధంగా కూడా చూడాలని-ఎక్కడైతే ఆ మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, చెరువులు, మురుగునీటి కుంటలు ఉంటాయో అవన్నీ కూడా కరువు పనుల క్రింద చేపట్టి ప్రత్యేక ప్రాజెక్టు కార్యక్రమంగా స్వీకరించాలని.**

ఇది తక్షణ కర్తవ్యంగా భావించి–ఎన్నో ఇబ్బందులతో త్రాగు నీటికీ కూడా బాధపడుతున్న ప్రజలను ఆదుకోడానికి – అది ప్రభుత్వ ధ్యేయంగా భావించి ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని మనవిచేస్తున్నాను. ఇందులో రూ. 3.50 కోట్లు రూరల్ వాటర్ స్కీమ్స్‌కు, రూ. 1.00 కోటి పట్టణ ప్రాంత నీటి సరఫరా విధానానికి, రూ. 0.50 కోటి ప్రత్యేకంగా పశుగ్రాసం కోసం కేటాయించబడిందని మనవిచేస్తున్నాను. ప్రత్యేకమైన ఉత్తర్వులు ప్రభుత్వ పరంగా జిల్లా అధికారులకు జారీచేయబడ్డాయి. ముఖ్యంగా ఎక్కడైతే మైనర్ ఇరిగేషన్ పనులు ఉంటాయో – కేవలం కాంట్రాక్టర్ల చేతిలో ఆ పనులు పెట్టకుండా – ప్రజలు జీవనభృతి సముపార్జించుకునేందుకు, వారిని ఆదుకునే కరువు పనులుగా వాటిని తీసుకోవాలని, వారికి తగినటువంటి పనులు కల్పించడమేకాకుండా వారికి సహాయం అందించే విధంగా కూడా చూడాలని, ఎక్కడైతే ఆ మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, చెరువులు, మురుగునీటి కుంటలు ఉంటాయో అవన్నీ కూడా కరువు పనుల క్రింద చేపట్టి ప్రత్యేక ప్రాజెక్టు కార్యక్రమంగా స్వీకరించాలని, మీ మీ జిల్లాలలో ఏయే కార్యక్రమాలు ఉన్నాయి ఎంతవరకు చేసుకోడానికి అవకాశం ఉంటుందో చూసుకుని, మీరు ఆ కార్యక్రమాలు చేపట్టేందుకు కృతనిశ్చయంతో ఉండాలని జిల్లా అధికారులకు అందరికీ ఆదేశాలు ఇవ్వడం జరిగింది.

దీనివల్ల నిరాధారమైనటువంటి పేదవారికి పని కల్పించడమే కాకుండా ప్రభుత్వం చేస్తున్నటువంటి సంక్షేమ కార్యక్రమాలు – బలహీనవర్గాలకు అందిస్తున్న చేయూత – కిలో రెండు రూపాయల పథకంగానీ, బట్టల సరఫరా విధానంగానీ – వారికి అందించి, వారిని ఆదరించవలసిన విషయం ప్రభుత్వం గుర్తించిందని సవినయంగా మనవిచేస్తున్నాను. ఈ విధంగా

ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం-పశుగ్రాసం విషయంలో, ఎక్కడైతే పశుగ్రాసం దొరుకుతుందో, అక్కడి నుంచి ఇంకోచోటికి తరలించకుండా చూడాలని, పశువులను పోషించడం విషయంలో శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని సవినయంగా మనవిచేస్తున్నాను. గౌరవనీయ సభకు తమద్వారా తెలియచేసేది ఏమంటే ఇది ప్రతి ఒక్కరికి సంబంధించిన కార్యక్రమము. మన అందరికీ సంబంధించిన కార్యక్రమం. మీ అందరి ఆలోచనలు – ఏ విధమైన కార్యక్రమాలు చేపడతాము, ఏ విధంగా ప్రజలకు సహాయం అందిద్దాము అనే ఆలోచన మీరందరూ సరైన పాత్ర వహించి, మీ అమూల్యమైన సలహాలు ఇచ్చి, అందరూ సహకరించాలని ప్రభుత్వపరంగా నేను సవినయంగా అందరికీ మనవిచేస్తున్నాను.

ఈనాడు మీముందు ఉంచబడినది ప్రభుత్వానికి ఇంతవరకు సూక్ష్మంగా అందినటువంటి వివరణ. ఇంకా వివరాలు అందుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎక్కడ ఏ విధంగా వర్షపాతం ఉంది? ఏ విధంగా పంటలు పాడైనాయి? ఎట్లా పంటలు దెబ్బతిన్నాయో వివరాలు ఇవ్వాలని, అదే కాకుండా పూర్తిగా కరువు ఉన్న ప్రాంతాలను కరువు ప్రాంతాలుగా ప్రకటన చేయాలని, అక్కడ రైతులకు మామూలుగా ఇచ్చే రాయితీలన్నీ ఇవ్వాలని, పంట దెబ్బతిన్న చోట తిరిగి వారు పంట వేసుకొనే పద్ధతిలో వారికి ఎరువులు కానీ, విత్తనాలు కానీ, క్రిమిసంహారక మందులుకానీ, సరఫరాచేసే పద్దతిలో, సబ్సిడీ పద్ధతిలో వారికి రుణాలు ఇప్పించే విధానం ఉండాలని వారికి ఎటువంటి ఇబ్బందులు కల్గినా వాటిని తొలగించడానికి సరియైన మార్గాలు అవలంభించాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందని మనవిచేస్తున్నాను. ఈ సభ ముందు ఈనాడు ఉన్నటువంటి పరిస్థితి గురించి చెప్పడానికి బాధపడుతూ దీనిని గురించి మీ ఆలోచనలు అందుకోవడానికి సుముఖంగా ఉన్నానని మనవిచేస్తున్నాను. వారివారి నియోజకవర్గాలలో ఏ పరిస్థితి ఉన్నది పూర్తిగా వివరాలు ఇస్తే వాటిని నివారించడానికి ప్రభుత్వం తప్పనిసరిగా చూస్తుందని మనవిచేస్తున్నాను.

అంతేకాకుండా ఈనాడు జిల్లా ప్లానింగ్ బోర్డులు ఉన్నాయి. ఆ జిల్లా ప్లానింగ్ బోర్డులలో ఆయా మంత్రివర్యులంతా ఈ సభా సమావేశం పూర్తికాగానే ఆ జిల్లాల్లో కేంద్రీకరించి అక్కడున్నటువంటి గౌరవనీయులైన శాసనసభ్యులు నుంచి పూర్తి వివరాలు ఏవిధంగా పరిస్థితులు ఉన్నాయనేది సేకరించాలని మనవిచేస్తున్నాను. మనము ప్రజా ప్రతినిధులుగా ఉండి ప్రజలకు చేయవలసిన కర్తవ్యం ఏమిటి? ఈనాడు అక్కడున్నటువంటి దుస్థితిని తొలగించడానికి కృషిచేయాలని అర్థిస్తున్నాను. గౌరవనీయులైన శాసన సభ్యులంతా ఈ విషయంలో వారి అమూల్యమైన సలహాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తే వాటికి సరియైన పరిష్కారమార్గం కనుగొనడానికి అవకాశం కల్గుతుందని సవివరంగా మనవిచేస్తూ దీనిని ఈ సభ ముందు ఉంచుతున్నాను.

◆◆

మార్చి 6, 1986

# సమపాళ్ల సమన్వయ సిద్ధాంతంతో నడిపించడం ఈ ప్రభుత్వ ధ్యేయం

*(గ్రామీణ మరియు చిన్న తరహా పరిశ్రమలకు గ్రాంట్స్ విడుదల చేసే డిమాండ్‌పై చేసిన ప్రసంగం)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, ఈ పరిశ్రమల డిమాండ్‌పై గౌరవనీయులైన 10 మంది సభ్యులు వారివారి విలువైన అభిప్రాయాలను తెలియపరిచారు. వాటినన్నింటినీ గౌరవ భావంతో స్వీకరించడం జరిగిందని మీ ద్వారా నేను సవివరంగా మనవిచేస్తున్నాను. అభివృద్ధి అన్నది భిన్న దృక్పథంతో, భిన్న శాఖలుగా జరుగుతుందని విజ్ఞులు చెప్పారు. దీని విషయములో భిన్నాభిప్రాయాలు లేవు. పరిశ్రమలు, వ్యవసాయం అనేవి ప్రభుత్వానికి రెండు కళ్ళులాంటివి. అవి అభివృద్ధి చేయబడాలి. తినడానికి ఆహార ధాన్యాలు, హెచ్చు పంటలు పండించడాన్ని ఒక పక్కన అవసరమైతే సాగునీటి సౌకర్యాలు తీర్చుకుంటూ, ఈనాడు వెనుకబడిన ప్రాంతాలలో సరియైనటువంటి పారిశ్రామికాభివృద్ధి జరిపించడం అవసరమని ప్రభుత్వము గుర్తించిందని సవివరంగా మనవిచేస్తున్నాను.

రాష్ట్ర అభివృద్ధికి వ్యవసాయం, పరిశ్రమలు అనే రెండు రంగాలు పని చేసినప్పుడే వాటిలో సంపూర్ణమైన ప్రగతి సాధించినప్పుడే కేవలం పేదరికమే కాకుండా నిరుద్యోగాన్నీ అదే విధంగా సమాజంలో మిగిలిన దురదృష్టకరమైన దారిద్ర్యాన్ని రూపు మాపగలమని ప్రభుత్వం నమ్మకంగా భావిస్తున్నదని మనవిచేస్తున్నాను. పారిశ్రామికాభివృద్ధి జరగాలి. వ్యవసాయభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుపుకోవలసిన అవసరం ఉంది. సమపాళ్ల సమన్వయ సిద్ధాంతంతో నడిపించడం ప్రభుత్వ ధ్యేయంగా భావిస్తున్నామని సవివరంగా మనవిచేస్తున్నాను. పారిశ్రామిక విధానంలో ఏ విధమైన ప్రగతి కావాలో ఆ విధమైన ప్రగతి కోసమే పాటుబడుతున్నామని నేను సవివరంగా మనవిచేస్తున్నాను. కేవలం కొంతమంది గుత్తాధిపతులు అధిపత్యం క్రింద ఉన్నటువంటి గనులు

కానివ్వండి ప్రకృతికి సంబంధించిన వనరులు కానివ్వండి అవన్నీ వెలికి తీసి ఎవరైతే పారిశ్రామిక విధానపరమైన విజ్ఞానంతో ఉండాలో వారికి సరియైన చేయూతనిచ్చి, అండదండలు ఇచ్చి, ఆదరించడం ప్రభుత్వ విధానమని సుస్పష్టము చేస్తున్నాను. అదేవిధంగా ఈనాడు కేవలం విజ్ఞానవంతులతో పాటు వాటికీ సమన్వయపరమైనటువంటి వారి భవిష్యత్తుకు ఉపకరించేటటువంటి సరియైన విజ్ఞానం కూడా అందించిపెడదామని ప్రభుత్వం వారికి తర్ఫీదు నిచ్చే విధానంగా తీసుకున్నదని గౌరవసభ్యులకు సవివరంగా మనవిచేస్తున్నాను. దీని గురించి ఒక ఇన్‌స్టిట్యూట్ ప్రారంభించుకుంటే బాగుంటుందని గౌరవసభ్యులు కొంతమంది తెలియజేశారు.

ఈ విధమైన ఇన్‌స్టిట్యూషన్ ప్రారంభించడానికి ప్రభుత్వపరమైన నిర్ణయం ప్రభుత్వం తీసుకున్నదని గౌరవ సభ్యులకు సవివరంగా మనవిచేస్తున్నాను. ఇన్‌స్టిట్యూట్ విషయంలో ఎవరైతే పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తారో కేవలం గ్రుడ్డిగానో, లేక ఇదివరకు ఏదో ఉన్న పరిజ్ఞానంతో కాకుండా ఈ ఆధునీకీకరణ పరిజ్ఞానం ఏ విధంగా ఉన్నది, ఏ విధమైనటువంటి సుశిక్షితమైనటు వంటి క్రమశిక్షణతో కూడిన మేనేజిమెంట్ ద్వారావారు స్థాపించబోయే పరిశ్రమలు వారు నిర్వహించకోగలిగి ఉండాలి అనే విధానం మీద పూర్తిగా ప్రభుత్వం ఈనాడు ఇటువంటి ఇన్‌స్టిట్యూట్ ప్రారంభించడానికి నిర్ణయం తీసుకున్నదని గౌరవసభ్యులకు సవివరంగా మనవిచేస్తున్నాను దీంట్లో ఇండస్ట్రియల్ మెనేజ్‌మెంట్, సక్సెస్‌ఫుల్ ప్లానింగ్, అదే కాకుండా ఇతర దేశాలకు వీరు వెళ్లి ఏ పరిజ్ఞానం ఎక్కడ నుంచి వస్తుందో ఆ పరిజ్ఞానం విషయంలో వారికి మంచి అవగాహన కలిగించాలని, సువిధానాలలో వారికి సరియైనటువంటి మంచి మార్గాలు చూపించాలని, వారికి కేవలం పరిశ్రమలు స్థాపించే వారుగా మాత్రమే కాకుండా వారు పరిశ్రమలలో విజయవంతముగా సాధించే పారిశ్రామికవేత్తలుగా వారిని తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వపరమైన విధానమని నేను గౌరవ సభ్యులకు మనవిచేస్తున్నాను, టెక్నోక్రాట్స్ విషయంలో ఎవరైతే పూర్తిగా శాస్త్రీయ పరిజ్ఞానం కలిగి ఉంటారో వారిని ఆహ్వానించడం, గౌరవించడం, వారికి సరియైనటువంటి సౌకర్యాలు కలిగించడమే ప్రభుత్వ విధానమని గౌరవ సభ్యులకు మనవిచేస్తున్నాను.

**ఈనాడు కేవలం విజ్ఞానవంతులతో పాటు వాటికీ సమన్వయపరమైనటువంటి వారి భవిష్యత్తుకు ఉపకరించేటటువంటి సరియైన విజ్ఞానం కూడా అందించిపెడదామని ప్రభుత్వం వారికి తర్ఫీదు నిచ్చే విధానంగా తీసుకున్నదని గౌరవసభ్యులకు సవివరంగా మనవిచేస్తున్నాను. దీని గురించి ఇక ఇన్‌స్టిట్యూట్ ప్రారంభించుకుంటే బాగుంటుందని గౌరవసభ్యులు కొంతమంది తెలియజేశారు.**

అదే విధంగా కొంతమంది సభ్యులు మాట్లాడుతూ నాన్ రెసిడెంట్ ఇండియన్స్ విషయంలో ముఖ్యమంత్రిగారు అమెరికా వెళ్ళి వచ్చిన తరువాత అక్కడ వారు ఇక్కడ పరిశ్రమలు పెట్టడానికి ముందుకు వస్తున్నారని చెప్పారు. వారు వచ్చి పరిశ్రమలు పెట్టాలా అని అడిగారు. వారి గురించి

ఆ పరిశ్రమల గురించి అప్పుడే స్థల నిర్ణయం జరిగిందని మనవిచేస్తున్నాను. ఇప్పటికిప్పుడే 13 ప్రాజెక్టులు వచ్చి ఉన్నాయి. అవి 18 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణములో ఉన్న సంగతి మీకు మనవిచేస్తున్నాను. ఇంకో 83 యూనిట్స్ 200 కోట్ల రూపాయల వ్యయంతో పరిశీలనలో ఉన్నాయి. అవి కూడా వెంటనే ప్రారంభించబడతాయనే విశ్వాసం ప్రభుత్వానికి ఉందని గౌరవసభ్యులకు నేను సవివరంగా మనవిచేస్తున్నాను. విప్లవాత్మకమైన పారిశ్రామిక విధానం రావాలని కొంతమంది గౌరవసభ్యులుచెప్పారు. కేవలం విప్లవాత్మకమైన పారిశ్రామిక విధానం రావాలంటే అది గవర్నమెంటు ఆఫ్ ఇండియా- కేంద్ర ప్రభుత్వ దృష్టిలో కేవలం నో, హౌ తెచ్చుకోవడం వలన పరిశ్రమలు రావు. ఎక్కడికక్కడ రీసెర్చ్ ఉండాలి. విజ్ఞానపరమైనటువంటి పరిశోధనా కార్యక్రమం ఉండాలి.

ఈనాడు మనం తెచ్చుకున్నది వారు వాడి వదలివేసిన నో, హౌ లే గానీ ఆధునికమైన నోహౌ లు కాదనే విషయం మనం గుర్తుంచుకోవాలని గౌరవసభ్యులకు సవివరంగా మనవిచేస్తున్నాను. ఏమైనా సరే మన విజ్ఞానాన్ని మనమే ఇక్కడే ప్రోత్సహించి, సంపాదించుకొని, దానిపై ప్రయోజనాత్మకమైన రీసెర్చ్ ఇక్కడే జరిపి, మనవాళ్లకు తర్ఫీదు ఇచ్చుకుంటే తప్ప మనం ఈనాడు ప్రపంచములో ఉన్న కార్యక్రమ విధానాలతో పోటీ చేయలేము ఎప్పటికప్పుడు ఇతర దేశాలనుండి అరువుగా తీసుకునే విజ్ఞానం అరువుగానే ఉంటుంది. కనక ఆ విధమైన రీసెర్చ్ ఎంతవరకు ప్రయత్నం చేస్తే ఫలించగలదనే విధానం కూడా ప్రభుత్వ దృష్టి సాధిస్తున్నదని సవినయంగా మనవిచేస్తున్నాను. ఈనాడు ఉన్న పరిశ్రమకు సంబంధించిన ఇన్‌స్టిట్యూషన్స్ ఉన్నాయి. వాటన్నింటి ద్వారా సరియైన, సమగ్రమైన సహాయం పారిశ్రామికవేత్తలకు అంటే ఎ.పి.ఐ.డి.సి; ఎ.పి.ఎస్.ఎస్.ఐ.డి.సి; ఎ.పి.ఎస్.ఎఫ్.సి; ఎ.పి.ఇ.డి.సి; ఎ.పి.బి.సి;- ఇవన్నీ సంస్థలద్వారా కూడా సరియైన విజ్ఞానంగానీ, ఆర్థికపరమైన సహాయంగానీ అందజేయడం జరుగుచున్నది. ఈనాడు ఈ సంస్థలలోని ప్రగతిని నేను అభినందిస్తున్నాను.

ఎందుకంటే ఆనాడు ఏదైతే ప్రభుత్వము తన విధానాన్ని నిర్ణయించిందో ఆ విధానాన్ని ముఖ్యంగా అమలు చేయడంలో వారు కృషి చేయడం జరుగుచున్నది. ఆ కృషి వల్లనే పారిశ్రామిక విధానము ఇంత అభివృద్ధివంతంగా ఉంది మన రాష్ట్రంలో ఈనాడు electroics is the latest technological development in the scientinic research. ఈ ఎలక్ట్రానిక్స్ - ఈనాడు ఈ ఆధునీకీకరమైన పారిశ్రామిక విధానములో ఇదివరకున్న ఈ మెకానికల్ ఇంజినీరింగ్‌ను, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌ను త్రోసిపుచ్చి అది ముందుకు వస్తున్నపుడు ఈ ఎలక్ట్రానిక్ అండ్ కంప్యూటరైజేషన్ చాలా అవసరాలను తీరుస్తున్నదన్న భావనతో ఈనాడు ప్రభుత్వము ప్రతి కాలేజీలో ఈ కోర్సును పెట్టాలని నిర్ణయం తీసుకొన్నది. ఈనాడు ఈ ఎలక్ట్రానిక్స్‌ని తిరుపతిలో, వరంగల్‌లో, విజయవాడలో, హైదరాబాద్‌లో ఒక్కొక్కటి నిర్మాణం చేయడం జరిగిందని గౌరవ

సభ్యులకు తెలుసు. అంతేకాకుండా ప్రభుత్వ ఉద్దేశంలో కూడా రాజ్యాంగ పరిపాలనా విధానాన్ని ఆధునిక శాస్త్రీయ పద్ధతిలో ఏవిధంగా ఉపయోగించుకోవాలో అందుకు పరిపూర్ణమైన కృషి జరుగుచున్నదని మనవిచేస్తున్నాను.

ఈనాడు మిగిలిన వ్యవసాయ రంగములో ఏ విధంగా అభివృద్ధి చెందుతున్నదో ఇదివరకు విన్నవించడం జరిగింది. స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ విషయంలో గ్రామాలకు ప్రాముఖ్యత ఇవ్వడం జరుగుతున్నది. పెద్ద పరిశ్రమలకు యాన్సిలరీస్ కొన్నింటిని అందించడానికి ఆయా జిల్లాలలో అవకాశం ఉంది. స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్‌ను స్థాపించి సామాన్య వ్యక్తిని పారిశ్రామిక రంగములో ఇందుకు పంపాలనేదే ప్రభుత్వపరమైన ఉద్దేశమని సవినయంగా మనవిచేసున్నాను. ఇదివరకు కేవలం వ్యవసాయం మీదనే ఆధారపడి ఉన్నందున, ఎవరు కూడా పారిశ్రామిక విధానములో ముందుకు రాకపోవడం జరిగిందని గుర్తు చేస్తున్నాను. ప్రతి ఊరిలో ఒక పరిశ్రమను స్థాపించాలి. ఆడ, మగవారికి ఈ పారిశ్రామిక విధానములో వారి వారి పరిధిలో జీవనోపాధి కల్పించడం కోసమే ప్రభుత్వపరమైన ఈ పారిశ్రామిక విధానమని కూడా మనవిచేస్తున్నాను. ఎక్కడెక్కడైతే ముఖ్యంగా చిన్న చిన్న పరిశ్రమలు ప్రారంభించడానికి అవకాశం ఉందో అక్కడ, అటువంటి చిన్న పరిశ్రమలకు ఆర్థికపరమైన అవకాశం అందజేయడం జరుగుతుందని సవినయంగా మనవిచేస్తున్నాను.

ఎక్కడికక్కడ బాగులేకుండా చూడడానికి ప్రభుత్వము కొన్ని నిర్ణయాలు తీసుకొన్నది. ఆ నిర్ణయాలను గౌరవ సభ్యులకు తమద్వారా తెలియచేయటం నా బాధ్యతయని మనవిచేస్తున్నాను. ఇపుడే పి.ఎల్.పి. లోన్సు చిన్న కుటీర పరిశీమలకు రద్దు చేయడం జరిగిందని సవినయంగా మనవి చేస్తున్నాను. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ వారు ప్రభుత్వపరమైన భూమిని ఇచ్చినపుడు తిరిగి పారిశ్రామికవేత్త ఎగ్జెంప్షన్ కొరకు పెట్టే ఆ పాత విధానాన్ని రద్దు చేయడం జరిగింది. ఎక్కడైనాసరే, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ఏ పారిశామికవేత్తకైనా సరే, ఆ విధంగా స్థలం తీసుకొన్నప్పుడు దానికి వేరే ఎగ్జెంప్షన్ లేకుండా వెంటనే వారు పరిశ్రమలు పెట్టడానికి అవకాశం కల్పించడం జరిగింది. అదే విధంగా ఇంకా కట్టుదిట్టమైన విధానంతో, ఎవరైనా పారిశ్రామికవేత్త ముందుకు వస్తే, వారికి అనువైన ఈ అవకాశాలు అన్నీ కూడా వారికి కావలసిన ప్రభుత్వపరమైన సహాయాన్ని అంతయునూ 30 రోజులలో ఇచ్చేటట్లు కట్టుదిట్టం చేయడం, అందుకు తగిన కట్టుదిట్టమైన ఆదేశాలివ్వడం జరిగిందని మనవిచేస్తున్నాను.

చేనేత పరిశ్రమను కొత్త ప్రభుత్వపరమైన సిద్ధాంతంగా వ్యవస్థీకరించడానికి, న్యూ టెక్స్టైల్, పాలసీని అంటే ఒక ప్రక్క చేనేత, పవర్ లూమ్స్ మరొక వైపు స్పిన్నింగ్ మిల్స్ వీటికి ఏదైనా సమన్వయం ఉండాలి. పరిశ్రమను కాదనలేము. ఎన్నో యుగాలుగా తరతరాలుగా ఖ్యాతి తెచ్చిన ఆ పరిశ్రమలపై లక్షల చేనేత కార్మికులు ఆధారపడి ఉన్నారు. ఆధునికమైన పద్ధతిలో వారికి

సరియైన విధానాన్ని అందజేయడానికి కొత్త టెక్స్టైల్ పాలసీని ప్రభుత్వము అవలంభించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయడం, ఆ కమిటీ సిఫారసులను అనుసరించి పారిశ్రామిక విధానంలో ఏ విధమైన నిర్ణయాలు తీసుకోవాలన్నది ప్రభుత్వము యొక్క ఆలోచనగా ఉందని మనవిచేస్తున్నాను.

ఈనాడు సబ్సిడీ ధరకు చేనేత వసూలు ఇస్తున్నారంటే 60-70 లక్షల రూపాయలు విలువచేసిన ధోవతులు, చీరెలు కావలసిన అవసరముందని అంటే ఏ విధంగా చేనేత కార్మికులకు తగినటువంటి వృత్తిని కల్పించడం జరుగుతున్నదో నేను చెప్పవలసిన అవసరము లేదు. ఈ విషయంలో సామాన్య శ్రామికుడు, కార్మికుడు ఎవరై ఉంటారో వారికి సరియైన చేయూత, బలం, ప్రోత్సాహం ఇవ్వాలని ప్రభుత్వపరమైన ధ్యేయంగా మనవిచేస్తున్నాను. ఈ సందర్భంలో డి.బి.ఆర్. మిల్స్ విషయం చెప్పారు. ఈ మిల్స్ కొద్ది రోజుల్లో పునః ప్రారంభించబడుతున్నాయని సవినయంగా మనవి చేస్తున్నాను. ఏదైనా ఒక పారిశ్రామిక వ్యవస్థ ఆగినపుడు ముందుగా వర్కర్స్‌కు ప్రాతినిధ్యం ఇవ్వడం జరుగుచున్నది. ఎవరైనా సరే వారు ముందుకు వస్తే వారు పరిశ్రమను నడుపుకోగలరు. వారికి అప్పగించడం జరుగుతుందని అన్నప్పుడు వారు ముందుకు రాకపోతే ప్రభుత్వము ఏ విధంగా దాన్ని నిర్వహించాలి అనేది ఆలోచన చేస్తుందిగానీ, ప్రప్రథమంగా శ్రామికులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతున్నదని సవినయంగా మనవిచేస్తున్నాను. సర్ సిల్క్ ఫ్యాక్టరీ ఉంది. ప్రభుత్వపరంగా ఒక నిర్ణయం తీసుకోవడం జరిగింది. దాన్ని నిర్వహించడానికి తగిన కట్టుదిట్టాలు, సన్నాహాలు చేయడము. జరుగుచున్నదని మనవిచేస్తున్నాను.

> **చల్లపల్లి షుగర్ ఫ్యాక్టరీ విషయంలో ప్రభుత్వం దాన్ని నిర్వహించడానికి కొన్ని ఇబ్బందులు వచ్చినపుడు ఎన్.ఎస్.ఎఫ్.కు అప్పజెప్పి, తద్వారా నిర్వహించడానికి అవకాశాలు కల్పించడం జరిగింది. ఈ సంవత్సరమే చక్కెర ఉత్పత్తిని ప్రారంభించే వీలును కల్పించడం జరుగుతుందనీ మనవిచేస్తున్నాను. శ్రామికులు, కర్షకులు అందరూ సుభిక్షంగా ఉండాలనే ప్రభుత్వపరమైన ఉద్దేశమని, ఆ విధమైన కృషి జరుగుచున్నది.**

చల్లపల్లి షుగర్ ఫ్యాక్టరీ విషయంలో ప్రభుత్వపరంగా దాన్ని నిర్వహించడానికి కొన్ని ఇబ్బందులు వచ్చినపుడు ఎన్.ఎస్.ఎఫ్.కు అప్పజెప్పి, తద్వారా నిర్వహించడానికి అవకాశాలు కల్పించడం జరిగింది. ఈ సంవత్సరమే చక్కెర ఉత్పత్తిని ప్రారంభించే వీలును కల్పించడం జరుగుతుందనీ ఆ ఆలోచనే ప్రభుత్వానికి ఉందని మనవిచేస్తున్నాను. శ్రామికులు, కర్షకులు అందరూ సుభిక్షంగా ఉండాలనే ప్రభుత్వపరమైన ఉద్దేశమని, ఆ విధమైన కృషి జరుగుచున్నది. ఇపుడే ప్రభుత్వ పాలనా ఆలోచనగా వారికి తెలియజేస్తున్నాను, గనుల విషయం వారు తెలిపారు. ఎవరైనా తక్కువ పొలాలుగల పూర్ మార్జినల్ ఫార్మర్స్‌గా ఉంటే, వారే ఆ గనిలో ఉన్న వస్తువును వెలికితీసి, వారే దానిని స్వేచ్ఛగా అమ్ముకొనే వీలును కూడా ప్రభుత్వపరమైన యోచనగా, నిర్ణయంగా తెలియజేస్తున్నాను. కొద్దిగా స్థలాలు కలిగియున్న వారి దగ్గర నుంచి ఏ విధంగా

ధనవంతులు ఆ స్థలాలను తీసుకొన్నారో ఇపుడు గౌరవసభ్యులు కొందరు చెప్పారు. 20 ఏండ్ల దాకా ఒకరిదగ్గరే కాంట్రాక్టు ఉండాలా? ఎందుకు వారే 20 ఏండ్లు ఉంచుకోవలెను? ప్రభుత్వపరమైన ఆ భూమి అందరికీ చెందింది. ఎవరైతే ముందుకు వస్తారో వారికి అనుభవించే అవకాశము కల్పించాలిగానీ, పలుకుబడిని ఉపయోగించి ఆ స్థలాన్ని లేదా పొలాన్ని గుత్తేదారు క్రింద ఆక్రమించుకొనే విధానం ప్రభుత్వం మాత్రం హరించదు, అవలంభించదని సవినయంగా మనవిచేస్తున్నాను.

రాయలసీమలోనున్న కడప రాయిని, గుంటూరులో ఉన్న సున్నపురాయిగానీ, మరొకటిగానీ, ఎవరైతే సామాన్య రైతు అతని అధీనంలో భూమి ఉంటుందో, వారే వస్తువును బయటకు తీసిన వారే అమ్ముకోవాలి. ఇది ప్రభుత్వం యొక్క విధానంగా మనవిచేస్తున్నాను. ఈనాడు రాష్ట్రపరమైనటువంటి అవసరాలు ఉన్నాయి. గూడూరు సిరామిక్ ఫ్యాక్టరీ ఉన్నది. క్రితం సంవత్సరం కేవలం 11 లక్షలు సుమారుగా ప్రభుత్వ పరమైనటువంటి ఆర్డర్లు ఇవ్వడం జరిగితే ఈ సంవత్సరం నుండి 17 లక్షలకు పెంచబడింది. ప్రభుత్వానికి ఏమైనా అవసరం ఉంటే సరుకులు ఆయా వ్యవస్థ నుంచే కొనాలి. ఎలక్ట్రిసిటీ బోర్డువారికి ఏదో పింగాణి కావాలి అనుకున్నప్పుడు పూర్తిగా ఆ సంస్థను ఉపయోగించుకోవాలి. ఆ సంస్థకు వారు కూడా కొంత పెట్టుబడి పెట్టి వారు పనిచేసే విధానాన్ని కూడా సృష్టించి అక్కడ కార్మికులకు సరైనటువంటి ఉపాధి కల్పించాలి. పరిశ్రమ మూతపడకుండా దాని అభివృద్ధికి పాటుపడాలి అనేటటువంటి విధానం ప్రభుత్వపరంగా తీసుకోవడం జరిగిందని కూడా మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను కొన్ని కొన్ని విషయాలు గౌరవనీయ సభ్యులు మనవి చేశారు. వారు చెప్పిన విషయాలు అన్నింటిలో కూడా ఈనాడు లక్ష్మీసరస్వతి పేపర్ మిల్స్ అన్నారు, దానికి కూడా సరైనటువంటి ఆదాయం చేయడం జరుగుతున్నది. ఈనాడు అది కూడా సక్రమంగా పేపరు తయారు చేసేటటువంటి దానికి కూడా ఆర్థికపరమైనటువంటి సహాయం వారికి అందచేయడం కూడా జరిగింది. కాబట్టి పరిశ్రమ మూతపడడం ప్రభుత్వానికి ఇష్టము లేదు.

ఏ ప్రభుత్వం కూడా మన అవసరాలను మన పరిశ్రమలు తీర్చేవిధంగా వాటిని తీర్చిదిద్దుకోవడం, కార్మిక శాంతిని, కార్మిక ప్రగతిని పూర్తిగా సమర్థించడం ప్రభుత్వ విధానం అని మరొకసారి మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను. అంతేకాకుండా ఇదివరకు నో ఇండస్ట్రీ డిస్ట్రిక్ట్స్ అని ఉండేవి. మనకు ఉన్నటువంటి జిల్లాలు అన్నింటిలో కూడా పరిశ్రమలు ఉన్నాయని ఇదివరకు రికార్డ్‌లో సృష్టించారు. ఐదుకోట్లకు మించినటువంటి పరిశ్రమ ఏ జిల్లాలో ఉంటే ఆ జిల్లా ఇండస్ట్రీ డిస్ట్రిక్ట్. జిల్లా అంటే ఎంతో విశాలమైనది. ఇప్పుడు హైదరాబాద్ జిల్లాలో ఒక పరిశ్రమ కేవలం ఏ మూలలో ఒక ఐదు కోట్లు పెట్టుబడితో నిర్మిస్తే ఇక ఆ జిల్లాలో పరిశ్రమలు వచ్చినట్లే లెక్కగా ఉండేది అధ్యక్షా. ఇది సరైన విధానం కాదు. ఇప్పుడు మాండలిక

రాజ్యాంగ పరిపాలన విధానం వచ్చినప్పుడు నో ఇండస్ట్రీస్ డిస్ట్రిక్ట్ అని కాకుండా నో ఇండస్ట్రీ మండల్స్‌గా మనం తీసుకోవాలి. ఏ మండలికి ఆ మండలికే పరిపూర్ణంగా అక్కడ సక్రమమైనటువంటి పారిశ్రామికాభివృద్ధి జరగాలని అన్నది ప్రభుత్వ పరమైనటువంటి విధానంగా మీకు మనవిచేస్తున్నాను.

అదే విధంగా శ్రీమతి ఇందిరగారు మాట్లాడుతూ మహిళా సంక్షేమం సంగతి చెప్పారు. చాలాసంతోషం, ఈ రోజున ప్రభుత్వపరమైన విధానం గౌరవనీయురాలైన సభ్యురాలికి తెలుసు. ప్రతి జిల్లాలో ఉమెన్ వర్క్ హౌస్‌ను పెట్టాలని, అక్కడ వారు ఉండి చేయకుండా ఏదో గార్మెంట్సుగానీ మరొకటిగానీ వారి ఇంటి కాడ తయారుచేసి తీసుకువచ్చి ఆ వర్క్ హౌస్‌లో వారు అమ్మడం అటువంటి విధానం కానివ్వడం, లేకపోతే కొంతమంది ఏ మాత్రము కూడా ఆదరువులేని ఆడపడుచులకు అక్కడే ఒక ఉపాధి కల్పించే విధానంలో కొన్ని కుట్టుమిషనులో ఏవో ఏర్పాటు చేయాలని సామాన్యంగా కుటీర పరిశ్రమల ద్వారా మహిళలు చేసుకునేటటువంటి కార్యక్రమాల ద్వారా సంపాదించి, ఈనాడు మన హాస్టల్స్ కానివ్వండి మరొక చోట కానివ్వండి, అవసరమైనటువంటి ఆహారపదార్థాల దగ్గర నుంచి దుస్తులు వరకు కూడా మన సోదరీమణుల చేతనే తయారు చేయించి అమ్మాలి అన్నది ప్రభుత్వపరమైనటువంటి నిర్ణయమని తమకు మనవిచేస్తున్నాను. అదే విధంగా ఇక్కడిక్కడ విజ్ఞానవంతులైన సమాజంలో రాష్ట్ర సంక్షేమం చేకూర్చాలి అన్నది ప్రభుత్వపరమైన విధానం.

ఈనాడు చెరకు సంగతి చెప్పారు. పంచదార చెరకు విషయంలో ఇదివరకు ప్రభుత్వ విధానం మనవిచేశాను. ఈనాడు ప్రభుత్వం ప్రతి దానిలో జోక్యము కలుగచేసుకోవడం నిజమైనటువంటి ప్రజాస్వామ్య సిద్ధాంతం కాదు కాబట్టి కోఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీస్ రైతుకివ్వాలి. వారే దానిని నిర్వహించుకోవాలనేటటువంటి విధానాన్ని ప్రభుత్వం ఆలోచిస్తున్నది. అది కూడా వారికి నేను సవినయంగా మనవిచేస్తున్నాను కేవలం రైతులకు రక్షణ అంటే వారికి సరైనటువంటి గిట్టుబాటు ధర ప్రభుత్వం ఇస్తున్నది. 195 రూపాయలు ఈనాడు. 85 రికవరీ మీద ధర ఇంకో 15 రూపాయలు ప్రభుత్వ పరమైనటువంటి ఆర్డరుగా వేసినది ఇంకో 10 రూపాయలు, ఎక్సైజ్‌టాక్సు ఈ విధానం కలుపుకుని మొత్తం 220 రూపాయలు టన్నుకి ప్రభుత్వం ఇచ్చింది. అంటే ప్రభుత్వం ఏ విధంగా రైతుల సంక్షేమాన్ని ఆకాంక్షిస్తున్నది, పంటలను పండించే రైతులు ఏ విధంగా బాగుపడాలి అన్నది ప్రభుత్వం విధానం అనే విషయం గౌరవనీయ సభ్యులు గుర్తించాలి. అదే విధంగా కాటన్ ఫ్యాక్టరీ.

ఎవరైనా సరే మధ్య దళారీలను తీసివేసి ప్రత్తి ఉత్పత్తి దారులనుంచే ఈ ఫ్యాక్టరీలకు, స్పిన్నింగు మిల్స్‌కు కావలసినటువంటి దూది తీసుకోవాలి అన్నది ప్రభుత్వపరమైనటువంటి విధానం. మధ్య దళారీలు పోవాలి, ఎవరైతే ఈ సమాజాన్ని సమాజ సంక్షేమాన్ని ఇంతవరకు

క్రమింగారో వారందరిని తొలగించడం రైతుకి, ఉత్పత్తిదారుకి, వినియోగదారుకి మధ్యన సమన్వయం ప్రభుత్వం యొక్క బాధ్యతగా స్వీకరించడం జరుగుతున్నది. కాకపోతే అధ్యక్షా మీకు తెలియనిదికాదు. ఎన్నాళ్ళనుంచో ఈ మురిగిపోయిన సమాజంలో స్వార్థంతో కరుడు గట్టుకుపోయినటువంటి ఈ స్వార్థపర శక్తితో కూడినటువంటి ఈ విధానాలు అన్నీ మంచికి రావాలి అంటే కొంత శ్రమ, కొంత కాలాతీతము కూడా జరుగుతున్నది గానీ ఇది కేవలం తెలుగుదేశం ప్రభుత్వం ప్రజల కష్టాలలో నుంచి పేద ప్రజల మనస్సులో నుంచి వారి కడుపు మంట నుంచే వచ్చింది.

ఎప్పటికప్పుడు పేద ప్రజల యొక్క సంక్షేమాన్ని విస్మరించడం జరగదు. మా శ్రమ అంతా పేద ప్రజల సముద్ధరణకి, వారి సంక్షేమానికి కృషి చేయడం జరుగుతుందని మనవిచేస్తున్నాను. ఈ అన్ని పద్దులు ఎందుకు కలిపారు అని కొంత మంది సభ్యులు అన్నారు. పెద్ద పరిశ్రమలు చిన్న పరిశ్రమలు, దానికి సంబంధించిన కార్మికుల సమస్యలు ఇవన్నీ కూడా ఒకే భాగానికి సంబంధించినవి కాబట్టి ఒకే రోజున వీటన్నింటినీ కలపడం జరిగింది. ఒకదానికొకటి సంబంధించినటువంటి పద్దులు కాబట్టి ఈ పద్దులు అన్నీ ఒక చోట పెట్టడం జరిగింది. ఇంకా గౌరవనీయులైన ఇతర మంత్రివర్యులు మాట్లాడాలి. కాబట్టి ఈనాడు నాకు ఇచ్చిన ఈ అవకాశానికి మరొకసారి మీకు నా హృదయపూర్వకమైన అభినందనలు తెలియజేస్తూ గౌరవనీయ సభ్యులు చేసిన సూచనలు గుర్తుంచుకొని తగిన విధంగా పరిశీలిస్తామని మనవి చేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

◆◆

మార్చి 12, 1986

# పరస్పర విశ్వాసంతో, గౌరవంతో, అభిమానంతో ఈ సమస్యను పరిష్కరించుకోవాలి

*(తెలుగు గంగ ప్రాజెక్టుపై 304 నిబంధన క్రింద జరిగిన చర్చపై సమాధానం)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, గౌరవ సభ్యులు తెలుగుగంగ ప్రాజెక్టు విషయంలో అమూల్యమైన సూచనలు చేశారు. ఎవరు ఉద్యమాలు లేవదీసినా సరే దీని విషయంలో పూర్తిగా సహకరిస్తామని జాతీయ భావంతో గౌరవ సభ్యులు వారి వారి అభిప్రాయాలను వ్యక్తం చేసినందుకు వారికి హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నాను. బచావత్ అవార్డులో కృష్ణానదిలో మొత్తం 2060 టి.ఎం.సి.ల నీరు ప్రవహిస్తున్నదని తెలిపారు. దీనిలో ఏమీ అనుమానం లేదు. ఈ నీటిలో 800 టి.ఎం.సి.ల నీరు ఆంధ్రప్రదేశ్‌కు, 700 టి.ఎం.సి.ల నీరు కర్ణాటకకు, 560 టి.ఎం.సి.ల నీరు మహారాష్ట్రకు కేటాయించడం జరిగింది. 75 పర్సెంట్ డిపెండబిలిటీ, అంటే 100 సంవత్సరాలలో 75 సంవత్సరాలు నీరు ఇదే విధంగా ప్రవహిస్తుంటే అంటే 2060 టి.ఎం.సి.ల నీరు దానిలో ఉంటే మిగిలిన 25 సంవత్సరాలు అంత నీరు ఉండకపోవచ్చు. ఏదైనా అనివార్యమైన ప్రకృతి వైపరీత్యాల వల్ల నదిలో నీరు తగినంతగా లేకపోతే ఆఖరున ఉన్నది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే గనుక పూర్తిగా నష్టపోయేది ఆ రాష్ట్రమే కాబట్టి ఇప్పుడు ఏదైనా మిగులు నీరు ఉంటే దానిని వాడుకొనే పరిపూర్ణమైన హక్కు ఆంధ్రప్రదేశ్‌కు కల్పించడం జరిగిందని అందులో స్పష్టం చేయబడింది.

**డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి:** వారు చెప్పింది ఒప్పుకొంటాము. రైపేరియన్ రైట్స్ అని ఉందా లేదా చెప్పమనండి.

*(ఈ సందర్భంలో సర్వశ్రీ డా. వై.ఎస్.రాజశేఖరరెడ్డి, ఎం.వి. మైసూరారెడ్డి, ఎ. ధర్మారావు, తదితరులు లేచి తీవ్ర అంతరాయం కల్పించారు)*

**శ్రీ ఎన్.టి. రామారావు:** రెండు స్కీమ్సు గురించి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారి పబ్లికేషన్‌లో వారు సుస్పష్టం చేశారు.

'A' will come into operation on the date of the publication of the decision of the Tribunal in the official Grazettle under Section 6 of the Inter-State Water Disputes Act 1956." ఎప్పుడైతే ట్రిబ్యునల్ అవార్డును కేంద్ర ప్రభుత్వం ఆమోదించి గెజిట్ పబ్లికేషన్ చేయడం జరిగిందో అప్పుడే స్కీమ్-ఎ అమలులోకి రావడం జరుగుతుందని అన్నారు. ఆ తరువాతే బి-స్కీము వస్తుంది. ముందు ఎ-స్కీమును అమలు చేయడం జరుగుతుంది. దాని ప్రకారమే ఈనాడు మిగులు నీటిని వాడుకోవడం జరిగింది. నేను మనవి చేసేది ఏమిటంటే నాకు ఉండే అధికారాన్ని తీసుకుపోయి ఇంకొకరి జేబులో పెట్టడానికి మాత్రం నేను అంగీకరించను. నేను ఈ విషయంలో సుస్పష్టంగా ప్రైమ్ మినిస్టరుగారికి ఉత్తరం వ్రాయడం జరిగింది. అందులోని కొన్ని భాగాలు మీకు చదివినిపిస్తాను.

The finality of the Tribunal Award cannot allowed to be undermined in the form of objections to Telugu Ganga Project. We have already clarified the position in our replies to Central water Commision. Nor any Inter-State meeting of whatever level it has proposed is competent to reopen or renegotiate issues judicially setteld by the Tribunal after seven long years of thoughtful deliberations. ఏదైనాసరే పునఃపరిశీలించే అవకాశం కలిగించామన్నారు. అయితే పరిశీలించాలనే విషయం వచ్చినప్పుడు మాకు ఏదైనా నష్టం జరగవచ్చు, కాబట్టి మా అధికారాన్ని, హక్కులు వదలుకోము, మా ఆత్మ గౌరవాన్ని తాకట్టుపెట్టమని సుస్పష్టంగా చెప్పడం జరిగింది.

**Dr. Y.S.RAJASEKHARA REDDY:** 'Shame', without obtaining permanent riparian rights.

(Dr. Y.S. Rajasekhara Reddy came out of his seat) మేము అడిగేది పర్మినెంట్ పాయింట్, రైపేరియన్ రైట్స్ విషయం ఉందా. లేదా? Without obtaining permanent riparian rights అని అదే బుక్‌లో ఉన్నదా లేదా? రైపేరియన్ రైట్స్ ఉందనే విషయం చెప్పకుండా పిల్లి కళ్ళు మూసుకొని ఎవరూ చూడడంలేదని అనుకొన్నట్టుగా అనుకొంటున్నారు. పర్మినెంట్ రైపేరియన్ రైట్స్ అనేది ఉంది. అది చెప్పకుండా ఆంధ్రుల ఆత్మాభిమానం అని అనడం ఏమిటి? (Many members from the Treasury Benches stood up at one time and interrupted)

**శ్రీ ఎన్.టి. రామారావు:** ఈ విషయాలను రామకృష్ణ హెగ్డేగారు సుస్పష్టం చేశారు. He however made it clear that Karanataka could not prevent Andhra Pradesh from going ahead with the Telugu Ganga project as along as it did not violate the Bachawat Award. It is clear in his statement. వారికి లేని అనుమానాలు మనకు ఎందుకు వస్తున్నాయో, ఇదేమిటి, అదేమిటి. అనే అనుమానాలు ఎందుకు వ్యక్తం చేస్తున్నామో అర్థం కావడంలేదని నేను సుస్పష్టం చేస్తున్నాను. ఈనాడు 330 టి.ఎం.సి.ల నీరు వృధాగా సముద్రంలోకి పోతున్నదని కృష్ణారావుగారు రిపోర్టు ఇచ్చారు.

అష్యూర్డ్ వాటర్ అంటున్నారు. అది కేటాయించడం జరిగింది. ఇప్పుడు వెనుకబడిన ప్రాంతాలు, మెట్ట ప్రాంతాలు ఉన్నాయి. త్రాగడానికి కూడా నీరు లేకుండా బాధపడే ప్రజానీకం ఉంది వారి కోసం నీటిని జాగ్రత్తగా వాడుకోవాలి. వాటర్ ఈజ్ అష్యూర్డ్. నాట్ అష్యూర్డ్ వాటర్, ది వాటర్ ఈజ్ అష్యూర్డ్ బికాజ్ దేరీజ్ ఎనఫ్ వాటర్‌దేర్, 330 టి.ఎం.సి.ల నీరు వృధాగా సముద్రములోనికి పోతోందని నమ్మకపోవడం దురదృష్టకరమైన విధానం అని నేను మనవిచేస్తున్నాను. ఇదే సందర్భంలో మీకు తెలియజేస్తున్నాను. ఈనాడు శ్రీశైలము ఎడమ కాలువకు ఇంకా క్లియరెన్సు రాలేదు. ఏ ప్రాంతంలో అయినా సరే ఎక్కడ వెనుకబడిన జిల్లా ఉన్నా అక్కడి ప్రజాసంక్షేమాన్ని ఏమాత్రం విస్మరించడం జరుగదని నేను సుస్పష్టం చేస్తున్నాను. కాబట్టి విశ్వాసంతో గౌరవంతో అభిమానంతో మనందరం కలసి ఈ సమస్యను పరిష్కరించుకోవాలి. మనకు ఉన్న అధికారాన్ని ఇంకొకరి జేబులో పెట్టడమో వారి నిర్ణయాలకు వారి దయాభిక్షానికి కూర్చోవడమో అది మాత్రం నాకు సమ్మతం కాదని నేను సుస్పష్టంజేస్తున్నాను. కాబట్టి ఈ విషయంలో మనకు మిగులు నీరు ఉన్నది వాడుకుందాము. వాటర్ ఈజ్ అష్యూర్డ్ ఫర్ అదర్ ప్రోజెక్ట్. తమిళనాడుకి కూడా రామచంద్రన్ గారికి సుస్పష్టం చేశాము, 60 కోట్ల రూపాయలు ప్రతి సంవత్సరం మీరు ఇవ్వాలి. మూడు సంవత్సరాలు అని.

**త్రాగడానికి కూడా నీరు లేకుండా బాధపడే ప్రజానీకం ఉంది వారి కోసం నీటిని జాగ్రత్తగా వాడుకోవాలి. వాటర్ ఈజ్ అష్యూర్డ్. నాట్ అష్యూర్డ్ వాటర్, ది వాటర్ ఈజ్ అష్యూర్డ్ బికాజ్ దేరీజ్ ఎనఫ్ వాటర్‌దేర్, 330 టి.ఎం.సి.ల నీరు వృధాగా సముద్రములోనికి పోతోందని నమ్మకపోవడం దురదృష్టకరమైన విధానం అని నేను మనవిచేస్తున్నాను. ఈనాడు శ్రీశైలము ఎడమ కాలువకు ఇంకా క్లియరెన్సు రాలేదు.**

ఈనాడు మనమే ఈ విధంగా వాగ్వాదాలకివస్తే ఇక వారు కూడా వారికి సాధ్యమైనంత వరకు జాగు చేయడానికే ప్రయత్నిస్తారు. కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుంది అని మన సమస్యను ఈ విధంగా బహిర్గతం చేసుకుని ఒకరిని ఒకరు అనుమానించుకుంటూ ఈ విధంగా పోయినట్లయితే మన రాష్ట్ర ప్రగతిని సాధించలేమని సుస్పషంగా గౌరవనీయమైన సభకు తమ

ద్వారా తెలియజేస్తున్నాను. ఈ తెలుగుగంగ ప్రాజెక్టు పనికి ఆటంకము జరగదు అని గౌరవనీయ సభ్యులకు తమ ద్వారా హామీ ఇస్తున్నాను. ప్రత్యేకంగా ప్రభుత్వము దీనిని తేవడానికి ప్రయత్నిస్తుందని, ఆత్మ గౌరవాన్ని అమ్ముకోకుండా మనందరము సమిష్టిగా మన రాష్ట్రం యొక్క భవిష్యత్తుకి, కృషి చేయవలసినదిగా ప్రతి ఒకరికి నేను విజ్ఞప్తి చేస్తున్నాను.

అధ్యక్షా, గౌరవనీయులైన సుధాకరరావుగారు మాట్లాడిన దానికి నేను సమాధానం చెబుతాను. వారు శ్రీశైలం లెఫ్ట్ కెనాల్ నుంచి వచ్చే నీటి విషయం అడిగారు. 30 టి.ఎం.సి. వాటర్ బచావత్ అవార్డు ప్రకారంగా మిగులు నీరు వాడుకోవచ్చును. అది టన్నెల్ ద్వారా సప్లయి చేయాలా లేక రెగ్యులేటర్ ద్వారా నీటిని సప్లయి చేయాలా అనేదాని మీద అఖిలపక్ష సమావేశము ఏర్పాటు చేయడం జరిగింది. టన్నెల్ వేస్తే చాలా సంవత్సరాలు పడుతుందనే భయంతో ఈ ప్రభుత్వం ఆలోచన చేస్తున్నది. ఈనాడు లెఫ్ట్ కెనాల్, రైట్ కెనాల్ అనేది లేకుండా ఏవిధంగానైనా రాయలసీమకు నీరు అందించాలనే ఉద్దేశ్యంతోనే ఈ ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. బచావత్ కమిషన్ రిపోర్టు ప్రకారం మనం 2000 ఏ.డి. వరకూ కూడా నీరు మనకు ఎలాటు చేసినది వాడుకోవచ్చును. దానికి అగ్రిమెంటు ఉంది, కానీ 2000 ఏ.డి. దాటిపోతే ఆ నీరును వాడుకోవడానికి మనకు అభ్యంతరం ఉంటుందని చెబుతున్నాను.

**శ్రీ నాయిని నరసింహారెడ్డి:** అఖిలపక్ష సమావేశంలో టన్నెల్ గురించి చెప్పారు. లిఫ్టు ఇరిగేషన్ గురించి కూడా చెప్పడం జరిగింది.

**శ్రీ ఎన్.టి. రామారావు:** అసలు మిగులునీరు 300 టి.ఎం.సి. వాటర్ కృష్ణా రివర్ నుంచి సముద్రములోకి వృధాగా పోతున్నదని, ఆ నీరు సముద్రములోకి పోకుండా ఆ నీటిని వెనుకబడిన ప్రాంతాలలో కట్టబోతున్న ప్రాజెక్టులకు ప్రాముఖ్యత, ప్రాధాన్యత ఇవ్వడం కోసమే ఈ ప్రభుత్వం చర్యలు తీసుకొంటున్నదని ఇక్కడ అందరి సభ్యులకు కూడా తెలుసు. కేవలం తమిళనాడువారు వారి వాటాగా తెలుగుగంగ ప్రాజెక్టుకు రు.47 కోట్లు ఇస్తే మనవాటాగా 45 కోట్లరూపాయలు ఖర్చు పెట్టడం జరిగింది. కాబట్టి ఏయే ప్రాంతాలకు ఎంతెంత నీరు అందివ్వాలో ఆ విధంగా చేయడం జరుగుతుంది. ఇపుడు మొదటే అనుమానాలతో ఉన్న నీటిని వాడుకోకుండా చేసుకోవడం మంచిదికాదు. ఎవరైనా పునఃపరిశీలన చేయవలసిందని అడిగితే మనం తరువాత చూసుకోవచ్చును. ఇప్పుడు ఏమీ అనుమానాలు పెట్టుకోవద్దని మనవిచేస్తున్నాను.

◆◆

జూలై 31, 1986

# సమాన హక్కులు, అవకాశాలు సమాజంలో సర్వులకు సంప్రాప్తింప జేయాలనేదే ప్రభుత్వ సంకల్పం

*(మురళీధర్ రావు కమిషన్ రిపోర్టుపై చేసిన ప్రకటన - జరిగిన చర్చ)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, ఈనాడు సాయంకాలం మురళీధరరావు కమిషన్ వారు అందించిన నివేదికపై ప్రభుత్వ పరంగా తీసుకొన్న నిర్ణయాలను చర్చించే ముందు తమద్వారా గౌరవసభ్యులకు మరొక ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యక్తంచేస్తే, ఇది కూడా వారు దృష్టిలో ఉంచుకొని, చర్చించడానికి వీలవుతుందనే ఉద్దేశంతో ఈనాడు ముందుగా ఈ ప్రకటన చేయడం జరుగుతున్నది. బలహీనవర్గాల రిజర్వేషన్ల పెంపుదల ప్రకటనపట్ల ఒకప్రక్క విస్తృతంగా హర్షం వ్యక్తమవుతున్నప్పటికీ మరోప్రక్క సత్సంకల్పంతో తీసుకొన్న ఈ చర్య షెడ్యూలు జాతులు, షెడ్యూలు తెగలు, వెనుకబడిన తరగతులకు చెందని ప్రతిభావంతులైన యువతీయువకుల విద్యావకాశాలను దెబ్బతీస్తుందేమోననే అనుమానం, భయాందోళనలు కూడా వెల్లడి అవుతున్నాయి.

ఈ సమస్యను గురించి అత్యంత శ్రద్ధతో, నిండు మనసుతో సుదీర్ఘంగా ఆలోచించాను. ఈ అంశాన్ని గురించి శాసనసభలోని వివిధ పక్షాల నాయకులతో ప్రయోజనకరమైన చర్చలు జరిపాను. విద్యా సముపార్జనాభిలాషులే కానివ్వండి, వృత్తి విద్యాన్వేషణపరులే కానివ్వండి ప్రతిభావంతులైన విద్యార్థులందరికీ మన విద్యాసంస్థల ద్వారాలు కూడా తెరిచి ఉండాలనే ప్రభుత్వ విధానాన్ని ఈ సందర్భంగా పునరుద్ఘాటిస్తున్నాను. ప్రతిభాశాలియైన ఏ ఒక్క విద్యార్థికీ, విద్యార్థినికీ మన విద్యా సంస్థల్లో ప్రవేశం నిరాకరించే పరిస్థితి ఉండరాదు. అందుచేత సాంకేతిక, వృత్తి విద్యాసంస్థలతో సహా ప్రస్తుత విద్యాసంస్థ ఇంటర్‌మీడియట్, అండర్ గ్రాడ్యుయేట్, పోస్టుల్లో గ్రాడ్యుయేట్ కోర్సులలో ఇప్పుడున్న సీట్ల సంఖ్యను 20 శాతం పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. అభ్యర్థి కుల మతాలతో నిమిత్తం లేకుండా కేవలం ప్రతిభయే ప్రాతిపదికగా ఈ సీట్లు లభిస్తాయి. ఈ ఏర్పాటు పాలనాపరంగా ఆర్థిక పరంగా సాధ్యమని, న్యాయపరంగా

సమర్థనీయమని భావిస్తున్నాం. ఈ అంశాన్ని తరచి చూస్తే, శ్రేయోపరిరక్షణ కోసం తమతమ దృక్పథాన్ని చూపవలసి వచ్చినప్పుడు ఆర్థిక స్థితిగతులు అన్నవే సుయోచితమైన, ఆచరణాత్మకమైన, సముచితమైన మార్గదర్శక సూత్రాన్ని అందించగలవనే నా దృఢ విశ్వాసం. వసంత కుమారుకు కర్ణాటక ప్రభుత్వానికి మధ్య జరిగిన వ్యాజ్యంలో న్యాయమూర్తి దేశాయ్ సామాజికపరంగా, విద్యాపరంగా వెనుకబడినతనానికిగల మూల కారణాన్ని నిర్మూలించి అదే సమయంలో కుల వ్యవస్థను కూలద్రోసి లౌకికతత్వాన్ని జాతీయ స్థాయిలో పెంపొందించగల ప్రధానమైన మార్గం ఇది ఒక్కటే కాగలదని" అభిప్రాయపడ్డారు.

ఆర్థికంగా పేదలైన వారికి ఇచ్చే స్కాలర్‌షిప్పులను పొందేందుకు ఇప్పుడున్న రూ. 3,600/- వార్షిక ఆదాయ పరిమితిని రూ. 12,000/- లకు పెంచడానికి నిర్ణయించామని ప్రకటించేందుకు సంతోషిస్తున్నాను. దీనితోపాటు ఆర్థికంగా పేదవారైన విద్యార్థులకిచ్చే స్కాలర్‌షిప్పుల కోసం బడ్జెట్ కేటాయింపును కూడా రూ. 1.75 కోట్ల నుండి రూ. 4.00 కోట్లకు పెంచుతున్నామని వినయంగా తెలియజేస్తున్నాను. అందరి మనసుల్లో ముఖ్యంగా, చైతన్య స్ఫూర్తిని నింపుకొని, ఆధునికత సంతరించుకొని, ప్రగతి పథంలో పయనించే మన భారతదేశానికి మూల స్తంభాలైన నా యువసోదర సోదరీమణుల, విద్యార్థుల మనసుల్లో మొలకెత్తిన భయాందోళనలు, అపోహలు దీనితో తొలగిపోతాయని నేను హృదయ పూర్వకంగా ఆశిస్తున్నాను.

అధ్యక్షా, గౌరవనీయమైన సభ ఎంతో ఉద్వేగంతో, ఆసక్తితో ఈనాడు-ఈ కార్యక్రమం ఏర్పాటు చేయాలని కోరిన మీదట వారి యొక్క అమూల్యమైన అభిప్రాయాలు తెలుసుకోవాలని, ఈనాడు ప్రజాస్వామ్యంలో కేవలం తాను పట్టిన కుందేలుకి మూడే కాళ్లు అని కాకుండా ఎవరు సరైన ఆలోచనతో చెప్పగలరో, ఎవరి దగ్గర నుండి ఎటువంటి స్పందన వస్తుందో అని వారందరికీ అవకాశం కలిగించడం, వారి అమూల్యమైన అభిప్రాయాలు వినడం ఆదర్శంగా పెట్టుకొని ఈనాడు ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని తమకు తెలియనిది కాదు. ఈ చర్చలో ఎంతోమంది గౌరవనీయులు, వివిధ పక్షాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నవారు, తమ అమూల్యమైన అభిప్రాయాలను ఎంతో చక్కగా వివరించారు. గౌరవనీయులైన బాగారెడ్డిగారు, దాడి వీరభద్రరావుగారు, సిహెచ్. రాజేశ్వరరావుగారు, వెంకటేశ్వరరావుగారు, ప్రభాకరరావుగారు, శ్రీరాములుగారు, బాబూఖాన్‌గారు, ఆనందరావుగారు, చిత్తరంజన్‌దాస్‌గారు, జయరాం బాబుగారు, అమర్‌నాథరెడ్డిగారు, శివాజీగారు, విద్యాధరరావుగారు ఎంతో ఉత్సుకతతో, ఆసక్తితో వారు తమ విలువైన అభిప్రాయాలు చెప్పినందుకు వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నాను, ప్రభుత్వ పరంగా.

సోదరులారా, మీకు తెలియనిది కాదు, సమాజంలో స్వార్థం పెరిగినప్పుడు ఇటువంటి అవకతవకలు జరుగుతూ ఉంటాయి, మానవుడు తన ధర్మాన్ని విస్మరించి కేవలం బుద్బుధప్రాయమైన ఈ జీవితంలో తన సంపాదనకు అలవాటుపడి, తన అభివృద్ధిని కోరుకొంటూ ఎప్పుడైతే

సమాజానికి ద్రోహచింతన చేస్తాడో అప్పుడు ఈ విధమైన ఆకృత్యాలు, అసహనం సమాజంలో బయలుదేరడం మనం చూస్తున్న విధానంగా తరతరాలుగా యుగయుగాలుగా గత చరిత్ర మనకు చెప్పిందని నేను సవినయంగా మనవిచేస్తున్నాను. ఈనాడు ఉన్న అసమానత్వాన్ని మనం తల్లీబిడ్డల న్యాయంతో పరిష్కరించుకోవాలి. ఒక తల్లికి నలుగురు బిడ్డలు ఉన్నప్పుడు చంకలో ఒక బిడ్డ ఉంటాడు, అవిటి బిడ్డ ఉంటాడు, పెరిగిన బిడ్డ ఉంటాడు, పెరిగిన బిడ్డ అమ్మా అన్నం అన్నప్పుడు నువ్వు పెట్టుకో అంటుంది. అదే చంకలో ఉన్న బిడ్డకు కలిపి నోటికి అందిస్తుంది.

ఈ సమాజంలో సోదరులకు వారికి ఏ విధమైన అశక్తత ఉన్నదో, వారు ఏ విధంగా విజ్ఞానహీనంగా ఉన్నారో. ఏ విధంగా అభివృద్ధి చెందుతున్నారో గొప్ప హృదయంతో, విశాల దృక్పథంతో ఊహించుకుని సమన్వయపరమైన సామాజిక న్యాయాన్ని అలవర్చుకోవలసిన అవసరం ఉందని మనవిచేస్తున్నాను. ఆ సద్భావం అందరిలో రావాలి. కేవలం చట్ట పరంగా న్యాయం వస్తుందంటే నేను నమ్మను కానీ ఈనాడు ప్రజాస్వామ్య వ్యవస్థలో అటువంటి బాధ్యత ప్రభుత్వానికి ఉంది కాబట్టి అదుపులో పెట్టి ఈ విధానాన్ని అవలంభింపచేసి ఎవరైతే దూరంగా సామాజికపరమైన న్యాయానికి నోచుకోలేక నిర్భాగ్యులుగా సమాజంలో అట్టడుగున ఉంటూ, బడుగువర్గాలుగా ఉంటూ, వెనుకబడిన తరగతులుగా ఉంటూ యుగయుగాలు ముందుకుపోలేని పరిస్థితిలో సతమతమవుతూ చావలేక బ్రతుకుతున్నారో, అట్టివారికి సరైన న్యాయం చేకూర్చాలని సంకల్పించుకోవడం మన రాజ్యాంగపరంగా మనకు సంక్రమించిన హక్కు, బాధ్యతని మీకు సవినయంగా మనవిచేసుకొంటున్నాను.

**ఈ సమాజంలో సోదరులకు వారికి ఏ విధమైన అశక్తత ఉన్నదో, వారు ఏ విధంగా విజ్ఞానహీనంగా ఉన్నారో. ఏ విధంగా అభివృద్ధి చెందుతున్నారో గొప్ప హృదయంతో, విశాల దృక్పథంతో ఊహించుకుని సమన్వయపరమైన సామాజిక న్యాయాన్ని అలవర్చుకోవలసిన అవసరం ఉందని మనవిచేస్తున్నాను. ఆ సద్భావం అందరిలో రావాలి. కేవలం చట్ట పరంగా న్యాయం వస్తుందంటే నేను నమ్మను .**

సోదరులు కొందరు చెప్పారు సమాజంలో ముందు కులం లేదని, నేను తప్పకుండా అంగీకరిస్తున్నాను. 'చాతుర్వర్ణ నవాస్తుత్యం గుణ కర్మ విధాగతం' అని వేదాలు చెప్పాయి. చాతుర్వర్ణాలుగా ఈ సమాజం అంతా విభజించబడింది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులని వారి కర్మ ప్రకారం వారి వృత్తి పరంగా విభజించబడ్డ సమాజం గానీ కేవలం కులపరంగా విభజించబడ్డది కాదని మనకు వేదాలు చెబుతున్న సుస్పష్టమైన విధానం, ఆ తరువాత కేవలం స్వార్థపరత్వం ముదిరినప్పుడు ఈ విధముగా కులాలు ఉత్పన్నమయ్యాయి. తల్లి గర్భంలో ఉన్న పిండానికి తను ఏ కులమో తెలియదు. బిడ్డ భూమి మీద పడ్డ తరువాత తొలిసారి శ్వాస తీసుకున్న తరువాత ఆ శిశువుకు తనది ఏ కులమో తెలియదు.

కానీ పరిజ్ఞానం సంతరించుకున్న కొద్దీ, తెలివితేటలు పెరిగిన కొద్దీ, అవగాహన ఎక్కువైన కొద్దీ తనదీ తనదీ తనదీ అన్న స్వార్థం పెరిగిన తరువాత ఈ కుల మత వ్యవస్థలకు ఈవిధమైన ప్రాధాన్యం కలిగిందని నేను సవినయంగా మనవిచేస్తున్నాను. అంతకుముందు మహానుభావులు ఈనాడు దేవుళ్ళు అయ్యారు. కానీ వారిని నేను దేవుళ్లు అని అనను, సంఘసంస్కర్తలు అని భావిస్తాను. త్రేతాయుగంలో రామచంద్రమూర్తి గుహుడ్ని, కేవలం గంగపుత్రుడిని 'సోదరా' అని కౌగిలించుకున్నాడు. అదేవిధంగా శబరిని 'అమ్మా' అని ఎంగిలి పళ్ళు తిని మోక్షం ఇచ్చాడంటున్నారు. ఆదేవిధంగా సుగ్రీవుడిని, ఒకవిధంగా గిరిజన సోదరుడిని కౌగలించుకుని 'తమ్ముడూ నీకు న్యాయం కలుగచేస్తాను' అని మాట ఇచ్చాడు. న్యాయం చేకూర్చాడు, అదేవిధంగా ద్వాపర యుగంలో కృష్ణ పరమాత్మ ఆవిర్భవించాడు. 'ప్రరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం ధర్మసంస్థాపనార్థాయ, సంభవామి యుగే యుగే' అంటే ప్రతి యుగంలో ఎప్పుడైతే ధర్మం నశిస్తుందో ఆనాడు ఏదో అవతార మూర్తిగా పరమాత్మ అవతరిస్తాడు అని ఆయన నిర్వచనం, సమాజం ఉన్నంత వరకూ, ఈ స్వార్థం ప్రబలుతున్నంతవరకూ, ధర్మానికి హాని కలుగుతూనే ఉంటుంది. ధర్మం తగ్గినప్పుడల్లా ఈ విధమైన సంస్కర్త ఎవరో ఆవిర్భవించాలి.

సమాజంలో ఏవిధమైన న్యాయం కలుగచేయాలో, బీదా బిక్కీ నోరు లేక మూగ వోయిన గొంతులతో, కాలే పొట్టలతో క్రుంగుతున్న ఆ పేద ప్రజానీకానికి, ఆ బాధాపరులకు ఏవిధమైన మోక్షం ఇవ్వాలో ఆవిధమైన పరిష్కారం జరిగి తీరాలని ఆయన ఆనాడు చెప్పిన సంగతి మనందరకూ తెలుసు ఆ తరువాత గౌతమ బుద్ధుడు 'సంఘం శరణం గచ్ఛామి' అన్నాడు. ఆయన ఆనాడు కుంటి వారిని, గుడ్డివారిని, బాధలతో క్రుంగుతున్నవాడిని, గర్భదరిద్రం అనుభవిస్తున్న వారిని వీరినందరినీ కాచిన తరువాత మనలో మానవత్వం ఏమిటి, ఎవరికోసం ఈ సమాజం, సమాజం అందరిది అనుకొన్నప్పుడు ఆ సమాజాన్ని గౌరవించాలి అనే ఒక విధమైన బాధతో, వేదనతో వేదాంతపరమైన విజ్ఞానంలో పడిపోయాడు. కనుకనే సంఘం శరణం గచ్ఛామి అని సంఘానికి మించిన పవిత్రమైన దేవాలయం లేదు, మనిషిని మించిన దేవుడు లేడు, మానవత్వంతో ఆ మనిషిని ఆరాధించగలగాలి, ఆ మనిషి పొందుతున్న కష్టాలను, బాధలను నివృత్తి చేయడం తప్ప వేరేమార్గం లేదనేదే పరమసత్యంగా గుర్తించాడని నేను మనవిచేస్తున్నాను.

తరువాత సంఘసంస్కర్త పలనాటి బ్రహ్మనాయుడు. చాపకూటి సిద్ధాంతం ఆయనది. ఆనాడు మాల కన్నమదాసును సర్వ సైన్యాధ్యక్షుడిగా చేశాడు. ఎందుకు అలా చేశాడు? ఏవిధమైన సమాజం కావాలని ఆశించాడాయన? చాపకూటి సిద్ధాంతం కుల, మత, వర్ణ, భేదం లేకుండా తమ తమ భేదాలు పాటించకుండా అందరూ ఒకేచోట కూర్చుని విందారగించడం, భోజనం చేయడం అనే ఉత్కృష్టమైన సిద్ధాంతాన్ని ఆయన ప్రవచించాడు మహానుభావుడు పలనాటి బ్రహ్మన్న. పందొమ్మిదవ శతాబ్దం వచ్చేటప్పటికీ రాజారామమోహన్ రాయ్, కందుకూరి వీరేశలింగం ఇత్యాది

మహానుభావులు మన సమాజంలో ఆవిర్భవించారు. వారందరూ సమాజంలో ఉన్న హెచ్చు తగ్గులను నివారించి సమాజంలో ఉన్న కుళ్ళును పెరికివేయటానికి తమ పరిపూర్ణమైన విజ్ఞతతో తమ జీవితాలను దీపకళికలుగా చేశారు. సమాజానికి హారతులిచ్చారు. అటువంటి మహానుభావుల తరువాత పూజ్య బాపూజీ అంటరానితనం పోవాలి. హరిజనోద్ధరణ జరగాలి.

ఎవరినైతే అంటరానివారుగా గూడేలలో వాడలలో పెట్టి అవమానిస్తున్నామో వారిని మనం ఆలింగనం చేసుకుని సోదర భావంతో ఆదరించిన నాడుగానీ ఈ సమాజానికి నిష్కృతి లేదని అతి పవిత్రమైన సిద్ధాంతీకరణ చేసిన మహావ్యక్తి పూజ్య బాపూజీ అని మీకు సవినయంగా మనవిచేస్తున్నాను. ఈ సమాజం ఎందుకు చిన్నాభిన్నం అయిందని ఆలోచించినప్పుడు కొంతమంది స్వార్థపరులు, రాజకీయపరంగా ఈ దేశాన్ని పాలించిన విదేశీయులు, వారి వారి విధానాలను సరిపెట్టుకోటానికి, మనలను శాశ్వతమైన బానిసత్వంలో క్రుంగదీయటానికి సమాజంలో ఈ విధమైన కుల మత వర్గాలను పెంచారని మీకు సవినయంగా మనవిచేస్తున్నాను. పరిపాలన విధానములో, వారు కేవలము జమీందారులను పోత్సహించినప్పుడు వారికి ఏ విధంగా అయినాసరే తాము తాబేదారులుగా ఉంటూ ప్రజాస్వామ్యము అనే దానిని ఏమాత్రము పాటించకుండా ఎవ్వరైతే తమ అడుగులకు మడుగులొత్తుతారో, ఎవ్వరైతే తాము సాగిస్తున్న ప్రపంచ సంగ్రామాలకు సైన్యాన్ని ఆయత్తం చేసి ఇక్కడి నుండి పంపుతూ ఉంటారో, వారికే బిరుదులు, వారికే సత్కారాలు, వారికే సన్మానాలు, వారికే జాగీర్లు, వారికే జమీందారీలు అన్నీ కట్టబెట్టడం జరిగిందన్న సంగతి అందరికీ గుర్తే ఉంటుంది.

అప్పుడే సామాజిక పరమైనటువంటి ఒక చైతన్యం ప్రభావితం అయింది. ఏమిటీ ఈ విధమైనటువంటి దురదృష్టకరమైనటువంటి విధానం. ఎన్నో సంవత్సరాలుగా ఈ భూమిని అంటిపెట్టుకుంటే ఈనాడు భూసంస్కరణలు అని మనవారు చెబుతున్నారే. మేము ఇనాళ్లూ ఈ భూమిని నమ్మి బ్రతుకుతున్నటువంటి మాకు హక్కు లేకుండా ఎవరో ఒక జమీందారుకు హక్కు సంక్రమించడమేమిటీ అనేటటువంటి విప్లవాత్మకమైనటువంటి ఆనాటి విధానానికి ఆనాడు ఆంగ్లేయులు ప్రవేశపెట్టిన కుడివరం మేడవరం హక్కుల కోరిక ఉన్నటువంటి కేరళ ఆనాడు సాగు చేసేటటువంటి రైతులకు బదిలీ చేయడమే ఆనాడు ప్రజాస్వామ్యం సాధించినటువంటి పరమోత్తమైన విజయమని మనవిచేస్తున్నాను. ఎవ్వరైతే భూమిని పండిస్తున్నారో, ఎవ్వరైతే సాగు చేస్తూ ఉంటారో, భూముల మీద వారికి హక్కులవిక్రయం, బదిలీ, తాకట్టు మొదలైనటువంటి సర్వ స్వతంత్ర్య హక్కులు సంక్రమింపజేయబడ్డాయి ఆనాడే అని మీకు నేను సవినయముగా మనవిచేస్తున్నాను. అయినా, ఆ జమీందారు పోషణ వారికి తప్ప లేదు. కాబట్టి కొంత ఏదో సొమ్ము చెల్లించమనేది ఇంకా మ-రవలేదు వారు ఉన్నంతవరకు, ఆ తరువాత ప్రజాచైతన్యమైనటువంటి ఉద్యమాలు మనం మద్రాసు ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు ఎన్నో వచ్చాయి.

ఈనాడు గౌరవనీయ సభ్యులు కొన్ని అటువంటి సందర్భాలు కూడా తెలియజెప్పడం జరిగింది. ఆ తరువాత 1922లో మొదటి కమ్యూనల్ జి.ఓ. కుల ప్రాతిపదిక మీద ఉద్యోగాలు సంక్రమించే ఏర్పాటు చేయడం జరిగింది. దానికి గౌరవనీయ సభ్యులు చెప్పినట్లుగా, రామస్వామి నాయకర్ ఇత్యాది వారందరూ విజ్ఞానం కేవలం ఒకరి సొత్తు కాదు-బ్రహ్మ జ్ఞాని బ్రాహ్మణః, ఎవరైతే బ్రహ్మజ్ఞానం కలిగి ఉంటాడో వాడే నిజమైనటువంటి బాహ్మణుడుగానీ కేవలం జందెం వేసుకున్నంత మాత్రాన బాహ్మణుడు కాదు, కాబట్టి ఆ పేరుతో ఆ కులంతో సర్వ హక్కులు వీరు అనుభవించడానికి వీలు లేదనే ఒక చైతన్య స్ఫూర్తి, సామాజిక ప్రభావం ఆనాడే బయటకు వచ్చిందని మనవిచేస్తున్నాను. దాని ఫలితంగానే 1922లో అమెండ్ చేసినటువంటి ఆ జి.ఓ.లో బ్రాహ్మణులకు, బ్రాహ్మణేతరులకు, హిందువులకు, ముస్లింలకు, క్రిస్టియన్లకు, ఆంగ్లో ఇండియన్ వర్గాలకు ప్రత్యేక స్థానాలు కూడా కేటాయించక తప్పలేదని సవినయముగా మనవిచేస్తున్నాను. ఆ తరువాత వచ్చినటువంటి సంచలనాత్మకమైనటువంటి విధానం డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ - బాబా సాహెబ్ అంబేద్కర్ విషయములో తెలియని వారు ఉండరు.

బడుగువర్గాల ప్రతినిధిగా, వారి ఆశాజ్యోతిగా ఆనాడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌గారు రావడం మనందరికీ తెలిసిన విషయమే. కేవలం రిజర్వేషను అన్నది ఈ ప్రత్యేక స్థానం అన్నది ఆనాడు ఉన్నటువంటి కులాలకు కాదు. ఎవరైతే ఈ సమాజములో అణగదొక్కబడి, క్రుంగిపోయి చావలేక జీవచ్ఛంలాగా బతుకుతున్నారో అటువంటి వారికి కావాలని చెప్పడం జరిగిందన్న సంగతి తమకు గుర్తే ఉంటుంది.

మహానుభావుడు ఎవరైతే బడుగువర్గాలుగా సమాజం చేత చూడబడక అతి నికృష్టమైనటువంటి జీవనం గడుపుతున్నారో, ఎవరైతే మురికి వాడలలో బ్రతుకుతూ దూరముగా నెట్టివేయబడి, దూరముగా వాడలలో, గూడెములలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారో, అటువంటి బడుగువర్గాల ప్రతినిధిగా, వారి ఆశాజ్యోతిగా ఆనాడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌గారు రావడం మనందరికీ తెలిసిన విషయమే. కేవలం రిజర్వేషను అన్నది ఈ ప్రత్యేక స్థానం అన్నది ఆనాడు ఉన్నటువంటి కులాలకు కాదు. ఎవరైతే ఈ సమాజములో అణగదొక్కబడి, క్రుంగిపోయి చావలేక జీవచ్ఛంలాగా బతుకుతున్నారో అటువంటి వారికి కావాలని వారు చెప్పడం జరిగిందన్న సంగతి తమకు గుర్తే ఉంటుంది. దాని పర్యవసానంగానే రాజ్యాంగములో షెడ్యూలు కులాల వారికి, షెడ్యూల్డు తరగతుల వారికి పత్యేకమైనటువంటి రిజర్వేషన్స్ సంభవించడం జరిగింది. ఇండియా చట్టం ద్వారా కొత్త రిజర్వేషన్స్ అమలులోకి వచ్చాయి. అదివరకు సమాజంలో ఎవరైతే రిజర్వేషన్ ఫలితాలు అందుకొని అభివృద్ధి పథములో పైకి వచ్చారో, ఏ రైతులైతే ఏ భూమిని సాగు చేస్తూ ఆర్థికంగా, విద్యాపరంగా, వైజ్ఞానికంగా పైకి వచ్చారో, ఆ కులాలు అన్నీ తీసివేయబడ్డాయి ఆ లిస్టులో నుండి. బడుగు వర్గాల వారికి, ఎస్.సి, ఎస్.టి.లకు ప్రత్యేకంగా రిజర్వేషన్స్ కల్పించబడినాయనే సంగతి తమకు తెలియజేస్తున్నాను. ఈ జనాభా దామాషా మీద అదివరకు అభివృద్ధి చెందిన వారిని మినహాయించడం జరిగిందని కూడా మీకు సుస్పష్టం చేస్తున్నాను.

ఆ తరువాత 1950 జనవరి 26 నాడు భారత రాజ్యాంగం ఆవిర్భవించింది. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ నిర్వహించినటువంటి మనకు ఇచ్చినటువంటి పవిత్రమైన మానవతా హక్కులను పరిరక్షించే గ్రంథం ఇది. దానిలో ఎస్.సి., ఎస్.టి. లకు వెనుకబడిన వారిని దృష్టిలో ఉంచుకొని నిర్ణయించినటువంటి వారికి రక్షణలు, వారి యొక్క హక్కులను పరిరక్షించే విధానము ప్రత్యేకంగా కల్పించబడినది. అయినా దాని వల్ల కూడా సమాజానికి పూర్తిగా న్యాయం లభించలేదు. ఈనాడు అనుకుంటున్న వెనుకబడిన వర్గాల వారు ఉన్నారు, వారి సంగతి ఏమిటి, సంచార దళాలుగా ఉన్నారు. వృత్తి విద్యలలో ఉన్న వడ్రంగులు, కమ్మరిలు, కుమ్మరిలు, గంగపుత్రులు, చేనేతవారు, దొమ్మరులు – వీరందరూ కూడా సంచార దళాలుగా ఉంటూ విద్యకు నోచుకోక నాగరికతకు దూరమై సమాజానికి దూరమై బ్రతుకుతున్నారు మరి వారి సంగతి ఏమిటన్నప్పుడు, మన రాజ్యాంగాన్నీ ఆనాడు అమెండ్ చేసుకోవలసిన అవసరం వచ్చి, దాని ఉద్దేశముతోనే ఆనాడు ఉన్నటువంటి ఆర్టికల్ 15(4), 16(4)లో కూడా ప్రత్యేకమైనటువంటి ఆమెండ్‌మెంట్ తీసుకురావడం జరిగిందని మనవిచేస్తున్నాను.

Art. 15(4) reads: Nothing in this article or in cluase (2) of Art. 29 shall prevent the State from making any special provision for the advancement of any socially and educationally backward classes of citizes or for the Scheduled castes and the Scheduled Tribes. 16 (4)వ పరిచ్ఛేదములో 'Nothing in this article shall prevent the State from making any provision for the reservation of appointments or posts in favour of any backward class of citizens which, in the opinion of the State,is not adequately represented in the services under the State.' అదివరకు ప్రభుత్వం సంకల్పించినటువంటి సంక్షేమ కార్యక్రమాలలో, ఉద్యోగాలలో అవకాశం లేక అవకాశం రాక ఎవరైతే వెనుకబడి ఉంటారో వారందరి సంక్షేమాన్ని గుర్తించి పూర్తిగా వారి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వాలు తగినటువంటి చర్య తీసుకునే హక్కును పూర్తిగా సంక్రమింపజేయడం జరిగింది. దాని ద్వారా నిర్ణయం కూడా ఒక చట్టబద్ధంగా చేయటం జరిగిందని సవినయముగా మనవిచేస్తున్నాను గానీ పర్యవసానంగా భారత ప్రభుత్వం నాడు కాకా సాహెబ్ కాలేల్‌కర్ కమిషన్‌ను నియమించడం జరిగింది. కమిషన్‌ను వెనుకబడినతనానికి ఆధారము కులమా, మరొకటా ఏమిటి ఎందుకు వెనకబడి ఉన్నారు, కుల ప్రాతిపదిక మీద వెనుకబడి ఉన్నారా లేకపోతే ఏ స్థితిమీద వెనుకబడి ఉన్నారు, ముందుకు ఎందుకు రాలేకపోయారు అనే విషయములో ఆ కమిషన్‌లో ఉన్నటువంటి సభ్యులందరు కూడా వివిధమైనటువంటి అభిప్రాయాలు చెప్పినందువల్ల – ఆ కమిషన్ కూడా – సరైనటువంటి సూచనలను ప్రభుత్వానికి అందించలేకపోయింది. అప్పుడు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు ఒక తాఖీదును

అందించింది. ఒక ఉత్తరం ద్వారా కూడా తెలియజేయడం జరిగింది. The Central Government did not draw up any list of the backward classes on the basis of Kalelkar's Commission. However, in 1961 the Ministry of Home Affairs addressed all the State Governntents stating that the State Government have the discretion to chose their own criteria for defining the backward classes.In view of this, it would be better to apply economic test than to go by castes. కులం అనేదానికంటే ఒక విధంగా సరైన విధానం అనుకున్నప్పుడు ఆర్థికపరంగా వెనుకబడినతనాన్ని కూడా తీసుకొని ఎవరైతే అమాయకులుగా ఈ సంఘములో నలిగిపోతున్నారో అటువంటివారికి అభివృద్ధి కార్యక్రమాలు అందించడం, ఆ వర్గాన్ని అభివృద్ధి చేయడం ప్రభుత్వాల ధర్మంగా రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలని కేంద్ర ప్రభుత్వము ఆనాడు తాఖీదు ఇవ్వడం జరిగింది.

అయినా ఒక నిర్దుష్టమైనటువంటి పరిచ్ఛేదం చేయలేకపోతున్నామే. సమాజములో అసంతృప్తి పెరిగిపోతున్నదే, ఎక్కడికక్కడ మాకు ఏమిటి స్వాతంత్ర్యం తెచ్చింది, ఏమిటి స్వాతంత్ర్యంవల్ల మేము పొందగలుగుతున్నది, ఆనాడు ఎంతోమంది మహానుభావులు అమరజీవులై ఆత్మార్పణ చేశారే, అటువంటివారి త్యాగాలవల్ల మేము ఆశించింది నేరవేరుతున్నదా లేదా అని గుండెలు బాదుకుంటున్న పేద ప్రజానీకం తమ హక్కుల కొరకు ఆనాడు నిలదీసి అడిగే రోజు వచ్చినప్పుడు, ప్రత్యేకంగా దీని విషయములో కమిషన్ వేస్తే బాగుంటుంది, ఏదైనా ఈ సమాజములో ఎవరు వెనుకబడి ఉన్నారు, ఎవరికి సరైనటువంటి సంరక్షణ కలగాలి, ప్రభుత్వపరంగా సంక్షేమ కార్యక్రమాలు అందాలి, ఏ విధమైన శాతం ఉండాలి, ఎలా ఉండాలి అనే దానిమీద నిర్ణయం చెప్పడానికి మండల్ కమిషన్ ఆనాడు ఏర్పాటుచేయడం జరిగిందని సవినయముగా మనవిచేస్తున్నాను. 1981లో రాజ్యాంగపరంగా సంభవించినటువంటి ఎస్.సి., ఎస్.టిల హక్కుల కోసం ఆ జనాభా తీసుకున్నారు. వారి జనాభా నిర్దిష్టంగా ఉన్నది. ఆ జనాభా తీసుకున్నారు. మనకు మైనారిటీస్‌గా ఉన్నటువంటి ముస్లిమ్స్, క్రైస్తవులు, పార్శీలు ఇత్యాదుల జనాభాను తీసుకున్నారు. ఆనాడు అభివృద్ధి చెందినటువంటి, ఇతర కులాలుగా చెప్పబడుతున్నటువంటి వారి శాతం తీసుకోబడింది.

ఇవన్నీ కూడా కలిపి మినహాయిస్తే మిగిలింది వెనుకబడిన వర్గాలవారు అనేటటువంటిది నిర్ధారించబడింది కానీ కేవలం ప్రత్యేకమైనటువంటి జనాభా ప్రాతిపదికమీద ఇది తీసుకోబడలేదు. ఆనాడు అంచనా ప్రకారంగా ప్రతి సంవత్సరం పెరుగుతున్నటువంటి జనాభాతో ఊహించుకొని గుణించి చేసినటువంటి పరిష్కారం అని నేను మనవిచేస్తున్నాను. దానిమీద 50 శాతం రిజర్వేషన్స్ మించకూడదన్న భావంతో ఎంతోమంది సుప్రీంకోర్టుకు వెళ్లడం జరిగింది. కానీ సుప్రీంకోర్టు

పూర్తిగా మండల్ కమిషన్ ఇచ్చినటువంటి విధానాలను అనుసరించింది. మండల్ కమిషన్ కూడా ఆ 50 శాతం సుప్రీంకోర్టు అదివరకు ఇచ్చినటువంటి తీర్పును ధిక్కరించకూడదనే భావంతో అప్పటి నుంచి ఉన్నటువంటి 22 శాతం ఎస్.సి., ఎస్ టి.లకు రిజర్వేషను పోను – మనది 50 శాతంలో ఉండాలి కనుక ఏ శాతం వెనుకబడిన వ్యక్తుల వారికి ఇస్తే సరిపోతుందనేటటువంటి, విధమైనటువంటి ఊహ పరిచ్ఛేదమే ఇచ్చారు కానీ సరైనటువంటి అంకెలతో, సరైనటువంటి సమన్వయపరమైన విధానంతో ఆనాడు ఉన్నటువంటి వెనకబడిన తరగతుల వర్గాలకు చెందిన జనాభాకు సరిపోయేటటువంటి నిష్పత్తితో వారికి రిజర్వేషన్స్ జరిపించబడలేదనేది సుస్పష్టంగా మనకు తెలియజేస్తున్న విధానంగా నేను మనవిచేస్తున్నాను.

ఆనాడు మండల్ కమిషన్ ఏర్పాటు చేసినా, వారు ఇచ్చినటువంటి సిఫార్సుల ప్రకారం ఇంతవరకు కొన్ని రాష్ట్రాలలో అమలుపరచబడలేదంటే ఏ విధంగా సమాజంలో స్వార్థం కరుడు కట్టుకొని పోయిందో ఒకసారి ఆలోచిస్తే మనకు అర్థం అవుతుందని మనవిచేస్తున్నాను. కేవలం అభివృద్ధి అనేది ఏ కొందరి కోసమో కాదు. ఈ సమాజంలో ఉన్నటువంటి ప్రతి మనిషికి, మానవుడుగా సమాజంలో పుట్టిన ప్రతివాడికి మనిషిగా గౌరవంగా బ్రతికే హక్కు, అధికారం ఉంది. కనుక అటువంటి మానవుడికి సంబంధించిన ప్రాథమిక హక్కు, ప్రాథమిక జీవన సౌకర్యాలు కల్పించని ఈ సమాజం పనికిరాదు అనే విధానాన్ని మరొకసారి నేను వ్యక్తం చేస్తున్నాను. తరువాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈవిధమైనటువంటి అలజడులు జరుగుతున్నప్పుడు 1968వ సంవత్సరంలో మనోహర ప్రసాద్ కమిషన్‌ను నియమించడం జరిగింది. ఆ మనోహర ప్రసాద్ గారు ఆ సంవత్సరమే రాజీనామా చేయడం జరిగింది ఆ తరువాత అనంతరామన్ కమిషన్ తొమ్మిది మంది సభ్యులతో ఏర్పరచడం జరిగింది.

వారు ఏవిధమైన ప్రాతిపదిక మీద ఈ వెనుకబడిన తరగతుల వారిని తీసుకోవాలని ఆలోచించినప్పుడు ఆ వర్గంలో ఉన్నటువంటి 'పేదరికం, వృత్తిమీద తక్కువ గౌరవంగల, అపరిశుద్ధమైనటువంటి, తగినటువంటి ఆర్థికస్థోమత లభించనటువంటి దానిని గుణికంగా తీసుకొనడం జరిగింది, కొలబద్ధగా తీసుకోవడం జరిగిందని మనవిచేస్తున్నాను. హిందూ సమాజంలో అంటరానివారు అని దగ్గరకు రానీయకుండా దూరంగా నెట్టుతున్నారా, వారికి ఏవిధంగా సమాజంలో గౌరవం ఉంది, అగౌరవం జరుగుతున్నదా అనే విధానాన్ని కూడా వారు పరిశీలించడం జరిగింది. ఆ తరువాత విద్యావిధానంగా వారు వెనుకబడిన తనం, ఏవిధంగా ఎంతవరకు, ఏ శాతంలో విజ్ఞానార్థులైనారు, వారికి ఏ మేరకు విద్యాగంధం అబ్బకుండా ఉంది అనేది కూడా నాల్గవ పాయింటుగా, కొలబద్ధగా తీసుకొనడం జరిగిందని మీకు సవినయంగా మనవిచేస్తున్నాను. పైగా ఆ నివేదికలో వారు 93 వెనుకబడిన వర్గాలు ఉన్నాయని, 30 శాతం ప్రత్యేకంగా వారికి కేటాయింపులు కేటాయించాలని, 10 సంవత్సరాల వరకు ఆ సిఫార్సులు ఉండాలని చెప్పడం

జరిగింది. వారు వెనుకబడిన 4 తెగలుగా విభజించారు. మొదటి తెగ సంచార జీవనులు. వారికి 7 శాతం ఇమ్మని అన్నారు. 2వ తెగ వృత్తి పనులవారు. వారికి 13 శాతం ఇమ్మని అన్నారు, మూడవ తెగ-మతాంతరులు. షెడ్యూల్డు తెగలవారు ఎవ్వరైతే క్రైస్తవ మతం పుచ్చుకుంటారో వారికి ఒక శాతం ఇమ్మని అన్నారు. ఈ తరువాత మిగిలిన కులాలు - ఎవరైతే వెనుకబడిన తరగతులలో మిగిలిన కులాల వారు ఉన్నారో వారికి 9 శాతం ఇమ్మని అన్నారు. ఈ విధంగా 30 శాతం వాటా ఇమ్మని చెప్పడం జరిగింది, అయినా ఆనాటి ప్రభుత్వం 50 శాతానికి మించి రిజర్వేషన్స్ ఇవ్వకూడదు ఏవిధమైనటువంటి విపత్తు వస్తుందనే భావంతో 25 శాతం వెనుకబడిన వర్గాలవారికి ఇవ్వడానికి అంగీకారం తీసుకున్నది, అమలు చేసిందని మీకు మనవిచేస్తున్నాను.

**1982లో ప్రభుత్వం నియమించినటువంటి మురళీధరరావు కమిషన్ వారియొక్క లెక్కలు-జనాభా ప్రాతిపదికమీద తీసుకున్నటువంటి అంచనాలన్నీ కూడా మండల్ కమిషన్ ఇచ్చిన లెక్కల ఆధారంగా తీసుకొని ఆ తరువాత ప్రతిసంవత్సరం పెరుగుతున్న జనాభాను గణించి నిర్ణయం తీసుకున్నారు. షెడ్యూలు కులాలు 15% షెడ్యూల్డు తెగలవారు 8%, వెనుకబడిన తరగతుల వారు 52% అన్నారు.**

(1) సంచార జీవనులకు 7 శాతం, (2) వృత్తిపరులకు 10 శాతం, (3) మతాంతరులకు 1 శాతం, (4) ఇతర కులాల వారికి 7 శాతం మొత్తం 25 శాతంగా వీరందరికీ అన్ని విధానాలలో సంక్రమింపజేయడం జరిగిందని మనవిచేస్తున్నాను. ఆ తరువాత అనంతరామన్ రిపోర్టు చెల్లదు, సరైనటువంటి విధానములో సరైనటువంటి సూచనలు ప్రభుత్వానికి అందచేయలేదని కోర్టుకు వెళ్లడం జరిగింది. అప్పుడు ఆ కోర్టువారు ఆ రిపోర్ట్‌ను బలపరచడం కూడా జరిగిందని మనవిచేస్తున్నాను. అప్పుడు అప్పటికీ సమాజంలో ఇంకా అసంతృప్తి ఉంది. ఇది సరిగా అమలు పరచబడడం లేదు, మాకు న్యాయం జరగడం లేదు, ఈనాడు మెజారిటీగా అత్యధిక సంఖ్యలో ఉన్నటువంటి వెనుకబడిన వర్గం మా అతీగతీ చూసే నాధుడే లేకపోతున్నాడు. ఈ 25 శాతం కూడా వెనుకబడిన వారిలో పదవులలో ఉంటూ, పలుకుబడి ఉంటూ ఎవరైతే పైన ఉన్నారో వారు అనుభవిస్తున్నారు కానీ అట్టడుగున ఉన్నటువంటి వారు ఎవ్వరైతే కుగ్రామాలలో వృత్తి చేసుకొని గడవక పొట్ట చేతితో పట్టుకొని అహర్నిశలు క్రుంగిపోతున్నారో అటువంటివారు మాకు మీరు ఇచ్చే సహాయం ఏమిటని అన్నప్పుడు తప్పకుండా మరొక కమిషన్‌ను మన రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయవలసి వచ్చిందని మీకు మనవిచేస్తున్నాను.

అదే 1982లో ప్రభుత్వం నియమించినటువంటి మురళీధరరావు కమిషన్. వారియొక్క లెక్కలు-జనాభా ప్రాతిపదికమీద తీసుకున్నటువంటి అంచనాలన్నీ కూడా మండల్ కమిషన్ ఇచ్చిన లెక్కల ఆధారంగా తీసుకొని ఆ తరువాత ప్రతిసంవత్సరం పెరుగుతున్న జనాభాను గణించి నిర్ణయం తీసుకున్నారు. అదేమిటంటే షెడ్యూలు కులాలు 15% అన్నారు, షెడ్యూల్డు తెగలవారు 8% అన్నారు, వెనుకబడిన తరగతుల వారు 52% అన్నారు. ఇతర కులాలవారు మిగిలిన

భాగంగా ఉన్నారని తెలియజేశారు. ఈ 52%లో అప్పుడు ఓపెన్ కాంపిటిషన్‌లో వారికి ఉన్నటువంటి విద్య, విజ్ఞాన, ఆర్థిక వికాసాలతో అందరితో పోటీచేసి పరీక్షలలో కూర్చొని నెగ్గి అభివృద్ధి కార్యక్రమాలు అందుకునే వారు 8%గా వారు నిర్ణయించారు. కనుక ఆ 52%లో 8% పోతే ఇక 44 శాతం వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్స్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. వారి అభివృద్ధికి ఈ విధంగా దోహదం చేయడం అత్యంత సమజసం అని వారు ప్రభుత్వానికి సిఫారసు చేయడం జరిగిందని మనవిచేస్తున్నాను. అలాగే ఇచ్చినటువంటి వారిలో వారు 5 తెగలుగా విభజించారు. 1.సంచారజీవులకు. ఈనాడు ఉన్నచోట ఉండకుండా గుడిసెలు వేసుకుంటూ మరునాడు తీసి ఇంకొక చోటుకు మారడం జరుగుతుంది. కడుపు చేతబట్టుకొని నిలువ నీడ లేక, ఉన్న చోట ఉండక దేశదేశాలుగా తిరుగుతున్న వారు ఉన్నారు. అటువంటి సంచారజీవులు వారు.

అనాగరికంగా ఉంటున్నవారు. మన కళ్లముందే చూస్తేనే సమాజానికి సిగ్గుగా ఉందని మనం ఎవరిగురించి అయితే భావిస్తున్నామో అటువంటి వారి ఒక లిస్టు తయారుచేసి వారికి 10 శాతం కేటాయించాలని నిర్ణయించారు. ఆ తరవాత మిగిలిన వృత్తి పరుల పనివారు. చేనేత, వడ్రంగులు, కమ్మరులు, కుమ్మరులు వంటివారికి, ఆ వృత్తులతో కాలం గడుపుతున్నటువంటి వంటివారికి ఇమ్మని చెప్పడం కూడా జరిగింది. కులాలు వారు ఎవరైతే ఉన్నారో వారందరికీ 8 శాతం. ఆ తరువాత మతాంతరులు, ఎవరైతే షెడ్యూల్డు మతం మార్చుకున్నారో వారికి 2 శాతం రిజర్వేషన్స్ ఇమ్మని సిఫార్సు చేయడం జరిగింది. ఇవన్నీ గణిస్తే మొత్తం 41 శాతం వెనుబడిన వారికి ఇస్తే బాగుంటుందని వారు అన్నారు. ఇది అప్పటి నుంచి పెద్ద పెద్ద మహానాయకులు, వెనుకబడిన తరగతుల వారి ప్రతినిధులు, రాజకీయ పక్షాలవారు మన శాసన సభలో ఎన్నో సార్లు ప్రశ్నలను – ఏది మురళీధరరావు కమిషన్ ఎక్కడ ఉందని ప్రభుత్వాన్ని ఈనాడు అన్నట్లు ఆనాడు అన్నారు.

ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు, అంటే అమలు చేయమనండి అన్న విధానాన్ని ఎంతో మంది ప్రభుత్వంపట్ల గల అనుమానం వ్యక్తం చేసినప్పుడు – అప్పటి నుంచి ప్రభుత్వం పరిశీలిస్తూనే ఉంది. సోదరీమణి ప్రతిభా భారతిగారు కూడా ఈ సభలోనే చెప్పారు – ప్రభుత్వం పరిశీలిస్తున్నది, తప్పకుండా అమలు చేస్తామని వారు కూడా హామీ ఇవ్వడం జరిగింది. అందుకే దీని విషయంలో వెంటనే నిర్ణయం తీసుకోవడం జరిగింది. పైగా ఒకసారి ప్రభుత్వంచే నియమించబడిన కమిషన్ – కేవలం అనామకంగా ఏర్పడినటువంటిది కాదు – వారు సిఫార్సులు అందజేశారు. పూర్తిగా క్యాబినెట్ సమావేశంలో దాని మంచి చెడులు కూడా చర్చించడం జరిగింది. ఎవరైతే దాని కోసం ఎదురు చూస్తున్నారో, సామాజికపరమైన న్యాయం కావాలని అడుగుతున్నారో, వారికి అది వెంటనే అందించడం తెలుగుదేశం సిద్ధాంతంగా తీసుకున్నాము. దానిని ప్రభుత్వపరమైన సిద్ధాంతంగా అమలు చేయడానికి నిర్ణయం తీసుకోవడం జరిగిందని

మనవిచేస్తున్నాను. అందరూ గౌరవంతో పరిపూర్ణమైన సహాయాన్ని సహకారాన్ని అందిస్తారనే విశ్వాసంతో ఇది చేయడం జరిగింది గానీ కేవలం మీకు తెలియకుండా చేయాలని కాదు. అందుకే మీకు తెలిసే విధానంగా ఆ మురళీధరరావు కమిషన్ రిపోర్టు ఈ గౌరవనీయ సభ ముందు చిత్తశుద్ధితో ఉంచడం కూడా జరిగిందని మనవిచేస్తున్నాను, కాబట్టి ఇది ఏదో తొందరపాటు చర్యగా భావించడంగానీ - ఇది చిత్తశుద్ధితో చేయలేదనో- లేకపోతే ఇన్ని వివరాలు సేకరించడానికి ఇంత టైము పట్టింది గానీ, ఇది కేవలం తొందరపాటుతో తీసుకున్న నిర్ణయం కాదు సమగ్రంగా, సమూలంగా పరిస్థితులు పరిశీలించి, ఆది నుంచీ ఈనాటి వరకు ఏ పరిస్థితులలో ఈ సమాజం క్రుంగిపోతున్నదో, ఆ పరిస్థితులు నివారించడం కోసం పరిశీలించి చేసిన నిర్ణయంగానీ, దీని వెనక రాజకీయ ప్రయోజనం ఏమీ లేదని మాత్రం సుస్పష్టంగా, వినయంగా గౌరవసభ్యులకు మనవిచేస్తున్నాను.

కేవలం ఈ వెనకబడినతనంతోబాటు ఆర్థికంగా వెనుకబడినతనాన్ని జోడించడమే నిజమైన సామాజిమైన న్యాయమన్న దృష్టితో పరిశీలించడం జరిగిందని నేను సవినయంగా మనవిచేస్తున్నాను. అదే జరిగి ఉంటే ఈనాడు గ్రామాలలో క్రుంగి కృశించి పోతున్నటువంటి ఆ నిర్భాగ్య జీవులకు ఇంతవరకు ఎందుకు మోక్షం కలుగలేదని అడుగుతున్నాను. ఈ సభలో కేవలం ప్రభుత్వపరంగా, రాజకీయపరంగా ఎవరికైతే స్థానం ఉందో సమాజంలో వారే ఈ సంక్షేమాన్ని అనుభవిస్తున్నారు గానీ నిరుపేదలు, నిర్భాగ్యులు ఎక్కడైతే ఉన్నారో వారికి మాత్రం ఈ సంక్షేమం అందడం లేదని మనవిచేస్తున్నాను. అందుకే చెప్పాను - స్వార్థం మానవుడి కళ్ళు కప్పుతున్నది. స్వార్థమే సమాజానికి ద్రోహం చేయిస్తున్నదని మరొకసారి ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. దీనిని సమర్థిస్తూ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ 'వసంతకుమార్ వర్సెస్ కర్ణాటక'లో ఈ విధంగా వారు చెప్పారు.

"In sofar as other Backward classes are concerned, two tests could be conjectively applied for identifying them for purpose of reservations in the employment and education. The first test was that they should be comparable to scheduled castes and scheduled tribes in the matter of backwardness. And the second was that they should satisfy a means test as the Government may lay down in the contest of prevailing economic conditions." వారికి ఉన్నటువంటి ఆర్థిక స్తోమత కూడా పరిశీలించి ఇవ్వడంలో తప్పు లేదని, అటువంటి న్యాయమూర్తి వారి తీర్పులో పేర్కొనడం జరిగింది. ఆ తరువాత 'స్టేట్ ఆఫ్ కేరళ వర్సెస్ థామస్'లో సుప్రీంకోర్టు మరొక అబ్జర్వేషన్ కూడా ఇచ్చింది.

“The Court observes: Its benefits (reservations) by and large are snatched away by the top cream layer of the backward Castes and classes.” I am repeating The Court observed that its benefits by and large are snatched away by the top cream layer of the backward castes and classes. Thus keeping the weakest among the weak always weak and allowing the fortunale layer. ఆ తరువాత ఈ రిజర్వేషనులు ఎంత శాతం ఉండాలి. ఏవిధంగా వర్తించాలి అని పరిగణనలోకి తీసుకోవడం జరిగినప్పుడు న్యాయమూర్తి జస్టిస్ ఫజల్ అలీ కేరళ వర్సెస్ థామస్ కేస్‌లో వెలిబుచ్చిన అభిప్రాయాలు చాలా హేతుబద్దంగా ఉన్నాయి.

“As to what would be the suitable reservation within the permissible limits will depend upon the facts and circumstances of each case and no hard and fast rule can be laid nor can this matter be reduced a mathematical formula so as to be adhered to in all cases. Decided cases of this Court have to doubt and down that the percentage of reservation should not exceed 50%. As I read the authorities, this is a rule, however of caution and doesnot exhaust all categories, Suppose for instance a state has large number of backward classes of citizens which constitute 80% of the population and the Government on order to gave them proper representation reserves 80% of the jobs for them, can it be said that the percentage of reservation as bad and violates the permissible limit under clause (4) of art. 16 the answer must necessarily be in the negative. The dominant objective of this provisions to take steps to make inadequate representaton adequate.” ఎవరైతే ఈనాడు సమంజసం కాదనుకుంటున్నారో దానిని సమంజసం చేయాలన్నదే ఈ పరిశీలన అని కూడా వారు నిర్దిష్టంగా చెప్పడం జరిగింది.

ఇది కేవలం మనం ఆలోచిస్తే, ఏవిధంగా ఆచరణలో పెట్టాలి, ఏవిధంగా నిర్ణయాలు తీసుకోవాలి అని ఆలోచించినప్పుడు, ఎవరైతే వెనుకబడి ఉన్నారో వారికి పరిపూర్ణమైనటువంటి అభివృద్ధి కార్యక్రమాలు అందించడం ప్రభుత్వానికి సరైన మార్గంగా గుర్తించడం జరిగిందని సవినయంగా మనవిచేస్తున్నాను. ఈ విషయంలో ఎంతోమంది విద్యార్థులు వారికి ఉన్న అవకాశాలు, వారికి ఉన్న ప్రవేశాలు పోతున్నాయని బాధపడినప్పుడు, వారి బాధ వ్యక్తం చేసినప్పుడు, అందుకే ప్రత్యేకంగా అదనంగా నాట్ హండ్రడ్, నాట్ హండ్రడ్ అండ్ ట్వంటీ,

హంండ్రెడ్ ప్లస్ ట్వంటీ – ఉన్న హంండ్రెడ్ సీట్లకు ట్వంటీ ఎడిషనల్ సీట్స్ కల్పించడం జరిగింది తప్ప 120 సీట్లుగా మాత్రం భావించవద్దు. They are separately reserved for the students of merit irrespective of their caste and creed.

ఏదైనా సరే మనం విజ్ఞానాన్ని గుర్తించాలి. కేవలం వెనుకబడిన తరగతుల్నే, వెనుకబడినతనాన్నే ఉద్ధరిస్తే మన సమాజం ముందుకు పోవాలి. ఉద్ధరిస్తే సాంకేతికపరమైన శాస్త్ర విజ్ఞానంతో మన దేశం అభివృద్ధి చెందాలనేటువంటి కార్యక్రమం, అటువంటి అభ్యుదయ భావం, అటువంటి సంచలనాత్మకమైన ఉద్దేశంతో కుంటుపడుతుందేమోనన్న భావంతో, అర్హతను గుర్తించాలనే ప్రభుత్వ విధానానికి ప్రాతిపదికగా ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది గానీ ప్రత్యేకంగా మరొక పద్ధతితో కాదని మనవిచేస్తున్నాను. దీని విషయంలో కొందరు గౌరవ సభ్యులు వారి వారి అభిప్రాయాలు చెప్పారు. వెనుకబడిన వర్గాలకు నిర్వచనం ఏమిటని, ఆర్థికంగా బలహీనంగా ఉన్నారు, వారి సంగతి ఏమిటి అని అన్నారు. స్కాలర్‌షిప్స్ విషయం ముఖ్యంగా రాజేశ్వరరావుగారు చెప్పడం జరిగింది. దాని విషయంలో వారికి సవినయంగా మనవిచేస్తున్నాను.

ఈనాడు రూ.3600 ఉన్న స్కాలర్ షిప్‌కు ఆర్థిక స్తోమత ఈనాడు రూ.2,000 లకు పెంచడం. దానివల్ల ఈ స్కాలర్‌షిప్స్ వారికి సంక్రమింపచేయడంవల్ల ఇంకా ఎక్కువ మంది ఈ ఫలితాన్ని పొందుతారు. ఎవరైతే ఆర్థికంగా వెనకబడి ఉన్నారో వారికి ప్రభుత్వపరంగా ఇచ్చే ఈ సహాయం పొందే అవకాశం. రూ.1 కోటి 75 లక్షలు ప్రభుత్వం కేటాయించిన మొత్తాన్ని ఈరోజు రూ.4 కోట్లకు మార్చి ఇంకా సంక్షేమ కార్యక్రమాలు వారికి పెంచడం జరిగింది. మధ్య దళారీలు దోపిడీలు అన్నారు. సమాజంలో ఆశించిన ఫలితం ఎవరికి దక్కాలో వారికి దక్కక, మధ్య దళారీలు పొట్టన పెట్టుకుంటున్నారు. సమాజం ఈ విధంగానే కుంచించబడి, క్రుంగబడి ఈనాడు. బాధలతో సతమతమవుతున్నదని మనవిచేస్తున్నాను. వారి విధానానికి పూర్తిగా నా అంగీకారం వ్యక్తం చేస్తున్నాను. వెనుకబడిన వర్గాలకు ఈ విధమైనటువంటి మార్గం శాశ్వత చికిత్స మాత్రం కాదన్నారు.

> **మతం కేవలం ఐకమత్యాన్ని ప్రబోధిస్తుందనే భావన ఇది. కాబట్టి ముస్లిం సోదరుల పట్ల మాకు ప్రేమ, వాత్సల్యం, అనురాగం ఉంది. కాబట్టి ఈనాడు మండల కమిషన్ వారు సూచించిన ప్రకారం ముస్లింలు అంటే కేవలం ఒకప్పుడు సుల్తాన్‌లు, జాగీరులు. వారంతా విద్యా గంధం అబ్బి సాంస్కృతికంగా, నాగరికతపరంగా అభివృద్ధిచెందినటువంటి కులాలుగా నిర్వచించబడుతూ ఉంటూ వచ్చినారు.**

కానీ ఇదే శాశ్వత చికిత్స అని నా అభిప్రాయం. ఎందుకంటే ఎవరు వెనుకబడి ఉన్నారో వారి వెనుకబడినతనాన్ని ముందు పైకి తీసినప్పుడు, వారికి సరైన సహకారం అందించి, మనతో సమానంగా వారిని నిలబెట్టినప్పుడు నిజమైనటువంటి ఒక సమాజం ఆవిర్భవిస్తుంది గానీ కేవలం వారిని అట్టడుగున ఉన్న వారిని అక్కడే ఉంచి కేవలం మరొక విధంగా చేస్తే మాత్రం పరిష్కారం

కాదని మనవిచేస్తున్నాను. కాబట్టే ఈనాడు రూ.12 వేలకు పరిమితి పెట్టడం జరిగింది. రూ.12 వేల లోపు ఉన్నవారు ఈనాడు వెనుకబడిన తరగతులలో 95 శాతం ఉన్నారని మనవిచేస్తున్నాను. అంటే ఇదివరకు ఉన్నటువంటి రిజర్వేషన్ 25 పర్సంట్‌లో కేవలం 5 పర్సంట్ వారే అనుభవిస్తూ, ఈ సమాజానికి సరియైనటువంటి న్యాయం అందచేయడం లేదన్నది సుస్పష్టమైన ప్రభుత్వం యొక్క అవగాహనగా వారికి నేను సవినయంగా మనవిచేస్తున్నాను.

ఇకపోతే గౌరవ సభ్యులు కుడిపూడి ప్రభాకరరావుగారు డబ్బు గురించి – ఆర్థికంగా కేవలం మీరు అమలు చేస్తామని అంటున్నారా? అని అడిగినారు. వెనుకబడిన తరగతుల పట్ల ఏ విధమైన ఆర్థిక విధానం ప్రభుత్వం వహిస్తున్నదంటే ఇప్పటికీ సాలుకు రూ.220 కోట్లు ఖర్చు పెట్టడం జరుగుతోంది. హాస్టల్ సౌకర్యాలకు కానీ స్కాలర్ షిప్‌లకు కానీ ఇత్యాది సంక్షేమ కార్యక్రమాలకు రూ.95 కోట్ల రూపాయలు–ఆ తర్వాత ప్రత్యేకంగా కిలో బియ్యం రూ.2లకు ఇవ్వడం దీనిని కేవలం కూడా మత, వర్ణ, వర్గ బేధం లేకుండా ఎక్కడయితే పేదతనం ఉందో ఆ పేదరికాన్ని నిర్మూలింపచేయడానికి సమగ్రమైనటువంటి, సృజనాత్మకమైనటువంటి ప్రభుత్వ విధానం. రూ.2 లకు కిలో బియ్యం స్కీమ్ క్రింద పన్నెండున్నర లక్షల టన్నుల బియ్యం ఈనాడు వెనుకబడిన వర్గాలకు యొక్క సంక్షేమ కార్యక్రమాలకు అందించబడుతున్నాయి. దీనికి సుమారు రూ.120 కోట్లకు పైచిలుకు ఖర్చు అవుతుంది. మొత్తం కలిపితే సుమారు రూ.220 కోట్లు ఈనాడు ప్రభుత్వం వెనుకబడిన తరగతుల సంక్షేమానికి ఖర్చు పెడుతోంది, అనే మాటలు వాడను. ఇది మన ధర్మం. ఎవరైతే వెనుకబడిన వారున్నారో వారికి సంక్షేమం అందించి, సామాజికపరమైనటువంటి న్యాయం వారికి చూపించి వారిని అభివృద్ధి చేయడమే మన ధ్యేయం.

ఓంకార్‌గారు చెప్పినట్లుగా ఫ్యూడల్ వ్యవస్థగా, ధనికవర్గాల వారికి చెందిన రాష్ట్రంగా మాత్రం ఉండకూడదు. ఎవరైతే ఈనాడు నిజమైన స్వతంత్రంకు సరియైన నిర్వచనం ఇవ్వలేక వీరు ఇటు జీవించలేక అటు చావలేక బ్రతుకుతున్నారో అటువంటి బాధితులకు ఈ కార్యక్రమాన్ని అందించడమే ప్రభుత్వ ధ్యేయం. కాబట్టి ఈ విధమైన సంక్షేమ కార్యక్రమము ఎక్కడ పేదరికం ఉ ందో, ఎవ్వరైతే నిజమైన పేదవారో వారందరికీ అందించడం జరిగిందని నేను సర్వజ్ఞులకు మనవిచేస్తున్నాను. గౌరవనీయులైన మస్కతీగారు మనవిచేసినారు. We are belonging to the same country. మతం కేవలం ఐకమత్యాన్ని ప్రభోదిస్తుందనే భావన ఇది. కాబట్టి ముస్లిం సోదరుల పట్ల మాకు ప్రేమ, వాత్సల్యం, అనురాగం ఉంది. కాబట్టి ఈనాడు మండల కమిషన్ వారు సూచించిన ప్రకారం ముస్లింలు అంటే కేవలం ఒకప్పుడు సుల్తాన్‌లు, జాగీరులు. వారంతా విద్యా గంధం అబ్బి సాంస్కృతికంగా, నాగరికతపరంగా అభివృద్ధిచెందినటువంటి కులాలుగా నిర్వచించబడుతూ ఉంటూ వచ్చినారు. కానీ ఈనాడు మురళీధర్ కమిషన్ రిపోర్టులో ప్రత్యేకంగా ఖురేషీ, దూదేకుల, మెహగర్‌లు కేవలం ముస్లింలు అయినప్పటికీ కూడా వారు వృత్తిరీత్యా

ఆర్థికపరంగా వెనుకపడినారు, సంస్కారపరంగా వెనుకపడ్డారు అని ఆ మూడు తెగలవారిని కూడా వెనుకబడిన తరగతులలో చేర్చడం జరిగిందని వారికి సవినయంగా మనవిచేస్తున్నాను. తర్వాత గౌరవనీయ సభ్యులైన అమరనాథరెడ్డి గారు చెప్పిన పాయింట్స్‌లో ఈనాడు శాంతిభద్రతలు లోపించడం జరుగుతోందని అది ఎప్పటికీ జరగదని వారికి ప్రభుత్వపరంగా హామీ ఇస్తున్నాను. శాంతిభద్రతలు అంటే అలజడులు మామూలుగా జరుగుతూ ఉంటాయి.

ఏ మంచి పని చేయడానికి అయినా ఎన్నో ఆటంకాలు సమాజంలో వస్తూనే ఉంటాయి, వాటికి ఏ మాత్రం భయపడడం జరగదని ప్రభుత్వం మీకు హామీ ఇస్తున్నది. ఏ విధమైన అలజడులకు దారితీయని విధానంతో శాంతి భద్రతలు పరిరక్షించడానికి ఈనాడు ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై ఈ కోర్టులు స్టే ఇచ్చినప్పటికీ కూడా దీనిని అపీల్ చేసి పూర్తిగా ఏ చిత్తశుద్ధితో, ఏ శాసనం చేసినామో, ఏ నిర్ణయం చేసినామో దానినిపూర్తిగా అమలుపరచడానికి ప్రభుత్వం, అంకితమైన భావంలో కృషిచేస్తుందని వారికి సవినయంగా మనవిచేస్తున్నాను.

ఇది ఒకరి కోసం కాదు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఇచ్చిన బాధ్యత నా మేధస్సులో స్పందించిన ప్రజాభ్యుదయ సంక్షేమము సంఘములో పంపించబడి, కర్మ సిద్ధాంతంతో తమ ఆవేదనను తిట్టుకుంటూ విధివంచితులై, బాధాగ్రస్తులై వెనుకబడిన వారుగా యుగయుగాలుగా తరతరాలుగా విస్మరించబడిన ఆ దగాపడ్డ తమ్ముళ్లకు, చెల్లెళ్ళకు విమోచన కలిగించాలన్నదే నా తాపత్రయం. సాధకుడిని నేను. ఇది నా సాధనం. పేదవారి పెంపుకే ఈ జీవితం అంకితం, పునరంకితం. ప్రజలు ఇచ్చిన గౌరవానికి, ఉంచిన విశ్వాసానికి అనుగుణంగా సమసమాజోద్ధరణ చేయాలనేదే నా వ్యూహం, సమాన హక్కులు, సమాన అవకాశాలు సమాజంలో సర్వులకు అన్ని వర్గాలకు సంప్రాప్తింప చేయాలనేదే ప్రభుత్వ సంకల్పం. కర్మిష్ఠి నేను, కర్మ నాది, ఫలితం మీరిచ్చే సహకారం.

***కర్మణ్యే వాధికారస్తే***
***మాఫ లేషు కదాచన***
***మా కర్మఫలహేతుర్భూః***
***మాతే సంగోస్త్వకర్మణి***
***ఓం సహనావతు***
***సహ నౌ భునక్తు***
***సహవీర్యం కరవావహై***
***తేజస్వినావధీతమస్తు మా విద్విషావహై***
***ఓం శాంతిః శాంతిః శాంతిః***

◆◆

జనవరి 7, 1987

# చెట్టుకూ, పుట్టకూ, గుట్టకూ, నీటికీ, ప్రతిదానికి కేంద్ర ప్రభుత్వం దగ్గర చేయి చాచాలా?!

*(గవర్నర్ గారి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చేసిన ప్రసంగం)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** గౌరవనీయులైన అధ్యక్షులకు ఎంతో ఉద్వేగంతో, ఉత్సాహంతో వారి వారి అభిప్రాయాలను సెలవిచ్చిన గౌరవనీయులైన శాసన సభ్యులకు ప్రభుత్వ విధానాలు చెప్పేముందు నా శుభాభినందనలు తెలియజేస్తున్నాను. ఈ నూతన సంవత్సరం గతంలో మనకు సంభవించిన ఈతిబాధలు ఏమీ లేకుండా, మన తెలుగు మాగాణం సుభిక్షమై, శాంతివంతమై, సర్వులకు ఆనందదాయకమైన సుఖంతో, శాంతితో ఓలలాడాలని మనందరి తరఫున, నా తరఫునా ఆరు కోట్ల ఆంధ్ర ప్రజానీకానీకి ఈ నూతన సంవత్సర శుభాకాంక్షలు వ్యక్తం చేస్తున్నాను. అరిష్టాలు వచ్చాయి. అక్షయనామ సంవత్సరం రేపు ఉగాదితో గడచిపోతుంది. తెలుగు సంవత్సరాలలో మొదటిదైన ప్రభవనామ సంవత్సరం తిరిగి 60 సంవత్సరాల తరువాత వస్తోంది. ప్రభవతోనైనా మన జాతి ప్రభవించాలనీ, వికసించాలనీ, ఇంతవరకూ అనుభవమైన దురదృష్టకరమైన వరదలు, కరువుల వంటి ఈతిబాధలేమీ లేకుండా జాతి సంక్షేమంగా ఉండాలని సర్వ ప్రజానీకానీకి ప్రజా ప్రతినిధిగా మరొక్కసారి నా శుభాకాంక్షలు వ్యక్తంచేస్తున్నాను.

నూతన సంవత్సరంలో ప్రథమ సమావేశం ఇది. ఈ ప్రథమ సమావేశ సందర్భంలో కేవలం ప్రభుత్వ సిద్ధాంతాలను గురించి మాత్రమే చెప్పాము కానీ వివరాలు వివరించలేదని నేను సుస్పష్టం చేస్తున్నాను. తరువాత ఏప్రిల్ 1వ తేదీనుంచి అమలు జరపబోయే బడ్జెట్ వివరాలన్నీ సేకరించబడతాయి. ఈనాడు ఎంతో ఉద్వేగంతో సర్వులూ తమ అభిప్రాయాలు చెప్పారు. వాటన్నింటినీ గౌరవించడం జరుగుతుంది, గుర్తించడం జరుగుతుంది. సరైన విధానాలు అమలు జరుగుతాయి. జాతి సంక్షేమం సరైన మార్గంలో జరుగుతుందని మనవిచేస్తున్నాను. ఈనాడు వారు చెప్పిన అభిప్రాయాలూ వివరంగా స్వీకరించబడ్డాయి.

కాబట్టి, వచ్చే సంవత్సరం ఏర్పరచబోయే ప్రభుత్వ విధానం, వివరాలలో సలహా సంప్రదింపులు, అభిప్రాయాలన్నీ కూడా ఆలోచించబడతాయని, ప్రభుత్వపరంగా ఈ సభా మనిషిగా, మీ వారిగా తమ ద్వారా అందరికీ నేను సుస్పష్టం చేస్తున్నాను. ముఖ్యంగా కొన్ని విషయాలు చెప్పవలసి ఉంది. ఈనాడు ప్రభుత్వం ఏమిటి? ఏ విధంగా సాగుతున్నది? తెలియనిది కాదు పెద్దలందరికీ ఈ రోజున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయ బాధ్యత, మన రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత ఒకసారి కనుక ఆలోచించగలిగితే, ఈనాడు రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణ ఏమిటి? కేంద్ర ప్రభుత్వం బాధ్యత ఏమిటి? ఈ ఫెడరల్ సిద్ధాంతపరమైన రాజ్యాంగ విధానంలో, ఏ విధమైన వ్యవస్థ జరగాలనేది మీరే సూచించారు, నేను విన్నాను.

ముఖ్యంగా ఫెడరల్ సిద్ధాంతపరమైన వ్యవస్థలో భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడినటువంటి ఈ వివిధ రాష్ట్రాల సమన్వయ భావంతో ఐక్యతతో కేంద్ర ప్రభుత్వం ముందుకు నడవాలన్నది సుస్పష్టం. కాబట్టి, నేను మనవిచేస్తున్నాను. ఈనాడు ఏది అడిగినా కేంద్ర ప్రభుత్వాన్ని మేము ఏదో కోపంతోనో, ద్వేషంతోనో అడుగుతున్నామని భావించడం సబబు కాదని సుస్పష్టం చేస్తున్నాను. మన బాధ్యత అది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఈనాడు అఖిల భారతంలో తనవంతు ధర్మాన్ని తాను నిర్వర్తిస్తోంది. అమ్మకూడా అన్నం పెట్టమని అడగందే పెట్టదు. మాబాధలు మన అన్న దగ్గరో, అమ్మ దగ్గర చెప్పుకోక ఎవరిదగ్గర చెప్పుకుంటాము? కాబట్టి, ఏదైనా సంక్షేమం జరిగితే కేవలం జాతికి అంతటికీ జరుగుతుంది గానీ అడిగిన వారికో, మరొకరికో, ఏ వర్గానికో, ఏ పక్షానికో కాదని నేను సుస్పష్టం చేస్తున్నాను. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం కూడా ఏది అడిగినా ఈనాడు ఒక పక్షపాత రహితమైన ఉద్దేశ్యంతో, బుద్ధితో ఇవ్వడం సంప్రదాయం కావాలి గానీ కేవలం 10 మంది అనుకునే విధంగా వ్యవహరించడం గానీ 10 మంది విమర్శించేటటువంటి పద్ధతిలో విచక్షణ చూపడం కానీ మర్యాద కాదని నేను సవినయంగా మనవిచేస్తున్నాను.

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఈనాడు అఖిల భారతంలో తనవంతు ధర్మాన్ని తాను నిర్వర్తిస్తోంది. అమ్మకూడా అన్నం పెట్టమని అడగందే పెట్టదు. మాబాధలు మన అన్న దగ్గరో, అమ్మ దగ్గర చెప్పుకోక ఎవరిదగ్గర చెప్పుకుంటాము. కాబట్టి, ఏదైనా సంక్షేమం జరిగితే కేవలం జాతికి అంతటికీ జరుగుతుంది గానీ అడిగిన వారికో, మరొకరికో, ఏ వర్గానికో, ఏ పక్షానికో కాదని నేను సుస్పష్టం చేస్తున్నాను.**

మరి దేశసమైక్యతను కోరే మనిషిగా గౌరవసభ్యులు చెప్పారు. మిగతా రాష్ట్రాలకు ఎంత డబ్బు ఇచ్చారు? మిగతావాటికి ఏ విధమైన వనరులు ఇచ్చారని అడుగుతున్నాను? కాబట్టి ఇది మీకే తెలుసు. ఈనాడు పార్టీ సిద్ధాంతపరమైన విధానాలతో నిర్ణయంతో ఏ విధంగా వ్యవహరించబడుతున్నదో ఒకసారి గుర్తు చేసుకోవాలని నేను వారికి సవినయంగా మనవిచేస్తున్నాను. ఈ రోజున ముఖ్యంగా, కేంద్ర ప్రభుత్వం ఒకప్పుడు వారికి ఫారిన్ పాలసీలో,

డిఫెన్సు లేక, కమ్యూనికేషన్ మరి ఇత్యాది అన్నీ కూడా జాతీయ పరంగా నిర్ణయించబడినటువంటి కార్యక్రమం ఉద్దేశించబడినప్పుడు, ఈ రోజున ఏ విధంగా ఒకప్పుడు స్టేట్ లిస్టులో ఉన్నాకూడా కాంకరెంటు లిస్టులో చేర్చబడక పోతున్నాయి. ఏ విధంగా రాష్ట్రాలు రోజురోజుకు వాటి అధికారాలు కుంచించుకుపోతున్నాయి? ఏ విధంగా ప్రతి దానికి-చెట్టుకు, పుట్టకూ, గుట్టకూ, నీటికీ, ప్రతిదానికి కూడా కేంద్ర ప్రభుత్వం దగ్గర చేయి చాచి అడిగేటటువంటి దౌర్భాగ్య పరిస్థితి రాష్ట్రాలకు ఏర్పడిందో ఒకసారి గమనించవలసి ఉంటుంది. చూడవలసి ఉంటుంది.

ఇదేనా మన రాజ్యాంగ స్రష్టలు, రచయితలు కోరిన విధానం? ఇదేనా ఈ దేశం ఉండవలసిన పద్ధతి అని కూడా నేను మీకు సుస్పష్టం చేయవలసి ఉంటుందని తమకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను. పూజ్యనీయులు, పెద్దలు, ప్రముఖులు, విజ్ఞానవేత్తలు, కీర్తి శేషులు, మన ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ గారు 1983వ సంవత్సరంలో వారిని దర్శించడానికి వెళ్ళినప్పుడు, వారికి ఆనాడే నేషనల్ ప్రాజెక్టు క్రింద తీసుకోండి పోలవరం, కేవలం ఒక స్టేటు దీన్ని ప్రారంభించలేదు ఈనాడు మనకున్న ఆర్థిక వనరులు చాలవని నేను వారికి మనవిచేశాను. గౌరవ సభ్యులందరి దగ్గర కూడా ఒకసారి, రెండుసార్లు కూడా ప్రత్యేకంగా దీనిని చెప్పడం జరిగిందని కూడా నేను గుర్తుచేస్తున్నాను. ఆనాడు ఆ విధంగా చెప్పినటువంటి తెలుగుగంగ కేవలం ఒక్క వ్యవసాయానికి కాదు. కూటికీ, నీటికీ కరువైన రాయలసీమ వాస్తవ్యులకు పూర్తిగా నిర్దేశించబడ్డ ఆ కార్యక్రమం, మరి దానితోబాటు మద్రాసు వాస్తవ్యులకు మానవత్వంతో ఇవ్వదలచిన మంచినీరు, ఇదివరకు ప్రభుత్వాలు చేసుకున్నటువంటి వారి ఒడంబడిక ప్రకారం తెలుగుదేశం ప్రభుత్వం వారు గౌరవించి ఇచ్చినటువంటి నీటిసరఫరా విధానాలను గానీ, అదేవిధంగా రాజస్థాన్ కాలువ,

ప్రత్యేకంగా ఎడారిగా ఉన్న దానిని ఆ నీటిని ప్రజలకు పోయేటటువంటి ప్రజా ప్రాజెక్టు క్రిందగానీ, జాతీయ ప్రాజెక్టు క్రింద గానీ ఏర్పరచకుండా ఈనాడు కేవలం సట్లైజ్ యమున లింకు కెనాల్ మాత్రం ఎందుకు జాతీయ ప్రాజెక్టుగా ఏర్పరచారో? మాట ఇచ్చారో, నాకు అర్థం కావడం లేదని నేను సుస్పష్టం చేస్తున్నాను. ఈనాడు వరదలు విషయం చెప్పారు. గౌరవ సభ్యులందరికీ నేను సవినయంగా మనవిచేస్తున్నాను. వారు మన అతిథి, ఊహించాము, మనకు జరిగినటువంటి నష్టం చెప్పాను. మనకు ఉన్నటువంటి కష్టం వారు స్వయంగా చూశారు. వచ్చినప్పుడు వారికి మొఖం ఎత్తేసి ఇదంతా అడగడం నా ధర్మం కాదు? ఎందుకంటే, డిపార్టుమెంట్ ఉన్నది. నష్టం ఎంత అయిందో తయారు చేశారు.

'మెమోరాండం వారు తయారుచేస్తారు. ఇచ్చిన దాని ప్రకారం సరైనటువంటి సమగ్రమైన సహాయం కలగాలి గానీ కేవలం నేను ఏదో బేరీజు వేసి చెప్పడం, వారు ఏదో ఉద్దేశ్యపూర్వకంగా ఇవ్వడం కాదు, ఎవరూ, ఎవరి సొత్తు ఎవరికీ ఇవ్వలేదు. ఇది జాతీయ పూర్వకమైన ఆర్థిక

విధానం. కాబట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున అడిగే హక్కు నాకు ఉంది. వారే అన్నారు. ఎంతగా ఇవ్వాలని అన్నారు కూర్చోబెట్టి అడగడం, జేబులు తట్టడం నా ఆచారం కాదు, అది తెలుగు జాతీయతా కాదు. కాబట్టి నీ ఇష్టం వచ్చింది ఇవ్వమని అన్నాను. రూ.50 కోట్లతో సరిపోయే దురదృష్టం నాకు లేదు. లేకపోతే, ఇప్పుడు ఇచ్చిన రూ.132 కోట్లు అందులో రూ.90 కోట్లు కలిపితే ఈరోజు కేవలం 99 కోట్లు సుమారు వస్తే, మేము 1660 కోట్లు సుమారుగా నష్టం అంచనా వేస్తే, ఇప్పుడు సుమారుగా 1260 కోట్లు కావాలని సహాయాన్ని నోరు తెరిచేసి అడగడం ధర్మం కాదా? అని ఈనాడు గౌరవ సభ్యులందరినీ, సోదరులను తమద్వారా అడుగుతున్నాను.

ఈనాడు 99 కోట్లు వచ్చిందని వాపోయే మనిషిని నేను కాదు, డబ్బు ఖర్చు పెట్టడం ప్రజాసంక్షేమంగా చూడడం నా బాధ్యతగా నేను ఆశిస్తున్నాను. ప్రభుత్వ ధర్మంగా ప్రత్యేకంగా రైతుజన సంక్షేమం చూడడం నా కర్తవ్యంగా నేను భావిస్తున్నానని సవినయంగా మనవిచేస్తున్నాను. కాబట్టి, మీ మనసుల్లో ఉన్నటువంటి ఆ పద్ధతి తీసివేసి ఈ రోజున జాతి గౌరవాన్ని అమ్ముకునే దురదృష్టం నాకు కలుగలేదని సుస్పష్టం చేస్తున్నాను. అందుకే ఎన్నోసార్లు చెప్పాను. గోదావరి కరకట్టలకు 260 కోట్లు అయితే గానీ ఈనాడు గోదావరి ఆనకట్ట మీద ఉన్న 22 అడుగుల వరద నీటిమట్టానికి సరైన కరకట్టలు కట్టుకోలేమని ప్రాజ్ఞులు చెప్పుతున్నారే, అది గోదావరి డెల్టా ప్రాంతానికి సంభవించిన నష్టానికి కేటాయించింది అయితే దాని నష్టం పూర్తి చేసుకోవాలని చెప్పుతున్నారే, దానిలో ఇన్ని నష్టాలు కళ్ళముందున్నప్పుడు కేవలం దీనితో సరిపెట్టుకోవడం అనేది ఈనాడు ధర్మం కాదు, ఆచారం కాదు; కాకూడాదని నేను సుస్పష్టంగా చెప్పుతున్నాను.

కాబట్టి మన సమాజం, మన దేశం ఈ విధంగా ఉన్నదని మాత్రం మరొక్కసారి మీ గమనానికి నేను తెస్తున్నాను. ఇది దేశ సమన్వయతా కాదు, సమైక్యతా భావం కాదని కూడా మీకు నేను సుస్పష్టం చేస్తున్నాను. పోతే, ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వంను అసెస్‌మెంట్, ఎంటర్‌టైన్‌మెంట్ టాక్సెస్, జనరల్ సేల్స్ టాక్సులలో ఇంక్రీజ్ అడుగుతున్నాము, మార్కెటింగ్‌లో కట్ చేశారు. ఇదివరకు స్మాల్ సేవింగ్స్‌లో రెండు వంతుల భాగం వచ్చేది. ఈనాడు దాన్ని తీసేసి కేవలం స్పెషల్ డిపాజిట్ స్కీముతో ఎప్పటికప్పుడు ఏదో కల్పించి కేవలం రాష్ట్ర ప్రభుత్వాలను ఈనాడు దరిద్రులను చేయాలని పూనుకుంటే దీనిలో మనందరి బాధ్యత కాబట్టి, మీరు పూర్తిగా గమనించండి? న్యాయాన్ని పేద ప్రజలకు చేయండని మనవిచేస్తున్నాను.

ఈనాడు ముఖ్యంగా గవర్నరుగారు చెప్పినటువంటి ప్రసంగము మీద ఉపన్యసిస్తున్నారు. పెద్దలు శ్రీ బాగారెడ్డి గారు, శ్రీ రాఘవ రెడ్డిగారు, శ్రీ చినమల్లయ్యగారు, నాయిని నరసింహారెడ్డి గారు, శ్రీ ఓంకార్ గారు, రాజేశ్వరరావుగారు, శ్రీ విద్యాధరరావుగారు, శ్రీ విజారత్ రసూల్‌ఖాన్ గారు, శ్రీమతి రాజాన రమణిగారు, శ్రీ సమర సింహారెడ్డిగారు, శ్రీ వెంకటపతిగారు, శ్రీ ఇంద్రసేనారెడ్డిగారు, శ్రీ అమరనాథ రెడ్డిగారు మీరందరూ కూడా సరైనటువంటి భావంతో

ప్రసంగాలు చేశారు. వారికి నేను సవినయంగా మనవిచేస్తున్నాను. వివరాలతో కూడినది కాదది. కేవలం ప్రభుత్వం యొక్క విధానాన్ని వివరించేటటువంటి పాలసీ స్టేట్‌మెంట్ మాత్రమేనని వారికి నేను సవినయంగా తెలియజేస్తున్నాను. ఈనాడు ఇచ్చిన ఊహలతో, సరైన వివరాలతో రేపు బడ్జెట్ ప్రవేశ పెట్టబడుతుంది. దాని విషయం ఆలోచించబడుతుందని కూడా నేను సమన్వయ భావంతో వారికి సవినయంగా మనవిచేస్తున్నాను. కేవలం ఇది ఈనాడు అందరూ కూడా నిరసించవలసిన విషయము. మోకరింగ్ ప్లానింగ్ అని ఎవరో ఒక ప్రముఖుడు అన్నారు.

మరి కేంద్ర ప్రభుత్వంలో ప్లానింగ్ బోర్డు ఉండగా, ఈనాడు సెంట్రల్ డివల్యూషన్, సెంట్రల్ పూల్ ఉండగా, ఈనాడు రాష్ట్రాల నుంచి ఆదాయం వస్తూ ఉండగా ఏ రాష్ట్రానికి సంబంధించినంత సహకారం కానీ, సహాయం ఇవ్వాలి కానీ కేవలం ఈనాడు మీరు నన్ను అడిగారు. జూరాల ప్రాజెక్టుకు సెంట్రల్ వాటర్ క్లియరెన్స్ రాలేదు. అదే విధంగా శ్రీశైలం ఎడమ కాలువకు సెంట్రల్ వాటర్ క్లియరెన్స్ రాలేదు. తెలుగుగంగకు సెంట్రల్ వాటర్ క్లియరెన్స్ రాలేదు. ఇచ్చంపల్లికి సెంట్రల్ క్లియరెన్స్ రాలేదు, పోలవరంకు సెంట్రల్ క్లియరెన్స్ రాలేదు. వంశధార రెండవ దశ నిర్మాణానికి సెంట్రల్ క్లియరెన్స్ రాలేదు. ఇవన్నీ ఏమి చేయమంటారో వారినే చెప్పమనండి. కేంద్ర ప్రభుత్వం యొక్క దయాభిక్ష మీద ఆధారపడిన వాళ్లం గనుక ఈనాడు ఏమి జరుగుతున్నా సరిపెట్టుకొని, ఉండవలసి వచ్చిందని మనవిచేస్తున్నాను. కేవలం రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమే ఈ జాగు కాదని అందరికీ నేను సుస్పష్టం చేస్తున్నాను.

> **గౌరవనీయ సభ్యులు రాజేశ్వరరావుగారు చెప్పారు. సోషల్ జస్టిస్ మరియు సోషల్ వెల్ఫేర్ రెండూ భేదమని, మరి వారి పార్టీ సిద్ధాతం అది, మా పార్టీ సిద్ధాంతం ఇది. సోషల్ వెల్ఫేర్‌లోనే సోషల్ డెవలప్‌మెంట్ ఉన్నదని నేను సుస్పష్టం చేస్తున్నాను. డెవలప్‌మెంట్ విషయానికివస్తే నాగార్జునసాగర్ నుంచి నీరు తీసుకొనే రైతుల సంగతి ఆలోచిస్తే ఆ నాగార్జున సాగర్ ఆనకట్టి కట్టిన ఆ పేదవాడి సంగతి ఎవరు ఆలోచిస్తారు?**

నేచురల్ కెలామిటీస్ – వరద వచ్చినా, ఈనాడు ఈతి బాధలు, కరువు వచ్చినా మనకు చెప్పి వచ్చిందా? వరుసగా నాలుగు సంవత్సరాలు వానలే లేకుండా అలమటించిపోతున్నారే. ఇలాంటి కరువు వచ్చినా, కాటకాలు వచ్చినా, ఈతి బాధలు వచ్చినా ఈ బాధ్యత ఎవరిది? కేవలం ఇది నివారించడం మన జాతీయ ప్రభుత్వ ధర్మము కాదా అని అడుగుతున్నాను. కేవలం ఈనాడు అన్నింటినీ కూడా జానెడు గోచిలోనే ముడిపెట్టుకోవలసిన ఈ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నిటికని సమాధానం చెబుతుంది? ఎన్నని చేస్తుంది? ఒకసారి దయచేసి ఆలోచించ వలసిందిగా సర్వులను కోరుతున్నాను నేను మీకు మనవిచేస్తున్నాను. మరి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన విధానాన్ని కూడా ఈ సందర్భంలో గుర్తు చేయడం మంచిది. మరి గౌరవనీయ సభ్యులు రాజేశ్వరరావుగారు చెప్పారు. సోషల్ జస్టిస్ మరియు సోషల్ వెల్ఫేర్ రెండూ భేదమని, మరి వారి పార్టీ సిద్ధాంతం

అది, మా పార్టీ సిద్ధాంతం ఇది. సోషల్ వెల్‌ఫేర్‌లోనే సోషల్ డెవలప్‌మెంట్ ఉన్నదని నేను సు-స్పష్టం చేస్తున్నాను. డెవలప్‌మెంట్ విషయానికివస్తే నాగార్జునసాగర్ నుంచి నీరు తీసుకొనే రైతుల సంగతి ఆలోచిస్తే ఆ నాగార్జున సాగర్ ఆనకట్టి కట్టిన ఆ పేదవాడి సంగతి ఎవరు ఆలోచిస్తారు? మరి దాని నీరు ఏ 30, 35 సంవత్సరాలకో ఆ ప్రాజెక్టు నీరు పేద వ్యవసాయదారుడి చేనుకు ప్రవహిస్తే అంతవరకు 35 సంవత్సరాలు నోరు తెరుచుకొని చూడవలసిందేనా? అదేనా వాడిగతి? అదేనా రాష్ట్రాభివృద్ధి? అదేనా సర్వజన సంక్షేమం? అదేనా సామాజికపరమైన న్యాయం? పేదవాడి సంక్షేమం చూడవలసింది తెలుగుదేశ ప్రభుత్వం యొక్క విధానంగా నేను మనవిచేస్తున్నాను.

నేను మీ విధానాన్ని తప్పు అనడం లేదు. ఈ విధానం తెలుగుదేశ ప్రభుత్వ విధానంగా మాత్రం నేను సుస్పష్టం చేస్తున్నాను. ఇది కేవలము మన రాష్ట్రమే కాదు, అన్ని రాష్ట్రాలూ చెప్పుకొంటున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో రెండు రూపాయలకు కిలో బియ్యం ఇవ్వగలిగినప్పుడు మీరు ఎందుకు ఇవ్వలేక పోతున్నారని అడుగుతున్నారు. మన నాయకులను ఈ రోజున అడుగుతున్నారు. పేదరికం అన్నది అందరికీ ఒక్కటే. జాతిపరంగా పేదరికం అందరికీ ఒకటే. ఆ పేదరికాన్నీ నివారించడానికి ఎప్పుడో వేళ్లు లెక్క పెట్టుకొంటూ కూర్చునేకంటే ఈనాడు విస్తరిలో భోజనం చేయడం సర్వత్రా సంతోషము గదా. కాలే కడుపుకు పొట్ట నింపడం మన ఆచారం కాదా, ధర్మము కాదా అని అడుగుతున్నాను. ఈరోజున గుడ్డలు లేక మానం కప్పుకోలేని స్థితిలో ఆడబడుచులు ఉంటే 50 శాతం సబ్సిడీకి బట్ట ఇస్తున్నాము. మరి ఎప్పుడో మగ్గాలు లేకపోతే మరొక పరిశ్రమలు పెట్టాలి. అంతవరకు బాధపడాలని నేను అనడం లేదు.

ఈరోజు పేదప్రజానీకం ఏ స్థాయిలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారో వారి ప్రతినిధులుగా మనము ఉన్నాము. పేదరికాన్నీ మనం రూపు మాపాలనుకుంటున్నామో అలాంటి పేదరికాన్ని ఏ విధంగానైనా రూపు మాపితే పేదవానికి క్షేమం కలుగుతుంది. పేదరికాన్ని మరచిపోతారనే ధ్యేయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతున్నది. కానీ ఈ విషయాన్ని అమర్త్యకుమార్ సేన్ గారు ప్రత్యేకంగా అభినందించారు. అమర్త్యకుమార్ సేన్ గారు మా మనిషి కాదు. మనరాష్ట్ర మనిషి కాదు.

ఇదే ముఖ్యంగా రెండు రూపాయలకు కిలో బియ్యము స్కీము కానీ, ఇంకా ఇలాంటివి అత్యుత్తమమైన మార్గాలని వారు కూడా అభినందించారు. వారన్నట్లు స్ట్రక్చరల్ ఛేంజ్ రావాలంటే సిద్ధాంతం వేరు. మరి రోజు రోజుకు రక్త విప్లవం వచ్చినప్పుడు స్ట్రక్చరల్ ఛేంజ్ వస్తుంది కానీ రాష్ట్ర ప్రభుత్వం వలన అది జరగదు. ఈనాడు ఉన్న పద్ధతి కాదని మనవిచేస్తున్నాను. మీకంటే వేడి రక్తం కలిగినవాడిని, మంచి కోరుకునేవాడిని. ఈనాడు భారత దేశంలో ఉన్న విధానం ఏమిటి? మనకు వచ్చిన స్వరాజ్యం శాంతి సమరం వలన వచ్చింది. సత్యాగ్రహోద్యమము వలన వచ్చింది. ఈనాటికి కూడా అడ్మినిస్ట్రేషన్ విధానము కానీ, ఎడ్యుకేషనల్ విధానంకానీ అన్ని

విధానాలు కూడా మారకపోవడము ఈనాడు దేశానికి పట్టిన దురదృష్టము. ఎప్పుడో జరగవలసింది జరగలేదు. అది కేవలం ఏ విధంగా జరుగుతుందంటే మనకున్న ఈ వనరుల పరిధిలోనే మనము చేయగలుగుతున్నాము. అదే మన సంతృప్తి. ఈనాడు చెప్పే 20 సూత్రాల పథకము విషయములో పుస్తకము ఉన్నది. రెండవ గ్రేడ్‌గా కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రాన్ని అభినందించింది. ఇది అందరూ అభినందించాలి. కానీ కేవలం 20 సూత్రాల పథకం ప్రవేశ పెట్టలేదన్న దానికి కారణాలు చెప్పాము, దేనికి వివరాలు ఇవ్వలేదు. సూచనప్రాయంగా ప్రభుత్వం యొక్క విధానాలు చెప్పాము, వివరాలు ఇవ్వలేదని మనవిచేశాను. ముందే చెప్పాను కావాలంటే వివరాలు తీసుకోండి. ఇది కేంద్ర ప్రభుత్వము ప్రకటించిన ప్లానింగ్ బోర్డు పుస్తకం. మనరాష్ట్ర ప్రభుత్వం అఖిల భారత స్థాయిలో రెండవస్థానం ఆక్రమించుకొంది. ఒక ట్రీప్లాంటేషన్, బయోగ్యాస్, ఐ.సి.డి.ఎస్. ఫ్యాక్టరీలు తప్ప మిగిలినవాటిలో అత్యుత్తమమైన స్థానంలో ఉన్నది. దయచేసి వారు దీనిని గమనించాలని నేను మనవిచేస్తున్నాను.

ఈనాడు మనం సాగించేటటువంటి ప్లాన్ విషయం చూచినట్లయితే ఇరిగేషన్ విషయంలో మరి ఏ విధంగా సాగుతున్నదో 1980-81వ సంవత్సరంలో కేవలము 158కోట్ల 10 లక్షలు ఉంటే. 1984-85వ సంవత్సరములో 249.96 కోట్లు అయింది. 1986వ సంవత్సరంలో 331.64 కోట్లు అయింది. అదే విధంగా పవర్ విషయం ఆలోచిస్తే 1980-81వ సంవత్సరములో 136 కోట్ల 47 లక్షలు ఉంటే 1985-86వ సంవత్సరములో 162 కోట్ల 33 లక్షలు అయింది. 1986-87వ సంవత్సరములో 180 కోట్ల 20 లక్షలు అయింది. మరి ప్లాన్ పీరియడ్‌లో తలసరి ఆదాయం ఎంత పెరిగిందో ఒక్కసారి గమనించవలసిందిగా కూడా నేను సుస్పష్టం చేస్తున్నాను. గౌరవనీయ సభ్యులు కొంత మంది పన్నులు వసూలు కావడం లేదని, ఆదాయం పెరగడం లేదని చెప్పారు. మరి మన జాతీయపరమైన పన్ను కట్టే విధానం 76 శాతం ఉంటే మన రాష్ట్రం 8.7 శాతంలో ఉన్నది. మరి ఏ విధమైన ఆదాయం మన రాష్ట్రానికి పెంచగలమో దయచేసి ఒక్కసారి గమనించమని నేను కోరుతున్నాను. మరి ప్లాన్ విషయము అందరూ చెప్పారు. 1980-81వ సంవత్సరంలో కేవలం 467 కోట్లు ఉంటే 1986-87వ సంవత్సరంలో 1000 కోట్లకు ప్లాన్ పెంచగలిగాము.

ఈ సంవత్సరం ఇంకా ఎక్కువ ప్లాన్ తేవడానికి మేము ఆలోచిస్తున్నామని కూడా మనవిచేస్తున్నాను. ఈ సందర్భంలో నేను రేపు ఢిల్లీ వెళ్లబోతున్నాను. తెస్తాం అంటే తేగలము, ఖర్చు పెడతామంటే ఖర్చు పెట్టగలము. సర్వజన సంక్షేమం, పేదజన ఉద్ధరణము, ఈనాడు బడుగు వర్గాల, బలహీన వర్గాల, వెనుకబడిన తరగతుల వారి సంక్షేమం చేయగలము. వారికిచ్చిన హామీలు నిలబెట్టగలమనేటటువంటి ఆత్మత్యాగం నా మనసులో ఉందని, నేను మీ మనిషిగా స్పష్టం చేస్తూ, నన్ను బలపరచవలసిందిగా మిమ్ములను అందరినీ కూడా కోరుతున్నాను. మరి

ఈనాడు అభివృద్ధిలో ముఖ్యంగా మూడు భాగాలు ఉన్నాయి. వ్యవసాయం ఒకటి, తరువాత పవర్, ఇండస్ట్రీస్, దాని తరువాత సాంఘిక సంక్షేమం, ఇవి ముఖ్యమైన విషయాలుగా ఈనాడు ప్రభుత్వం ప్రకటిస్తోందని మీకు నేను మనవిచేస్తున్నాను మరి ఇన్ని బాధలు ఉన్నప్పటికీ సెంట్రల్ వాటర్ కమిషన్ ఇంతవరకు అంగీకరించనప్పటికీ తెలుగుగంగకు రూ.100 కోట్లు ఈనాడు మంజూరు చేశామని అంటే ఉండి కాదు, చేయగలమనే ధైర్యం చేత, గుండె నిబ్బరం చేత, మెరక ప్రాంతాలుగా ఉన్నటువంటి రాయలసీమ వాసులకు నీరు ఇవ్వాలి అని.

ఈనాడు మద్రాసు సంగతి నేను చెప్పడం లేదు. రాయలసీమకు ముఖ్యముగా నీరు అందివ్వాలి. వారి వ్యవసాయానికి, త్రాగడానికి గుక్కెడు నీరు ఇవ్వకపోతే ముఖ్యముగా వారికి ఇచ్చిన హామీలు, వారి సోదరత్వాన్ని నిలుపుకున్న వాడిని నేను కాదు: ఇది నా ప్రభుత్వమే కాదనేటటువంటి పరిశుద్ధమైన ఆకాంక్షతా భావము నా మనస్సులో ఉంది. దానికి కూడా మీ సహాయం కావాలని చెప్పి నేను సుస్పష్టము చేస్తున్నాను. మరి అదే విధంగా ఈనాడు శ్రీశైలం ఎడమ కాలువకు రూ.100 కోట్లు మంజూరు చేశామన్న సంగతి మనందరం గుర్తించిన విషయమే. ఇదివరకు అపోజిషన్ పార్టీస్‌తో మీటింగ్ పెట్టాము, వారు రెగ్యులేటర్ కట్టిన తరువాత మీరు ఏమైనా ఆలోచించవచ్చు అన్నారు. రెగ్యులేటర్ కట్టకపోతే అనుమానపడతాము, ప్రజలు అనుమానపడుతున్నారు అంటే రెగ్యులేటర్ కట్టాము. రెగ్యులేటర్ కట్టిన తరువాత శ్రీశైలం కుడి కాలవలో నీరు పారుతూ సస్యశ్యామలమైన మెరక మాగాణిని చూచినప్పుడు మరి ఎడమ కాలవ వైపు ఉన్న రైతులు ఏమి అనుకుంటారో ఒకసారి దయచేసి ఆలోచించమని సభ్యులకు మనవిచేస్తున్నాను. కామన్ కెనాల్ త్రవ్వాము. త్రవ్విన దానికి కేవలం నీరు అందించాలి. ఎంతో అంత నీరు పెడుతూ ఉంటే ఆ పేదవారి హృదయాలు సంతోషిస్తాయి.

కాబట్టి ఇరిగేషన్‌కు నీరు అందించాలి. రేపు టన్నెల్ త్రవ్వుతాము, త్రవ్విన తరువాత ఇరిగేషన్ మూసేస్తాము, లేదంటే ఈనాడు అనుకుంటున్నాము దానికి పథకం చేసుకోడానికి ఆలోచిస్తాము తప్ప అది వృధా కాదు. 10, 15 ఏళ్ళు వేచి ఉంటే కష్టమనే ఉద్దేశముతో, కేవలం ఈ ఋతువులోనే నీరు ఇవ్వకపోతే అది మంచిదికాదని నేను హృదయపూర్వకంగా భావిస్తున్నాను. మెరక ప్రాంతాలుగా ఉన్నటువంటి తెలంగాణా జిల్లాలను సస్యశ్యామలం చేసినట్లు అవుతుందని తెలుగుదేశం ప్రభుత్వం సుస్పష్టముగా భావిస్తోందని మీకు నేను మనవిచేస్తున్నాను. గౌరవసభ్యులకు తెలుసు ఈనాడు గుంటూరు, ప్రకాశం జిల్లాలలో టెయిల్ ఎండ్ భూములకు నీరు అందకుంటే సప్లిమెంటరీ స్కీమ్స్, 91 స్కీమ్స్ వారు ఇప్పటికే ఇన్‌వెస్టిగేట్ చేసి సిద్ధముగా ఉంచారు. ఒక లక్షా ఇరవై వేల ఎకరాలు దాని వల్ల సాగవుతుంది. మరి అది ఆలోచించినప్పుడు న్యాయం చేయడం మన ధర్మం. టెయిల్ ఎండ్ భూములకు నీరు వెళ్లడం లేదు. సప్లిమెంటరీ స్కీమ్స్ ఇవ్వకపోతే ఎలా అని ఆ రైతులు మొర పెడుతూ ఉంటే వెంటనే రు. 16 కోట్లు మొత్తం 91 స్కీమ్స్ మంజూరు

చేయడం జరిగింది. అంతేకాకుండా రూ.4 కోట్లు ప్రత్యేకంగా డిసిల్టింగ్ ప్రొగ్రామ్‌కి అక్కడ ఉన్నటువంటి మెరక పూడిక తీసికొనే విధానంలో పూర్తిగా సగభాగం వారు కృషి చేసినట్లయితే ఆ మేరకు తీసుకోడానికి లైనింగు వేసుకోడానికి పూర్తిగా ప్రభుత్వం ఇస్తుంది. ఈ విధమైన పద్ధతిమీద నిర్ణయం తీసుకోవడం జరిగిందని మనవి చేస్తున్నాను.

మరి ఈనాడు గౌరవ సభ్యులు మహబూబ్‌నగర్ విషయం ప్రస్తావించారు. నేను మీతో నా సానుభూతిని ప్రకటిస్తున్నాను. ఎక్కడ ఏ బాధ జరిగినా, ఏ కష్టం జరిగినా దానిని విస్మరించేటటువంటి మూర్ఖుడను మాత్రము కాదు. మీరు ఇచ్చిన సలహాలతో ఏకీభవిస్తున్నాను. మీరు డబ్బు ఇంకా ఇవ్వమన్నారు. వెంటనే నేను వ్యవసాయానికి జూరాల ప్రాజక్ట్‌కు మంజూరు చేశాను. జూరాలే కాదు, తెలుగుగంగే కాదు, మరి ఎక్కడైనా సరే పని లేదనే వారికి అందరికీ కూడా పని ఇవ్వాలి. పనిలో చేర్చుకోవాలి; సరైనటువంటి, ప్రభుత్వం నిర్ణయించినటువంటి భృతి ఇవ్వాలి. రెండు రూపాయల కిలో బియ్యం వారికి అందచేయాలి. ఇదే దేశ సంక్షేమం, ఇదే రాష్ట్ర ప్రభుత్వం యొక్క ఉద్దేశముగా నేను మీకు సవినయముగా మనవిచేస్తున్నాను. ఈనాడు గౌరవసభ్యులు ఏదో పురుగు పట్టిన బియ్యం చూశాము అన్నారు. నేనూ చూశాను. ఇది మేము ఇచ్చినది కాదు, పంజాబ్ నుంచి కేంద్ర ప్రభుత్వం పంపించింది.

*(షేమ్ షేమ్ అని అధికారపక్ష సభ్యులు అరిచారు)*

గిరిజన ప్రజానీకం వెళ్ళినప్పుడు వారందరూ బంగారంలాంటి రెండు రూపాయల కిలో బియ్యం తింటున్నామని అంటే, మా మీద ఏదో పగతో మేము రూ.1-35 పైసలకు ఇస్తూ ఉంటే మీరు రెండు రూపాయలు కిలో బియ్యం అని ఏదో మభ్య పెడుతున్నారు అన్నారు. మాది ఏమీ లేదు దయచేసి మీరు పంపించండి మేము ఇస్తాము అన్నాము. వారు పంపించారు మేము ఇచ్చాము. వారు తినం అన్నారు. వారు కట్టలు కట్టి మా నెత్తిన పడేశారు. మేము అదే తీరులో పంపించాము. ఇక్కడ ఈ రాష్ట్రంలో ఉండే బియ్యం అనవసరముగా ఇంకో రాష్ట్రానికి పంపించడం ఎందుకు, ఆ రాష్ట్రంలో ఉన్నటువంటి బియ్యాన్ని రవాణా ఖర్చులు కూడా పెట్టి మా రాష్ట్రానికి పంపించడం ఎందుకు? ఇది అంతా అనవసరం. దయచేసి నాకు ఈ విషయములో పూర్తిగా సహకరించాలి. ఈనాడు ఏ గిరిజనుడైతే అమాయకుడో, అజ్ఞానుడో అని గుర్తించి అటువంటి పురుగు పట్టిన బియ్యం తినండని ఇవ్వడం వల్ల పాపం ఒడిగట్టుకుంటున్నాము, అటువంటి పాపం నుండి ఈ సమాజాన్ని, ప్రభుత్వాన్ని దయచేసి కాపాడవలసిందని సర్వులకు నేను విజ్ఞప్తి చేస్తున్నాను.

మరి అదే విధంగా ఈనాడు ప్రపంచములో ఎక్కడా తీసుకోనిది ఫార్మర్స్ కౌన్సిల్ కర్షక పరిషత్తు. కేవలం ఒక పిన్ను తయారుచేసుకొనే పారిశ్రామికుడు తన యొక్క ఉత్పత్తి ధరను తానే నిర్ణయించుకోగలిగినప్పుడు ఈ రైతులు అహర్నిశలు రెక్కలు ముక్కలు చేసుకొని అన్నదాతలుగా

వ్యవహరించే వారికి ఆ విధమైన స్థితి లేకుండా ఎందుకు ఉండాలి? అందుకు వారికే అధికారం ఇవ్వాలి. ఏ విధమైన పంట వేసుకోవాలో, ఏ విధంగా దానిని పరిష్కరించుకోవాలో, ఏ విధంగా పేద ప్రజానీకాన్నీ ఆదుకోవాలో, ఏ విధంగా ప్రోత్సహించుకోవాలో అనే విధానాలను వారి భాగస్వామ్యంతో పరిపూర్ణమైనటువంటి స్వాతంత్రోద్దీపితమైనటువంటి కర్షక శక్తిని కూడాకట్టుకోవాలని, మన రైతుల అభ్యుదయమే ఈ నిర్ణయం చేయించిందని మీకు నేను సుస్పష్టము చేస్తున్నాను. దీనివల్ల రైతుల గౌరవం పెరిగింది.

రైతు మనిషిగా గుర్తించబడుతున్నాడు. మరి ఇంతవరకు ఎందుకు గుర్తించబడలేదు. పల్లెటూళు ళ్ళ ఎందుకు స్మశానాలుగా అయిపోయాయి? రోడ్లు లేవు. రవాణా సౌకర్యాలు లేవు, స్కూల్స్ లేవు. ఏమీ లేవు లేవు అనే దానిలో ఇబ్బంది పెట్టి వారిని కూలగొట్టేదానికంటే మధ్య ఉన్నటువంటి దళారీల నోటికీ అప్పచెప్పే దాని కంటే, పూర్తిగా వారికి స్వతంత్రమైనటువంటి, విప్లవోద్దీపిత మైనటువంటి భాగస్వామ్యము కల్పించడం, వారి ప్రాతినిధ్యముతో ఈనాడు ఆంధ్రప్రదేశ్ ఉండాలి, పరిమళించాలి అనేటటువంటి భావనలో ఈనాడు కర్షక పరిషత్తు బిల్లు ప్రవేశపెట్టడం జరుగుతోందని మీకు నేను సుస్పష్టము చేస్తున్నాను. అదే విధంగా సింగిల్ విండో సిస్టమ్. ఏదైనా సరే ఇంతవరకు డబ్బు కావాలంటే తాకట్టు పెడితే కానీ బ్రతకలేని బ్రతుకుభారం ఈ దేశములో ఏ విధంగా ఉందో ఒకసారి ఆలోచించమని మనవిచేస్తున్నాను.

**మీరంతా నా అన్నలు, తమ్ముళ్ళు, ఈ మంచి అభిప్రాయాలు విధానాలు చక్కగా అమలు పరిచే దానికి సహాయపడాలి. ఈనాడు ప్రభుత్వం ఏదైనా, రాజకీయం ఏదైనా, పార్టీలు ఏవైనా మనందరం ఒక్కటే. ఈనాడు శాసనసభ్యులు. మీ అందరి నమ్మకాన్నీ, విశ్వాసాన్ని చూరగొన్న మనిషి నేను. కాబట్టి నా బాధ్యతలో ఏమాత్రమూ కళంకము లేకుండా నిర్వహించేటట్లు చేయవలసిందిగా సభ్యులను కోరుతున్నాను.**

రైతు ప్రతినిధులు మీరు ఎంతో మంది ఉన్నారు. వారి ఆస్తి తాకట్టు పెట్టకుండా డబ్బు ఇవ్వనటువంటి అగౌరవమైన విధానాన్ని తగ్గించాలి. వారికి అన్నీ ఒకేచోట లభించాలి. పాస్‌బుక్‌లో వివరాలు ఉండాలి. పాస్‌బుక్ తీసుకొని పెడితే వారికి కావలసిన వనరులను సమీకరింపు చేయాలనే భావముతో సింగిల్ విండో సిస్టమ్ ప్రవేశ పెట్టి తెలుగుజాతి ఆత్మ గౌరవాన్ని ఇనుమడింపచేసింది. మన తెలుగుదేశం ప్రభుత్వమని మీకు సుస్పష్టము చేస్తున్నాను. కాబట్టి సోదరులారా ఏమైనా సరే పొరపాట్లు ఉండవచ్చు. మంచి పనిని మంచి పనిగా గుర్తించండి. పొరపాట్లు ఉంటే దిద్దండి. మీరు ప్రజా నాయకులు, ఈనాడు సివిల్ సప్లయిస్ విధానములో, ఫుడ్ కమిటీస్‌లో మీరంతా భాగస్వాములు. మీరు కూడా ఉన్నారు. ప్రభుత్వం అంటే మాదే అనడం లేదు. అందరూ మా వారు. మీరంతా నా అన్నలు, తమ్ముళ్ళు, ఈ మంచి అభిప్రాయాలు విధానాలు చక్కగా అమలు పరిచే దానికి సహాయపడాలి. ఈనాడు ప్రభుత్వం ఏదైనా, రాజకీయం ఏదైనా, పార్టీలు ఏవైనా మనందరం ఒక్కటే. ఈనాడు శాసనసభ్యులుగా,

మీ అందరి నమ్మకాన్నీ, విశ్వాసాన్ని చూరగొన్న మనిషి నేను. కాబట్టి నా బాధ్యతలో ఏమాత్రమూ కళంకము లేకుండా నిర్వహించేటట్లు చేయవలసిందిగా సర్వులను కోరుతున్నాను.

గౌరవనీయులు రాజేశ్వరరావుగారు ఏదో అవినీతి, అక్రమం చొచ్చుకున్నదని చెప్పారు. నేను పూర్తిగా గర్హిస్తున్నాను. అవినీతి, అక్రమం జరిగితే ఈనాడు వేసుకున్న కాషాయానికి అర్థం లేదు. కాబట్టి పూర్తిగా అటువంటి దుర్నీతిని సహించను, వారు ఎవరైనా కానివ్వండి నేను మీతో పూర్తిగా సహకరిస్తాను. మీరు పూర్తిగా ఆత్మీయులుగా వ్యవహరించండి. ఎవరి మీదైనా, ఏదైనా రిపోర్టు ఉంటే మాకు ఇవ్వండి మీ ద్వారానే విచారణ చేయిస్తాను. వారు ఎవరైనా సరే పార్టీ నుంచి బహిష్కరిస్తాను, మంత్రులను తీసి వేస్తాను, అవినీతిని సహించడం జరగదని నేను తెలుగుదేశం పార్టీ తరపున మీకు సుస్పష్టం చేస్తున్నాను.

మీకు తెలుసు, ఈనాడు వ్యవసాయదారులకు ఏ విధమైన అభివృద్ధి కోరే పథకాలు అమలుచేశామో, ఈనాడు గోదావరి బరాజ్‌కి సుమారు రూ.15 కోట్లతో స్టీల్ ప్లేట్స్ రైలింగ్‌తో ఏ విధంగా పాత ఆనకట్టను మరమ్మత్తు చేస్తున్నామో, ఆ టాంక్ లెవెల్ ఏవిధంగా నాలుగు అడుగుల పైన ఉంచదలచుకొన్నామో. పంట ఏదైతే కళ్లముందు కొట్టుకుపోయి వారు అనాథలై దిక్కులేక హీనులుగా ఉన్నారో అటువంటి వారిని ఆదుకోడానికి పూర్తిగా రబీ పంటకు నీరు ఇస్తామని నేను చెప్పాను. పూర్తిగా ఇస్తాను ఈనాడు మళ్ళీ చెపుతున్నాను. ఎవరైతే పంట పోగొట్టుకున్నారో, కర్షకులు ఎవరైతే దీనాతిదీనస్థితిలో ఉన్నారో అటువంటి వారికి పూర్తిగా దాళ్వా పంటకు నీరు ఇవ్వడం జరుగుతుందని మీకు నేను సవినయముగా మనవిచేస్తున్నాను. అందుకే 26 వేల ఇళ్లు, నేడు ఉన్నటువంటి ఈ పేదరికంలో 26 వేల ఇళ్లు అన్నీ వరదల వల్ల పడిపోయిన గృహాల వారికి నేను సమర్పించాను.

మరి ఇంకా ఏదైనా ఎక్కువగానే సమర్పిస్తాము. నాకేమీ ఒక లిమిట్ లేదు. ఒక హద్దుపెట్టుకొని నేను కూర్చోలేదు. దయతో మీరందరూ కూడా సహకరిస్తే, ఎంత వరకూ పూర్తిగా మన ప్రభుత్వం చేయగలుగుతుందో అంత వరకూ చేస్తాను. చేస్తాను అని మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను. అదే విధంగా ఈనాడు ఇంట్రస్ట్ వేవింగ్. దీని వలన సుమారు రూ.70 కోట్ల భారం ఉంటుంది. కేవలం ఇది రాష్ట్ర ప్రభుత్వం యొక్క పరిధిలో లేదు. కేంద్ర ప్రభుత్వమూ, నాబార్డ్, ఆర్.బి.ఐ. అన్నీ అంగీకరించాలి. అయినప్పటికీ ధైర్యం చేశాము. ఈనాడు ఎంతో ఖర్చు పెడుతున్నాము. కేవలం ఈనాడు అనాథలైన రైతులను ఆదుకోవాలి. పేదరికాన్నీ తొలగించాలి. వరద వచ్చిన వారికి, కరువు వచ్చిన వారికి, పెద్దా, చిన్నా లేదు. అందరూ పోగొట్టుకొన్న వారే, ఎండిపోయిన వారే, అటువంటి వారికి సౌలభ్యం కలిగించడానికే ఈ కృషి చేయడం జరిగింది అని మనవి చేస్తున్నాను. ఏడు జిల్లాలలో వరద ఉంటే సుమారు 14 జిల్లాలలో కరువు ఉంది. కేవలం ఒక జిల్లా కాదు 20 జిల్లాలకు పైచిలుకు ఈ అరిష్టం ఉంది. వీటిని ఏవిధంగా

ఉద్ధరించాలి, ఏవిధంగా అందరినీ ఆదుకోవాలి అనే పద్ధతిలో, తక్షణ కర్తవ్యంగా మీ సూచనలను తీసుకోవడం జరిగింది.

ఇంకా పెద్ద పనులు చేయగలిగితే సంతోషమే. కానీ ఈ మాత్రం అయినా చేయగలిగాము అనే తృప్తి మీ అందరి సహకారంతో నాకుందని మనవిచేస్తున్నాను. మంచిని, మంచితనాన్ని గుర్తించాలి కాబట్టి ఎవరైతే రైతులు పూర్తిగా రుణాలు చెల్లిస్తారో, వారికి అయిదున్నర శాతం వడ్డీ రద్దు మన రైతులకు ఇవ్వడం జరిగింది. ఎక్కడా మాగ్జిమం లేదు. అయిదు శాతం ఉంది. పన్నెండున్నర శాతంలో అయిదున్నర శాతం వడ్డీ ముదరా ఇచ్చి, కేవలం ఏడు శాతం వడ్డీనే తీసుకోవడం జరుగుతుంది. దీనిని బట్టి ఏ విధంగా రైతు జన సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం కృషి చేస్తున్నదో ఒక్కసారి గుర్తించాలని సర్వులకు సవినయంగా మనవిచేస్తున్నాను. దీని వల్ల కేవలం రు. 20 కోట్లు ప్రభుత్వానికి ఖర్చు అవుతుందని అన్నారు. అవనివ్వండి. ఈనాడు కేవలం ఖర్చు పెట్టడానికి వచ్చిన వ్యవస్థ కానీ లెక్కలు చూసుకొనే చిల్లర కొట్టు మాత్రం కాదని నేను చెప్పడం జరిగిందని మీకు నేను సుస్పష్టం చేస్తున్నాను. ఒక రూరల్ యూనివర్సిటీని పెట్టాలని ఈనాడు ప్రభుత్వం యోచిస్తున్నది. గ్రామీణ వాతావరణానికి సంబంధించిన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నది. గాంధీగారు చెప్పిందేమిటి? పల్లె సీమలే పట్టుగొమ్మలు అన్నారు. గ్రామాలే దేశాభివృద్ధి వ్యవస్థలన్నారు. అటువంటి గ్రామాలు ఈనాడు ఏ విధంగా నిర్లక్ష్యం చేయబడినాయో మన కళ్ల ముందు ఉన్న సత్యం.

కాబట్టి విజ్ఞులు, ప్రాజ్ఞులు, సర్వులు గ్రామ సంక్షేమానికి వారందరి ఊహలు కలబోసి సర్వతోముఖంగా ఈ గ్రామీణ వ్యవస్థను ఏర్పాటు చేయాలనే ఆలోచన మదిలో, మనస్సులో ఇఉందని మీకు నేను సుస్పష్టం చేస్తున్నాను. తరువాత రైతులకు రు. 50కి కేవలం ఒక్క హార్స్ పవర్ సంవత్సరానికి ఇవ్వగలుగుతున్నాము. అంటే మరి మన భారతదేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేదు. ఇది మనం ఇవ్వగలుగుతున్నాము. ఈ రకంగా ఇవ్వగలుగుతున్నామంటే, రైతు జన సంక్షేమం కోసమే. ఇది కూడా తీసివేయాలంటే తీసేయచ్చును. కానీ ఎంత అవుతుందో, మన బడ్జెట్ ఏమిటీ అనేది కూడా ఆలోచన చేయాలి. ప్రస్తుతం రు.50 హెచ్.పి. అనేది ప్రపంచంలో ఎక్కడా లేనిది. అదే సంవత్సరానికి ఇవ్వడం జరుగుతున్నది. నా దృష్టికి వచ్చినంత వరకూ, మనం చేస్తున్నాము అని మీకు నేను సుస్పష్టం చేస్తున్నాను.

ఈనాడు మన రాయలసీమలో విద్యుచ్ఛక్తి సరిగ్గా లేదు. వేరియేషన్స్ ఉన్నాయి. వాటిని తొలగించడానికి, పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి ముద్దనూరులో థర్మల్ పవర్ స్టేషన్ 210 మెగావాట్లది రెండు ఇంజన్లతో కూడినటువంటిది నిర్మించడానికి, రాయలసీమ వాసులకి ఒక సమగ్రమైన విధానంలో విద్యుచ్ఛక్తి సౌకర్యం కలగచేయడానికి ఈ కార్యక్రమం నిర్దేశించబడింది. ఇది మూడు సంవత్సరాలలో నిర్వర్తించబడుతుందని సవినయంగా

మనవిచేస్తున్నాను. అదే విధంగా విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్. ఈనాడు విద్యుచ్ఛక్తి కావాలి. పారిశ్రామికంగా దేశం బాగుండాలి అంటే, వ్యవసాయదారులు ముందుకి వెళ్లాలి అంటే, పల్లెటూర్లలో విద్యుచ్ఛక్తి లభించాలంటే, సామాన్య కుటుంబీకుడు వెలుగు పొందాలి అంటే, విద్యుచ్ఛక్తి కావాలి. ఈనాడు బొగ్గు గనులు ఉన్నాయి. దానిని ఉపయోగించి, హైడ్రో ఎలక్ట్రిక్ మీద ఆధారపడకుండా, పూర్తిగా థర్మల్ పవర్ ప్లాంట్స్ పెడితే బాగుంటుందని విజయవాడ వద్ద రెండవ దశ థర్మల్ స్టేషన్ కూడా మూడు సంవత్సరాలలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నదని నేను సవినయంగా సుస్పష్టం చేస్తున్నాను. ఈనాడు ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చాము. అన్నీ చెప్పలేదు.

కేవలం వివరాలు చెప్పలేదని ముందే నేను మనవిచేశాను. ఈనాడు విద్యుచ్ఛక్తి బోర్డులో ఈ జనరేషన్, డిస్ట్రిబ్యూషన్, మెయిన్‌టెనెన్స్, మూడు కూడా సెపరేట్ చేయాలనేది ప్రభుత్వం ఆలోచిస్తున్నదని మనవిచేస్తున్నాను. ఎన్నో విధాలుగా ఈనాడు పేయింగ్ సెక్షన్‌లో అవకతవకలున్నాయి. బిల్ కలెక్టర్లను తీసేసి, వారి బాధ్యతగా గుర్తించి, ఎవరికి వారే నైతిక ప్రవర్తనమీద ఏ మండలంలో ఆ మండలంగా ప్రత్యేకమైన రూరల్ కలెక్షన్ పెట్టాలని అనుకొంటున్నాము. ఆఫీసు ఆఫీసుకి వారి యొక్క డబ్బు పంపి, వారి యొక్క విద్యుత్ వివరాలను వారే అందించుకొనే అవకాశాలు కల్పించడం జరుగుతుందని మనవిచేస్తున్నాను. అదే విధంగా ఈనాడు రైతులున్నారు. వారు పోల్స్ తీసుకొని వెళ్ళగలిగితే, అది వారికి ఇస్తే రవాణా ఖర్చు లేకుండా పోతుంది. అనవసరంగా ఒ.టి. డేటా బిల్లులు ఉండవు అనే భావనతో ప్రభుత్వం పూర్తిగా ఆలోచిస్తున్నదని సవినయంగా మనవిచేస్తున్నాను. ఈనాడు విద్యుచ్ఛక్తి బాగా ఉండడం వలన రాష్ట్రంలో పరిశ్రమలు ఉన్నాయి. పరిశ్రమలు విషయం వచ్చినపుడు, మీకందరికీ నేను సవినయంగా మనవిచేస్తున్నాను. చిన్న తరహా పరిశ్రమలకు ఆ లైనింగ్ డిపాజిట్ తీసివేశాము. చిన్న తరహా పరిశ్రమలు ఎక్కడున్నా వాటికీ విద్యుచ్ఛక్తి సౌలభ్యం కలిగించాలని కూడా వారికి ఆదేశాలు ఇవ్వడం జరిగింది.

**విద్యుచ్ఛక్తి బోర్డులో లైన్‌మెన్‌లను మండలానికి ఒకరిని తయారు చేసుకోండి అని విద్యుత్ బోర్డు ఆదేశించడం జరిగింది. ప్రతి మండలంలో ఒక మనిషి ఫ్యూజ్ వేసుకొనే వారు, లైను వేసుకొనే వారుంటే, వారు ఇన్‌చార్జ్‌గా ఉంటే, ఈనాడు ఉన్న బేటా సిస్టం, లైన్‌మెన్ విధానం తొలగించుకుంటే మన భారాన్ని, వ్యయాన్ని తగ్గించుకోవచ్చును కూడా చెప్పడం జరిగిందని నేను మనవిచేస్తున్నాను.**

అదే విధంగా ఇదివరకు నో పోల్, ఆర్ వన్ పోల్ అనే భేదభావం తీసేసి నాలుగు పోల్స్ వరకూ దూరం ఉన్నప్పటికీ వెంటనే ఇవ్వమని చెప్పాము. అదే విధంగా మూడు సంవత్సరాలుగా సౌలభ్యంలేని వారికి ఎంత దూరంలో ఉన్నప్పటికీ ఇవ్వనున్నాము. జిల్లా ప్లానింగ్ బోర్డులు ఉన్నాయి. అందరూ కూడా చూస్తున్నారు. పర్యవేక్షిస్తున్నారు. గౌరవ సభ్యులున్నారు. మంత్రి

వర్యులున్నారు. ఇది ప్రభుత్వం ఇచ్చిన తాఖీదు, పొరపాటున ఎక్కడైనా అమలు చేయకపోతే అది కేవలం దురదృష్టకరమైక విషయం. దయచేసి అందరూ పూర్తిగా, బాధ్యతగా గుర్తించండి. ఏదైనా పొరబాటు పనులుంటే చూసే అధికారం వారికుంది, మంత్రిగారికి చెప్పండి. నాకుచెప్పండి మీ మనిషిగా వెంటనే నేను నిర్వర్తిస్తాను అని మీకు నేను మనవిచేస్తున్నాను. అదే విధంగా ఈనాడు ఎక్కడ చూసినా విద్యుచ్ఛక్తికి స్పేర్ పార్ట్స్ లేవు అంటున్నారు.

ఆ విధానాన్ని తొలగించడానికి ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్‌లోనే - మన రాష్ట్రంలోనే ఈ విద్యుచ్ఛక్తికి సంబంధించినటువంటి విడి భాగాలు తయారుచేసే ఒక కర్మాగారాన్ని నిర్మించే విషయం ఆలోచించడానికి ఒక వంద ఎకరాల స్థలం పెట్టాలనే యోచన ఎప్పటినుంచో జరుగుతోంది. ఈ కార్యక్రమం ఇప్పటిది కాదు. ఈనాడు హెవీ ఇండస్ట్రీస్ చాలా నష్టాల మీద నడుస్తున్నాయి. అది కూడా ఉన్నతమైన, విజ్ఞులైన ఒక వ్యక్తికి అప్పచెప్పి, వారి ద్వారా ఈ స్పేర్ పార్ట్స్ ఫ్యాక్టరీ కార్యక్రమం చేయాలని నిర్ణయించడం జరిగింది. అదే విధంగా విద్యుచ్ఛక్తి బోర్డులో లైన్‌మెన్‌లను మండలానికి ఒకరిని తయారు చేసుకోండి అని విద్యుత్ బోర్డు ఆదేశించడం జరిగింది. ప్రతి మండలంలో ఒక మనిషి ఫ్యూజ్ వేసుకొనే వారు, లైను వేసుకొనే వారుంటే, వారు ఇన్‌చార్జ్‌గా ఉంటే, ఈనాడు ఉన్న సిస్టం, లైన్‌మెన్ విధానం తొలగించుకుంటే మన భారాన్ని, వ్యయాన్ని తగ్గించుకోవచ్చునని కూడా చెప్పడం జరిగిందని నేను మనవిచేస్తున్నాను.

పరిశ్రమల విషయంలో వెంటనే ఒకటి చెప్పాలి. పరిశ్రమల విషయంలో ఏ విధమైన విధానాన్ని మనం అనుసరిస్తున్నామో మీకు తెలుసు. ఈనాడు మనకు సమృద్ధిగా భూమి, నీరు, పవర్ ఉంది. కాబట్టి ఎవరైనా వస్తే, వారికి వెంటనే ఏర్పాటు చేయడానికి వీటిని లభింపచేయడానికి, సింగిల్ విండో ఏర్పాటు చేశాము. ఒక వ్యక్తి వద్దకు వస్తే, వ్యక్తే అప్లికేషన్ తీసుకొన్ని అన్ని డిపార్ట్‌మెంట్స్‌కి వెళ్లి పూర్తిగా మంజూరు చేసే అవకాశం కల్పించడం జరిగింది. జరగలేదని అంటే దురదృష్టం. వెరీ సారీ. దయచేసి సభ్యుల దృష్టికి వస్తే, ఆ వివరాలు తెలియజేస్తే చర్య తీసుకోవడం జరుగుతుంది. మనందరి బాధ్యత, ప్రభుత్వం మనది. మనందరం ఏకగ్రీవంగా నిర్ణయాన్ని అమలు చేసే విధానంలో శ్రద్ధ తీసుకోవాలి అని మనవిచేస్తున్నాను.

ఇక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లైన్ అంటే కేవలం 15 వేల రూపాయల భూమి ఉంటే, ఆ ప్రక్క 100 రూపాయలకు ప్రభుత్వం అడుగుతోంది అంటే, చిన్న తరహా పరిశ్రమలు స్థాపించాలనుకొన్న వారు వచ్చి, ఈ డబ్బుకి తీసుకోడానికి ఉన్న డబ్బు అయిపోతుంది అంటే, ఎక్కువగా ఉందంటే వారికి ఇవ్వమని ఆదేశించడం జరిగింది. ఎక్కడైతే భూమి ఉందో, భూమి ఇవ్వండి. మాస్టర్ ప్లాన్ వేసి ఆ భూమికి పవర్ మొదలైన సర్వ సౌకర్యాలు కల్పించండి. వారే తీసుకుపోతారు. 15 వేల రూపాయలకు కొన్న భూమిని అంతకే వారికి ఇవ్వాలి కానీ దానిలోనే లాభం తీసుకోవాలనే అభిప్రాయాన్ని పారిశ్రామిక వేత్తలు కలిగించడం భావ్యం కాదు అది ప్రజాస్వామ్య సిద్ధాంతం కాదు. ప్రజాస్వామ్య

పద్ధతి కాదు అని నేను సుస్పష్టం చేయడం జరిగిందని మీకు నేను మనవిచేస్తున్నాను. అదేవిధంగా ఎన్నారై సోదరులున్నారు. ప్రవాస ఆంధ్రులు ఇతర దేశాల నుంచి, అమెరికా నుంచి వస్తున్న వారు, వారి పెట్టుబడే కాదు, చక్కని సరసమైన విధానాన్ని అవలంభించడం, వారికి వీలైన పద్ధతిలో అధికారులనందరినీ పంపించి, సరైన నిర్ణయం తీసుకొని ముఖ్యమైన వైద్య విధానంలో కానీ, పారిశ్రామిక విధానం కానీ అవలంభించడం జరుగుతుందని మీకు నేను మనవిచేస్తున్నాను. అదే విధంగా ఈరోజున ముఖ్యంగా వరంగల్లు, విజయవాడ హైదరాబాద్, తిరుపతిలో కానీ, 4 చోట్ల ముఖ్యంగా ఎలక్ట్రానిక్ కార్పొరేషన్‌కు గానూ ప్రత్యేకంగా భూములు మంజూరు చేయడం జరిగింది. అతి విలువైన భూములు, విలువ కాదు మనకు కావలసింది. పారిశ్రామిక అభివృద్ధి. ఈనాడు ఆంధ్రప్రదేశ్ ప్రగతి మనకు కావాలి.

కాబట్టి ఈ విధానానికి పూర్తిగా అంకితమైన భావంతో కృషి చేయడం జరుగుతుందని మీకు మనవిచేస్తున్నాను. ఇదివరకు ఎప్పుడో ఏదో ఊహాప్రాయంగా మిగిలిన నాగార్జున ఫెర్టిలైజర్స్ కానివ్వండి, గోదావరి ఫెర్టిలైజర్స్, మంగళగిరి టైర్స్ ఎవరు ముందుకు రాకపోయినా నేనే పెట్టిస్తాను, మీకు హామీ ఇస్తున్నాను. ఇవన్నీ ఈనాడు ఒక రూపాన్ని ధరిస్తున్నాయి అంటే కేవలం ప్రభుత్వ విధానం వల్ల, వారికి ఇచ్చే సౌకర్యాల వల్ల, సౌలభ్యాల వల్ల అని మీకు మనవిచేస్తున్నాను. అదే విధంగా ముఖ్యంగా ఈ పరిశ్రమల విషయంలో సర్ సిల్క్ పరిశ్రమ సంగతి చెప్పారు. సర్ సిల్క్ రిపోర్టు సంగతి కూడా మీరు విన్నారు. వారు ఈ పరిశ్రమలో నష్టమే కానీ, లాభం రాదని తెలియజేశారని గౌరవ సభ్యులకు సుస్పష్టం చేస్తున్నాను. పారిశ్రామిక విధానం కేవలం పెట్టుబడి పెట్టడం కాదు. ఎవరైనా ముందుకు వచ్చి జరిగేటట్లు చేయడం, ప్రజల యొక్క డబ్బును, విత్తాన్ని ఈనాడు ఈ సిక్ ఇండస్ట్రీస్, అసమర్థవంతమైన పరిశ్రమలకు ముడి పెట్టడం కాదని మనవిచేస్తున్నాను.

కానీ వారేమైనా బీదవారా అంటే దానిలోని వారందరూ పెద్దలూ, వీరందరూ కూడా కార్బైడ్స్ ఒక ప్రక్క, సర్ సిల్క్ ఇవన్నీ కూడా నిర్వహించిన మహనీయులే. ఒక్కొక్కరూ, కొన్ని కోట్ల మొత్తాలు ఈనాడు సేల్స్ టాక్స్ కానీ, పవర్‌కి గానీ కట్టకుండా ఎగగొట్టిన విషయం మీకందరికీ తెలుసు. ఆ భారం అంతా ప్రజలను మోయమంటే, ఆ ధనికులు చేసిన కుట్రకు ప్రజలను బలి చేస్తామా అని గమనించాలి. కార్మిక, శ్రామిక ప్రగతికి ద్రోహం చేయని విధానం అవలంభించే వారికి ప్రాధాన్యం ఇవ్వాలి. వారికి కావలసిన ప్రతి దమ్మిడి వారికే చేరేటట్లు చూడాలి. ఆ విధంగా నేను పూర్తిగా హామీ ఇస్తున్నాను. కార్మిక శక్తికి, శ్రామిక శక్తికి ఏమాత్రం ద్రోహం చేయడం కానీ, వారి డబ్బు ఎగగొట్టడానికి కానీ, ప్రభుత్వం అంగీకరించదు. అని నేను సుస్పష్టం చేస్తున్నాను.

ఈనాడు ప్రభుత్వ విధానాలు చెప్పాలంటే ఎన్నో ఉన్నాయి. కాబట్టి కేవలం పాలసీ మాత్రం చెప్పాను. అదే విధంగా విద్యా విధానం ఎందుకూ పనికి రాని, చేత కానీ, విద్యార్జన చేయలేని

చౌకబారు చదువులు ఉన్నాయి. మీరు చెప్పినట్లుగా ఎన్నో లక్షల మంది చదువుకొని ఉద్యోగం లేకుండా ఉన్నారు. నిజమైన చదువు చదువుకొన్నవాడు ఎవడూ ఉద్యోగం లేకుండా కూర్చోడు. స్వశక్తి మీద బ్రతుకుతాడు. కాబట్టి అటువంటి విద్య ఇవ్వాలి. It is worth-while to have vocational training in education. There should be some purpose in education. అటువంటి వృత్తి విద్యాపరమైన విద్యావిధానాన్ని ఇవ్వాలి. కేవలం ప్రభుత్వం అంటే అన్నీ తన నెత్తిన వేసుకొని ఉండడం కాదు. కమిషనరేట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ తరఫున, వృత్తి విద్యను సంగ్రహింపచేయడం మన బాధ్యత అయినా, పై అంతస్థులో ఉన్నవారు పై చదువులు చదువుకొనే దానిలో వారే భాగస్వామ్యం కావాలని, కేవలం చదువంటే ప్రభుత్వం చెప్పిందే ఉచిత విద్య కాదు, ఒక క్రమశిక్షణతో కూడిన, ఆదర్శవంతమైన వృత్తి విద్యా ప్రదీప్తమయిన విజ్ఞానదర్శకంగా, విలసితమైన విద్యా విధానం ఉండాలని 'కాబట్టి కమిషనరేట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఏర్పాటు చేయడం జరిగింది. ఆడియో విజువల్ సిస్టం ఈ ప్రపంచంలో ఎక్కడా లేదు. అమెరికన్స్ వచ్చారు ఇక్కడికి. ఏమిటీ అన్నారు? ఎక్కడో మాకు కావలసిన శాస్త్రాలు మాత్రం ఆడియో విజువల్ పెడతాము కానీ ఈనాడు ఎడ్యుకేషన్ అంటే అసలు మాకు తెలియదు అన్నారు. దయచేసి మీరు పెట్టేటప్పుడు మాకు చెప్పండి. మేము కూడా వస్తాము. చూస్తాము అన్నారు.

అతి ఉత్తమోత్తమమైన మానవత్వం, క్రొత్తదనం కొరకు నాంది పలుకుతోంది ఈనాడు ప్రభుత్వం అని సవినయముగా మనవిచేస్తున్నాను. అదే పద్ధతిలో మెడికల్ సర్వీసెస్ ఎక్కడా లేని, ఏ రాష్ట్రంలో లేని ఆరోగ్య విశ్వ విద్యాలయం ప్రారంభించిన ఘనత మన రాష్ట్రానికి దక్కింది. మన ప్రభుత్వానికే దక్కిందని మీకు నేను సవినయంగా తెలియజేస్తున్నాను. అదేవిధంగా టీచింగ్ హాస్పిటల్స్ అన్నీ కూడా ఈనాడు ఏ విధంగా కళాశాలలున్నాయో, వైద్య కళాశాలలకు వాటికే అప్పగించబడ్డాయి. ఎందుకంటే అక్కడ తయారయ్యే హౌస్ సర్జన్సు మొదలైన వారు కేవలం పుస్తకాలతో కాలం గడపకుండా ఎక్కువ కాలం హాస్పిటల్స్‌లో గడపాలి. విద్యార్థులు పరీక్షించాలి. అందుకే టీచింగ్ హాస్పిటల్స్ ఏవైతే ఉన్నాయో వాటిని అన్నింటినీ కూడా ఈనాడు వైద్యకళాశాలలకు అప్పగించడం జరిగింది.

అదే విధంగా ఎంతోమంది దొంగలు సమాజంలో ఉన్నారు. అవినీతి అక్రమం, లంచగొండితనం విచ్చలవిడిగా జరుగుతోంది బజారుల వెంట అని మనమే చెప్పుకొంటున్నాము ఆరోజున. కాబట్టి ఏదైనా క్రమశిక్షణా విధానాన్ని ప్రభుత్వం అవలంభించడం కోసం, దానిని అమలుచేయడం కోసం భాగస్వామ్యం కోసం ఈ కమిషన్‌రేట్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ ఏర్పాటు చేయడం జరిగింది. డిస్ట్రిక్ట్ హాస్పిటల్స్‌లో కానీ, తాలూకా హాస్పిటల్స్‌లో కానీ వారికి ఇచ్చి, పేయింగ్ వార్డ్స్ పెట్టి, ఉచితంగా లక్షాధికారులకు వైద్యం ఇచ్చే ఖర్మ ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఏమి పట్టింది? కాబట్టి ఎవరైతే డబ్బు ఇచ్చుకోగల వారి దగ్గరనుంచి ఒక పద్ధతి ప్రకారం డబ్బు

తీసుకోవడం, పేదవారికి వైద్య సౌకర్యం కలుగ చేయడం కోసం, వైద్య విధానాన్ని గుర్తించే ఈ భాగస్వామ్యం ఈ రోజున కమిషనరేట్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్‌కు ఇవ్వడం జరిగిందని నేను విన్నపం చేస్తున్నాను. అదేవిధంగా ఈనాడు ప్రైమరీ హెల్త్ సెంటర్స్ ఉన్నాయి. ఆరోగ్య విధానం ప్రభుత్వం లక్ష్యం. జ్వరం, ఎప్పటికప్పుడు వచ్చే జబ్బులు, కానీ వాటిని, కుష్టు మొదలైన వాటిని నివారించే బాధ్యత పూర్తిగా ప్రభుత్వమే వహిస్తున్నది.

ఆ బాధ్యత స్వీకరించబట్టే 454 ప్రైమరీ హెల్త్ సెంటర్స్ ప్రారంభించడం జరిగింది. గౌరవ సభ్యులు అన్నారు, ఖాళీగా ఉన్నాయని. అది మన జాతి దురదృష్టం, అందరికీ డిగ్రీలు ఉన్నాయి. అందరూ అప్లికేషన్సు పెడుతున్నారు. వచ్చి నిలబడుతున్నారు. అయ్యా దయచేయండి అన్నాము. అందరూ గిరిజన ప్రాంతానికి వెళ్లండి. పేద ప్రజానీకానికి సేవ చేయండి. 5 సంవత్సరాలు పని చేయండి. మీరు మహనీయులు అనిపించుకోండి. మీరు తిరిగి ప్రమోషన్సు తీసుకోండి అంటే వారు పల్లెటూర్లకు మాత్రం వెళ్ళరట, సూట్లు వేసుకొని పట్టణాలలో మన నెత్తిన కూర్చుంటారట. అయితే ఈ విధానాన్ని మాత్రం అంగీకరించడం జరగదు. జరగడం లేదని మాత్రం సుస్పష్టం చేస్తున్నాను. అయితే ఏదో కొద్దిగా ఖాళీలు ఉండవచ్చు. ఈ మధ్యన గిరిజన ప్రాంతాలకు వెళ్ళిన డాక్టర్లకు రూ.75లు రోజు వారీ వేతనంగా, అదే మామూలు ప్రాంతంలో ఉన్న వారికి రూ.50లు చొప్పున ఇచ్చి భర్తీ చేయడం జరిగింది. 3029 మంది డాక్టర్స్ ఉండవలసిన స్థానంలో కేవలం 197 స్థానాలు మాత్రం ఖాళీగా ఉన్నాయని సుస్పష్టం చేస్తున్నాను.

అదే విధంగా మందులలో కల్తీ, ఎన్ని మందులు? 700, 1000, 1200 ఏమిటి ఈ సంఖ్య? ఇదివరకు కేవలం మూడో, నాలుగో ఉన్నాయి. మందులు పెరిగి పోవడం, ఎక్కడికక్కడ అందరూ స్వంతంగా ఫ్యాక్టరీస్ పెట్టుకోవడం, దళారీలు దోచుకోవడం, మందులు కల్తీ చేయడం, ఒక వ్యాపారం దుర్వినియోగంగా మారినప్పుడు దానిని అరికట్టడానికి ఇప్పుడు ఏ.పి. డ్రగ్స్ అండ్ ఫార్మస్యూటికల్స్ ప్రత్యేకంగా నాగార్జున సాగర్‌లో జాయింట్‌గా ప్రభుత్వం ప్రారంభించడం జరిగింది. జూన్ నుంచి ఉత్పత్తి ప్రారంభమవుతుంది. అక్కడ తయారుచేసే మందుల పూర్తి నాణ్యతను ప్రభుత్వం గుర్తిస్తోంది. వాటిని వైద్యశాలల్లో ఉపయోగించడం జరుగుతుంది అని మీకు నేను సవినయంగా మనవి చేస్తున్నాను.

ఈ విషయాలు ఇట్లా ఉండనివ్వండి. ఇకపోతే మూడవది సోషల్ వెల్‌ఫేర్ ఉంది. చాలా ముఖ్యమైనది. ఈనాడు ఎస్.టి, ఎస్.సి.లకు రాజ్యాంగ బద్ధమైన ప్రొటెక్షన్ ఉంది. మనకు ఆర్థికంగా వెనుకబడినవారు ఎంతోమంది ఉన్నారు. The reservations for the Backward Classes is the victory for Telugu Desam. ఈ దేశంలో ఈ రాష్ట్రంలో పూర్తిగా వెనుకబడిన తరగతివారికి ఎక్కడా అందని చైతన్యం ఇచ్చిన ఘనత మాకే దక్కింది. మురళీధరరావు కమిషన్ మేము ఉండగా వేసింది కాదు. గత ప్రభుత్వం ఎప్పుడో వేసింది. ఎవరూ

అమలు చేయనిదానిని నేను అమలు చేయడానికి తమ అందరి సహాయంతో సిద్ధపడ్డాను, తెగించాను. తెగించాను అనే మాట వాడుతున్నాను. దానిని కాదనడం సమాజ బాధ్యత కానీ, నా బాధ్యత కాదు. నాహృదయం, నా అవగాహన, నా భవిష్యత్తు, పురోగమిత విధానం ఇదంతా కూడా దానివల్ల సృష్టీకరించామని మనవిచేస్తున్నాను.

ఈనాడు మండలాల రిజర్వేషన్స్ గురించి అడిగారు. మండలాలలో రిజర్వేషన్స్ ఉన్నారు. అన్నీ 50 శాతం, 20 శాతం బి.సి లకు, 15 శాతం ఎస్.సి. వారికి అదేవిధంగా ఎస్.టి వారికి 6 శాతం. ఏ మహిళా సంక్షేమం కోసం ఈనాడు తెలుగుదేశం ప్రభుత్వం కోరుతున్నదో వారికి 9 శాతం రిజర్వేషన్స్ మొత్తం 50 శాతం ఇస్తున్నామని మీకు నేను సుస్పష్టం చేస్తున్నాను. మొత్తం 50 శాతం ఇస్తున్నామని సుస్పష్టం చేస్తున్నాము. మహిళలు అంటే చెబుతున్నాను. మరి ఎందుకు ఇంత దురదృష్టకరమైన విధానం జరిగింది మహిళల మీద ఆత్యాచారాలు జరిగితే, మరి గుండెలు పట్టుకొంటున్నామో ఇంతవరకు మీ కూతుళ్లను, మీ చెల్లెళ్లను, గౌరవించే విధానం మనం ఆచరించలేకపోతున్నామే, దీనికి కారణం ఏమిటి? కాబట్టి ఈనాడు చారిత్రాత్మకమైన నిర్ణయం తెలుగుదేశ ప్రభుత్వం తీసుకొన్నది మగవారితో పాటు ఆడవారికి కూడా ఆస్తిలో సమాన హక్కులు కల్పించబడ్డాయి. అదే విధానంగా 30 శాతం వారు చేసే ఉద్యోగాలు వారికే ఇవ్వబడుతున్నాయి. అదే విధంగా పెన్షన్లలో, ఎన్నో మరెన్నో సౌకర్యాలు కల్పించాము. వారు ముందుకు రావాలి. సమాజంలో అర్ధశాతం ఉన్న వారు ప్రగతిలో ముందుకు రావాలని హృదయపూర్వకంగా అంటున్నాను.

**సింగూరు ప్రాజెక్ట్ మూడవ దశ రేపు పూర్తి చేయబడుతుంది. ఆ తరువాత సింగూరు ప్రాజెక్ట్ 1990 నాటికి చూస్తే అక్కడ ఉండే నీరు చాలదేమో అనిపిస్తుంది. కాబట్టి పర్మనెంట్ స్కీము తయారు చేయడానికి ఒక కమిటీని వేయడము జరిగింది. విజ్ఞానులు మీ అందరితో సమాలోచన చేసి కేవలం నా అంతట నేను నిర్ణయించడం కాకుండా, మీరు నా మనుషులు కాబట్టి మీ అందరితో యోచించి మీ బాధ్యతగా స్వీకరిస్తున్నారు.**

ఇది వరకు వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్ల విషయంలో నేను ఊరుకోలేదు. వెనుకబడిన తరగతుల వారి రిజర్వేషన్లను నేను తప్పించుకోలేదు. వారికి ప్రత్యేకంగా 250 హాస్టళ్లు నిర్మించడం జరిగింది. 10 వేల మందికి ప్రత్యేకంగా హాస్టళ్లలో వసతులు కల్పించబడ్డాయి. మూడు విద్యాలయాలు స్థాపించబడ్డాయి. నాగార్జునసాగర్‌లో, శ్రీశైలములో, సింహాచలములో మూడు విద్యాలయాలు స్థాపించబడ్డాయి. ఒక్కొక్క దానిలో రెండు వేల మంది విద్యార్థులకు వసతి కల్పించడం జరిగింది, ఏ ఆర్థిక ప్రమాణమే అయితే నేను రిజర్వేషనులలో పెట్టానో ఆ ఆర్థిక విధానమే దాని యొక్క ప్రాముఖ్యత పొందిన విధానంగా రూపొందించబడింది. 12 వేలు, 15 వేలు, 18 వేలు వరుస క్రమంగా ఎవరికైతే ఆర్థికపరమైన సంక్షేమం ఉండదో వారి బిడ్డలకు ఒకటవ తరగతి నుంచి 12వ తరగతి వరకు అక్కడ చదువుకునే అవకాశం కల్పించబడిందని

వారికి నేను సుస్పష్టం చేస్తున్నాను. మనం అపజయం పొందామంటే అది అపజయము కాదు. రాబోయే జయం. భవిష్యత్ జయమని నేను సుస్పష్టము చేస్తున్నాను.

అదే విధంగా మరి ఈ రోజున ఎస్.సి హాస్టళ్లు 376 ఉన్నాయి. 2 లక్షల 31 వేల 565 మంది విద్యార్థులకు అక్కడ వసతి కల్పించబడింది. మరి ఇదంతా కూడా కేవలం సామాజికపరమైన సంక్షేమము, కేవలం అర్ధనగ్నంలో ఉన్న అమాయకులు, మన సోదర, సోదరీమణులు. కాబట్టి వారికి ఒంటినిండా గుడ్డ కప్పాలి. వారికి విజ్ఞానాన్ని ఇవ్వాలి, ఆదరించాలి, చేయూతనిచ్చి ముందుకు నడిపించాలనే ధ్యేయంతో ఈ సంక్షేమ కార్యక్రమము తీసుకోబడిందని సవినయంగా మనవిచేస్తున్నాను. తరువాత సంక్షేమ కార్యక్రమాల క్రింద మరెన్నో మనవిచేశాను. ఇకపోతే సోదరులు చాలా ఉత్సాహంగా ఉన్నారు. ఈనాడు జంట నగరాలకు మంచి నీటి వసతి ఏమి చేయాలి? సింగూరు ప్రాజెక్ట్ మూడవ దశ రేపు పూర్తి చేయబడుతుంది. ఆ తరువాత సింగూరు ప్రాజెక్ట్ 1990 నాటికి చూస్తే అక్కడ ఉండే నీరు చాలదేమో అనిపిస్తుంది. కాబట్టి పర్మనెంట్ స్కీము తయారు చేయడానికి ఒక కమిటీని వేయడము జరిగింది. విజ్ఞానులు మీ అందరితో సమాలోచన చేసి కేవలం నా అంతట నేను నిర్ణయించడం కాకుండా, మీరు నా మనుషులు కాబట్టి మీ అందరితో యోచించి మీ బాధ్యతగా స్వీకరిస్తున్నారు కాబట్టి అది కృష్ణా నుంచో, గోదావరి నుంచో ఎక్కడి నుంచో తెచ్చి అమలుచేయబడుతుందని సుస్పష్టం చేస్తున్నాను.

**డా. ఎమ్.వి. మైసూరారెడ్డి:** కృష్ణానో, గోదావరో ఏదో ఒకటి తేల్చి చెప్పండి.

**శ్రీ ఎన్.టి. రామారావు:** కమిటీ రిపోర్ట్ ఇవ్వనియ్యండి. కమిటీ రిపోర్ట్ రావాలి. కమిటీ రిపోర్ట్ ఇస్తే తప్పకుండా నీరు ఇస్తాము. ఎక్కడ నుంచి అయితే ఏమి? ప్లాన్ చేయాలనే నిర్ధారణ లేదు మహానుభావులు, విజ్ఞులు, ఇంజినీర్లు ఉన్నారు.

అదేవిధంగా ఈనాడు పాతబస్తీ విషయంలో సోదరులు మనవిచేశారు. వారికి నేను సవినయంగా తెలియజేస్తున్నాను. ఎప్పుడూ జరగనటువంటి అభివృద్ధి ఈనాడు పాతబస్తీలో జరుగుతున్నది. అక్కడ ఒక స్టేడియం కోసం 25 లక్షల రూపాయలు తెలుగుదేశం ప్రభుత్వం మంజూరు చేసిందని వారికి నేను సవినయంగా తెలియజేస్తున్నాను. అదే విధంగా డ్రైనేజ్ కోసం ప్రత్యేకంగా 38 లక్షల రూపాయలు మంజూరు చేయడం కూడా జరిగింది. అదే విధంగా అక్కడ ఉన్న 46 వాస కూటాలను అభివృద్ధి చేసేందుకు 11 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగింది. 19వ జంక్షన్ లో ప్రత్యేకమైన సైంటిఫిక్ ట్రాఫిక్ సిగ్నల్స్ పెట్టడం కూడా జరిగింది. చార్మినార్ దగ్గర రోడ్డు విస్తరణ వారే చూస్తున్నారు. కాబట్టి ఏదో మనకున్న వనరులలో పాతబస్తీ నూతన శోభలతో కొత్త బస్తీలాగానే వెలగాలని ఉన్న పరిధిలో సరైన అభివృద్ధి చేయిస్తున్నామని మాట ఇస్తున్నాను. సర్క్యులర్ రైల్వే పారిశ్రామికులు ఎంతో మంది బైటనుంచి పట్టణానికి

వస్తున్నారు. సర్క్యులర్ రైలు కావాలంటే 300 కోట్ల రూపాయలు కావాలి. ఇది మన చేతులలో లేని విషయము. మేము కూడా కోరడము జరుగుతున్నది. దానికి మేము ఎదురు చూస్తున్నామని సవినయంగా మనుచేస్తున్నాను. సనత్‌నగర్ ఓవర్ బ్రిడ్జి కూడా ప్రారంభించడం జరిగింది. ఇది రెండవ బ్రిడ్జి, దీనికి అంకురార్పణ చేయడం జరిగిందని మనవిచేస్తున్నాను. అదే సబ్ బేస్ కాని 4, 5 ఓవర్ బ్రిడ్జిలు కట్టించాలని ప్రభుత్వం యోచన చేస్తున్నది. ముఖ్యంగా పట్టణాభివృద్ధి కోసం చేస్తున్నది. ఇది మన ముఖ్యపట్టణము.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే కాదు, ప్రజలందరు గర్వించదగిన పట్టణము. ఇది ఉమ్మడి నగరంగా ఉండాలి. కేవలం పాత కాలం ఏలుబడిలో ఉన్న ముస్లిం నాగరికతను, తెలుగు నాగరికతకు వివిధ రాష్ట్రవాసుల యొక్క ఆచార వ్యవహారాల నాగరికతకు ఒక జాయింట్ సివిలియేషన్‌గా మిగిలినటువంటి ఈ మహాదృష్ట సంజాతమైన ఈ మహానగరాన్ని కాపాడుకోవాలనే భక్తి భావంతో కృషి చేస్తున్నామని సవినయంగా మనవిచేస్తున్నాను. అదేవిధంగా లలితకళాతోరణం ఈనాడు కరువు వస్తే శిల్పాలు ఏదో పెట్టారనే మాట అన్నారు. మరి కరువు వచ్చింది కదా అని ఏ పనులు మానుకొన్నాము. కేవలం ఈనాడు మనకు ఉన్నా లేకపోయినా ఆడంబరంగా పైకి కనపడడము మన ఆచారము. లేనితనము చూపించడం మన ధర్మముకాదు, అసలు మనకు ఎవరు పాతవాళ్ళు, మనది ఏ వారసత్వం. అసలు ఎవరికి తెలుసు. జాతీయ జెండా గురించి ప్రధానమంత్రి గారిని నేను అడిగాను వారు చెప్పలేకపోయారు. నేను చెప్పాను. జాతీయ జెండా రచన చేసిన తెలుగువాడు పింగళి వెంకయ్య అని, అలాంటివి గుర్తు రావాలంటే చిరస్మరణీయంగా వాళ్ళు కళ్ళ ముందు ఉండాలని, మహా త్యాగులు, వాళ్ళు...స్వాతంత్ర్యం కోసం బ్రతుకు ధారపోసిన వారు.

అదే విధంగా ఈనాడు ట్యాంక్‌బండ్ నిర్మించడమే కాదు, 100 కోట్ల రూపాయల వ్యయంతో హుసేన్‌సాగర్ టూరిస్టు రిక్రియేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇది మన నగరము. మన హైదరాబాద్. మనం అలంకరించుకోవాలి. మన ఆడబిడ్డలకు, మన చెల్లెళ్లకు, మన కూతుళ్ళకు మనం శోభ చేసుకొంటున్నట్లుగా పట్టణాన్ని చూసి మురిసిపోవాలి. అందుకే ఈనాడు వీధులన్నీ విస్తరించడం జరిగింది, రాత్రైనా, పగలైనా అనుకోకుండా శ్రమించడం జరుగుతుంది.

మైనారిటీస్‌కు సంబంధించి-మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ పెట్టాము. వక్ఫ్ ప్రాపర్టీస్ విషయంలో కూడా ఒక కార్పొరేషన్ పెట్టాలని ఆలోచిస్తున్నాం వక్ఫ్ ప్రాపర్టీస్ ఏ స్వార్థపరుల చేతుల్లోను పడకుండా వారి జాతి ఉద్ధరింపబడడానికి, విద్య వైజ్ఞానికంగా ఉన్నతంగా వారికి స్థితిగతులు కల్పించేందునుగాను ఇది ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఆ విధంగా మైనారిటీస్ ఉన్నతి కోసం ప్రభుత్వం ఆలోచిస్తున్నది, వారి మతాచారాలలో వేలు పెట్టకుండా, అభ్యుదయ పథంలో వారిని ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం ఆలోచిస్తున్నదని మనవిచేస్తున్నాను.

నాకు ప్లేన్ టైమ్ అవుతున్నది, సమయం తక్కువగా ఉన్నది కాబట్టి, మీకు కూడా ఓర్పు తగ్గుతున్నది కాబట్టి, సవినయంగా మీకు మనవిచేస్తున్నాను. మీరు చేసిన సూచనలకు మరొకసారి ప్రభుత్వం తరపున నా అభివందనాలు వివిధ రాజకీయ పక్షాల నాయకులకు, ప్రతినిధులకు అందరికీ తెలియజేస్తున్నాను, మీ అందరి ఆశీస్సులతో, మీ పూర్తి సహకారముతో నూతన సంవత్సరంలో ముందుకు సాగాలని, ప్రత్యేకంగా పేద ప్రజానీకం సంక్షేమం కోసమే తెలుగు దేశం ప్రభుత్వం అహర్నిశలూ కృషిచేస్తూ పోతుందని హృదయపూర్వకంగా తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను. జై తెలుగునాడు.

◆◆

జనవరి 23, 1987

# పరిశ్రమ కుంటుపడినప్పుడు దాన్ని శ్రామికులకే అప్పగించాలి

*(సర్‌సిల్క్ ఫ్యాక్టరీ పునః ప్రారంభంపై జరిగిన చర్చ)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, సర్ సిల్క్ ఫ్యాక్టరీ మూతపడిన సంగతి సభ్యులందరికీ తెలిసిన విషయం. ప్రతిపక్ష నాయకుల వారికి ముఖ్యంగా తెలుసు. దాని విషయంలో వర్కింగ్ క్యాపిటల్ విషయం వచ్చినప్పుడు ప్రభుత్వం ఒక నాలుగున్నర కోట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. 3 సంవత్సరాల లోపల నష్టాలను భరించడానికి కూడా. సంవత్సరానికి కోటిన్నర రూపాయలను కూడా ఇదివరకే అంగీకరించడం జరిగింది. కానీ దాని వర్కింగ్ క్యాపిటల్ ఐదున్నర కోట్లు. ఐదున్నర కోట్లు ఇవ్వాలన్నప్పుడు ఏ విధమైన రిపోర్టు మాకు మీరు అందచేసే బాధ్యత ఉన్నది అన్నప్పుడు మొదట మేము సిట్రా కమిటీ రిపోర్టు వేయడం, శుభ్రంగా పరిశీలించి దాని వయబిలిటీ చెప్పమన్నప్పుడు గౌరవసభ్యులకు కూడా తెలుసు. అప్పుడు దాని రిపోర్టు వచ్చినప్పటికీ కూడా మేము ప్రతిపక్షాల నాయకులను పిలిపించాము. వారు రిపోర్టుపై కూలంకషంగా చర్చించారు. అక్కడ, కొన్ని కండిషన్స్‌లో దాన్ని నడపవచ్చునన్నారు. వారానికి 7 రోజులు పనిచేయాలి. రోజుకు మూడు షిఫ్టులు పనిచేయాలి. ఇది ఓపెన్ చేసినప్పటికీ కూడా లాభాలతో నడుస్తుందని నమ్మకం, విశ్వాసం కలుగడం లేదని నిర్ధిష్టంగా వారు రిపోర్టు ఇవ్వడం జరిగింది అది వారికి కూడా తెలుసు.

సిట్రా కమిటీ రిపోర్టు ఇచ్చింది. సిట్రా మెంబర్సు ద్వారా ప్రతిపక్షాలందరిని కూడా ఆనాడు సంప్రదించడం జరిగింది. దానిలో ఉన్న విషయాలు ఇవి. వారు చెప్పిన దాంట్లో ఇన్‌క్రీజింగ్ టర్నోవర్ ఆఫ్ ది ఫ్యాక్టరీ రు.11 కోట్లు నుంచి 33 కోట్లకు పెంచమన్నారు. మూడు షిఫ్టులు పని చేయాలన్నారు. వారానికి సెలవు లేకుండా 7 రోజులు పని చేయాలన్నారు. ఇంక్రీజ్డ్ కెపాసిటీ, రేషనలైజేషన్ ఆఫ్ లేబర్ ఫోర్స్ ఇవన్నీ కూడా కండిషన్స్ చెప్పి ఇన్ని అవలంభించినప్పటికీ కూడా లాభం వస్తుందని చెప్పలేమని నిర్ధిష్టంగా వారు చెప్పడం జరిగింది. ఆ రిపోర్ట్‌లో వేరే మార్గం

ఏదీ ప్రభుత్వానికి గోచరించలేదు. పూర్తిగా లిక్విడేట్ చేయడానికి ప్రభుత్వం నిర్ణయించుకున్నది. ఆ శ్రామికులకు, వారికి ఏమాత్రం కూడా నష్టం కలుగకుండా అత్యంత ప్రాధాన్యం వారికి ఇచ్చి పూర్తిగా, సరైన, సర్వసౌకర్యాలు కల్పించడం జరుగుతుందని మనవిచేస్తున్నాను. అదేవిధంగా ఈనాడు ప్రభుత్వం వారు ఇచ్చే ఆర్థికపరమైన సహాయం మొదట వారికి వేరే ఉద్యోగాలు లభించకపోతే పని లేకపోతే, పని లభించకపోతే 70 శాతం జీతాలు ఇవ్వడం, 53వ సంవత్సరం, పాతిక పర్సెంటు ఉద్యోగులకు వేతనాలు సంక్రమింపచేయడం, మన గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ద్వారా జరుగుతుంది. కాబట్టి, ఆ విషయాల గురించి సర్వ విధాల న్యాయాలు కలిగించడం జరుగుతుందని మీ ద్వారా మనవి చేస్తున్నాను.

గౌరవనీయ సభ్యులు తమద్వారా సూచించిన సూచనలను అన్నింటినీ కూడా నేను వినడం జరిగింది. అయితే ఒక బాధావహమైన విషయం. ప్రభుత్వం కూడా ప్రజాసామ్య పద్ధతిలో ప్రజలకు సంబంధించినదే. ప్రజల డబ్బుతో ఇక్కడ వ్యవహారం నిర్వహించుతున్నదే కాబట్టి ఆ ధనం ఖర్చు పెట్టే విషయములో కూడా సరైనటువంటి న్యాయం భవిష్యత్తులో ఆశాజనకంగా ఉంటుంది అనేటప్పుడు తీసుకోవలసిన నిర్ణయం ఎప్పటికప్పుడు పరిశీలించవలసి ఉంటుందని నేను మనవిచేస్తున్నాను. ఈ సర్ సిల్క్ ఫ్యాక్టరీ విషయం గత వ్యవస్థలో జరిగిన విషయం ఇది. అప్పుడేమో వారు పూర్తిగా బిర్లాలకు ఎందుకు ఇచ్చారో, వారు డబ్బు పెట్టకపోయినా పెత్తనం చెలాయించేందుకు అనేది అర్థంకాని విషయం. ఇప్పటికీ అన్యాయం జరిగింది. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తరువాత పూర్తిగా, అక్కడ ప్రత్యేకంగా కార్మిక, శ్రామిక సంక్షేమం కోరి రు.70 లక్షలు ప్రత్యేకంగా వారికి జీతాలు ఇవ్వడం కూడా జరిగింది. శ్రామికుల విషయములో పూర్తిగా సానుభూతి ఉంది.

**ప్రభుత్వం కూడా ప్రజాసామ్య పద్ధతిలో ప్రజలకు సంబంధించినదే. ప్రజల డబ్బుతో ఇక్కడ వ్యవహారం నిర్వహించుతున్నదే కాబట్టి ఆ ధనం ఖర్చు పెట్టే విషయములో కూడా సరైనటువంటి న్యాయం భవిష్యత్తులో ఆశాజనకంగా ఉంటుంది అనేటప్పుడు తీసుకోవలసిన నిర్ణయం ఎప్పటికప్పుడు పరిశీలించవలసి ఉంటుందని నేను మనవిచేస్తున్నాను. ఈ సర్ సిల్క్ ఫ్యాక్టరీ విషయం గత వ్యవస్థలో జరిగిన విషయం ఇది.**

కేవలం వారు ఇప్పుడు మనవి చేసిన ప్రకారంగా ఆచరించవలసి ఉంటే కార్మికులకు, శ్రామికులకు ఏమాత్రమూ అన్యాయం జరగదు. వారికి ముట్టవలసిన విధానాలు వారికి ముడతాయి. అదే కాకుండా నేను ప్రత్యేకంగా తమకు మనవిచేసి ఉన్నాను. టెక్స్‌టైల్స్ వర్కర్స్ రీహాబిలిటేషన్ ఫండ్‌లో నుంచి కూడా వారికి మూడు సంవత్సరాలు భృతి కల్పించబడుతుందని మనవిచేశాను. అంతే కాకుండా ఈ ఫ్యాక్టరీలో ప్రత్యేకంగా ఇంకా ఏమైనా మార్పిడి, ఆధునికీకరణ కూడినటువంటి ఏదైనా ఒక పరిశ్రమ అయితే, ఈ టెక్స్‌టైల్స్ పరిశ్రమకు సంబంధించినది కనుక పెట్టినట్లయితే లాభసాటిగా ఉంటుంది ఏమో, వారికి కూడా ఎక్కువ పని కల్పించడానికి

వీలవుతుందేమో అనే విషయం కూడా ప్రభుత్వం గమనిస్తుందని తమ ద్వారా మనవిచేస్తున్నాను. ఇక మనవిచేయాలంటే ఈనాడు శ్రామికులకు, కార్మికులకు ఏ విధమైన విప్లవాత్మకమైన చట్టాలను ప్రభుత్వం తేవాలి, మోసాలకు బలి కాకుండా ఈ శ్రామికులను, కార్మికులను బ్రతికించగలగాలి అనే విషయములో, పారిశ్రామిక వివాదాల విషయములో విప్లవాత్మకమైన చట్టం తీసుకురావడానికి ప్రభుత్వం సిద్ధముగా ఉంది. రేపు దీని విషయములో గౌరవ సభ్యులు మాటాడతారు, అంతేకాకుండా సిక్ ఇండస్ట్రీస్ యాక్టును సెంట్రల్ గవర్నమెంట్ ప్రవేశపెట్టడం జరిగింది. ఈ విషయం కూడా పూర్తిగా పరిశీలించి. దాని మీద ఏవిధంగా ఈనాడు సిక్‌గా ఉన్నటువంటి పరిశ్రమల విషయములో ఏవిధమైన చర్యలు తీసుకోడానికి వీలవుతుందో కూడా పరిశీలించడం జరుగుతుందని మనవిచేస్తున్నాను. గౌరవసభ్యులు చూసి వచ్చాము అన్నారు. అక్కడ శ్రామికుల చేతుల్లో ఉన్న పని తీయాలనేది ప్రభుత్వం యొక్క ఉద్దేశం కాదు. దీనిని ఈనాడు కూడా మరొకసారి సవినయముగా మనవిచేస్తున్నాను.

ఈనాడు ఏదైనా ఒక కోపరేటివ్ పద్ధతిగా పెట్టి శ్రామికులు, కార్మికులకు మిల్లును నడుపుకొనగలిగిన శక్తి ఉంటే ప్రభుత్వం పూర్తిగా వారికి సహాయం చేస్తుంది. ఆ విధంగా నడుపుకోమనండి. వారికి మిల్లును ఇవ్వడానికి అభ్యంతరం లేదని మనవిచేస్తున్నాను. ఎందుకంటే ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రమోటివ్ వ్యవస్థే తప్ప, ఎక్కడికక్కడ పరిశ్రమలు అభివృద్ధిపరిచే వ్యవస్థ తప్ప వ్యాపారాత్మకంగా పరిశ్రమలకు దేనికి దానికి సాగించేటటువంటి వ్యవస్థ కాదన్నది మరొకసారి గుర్తు చేస్తున్నాను. ఈనాడు శ్రామికులు, కార్మికులు కూడా ఇది మంచి వ్యవస్థ, లాభం వస్తుంది అని వారికి ఉద్దేశం ఉంటే పూర్తిగా వారి భావముతో అంగీకరించి వర్కర్స్‌కి ఈ మిల్లును అప్పచెప్పడానికి అభ్యంతరం లేదు. ఆర్థికంగా సహాయం చేయడానికి, మాకు వీలైనంతవరకు ప్రత్యేకంగా సాయం చేయడం జరుగుతుంది. కాబట్టి ఈ విషయములో గౌరవ సభ్యులు ఆలోచించి చెప్పినట్లయితే ఈ మిల్లును వర్కర్స్ కోపరేటివ్‌కి అప్పచెప్పడానికి నేను సిద్ధముగా ఉన్నాను మనవిచేస్తున్నాను.

అధ్యక్షా, గౌరవ సభ్యులు వారి అభిప్రాయాలు చెప్పారు. రాజేశ్వరరావు గారు చెప్పింది కూడా విన్నాను. అదొక దౌర్భాగ్యమైన అనుభవం గతంలో జరిగింది. ఈ రాష్ట్ర ప్రభుత్వం 27.35 శాతం ఉండగా, నైజాం ఛారిటబుల్ ట్రస్ట్ 46.6 శాతం ఉండగా ఇతర ఆర్థిక సంస్థలు 26 శాతం భాగం ఉండగా కేవలం బిర్లా వారు తీసుకోవడం, ఏజెంటుగా ఉండడం, వారు నడిపించడం, వారు తీసుకోవడం దురదృష్టకరమైన అనుభవం. ఈనాటికి కాదు. పూర్తిగా వారు కావాలన్నప్పుడు అన్ని సౌకర్యాలు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది అని కూడా ఈ సందర్భంగా నేను సుస్పష్టం చేస్తున్నాను. ఆల్కహాల్ కావాలి, సరైన సప్లయి సరైనంత లేనప్పుడు మేము బయట నుంచి ప్లెడ్జు తెచ్చుకుంటాము అంటే దానికి అనుమతి ఇవ్వడం జరిగింది. అదే

విధంగా డబ్బు కావాలి. ఆర్థికమైన వనరులు కావాలి యంత్ర సామాగ్రిని మార్టుగేజ్ చేసి తెచ్చుకొంటాము అంటే దానికి కూడా ఆ విధంగా అంగీకరించడం జరిగింది. అంతే కాకుండా పూర్తిగా దురదృష్ట విధానంలో మూతపడ్డప్పుడు, పూర్తిగా ప్రభుత్వం బాధ్యత వహించి ఒక అధికారిని నియమించి రు. 75 లక్షలు కార్మికులకూ, శ్రామికులకూ జీతాలు ఇవ్వడం జరిగింది.

ఈ సందర్భంలో అది పూర్తిగా ప్రజావ్యవస్థ కాదు అని గుర్తు చేస్తున్నాను. ఏదైనా ప్రోత్సాహం ఇవ్వడం బాధ్యత, పరిశ్రమలను అభివృద్ధి చేయడం బాధ్యత కానీ ప్రతి పరిశ్రమ నష్టపడితే నెత్తిన వేసుకోవడానికి ఈ ప్రభుత్వం సిద్ధంగా లేదు. ఆలోచనలో లేదు అని నేను సుస్పష్టం చేస్తున్నాను. ప్రాథమికంగా కార్మికులకూ, శ్రామికులకూ పూర్తిగా మద్ధతు ఇవ్వడం జరిగింది, జరుగుతుంది. ఏదైనా సరే వారు నిర్వహించే పద్ధతిలో యాజమాన్యాన్ని మాత్రం సమర్థించడం ఎప్పుడూ జరగదు, వారికి పూర్తిగా సౌకర్యాలు కల్పించబడతాయి. గౌరవ సభ్యులు ఏవిధంగా లాభసాటిగా ఉంటుంది అంటున్నారో, అని వారు ఊహించుకొంటున్నారో ఆ లాభాన్ని ఆ శ్రామికులు పొందగలిగితే నేను ఎంతో సంతోషపడతాను. వారికి ఉచితంగా హేండోవర్ చేయడానికి నాకు ఏమాత్రం అభ్యంతరం లేదు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు గారు చెప్పారు. ఫార్మర్స్ కౌన్సిల్ బిల్ ప్రవేశపెట్టబోతున్నామని. ఇదే సందర్భంలో నేను మనవిచేస్తున్నాను. కో ఆపరేటివ్ చక్కెర ఫ్యాక్టరీస్‌లో ప్రతి ఫ్యాక్టరీ కూడా ఎన్నో కోట్లు నష్టపడి దగాపడి ఉన్నదో గౌరవ సభ్యులు రాజేశ్వరరావు గారికి కూడా తెలుసు.

ఈ విధమైన దురదృష్టకరమైన విధానం ఉండకూడదు. వారు ఎంత చెరకు పండిస్తున్నారో అటువంటి వారికి వారి భాగస్వామ్యంతో వారే పరిశ్రమను నడిపించుకొనే సంపూర్ణమైన అధికారం వారికే ఇవ్వాలని ప్రభుత్వం యొక్క ఆలోచనగా వారికి నేను స్పష్టం చేస్తున్నాను. కాబట్టి అదే సందర్భంగా, అదేవిధంగా ఆ కార్మికులు ఈ పరిశ్రమ నిర్వహించుకొనే పద్ధతిలో పూర్తిగా వారికి సహాయం అందించడానికి ప్రభుత్వం ఏమాత్రం వెనుదీయదు. ఇది విలువైన ఫ్యాక్టరీ అని చెబుతున్నారు. నాకూ సంతోషంగా ఉంది. అటువంటి విలువైన ఫ్యాక్టరీ వారు శ్రమ చేస్తాము, కష్ట పడతాము, పని చేస్తాము. అంటే వారికి ఉచితంగా అప్పగించి మిగిలిన సహాయ సహకారం ఏది కావాలన్నా ప్రభుత్వం పూర్తిగా ఆలోచిస్తుంది. దాని విషయంలో వెనుకాడడం జరగదు. కార్మిక శ్రామిక శక్తులకు ఎప్పటికీ ద్రోహం చేయడం జరగదు. వారికి పరిపూర్ణమైన భాగస్వామ్యాన్నిచ్చి ప్రోత్సహించి ఈ పరిశ్రమ అభివృద్ధి చేసే విధానాన్ని తప్పకుండా గమనిస్తామని, ఆలోచిస్తామని తమ ద్వారా వారికి హామీ ఇస్తున్నాను.

కానీ ఇప్పుడు మీరు పెట్టుకోండి బాధ్యత వహించండి, నడపండి అంటే ప్రజావిత్తం ఈ విధంగా ఇన్ని కోట్లు నష్టపడిన దానికి, ఆ పరిశ్రమకు ప్రజల డబ్బును ఈ విధంగా దుర్వినియోగం చేసే పరిస్థితిలో ప్రభుత్వం లేదు. వారు కనుక ఈ విషయాన్ని గమనించి పూర్తిగా ఆలోచించి శ్రామికులకు, కార్మికులకు వారి నాయకత్వంలో వారికి అప్పగించడానికి, కో ఆపరేటివ్‌గా దానిని

అప్పగించడానికి మాత్రం ఏమాత్రం అభ్యంతరం లేదు. లిక్విడేషన్ ప్రశ్న అప్పుడు ఉత్పన్నం కాదు. కాబట్టి ఈ విషయంలో గౌరవనీయ ప్రతిపక్ష నాయకులు వారందరూ కూర్చొని, శ్రామిక కార్మిక నాయకులతో కూడా ముచ్చటించి, ఈ పరిశ్రమను బాధ్యతాయుతంగా వారు నిర్వహించుకొనే పరిస్థితిలో ప్రభుత్వం పూర్తిగా అండదండలు ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. ఆదర్శవంతంగా ప్రారంభించబడే తొలి విధానంగా మార్చగలిగితే నేను ముఖ్యంగా సంతోషిస్తానని సవినయంగా వారికి నేను మనవిచేస్తున్నాను.

అధ్యక్షా, ఈ దేశంలో, చారిత్రాత్మకమైనటువంటి శ్రామిక విధానం సృష్టించాలి అన్నది ప్రభుత్వం ఆలోచన. ఏదైనా ఈ విధంగా పరిశ్రమ కుంటుపడినప్పుడు దాన్ని, యజమానికి ఏ మాత్రం మద్దతు ఇవ్వకుండా, శ్రామికులకే అప్పగించాలి. అలాగే బాధ్యతను అప్పగించి, భాగస్తులను చేసి వారే నిర్వహించుకొనేటట్లు చేయాలి. 'వారికి, ఆ శ్రామిక శక్తికి గౌరవం ఇవ్వాలి అనేది ప్రభుత్వ విధానం. కాబట్టి ఈ విషయంలో గనుక గౌరవనీయులైన సభ్యులు అందరూ సహకరిస్తే ఆదర్శవంతమైన పద్ధతిలో కార్మికుడిచే యజమానిగా నిర్ణయించే బాధ్యత మనం దక్కించుకున్నట్లు అవుతుంది. కాబట్టి ఈనాడు ఈ పరిశ్రమను మూత పెట్టాలి అనేది ప్రభుత్వం ఉద్దేశం కాదు. కానీ ఎప్పటికప్పుడు నష్టాలు వస్తున్నాయి కాబట్టి ఈనాడు ఆ కార్మిక శక్తిని గుర్తించి సరియైన మార్గంలో వారిని నడిపించగలిగితే ఈ పరిశ్రమను వారికి అప్పగించడం జరుగుతుంది. ఇటువంటి ఉదాత్తమైన విధానానికి అందరూ కూడా సరియైన పద్ధతిలో రూపకల్పన చేయాలని సవినయంగా ప్రతి వారికి మనవిచేస్తున్నాను.

> **ఈ దేశంలో, చరిత్రాత్మకమైనటువంటి శ్రామిక విధానం సృష్టించాలి అన్నది ప్రభుత్వం ఆలోచన. ఏదైనా ఈ విధంగా పరిశ్రమ కుంటుపడినప్పుడు దాన్ని, యజమానికి ఏ మాత్రం మద్దతు ఇవ్వకుండా, శ్రామికులకే అప్పగించాలి. అలాగే బాధ్యతను అప్పగించి, భాగస్తులను చేసి వారే నిర్వహించుకొనేటట్లు చేయాలి. 'వారికి, ఆ శ్రామిక శక్తికి గౌరవం ఇవ్వాలి అనేది ప్రభుత్వ విధానం.**

అధ్యక్షా, గౌరవసభ్యులు కార్మిక శాఖామంత్రిగారు – ఇంద్రారెడ్డిగారితో మాట్లాడారు, కాబట్టి, నేను వారి అభిప్రాయాలు వారి ద్వారా వినడం జరిగింది. ఈనాడు వారికి మరొక అవకాశం కావాలంటే ఇవ్వడానికి నాకు అభ్యంతరం లేదని కూడా నేను చెప్పాను. కాబట్టి గౌరవనీయులైన ప్రతిపక్ష నాయకులు 30 రోజులు గడువు తీసుకొని సరియైన నిర్ణయం ప్రభుత్వానికి అందజేస్తే ఆ విధంగా చేయవచ్చు; అంతేగానీ, ప్రభుత్వమే నిర్వహించే స్థితిలో మాత్రం లేదని చెబుతున్నాను. ప్రభుత్వం ప్రజాక్షేమమే ధ్యేయంగా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ముందుకు వెడుతున్నది. అలాగే, కార్మిక సంక్షేమం ఎట్లా చెయ్యాలో మీరే చెప్పండి. వారి భాగస్వామ్యంతో, పరిశ్రమను పునరుద్ధరించి నిర్వహించే విధానం చెప్పండి. పూర్తిగా ప్రభుత్వమే పునరుద్ధరించి,

నిర్వహించమంటే - అది సాధ్యం కాదు, వారు ఈ యధార్థాన్ని గ్రహించి, సరియైన విధానం అందజేస్తే, 30 రోజులు వేచి ఉండడానికి ప్రభుత్వానికి అభ్యంతరం లేదని నేను మరొకసారి మనవిచేస్తున్నాను.

లిక్విడేట్ చేసే ఆలోచన మాత్రం లేదు. వారి ఆలోచన ఇచ్చేంత వరకు, 30 రోజులైనా ఆపుతాను. ప్రభుత్వం నిర్ణయం తీసుకోదు. వారు ఇస్తే సంతోషం, బాధ్యత లేకపోవడమేమీ లేదు. మా మంత్రిగారు ఉంటారు. మీరు కూడా మీ బాధ్యత నిర్వహించండి. అందరం కలిసి కార్మికులకు తిండి పెడదాము, ఆ పరిశ్రమ వారికి అప్పగిద్దాము. దానిని ఆదర్శవంతంగా నిర్వహించే విధానం ఆలోచించమని మేము చెబుతున్నాము. మధ్యదళారీలు, మధ్యపెత్తనం అక్కరలేదు, వారిని వారే నిర్వహించుకుని వారిలోని శక్తిని అందరం పెంపొందిద్దాం. దీనికి వారందరూ సహకరించాలని తమద్వారా సవినయంగా నేను వారికి మనవిజేస్తున్నాను.

గౌరవ సభ్యులు చెప్పిన దానితో నేను ఏకీభవిస్తున్నాను. ప్రజాసంక్షేమం కోసం ఖర్చు పెట్టే ఖర్చు కాదు. అభివృద్ధి కార్యక్రమం క్రిందనే ప్రభుత్వం భావిస్తుంది. కాకపోతే ఒక ఆదర్శవంతమైన విధానాన్ని సృష్టించాలి. కార్మిక శక్తి గుర్తించి శ్రామికులు సరైన భాగస్వామ్యం ఇవ్వాలి అలా చేస్తేనే వారు అభ్యుదయ పథంలో ముందుకు సాగుతారనే భావంతో వారిని భాగస్వాములను చేసి వారే నిర్వహించుకొనే అవకాశం ఇవ్వాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉందని సవినయంగా మనవిచేస్తున్నాను. ఎమ్.డి.గా ఐ.ఏ.ఎస్ ఫలానా వారు ఉండాలని నేను కోరడం లేదు. వారినే నిర్ణయించుకోమనండి. వారి భాగస్వామ్యంలో మూడు పువ్వులు ఆరు కాయలుగా నడుపుకోమనండి. దానికి సహకరించండి అని చెబుతున్నాను. కానీ రాజకీయం చేయదలచుకోలేదు. కార్మిక శ్రామిక సంక్షేమం కోరటమే ప్రభుత్వ విధానము. ప్రతి విషయంలో వారిని భాగస్వాములుగా చేద్దామనేదే నా కోరిక అని మనవిచేస్తున్నాను.

◆◆

మార్చి 27, 1987

# సమాజాన్ని పోషించే ప్రతి వర్గానికి స్వాతంత్ర్యం ఉండాలి

*(ప్రకాశం జిల్లాలో పొగాకు రైతుల ఆందోళనపై చేసిన ప్రసంగం)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, ఇది ఈనాటి సమస్య కాదు. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చినప్పటినుంచీ రైతుల ఇబ్బందులు చూస్తూనే ఉన్నాం. ఈనాడు పొగాకు పండించే రైతుల సమస్య కావచ్చు, నిరుడు ప్రత్తి పండించిన రైతుల సమస్య కావచ్చు, ఇంకొకసారి మరో పంట పండించే రైతుల సమస్య కావచ్చు. ఇలా ఎప్పటికప్పుడు రైతాంగం అసంతృప్తితో ఉందని మనవిచేస్తున్నాను. ఈనాడు రైతులపట్ల సరైన చూపు చూడబడడం లేదు. ఈనాడు ఈ విధమైన దౌర్భాగ్యపు పరిస్థితి దేశంలో ఉంది. ఈనాడు పారిశ్రామిక వేత్తలు ఉత్పత్తి చేస్తున్న చిన్న వస్తువు విషయంలో కూడా ఆ వస్తువు ఉత్పత్తికి అయ్యే వ్యయం, లాభం మొదలైనవి లెక్క వేసుకొని ఈ వస్తువుకు ఇంత ధర ఉండాలని చెప్పే అవకాశం పారిశ్రామిక వేత్తలకు ఉంది.

కానీ అలాంటి అవకాశం రైతాంగానికి లేదు. తాము ఉత్పత్తి చేస్తున్న పంటలకు ఈ రకమైన ధర ఉండాలని సూచించే అధికారం రైతులకు లేకపోవడం చూస్తే మన స్వాతంత్ర్యం దేనికి? ఎవరికోసం అనే ఆలోచన నాకు అప్పుడప్పుడూ కలుగుతుంది. స్వాతంత్ర్యం అనేది ప్రతివారికి రావాలి. సమాజాన్ని పోషించే ప్రతి వర్గానికి స్వాతంత్ర్యం ఉండాలి, కనీసం వారి భావాన్ని వ్యక్తం చేసే అవకాశం ఉండాలి. ఎక్కడో సెంట్రల్ ప్రైసెస్ కమిషన్‌లో ఎవరో ఉంటున్నారు, రైతాంగానికి ప్రాతినిధ్యం లేదు. ఈనాడు పొగాకు పండించే వారు, ప్రత్తి పండించేవారు, ధాన్యం పండించేవారు, ఇతర పంటలు పండించేవారు ఉన్నారు. పంటలు పండించేవారు తమ ఉత్పత్తులకు ఇంత ధర ఉండాలని కనీసం చెప్పుకొనేందుకు అయినా ఈ ప్రజాస్వామ్యంలో అవకాశం కలిగిందా అంటే అది కూడా పూర్తిగా లేదని మనవిచేస్తున్నాను.

రైతు దేశానికి వెన్నుముక అన్నాం, రైతు సంక్షేమమే దేశానికి సంక్షేమం అన్నాం, అహర్నిశలు రెక్కలు ముక్కలు చేసుకొని దేశానికి అన్నం పెట్టే అన్నదాత రైతు అన్నాం, రైతు పంటలు పండించని

ఎవరికీ తిండి దొరకదని అనుకొంటున్నాం, అలాంటి రైతును ఏ విధంగా గౌరవించాలన్నప్పుడు కర్షక పరిషత్తును ఏర్పాటు చేసి, అందులో వారికి ప్రాతినిధ్యం ఇచ్చి, వారి భాగస్వామ్యంలో ప్రజాస్వామ్యం పులకించాలనేదే తెలుగుదేశం సిద్ధాంతం అని మనవిచేస్తున్నాను. దానికోసం ఎన్నో రకాల సంస్కరణలు చేస్తున్నాం. 10 కోట్ల రూపాయలు ఇవ్వాలని బుచ్చయ్య చౌదరిగారు అన్నారు. రు.10 కోట్లే కాదు, ఎంతైనా ప్రోగు చేసుకొనే శక్తి వారికి ఉంది, ఆ శక్తిని మనం గుర్తించక మనం దగాపడ్డాం, దగా చేసాం. రైతు గౌరవంగా బ్రతికేవాడే కానీ బిచ్చమెత్తేవాడు కాదు. అందువల్ల వారి గౌరవాన్ని వారు కాపాడుకొంటారు.

ఈనాడు స్టేట్ ఎడ్వైజరీ ప్రైస్ ఎందుకు ఇవ్వవలసివస్తోంది? స్టేట్‌కు సంబంధం ఏమిటి? ఎన్నో రకాలుగా రైతులను బలపరిచే కృషి జరుగుతోందని మనవిచేస్తున్నాను. 1983లో తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక నేను కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా చెప్పాను. మధ్యదళారీ వర్గాలను ప్రభుత్వం ఎందుకు పోషిస్తున్నది. పండించే రైతులకే ఎక్స్‌పోర్టు లైసెన్స్‌లు ఇవ్వమని చెపుతున్నాము. లేకపోతే ఈనాడు మన ప్రతిష్ట పోతోంది. పొగాకు బేళ్లలో నాపరాళ్ళు పెట్టి పంపించారు. ఇసుక పెట్టి పంపించారు? ఈ రకంగా చేసి దేశానికి అప్రతిష్ట తెచ్చారు. ఇలా డబ్బుకోసం మానవత్వం బజార్లలో అమ్ముడుపోతున్నది. మానవతను రక్షించాలి. రైతాంగాన్నీ ఉద్ధరించాలి తప్ప వారి సంక్షేమాన్ని కబళించకూడదని కూడా నేను చెప్పడం జరిగింది. తాము పండించిన సరకులను విదేశాలకు ఎగుమతి చేసేందుకు వారికి అవకాశం కల్పించాలనీ, అట్లాగే వారికి అనువైన ధరలకు విక్రయించుకొనే అవకాశం కల్పించాలనీ మనవిచేసాను

దీని గురించి అడగడానికి ఆంధ్రప్రదేశ్ పౌరులుగా మనకు బాధ్యత ఉంది. రైతు సంక్షేమానికి అనుగుణంగా తెలుగుదేశం ప్రభుత్వం విధానాలను రూపొందించుకోవడం జరిగింది. రైతులు తమను తామే ఉద్ధరించుకోవాలని కర్షక పరిషత్తును ఏర్పాటు చేసాం. ఈ రకంగా రైతులు కూడా ప్రభుత్వంలో భాగస్వాములు కావాలి. ప్రభుత్వంలో అన్నివర్గాల ప్రజల భాగస్వామ్యం ఉన్నప్పుడు నిజమైన ప్రజాస్వామ్యం అవుతుంది కానీ ఈనాడు ఓట్ల కోసం ప్రజల దగ్గరకు వెళ్ళి ఆ తరువాత వారి అవసరాలు తీర్చకుండా మా ఇష్టం వచ్చినట్టు చేస్తామనడం మంచిది కాదు. అందువల్ల ప్రభుత్వపరమైన విధానాలలో రైతులకు భాగస్వామ్యం కల్పించాలనీ, ప్రతి మనిషికి కూడా ప్రభుత్వ విధానాలలో భాగస్వామ్యం కల్పించాలనేదే తెలుగుదేశం ప్రభుత్వ సిద్ధాంతమని సవినయంగా మనవిచేస్తున్నాను. ఈనాడు రైతులను కూడగట్టుకోవడం జరిగింది. చెరకు పండించే రైతులకు కోఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీలను అప్పగించాము.

రైతులు ఏ ఏ పంటలను పండిస్తున్నారో, వాటికి సంబంధించిన పరిశ్రమలను ఆయా ఫెడరేషన్ల ద్వారా రైతులే నిర్వహించుకొనే అధికారాన్ని సంక్రమింపజేయాలి. అధికారులు వారిపై పెత్తనం చేయడంగానీ, వారిని తొక్కి పెట్టడంగానీ జరగకూడదు. ఇలా రైతుల గౌరవాన్ని కాపాడే

విధానమే తెలుగుదేశం ప్రభుత్వం అనుసరిస్తోంది. ఆ విధానంలో భాగంగానే టొబాకో యూనియన్ వారికి ప్రభుత్వపరంగా రెండు కోట్ల రూపాయలు ఇవ్వడం జరిగింది. అట్లాగే ప్రత్తి విషయం తీసుకొంటే వైట్ ఫ్లయ్ వల్ల ప్రత్తి దెబ్బతిన్నప్పుడు, నాణ్యత తగ్గినప్పుడు ఉడతా భక్తిగా సహాయం చేయాలనుకొన్నాం. అది ఎంత అని కాదుగానీ, తెలుగుదేశం ప్రభుత్వం రైతులపట్ల ఏ విధంగా సానుభూతితో ఉందో స్పష్టంచేయదలచుకొన్నాను. యూనియన్ వారికి రూ.2 కోట్లు ఇచ్చాము.

అదృష్టవశాత్తూ లాభం వచ్చిందని వారు చెప్పారు, సుమారు లక్షా అరవై వేల రూపాయలదాకా లాభం వచ్చిందని వారు చెప్పారు. ఆ డబ్బును ప్రత్తి రైతులకు అడ్వాన్స్‌గా ఇచ్చి ప్రత్తిని కూడా కొనుగోలు చేయమని చెప్పడం జరిగింది. ప్రభుత్వపరంగా ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అయితే ప్రత్తి విషయంలో నష్టం వచ్చింది. అయినా వారు ఉదారంగా ఉన్నారు. వారికి డబ్బు లేకపోయినాసరే, ఒక కోటి రూపాయలు వారికి చెల్లించి టోబాకో యూనియన్ వారు పొగాకు కొనడానికి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఇకపోతే రైతులు బెంబేలు పడుతున్నారు కాబట్టి మీరు కూడా ఎస్.టి.సి. ద్వారా పొగాకు కొనవలసిన అవసరం ఉందని కేంద్ర ప్రభుత్వం వారికి మనవిచేయడం జరిగింది. మేము ఇచ్చిన కోటి రూపాయలు మూలధనంగా పెట్టుకొని, బ్యాంకుల ద్వారా మరో 4, 5 కోట్ల రూపాయలు తీసుకొని టొబాకో యూనియన్ వారు సరకును కొనే సౌకర్యం కల్పించడం జరిగింది. అట్లాగే కేంద్ర ప్రభుత్వం ఎస్.టి.సి. ద్వారా పొగాకు కొనడం జరుగుతుందని పత్రికలలో ప్రకటన కూడా వచ్చింది. ప్రభుత్వం వారికి ఈ సమాచారం అందజేసిన మీదట కేంద్రం వారు ఇలాంటి మంచి నిర్ణయం తీసుకొన్నందుకు వారిని అభినందిస్తున్నాను.

**కేంద్రప్రభుత్వం ఎస్.టి.సి. ద్వారా పొగాకు కొనడం జరుగుతుందని ప్రకటన కూడా వచ్చింది. ప్రభుత్వం వారికి ఈ సమాచారం అందజేసిన మీదట కేంద్రం వారు ఇలాంటి మంచి నిర్ణయం తీసుకొన్నందుకు వారిని అభినందిస్తున్నాను. ఇక చైనానుంచి కొందరు పొగాకు వ్యాపారులు వచ్చారని తెలుస్తోంది. మధ్యదళారులు ఉండకూడాదనేది మా విధానం, రైతులకు సాధ్యమైనంత ఎక్కువ ధర ఇచ్చినట్లయితే వారు సంతోషిస్తారు.**

ఇక చైనానుంచి కొందరు పొగాకు వ్యాపారులు వచ్చారని తెలుస్తోంది. మధ్యదళారులు ఉండకూడదనేది మా విధానం. రైతులకు సాధ్యమైనంత ఎక్కువ ధర ఇచ్చినట్లయితే వారు సంతోషిస్తారు. ఇది తెలుగుదేశం ప్రభుత్వ అభిప్రాయం. ఈ అభిప్రాయాన్ని కేంద్ర ప్రభుత్వానికి కూడా వ్యక్తం చేయడం జరిగింది. ఇలాంటి దౌర్భాగ్యపు పరిస్థితి రావడం మాకు ఎంతో బాధగా ఉంది. రైతు సంక్షేమం చూడడం ప్రభుత్వ ధర్మం. ప్రభుత్వం అన్ని రకాలుగా సహకారం అందించి వారిని ఈ విపత్తునుంచి బయటకు తేవడానికి ప్రయత్నిస్తుందని మనవిచేస్తున్నాను. నిన్నా, ఈవేళా కొందరు రైతులు నా వద్దకు వచ్చారు. వారికి కూడా ఇదే చెప్పాను. ఈ ప్రభుత్వం మీది,

తెలుగుదేశం అంటే ఇక్కడ ఉన్న కొద్దిమంది కోసం కాదు, ఆరు కోట్లమంది ప్రజల సంక్షేమం కోసం వ్యవహరిస్తున్న బాధ్యత కలిగిన వ్యవస్థ కాబట్టి మీ సంక్షేమాన్ని గమనిస్తామని వారికి హామీ ఇవ్వడం జరిగింది. ఇందాకా రాఘవరెడ్డిగారు ఒక కమిటీని ఏర్పాటు చేయమన్నారు. మాకు అభ్యంతరం లేదు. ది గవర్నమెంట్ ఈజ్ సో ఓపెన్. మేము తీసుకొన్న చర్యలేమిటో నిష్పాక్షికంగా తమముందు పెట్టాను.

కమిటీని ఏర్పాటుచేయడానికి మాకు అభ్యంతరం లేదు. తమరు కూడా వెళ్లండి. ఈనాడు ఉండే పరిస్థితి అక్కడ చెప్పి సాధ్యమైనంతవరకు ఇక్కడ కావలసిన వసతి కల్గించే పద్ధతిలో మీరు కూడా వ్యవహరించాలి. మధ్యదళారులను మాత్రం తీసివేసే విధానాన్ని పూర్తిగా సమర్థించాలి. కేవలం వ్యాపారాత్మకమైన విధానాలతో ఇక్కడ మాత్రం రైతు సంక్షేమాన్ని తాకట్టు పెట్టకూడదని మాత్రం మా ఉద్దేశ్యం అని దయచేసి రాఘవరెడ్డి గారికి మనవిచేస్తున్నాను. వారు కనుక వెళ్ళాలంటే మాకు ఏమీ అభ్యంతరం లేదు. ఒక కమిటీని వెంటనే వేసాను. టైమ్ జాప్యం జరగడానికి వీలులేదు. అందరూ కూడా కలిసి ఎవరైతే వెళ్ళదలచుకున్నారో రైతులతో సంబంధం ఉన్న అఖిల పక్షాల వారు వెళ్ళవచ్చు వారికి బాధ్యత ఉంది. కాబట్టి మీరందరు వెళితే పూర్తిగా దీని విషయంలో మా తెలుగుదేశం ప్రభుత్వం తరపున వ్యవసాయ మంత్రిగారిని కూడా పంపుతుంది. వీరందరు కూడా వెళ్ళి దయచేసి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తమ దగ్గర సెలవు తీసుకుంటున్నాను.

◆◆

మార్చి 25, 1988

# ప్రజలే మాకు దేవుళ్ళు, సమాజమే మాకు దేవాలయం

## *(గవర్నరు ప్రసంగమునకు ధన్యవాదములు తెలుపు ప్రతిపాదనపై చర్చ)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, గౌరవసభ్యులకు తమ ద్వారా నా కృతజ్ఞతలు, అభినందనలు తెలియ జేసుకుంటున్నాను. గౌరవనీయులైన శ్రీ బాగారెడ్డిగారు, వెంకటపతిగారు, సిహెచ్.రాజేశ్వరరావుగారు, అమానుల్లాఖాన్ గారు, ఓంకార్ గారు, కుడుపూడి ప్రభాకరరావుగారు, బి.జె.పి.కి చెందిన వారికి, వర్గ ప్రతినిధులు అందరూ తమ అమూల్యమైన సూచనలు, అభిప్రాయాలు ఇచ్చినందుకు అందరికీ కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను, గవర్నర్‌గారి స్పీచ్ మీద ప్రభుత్వానికి ఉన్న ఒక నిర్దిష్టమైన అభిప్రాయం విషయంలో వారివారి అభిప్రాయాలు, వారివారి సూచనలు తెలియచేసినందుకు సదా కృతజ్ఞతలు. స్పీచ్ విషయంలో రెండు భాగాలుగా విభజింపవలసిన అవసరం ఉంది. స్పీచ్‌పరంగా సూచించిన సూచనలు కొన్ని, సామాన్యంగా విధానాలు, వివరాలు, విధుల మీద అందచేసిన సూచనలు కొన్ని.

ఈ విధంగా రెండు భాగాలుగా ఉన్నటువంటి దాని మీద సాధ్యమైనంతవరకు సంతృప్తికరంగా సమాధానం చెప్పడానికి ప్రయత్నిస్తానని మనవిచేస్తున్నాను. గౌరవనీయులైన సభ్యులు గవర్నరుగారు వచ్చినప్పుడు సరియైన మర్యాద జరుగలేదు. ముఖ్యమంత్రిగారు ఎదురువెళ్ళి వారిని ఆహ్వానించలేదనేటటువంటి అభియోగం తెలియజేయడం జరిగింది. ఎంతో బాధగా నేను దీనికి నా విచారాన్ని వ్యక్తము చేస్తున్నాను. వ్యవస్థను విమర్శిస్తున్నప్పుడు పూర్వాపరాలను గుర్తుంచుకుని ఆ విధంగా గౌరవించాలని, ఆ విధంగా వ్యవహరించాలని ఏమైనా లోటుపాట్లు జరిగాయో లేదో అవగాహన చేసుకుని మాట్లాడాలే తప్ప కేవలం ఒక వాదనే చేస్తూ, అది మర్యాద అనుకుంటే మాత్రము అది మంచిది కాదని విజ్ఞప్తి చేస్తున్నాను. రాజభవన్ నుంచి ఒక మెసేజ్ ఉంది. అది చదువుతాను.

"On arrival at the main portico, the Governer is received by the Speaker, Legislative Assembly and the Secretary to the State Legis-

lature. The procession is then formed with A.D.C. to the Governor, Speaker, Legislative Assembly, the Governer, Secretary to Governer, Secretary to the State Legislature."

అది ఇందులో లిఖించబడిన విషయం తు.చ తప్పకుండా పాటించడం జరిగింది. ఎవరినీ అమర్యాద పరచడం జరుగలేదు అని మనవిచేస్తున్నాను. పూర్తిగా వారిని గౌరవించడం, ఆ గౌరవించడంలోనే మన గౌరవం ఉందని, అది నా ధర్మం తప్ప మరొకటి కాదని, అధికారికంగా చేయవలసిన విధులలో చేయవలసిన విధానాన్ని ఏ మాత్రం మరువలేదని మనవిచేస్తున్నాను. విధానాల విషయంలో కొన్ని కొన్ని విషయాలు, వారివారి అభిప్రాయాలు తెలియచేశారు. అభిప్రాయాల విషయంలో – తెలుగుదేశం పార్టీకి సంబంధించినంతవరకు క్రమశిక్షణతో, విధానాల ఆచరణలో ఏమాత్రము కూడా ఎవరూ విమర్శలు చేయవలసిన అవసరం లేకుండా నిర్దిష్టంగా వ్యవహరిస్తున్నాము. మా ఐక్యత, మా ఆదర్శం మా బలమే మా సమైక్యత అనేటటువంటి భావంలో ప్రజా సేవకు అంకితమై మా మంత్రివర్యులు, శాసనసభ్యులు కృషిచేస్తున్నాము. అంతేగానీ నియంతృత్వ విధానం గానీ మరొకవిధంగా గానీ నడిపించడం జరగడం లేదు. ప్రజాస్వామ్య విధానాన్ని గౌరవించడం జరుగుతున్నదని మనవిచేస్తున్నాను. గత ఐదు సంవత్సరాల నా అనుభవాన్ని వ్యక్తము చేయడం అవసరం. వారివారి సూచనల ప్రకారం చూస్తే ఏవిధమైన దుర్విధానం, కుటిలమైన రాజనీతి తెలుగుదేశం పార్టీకి గానీ, తెలుగుదేశం ప్రభుత్వాన్నిగానీ కూలద్రోయడానికి జరిగిన కుటిల యత్నాలను గౌరవసభ్యులు గుర్తుంచుకోవాలని మనవిచేస్తున్నాను.

**అభిప్రాయాల విషయంలో - తెలుగుదేశం పార్టీకి సంబంధించినంతవరకు క్రమశిక్షణతో, విధానాల ఆచరణలో ఏమాత్రము కూడా ఎవరూ విమర్శలు చేయవలసిన అవసరం లేకుండా నిర్దిష్టంగా వ్యవహరిస్తున్నాము. మా ఐక్యత, మా ఆదర్శం మా బలమే మా సమైక్యత అనేటటువంటి భావంలో ప్రజా సేవకు అంకితమై మా మంత్రివర్యులు, శాసనసభ్యులు కృషిచేస్తున్నాము.**

1983 సంవత్సరములో 9 నెలల ప్రాయములోనే తెలుగుదేశం పార్టీ ఎంతోమంది సోదరులు ఎక్కువగా అభిమానించడం వలన అధికారానికి రావడం సంభవించింది. ఆవిధంగా జరిగినప్పుడు 1984 సంవత్సరములో ఎందుకు ఆనాడు ప్రజాస్వామ్యాన్ని కూలద్రోయడానికి ప్రయత్నాలు జరిగాయి. ఇది అందరికీ సంబంధించిన విషయం. ఈ విధమైన దురాలోచనలు, దురదృష్టకరమైన, అమానుషమైన సంఘటనలు ఏవిధంగా జరిగినాయో నేను ఈ సందర్భంగా గౌరవసభ్యులకు గుర్తు చేస్తున్నాను. అప్పటినుంచి ప్రజలందరూ చలించని అకుంఠిత విశ్వాసంతో 1983 సంవత్సరములో జరిగిన ఎన్నికలలో, 1984 సంవత్సరములో జరిగినటువంటి పార్లమెంటు ఎన్నికలలో, 1985వ సంవత్సరములో జరిగిన ఎన్నికలలో, 1987వ సంవత్సరములో జరిగిన మాండలిక రాజ్యాంగ విధాన ఎన్నికలలో, జిల్లాపరిషత్తు ఎన్నికలలో అప్పటి నుంచి నేటి వరకు ఒకసారి సింహావలోకనము

చేసుకుంటూ విమర్శనాత్మకమైన దృష్టితో ఏ విధమైన ప్రజావిజయాన్ని మనం గుర్తుంచుకోవాలని కోరుతున్నాను. విమర్శించనక్కరలేదు. వ్యక్తిగతమైన పేర్లు నేను చెప్పదలచుకోలేదు. వ్యవస్థల పేర్లు చెప్పదలచుకోలేదు. ప్రజలకు తెలుసు. గౌరవనీయులైన సభ్యులకు తెలుసు.

No constitutional entity is being spared to destabilise my government or de-popularise.

రాజ్యాంగ బద్ధమైన అన్ని వ్యవస్థలూ పూర్తిగా తెలుగుదేశం ప్రభుత్వాన్ని కూలగొట్టడానికి ఉపయోగించబడ్డాయి. ఇంతగా నిలబడగలిగామంటే ప్రజలే మాకు దేవుళ్ళు, సమాజమే మాకు దేవాలయం, పేద ప్రజానీకానికి చేసిన సంక్షేమంలో మేము నిలబడగలిగామని నేను మనవి చేస్తున్నాను. అటువంటి విధానాలు జరిగినప్పుడు నేను ఎటువంటి పరుషమైన విధానాలను ఎదుర్కొన్నానో, ఎందుకు ఎదుర్కోవలసి వచ్చిందో ముచ్చటించదలచుకోలేదు. అర్థించదలచుకోలేదు. నేను పూర్తిగా నా నైతిక బలంతో నిలబడదలచుకున్నాను. ఏ చెడు అలవాట్లు లేని నేను ప్రజలకు చెడు చేసి ఈ అధికారంలో ఉండదలచుకోనని మనవి చేయదలచుకున్నాను. నిన్న మొన్న పత్రికలలో చూశాను.

నా మీద ఆర్థిక నేరాల విషయంలో కోర్టుకు వెళ్ళడం జరిగింది. ఆర్థికంగా ఈ ఐదు సంవత్సరాలలో నేను ఏమీ సంపాదించానో నా మీద ఆర్థిక నేరాలుగా ఎందుకు కోర్టుకు వెళ్ళవలసి వచ్చిందో నాకు తెలియదు. నేను ఎదుర్కొంటాను. తలకాయవొంచడం అనేది నాకు తెలియదు. నేను అన్నీ విసర్జించి రాజకీయాలకు వచ్చాను, ప్రజలు నన్ను ఎందుకు ఎన్నుకున్నారో నాకు తెలియదు, నేను ఏమీ రాజకీయ వేత్తను కాను. నేను ఏమీ రాజకీయ పాటవము అవగాహన చేసుకున్న వ్యక్తిని కాను. నేను మంచితనంతో అధికారానికి వచ్చాను. మంచితనంతో నేను ప్రజాసేవ చేయదలచుకున్నాను. ఆ మంచితనంతోనే నా ప్రజలకు జీవితాన్ని, నా ప్రాణాన్ని అంకితం చేయదలచుకున్నాను, సమర్పించదలచుకున్నాను. వారి ఆత్మీయతే సాక్ష్యాధారమని నేను మనవిచేస్తున్నాను. ఎదురు దెబ్బలు ఎదుర్కొనగలను కూడా.

మానవుడు అయిన తరువాత మడమ వెనుకకు త్రిప్పడం అన్నది ఎరుగని వ్యక్తినని, ప్రజలే నా దేవుళ్ళు, వారికే నాజీవితం అంకితమని మీ ద్వారా మనవిచేస్తున్నాను. సంస్థాగతంగా మార్పురానిదే వ్యవస్థలో మార్పురాదని సూచించారు. నాకు మా తెలుగుదేశం పార్టీకి ఒక సిద్ధాంతం ఉంది. తెలుగుదేశం పార్టీ సామాజికమైన న్యాయాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో, భావంతో మంచి తనంతో కృషి చేస్తున్నది. ఏదైనా ఇది మరొక విధంగా ఉంటే బాగుంటుందని అనుకుంటున్నాము. వ్యవస్థ వల్ల సంస్థ మారాలి. ఆ వ్యవస్థ వల్ల సంస్థ మారే అవకాశం ఉంది. మనకు 1947 సంవత్సరములో స్వాతంత్ర్యము వచ్చినది. ఇంతవరకు వ్యవస్థ మారలేదంటే స్వతంత్ర్యము అనే అమృతభాండము మన ముందు ఉందంటే ఆ అమృతభాండం నుంచి ఒక

చుక్కైనా పేదవారికి ఇవ్వగలుగుతున్నామా? దేశంలో నిరక్షరాస్యత ఉంది. దేశంలో అమాయకత్వం ఉంది. ఓట్ల విషయంలో డబ్బు దుర్వినియోగం అవుతున్నది. దేశం దగాతో నడుస్తోంది. స్వాతంత్ర్యము సంపాదించిన వ్యవస్థలో మార్పు రాలేదని మనవిచేస్తున్నాను. పేదవాడు పేదవాడిగానే ఉంటున్నారు. మహిళలు అస్వతంత్రులై ఎన్నో రకాల అక్రమాలకు లోబడి బ్రతుకుతున్నారు.

అదేవిధంగా చూడడానికి దిక్కే లేక దైన్యమైన స్థితిలో పేదరికం అనుభవిస్తున్నారు. పేదప్రజల ఈ స్వాతంత్ర్య ఫలితం పొందలేకపోతున్నారు. ఈ విధమైన వ్యవస్థలో మార్పు రాలేదని గుర్తించవలసిందిగా మనవిచేస్తున్నాను. సంస్థల విషయంలో మార్పు రావాలంటే ఈ సంస్థలకు రాజకీయ విధానం, సాంఘిక విధానం, ఆర్థిక విధానంలో పరిపుష్టత వారిలో వచ్చేంతవరకు మనం కోరినటువంటి సమభావన వికాసము వారికి అర్థము కావని మనవిచేస్తున్నాను.

*(ఉపసభాపతి అధ్యక్ష స్థానములో ఉన్నారు)*

ఈనాడు అజ్ఞానాంధకారములో నిరక్ష్యరాస్యులు సుమారు 65-70 శాతం ఉన్నారు. ఆలోచించలేని స్థితిలో అమాయకులున్నారు. ధనిక వర్గానికి, పెత్తందారీ వర్గానికి, బూర్జువా సిద్ధాంతానికి బలైపోయే విధానము ఈనాడు సమాజములో మన కళ్ళ ముందే ఉందని అంటే ఏవిధంగా ఆ యొక్క వ్యవస్థలన్నీ కూడా అసలు ఆరోగ్యకరమైన విధానములో విజ్ఞతను పెంపొందించుకోలేని స్థితిలో ఉన్నాయనేది దయచేసి గుర్తించాలని మనవిచేస్తున్నాను. స్థూలంగా ఆలోచిస్తే వ్యవస్థలో ఆ మార్పు లేదు. కాబట్టే, ఈనాడు విజ్ఞులందరూ ఈ దేశమునుండి వెళ్ళిపోతున్నారు. ఈనాడు ఆర్థిక వ్యవస్థ వల్ల పూర్తిగా మన విజ్ఞానాన్ని వాడుకోలేకపోతున్నాము, స్వతంత్ర భారత పౌరునిగా స్వతంత్రము నాది.

నేను భారత పౌరుణ్ణి. సాటి మానవుడిని మానవుడిగా గుర్తించాలి, సాటి మానవునికి సహాయం చేయాలనేటటువంటి విజ్ఞత ఈనాడు ఎక్కువ మందిలో రాలేదని అంటే, పూర్తిగా ఏవిధమైన వ్యవస్థాగతమైన అమాయాకత్వమో - ఆ వ్యవస్థాగతమైన వారికి ఆ ఆలోచన ప్రభావితం కాలేదనే విధానం కూడా గుర్తించాలని సవినయంగా మనవిచేస్తున్నాను. తెలుగుదేశం ప్రభుత్వము పూర్తిగా పెట్టుబడిదారీ వ్యవస్థ కాదు, అధికార ఆలోచన లేదు. పదవీ అలసత్వం ఏ మాత్రం లేదు. పూర్తిగా ఎవరైతే పేద ప్రజానీకం ఈ సమాజంలో 35 సంవత్సరాలు - తెలుగుదేశం ప్రభుత్వము ఆవిర్భవించేటప్పటికీ ఉందో, ఎవరైతే పూర్తిగా స్వాతంత్ర్య ఫలితాన్ని పొందలేకపోతున్నారో, ఎవరైతే పూర్తిగా స్వతంత్ర భావంతో మనలేకపోతున్నారో అటువంటి వారి ప్రతినిధిగా ఈ తెలుగుదేశం ప్రభుత్వము అధికారంలోకి వచ్చిందన్న సంగతిని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఈనాడు పేద దేవుళ్ళే మా ఆరాధ్యులు, ఆ కాలే కడుపుకు పరగడుపున ఉన్న

ఆ దేవ దేవునికి ఇంత ప్రసాదం పెట్టడానికే ఈ సంక్షేమ కార్యక్రమాలు, చేపట్టబడ్డాయని మీకు సవినయంగా మనవి చేస్తున్నాను. ముఖ్యంగా రాజకీయమైన – పొలిటికల్ ఫిలాసఫీకి సంబంధించినంత వరకు ముఖ్యంగా ఒక విధమైన కుల, మత, వర్ణ, వర్గ భేదమేలేని సమాజము – అల్ప వర్గాలకు సరియైన సంక్షేమం ఏవిధంగా అందించబడుతున్నదో దయచేసి ఒకసారి గుర్తించాలని మనవిచేస్తున్నాను.

అదేవిధంగా ఈనాడు ఎక్కడా లేనిది కేవలం కర్ణాటక, వెస్ట్ బెంగాల్లో మాత్రం జరిగింది తప్ప, ఎక్కడా జరగని విధంగా ఈనాడు అన్ని స్థానిక వ్యవస్థలలో ఎన్నికలు జరుపగలిగామంటే, తెలుగుదేశం ప్రభుత్వానికి ప్రజాస్వామ్యం పట్ల ఉన్న అంకిత భావం నిదర్శనమని సవినయంగా మనవిచేస్తున్నాను. ఈనాడు పంచాయితీ ఎన్నికలు, మాండలిక ఎన్నికలు, జిల్లా పరిషత్తు ఎన్నికలు, మునిసిపాలిటీ ఎన్నికలు, కార్పొరేషన్ ఎన్నికలను ఏవిధమైన సంస్థాగత ఎన్నికలు వచ్చినప్పటికీ కూడా నిర్వహించగలిగాము. సుమారు 25.58 కోట్ల రూపాయలు ప్రత్యేకంగా వెచ్చించబడ్డాయి. మరొక 7 కోట్ల రూపాయలు ఈ శాంతి భద్రతలను కాపాడటానికి అదనంగా వినియోగించబడ్డాయి. ఈ రు.55 కోట్లు వెచ్చించి ప్రజాస్వామ్యం ఏవిధంగా ఉద్ధరించబడిందో తెలుగుదేశం ప్రభుత్వపరంగా దయచేసి, ఆలోచన చేయవలసిందిగా సవినయంగా మనవిచేస్తున్నాను. మాండలిక రాజకీయ విధానములో ప్రజలే ఆరాధ్యులు.

ప్రజలకు భాగస్వామ్యం కావాలి. ఇదివరకు ఎప్పుడూ లేనిది అధికార వికేంద్రీకరణ ఈ ప్రభుత్వ పరంగా జరిగిందని అంటే, ఏవిధమైన విధానాలను వ్యవస్థలను ఉద్ధరించడం జరిగిందో ఆలోచించవలసిందని మనవిచేస్తున్నాను. మాండలిక వ్యవస్థ ఉంది. తరువాత జిల్లా వ్యవస్థ, ఆ తరువాత రాష్ట్ర వ్యవస్థ ఉంది. సరియైన క్రమశిక్షణతో, ఉద్దేశముతో, ఏవిధంగా ప్రజాస్వామ్య వ్యవస్థలు ఉద్ధరించబడ్డాయో, ఏవిధంగా సామాన్య మానవుడు గుర్తించబడ్డాడో, ఏ విధంగా సామాన్య మానవునికి అధికారాన్ని అప్పగించబడిందో కేవలం అధికారమన్నది హైదరాబాద్‌లోనే లేదు. పేదవాడి ఇంటిముందు నిలవాలి, తలుపు తట్టాలి. అన్నది ఈ ప్రభుత్వ సిద్ధాంతం. దాన్ని పరిష్కరించాలన్న భావంతో మాండలిక రాజ్యాంగ విధానాన్ని ప్రజల ముంగిటికు తీసుకొనిపోవడం జరిగిందని సవినయంగా మనవిచేస్తున్నాను.

అదేవిధంగా గ్రామీణ క్రాంతి పథము ఉంది. ఎన్నెన్నో వర్గాలో ప్రజలతో కూడుకొని ఉన్న విధానాలను ప్రభుత్వము ఆలోచించింది. ప్రజలు భాగస్వాములు కానిదే ప్రజాస్వామ్యము పండదు. ప్రజలే ప్రజాస్వామ్యం యొక్క విధి విధాతలు అన్న భావంతో వారి దగ్గరకు తీసుకొని పోవడం జరిగింది. కర్షక పరిషత్తు గానీ, మరొకటి గానీ అందులో పూర్తిగా ప్రజలే వారు, వారే ప్రజలు. వారే వారి భవిష్యత్తును నిర్ణయించుకోవలెను. వారే వారియొక్క వర్గ చైతన్యాన్ని ఉద్ధరించుకోవలెనన్న భావనతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని సవినయంగా మనవి

చేస్తున్నాను. సాంఘిక ప్రయోజనాల విషయంలో ఏవిధంగా చర్యలు తీసుకొనబడుతున్నాయో తెలుసు. ముఖ్యంగా మనిషికి మనిషి ఏవిధంగా సహకరిస్తున్నారు, మనిషి ఆడబిడ్డలయొక్క గౌరవాన్ని ఏవిధంగా చూస్తున్నాడు అనే విషయం కూడా నేను సవినయంగా మనవి చేస్తున్నాను. అల్పసంఖ్యాక వర్గాలున్నాయి. వారియొక్క సంక్షేమం ముఖ్యం.

ఈనాడు ఏవిధంగా ముస్లిం సోదరులకు రాయితీలు ఇవ్వబడ్డాయి? పాత బస్తీ విషయంలో ఏవిధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబడుతున్నాయి? "కులీకుతుబ్ షా" సంస్థ ద్వారా ఏవిధంగా అక్కడ నగరాన్ని సుందరవంతంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయో ఈ సందర్భంగా సవినయంగా మనవిచేస్తున్నాను. అంతకంటే ముఖ్యంగా ఏ ప్రాంతమనే ద్వేషం లేకుండా కులమత ద్వేషం లేకుండా, ఉండడానికి సిద్ధపడి ఉన్నామో అది కూడా దయచేసి గమనించాలని కోరుతున్నాను. ఐదు సంవత్సరాల తెలుగుదేశం పరిపాలనలో ఇదివరకు ఎప్పుడూ లేనిది - ఈనాడు జంట నగరాలలో శాంతి నెలకొల్పబడింది. హిందూ ముస్లిం సోదరులు అన్న-తమ్ముళ్ళవలె భాఈ-భాఈ అనుకొంటూ, ప్రశాంతంగా, భయభ్రాంతులు లేకుండా ఉండగలుగుతున్నారు. అందుకు కారణం నిర్దిష్టమైన భావం, సోదరభావం తెలుగుదేశం ప్రభుత్వానికుంది. మన సమాజంలో ఈ మత సామరస్యం, సోదర భావం ఉండాలని దయచేసి దీన్ని గమనించాలని మనవిచేస్తున్నాను. వారికి ఏమాత్రం మనసులో భేదంలేదు. వారికి మొన్న రాయితీలు ఇవ్వడం జరిగింది. తప్పులు చేయడం సహజం కావచ్చు.

కానీ, ఏదైనా వారియొక్క బాధలను తీర్చడం ఈ ప్రభుత్వము యొక్క బాధ్యత. ఈనాడు అన్ని వర్గాల వారిని అప్పటికప్పుడు రప్పించి - ఎంట్రీ టాక్స్ విషయంలో, లారీ యజమానులు, - లారీ కార్మికులు విషయంలో గానీ, ముస్లిం సోదరుల విషయంలో గానీ, ఏ వర్గానికి చెందిన వారైనా ఎవరైనా సరే, ఇది నా ప్రభుత్వము, నేను పూర్తిగా సంతోషంగా స్వేచ్ఛగా స్వచ్ఛందంగా, శాంతియుతంగా చక్కగా వాళ్ళతో మనగలిగాను. ఇది నా విధానములో ఉండాలనేదే ఈ ప్రభుత్వము యొక్క సిద్ధాంతమని మనవిచేస్తున్నాను. ముఖ్యంగా ఆడబిడ్డలున్నారు. ఏదేశములో లేని విధానం, విప్లవాత్మకమైన భావనతో, అంకితమైన భావనతో వాళ్ళను దృష్టిలో పెట్టుకొని, ఎక్కడా ఎప్పుడూ లేనిది, తరతరాలుగా యుగయుగాలుగా 50 శాతం జనాభాలో ఉన్నప్పటికీ సమాజములో వారికి ప్రత్యేకంగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేక బతుకుతున్న ఆడబిడ్డలకు తల్లిదండ్రుల ఆస్తిలో సమానంగా వాటా ఇవ్వాలనే తలంపు, అన్నగా లేక ఈ ప్రభుత్వ పరంగా నాకు సిద్ధించిందని అంటే ఏవిధమైన గుర్తింపు ఆడబిడ్డలకు ఇవ్వడం జరిగిందో ఒకసారి గమనించాలని కోరుతున్నాను. నాలుగు విశ్వవిద్యాలయాలను ప్రారంభించాము. అది మనకందరకు గర్వకారణము. మహిళా విశ్వవిద్యాలయం, ఆరోగ్య విశ్వవిద్యాలయం, సార్వత్రిక విశ్వవిద్యాలయం, తెలుగు భాషకు ప్రత్యేకమైన విశ్వవిద్యాలయాలను ఏర్పాటుచేయడం జరిగింది.

ఈ విధంగా మన గౌరవాన్ని మనమే కాపాడుకోడానికి, మన గుర్తింపును మనమే కల్గించుకోవడం జరిగిందని నేను సంతోషంగా తృప్తిగా సవినయంగా మనవిచేస్తున్నాను. అదేవిధంగా, ఆడబిడ్డలకు వారుచేసే ఉద్యోగాలలో 30 శాతం రిజర్వేషన్ ఇవ్వడం జరిగిందని అంటే ఏవిధమైన అవకాశాలు వారికి కలిగించబడ్డాయో, కేవలం ఆడది అంటే ఇంటినీ అంటిపెట్టుకొనివుండే ఒక విలాస వస్తువు కాదు. సరియైన భావిపౌరులను ఉద్భవింపజేస్తే ఆవేశమూర్తికి, శక్తి స్వరూపిణికి ఈ విధమైన గౌరవాన్ని కలిగించడం జరిగింది. అదేవిధంగా చాలా మహిళా ప్రగతి ప్రాంగణాలు ప్రతి జిల్లాకు ఇవ్వాలి. ఎవరైతే అనాథలుగా దిక్కులేక ఉన్నారో, ఎవరైతే ఏ బిడ్డలైతే, వారి తల్లిదండ్రులను గుర్తించలేకుండా ఉన్నారో వారికి ఆశ్రయాలను కలిగించడం జరిగిందని సవినయంగా మనవిచేస్తున్నాను.

ఆర్థికపరమైన విధానం గురించి ఇదివరకే మనవిచేశాను. స్వాతంత్ర్యము తీసుకొన్నాము కానీ పూర్తిగా ఆర్థిక సమానత్వం అన్నది ఈ దేశానికి రాలేదు. పేదవాడిని ఆదరించే నాథుడే లేడు. వాడి బిడ్డలు చదువుతున్నారా లేదా, వాడి జీవితం ఏ విధంగా నడుస్తున్నది. వాడు మానవుడుగా గుర్తించబడుతున్నాడా లేదా అనేటటువంటి ఆర్థికపరమైన స్థోమతగానీ, స్వతంత్ర్య భావంగానీ, విధానంగానీ కల్గించబడ లేదని సవినయంగా మనవిచేస్తున్నాను. దీనివల్ల పేదవాడు కూరుకుపోయాడు. మూల్గుతూ తన బ్రతుకును భారంగా సాగిస్తున్నాడు.

**తెలుగుదేశం ప్రభుత్వము వచ్చినప్పుడు, ఏ రాష్ట్రంలో లేని విధంగా ఈ ప్రభుత్వము రెండు రూపాయలకు కే.జి. బియ్యం పేదవాడికి ఇవ్వడం జరుగుతున్నదంటే అది మన రాష్ట్రానికి గర్వకారణమని మనవిచేస్తున్నాను. ఇది కేవలం ఏ ఒకరి విధానమూ కాదు. మన అందరి విధానమని వ్యక్తము చేస్తున్నాను. ఈరోజు 95 లక్షల పచ్చ కార్డులు, దానిలో 30 లక్షలు పసుపుపచ్చ కార్డులు ఉన్నాయి.**

అటువంటి సందర్భములో తెలుగుదేశం ప్రభుత్వము వచ్చినప్పుడు, ఏ రాష్ట్రంలో లేని విధంగా ఈ ప్రభుత్వము రెండు రూపాయలకు కే.జి. బియ్యం పేదవాడికి ఇవ్వడం జరుగుతున్నదంటే అది మన రాష్ట్రానికి గర్వకారణమని మనవిచేస్తున్నాను. ఇది కేవలం ఏ ఒకరి విధానమూ కాదు. మన అందరి విధానమని వ్యక్తము చేస్తున్నాను. ఈరోజు 95 లక్షల పచ్చ కార్డులు, దానిలో 30 లక్షలు పసుపుపచ్చ కార్డులు ఉన్నాయంటే, ఏ విధంగా పేద ప్రజలను ఆదుకుంటున్నది, ఈ కుటుంబాలలో సుమారు 50శాతం ఎక్కువగా జనాభా రెండు రూపాయల కే.జి. బియ్యమును తీసుకొని బ్రతుకుతున్నారు. కరువు వచ్చినప్పటికీ, వరదలు ఈ విధానాన్ని మరచి పోకుండా, పూర్తిగా పొట్టనిండా, గంజి కాసుకొని పొట్టనింపుకొంటాడని తలంచి రెండు రూపాయలకు కే.జి. బియ్యం కార్యక్రమమును సామాన్య మానవునికి కొనసాగిస్తూ, ఏ విధంగా పేదరికం తుడిచివేయబడుతున్నదో ఒకసారి మననం చేసుకోవలెనని కోరుకుంటున్నాను. ఏ విధమైనటువంటి ఆర్థిక స్థోమత ఈనాడు సామాన్య మానవుడుకి

ఇవ్వబడిందో పేదరికం ఏవిధంగా తుడిచివేయబడిందో ఒకసారి గుర్తించాలని సవినయంగా మనవిచేస్తున్నాను. అదే విధంగా పేదరికాన్ని కప్పడానికి 50 శాతం బట్టల పరంగా ఆడబిడ్డలకు అన్నదమ్ములకు అందించడం జరుగుతోంది. అదే విధానంగా మరి కేవలం భవంతులలో ఉండడం, డబ్బు ఉన్నవారికే అధికారం కాదు, పేదవారు కూడా గౌరవించబడాలి. గుర్తించబడాలి. అదే నిజమైనటువంటి స్వతంత్ర భారతం. కేవలం ఎంతో మంది అమర వీరులు తమ వేడి నెత్తురుతో భారతమాత పాద కమలాలకు పారాణి దిద్దారు అంటే కేవలం ఏ కొద్దిమందో ఆ ఫలితం అనుభవించాలని కాదు ప్రత్యేకంగా ఈ రోజున 80 కోట్ల భారత ప్రజానీకం ఎంతో స్వతంత్ర ప్రతిపత్తితో నేను స్వతంత్ర భారత పౌరుడని అనేటటువంటి చిత్త శుద్ధితో కూడిన ఆత్మ గౌరవము, ఆత్మతృప్తి పొందితేనే గానీ దేశానికి మోక్షము రాదు, లేదు అని కూడా మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను.

ఈ రోజు సుమారు రూ.42 కోట్ల వ్యయంతో 7 లక్షల 17 వేల 240 ఇళ్ళు వారికి నిర్మించి ఇవ్వడం జరిగింది. మరొక రెండు లక్షల ఇళ్ళు ఈనాడు ప్రారంభం చేయబడ్డాయని ఈ సందర్భంగా సవినయంగా నేను మనవిచేస్తున్నాను. ఇక జనరల్ విషయం చూస్తే సామాన్యంగా మనం పూర్తిగా ఈ ఆర్థిక విధానాలను కనుక గమనించగలిగితే మరి షెడ్యూల్డు తరగతుల వారికిగానీ, షెడ్యూల్డు కులాలవారికిగానీ, మరి ఆడ బిడ్డలకు గానీ, వైద్య విద్యాసౌకర్యాలకు గానీ ఎంత డబ్బు ఖర్చు పెట్టబడుతోందో ఈనాడు ఈ సోషల్ వెల్ఫేర్‌కి, సాంఘిక సంక్షేమానికి దయచేసి గమనించాలని మనవిచేస్తున్నాను. కేవలం మాటలతో కాకుండా పూర్తిగా అంకెలే ఈనాడు ప్రభుత్వం యొక్క అంకితమైన భావాన్ని రుజువు చేస్తాయని నేను సవినయంగా మనవిచేస్తున్నాను. 1978వ సంవత్సరం నుంచి 1983వ సంవత్సరం వరకు కేవలం ఈ సాంఘిక సంక్షేమానికి 436 కోట్ల 24 లక్షల రూపాయలు ఖర్చు పెడితే అది ఈరోజు 1983-85 సంవత్సరాలలో 165 కోట్ల 43 లక్షల రూపాయలుగా పెంచబడింది.

మరి ఈ పెంపుదల ఏవిధంగా జరిగిందో, ఎంత అభివృద్ధి చెందిందో దయచేసి గమనించాలని సర్వులకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను. అదే కాకుండా ఇంకా ఎన్నో విప్లవాత్మకమైన విధానాలు, గ్రామ సీమలలో కేవలం గుత్తాధికారాలతో వ్యవహరిస్తున్న గ్రామాధికారుల వ్యవస్థను రద్దుచేయడం జరిగింది. అదే విధానంగా మండల రాజ్యాంగ విధానంతో అందరూ కలలు కన్నటువంటి అధికార వికేంద్రీకరణ పరంగా జరిగేటటువంటి పరిపాలనా వ్యవస్థను సృష్టించడం జరిగింది. ఇదివరకు 330 సమితులు ఉన్న స్థానంలో ఈనాడు 1104 మండలాలు సుమారుగా రాగలిగాయి అంటే ఏవిధమైనటువంటి నిర్దుష్టమైనటువంటి అధికార వికేంద్రీకరణ తెలుగుదేశం మనస్సులో జ్వలిస్తుందో ఒకసారి గుర్తించాలని సభ్యులందరకు తమ ద్వారా మనవిచేస్తున్నాను. "ఏకగవాక్ష విధానం" క్రింద ఇదివరకు ఎక్కే గడప, దిగే గడపగా రైతులు అందరూ కూడా దీర్ఘకాల

రుణాలు, స్వల్పకాల రుణాలు, మధ్యకాలపు రుణాలు తీసుకుంటూ కేవలం ప్రతి దానికి తాకట్టు బ్రతుకు బ్రతికేటటువంటి ఆ విధానంలో రైతులను ఉద్ధరించి ఏవిధంగా వారికి ఆత్మ ప్రతిష్టను పెంచడం జరిగింది.

కేవలం డబ్బు ఉన్నవాడు చెక్కు రూపముగా డబ్బు ఉపయోగించడమే కాదు ప్రత్యేకంగా వీరికి కూడా పాస్‌బుక్స్ విధానంలో వారికి రుణాలు సౌకర్యాలు వారికి కల్పించాలని, గౌరవంగా వారికి కూడా గుర్తింపు కలగచేయాలని, వారికి కావలసినటువంటి ఇన్‌పుట్స్ వ్యవసాయానికి అనువైనటువంటి విత్తనాలు గానీ, ఎరువులుగానీ, పురుగుల మందులు గానీ, రుణ సౌకర్యాలు గానీ అన్నీ వారు ఆ పుస్తక రూపేణా తెప్పించుకునేటట్లు చేయాలనే ఉద్దేశంతో మరి ఏవిధంగా ఏకగవాక్ష విధానం ఈ దేశంలోనే తొలిసారిగా ప్రవేశపెట్టబడిందో దయచేసి గమనించాలని సర్వులకు తమ ద్వారా మనవిచేస్తున్నాను. అదే విధంగా ఈనాడు రైతుల సమస్యల్ని మనం మాట్లాడుకున్నాము. లాభాలలోనే భాగాలు లేవుగానీ బాధలలో మాత్రము భాగము పంచే వ్యవస్థగా చెలామణి అవుతున్న ఈ 40 సంవత్సరాల పరాధీనత ప్రభుత్వం పెట్టిన కర్షక పరిషత్తుతో తొలగిపోవాలి. రైతే రాజు కావాలని పూజ్య బాపూజీ చెప్పారు. మరి రైతు రాజు కాగలిగినప్పుడే గానీ ఈ దేశానికి మోక్షము లేదు అన్నటువంటి పద్ధతిలో ప్రభుత్వమే చొరవతో కర్షక పరిషత్తును ఏ విధంగా ప్రారంభించడం జరిగిందో ఒకసారి మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను. మరి ఈ విధంగానే ఎన్నో రకాలైనటువంటి మార్పులు, ఎన్నో రకాలైనటువంటి నూతనతత్వ విధానాలను ఏర్పరచడం జరిగింది. ఇది ఎవరూ ఊహించలేనిది.

కేవలం తెలుగుదేశం తమ సిద్ధాంతానికి అంకితమై చేసిన నిర్ణయంగా తమకు మనవిచేస్తున్నాను. ఇది కొత్త సిద్ధాంతం కాబట్టి ఏమైనా లోట్లు రావచ్చు. లోట్లు సర్దుకోవడం మన ధర్మం. మానవుడు తప్పు చేయడం నేరం కాదు. చేసిన తప్పును దిద్దుకోవడం ముఖ్యమైన విషయం. ప్రభుత్వ విధానాలను గుర్తించి పూర్తిగా ప్రజల కోసము తలపెట్టిన వాటి ఫలితాలను వారికి అందేటట్లుగా చూడడంలో సహకరించాలని నేను అందరికీ సవినయంగా మనవిచేస్తున్నాను. ఇక సివిల్ సప్లయిస్ విషయం అందరికీ తెలిసిందే. 1980-81వ సంవత్సరంలో 3 లక్షల 41 టన్నులు మాత్రము ఆనాడు పంపిణీ చేయబడేవి. ఈనాడు అంటే 1986-87వ సంవత్సరంలో 22.6 లక్షల బియ్యము సామాన్య మానవుడికి అందించబడుతున్నాయి. బీదరికాన్ని తుడిచిపెట్టాలని అంకితమైన భావము ప్రభుత్వానికి ఉందని మనవిచేస్తున్నాను. ఇదివరకే చెప్పాను. 95 లక్షల ఆకుపచ్చ కార్డులు, 30 లక్షల పసుపుపచ్చ కార్డులు ఉండే ఈనాడు ధరలు పెరగకుండా ఏవిధమైన విధానంతో ధరలను అదుపుచేయడం జరుగుతున్నదో, ఏ విధంగా పేదవారి బ్రతుకులను ఉద్ధరించడం జరుగుతున్నదో దయచేసి గమనించాలని సవినయంగా మనవిచేస్తున్నాను. చేనేత విషయంలో చెప్పారు గౌరవనీయ సభ్యులు కొందరు. పాశ్చాత్యదేశాలు కన్ను తెరవని నాడే,

నాగరికతతో కన్ను తెరవనినాడే చీనీ చీనాంబరాలు - 8 గజాల చీరలు నేసి అగ్గిపెట్టెలో పెట్టి దేశం యొక్క ప్రతిష్టను గౌరవాన్ని పెంచినటువంటి వృత్తి గలవారు. అటువంటి చేనేత కార్మికుల వృత్తిని ఆదుకోవడం ప్రభుత్వం తమ ధర్మంగా భావిస్తున్నదని నేను మీకు సవినయంగా మనవి చేస్తున్నాను. పేద ప్రజానీకానికి సగము ధరకే వస్త్రాలు ఇవ్వాలనే దాంట్లో రెండు ఫలితాలు క్రోడీకరించబడి ఉన్నాయి.

పేద చేనేత కార్మికులకు పని ఇవ్వడం ఒకటి, పేదవారికి బట్టలు ఇవ్వడం రెండవది. తగిన విధంగా సబ్సిడీ ఇవ్వడం ప్రభుత్వ నూలు విధానంలో, కార్మిక సంక్షేమానికి తగినటువంటి గృహవసతితో కూడినటువంటి సహాయం వారికి కలుగజేయడం వారిని కూడా సాటి సోదరులుగా భావించడం వారి కన్నీరు తుడవడం ప్రభుత్వం తమ ధర్మంగా భావిస్తున్నదని మీకు నేను సవినయంగా మనవి చేస్తున్నాను. ఇక నూలు సబ్సిడీ విధానంలో ఆప్కో సంస్థవారు ప్రైమరీ సొసైటీకి అందజేయడం, ఆ ప్రైమరీ సొసైటీ ద్వారా వారు ఎవరైతే చేనేత కార్మికులు ఉన్నారో వారికి స్వయంగా అందజేయడం, అక్కడ ఉన్నటువంటి సహకార సొసైటీలు అన్నీ కూడా సక్రమంగా సరియైన విధానంతో చేనేత కార్మికులను ఐడెంటిఫై చేసి ఎవరైతే నిజమైన చేనేత కార్మికులో వారికి ఫలితాలను అందించే విధానాలను చేసి మధ్యదళారీలను మాస్టర్ వీవర్సును తీసివేసి ఎవరైతే నిజమైన కార్మికుడో వారికి అందేటట్లు చూడడం ఈ వేళ ప్రభుత్వ విధానంగా మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను.

ఈ సబ్సిడీ కోసము ప్రభుత్వం ఒక కోటి 40 లక్షలు రూపాయలు ప్రత్యేకంగా మంజూరుచేయడం జరుగుతుందని కూడా ఈ సందర్భంగా మీకు నేను తెలియజేస్తున్నాను. అదేవిధంగా బ్యాంకులనుంచి వారికి సహాయం బ్యాంకుల నుంచి రుణాలను అందజేసే విషయంలో కూడా ఎవరైతే ఈనాడు వారి చేతి వృత్తులమీద ఆధారపడి బ్రతుకుతున్నారో వారికి ఏ మాత్రం ముప్పులేకుండా, వారికి ఏ మాత్రం ఆర్థికపరమైనటువంటి అభ్యంతరంగానీ బాధగానీ లేకుండా వారికి ఈనాడు సరైనటువంటి సౌకర్యమైనటువంటి స్వల్ప వడ్డీ మీద రుణాలు అందజేయడం జరుగుతుందని మనవిచేస్తున్నాను. డిస్ట్రిక్ట్ కోపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ద్వారా 1982-83వ సంవత్సరంలో 24 కోట్ల రూపాయలు వారికి సహాయం రుణపరంగా అందించబడితే అది ఇప్పుడు 55 కోట్ల రూపాయలకు పెంపుచేయబడిందని గౌరవనీయ సభ్యులకు తమ ద్వారా మనవిచేస్తున్నాను. అదేవిధంగా బట్టల అమ్మకం 1982-83వ సంవత్సరంలో అది 33 కోట్ల 80 లక్షల రూపాయలు ఉంటే ఇప్పుడు అది 70 కోట్లకు పెంచబడిందని మనవిచేస్తున్నాను.

ఈ విధంగా చేనేత కార్మికులకు ఇచ్చే రాయితీల పెరుగుదల వల్ల ఎన్నో కుటుంబాలు బాగుపడుతున్నాయని సవినయంగా మనవి చేస్తున్నాను. చేనేత కార్మికులకు 1983 సంవత్సరంలో 6 కోట్ల రూపాయలు బాకీలు ఉంటే ఆ మొత్తాన్ని రిబేట్‌గా ఇచ్చామని మనవి చేస్తున్నాను. ఆ

మొత్తం డబ్బు చెల్లించడం జరిగింది. ఇవన్నీ ఎందుకు చేస్తున్నామంటే బీదవారిని సకాలంలో సక్రమంగా ఆదుకుని వారికి సహాయం చేయాలనే ఉద్దేశ్యంతోనే అని మనవిచేస్తున్నాను. ఇక వారికి ఇళ్ళు వర్కింగ్ షెడ్స్‌తో సహా కట్టి మగ్గాలు నేసుకునే వీలు, విధానం కల్పించడం జరిగిందని సవినయంగా మనవిచేస్తున్నాను. ఆ విధంగా చేనేత కార్మికులకు వర్కింగ్ షెడ్స్‌తో సహా 2,348 మందికి ఏర్పాటు చేయడం జరిగింది. తరువాత ఎక్కువ నూలు ఉత్పత్తి చేస్తే తప్ప నూలును చౌకగా కార్మికులకు అందించడం సాధ్యం కాదు.

దానికి సబ్సిడీ విధానం కూడా ఉండాలి. అందుకోసమే ఎక్కువ నూలు మిల్లులు ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యం. అందుకోసమే నేరుగా ప్రత్తి పండించే రైతుల వద్ద నుంచి ప్రత్తి సేకరించి మిల్లర్ల వద్దనుంచి నూలు కొనే విధానం ఆపివేయాలని ప్రభుత్వ ఉద్దేశ్యం. కొత్తగా ఈ నూలు మిల్లులు ఇదివరకు, నంద్యాల, ఇంకొల్లు, చిలకలూరిపేటలలో ఏర్పాటు చేయడానికి అంగీకరించడం జరిగింది. ఈ సందర్భంగా కరీంనగర్‌లో కూడా 4వ నూలు మిల్లును ఏర్పాటు చేయడానికి నేను మాట ఇచ్చిన ప్రకారంగా ఏర్పాటుచేయడం జరుగుతుందని ఇక్కడ గౌరవ సభ్యులకు సవినయంగా మనవిచేసుకుంటున్నాను. ఇక సింగిల్ విండో విషయంలో సోదరులు నాగేశ్వరరావు గారు చెప్పారు. రైతులు సకాలంలో వారు తీసుకున్న ఋణాలు కట్టినవారికి 51/2 శాతం వడ్డీ ముదరాగా ఇవ్వడం జరుగుతుంది. ఆవిధంగా రైతులు బ్యాంకుల నుంచి లోన్సు తీసుకొని ట్రాక్టర్స్ కొనుక్కుంటున్నారు. కృష్ణా గోదావరి జిల్లాల రైతులు షెడ్యూలు బ్యాంకులవారు అప్పులు ఇస్తామంటే తీసుకోకుండా మేము కో ఆపరేటివ్ బ్యాంక్సు నుంచి తీసుకుంటామని అన్నారు. ఇదంతా ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మకమైన విధానం వల్లనే రైతులకు మేలు జరుగుతున్నదని ఇక్కడ సభ్యులకు మనవిచేస్తున్నాను.

**చేనేత కార్మికులకు ఇచ్చే రాయితీల పెరుగుదల వల్ల ఎన్నో కుటుంబాలు బాగుపడుతున్నాయి. చేనేత కార్మికులకు 1983 సంవత్సరంలో 6 కోట్ల రూపాయలు బాకీలు ఉంటే ఆ మొత్తాన్ని రిబేట్‌గా ఇచ్చామని మనవి చేస్తున్నాను. ఆ మొత్తం డబ్బు చెల్లించడం జరిగింది. ఇవన్నీ ఎందుకు చేస్తున్నామంటే బీదవారికి సకాలంలో సక్రమంగా ఆదుకుని వారికి సహాయం చేయాలనే ఉద్దేశ్యం ప్రభుత్వంకు ఉన్నదని మనవిచేస్తున్నాను.**

ఇపుడు ఈ కల్తీ మందుల విషయం ఇక్కడ సభ్యులు చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా ఇటువంటి స్వార్థపరమైన, డబ్బు సంపాదించుకునే విధానంతో పురుగుల మందులలో కూడా కల్తీ చేస్తున్నారంటే ఇది ఎంత దురదృష్టకరమైన విధానమో అర్థం చేసుకోవాలి. కానీ ఈ తెలుగుదేశం ప్రభుత్వం సాహసం చేసి గత 35 సంవత్సరాలుగా చేయలేని పనిని గుంటూరు జిల్లాలో పెట్టుబడి దారులను, పురుగుమందుల వ్యాపారులను ఇన్‌వెస్ట్‌గేషన్ చేసి పట్టుకొన్న ఉదంతం ఈ తెలుగుదేశం ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధికి నిదర్శనమని, అది సర్వులూ అర్థం

చేసుకోవాలని మనవిచేస్తున్నాను. ఇక కోఆపరేటివ్ వ్యవస్థలో 70,000 మంది మెంబర్లు ఉంటే ఇపుడు ఆ సంఖ్య 1,10,000 మందికి పెరిగింది. స్వార్థంతో నిర్వహింపబడే ఈ సహకార సంస్థలను, ఆర్థికంగా మనలేని సహకార సంస్థలను తిరిగి పునర్నిర్మాణం చేయడం వల్ల ఇదివరకు 6,562 సహకార సంస్థలు ఉంటే అవి ఇప్పుడు 4,564 సహకార సంఘాలుగా తగ్గించి వాటిని పటిష్టము చేయడం జరిగింది. అన్నదాతలైన రైతులకు సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

1984 సంవత్సరంలో ఖరీఫ్ పంటకు ఇదివరకు 110 కోట్లు రూపాయలు అప్పులు ఇచ్చి ఉంటే అది ఇప్పుడు 235 కోట్ల రూపాయలకు పెంచబడిందని మనవిచేస్తున్నాను. ఇది రైతులకు ఏవిధంగా సేవచేయడానికి చూస్తున్నామనేదానికి నిదర్శనం, ఇదివరకు ఖరీఫ్, రబీ రెండు పంటలకు కలిసి 158 కోట్ల రూపాయలు వడ్డీ రాయితీలు ఇస్తుంటే అది ఇపుడు 271 కోట్ల రూపాయలకు పెంపుదల జరిగింది. ఆ విధంగా ఈనాడు దేశంలో ఎక్కడాలేని ఆ విధంగా ఆంధ్రప్రదేశ్‌లో రైతుకు సహాయం అందిస్తున్నామంటే అది ఇక్కడ అందరి సభ్యుల సహకారమే సహకారరంగ విజయానికి కారణమని సవినయంగా మనవి చేసుకుంటున్నాను. ఇపుడు ఈ పెట్టుబడి పెరుగుదల 71.5 శాతం పెరిగింది. ఈ విధంగా ఎక్కువ డబ్బు రైతులకు అందించబడుతోంది. స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలతో రైతులు బ్రతకడానికి వీలుగా ధనవంతుల గుప్పిట్లో రైతులు పడకుండా చేయడం జరుగుతున్నదని మనవిచేస్తున్నాను.

ఇదివరకు 9 జిల్లా సహకార సంస్థలను నాబార్డ్ గుర్తించకపోతే ఈనాడు 7 సహకార వ్యవస్థలకు గుర్తింపు లభ్యం కాబడిందని ఇంకా రెండు సహకార వ్యవస్థలకు కూడా గుర్తింపు తీసుకురావడం జరుగుతుందని మనవిచేస్తున్నాను. రైతులకు రుణాలు ఇచ్చే సందర్భంగా 1986-87 సంవత్సరంలో ఖరీఫ్ పంటకు 202 కోట్ల రూపాయలు, రబీ పంటకు 42 కోట్ల రూపాయలు, మొత్తం 244 కోట్ల రూపాయలు అయితే అది నూతనంగా 497.34 కోట్ల రూపాయలు ఖరీఫ్ పంటకు, 227.98 కోట్ల రూపాయలు రబీ పంటకు, మొత్తం 725.26 కోట్ల రూపాయలు చొప్పున 197.2 శాతంకు అభివృద్ధి చెందిందని మనవిచేస్తున్నాను. ఇక మన ఆర్థిక పరిస్థితి పెరుగుదల శాతం తగ్గిందని ఇక్కడ గౌరవసభ్యులు కొందరు అన్నారు. కానీ 1981 సంవత్సరంలో మన రాష్ట్ర ప్రణాళిక 467 కోట్లు ఉంటే అది 1986-87 సంవత్సరంలో 1222 కోట్లుగా పెంచబడింది అంటే దీని అభివృద్ధి 162 శాతం ఉందని మనవిచేస్తున్నాను.

ఈనాడు సహకార రంగం పెట్టుబడులు ఏవిధంగా పెరిగాయో గౌరవసభ్యులు అర్థం చేసుకోవాలని కోరుతున్నాను. ఇక వ్యవసాయానికి, వాటికి సంబంధించిన వ్యవస్థలలో గానీ 1982-83 సంవత్సరంలో 49.69 కోట్ల రూపాయలు ఉంటే అది 1986-87 సంవత్సరంలో 185.72 కోట్ల రూపాయలకు పెరిగింది. నీటిపారుదలకు సంబంధించినంతవరకు 1982-83

సంవత్సరంలో 153.71 కోట్ల రూపాయలు ఉంటే అది 306 కోట్ల 76 లక్షల రూపాయలకు 1986-87 సంవత్సరంలో పెంచబడిందని అంకెల పరంగా తెలియజేస్తున్నాను.

పరిశ్రమలకు 1982-83లో 39.67 కోట్లు కేటాయించబడితే ఈనాడు ఆ కేటాయింపు రూ.62.50 కోట్లకు పెరిగింది. ఇక సాంఘిక సంక్షేమ కార్యక్రమాల విషయానికి వస్తే 1982-83లో రూ.140.48 కోట్ల కేటాయింపు ఉంటే ఈనాడు రూ.354.61 కోట్లకు పెంచడం జరిగింది. హరిజనులు, గిరిజనులు, వెనుకబడిన తరగతుల విద్యార్థులకై ఎన్ని ఆశ్రమ పాఠశాలలను, ఎన్ని హాస్టళ్ళను ఏర్పాటు చేసిందో, ఈ బలహీన వర్గాలవారికై ఏవిధమైన ఆర్థిక సహాయాన్ని అందజేస్తోందో, వారి భవిష్యత్తుకై ఈనాడు ఎన్ని సాంఘిక సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తున్నదో దయచేసి గుర్తించాలని మనవిచేస్తున్నాను. ఇక కేంద్ర ప్రభుత్వ విషయానికి వస్తే 1985-86 లో వారి యాన్యువల్ ప్లాన్ 20,094 కోట్ల రూపాయలు ఉంటే మనరాష్ట్ర ప్లాన్ రూ.942 కోట్లు ఉండింది. 1986-87 లో కేంద్ర ప్లాన్ రూ.23,625 కోట్లు ఉంటే మన ప్లాన్ 1,222 కోట్లకు పెరిగింది. అంటే కేంద్రం ఆర్థికాభివృద్ధి 17.6 శాతం ఉంటే ఈనాడు మనం 38 శాతం అభివృద్ధిని అందుకోగలిగామని సవినయంగా మనవిచేస్తున్నాను.

ఈనాడు ప్రభుత్వాన్ని ఏవిధంగా నిర్వహిస్తున్నామో, ఏవిధమైన ఆర్థిక పరిస్థితిని ఎదుర్కొంటున్నామో, కేంద్రం సహాయం చేయనప్పటికీ మీ అందరి సహకారంతో ఏ విధంగా నిర్వహించుకోగలుగుతున్నామో దయచేసి గుర్తించాలని మనవిచేస్తున్నాను. మార్కెట్ బారోయింగ్‌లో మొదటి పంచవర్ష ప్రణాళికలో సుమారు 76 శాతం రాష్ట్రాలకు, 24 శాతం కేంద్ర ప్రభుత్వానికి ఉంటే ఈనాడు ఏడవ పంచవర్ష ప్రణాళికలో అది తలక్రిందులై సుమారు 76 శాతం కేంద్రప్రభుత్వం తీసుకొంటున్నది, 24 శాతం మాత్రం రాష్ట్రాలకు అందజేస్తున్నది. ఈ విషయం కూడా గమనించాలని మనవిచేస్తున్నాను. ఇది ఒక కంప్లెయింట్ కాదు, కేంద్రానికి వ్యతిరేకంగా రిపోర్టు కాదు, ఈ విధానంవల్ల కుచించుకుపోయిన రాష్ట్ర ప్రభుత్వం ఏవిధంగా పతనమవుతున్నదో, అయినప్పటికీ అభివృద్ధికై ఏవిధంగా కృషిచేస్తున్నదో సర్వులూ గుర్తించాలని మనవిచేస్తున్నాను. ఇది కేవలం తెలుగుదేశం పార్టీకి సంబంధించిన వ్యవహారంకాదు, అన్ని పార్టీలకు, అందరూ గౌరవ సభ్యులకు సంబంధించింది. ఇది మన రాష్ట్రం, ఇది మన ప్రభుత్వం, మనం ఏవిధంగా ఆదుకోవాలో ఆలోచించాలి.

నాకు ఇప్పుడే ఒక విషయం తెలిసింది. ఫైనాన్స్ బిల్లు ప్రవేశపెడుతూ అరక్ సేల్స్‌లో 1989వ సంవత్సరం ఏప్రిల్ 1వ తేదీనుంచి 10 శాతం అమ్మకంలో ఆదాయంగా తీసుకొంటామో, దానిలో 20 శాతం అమ్మకం జరిగిన వెంటనే కేంద్ర ప్రభుత్వం వారి ఖజానాకు జమచేయాలని బిల్లు ప్రవేశపెట్టడం జరిగింది. ఈ విషయంపై మనం ఆలోచించాలి. మనం ఈనాడు సుమారు రూ.450 నుంచి 500 కోట్ల వరకు వచ్చే ఎక్సైజ్ డ్యూటీ మీద బ్రతుకుతున్నాం. కానీ ఇదే

జరిగినట్లయితే సుమారు 100 కోట్ల రూపాయల పైచిలుకు కేంద్ర ప్రభుత్వానికి ఇస్తే మనగతి ఏమిటి? రాష్ట్ర ప్రభుత్వాలు ఏమౌతాయి? దయచేసి ఈ విషయం గమనించాలని మనవిచేస్తున్నాను. ఈనాడు మార్కెట్ బారోయింగ్స్ లేవు, ఓపెన్ మార్కెట్లో బాండ్స్ తెచ్చుకోవడం లేదు. కానీ కేంద్ర ప్రభుత్వానికి ఈనాడు 2,24,180 కోట్ల రూపాయల మేరకు పబ్లిక్ డెట్స్ ఉండి, దాని టోటల్ అసెట్స్ కేవలం 1,84,300 కోట్ల రూపాయలు ఉన్నాయంటే 40 వేల కోట్ల పైచిలుకు రూపాయలకు మనం తాకట్టు పెట్టబడ్డామని మనవిచేస్తున్నాను. అదేవిధంగా ఔట్ స్టాండింగ్ పబ్లిక్ డెట్స్ విషయంలో 1,22,038 వేల కోట్లు కేంద్ర ప్రభుత్వానికి ఉంటే రాష్ట్ర ప్రభుత్వానికి 4,165 కోట్ల రూపాయలు మాత్రమే ఉందని మనవిచేస్తున్నాను.

మన రెవెన్యూ రెసీట్స్ ఈ రోజున 3,716 కోట్లు, కేంద్ర ప్రభుత్వానికి 38,122 కోట్లు అయితే ఈనాడు కేంద్రానికి సంబంధించి రూపాయి విలువ చూస్తే రూపాయిలో కేవలం 31.2 శాతం మాత్రం ఉంది, రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి 89 శాతం ఉంది. దానిని రక్షించుకొంటూ వస్తున్నాము. ఈ విధంగా మన ఆర్థిక విధానం ఉంది. ఈనాడు సంవత్సరాంతంలో ఓవర్ డ్రాఫ్టు లేదు. ఓవర్ డ్రాఫ్టును తీసివేసి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరిగింది. వారు నిన్నకాక మొన్న బడ్జెట్‌ను ప్రవేశపెట్టినప్పుడు బొగ్గుమీద, పెట్రోలియం మీదగానీ, ప్రయాణీకుల టిక్కెట్లమీదగానీ రు. 3,100 కోట్ల మేరకు పన్నులు విధించడం జరిగింది. కానీ అందులో ఒక్క రూపాయి కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వబడడంలేదంటే ఏవిధమైన దాక్షిణ్యరహితమైన ప్రజాస్వామ్య విధానం నిర్వహించబడుతున్నదో గమనించాలని మనవిచేస్తున్నాను.

ఇప్పుడు సుమారుగా 7,800 కోట్ల రూపాయల లోటు తేల్చారు. అంతేకాకుండా పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్‌లో వెయ్యి కోట్లు వస్తేనే మహాఘనంగా ఉండేది. కానీ ఈనాడు 3 వేల కోట్లు వస్తుందని ఎలా అంచనా వేశారు? ఆ రెండు వేల కోట్ల రూపాయలను కూడా కలుపుకొంటే ఈనాడు 10 వేల కోట్ల రూపాయల బడ్జెట్‌ను ప్రవేశపెట్టారే? రేపు ఏ పన్నులు వేస్తారు? ఎవరివి అమ్ముతారు? ఏ పేదవారిని తాకట్టు పెడతారు? ఏవిధంగా దేశాన్ని ధ్వంసం చేస్తారు? ఏ విధంగా దేశాన్ని నిర్వహించ గలుగుతారు? ఇది ఆర్థిక శాస్త్రజ్ఞులు చెప్పిన విషయం, కేవలం నేను చెప్పింది కాదు. మనం డెట్ ట్రాప్‌లోకి వెడుతున్నాం.

ఈనాడు ఏవిధంగా అప్పులకు బలైపోతున్నామో అందరూ గమనించాలి. ఈ తాకట్టు బ్రతుకు బ్రతకడానికి మనం అంగీకరిస్తామా? ఏ విధంగా భవిష్యత్తును చూడగలుగుతాం? ఈనాడు పరిశ్రమల అభివృద్ధి అనుకొన్నంతగాలేదు, ఎగుమతులు లేవు, కేవలం దిగుమతులమీద ఆధారపడి బ్రతుకుతున్నాం. ధరలు పెరుగుతున్నాయి, డి.ఏ.లు పెరుగుతున్నాయి, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయి. విపరీతమైన ధరలు పెరుగుతున్న ఈ పరిస్థితులలో సామాన్య ప్రజానీకం ఏవిధంగా బ్రతుకుతుందో అందరూ కూడా దీనిని తమ తమ సమస్యగా గుర్తించాలి. మనం

తొలుత భారతీయులం, ఆ తరువాతే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవాసులం, దేశభవిష్యత్తులో మనమూ భాగస్వాములమే అన్న ఆలోచనను ప్రకోపింపజేయాలని సర్వులకూ మనవిచేస్తున్నాను. ఇది సుహృద్భావంతో స్వీకరించాలి తప్ప ఎవరినీ ఏమీ అనవలసిన అవసరం మాకు లేదు. మనం పేదరికాన్ని కూసింత అయినా తుడిచివేయగలిగితే, పేదల కన్నీళ్ళు ఒక్క బొట్టు అయినా తుడవగలిగితే అంతకన్నా పరమార్థంలేదు. కానీ భవిష్యత్తు ఏమిటి? భవిష్యత్తును ఏవిధంగా ఎదుర్కోవాలో దయచేసి గమనించాలని ఎంతో సుహృద్భావంతో, అభ్యుదయ పూర్వకమైన ఆలోచనలను అందించిన గౌరవ సభ్యులందరికీ సవినయంగా మనవిచేస్తున్నాను. ఈనాడు ప్రభుత్వ విధానాలను తెలియజేసే అవకాశం కల్పించిన మీకు నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతూ సెలవు తీసుకొంటున్నాను.

◆◆

జూలై 27, 1988

# ఈ కార్యక్రమాలు చరిత్రలో సువర్ణాక్షరాలతో శాశ్వతంగా ఉండగలవు

*(జంటనగరాలకు శాశ్వత మంచినీటి సరఫరాకు సంబంధించి ప్రకటన చేసిన సందర్భంగా)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ అరగాణి ప్రాంతాల్లో ఋతుపవనాలు విఫలమై వర్షాలు పడనందువల్ల గత కొద్ది సంవత్సరాలుగా జంటనగరాలు తీవ్రమైన నీటికొరతను ఎదుర్కొంటున్న విషయం ఈ సభకు తెలియంది కాదు. ముఖ్యంగా నగరానికి మంచినీరు సరఫరా చేస్తున్నది మంజీరా మొదటి దశ, రెండవదశ పథకాలు. రోజుకు 60 మిలియను గాలన్ల నీరు లభ్యం చేయగలదని ఆశిస్తున్న మంజీరా మూడవదశ పూర్తి అయిన మీదట నీటి సరఫరా రోజుకు 150 మిలియన గాలన్ల మేరకు పెరుగుతుంది. ఇది 1990 వరకు జంటనగరాల గృహోపయోగ, పారిశ్రామిక తదితర అవసరాలకు సరిపోతుంది. రోజురోజుకు పెరుగుతున్న అవసరాలను దృష్టిలో పెట్టుకుని 1990 తర్వాత జంటనగరాలకు సరిపడే మంచినీరు సరఫరాచేసే అంశాన్ని ఒక నిపుణుల సంఘానికి నివేదించడం జరిగింది. ఆ నిపుణుల సంఘం సమర్పించిన నివేదికను ఇదివరకే సభా సమక్షంలో ఉంచడమైంది. ఆ నివేదికలో సూచించిన అనేక ప్రత్యామ్నాయ పథకాల లాభనష్టాలను, ప్రయోజనాలను గురించి ఈ సభలోను, వెలుపల కూడా విస్తృతంగా చర్చలు జరిగాయి. ఈ పథకాల్లో సులభ సాధ్యమూ, వాంఛనీయమూ అయిన దానిని ఎంపిక చేసేందుకై నేను శాసన సభలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో చర్చలు కూడా జరిపాను. ఈ అంశంపై ప్రభుత్వ నిర్ణయాన్ని వీలైనంత త్వరలో ప్రకటించడం జరుగుతుందని సభాముఖంగా మీకందరికీ తెలియజేశాను.

గోదావరి, కృష్ణానదుల నుండి నీరు ఇచ్చేందుకై సూచించబడిన వివిధ పథకాల యోగ్యతా యోగ్యతలను ప్రభుత్వం జాగ్రత్తగా బేరీజు వేసింది. మన దేశంలోని ఇతర నదుల మాదిరిగానే ఈ రెండు నదులలోకి 80 శాతానికి పైబడిన నీరు జూన్–సెప్టెంబరు నెలల మధ్యకాలంలో

లభిస్తుంది. మున్ముందు సమర్థవంతంగా వినియోగించుకునే నిమిత్తం ఈ ప్రవాహపు నీటిని తగు సామర్థ్యంగల రిజర్వాయర్లలో నిల్వ చేయాల్సి ఉంది. ఆంధ్రప్రదేశ్ గోదావరి నదిపై నిర్మించబడిన ఏకైక రిజర్వాయరు శ్రీరామసాగర్, ఈ రిజర్వాయరు ద్వారా లభించే నీరు ఈ ప్రాజెక్టు మొదటి, రెండవ దశల క్రింద నిర్ణయించబడిన అవసరాలకు బొటాబొటిగా సరిపోతుంది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలతో కలిసి అంతర్ రాష్ట్ర ప్రాజెక్టుగా ఇచ్చంపల్లి వద్ద ఒక పెద్ద రిజర్వాయర్‌ను నిర్మించాలని సంకల్పించడం జరిగింది. నీటి ముంపుకు గురయ్యే అటవీ భూముల గురించి గిరిజనులు పునరావాసాన్ని గురించి ఏవేవో సమస్యలు ఉంటున్నాయంటూ - ప్రాజెక్టుకు అనుమతినివ్వటంలో కేంద్ర ప్రభుత్వం తన వివక్షతను కనబరుస్తున్నది.

రిజర్వాయరు సామర్థ్యం లేకుండా గోదావరి నదిపై ఆనకట్ట లేదా బ్యారేజి ప్రాతిపదికగా మంచి నీటిపథకాలు ఎంత మాత్రం ఆధారపడదగినవి కావు. నమ్మకంగా లభించగలదని ఆశించే 90 శాతం నీటితో ఎల్లంపల్లి వద్ద సంకల్పించిన బ్యారేజ్ ద్వారా స్థానిక, పారిశ్రామిక అవసరాలు పోగా, లభ్యమయ్యే నీరు కేవలం 14.5 టి.ఎం.సి.లు (శతకోటి ఘనపుటడుగులు). రోజురోజుకూ పెరుగుతున్న నగర నీటి అవసరాలకు ఇది సరిపోదు. కంతాలపల్లి వద్ద వర్షాలు పడు సీజనులో నీటి ప్రవాహం చాలా తక్కువగా 200 నుండి 250 క్యూసెక్కులు ఉంటుందని అది నదికి దిగువన గల మణుగూరు పారిశ్రామిక అవసరాలకు ఇదివరకే నిర్ణయించబడి ఉందని నిపుణుల సంఘం గుర్తించింది. మొట్టమొదట కంతాలపల్లి వద్ద తగినంత నిల్వ సామర్థ్యం గల రిజర్వాయరును ఏర్పాటు చేయకుండా మంచి నీటి పథకం చేపట్టినట్లయితే అది జయప్రదం అవుతుందని చెప్పలేము. నీటి పథకానికి ఇబ్బంది కూడా ఉంది. దీనికి సంబంధించిన పైపు లైను దాదాపు 45-50 కిలో మీటర్ల దూరం రిజర్వు అడవిలో నుండి పోవాల్సి ఉంది. గంగానది నది రిజర్వాయరుకు మరింత దూరంగా ఉంది. కొన్ని చోట్ల నది నీటి మట్టం తక్కువ స్థాయిలో ఉంది. వీటి కారణంగా ఎక్కువ దూరం పైపు లైను వేయాల్సి రావడం, ఎత్తిపోతల ద్వారా నీటిని పైకి తోడడం అవసరమౌతుంది. వీటన్నింటి మూలంగా విద్యుత్ వినియోగం, అవృత వ్యయం ఎక్కువగా ఉంటుంది.

కృష్ణానదిపై శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల వద్దగల రెండు రిజర్వాయర్ల మొత్తం సామర్థ్యం 700 టి.ఎం.సిలు, 45 టి.ఎం.సిల రిజర్వాయరు సామర్థ్యంతో పులిచింతల ప్రాజెక్టును అమలుపరచాలని ప్రభుత్వం ఇదివరకే నిర్ణయించింది. మనకు నమ్మకంగా లభించగల నీటినీ, అదనంగా 2000 సంవత్సరం వరకు కృష్ణానదిలోని మిగులు నీటిని కూడా మన రాష్ట్రం వినియోగించుకొనేందుకు కృష్ణా నదీ జల వివాద ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం అనుమతి ఉంది. ఇది గౌరవ సభ్యులకు తెలిసిన విషయమే. కృష్ణా నదిలోనికి వచ్చే నీరు ఏడాదికి సగటున 2390 టి.ఎం.సిలు కాగా మనకు నమ్మకంగా లభించగలదని కేటాయించిన నీరు 2060 టి.ఎం.సిలు, తనకు యుక్తమని తోచిన విధంగా ఈ నీటిని వినియోగించుకొనే స్వేచ్ఛ కూడా మన రాష్ట్రానికి

ఉంది. ప్రస్తుతం నాగార్జునసాగర్, శ్రీశైలం రిజర్వాయర్లలో లభ్యంగా ఉన్న నిల్వ సామర్థ్యాలతో పాటు సంకల్పిత పులిచింతల ప్రాజెక్టు రిజర్వాయరులో నీరు పుష్కలంగా లభించే సంవత్సరాల్లో పూర్తిగా నీటిని నిల్వచేసుకొని ఆ నీటిని తదుపరి సంవత్సరంలో వినియోగించుకోవచ్చు. ఆ విధంగా మిగులు నీరును పెద్ద మొత్తాల్లో సక్రమంగా వినియోగించుకోవడానికి వీలుంటుంది. మొత్తం మీద పైరీతిన నమ్మకంగా లభించే నీటితో మెరుగుపరచబడిన రిజర్వాయర్ల అధిక నిల్వ సామర్థ్యం ద్వారా జంటనగరాల నీటి అవసరాలను తీర్చవచ్చు. 1987 సెప్టెంబరు 'జాతీయ జలవిధానం' పత్రంలో 'లభించే నీరులో నుండి ప్రాణికోటి నీటి అవసరాలను తీర్చడం ప్రథమ కర్తవ్యమని' పేర్కొనబడివుంది. దీనికి అనుగుణంగా మంచినీటి అవసరాలకు ప్రాధాన్యతనిచ్చి ఆ విధానాన్ని కొనసాగించడం జరుగుతుంది.

**కృష్ణానది జల వివాదాల ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం మంచినీటి ప్రయోజాలకోసం మళ్ళించిన నీటిలో 20 శాతాన్ని మాత్రమే వినియోగ శాతంగా పరిగణించడం జరిగింది. ఎందుచేతనంటే మిగతా నీరు పరీవాహక ప్రాంతంలోని వెనుకకు వెళ్ళిపోతుంది. జంటనగరాల నీటి పథకానికిగాను నికరంగా వినియోగించుకునే అదనపు నీరు 15.5 టి.ఎం.సిలలో కేవలం 20 శాతం అంటే 3.3 టి.ఎం.సిలు మాత్రమే అవుతుంది.**

మన జంటనగరాలు కృష్ణానది పరీవాహక ప్రాంతంలో ఉన్నాయని గౌరవ సభ్యులకు తెలుసు. కృష్ణానది జల వివాదాల ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం మంచినీటి ప్రయోజాలకోసం మళ్ళించిన నీటిలో 20 శాతాన్ని మాత్రమే వినియోగ శాతంగా పరిగణించడం జరిగింది. ఎందుచేతనంటే మిగతా నీరు పరీవాహక ప్రాంతంలోని వెనుకకు వెళ్ళిపోతుంది. ఆ విధంగా సిద్ధాంతపరంగా చూస్తే, జంటనగరాల నీటి పథకానికిగాను నికరంగా వినియోగించుకునే అదనపు నీరు 15.5 టి.ఎం.సిలలో కేవలం 20 శాతం అంటే 3.3 టి.ఎం.సిలు మాత్రమే అవుతుంది. ఈ పరిమాణం మద్రాసు నగరానికి నీటి సరఫరా పథకం ద్వారా అందించేందుకు మన రాష్ట్రం ఇదివరకే అంగీకరించిన పరిమాణం కంటే ఎంతో తక్కువ. ఇతర రాష్ట్రాల నుండి నీటి అవసరాలను తీర్చడమనేది ఔదార్యమే. కాదనడానికి లేదుగానీ మన రాష్ట్ర ప్రజల అవసరాలను ముందు దృష్టిలో ఉంచుకొనడం ఎంతైనా అవసరం, సమంజసం. అయితే ముందు ఆత్మీయులపట్ల ఉదారంగా ఉండాలనే సామెత చెప్పవచ్చు.

కృష్ణానదిపై సూచించిన పథకాలన్నింటిలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిని అక్కంపల్లి రిజర్వాయరు ద్వారా నగరానికి తెచ్చేందుకు రూపొందించిన పథకం పెట్టుబడి వ్యయం దృష్ట్యాగానీ, నిర్వహణ ఖర్చుల దృష్ట్యాగానీ లాభదాయకంగా ఉంటుందని కనుగొనడం జరిగింది. ఈ నీటివనరు జంటనగరాలకు అతి సమీపంగా ఉండడమే కాకుండా మన రాష్ట్రంలోని అత్యంత పెద్ద రిజర్వాయరు, 108 కిలోమీటర్ల పొడవు రూపొందించిన పైపులైనులో దాదాపు 100 కిలోమీటర్ల పైపులైను నాగార్జునసాగర్ - హైదరాబాద్ రాష్ట్ర రహదారికి సమాంతరంగా

వెళ్తుంది. దీనివల్ల భూసేకరణలో ఎంతో సమయం, ఖర్చు తగ్గుతుంది. అంతేకాక, పనివారిని, వస్తు సామాగ్రిని శీఘ్రంగా తరలించడానికి, ఎప్పటికప్పుడు తనిఖీచేయడానికి, వీలౌతుంది. ఎటువంటి జాప్యం లేకుండా ఈ పథకాన్ని అమలుపరచడానికి కూడా వీలుంటుంది. సాంకేతిక, ఆర్థిక సౌలభ్యాల దృష్ట్యా కూడా అక్కంపల్లి మీదుగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు రిజర్వాయరు నుండి నీటిని పైకి తోడే ఈ పథకం మిగతా అన్ని పథకాలకంటే శ్రేష్టమైనది. ఈ పథకాన్ని మూడు వేరు వేరు దశల్లో అమలుపరచవచ్చు. ఒక్కొక్కటి 2 మీటర్ల వ్యాసంగల పైపులైను ద్వారా 5.5 టి.ఎం.సిల నీటిని సరఫరా చేయెచ్చు. ప్రాథమిక అంచనా ప్రకారం ఈ పథకం మొదటి దశకు సుమారు 200 కోట్ల రూపాయలు ఖర్చు కావచ్చు.

జంటనగరాల దీర్ఘకాలిక నీటి సరఫరా పథకానికి నీటివనరు కొన్ని దశాబ్దాలుగా ఖరారు కాకుండా ఉండిపోయింది. మనదేశంలోని నగరాల్లోకెల్లా హైదరాబాద్ – సికింద్రాబాదు జంటనగరాలు సర్వ సంస్కృతులకు నిలయమని నిస్సందేహంగా చెప్పవచ్చు. కాబట్టి జంటనగరాల భవిష్యత్ అభివృద్ధి ఈ కీలకమైన నీటి సరఫరా అంశంపై ఆధారపడివుంది. వాస్తవానికి ఈ అంశంపై మనం తీసుకొనే నిర్ణయం సులభసాధ్యమై విజయవంతం అయ్యేదిగా ఉండాలి. వాస్తవిక దృక్పథ పరిధిలో ఈ జటిల సమస్యను దృఢ సంకల్పంతో, కృతనిశ్చయంతో పరిష్కరించినపుడే ఇది సాధ్యమౌతుంది. అందుచేత నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఆధారంగా, మంచినీటి సరఫరా పథకాన్ని మంజూరు చేసి, ఈ పథకం మూడు దశలకుగాను మొదటిదశ పనిని వెంటనే అమలుపరచాలన్న ప్రభుత్వం నిర్ణయాన్ని ప్రకటిస్తున్నాను. దీనిని ఈ ప్రభుత్వం గర్వించదగిన విధాన నిర్ణయంగా భావిస్తున్నది. ఈ పథకాన్ని అతి శీఘ్రంగా అమలుపరచగలమని సభ వారికి హామీ ఇస్తున్నాను.

**పులిచింతల ప్రాజెక్టు గురించి:** అధ్యక్షా, కృష్ణానది చివరి భాగంలో నిర్మించడానికి వీలుగా పులిచింతల రిజర్వాయరును రూపొందించడం జరిగింది. ఇందులో 45 శతకోటి ఘనపుటడుగుల నీరు నిల్వ చేయవచ్చు. నదిలో 75 శాతం నీరు లభించేటప్పుడు పులిచింతల డ్యామ్ స్థలం వద్ద 93 శతకోటి ఘనపుటడుగుల నీరు లభిస్తుంది. ఈ నీటి నుండి ఎగువ భాగంలో 46 శతకోటి ఘనపుటడుగుల నీరు వినియోగపడుతుందని అంచనా. పోతే నికరంగా లభించే నీరు 47 శతకోటి ఘనపుటడుగులు మాత్రమే ఉంటుంది నాగార్జునసాగర్ ప్రాజెక్టు, ప్రకాశం బ్యారేజి మధ్య నీరు నిల్వచేసే ఏర్పాటు దాల్చేందుకు నీటిలో అధిక భాగం నిరుపయోగంగా సముద్రంలో కలిసిపోతున్నది. దీనివల్ల నీరు సమృద్ధిగా లభించే అవకాశం లేకుండా పోతున్నది. పులిచింతల రిజర్వాయరు ఈ ప్రవాహాన్ని అదుపు చేయటానికి తోడ్పడమే కాకుండా కృష్ణాడెల్టాలో నీటిపారుదల పనులు జరగనప్పుడు నాగార్జునసాగర్ ప్రాజెక్టు వద్ద విద్యుదుత్పాదనకు కూడా ఇది ఉపయోగపడుతుంది. పులిచింతల రిజర్వాయరు నిర్మాణం వల్ల కృష్ణానదిలో నీరు పుష్కలంగా లభిస్తుంది. అంతేకాకుండా, కృష్ణా జలాలను నీటి పారుదలకు, విద్యుత్ ఉత్పాదనకు కూడా గరిష్ట స్థాయిలో వినియోగించుకోవడానికిగాను రిజర్వాయరు ఎంతగానో దోహదపడుతుంది.

కృష్ణానది మీద విజయవాడకు ఎగువ భాగంలో సుమారు 82 మైళ్ళ దూరములో రిజర్వాయరు నిర్మించాలన్న మొట్ట మొదటి ప్రతిపాదనను శ్రీ రీడ్‌మహాశయుడు, 1905లో చేశారన్న సంగతి గౌరవ సభ్యులకు తెలుసు 1911 సంవత్సరంలో కల్నల్ ఇల్లీస్ గారు, విజయవాడకు ఎగువన 40 మైళ్ల దూరంలో పులిచింతల వద్ద కృష్ణానది మీద రిజర్వాయరు నిర్మించడానికి ఒక పథకాన్ని రూపొందించారు. అప్పటి నుండి కృష్ణానది చివరి భాగంలో పులిచింతల వద్దనుంచి రిజర్వాయరుగా రూపొందే అవకాశం ఉన్న ఆ రిజర్వాయరు నిర్మాణం వివిధ సాంకేతిక బృందాలు, ప్రభుత్వ పరిశీలనకు వచ్చింది. అయితే ఈ విషయంలో ఇప్పటివరకూ తుది నిర్ణయం జరగలేదు. పులిచింతల రిజర్వాయరును తప్పని సరిగా వెంటనే నిర్మించవలసినదిగా స్వర్గీయ డాక్టరు కె. ఎల్. రావుగారు నాకు, నా ప్రభుత్వానికి తమ అమూల్యమైన సలహాను అందించినందుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఆయన అందించిన ఉత్తేజకరమైన సలహా ఆధారంగానే ఇప్పటి ప్రాజెక్ట్ నివేదికను కూడా వారే రూపొందించడం జరిగింది. ఈ ప్రాజెక్టుకు రు. 138.37 కోట్లు ఖర్చు కాగలవని అంచనా. విద్యుదుత్పాదనకు సంబంధించిన సివిల్ పనులకు అయ్యే రు. 34.39 కోట్ల వ్యయం ఈ మొత్తంలో చేరివుంది. ప్రాజెక్టు నివేదికను కేంద్ర జల సంఘానికి 1985 అక్టోబరులో పంపడం జరిగింది.

ఈ ప్రాజెక్టు సత్వర అమలుకు మంజూరు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని గౌరవ సభ్యులకు తెలియజేయడానికి చాలా సంతోషిస్తున్నాను. గౌరవనీయులైన సభ్యులకు తమ ద్వారా కొన్ని విషయాలు తెలియజేయవలసిన అవసరం ఉంది. ఏ విషయంకూడా దాపరికంలేకుండా అందరిముందు పెట్టడం నా ధర్మంగా భావిస్తున్నాను. ఈ ప్రాజెక్టు వల్ల దాదాపు 14,899 హెక్టార్ల భూమి ముంపుకు గురికాగలదని అంచనా. ఇందులో 2,379 హెక్టార్లు అటవీ భూములు. 875 హెక్టార్ల భూమి సాగర్ ఆయకట్టులో ఉంటుంది. ఈ ఆయకట్టు భూమిని రక్షించడానికి గాను 10 కోట్ల రూపాయలు ఈ మొత్తంలో కేటాయించబడిందని తమద్వారా మనవిచేస్తున్నాను. భూములు కోల్పోయే కుటుంబాల వారికి నష్ట పరిహారం ఇవ్వడం, పునరావాస సౌకర్యాలు కల్పించడానికి కూడా ప్రభుత్వం నిశ్చయించిందని, ఈ విషయంలో సందేహాలు అవసరం లేదని కూడా మనవిచేస్తున్నాను. ఈ రెండు కార్యక్రమాలు కూడా చరిత్రలో సువర్ణాక్షరాలతో శాశ్వతంగా ఉండగలమ పరిపూర్ణంగా ప్రభుత్వం విశ్వసిస్తున్నది. ఇది మన జాతికి-మనకు ఉన్న వనరులను పూర్తిగా ఉపయోగించుకొనడానికి ఈ ప్రభుత్వం ఏ విధంగా కృషి చేస్తున్నదో తెలియజేయడానికి శాశ్వత నిదర్శనాలుగా ఉండగలమ కూడా నేను భావిస్తున్నా ఈ రెండు ప్రాజెక్టులను కూడా ఆంధ్రప్రదేశ్ ప్రజానీకానీకి, ఫలితాన్ని అందుకోబోయే బీదా సాదా ప్రజానీకానికి అంకితం చేస్తున్నానని మనవి చేస్తూ సెలవు తీసుకొంటున్నాను.

◆◆

ఆగస్టు 1, 1988

## అందరి యెడల సరైన భావం, బాధ్యత మాకు ఉన్నది

*(ఉర్దూ బచావో ఆందోళనకు సంబంధించి 304 నిబంధన క్రింద చర్చ జరిగిన సందర్భంగా)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, ఈనాడు అందరూ కోరుకునేటటువంటి, అందరి మనస్సులో ఉన్నటువంటి, అందరి హృదయాలలో స్పందించేటటువంటి విషయం,ఈనాటి సమాజంలో కులమత వర్ణవర్గ భేదము ఉండకూడదని. ఇది కోరుకుంటూ ఉన్నవాళ్లము, సమాజమే దేవాలయము అని అంటున్న వాళ్లము, అందరిలో సోదరభావము కావాలని అర్థించే వాళ్లము. అటువంటిది ఈ భాషా సమస్య విషయం ఈనాడు రావడం, ప్రభుత్వపరంగా ఇంతవరకు తీసుకున్న విధానాలు విషయాలు మీకు స్పష్టం చేయడం, మరి ఏదైనా కేవలం ప్రభుత్వానికి సంబంధించిన ఒక ప్రభుత్వ హయాములో పరిపాలనలో బాధ్యత కలిగినటువంటి ఒక పార్టీకి కాకుండా ప్రజలందరికీ సంబంధించిన ఈ సమస్యగా నేను దీనిని అవగాహన చేసుకుంటున్నాను. అదే విధానంగా చెబుతున్నానని తమకు నేను మనవిచేస్తున్నాను. ఏ పార్టీవారు అయినప్పటికీ కూడా అన్యోన్య సోదరభావము అందరితో ఉండాలి.

కాబట్టి, ఈనాడు ఆంధ్రప్రదేశ్ అంటే మరి ఎన్నో భాషలు, సంస్కృతితో వికాసాలతో విరాజిల్లుతున్న దేశం కాబట్టి, అందరి విధానం కాబట్టి ప్రభుత్వం విధానం చూసుకున్నప్పటికీ కూడా భిన్నత్వంలో ఏకత్వం మనకి ఆదర్శం. కాబట్టి మరి అందరికీ తెలుసు మహాశయులు చెప్పినటువంటి ఆనాటి గీతం. మరి ఈనాడు కూడా నాకు యదార్థానికి నేను సినిమానటుడుగా ఉన్నపుడు నాకు హిందీ భాష రాదు, ఉర్దూ భాష రాదు, ఏమీ రాదు అయినప్పటికీ ఈనాడు మరి నేను ఆ వర్గం వారికికూడా ప్రతినిధిగా ఉంటున్నాను. దానిలో చొరవ కలిగించుకోవడంవల్ల నాకు కూడా ఆ భాషలో ఉండేటటువంటి మాధుర్యము తెలుసు. ఈనాడు నేను చెప్పగలిగానని అంటే ఇక్బాల్ మహాశయుడు వ్రాసినటువంటి ఆ రచనా విధానాన్ని, దాంట్లో ఉండేటటువంటి మధురత్వాన్ని నేను ఆస్వాదించాను కనుకనే అది చెప్పగలిగాను అని మీకు నేను సవినయంగా

మనవిచేస్తున్నాను. కాబట్టి భాషాతీతం అయినటువంటి పద్ధతిలో మనం అందరం కూడా సమన్వయ భావాన్ని అలపరచుకోవడం అన్నది ప్రభుత్వపరమైనటువంటి విధానంగా మీకు నేను మనవిచేస్తున్నాను. ఇదివరకు తెలుగుదేశం ప్రభుత్వం రాకముందు ఉన్న ప్రభుత్వం కొన్ని విధానాలు అమలుపరిచింది. నిర్ణయాలు తీసుకుంది. దాని తరువాత ఆదర్శవంతంగా ఈనాడు ఉన్న భావాలకు అతీతంగా అప్పుడు జరగనటువంటి, 35 సంవత్సరాలలో జరగనటువంటి పనులు, ఏదో కొత్తగా చేయాలి.

మన యొక్క సోదరభావాన్ని వ్యక్తం చేయాలి అన్న భావము ఈ రోజున తెలుగుదేశం ప్రభుత్వం ఏ విధమైనటువంటి కార్యక్రమం ముస్లిం సోదరుల సంక్షేమానికి, వారి యొక్క భాష రక్షణకు తీసుకున్నదో స్పష్టంచేయడం నా ధర్మంగా నేను భావిస్తున్నాను అని మీకు నేను మనవిచేస్తున్నాను. అందుకనే మరికొన్ని రాష్ట్రాలలో కేవలం ఒకే భాష ఉండాలి లేకపోతే రెండు భాషలు ఉండాలి అనుకొన్నప్పుడు మన రాష్ట్రంలో ఈ రోజున త్రీ లాంగ్వేజెస్ ఫార్ములా మూడు భాషల యొక్క సువిధానాన్ని ఏర్పరచుకున్నామని మనవిచేస్తున్నాను. ఆదర్శవంతంగా భాషాప్రయుక్త రాష్ట్ర విభజన ప్రాతిపదిక మీద తెలుగుకే మరి రాజభాషగా ఉండేటటువంటి గౌరవం కోరినప్పుడు జాతీయభాషగా హిందీని అలవరచుకున్నాము. అట్లానే అంతర్జాతీయ భాష – ఇంగ్లీషును కూడా అలవరచుకున్నాము మూడు భాషలతో సమన్వయం అయినటువంటిది ఈనాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా విధానం అని కూడా మీకు నేను స్పష్టం చేస్తున్నాను.

ఏదైనా సరే భాష అవగాహన కోసం, ఒకరిని ఒకరు తెలుసుకోవడం, ఒకరి భావాలను ఒకరు అర్థం చేసుకోవడం కోసం కాబట్టి విధానాలను పూర్తిగా దోహదం చేసేది సరైన భాషాభావము అన్నది తెలుగుదేశం స్ఫూర్తిగా మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను. ఇప్పుడే సోదరులు నాగభూషణ రావు చెప్పారు. హిందూస్తానీ విషయంలో ఒకప్పుడు అది ఏ భాష ఉండాలి, హిందీ ఉండాలా, హిందూస్తానీ ఉండాలా మనయొక్క దేశభాషగా అని ఆనాడు చర్చ వచ్చినప్పుడు దురదృష్టవశాత్తో, అదృష్టవశాత్తో ఏ విధంగానో ఈనాడు నాకు అవసరంలేదు.

అందరికీ కూడా అవసరం లేదు గానీ ఆనాడు హిందుస్తానీ భాషకంటే ఒక ఓటు మాత్రము హిందీ భాషకు వచ్చింది కాబట్టి ఆనాడు హిందీ భాష రాజ భాష అయింది. దేశ భాష అయింది. అది మరి ఆ ఒక్క కాస్టింగు ఓటుతో ఆనాడు మెజారిటీ సాధించగలిగినందువల్ల ఆ విధానం అనుసరించబడింది. మరి రెండు భాషలు ప్రోత్సహించినవారు సమ ఉజ్జీలుగా ఒక స్థాయిలో ఉండగలిగారు. అంటే ఒక ఓటు కనుక వచ్చి ఉంటే ఆనాడు హిందూస్తానీ వచ్చి ఉండేది. మరి మీరు అన్నట్లుగా ఈనాడు మనకు ఈ గొడవ లేకుండా ఉర్దూ భాష కూడా మిళితమైనటువంటి ఆ హిందుస్తానీ భాషను దేశ భాషగా ఈనాడు అందరం ఆరాధించి ఉండేవారము.

ఆ స్థితిలో అది ఆనాడు పోయింది కాబట్టి ఈనాడు తిరిగి హిందూస్తానీ విషయం ప్రస్తావించనవసరం లేదు. ఇప్పుడు ముఖ్యంగా ఉర్దూ భాష ముస్లిం సోదరులకు వారికి ఉన్నటువంటి అనుమానాలు...

**శ్రీ సి.హెచ్. రాజేశ్వరరావు:** ఉర్దూ భాష ముస్లిముల భాష మాత్రమే కాదు. అల్ప సంఖ్యాకుల భాష అనండి, లింగ్విస్టిక్ మైనారిటిస్ అని చెప్పితే బాగుంటుంది.

**శ్రీ ఎన్.టి. రామారావు:** అలాగే మీ ఇష్టం, ఇప్పుడు బాగారెడ్డిగారు. ఉర్దూలో మాట్లాడారు అంటే వారు అల్పసంఖ్యాకులు అని అనుకోవాలా? మీరు చెప్పండి. కాబట్టి ఎవరి ఇష్టము వచ్చిన భాష అందంగా వారు మాట్లాడతారు. అల్పసంఖ్యాక వర్గాలభాష ఇది అధిక సంఖ్యాక వర్గాల భాష ఇది అని చెప్పడం కుదరదు. ఈనాడు ఉర్దూ భాష నేను కూడా మాట్లాడుతున్నాను. ఆరవం కూడా మాట్లాడుతున్నాను. అంటే అది నాకు ఉత్సాహంవల్ల కావచ్చు, ఆ భాషలో ఉండేటటువంటి సౌశీల్యమే కావచ్చు తప్ప ప్రత్యేకంగా ముస్లిం వర్గాలు అవడం కారణం ఏమిటంటే ఉర్దూ భాష అన్నది వారికి, ఈనాడు మనం తెలుగు ఎట్లా అనుకుంటున్నామో, వారందరు ఆ భాష వారికి సంబంధించింది కాబట్టి ఆ విధంగా అన్నానని సభ్యులకు మనవిచేస్తున్నాను. కాబట్టి అధ్యక్షా, తమద్వారా గౌరవ సభ్యులకు తెలియజేసేది ఏమిటంటే మరి తెలుగుదేశం ప్రభుత్వం వచ్చినప్పటినుంచి ఏవిధమైన అవగాహనతో వ్యవహరిస్తున్నదో మీ అందరికీ కూడా ఈ సందర్భంగా నేను గుర్తు చేస్తున్నాను.

**ఈ రాష్ట్రంలో హైదరాబాద్‌లో మాత్రం 84 శాతం ఉర్దూ మాట్లాడే వారు ఉన్నారు. అదే కర్నూల్‌లో 15 శాతం ఉన్నారు. కొన్ని జిల్లాలలోనేమో ఇంకా తక్కువ శాతంలో ఉండవచ్చు. కానీ మొత్తం మన రాష్ట్రం వ్యాప్తంగా కనుక చూస్తే 7.7 శాతము ఉర్దూ భాష మాట్లాడేవారు ఉన్నారన్నది లెక్కల వలన తేలిన సత్యముగా మనవిచేస్తున్నాను లెక్కలకంటే ఆత్మీయత ఉండాలి. ప్రేమ ఉండాలి, వాత్సల్యం ఉండాలి. భాషపై ఆరాధన ఉండాలి.**

ఈ రాష్ట్రంలో హైదరాబాద్‌లో మాత్రం 84 శాతం ఉర్దూ మాట్లాడేటటువంటి వారు ఉన్నారు. అదే కర్నూల్‌లో 15 శాతం ఉన్నారు. కొన్ని జిల్లాలలోనేమో ఇంకా తక్కువ శాతంలో ఉండవచ్చు. కానీ మొత్తం మన రాష్ట్రం వ్యాప్తంగా కనుక చూస్తే 7.7 శాతము ఉర్దూ భాష మాట్లాడేవారు ఉన్నారన్నది ఈనాడు లెక్కల వలన తేలిన సత్యముగా మీకు నేను మనవిచేస్తున్నాను. లెక్కలకంటే కూడా ఆత్మీయత ఉండాలి. ప్రేమ ఉండాలి, వాత్సల్యం ఉండాలి. భాషపై ఆరాధన ఉండాలి. మంచి ఎక్కడ ఉన్నా కూడా ప్రోత్సహించాలి. సోదర భావము పెంపొందాలి అన్నదే తెలుగుదేశం సిద్ధాంతం అని నేను మనవిచేస్తున్నాను కాబట్టి ఇదివరకు జి.ఓ.ల సంగతి చెప్పారు.

472, 358, 603 తరువాత 371 జిఓల విషయంలో వారు ప్రస్తావించారు. మరికొన్ని విషయాలు 371 జి.ఓలో ఉన్నవి. భాషకు సంబంధించిన వేరే ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్‌కి

సంబంధించిన జిఓలు కూడా తీయడం జరిగింది. కాబట్టి అందరూ ఇప్పుడు కావాలి అనే పద్ధతిలో మొత్తం ప్రభుత్వ విధానాలు అన్నీ సమీకరించి ఒకే ప్రోగుగా చేసి ఒకే జిఓ క్రింద నేను వెలువరించే పద్ధతిన చేస్తాను, ఇది సభ వారికే నేను వదిలి పెడుతున్నాను అని వారికి నేను మనవిచేస్తున్నాను. "At the Conference of Chief Ministers and Central Ministers held in August, 1961 certain criteria was evolved for recognition of minorities for official purposes in pursuance of that recommendation a State is considered unilingual of about 70% or more of its population speak one language and if it is substantial minority consisting of 30% or more of the population such a State is considered ఈ పద్ధతి ప్రకారం కూడా 30 శాతం మరి ఎక్కడైతే జనాభా ఉంటారో మైనారిటీ లాంగ్వేజి మాట్లాడే వారు వారి భాషలను కూడా ద్వితీయ భాషగా పరిగణించాలి అనేటటువంటి సూత్రం ఆనాడు అవలంభించబడింది, 1961వ సంవత్సరంలోనే.

అదే విధానాన్ని అనుసరించి ఈనాడు మరి రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎక్కడైతే 30 శాతం అల్పసంఖ్యాక వర్గాల వారు ఉర్దూ భాష మాట్లాడుతున్నారో ఆ సందర్భంగా ఆ భాషనే ద్వితీయ భాషగా కూడా అంగీకరించాలని కూడా చట్టబద్ధము చేయడం కూడా జరిగిందని ఈ సందర్భంగా మీకు నేను స్పష్టం చేస్తున్నాను. అదే సందర్భంగా 15, 20 శాతం మధ్య ఎక్కడైతే ఈ జనాభా ఉంటుందో అక్కడ దీనిని వ్యవహారిక భాషగా గౌరవించవలసిందిగా, గుర్తించవలసిందిగా ఆదేశించడం జరిగింది గానీ ఈనాడు 15, 20 అన్నప్పటికీ కూడా 15 శాతం ఉంటేనే దానిని వ్యవహారికం చేయాలి అన్నది ఈనాడు చట్టబద్ధముగా ప్రభుత్వం చేసినటువంటి నిర్ణయం అంతేకాకుండా ఈనాడు అనంతపూర్ జిల్లాలో కేవలం 11 శాతమే ఉర్దూ భాష మాట్లాడేవారు ఉన్నప్పటికీ కూడా మనం భాషపట్ల కల్గిన గౌరవంతో అక్కడ ఆ భాషను వ్యవహార భాషగా కూడా పరిగణించాలని ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందని మీకు ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను.

ఈ రెండు తీరుల్లో వ్యవహరించడం ప్రభుత్వం చేస్తున్న విధానమని సుస్పష్టంగా తెలియజేస్తున్నాను. ఈ తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తరువాత ఏ విధంగా పాతబస్తీని డెవలప్ చేసినది మన ముస్లిం సోదరులకు, రాజేశ్వరరావుగారికి అందరికీ తెలుసు పాతబస్తీలో కులీ కుతుబ్ షా స్టేడియం పెట్టడం మన ఆదర్శాలకు, భావాలకు, వారసత్వానికి నిదర్శనంగా ఉంది. ఇక్కడ మనం లాల్ బహదూర్ స్టేడియంను ఏర్పాటు చేసుకున్నట్లు అక్కడ ముస్లిమ్ నాయకుల చరిత్రను గుర్తించడం కోసం, వారు ఉత్తమ వంశమును గుర్తించేందుకు వారిపేరిట ఈ కులీ కుతుబ్ షా స్టేడియం ఏర్పాటు చేయడం జరిగింది. కులీ కుతుబ్ షా డెవలప్‌మెంట్ అథారిటీని కూడా ఏర్పాటు చేయడం జరిగింది. దాని అభివృద్ధికొరకు 10 కోట్ల రూపాయలు కూడా

కేటాయించడం జరిగింది. అదే విధంగా సుందరవనంగా ఏర్పాటు చేయాలని, చార్మినార్ నుంచి ఫలక్‌సుమా వరకు రోడ్డు విస్తీర్ణం చేయాలని అనుకున్నాము. అమానుల్లాఖాన్‌గారు మమ్ములను కలవడానికి వచ్చినపుడు ఇంటర్వ్యూ ఇవ్వలేదని సభ్యులు అంటున్నారు. అందుకు నా బాధను వ్యక్తము చేస్తున్నాను. నేను ఆ సమయంలో ఏలూరు వెళ్ళడం వల్ల ఇంటర్వ్యూ ఇవ్వలేకపోయాను. తరువాత అమానుల్లాఖాన్ గారికి ఫోనుచేసి బాబ్రీ మసీదు విషయంలో పోరాడినటువంటి షహబుద్దీన్ గారిని కూడా రమ్మనడం జరిగింది. కాబట్టి శాసన సభ్యులు అమానుల్లాఖాన్ గారికి నా ఇంటి ద్వారాలు తెరిచే ఉంటాయి, వారిని ఆహ్వానిస్తున్నాను. నేను ఈ రాజకీయ విధానాల విషయంలో పూర్తిగా వివరాలు చెప్పకుండా కుదరదు. సామాన్య మానవుడికి కూడా ప్రభుత్వ విధానాలు తెలియాలి. ఎవరు ఏ రాజకీయ విధానంలో ఉన్నారో కూడా ప్రజలకు తెలియాలి. ఇపుడు ఎవరికీ అన్యాయం జరగలేదు. అందరికీ న్యాయం జరిగిందని చెప్పడానికే ఇట్లాగు పాతబస్తీలో జరిగిన అభివృద్ధి విషయం చెప్పవలసి వస్తున్నది పాతబస్తీలో మంచినీరు, లైటింగు, డ్రైనేజ్ సమస్యలు వచ్చినపుడు అన్నీ కార్యక్రమాలు చేసినపుడు ప్రజలు నాకు అండగా ఉన్నారు రాజకీయ అలజడి తెచ్చినవారికి ప్రజల మద్దతు లేదు, ఈ రోజు కిలో రెండురూపాయల బియ్యం పథకం వల్లనే బీదలు సంతోషంగా ఉన్నారు.

కులీ కుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ క్రింద ఉర్దూ భాష తెలిసిన బాలికల కోసం బాలికల పాలిటెక్నిక్‌ను ఏర్పాటుచేయడం జరిగింది. 1985 నుంచి ఇంతవరకు రు. 80 లక్షలు ఖర్చు పెట్టడం జరిగింది. అదేవిధంగా కర్నూల్‌లో ఒకటి, నిజామాబాదులో ఒకటి, గుంటూరులో ఒకటి చొప్పున మూడు ఉర్దూ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుచేయడం జరిగింది. ఇదివరకు హైదరాబాద్‌లో ఉంది కాబట్టి మొత్తం నాలుగు రెసిడెన్షియల్ స్కూల్స్ అయ్యాయి. ఇక 100 ఉర్దూ ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటు చేయాలని కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది ఉర్దూ చదివే బిడ్డలకోసం అని మనవిచేస్తున్నాను.

ఈ కార్యక్రమాలకు ప్రత్యేకంగా ఉర్దూ భాషను అమలుపరచాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది. కాబట్టి భాషా విషయంలో ఏమాత్రం ద్వేష భావులంకాము. అందరం సోదరులం, అన్యోన్యత ప్రేమ, వాత్సల్యం కావాలని కోరుకొనేవారం. సంస్థాన సంస్కృతిగానీ, ఈనాటి ఆంధ్రప్రదేశ్ సంస్కృతిగానీ ఉమ్మడి సంస్కృతులని చెప్పుకొంటున్నాం. రెండు భాషలను గౌరవించడం మనధర్మం అనుకొంటున్నాము. అదేవిధంగా దీనికి సంబంధంలేకపోయినా ఒక విషయం చెపుతాను. ఈనాడు సౌండ్ అండ్ లైట్ ఎక్కడ పెట్టాలంటే గోల్కొండలో పెట్టాలని చెప్పినవాణ్ణి నేను. ఎందుకంటే ఇక్కడికి ఎవరు వచ్చినా సంస్కృతి విషయం తెలుసుకోవాలి. ఏ విధంగా ఒకరినొకరం ప్రేమించుకొంటున్నాం. అర్థం చేసుకొంటున్నాం అనేది అందరికీ తెలియాలి. ఆదర్శంగా ఉండాలనే భావంతో వ్యవహరిస్తున్నామని మనవిచేస్తున్నాను. అదేవిధంగా

తెలుగుదేశం ప్రభుత్వం వచ్చి 5 సంవత్సరాలు అయింది, ఈ 5 సంవత్సరాలుగా మతసామరస్యాన్ని మా ప్రభుత్వం ఎలా కాపాడిందో అందరికీ తెలిసిందే. ఈనాడు అందరూ గుండెలమీద చేయి వేసుకొని నిద్రపోతున్నారు. భాష అన్నప్పుడు సర్వత్రా గౌరవం ఉండాలి, భాషే ప్రాణం. అలాంటి ప్రాణప్రదమైన భాషను గౌరవించడం, ఏ భాషలో ఉన్నప్పటికీ మంచిది అయినదానికి స్వీకరించడం ప్రభుత్వం తన ధర్మంగా భావిస్తున్నది భాషను గౌరవించడం ప్రభుత్వం తన ధర్మంగా భావిస్తుందని మనవిచేస్తున్నాను.

అంతేకాదు, ఇక్బాల్ సాహెబ్ మెమోరియల్‌ను ఆవిష్కరించిన గౌరవం నాకు దక్కింది. ఎందుకంటే సోదరులు కోరారు, మాకు కావాలి అన్నారు. నేను వెంటనే ఫలానా తారీఖు లోపల నేను దాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పాను. అదే విధంగా చేశాను మా యొక్క తెలుగు వారికే కాదు, అన్ని జాతుల వారికి ఇది గౌరవ కారణం. అందరి విషయం ఆలోచించుకుంటున్నాము, అన్ని భాషలను గుర్తించుకుంటున్నాము. అందరమూ సోదరభావంతో ఉంటున్నాము అనేది తప్ప మరొకటి కాదు. దయచేసి ఈనాడు ఈ రాష్ట్రంలో అన్నీ సామరస్య ధోరణిలో సాగుతున్నాయని గుర్తించండి. ప్రభుత్వం ఒకరికే చెందింది కాదు. మన సంఘంలో ఎవరికి ఏ అనుమానం వచ్చినా, తీర్చవలసిన బాధ్యత మాకు ఉన్నది. అందరి యెడల సరైన భావం, భాధ్యత మాకు ఉన్నది కాబట్టి పూర్తిగా మా మనిషిగా నమ్మమని నేను కోరుతున్నాను. ఇటువంటి ప్రవాహానికి ఏమీ మీరు తలవొగ్గవలసిన అవసరం లేదు. ఎప్పుడూ, ఎప్పటికీ, ఉర్దూభాషకు అన్యాయం చేయడం జరుగదు. ఆ సంస్కృతి మనకు అబ్బిన ప్రత్యేక విధానంగా గౌరవిస్తున్నవారము, కనుక దీని విషయంలో సరియైన విధానంలో గుర్తించి, మేము తీసుకున్న చర్యను గుర్తించాలని సవినయంగా మనవిచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

◆◆

ఆగస్టు 18, 1988

# ప్రతీ చుక్క నీటిని సస్యశ్యామలంగా చేసుకోడానికి అవకాశం ఉంది

*(రాయలసీమలోని నిత్య కరువు పీడిత ప్రాంతాలకు సేద్యానికి, త్రాగడానికి నీటి సరఫరా జరిగిన సల్పకాలిక చర్చ)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, గౌరవనీయులైన సభ్యులు చేసిన సూచనలు అన్నీ కూడా సహృదయంతో వారు చేసిన సూచనలను మేము ఏమీ అభ్యంతరం పెట్టడం లేదు. మంచినీరు త్రాగడానికి అని గుర్తించవలసిన విషయం. ప్రత్యేకమైన ప్రాంతీయ ద్వేషం, ప్రాంతీయ భావం లేకుండా ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నటువంటి మెరకబట్టిన ప్రాంతాలు, అరుదు ప్రాంతాలు కానటువంటి భూములను సస్యశ్యామలంగా మాగాణిగా అయ్యేందుకు సాధించేందుకు నీరు అవసరమని మనం అందరం భావించాలని మనవిచేస్తున్నాను. వాగులు, జలాలు ఉన్నాయన్నారు. ఇదివరకే పూర్తిగా గుర్తించినటువంటి విషయం. మూడు రాష్ట్రాలు అంగీకరించాయి. 2060 టి.ఎం.సి కృష్ణ నీరు బచావత్ అవార్డు ప్రకారం వాటర్ డిస్ట్రిబ్యూషన్ విషయం దానిని ప్రాతిపదికగా తీసుకుని 700 టి.ఎం.సి. వాటర్ కర్ణాటక రాష్ట్రానికి, 560 టి.ఎం.సి. వాటర్‌ను మహారాష్ట్ర రాష్ట్రానికి 800 టి.ఎం.సి వాటర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వాడుకోవాలని తీర్పు ఇవ్వడం జరిగింది.

ఇది వరకు ప్రభుత్వం ఉన్నప్పుడే 24 ఐటెమ్స్‌గా ఏవిధంగా మూడు ప్రాంతాల వారికి నీరు సంభవం చేయాలన్న విషయం ఆలోచించే రాయలసీమకు 122.70 టి.ఎం.సి.ల నీరు ఆ తరువాత ఆంధ్రాకు 377.41 టి.ఎమ్.సి.ల నీరు, తెలంగాణకు 246.83 టి.ఎమ్.సి. ల నీరు ఆనాడు కేటాయించడం జరిగింది. ఉన్న నీరంతా ఇచ్చిన తరువాత ఇంకా మాకు అష్యూర్డ్ వాటర్ కావాలనడంలో అర్థం లేదని కూడా ఈ సందర్భముగా తమ ద్వారా నేను మనవిచేస్తున్నాను. బచావత్ కమిషన్ వారు ఇచ్చిన రిపోర్ట్ ప్రకారం 75 శాతం నీటిని కర్ణాటక రాష్ట్రం వారు,

మహారాష్ట్ర వారు తమవంతు నీరు వాడుకొని తరువాత మిగిలింది వదిలి పెడతారు. కాబట్టి కరువు కానీ, ప్రకృతి విలయాలు కానీ వచ్చినప్పుడు దెబ్బతినేది ఆంధ్రప్రదేశ్ కాబట్టి 2,000 సంవత్సరం వరకు కూడా మిగులు నీరు అన్నది ఏమైనా ఉంటే ఆ జలాలు వృధాగా సముద్రంలోకి పోకుండా వాటిని పూర్తిగా వినియోగించుకొనే అవకాశం, అధికారం కూడా ఆంధ్రప్రదేశ్‌కు ఉన్నదని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను.

300,320 టి.ఎమ్.సి.ల నీళ్లు వృధాగా సముద్రంలోకి పోతున్నాయి. దానిని నివారించడానికి విజయవాడ బ్యారేజి దగ్గర ఉన్న రెగ్యులేటరు కానీ, మరొకటి కానీ ఏకాభిప్రాయంగా సూచించేది, అప్పటి వరకు లేనిది తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తరువాత ఆవిర్భావం కావడం జరిగిందని వారికి నేను మనవిచేస్తున్నాను. పెద్దలు బాగారెడ్డిగారు ఏమీ అభివృద్ధి జరగలేదనేది మంచిది కాదు. అభివృద్ధి జరగలేదని మేము ఆనడం లేదే. అభివృద్ధి జరిగిందని మేము ఒప్పుకుంటున్నాము. జరిగింది, జరగలేదనడం కాదు. ఇంకా జరగవలసింది ఎంత అనేది ఈనాడు మనం అందరం ఆలోచించుకొంటున్నాము. కాబట్టి ఇంకా ఎంత జరగాలనేదే తెలుగుదేశం ప్రభుత్వం ఆనాడు ఆలోచించింది. 320 టి.ఎమ్.సి.ల నీరు వృధాగా సముద్రంలోకి పోతూ ఉంటే దానిని ఊరికనే వదిలి పెట్టడమేనా? లేకపోతే మెట్టబారి బీడు భూములుగా ఉన్న రాయలసీమ, తెలంగాణా ప్రాంతాల వారికి ఏ మాత్రం అయినా మనం సహాయం చేయడానికి వీలువున్నదా? మనకు ఆ కమిషన్ వారు అధికారం ఇచ్చారే దానిని ఏ విధంగా వాడుకొందాము, స్వప్రయోజనం కోసం అనే భావంతోనే ఈ రెండు పద్ధతులు శ్రీశైలం ఎడమ కాలువ కానీ, అదే విధంగా ఈనాడు తెలుగుగంగ ప్రాజెక్టు ప్రారంభించడం జరిగిందని మనవిచేస్తున్నాను.

> **320 టి.ఎమ్.సి.ల నీరు వృధాగా సముద్రంలోకి పోతూ ఉంటే దానిని ఊరికనే వదిలి పెట్టడమేనా? రాయలసీమ, తెలంగాణా ప్రాంతాల వారికి ఏ మాత్రం అయినా మనం సహాయం చేయడానికి వీలువున్నదా? మనకు ఆ కమిషన్ వారు అధికారం ఇచ్చారే దానిని ఏ విధంగా వాడుకొందాము, స్వప్రయోజనం కోసం అనే భావంతోనే శ్రీశైలం ఎడమ కాలువ కానీ, అదే విధంగా ఈనాడు తెలుగుగంగ ప్రాజెక్టు ప్రారంభించడం జరిగింది.**

తెలుగుగంగ నుండి 29 టి.ఎం.సిల నీటితోను, శ్రీశైలం ఎడమ కాలువ నుండి 29 టి.ఎం.సిల నీటితోను మెట్ట ప్రాంతాలుగా, బీడుబడ్డ ప్రాంతాలుగా, వెనుకబడ్డ ప్రాంతాలుగా, దరిద్ర, దుర్భిక్ష ప్రాంతాలుగా ఉన్న నల్గొండ జిల్లా వారందరికీ కూడా అవకాశం కల్పించడం జరిగింది. సమభావంతో, సమమైన పంపిణీ విధానంతో ఎక్కడెక్కడ ఏ విధంగా మెరక ప్రాంతాలు ఉన్నవో వాటిని ఉద్ధరించాలనేదే భావన. ఎవరికైతే ఎక్కడెక్కడ గుక్కెడు నీరు లేదో వారికి ఇవ్వాలనే భావం అని మనవి చేస్తున్నాను. మరి ఇదివరకు తెలుగుగంగ సంగతి ప్రస్తావించారు. ఆ విషయంలో కూడా నేను తెలుగుదేశం ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధిని వారి ముందు

తెలియజేస్తున్నాను. ఇది వరకు కేవలం మద్రాసుకు మంచి నీరు ఇచ్చే పథకం క్రిందే 17 టి.ఎం.సిల నీరు ఇవ్వడానికి తెలుగుగంగ ఏర్పాటు అయింది తప్ప అసలు రాయలసీమ విషయం కానీ, రాయలసీమలో గొంతు ఎండి మాడే వారి విషయం కానీ, ఆనాడు ఎండిపోయిన బీడు గడ్డల విషయం కానీ ఏ మాత్రం ఆలోచించలేదని కూడా ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ కలిపి 3.5 టి.ఎమ్.సి.ల నీరు ఇవ్వడం ధర్మమన్న భావంతో మానవ హృదయంతో తమిళ సోదరులకు మనం నీరు ఇస్తున్నాము.

కానీ ఈ మధ్యన ఉన్న మన వారి సంగతి ఏమిటి? తనకు మాలిన ధర్మం ఏమిటి? తనకు అవకాశం ఉన్నప్పుడు అటువంటి అవసరం వచ్చినప్పుడు పూర్తిగా తన ప్రయోజనాలను కూడా సాధించుకొని ప్రక్కవారి ప్రయోజనాలను చూడడం కూడా మంచిదన్న భావంతో దానిని, మంచి నీటి వ్యవస్థగానే కాకుండా, 2 లక్షల 75 వేల ఎకరాల రాయలసీమ భూమిని సాగుచేసే ప్రాజెక్టుగా కూడా తీర్చిదిద్దడం జరిగిందని ఈ సందర్భంగా మా సేవ విషయం వారికి మనవిచేస్తున్నాను. అందుకే చిన్నముక్కపల్లి వద్ద ఆఫ్ టేక్ నిర్మించడం కూడా జరిగింది. ఎందుకంటే ఇదివరకు బచావత్ వారిచ్చిన అవార్డులో ఆఫ్ టేక్ పాయింట్ తరువాత ఏది కూడా వ్యవసాయానికి వాడకూడదన్నారు. చిన్నముక్కపల్లి తరువాత మద్రాస్‌వారికి ఇచ్చారే ఆ నీటిలో ఏ విధమైన వ్యవసాయానికి సంబంధించినవి చేర్చకుండా చిన్నముక్కపల్లి లోపల పూర్తిగా 2లక్షల 75 వేల ఎకరాలకు కూడా ఈ సౌకర్యం కల్పించడం జరిగిందని వారికి నేను మనవిచేస్తున్నాను. అందుకే నేను చెప్పాను. సోదరులు రాజశేఖరరెడ్డి గారు చెప్పినప్పుడు అష్యూర్డ్ వాటర్ కావాలంటే, ఆ మాటే ప్రక్కవారు అంటే ఏమి సమాధానం చెప్పాలో వారే ఆలోచించాలి.

ఈనాడు నల్గొండ జిల్లా వారు కూడా, తెలంగాణా వారు కూడా వచ్చి మాకు కూడా అష్యూర్డ్ వాటర్ కావాలంటే ఎక్కడ ఉంది. అష్యూర్డ్ వాటర్? మనకున్న 800 టి.ఎం.సిల నీరును అడ్జస్ట్ చేసుకోవడం జరిగింది. ఇక మిగులు నీటిని మనం వాడుకోవలసిందే తప్ప దీనిలో అష్యూర్డ్స్ వాటర్, అష్యూర్డ్ వాటర్ అని పట్టుబట్టడంలో అర్థం లేదని వారికి మనవిచేస్తున్నాను. ఈనాడు రూ.800 కోట్లు, 1200 కోట్లు, 900 కోట్లతో నిర్మించుకొన్నామంటే కేవలం వాటిని వృధా చేసుకోడానికి కాదు. ఇంకా మనం చాలా ఆధునీకరణతో కూడిన సిద్ధాంతాలు అవలంబించాలి. వాటర్ మేనేజిమెంట్, ఎవాపరేషన్ తగ్గించుకోవాలి. ఇదే విధంగా ఎన్యుమరేషన్ కూడా పెట్టుకోవాలి. ఇవన్నీ కలిసినట్లయితే మన యొక్క నీటి వాడకంలోనే పొదుపు చేసుకొని మనం వాడుకోవచ్చును. ఈనాడు 300 టి.ఎం.సి.ల పైన నీరు వృధాగా పోతుందన్నారు కాబట్టి ఏ విధంగా చూసినప్పటికీ రెండు వేల సంవత్సరం తరువాత మనకు రావలసిన నీటి వాటాలున్నాయి. అధికారాలు ఉన్నాయి. కాబట్టి మనం ఈనాడు ఉన్న ప్రతి చుక్క నీటిని సస్యశ్యామలంగా చేసుకోడానికి అవకాశం ఉంటుందని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. బడ్జెట్ సంగతి ప్రస్తావన

వచ్చినప్పుడు ఎంత బడ్జెట్ పెట్టారు, ఎంత ఖర్చు చేశారు అన్నారు. ఖర్చు చేయడం కొంచెం తగ్గవచ్చు. తప్పేముంది.

ఇది వరకు బడ్జెట్‌లో కేటాయించింది ఎంత, ఖర్చు పెట్టింది ఎంతని ప్రశ్నించారు. తక్కువే కావచ్చు. నిన్నటికీ ఈవాళటికీ, ఈవాళటికీ రేపటికీ భేదముండవచ్చు. ఎప్పటికప్పుడు పరిస్థితులను పరిశీలించి కార్యక్రమాలు చేయవలసిందే తప్ప కేవలం మాట ఇచ్చామని మనుషుల నెత్తినెక్కి తొక్కేటటువంటి రాక్షసత్వంతో కూడిన ప్రభుత్వం కాదని మనవిచేస్తున్నాను. కరువులు, కాటకాలు వస్తున్నాయి. ప్రజల దగ్గర నుండి ఆశించిన పన్నులు రావడం లేదు. మరి అలా రానప్పుడు తగ్గించుకోవడం మనకు అవసరంగానే భావిస్తున్నది ప్రభుత్వం అని మనవిచేస్తున్నాను. ప్రభుత్వ చిత్తశుద్ధిని ఈనాడు గౌరవనీయులు శంకించనక్కరలేదనడానికి నిదర్శనంగా వ్యవసాయానికి కేటాయింపులు పెరిగాయో లేదో ఒక్కసారి దయచేసి గౌరవ సభ్యులు అందరూ కూడా తెలుసుకోవాలని మనవిచేస్తున్నాను.

1979-80 సంవత్సరంలో 160 కోట్ల రూపాయలు, 1980-81వ సంవత్సరంలో 153 కోట్ల రూపాయలు 1981-82వ సంవత్సరంలో 153 కోట్లరూపాయలు, 1982-83వ సంవత్సరంలో 152 కోట్ల రూపాయలు, 1983-84వ సంవత్సరంలో 172 కోట్ల రూపాయలు అయితే తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తరువాత 1984-85వ సంవత్సరంలో 235 కోట్ల రూపాయలు, 1985-86 వ సంవత్సరంలో 250 కోట్ల రూపాయలు. 1986-87వ సంవత్సరంలో 306 కోట్ల రూపాయలు, 1987-88వ సంవత్సరంలో 257 కోట్ల రూపాయలు మరి ఈ సంవత్సరం 300 కోట్ల రూపాయలు ప్రత్యేకంగా దీని కోసం వినియోగించడం జరుగుతుందని వారికి మనవిచేస్తున్నాను. వ్యవసాయానికి ప్రభుత్వం చెప్పినట్లుగా రైతులకు హామీ ఇచ్చినట్లుగా అభివృద్ధిని కోరి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి, దారిద్ర్యాన్ని దూరముగా పోగొట్టాలి ఈనాడు అన్నదాతగా ఉన్నటువంటి వ్యవసాయానికి ప్రభుత్వం కూడా పరిరక్షణ ఇవ్వాలి అనే భావనతోనే ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని నేను సవినయంగా మనవిచేస్తున్నాను.

అధ్యక్షా, ఇది వరకు అసలు బడ్జెట్ మొత్తం సుమారు 775 కోట్ల రూపాయలు అయితే ఈనాడు 1250 కోట్ల రూపాయలకు పెంచి, రంగాలకు అన్నింటికీ కూడా కేటాయింపులు చేస్తే ఇది అభివృద్ధి కాదు అంటే నేను చెప్పేది ఏమీ లేదని తమ ద్వారా మనవిచేస్తున్నాను. కాబట్టి ఈనాడు ఇది అతి సునిశితమైనటువంటి సమస్య ప్రజల యొక్క అభిమానంతో ఈనాడు ఆంధ్ర రాష్ట్రం విశాలాంధ్ర రాష్ట్రంగా మారి భిన్నత్వాన్ని మరచిపోయి అందరి కలయికతో ఈనాడు ఏకత్వంలో మమేకమైనప్పుడు ఈ సమస్యలు పరిష్కరించడానికి పూర్తిగా మనలోనే మనం ప్రయత్నించాలి. ఎవరైతే వెనుకబడి ఉన్నారో, ఎవరైతే మెట్ట ప్రాంతాలుగా బాధలలో ఉంటున్నారో,

అటువంటి వారికి మనం అందరం ప్రతినిధులము అనుకోవాలి తప్ప కేవలం ఒక ప్రాంతం వారుగా ఎవరూ కూడా మాట్లాడడం సరికాదని నా అభిమతమని మీ ద్వారా వారికి సవినయంగా మనవిచేస్తున్నాను. పూర్తిగా ఆలోచనలు, ఊహలు మన భావాలు అన్నీ కూడా వెనుకబడిన ప్రాంతాలపై ఉన్నాయి. వాటిని ఉద్ధరించడంలో సరైన విధానం ఆచరించడానికి ప్రతి ఒక్కరికి జాతీయ భావము అవసరమని ఈనాడు తెలుగుదేశం ప్రభుత్వము నిష్కల్మషంగా నిర్భయంగా చెప్పింది, గంగ నీళ్ళు తీసుకురావాలి కావేరి నదిలో కలపాలి. పూర్తిగా దేశాన్ని సస్యశ్యామలము చేయాలని. 1983వ సంవత్సరంలో శ్రీమతి ఇందిరా గాంధీగారి దగ్గరకు నేను వెళ్ళినప్పుడు వారికి నేను సవినయంగా మనవిచేశాను.

అమ్మా, ఈ పెద్ద ప్రాజెక్టులు మా వల్ల కాదు, రాష్ట్రాల వల్ల అది సంభవం అవుతుంది అనుకోవడం మంచిది కాదు, దయచేసి ఇది ఈనాడు నీటి సమస్య, ప్రతి వారికి సంబంధించిన సమస్య, ఆహారం ప్రతి భారతీయుడికి సంబంధించిన సమస్య, కాబట్టి పూర్తిగా మీరు జాతీయ ప్రాజెక్టుల క్రింద తీసుకోవాలి అని వారిని కోరడం జరిగింది. ఈనాడు నర్మదా ప్రాజెక్టు తీసుకున్నారు. జాతీయ ప్రాజెక్టు క్రింద, భాక్రానంగల్ ప్రాజెక్టు తీసుకున్నారు. అదే విధంగా పంజాబ్ హరియాణా కాలువ కూడా ఈనాడు బాధ్యత వహించి కేంద్ర ప్రభుత్వం త్రవ్విస్తోంది. అటువంటి బాధ్యత ఈనాడు ఈ జల సరఫరాను ఎందుకు తీసుకోవడం లేదు అని నాకు వచ్చిన అనుమానంగా మీకు నేను మనవిచేస్తున్నాను అధ్యక్షా. వంశధార విషయం చెప్పారు మీరు. ఒరిస్సా ముఖ్యమంత్రిగారితో నేను అంగీకారం కుదుర్చుకొన్నాను.

**ఒక మీటింగుకి వెళ్ళినప్పుడు ఒరిస్సా ముఖ్యమంత్రిగారిని అడిగాను. ఏమండి ఏమిటి మన సంగతి ఏమైంది అని అంటే, మీరు ఒప్పుకున్నారు కదా అని, నేను ఒప్పుకున్నాను కదా అప్పుడే చెప్పాను. అంటే ఆయన చెయ్యి పుచ్చుకుని నన్ను ప్రధానమంత్రిగారి దగ్గరికి తీసుకువెళ్ళి అయ్యా మీరు ఎందుకు ఆలస్యము చేస్తున్నారు, ఆయన ఒప్పుకున్నాడు 106 ఎకరాలు మునిగిపోవడానికి, నేను ఒప్పుకున్నాను.**

106 ఎకరాలు సబ్ మెర్షన్‌కి నేను ఒప్పుకున్నాను. ఆయన ఒప్పుకున్నారు. మరి ఎందుకు దానికి క్లియరెన్సు రాలేదు? క్లియరెన్సు రాకపోతే నేను మొన్న ఒక మీటింగుకి వెళ్ళినప్పుడు ఒరిస్సా ముఖ్యమంత్రిగారిని అడిగాను. ఏమండీ.. ఏమిటి మన సంగతి ఏమైంది అని అంటే, మీరు ఒప్పుకున్నారు కదా అని, నేనూ ఒప్పుకున్నానని అన్నారు. అంటే ఆయన చెయ్యి పుచ్చుకుని ప్రధానమంత్రిగారి దగ్గరికి తీసుకువెళ్ళి అయ్యా మీరు ఎందుకు ఆలస్యము చేస్తున్నారు, ఆయన ఒప్పుకున్నాడు 106 ఎకరాలు మునిగిపోవడానికి, నేను ఒప్పుకున్నాను 106తో సరిపెట్టుకోడానికి. ఇక ఆలస్యము ఏమిటి అని అడిగితే ఆయన ఇంగ్లీషులో అడిగారు, ఈజిట్ అని. ఎస్ సర్ ఐ యాక్సెప్టెడ్ అని ఆయన చెప్పారు. వెంటనే వారు చెప్పింది-డన్-అనే మాట కూడా గుర్తు

చేస్తున్నాను. ఈ మాట కూడా అన్నాడు ఆయన–డన్ డన్ అని అన్న తరువాత ఇప్పటికి సుమారు ఆరు నెలలు పైన గడిచింది. మరి ఈ డన్‌కి అర్థము నాకు అర్థం కావడం లేదు కాబట్టి గౌరవనీయులైన తమకు ఉన్నది ఉన్నట్లుగా నేను చెప్పాను. ఎవరి మీదా మాకు అపార్థం లేదు ఎవరినీ దూషించవలసిన అవసరం అంతకంటే లేదు. ఈనాడు ఆరు కోట్ల ప్రజానీకానికి ఏ పార్టీ వారు అయినా సరే ప్రజా సంక్షేమం కోసం వచ్చినటువంటి ప్రభుత్వంగా ప్రజా ప్రభుత్వంగా ఆరు కోట్ల ప్రజానీకానికి కూడా ఎవరికీ ఏ అన్యాయము కూడా జరగదని నేను సవినయంగా మీ అందరికీ మనవిచేస్తున్నాను. నాకు ఇచ్చిన అవకాశానికి మరొకసారి కృతజ్ఞతలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

◆◆

ఆగస్టు 25, 1988

# అన్ని ప్రాంతాల ప్రజానీకం ఎంతో నమ్మకముతో తెలుగుదేశాన్ని గౌరవించారు

*(తెలంగాణ ప్రాంతంలోని సాగునీటి ప్రాజెక్టులు, మరియు ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై జరిగిన స్వల్పకాలిక చర్చ)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, గౌరవ సభ్యులు తమ తమ అభిప్రాయాలను తెలిపారు. ప్రాంతీయతత్వంతో మాట్లాడుతున్నట్లుగా నాకు అనుమానం ఉంది. కానీ ప్రజలకు విశ్వాసం, సమైక్యత కల్పించవలసిన అవసరం ఉంది. ఒకరిపై ఒకరు అనుమానాలు పెంచుకోవడం మంచిది కాదు. సమస్యలు ఉంటే సామరస్యంతో పరిష్కరించుకుందాము. ఏ ప్రాంతానికి అన్యాయం జరగకుండా చిత్తశుద్ధితో మనం కృషి చేస్తేనే మనపై ప్రజలకు విశ్వాసం కలుగుతుంది. ఎలాగూ ఒక కమిటీ వేశాము. అందులో మన సమస్యలు చర్చించుకోవచ్చు...

ఈనాడు మనం ఒక ఉన్నత స్థితిలో గౌరవస్థాయిలో ఉన్నాము. ప్రజలు మనపై విశ్వాసం ఉంచారు. వారి సమస్యలు పరిష్కరించటానికి ప్రభుత్వం బాధ్యత తీసుకుంటున్నది. పారలల్‌గా ఇంకో కమిటీ చెక్, కౌంటర్ చెక్ ఇదంతా అనవసరం. ప్రభుత్వం బాధ్యత తీసుకుని చేస్తుంది. మీరు ఉదయం నుండి చెబుతున్న వాటిని ఇంత ఓపిగ్గా, చిత్తశుద్ధితో వింటున్నాము, ఏదో మంచి చేద్దామనే ఉద్దేశ్యంతోనే కదా వింటున్నాము. ఈ ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుంది. వేరే కమిటీ అనవసరమని మనవిచేస్తున్నాను. సిక్స్ పాయింట్ ఫార్ములా వల్ల ఏదీ వయోలేట్ జరగకూడదని, సుందరేశన్ కమిటీని ఇదివరకు వేశాము. వారు పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలన చేశారు. ఇంకా అవసరముంటే, ఇంకొక సింగిల్ మ్యాన్ కమిటీని ఏర్పాటు చేస్తాము. అది మనకందరకూ అవసరం. దాన్ని గౌరవించడం మన ధర్మం. కాబట్టి దాని విషయంలో అశ్రద్ధ చేయడం జరుగదని మనవిచేస్తున్నాను. అధ్యక్షా, తమరి అనుమతితో నేను వైండప్ చేస్తున్నాను. గౌరవఅధ్యక్షులకు, గౌరవ సభ్యులకు, తమయొక్క అభిప్రాయాలను వ్యక్తము చేసినందుకు పేరు

పేరునా వారందరికీ ప్రభుత్వము తరపున కృతజ్ఞతా పూర్వకంగా, సవినయంగా మనవి చేస్తున్నాను. అనుభవం లేకపోయినప్పటికీ, రాజకీయంలో కొత్త అయినప్పటికీ, 1983 ఎన్నికలలో, అందరూ, అన్ని ప్రాంతాల ప్రజానీకం ఎంతో దయతో, ఆదరతతో, ఆప్యాయతతో, ఆశతో, నమ్మకముతో తెలుగుదేశాన్ని గౌరవించారంటే, ప్రత్యేకంగా వారిచ్చిన బాధ్యతను కృతజ్ఞతా పూర్వకంగా నిర్వహిస్తానని సవినయంగా మనవిచేస్తున్నాను. కేవలం, ప్రలోభాలకు లోబడి, ఏ ప్రాంతానికి అన్యాయం చేయడం గానీ, ఏ విధమైన కులమత వర్గ విద్వేషాలు పెట్టుకొని మరొక విధంగా ఆచరించడం గానీ, జరగదని ప్రతి ఒక్కరికీ హామీ పూర్వకంగా తెలియజేస్తున్నాను. ఈనాడు దురదృష్టకరమైన విషయం ఏమంటే, మనలో మనము అనుమానించుకొంటూనే మాట్లాడడం శోచనీయంగా, నా బాధగా తెలియజేస్తున్నాను. సంస్కారవంతమైన విధానములో ఒకరి మీద ఒకరికి విశ్వాసాన్ని పెంచుకొనే పద్ధతిలో ఉండాలి. అది ఉపయోగపడాలని కోరుకునే వాళ్ళలో నేను ముఖ్యుడిని. ఇపుడు వారి వారి అభిప్రాయాలను తెలియజేశారు. మీ యొక్క అభిప్రాయాల ప్రకారమే మనమందరం తమరి అధ్యక్షతన నిర్వహించిన సమావేశములో మనం కమిటీని వేయాలంటే ఎందుకో ప్రతి పార్టీ వారు, ఫోర్ లీడర్స్ ప్లస్ మూడు జోనల్ రెప్రజెంటేషన్ ఉండాలని మొన్న నిర్ణయించడం జరిగింది.

ప్రజలందరికీ మనము విశ్వాసాన్ని కలిగించవలసిన అవసరం ఉందని తమరిద్వారా సవినయంగా మనవిచేస్తున్నాను. మన రాష్ట్ర సమైక్యతను, మన ప్రాతినిధ్యమును పటిష్టంగా కాపాడుతుందనే ఒక ఉదాత్తమైన నమ్మకము, మన యొక్క అభివృద్ధిని ఆకాంక్షిస్తుందనే నమ్మకం, సరియైన న్యాయపరమైన విధానముతో అందరినీ గమనిస్తుందని, మనపై వారికి విశ్వాసాన్ని పెంపొందించుకోవడం, మనకు అవసరమని మనవిచేస్తున్నాను. ఇప్పుడే నీటి విషయంలో నేనేమీ డీటెయిల్స్‌లోకి వెళ్ళదలచుకోలేదు. ప్రభుత్వము ఏమైనాసరే, ఆవేశంతో, ఆతృతతో, పూర్తిగా మన బాధ్యతలను మనం నిర్వహించాలి. మెరక ప్రాంతాలుగా ఉన్నటువంటి వారికి మనము తగినంతగా ఆదరువు కలిగించాలి. ఆ ఆతృతతోనే ప్రభుత్వము వెళ్లుతున్నదితప్ప, మరొక విధంగా కాదని సవినయంగా మనవిచేస్తున్నాను. బచావత్ కమిషన్ అవార్డులో వారు చెప్పిన భాగము కూడా ఉంది. "There is no ground for limiting the use of assured water to Andhra Pradesh to the existing carrying capacity. If the remaining is not utilised, it would be wasted in the Sea" వృధాగా జలం పోతుంది కాబట్టి ఆఖరి రాష్ట్రంగా, రెండు రాష్ట్రాల వారికి 700-560 టి.ఎం.సి.ల నీరు ఇచ్చిన తరువాత, మిగిలినది వదలిపెడతారు కాబట్టి, 75 శాతం డిపెండబిలిటీ మీద, ఎప్పుడైనా కరువు కాటకాలతో ఇబ్బంది ఏర్పడితే, ఆఖరి రాష్ట్రంగా, తుది రాష్ట్రంగా 2000 సంవత్సరం వరకు దాన్ని ఉపయోగించుకోవచ్చు, అనే ఒక చిన్న క్లాజును తీసుకొని స్వతంత్రించడం జరిగిందని సవినయంగా మనవిచేస్తున్నాను. కాబట్టి, ఈనాడు తెలుగుగంగను ఆలోచించినా, శ్రీశైలం లెఫ్ట్

బ్యాంక్ కెనాల్‌ను ఆలోచించినా ఈ ఆదరువు ఉంది కాబట్టి, మొండిగా ధైర్యంగా, ప్రజలను దృష్టిలో పెట్టుకొని, ముందుకు వెళ్ళుతున్నాము గనుక ఈ విధానాన్ని పటిష్టము చేయడానికి దయచేసి ఇవ్వండి. ఎవరికి ఎంతెంతో పంచండి. నాకేమీ అభ్యంతరం లేదు. ఎన్నో ప్రాజెక్టులు చేశాము. అన్నీ పూర్తిగా మన చేతుల్లో ఉన్నాయి. ఇది నిర్వహణ సాధ్యమని అనుకొన్నాము పూర్తిగా.

ఆర్థిక విధానం గురించి కొందరు, డబ్బు ఖర్చు చేయలేదని అన్నారు. నేను ఒప్పుకుంటున్నాను. ఎందుకంటే, 4 సంవత్సరాల నుండి మనకు అనుకోకుండా కరువులు వచ్చాయి. అందరికీ తెలుసు. కొన్ని విధానాల వల్ల మనకు వచ్చే ఆదాయం తగ్గిపోయింది. నిన్న లేక మొన్న విద్యుచ్ఛక్తిలో కోతవల్ల పరిశ్రమలు వారి యొక్క కార్యక్రమాలు తగ్గి ఈనాడు కరెంట్ కొనడానికి అవకాశం లేదు. ఒక క్రమశిక్షణా విధానముతో ఈనాడు ఆచరిస్తున్న పద్ధతిని వారికి సవినయంగా మనవిచేస్తున్నాను. ఎన్ని అవాంతరాలు వచ్చినటికీ కూడా అనుకొన్న టైంలో పూర్తి చేయడానికి ప్రయత్నం చేస్తున్నాము. నీటి సమస్యలు పోయిన తరువాత కొన్ని సమస్యల విషయంలో సమాధానం చెప్పలేదని చెప్పారు. వారికి నేను మనవిచేస్తున్నాను. తమరే మనవిచేసారు. ఫ్రీ జోన్‌గా ఉంది. దానివల్ల పాఠశాలల్లో గానీ, కళాశాలల్లో గానీ అందరూ ప్రవేశించడానికి అర్హత ఉంది. కానీ పూర్తిగా తెలంగాణ ప్రాంతములో ఉన్నటువంటి ఆ పేద బిడ్డలు, చదువుకునే అవకాశం లేదని వారు మనవి చేశారు.

**4 సంవత్సరాల నుండి మనకు అనుకోకుండా కరువులు వచ్చాయి. అందరికీ తెలుసు. కొన్ని విధానాల వల్ల మనకు వచ్చే ఆదాయం తగ్గిపోయింది. నిన్న లేక మొన్న విద్యుచ్ఛక్తిలో కోతవల్ల పరిశ్రమలు వారి యొక్క కార్యక్రమాలు తగ్గి ఈనాడు కరెంట్ కొనడానికి అవకాశం లేదు. ఒక క్రమశిక్షణా విధానముతో ఈనాడు ఆచరిస్తున్న పద్ధతిని వారికి సవినయంగా మనవిచేస్తున్నాను.**

ఇది తప్పకుండా గమనించవలసిందే. ఎందుకంటే, ఈనాడు ఒక లిమిట్ ఏర్పడినపుడు, ఆ సిక్స్ పాయింట్ ఫార్ములాను కాదనలేము. ఇప్పుడు జరుగుతున్న విధానము తప్పు అని అనలేము. దీని మీద మరొక మార్గం ఉందేమో దయచేసి సూచన చేయండి. తప్పకుండా ప్రభుత్వము ఆచరించి తీరుతుంది. ఎందుకంటే, ప్రజలకు సరియైన సంక్షేమం కలగాలి. విద్య విషయంలో వైద్యం విషయంలో గానీ మీ అందరితో నేను ఏకీభవిస్తున్నాను. కాదనేది లేదు. ప్రభుత్వం తరపున నేను స్వయంగా ప్రత్యేకంగా హామీ ఇస్తున్నాను. ప్రజలకు సంబంధించినంత వరకు ఈ సంక్షేమ కార్యక్రమాలు విధిగా నిర్వహించబడుతాయి. అందువల్ల ప్రతి మండలంలో కూడా ప్రాంతీయ విద్వేషం లేకుండా, ప్రైమరీ హెల్త్ సెంటర్లుండాలని, పోలీస్ స్టేషన్, జూనియర్ కళాశాల ఉండాలని ఇన్ని ప్రయత్నాలు కూడా జరుగుచున్నాయి. అన్ని మండలాలకు వచ్చిన తరువాత, న్యాయం అనేది లక్షణంగా అందరికీ ఏర్పర్చబడుతుంది. ఇంకా అవసరమైతే, దీని విషయంలో

ప్రత్యేకమైన విధానంలో మనం న్యాయం చేకూర్చుకుందాము. ఈ విషయాన్ని పూర్తిగా ప్రభుత్వము గమనిస్తుంది. ఈనాడు గౌరవ సభ్యులు కొందరు చెప్పారు.

తెలంగాణలో ఉన్న ఈ సమస్యల గురించి గౌరవ సభ్యులు వెంకటేశ్వరరావుగారు చెప్పినట్లుగా, గతంలో వచ్చిన ఆనవాయితీ విధానంవల్ల వచ్చిన దురదృష్టకరమైన నష్టము. కోస్తా ప్రాంతం గానీ, మరొక ప్రాంతముగానీ, రాయలసీమ గానీ, సులక్షణంగా, నాగరికతతో వారు స్వేచ్ఛగా గాలి పీల్చుకుంటున్నారు. అటువంటప్పుడు, ఇక్కడ నిజాం నిరంకుశ నియంతృత్వ పరిపాలనలో మ్రగ్గినటువంటి ప్రజానీకం, ఎన్నో ఇబ్బందులలో ఉన్నప్పుడు, తమరే సెలవిచ్చారు. దీనివల్ల, కొంత నాగరికతనో లేకపోతే అటువంటి అభివృద్ధి జరగకుండా ఉండే ఉండవచ్చు. కానీ ఈనాడు మన బాధ్యత అందరికీ సక్రమంగా, అభివృద్ధి ప్రాంతాలు, అభివృద్ధిలేని ప్రాంతాలు, సాటివారిని పైకి లేవనెత్తాలి అనేది ప్రభుత్వము యొక్క ఆదర్శము కాబట్టి, ప్రత్యేకంగా మనకున్నటువంటి అవకాశాలు గానీ, మనకున్నటువంటి విధులుగానీ, మనకున్నటువంటి కార్యక్రమాలు గానీ, పూర్తిగా ఎవరైతే వెనుకబడి ఉన్నారో, వారిని ఉద్ధరించడానికి పూనుకొనడంలో ఏమాత్రం ఈ ప్రభుత్వానికి అభ్యంతరంలేదని వారికి సవినయంగా మనవిచేస్తున్నాను.

గౌరవనీయులైన బాగారెడ్డి గారికి మనవిచేస్తున్నాను. కాంగ్రెస్ పార్టీ పక్షాన సభ్యుల పేర్లను పంపండి. అనుకున్న మూడు నెలల గడువు లోపల మనందరం కలిసికట్టుగా, ఒక కుటుంబ సభ్యులుగా భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు చేశారు అని ప్రజలకు నమ్మకం కలిగేలా నిర్ణయాలు తీసుకుందాము. రాష్ట్ర సమైక్యతను కాపాడుకోటానికి, పేదరికం పోవడానికి కృషి చేద్దాము. దానికి మీరంతా తోడ్పడాలని కోరుతూ మీరంతా క్రమశిక్షణతో వ్యవహరించిన తీరుకు ప్రభుత్వపక్షాన నా హృదయపూర్వక ధన్యవాదాలు, అభినందనలు తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

◆◆

మార్చి 4, 1989

# అనుమానాలు లేకుండా సరియైన అవగాహనతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకొందాం

*(1989-90 సంవత్సరమునకు బడ్జెట్‌పై జరిగిన సాధారణ చర్చ)*

**Chief Minister Sri N.T. Rama Rao:** This is a matter concerning the Centre And State relations. భిన్న సంస్కారాలు, భిన్న నాగరికతలు, భిన్న జాతులున్న ఈ దేశములో among all the diversities, unity is our key note. దాని విషయంలో పూర్తిగా శ్రద్ధ వహించవలసిన బాధ్యత ఉందని చెప్పడం జరిగింది. కానీ ఆంధ్రప్రదేశ్‌లో జాతి అంతా ఒకటే, భాష ఒకటే. దీనిలో వ్యత్యాసాలు ఉంచుకోవడం మంచిది కాదని, ఇది వరకు వేర్పాటు వాదం వలన అనర్థాలు చవిచూచిన వారం కాబట్టి, ఇపుడు కేటాయింపులు కూడా తమరు పరిశీలన చేశారు. ఇరిగేషన్ ఫెసిలిటీ అక్కడ ఏ వసతులున్నాయో, వాటికీ ఈనాడు రాయలసీమకు గానీ, తెలంగాణకు గానీ, ఎప్పుడూ కనీవినీ ఎరుగని విధంగా అక్కడ ఇరిగేషన్ ప్రాజెక్టులు తీసుకొనబడుతున్నాయని అంటే, వాటిని అభివృద్ధి చేయాలనే బాధ, తపన ప్రభుత్వానిదితప్ప, వెనుకబడినతనాన్ని ఉంచాలని మాత్రం ఏమీ లేదు. అన్ని ప్రిఫరెన్సెస్ ఇవ్వబడతాయి. కానిస్టిట్యూషనల్ స్టాటస్ ఉండదు. అందరికీ తెలుసు, దాచుకొనేది లేదు. అందరం బడ్జెట్ గురించి చర్చలు చేశాము. ఎవరెవరికి ఏ ఏ ప్రాంతానికి ఎంతెంత కేటాయించింది కూడా పూర్తిగా గుర్తించాము ఇంకా ఏమైనా ఉంటే చేసుకొందాము ప్రత్యేకంగా, మనలో మనకు విశ్వాసము లేకుండా, ఒక కమిషన్ చెప్పితేనే విశ్వాసం ఉంటుందనే భావన ఉండడం మంచిది కాదు. ఏమైనా లోపాలుంటే మీరు చెప్పండి, ప్రభుత్వపరంగా - డిపార్టుమెంట్ ఉంది, అధికారులున్నారు. నేను హామీ కూడా ఇస్తున్నాను. ఇట్ షుడ్ బి డన్. ఒక కమిషన్ కావాలని ప్రాంతీయ అనుమానాలు పెట్టుకోవడంకన్నా, సరియైన అవగాహనతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకొందామని సవినయంగా మనవిచేస్తున్నాను.

అధ్యక్షా, గౌరవనీయులైన శ్రీ బాగారెడ్డి గారు చెప్పారు. హౌసింగ్ విషయంలో కొత్త స్థలాలలోనే కట్టనక్కర లేదు, 20 ఇళ్లు అనేది నిర్ధారణంగా ఉండనక్కరలేదు, ఈనాడు గ్రామంలో ఒకటి, రెండు కుటుంబాల రజకులు ఉంటున్నారు. వారికి 20 ఇళ్ళు ఉంటే కానీ మేము కట్టము అని అనడం పొరపాటు అవుతుంది. ఈనాడు ల్యాండ్ కాస్ట్లీ అయింది. కనుక వారికి ఉన్నటువంటి స్థలాలో – 4 ఉన్నా, 5 ఉన్నా, 10 ఉన్నా, 8 ఉన్నా కట్టండి అని చెప్పడం జరిగింది. ల్యాండ్ ఎక్విజిషన్ విషయంలో వారికి డబ్బు కట్టలేదన్న మాట నిజం. సుమారుగా 15 కోట్ల రూపాయలు రజకులకి ప్రభుత్వం ఇవ్వవలసి ఉంటుంది. నేను ఒప్పుకొంటున్నాను ఇవ్వవలసిన మాట వాస్తవమైతే స్థలాలు ఎక్విజిషను ప్రొసీడింగ్సుతో మనం స్వాధీనపరచుకోదలచుకున్నామో వాటికి ముందుగా డబ్బు ఇవ్వండి, వాటికి ప్రిఫరెన్సు ఇవ్వండి అని చెప్పడం జరిగింది. కనుక వీటి విషయంలో వారికి వెంటనే ఆ మొత్తాలు చెల్లించడం జరుగుతుందని వారికి సవినయంగా మనవిచేస్తున్నాను.

**ఈనాడు మునిసిపాలిటీలలో ఉన్నటువంటి పేదవారికి 5 లక్షల గృహాలు ఇవ్వడం జరిగింది. ఇదివరకు లేని ప్రాముఖ్యత ఈనాడు పక్కా ఇళ్లకు వచ్చింది. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తరువాత సుమారు 8 లక్షల 50 వేల ఇళ్ళు ఈ 6 సంవత్సరాలలో కట్టాము. దానికి అత్యంత ప్రాధాన్యత వచ్చింది. వెస్ట్ బెంగాల్ నుంచి, ఇతర రాష్ట్రాలనుంచి ఈ కార్యక్రమం ఇక్కడ ఎలాగ జరుగుతున్నదో చూసి రమ్మని వారు బృందాలను పంపించడం జరిగింది.**

అధ్యక్షా, రెండవ అభిప్రాయం కూడా నేను ఇప్పుడే తెలుసుకున్నా. ఇంతకు ముందు చాలామంది రూ.311ల చొప్పున కలెక్టరు ద్వారా కట్టారు, కలెక్టరుగారు మంజూరు చేసారు. అది ఇంకా గ్రౌండు కాలేదు. అవి పూర్తి కాలేదని చెప్పారు. ఆ విషయంలో నేను కూడా ఏకీభవిస్తున్నాను. ఈనాడు సెకండ్ ఫేజ్ శాంక్షన్ చేస్తున్నాము సెకండ్ ఫేజ్ నెక్స్ట ఇయర్ – 1990 మార్చి 31 వరకు కూడా కలిపి 2 లక్షలు ఇళ్లు ప్రత్యేకంగా వీకర్ సెక్షన్సుకు అదే పథకం క్రింద ఇవ్వడం జరుగుతుంది. కనుక సాధ్యమైనంతవరకు ఎక్కువగా ఉన్న పరిధిలో వారిని గమనించడం, గుర్తించడం జరుగుతుంది. అంతేకాకుండా ఈనాడు మునిసిపాలిటీలలో ఉన్నటువంటి పేదవారికి 5 లక్షల గృహాలు ఇవ్వడం జరిగింది. ఇదివరకు లేని ప్రాముఖ్యత ఈనాడు పక్కా ఇళ్లకు వచ్చింది. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తరువాత సుమారు 8 లక్షల 50 వేల ఇళ్ళు ఈ 6 సంవత్సరాలలో కట్టాము. దానికి అత్యంత ప్రాధాన్యత వచ్చింది. వెస్ట్ బెంగాల్ నుంచి, ఇతర రాష్ట్రాలనుంచి ఈ కార్యక్రమం ఇక్కడ ఎలాగ జరుగుతున్నదో చూసి రమ్మని వారు బృందాలను పంపించడం జరిగింది. ఈ విధంగా ఇంత పాపులర్ అయిన విధానాన్ని పూర్తిగా అమలు చేస్తాము సాధ్యమైనంత త్వరలో అని వారికి తమద్వారా మనవిచేస్తున్నాను.

1982–83వ సంవత్సరంలో 2,736 మెగావాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తి చేయడం జరిగింది. 1987–88 సంవత్సరానికి వచ్చేసరికి 3,814 మె.వా. విద్యుచ్ఛక్తి ఉత్పత్తి జరుగుతోంది. అయినా

ఈ విద్యుచ్ఛక్తి సరైన నిష్పత్తిలో ఉత్పత్తి కావడంలేదు. థర్మల్ పవర్ జనరేషన్ 2/3 వంతులు ఉండాలి. అంటే మూడు వంతులులో రెండువంతులు థర్మల్ జనరేషన్ ఉండానికి, ఒక వంతు హైడ్రో పవర్ ఉండాలి. అది ఇపుడు రివర్స్ అయింది. 1/3 వంతు థర్మల్ ఉంది. 2/3 వంతు హైడ్రో జనరేషన్ ఉంది. ఈ పరిస్థితులలో ప్రకృతి వైపరీత్యాలు వచ్చినవుడు విద్యుచ్ఛక్తి కొరత వస్తున్నది. అందువల్ల థర్మల్ కెపాసిటిని పెంచడానికి విద్యుచ్ఛక్తి బోర్డు వారు ప్రయత్నం చేస్తున్నారు. దానికొరకు ముద్దనూరు థర్మల్ ప్రాజెక్టు, విజయవాడ ఫేజ్ 2, 3లు, విశాఖపట్నంలో ప్రత్యేకంగా 1000 మె.వా. థర్మల్ ఉత్పత్తి కేంద్రాన్ని పెట్టాలని ఆలోచన చేయడం జరిగింది. అంతేకాకుండా గ్యాస్ ద్వారా విద్యుచ్ఛక్తి ఉత్పత్తి చేసుకోవాలని చూస్తున్నాము. ఈ విధంగా మనకు ఉన్న విద్యుచ్ఛక్తి కొరత తీర్చుకోవాలి. నదులలో నీరు తక్కువ అయినా విద్యుత్ కొరత లేకుండా, కోత విధించకుండా చూడటానికి ఆ విధంగా మన పారిశ్రామిక అభివృద్ధికి, రాష్ట్ర అభివృద్ధికి పాటుపడాలని చూస్తున్నాము.

ఇక విఠల్ రెడ్డిగారు భూసంస్కరణల విషయం ప్రస్తావించారు. ఇది 35 సంవత్సరాల క్రితం ప్రవేశపెట్టింది అనుకుంటాను. ఇప్పుడు మేము అధికారంలో ఉన్నాము కాబట్టి ఏ రాయి వచ్చినా మా నెత్తిన పడుతున్నది. భూసంస్కరణల విషయంలో సరైన శ్రద్ధ తీసుకొని పరిశీలించడం జరుగుతున్నది. ఎవరో బినామీ దారులు 30 సంవత్సరాల క్రిందట పాపాలు చేసారు. వారిని వెనుకకు తీయాలంటే ఎక్కడో బీదవారు 2, 5 ఎకరాలు ఉన్నావారు, ప్రక్కన ఉన్న కామందు పొలం కొనుక్కోవడం జరిగింది. అసలే అతను బీదవాడు. అటువంటివి తిరగదోడాలంటే ఆలోచించాలి. అతను మార్జిన్ లిమిట్‌లోనే ఉన్నాడు. అయినా దీని విషయంలో ఇదివరకు ప్రతిపక్షాల నాయకులతో మీటింగులు పెట్టాము. దీని విషయంలో త్వరలోనే నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని మనవిచేస్తున్నాను.

ఇక ఉపాధ్యాయుల నియామకం విషయంలో మనం ఈ సభలో ప్రతిరోజూ చర్చిస్తున్నాము. మనకు ఉన్న వనరులు, రాబడి ఏమిటో మనకు తెలుసు. ఖర్చుల విషయంలో కూడా ప్రభుత్వం ఆలోచించుకోవాలి. ఆర్థికరంగంలో డిసిప్లిన్ కూడా కావాలి. మనకు బాధలు ఉన్నాయి. ఇప్పటికే విద్యారంగానికి ప్రభుత్వం 800 కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నది. మరల వేలకు వేల ఉపాధ్యాయులను పనిలోనికి తీసుకుంటే ఏమి అవుతుందో తమరే తెలియజేయండి. ముందుగా ప్రాథమిక విద్య రాష్ట్రంలో బాగుపడాలి. ప్రైమరీ ఎడ్యుకేషన్ ప్రభుత్వ బాధ్యత, ఈ ఇల్లిటరసి పోవాలంటే స్కూలు ఎడ్యుకేషన్ ఈ ప్రభుత్వ బాధ్యతగా ఉంది. హయ్యర్ ఎడ్యుకేషన్ లగ్జరీ. ఏదో కలెక్టరు, డాక్టరు, ఇంజినీరు కావాలనుకునేవారు చేసే ప్రయత్నానికి ప్రభుత్వం పేద ప్రజలను బలిచేయడానికి ఇష్టపడడం లేదు. ఇపుడు గౌరవనీయులైన ఆర్థికశాఖామాత్యులు చెప్పారు. ఎర్నింగ్ వైల్ లెర్నింగు అనే దానిని ప్రతి విద్యార్థికి తెలియచెప్పవలసిన అవసరం ఉంది. వారు

చదువుకుంటూనే సంపాదించుకుంటూ దేశాభివృద్ధికి పాటుపడుతున్నారనే సంతృప్తి వారికి కలుగజేస్తే వారికి దేశాభివృద్ధిలో పాలుపంచుకుంటారనే పరమానందం ఉంటుంది. ఈ విధంగా ఇపుడు మన విద్యా విధానాలు సరిచేసుకోవాలి.

మహబూబ్‌నగర్ జిల్లాలో కరువు కాటకాలు ఉన్నాయని పూర్తిగా గుర్తించాము. అందుకే జూరాల ప్రాజెక్టు కొన్ని లక్షలతో నామమాత్రంగా ప్రారంభించిన దానిని ఈనాడు దానికి శ్రద్ధ వహించి దానికి 25 కోట్ల రూపాయలు మంజూరు చేసాము. ఆ ప్రాజెక్టు ద్వారా వచ్చే సంవత్సరం నీరు ఇవ్వాలని నిర్ధారణ చేయడం జరిగిందని మనవిచేస్తున్నాను. ఇక భీమాలో అంతర్భాగమైన రెండవదశ గురించి సభ్యులు చెప్పారు. ఇపుడు ప్రాజెక్టు పూర్తిచేసి నీరు అందించిన తరువాత భీమా ప్రాజెక్టు కూడా తీసుకుంటామని మనవిచేస్తున్నాను.

అధ్యక్షా, కాకతీయ రెండవదశ కాలువ వల్ల 5 లక్షల ఎకరాలకు ప్రయోజనం కలుగుతుందని గౌరవ సభ్యులు తెలియజేశారు. ఈ విషయం ప్రభుత్వం గుర్తించింది కాబట్టి వరల్డ్ బ్యాంక్ ఎయిడ్ రావడంతోనే దానిని ఉధృతంగా ప్రారంభించడం, పూర్తి చేయడం జరుగుతుంది. వారు చెప్పినట్టు రెండవదశ తీసుకొంటాము. ఒకసారి ప్రతిదీ తీసుకొని ఇన్వెస్టిగేషన్ పేరుతో కొద్దికొద్దిగా డబ్బు ఖర్చు పెట్టడం ప్రభుత్వానికి ఇష్టంలేదు. సాలిడ్‌గా తీసుకొని ఒక నిర్దిష్టమైన కాలంలో పూర్తి చేయాలన్నది ప్రభుత్వ భావన అని మనవిచేస్తున్నాను. ఇక వారు మోటార్స్ కాలిపోయిన విషయం తెలియజేశారు. డిస్ట్రిబ్యూషన్ సరిగా లేదు. ఇదివరకు ఉన్న అవకతవకల వల్ల, 132 కె.వి సబ్ స్టేషన్లుగానీ లేక 33/11 కె.వి. సబ్ స్టేషన్లుగానీ సరైన విధానంలో నిర్మించకపోవడంవల్ల విద్యుచ్ఛక్తి సరఫరాలో హెచ్చుతగ్గుల వల్ల మోటార్లు కాలిపోవడం వంటివి జరగడంవల్ల మనం బాధపడుతున్నాం. 32 కె.వి. సబ్ స్టేషను 132 పెట్టడం జరిగింది, అదేవిధంగా 33/11 కె.వి. సబ్-స్టేషన్లు 294 సెవెంత్ ప్లాన్ పీరియడ్‌లో నిర్మించడం జరిగింది. వీటన్నింటి విషయంలో ప్రభుత్వం శ్రద్ధ తీసుకొంటుంది. ఎందుకంటే సామాన్య మానవుడికి విద్యుచ్ఛక్తి సరఫరా లేకపోగా మోటార్లు కాలిపోవడం దురదృష్టకరమైన విధానం. ఈ లోపాన్ని సరి చేయడం జరుగుతుందని మనవిచేస్తున్నాను.

**శ్రీ వి. శ్రీరాములు:** చేనేత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా విషయం చెప్పండి.

**శ్రీ ఎన్.టి. రామారావు:** ఆకలి చావులకు ప్రభుత్వం కూడా తీవ్రంగా బాధపడుతున్నది. దేశానికి ఖ్యాతి తెచ్చిపెట్టిన చేనేత కార్మికులు బాగుండాలన్న ఉద్దేశంతో సహకార పరపతి సంఘాలలో ఉన్న లోటుపాట్లను సరిదిద్ది ఎవరైతే నిజంగా శ్రమ చేస్తున్నారో వారికే ముట్టాలన్నది ప్రభుత్వ యోచనగా ఉంది. ఇలాంటి దురదృష్టకరమైన సంఘటనలు జరగడం చాలా బాధాకరమైన విషయం. దాని విషయం పూర్తిగా గమనించడం జరుగుతుందని మనవిచేస్తున్నాను.

అల్పసంఖ్యాక వర్గాల వారు సోదర భావంతో ఉండాలి. వారికి రక్షణ కల్పించాలన్నది ప్రభుత్వం విధానం. ఈనాడు సమాజంలో శాంతి నెలకొల్పబడింది అంటే ఎలాంటి పక్షపాతం లేకుండా వారిని సక్రమంగా గుర్తించడమే మనవిచేస్తున్నాను. కొత్త బస్తీకి ఏమాత్రం తీసిపోనని రీతిగా పాత బస్తీని ఆధునీకరణం చేయాలని, వారికి సౌకర్యాలు కల్పించాలని కులీకుతుబ్‌షా అథారిటీకి గత 5 సంవత్సరాలలో రూ.21 కోట్లు మంజూరు చేయడం జరిగింది. అక్కడివారు ఆనందంగా ఉండాలని ఇక్కడి లాల్ బహుదూర్ స్టేడియం ఎలా ఉందో అక్కడ కులీకుతుబ్‌షా స్టేడియంను నిర్మించడం జరిగింది. ఈ సంవత్సరంకూడా కులీకుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి రూ.4 1/2 కోట్లు మంజూరు చేయడం జరిగింది.

అయితే ఇది చాలుతుందని అనుకోను, ఉన్న దానిని బట్టి అడ్జెస్ట్ చేసుకొంటున్నాము. 100 ప్రైమరీ సూల్స్ ఏర్పాటు గానీ, వారికి కావలసిన తదితర సౌకర్యాలను కల్పించడం గురించిగానీ ఇందాక ఆర్థిక మంత్రిగారు చెప్పారు. అదేవిధంగా ఈనాడు మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు ఈ సంవత్సరం 1 కోటి 20 లక్షలు ఇవ్వడం జరిగింది. ఇదివరకు కోటి రూపాయలు ఇచ్చాము. వారికి ఆర్థిక సహాయం కల్పించాలన్నది ప్రభుత్వ భావన. అదేరకంగా 30 పర్సెంట్ కంటే ఎక్కువ ఉర్దూ భాష మాట్లాడేచోట్ల ఆ భాషను రెండవ భాషగా గుర్తించడం జరిగింది. ఇంతటితో సరిపుచ్చుదామని అనడంలేదు. ఇంకా ఏమైనా ఉంటే చెప్పండి, చేద్దాము. తృప్తి కోసం ఇది చేయడం జరిగింది. వారిని శ్రద్ధగా గమనించడం జరుగుతుంది. సోదర భావంతో ఆదరించడం జరుగుతుందని మనవిచేస్తున్నాను.

**మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు ఈ సంవత్సరం 1 కోటి 20 లక్షలు ఇవ్వడం జరిగింది. ఇదివరకు కోటి రూపాయలు ఇచ్చాము. వారికి ఆర్థిక సహాయం కల్పించాలన్నది ప్రభుత్వ భావన. అదేరకంగా 30 పర్సెంట్ కంటే ఎక్కువ ఉర్దూ భాష మాట్లాడేచోట్ల ఆ భాషను రెండవ భాషగా గుర్తించడం జరిగింది. ఇంతటితో సరిపుచ్చుదామని అనడంలేదు. ఇంకా ఏమైనా ఉంటే చెప్పండి, చేద్దాము. తృప్తి కోసం ఇది చేయడం జరిగింది.**

ఇక వక్ఫ్ బోర్డు ప్రాపర్టీస్ విషయం చెప్పారు. వక్ఫ్ బోర్డు ప్రాపర్టీస్ అన్యాక్రాంతం కాకుండా స్వాధీనం చేసుకొమ్మని వారికి చెపుతున్నాను. ప్రభుత్వమే 25 లక్షల రూపాయలు ఖర్చుపెట్టి పాత రికార్డ్సు కూడా తయారు చేయించడం జరిగింది. అదేవిధంగా పాత మసీదులు, ఖబ్రస్థాన్‌ల మరమ్మతుల కోసం రూ.25 లక్షలు ఇచ్చాము. వక్ఫ్ ప్రాపర్టీలు ఎవరూ ఆక్రమించుకోకుండా ఆడవాళ్ళకు ఒక కళాశాల, మగవాళ్ళకు ఒక కళాశాల ఏర్పాటుచేయండి. పేదలకు తక్కువ ధరలో క్వార్టర్స్ కట్టించి ఇవ్వండి అని ఎప్పటి నుంచో చెబుతున్నాను. గత మూడు సంవత్సారాల నుంచే చెబుతున్నాను. వక్ఫ్ ప్రాపర్టీస్ మీవాళ్ళే అమ్ముకొంటున్నారు. బయటి వాళ్ళు ఎవరూ అందులో వేలు పెట్టడంలేదు.

**శ్రీ మహమ్మద్ అమానుల్లాఖాన్:** వక్ఫ్ బోర్డుకు పవర్స్ లేవు.

**శ్రీ ఎన్.టి. రామారావు:** ఆ డిటెయిల్స్‌లోకి నేను వెళ్ళడంలేదు. ఉన్నటువంటి ప్రభుత్వపరమైన విధానాలు చెబుతున్నాను. వక్ఫ్ బోర్డు గురించి ఏమైనా ఉంటే చెప్పండి. ఇట్ ఈజ్ వెరీ ఇంపార్టెంట్ ఫర్ మి. ఎవరో పెద్దలు ఆ రోజున ఎంతో ఉదారంగా ఇచ్చిన ఆస్తులను అన్యాయంగా ఇంకెవరో ఆక్రమించుకోవడం ప్రభుత్వానికి ఇష్టంలేదు. ఆ ఆస్తులకు పూర్తి రక్షణ కల్పించాలి. అందువల్ల వారితో సంప్రదించి వక్ఫ్ బోర్డులో మంచి వారిని నియమించాలి, అందులో రాజకీయాలకు తావులేదు. ఈ విషయంతో ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంటుందని మనవిచేస్తున్నాను.

**శ్రీ మహమ్మద్ అమానుల్లాఖాన్:** మైనారిటీస్ కమిషన్ రిపోర్టు 1983 నుంచి చీఫ్ మినిస్టర్ గారి దగ్గర పెండింగులో ఉంది. ఆ రిపోర్టును హౌజ్‌లో పెట్టండి, వారు ఏమి రికమండ్ చేశారో తెలుస్తుంది.

**శ్రీ ఎన్.టి. రామారావు:** ఆ రిపోర్టులో ప్రభుత్వం ఎన్ని అమలు చేసిందో మొత్తం రికార్డు మీ టేబుల్ మీద పెడతాను.

**శ్రీ టి. సీతారాం:** అధ్యక్షా, శ్రీకాకుళం జిల్లాకు జీవనాధారమైన వంశధార రెండవ దశ క్లియరెన్సుకోసం కేంద్ర ప్రభుత్వంలో ఉంది. సుమారుగా 60 వేల ఎకరాలకు నీటి పారుదలకుగాను మూడు ఓపెన్ హెడ్ స్లూయిజెస్‌ను కలుపుకుంటూ లింక్ కెనాల్‌ను ఏర్పాటుచేయాలనే అక్కడి నియోజకవర్గాలకు చెందిన శాసన సభ్యులము ప్రభుత్వానికి ప్రపోజల్ పంపడం జరిగింది. ఈ బడ్జెట్‌లో ఆ లింక్ కెనాల్‌ను టేకప్ చేసి పూర్తి చేయడానికి డబ్బు కేటాయించమని తమద్వారా ముఖ్యమంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ ఎన్.టి. రామారావు:** నేను అక్కడికి వెళ్లి చూశాను, లింక్ కెనాల్ అది మొదటి స్టేజ్‌లోనే మొదలు పెట్టాల్సింది. రెండవ దశకు చేశారు. అక్కడ ముందు మొదలు పెట్టాలి. గొట్ట బ్యారేజీ మొదలు పెట్టి పూర్తిచేశారు. దీన్ని వదిలి పెట్టారు. నేను అక్కడ ఒరిస్సా ముఖ్యమంత్రిని కలవడం జరిగింది. 106 ఎకరాలు మాత్రమే ఉంది. కొన్ని లక్షల మందికి ఉపాధి, ఉద్యోగాలు కల్పించడం, సుక్షేత్రంగా రూపొందించడానికి కేవలం 106 ఎకరాలు మాత్రమే పరిష్కారం కావాలి, ఇంతకు ముందు ఒప్పుకోవడం జరిగింది. మాకు ఏమి అభ్యంతరం లేదని కేంద్ర ప్రభుత్వం కూడా అనడం జరిగింది. ఆనాడు ప్రధానమంత్రిగారి వద్దకు, ఒరిస్సా ముఖ్యమంత్రి గారిని తీసుకెళ్ళి, మేమూ అంగీకరించాము, 106 ఎకరాల గురించి మేము అంగీకరించామని చెప్పడం జరిగింది. ఆ రోజున 'డన్' అని అన్నారు. ఆ డన్ అని ఇప్పటికీ గత సంవత్సరన్నర కాలం కావస్తున్నది. కాబట్టి, ఎప్పటికీ "డన్' అవుతుందో ఏమిటో నాకు తెలియదు. కాబట్టి లింక్ కెనాల్ విషయంలో ఆ రెండూ కలిపితే గానీ నీరు పూర్తిగా రాదు. దీని విషయం ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతంగా ఉన్న శ్రీకాకుళం జిల్లా విషయంలో కూడా పూర్తిగా ప్రభుత్వం గమనిస్తుందని సవినయంగా మనవిచేస్తున్నాను.

◆◆

సెప్టెంబర్ 7, 1989

# N.T.R. IS THE ONLY LEFTIST IN THIS COUNTRY

*(రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై జరిగిన చర్చ)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** గౌరవనీయులైనటువంటి సభాధ్యక్షులకు శాంతిభద్రతల సమీక్షా కార్యక్రమంలో ఉత్పన్నమైన సూచనలు చేసిన, అవగాహనలు ఇచ్చినటువంటి వివిధ పక్షాల ప్రతినిధులకు, వారి నాయకులకు నా హృదయపూర్వకమైనటువంటి కృతజ్ఞతలు. ఇది చాలా ముఖ్యమైన సమస్య. కాబట్టే, ఈనాడు దీని విషయంలో చర్చించాలన్నప్పుడు తప్పకుండా ఒప్పుకున్నానని చెప్పడం జరిగింది. శాంతిభద్రతల విషయంలో ముఖ్యంగా, ఎవరు ఏమి చెప్పినా, ఏమి చేసినా ప్రభుత్వం మాత్రం పూర్తిగా బాధ్యత వహిస్తున్నది. నా బాధ్యత నుంచి నేను తప్పుకోలేను. నా ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పుకోదు. పూర్తిగా రాష్ట్రంలో శాంతిభద్రతలు, పటిష్టంగా అమలు చేయడం విషయంలో పూర్తిగా ప్రభుత్వమే బాధ్యత వహించవలసిన అవసరం ఉందని అవగాహన కలిగినటువంటి వ్యక్తిగా నేను ఈ సమావేశాన్ని ప్రత్యేకంగా కోరడం కూడా జరిగింది. మా సంగతులు కూడా వ్యక్తం చేయవలసిన అవసరం ఉందని మనవిచేస్తున్నాను.

గౌరవనీయ సభ్యులందరు చెప్పారు. ఈనాడు శాంతిభద్రతలు అంటే రెండు విభాగాలుగా మేము చెప్పాలనుకుంటున్నాము. ఒకటి సమాజంలో ఉన్నటువంటి సామాన్య వ్యక్తికి సంబంధించినటువంటి శాంతిభద్రతల విషయం ఒకటి. ఈనాడు ఎక్స్ట్రీమిస్టుల పేరుతో రాష్ట్రంలో ఉన్నటువంటి ఈ దుష్ట విధానాన్ని గురించి కూడా మనవిచేస్తున్నాను. మొదటి విషయం వచ్చినపుడు, శాంతిభద్రతల విషయంలో సామాన్య మానవుడి మనుగడకు గానీ, కులమతవర్గ రహితమైన విధానానికి గానీ ఏ మాత్రం కూడా ఒకరు ప్రశ్నించే అవకాశం లేకుండా శాంతి భద్రతలు పటిష్టంగా ఉన్నాయని నేను అందరికీ సవినయంగా మనవిచేస్తున్నాను. ఇదివరకు ఉన్నటువంటి మత వ్యవస్థలు లేవు, మత కలహాలు లేవు. ఎవరికి వారు నిశ్చితంగా వారి వారి

కార్యక్రమాలు చేసుకోగలుగుతున్నారు. కులమత వర్గ విచక్షణ లేకుండా, సమాజం సోదర భావంతో చక్కగా ఉండగలుగుతున్నారు. మరి తెలుగుదేశం ప్రభుత్వం ఏడు సంవత్సరాల కాలంలో చూసినట్లయితే ఒక మత సంబంధమైన కల్లోలం కూడా లేదంటే అది దానికి నిదర్శనమని మనవిచేస్తున్నాను. దీని విషయంలో ప్రత్యేకంగా ఏదో ఆర్భ్యా చేయడంగానీ, ఏదో గొప్పగా చెప్పుకోవడం ఉద్దేశ్యం కాదు.

అసలు నా విషయం తక్కువగా చెప్పి, గౌరవనీయులైన సభ్యులు సూచించిన విధానం పట్ల ఉద్దేశ్యంను వెల్లడించడం నా ఆదర్శంగా పరిగణిస్తున్నానని గౌరవనీయులైన తమకు మనవిచేస్తున్నాను. ఈనాడు ప్రభుత్వం నిర్వహించిన విధానాలు, అమలు చేస్తున్న పద్ధతులకు సమాజమే నిదర్శనం. ఈనాడు శాంతిభద్రతలు అన్నవి లేవు అనే పద్ధతిలో మాట్లాడవలసిన అవసరం ఏ మాత్రం కూడా లేదని సవినయంగా మనవిచేస్తున్నాను. ఇకపోతే, రెండవ విషయం వచ్చినపుడు- నక్సలైట్ల మూవ్‌మెంట్ - నక్సలైట్లు. ఎవరు ఇపుడు ఉన్నవారు అని ఆలోచిస్తే, ఒకప్పుడు నక్సల్‌బరీ మూవ్‌మెంట్ ప్రారంభమైనపుడు, కత్తితోగానీ అధికారాన్ని చేజిక్కించుకోలేమని, సంపన్న వర్గాలు పూర్తిగా సమాజాన్ని దోచుకుంటున్నందువల్ల వారిపై కక్ష అన్నారు. ఈనాడు కడుతున్న కక్ష ఎవరిమీద? అని ఆలోచిస్తే ఈనాడు సిద్ధాంతం ఏమిటి? ఏమిటి మరి నిర్దిష్టంగా కావాలంటే, ఒక కోరిక వెలిబుచ్చారా? అది ఏమీ లేకుండా పూర్తిగా ఏదో ఒక బాండిట్స్‌లాగా తమ చేతుల్లోకి అధికారాన్ని తీసుకుని కేవలం అమాయకులను, సమాజంలో ఉన్నటువంటి ప్రజలను, చంపుతూ ప్రజలలో అల్లకల్లోలం సృష్టిస్తూ వారిమీద హింసాత్మకమైన విధానాలను జరపడం శోచనీయమని నేను మనవిచేస్తున్నాను.

మనమందరం మాట్లాడుకునేది, సిద్ధాంతాలు వేరని. మీ పార్టీ సిద్ధాంతాలు వేరు, ఇతర పార్టీల సిద్ధాంతాలు వేరు, తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు వేరుగా ఉండవచ్చు. కాబట్టి అందరికీ అన్ని సిద్ధాంతాలు ఉండవచ్చు. మీ సిద్ధాంతం ఏమిటి? ఈనాడు ఏమి కోరుతున్నారు? చచ్చిపోయిన వారిమీద విచారణ జరిపించడమే మీ సిద్ధాంతమా? లేకపోతే సమాజాన్ని చైతన్యవంత విధానాన్ని ప్రబోధించడమా? ఏమిటి మీ విధానం? ఇది అసలు మీరు చేసే విధానంలో మీ సిద్ధాంతాలకు సంబంధించినటువంటిది ఏదైనా యదార్థం ఉందాయని ఆలోచించాలి. ఈనాడు సామాన్య మానవుడు, పెళ్ళాం బిడ్డలతో, పని చేసుకుంటూ జీవిస్తున్న ఒక సామాన్య వ్యక్తి ప్రాణం తీసారే, తన భార్యతో కాపురం చేస్తున్నవాడి, నెత్తురు చిందించారే, అదే విధంగా ఈనాడు అనాధలను సృష్టించే విధానాలను కోరుతున్నారా? ఒకసారి ప్రశ్నిస్తే, ఏ విధమైన, దురాగతాన్ని, దౌర్జన్యకరమైన, హింసాత్మకమైన విధానం ఈనాడు సాగుతున్నదో గుర్తించాలని సవినయంగా మనవిచేస్తున్నాను. ఇదిగో మేము వీరిని తీసుకెళతాము. ఎవరో చనిపోయారు, వారి విషయం మీరు న్యాయ విచారణ జరపండి. వీరిని వదలిపెడతాము

అనడంలో ఏమి న్యాయం ఉందో దయచేసి ఆలోచించండని మనవిచేస్తున్నాను. గౌరవనీయ సభ్యులు చెప్పారు పౌరహక్కులు అంటే కేవలం హింసాత్మకమైన విధానాలు కాదు. అదే విధంగా అమాయకమైన ప్రజలు బలవుతున్నారే వారు మాత్రం పౌరులు కారా? వారిని ఎందుకు తీసుకెళ్తున్నారు. ఒక అమాయక మండల ప్రజాపరిషత్తు అధ్యక్షుణ్ణి ఎందుకు చంపారు. సంబంధం ఏమి ఉంది? మంచివారు అంటున్నారే. తెలుగుదేశం సభ్యులు కావడమే ఆయన తప్పా? సిద్ధాంతాన్ని ఏకీభవించారు. తెలుగుదేశం కావచ్చు, ఆ విధంగా, సి.పి.ఐ., జనతా, భారతీయ జనతాపార్టీ కావచ్చు. ఆ సిద్ధాంతాల ఏకీభవిస్తున్నారో ఆయా పక్షాలలో చేరుతుంటారు, ప్రోత్సహిస్తుంటారు ఆచరిస్తూ ఉంటారు. మనకు తెలిసిన సత్యమే. ఆ పార్టీ మనుషులు అయినందుకు వారు చేసుకున్న పాపము ఏమిటి? ఈనాడు హక్కు కావాలంటున్నాము, స్వాతంత్ర్యం కావాలంటున్నాము, భావ స్వాతంత్ర్యం కావాలంటున్నాము, ఎవరి మనసులో ఉన్నది చెప్పవచ్చునంటున్నారు ఎవరి సిద్ధాంతాలు వారు చెప్పడం తప్పా? ఏమీ తెలియచేయకుండా కేవలం హింసాత్మకమైన విధానం, దోపిడీ పద్ధతే మీ విధానం అయినప్పుడు పూర్తిగా దాన్ని ప్రభుత్వం ఏ మాత్రం అంగీకరించదని తమద్వారా మనవిచేస్తున్నాను.

ఈనాడు అమాయక ప్రజలను బలి పశువులుగా చేస్తూ, సోదర మానవులను, ఆయుధాలతో, దొంగతనంగా చాటుమాటుగా హత్య జరిపిస్తామనడం, దాన్ని క్షమించే స్థితిలో, ఒప్పుకునే పద్ధతిలో ప్రభుత్వం, ఏ మాత్రం లేదని మనవిచేస్తున్నాను. నేనే చెప్పాను-తప్పు చేయటం సహజం - సమాజంలో ప్రజాస్వామ్యం ఉన్నది కాబట్టి, ప్రజలు కోరుకున్నప్పుడు ఈనాడు తెలుగుదేశం అధికారంలోకి వచ్చింది. మీకు ఏదైనా సమస్య ఉంటే, మాకు చెప్పండి. అదే విధంగా మీరు చేసే విధానాన్ని అంగీకరించము. మీకు ఆదర్శమైన విధానం నాకు చెప్పండి? లేదా ప్రజలకు చెప్పండి? మీరు ఆ విధానాన్ని సంస్కారవంతమైన పద్ధతిని అవలంభిస్తే ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుంది. మీ హక్కులను కాదనము.

**సమాజంలో ప్రజాస్వామ్యం ఉన్నది కాబట్టి, ప్రజలు కోరుకున్నప్పుడు ఈనాడు తెలుగుదేశం అధికారంలోకి వచ్చింది. మీకు ఏదైనా సమస్య ఉంటే, మాకు చెప్పండి. అదే విధంగా మీరు చేసే విధానాన్ని అంగీకరించము. మీకు ఆదర్శమైన విధానం నాకు చెప్పండి? లేదా ప్రజలకు చెప్పండి? మీరు ఆ విధానాన్ని సంస్కారవంతమైన పద్ధతిని అవలంభిస్తే ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుంది. మీ హక్కులను కాదనము.**

కాబట్టి, మీరు చాటుమాటున దాక్కోవలసిన పరిస్థితి ఎందుకు వచ్చింది? బయటకి రండి అని సోదరభావంతో మానవత్వంతో మనవిచేస్తున్నాను. 272 మంది వచ్చారంటే, ఈనాడు ప్రభుత్వం మీద విశ్వాసం ఉండేకదా? అని నేను మిమ్మల్ని అడుగుతున్నాను, ముక్కు సుబ్బారెడ్డి గారు విప్లవవాది, బయటకు వచ్చి, ప్రత్యేకంగా ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ఈనాడు కేవలం నేను అన్న మాటల ప్రకారం మానవుడుగా సమాజంలో తిరగగలుగుతున్నాడే, ఇదివరకు బయటకు రాకముందు, ప్రభుత్వానికి లొంగక ముందు ఆయన ఏదో చెట్టు చాటుమాటున,

పుట్టచాటున ఉండే వ్యక్తి కదా! కాబట్టి, ఈనాడు ఈ విధమైన మానవత్వ విధానాన్ని అవలంభించడం జరిగింది. 272 మంది ఈనాడు వచ్చి ప్రభుత్వానికి లొంగిపోవడం, సమాజ స్రవంతిలో భాగస్వాములు కావడం, చక్కగా కార్యక్రమాలు నిర్వహించుకోవడం జరుగుతున్నదని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. ఈ నక్సలిజం ఓడిపోతుంది. పతనం అయిపోతుందనే భావం, లేకపోతే, హింసాత్మక విధానంలో ఏదో ఆనందం ఉండే పద్ధతిలో లేకపోతే మరొక విధానంగా, విచ్చలవిడిగా సంచరించేటటువంటి విధానం, సంఘవ్యతిరేక శక్తులతో కలయిక వల్ల ఈ కార్యక్రమం సాగుతుండడం నేను దురదృష్టకరంగా పరిగణిస్తున్నాను. చక్కగా, సమాజంలో ప్రవర్తించనప్పుడు పూర్తిగా ప్రభుత్వం వారితో ఏమాత్రం కూడా వారు చేసేటటువంటి దుష్ట కార్యాలను సహించడం జరగదని సవినయంగా తెలియచేస్తున్నాను.

ఇకపోతే, గౌరవనీయులైన సభ్యులు ఏ సూచనలు చేశారో అవి నాకు చాలా ముఖ్యం, పక్షాలు వేరు కావచ్చు, భావాలు వేరు కావచ్చు. కానీ మీరు ఏ సూచనలు ఇస్తారో నేను గుర్తించడం, దాని విషయంలో పూర్తిగా ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని గుర్తించి, గౌరవించడం కూడా నేను బాధ్యతగా స్వీకరించాను అనేటటువంటి నాయొక్క గౌరవాన్ని నేను మీ పట్ల వ్యక్తం చేస్తున్నాను. మీరు ట్రాన్స్‌ఫర్స్ విషయం చెప్పారు. ఈనాడు అధికారులు ఉన్నారు. ఇక్కడ, అందరితో ముఖాముఖి తెలియజేస్తున్నాను. మూడు సంవత్సరాల లోపల ఏ మాత్రం కూడా ట్రాన్స్‌ఫర్ చేయడానికి వీలు లేదు అనేటటువంటి ప్రభుత్వ ఉత్తరువు ఇప్పటికీ ఉన్నదని కూడా నేను స్పష్టం చేస్తున్నాను. ఏదైనా కారణం వచ్చినప్పుడు ఆయా ఉద్యోగులందరూ కూడా ఆ మంత్రివర్యులకు తమను ఎందుకు ట్రాన్స్‌ఫర్ చేయవలసి ఉందో తెలియపరచాలని చెప్పడం జరిగిందని కూడా నేను మీకు సవినయంగా మనవిచేస్తున్నాను.

ఇక రెండవ విషయం నిరుద్యోగం. నిరుద్యోగం అన్నది పూర్తిగా ఈనాడు మనం చెప్పేటటువంటి విద్యదే బాధ్యత అని కూడా మనవి చేస్తున్నాను. పనికిమాలిన చదువులతో నిరుద్యోగాన్ని పెంచేటటువంటి ఈ దురదృష్టకరమైన, కాలదోషం పట్టిన విద్యా విధానం మారాలన్నది తెలుగుదేశం సిద్ధాంతం. కాబట్టే ఈనాడు వృత్తి విద్యా ప్రయోగం. అందుకే యువశక్తి ప్రారంభం. ఎన్నో కార్యక్రమాలు ఇవ్వడం ఏ ప్రజలు ఆ గ్రామ పరిధిలో వారి కార్యక్రమాలు వారే నిర్వహించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించడం, ఈనాడు అవి పూర్తిగా అమలు జరుగుతున్నాయా, లేదా అంటే కేవలం ఈనాడు ఒక్కసారిగా ఉన్నటువంటి ఈ యంత్రాంగాన్నీ మార్చడం కష్టం కావచ్చు, కానీ భవిష్యత్తులో పూర్తిగా తెలుగుదేశం సిద్ధాంతాలు అర్థం అవుతాయని మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను.

ఈనాడు కేవలం బ్యూరోక్రసీ, బ్యూరోక్రసీ అని ఎందుకు అంటున్నాము? ప్రజా ప్రతినిధుల నిర్ణయం ఏమిటి? అమలు విధానం ఏమిటి? ఏ విధంగా చేయాలి? ఈ మధ్యలో ఉన్న భేదాలు,

తేడాలు అన్నీ సమసిపోయి, పూర్తిగా మన ప్రజల కోసం మనం పాటుపడాలి. మనం స్వతంత్ర్య భారత పౌరులం. మనకు స్వాతంత్ర్యం వచ్చి 42 సంవత్సరాలు అయింది. మనం పేద ప్రజానీకాన్నీ ఉద్ధరించాలి. ఈనాడు కూడా సుమారు 50 శాతం పేదవారు సమాజంలో ఉన్నారంటే అది మనకు సిగ్గుచేటు. ఈనాడు కూడా సమాజంలో వ్యత్యాసాలు ఉన్నాయంటే, మనమందరం దాని విషయంలో తీవ్రంగా ఆలోచించాలనేటటువంటిది అందరూ గుర్తించాలి. గమనించాలి. ఇప్పుడే గౌరవనీయులైన సభ్యులకు కొందరు చెప్పారు. ఇది ఒక పార్టీకి సంబంధించింది కాదు. అందరూ సహకరించాలి. కార్యస్థాయిలో కూడా మనమందరం కూడా ఏకముఖంగా అన్ని విషయాలలో ఈ విధమైన శాంతియుత జీవనానికి పూనుకున్నప్పుడే అది కొనసాగుతుందని చెప్పారు. వారికి అభినందనలు. ఆ విధమైనటువంటి సద్భావన ఉండాలి. కేవలం ఒకరి మీద ఒకరు చాడీలు కాదు.

ఈనాడు చాడీలకు మనమందరం అతీతులమని, చెప్పినట్లు కాదు, ఈనాడు ప్రజాప్రతినిధులుగా మనం మన కర్తవ్యం నిర్వహించాలి. ఒక్కొక్క నియోజకవర్గం నుండి కొన్ని లక్షల మంది మన మీద అభిప్రాయంతో, గౌరవంతో ఎన్నుకున్నారు. కాబట్టి ఆ విధమైనటువంటి సదాభిప్రాయానికి అనుగుణంగా మనం పని చేస్తాము. ఏ విధంగా ప్రజాస్వామ్యాన్ని మనం ఉద్ధరిస్తాము అనేటటువంటి పద్ధతే తప్ప, కేవలం ఒకరిని ఒకరు వ్యక్తిగతంగా దూషించుకోవడంవల్ల గానీ, మరో దానివల్లో గానీ ప్రయోజనం ఉండదు. మన దేశానికి కూడా భవిష్యత్తు ఇంతకు మించింది మనం కలుగు చేయలేమని కూడా మీ అందరికీ నేను సవినయంగా మనవిచేస్తున్నాను.

ఇక భూసంస్కరణల విషయంలో మేము కూడా తీవ్రంగానే ఆలోచిస్తున్నాము. భూసంస్కరణలు అనేది ఒకరి సొత్తు కాదు. అందరి బాధ్యత కూడా. మీ అవగాహన ఒక విధంగా ఉండవచ్చు. తెలుగుదేశం అవగాహన ఇంకొక విధంగా ఉండవచ్చు. ఇదివరకే చర్చలు జరిపాను. నిర్ణయం కూడా తీసుకోవడం జరిగింది. ఎప్పుడోతీరిన సమస్య గురించి ఈనాడు ఎవరో పాపం ఆ లిమిట్‌లో ఉన్నాడు ఆ భూకామందు, అతడిని నీకు ఎక్కడ నుండి వచ్చింది అని అడగటం – నన్ను తెచ్చిపెట్టి ఈ చొక్కా ఎక్కడి నుండి వచ్చింది. అంటే ఏమి చెప్పను? అదే విధంగా ఈనాడు ఎందుకు మన సమాజాన్ని బలిచేయడం. కాబట్టి ఒక లిమిట్ పెట్టి –ఈనాడు ఎవరైతే పేదవారు అని మనం నిర్ణయించామో, ఆ నియమించిన అటువంటి నిబద్ధమైన లిమిట్ లోపల ఉన్నటువంటి వ్యక్తులను ఈనాడు మనం ఎందుకు కదిలించాలి? వాడు ధనవంతుడా? కాదు. ఈనాడు గట్టిగా ఒక జత ఎడ్లను మేపలేడు. పాలేరును పోషించుకోలేడు. వాడి దగ్గర, ఇది ఎట్లా వచ్చింది. అది ఎట్లా వచ్చింది అని అధికారులు అంటున్నారు.

ఆ రాజకీయ విధానాల వల్ల అందరి పాలిట ప్రజలు నలిగిపోతున్నారు. మళ్లీ వాళ్ల పాలిటే పడేద్దామా? ఒకసారి గౌరవనీయులైన సభ్యులు దయతో ఆలోచించండని మనవిచేస్తున్నాను.

ఎవరైనా బినామీదార్లు ఉన్నప్పుడు, ఆ బినామీ సాయంతో ఆ దుర్మార్గులను పట్టుకోవాలి. ఆ భూకామందు ఎవరు ఉన్నారో, వారిని పట్టుకోవాలి. ఆ జమీందారు ఎవడు ఉన్నాడో వాడిని పట్టుకోవాలి. కానీ కేవలం అమాయకత్వంతో నాకు నాలుగు ఎకరాల పొలం ఉన్నది. ఇంకో రెండు ఎకరాలు కొనుక్కుంటున్నాననే ఎంతో కొంత కొనుకున్న వాటిని పట్టుకోవడం – అది మా సిద్ధాంతం కాదు, మేము ఒప్పుకోము. కాబట్టి ఈనాడు ఈ సమావేశంలోని భూసంస్కరణలు మేము అనుకున్న రీతిలో, సమాజ శ్రేయస్సు కొరకు ప్రవేశపెడతామని కూడా వారందరికీ నేను సవినయంగా మనవిచేస్తున్నాను. నేను ఏమి కేపిటలిస్టును కాదు. కొంతమంది గౌరవనీయులైన సభ్యులు చెప్పారు. ఇది ఏదో పెట్టుబడి వారి వర్గము అని. I am very sorry for it. మేము అన్నీ వదలుకొని వచ్చాము. కానీ ఈ మాటలు పడడానికి రాలేదు. మేము కక్కుర్తి పడి రాలేదు. వ్యాపారాత్మకం అయినటువంటి రాజకీయం జరపడానికి రాలేదు. పదవీ వ్యామోహం అంతకంటే లేదు. ఈనాడు ప్రజల సేవ చేయడానికి వచ్చామని వారికి సవినయంగా మనవిచేస్తున్నాను. నేను ఎప్పుడో చెప్పాను. N.T.R is the only leftist in this country ఎందుకంటే నేను స్వార్ధం వదులుకున్న వ్యక్తిని పూర్తిగా నా ప్రాణం కూడా ప్రజలకు ఇవ్వడానికి సిద్ధపడ్డ వ్యక్తిని. నా కంటే ఒక విధమైనటువంటి ప్రజా శ్రేయస్సు కోరే మనిషి ఉండవచ్చు. చాలా మహానీయులు, వారిలో నన్నూ ఒకరిగా పరిగణించాలని నేను వారందరిని కోరుతున్నాను.

అదే విధంగా ఈ మానవత్వంలోని ఈ విధానాలు అన్నీ అవలంభించడం జరిగింది. మీకు తెలుసు. ఈనాడు ఎక్స్ట్రీమిస్ట్ ప్రాబ్లం ఉంటే ఏ విధంగా మేము టేకిల్ చేస్తున్నామో, ఇది ఈనాటిది కాదు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ టైమ్‌లో వినోదాభావే చంబల్ వేలీలో ఉన్నటువంటి దొంగల విషయంలో వారందరిని పరివర్తింపజేయాలని సంకల్పించారు. అదే విధానంగా, జయప్రకాష్ నారాయణ్. వీరందరూ కూడా మానవత్వం చూపించాలనే భావంతోనే ఆచరణ చేశారు. అది అందరికీ ఈనాడు ఆమోదయోగ్యంగా, ఆదర్శనీయంగా అయ్యిందన్న సంగతి ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. కాబట్టి మనం మానవత్వం, ప్రేమను ఇవ్వడంలో ఉన్నది. ఆదరించడంలో ఉన్నది అనే భావంతోనే, ఈనాడు ఎవరైనా ఆ విధంగా మార్పు వచ్చిన వారు ఉంటే రావచ్చునని చెప్పడం. వారి మాటలో ఈ ప్రభుత్వం మీద నమ్మకం కలిగింది.

ఇంకా కొంచెం గడువు పొడిగించండి అనడంతో నెల అన్నది రెండు నెలలు, రెండు నెలలు అన్నది మూడు నెలలు గడువు పొడిగించడం జరిగింది. వారి అభిమతం మీద. అది కూడా సత్ఫలితాలు ఇస్తుందని మనవిచేస్తున్నాను. ఆ వచ్చే వారిని తిరిగి ఏ విధంగా సమాజం స్వీకరిస్తుంది? ఒక పతనమైన సోదరుడు ఉన్నాడు, ఒక విధంగా భ్రష్టుడైన తన అన్న, లేదా తండ్రి ఉన్నాడు. ఏ విధంగా వారిని ఆదరించాలి. గౌరవించాలి అన్నదే ఆదర్శం అన్న భావంతో వచ్చిన వారికి ఏ విధమైన రాయితీలు ఇస్తున్నామో కూడా తమందరికీ తెలుసు. పొలం లేని

వారికి పొలం ఇవ్వడం, ఆర్థికవనరులు కల్గించడం, ముఖ్యంగా చదువుకున్న వారికి అయితే పరిశ్రమలు పెట్టుకోవడానికి ఆదరువులు కలిగించడం, ఇవన్నీ మానవత్వంతో ప్రభుత్వం చేసిన ఫలవంతమైన విధానాలని మనవిచేస్తున్నాను. కాబట్టే ఈనాడు ఇటువంటి సహోదర భావంతోనే, స్నేహంతోనే సమాజంలో ఒక చైతన్యం కలిగించాలన్నదే ఆదర్శం అని నేను మీకు సవినయంగా మనవిచేస్తున్నాను.

దేవాలయాల భూముల విషయం మనవిచేస్తాను. పట్టణ ప్రాంతాల భూముల విషయంలో ఒక కమిషన్‌ను నియమించడం, వారు ఒక రిపోర్టు ఇవ్వడం కూడా జరిగింది. దాని కోసం ఒక కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. పరిశీలించిన దాని మీదట పూర్తిగా దాన్ని ఏ విధంగా ప్రజల కోసం వినియోగించాలి? ఏ విధంగా పేద వారికి వసతులు కల్పించడానికి వాడాలి అనే అభిప్రాయంతో ప్రభుత్వం ఉన్నదని మీకు నేను సవినయంగా తెలియజేస్తున్నాను. అదే విధానంగా ఈనాడు విజయవాడలో ఇన్ని వేల మందికి పట్టాలు ఇవ్వడం జరిగింది. ఇంతవరకు ఏ పేద ప్రజానీకమైతే ప్రభుత్వ భూముల్లో ఉన్నారో, వారందరికీ పట్టాలు ఇవ్వడం జరిగింది. సుమారు 4,500 మందికి ఒకే చోట ఈనాడు ఇవ్వగలిగామంటే ప్రభుత్వాన్ని దయచేసి మీరు అనుమానించవలసిన అవసరం లేదు. మా సంకల్పంలో ఏ మాత్రం కూడా మీరు అన్నట్లుగా మరొక భావన లేదని కూడా నేను సవినయంగా మీ అందరికీ మనవిచేస్తున్నాను. రూరల్ దేవాలయాల భూముల విషయం వచ్చినప్పుడు అక్కడ కౌలుదారులు ఉన్నారు. మొఖాసాదార్లు ఉన్నారు. మీ అందరికీ తెలుసు.

వారందరికీ ఏ విధమైనటువంటి విధానాలుండాలనేది ఆలోచించాలి. ఏది చేసినప్పటికీ ఆదర్శవంతంగా ఉండాలి కాబట్టి దాన్ని కూడా ప్రభుత్వపరంగా తీసుకోవడం జరుగుతుందని మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను. ఎవరికైతే అర్హత ఉందో, ఎవరైతే ఆ భూముల్లో ఐదేళ్ల పై చిలుకు ఉన్నారో, ఆ విషయంలో ప్రభుత్వం జి.వో. కూడా ఇవ్వడం జరిగింది. ఎప్పుడైతే ఎవరైతే స్థిర నివాసం కలిగించుకొని ఉన్నారో, పేద ప్రజానీకం, వారందరిని వెళ్లగొట్టడానికి వీలులేదు. వారికి 60 గజాల స్థలం మంజూరు చేయండి. వీలుగా ఉంటే కాలనీలు కూడా నిర్మించండని కూడా ఎప్పుడూ లేనటువంటి చారిత్రాత్మకమైన నిర్ణయం ప్రభుత్వం తీసుకోవడానికి కూడా ఇదే కారణమని మీకు నేను సవినయంగా తెలియజేస్తున్నాను.

పోలీసు విషయంలో తగినంత మంది సిబ్బంది లేరని చెప్పి కూడా నేను అంగీకరిస్తున్నాను. కాబట్టే ఫస్ట్ బ్యాచ్ ఆఫ్ యస్ఐస్ మరో నెల రోజుల్లో వస్తారు 425 మంది. తర్ఫీదుతో ఈయొక్క శాంతిభద్రతల పటిష్టతకు పాటుపడడానికి యువకులు వస్తారు ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. ఇదే సందర్భములో మరొక ఏడు వేల మందిని రిక్రూట్ చేయాలని కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఇది సుమారు రెండు నెలల లోపల ఒక ఏడు వేల మంది పోలీసు సిబ్బందిని ఫ్రెష్

గా, యువకులైన వారిని తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భముగా మీ అందరికీ సవినయంగా మనవిచేస్తున్నాను.

ఆ తర్వాత కమిటీ అప్పాయింట్‌మెంట్ సంగతి చెప్పారు. దీని విషయములో ఏమీ లేదు. దేశ శ్రేయస్సు కోసం, శాంతిభద్రల కోసం, ఈ రాష్ట్ర పటిష్టత కోసం, అవసరం అయితే ఏ దౌర్జన్యకాండ, ఏ విధంగా ఎందుకు జరిగిందో తెలుసుకోవడం మనందరికీ అవసరం కాబట్టి దీని మీద నాకు భిన్నాభిప్రాయం లేదు. దీని విషయములో ప్రభుత్వం యోచించడం జరుగుతుందని నేను సవినయంగా మనవిచేస్తున్నాను. ఇప్పుడు కొంత మంది సభ్యులు కడప విషయం చెప్పారు. కడప విషయం జరిగిన మరునాడే ఐ హేవ్ అప్పాయింటెడ్ ఎ కమిషన్, ఒక కమిషన్‌ను అప్పాయింట్ చేయడం జరిగింది. ఎరాడే-ఎ రిటైర్డ్ డి.జి. ఆఫ్ పోలీసు వారు ప్రత్యేకంగా ఆ శాఖలో ఉన్న వ్యక్తి, నిర్మొహమాటమైన వ్యక్తి అని, నిజాయితీ గల మనిషని చెప్పి ఆయనను ప్రత్యేకంగా సింగిల్ మేన్ కమిషన్ ఆల్‌రెడీ అప్పాయింట్ చేయడం జరిగింది. కాబట్టి, దీని విషయములో ప్రభుత్వం ఎవరినీ సమర్థించడం జరగదు, న్యాయం, ధర్మం జరగాలన్న కోరిక తప్ప దౌర్జన్యకాండను ఉపేక్షించడం కానీ, లేకపోతే హింసాకాండను ప్రోత్సహించడం కానీ, ఒక నిరంకుశత్వ విధానాన్ని అనుసరించే విధానాలు కల్పించడం కానీ ప్రభుత్వం యొక్క ఉద్దేశం కాదని నేను సవినయంగా మనవిచేస్తున్నాను.

**యువకులకు పని కల్పించడం అవసరం అని ఈనాడు ప్రతి జిల్లాలో 200, 300 మందిని ఫస్ట్ బేచ్ క్రింద యువకులను తీసుకోవడం. వారికి గ్రామ సమస్యలలో తర్ఫీదు ఇవ్వడం, ఎక్కడైనా ఫీజుపోయినా, మరొకటి పోయినా, ఆ గ్రామానికి సంబంధించిన సమస్యలకు బయటి వారితో ప్రమేయం లేకుండా, ఎవరి కోసం ఎదురుచూడకుండా శిక్షణ కల్పించి పని కల్పించి వారికి తగిన సహాయాన్ని చేయాలనేదే సంకల్పం.**

తరువాత గ్రే హౌండ్స్ అన్నారు. గ్రేహౌండ్స్ విషయములో ఇప్పుడు ప్రత్యేక శిక్షణ పొందుతూ ఉన్నారు. ఫస్ట్ బేచ్ ఆఫ్ ది గ్రే హౌండ్స్ ఆర్ గెటింగ్ ట్రైనింగ్. నేను అన్న మాటను వృథాగా పోయేటట్లు చూచే వ్యక్తిని కాను. అలాంటప్పుడు మాటకు విలువ లేదు. కాబట్టి, ఈనాడు యాజ్ ఎ.సి.ఎమ్. ఆఫ్ ది స్టేట్ ఇఫ్ ఐ సే ఎఫ్‌వర్డ్ ఇట్ మస్ట్ డన్. కాబట్టే, ఈనాడు గ్రే హౌండ్స్ విషయములో ప్రత్యేకమైన తర్ఫీదు పొందుతూ ఉన్నారు. వారు సరైన శిక్షణతో ఈ ఉపద్రవాన్ని ఎదుర్కోడానికి కృషి చేస్తారనే నమ్మకాన్ని నేను మీకు వ్యక్తం చేస్తున్నాను. తరువాత, ముఖ్యంగా యువకులకు పని కల్పించడం అవసరం అని ఈనాడు ప్రతి జిల్లాలో 200, 300 మందిని ఫస్ట్ బేచ్ క్రింద యువకులను తీసుకోవడం, వారికి గ్రామ సమస్యలలో విద్యుత్ సరఫరా అంశంపై తర్ఫీదు ఇవ్వడం, ఎక్కడైనా ఫీజుపోయినా, మరొకటి పోయినా, ఆ గ్రామానికి సంబంధించిన సమస్యలకు బయటి వారితో ప్రమేయం లేకుండా, ఎవరి కోసం ఎదురుచూడకుండా వారిది వారే నిర్ణయించు కొనే దానిలో శిక్షణ కల్పించి పని కల్పించి వారికి

తగిన సహాయాన్ని చేయాలనేదే సంకల్పం. మీ అందరికీ తెలుసు. అందుకే ఈ మధ్య 25 ఎకరాల స్థలాన్ని కూడా మంజూరు చేయడం ప్రత్యేకంగా వీకర్ సెక్షన్ హౌసింగ్ విషయములో దర్వాజాలు తయారు చేసే విషయం, బ్రిక్స్ తయారు చేసే విషయములో కానీ, స్వల్ప డబ్బుతో ఇల్లు తయారుచేసే విషయములో కానీ వారికి తర్ఫీదు ఇచ్చేటటువంటి విషయం ప్రత్యేకంగా దీనిలో కల్పించడం జరిగిందని మీ అందరికీ కూడా సవినయంగా మనవిచేస్తున్నాను.

ఇకపోతే హవుస్ సైట్స్ ఫర్ పూర్ విలేజర్స్. ఈనాడు ఇది మీకు తెలుసు. ఈనాడు పొలాల ధర విపరీతంగా పెరిగిపోయింది. ఇప్పటికే సుమారుగా రూ.28 కోట్లు ప్రభుత్వం చెల్లించవలసి ఉంది. అయినప్పటికీ కూడా ఈనాడు ఉన్నటువంటి దేవాలయాల భూములు కానీ వాటిని కొని కేవలం ఈనాడే చెల్లించకుండా 10 వాయిదాల మీద ఏ విధంగా చెల్లించడానికి వీలవుతుందో పేదవారికి ఆ భూములు ఏ విధంగా ఆశ్రమం కల్పించడానికి, ఉపయోగించుకోడానికి వీలవుతుందనే విషయం మీద పూర్తిగా ప్రభుత్వం ఈనాడు ఆలోచనతో శ్రద్ధ వహిస్తున్నదని నేను గౌరవ సభ్యులకు సవినయంగా మనవిచేస్తున్నాను. ఈనాడు చేస్తున్నది చాలదు. ప్రభుత్వం ఈనాడు నిరాశ్రయులైన వారికి, ఇళ్లులేని వారికి స్థలాలు ఇవ్వాలనే ఆశయం కానీ ఈనాడు చేస్తున్నది చాలా అంటే చాలదని నేను మీతో ఏకీభవిస్తున్నాను కాబట్టి ఇది ఉధృతంగా జరగాలి. ప్రతి వారికి ఇల్లు కావాలి అంటే, ఈ విధమైన కార్యక్రమం అవలంభించడమే ప్రభుత్వం యొక్క ఉద్దేశముగా మీకు నేను మనవిచేస్తున్నాను.

మైనర్ ఇరిగేషన్–ఆదిలాబాదు గిరిజన జిల్లాకు వెళ్ళినపుడు అక్కడ ఎన్నో మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు ఉన్నా సరే ఈనాటికి అదే సిద్ధాంతముగా వెనుకబడిన జిల్లాలలో మైనర్ ఇరిగేషన్ అవకాశాలు ఎక్కడ ఉన్నాయో, చిన్న నీటి పారుదల ఆవకాశాలు ఎక్కడ ఉన్నాయో వాటిని అన్నింటినీ ప్రోత్సహించడమే ప్రభుత్వ విధానం అని మీ అందరికీ తెలుసు. పేదవారికి ఏ నీటిబొట్టు ఉపయోగపడ్డా సరే ముఖ్యంగా నేను దీనిని ప్రోత్సహించి, మంజూరు చేసి అమలుపరిచే పద్ధతిని అవలంభిస్తున్నదని ఈ ప్రభుత్వం మైనర్ ఇరిగేషన్ విషయంలో శ్రద్ధగా, చక్కగా నిర్వహించడానికి, ప్రతి నీటి బిందువును బీడుపడిన భూములను మాగాణులుగా మార్చడానికి సస్య శ్యామలం చేయడానికి పూర్తిగా ఉపయోగించుకోవడం జరుగుతుందని మీకు సవినయంగా మనవిచేస్తున్నాను.

సెంట్రల్ జైల్స్ విషయములో ఎక్కువ మంది మ్రగ్గిపోతున్నారు. వారిని కోర్టులకు, వాటికీ తీసుకు వెళ్లడానికి సరైనటువంటి పద్ధతి కల్పించాలి, ప్రత్యేకమైన సిబ్బందిని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను. విచారణ త్వరగా జరిపించాలి. కేవలం ఏదో పట్టుబడ్డాము, దిక్కు, దివాణం లేదు కాబట్టి మమ్ములను ఇక్కడ ఉంచారు అనే భావన లేకుండా సకాలములో విచారణ కల్పించడానికి అవకాశాలను కూడా కల్పించడం జరిగిందని మీకు మనవిచేస్తున్నాను.

ఇక బీర్‌పూర్ యాక్సిడెంట్ విషయం చెప్పారు. వారికి నా సానుభూతిని తెలియజేస్తాను. ఈ విధమైన దురదృష్టకరమైన, హింసాత్మకమైన విధానం అమలులో బలికావడంలో నా ఆవేదనను వ్యక్తం చేస్తూ వారికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వడం జరిగిందని మనవిచేస్తున్నాను. ఈ హింసాత్మకమైనటువంటి, దురదృష్టకరమైనటువంటి ఈ విధానములో బలి అయిన వారందరికీ ఒక్కొక్కరికి, ఒక కుటుంబములో ఇద్దరు ముగ్గురు ఉన్నా సరే వారందరికీ కూడా రూ.10 వేలు ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయడం జరిగిందని తమకు నేను సవినయంగా మనవి చేస్తున్నాను.

ఇక సోదరులు రసూల్‌ఖాన్ గారు చెప్పారు. దయచేసి మైనారిటీస్ విషయములో మాకు సోదర భావం ఉంది. ఈ మధ్య ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు దీనికి కారణం అని ప్రత్యేకంగా వివరించవలసిన అవసరం లేదు. మీకు ఏమైనా సమస్యలు ఉంటే ప్రత్యేకంగా దయచేయండి, మాకు చెప్పండి. మొన్న జరిగిన సంఘటన గురించి చెప్పారు. అది ఇద్దరు ముస్లిముల మధ్య, వారు తెలుగుదేశమో మరి ఇంకో దేశమో మనకు తెలియదు కానీ మొత్తం మీద ఇది నేను ఒక విధంగా 'అమ్మా' అని అనుకున్నాను. అది ఏదైనా పొరపాటున హిందువు అయి రాయి విసిరితే ఆ ముస్లిమ్‌కు దెబ్బ తగిలి ఉంటే ఏమిటి ఈ దురదృష్టకరమైన విధానం జరిగిందని బాధపడే వాడిని. అది వారిలో వారికి సంబంధించిన స్వసంఘర్షణ. ఈ విధానానికి నేను బాధపడుతున్నాను. అయినప్పటికీ కూడా ప్రభుత్వం ఇద్దరి విషయములో ఎవరినీ క్షమించకుండా పూర్తిగా శ్రద్ధ తీసుకుంటున్నది. ఎవరైతే దీనికి కారకులో వారిని దండించడం కూడా జరుగుతుందని నేను సవినయంగా మనవిచేస్తున్నాను.

ఇంకొక్క విషయం. దీనిలో రాజకీయం లేదు. మన యొక్క రాజ్యాంగము, మన భారతదేశం యొక్క సమగ్రత మన రాష్ట్ర సమన్వయం, దీనికి కారణం కేవలం ఈ రోజున రాష్ట్రాలు ఏమైనా పని చేస్తున్నాయి అంటే రాష్ట్రాల పేరిట యూనియన్ ఉన్నది అనేది మరచిపోవద్దని సవినయంగా మనవిచేస్తున్నాను. ఇట్ ఈజ్ ది యూనియన్ ఆఫ్ ది స్టేట్స్. అన్ని రాష్ట్రాల కలయికే ఈనాడు కేంద్ర ప్రభుత్వం. ఈనాడు రాష్ట్రాల యొక్క హక్కులను కానీ రాష్ట్రాల యొక్క అధికారాలను కానీ, రాష్ట్రాలకు కావలసిన అవసరాలు కానీ, పూర్తిగా కేంద్ర ప్రభుత్వం గుర్తించడం, యూనియన్ ప్రభుత్వం తమ చేయూతనివ్వడం తమ బిడ్డలను తల్లులు సాకినట్లుగా వారు కూడా సాకడం ధర్మం న్యాయం. అప్పుడు కానీ పూర్తిగా దేశములో ఏ పద్ధతికానీ సుస్థిరముగా అమలుపడదు. ఈనాడు శాంతిభద్రతలు కావాలన్నప్పుడు కేంద్రం కోరేది, మేము కేవలం కోరేది కాదు. మీరు ఆమోదించిన పద్ధతి అందరూ ఆమోదించిన పద్ధతి. 82 కోట్ల భారతీయులకు సంబంధించినటువంటి విషయం ఈనాడు శాంతిభద్రతలు.

కాబట్టి రెండు సంవత్సరాల నుంచి అడుగుతున్నాము. అయ్యా, మాకు దయచేయండి, మా దగ్గర బలగం చాలదు అని, మా చేతుల్లో ఉంది మేము చేయగలం కానీ మాకు అండగా వారి

ఆమోదం కావాలి, మేము కూడా అండగా ఉన్నామని చెప్పి మమ్ములను కొంచెం యూనియన్ ప్రభుత్వం నడిపించాలని కోరుకున్నాము. మూడు బెటాలియన్స్ ఇవ్వమన్నాము. 3 బెటాలియన్స్ అంటే 18 కంపెనీలు. 18 కంపెనీలు అంటే 1800 సెంట్రల్ రిజర్వ్ పోలీసు ఫోర్సును అడిగితే కేవలం 5 కంపెనీలు ఎప్పుడో ఇచ్చారు. 500 మందిని ఇచ్చారు. 1988 డిసెంబర్‌లో గౌరవనీయులు హోమ్ మంత్రిగారు, డి.జి.పి. గారు, హోమ్ శాఖ కార్యదర్శి గారిని కూడా పంపించడం జరిగింది. వారికి నచ్చచెప్పడం జరిగింది.

మరి ఎన్ని చెప్పినప్పటికీ కూడా చివరకు మేము పంపించలేని స్థితిలో ఉన్నామని వ్రాత మూలకంగా వారు ఉత్తరం కూడా పంపించడం జరిగింది. కాబట్టి, ఈ విధమైన నిర్లక్ష్య భావముతో చూడబడుతున్నాము అంటే నేను దీనికి ఏమీ ఆపాదించను. కానీ బాధ్యత ఏవిధంగా తిరస్కరించబడుతోందని మాత్రము ఒక పౌరుడిగా అడుగుతున్నాను. మాకు అధికారం ఉన్నది, హక్కు ఉన్నది. మా హక్కును గుర్తించవలసిన అవసరం కూడా వారికి ఉన్నది. దేశ సమగ్రత, పటిష్టత కాపాడాలి అంటున్నారు, శాంతిభద్రతలు కాపాడాలి సమాజంలో అంటున్నారు. మేము కోరి దయ చేయండి అన్నప్పుడు ఎందుకు పంపించడం లేదో మాకు అర్థంకానీ సమస్యగా ఉందని మనవిచేస్తున్నాను. అదే తమిళనాడు ప్రభుత్వాన్ని అడిగినప్పుడు, వారికి సమస్యలు ఉన్నప్పటికీ కూడా వారికి ఉన్న దానిలో రెండు కంపెనీలను వారు ఎందుకు పంపించారు? మరి ఈ మాత్రం ఔదార్యం యూనియన్ ప్రభుత్వానికి ఎందుకు లేకపోయింది? ఇది అడగవలసిన ధర్మం, మీకు చెప్పవలసిన ధర్మం నాకు ఉంది. కేవలం మేము ఇది అవలంభించాము, ఈ విధంగా తిరస్కరించబడ్డాము. ఈ విధంగా 'లేదు' అనిపించుకున్నామని కూడా మీకు చెప్పడం మా బాధ్యతగా నేను మీకు సవినయంగా మనవిచేస్తున్నాను.

**మా హక్కును గుర్తించవలసిన అవసరం కూడా వారికి ఉన్నది. దేశ సమగ్రత, పటిష్టత, శాంతిభద్రతలు కాపాడాలి అంటున్నారు. మేము కోరి దయ చేయండి అన్నప్పుడు ఎందుకు పంపించడం లేదో మాకు అర్థంకానీ సమస్యగా ఉందని మనవిచేస్తున్నాను. అదే తమిళనాడు ప్రభుత్వాన్ని అడిగినప్పుడు, వారికి సమస్యలు ఉన్నప్పటికీ కూడా వారికి ఉన్న దానిలో రెండు కంపెనీలను వారు ఎందుకు పంపించారు?**

ఏదో లాంగ్ టర్మ్ విషయంలో మాట్లాడతాము అంటే మాట్లాడండి. దానికి సంబంధించిన ప్లాన్ కూడా పంపుతాము అన్నాము. పంపాము. నిన్న, మొన్న ఎవరో చూస్తామని అన్నారు వచ్చి, మన స్టేట్ ప్లాన్ ఎట్లా ఉండాలనేది చూడటానికి వస్తామన్నారు. ఈ సమస్య ఎట్లా ఉంటుందో మనకు తెలియని స్థితిలో ఉన్నప్పటికీ నా మనసులో గల బాధను, మన రాష్ట్ర ప్రతిపత్తిని గుర్తించినటువంటి అభిప్రాయాన్ని తెలియచేస్తున్నాను. కాబట్టి సోదర, సోదరీమణులకు సవినయంగా మనవిచేస్తున్నాను. ఎంతో ఉద్రేకంతో, ఉదాత్తమైన ఆలోచనలు చెప్పారు. నాలో

కూడా ఆవేశం రగిల్చారు. వారి భావాలను నేను వ్యతిరేకించడం లేదు. అందరూ కూడా రాష్ట్రం యొక్క అభివృద్ధిని గురించి చెప్పడం జరిగింది. కనుక దాని విషయం గురించి ఆలోచించడం మాత్రమే నా ధర్మం కానీ, కాదు అనడం భావ్యం కాదు. సరైన, ఉదాత్తమైన ఆలోచన వచ్చిన వివిధ పక్షాల నాయకులకు, మా తెలుగుదేశం పార్టీ ప్రాధాన్యత వహిస్తున్నటువంటి గౌరవనీయులైన సోదర సోదరీమణులకు కృతజ్ఞతాపూర్వకమైన అభినందనలు వ్యక్తంచేస్తూ, ఈనాడు ప్రభుత్వ ఉద్దేశ్యాన్ని తెలియచేసే అవకాశం కల్పించినందుకు గౌరవనీయులైన సభాధ్యక్షులకు నమస్కారములు తెలియచేస్తూ సెలవు తీసుకొంటున్నాను.

జై తెలుగుదేశం – జై హింద్.

◆◆

సెప్టెంబర్ 16, 1989

## 'హంద్రీ - నీవా సుజల స్రవంతి' బహుళార్ధ సాధక పథకం రాయలసీమ ప్రజలందరికీ సంతృప్తి చేకూర్చగలదు

*(రాయలసీమ ప్రాంతంలో సాగునీరు, మంచినీరు అందించేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టు గురించి ప్రకటన)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, రాయలసీమలో ఈనాటివరకూ ఎంతో కృషి జరిగినా, భగీరథ ప్రయత్నాలు చేయబడ్డా, ఇంకా నీరందించడానికి వీలుపడని కరువు ప్రాంతపు మెట్ట భూములకు నీరందించవలసిందిగా అనుక్షణం ఆలోచనలను అందిస్తున్న గౌరవ శాసనసభ్యుల సూచనలతో పాటు వారు అందించిన ప్రాథమిక నివేదికను కూడా పరిశీలించడం జరిగింది, అధ్యక్షా, తమ సమక్షంలో కూడా ఇప్పుడు ఉంచడం జరుగుతోంది.

*(నివేదికను అధ్యక్షుల వారికి అందించడమైనది)*

నిరంతర కరువు కాటకాలతో కటకటలాడుతున్న సీమప్రజల ఇక్కట్లను తప్పించి అందుబాటులో ఉన్న ప్రతిచుక్క నీటిని ప్రజోపయోగార్థం బీడు భూములకు మళ్ళించాలన్నదే ప్రభుత్వ ఆశయం. దాహార్తుల దప్పిక తీర్చడానికి, కృషీవలుల కృషికి నీరాజనం పట్టడానికి వారి అందుబాటులోకి జల స్రవంతిని రప్పించాలన్నదే మా పరమార్థం ఉద్దేశం.

అందుకే, కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపుర జిల్లాలలోని నీరందని సుమారు ఆరు లక్షల ఎకరాలను సస్యశ్యామల శోభితం చేయడానికి సాగునీరు పలు పట్టణ గ్రామ ప్రాంతాల ప్రజలకు త్రాగునీరు అందించే ఈ బహుళార్ధ సాధక పథకంపై సమగ్ర పరిశీలన జరిపేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్ణయించింది. రాష్ట్రసమగ్రాభివృద్ధికి, కరువు ప్రాంతాల దుర్భర స్థితిని తప్పించడానికి ప్రత్యేకించి ఆనాదిగా ఆలస్యం చేయబడిన రాయలసీమ పరిపుష్టికి, తుష్టికి పరమార్థం కోరి లక్షించిన ఈ బృహత్తర పథకానికి ప్రాథమిక నివేదిక ప్రకారం నాలుగు వందల

కోట్ల రూపాయలు ఖర్చు కాగలవు. ఆరు మాసాల్లో ఈ ప్రాజెక్టును గురించి సమగ్ర నివేదిక అందజేయవలసిందిగా కోరడమైంది. ఇందుకోసం ప్రత్యేకంగా ముఖ్యమంత్రి - నీటిపారుదల సలహాదారు శ్రీ రామకృష్ణయ్యగారి నేతృత్వంలో వెంటనే రెండు పరిశోధనా విభాగాలు ఏర్పాటుచేయడం జరుగుతుంది. సమగ్ర నివేదిక అందిన తదుపరి ఎనిమిదవ ప్రణాళికలో ఈ ప్రాజెక్టును చేర్చటం జరుగుతుందని గౌరవనీయ శాసన సభ్యులకు తెలియ జేస్తున్నాను.

"హంద్రీ - నీవా సుజల స్రవంతి" పేరుతో రూపొందించనున్న ఈ బహుళార్ధ సాధక పథకం రాయలసీమ సోదరీ సోదరులకు తుష్టిని, ఆర్థిక పుష్టినీ, మానసిక సంతృప్తిని చేకూర్చగలదని మా ఆకాంక్ష - ఆశయం. దీనిలో ప్రత్యేకమైన విషయాలను గౌరవ సభకు తమద్వారా తెలియచేస్తున్నాను. కర్నూలు జిల్లాలో 35 వేల ఎకరాలకు, కడపజిల్లాలో 2.50 లక్షల ఎకరాలకు, అనంతపురం జిల్లాలో 3,92,500 ఎకరాలకు, చిత్తూరు జిల్లాలో లక్ష ఎకరాలకూ సుమారు 8,27,500 ఎకరాలు సస్యశ్యామలం కాగలవని అంచనా. ల్యాండ్ అక్విజిషన్ ఇదివరకు తెలుగుగంగకు 90 వేల ఎకరాలను సేకరించడము జరిగితే, ఈ బృహత్ పథకానికి ఫారెస్టు ల్యాండ్ 1000 ఎకరాలూ, ప్రైవేటు ల్యాండ్ 8 వేల ఎకరాలూ, గవర్నమెంట్ ల్యాండ్ 1000 ఎకరాలు మొత్తము 10 వేల ఎకరాలతోనే ఈ ప్రాజెక్టు నిర్మితం అవుతుందని ఇదివరకే మనవిచేశాను. దీని యొక్క విలువ రు. 400 కోట్లు 500 కోట్లు మధ్య ఉండవచ్చని అంచనా వేయబడింది.

**కాస్ట్ ఆఫ్ ది ప్రాజెక్టు అండ్ ది బెనిఫిట్స్:**

దీనివల్ల సాగునీరు 6 లక్షల ఎకరాలకు, గ్రౌండ్ వాటర్ ఛార్జ్ భూగర్భ జలాన్ని తుష్టిగా అందించే దానికి 20 లక్షల ఎకరాలు, సాయిల్ కన్సర్వేషన్ 20 లక్షల ఎకరాలు అడిషనల్ నీటి యొక్క అందుబాటు ఉంది కనుక 30 లక్షల చెట్లు పెరగడానికి కూడా ఇది ఆస్కారం కాగలదని మనవిచేస్తున్నాను. దుమ్ము తుఫానులు (డస్టు స్టారమ్స్) అవన్నీ కూడా నివారించబడతాయి.

దీనివల్ల మనం ఇతర దేశాల నుంచి ఈనాడు దిగుమతి చేసుకొంటున్న ఆ ఫారిన్ ఎక్చేంజ్ వంటనూనెల ద్వారా పోతున్న దానిని కూడా మనం రాబట్టుకోడానికి వీలవుతుంది. దీనివలన 3 1/2 లక్షల టన్నుల వేరుశనగకానీ, సుమారు ఆరులక్షల వ్యవసాయదారులకు పనికానీ లభింపచేయడం జరుగుతుందని మనవిచేస్తున్నాను. దీనివలన కదిరి, హిందూపూర్ మొదలైన ఎన్నో పట్టణాలకు, గ్రామాలకు త్రాగడానికి నీరు అందించడము జరుగుతుందని మనవిచేస్తున్నాను. కదిరిలో ఇప్పటికిప్పుడే ఫ్లోరైడ్ కంటెంట్ ఉన్నది. మరి డిఫ్లోంయంట్ ప్లాంట్' పెట్టినప్పటికీ కూడా అది ప్రయోజనము లేనందువల్ల అక్కడున్న దుర్భర గ్రామ విధానాన్ని నివారించడానికి పూర్తిగా ఇది దోహదం చేయగలదని ఆశిస్తూ ఇది ప్రజాస్వామ్య విధానంపట్ల నమ్మకముతో ప్రజా ప్రభుత్వం చేస్తున్న సేవగా, కృషిగా 'సర్వేజనా సుఖినో భవంతు' అని ప్రజలకు అంకితం చేయడం జరుగుతుందని మనవి చేస్తున్నాను.

◆◆

జనవరి 20, 1995

# సమాజములో అసమానత్వం పోవాలి, పేదవారిపట్ల నిర్లక్ష్య భావం పోవాలి

*గవర్నర్ ప్రసంగమునకు ధన్యవాదములు తెలిపే సందర్భంగా ముఖ్యమంత్రి ఎన్.టి.ఆర్. ప్రసంగం)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** గౌరవనీయులైన అధ్యక్షులకు, విజ్ఞులైనటువంటి శాసనసభ్యులందరికీ అభినందనలు, శుభాభినందనలు. గవర్నర్‌గారి ప్రసంగముపై జరిగిన చర్చలో మీ అందరూ పాల్గొన్నారు, ఎంతో విజ్ఞతతో, అనుభవస్ఫూర్తితో మీ భావాలు వ్యక్తం చేశారు. దానిని పూర్తిగా గమనించడం జరిగింది. ఏ విధంగా వాటి విషయములో స్పందించాలో ప్రభుత్వం పూర్తిగా ఆలోచిస్తుందని మీకు సవినయంగా మనవిచేస్తున్నాను. అందరి పేర్లు – పేరు పేరిట చెప్పడం ఎక్కువ అవుతుంది. సుమారు 33 మంది గౌరవనీయ సభ్యులు ఈ చర్చలో పాల్గొన్నారు. వారు అందరూ చేసినటువంటి నిర్మాణాత్మకమైన సూచనలను పూర్తిగా ఆలోచన చేయబడుతుందని అందరికీ సవినయంగా మనవిచేస్తున్నాను. కానీ ఒకటి మీ అందరికీ మనవిచేస్తున్నాను. ఈ రోజున ప్రజాస్వామ్యం ప్రకారం ప్రజల అభీష్టానుసారం, ప్రజల అనుమతి ప్రకారం తెలుగుదేశం ప్రభుత్వాన్ని చేపట్టిందన్న సంగతి మీ అందరికీ సవినయంగా మనవిచేస్తున్నాను. మన పార్టీలు వేరు, విధానాలు వేరు, ఆలోచనలు వేరు, ఉద్దేశాలు వేరు.

ప్రజలకు ఇచ్చిన హామీలు వేరు. ప్రజలు మనము ఇచ్చిన హామీలను విశ్వసించి దాని ప్రకారంగా ఈరోజున ఎవరికీ ఏవిధంగా, ఎవరినీ ఏ విధంగా బలపరచాలో ఆ విధంగా బలపరచడం జరిగిందని ఈమధ్య జరిగినటువంటి ఎన్నికలు నిరూపణ చేశాయని మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను. ఈ పక్షాలు అందరినీ, ఈ పక్షాలు అన్నింటినీ ఎందుకు ఈ విధంగా అనుమతించాయి అన్నది ప్రజల అభీష్టం, ప్రజాస్వామ్యములో అది అడగడానికి ఎవరికీ అధికారం లేదు. మరి ఆ నమ్మిన వారికి అనువైన విధానములో మార్పులు కానీ చేర్పులు కానీ

అనుసరణ కానీ సాగించడం మన ధర్మంగా భావించాలి అన్నది మన సూత్రంగా మీ అందరికీ కూడా సవినయంగా మనవిచేస్తున్నాను. కాబట్టి ఈ రోజున తెలుగుదేశం అధికారానికి వచ్చింది అంటే తెలుగుదేశం ఎన్నో హామీలు ప్రజలకు ఇచ్చింది. ప్రజలు విశ్వసించారు, నమ్మారు, దాని ప్రకారం ఈనాడు మాకు అధికారాన్ని ఇచ్చారు. కాబట్టి తప్పకుండా ఏ హామీలు అయితే ప్రజలకు ఇచ్చామో, ఏదైతే ప్రజలకు సేవ చేస్తామని మేము చెప్పామో దేనికి మేము నిర్ణయించబడ్డామో మీకు తెలుసునని సవినయంగా మనవిచేస్తున్నాను. కాబట్టి, విజ్ఞతతో మీరు ఇచ్చిన సలహాలను దృష్టిలో పెట్టుకుంటూ మేము ఇచ్చినటువంటి నమ్మకాన్నీ, ప్రజలకు ఇచ్చినటువంటి విశ్వాసాన్ని ఏ మాత్రం మరచిపోవడం కూడా జరగదని మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను. ఏ విధానాన్ని నమ్మించి, ఏ పద్ధతిలో ప్రజలకు సంక్షేమాన్ని కలిగిస్తామని, సేవ చేస్తామని మేము చెప్పామో దానిని మాత్రం విస్మరించడం జరగదని మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను.

మరి మనకు 47 సంవత్సరాల ముందు స్వాతంత్ర్యము వచ్చిందని మీకు తెలుసు. 35 సంవత్సరాలు ఒక పక్షం రాజ్యం చేసింది. 7 సంవత్సరాలు తెలుగుదేశం పరిపాలించింది. తరువాత తిరిగి సుమారు 5 సంవత్సరాలు ఇంకొక పక్షం పాలన చేసింది. దీని అనుభవం ప్రజలకు ఉంది. మనకు ఉంది. సమాజములో ఏ విధంగా అంతస్తులు ఉన్నాయో, ఏ విధంగా సమాజం ఉందో కూడా మనకు అనుభవం ఉంది. కాబట్టి, ప్రజలు అనుభవం ప్రకారం వారి విశ్వాసాన్ని ప్రకటించారు. వారు అధికారం ఇచ్చారు. దానిని కాదనడానికి మాత్రం ఎవరికీ హక్కు లేదని నేను సవినయంగా మనవిచేస్తున్నాను. అదే విధంగా 35 సంవత్సరాలు, 5 సంవత్సరాలు, 40 సంవత్సరాలు సుమారుగా పరిపాలన చేసిన ప్రభుత్వం ఏవిధంగా ప్రజల కోరికను మన్నించలేకపోయిందో, ఏ విధంగా ప్రజలకు సమ సమాజాన్ని సృష్టించలేకపోయిందో, ఏ విధంగా పేద వారికి సరైనటువంటి అభివృద్ధిని కలిగించలేకపోయిందో, ఏ విధంగా పేద వారికి సరైనటువంటి అభివృద్ధిని కలిగించలేక పోయిందో వారే నిర్ణయించారు.

**మరి మనకు 47 సంవత్సరాల ముందు స్వాతంత్ర్యము వచ్చిందని మీకు తెలుసు. 35 సంవత్సరాలు ఒక పక్షం రాజ్యం చేసింది. 7 సంవత్సరాలు తెలుగుదేశం పరిపాలించింది. తరువాత తిరిగి సుమారు 5 సంవత్సరాలు ఇంకొక పక్షం పాలన చేసింది. దీని అనుభవం ప్రజలకు ఉంది. మనకు ఉంది. సమాజములో ఏ విధంగా అంతస్తులు ఉన్నాయో, ఏ విధంగా సమాజం ఉందో కూడా మనకు అనుభవం ఉంది.**

మేము నిర్ణయించడం కాదు. ఈనాడు అట్టడుగున ఉన్న పేద, బడుగు, బలహీన, దళితవర్గాల వారు మాకు ఏ మాత్రం సంక్షేమం కలిగించబడలేదు. మేము విస్మరించబడ్డాము. వెనుకబడిన తరగతుల వారము వెనుకబడే ఉన్నాము మమ్మల్ని ఎప్పుడూ ముందుకు తీసుకువెళ్లలేదు అని వారు, అదే విధంగా అల్ప సంఖ్యాక వర్గాలుగా ఉన్నటువంటి ముస్లిమ్

సోదరులు అందరూ కూడా ఈనాడు విశ్వాసంతో మేము ఉండలేకపోతున్నామని ఎవరికి వారు ఒక మౌన విప్లవం అనేది, వారు మనంత సంభాషణా చాతుర్యముతో చెప్పలేకపోవచ్చు, వారికి అవసరం కూడా లేదు చెప్పడానికి, అవసరం వచ్చినప్పుడు వారు చేసి చూపించారు. ఎవరికీ ఓటు ఇవ్వాలో వారే చెప్పారు. కాబట్టి వారి అభీష్టం వల్లనే ఇది మౌన విప్లవం అని అన్నాను. ఈ మౌన విప్లవం ద్వారా ఏ విధంగా తెలుగుదేశాన్ని బలపరిచారో, ఏ విధంగా తెలుగుదేశానికి పరిపాలన అప్పగించారో అది ఎప్పుడూ కూడా మేము మరచిపోమని మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను. ఎవరు ఏ పార్టీ విధానాలపట్ల విశ్వాసముతో చెప్పినప్పటికీ కూడా మేము ఇచ్చిన హామీలను మేము కూడా మరచిపోము, తూచా తప్పకుండా వాటిని నిర్వహించడం జరుగుతుందని కూడా సభ్యులందరికీ సవినయంగా మనవిచేస్తున్నాను. దానికి బద్ధులం. ప్రజలకు ద్రోహం చేయలేము.

వారికి ఏ మాట అయితే ఇచ్చామో, ఏ విధంగా నమ్మించామో, ఏ నమ్మకం మీద ప్రజలు మాకు ఓట్లు ఇచ్చారో ఏ విధంగా మహత్తరమైనటువంటి, ఒక చారిత్రాత్మకమైనటువంటి విజయాన్ని వారు మా పార్టీకి కలిగించారో దానిని ఎప్పుడూ కూడా వమ్ము చేయలేము. దానికోసం పూర్తిగా అంకితమైన భావముతో పనిచేస్తాము. మమ్మల్ని నమ్మి ఓట్లు ఇచ్చినటువంటి వారికి పూర్తిగా నేను ఈరోజున అంకితమైన భావముతో మనవిచేస్తున్నాను. సమాజములో వ్యత్యాసాలు పోవాలి, కుళ్ళు పోవాలి, సంకుచితతత్వం పోవాలి, రాజకీయములో కలుషితం పోవాలి, ప్రజా విద్రోహము పోవాలి – ఇవన్నీ వారు కోరుకుంటున్నారు. వారు కోరుకుంటున్నారు వారి ఓట్ల వల్ల తెలిసిపోయింది. నేరుగా మనము ఏమీ అడగనక్కరలేదు. కాబట్టి, దాని విషయములో పూర్తిగా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తామని సోదరులందరికీ సవినయంగా మనవిచేస్తున్నాను. ఇది ప్రజాస్వామ్యం. ప్రజాస్వామ్యబద్ధులమై అంకితమైన భావముతో ప్రజల శ్రేయస్సు కోసం నేను పూర్తిగా తూచా తప్పకుండా వ్యవహరిస్తానని మరొకసారి అందరికీ సవినయంగా మనవిచేస్తున్నాను.

దానితోపాటుగా మీరు ఇచ్చిన యోగ్యమైనటువంటి సూచనలను, వివేకాత్మకమైనటువంటి సూచనలను తప్పకుండా పాటిస్తాము. ఎందుకంటే ఒకరి కంటే కూడా నాలుగు గొంతులు కలిసినట్లయితే నాలుగు ఆలోచనలు ఉన్నప్పుడు ఎక్కువగా మాకు కూడా విశాలమైన భావం ఏర్పడుతుంది కాబట్టి మీ ఉద్దేశాలలో కూడా మంచివి ఉంటే తప్పకుండా తీసుకోవడం జరుగుతుంది. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షణ చేయడం జరుగుతుంది. ప్రజాస్వామ్యం మీద విశ్వాసముతో పరిపాలన చేయడం జరుగుతుందని మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను. ఈనాడు సమాజములో ఉన్నటువంటి అసమానత్వం పోవాలి. పేదవారిపట్ల నిర్లక్ష్యమైన భావం పోవాలి. పరిపాలనకు వచ్చినటువంటి పక్షాలు ఏవిధంగా వారిని విస్మరిస్తున్నాయో ఓట్లు వేసిన

తరుణములో ఏదో మా మేనిఫెస్టో ఇది అని చెపుతూనే ఏ విధంగా స్వార్థముతో సంకుచితమైన భావముతో, ప్రజలకు సంభవించేటటువంటి విధానాలవల్ల ఆశలు ఏ విధంగా సంక్రమింప చేస్తున్నాయి, వారి కళ్ళ ముందు ఎమ్.ఎల్.ఏ.లుగా నిలబడి ప్రజానాయకులైన వారు ఏ విధంగా వారి ముందే మేడలు, మిద్దెలు ఏర్పరుచుకుంటున్నారో ఇవన్నీ కూడా ప్రజలు చూస్తున్నారు. అవి మనము దాచుకొనేవి కావు, మేడలు మనము జేబులో పెట్టుకొనేవి కావు, మేడ మేడగానే ఉంటుంది. కళ్ళముందు కనపడుతూ ఉంటుంది. మనము తిరిగే కారు కనిపిస్తూనే ఉంటుంది. ఎంతపెద్దది ఎంత విభవముతో కూడినది అన్నది ప్రజలు చూస్తున్నారు.

ఏ విధమైన భావం ఉంటుందో ఒకసారి గమనించమని మీ అందరికీ సవినయంగా మనవిచేస్తున్నాను. మరి రాజకీయం ఈ విధమైన విధానాలకు అంకితమైనప్పుడు ప్రజా సంక్షేమాన్ని విస్మరించినప్పుడు ప్రజలు ఏ విధమైన నిర్ణయం తీసుకోవాలో అదే ఈనాడు తీసుకున్నారని కూడా మనవిచేస్తున్నాను. అందుకే ఇది నిశ్శబ్ద విప్లవమని మీకు మనవిచేస్తున్నాను. కాబట్టి, మనలో కనుక నిజాయితీ ఉంటే, నీతి ఉంటే, మనము తెచ్చుకున్న స్వాతంత్ర్యానికి మనము న్యాయం కలిగిస్తే, కలిగించదలచుకుంటే, మనం ఎప్పటికప్పుడు వారి యొక్క ప్రాతినిధ్యానికి గౌరవం కల్పించదలచుకొంటే, ఈనాడు మనము ఏమిటో, ఈ పదవిలోకి రాకముందు మనము ఏమిటో విప్పిచెప్పడం కూడా చాలా అవసరం. అది మీ నిర్ణయానికే వదలివేస్తున్నాను. నేను ఏమీ చెప్పడం లేదు. ప్రజాప్రతినిధులుగా ఉండక ముందు ఏ విధంగా ఉన్నాము, ప్రజాప్రతినిధులం అయిన తరువాత ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ఏ విధంగా వాడుకుంటున్నామో ఈనాడు మనము ఆచరించి నిర్ణయిస్తే అంతా కూడా ప్రజల కోసం జరుగుతున్నదా లేకపోతే స్వార్థం కోసం జరుగుతున్నదా అన్నది ఒకసారి ఎవరికి వారు ఆలోచించుకోవాలని కూడా నేను మీకు మనవిచేస్తున్నాను.

వారికి మనలాగే భాషచెప్పే యోగ్యత లేకపోవచ్చు. చదువు లేకపోవచ్చు. అందుకే చదువులేని సమాజాన్ని ఉద్ధరించడం పోయి ఈనాడు స్వార్థముతో దిగమింగుతున్నామని కూడా మీకు సవినయంగా మనవిచేస్తున్నాను. మనకు స్వాతంత్ర్యం సిద్ధించి 47 సంవత్సరాలు అయిన అనంతరం కూడా ఇప్పటికే చదువుకొన్నవారు 33 శాతానికి మించి పోలేదంటే సమాజాన్ని విజ్ఞానం లేకుండా ఏ విధంగా ఉంచుతున్నామో ఒక్కసారి అర్థం చేసుకోవడం చాలా అవసరం. ఈనాడు విద్యారంగం మన చేతులలో ఉంది. విద్యారంగానికి సంబంధించి ఎప్పటికప్పుడు మనకు కావలసిన పరిపాలనాయుతమైన విధానాలను నిర్ణయిస్తున్నాం. కానీ ఎంతమంది చదువుకొని తెలివితేటలతో ఉన్నారు. ఏ రకంగా వారు సమాజానికి ఉపయోగపడుతున్నారో ఆలోచించడం మంచిది. చదువుకోలేదు కాబట్టి, తెలివి లేదు కాబట్టి, చెప్పలేరు కాబట్టి, వారు నిశ్శబ్దంగా విప్లవాన్ని సాగించారు. ఆ విప్లవ పరమార్థమే తెలుగుదేశం విజయమని కూడా నేను సవినయంగా మనవిచేస్తున్నాను. ఈనాడు తెలుగుదేశం ఏదో చేస్తుందని వారు ఊహించుకొన్నారు.

తెలుగుదేశంలో వారికి ఏదో న్యాయం జరుగుతుందని అనుకొన్నారు. తెలుగుదేశం మాకు సరైన సంక్షేమాన్ని కల్పిస్తుందని అనుకొన్నారు. బడుగు, బలహీన, పేద వర్గాలవారు తమ పేదరికం పోతుందని అనుకొన్నారు.

గతంలో ఏడు సంవత్సరాల తెలుగుదేశ ప్రభుత్వ పరిపాలనలో ఏ విధమైన శాసనాలు చేసిందో, ఏవిధమైన ఉత్తర్వులు ఇచ్చిందో, డబ్బుకు సైతం లెక్క చేయకుండా సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించే పేదవారు బ్రతకడమే ధర్మంగా భావించిందో మీకు తెలుసు, మేము చెప్పనక్కరలేదు. గత ఎన్నికల సందర్భంలో గతంలో మేము పరిపాలన చేసినప్పుడు అది చేశాం, ఇది చేశామని చెప్పలేదు కూడా. కేవలం మూడు కార్యక్రమాల గురించి మాత్రం చెప్పాము. రెండు రూపాయలకు కిలో బియ్యం ఇస్తామని చెప్పాము, అదే మా ధ్యేయం. దానిని కాదనడానికి ఎవరికీ అధికారం లేదు. దానిమీదే ప్రజలంతా మాకు బలం కూర్చారు. అధికారాన్ని ఇచ్చారు. కాబట్టి ఆరు నూరైన, నూరు ఆరైనా రెండు రూపాయలకు కిలో బియ్యం పథకాన్ని అమలుచేయక తప్పదు, తప్పదు.

ఆ రోజున మూడున్నర రూపాయలకు కిలో బియ్యం సరఫరా చేస్తుండిన ప్రభుత్వం ఎన్నికల సందర్భంలో పేదవారికి 10 కిలోల బియ్యం ఉచితంగా ఇస్తామన్నారు. అందుకే వారిని అడుగుతున్నా, నేను కూడా ప్రధాన మంత్రిగారికి ఉత్తరం వ్రాస్తాను. అయ్యా, మీరు 10 కిలోల బియ్యం ఉచితంగా ఇస్తామన్నారు. దాని విలువ 320 కోట్లు అవుతుంది. అందువల్ల ఆ డబ్బు మాకు ఇచ్చినట్లయితే పేద ప్రజలకోసం మీ పేరిట ఆ డబ్బును ఖర్చు పెడతామని అడుగుతున్నాను.

**ఆ రోజున మూడున్నర రూపాయలకు కిలో బియ్యం సరఫరా చేస్తుండిన ప్రభుత్వం, ఎన్నికల సందర్భంలో పేదవారికి 10 కిలోల బియ్యం ఉచితంగా ఇస్తామన్నారు. నేను కూడా ప్రధాన మంత్రిగారికి ఉత్తరం వ్రాస్తాను. అయ్యా, మీరు 10 కిలోల బియ్యం ఉచితంగా ఇస్తామన్నారు. దాని విలువ 320 కోట్లు అవుతుంది. అందువల్ల ఆ డబ్బు మాకు ఇచ్చినట్లయితే పేద ప్రజలకోసం మీ పేరిట ఆ డబ్బును ఖర్చు పెడతామని అడుగుతున్నాను.**

*(అధికార పక్ష సభ్యుల నుంచి చప్పట్లు)*

పది కిలోల చొప్పున బియ్యం ఉచితంగా ఇవ్వాలంటే 5 లక్షల టన్నులు కావాలి, దాని ఖరీదు 320 కోట్లు ఉంటుంది కాబట్టి ప్రధానమంత్రిగారు ఆరోజున ఇచ్చిన వాగ్దానం మేరకు ఆ డబ్బు ఇచ్చినట్లయితే ఇదిగో. ఇది ప్రధానమంత్రిగారు ఇచ్చారని నేను ప్రజానీకానికి చెప్పి వారి పేరిట ఖర్చుచేయడానికి సంకోచించనని సవినయంగా మనవిచేస్తున్నాను.

ఇక మద్యపాన నిషేధం విషయానికి వస్తే ఆనాడు పూజ్య బాపూజీ మద్యపానాన్ని నిషేధించాలన్నారు. అందుకోసం ఆయన తీవ్రంగా కృషిచేశారు. ఆయన సమాజాన్ని ఉద్దేశించి పత్రికల ద్వారా ఎన్నో విషయాలు చెప్పారు. మన దేశంలో ఉన్న వాతావరణాన్ని బట్టి మనం

త్రాగుడుకు అలవాటు పడవలసిన అవసరం లేదు. చలి దేశాలలో అయితే మద్యాన్ని తీసుకోవచ్చేమో గానీ మనది వేడి ప్రదేశం. మద్యం కోసం మనం బాధపడవలసిన అవసరం లేదు. పేదవారు తమ సంసారాలను బాగుచేసుకోవాలంటే త్రాగుడును నిషేధించడం అవసరమని ఆనాడే వారు ఉద్భోదించారు. కానీ వారి పేరిట ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలు - ఒక్క గుజరాత్ రాష్ట్రంలో మినహా - ఎక్కడా దీనిని పాటించలేదు. కొంతమంది కొంత కాలం పాటు పాటించారు. తరువాత ఎత్తివేశారు. ప్రతీదానికి డబ్బు, డబ్బు, డబ్బు అని డబ్బు విలువ పెరిగిందే తప్ప మానవత్వం విలువ పెరగలేదని మీకు మనవిచేస్తున్నాను.

గతంలో ఏడు సంవత్సరాలు మేము పరిపాలన చేసిన కాలంలో రెండు రూపాయలకు కిలో బియ్యం ఇస్తే మేము బ్రతుకుతామని ప్రజలు అడిగారు తప్ప మద్యపానాన్ని నిషేధించాలని అడగలేదు. ఒకవేళ ప్రజలు అడిగివుంటే ఆనాడే మద్యపానంపై నిషేధాన్ని విధించి ఉండేవాడినని మనవిచేస్తున్నాను. ఇటీవల ఏవిధంగా మద్యపాన నిషేధానికి ఆడపిల్లలు ఉద్యమించారో మీకు తెలుసు. అయితే వారిపై, లాఠీఛార్జ్ చేశారు. వారిపై కేసులు పెట్టారు. వారిని జైళ్లలో పెట్టారు. కానీ మా చెల్లెళ్లుగానీ, ఆడబిడ్డలుగానీ, తల్లులుగానీ ఏమీ జంకలేదు. ఈనాడు సమాజంలో 51 శాతంగా ఉన్న మహిళలు మద్యపాన నిషేధం కావాలని అడిగారు. ఏదో కేవలం పేద కుటుంబాలకు చెందినవారే ఇలా అడిగారని అనే వీలు లేదు. డబ్బున్న సోదరీ మణులు కూడా అలా కోరారు.

కాబట్టి ప్రజాస్వామ్యబద్ధంగా దానిని ఆచరించడం మా ధర్మంగా భావించడం జరిగిందని కూడా మనవిచేస్తున్నాను. కాబట్టి తెలుగుదేశం అధికారంలోకి వస్తే మూడు సిద్ధాంతాల గురించి మాత్రం చెప్పాను. అందులో మొదటిది రెండు రూపాయలకు కిలో బియ్యం, రెండవది మద్యపాన నిషేధం. మద్యపాన నిషేధాన్ని అమలుచేస్తామన్నాం కాబట్టి అలా చేయడం మా ధర్మం, ఇది ప్రజలకిచ్చిన మాట. దీనివల్ల ఇంత ఆదాయం పోతుంది. అంతపోతోంది అని అనుకొనడానికి వీలులేదు. మేము ఆ విధంగా ప్రజలకు మాట ఇచ్చాం. ప్రజలు మాకు ఓట్లు ఇచ్చారు కాబట్టి ఏదిఏమైనా మద్యపాన నిషేధాన్ని అమలు చేయవలసిందే, లేకుంటే పరిపాలన చేయడానికి మాకు హక్కు లేదు. అందుకే వెంటనే దానిని అమలు చేయడం జరిగిందని మనవిచేస్తున్నాను. అదే విధంగా గౌరవనీయులు మొరార్జీ దేశాయ్‌గారు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆ రాష్ట్రంలో మద్యపాన నిషేధాన్ని విధిస్తే, మద్యపాన నిషేధం వల్ల ప్రభుత్వం కోల్పోయిన ఆదాయంలో 50 శాతం నిధిని కేంద్రం నుండి ఇచ్చారు.

ఆ విధంగా నేను వారికి ఉత్తరం కూడా వ్రాశాను. అయ్యా, ఇది మాకోసం కాదు. ఇది మా పార్టీ విధానం అని కాదు. ఇది పేద ప్రజలకోసం. పేద ప్రజలకు మేము ఇచ్చిన మాటను నిలబెట్టుకొంటున్నాం. ఇదివరకు మీరు ఇచ్చిన సాంప్రదాయం కూడా ఉంది. కోల్పోయిన

ఆదాయంలో మీరు 50 శాతం ఇచ్చారు, ఇది సమాజం కోసం చేసిన పని కాబట్టి నూటికి నూరుపాళ్లు ఇవ్వమని కూడా చెప్పాము. పోనీ నూటికి నూరు శాతం కాకపోయినా, గతంలో గుజరాత్‌కు ఇచ్చినట్టు మేము కోల్పోయే ఆదాయంలో 50 శాతం అయినా ఇవ్వండి, ఇదివరకు ఉన్న సంప్రదాయాన్ని గౌరవించండి. మీరే ఆంధ్రదేశాన్ని ముందుకు నడిపించండి అని చెప్పాం. మంచి పనులు మీరు చెప్పండి. మేము చేస్తాం, ముఖ్యమంత్రిగా నేను ఏదో పెద్ద అంతస్తులు కావాలని కోరడం లేదు. జాతి వికాసాన్ని కోరుతున్నాను. మీరు మాకు సహాయం చేయాలని వారిని అర్థించడం జరిగిందని కూడా మీకు సవినయంగా మనవిచేస్తున్నాను.

మరోసారి ఇప్పుడు వారికి ఉత్తరం వ్రాస్తాను. రేపు 30వ తేదీనాడు గాంధీ వర్ధంతి సందర్భంగా వారిని ఆహ్వానించాను. మీరు గౌరవంతో కూడిన వ్యక్తులు. మిమ్మల్ని గౌరవించడం, ఆహ్వానించడం మా ధర్మంగా భావించాము, కాబట్టి 30వ తారీఖున మీరు రండి అని వారిని ఆహ్వానించడం జరిగిందని కూడా సవినయంగా మనవిచేస్తున్నాను. ఎందుకంటే ఈ విషయాలు అందరికీ సంబంధించినవి. రెండు రూపాయలకు కిలో బియ్యం పథకం అందరిదీ. ఇందులో కుల, మత, వర్గ, వర్ణ భేదం ఏమీ లేదు. ఇది పేదవారికోసం, వారు భోంచేస్తారు. అలాగే మద్యపాన నిషేధం అందరూ అనుసరించవలసిన విధానం. ఇందులో రెండో అభిప్రాయానికి తావులేదు. ఇది నూటికి నూరుపాళ్లూ సమాజానికి సంబంధించినటువంటిది కాదు. కాబట్టి మీరు మా ఆహ్వానాన్ని మన్నించండి. మిమ్ముల్ని ఆహ్వానిస్తున్నారని చెప్పడం జరిగింది. నేను ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత వారిని కోరడం జరిగింది. వారు వస్తానంటే తెలియచేస్తాను, నేను మాత్రం వారిని ఆహ్వానించడం జరిగిందని మనవిచేస్తున్నాను. ఇక ఎంతో ఆదాయాన్ని కోల్పోయి ఈ విధమైన నిర్ణయాలు తీసుకోవడం జరిగింది.

కాబట్టి ఎవరైనా దీనిని ఉల్లంఘించినట్లయితే తీవ్రమైన శిక్ష విధించబడుతుందని మనవిచేస్తున్నాను. ఎందుకంటే ప్రజల హితవు కోసం మేము రెండు వేల కోట్ల రూపాయల ఆదాయాన్ని కోల్పోయాం కాబట్టి, ఎవరైనా ఈ విధానానికి ద్రోహం చేసినట్లయితే తీవ్రమైన శిక్షను అనుభవించవలసి ఉంటుంది. అధికారులు, ఉద్యోగులు దీనిని ఉల్లంఘిస్తే వారి ఉద్యోగాలు పోతాయి. సామాన్య మానవులు పూర్తి శిక్షను అనుభవించవలసి ఉంటుందని కూడా మనవిచేస్తున్నాను. ఇక రైతుల విషయానికి వస్తే అహర్నిశలు రెక్కలు ముక్కలు చేసుకొని దేశానికింత కూడుపెట్టే అన్నదాత రైతు మనం ఎంత కోటీశ్వరులమైనా, ఎన్ని అంతస్తులు ఉన్నా ఐశ్వర్యాలు ఉన్నా తినడానికి ఆహారం మీదే ఆధారపడాలి. రైతులు మనకు తిండిని సమకూరుస్తున్నారు. కాబట్టి రైతుల సంక్షేమం కోసం పాటుపడవలసిన బాధ్యత ప్రభుత్వానిది– మేము ఎన్నికల సందర్భంలో మూడు మాటలు మాత్రం చెప్పాం. రైతులకు సంక్షేమం కలిగిస్తామని, సంవత్సరానికి ఒక రైతుకు సాగుకు విద్యుచ్ఛక్తి ఒక హార్సు పవర్ రూ. 50 కే ఇస్తామని చెప్పాము.

వారి సంవృద్ధి కోసం, సంక్షేమం కోసం 50 రూపాయలకే సప్లయి చేయడం జరుగుతుందని మరొక్కసారి నేను సవినయంగా మనవి చేస్తున్నాను. అదే విధంగా, కేవలం ఒక్క విద్యుచ్ఛక్తి వల్ల సంక్షేమం జరగదు. ప్రభుత్వ పరంగా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేయవలసిన అవసరం ఉన్నది. అదే విధంగా మనకు ఎన్నో ఇరిగేషన్ ప్రాజెక్టులు ఉన్నాయి. బచావత్ అవార్డు ప్రకారం మనకు రెండు వేల సంవత్సరం వరకు అవకాశం ఉన్నది. మన సంక్షేమ కార్యక్రమాలన్ని రెండువేల సంవత్సరం తోటే పూర్తి చేసుకోలేము.

కాబట్టి, దీన్ని ఏ విధంగానైనా సరే. రెండువేల సంవత్సరం లోపల పూర్తి చేసుకోవలసి ఉన్నది. తెలుగుగంగ ఆ రోజు 620 కోట్ల అంచనాతో ప్రారంభించాము. అది ఇప్పుడు 1960 కోట్లు అయింది. అదే, గాలేరు నగరికి 14 కోట్లు: హంద్రీ-నీవాకు 14 కోట్లు: అలాగే జూరాల, భీమా ఉన్నాయి. వంశధార ఉన్నది. ఒరిస్సా ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపాము. బిజూపట్నాయక్‌తో ఒక అవగాహనకు వచ్చాము. రెండవ దశకు సంబంధించి సంతకాలు కూడా చేయడం జరిగింది. మనం నిర్మించుకోవాలి. దాని విషయం కూడా గుర్తించుకోవాలని మనవిచేస్తున్నాను. అదే విధంగా పులిచింతల ఎవరికీ నష్టం లేని ప్రాజెక్టు - వృధాగా నీరు సముద్రానికి పోయే దాన్ని అడ్డుకట్ట వేసుకుని మిగిలిన ప్రాంతాలలో వాడుకుంటూ, క్రింద కేవలం కృష్ణా డెల్టా మిగిలిన గుంటూరు డెల్టాకు నీరు వాడుకోవచ్చు. ఆ భావంతో వృధా పోయే దానికి కాకుండా పులిచింతల నిర్మాణానికి ఏర్పాట్లు చేయబడ్డాయి అని మీ అందరికీ తెలుసు. ఇవన్నీ కూడా నిర్మించుకోవడానికి రెండు వేల సంవత్సరం వరకు అవకాశం ఉన్నది.

ఇప్పుడు ఏది ఉన్నది? 1989వ సంవత్సరంలో ఇంకో పార్టీ వారు అధికారంలోకి వచ్చారు. ఐదు సంవత్సరాలలో ఏమి చేశారు అడగడంలో తప్పు లేదు. మేము చేసింది చూడండి. మీరు చేసింది మాకు చెప్పండి. 5 సంవత్సరాల కాలం దాటిపోయింది. ఇప్పుడు నిండుగా 5 సంవత్సరాలు ఉన్నాయి. ఇన్ని పాజెక్టులు పూర్తి చేసుకోవాలంటే ఎంత డబ్బు అవుతోందో దయచేసి ఆలోచించాలని సవినయంగా మనవిచేస్తున్నాను. ప్రజలకు కూడా మనవిచేస్తున్నాను. ఇది ఇస్తాము. అది ఇస్తామని కాదు. ఎంత భారము ఉన్నది, ఇన్ని నిర్మించి తయారుచేసుకోవడానికి, వీటికి రూపకల్పన చేయడానికి ఎంత డబ్బు అవుతుందనేది దయచేసి ప్రజలు అవగాహన చేసుకోవలసి ఉన్నదని సవినయముగా వారికి మనవిచేస్తున్నాను. ఎస్.ఎల్.బి.సి జంటనగరాలకు నీటి సప్లయి ఉన్నది. శ్రీశైలం విషయంలో గత ప్రభుత్వకాలంలో 18 టి.ఎం.సి.లు మాత్రమే వ్యవసాయానికి ఇస్తామని నిర్ణయం తీసుకున్నారు. అది కాదు. 30 టి.ఎం.సి.లు ఇస్తున్నామని 1989కి ముందు దానికి రూపకల్పన కూడా చేయడం జరిగింది. నిన్న నిర్ణయించాము. ఎంతవరకు దీనిని ప్లాను చేసుకోవడం జరిగింది? ఎస్.ఎల్.బి.సి విషయంలో 30 టి.ఎం.సి.ల వాటర్ రైతాంగానికి ఇవ్వవలసిందే.

అదే విధంగా జంటనగరాలకు ప్రత్యేకంగా నీరు కల్పించవలసిందే. ఈ రెండు కూడా దానిలో ఆధారపడి ఉన్నాయి. అక్కంపల్లి రిజర్వాయర్ మేము నిర్మించాలని శంకుస్థాపన కూడా చేయడం జరిగింది. కాబట్టి, ఏవిధంగానైనాసరే, తెలుగుదేశం ప్రభుత్వం ముందు అనుకున్న విధంగా జరగాలి. రైతులకు, ప్రజలకు అన్యాయం చేయడం మాత్రము ఏ విధంగా కూడా జరగదని మనవిచేస్తున్నాను. ఆ యొక్క విధానాన్ని 1989లో ఏది అయితే నిర్ణయించామో – ముందు అపోజిషన్ పార్టీ వారు అందరూ కూడా ఆనాడు నిర్ణయించుకున్నాము. ఏ విధంగా, టన్నెల్ గురించి ఒప్పుకుని, లిఫ్టు ఇరిగేషన్ ద్వారా తాత్కాలికంగా నీరు సప్లయి చేయాలనుకున్నామో అదే విధంగా నిర్ణయించడం జరిగింది. ఆ నిర్ణయం మంచిది కాదనే భావంతో పాత నిర్ణయాన్ని అంగీకరించడం జరిగిందని అందరికీ సవినయంగా మనవిచేస్తున్నాను.

అధ్యక్షా, మా ప్రభుత్వం చేసిన విధానాలను మేము చెబుతున్నాము. తరువాత వారు ఇష్టం వచ్చిన మాట మాట్లాడవచ్చు. మా విధానాలు ఇవి. విద్యుచ్ఛక్తి విషయంలో కూడా చాలా ప్రాముఖ్యత ఉన్నది. ఈనాడు పారిశ్రామిక విధానంగా మన రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే విద్యుచ్ఛక్తి అభివృద్ధి చేసుకోవడం చాలా అవసరం. కాబట్టి రాష్ట్ర అభివృద్ధిని చాలా ముఖ్యంగా భావించడం జరిగిందని కూడా మీకు సవినయంగా మనవిచేస్తున్నాను. ఈనాడు ఎంత డిమాండ్ ఉన్నది – పారిశ్రామికంగా మన రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నది విజ్ఞులు గమనించిన సత్యం. కాబట్టి ఏ విధంగా అయినా సరే త్వరితగతిలో మన రాష్ట్రాన్ని పారిశ్రామికీకరణంగా అభివృద్ధి చేసుకోవడం అతి ముఖ్యమన్న విషయం ప్రభుత్వం భావించిందని నేను సవినయంగా మనవిచేస్తున్నాను. ఇదే విషయంలో ఒకటి మనవిచేస్తున్నాను. ఇప్పుడు అంతా కూడా అన్ని విధాల కూడా ప్రభుత్వమే నిర్ణయించాలి. ప్రభుత్వమే నిర్వహించాలి. ప్రభుత్వమే జరపాలంటే కూడా కష్టంగా ఉంటుందని కూడా భావించడం జరిగింది. రాష్ట్రం అభివృద్ధి చెందానికి ప్రైవేటైజేషన్ కూడా ఒక మార్గమే. ప్రభుత్వం వ్యాపారరంగం కాదు. ప్రభుత్వం సంక్షేమ రంగం.

కాబట్టి పూర్తిగా సంక్షేమానికి వినియోగపడడం, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పడడం అనేది ధ్యేయంగా భావించడం జరిగిందని కూడా సవినయంగా మనవిచేస్తున్నాను. ప్రభుత్వ విధానంలో రైతాంగానికి సంవత్సరానికి 50 రూపాయలకు ఒక హార్స్ పవర్ విద్యుచ్ఛక్తి ఇస్తామని హామీ ఇవ్వడం మా బాధ్యత. సంక్షేమ కార్యక్రమాలన్నింటినీ కూడా అమలుచేయడానికి ప్రభుత్వం బాధ్యత వహిస్తుంది. ఏవైతే ప్రజా సంక్షేమానికి కార్యక్రమాలు ప్రభుత్వం ఉద్దేశించినదో వాటన్నింటినీ ప్రభుత్వమే నిర్వహిస్తుంది. ఎవ్వరికి కూడా ఇవ్వడం జరగదు. ఏ విధమైన అవకతవకలు కానీ, మోసాలు కానీ జరిగితే అంగీకరించము అని మీకు సవినయంగా మనవిచేస్తున్నాను. ముఖ్యంగా ప్రజారంగ సంస్థల విషయంలో అందరికీ తెలిసిన విషయమే. కార్పొరేషన్లు ఎన్ని ఉన్నాయి. ఎన్ని లాభసాటిగా నడుస్తున్నాయి. కేవలం ఐ.ఎ.ఎస్ ఆఫీసర్లు

ఎం.డి లుగా ఉన్నా కూడా మన ఇష్టం వచ్చిన వాళ్ళను ఛైర్మన్‌లుగా ఏర్పాటుచేసుకుంటున్నాము. ఆ రంగాలు ఎన్ని నష్టాలలో ఉన్నవి మనందరికీ తెలుసు. ప్రభుత్వం అన్నది వ్యాపార సంస్థ కాదు. కేవలం సేవా సంస్థ అన్న భావంతోనే ప్రభుత్వానికి నష్టం కలిగిస్తున్న పబ్లిక్ సెక్టార్స్‌ను పూర్తిగా ప్రజలకు అప్పగించాలి. ప్రజలే నిర్వహించేటట్లు చక్కగా రాష్ట్రాభివృద్ధి జరిగేటట్లు చూడాలన్నది ప్రభుత్వ ధ్యేయమని మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను.

రాష్ట్రాభివృద్ధి జరగడానికి రోడ్లు, బ్రిడ్జిలు నిర్మించుకోవడం చాలా అవసరం. ఈనాడు రోడ్ల పరిస్థితి మనం చూస్తున్నాం. రోడ్లు ఏ విధంగా కూడా అనువుగా ప్రయాణం చేయడానికి వీలుగా లేని స్థితిలో ఉన్నాయి. బ్రిడ్జెస్ దగ్గర ప్రమాదం జరిగితే అక్కడ ఆ బ్రిడ్జెస్ పరిస్థితి చూస్తే బ్రిడ్జెస్ వాసాలు, బొంగుల ఆధారంలో ఉన్నాయి. అది ఎంత హీనమైనదో ఆలోచించాలి. మనకు తగిన విధంగా ఈ రోడ్లు, బ్రిడ్జిలు నిర్మించుకోవడం చాలా అవసరం. ఏ విధంగా అయినా మన రాష్ట్రం అభివృద్ధి కావాలంటే వ్యాపారాత్మకంగా మనం అభివృద్ధి చెందాలంటే వీటి విషయం ఒకే ధ్యేయంగా ఆలోచించాలనేదే ప్రభుత్వ విధానంగా నేను మీకు మనవిచేస్తున్నాను. వీటన్నింటికీ కూడా ప్రభుత్వం డబ్బు పెడుతుందా అంటే డబ్బు పెట్టడం కాదు, నిర్మించడం, నిర్మాణాత్మకంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పరచడం మా ధ్యేయం. ఈనాడు సామాన్యమైన రైతులు కానీ, సామాన్యమైన మానవుడు కానీ, సైకిల్ మీద వెళ్లే వాళ్లు కానీ, రిక్షా మీద వెళ్ళే వాళ్ళు కానీ రోడ్ల మీద ప్రయాణం చేస్తున్నారు. వసతులు అనుభవిస్తున్నారు. అభివృద్ధి కర దేశాలన్నీ కూడా టోల్‌టాక్స్ కడుతున్నాయి. దీనిలో తప్పు లేదు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాలంటే ఆ వసతులు వాడుకుంటున్న వాళ్లందరూ. కూడా ఈ విషయాలలో నిర్మాణాత్మకంగా సహాయపడడం, భాగస్వామ్యులు కావడం ధ్యేయమని నేను మీకు సవినయంగా మనవిచేస్తున్నాను.

**హైదరాబాద్ ప్రాశస్త్యం అందరికీ తెలుసు. గత ప్రభుత్వ కాలంలో అభివృద్ధి చెందిందో లేదో తరువాత చూద్దాము. ఈనాడు దాని స్థల ప్రాముఖ్యత ఎంత ఉన్నదో దానిని బట్టి మనం ఏ విధంగా అభివృద్ధి పరచాలి అనేది గమనించాలి. సరైన సౌకర్యాలు - విద్యుచ్ఛక్తి కానీ, వాటర్ కానీ, మిగతా విషయాలలో కానీ వసతులు కల్పిస్తే ఎంత మంది వ్యాపారస్తులు రావడానికి సిద్ధంగా ఉన్నారో అందరికీ తెలుసు.**

ముఖ్యంగా హైదరాబాద్ నగరాన్ని మెగా సిటీగా చేయాలని కూడా నిర్ణయించడం జరిగిందని నేను సవినయంగా మనవిచేస్తున్నాను. హైదరాబాద్ ప్రాశస్త్యం అందరికీ తెలుసు. గత ప్రభుత్వ కాలంలో అభివృద్ధి చెందిందో లేదో తరువాత చూద్దాము. ఈనాడు దాని స్థల ప్రాముఖ్యత ఎంత ఉన్నదో దానిని బట్టి మనం ఏ విధంగా అభివృద్ధి పరచాలి అనేది గమనించాలి. సరైన సౌకర్యాలు – విద్యుచ్ఛక్తి కానీ, వాటర్ కానీ, మిగతా విషయాలలో కానీ వసతులు కల్పిస్తే ఎంత మంది వ్యాపారస్తులు రావడానికి సిద్ధంగా ఉన్నారో అందరికీ తెలుసు. ఎంతోమంది మేము వస్తాము

అని అడుగుతున్నది కూడా నాకు తెలుసు. కాబట్టి పట్టణ అభివృద్ధి కోసం దీనిని మెగాసిటీ చేయడం మంచిదని భావించడం జరిగిందని సవినయంగా మనవిచేస్తున్నాను. అతి త్వరలోనే దీని విషయంలో కూడా సరైన నిర్ణయం తీసుకుని సమగ్రంగా నిర్మాణం చేయడం జరుగుతుందని కూడా సవినయంగా తెలియచేస్తున్నాను. ఇదే విషయంలో చుట్టూ ఉన్న మునిసిపాలిటీలను సమీకరించి, ఒకే పట్టణంగా చేసి, ఎంతో ప్రాముఖ్యత గల పట్టణంగా దీనిని అభివృద్ధి చెయ్యాలనేది ప్రభుత్వ సిద్ధాంతంగా, ప్రభుత్వ ధ్యేయంగా. నమ్మకంగా సవినయంగా మనవిచేస్తున్నాను. హుస్సేన్‌సాగర్ అభివృద్ధి ఏ విధంగా ఉంది. ఎట్లా మొదలు పెట్టాము, ఈనాడు ఎట్లా ఉంది అన్నది దయచేసి చూసిన వారికెవరికైనా తెలుస్తుంది. హుస్సేన్‌సాగర్ ఎట్లా పాడుపెట్టబడిందో మీకు తెలుసు.

కాబట్టి, దానిని పునఃనిర్మించాలి, అది శోభాయమానం కావాలంటే హుస్సేన్‌సాగర్ ఎంతో ప్రాముఖ్యత గల జలపాతంగా గమనించాలని సవినయంగా మనవిచేస్తున్నాను. అదే విధంగా ప్రజలు ఆశించే విధంగా మనకు గౌరవం సంతరించే విధంగా తయారుచేయడమే ధ్యేయంగా మనవిచేస్తున్నాను. ఇదివరకు తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడు ఎన్నో కార్యక్రమాలు రూపొందించింది. కానీ ఇంతవరకూ ఏమీ చెయ్యలేదు. అట్లాగే పాడు పెట్టబడింది అని మరొకసారి సవినయంగా మనవిచేస్తున్నాను. బుద్ధ విగ్రహం సరిగ్గా ఆవిష్కరించబడలేదు. ఎలక్ట్రిఫికేషన్ జరగలేదు. మ్యూజికల్ ఫౌంటెన్ పెట్టాలని అనుకున్నాము. అదీ జరగలేదు. అభివృద్ధి, చెయ్యాలి. సంస్కరించాలి. పిల్లలందరూ రావడానికి అమ్యూజ్‌మెంట్ పార్క్ నిర్మించాలి. అందరూ సాయంకాలం ఆనందంగా కాలక్షేపం చేసే విధంగా అవకాశం కల్పించాలి. ఆ విధంగా చెయ్యడానికి తెలుగుదేశం ప్రభుత్వం పూర్తిగా సిద్ధమైందని సవినయంగా మనవిచేస్తున్నాను. మనో సామాజిక జీవితానికి, నాగరికతకు, అభ్యున్నతికి, మన వికాసానికి విద్య ఎంత ముఖ్యమో మీకు తెలిసిందే కాబట్టి ఈ విద్య ఏ విధంగా ఉందో మేము గుర్తు చేసుకున్నాము.

ఏ విధంగా ఉందంటే సుమారు 37 శాతం ప్రజలు మాత్రమే విద్యాధికులుగా ఉన్నారు. మిగతా వాళ్ళకు విద్య రావడం లేదు అంటే ఏ విధంగా సమాజం ఉందో, ఏ విధంగా మెరుగుచేయాలో అనేది ఒక్కసారి ఆలోచించాలని సవినయంగా మనవిచేస్తున్నాను. ప్రాథమిక విద్య - 10వ తరగతి వరకూ పూర్తిగా ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ప్రభుత్వమే తప్పనిసరిగా బాధ్యత తీసుకోవాలి దానికి అవసరమైన కార్యక్రమం చేపట్టడానికి ప్రభుత్వం సిద్దంగా ఉంది. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు బిడ్డల సంక్షేమం చూడాలి, వారు చక్కగా మేము స్కూల్‌కి వెళ్లాలనే భావన వారికి వచ్చేలా చెయ్యాలి. 6, 7 తరగతులలో ఏ విధంగా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనేది వారు గుర్తించాలి. ఏ విధంగా తగిన పౌరులుగా గుర్తించబడాలి అనేది ఉండాలి. అందుకు తగిన విజ్ఞానాన్ని వారికి ప్రసాదించాలి. అలాగే 8, 9, 10వ తరగతులలో

వృత్తి విద్యను నేర్పాలి. కనీసం ఆ విద్యతో బ్రతకడానికి కావలసిన అవకాశాన్ని వారికి కల్పించాలి. ఈ విషయంలో పూర్తిగా ప్రభుత్వం శ్రద్ధవహిస్తుంది. ప్రాథమిక విద్య వరకూ పిల్లలను ఎడ్యుకేట్ చెయ్యడానికి ప్రభుత్వం బాధ్యతవహిస్తుంది. త్వరితగతిన దీని విషయంలో ఒక కార్యక్రమాన్ని నిర్ధేశిస్తాము. పిల్లలందరూ కూడా చదువుకోడానికి అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సవినయంగా మనవిచేస్తున్నాను. ఉన్నత విద్య విషయంలో మన రాష్ట్రంలో, మన సమాజంలో ఎట్లా జరుగుతోందో తెలిసిందే విద్య వ్యాపారంగా తయారైంది. ఈ రోజు కేవలం ప్రైవేట్ కాలేజీలు చాలా వచ్చాయి. అందరూ కూడా బాగా విద్య నేర్పుతున్నారనే భావన ప్రజలందరి మనసులలో ఉంది. మనలో మనం మాత్రం కేవలం ఈ అసెంబ్లీలో కూర్చుని మాట్లాడవద్దు. ప్రపంచాన్ని ఒక్కసారి చూడాలి. ప్రైవేట్ కాలేజీల ద్వారా అందరూ కూడా విద్యను అభ్యసించగలుగుతున్నారు. ఎందుకు ఆ విధంగా చేస్తున్నారు? ఏ విధంగా మన ప్రభుత్వరంగ సంస్థలు సరైన విధంగా ఎదగలేక పోతున్నాయి? ఈ విషయం అందరూ ఆలోచించాలి. అందుకే గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కోఆపరేటివ్ కాలేజీలు పెట్టాలని నిర్ణయించాము.

తల్లిదండ్రులకు పూర్తిగా అవకాశం ఇవ్వాలి. వారే తమ బిడ్డలను సరిచేసుకోవాలి. గతంలో తప్పు జరిగింది. ఈ కోఆపరేటివ్ కాలేజెస్ కుటుంబ కాలేజీలు కావు. రియల్ కాలేజెస్. స్టూడెంట్స్ ఎవరైతే చదువుకుంటారో, వారి తల్లిదండ్రులే ఆ కాలేజీలో మెంబర్స్‌గా ఉండి, తగిన విధంగా శిక్షణ ఇచ్చే విధంగా వారికే అప్పగించాలనేది విధానం. కాలేజీ విద్యార్థుల తల్లిదండ్రులకు మనం తప్పనిసరిగా బాధ్యతనప్పగించాలి. ఆ విధంగా ఉండాలనేది ప్రభుత్వం యొక్క అవగాహన, కానీ కేవలం ఎవరో గుత్తాధికారులకు ఇచ్చి, వాళ్ళెవరో నిర్వహించి, విద్యను నాశనం చేసే విధంగా ప్రవర్తించడానికి వీలుపడదు, పడరాదు అనేది మా నిర్ణయంగా మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను. ఆ విద్యలో కూడా మన ఎస్.సి, ఎస్.టి., బి.సి. ఇ.బి.సి.లకు తగిన విధంగా అవకాశం ఇవ్వబడుతుంది. రిజర్వేషన్స్ మామూలుగా ఇవ్వాల్సిందే. వారికి రక్షణ ఇవ్వాలి. వారికి తగిన ప్రాధాన్యత ఇచ్చి, పూర్తిగా వారికి అవకాశం ఇచ్చి, వారికి కూడా సరైన భవిష్యత్తు నిర్ణయించే విధానం వారికి ఇవ్వబడుతుందని సవినయంగా మనవిచేస్తున్నాను.

ఇక ఆరోగ్యానికి వస్తే, ఉన్న స్థితి ఏమీ బాగాలేదన్నది అందరికీ తెలిసిందే. పట్టణాలలో కానీ, ఎక్కడైనా కానీ ప్రభుత్వ వైద్యశాలలు ఏ విధంగా పనిచేస్తున్నాయో తెలుసు. ఆరోగ్యం విషయంలో ప్రభుత్వం మండల పరిధిలో పటిష్టమైన ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటుచేసి పల్లె పల్లెకీ సంచార వైద్యశాలలు కల్పించాలనే ఆలోచన ఉంది. అదే విధంగా పట్టణాలలో తగిన విధంగా మంచి అంతస్తులో ఇక్కడ గల వైద్యశాలలను అభివృద్ధి చెయ్యాలని నిర్ణయం తీసుకుంటుందని కూడా సవినయంగా మనవిచేస్తున్నాను. 'నిమ్స్", స్విమ్స్' అనే రెండు వైద్యశాలలను ఏర్పాటుచేశాము.

విజయవాడలో 'విమ్స్' – విజయవాడ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ ఏర్పాటు చెయ్యాలని చూస్తున్నాము. పూర్తిగా ఆధునీకరణతో కూడిన వైద్య విధానాన్ని ప్రజలకు ఇవ్వాలనే ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్నాము. మూడు ప్రాంతాలలో మూడు ముఖ్యమైన వైద్యశాలలు ఉండాలని. సరైన వైద్యా ప్రదానం జరగాలనే ఆలోచనతో ప్రభుత్వం ఈ ఆలోచన చేసింది.

**శాంతి భద్రతలు:** శాంతిభద్రతలు ఏ విధంగా ఉన్నాయో ఒకసారి ఆలోచిస్తే – శాంతియుత మానవ సమాజం ఉందా లేదా అన్నది మనం చూస్తున్నాము. మన కళ్ల ముందే జరుగుతోంది. సరైన అధికారం, పటిష్టమైన విధానం లేక, ఎంతమంది ఏ విధంగా బాధపడుతున్నారో, అంతమంది ఎన్ని బాధలకు లోనవుతున్నారో మనం నిత్యం గమనించే విషయాలని మనవిచేస్తున్నాను. పూర్తిగా రక్షణ ఇస్తామని అందరికీ హామీ ఇస్తున్నాను. ప్రభుత్వం తప్పకుండా తీవ్రమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఎంత పెద్దవారైనా సరే న్యాయస్థానం నుంచి కానీ న్యాయ విధానం నుంచి కానీ, ఈ శిక్ష నుంచి తపించుకోలేదని సవినయంగా మనవిచేస్తున్నాను.

**మతా కక్షలను నివారించాలి. బాంబులు, మారణాయుధాలను దూరం చెయ్యాలి. దానికోసం పూర్తిగా అక్కడ గల విధానాన్ని మరచి, సరైన శాంతియుతమైన జీవనంలో విద్య ప్రదానం చెయ్యడం జరగాలి. వారు వెనుకబడి ఉన్నారు. ఇది మంచిది కాదు. సోదర భావంతో ఉండాలి, సమాజాన్ని అభివృద్ధి చెయ్యాలి అనే పద్ధతిలో ముందుకు నడవాలనే భావంతో విద్యను ఎవరైతే వెనుకబడి ఉన్నారో, వారికి ప్రసాదించాలని నిర్ణయించడం జరిగింది.**

మైనారిటీల సమస్యల విషయంలో పూర్తిగా ప్రభుత్వం బాధ్యత వహిస్తుంది. ముందే మనవిచేశాను. ఎన్నోసార్లు చెప్పాను. మీరు మా తమ్ముళ్లు. అన్నదమ్ములం అందరం కూడా ఒక ఉద్యానవనంలో పిట్టలుగా ఉన్నాం. సారే జహాసె అచ్ఛా, హిందూ సితా హమారా. హం బుల్ బులేహై ఇస్‌కే'– ఇదే విధానంలో మిమ్మల్ని అందరినీ చూడడం జరుగుతుంది. బేధభావంతో చూడడం జరగదు అని సవినయంగా మనవిచేస్తున్నాను. తెలుగుదేశ ప్రభుత్వ కాలంలో ఏం చేశామో మీకు తెలుసు. ప్రత్యేకంగా మైనారిటీ కార్పొరేషన్ ఏర్పాటుచేసింది. మేము వక్ఫ్ స్థలాల విషయంలో సరైన వివరాలు సేకరించి 25 లక్షలు ప్రభుత్వం అంగీకరించి ఏర్పాటుచేసిందని మీకు తెలుసు. అదే విధంగా 20 లక్షల రూపాయలు ప్రత్యేకంగా అక్కడ గల పాత కట్టడాల మరమ్మతు కోసం ఏర్పాటుచేయడం జరిగింది. అన్ని విషయాలలోనూ మీకు పరిరక్షణ చేయడం జరుగుతుందని ముస్లిం సోదరులకు మనవిచేస్తున్నాను. మత కలహాలు మాత్రం రాకుండా చూడాలని ప్రభుత్వ నిర్ణయం, ప్రభుత్వ విధానం, ప్రభుత్వ ధ్యేయం.

అదే పద్ధతిలో ప్రజలు ప్రశాంత జీవనం చెయ్యాలి. వారు ఆనందంగా ఉండాలి ఏ విధమైన కుల, మత విద్వేషాలకు లోనుకాకుండా, మానవతా సమాజాన్ని సృష్టించాలని సవినయంగా మనవిచేస్తున్నాను. అదే మా లక్ష్యం. ముఖ్యంగా రాయలసీమ విషయంలో కూడా ప్రభుత్వ

విధానాన్ని ప్రస్తావిస్తున్నాను. ముఠా కక్షలను నివారించాలి. బాంబులు, మారణాయుధాలను దూరం చెయ్యాలి. దానికోసం పూర్తిగా అక్కడ గల విధానాన్ని మరచి, సరైన శాంతియుతమైన జీవనంలో విద్య ప్రదానం చెయ్యడం జరగాలి. వారు వెనుకబడి ఉన్నారు. ఇది మంచిది కాదు. సోదర భావంతో ఉండాలి, సమాజాన్ని అభివృద్ధి చెయ్యాలి అనే పద్ధతిలో ముందుకు నడవాలనే భావంతో విద్యను ఎవరైతే వెనుకబడి ఉన్నారో, వారికి ప్రసాదించాలని నిర్ణయించడం జరిగిందని నేను సవినయంగా మనవిచేస్తున్నాను. రెండు రెసిడెన్షియల్ కళాశాలలను ఒక్కొక్క దానిలో 2 వేల మంది పిల్లలకు తక్కువ లేకుండా పెడతాము. ఒకటి కర్నూలులో, మరొకటి అనంతపూర్‌లో ఏర్పాటు చెయ్యాలనే ఆలోచన కూడా ఉందని సవినయంగా మనవిచేస్తున్నాను. శాంతియుతమైన సమాజాన్ని సృష్టించుకోవాలనే పద్ధతిలో బ్రతకాలి. మనకు వచ్చిన స్వాతంత్ర్యానికి సరైన అర్థం చెప్పగలిగి ఉండాలనే విధంగా ప్రజలు జ్ఞానవంతులు కావాలి. అది పిల్లల నుంచి ఆవిర్భవించాలనే పద్ధతిలో రెండు రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఏర్పాటు చెయ్యడానికి ప్రభుత్వం నిర్ణయించింది. సమాజంలో విజ్ఞతతో కూడినటువంటి ఆదర్శ విధానాన్ని సృష్టించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని సవినయంగా మనవిచేస్తున్నాను.

తెలంగాణలో తెలంగాణ సోదరులకు మీద్వారా తెలియచేస్తున్నాను. అక్కడ భూసంస్కరణలు కావాలి. ఇదివరకు గల పెద్ద కామందులు దూరంగా వెళ్లారు కానీ వారు భూములను ప్రజలకు పంచిపెట్టలేదు. ఎన్నో మూవ్‌మెంట్స్‌ను చూస్తున్నాము. సంచలనాత్మకమైన విధానాలు చూస్తున్నాము. వాటిని అన్నింటినీ అరికట్టాలి అంటే సరైన విధంగా భూ సంస్కరణలు అమలుచెయ్యాలి. ఎవరి వద్ద మిగులు భూములున్నాయో, వాటిని తీసుకుని పేదలకు పంచే ప్రయత్నం చెయ్యాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందని సవినయంగా మనవిచేస్తున్నాను.

నిరుద్యోగ యువకులకు పని కల్పించాలి. పని అంటే కాంట్రాక్టర్ల చేతికి మన రాష్ట్రాన్ని పెట్టకుండా, ఎవరైతే నిరుద్యోగ యువకులున్నారో వారికి పని ఇవ్వండి. పని ఇచ్చి ఆదరువు ఇవ్వాలనే వారు కోరేది. ఎట్లాగైనా మనిషిగా బ్రతకాలని వారనుకుంటున్నారు. కనుక పటిష్టమైన జీవన విధానాన్ని కల్పించడంలో కూడా ప్రభుత్వ విధానమని సవినయంగా మనవిచేస్తున్నాను. పని చేసి హాయిగా మానవత్వంతో బ్రతకడమనేదే ప్రభుత్వ విధానం. ఆ విధంగా కార్యక్రమాలు చేపట్టవలసిన అవసరముందని ప్రభుత్వం గ్రహించిందని సవినయంగా మనుచేస్తున్నాను. బంజరు భూముల విషయంలో వాటిని వెంటనే ప్రజలకు పంచాలి. బంజరు భూములు ఉంటే ప్రయోజనం లేదు. ఇవాళ మనం తిండి కావాలని అనుకుంటున్నాము. బంజరు భూములు ఏ మాత్రం సాగులోకి రాకుండా అలాగే నిరుపయోగంగా ఉన్నాయి.

కాబట్టి వాటన్నింటినీ కూడా సరైన పద్ధతిలో ప్రజలకందరికీ పంచిపెట్టడం, అవి సాగు అయ్యేటట్లు, చూడడం వలన సంవృద్ధివంతమైన ఆహార సంక్షేమం మనందరికీ కలగడమే

ధ్యేయంగా ప్రభుత్వం భావించిందని కూడా సవినయంగా మనవిచేస్తున్నాను. అక్రమ మార్గాలపై తీవ్రమైన చర్యతీసుకోవడం జరుగుతుంది. అమాయకంగా ఉన్న వారి భూములను ఆధీనం చేసుకోవడం జరిగిందని కూడా నాకు వార్తలు వస్తున్నాము. ఇప్పటినుంచే కాదు, ఎప్పటినుంచో ఉన్నాయి. దాని విషయంలో కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందని సవినయంగా మనవిచేస్తున్నాను. 40 రోజుల గడువు ఈ రోజు నుండి 40 రోజుల లోపల ఎవరి దగ్గరైతే అక్రమంగా ఆధీనపరచుకున్న భూములు ఉంటాయో వారు తెలియపరచినట్లయితే 75 శాతం ఇవాళ ఉండే వాల్యూ ఇస్తే వారికే ఆ భూములు ఇవ్వబడతాయి. లేని పద్ధతిలో ఆ భూములను ఆధీనం చేసుకుని మరల పేదవారికి పంచడం జరుగుతుందని కూడా ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను.

దేవాలయ భూములు కూడా ఉన్నాయి. అడిగే వారు లేరు కదా అని ఎవరైతే కామందులు పెద్దవారుగా ఉన్నారో, వారు తమ శక్తినంతా ఉపయోగించుకొని భూములను స్వాధీనం చేసుకొని బ్రతుకుతున్నారు. వారికి కూడా నేను సవినయంగా మనవిచేస్తున్నాను. అదే విధంగా పేద రైతులకు కూడా నేను సవినయంగా మనవిచేస్తున్నాను. మీ భూములను ఖాళీ చేయండని నేను అడగడం లేదు. ఆక్రమించుకున్న భూమి విలువలో 75 శాతం రైతుల ఆధీనంలో గనుక ఉన్నట్లయితే, పట్టణ భూములైతే మూల్యం ఒకేసారి ఇవ్వాలి. రైతులు అయితే మూడు దఫాలుగా ఇవ్వవచ్చును. ఆ భూములు వారికే ఇవ్వబడతాయి. వారే సేద్యం చేసుకోవచ్చు. కాబట్టి ఈ విషయాలను పూర్తిగా గమనించి మన రాష్ట్రాభ్యుదయానికి, రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలని కోరుతున్నాను. ఈ యొక్క అవినీతితో కూడిన విధానాలు మంచివి కావు. ఆ భూములు స్వంతంగా మీకే ఇవ్వబడతాయి. మీరు దయతో ముందుకురండి (రైతులను ఉద్దేశించి). మీ దగ్గర ఏవైతే భూములు ఉన్నాయో వాటిని గురించి చెప్పండి. అవి మీకే వశపరచబడతాయని కూడా నేను సవినయంగా మనవిచేస్తున్నాను. మీరే స్వయంగా వెల్లడించాలి. ఆ నీతికి, నియమానికి మన ప్రజలందరూ బద్ధులు కావాలి. వారిని కూడా గౌరవించడం జరుగుతుంది. వారిని ఏ విధంగానూ బాధ పెట్టడం జరగదని, ఈ సభాముఖంగా హామీ ఇస్తున్నాను.

అధ్యక్షా, స్థానిక ఎన్నికల విషయం తీసుకుందాము. జిల్లా ప్రజాపరిషత్తులు కానీ, లేకపోతే మునిసిపాలిటీలు కానీ, మండలాలు కానీ, పంచాయతీలు కానీ ఇవన్నీ కూడా మార్చి నెలాఖరులోగా ఎన్నికలు ముగించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్న విషయం తమకందరికీ తెలును ఎందుకంటే అభివృద్ధి కార్యక్రమాలు ఎన్నో చేయవలసినవి ఉన్నాయి. ఒక ఎన్నికలలోనే మన జీవితం అంతా వెచ్చిస్తే, మన కృషి అంతా కూడా ఈ రాష్ట్రాభివృద్ధికి ఉపయోగించలేమేమో అనే భయంతో ఈ ఎన్నికలు కూడా త్వరగానే ముగించాలనేది ప్రభుత్వ ఆలోచనలో ఉందని మీకు సవినయంగా మనవిచేస్తున్నాను. అందరినీ అభ్యర్థిస్తున్నాను. మీరంతా నా వాళ్లు, నా అన్నలు,

నా తమ్ముళ్లు. నా సహోదరులు. నాతోబాటుగా ఈ అసెంబ్లీలో కూర్చున్నారు. మన బాధ్యత ఏమిటి? సమాజాన్ని ఏ విధంగా అయినా సరే అభివృద్ధి పరచాలి, ముందుకు తీసుకువెళ్లాలి.

ఎందుకంటే కాలం నా దృష్టిలో ఉన్నది కాబట్టి త్వరగా ముఖ్యమైన విషయాలు నాలుగు చెప్పాలని చెబుతున్నాను ఇలా చెబుతూపోతే ఒక రోజు, రెండు రోజులు, మూడు రోజులు చెప్పవలసి ఉంటుంది. కాబట్టి వారి విజ్ఞతకు, ఆలోచనలకు కొన్ని విషయాలను వదలిపెడుతున్నాను. మంచి చేయడం వలన తెలుగుదేశం ఈనాడు ప్రభుత్వంలోకి వచ్చింది. కాబట్టి మాదే బాధ్యత అంతా అని కూడా కాకుండా వారి బాధ్యత కూడా ఉన్నది. అందరూ మంచి ఆలోచనలు ఇవ్వండి. మంచి విధానంలో ముందుకు నడవండి. పేద వారిని కనికరంతో చూడండి. పేదవారు ఏ విధంగా తిండిలేక చస్తున్నారో, బాధపడుతున్నారో ఒక్కసారి గమనించండి. మన కళ్ళ ముందు ఎంతమంది అన్యాయంతో బ్రతుకుతున్నారో, ఎంత మంది సమాజంలో సమాజాన్ని దోచుకుంటున్నారో ఒక్కసారి దృష్టిని సారించండని అందరికీ సవినయంగా మనవిచేస్తున్నాను. ఈ బాధ్యత నా ఒక్కడిది కాదు. నేను ముఖ్యమంత్రిని కావచ్చు. But, I am not taking the whole responsibility. I am seeking the cooperation of all of you. అందరి సహకారాన్ని అడుగుతున్నాను. మన వారికి మంచి జరగనియ్యండి. దానివల్ల ఈ ప్రభుత్వానికి కానీ, ప్రజాస్వామ్యానికి కానీ, ఈ యొక్క విధానానికి కానీ, ఈ యొక్క శాసన సభకు కానీ గౌరవం ఇద్దామని, మనందరం అదే ధ్యేయంతో అందరూ, మీరందరూ సహకరించాలని నేను మనవిచేస్తున్నాను. ఇప్పుడు మాకు బాధ్యతను ప్రజలు ఇచ్చినప్పటికీ కూడా, సహకారం మీరు కూడా ఇవ్వాలి. ప్రతిరోజు మీతో నేను భేదభావం పెట్టుకొనేది లేదు. మీరు కూడా ముందుకు నడిపించాలి. మనందరం ఒకే మార్గంలో వెళ్లాలి. మేము చేసే పనులు మీకు చెప్పాను. అది ఎవరో ఒక వ్యక్తి కోసం కాదు. పూర్తిగా సమాజం కోసం, మన గౌరవం కోసం, మన రాష్ట్రాభివృద్ధి కోసం ఇంకా ఏమైనా ఉంటే చెప్పండి. ఇదిగో ఈ విధంగా చేయండి. మనందరం కూడా మన రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెడతామని చెప్పి మమ్ములను ముందుకు నడిపించాలి.

**మార్చి నెలాఖరులోగా ఎన్నికలు ముగించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్న విషయం తమకందరికీ తెలును ఎందుకంటే అభివృద్ధి కార్యక్రమాలు ఎన్నో చేయవలసినవి ఉన్నాయి. ఒక ఎన్నికలలోనే మన జీవితం అంతా వెచ్చిస్తే, మన కృషి అంతా కూడా ఈ రాష్ట్రాభివృద్ధికి ఉపయోగించలేమేమో అనే భయంతో ఈ ఎన్నికలు కూడా త్వరగానే ముగించాలనేది ప్రభుత్వ ఆలోచనలో ఉందని మీకు సవినయంగా మనవిచేస్తున్నాను.**

మీకు కూడా అదే గౌరవం ఇస్తామని అందరికీ నేను సవినయంగా మనవిచేస్తున్నాను. I am not treating you as opposition Members. I am treating you as my own Members of the Assembly. ఈ ప్రజాస్వామ్య విధానంలో మీరు నాకు

స్నేహితులుగా, బంధువులుగా, తమ్ముళ్లుగా నేను భావిస్తున్నాను. కాబట్టి ఈ యొక్క ప్రభుత్వ విజయానికి మీరు కూడా సహాయపడాలని ప్రతి ఒక్కరినీ కోరుకుంటున్నాను. ఈనాడు ప్రభుత్వ విధానాన్ని స్థూలంగా మీకు చెప్పాను. ఏ విధంగా కూడా ప్రభుత్వం ప్రజలకు ద్రోహం చేయకుండా పేదవారిని ఉద్ధరించడానికి, పేదరికాన్ని నిర్మూలించడానికి పూర్తిగా ప్రయత్నం చేయడానికి అంకితమైనదని సవినయంగా మనవిచేస్తున్నాను. ఈనాడు మా ప్రభుత్వ విధానాలను గురించి చెప్పే అవకాశం కల్పించారు. చాలా సంతోషం ప్రజలకు ఏ మాటలైతే చెప్పామో, ఏ హామీలైతే ఇచ్చామో, ఆ హామీ ప్రకారమే నేను చెప్పాను. అంతకుమించి ఏమైనా ఉంటే మీరూ చెప్పండి తప్పకుండా ప్రభుత్వం అందరిదీ. మీరు కూడా ప్రజాస్వామ్య విధానంలో ఎన్నికైన ప్రజా ప్రతినిధులు కాబట్టి మీకు కూడా గౌరవం కల్పించడం నా బాధ్యతగా నేను మనవిచేస్తున్నాను. ఈ విధానంలో మనకు, మన శాసనసభకు గౌరవం తీసుకురావలసిందిగా ప్రతి వారికి కూడా నేను విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ యొక్క ప్రభుత్వ విధానాలు సరైన పద్ధతిలో ముందుకు నడిపించాలని నేను ముఖ్యమంత్రిగా మిమ్ములను కోరుకుంటున్నాను. ఈనాడు నాకు ఈ అవకాశం ఇచ్చిన అధ్యక్షులకు నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

◆◆

ఏప్రిల్ 24, 1995

# మన రాష్ట్రం యొక్క హక్కులను కాపాడడానికి, వినియోగించుకోడానికి ప్రవేశపెడుతున్న తీర్మానాన్ని అందరూ బలపర్చాలి

*(ఎగువ కృష్ణాబేసిన్లో కర్ణాటక ప్రభుత్వం వారి ప్రాజెక్టుల నిర్మాణం విషయం గురించి ప్రవేశ పెట్టిన తీర్మానం)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** కృష్ణా నదిలో ప్రవహించే నీటి విషయంలో, దానికి సంబంధించిన రాష్ట్రాలు, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య వివాదం వచ్చింది. ఎంత నీరు ప్రవహిస్తోంది? ఏ విధంగా భాగం పంచుకోవాలి అని వివాదం వచ్చిన సందర్భంలో అప్పుడు బచావత్ వారిని నియమించడం కూడా జరిగిందని నేను మనవిచేస్తున్నాను. బచావత్ గారు పూర్తిగా పరిశీలించారు 2,060 టి.ఎం.సి.ల నీరు కృష్ణా నదిలో ప్రవహిస్తోందని వారు నిర్ధారించడం జరిగింది. దాంట్లో కర్ణాటక 700 టి.ఎం.సిలు, మహారాష్ట్ర 560 టి.ఎం.సి.లు, ఆంధ్రప్రదేశ్ 800 టి.ఎం.సి.ల నీటిని వినియోగించుకోవచ్చునని వారు నిర్ణయం ఇవ్వడం కూడా జరిగింది. దీంట్లోనే వారు ఇంకొకటి కూడా కల్పించారు 2,060 టి.ఎం.సి. ల కంటే.. 75 శాతం...

**ఒక సభ్యుడు:** మాకు సీఎం గారి స్టేట్‌మెంట్ కాపీ కావాలి.

**శ్రీ ఎన్.టి. రామారావు:** నేను ఇంట్రడ్యూస్ చేస్తున్నాను. 75 శాతం డిపెండబిలిటీ మీద ఆఖరి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కాబట్టి, 25 సంవత్సరాలలో కనుక వర్షపాతం తగ్గినట్లయితే నష్టపోయేది ఆంధ్రప్రదేశ్ కాబట్టి 2,000 సంవత్సరం వరకు కూడా మిగులు నీరు ఏదైనా ఉంటే వాడుకోవచ్చుననే హక్కు, అధికారం కూడా ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వడం జరిగిందని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. దానిని అనుసరించి ఏ విధంగా అయినా మన హక్కును మనం కాపాడుకోవాలి

అన్న బాధ్యతతో ప్రభుత్వం తెలుగుగంగ, శ్రీశైలం, జూరాల, పులిచింతల, హంద్రీనీవా, గాలేరు నగరి మొదలైన ప్రాజెక్టులు ప్రారంభించడం జరిగింది. ఈనాడు నీటి కొరతను గుర్తించి, ఏ విధంగా అయినా వ్యవసాయదారులకు, సామాన్య ప్రజానీకానీకి త్రాగడానికి నీరు ఇవ్వాలని ధ్యేయంగా ఈ ప్రయత్నం చేయడం జరిగిందని మనవిచేస్తున్నాను. దీనికి విరుద్ధంగా కర్ణాటక రాష్ట్రం మిగులు నీరు ఎక్కువ వాడుకుంటున్నదని ఒక మాట మనం వింటున్నాము. దీనిని ఏ మాత్రం అంగీకరించడం జరగదు, జరగదని నేను మనవిచేస్తున్నాను.

కాబట్టి ఈ విషయంలో మా యొక్క ఉద్ధేశ్యాన్ని తెలియపరచడం జరుగుతుంది. అందరమూ అన్నీ పార్టీల వారం ఇది మన బాధ్యతగా గుర్తించి, కలిసికట్టుగా ప్రజా సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయవలసిన బాధ్యత మన మీద ఉంది, కాబట్టి దీనిని ఒక తీర్మానరూపంలో వారికి తెలియచేద్దాము. ఏ విధంగా కర్ణాటక రాష్ట్రం అక్కడ నీటిని ఎక్కువగా వినియోగించుకోడానికి అడ్డు కట్టవేస్తోంది అన్న దానిమీద ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టడం జరుగుతుందని నేను సవినయంగా మనవిచేస్తున్నాను. కాబట్టి, ఇది ఒక పార్టీ సమస్యకాదు. ప్రజలందరి సమస్య. త్రాగు నీటి సమస్య ప్రతివాడూ జలాధారాన్ని కలిగించుకునే సమస్య కాబట్టి దీనిని అందరూ దయదలచి గౌరవ ప్రదంగా బలపరచాలని, కేంద్ర ప్రభుత్వానికి పంపించే ఈ తీర్మానాన్ని బలవంతంగా ఆంధ్ర రాష్ట్రం యొక్క హక్కులను కాపాడడానికి, వినియోగించుకోడానికి నేను పూర్తిగా విశ్వసిస్తూ, ఆ తీర్మానాన్ని నేను తెలియజేస్తున్నాను.

**మన హక్కును మనం కాపాడుకోవాలి అన్న బాధ్యతతో ప్రభుత్వం తెలుగుగంగ, శ్రీశైలం, జూరాల, పులిచింతల, హంద్రీనీవా, గాలేరు నగరి మొదలైన ప్రాజెక్టులు ప్రారంభించడం జరిగింది. ఈనాడు నీటి కొరతను గుర్తించి, ఏ విధంగా అయినా వ్యవసాయదారులకు, సామాన్య ప్రజానీకానీకి త్రాగడానికి నీరు ఇవ్వాలని ధ్యేయంగా ఈ ప్రయత్నం చేయడం జరిగిందని మనవిచేస్తున్నాను.**

Sir, with your permission, I beg to move.

“That this House Expresses its deep concern on the proposals of the Government of Karnataka to increase the full reservoir level of Almatti Dam in Krishna basin from + 1680 ft. to + 1720 ft. with a view to providing additional storage of 185 tmc. This revision of the full reservoir level is in violation of the allocation made by the Krishna Water Disputes Tribunal for this Project. This would adversely affect the interests of Andhra Pradesh.

In view of the above, this House resolves to request the Goverment of India to ensure that the Government of Karnataka abides by the allocation made by the Tribunal to Almatti Project. Further, the

Government of Karnataka may be rest rained by the Government of India from constructing any new Project or improving the storage capacities of the existing Projects in Krishna basin contrary to the allocations made by the Tribunal.

This House further resolves to request the Government of Andhra Pradesh to expeditiously and vigorously take such steps as are necessary to ensure that the Bachawat Tribunal Award is implemented in letter and spirit, so that the interests of the State of Andhra Pradesh are fully protected."

**MR. SPEAKER:** Motion moved. The question is:

"That this House expresses its deep concern on the proposals of the Government of Karnataka to increase the full reserveir level of Almatti Dam in Krishna Basin from + 1680 ft. to + 1720 ft. with a view to providing additional storage of 185 tmc. This revision of the full reservoir level is in violation of the allocation made by the Krishna Water Disputes Tribunal for this Project. This would adversely affect the interests of Andhra Pradesh.

In view of the above, this House resolves to request the Government of India to ensure that the Government of Karnataka abides by the allocation made by the Tribunal to Almatti Project. Further, the Government of Karnataka may be restrained by the Government of India from constructing any new Project or improving the storage capacities of the existing Projects in Krishna Basin contrary to the allocations made by the Tribunal.

This House further resolves to request the Government of Andhra Pradesh to expeditiously and vigorously take such stops as are necessary to ensure that the Bachawat Tribunal Award is implemented in letter and spirit, so that the interests of the State of Andhra Pradesh are fully Protected."

◆◆

మే 3, 1995

# రాష్ట్ర అభివృద్ధి కోసం అందరం కృషి చేద్దాం

*(గాలేరు-నగరి ప్రాజెక్టు నిర్మాణంపై ఇచ్చిన జవాబు)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, దీని విషయం సభకు వివరించాలి. యదార్థంగా మన రాష్ట్ర భవిష్యత్తు కోసం మనం ఏమి చేస్తున్నాం అనేది ఆలోచించాలి. తెలుగుదేశం ప్రభుత్వాన్ని అధికారంలోకి వచ్చిన తరువాతే ఈ ప్రాజెక్టులు రావడం సంభవించిందని సవినయంగా మనవిచేస్తున్నాను. గాలేరు-నగరి, హంద్రీ-నీవా, తెలుగుగంగ, శ్రీశైలం ఎడమ కాలువ ఇవన్నీ రావడం జరిగింది. ఎందుకంటే వారు బచావత్ అవార్డ్ ప్రకారంగా కృష్ణా నదిలో 2 వేల టి.ఎం.సి.ల వాటర్ ప్రవహిస్తున్నదని తేల్చారు. దానిలో 700 టి.ఎం.సి.ల వాటర్ కర్ణాటకకు, 520 టి.ఎం.సి.ల వాటర్ మహారాష్ట్రకు, మిగతా 800 టి.ఎం.సి వాటర్ మన ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించడం జరిగింది. దాని ప్రకారంగా 75శాతం డిపెండబులిటీ, 100 సంవత్సరాలలో, 75 సంవత్సరాలే వర్షపాతం ఉంటుంది.

20 సంవత్సరాలు వర్షపాతం లేకపోవచ్చు అనే అంశం మీద ఏదైనా మిగులు జలాలు గనుక ఉంటే అవి వృధాగా సముద్రంలోకి వెడితే నష్టపోయేది ఆఖరు స్టేట్ ఆంధ్రప్రదేశ్ కాబట్టి. దానినే 2 వేల సంవత్సరాల వరకు కూడా పూర్తిగా ఉపయోగించుకునే హక్కు ఆంధ్రప్రదేశకు ఉన్నదని నిర్వచించడం జరిగింది. కాబట్టి తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తరువాత దానిని పరిశీలించినట్లయితే అక్కడ విజయవాడ వాళ్ల లెక్కల ప్రకారంగా సంవత్సరానికి 320 టి.ఎం.సి.ల వాటర్ వృధాగా సముద్రంలోకి పోతుందని తేలింది. కాబట్టి 320 టి.ఎం.సి.ల వాటర్ వృధాగా పోయే దానికంటే కూడా మనకు హక్కు ఉన్నది కాబట్టి దానిని మనం త్రాగే నీటికీ కానీ, వ్యవసాయానికి కానీ ఉపయోగించుకుందాము.

మన రాష్ట్ర సంవృద్ధి కోసం ఏ విధంగా పాటుపడాలని ఆనాడు పరిశీలించడం జరిగింది. దాని వలననే ఈ ప్రాజెక్టులు అన్ని రావడం జరిగింది. అప్పటి నుంచి కూడా ఏ విధంగా కృషి

చేయాలనే విధానంలో కృషి చేయడం జరుగుతోంది. ఇవన్నీ సాధించుకోవాలన్న భావంతో, వాటిని నిర్మించుకోవాలన్న ధ్యేయంతో పని చేయడం జరుగుతోంది. ఈనాడు రూ.15 వేల కోట్లు అయితే కానీ ఈ ప్రాజెక్టు నిర్మించుకోడానికి వీలులేదు. 2 వేల సంవత్సరం లోపల ఇవన్నీ పూర్తి చేసుకోవాలి. కాబట్టి వ్యవధి ఉన్నది. డబ్బు ఎంత అవుతుంది. ఏ విధంగా దీనిని ముడిపెట్టాలి. ఏ విధంగా సాధించాలి అనేది తప్ప కేవలం రూ.10 కోట్లు, 15కోట్లు, 20 కోట్లతో ఏమీ ప్రయోజనం లేదు. కాబట్టి మొత్తంగా పరిశీలించి ఏ విధంగా మనం చేస్తే మన రాష్ట్రం సంవృద్ధి అవుతుందనేది ఆలోచించాలి. ఈనాడు తాగే నీటికీ కూడా ఇబ్బందిపడుతున్నాం. వ్యవసాయానికి ఇక చెప్పవలసిన అవసరమే లేదు. ప్రతిదీ కూడా ఇబ్బందిగానే ఉన్నది. కాబట్టి ఒక ప్రక్కన పారిశ్రామికంగా రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పరిశ్రమలకు కూడా నీరు లభ్యం కావడం లేదు. అందుచేత మన రాష్ట్రం సంవృద్ధి కోసం మనం పాటుపడాలనే ధ్యేయంతో వీటన్నింటినీ కూడా పరిశీలించడం జరుగుతోంది ఏవిధంగా డబ్బు తేవాలి. ఏవిధంగా వినియోగించుకోవాలి. ఏవిధంగా 2 వేల సంవత్సరం లోపల ఇవన్నీ పూర్తి చేసుకోవాలనే ధృక్పథంతో ఉన్నాము.

**ఈనాడు తాగే నీటికీ కూడా ఇబ్బందిపడుతున్నాం. వ్యవసాయానికి ఇక చెప్పవలసిన అవసరమే లేదు. ప్రతిదీ కూడా ఇబ్బందిగానే ఉన్నది. కాబట్టి ఒక ప్రక్కన పారిశ్రామికంగా రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పరిశ్రమలకు కూడా నీరు లభ్యం కావడం లేదు. అందుచేత మన రాష్ట్రం సంవృద్ధి కోసం మనం పాటుపడాలనే ధ్యేయంతో వీటన్నింటినీ కూడా పరిశీలించడం జరుగుతోంది.**

ఆ విధంగా ప్రయత్నం చేయడానికి కూడా ఆల్‌రెడీ బచావత్ నిర్ణయం చేసి మాకు ఇచ్చింది కాబట్టి రెండు వేల సంవత్సరం వరకు కూడా ఆ నీటిని వాడుకునే హక్కు మనకు ఉన్నది కాబట్టి, మనం వాడుకుంటామనే భావంతో దీని విషయంలో కూడా కృషి చేయడం జరుగుతోంది. కాబట్టి అందరికీ సవినయంగా మనవిచేస్తున్నాను. ఏదైనా మంచి భావన ఉంటే చెప్పండి. ఈ 15 వేల కోట్ల రూపాయలు ఏ విధంగా తెచ్చుకుందాము. ఏ విధంగా రాష్ట్రం అభివృద్ధి, చేద్దామనే విషయం మీద వివరించండి తప్ప దానికి ఎంత? దీనికి ఎంత? అనే దానికంటే మనం అన్నీ పూర్తి చేసుకోవాలి. ఒకటి కాదు, రెండు కాదు అన్ని ప్రాంతాలకు పనికి వచ్చే విధంగా మనం ఉపయోగించుకోవాలి. అందుచేత ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తున్నది. మేము అధికారంలోకి వచ్చి నాలుగు నెలలే అయింది. 5 సంవత్సరాల క్రితం వరకు ప్రభుత్వం పని చేసింది. నేను పేరు చెప్పడం లేదు. క్రితం ప్రభుత్వం అనే చెప్పాను. వారు ఎంతవరకు సాధించారనేది దయచేసి గమనిస్తే బాగుంటుంది.

ఏ విధంగా సాధించాలనే ధ్యేయాన్ని మనసులో పెట్టుకునే కృషి చేస్తున్నాము. కాబట్టి దయచేసి శాసన సభ్యులందరు కూడా మన రాష్ట్రాన్ని గుర్తించాలి. ఏ విధంగా మనం ఏర్పరచుకుందామనేది ఆలోచించండి. సలహా చెప్పండి. మంచి సలహాలు ఇస్తే, స్వీకరించడానికి మాకు ఎలాంటి

అభ్యంతరం లేదు. రాష్ట్రం మనది. రాష్ట్ర శాసన సభ్యులం మనం కాబట్టి ప్రభుత్వానికి భేదభావం ఉందని అనుకోవద్దు. అన్ని విషయాలు అందరికీ చెప్పాను. రెండువేల సంవత్సరం వరకు మనం పూర్తి చేసుకోవలసిన అవసరం ఉన్నది. వారు చెబితే మేము కాదనేది లేదని మా ధ్యేయం ఇది, మా ఉద్దేశ్యం ఇది, మా ఆచరణ ఇది, మా భావం ఇది అని అందరికీ స్పష్టం చేస్తున్నాను.

అధ్యక్షా, మొన్న మేము ఢిల్లీ వెళ్లిన సందర్భంలో రంగయ్యానాయుడు గారిని కలవడం జరిగింది. వారికి ఈ విషయం పూర్తిగా చెప్పడం జరిగింది. అది గమనించి మాకు క్లియరెన్స్ ఇవ్వాలని వారికి చెప్పడం జరిగింది. వాతావరణ విషయంలో రిపోర్టు పంపించమని వారు చెప్పడం జరిగింది. రిపోర్టు పంపించిన వెంటనే దాని విషయంలో తగిన విధంగా సహాయం చేస్తామని వారు హామీ ఇవ్వడం జరిగింది. కాబట్టి అది ఆచరిస్తాము. మా ప్రభుత్వం ఉన్నప్పుడు గతంలో రూ.340 కోట్లు వ్యవసాయానికి శాంక్షన్ చేశాము. ఈ సంవత్సరం రూ.1200 కోట్లు శాంక్షన్ చేయడం జరిగింది. అందుచేత చేయగలిగినంత చేస్తున్నాం. ఇంకా ఏ విధంగా చేయవలయునో చెప్పండి. సలహా ఇవ్వండి. అందరం కలసి చేద్దాము. ఇది రాష్ట్రానికి సంబంధించినది కాబట్టి మేము చేసేది చేస్తున్నాం. వారిని కూడా సహాయం చేయమంటున్నాను. ఆలోచన చేయమని అంటున్నాను. రాష్ట్ర అభ్యుదయానికి పాటుపడమని సవినయంగా మనవిచేస్తున్నాను. వెంటనే దీని విషయంలో అధికారులకు ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది. ప్రాజెక్టు క్లియరెన్స్ కోసం వారు ఎప్పుడైతే నాకు చెప్పారో వెంటనే రిప్లయ్ ఇవ్వమని వారికి చెప్పాను. I have asked them to give the report immediately so that we can get the clearance.

**శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, మూడు విధాలుగా ప్రయత్నం చేస్తున్నాము. బాండ్స్ విధానంగా పెట్టి, తరువాత లోన్ తెచ్చుకోవడం ఒకటి. వ్యవసాయ అభివృద్ధి కోసం, ఏ జలాల కోసం ఖర్చు పెడుతున్నామో. ఆ ఖర్చు లోను విధంగా సహాయం చేస్తే వారికి వడ్డీ ముట్టచెప్పడం ఒక ప్రయత్నం తరువాత బెటర్‌మెంట్ ఛార్జెస్ కూడా ఎందుకంటే ఈనాడు పొలాలు బీడు గడ్డలుగా ఉన్నాయి. రేపు నీరు రావడం వల్ల దానికి అభివృద్ధి జరుగుతుంది. 30 లేక 40 బస్తాల ధాన్యం పండడానికి అవకాశం ఉంటుంది. కాబట్టి వారికి ఆ ప్రోత్సాహం కానీ, ఆ లాభం కానీ అందరికీ జరుగుతుంది కాబట్టి. వారందరూ ముందుకు వస్తేనే మనం చేయగలుగుతాము. నిస్వార్థంగా మన యొక్క అభివృద్ధి కోసం పాటుపడాలనే భావంతో వ్యవసాయదారులు ముందుకు వచ్చి ఇది మన రాష్ట్రం అనే విధానంలో వారు గమనిస్తే మనం చేయడానికి వీలు అవుతుంది. కాబట్టి వారందరికీ ఈనాడు ఈ శాసనసభ ద్వారా అప్పీల్ చేస్తున్నాను. ఇది కేవలం ప్రభుత్వం కోసం కాదు, మరొకరి కోసం కాదు, రాష్ట్ర అభివృద్ధి కోసం, రాష్ట్రంలోని వ్యవసాయం కోసం, అందరూ దయచేసి ముందుకు వస్తే, బీడు గడ్డలను ఈనాడు పంట పండే పొలాలుగా వృద్ధి చేసుకోవచ్చు. దానికి

మాత్రం ఏదైనా సరే వారి శక్తానుసారం నిర్ణయించిన కాంట్రిబ్యూషన్ ప్రకారం దయచేసి ఇవ్వమని సభాముఖంగా ప్రార్థిస్తున్నాను. ఎన్నివిధాల సాధ్యమో అంతా పూర్తిగా ప్రయత్నించడం జరుగుతుందని, ఈనాడు ఇది అందరి యొక్క విధానం అని మనవిచేస్తున్నాను. ఇది మా ఒక్కరి విధానం కాదు. రాష్ట్రం అభివృద్ధి కోసం పూర్తిగా అందరం కృషి చేస్తాము. ఈ ప్రభుత్వం పూర్తిగా ఈ విధానానికి అంకితమై పని చేస్తుందని సవినయంగా మనవిచేస్తున్నాను.

**శ్రీ ఎన్. రాఘవరెడ్డి:** పెండింగ్ ప్రాజెక్టుల విషయంలో క్యాబినెట్ హోదా గల మంత్రిని నియమిస్తే బాగుంటుందని చెప్పాము.

**శ్రీ ఎన్.టి. రామారావు:** నేను వాగ్దానం చేశాను. ఫండ్స్ కానీ, లోన్స్ కానీ ప్రత్యేకంగా తీసుకోవడం జరుగుతుంది. అదే రైతులకు కూడా అప్పీల్ చేస్తున్నాను.. ఈనాడు బీడు గడ్డలుగా ఉన్న భూమి రేపు సస్యశ్యామలం కాబోతున్నది. ఫలితం అందరికీ దక్కుతుంది. మన రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. కాబట్టి మీరందరు మరొక విధానంగా అనుకోకుండా ప్రభుత్వం ఏదో అడుగుతుందని భావించకుండా వారి భూమి అభివృద్ధి కోసం వారందరూ దయచేసి పాటుపడాలని ప్రతి రైతుకు కూడా నేను ఈ సభ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను. క్యాబినెట్ హోదా అన్నారు. గవర్నమెంట్ ఆఫీసర్ ప్రత్యేకంగా దీని విషయంలో ఒక డెవలప్‌మెంట్ అధికారిని కూడా ఏర్పాటు చేయడం జరిగింది. వారందరూ అక్కడ కూర్చుని క్లియరెన్స్ తేవాలి. ఇక్కడ కేవలం హైద్రాబాద్‌లో కూర్చుని కబుర్లు చెప్పవద్దని కూడా ఆదేశించడం జరిగింది.

**శ్రీ ఎన్.టి. రామారావు:** అన్ని విధాలా ప్రయత్నం చేస్తాము అని సవినయంగా మనవిచేస్తున్నాను. అదే విధంగా ఈ కాంట్రాక్టులు ఇచ్చే దానిలో 80 శాతం, 100 శాతం, 120 శాతం ఎస్కలేషన్‌తో డబ్బు వారి మొహాన వేసే దాని కంటే ప్రజలు ముందుకు వస్తే వారే తీసుకుని వారి విధానాన్ని నిర్మించుకోవాలని అన్నది ప్రభుత్వ ధ్యేయం. పూర్తిగా వారికే డబ్బు ఇస్తాము. కాలువలు త్రవ్వుకునే విషయంలో ఈవిధంగా చేద్దాము. పెద్దపెద్ద విషయాలు ఇంజినీర్లు చూసుకుంటారు. సామాన్య విషయాలలో ఎవరికి వారే ముందుకు రావాలి. సామాన్యంగా ఏ విధంగా రేటు ఉంటుందో దాని ప్రకారం వేసుకుని ఆ పనులు బాగా చేసుకోవచ్చు అనేదానికి అవకాశం ఉంది. కాబట్టి ఆ విధానాన్ని కూడా పరిశీలిస్తామని వారికి మీ ద్వారా మనవిచేస్తున్నాను. ఫండింగ్ విషయంలో అన్ని రకాలుగా ప్రయత్నం చేస్తున్నాము. ఎన్ని విధాలుగా తెచ్చుకునే అవకాశం ఉంటుందో అన్ని విధాలా తెచ్చుకోడానికి ప్రయత్నం చేస్తాము. గండికోట ప్రాజెక్టు విషయం చెప్పారు. దీని విషయంలో పూర్తిగా పరిశీలించడం జరుగుతుంది. ఏదైనా సరే, నీరు ఉంటే ప్రతి చుక్కా, ప్రతి బొట్టూ కూడా పూర్తిగా జన సంక్షేమం, రైతు సంక్షేమం కోసం, సామాన్య ప్రజల సంక్షేమం కోసం ఉపయోగించాలనే ధ్యేయంతో అన్ని విధాలా కృషి చేస్తున్నాము.

**శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, ఇవన్నీ కనిపెట్టిందే తెలుగుదేశం ప్రభుత్వం ఈ ప్రాజెక్టులు అన్నీ తెచ్చిందే తెలుగుదేశం. మరొక అర్థం వారు చేసుకోకుండా ఉంటే, సోదర భావంతో చూస్తే 5 సంతవ్సరాలలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండి ఏం పనులు చేశారు? ఈ రాష్ట్రానికి ఏం తెచ్చారు? వారేం సాధించారు? అప్పుడే ఈ గండికోట ప్రాజెక్టు ఎందుకు తేలేదు? ఈనాడు చిన్నబుచ్చాలని కాదు కానీ ఆనాడే ఎందుకు తేలేదనే నేను సవినయంగా మనవిచేస్తున్నాను.

**శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, యదార్థం మాట్లాడితే కోపం వస్తుంది. మేము రూ.10 కోట్లు పెట్టాము. 5 సంవత్సరాలలో వారెంత పెట్టారో చెప్పమనండి. ఆనాడు ఎందుకు వీళ్లు అడగలేదు? వారి ప్రభుత్వంలో ఎందుకు చెయ్యలేకపోయారు? ప్రజలను ఏ విధంగా మభ్యపెట్టారు? దయచేసి చెప్పమనండి.

*(ఇంటరప్షన్స్)*

అన్ని ప్రయత్నాలు చేస్తాము. ఏ విధంగా వనరులు చేకూర్చాలో ప్రయత్నం చేస్తాము. బాండ్స్ అమ్మడమా, ఏ విధంగా అప్పులు ప్రజల నుంచి తేవడానికి పూర్తిగా ప్రయత్నం చేసి అది చాలకపోతే, ఏ విధంగా వాటర్ ఛార్జెస్-బెటర్‌మెంట్ గురించి విషయం ఆలోచించడం. జరుగుతుంది కానీ ముందు అన్ని విధాలా ప్రయత్నం చేస్తాము. అది ఆఖరి రిసార్ట్ మాత్రమే రైతులకు ఏ విధంగా సంక్షేమం చెయ్యాలో పూర్తిగా ఆ విధంగా సహాయపడతాము. నేనూ అక్కడి శాసనసభ్యుడినే నాకూ బాధ్యత ఉంది. నేను కూడా అనంతపూర్ జిల్లా నుంచి వచ్చిన వాడినే. అక్కడి శాసనసభ్యుడిగా ప్రత్యేకంగా అక్కడి అభివృద్ధికి ప్రయత్నం చేస్తానని చెబుతున్నాను. అనుమానం అవసరం లేదు. You know very well that though I hail from Krishna I belong to Rayalaseema also. రాయలసీమ దత్తపుత్రుడిని అంటూ అభిమానిస్తారు. దానికి ఏ విధంగా రుణం తీర్చుకోవాలో నాకు తెలుసు. తీరుస్తాను అని మనవిచేస్తున్నాను.

**శ్రీ ఎన్.టి. రామారావు:** ఈనాడు రూ.1200 కోట్లు ఎప్పుడు లేని విధంగా రాష్ట్రాభివృద్ధికి గాను పెట్టాము. ప్రజలకు తెలుసు. నేను చెప్పను ఏదైనా కానీ They know it better The people know it better. They know how to answer it also. 5 సంవత్సరాలలో ఏమీ లేనిది. చేతిలో అప్పుడు అధికారం ఉంచుకుని ఏమీ చెయ్యలేదేం?

**శ్రీ ఎన్.టి. రామారావు:** 5 సంవత్సరాలు చేతిలో అధికారం పెట్టుకుని ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి చెయ్యలేని వారు ఈనాడు ఏదో చేస్తామంటే ఎవరు నమ్ముతారు సారీ.

◆◆

జూన్ 15, 1995

## హామీలను గౌరవించడం ధర్మంగా భావించాలి

*(ప్రణాళిక సంఘం వారు ప్రణాళికా కేటాయింపును తగ్గించడంపై 304 నిబంధన కింద చర్చ)*

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, ప్రత్యేకంగా ఇది ఎవరినీ ధిక్కరించాలని కాదు. ఎంతో ఆవేదనతో చెబుతున్న విషయం ఎందుకంటే ప్రజలకు హామీ ఇచ్చాము. పేదవారికి కూడు పెడతామని, రెండు రూపాయలకే కిలో బియ్యం ఇస్తామని చెప్పాము. ఆడబిడ్డలు అడిగిన దానిమీద మద్యనిషేధం అమలు చేస్తామని చెప్పడం జరిగింది. అది మంచి అయినా, చెడు అయినా హామీ నిలుపుకోవాలి. మంచిపనులు చేయాలి. మా ప్రభుత్వం అంకితభావం కలిగింది కాబట్టి వాటిని అమలుచేయడం జరిగింది. దాని మీద ఎన్నో మాకు ఆశలు ఉంటాయి. కోఆపరేటివ్ ఫెడరలిజం, తండ్రి బిడ్డలకు ఏ రకమైన సంబంధం ఉంటుందో కేంద్రప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు అదే విధమైన సంబంధం ఉంటుంది. ఏదైనా కష్టం కలిగినప్పుడు సమస్య వచ్చినప్పుడు కానీ అనుభవం గల తండ్రికి చెప్పకుండా మరెవరికి చెప్పాలో నాకు అర్థం కావడం లేదని తమకు సవినయంగా మనవిచేస్తున్నాను. అదే విధానంలో వారిని గౌరవించాలి. వారు హైదరాబాద్ వచ్చినప్పుడునూ ఇంటికీ డిన్నర్‌కు ఆహ్వానించాను. అది ధర్మం.

He is the Prime Minister of the country. ఆయనను గౌరవించకుండా ఉండడం అనే ప్రశ్న లేదు. ఆయన ఏమి చేసినా గౌరవిస్తాము. వారు ఏ పార్టీకి చెందినవారనేది అనవసరం. వారు మన దేశానికి ప్రధానమంత్రి గారు. వారు మన రాష్ట్రానికి వచ్చినప్పుడు వారిని గౌరవించడం మనలను మనం గౌరవించుకోవడమే అవుతుంది దాని విషయంలో పూర్తిగా ఎప్పుడూ వారిపట్ల గౌరవమే కానీ ద్వేషభావం అనేది లేదని తమకు సవినయంగా మనవిచేస్తున్నాను. పార్టీలు వేరు కావచ్చు, విధానాలు వేరు కావచ్చు. ప్రజలు నిర్ణయిస్తారు.

ఏ పార్టీ కావాలనేది ప్రజలు నిర్ణయించిన తరువాత, ప్రజల నిర్ణయాన్ని అనుసరించి ఆ పార్టీ విధానాలను అనుసరించి ఆ పార్టీకి తగు ఆర్థిక సహాయం చేయడం కేంద్ర ప్రభుత్వ ధర్మంగా

భావించి ఈనాడు వారిని కోరుతున్నాము. కేంద్ర రాష్ట్ర సంబంధాలు విడదీయరానివి. మేము ప్రజల కోసం పెడుతున్నాము. కోఆపరేటివ్ ఫెడరలిజంలో మాకు కొన్ని హక్కులు, బాధ్యతలు ఇవ్వాలి. మమ్మల్ని మీరు పూర్తిగా నడిపించాలని నేను వారిని ప్రార్థనాపూర్వకంగా అడగడం జరిగింది. It is not a demand. It is neither a demand nor a fight. వారిని విస్మరించడం లేదు. వారితో గౌరవంగానే మాట్లాడుతున్నాము. గౌరవంగానే అర్థిస్తున్నాము. మన రాష్ట్ర ప్రజల కోసం. పేదవారికోసం మేము చేసే పనులను గురించి ఆలోచించండి. ఏ పేదవారికైతే సహాయం అందిస్తున్నామో, వారి కోసం అర్థిస్తున్నాము ప్రభుత్వ సంవత్సర ఆదాయం ఎంతో ఏ విధంగా పన్నులు వేస్తున్నామో కేంద్రానికి తెలుసు. కేంద్రం ఏవిధంగా పన్నులు తీసుకుంటుందో కూడా తెలుసు. ఒకవైపు బచావత్ అవార్డు ఉంది. రెండు వేల సంవత్సరం నాటికి పూర్తి చేసుకోవాలి. అందుకోసం రూ.15 వేల కోట్ల నుండి రూ.20 కోట్ల వరకు కావాలి. ఎక్కడి నుండి తెస్తాము? గౌరవనీయులందరూ అనుభవం గల వారే. ఈనాడు శాసనసభకు అందరూ రాలేదు. ప్రజాస్వామ్య విధానంలో బాధ్యత వహించి ప్రజాప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారు. I am actually telling with a heavy heart. నేను ఆవేదనతో చెబుతున్నాను. కలవారి కోసం కాదు. పేదవారి కోసం, కూడు, గూడు లేని వారి కోసం మేము ఇస్తున్నాము. మేము మొదలు పెట్టిన తరువాత, ఎన్నో రాష్ట్రాలు ఈ విధానాన్ని అమలు పరుస్తున్నాయి.

**మన రాష్ట్రప్రజల కోసం. పేదవారికోసం మేము చేసే పనులను గురించి ఆలోచించండి. ఏ పేదవారికైతే సహాయం అందిస్తున్నామో, వారి కోసం అర్థిస్తున్నాము ప్రభుత్వ సంవత్సర ఆదాయం ఎంతో ఏ విధంగా పన్నులు వేస్తున్నామో కేంద్రానికి తెలుసు. కేంద్రం ఏవిధంగా పన్నులు తీసుకుంటుందో కూడా తెలుసు. ఒకవైపు బచావత్ అవార్డు ఉంది. రెండు వేల సంవత్సరం నాటికి పూర్తి చేసుకోవాలి.**

ఇది తప్పుడు విధానం అయితే వారందరూ ఎందుకు అనుసరిస్తారు. 1983లో ఇది క్రొత్త విధానం కావచ్చు. నేడు, పేదవారికి అన్నం పెట్టాలనేది. దేశం అంతా ఆలోచిస్తున్న విధానం ప్రజలు కోరుతున్నారు కాబట్టి ఆ నిర్ణయం తీసుకుంటున్నారు. ప్రజల కోసం చేస్తున్నాము కాబట్టి దయచేసి సహాయం చేయండి అని అర్థించడానికి వెళ్లాము. వారు మర్యాదగానే చూశారు. వెళ్లీ వెళ్లడంలోనే చెప్పారు. ప్లానింగ్ కమిషన్ దగ్గరకు వెళ్ళినప్పుడు (10వ ఫైనాన్స్ కమిషన్) వారు అదే విధంగా గౌరవించారు ఒక్క విషయం మనవిచేస్తాను. దేశంలో ఉండే పత్రికలు ఏమయ్యాయి? పార్టీలు ఏమయ్యాయి? మేధావులు ఏమయ్యారు? వారు ఏ విధంగా అనుకున్నారు? ఈనాడు సాధించింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ప్రభుత్వం పేదలకు సహాయం అందించగలిగిందనేది చాలామంది నాకు ఉత్తరాలు వ్రాశారు. పత్రికల్లో వ్రాశారు. ప్రధానమంత్రి మన రాష్ట్రం వారిని గౌరవించాను. ఏ రాష్ట్రం అయినా మాకు ఒకటే మన వారు కాబట్టి ప్రత్యేక అభిమానం, గౌరవం ఉండవచ్చు. ఇదే విధానంలో వారు సహకరిస్తారని ఉబలాటపడటం, వెళ్ళగానే చెప్పాను రూ.2159 కోట్లు, ఉన్న బడ్జెట్‌ను రూ.3153 కోట్లకు

పెంచినట్లుగా బడ్జెట్‌లో రూ.1,000 కోట్లు పెంచవలసి వచ్చింది. రెండు రూపాయలకు కిలోబియ్యం పథకం వల్ల రూ.2 వేల కోట్లు, మద్యనిషేధంవల్ల రూ.1200 కోట్లు ఆదాయం పోతోంది. అదే విధానంగా రైతులకు రూ.50కి హార్స్‌పవర్ విద్యుత్తు ఇద్దామని అనుకుంటున్నాము. ఇన్ని బాధ్యతలు ఉన్నాయి కాబట్టి, మా బాధ్యతలను బాధలను ఒక తండ్రితో చెప్పే విధంగా చెప్పడానికి, అర్థించడానికి వచ్చాము.

We went for seeking their assistance. వారితో పోట్లాడడానికి కాదు. అర్థించడానికి వెళ్ళాము. ఆఫీసర్స్ డాక్యుమెంట్స్ తెచ్చారు. వెళ్లగానే మీరు చాలా చక్కగా ప్రభుత్వం నడుపుతున్నారు. మేము అభినందిస్తున్నాము అని అన్నారు. మీకు వెయ్యి కోట్ల రూపాయలకు గాను రూ.750 కోట్లు, ఇస్తాము మిగతా రూ.250 కోట్లు మీరు సంపాదించుకుంటారా అని అడిగారు ఏదో తిప్పలు పడతాము. మీరు చేసే సహాయానికి ధన్యవాదాలు అని చెప్పాము. రూ.750 కోట్లు ఇస్తాము అనగానే వెంటనే నమస్కారం పెట్టాను. చాలా సంతోషం ప్రణబ్ ముఖర్జీగారూ.. మీరు గౌరవం నిలబెట్టారు అని వారిని అభినందించాను.

ఆ విషయంలో ఒక్కమాట కూడా మాట్లాడలేదు. పరవాలేదు, కేంద్రం సహాయం చేస్తుంది అని వచ్చాము తరువాత ఎక్కడ ఏ విధానం జరిగిందో మాకు తెలియదు. మేము తప్పు దారిలో పడ్డామో? పత్రికలు, మిగతా పార్టీలు తప్పుదారి పడతాయో? ప్రజలు, ప్రపంచం తప్పుదారి పడుతుందా? ఒకసారి ఆ మాటలను గురించి ఆలోచించండని మనవిచేస్తున్నాను. వారంటే జాలి తప్ప కోపం లేదు. వారు ఇవ్వకపోయినా ప్రజలు ఉన్నారు. మేము ప్రజలకు ఇచ్చిన హామీలను ఎలా నెరవేర్చుకోవాలో మాకు బాగా తెలుసు. We know what we should do. అది నేను అడగడం లేదు ఏ విధంగా మిగతావారు అనుకుంటారు? ఇచ్చిన హామీలను మర్చిపోతే అపఖ్యాతి పాలవుతాము. ప్రపంచ పత్రికలు కానివ్వండి మిగతా పార్టీలవారు కానివ్వండి, మనదేశం వారు అందరూ ఉన్నారు.

నేను బాధపడుతున్నాను ఎందుకు ఈ విధంగా అన్నారు? ఇంకో విధంగా మనం చేసుకోవచ్చును. వారు రూ.750 కోట్లు ఇస్తారు అనుకుంటూ ఉంటే దానికి 10వ ఫెనాన్స్ కమిషన్ కలుపుతున్నామని చిన్నమాట ఎందుకు చెప్పారు? కాబట్టి అయాం సారీ ఫర్ దట్. ఇది కేవలం బాధతో చెబుతున్నాను. పట్టింపు ఏమీ లేదు. వారివ్వలేదన్న కోపం లేదు. ఇది ఒక బాధ్యతగా తీసుకుని. ప్రజల కోసం భిక్ష్యం వేస్తే తెద్దామని అడుగుతున్నాను. అందరి దగ్గర భిక్షం నేను అడుగుతాను పేదవాడికి ఇవ్వడం నా ధర్మం. అలాగే ఆడవాళ్ల కోసం మద్యపాన నిషేధం అమలు చేయాలని అనుకున్నాం కదా? ఇప్పుడు చెబుతున్నాను. That is my pledge. I am going with a begging bowl to the people. దయచేసి, కలవారందరూ కలిసి లేనివాడికి ఇంత కూడు పెట్టండి. ఈనాడు లక్షల రూపాయలు విరాళాలు పంపిస్తున్నారు. మీకు

తెలుసు. ఒక మంచి పని చేస్తున్నప్పుడు ప్రజలందరిని ఒక విధంగా కూడగట్టుకుని మంచిపనిలో వారందరినీ విలీనం చేసుకోవాలని అంతేగానీ మరొక విధంగా కాదు అని మా పరిపూర్ణమైన విశ్వాసం. ఇప్పటికైనా గౌరవిస్తారని మా నమ్మకం Again I am appealing తమద్వారా శాసనసభ ద్వారా గౌరవంగా వారిని అడుగుతున్నాము శిక్ష అడుగుతున్నాం. For the sake of the poor people. I am begging the central Government. That is my duty. దయచేసి ఈమాత్రం పేదవాడికి కూడు పెట్టమని అర్థిస్తున్నాం. That is my duty. I have the poorest of the poor in this State. వారి ఓట్లతో వచ్చాం కాబట్టి నా బాధ్యత నిర్వర్తించుకోవడం నా ధర్మం.

ఈనాడు రెండు రూపాయలకు కిలో బియ్యం ఇవ్వలేను, కూడు పెట్టలేనని నా ప్రాణం పోయినా అనను. పోతే ప్రాణం పోతుంది బజారులో మాట మాత్రం తప్పనని మనవిచేస్తున్నాను. అదేవిధంగా ఆడ బిడ్డలకు మాటయిచ్చాం. మద్యపానం నిషేధిస్తామని మీరే ఆలోచించండి. మీరు మీ చెల్లెళ్ళకు, అక్కలకు ఇచ్చిన హామీని కాదంటారా? ఇవి సెంటిమెంట్లు ఇందులో రాజకీయం లేదు మానవతా ధర్మంతో మీ ముందు పెట్టాం. ఇక్కడ మన అన్నలు, తమ్ముళ్ళు, చెల్లెళ్ళు, ప్రజాప్రతినిధులు అందరూ ఉన్నారు. ఆలోచించండి. ఇది నా ఒక్కడి బాధ కాదు. మీరందరూ సహకరించండి. ఈనాడు మన ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. ఇక్కడ ఏ పరిస్థితి ఉన్నది ఈనాడు ప్రభుత్వం చెప్పుకోవడం ధర్మం. మీ దగ్గర కాకపోతే ఎవరి దగ్గర చెప్పుకుంటాం. ఏ విధంగా సలహా చెబుతారో చెప్పండి. బెగ్గింగ్ బౌల్ పట్టుకుని దేశం అంతా తిరగమని చెబుతారా తిరుగుతాను లేదంటే మరొక సలహా ఇవ్వండి లేదంటే అందరం కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని అర్థిద్దామని, నమస్కారం పెట్టి, అయ్యా మాకు భిక్ష పెట్టండి. పేదవాడికి రెండు రూపాయలకు బియ్యం ఇస్తామని, మా మాట నిలపండి, వారి ఓటుతో ఈనాడు అధికారానికి వచ్చాం కాబట్టి ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులు ఇచ్చే హామీలను గౌరవించడం ధర్మంగా భావించాలని మనవిచేయమంటారా చెప్పండి మీరు చెప్పినట్లు చేస్తాం. వ్యతిరేకంగా చేయకూడదని మీ ముందుకు తీసుకువచ్చాం.

ఈనాడు కాంగ్రెసు పార్టీని వెలికి తేవాలని. బజారులో పెట్టాలని మా ఉద్దేశం కాదు. It is our Government. It is in Centre. ఇది మన ప్రభుత్వం. దాని గౌరవాన్ని కాపాడకుండా బజారులో పెడతామని ఎందుకు అనుకోవాలి? ఇది హిందూదేశానికి సంబంధించిన విషయం. మనం పూర్తిగా ప్రతి వారి భావలను గౌరవించాలి. ప్రతివారి మేనర్సును గౌరవించాలి. కొందరిని అవమానించామని ఎవరూ కూడా అనుకోవద్దు. తెలుగుదేశం అందుకు పుట్టలేదు, మా విధానం అది కాదని అధ్యక్షుడిగా మీకు చెబుతున్నాను. ముఖ్యమంత్రిగా చెబుతున్నాను. కాబట్టి మీరు మా విధానం అర్థం చేసుకుని ఏమి చేయమంటారో చెప్పండి. మీ ముందు కన్నీళ్లతో చెబుతున్నాను.

పేదవాడికి దారి చూపండని Please... I request all of you. నేనెంతో సంతోషిస్తాను మీ సూచనను నమస్కారంతో ఆమోదిస్తాను. నావాళ్లన్నారు నా తరఫున నాకు 73 సంవత్సరాలు వచ్చాయి. నా పేదవాళ్ళ కోసం నేను నిలబడినప్పుడు నా తమ్ముళ్ళందరూ ముందుకు వచ్చారు సంతోషిస్తాను. దయచేసి అర్థం చేసుకోండి ఇందులో రాజకీయం లేదు.

కాబట్టి ఆ విధంగా ఆలోచించాలని కోరుతున్నాను. ఈ విధంగా కేంద్ర ప్రభుత్వాన్ని అర్థిద్దాము. వారి మీద రిపోర్టు పెట్టాలనిగానీ, ద్వేషం గానీ లేనే లేవు. లిఖిత పూర్వకంగా పెడదామా మనుషులం వెళ్లి చెబుదామా? మీరు ఏ విధంగా సలహా ఇస్తారు? ఈ బియ్యం పథకం వద్దంటారా? మానమంటారా? ప్రొహిబిషను వద్దంటారా? కావాలంటే ఏం చేయాలి?. I am asking for your co-opertation. అంతే తప్ప దీనిని ఇంకో విధంగా అర్థం చేసుకోవద్దు, దీనిలో రాజకీయాలు ఏమీ లేవు. ప్రత్యేకంగా, మానవతాధర్మంతో పేదవారి సంరక్షణ కోసం ప్రతివారిని అడుగుతున్నాం మీ పార్టీ, మా పార్టీ అందరినీ అర్థిస్తున్నాం. దయచేసి అందరూ నాకు సమాధానం చెప్పండి. As the Chief Minister of the State. I am asking you, you and you. ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీలను మాటను నిలబెట్టుకోవాలని, నా విద్యుక్త ధర్మంగా నిర్వర్తించుకోవాలని ప్రతివారు నాకు సలహా చెప్పినా గౌరవం దక్కించేలా సహకరిస్తారని మనవిచేస్తూ, మీ అభిప్రాయాలు చెప్పాలని నేను సెలవు తీసుకుంటున్నాను.

◆◆

# సమున్నత చరిత్ర - సజీవ సాక్ష్యాలు

## ఎన్టీఆర్ సంక్షేమ పథకాలు



పేదలకు సైకిళ్ల పంపిణీ




చిన్న, సన్నకారు రైతాంగానికి ట్రాక్టర్లు



పేదల ఉపాధికి పశువుల పంపిణీ




పేదలకు వ్యవసాయ భూముల పంపిణీ



సోమశిల ప్రాజెక్టు ప్రారంభోత్సవం



స్కూటర్ల తయారీ పరిశ్రమకు ప్రారంభోత్సవం



భారీ పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం



వరద ప్రాంతాల్లో ఏరియల్ సర్వే



నీట మునిగిన ప్రాంతాలు



విజయవాడ గాంధీ కొండపై శ్రీమతి ఇందిరాగాంధీతో కలిసి గ్రంథాలయం ప్రారంభోత్సవం




హైదరాబాద్ పాతబస్తీలో పర్యటన




మైనార్టీస్ ఫైనాన్స్ కార్పోరేషన్ ప్రారంభోత్సవం



తెలుగు టైప్ రైటర్ వినియోగానికి శ్రీకారం




నంది బహుమతుల ప్రదానం




ఎఫ్‌డిసి ఆధ్వర్యంలో తెలుగు సినిమా వారోత్సవం



మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ




బడి పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం, చిరంజీవుల సుఖీభవం ప్రారంభం



అన్నార్తులకు భోజనం వడ్డిస్తున్న ఎన్టీఆర్



సామాన్యులతో కలిసి సహపంక్తి భోజనం



తెలుగు గంగకు శ్రీకారం




తెలుగు గంగకు ప్రారంభోత్సవం



తిరుమలలో నిత్య అన్న భోజన పథకం శ్రీకారం




తిరుపతి దివ్యారామం భూమి పూజ కార్యక్రమం




తిరుమలలో టిటిడి బస్ స్టేషన్ ప్రారంభం



గుంటూరు బస్ స్టేషన్ ప్రారంభం



శ్రీ వేంకటేశ్వర స్వామికి పట్టువస్త్రాల సమర్పణ



తిరుమలలో గజరాజుతో ఎన్టీఆర్



ట్యాంక్‌బండ్‌పై ప్రముఖుల విగ్రహాల ఆవిష్కరణ




విజయవాడ కనకదుర్గమ్మ వారధికి శంకుస్థాపన



ప్రజలవద్దకే పాలన - ప్రజాసదస్సు నిర్వహణ



ప్రజాసదస్సులో సామాన్య మహిళ సమస్యలు వింటున్న సీఎం ఎన్టీఆర్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవంలో జ్యోతిబసు,
చంద్రరాజేశ్వరరావు తదితరులతో ఎన్టీఆర్



అభివృద్ధి కార్యక్రమాల సమీక్ష.. కె.విజయరామారావు తదితరులతో ఎన్టీఆర్





పార, పలుగు చేపట్టి శ్రమైక జీవన సౌందర్యాన్ని చాటిచెప్పిన ఎన్టీఆర్





పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకమే మార్గం అని చెప్పిన ఎన్టీఆర్



ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డా॥ నోరి దత్తాత్రేయుడు, డా॥ కోడెల శివప్రసాదరావుతో
కాన్సర్ ఆసుపత్రి ప్రణాళికను వివరిస్తున్న ఎన్టీఆర్




బసవ తారకం క్యాన్సర్ ఆసుపత్రి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎన్టీఆర్




ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి శంకుస్థాపన కార్యక్రమంలో ఎన్టీఆర్..
కేంద్రమంత్రి షిండే, ఎల్‌వి ప్రసాద్ తదితరులు



నూతన డెయిరీ భవన సముదాయ ప్రారంభంలో ఎన్టీఆర్. వసంత నాగేశ్వరరావు,
రెడ్డి సత్యన్నారాయణ తదితరులు



గిరిజన ఆడపడుచులతో సంప్రదాయ నృత్యం చేస్తున్న ఎన్టీఆర్



గిరిజన సంప్రదాయ వేషధారణలో ఎన్టీఆర్

ప్రధాన ప్రతిపక్ష నేతగా

# శ్రీ నందమూరి తారక రామారావు అసెంబ్లీ ప్రసంగాలు

జనవరి 9, 1990

# మా పథకాలు కొనసాగించండి, మీ హామీలు నెరవేర్చండి!

*(గవర్నర్ ప్రసంగంపై ధన్యవాధాలు తెలిపే తీర్మానంపై చేసిన ప్రసంగం)*

**శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, మనలను గుర్తించి, గౌరవించి వారి ప్రతినిధులుగా నిలిపిన ప్రజాస్వామ్య విధానానికి విదాతలైన నా దేవుళ్లకు, ప్రజలందరికీ నా నూతన సంవత్సర శుభాకాంక్షలు, అభినందనములు తెలియజేస్తున్నాను.

*(ఇంటరప్షన్)*

ఈనాడు ప్రజలను దేవుళ్లుగా మాట్లాడడం నాకు కొత్త కాదు. బహుశా వినడం మీకు కొత్త ఏమో, సమాజమే మాకు దేవాలయం ప్రజలే మాకు దేవుళ్లని ఎన్నోసార్లు నేను చెప్పి ఉన్నాను.

పరిస్థితులు ఏ విధంగా ఉన్నా, ఏ విధంగా నిర్ణయాలు జరుపబడ్డా ఆ ప్రజల యొక్క తీర్పే మాకు శిరోధార్యం. వారి సేవే మాకు పరమావధిగా నేను సవినయంగా తెలియజేస్తున్నాను. ఈ రోజున గౌరవనీయులైన గవర్నర్ గారి ప్రసంగం మీద చర్చ జరుగుతుందన్నది గమనించి నేను మాట్లాడుతున్నాను. పార్టీ విధానాల పట్ల ద్వేష భావంతో కానీ, ఈర్ష్యతోకానీ, అసూయతో కానీ, వ్యక్తిగతంగా కానీ నేను ఏమీ మాట్లాడదలచుకోలేదని, ముందుగానే తమరికి సవినయంగా మనవిచేస్తున్నాను. గత ఏడు సంవత్సరాలుగా ఈ గడ్డను పరిపాలించిన తెలుగుదేశం ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది. మా యొక్క స్థానంలో ఈనాడు విజ్ఞులు, అనుభవజ్ఞులు అయిన పెద్దలతో కూడిన మరొక పార్టీ వారు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. 42 సంవత్సరాల స్వాతంత్ర్యానంతరం కూడా గతి లేక, ఆధారం లేక, నిరాధారులైన, నిస్సహాయులైన పేద ప్రజానీకం ఈ నూతన ప్రభుత్వం, ఈ నూతన సంవత్సరంలో ఏమి అందజేస్తుంది, ఏమి సందేశాన్ని ఇస్తుంది, వారివారి జీవితాలకు ఏ విధమైన నిర్వచనం కలుగజేస్తుందనే భావంతో ఆరు కోట్ల తెలుగు ప్రజానీకం ఎదురు చూస్తున్నారనేది నా అభిప్రాయంగా తెలియజేస్తున్నాను.

మరి ఈ సందర్భంలో ఎవరైతే మనుగడ లేక 42 సంవత్సరాల క్రితం తెచ్చిన స్వాతంత్ర్య ఫలితాలు అందజేయబడక, దగాపడ్డ తమ్ముళ్లుగా సమాజంలో మిగిలిపోయారో, అలాంటి వారందరూ మాకు ఏమి సంక్షేమం జరుగుతుంది, ఏమి జరుగుతుంది, మా జీవితాలకు ఏ మనుగడ విధానం, ఏ విధమైన కార్యక్రమాలను ఈ ప్రభుత్వం అందజేస్తుందన్న ఆశతో ఎదురుచూస్తూ ఉంటారన్నది నా అభిప్రాయంగా తెలియజేస్తున్నాను. మరి ఈనాడు గవర్నర్ గారు చేసిన ప్రసంగం ప్రత్యేకంగా ప్రభుత్వం వారి నోట వినిపించే ఒక పవిత్రమైన ప్రభుత్వ విధానంగా గుర్తుంచుకోవాలని నేను సవినయంగా మనవిచేస్తున్నాను.

గవర్నర్ గారి ప్రసంగం తమ నోటి నుంచి వినిపించే పవిత్రమైన ప్రభుత్వ విధానంగా ఉండాలి. గానీ ఈ ప్రసంగం చూస్తే ఇది పునరాలోచనా విధానాలతో, పేదవారికి ఏమాత్రం నిష్కృతి కలిగించని విధంగా ఉందని మనవిచేస్తున్నాను. గత ప్రభుత్వం చేసిన విధానాలను పునర్విమర్శ చేస్తాము. వాటిలో ఉన్న మంచి చెడ్డలను ఆలోచించి నిర్ణయాలు చేస్తాం అని చెప్పడం భ్రమ కలిగించే మాటలుగానే ఉన్నాయని మనవిచేస్తున్నాను. ప్రజలు ఏ నమ్మకంతో, ఏ విశ్వాసంతో వారికి ఓట్లు వేసి గౌరవించారో అవన్నీ కాదు వారికి నిస్పృహ కలిగించే రీతిలో ఈ ప్రసంగం ఉందనీ సవినయంగా మనవిచేస్తున్నాను. శుభాకాంక్షల తరువాత వారు తమ మొదటి పేరాలో మొన్న జరిగిన ఎన్నికల గురించి ప్రస్తావించారు. అందులో నాకు భిన్నాభిప్రాయం లేదు. ప్రజల నమ్మకానికి ప్రజలు అభీష్టానికి విరుద్ధంగా తమ కండబలంతో, తమ ధనబలంతో అమాయకులను కొల్లగొట్టి అవాంఛనీయ పరిస్థితులు కల్పించే పద్ధతిలో ఎన్నికల జరిగాయనేది సర్వులూ ఎరిగిన విషయమేనని సవినయంగా మనవిచేస్తున్నాను.

**గత ప్రభుత్వం చేసిన విధానాలను పునర్విమర్శ చేస్తాము. వాటిలో ఉన్న మంచి చెడ్డలను ఆలోచించి నిర్ణయాలు చేస్తాం అని చెప్పడం భ్రమ కలిగించే మాటలుగానే ఉన్నాయని మనవిచేస్తున్నాను. ప్రజలు ఏ నమ్మకంతో, ఏ విశ్వాసంతో వారికి ఓట్లు వేసి గౌరవించారో అవన్నీ కాదు వారికి నిస్పృహ కలిగించే రీతిలో ఈ ప్రసంగం ఉందనీ సవినయంగా మనవిచేస్తున్నాను.**

తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎన్నికల విధానంలో సంస్కరణలు రావాలని, ప్రజాస్వామ్యాన్ని నిస్పష్టంగా నిలబెట్టాలని, ఎలాంటి ఇన్ఫ్లూయెన్స్ ఎలాంటి అవరోధాలు లేకుండా ప్రజలు తాము కోరుకొనే వారిని ఎన్నుకొనే అవకాశం ఉండాలని మా విధానంగా అనుకున్నాము. మా ఉద్దేశ్యాలకు అనుకూలమైన చట్టాన్ని తెచ్చాము, చేశాము అని సవినయంగా మనవిచేస్తున్నాను. మొన్న జరిగిన ఎన్నికలలో ఎన్ని అక్రమాలూ, ఎన్ని అన్యాయాలూ, ఎన్ని దౌర్జన్యాలు జరిగాయో అందరికీ తెలిసిందే అవి ఇకముందు జగకుండా చూడటానికి ఏమి శ్రద్ధ చూపుతారో చూడటానికి నేను వేచి ఉంటాను. ప్రజాస్వామ్యం గొంతు నొక్కి ప్రజలకు మాట్లాడే అవకాశం లేకుండా చేసే

పద్ధతి లేకుండా విధానాలు రూపొందిస్తారనే విశ్వాసం కలిగివున్నానని మనవిచేస్తున్నాను. ఇక గవర్నర్ గారు తమ ప్రసంగంలో రెండవ పేరాలో నవంబరు 8వ తేదీన కోస్తా జిల్లాలలో వచ్చిన తుఫాను గురించి మనవిచేశారు. ఎన్నికల తేదీ నిర్ణయించినప్పటికీ నేను ఒక ప్రజా ప్రతినిధిగా బాధితులను ఆదుకోవాలని, నా ఆడబడుచులను, నా అన్నదమ్ములను ఆదుకోవాలని ఆ ప్రాంతాలకు నేను వెళ్ళటం జరిగిందని మనవిచేస్తున్నాను. నాయకుడిగా అది నా బాధ్యత అని భావించాను. ఆ బాధ్యతను నెరవేర్చాను సవినయంగా మనవిచేస్తున్నాను. నెల్లూరు జిల్లాకు సంబంధించినంతవరకూ అక్కడ తుఫాను వల్ల ఎక్కువగా ఇండ్లు పోయాయి. కాబట్టి గృహ నిర్మాణం కోసం పది వేలు రూరల్ హౌసింగ్, కావలిలో 5 వేల అర్బన్ హౌసింగ్ కార్యక్రమం చేపట్టాలని ప్రభుత్వ పరంగా ఆదేశాలు ఇవ్వడం జరిగిందని సవినయంగా మనవిచేస్తున్నాను. ఎక్కడ బాధితులకు ఏవి అందాలో, ఎక్కడ గంగపుత్రులు ఉన్నారో, ఎక్కడ నోరులేని మూగ జీవాలు, ఇండ్లు పోయాయో అక్కడే గృహ నిర్మాణం జరగాలని కూడా ఆదేశించడం జరిగిందని సవినయంగా మనవిచేస్తున్నాను.

అదే విధంగా ప్రకాశం జిల్లాకు వెళ్ళే అదను దొరకనప్పుడు కావలి పట్టణం నుండే ప్రకాశం జిల్లాకు 5 వేల రూరల్ హౌసింగ్, 2500 అర్బన్ హౌసింగ్ కార్యక్రమం వెంటనే చేపట్టాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందని కూడా మనవిచేస్తున్నాను. పొటెక్టెడ్ వాటర్ సప్లయి విషయంలో గానీ, రాకపోకల సౌకర్యం కలిగించే విషయంలో గానీ బాధ్యతగా వ్యవహరించాలని వారికి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అలా వారు అమలు చేయడం కూడా జరిగింది. అలాగే సన్నకారు, చిన్నకారు రైతులతో నష్టపడిన వారికి సహాయ సహకారాలు అందించడం జరిగిందని అకాల మృత్యువాత పడ్డ సోదరీసోదరుల కుటుంబాల వారికి ఎక్స్‌గ్రేషియా కూడా వెంటనే అందించడం జరిగిందని మనవిచేస్తున్నాను. ఇండ్లు కోల్పోయిన వారికి రిలీఫ్ ఫండ్స్ ఏర్పాటు చేసి వారికి బియ్యం అందజేశాము, అన్ని సౌకర్యాలు కలుగచేయడం జరిగిందని మనవిచేస్తున్నాను. జరిగిన నష్టం వివరాలు ఎప్పటికప్పుడు కేంద్రప్రభుత్వానికి మెమొరాండము ద్వారా తెలపడం జరిగింది. కొంత డబ్బు ఆ కార్యక్రమాలకు మంజూరు చేయడం కూడా జరిగిందని మనవిచేస్తున్నాను. గవర్నర్ గారి ప్రసంగంలో అప్పుడు కొంత చేశారని చెప్పడం వల్ల నేను చేసిన సేవను ఇప్పుడూ చెప్పుకోవలసిన వచ్చిందని, ప్రజా సంక్షేమం పట్ల తెలుగుదేశం ఎప్పుడూ నిర్లక్ష్యం భావం చూపలేదని సవినయంగా మనవిచేస్తున్నాను.

అధ్యక్షా, అలనాడు తెలుగుదేశం ప్రభుత్వ పరిపాలనలో సర్వీసెస్ విషయంలో అనిశ్చిత పరిస్థితి ఉందనే ఆరోపణ చేయబడింది. నియమబద్ధమైన పద్ధతులలో సర్వీసులు నడపబడాలనే ఉద్దేశ్యంతో తప్ప ఇతరత్రా జోక్యం కల్గించడం, వారిని బాధ పెట్టటం మా ఉద్దేశ్యం కాదని సవినయంగా మనవిచేస్తున్నాను. అప్పుడు ఉన్న వ్యవస్థలు Anti-Correption Bureau is there already C.B.C.I.D is there already; I.A.S. Officers are already

there. It is Indian Administrative Service; it is not State service. అందువల్ల మా జోక్యం ఏమీ లేదు మేము చేసిందల్లా అర్హతను కలిపాము. తాబేదార్లుగా తొత్తులుగా ఉండే విధానం పోవాలి. ప్రజా సంక్షేమం కోసం పాటుపడే వారిని గౌరవించాలనే ఆసక్తితో అలా పటిష్టం చేశాము తప్ప మొత్తంగా మేము కలుగచేసుకోలేదు. అన్ని గవర్నమెంట్ డిపార్టుమెంట్స్. నా డిపార్టుమెంట్ కాదని తమకు మనవిచేస్తున్నాను. అది ప్రత్యేకమైన వ్యక్తికి సంబంధించిన డిపార్టుమెంట్ కాదు. గవర్నమెంట్ శాఖలు, ఆ శాఖలు పటిష్టంగా పని చేసేటట్లు చేయగలిగాము గానీ అందులో ఏ మాత్రము జోక్యము కల్పించుకోలేదు. ఎవరైనా బాధపడి ఉండే వారికి నా బాధను వ్యక్తం చేస్తున్నాను. సిద్ధాంతం మాత్రము తెలియజేస్తున్నాను. పటిష్టమైనటువంటి పరిపాలనా విధానము, స్వచ్ఛమైన పరిపాలన ప్రజలకు అందించాలానే ధ్యేయముతో అది సాగిందని మనవిచేస్తున్నాను. ఇక ప్రమోషన్స్ విషయంలో వారి సీనియారిటిని బట్టి, అర్హతను బట్టి, యోగ్యతను బట్టి, ఖాళీలను బట్టి డిపార్టుమెంటల్ ప్రమోషన్ కమిటీలు నిర్వహించాయి. కేవలము నేను దానిలో జోక్యము చేసుకొని ఎవరినీ ఇబ్బంది పెట్టలేదని మాత్రము ఈ సభకు తమ ద్వారా మనవిచేస్తున్నాను.

పోతే ఆనాడు ఎంతో రాజకీయ విజ్ఞానమూర్తులైనటువంటి విజ్ఞులు అశోక్ మెహతాగారిలాంటి మహోన్నత భావి ప్రగతిశీలురు, వారి ఊహలు, కన్నటువంటి కలలు, సిద్ధాంత పరమైనటువంటి మాండలిక రాజ్యాంగ విధానము వికేంద్రీకరణ భావముతో అమలు పరిచాము. ప్రత్యేకంగా స్వార్థముతో ఆ వ్యవస్థ ప్రజలకు నిరుపయోగము మేము చేయలేదని మనవిచేస్తున్నాను. ప్రభుత్వము పేద ప్రజల వద్దకు వెళ్లాలి ఏ పని కావాలన్నా – ఉదయము గౌరవ సభ్యులు మనవి చేశారు. హెూటళ్ళు, హాస్టళ్ళు అన్నీ నిండిపోయాయని, మరియు ఈ దురదృష్టం ఈ జాతికి ఎందుకు పట్టింది అని అడుగుతున్నాను. ప్రభుత్వము అనేది ప్రజల కొరకు ఏర్పాటు అయినటువంటిది – ప్రజా ప్రభుత్వము–ప్రభుత్వము ప్రజల వద్దకు వెళ్ళాలి, పేదవారి గుడిసె తలుపులు తట్టాలి. వారి సమస్యలు పరిష్కరించాలి.

అధ్యక్షా, అటువంటి ఆదర్శ ప్రజాస్వామ్యము నియమ నిబద్ధము అయినటువంటి రాజ్యాంగాన్ని పేదవారి గుడిసె ముంగిటకు తీసుకువెళ్ళాలి. ఆ దిక్కులేని దీన ప్రజల సమస్యలు పరిష్కరించాలన్న భావముతో అధికార వికేంద్రీకరణ పరంగా దానిని నిర్మించడం జరిగిందని సవినయంగా మనవిచేస్తున్నాను. అప్పటికి 330 సమితులుగా ఉన్నటువంటి మన రాష్ట్రాన్ని 1104 మండలాలుగా విభజించడం జరిగింది. అది ముఖ్యంగా ఎ యూనిట్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ – సర్వ సౌకర్యాలు ప్రజలకు కావలసినటువంటి వనరులు, వసతులు ఒకే చోట వారికి లభించాలి. ఒకే చోట లభిస్తే ఎక్కే గడప, దిగే గడప, వెళ్ళే ఊరు, వచ్చే ఊరు గాకుండా అన్నింటినీ ఎంతో ఆదర్శవంతంగా సౌకర్యాలు పొందేలాగా ఫలితాలు లభింప చేసుకునే అవకాశం పేద ప్రజానీకానికి కలుగుతుందనే సువిధానంగా దానిని ఏర్పాటు చేయడం జరిగిందని సవినయంగా

మనవిచేస్తున్నాను. ముఖ్యంగా రెవెన్యూ పంచాయతీ శాఖల సంక్షేమం, వైద్యం, మార్కెటింగ్, రక్షణ, పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్, న్యాయ నిర్వహణ-న్యాయ పంచాయతీల బిల్లును కూడా ఎన్నికలకు ముందే మేము నిర్ధారణ చేయడం జరిగింది. అటువంటి విధానాలు అన్నీ ఈ ప్రభుత్వ విజ్ఞతకు వదిలి వేస్తున్నాము అమలు చేస్తే పేదవారికి వారి ముంగిట న్యాయం కల్పించే అవకాశం లభిస్తుంది. వారు ఈ న్యాయానికి, ధర్మానికి ఖర్చులకు లోను కావలసిన అవసరం లేదనే పద్ధతిలో అటువంటివి అన్ని ఒక చోట ప్రోగు చేయడం జరిగిందని సవినయంగా మనవిచేస్తున్నాను.

ఈ పద్ధతిని మనమే కాదు. దేశవ్యాప్తంగా ఎందరో ఆమోదించడం జరిగింది. ఒకవేళ అవసరమనుకుంటే ఎప్పుడైనా ఒక్కొక్క జిల్లాకు రెండు మూడు రెవెన్యూ డివిజన్లను ఆ కార్యక్రమాలను పర్యవేక్షించడం కొరకు ఏర్పాటు చేసుకోవచ్చు తప్ప ప్రత్యేకంగా తహసీల్దారు వ్యవస్థ ఏర్పాటు చేసుకోవలసిన అవసరం ఏ మాత్రం లేదని మనవిచేస్తున్నాను. ప్రతి దానికి అక్కడ బెంచ్ లేదు. ఇక్కడ బంట్రోతు బిళ్ల లేదని అంటున్నారు. బల్లలు, బంట్రోతు బిళ్ళలు కాదు ఆధారము. ప్రజాస్వామ్యం ఆదర్శం గానీ ప్రత్యేకంగా అధికారుల పెత్తనం కొరకు మండలాలు స్థాపించడం కాదు, అటువంటి హక్కులు, అధికారులు, ప్రజాస్వామ్య న్యాయం ప్రజలకు ఇవ్వబడాలని, వారి పరిపాలనను వారే చేసుకునే విశ్వాసం వారికి కల్పించాలనేదే దీని ఆంతర్యం గానీ అధికారులను పెంచడం, లేకపోతే రాష్ట్ర ప్రభుత్వ ఖజానాను ఖాళీ చేయడం దీని ఆదర్శం కాదని తమకు మనవిచేస్తున్నాను. అదే విధానము కొరకు అందరి ఆమోదం తీసుకోవడము జరిగింది. అందరి విజ్ఞులను సంప్రదించడం జరిగింది. ఇది ఆదర్శము. ఈనాడు అందరూ భావించడం జరుగుతోంది. కాబట్టి దీనిని పూర్తిగా పునఃపరిశీలిస్తామనే దానికంటే ఏమైనా తప్పులు జరిగి ఉంటే సరిచేయండి, మీకు అధికారం ఉంది. ప్రజలు అధికారం ఇచ్చారు. కాబట్టి దానిని పటిష్టంగా నిర్వహించండి. కానీ దానిని ఉంచడమా, ఊడగొట్టడమా అనే ఆలోచన వద్దు. ప్రజాస్వామ్యాన్ని భద్రపరచండి. ప్రజలకు అవకాశాలు ఇవ్వండి వారి బాధ ఎక్కడికక్కడ తీర్చండి. మన దగ్గరకు వచ్చే దురదృష్టము వారికి కల్పించకండి అని నేను సవినయంగా మనవి చేస్తున్నాను.

అప్పటికప్పుడే 300 సమితులలో కార్యాలయాలు ఉన్నాయి. సుమారుగా 400 మండల కార్యాలయాలు నిర్మించడం జరిగింది. ఏమీ లేదు అనుకోవడం పొరపాటు. అంచెల వారీగా నిర్మిస్తాము కానీ ఏదైనా అనుకున్నప్పుడు అనుకున్న క్షణంలోనే సృష్టించుకోలేము, కల్పించుకోలేము. కాబట్టి ఇటువంటి సువిధానం మీకు ఆమోదయోగ్యమైతే 5 సంవత్సరాలలో మిగిలిన 400 మండల కార్యాలయాలు నిర్మించండి. ప్రతిష్టవంతంగా నిర్వహించబడేట్లు చేయండని మీ విజ్ఞతకు వదిలి పెడుతున్నాను. కానీ మీరు మాత్రం ప్రజలకు ఏదో నిర్దిష్టమైనటువంటి నిర్ణయం తెలియజేయాలని హృదయపూర్వకంగా కోరుతున్నాను. ప్రజలను మభ్యపెట్టడం కానీ, వారిని తెలిసీ తెలియని వాతావరణంలో కన్ఫ్యూజన్‌లో ఉంచడం కానీ మంచిది కాదని మనవిచేస్తున్నాను. అదేవిధంగా పటేల్ పట్వారీ వ్యవస్థలు, మీకు తెలియదని కాదు. తెలంగాణ వారసులైనటువంటి

మీరందరూ, ఆ ప్రజలందరూ ఏ విధంగా పండుగలు జరుపుకున్నారో, ఏవిధంగా ఆనాడు పర్వదినంగా భావించి వారు సంతోషం వ్యక్తం చేశారో మీకు తెలుసు.

ఏవిధంగా బ్రిటిష్ నిరంకుశ నియంతృత్వ వలన పరిపాలనా విధానంలో ఏవిధంగా ప్రజలు బాధ పడ్డారు? వాటి అవశేషాలుగా మిగిలి పోయినటువంటి ఈ నియంతృత్వ వ్యవస్థలను కూలగొడితే కానీ ప్రజాస్వామ్యానికి అర్థం లేదన్న భావనతో ఎంతో కాలం నుంచి ఎదురు చూస్తున్న ప్రజల ఆశలకు అనుగుణంగా ఈ విధానాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందని నేను మీకు సవినయంగా మనవిచేస్తున్నాను. కాబట్టి దానికి ప్రత్యామ్నాయమైనటువంటి వ్యవస్థను పటిష్ఠవంతంగా నిర్వహింప చేసుకొనడానికి అవకాశం మాత్రం మాకు లభింపలేదు, అవరోధాలు కలిగాయి. వివరాలు తమకు తెలుసు. ఆ అవరోధాలు తొలగించండి. పటిష్ఠవంతంగా గ్రామీణ పాలనా విధానం నిర్వహించబడేట్లు ప్రజల శ్రేయస్సుకు మీరు చేయండి కానీ తిరిగి కాలదోషం పట్టిన వ్యవస్థల విషయం పునరాలోచన చేస్తామనడం చక్కటి విధానం కాదని మనవిచేస్తున్నాను. ముఖ్యంగా ఈ సంస్థల సంగతి ప్రస్తావించారు. అందులో ముఖ్యమైనది కర్షక పరిషత్. ఎవరికో ఒకరికి కట్టబెట్టాలన్న భావనతో ఆలోచించామన్నారు.

అధ్యక్షా, మానవత్వంతో మానవుడిగా ఆ విధానాలు వ్యక్తం చేస్తున్నాను సహృదయంతో గ్రహించాలని అందరికీ మనవి చేస్తున్నాను. గ్రామీణాభివృద్ధి జరగాలని, రైతే రాజు కావాలని పూజ్యబాపూజీ కలలు కన్నటువంటి విధానంగా మీ కందరికీ తెలుసు. అహర్నిశలు రెక్కలు ముక్కలు చేసుకొని దేశానికి ఇంతకూడు పెట్టే అన్నదాతను గౌరవంతో బ్రతికే విధానం ఈ దేశంలో కల్పించనప్పుడు- 42 సంవత్సరాల స్వాతంత్ర్యానంతరం అతని జీవితానికి సరైన నిష్కృతి లభించనప్పుడు తెలుగుదేశం పార్టీ నాయకుడిగా, రైతుబిడ్డగా రైతును గౌరవించడం నాధ్యేయం అనుకున్నాను, కనుక ఎవరైతే నూటికి 70 మంది వ్యవసాయ వృత్తులతోను ఈ సమాజాన్ని పోషిస్తున్నారో, ఎవరైతే తినడానికి ఇంత కూడు పెడుతున్నారో అటువంటి అన్నదాతలకు సరైన గౌరవం లభింపచేయాలన్నదే దీని ధ్యేయం కానీ మరోటి కాదని మనవిచేస్తున్నాను.

కాబట్టి తను పండించే పంటకు తానే ధర నిర్ణయించుకునే విధంగా ఉండాలనేది ధ్యేయం. సామాన్యమైన పారిశ్రామికవేత్త పిన్ను మొదలు పిన్నీసు వరకు ఏమీ చేసినప్పటికీ తను నిర్మించిన వస్తువుకు తానే ధర నిర్ణయించుకొంటున్నారే - అటువంటి ప్రతిప్రత్తి, అటువంటి స్వేచ్ఛ, అటువంటి గౌరవం, ఆ కష్టజీవికి, శ్రమజీవికీ ఎందుకు కలిగించకూడదనే భావనతో దీని నిర్మాణం జరిగిందనీ, వారికి ఆ ప్రత్యేక గౌరవం సంతరింప చేయడమే దీని ఆంతర్యమని మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను. కాబట్టి ఆహారధాన్యాలు పండించే పద్ధతి ప్రక్రియా విధానం, ప్రయోగ విధానం, మార్కెటింగ్ సౌకర్యం అన్నింటినీ ఆయనే స్వీకరించాలి. తను పండించిన పంటలకు తానే కర్తగా, తానే సృష్టించి తన గిట్టుబాటు ధర నిర్ణయించుకోవాలనే భావంతో ఆ

రైతు జన సంక్షేమానికే ఈ సంప్రోక్షణం అని నేను మీకు మనవిచేస్తున్నాను. కానీ ఏవిధంగా ఈ వ్యవస్థకు అడ్డంకులు తేబడ్డాయో మీకు తెలుసు. ఆనాడు మా మనుషులను వేసుకోదలిస్తే ఎప్పుడో వేసుకొని ఉండవచ్చు కానీ ఆ దుర్విధానానికి మేము పాల్పడదలచలేదు. సరైనటువంటి ఎన్నికలు జరిపించి నిజమైనటువంటి ప్రజాస్వామ్యాన్ని సుస్థిరం చేయాలని......

*(ఇంటరప్షన్)*

అధ్యక్షా, స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరములు అయినా కూడా రైతులు తమ పంటలను ఇతర దేశాలకు ఎగుమతి చేసుకునే సౌకర్యం గానీ, మార్కెటింగ్ చేసుకునే సౌకర్యం గానీ కల్పించబడలేదనేది మనకు తెలిసిన విషయమే. దీనికి గాను ప్రత్యేకంగా వారికి ఈ పర్మిట్లు ఇచ్చినా ఏ ఎగుమతి సౌకర్యం కల్పించినా మధ్య దళారీలు ఉండకూడదు అనే పరమార్థంతోనే ఈ నిర్మాణం జరిగింది. కానీ మరొక విధంగా కాదని సవినయంగా మనవి చేస్తున్నాను. అదేవిధంగా రైతుకు కావలసిన సాంకేతిక పరిజ్ఞానం – ఏ పంట వేసుకోవాలి, ఏ విధంగా పోషించుకోవాలి, ఏ విధంగా నిర్వహించాలి, ఏ విధంగా వ్యవసాయానికి అనుబంధ పరిశ్రమలు ఇవ్వాలి, అవన్నీ వారికి ఇవ్వాలి. ఆ వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు ఏ వ్యాపారస్తులకో, మరొకరికో కట్టబెట్టడం కాదు. ఆ లాభాలన్నీ రైతే అనుభవించాలి. రైతుకే ముట్టచెప్పాలి. వారి సంక్షేమం వారే నిర్వహించుకోవాలి అనే విధానం దీని పద్ధతి.

**రైతుకు కావలసిన సాంకేతిక పరిజ్ఞానం - ఏ పంట వేసుకోవాలి, ఏ విధంగా పోషించుకోవాలి, ఏ విధంగా నిర్వహించాలి, ఏ విధంగా వ్యవసాయానికి అనుబంధ పరిశ్రమలు ఇవ్వాలి, అవన్నీ వారికి ఇవ్వాలి. ఆ వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు ఏ వ్యాపారస్తులకో, మరొకరికో కట్టబెట్టడం కాదు. ఆ లాభాలన్నీ రైతే అనుభవించాలి. రైతుకే ముట్టచెప్పాలి.**

అందువల్లనే ఈనాడు చిత్తూరు జిల్లాలో చక్కెర కో–ఆపరేటివ్ ఫ్యాక్టరీలో ప్రత్యేకంగా 100 పడకల ఆసుపత్రి ఒకటి, ప్రత్యేకంగా నర్సెస్ ట్రైనింగ్ సెంటర్ ఒకటి, ఈ విధమైన ఆదర్శవంతమైన సంక్షేమ కార్యక్రమాలు వారికి వారు నిర్వహించుకోగల్గుతున్నారంటే ఈ విధమైన ఆదర్శ మార్గం మీరు గమనించాలని సవినయంగా మనవిచేస్తున్నాను. ఇది రైతులపాలిటి పెన్నిధిగా ఉండాలి. రైతుకు స్వేచ్ఛా స్వాతంత్ర్యం ఇవ్వాలి. రైతును ఒక మనిషిగా సమాజంలో నిలబెట్టాలి. రైతు తను బిడ్డలను చదివించుకునే అవకాశం కల్పించాలనేదే దాని పరమార్థం అని మీకు సవినయంగా మనవిచేస్తున్నాను. ఇకపోతే మేము నిర్మించిన వ్యవస్థలలో వైద్య విధాన పరిషత్తు ఒకటి. దీని ఆంతర్యం అవగాహన చేసుకోవడం మంచిది. వైద్య విధాన పరిషత్తు అంటే ప్రభుత్వం ప్రజలకు ఆరోగ్యం కల్గించాలి. కాబట్టి ప్రైమరీ హెల్త్ సెంటర్, హెల్త్‌కేర్ ఇవి ప్రభుత్వంచే నిర్వహింపబడాలనేదే ఒక పరమార్థం. జిల్లాల్లో ఆసుపత్రులు కానీ లేక పాత తాలూకా ఆసుపత్రులు నిర్వహించడానికి సరియైన నిర్ణయాలు

తీసుకుని నిర్వహించేబడేటట్లు ఒక వ్యవస్థను రూపొందించడం మంచిదనే భావంతో ఈ వైద్య విధాన పరిషత్తును నిర్మించడం జరిగిందని సవినయంగా మనవిచేస్తున్నాను. పటిష్టవంతమైన ఆరోగ్యం విధానం అదే ప్రైమరీ హెల్త్ సెంటర్స్, చిరంజీవుల హెల్త్ కార్డు, అందరికీ తెలిసిన విషయమే. వారికి ప్రత్యేకమైన పర్యవేక్షణలో భావిపౌరుల ఆరోగ్యం కాపాడడం కోసం ఈ విధమైన వికేంద్రీకరణం చేయడం జరిగింది. కానీ మరొక ఉద్దేశ్యంతో కాదని దీని ఆంతర్యం గ్రహించాలని కోరుతున్నాను. అదేవిధంగా ఏకగవాక్ష విధానం ఎక్కే గడప, దిగే గడపగా రైతు, చిన్నతరహా రుణాలు, మధ్యకాలిక, దీర్ఘకాలిక రుణాలు వ్యవసాయ పరిశ్రమలకు సంబంధించి ఉత్పత్తులు, సంతరింపులు కానీ ఒకే చోట అన్నీ లభింప చేసుకునే విధానాన్ని అందించడమే దీని యొక్క పరమార్ధం. దీనికి ఎంతో కష్టంగా ప్రభుత్వాధికారులతో వివరంగా చర్చించి మన రాష్ట్రానికి తీసుకుని రావడం జరిగింది.

ఈ విషయంలో అనుమానాలు వ్యక్తం చేసిన తర్వాత ప్రధానిలాంటి విజ్ఞులు ఇది ఎంతో మంచిదని అన్నప్పుడు, దీనిని ఆచరించవచ్చునని సూచించడంలో ఉన్న పరమార్థాన్ని గౌరవనీయులు, విజ్ఞులు, విజ్ఞానమూర్తులు ప్రతిభా శీలురు అందరూ గమనించాలని నేను సవినయంగా మనవిచేస్తున్నాను. కాబట్టి ఈ ఏకగవాక్ష విధానాన్ని ప్రవేశపెట్టడం రైతుల సంక్షేమం కొరకే, అదే విధంగా పాస్ బుక్కులు రైతులకు ఇవ్వడం. రైతు తన బిడ్డను చదివించుకోవాలంటే, తన కూతురుకు పెళ్ళి చేయాలంటే తనకు ఉన్న ఇల్లు లేక పొలము తాకట్టు పెట్టి డబ్బు తెచ్చుకునే పరిస్థితి ఉంది. వారిని తాకట్టు విధానం పరిస్థితుల నుంచి తప్పించాలని, డబ్బు కలవారు ఏ విధంగా పాస్ బుక్కులు బ్యాంకులలో చూపించి డబ్బు తెచ్చుకునే వ్యవహారాలు చేసుకుంటున్నారో అదేవిధంగా రైతుకు గౌరవప్రదమైన ప్రతిపత్తిని కల్గించాలని, ఆదర్శవంతమైన, గౌరవప్రదమైన జీవనం ఇవ్వాలనే ఉద్దేశ్యంతోనే ఆ పద్ధతి చేయడం జరిగిందని సవినయంగా మనవిచేస్తున్నాను. కాబట్టి దీనిలో రుణ సౌకర్యం తెచ్చుకునే అర్హత విధానం ఉండాలని, వారికి అవసరం అయినప్పుడు కేవలం తాకట్టుతో కాకుండా, రుణం తెచ్చుకునే అవకాశం కల్గించాలనే ఉద్దేశ్యంతో దీని నిర్మాణం జరిగింది. పైగా పాస్ బుక్కులు డిసెంబరు 31వ తేదీలోగా మా గత ప్రభుత్వం రైతులందరికీ అందజేస్తామని దీనికి స్టాట్యూటరీ పవర్స్ తీసుకుని రావడం జరిగింది. కాబట్టి దీనిని మీరు ఏ విధంగా నిర్వహించినారో ఒక మాట కూడా గవర్నర్ గారి ప్రసంగంలో ఉదహరించలేదు. మా గత ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం దీనిని నిర్మించింది.

కాబట్టి దీనిని గౌరవించాలని, గౌరవిస్తామని మీరు నిర్ధారణ చేసి చెప్పాలని నేను సవినయంగా మనవిచేస్తున్నాను. తర్వాత విద్యకు సంబంధించి సరియైనటువంటి విధానం నిర్వచించకపోవడం శోచనీయం. ముఖ్యంగా ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు విద్యా విధానంలో తేవడం జరిగింది. ఎన్నోసార్లు గౌరవనీయమైన సభలో చెప్పడం జరిగిందని మనవిచేస్తున్నాను.

విద్య అనేది విజ్ఞాన ప్రదాయిని. కానీ కేవలం బానిస ఉద్యోగ ప్రవృత్తిని ప్రకటించే వ్యవస్థ కాదని మా అభిప్రాయంగా చెప్పినాను. కేవలం ఆనాడు ఉన్న బ్రిటిష్ నిరంకుశ, నియంతృత్వ వ్యవస్థ పోయింది కానీ ఆ విధానాన్ని మనము పూర్తిగా మార్చుకోలేదు. విద్య అంటే విజ్ఞానాత్మకమేనని మనము చెప్పలేదు. విద్యను గడించిన వారు వారి స్వేచ్ఛకు, స్వాతంత్ర్యానికి తమ కాళ్ళమీద తాము నిలబడి ఆదర్శవంతమైన మూర్తులుగా చేసుకోలేకపోతున్నారనే బాధతో ఈ విప్లవాత్మకమైన మార్పులు తీసుకుని రావడం జరిగింది. విద్యను అమ్ముకోవడం ఆచారం అయిపోయింది. కాపిటేషన్ అర్హత అవసరం లేకుండా డబ్బు ఇస్తేనే సీటు ఇచ్చే పద్ధతి ఉంది. డబ్బు ఉన్నవారు తమ బిడ్డలు విద్యాధికులు కావాలని, పేదవారి బిడ్డలు అర్హత ఉన్నా కానీ వారు మట్టి పిసుక్కోవాలి అన్నటువంటి ఈ దాస్య ప్రవృత్తిని తీసివేయాలనే భావంతో ఈ నిర్ణయం చేయడం జరిగింది. కాబట్టి డబ్బు ఇచ్చి సీటు సంపాదించే విధానం పోగొట్టడం జరిగింది. అందువల్ల కామన్ ఎన్‌ట్రెన్స్ పరీక్షా విధానం పెట్టడం జరిగింది.

అందులో అర్హుల లిస్టు తయారు చేయడం జరిగింది. వారి అర్హతలను చూసి అవకాశాలను కల్పించడమే కానీ, వారు వారి బిడ్డ, వీరు వీరి బిడ్డ అనే భేదభావంతో ఈ నిర్ణయాలు చేయలేదు. అదేవిధంగా విద్య అంటే కేవలం పాఠాలు పుస్తకాలలో చదవడమే కాని, వారు విజ్ఞానాత్మకమైన వృత్తి విద్యను అభ్యసింపచేయడం మనకు ఆచారం కావాలి. ఈనాడు ప్రకృతి ప్రయోగాలతో ఇతర దేశాలన్నీ రోదసీలో ప్రయోగాలు జరుపుకుంటూ ఉంటే ఇంకా మనము బి.ఏ., ఎం.ఏ. చదివి పట్టభద్రులై అందరూ ఉద్యోగాలు కావాలని అలమటించే విధానంలో ఉండడం మన దేశానికి అభ్యుదయకరం కాదన్నది మా పరిపూర్ణ విశ్వాసం వారికి వృత్తి విద్యను అభ్యసింప చేయాలి. ఏదైతే వారి జీవనానికి సుగమంగా ఉంటుందో అటువంటి విద్యను వారు అభ్యసించే పద్ధతిలో 8వ తరగతిలో ఈ వృత్తి విద్యను ప్రవేశ పెట్టడం జరిగిందని మనవిచేస్తున్నాను.

అదే విధంగా ఆడియో విజువల్ ఎడ్యుకేషన్. దృశ్య, శ్రవణ విద్యా విధానము పిల్లలకు వినోదవంతముగా ఉండాలి. ఆదర్శవంతమైన ప్రతిభా శాస్త్ర సమన్వితమైన విజ్ఞానదాయకమైన విద్యా విధానము పిల్లల భవిష్యత్తుకు అవసరం. పిల్లల మనో ప్రవృత్తిని గుర్తించి దృశ్య శ్రవణ విద్యా విధానము ప్రవేశపెట్టడం జరిగింది. అదే విధముగా "ఎర్నింగ్ వైల్ లెర్నింగ్" సంపాదించుకుని చదువుకోవాలి. మా నాన్న కోటీశ్వరుడు – లేక నేను ఒకరి వలన చదువుకుంటున్నాననే బానిస విద్యావిధానం చిరంజీవుల మనస్సులో రాకూడదు. అటువంటి మానవ ప్రవృత్తి గురించి–స్వతంత్ర భారతదేశానికి – దీని గురించి ఎంతో కష్టపడి శ్రమకోర్చి ఎంతమందో విజ్ఞులైన వారి భావనలు సమకూర్చుకుని ఈ విద్యా విధానాన్ని సమకూర్చడం జరిగిందని మనవి చేస్తున్నాను. ఇందులో రెండు షిఫ్ట్‌లు. ఒకటి దేశాభ్యుదయం గురించి నేషనల్ డెవలప్‌మెంట్ స్కీమ్స్. రెండవది చదువుకోవడం. ఇందులో నా సంపాదనతో నేను

చదువుకుంటున్నాననే గుర్తింపు ధ్యేయంగా ఉంటుందని మనవిచేస్తున్నాను. తెలుగుదేశం ప్రభుత్వం పరిపాలనలోనికి వచ్చిన తరువాత ఎగ్జామినేషన్స్ ఇన్ టైమ్, అకడమిక్ ఇయర్ ఇన్ టైమ్ అనే పద్ధతి పాటించాము.

ఈ పద్ధతిలో ఏ మాత్రము కాలము వృధా కాకుండా, కాలహరణం చేయకుండా ఏ సంవత్సరానికి ఆ సంవత్సరము నిర్ణీత కాలములో పరీక్షలు నిర్వహించి అకడమిక్ ఇయర్ పొడిగించకుండా నిర్వహించడం అనేది ఈనాడు సాధించిన విద్యలో మార్పు విధానము మనవిచేస్తున్నాను. విద్యకు దూరంగా రాజకీయాలు ఉండే ఆతీతమైన వాతావరణం కల్పించాలనేది మా ఉద్దేశ్యము. విద్య వేరు, రాజకీయాలు వేరు, విద్యనభ్యసించి తరువాత వారి విజ్ఞతతో దేశసేవ చేయవచ్చు. రాజకీయ ప్రభావం విద్య మీద పడకూడదు. వైషమ్యాలు, ఈర్ష్యాద్వేషాలు, పార్టీ వైషమ్యాలు గానీ చిరునవ్వుల్లో రాకూడదనే భావనతో రాజకీయాలకు ఆతీతంగా ఉంచాలానే ఉద్దేశ్యంతో స్కూల్ సర్వీసు కమిషన్, కాలేజ్ సర్వీస్ కమిషన్-వీటితో పాటుగా విశ్వవిద్యాలయాలలో ప్రశాంత వాతావరణం పరిరక్షించడానికి సిండికేట్ సభ్యులుగా అర్హులైన వారిని నామినేట్ చేయడం జరిగింది.

**రాజకీయ ప్రభావం విద్య మీద పడకూడదు. వైషమ్యాలు, ఈర్ష్యాద్వేషాలు, పార్టీ వైషమ్యాలు గానీ చిరునవ్వుల్లో రాకూడదనే భావనతో రాజకీయాలకు ఆతీతంగా ఉంచాలానే ఉద్దేశ్యంతో స్కూల్ సర్వీసు కమిషన్, కాలేజ్ సర్వీస్ కమిషన్-వీటితో పాటుగా విశ్వవిద్యాలయాలలో ప్రశాంత వాతావరణం పరిరక్షించడానికి సిండికేట్ సభ్యులుగా అర్హులైన వారిని నామినేట్ చేయడం జరిగింది.**

మీరు ఉదహరణంగా ఏదైనా తీసుకోండి - మేము ఏమాత్రము ఇందులో జోక్యము చేసుకోలేదు. ఇందులో నిష్ణాతులైన వారిని ఉంచామని తమ ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నాను. అదేవిధంగా విశ్వ విద్యాలయాల కులపతుల విషయంలో - కులపతిగా ఉండడానికి మంత్రులు అర్హులని మీరు చెప్పడం జరిగింది. అదే విధానం మీది అయితే ప్రజాస్వామ్యానికి ఆంతర్యము ఏమిటి? పరమార్ధం ఏమిటి? ప్రజలచేత ఎన్నుకోబడి, జాతి సంస్కృతికి విధాన వారసుడుగా నిర్ణయించబడిన ముఖ్యమంత్రి కంటే ఎవరి చేతనో నామినేట్ చేయబడిన గవర్నర్ ముఖ్యులు అనుకుంటే అది మీ యొక్క విజ్ఞతకే వదిలి వేస్తున్నాను. దాని మీద వ్యాఖ్యానించదలచుకోలేదు. ఆత్మ గౌరవానికి, జాతి గౌరవానికి, చైతన్యానికి, విజ్ఞానానికి ఇది నిదర్శమని సవివరంగా మనవిచేస్తున్నాను. అది జాతి కోసము చేశామే తప్ప ఒక వ్యక్తి కోసము కాదని మనవిచేస్తున్నాను.

*(ఇంటరప్షన్)*

అధ్యక్షా, తమరి అనుమతితో పూర్తిగా గవర్నర్ గారి ప్రసంగము గురించి మాట్లాడుతున్నాను. విశ్లేషణంగా నేను ఎవరి మీద మాట్లాడడం లేదు. ఏమాత్రము డీవియేట్ కావడం లేదు. కళలు

గురించి మనవి చేస్తాను. అకాడమీలు కళా స్రవంతికి సంస్కార, సముచిత వికాస విధాన ఆచారాలకు ఆటపట్టులుగా ఉన్నాయి. ఈ ఆటపట్టులన్నింటిని ఒకటిగా చేసి తెలుగు విశ్వవిద్యాలయంలోకి తెలుగుతనాన్ని రక్షించడానికి ఉద్దేశించబడి విలీనం చేయడం జరిగింది. ఈ విధంగా ఎవరినో ఒకరినో మరొకరినో అకాడమీ అధ్యక్ష పదవికి తీసుకుని రావాలనే మా ఆశయమైతే ఈ విధంగా మేము చేసి ఉండేవారము కావని మనవిచేస్తున్నాను. ఈ విధంగా తెలుగు విశ్వ విద్యాలయంలో తెలుగు సంస్కృతీ చరిత్రలను, విశేషాలను, ఆచారాలను ఉదాత్తమైన విజ్ఞుల ద్వారా ఉచితంగా వర్తించే పద్ధతిగా చేశామని సవివరంగా మనవిచేస్తున్నాను.

పరిశ్రమల విషయంలో – 40,684 చిన్న తరహా పరిశ్రమలు తెలుగుదేశం ప్రభుత్వ హయములో ప్రారంభించబడినవి. 238 భారీ మధ్య తరహా పరిశ్రమలు తెలుగుదేశం ప్రభుత్వ హయాములో ప్రారంభించబడినాయని మనవిచేస్తున్నాను. కానీ ఇందులో కొన్ని విషయాలలో దురదృష్టవశాత్తు దెబ్బ తిన్నాము. కొన్ని భారీ పరిశ్రమలు ఉమ్మడి జాబితాలో ఉండడం వలన – వాటికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకూడదనే పద్ధతిలో పోవడం వలన కొంత లోటుపడిందని నేను అంగీకరిస్తున్నాను. ముఖ్యంగా వరంగల్‌లో ఫ్యాక్టరీకి అనుమతి ఇవ్వలేదు. విశాఖలో బాక్సైట్ ఖనిజాలు ఉన్నాయి. కనీసము మన రాష్ట్రములో అల్యూమినియం ఫ్యాక్టరీ అనుమతించినట్లయితే మనకు ఎగుమతులు, దిగుమతులకు ఎక్కువ అవకాశాలుండి, ఆ విధంగా పారిశ్రామికాభివృద్ధి జరిగి ఉండేదేమో కానీ అట్లాంటి అదృష్టానికి నోచుకోలేదు. నేను ఎన్ని ఇబ్బందులకు గురి అయ్యానో, నేను అవన్నీ బాధతో ఆచరించిన వాడిని కనుక, నేను బాధతో ఈ సంగతి వ్యక్తము చేస్తున్నాను. అంతెందుకు కలర్‌ట్యూబ్ ఫ్యాక్టరీ విషయంలో ఫిలిప్పీన్స్, నెదర్లాండ్స్ వారితో మాట్లాడి ఒక అంగీకారం కుదుర్చుకోవడం జరిగింది. అంగీకారం కోసము అప్లికేషను పెట్టాము. మా వెనుక వచ్చిన వారికి అంగీకారం ఇచ్చారు. మేము ఏమి పాపము చేసుకున్నాము? మమ్మల్ని ఎందుకు ఈ విధంగా బాధపెట్టారు.

*(ఇంటరప్షన్)*

నేను ఇంతకూ చెప్పేది ఏమిటంటే క్రొత్తగా పాలకపక్షము నాయకులు వచ్చారు. మేము సాధించలేక పోయింది వారిని సాధించమనండి. రాష్ట్ర అభివృద్ధికి పాటుపడండి అని గౌరవనీయులైన సభా నాయకులు డాక్టర్ యం.చెన్నారెడ్డి గారికి మనవిచేస్తున్నాను. మేము అంత మాత్రం చేత దిగులుపడి కూర్చోలేదు. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్స్ కార్పోరేషన్ తెలుగుదేశం ప్రభుత్వం పూనుకున్నదే. విశాఖపట్టణం ఫ్రీ ట్రేడ్ జోన్‌గా చేశాము. విచ్చలవిడిగా ఎగుమతులు, దిగుమతులు ద్వారా అభివృద్ధి చేయడానికి తెలుగుదేశం ప్రభుత్వం ప్రయత్నం చేసింది. ఏమీ అవరోధాలు లేకుండా వస్తుందనుకుంటున్నాను, ఇండస్ట్రీస్ విషయంలో పారిశ్రామిక అభివృద్ధి గురించి తెలుగుదేశం ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని మనవిచేస్తున్నాను. నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వము

వచ్చిన తరువాత గానీ అనుమతి లభించలేదని నేను విన్నాను. ఈ ప్రభుత్వము ఏ విధమైన దురదృష్టానికి నోచుకున్నదో నేను తమ ద్వారా సభకు తెలియచేస్తున్నాను. నల్లగొండ జిల్లాలో తెలుగుదేశం ప్రభుత్వము సిమెంట్ ఫ్యాక్టరీలకు అనుమతి ఇచ్చింది. నేను లెక్కలు చెప్పబోవడం లేదు గానీ - పారిశ్రామికాభివృద్ధి కొరకు తెలుగుదేశం ప్రభుత్వం పాటుపడిందని మనవిచేస్తున్నాను.

ఇకపోతే యాంటీపొల్యూషన్ విధానాన్ని అమలు చేస్తామనీ, అమలు చేసినప్పుడు, మీరు కూడా అమలు చేసేటట్లు అనుమతి ఇస్తామని గౌరవ ప్రధానమంత్రిగారే నాకు స్వయంగా చెప్పారు. పొల్యూషన్ ఉండకూడదు చాలా సంతోషమే. ఆ విధంగానే ఈనాడు పొల్యూషన్‌ను అతి పటిష్టంగా కంట్రోల్ చేయడంలో గానీ, కాలుష్యాన్ని నివారించడంలో గానీ, ఈనాడు పూర్తిగా అమలు చేసిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదన్నమాటని మీ ద్వారా మనవిచేస్తున్నాను. ఇన్సెంటివ్స్ విషయంలో ఏవిధమైన భావనతో ప్రవేశపెట్టబడ్డాయో మీకు తెలుసు. వెనుకబడిన శ్రీకాకుళం, ఆదిలాబాదు, అనంతపురం జిల్లాలలో 20 శాతం కాపిటల్ కాస్ట్ రూ.20 లక్షలు మించకుండా వారికి సబ్సిడీ ఇచ్చే పద్ధతి, అదేవిధంగా మిగతా జిల్లాలలో 15 శాతం మించకుండా రూ.15 లక్షల వరకు సబ్సిడీ ఇచ్చే పద్ధతి 10 సంవత్సరాల వరకు సేల్స్‌టాక్స్ వారికి హాలిడే నిధిగా సమకూర్చడం, వాయిదాల మీద దాన్ని తీసుకోవడానికి కూడా అవకాశం కల్పించబడిందని, మధ్యతరహా పరిశ్రమలు, శ్రీకాకుళం, ఆదిలాబాదు, అనంతపురం జిల్లాలలో ప్రారంభించబడే వారికి సౌకర్యము కల్పించబడింది. ఇతర జిల్లాలలోని వారికి 50 నుండి 75 శాతం వరకు కూడా ఈ విధమైన సేల్స్‌టాక్స్ 10 సంవత్సరముల వరకు వారికి కల్పించబడిందని మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను.

జిల్లా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ - ప్రతి జిల్లాలో కూడా ఆయా జిల్లాల్లో ఉన్న వనరులు ఏమిటి? వాటిని ఎగ్జిబిషన్ రూపేణా నిర్వర్తింపచేసి, అధికారులు అందరూ వెళ్ళి, టెక్నోక్రాట్స్ యువకులను చదువుకొన్న వారిని రానించి వారికి తెలియజేసి, నచ్చజెప్పి, పరిశ్రమలు పెట్టుకొనే విధంగా ప్రోత్సహించి ముందుకు వచ్చే వారికి 30 రోజులలో అన్ని లైసెన్సులు వారికి అందించే ఏర్పాటు చేయడం జరిగింది. ఇవన్నీ ఏక గవాక్ష విధానము. రెవెన్యూ క్లియరెన్స్ ఒకచోట, మున్సిపల్ క్లియరెన్స్ ఇంకొక చోట ఈ విధంగా కాకుండా, అన్ని ఒకేచోట వారికి అనుమతి లభ్యమయ్యే విధానంగా వారికి సంక్షేమ కార్యక్రమం కల్పించబడింది. చిన్న తరహా పరిశ్రమలకు అన్ని జిల్లాలలో కూడా 5 సంవత్సరముల వరకు సేల్స్ హాలిడే ఇవ్వడం జరిగింది. 35 లక్షల వరకు పరిమితిని నిర్ణయించడం జరిగిందని సవినయంగా మనవిచేస్తున్నాను. పరిశ్రమల టవున్ షిప్‌ను ఏర్పాటు చేశాము. అది మన గౌరవం. పరిశ్రమలు ఒకేచోట ఉండాలి. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అందరికీ సక్రమంగా, సమంగా ఇవ్వాలనే ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఇండస్ట్రియల్

గ్రోత్ సెంటర్స్ మూడు ప్రాంతాలలో కూడా మన రాయలసీమ, తెలంగాణ ప్రాంతాలలో అక్కడ గ్రోత్ సెంటర్స్‌ని నిర్ణయించడం జరిగిందని ఈ సందర్భంగా సవినయంగా మనవిచేస్తున్నాను.

గౌరవనీయ గవర్నరుగారి ప్రసంగములో లేబరును మరచారు. ఈనాడు డబ్బే ప్రధానం కాదు. శరీరము, శ్రమే పెట్టుబడిగా ఉన్నటువంటి ఈ ఆధునిక పారిశ్రామిక విధానముతో ఏ విధంగా లేబరును గౌరవించాలి? వర్కర్సు సంక్షేమానికి ఏ విధంగా పాటుపడాలి అన్నది విస్మరించబడడం శోచనీయమైన విషయం అని సవినయంగా మనవిచేస్తున్నాను. తెలుగుదేశం ప్రభుత్వము ఈ లేబరు బిల్లుకు సంబంధించినంతవరకు ఒక చట్టపరమైన విధానాన్ని ప్రతిపాదించడం జరిగింది. కార్మికులకు మేనేజిమెంటులో భాగస్వామ్యం ఉండాలి. మీ పెట్టుబడిదారునికి కూడా తన పరిశ్రమను కార్మికుల అనుమతి లేకుండా మూత వేయడం గానీ, మూసివేయడం గానీ, లాకౌట్ ప్రకటించడం గానీ చేయకూడదని ఇందులో పొందుపరచడం జరిగిందని గౌరవ విజ్ఞతామూర్తులకు సవినయంగా మనవి చేస్తున్నాను. మంచిని తీసుకొని శ్రమ జీవులను పోషించండి. వారి యొక్క భావి అభ్యుదయాన్ని ఆశించండి. పెద్ద పెద్ద పరిశ్రమలు, ఎక్కడికక్కడ పారిశ్రామిక వాడలు నిర్మించబడాలి. కార్మికులందరూ చక్కగా దగ్గరలో ఉండేటట్లు, వారి బిడ్డలు చదువుకునేటట్లు, వారికి చక్కని సామాన్య జీవిత విధానానికి అనువైన వస్తువులు అన్నీ గిట్టుబాటు ధరలో అందించేటట్లు చర్యలు తీసుకోవలెనని ప్రభుత్వ విధానంగా, మేము నిర్వహించిన పద్ధతిగా మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను. నేను రాజకీయంలోకి వచ్చి 7 సంవత్సరములు మాత్రమే అయింది. కానీ మీరు ముందు నుంచి ఉన్నారు. Government policy only to promote but not to under-take.

ప్రభుత్వము వ్యాపార వ్యవస్థకాదు. ఎవరైనా ఉత్సాహముతో ముందుకు వస్తే, వారి ఉత్సాహాన్ని గుర్తించి, వారికి దోహదము చేయాలి. అండదండలు ఇవ్వాలి, ప్రగతికి దారి తీయాలనేదే ఆదర్శం కాని, పరిశ్రమలు కానీ, మరొకటి కానీ, వ్యాపారార్థకంగా నిర్వహించబడాలన్నది తెలుగుదేశం సిద్ధాంతము కాదని మనవిచేస్తున్నాను. పరిశ్రమలకు పెట్టుబడిని అందివ్వడం, జాయింట్ కంపెనీగా దాని ప్రగతికి పాటుపడడం, అది చక్కగా లాభాలు సంతరించుకొనేటప్పుడు మనము పెట్టిన పెట్టుబడిని తీసుకొని మరొక చోటకు అందివ్వడం, పాడి పరిశ్రమను అందివ్వడం ఇది మా ధ్యేయము కానీ, ప్రత్యేకంగా మరొకటి కాదు. దీనివల్ల ప్రభుత్వానికి భారము తగ్గుతుంది. ఎన్నో పరిశ్రమలు ముందుకు వెళ్ళి లాభాలు గడిస్తున్నాయి. వాటికి మన సహకారము అక్కరలేదు. అటువంటిప్పుడు మనము పెట్టిన పెట్టుబడిని తిరిగి తీసుకొని కొత్త పరిశ్రమలకు పెట్టడంవల్ల, పారిశ్రామిక విధానము పెరుగుతుందనే భావంతో ఈ విధానం అనుసరించడం జరిగిందని మనవిచేస్తున్నాను. అదేవిధంగా విద్యుచ్ఛక్తిని తయారుచేసే విధానము – 1982–88లో విద్యుచ్ఛక్తి 148 యూనిట్స్ ఉండేది. ఈ రోజు 213 యూనిట్స్‌కు

పెంచబడింది. మనము అనుకున్నంత కాకపోయినా – నేనే చెబుతున్నాను థర్మల్ పవర్ రెండింతలు, హైడల్ పవర్ ఒకింత ఉండాలి. దురదృష్టవశాత్తు మనకున్న సౌకర్యాల వీలు చూచుకొని ఆనాడున్న ప్రభుత్వము జల ఉత్పాదన శక్తిని పెంపొందించారు.

దీనివల్ల రెండింతలుగా హైడల్ ఎలక్ట్రిక్ పవర్ ఉంది. దీన్ని పెంచడానికి ఎన్నో విధానాలు, కార్యక్రమాలు – ముద్దనూరు థర్మల్ పవర్ స్టేషన్, అదేవిధంగా విజ్జేశ్వరం దగ్గర లభించనున్న గ్యాస్ వినియోగించుకొని విద్యుచ్ఛక్తిని తయారు చేసుకోవడం, అదేవిధంగా విజయవాడ మూడవ స్టేజ్ పూర్తి చేయడం జరిగింది. నాలుగవ స్టేజ్ వెంటనే పూర్తి చేయాలని నిర్ణయం తీసుకోవడం, అదేవిధంగా విశాఖపట్టణంలో 1000 మెగావాట్స్ విద్యుచ్ఛక్తి ఉత్పాదన కేంద్రాన్ని ఏర్పరచుకోవాలని అనుకోవడం ఇవన్నీ ప్రభుత్వ యోచనలని మనవిచేస్తున్నాను. మీకు ఈ క్లూస్ అన్నీ అందిస్తున్నాను. మీరు వీటిని నిర్వహించండి. దేశాన్ని అభ్యుదయ పథంలోకి నడపండి ఆ విధంగా ప్రజలకు హామీ ఇవ్వండి. పరిశ్రమల గురించి పాటుపడతామని చెప్పండి. కాబట్టి ఇది మన ధర్మం, మన ధ్యేయంగా మీ అందరికీ సవినయంగా మనవి చేస్తున్నాను. ఇది దేశాభ్యుదయానికి, ప్రగతికి, పారిశ్రామిక ఉత్పత్తికి ఉపయోగపడుతుందని అందుకు కృషి చేయాలని ప్రతిఒక్కరికీ సవినయంగా విజ్ఞప్తి చేస్తున్నాను. పైగా మనకు కోల్ లింకేజి, మనకు సింగరేణి కాలరీ దేవుడిచ్చిన నిధి. నల్ల బంగారం కాబట్టి దీనిని కూడా ఉపయోగించుకోవాలి. ఈ కోల్ లింకేజి విషయంలో ఎన్నోసార్లు ప్రయత్నించాము. సాఠేగారి దగ్గరికి కూడా నేను ఎన్నోసార్లు వెళ్ళాను. ప్రత్యేకంగా మాకు లింకేజీ ఇవ్వండి అని. ఇస్తాను, ఇస్తాను అని అన్నట్లు వాగ్దానాలు మాత్రం మా రికార్డులో ఉన్నాయి.

కాబట్టి ఆ వాగ్దానాలను అనుసరించి మీరు నేరవేర్చండి అని మనవిచేస్తున్నాను. అదే విధంగా పబ్లిక్ అండర్ టేకింగ్సు. పబ్లిక్ అండర్ టేకింగ్సు, ప్రభుత్వ రంగసంస్థలు మరి అప్పటికి మా ప్రభుత్వం వచ్చేనాటికి అవి ఏ విధంగా ఉన్నాయి? ఈనాడు ఏ విధంగా లాభాలు గడిస్తున్నాయి? ఈ సంవత్సరం 38 ప్రభుత్వ రంగసంస్థలు సుమారుగా 451 కోట్లు లాభాలు గడించాయి. నికర లాభాలు అంటే మరి ఏ విధమైనటువంటి ఉద్దీపనతో, చైతన్యంతో పని చేస్తున్నవో, మరి ఏ విధమైనటువంటి శ్రద్ధ తీసుకోబడిందో గౌరవనీయులు గమనించాలని సవినయంగా తమద్వారా మనవిచేస్తున్నాను. మరి వాటిని అధికారులతో పరిమితం చేయకుండా టెక్నోక్రాట్స్‌ని ఇక్కడ మేనేజింగ్ డైరెక్టర్స్‌గా గానీ, ఛైర్మన్లుగా గానీ నియమించడం జరిగింది. అదే విధానంగా ఈనాడు ఎ.పి.ఎస్.ఆర్.టి.సి; ఆల్విన్స్, ఎన్.ఎఫ్.సి., ఎ.పి.ఎస్.ఇ.బి. ఇత్యాది వ్యవస్థలు అన్నీ కూడా ఎంతో లాభసాటిగా వ్యవహరిస్తున్నాయి. మా యొక్క పరిపాలనా కాలంలో గత పరిపాలన కాలంలో అంటే మేము ఏ విధమైనటువంటి శక్తియుక్తులతో వాటిని నడిపామో కూడా దయచేసి గ్రహించండి కనీసం, అని కూడా మీకు మనవిచేస్తున్నాను. మరి వాటిని తిరిగి నష్టాలపాలు

చేయకుండా సక్రమంగా సువిధానంగా ఉంచేటట్లు చూడమని మీకు నేను విజ్ఞప్తి చేస్తున్నాను. అంతేకాకుండా మేము ఈ పబ్లిక్ అండర్ టేకింగ్సుని పరిశీలించుటకు ఒక ప్రత్యేకమైనటువంటి వ్యవస్థను నియమించడం జరిగిందని మనవిచేస్తున్నాను. దీనిని సరిగా సకాలములో ఆ వ్యవస్థను పూర్తిగా పర్యవేక్షించడం, పరిశీలించడం, ఏ విధంగా నడుస్తోందో గ్రహించడం మరి కామన్ ఆడిట్ సెల్, కామన్ లీగల్ సెల్ వీటన్నింటిని కూడా ఏర్పర్చడం జరిగిందని మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను. ఇన్ని చర్యలు తీసుకోవడం వల్ల, ఏ మాత్రం కూడా జోక్యము కలిగించుకోకుండా ప్రభుత్వరంగ వ్యవస్థను పూర్తి ప్రజాస్వామ్య రీతిలో ప్రజా సువిధానంగా పాటుపడేటట్లు చేయడం మా ఆదర్శం అని మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను.

అధ్యక్షా, ఇక్కడ ఆర్థిక విధానంలో గత మా ప్రభుత్వం పాటించిన కృషి, శిక్షణ విధానం పెంపొందించిన విధానం కూడా తెల్పడం నా ధర్మం. 1983లో కేవలం రూ.558 కోట్లుగా ఉండే బడ్జెట్‌ను అదే ఈ సంవత్సరంలో సుమారుగా 1300 కోట్లు, రూ.1350 కోట్లకి పెంపొందించబడింది. అభివృద్ధి చేయబడింది అంటే ఏ విధమైన పటిష్టవంతమైన నిర్వహణ విధానం చేపట్టబడిందో దయచేసి గ్రహించాలని మనవిచేస్తున్నాను. రూ.235 కోట్లను, రూ.600 కోట్ల వరకు పెంచడం అదే కమర్షియల్ టాక్సెస్ రూ.400 కోట్ల నుంచి రూ.1350 కోట్ల వరకు పెంచడం, మరి అదనంగా ఉన్న, తెలియకుండానే ఉన్నటువంటి లూప్ హెూల్స్ అన్నీ ప్లగ్ చేసి వాటిని ఏ విధమైనటువంటి అక్రమం, అవినీతికి పాలుపడకుండా చేసి ఏవిధంగా క్రమశిక్షణ పద్ధతిలో ఆర్థిక ప్రగతిని సాధించగలిగామో గ్రహించాలి అన్నది మా మనవిగా మీకు మనవిచేస్తున్నాను.

**ఆర్థిక విధానంలో గత మా ప్రభుత్వం పాటించిన కృషి, శిక్షణ విధానం పెంపొందించిన విధానం కూడా తెల్పడం నా ధర్మం. 1983లో కేవలం రూ. 558 కోట్లుగా ఉండే బడ్జెట్‌ను సుమారుగా 1300 కోట్లు, రూ. 1350 కోట్లకి పెంపొందించబడింది. అభివృద్ధి చేయబడింది అంటే ఏ విధమైన పటిష్టవంతమైన నిర్వహణ విధానం చేపట్టబడిందో గ్రహించాలని మనవిచేస్తున్నాను.**

అదేవిధంగా గౌరవనీయులు సాల్వేగారు వచ్చినపుడు వారికి నేను చెప్పాను. ఈనాడు ప్రభుత్వ వ్యయం 60 శాతం నుంచి 70 శాతం వరకు పెరగడం దురదృష్టం. మనం సరైన క్రమశిక్షణతో కేంద్రం కూడా ఒక నిర్ణయానికి వచ్చి రాష్ట్ర ప్రభుత్వాలు అన్నింటిని కానీ తగు విధముగా అది 27 శాతం మాగ్జిమమ్ 39 శాతమో కనుక దానిని మనం నిర్ధారించినట్లయితే బాగుంటుందని నేను సూచించినప్పుడు వారు దానికి ఉత్సాహంగా, గౌరవ ప్రధానంగా, గౌరవప్రదంగా ఇటువంటి ఆలోచన నేను తొలిసారిగా విన్నాను. అందరికీ కూడా చెబుతాను. ఈ విధంగా పాటించడం ప్రజాశ్రేయస్సుకి మేలు, ప్రజల దగ్గర నుంచి మనం పన్నుల రూపేణా తీసుకున్నటువంటి డబ్బును ఎక్కువ శాతం వారి సంక్షేమానికే వినియోగించడం మనకు ఆదర్శంగా

ఉండడం ఎంతైనా మంచిదని అభినందించడం జరిగింది. కాబట్టి ఈ విధానం కూడా దయచేసి పెద్దలు అనుభవజ్ఞులు, విజ్ఞులు ఆలోచించవలసినది మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను. ఇక ప్రాజెక్టుల సంగతి, మరి ఇది ఎంతో శోచనీయమైన విషయం. బచావత్ నిర్ణయం దానికి 2000 ఎ.డి. వరకే శక్తి ఉంది. 1990వ సంవత్సరములో ఉన్నాము. ఇక పది సంవత్సరాలు కూడా లేదు. మరి ఈ వాదోపవాదాలతో కాలక్షేపం చేసే దానికంటే మన రాష్ట్ర ప్రగతి కోసం దయచేసి మీరందరూ కూడా విజ్ఞతతో దీని విషయం ఆలోచించాలని మనవి చేస్తున్నాను.

మీకు తెలుసు. కృష్ణా డిస్ప్యూటెడ్ వాటర్. దీంట్లో 2060 టి.ఎం.సి. వాటర్ ఉందని, అందులో 760 టి.ఎం.సి. కర్ణాటక అని, 500 టి.ఎం.సి. మహారాష్ట్రకి అని, అందులో 800 టి.ఎం.సి. మన ఆంధ్రప్రదేశ్‌కి అని నిర్ణయించడం జరిగిందని పెద్దలకు తెలుసు. నష్టపడేది ఏదైనా ఉంటే ఆఖరిగా ఉండేటటువంటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. తొలి రాష్ట్రం అయినటువంటి మరి కర్ణాటక గానీ, మహారాష్ట్రగానీ వారి వంతు వారి వాటా వారు తీసుకుంటారు. ఎప్పుడైనా 75 పర్సంటు డిపెండబిలిటీ మీద కనుక తక్కువ వర్షపాతం పడినట్లయితే తక్కువ వచ్చేది ఆంధ్రప్రదేశ్‌కే ఆఖరు రాష్ట్రంగాను. కాబట్టి మిగిలి ఉన్న వాటిని సముద్రములోనికి వృథాగా పోనీయకుండా వాటిని ఉపయోగించుకునేటటువంటి అవకాశం, అధికారం ఇచ్చాము అని చెప్పి అక్కడ క్లియర్‌గా చెప్పడం జరిగిందని మనవిచేస్తున్నాను. అందువల్లనే ఇది అష్యూర్డ్ వాటర్, అష్యూర్డ్ వాటర్ ఎప్పుడో పుచ్చుకున్నాము. 369 టి.ఎం.సి. నీళ్ళు మా ప్రభుత్వం కాదు. గత ప్రభుత్వాల హయాములోనే అది అన్ని ప్రాజెక్టులకు పంచబడింది. సహృద్భావం ఉంది. అన్నీ ఉన్నాయి. కానీ నీళ్ళు వృథాగా పోతున్నాయి సముద్రములో.

*(ఇంటరప్షన్)*

అధ్యక్షా, దీనిని ఆధారంగా చేసుకొని విజయవాడ వద్ద ఉన్న 323 టి.ఎం.సి. నీరు వృథాగా పోతున్నదని అక్కడ మీటరని బట్టి తేలుతున్నది. అది రికార్డు అయి ఉంది. It is on record. దీనిని తెలుసుకొని ఉన్న నీటిని దప్పికతో గొంతుక ఎండిపోతున్న సోదరులకు తెలంగాణ, రాయలసీమ సోదరులకు నీరు ఇవ్వాలని వారికి నీటి వనరులు ఏ కాలంలో అయినా అనుభవించే విధంగా వారి సేవకోసము నియమితమైన పద్ధతి అవలంబించడం జరిగిందని మనవిచేస్తున్నాను. దాని ఫలితమే ఈ శ్రీశైలము ఎడమ కాలువ, భీమా ప్రాజెక్టు, తెలుగుగంగ ప్రాజెక్టు మొదలైనవిగా ఏర్పడడం జరిగిందని మనవిచేస్తున్నాను. ప్రజా సేవకుడిగా వాటిని అమలు చేయడానికి కృషి చేయడం జరిగింది. కాబట్టి గవర్నరుగారు ఇచ్చిన ప్రసంగంలో కేవలం శ్రీశైలం ఎడమకాలువ విషయమే చెప్పారు. కానీ మిగతా విషయాలు అనగా శ్రీశైలము కుడి కాలువ, గాలేరు, జూరాల, హంద్రి, నగరి, భీమా, పులిచింతల, సుంకేసుల, చిత్రావతి బాలెన్సింగు రిజర్వాయరు, వంశధార ప్రాజెక్టు ఇత్యాది ప్రాజెక్టుల సంగతి ఏమి అయినవి. ఆ ప్రాజెక్టులు ఏం కావాలి? అవి

ప్రారంభించబడలేదా? ఇవన్నీ ఏమిచేయబోతున్నారనేది దయచేసి తమ అభిప్రాయాలు ఏమిటో ప్రజలకు తెలిసేలా ప్రకటించండి. అసలు ఆ ప్రాజెక్టులను ప్రారంభించలేదా? ఇపుడు ఆ పాజెక్టులన్నీ కూడా వెంటనే పూర్తి చేసి అక్కడ ప్రజలకు కావలసిన నీరు అందించాలని కోరుతున్నాను. అక్కడ నీటికోసం అలమటించే ప్రజలకు ఒక గుక్కెడు నీరు ఈ ప్రభుత్వం అందించాలని కోరుతున్నాను.

అదే విధంగా ఇపుడు కె.సి. కెనాల్‌కు ప్రత్యేకంగా ఈ కృష్ణా జలాలను అందించాలి. ఎందుకంటే అనంతపురం జిల్లా ఎడారిగా మారిపోతున్నది. కాబట్టి అనంతపురం జిల్లాకు తుంగభద్ర నీరు అందించాలని అనుకున్నాము. అక్కడ ధర్మవరం కెనాల్ మొదలైనవి కూడా కట్టడాలు ఉన్నాయి. కాబట్టి దయచేసి ప్రజలకు చెప్పండి. మీరు వారికి ఏమి సేవ చేయగలరో చెప్పండి. ఇక యువకుల విషయంలో అనుకున్నంతగా మేము చేయలేకపోయాము. ఆ లోటు భర్తీ చేసి ఈనాడు ప్రత్యేకంగా వ్యవసాయానికి, విద్యుచ్ఛక్తి రంగానికి ప్రాధాన్యత ఇచ్చి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు యువకుల కోసము చేయడం జరిగింది. ఈనాడు మేము ఇక్కడ ప్రతిపక్షంలో కూర్చున్నాము. మీరు అక్కడకు చేరుకున్నారు. అందుకు సంతోషం.

అందుకు మాకు ఏమీ బాధలేదు. కానీ మీరు ఇచ్చిన హామీలను, మేము ఇచ్చిన హామీలను మీ ప్రభుత్వం నెరవేర్చాలి. ఆ విధంగా యువకులకు ప్రోత్సాహం కలిగించి వారిని భవిష్యత్తులో మంచి భారత పౌరులుగా తీర్చిదిద్దండి. ఇపుడు యువకుల విషయంలో ఈ నిరుద్యోగ సమస్య పెనురాక్షసిలాగా తయారయింది. అందుకే మరి మా ప్రభుత్వ హయాములో హిమాయత్‌నగర్‌లో యువ శక్తి ప్రాంగణం నిర్మాణం ఒక కోటి రూపాయల వ్యయంతో నెలకొల్పబడింది. అక్కడ అన్ని శిక్షణా తరగతులు ఏర్పాటు చేసి, అన్ని విద్యలలో శిక్షణ కల్పించి గ్రామాలలో ఉన్న యువశక్తిని అక్కడికక్కడే ప్రోత్సహించి, ప్రేరేపించే విధంగా ఆయా పనులు ఆ యువకులే చేసుకునే విధంగా అంటే విద్యుచ్ఛక్తి విషయం తీసుకుంటే కరెంటు లైనులు వారే వేసుకోవడం, ఎలక్ట్రిక్ ఫ్యూజులు వేసుకోవడం వంటి పనులు వారే చేసుకోవడం కోసం వీలుకల్పించబడింది. ఆ విధంగా గ్రామాలలోని యువశక్తిని ఉపయోగించుకోవాలి.

మేము ప్రభుత్వములో ఉన్నప్పుడే ఎ.పి.ఎస్.ఇ.బి, ఎస్.ఎఫ్.సి. మొదలైన ప్రభుత్వ రంగసంస్థల సహాయాన్ని ఈ యువకులకు శిక్షణ కల్పించడం కోసం కోరడం జరిగింది. అందుకు వరల్డ్ బ్యాంక్ వారు దీనికి సహాయం చేయడానికి గాను హామీ ఇవ్వడం కూడా జరిగింది. వరల్డ్ బ్యాంక్ వారు కూడా ఈ సెరీకల్చర్‌కు సంబంధించిన ప్రాజెక్టులను 125 కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేయడానికి అంగీకరించారు. అపుడు రూరల్ యూత్ కొరకు వాణిజ్య పంటలకు, సెరీకల్చర్ ప్రాజెక్టులకు గాను లోన్సు ఇవ్వడం వల్ల ఒక్కొక్కరికి 20 నుంచి 40 వేల రూపాయల వరకూ వారే ఒక్కొక్కరూ సంపాదించుకోగలిగారు.

వీటిని ముఖ్యంగా చిత్తూరు, శ్రీకాకుళం, అనంతపురం, విజయనగరం, విశాఖపట్నం, ఆదిలాబాద్, కరీంనగర్‌లను నాలుగు కేంద్రాలుగా విభజించి 400 కో-ఆపరేటివ్ సొసైటీలు ఏర్పాటుచేసి ఒక్కొక కో-ఆపరేటివ్ సొసైటీకి 100 ఎకరాల స్థలం ఏర్పాటు చేయడం జరిగింది. దానిలో పూర్తిగా రీసెర్చి స్టేషన్స్, వీవింగు సెంటర్లు, కకూన్ మార్కెట్లు మొదలైనవి ఏర్పాటు చేయడానికి నిర్ణయించడం జరిగిందని మనవిచేస్తున్నాను. ఆ విధంగా జరిగిన దానిని చెబుతున్నాను. దయచేసి మీరు వాటిని కంటిన్యూ చేస్తూ మా నిర్ణయాలను అమలు చేస్తామని చెప్పండి. ఆ విధంగా ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని ఇక్కడ హామీ ఇవ్వవలసిందిగా ఈ సభకు మీ ద్వారా మనవిచేస్తున్నాను. ఇక యువకులు ఆ విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తే సంతోషిస్తారు. అదే విధంగా మంచినీటి సౌకర్యం విషయంలో 1983 నాటికి 5,600 పేదల నల్లాలు ఉంటే మరి మా ప్రభుత్వ నిర్వహణలో వాటిని సుమారు 25,000లకు పెంచడం జరిగింది. మరి ఎన్నో లక్షల బోర్‌వెల్స్‌కి విద్యుచ్ఛక్తి కనెక్షన్స్ అందించడం జరిగింది.

**జంట నగరాలకు నీరు అందివ్వడానికి గాను సింగూర్ ప్రాజెక్టు నుంచి వచ్చే జూన్ నాటికి నీరు అందివ్వడానికి సంకల్పించి పని మొదలు పెట్టడం జరిగింది. ఆ పనిని వెంటనే ఈ ప్రభుత్వం పూర్తి చేయాలి. అక్కడ ఉన్న నీరు నిల్వ 2000 ఎ.డి. వరకు జంటనగరాలకు సరిపోతుంది. ఆ విధంగా అధికారుల చేత అంచనా వేయబడింది.**

ఈ విధంగా గ్రామాలలో పౌరులకు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించాము. ఆ విషయం ఇక్కడ అందరికీ తెలిసినట్టే. కాబట్టి వాటి విషయంలో నేను చెప్పవలసిన అవసరం లేదు. ఇక జంట నగరాలకు నీరు అందివ్వడానికి గాను సింగూర్ ప్రాజెక్టు నుంచి వచ్చే జూన్ నాటికి నీరు అందివ్వడానికి సంకల్పించి పని మొదలు పెట్టడం జరిగింది. ఆ పనిని వెంటనే ఈ ప్రభుత్వం పూర్తి చేయాలి. అక్కడ ఉన్న నీరు నిల్వ 2000 ఎ.డి. వరకు జంటనగరాలకు సరిపోతుంది. ఆ విధంగా అధికారుల చేత అంచనా వేయబడింది. ఆ తరువాత శాశ్వత మంచి నీటి పరిష్కారానికి జంటనగరాలకు కృష్ణానదిలోని నీటిని అక్కంపల్లి రిజర్వాయరు ద్వారా మూడు దశలలో తీసుకురావడానికి నిర్ణయించబడింది. దానికిగాను 600 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుంది. ఈ విధంగా నీరు తీసుకువచ్చేటపుడు ఎక్కడా ఎవరి స్థలాలు ఎక్విజిషన్ చేయవలసిన అవసరంలేదు. రోడ్డు ప్రక్కనే మూడు గొట్టాలు ద్వారా మూడు దశలలో నీటిని జంటనగరాలకు ఎత్తిపోతల పథకాల ద్వారా తెస్తే దీనికి శాశ్వత పరిష్కారం అవుతుందని మనవి చేస్తున్నాను.

కాబట్టి ఈ మంచి నీటి పథకాన్ని వెంటనే చేపట్టడానికి పూనుకోవడానికి గాను ఆనాటి మా ప్రభుత్వం శంకుస్థాపన కూడా చేయడం జరిగింది. కాబట్టి ప్రజలకు ఆ పథకాన్ని చేపట్టి వెంటనే దానిని పూర్తి చేస్తామని హామీ ఇవ్వండి. మీకు ప్రజలు అధికారం ఇచ్చారు. కాబట్టి మీకు త్రాగే

నీరు అందిస్తామని చెప్పడం, ప్రజలకు ఆ విధంగా ప్రకటన చేయడం మీ బాధ్యత. ప్రతిపక్ష సభ్యులుగా మేము చెప్పడం మా బాధ్యత, ఇపుడు మీకు ప్రజలు అధికారం ఇచ్చారు. కాబట్టి ఆ పనిని మీరు పూర్తి చేయవలసిన బాధ్యత ఉంది. అదే విధంగా గృహ వసతి విషయంలో సామాన్య మానవుడు బ్రతుకు తెరువు లేక కన్నీరు పెట్టుకుంటూ, అదృష్టహీనులుగా, దగాపడ్డ తమ్ముళ్ళుగా ఉన్న వారికి ఈనాటికి అయినా నిష్కృతి కలిగించడం మీ బాధ్యత. ప్రతి సామాన్య మానవునికి అవసరమైన తిండి, బట్ట, నీడ ఇవ్వడం గత ప్రభుత్వం ఆదర్శంగా పెట్టుకున్నదని మనవిచేస్తున్నాను.

ఇపుడు ప్రతీ ఏటా ఒక లక్ష, 45 వేలు ఇళ్లు కట్టి 7 సంవత్సరాలలో 8 లక్షల ఇళ్లు నిర్మాణం చేయడం జరిగింది. ప్రజానీకానికి ఆ విధంగా మేము సంక్షేమ కార్యక్రమాలు చేసి చూపించాము. కానీ ఈనాడు ఆ గృహ నిర్మాణ పథకాలను ఎందుకు ఆపారు? ఎందుకు పేద ప్రజల మనస్సులలో అనుమానాలు సృష్టించారు. కాబట్టి ప్రజలపట్ల మనకు ఉన్న విశ్వాసము చూపడానికిగాను, ప్రజల ప్రతినిధులుగా మనము విశ్వాసము కలిగేటట్లు ప్రవర్తించాలి. గౌరవనీయులైన మంత్రి రోశయ్యగారు ఒకటి అడిగారు 1931 అని ఉందని చెప్పారు. దీనికి చరిత్ర ఒకటి ఉంది. దీని చరిత్ర నేను చెబుతాను. ఎందుకంటే ముందు 25 ఇళ్లు గ్రామాలలో నిర్మించాలనే రూల్ ఉంది. దానిని 20 ఇళ్లుగా చేసాము. తరువాత దానిని 15 ఇళ్ళుగా తగ్గించాము. ఎందుకంటే ప్రభుత్వం మీద ఈ పేద ప్రజలకు ఎక్విజిషన్ చేసినందుకు ఇవ్వవలసిన భారం 28 కోట్ల రూపాయల వరకూ పెరిగి పోయి వారికి బాకీ పడ్డాము. ఆ రుణం ప్రజలకు, పేద రైతులకు తీర్చాలి. ఆ పేదప్రజల నోళ్ళు కొట్టి ఇళ్లు నిర్మించుకోలేము. ముందు వారికి రెండు నెలల్లో వారి వద్ద నుంచి తీసుకున్న డబ్బును చెల్లిస్తామని నిర్ణయించడం జరిగింది. మా అప్పటి ప్రభుత్వ నిర్ణయం ఎక్కడైనా ఇళ్ళ స్థలాలు చూపించి అక్కడ ఇళ్ళు కట్టమని కోరినపుడు వారికి ఆ స్థలంలో ఇళ్ళు నిర్మించాలని ప్రభుత్వపరంగా అప్పుడు ఆదేశాలు ఇవ్వడం జరిగింది.

*(అధికార పక్ష సభ్యులనుంచి అంతరాయము)*

ఈనాడు ఒక్క ఇల్లు నిర్మించినా, రెండు ఇళ్ళు నిర్మించినా, 20, 30 ఇళ్ళు నిర్మించినా ఇది ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించే జరిగింది, ఇది తప్పుడు పద్ధతి కాదు మనవిచేస్తున్నాను. ఈనాడు రాజకీయ విద్వేషాలతో సామాన్య ప్రజానీకాన్ని ఇబ్బంది పెట్టకుండా వారికి ఇళ్ళు ఇవ్వండి, ఆశ్రయాలు కల్పించండి అని సవినయంగా మనవి చేస్తున్నాను.

*(అధికార పక్ష సభ్యులనుంచి అంతరాయము)*

దీనివల్ల సెల్ఫ్-ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అవుతుందని మా విశ్వాసం. ఇటుకలు తయారుచేసేవారు, ఇళ్లుకట్టేవారు, వడ్రంగులు, మేస్త్రీలు మొదలైనవారు దీనిని జీవనాధారం

చేసుకొని బ్రతుకుతారు అని దీని అంతర్యం. ఈనాడు ప్రభుత్వం వారు సెల్ఫ్-ఎంప్లాయ్‌మెంట్ కల్పిస్తామంటున్నారు. ఎవరికి కల్పిస్తారు? దయచేసి చెప్పండి, ప్రజలు తెలుసుకోవాలి. గృహ నిర్మాణం ఎవరి ద్వారా సాధిస్తారు? ఎలా సాధిస్తారు? ఈ విషయం తెలియజేయాలని సవినయంగా మనవిచేస్తున్నాను. అంతేకాదు, అర్బన్ హౌసింగు విషయానికి వస్తే గతంలో తెలుగుదేశం ప్రభుత్వం 5 లక్షల ఇళ్ళు నిర్మించిన సంగతి కూడా గుర్తుచేస్తున్నాను. దానికి అర్హతలు కూడా నిర్ణయించబడ్డాయి. ఎక్కడైతే పట్టణ ప్రాంతాలలో పేద వారు ఉన్నారో వారిని అక్కడినుంచి కదిలించకుండా అక్కడే పట్టాలు ఇవ్వమని మా ప్రభుత్వం ఆదేశించడం జరిగిందని మనవిచేస్తున్నాను. 50, 60 గజాలకు మించకుండా ఉండాలి. భూములు అన్యాక్రాంతం కాకుండా ఉండాలన్న భావంతో ఇలాంటి నిబంధనలు పెట్టడం జరిగిందని మనవిచేస్తున్నాను. ఇళ్ల స్థలాలు మంజూరు చేయలేదని కొందరు గౌరవ సభ్యులు అన్నారు. ఇటీజ్ ఆన్ రికార్డ్-ఎవ్రిథింగ్ ఐయామ్ గివింగ్ ఇన్ డిటెయిల్. పేద వారికి 14 లక్షల ఇళ్ల స్థలాలు పంచబడ్డాయని మనవిచేస్తున్నాను.

*(అంతరాయము)*

ఇక రెండు రూపాయలకు కిలో బియ్యం పథకం ఆంతర్యం తమకు తెలుసు. అక్కడి పార్టీ పెద్దలు కొందరు తామే ఆ పథకాన్ని ప్రవేశ పెట్టామన్నారు. ఒకసారి రూ.1.85 పైసలకు ఇచ్చామన్నారు, మరొకసారి రూ. 1.90 పైసలకు ఇచ్చామన్నారు. దానిని తెలుగుదేశం ప్రభుత్వం కేవలం వ్యాపారాత్మకంగా వాడుకొంటున్నదని విమర్శించారు. ఈనాడు మీరు అధికారానికి వచ్చారు. అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి గారు ఇంచుమించుగా ఈ పథకాన్ని తొలగించడానికి ఆలోచిస్తామన్నారు. అయితే తరువాత ప్రజల అభిప్రాయం తెలుసుకొని ఈ విషయం గురించి పునరాలోచిస్తామని పత్రికలవారితో చెప్పారు. ధర పెంచవచ్చు లేక పెంచకపోవచ్చు అన్నారు. చివరకు తేలింది ఏమిటంటే సబ్సిడీ ధరకు బియ్యం ఇస్తామని ఈ ప్రసంగంలో చెప్పారు. మీరు రూ. 1.80 పైసలకు ఇస్తారా, లేక పేద వారిమీద దయదలచి రూ. 1.40 పైసలకే ఇస్తారా? ఏదో ఒకటి చెప్పండి. చెప్పడానికి బిడియం ఎందుకు?

*(అంతరాయము)*

అంకితమైన భావనతో పేద ప్రజలకు ఇస్తామని ధైర్యంగా చెప్పండి, ముందుకు రండి అని సవినయంగా మనవిచేస్తున్నాను.

ఇక చీరెలు, ధోవతుల విషయం అందరికీ తెలుసు. ఇందులో రెండు లాభాలు ఉన్నాయి. ఒకటేమో మన దేశానికి, మనకు ఖ్యాతి తెచ్చిన చేనేత పారిశ్రామికులకు పని కల్పించడం. రెండవది సబ్సిడిమీద సగం ధరకే చీరెలు, ధోవతులు అందించడం, దీనిని మీరు కంటిన్యూ చేస్తామన్నారు. 50 పర్సెంట్ సబ్సిడీ ఇస్తారా? ఏ విధంగా చేస్తారో దయచేసి నిర్దిష్టంగా

తెలియజేయాలని మనవిచేస్తున్నాను. ఈనాడు చేనేత కార్మికుల దురవస్థకు కారణం గత ప్రభుత్వమే అని మీకు వివరిస్తున్నాను. మీకు తెలుసో లేదో నాకు తెలియదు కానీ నాకు తెలిసింది చెప్పుతున్నాను. మన ఆంధ్రప్రదేశ్‌లో–ప్రయారిటీ ఏరియాగా నిర్ణయించడింది. లో–ప్రయారిటీ ఏరియాగా నిర్ణయించబడినప్పుడు మన వద్ద స్పిన్నింగ్ మిల్స్ రావడానికి వీలు లేదు కాబట్టి మీకు అర్హత లేదు అన్నారు. మనం ఇతర రాష్ట్రాలకు ప్రత్తి ఎగుమతి చేసి అక్కడినుంచి నూలు తెచ్చుకోవడం జరుగుతోంది కాబట్టి అలా కాకుండా చేనేత కార్మికుల పోషణకు మాకు ఎక్కువ స్పిన్నింగ్ మిల్స్ ఇవ్వాలని కోరడం జరిగింది. ఈ విధానం కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయడం జరిగింది. అదేమిటంటే చేనేత పారిశ్రామికులకు, చేనేత పరిశ్రమకు రక్షణ కల్పించాలంటే లుంగీలు, తువాళ్ళ వంటి కొన్ని రకాల వస్త్రాల తయారీని చేనేత పరిశ్రమలకు రిజర్వ్ చేయాలి. ఎందుకంటే మరొక ప్రక్క యంత్రాల ద్వారా గుడ్డ తయారవుతోంటే వారు ఆ పోటికీ తట్టుకోలేరు. కాబట్టి కొన్ని రకాలను వారికి రిజర్వ్ చేయాలని చెప్పడం జరిగింది. కానీ ఆ విధానం ఇంతవరకూ అవలంబించబడలేదు. కొంతమంది ఆకలి చావులకు గురయ్యారు అన్నారు, వారికి నా సానుభూతిని తెలియజేస్తున్నాను. ఈ ఆకలి చావులను ఆపండి. చేనేత కార్మికులను పరిరక్షించే చేనేత పరిశ్రమలను ఉద్ధరించండి. మీ విధానం నిర్దిష్టంగా చెప్పండి అని మనవిచేస్తున్నాను.

ఇకపోతే మహిళాభ్యుదయానికి వస్తే వారు సమభాగినులు, సహ భాగినులు, సమాన భాగినులు, కాబట్టి వారి విషయంలో మనకు ద్వేషం లేదు. మీరు ఆడపడచులకు చేయగలిగిన మేలు చేయండి, పుణ్యం కట్టుకోండి అని మనవిచేస్తున్నాను. కానీ ఈ మధ్యన జరిగిన దురదృష్టకరమైన హింసాత్మకమైనట్టి దౌర్జన్యకరమైన అమానుష కృత్యాలకు మీరు ఏం సమాధానం చెపుతారు.

*(అధికార పక్ష సభ్యుల నుంచి తీవ్ర అంతరాయము)*

ఇకపోతే దీనిలో రైతుల సమస్యలు ప్రస్తావించలేదు. రాష్ట్రంలో 70 శాతం పైన వ్యవసాయం ఉంది. గత ప్రభుత్వం రైతులు తీసుకొన్న ఋణాల వడ్డీపై ముదరా ఇచ్చింది. మీరు ఏమి ఇస్తారో, ఏమి ఇవ్వరో నిర్దిష్టంగా చెప్పండి. ఈ విషయం నిర్దిష్టంగా తేల్చి చెప్పవలసిన బాధ్యత మీపై ఉందని మనవిచేస్తున్నాను.

అదేవిధంగా 50 రూపాయలకు ఒక హెచ్.పి. యూనిట్‌ను రైతులకు అందజేస్తారా, లేదా నిర్దుష్టంగా చెప్పవలసిన బాధ్యత మీకు ఉన్నదని నేను సవినయంగా మనవిచేస్తున్నాను. ప్రజల్లో అనుమానం కలుగవచ్చు. దయచేసి చెప్పండి ఇస్తారా లేదా? మీ ఇష్టం. అలాగే, గ్రామీణ క్రాంతి పథకం. 50 శాతం ప్రజలు ముందుకు వచ్చి వారి కార్యక్రమాలు నిర్వహించుకుని శ్రమశక్తిని ఉపయోగిస్తే, గతంలో 50 శాతం నిధులు ప్రభుత్వం అందించిన ఆ కార్యక్రమం నిర్వహించడం

జరుగుతుందా? ఎత్తిపోతల పథకాలు, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, బోర్‌వెల్స్ ఇవన్నీ కూడా నిర్వహించబడ్డాయి. ఇవి మీకు అంగీకారం కాదా? దీని విషయంలో ఏమీ ప్రస్తావించలేదు. అన్ని రాష్ట్రాలు ఆమోదించాయి. వారు ఎంతో గొప్పగా గౌరవించారు. దీని విషయంలో మీరు నిర్దుష్టంగా చెప్పాలని సవినయంగా మనవిచేస్తున్నాను. అధ్యక్షా, నాకు మంచి అవకాశం వచ్చినందుకు నా అభినందనలు వ్యక్తం చేస్తూ నిర్దుష్ట కార్యక్రమాలు, సిద్ధాంతాలను ప్రజలకు చెప్పాలని, పాలకపక్ష సభ్యులకు ముఖ్యంగా ఈనాడు గౌరవనీయులైన ముఖ్యమంత్రి చెన్నారెడ్డిగారికి నేను సవినయంగా వినతి చేస్తూ సెలవు తీసుకుంటున్నాను. జై తెలుగు దేశం.

◆◆

మార్చి 23, 1990

## పేదవాళ్లకు లక్షల్లో పక్కా గృహాలు కట్టించిన ఘనత మాదే

*(బలహీన వర్గాల గృహ నిర్మాణ కార్యక్రమంపై అధికార పార్టీ సభ్యులు చేసిన ఆరోపణలపై ఇచ్చిన వివరణ)*

**శ్రీ ఎన్.టి. రామారావు:** ఇది ప్రజలకు సంబంధించిన విషయం నేను సమాధానం చెప్పవలసి ఉంది. ప్రజా జీవితానికి సంబంధించి చాలా ముఖ్యమైన విషయంపై ఆరోపణలు చేశారు. కాబట్టి నేను ప్రజలకు తెలియజేయవలసిన అవసరం ఉంది కాబట్టి, నేను సమాధానం ఇచ్చేందుకు లేవవలసి వచ్చింది. మొత్తం ఎన్ని ఇండ్లు కల్పించారు? మేము ఈ సంవత్సరములో నాలుగు నెలలు ముందుగానే దిగిపోవలసి వచ్చింది. మంజూరు చేసిన ఇండ్లు పూర్తి చేయవలసిన బాధ్యత ఈ ప్రభుత్వానికి ఉంది. వారు కట్టించవలసి ఉంది. Government is a continuous institution. They must carry out the programmes of the previous Government. Common people are awaiting to get their problems solved.

అందుచేత గత ప్రభుత్వము డబ్బు ఇవ్వలేదు. కాబట్టి మేము ఇవ్వము, అన్ని ఇండ్లు కట్టించము అని చెప్పడం ఎంతమాత్రము సమంజసము కాదు, మేము ప్రతి సంవత్సరము 1,45,000 ఇండ్లు కేటాయించామా లేదా? ప్రకృతి విలయతాండవం చేసినప్పుడు ప్రత్యేకంగా ముఖ్యమంత్రి డిస్‌క్రిమినేషన్ మీద బాధితులకు అదనంగా ఇండ్లు కట్టించామా? లేదా? కేవలం ధనవంతులకే ఇండ్లు పోతున్నాయి అనేది చాలా దురదృష్టకరమైన సమాధానం అని మనవిచేస్తున్నాను. పైగా ధనవంతులకే ఇండ్లని వారంటున్నారు. ఆవిధంగా అనడం దురదృష్టకరము వారికి సమాధానంగా చెబుతున్నాను. డబ్బులు కట్టలేని వారు, శారీరక కష్టము చేసి, దానికి సరియైన శక్తిని ఉపయోగిస్తే, వారి యొక్క శక్తి, ఇన్వాల్‌మెంట్ ప్రభుత్వముచేత ఆమోదించబడుతుందని ఆ విధంగా గత ప్రభుత్వము నిర్ణయం చేసిందని గుర్తు చేస్తున్నాను.

అధ్యక్షా, గత ప్రభుత్వము గత ప్రభుత్వము అంటున్నారు. కేవలం హౌస్‌ను మిస్‌లీడ్ చేయడమో లేకపోతే రాజకీయ పరంగా సామాన్య మానవుడి నోటిలో దుమ్ము చల్లడమో చేయాలని తప్ప ఇది సంక్షేమ కార్యక్రమం చేసేది మాత్రం కాదు. 9 లక్షల పైచిలుకు ఇళ్లు కట్టించామని వారే తమ ముందు ఒప్పుకున్నారు. దానికి ఏవరేజ్ ఎంత అవుతుంది అధ్యక్షా, అది చెప్పమనండి. తరువాత మీరు అవి కట్టించండి. పేదవాళ్లను ఆదుకోవాలి కదా. బలహీన వర్గాలను ఇంత మభ్యపెట్టడం దేనికో అర్థము కావడంలేదు.

ఈ విషయం చాలా తీవ్రమైనది. సామాన్య మానవుడి జీవితాన్ని ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. ఇది చాలా ముఖ్యమైన విషయంగా మనవిచేస్తున్నాను. పైగా ఇంకొకటి ఇది కేవలం రూరల్ హౌసింగ్ స్కీమ్ క్రింద కట్టించినది మాత్రమే. ప్రత్యేకంగా అర్బన్ వీకర్ సెక్షన్స్ హౌసింగ్ క్రింద 5 లక్షల ఇళ్లు మా ప్రభుత్వం మంజూరు చేసిందని కూడా తమకు మనవిచేస్తున్నాను. కాబట్టి, మొత్తం ఇదే కాదు. చాలా ఉంది దీని విషయములో, పూర్తిగా అందరూ మాట్లాడే అవకాశం ఇవ్వాలి. సామాన్య ప్రజానీకాన్ని ఉద్ధరించాలి.

◆◆

ఏప్రిల్ 9, 1990

# కుప్పంలో ద్రావిడ విశ్వవిద్యాలయాన్ని పెట్టాలని వెయ్యి ఎకరాల భూమిని కేటాయించాం

***(కుప్పంలో విశ్వవిద్యాలయం ఏర్పాటుపై చేసిన ఆరోపణలకు ఇచ్చిన సమాధానం)***

**శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, ఇది అతి ముఖ్యమైనటువంటిది. దక్షిణాది రాష్ట్రాల సమన్వయ సిద్ధాంతానికి పునాదిరాయిగా ఉంటుందని మనవిచేస్తున్నాను. ఇది వరకు మీకు తెలుసు. బ్రిటిష్ ప్రభుత్వం హయాంలో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంగా ఉన్నవారము, ఉమ్మడి సంస్కృతి కలిగినటువంటిది, సంస్కృతి సిద్ధాంతపరమైనటువంటి సమస్యలుగానీ, ముఖ్యంగా రాష్ట్రాలన్నింటికి కూడా సంబంధించినవి, మేలు కలయికకు ఎంతో అవసరం అనేది కాబట్టి భాషలో కూడా ఒక విధమైన సమన్వయమైన, ప్రత్యేకమైన అవగాహన ఉంటే బాగుంటుందని ఆనాడు ఆలోచించడం జరిగింది. అప్పుడు ముఖ్యంగా ప్రభుత్వానికి సంబంధించినంతవరకు కుప్పం దగ్గర ఆ ద్రావిడ విశ్వవిద్యాలయాన్ని పెట్టాలని అక్కడ సుమారు వెయ్యి ఎకరాల భూమిని కూడా కేటాయించడం జరిగింది. అది నేను ప్రత్యేకంగా మద్రాసులో డి.ఎం.కె. సమావేశానికి వెళ్లినప్పుడు, అప్పుడు వారిని కోరడం కూడా జరిగింది. కర్ణాటకలో కరుణానిధిని మీరు అది అంగీకరించాలని కోరాను.

ఈ సందర్భంగా చెప్పుతున్నాను. అక్కడ కర్ణాటక ముఖ్యమంత్రి వర్యులు ఉన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి వర్యులు ఉన్నారు. కేరళ ముఖ్యమంత్రి వర్యులు ఉన్నారు. వారందరి సమక్షంలో నేను ఈ విశ్వవిద్యాలయం సంగతి ప్రస్తావనకు తెచ్చి అప్పుడు ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం వెయ్యి ఎకరాల భూమిని మంజూరు చేయడానికి ఇచ్చినట్లు చెప్పాను. మనమందరం కూడా ఒక సంస్కృతికి చెందినవారము, ఇటువంటి సమైక్యతా భావం మన రాష్ట్రాలకు పటిష్టంగా ఉంటుంది. అవగాహన బాగా ఉంటుందనే ఉద్దేశ్యంతో ఆనాడు చేయడం జరిగింది. దానికి సంబంధించినంత వరకు అప్పటి సిద్ధాంతాన్ని మేము వదిలేస్తాము, ప్రభుత్వం కోరితే వారికి

ఏమైనా సలహాలు కూడా అందజేస్తాము. గౌరవ మంత్రిగారిని కోరేది ఏమిటంటే, అప్పుడు ఉన్నవారందరూ కూడా అంగీకరించారు. నామమాత్రంగా అంగీకరించారు. వ్రాతపూర్వకంగా నిర్ధారణ చేయడం లేదు అని నేను చెప్పాను అప్పుడు - అది సమంజసంగా ఉన్నదనే భావం నేను ముఖ్యంగా మనవి చేశాను. ఈ సమైక్యతా భావనా సిద్ధాంతానికి బద్ధులై ఉన్నారా? మీరు ఏవిధంగా దీన్ని చేయడానికి నిర్ణయం చేసుకున్నారో దయచేసి చెప్పవలసిందిగా కోరుతున్నాను.

◆◆

ఏప్రిల్ 26, 1990

# ప్రభుత్వమన్నది ప్రజాస్వామ్య పచారీ దుకాణం కాదు

*(ఆంధ్రప్రదేశ్ ద్రవ్య వినియోగం బిల్లుపై మాట్లాడిన సందర్భంగా కిలో 2 రూపాయల బియ్యం ధర పెంపుదల ప్రతిపాదనను నిరసిస్తూ చేసిన ప్రసంగం)*

**శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, ఈ రోజున అప్రాప్రియేషను బిల్లు మీద మా అభిప్రాయాలు వ్యక్తము చేయమని తమరు అవకాశం ఇచ్చినందులకు మా పార్టీ తరఫున మీకు సంపూర్ణమైనటువంటి కృతజ్ఞతలు వ్యక్తము చేస్తున్నాను. అసలు అప్రాప్రియేషను బిల్లు అంటే అర్థము ఏమిటి? వివిధ పద్దుల క్రింద శాసనసభలో ప్రభుత్వము డిమాండ్స్ పెట్టి గౌరవనీయులైన సభ్యులందరూ ఆయా డిమాండ్స్ మీద వారి వారి విలువైన అభిప్రాయాలు ఇచ్చి కొన్ని పద్దులకు హెచ్చించడం, కొన్ని పద్దులకు తగ్గించడం – దీనిని అమలు పరచాలని ప్రజాస్వామ్యంగా మనకు ఇచ్చినటువంటి నిర్వచనంగా గుర్తుచేస్తున్నాను. దీనిని బడ్జెట్ సెషను అన్నారు. 45 రోజులు పాటు కార్యక్రమాలు మనం అందరం చర్చించి పేద ప్రజానీకానికి న్యాయం చేయాలని మనం ఇక్కడ కూర్చున్నాము. ఈ సందర్భంలో 37 పద్దుల మీద చర్చ లేకుండా గిలిటిన్ అయిన సందర్భం మీకు గుర్తు చేస్తున్నాను. మూడు పద్దులు మాత్రం వ్యవసాయం, విద్య, సోషల్ వెల్ఫేరుల మీద చర్చలు జరిగి 45 రోజులు తరువాత ఇన్నాళ్లు శ్రమపడిన తరువాత 34 పద్దులు గిలిటిన్ అయిపోయిన సందర్భంలో ఈ బిల్లును ఎట్లా అమోదించమంటారు? చర్చలు ఎట్లాగూ జరగలేదు. మొత్తంగా చూస్తే వీరికి ఏ విధమైన సంక్షేమం ప్రజలకు జరుగుతుంది.

మనం కర్తవ్యం నిర్వహించిన వారమవుతామా? చర్చ లేకుండా ఎప్రాప్రియేషను బిల్లును తీసుకుని వచ్చి మమ్ముల్ని అంగీకరించాలని అనడం న్యాయమేనా? పాల్గొనకుండా, అడిగేటటువంటి హక్కు మాకు ఇవ్వకుండా ఈ బిల్లును ప్రవేశ పెట్టారు కాబట్టి నేను పూర్తిగా నా అసమ్మతిని ప్రత్యేకంగా తెలియచేస్తున్నాను. I am putting my dissent over this. It is not acceptable by us. మేము చర్చలో పాల్గొనకుండా మమ్ములను బలవంతంగా

అంగీకరింప చేయవద్దు. మాకు అంగీకారం కాదని మీకు సవివరంగా మనవిచేస్తున్నాను. ఖర్చు మాకు సంబంధం లేదు. మీరు ఏవిధంగా ఖర్చు పెట్టారో మాకు సంబంధం లేదు. కేవలం ఒకవిధమైన చీకట్లో మమ్మల్ని కూర్చోబెట్టి, మీకు మెజారిటీ ఉంది కదా అని పాసు చేసుకుంటామంటే పాసుచేసుకోండి. మాకు సంబంధించినంత వరకు మీ ప్రభుత్వ వ్యయము వలన ప్రజల సంక్షేమానికి ఉపయోగపడుతుందని ఏమాత్రము నమ్మకం లేనప్పుడు మాకేమీ సంబంధము లేదని మనవిచేస్తున్నాను.

అధ్యక్షా, సామ్రాజ్యవాదం పోయింది. రాచరికాలు నశించాయి. ప్రజాస్వామ్యం ఉందని అనుకుంటున్నాము. ప్రజల చేత, ప్రజల కొరకు చేయబడ్డ పరిపాలనను ప్రజాస్వామ్యమని నేను చెప్పనక్కరలేదు, తమరికి తెలుసు. సాంఘిక సంక్షేమం గురించి మనం అందరం కూర్చుని ఆలోచిస్తున్నాము. మూగవోయిన గొంతులు ఎండి, బ్రతకలేక, చావలేక వారు బాధపడుతున్నారు. మనం అందరం అటువంటి వారి సంక్షేమం గురించి గుర్తుంచుకోవాలని భావిస్తున్నాను. ఆ విషయాన్ని ఆలోచించినప్పుడు ఆ విషయం గురించి, ప్రభుత్వమునకు చెప్పవలసిన అవసరం ఉంది. అది మా సలహా మీరు ఆచరిస్తారో, ఆచరించరో అది మీ ఇష్టం. మీకే వదలివేస్తున్నాను. నిర్ణయించవలసినది ప్రజలు చెప్పవలసినది అక్కడ –"సంఘం శరణం గచ్ఛామి" నువ్వు సంఘంలో బ్రతుకుతున్నావు. బడుగు బలహీన వర్గాల గురించి ఆలోచించకపోవడం శోచనీయం అని సవివరంగా మనవిచేస్తున్నాను. అనాగరికతకు చెందిన దేశాలు ఉన్నాయి. అనాగరికత పోవడం కొరకు పాటుపడడం ఆదర్శప్రాయం అవుతుంది. పేద ప్రజానీకానికి సబ్సిడీ రూపేణా అందించి ఆదర్శంగా ఉండాలి. అటువంటిది బడుగు వర్గాల వారి గొంతుకలు నులిమి వేయడం, పాతర వేయడం ఆదర్శము కాదని మనవిచేస్తున్నాను.

**సామ్రాజ్యవాదం పోయింది. రాచరికాలు నశించాయి. ప్రజాస్వామ్యం ఉందని అనుకుంటున్నాము. ప్రజల చేత, ప్రజల కొరకు చేయబడ్డ పరిపాలనను ప్రజాస్వామ్యమని నేను చెప్పనక్కరలేదు, తమరికి తెలుసు. సాంఘిక సంక్షేమం గురించి మనం అందరం కూర్చుని ఆలోచిస్తున్నాము. మూగవోయిన గొంతులు ఎండి, బ్రతకలేక, చావలేక వారు బాధపడుతున్నారు.**

రెండు రూపాయలు కిలో బియ్యం పథకం ఉంది. అది మన రాష్ట్రంలో అంతటా అమలు చేసినామని మీరు చెప్పుకున్నారు – ఈ పథకము మేమే పెట్టామనీ రూ.1.85 లకే మేము అమ్మామనీ, మీరు కిలో రెండు రూపాయలకు అమ్ముకుని 15 పైసలు లాభము పొందుతున్నారనీ చెప్పారు కానీ, అది కంటిన్యూ అవుతున్నదా? మీరు దీనిని బడ్జెట్లో పెట్టడానికి ఎన్నో అవరోధాలు పెడుతున్నారు. వద్దు, రద్దు అన్నారు. రెండు రూపాయాలకు కాదు, రెండున్నర రూపాయలకు ఇస్తామంటున్నారు. మీ మనస్సులో దురుద్దేశ్యము పెట్టుకున్నారు. పచ్చ కార్డులు తీసివేయడానికి

నిర్ణయము తీసుకున్నారు. 27న్నర లక్షల టన్నుల బియ్యం పేద ప్రజానీకానికి తెలుగుదేశం ప్రభుత్వం అందించింది. కార్డులు రద్దు చేస్తామంటూ మాయతో, మర్మంతో 50 పర్సెంటు వరకు కార్డులు తగ్గించడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఫ్యాను ఉంటే కార్డు లేదు, మీద చొక్కా ఉంటే కార్డు లేదు, టేప్ రికార్డు ఉంటే కార్డు లేదు. మీరు ప్రజలను అవమానించి అవహేళన చేస్తున్నారు అంటాను. మీరు కాదంటారా? ప్రజలు ఓట్లు తీసుకుని ప్రజాస్వామ్యాన్ని అవమానం చేయకూడదని ఈ సందర్భంగా ఇక్కడ విజ్ఞప్తి చేస్తున్నాను. మీరు ఆ విధంగా చేస్తున్నారు. మీరు కార్డులు 50, 60 శాతానికి తగ్గించి వేస్తున్నారు. అంటే 13 లక్షల టన్నుల బియ్యానికి తగ్గించి వేస్తున్నారు. ఇందులో 20 శాతము గోధుమలు ఇస్తామని - ఎవరూ తినని ఆహారాన్ని అందించడానికి ఎందుకు ప్రయత్నించుచున్నారు. వారి అలవాటులో మార్పు కలుగుతుందనే ఉద్దేశ్యం మీకు ఉందా?

రూ.2లకు కిలో బియ్యం అనేది ఇంత ప్రజాస్వామ్య విధానంగా ఈ దేశములో ప్రజలందరూ హర్షించి, మా రాష్ట్రములో కూడా అమలు చేయబోతున్నాము అని అందరూ కోరుతున్నప్పుడు, దీన్ని రూ.2 1/2 లకు పెంచితే, 120 కోట్ల రూపాయలు ఆదాయం వస్తుందని అనుకొంటున్నారు. మొత్తం స్కీమునే ఎత్తివేస్తే, 300 కోట్ల రూపాయలు ఆదాయం రావచ్చు. ప్రభుత్వమన్నది కేవలం డబ్బుల గల్లా పెట్టెను పరిశీలన చేసేటటువంటి ప్రజాస్వామ్య పచారీ దుకాణం కాదు. ప్రజాస్వామ్య విధానం ప్రకారం ప్రజల కోసము, ప్రజల క్షేమాన్ని కలిగించేటటువంటి ఒక పవిత్రమైన వ్యవస్థ ప్రభుత్వమనేది. కాబట్టి, దీని విషయంలో వారి విధానాన్ని ప్రకటించడం శ్రేయస్కరం. కేవలం మీనమేషాలు లెక్క పెట్టుకొంటూ, మాయ మాటల గారడీ విధానాలతో, అవి, ఇవి చేస్తాము, ఏమి చేయాలి? రద్దు చేయాలా? ఏవిధంగా ఈ పద్దు చూడాలి అనేది సరియైన పద్ధతి కాదు. ప్రజలను ఏవిధంగానూ మభ్యపెట్టవద్దని నేను మీద్వారా వారిని కోరుతున్నాను.

*(ఇంటరప్షన్స్)*

ఈ ప్రపంచములో, దేశములో ఏ ప్రజాస్వామ్య విధానముగానీ, ప్రజల కోసము పరిపాలన అమలు చేస్తున్నప్పుడు బ్రతికే ప్రతివాడూ కూడా చావడం వారి యొక్క ఆదర్శం కాదు. వాళ్ళను సక్రమంగా, మానవులుగా గుర్తించి, మానవత్వంతో వారిని గౌరవించడం మన ధర్మం....

సామాన్య మానవుడు బ్రతకడానికి అవసరమైన తిండి, బట్ట ఉండటానికి నీడ వారికి కలిగించాలి. వారి మానవత్వపు హక్కులను పరిరక్షించాలి. ప్రజాస్వామ్య విధానానికి ఎంతైనా ఆదర్శము అందరూ ఒప్పుకున్న పద్ధతి కాబట్టి. తెలుగు దేశం ప్రభుత్వము అమలు చేసిన విధానాన్ని మొన్ననే ఈ సభలో గౌరవ మంత్రివర్యులు ఆమోదించారు. లక్షా 45 వేల గృహాలు పేద వారికి - మనం ఏ.సి. రూమ్స్‌లో ఉంటున్నాము. మరి చక్కగా అలంకార శోభితంగా, మనము

విలాసవంతమైన జీవితాలను నడుపుకొంటున్నాము. వారికి మంచి నీడ ఇవ్వాలన్నది ఒక ఆదర్శవంతమైన దాన్ని మీరు ప్రజా ప్రతినిధులుగా ఎందుకు మరిచి పోతున్నారో తెలపాలని మీద్వారా కోరుతున్నాను. వారే చెప్పారు. సుమారుగా 9.60 లక్షల గృహాలు, 6 సంవత్సరాల కాలంలో అమలు చేయడం యదార్థము, ఇప్పటికీ గ్రౌండ్ అయిన వాటిని బట్టి చూస్తే, 11 లక్షల గృహాలు గ్రౌండై ఉన్నాయి. కేవలం బలహీన వర్గాలకు రూరల్ హౌసింగ్ స్కీము ఇది. వీకర్ సెక్షన్ హౌసింగ్ స్కీము క్రింద 11 లక్షల గృహాలు ఈనాడు తెలుగుదేశం ప్రభుత్వములో నిర్వహింపబడినవని మనవి చేస్తున్నాను. అదేవిధంగా అర్బన్ వీకర్ సెక్షన్ హౌసింగ్ స్కీమ్ క్రింద ఈనాడు హైదరాబాద్ కార్పొరేషన్ కానివ్వండి, విజయవాడ కార్పొరేషన్ కానివ్వండి, విశాఖపట్టణం కార్పొరేషన్ కానివ్వండి....

ఇపుడు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వారు 5 లక్షల రూపాయల కోసము 3 కార్పొరేషన్స్‌కు, విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్ కార్పొరేషన్స్‌కు అన్యాయం చేస్తున్నారు. బెజవాడలో గత ప్రభుత్వ ప్రతినిధిగా నేను శంఖుస్థాపన చెయ్యడం జరిగింది. కాబట్టి ఈ విషయాన్ని గుర్తించాలి. మరొక విషయం మీ దృష్టికి తెస్తున్నాను. షెడ్యూల్డ్ కులాల వారికి 50 శాతం రిజర్వేషన్ ఆ ఇళ్లలో ఉంది. అదే విధంగా 10 శాతం గిరిజన సోదరులకు ఉంది. మిగిలినవి వెనుకబడిన వారికి, ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉంది. హరిజనులకు, గిరిజనులకు ఇవ్వమని అంటారా? ఏదో ఒకటి నిర్దిష్టంగా చెప్పవలసిన అవసరం ఉంది. ఇప్పటికే అజ్ఞానులను చేశాము. అమాయకులను చేశాము. వారి భావం చెప్పుకునే అవకాశం వారికి కలిగించలేకపోయాము. కాబట్టి ఈ విషయాన్ని ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలి. ఒకసారి రూ.75 వేలు అని, మరొకసారి రూ.40 వేలని, ఒకసారి ఆలోచిస్తామని అంటున్నారు. ఇదివరకు గ్రౌండ్ చేసినవి వాటికి ఇవ్వమని అంటున్నారు. ఏమిటి దీనిలో గల రాజకీయ కుట్ర? ఇదివరకు కలెక్టర్స్ నిర్ణయించారు. ఎవరైతే ఈ విధానాలకు, ఎవరైతే ఈ ఆంక్షలకు లోబడి ఉంటారో, ఎవరైతే ఎస్.టి.లు, ఎస్.సి.లుగా ఉంటారో, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారో, బ్రతకలేక, బాధపడుతున్నారో, అటువంటి వారికోసం ఏర్పాటు చేసింది ఇది.

కాబట్టి ఎంత శ్రద్ధ చూపాలో గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారికి మీ ద్వారా మనవిచేస్తున్నాను. ఇవ్వకపోతే పోనివ్వండి. అది వారిష్టం, ఇవ్వమని నేను చెప్పడం లేదు. సూచన మాత్రం ఇస్తున్నాను. ఈనాడు ప్రజలు మీకు ఓట్లు ఇచ్చారు. అధికారం ఇచ్చారు సంక్షేమం చెయ్యమని అవకాశం ఇచ్చారు. అవకాశం ఉపయోగించుకుంటారో, దుర్వినియోగం చేసి ఆ వెనుకబడిన వారిని, ఆ బలహీనులను, ఇంకా బలహీనులుగా చేసి బాధపెడతారో అది వారిష్టం. కాబట్టి, వారికి సవినయంగా మనవిచేస్తున్నాను. ఇంతేకాక, ప్రత్యేకమైన ప్రకృతి విలయాలు ఉన్నాయి. వాటికి ఎన్నో రకాలున్నాయి. 1989 సెప్టెంబరులో నెల్లూరులో, ప్రకాశంలో

సంభవించిన పెనుతుఫాను సంగతి మీ అందరికీ తెలిసినదే. నేను కూడా వెళ్లాను. నెల్లూరులో 15 వేలు, 7,500 అర్బన్ అండ్ రూరల్ హౌసింగ్ క్రింద వారికి మంజూరు చేశాము. అదేవిధంగా గోదావరి వరదలు వచ్చినప్పుడు తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల ప్రజానీకం యొక్క ఇళ్లు వరదలపాలై, నించోటానికి కూడా చోటు లేనప్పుడు వారికి 2 వేలు ఇచ్చాము. ఇటువంటివి ఎన్నో కార్యక్రమాలను చేపట్టాము. కాబట్టి ప్రభుత్వం ప్రజలతో చెలగాటమాడరాదు దయచేసి వారికి ఇస్తారా లేదా చెప్పమనండి. ఆ తరువాత వారి ప్రారబ్ధం.

ఇక పేదరికాన్ని కప్పడానికి మూడవది బట్టల విధానం. ఇది కేవలం డబ్బు గలవారి సొత్తు మాత్రమే కాదు. సిల్కు మడతలలో, పట్టు పంచెలతో కులకడం కాదు. కాబట్టే సగం ధరకే బట్టలు ఇవ్వడానికి నిర్ణయం. దీనివల్ల రెండు ఫలితాలున్నాయి. చేనేత కార్మికులకు పని కల్పించడం, చిరిగిన బట్టలతో అర్ధనగ్నంగా మన కళ్లముందు ఉంటున్న పేద ప్రజలకు ఇంత గౌరవాన్ని ఆపాదించడానికి ఈ కార్యక్రమం తలపెట్టడం జరిగింది. దానికోసమే పచ్చ కార్డులు ఉన్నవారికి ఒక చీర, ఒక ధోవతి సగం ధరకే ఇవ్వాలనేది నిర్ణయించడం జరిగింది. మనం ఈనాడు ఎన్నో డజన్ల బట్టలు కట్టుకుంటున్నాము ఏం? వారికి లేధా ఆ అధికారం? వారికి ఇవ్వవలసిన బాధ్యత మనకు లేధా అని తమ ద్వారా మనవిచేస్తున్నాను. వారి సంగతి కూడా చూడాలి. పచ్చకార్డులపై రెండు రూపాయలకు కిలో బియ్యం చొప్పున ఇవ్వడానికి గాను 97 లక్షల కార్డులు ఇచ్చాము. వారికి ఫ్యాన్ ఉండకూడదా? చొక్కాలు తొడుక్కోరాదా? మంచి బట్టలు కట్టుకోకూడదా? అటువంటి వారే పేదవారా? వారు అట్లాగే చావాలి అనేది ఈ ప్రభుత్వ విధానమా? వారికే సహాయం చేస్తామా? మిగిలిన పేదవారు కనీసం పది రూపాయలతో కొడుక్కి మంచి బట్టలు కుట్టించుకోకూడదా? కూతురికి మంచి బట్టలు కుట్టించుకోకూడదా? అటువంటి విధానాన్ని ఆచరించలేకపోతున్నామే? ఇది నాగరిక సమాజానికే సిగ్గుచేటు. ఇటువంటి విధానాన్ని నిర్దిష్టంగా చెప్పమనండి. 'మేము ఇవ్వము' అంటే సరే ఇవ్వవద్దు. పీడా పోయింది. వారి గ్రహపాటు అనుకుంటారు. వారి బాధలు వారు పడతారు. కాబట్టి దీని విషయంలో నిర్దిష్టంగా ప్రభుత్వ విధానం చెప్పాలని మనవిచేస్తున్నాను.

**సంక్షేమం:** బడుగు వర్గాల వారున్నారు. వారి సంక్షేమంపై వారికి అధికారం లేదని చెప్పుకోడానికి వారికి అవకాశం లేదు. ఎన్నో రకాలైన దౌర్జన్యాలతో వారు క్రుంగిపోతున్నారు. మానవులుగా బ్రతకడానికి కూడా అవకాశం లేనప్పుడు, సాంఘిక, రాజకీయ న్యాయాన్ని తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసింది. ఎస్.సి.లకు గాను 14 శాతం రిజర్వేషన్ ఉంటే, ఈనాడు 15 శాతానికి పెంచిన ఘనత తెలుగుదేశం పార్టీదే. గిరిజన సోదరులకు 4 శాతం రిజర్వేషన్ విధానం ఉంటే, దానిని 6 శాతం చేసిన ఘనత మా తెలుగుదేశం పార్టీదే. అదే విధంగా వెనుకబడిన వర్గాలకు 20 శాతం చేశామంటే అదీ మా ఘనతే, అట్లాగే ఆడబిడ్డలకు ఎన్నడూ లేనివిధంగా 9 శాతం

రిజర్వేషన్ పెట్టాము. జన సంఖ్యలో 50 శాతంగా గలవారి, వారికి జన ప్రతినిధులు ఉండి కూడా సరైన సంక్షేమం లేనప్పుడు 9 శాతం రిజర్వేషన్ ఇచ్చాము. కాబట్టి ఆలోచించమనండి. వారు అర్హులు కాకపోతే ఇవ్వకండి. తీసేయండి. వారి చావు వారిని చావమనండి కానీ ఎటువంటి విధానాలైనా కానీ పేదలను బ్రతికించాలి. కానీ వారి నోటి వద్ద ఎంగిలి కూడా తిని బ్రతికే విధానం మంచిది కాదని మీ ద్వారా మనవిచేస్తున్నాను. ఆదిలాబాదు గిరిజన సోదరులున్నారు ఈ జిల్లాను ఆదర్శ జిల్లాగా ప్రకటించాము 1000 మంది గిరిజన యువకులను అధ్యాపకులుగా ఒకేసారి నియమించాము. వారికి 10 వేల పక్కా గృహాలను మంజూరు చేశాము. చిన్న తరహా నీటి పారుదల విషయాన్ని కూడా అన్ని ప్రాజెక్టులను కూడా మంజూరు చెయ్యడం జరిగింది. కొండలలో, కోనలలో ఎక్కడో, మరెక్కడో ఉండేవారికి, ఇంటింటికి...

*(ఇంటరప్షన్)*

ఇంటింటికి ఈ పచ్చ కార్డులు ఇచ్చాము. పొట్టలు నింపాము. వారందరి పొట్టలూ కొడతారేమో వారిష్టం, లేక వారిని తీసేస్తారా, వారిష్టం. నిర్ణయం చేసుకోమనండి. ప్రజలు ప్రభుత్వం యొక్క తీరుతెన్నులను గుర్తిస్తున్నారు వారిని మీ ద్వారా హెచ్చరిస్తున్నాను. ఇంత ప్రీతి ఉంది ఎస్.సి.ల మీద అంటారే? డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించిన మహాద్రష్ట. అటువంటి వారిని, పెద్ద పెద్ద వారిని గౌరవించాము. పెద్ద పెద్ద వారి ఫొటోలు పెట్టుకున్నాము. మహా పెద్ద పెద్ద బిరుదులు ఇచ్చాము. ఏం? మేము మరచిపోయామా వారిని? డాక్టర్ అంబేద్కర్ గారికి 'భారత రత్న' అనే బిరుదిచ్చి సత్కరించి, మా వాడు అని చెప్పుకున్న ఘనత మా నేషనల్ ఫ్రంట్‌కే దక్కింది అని మనవి చేస్తున్నాను. సమాధానం చెప్పమనండి. ఇంత కాలం ఎందుకు నిర్లక్ష్యం చేశారు? వారు రచించిన రాజ్యాంగాన్నీ అమలు చేశామన్నారే. అది వేదోక్తమైన గ్రంథం అని అన్నారే. గీతతో సరిపోల్చవలసిన పవిత్రమైన రాజ్యాంగం అన్నారే.

మరి ఆనాడు వారికి ఆ గౌరవం లేకపోయిందా? గుర్తింపు ఇవ్వలేకపోయారా? అది మన దేశం చేసుకున్న దౌర్భాగ్యం. ఇక ఇప్పుడైనా షెడ్యూల్డ్ కులాల వారికి తగిన న్యాయం చేయాలి. విస్మరించరాదు. పార్లమెంట్ సెంట్రల్ హాలులో అంబేద్కర్ గారి చిత్రపటం పెట్టిన ఘనత నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వానిదే. ఈనాడు హైదరాబాద్‌లో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ భవనం శాంక్షన్ చేశాము. దానికి నిధులు ఎవరు ఇచ్చారో చెప్పమనండి. కాబట్టి ఈ విధంగా షెడ్యూల్డ్ కులాల వారి మీద సవతి ప్రేమ చూపిస్తూ, వారిని అగౌరవం చేస్తున్నాం. కుంగదీస్తున్నాం. కేవలం వారిని రాజకీయపరంగా ఏ విధంగా వాడుకుంటున్నామో దయచేసి ఒక్కసారి గమనించాలని మనవిచేస్తున్నాను. ఇట్లాగే బీహార్‌లో పుట్టిన ఒక మహానుభావుడు జగజ్జీవన్‌రామ్‌గారి విగ్రహాన్ని మేము ఇక్కడ ప్రతిష్ఠించాము. ఇకపోతే పెన్షన్ విధానం 35 సంవత్సరాలు గత వ్యవస్థ పెత్తనం చేసిన కాలంలో కేవలం 2 కోట్ల 10 లక్షలు మంజూరు చేసి ఉంటే, 1983-90 సంవత్సరాల

మధ్య రూ. 8 కోట్ల 2 లక్షలకు పెంచబడినది అంటే నాలుగు రెట్లు పెంపుదల అనేది గమనించాలి. గౌరవ సభ్యులు గుర్తించాలి. లేకపోతే వ్రాసుకోవాలి. 1983వ సంవత్సరంలో ఎంతో మంది అర్జీదారులు ఉన్నారు. ఈ విధంగా వృద్ధాప్య పింఛను ఇచ్చి, క్రుంగిపోయి, లేవలేక, శ్రమ చెయ్యలేక, నడుము వంగి, బాధపడే వారిని ఏ మానవత్వంతో ఆదరిస్తున్నామో ఒక్కసారి గుర్తు చేసుకోవాలి. ఆ విషయం కూడా ఈ ప్రభుత్వం స్పష్టం చెయ్యాలి. ఇస్తే ఇవ్వమనండి లేకపోతే లేదు. వారి ప్రారబ్దం. చెప్పవలసిన బాధ్యత మా మీద ఉందని సవినయంగా మనవిచేస్తున్నాను. ఇక ఆడబిడ్డలున్నారు. తోడుపోయి, నీడ లేక, గోస పెడుతూ, అలోలక్ష్మణా అంటూ బాధపడుతూ, పస్తులుంటున్న ఆడపడుచుల బాధలు చూడవలసిన అవసరం లేదా? ఇది తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగా ప్రవేశ పెట్టిన స్కీమ్ వితంతు పెన్షన్.

గత ప్రభుత్వానికి ఆడబిడ్డలు - వితంతువులున్న విషయం వారి దృష్టికి రాలేదా? 1984-85 సంవత్సరంలో పెట్టిన స్కీము ఇది. రూ. 10 కోట్ల 99 లక్షలు మంజూరుతో వృద్ధి చెందుతూ ఉంది. వితంతువులకు సహాయం చేస్తామని, ఆడబిడ్డలకు సహాయం చేస్తామని కానీ ఎక్కడా ఒక్క మాట కూడా చెప్పలేదు. ఈ ప్రభుత్వ అభిప్రాయమేమిటి? 54,500 మంది ఈ బోనస్‌ను తీసుకుంటున్నారే వారందరూ ఏమనుకోవాలి? ఏ విధంగా వారి భవిష్యత్తు ఉంటుందనేది నిర్ణయించాలానేది దయచేసి ఈ ప్రభుత్వం గమనించాలి. వృద్ధ వ్యవసాయ కార్మికులకు పెన్షన్. వారు శ్రమ చేసి, వారు పెట్టిన కూడు మనం తింటున్నామే. మనం డబ్బు తినడం లేదు ఇంటికి వెడితే అన్నం కావాలి. అన్నం ఎక్కడ నుంచి వస్తుంది? మరి ఈనాడు నీరు పెట్టలేరు. విత్తనం వేయలేరు. నాట్లు మొలిపించలేరు. ఏమీ తెలియని వారు, దర్జాగా కుర్చీలో కూర్చుని భోజనం చేస్తున్నారే. మనకు పెట్టే అన్నం, ఆ అన్నదాత ఆ కార్మికుడు పెట్టేది అని గమనించాలి.

> **1983వ సంవత్సరంలో ఎంతో మంది అర్జీధారులు ఉన్నారు. ఈ విధంగా వృద్ధాప్య పింఛను ఇచ్చి, క్రుంగిపోయి, లేవలేక, శ్రమ చెయ్యలేక, నడుము వంగి, బాధపడే వారిని ఏ మానవత్వంతో ఆదరిస్తున్నామో ఒక్కసారి గుర్తు చేసుకోవాలి. ఆ విషయం కూడా ఈ ప్రభుత్వం స్పష్టం చెయ్యాలి. ఇస్తే ఇవ్వమనండి లేకపోతే లేదు. వారి ప్రారబ్దం. చెప్పవలసిన బాధ్యత మా మీద ఉంది.**

1985-86వ సంవత్సరములో ఈ స్కీమును తొలుత పెట్టింది తెలుగుదేశం ప్రభుత్వమే మరి ఐదు సంవత్సరాలలో రూ. 90 కోట్లు ఖర్చు పెట్టింది అంటే ఈనాడు 6,03,000 మంది లబ్ధి పొందుతున్నారు అంటే వారిని పారేద్దామా, వారు ఈనాడు శ్రమ చేయలేరు. ఇంతకాలం వారి శ్రమే మనం త్రాగేమే, తిన్నామే మరి ఈనాడు ఏమి చేద్దాము? కాబట్టి, ఈనాడు మభ్యపెట్టి ప్రజాస్వామ్యాన్ని కించపరచవద్దని దయచేసి మీ ద్వారా నేను మనవిచేస్తున్నాను. పోతే సాంఘిక సంక్షేమ హాస్టల్స్ విషయం ఎస్.టి, ఎస్.సి, వర్గాలకు సంబంధించినది, బలహీన వర్గాలు, బడుగు

వర్గాల హాస్టల్స్ సంఖ్య 1982-83లో కేవలం 1796 ఉంటే 1989-90 నాటికి 2210గా పెంచబడ్డాయి అంటే మరి ఏవిధమైన సంక్షేమం చూపబడింది. అదే బాలురు 1982-83లో 1,90,207 విద్యార్థులు సంక్షేమం పొందారు అంటే మరి ఈ రోజున 2,26,390 మంది బిడ్డలకు సంక్షేమం అందిస్తున్నామంటే మరి అది తప్పంటారా? మరి దాని విషయం నిర్వచించలేదే? దయచేసి మనవి చేయండి. ప్రజల విషయం ఏమిటి? బాలుర సంగతి, ఆ బలహీన బడుగు వర్గాల సంగతి ఏమిటని మీ ద్వారా నేను అడుగుతున్నాను. పోతే రెసిడెన్షియల్ స్కూల్స్. ఇదివరకు అసలు రెసిడెన్షియల్ స్కూల్స్ విషయం ఎవరికీ గుర్తుకు రాలేదు మరి పేదరికాన్ని మరచిపోవాలి. సహోదరభావం కావాలి, దేశభక్తి పెరగాలి, ఈ దేశాన్ని రక్షించాలి అంటే మేము ఈ దేశ పౌరులం అనుకొనేటటువంటి అవసరం, అవకాశం వారికి కలిగించాలని నేను సవినయంగా తమద్వారా మనవి చేస్తున్నాను.

దాని కోసం ప్రత్యేకంగా 68 పాఠశాలలు నిర్మించగలిగాము అంటే ఏవిధమైన దేశభక్తి, ప్రభోధితమైన సోదరభావం ఆ బిడ్డల చిరు మనస్సులలో తెలుగుదేశం ఆవిష్కరింపచేసిందో ఇప్పటికైనా స్మరించాలి. వారు అక్కరలేదా, పేద వారి బిడ్డలను పేదవారిగానే చూస్తారా, వారికి విజ్ఞానం అక్కరలేదా, అంధకారంలోనే బ్రతకాలా? పాలేళ్లుగానే బతికేస్తారా? ఏమిటో చెప్పండి. మేము ఏమీ మిమ్ములను అడగడం లేదు. ప్రజలు ఉన్నారు. నిర్ణయించే వారు ఉన్నారు. అది గుర్తుకు తెచ్చుకోవాలని మీ ద్వారా మనవిచేస్తున్నాను. తొక్కే వారికి రిక్షా అన్నాము. రిక్షా తొక్కే వారికి 1987-88లో బట్టల పథకాన్ని ప్రవేశపెట్టాము. అదే విధంగా 1989-90వ సంవత్సరములో రూ.159.78 కోట్లు ఉండగా, 1990-91 మీ బడ్జెట్‌లో రూ.129 కోట్లకు తగ్గించారు. దీనిని సమాజం క్షమిస్తుందా అని అడుగుతున్నాను. మరి పేదవారి సంక్షేమం కోసం నిధులు ఇవ్వలేనటువంటి ఈ చేతకాని ప్రభుత్వము, మరి మమ్ములను ఆమోదించమంటే ఏ విధంగా ఆమోదిస్తాము హృదయ భారముతో, నేను చెపుతున్నాను. నా బాధను వ్యక్తం చేస్తున్నాను. పేద వారికి అన్నం పెట్టలేని, పేదవారికి ఇంత గుడిసె వేయలేని, పేదవారి బిడ్డలకు చదువు చెప్పలేని ఈ ప్రభుత్వం ఎందుకు డబ్బు ఖర్చు పెడుతోందో ఒకసారి దయచేసి ఆలోచించాలి.

దీనిని మేము అంగీకరించము. ఏవిధంగానూ పేదవారికి పనికిరాని ప్రభుత్వాన్ని సమర్థించమని నేను సవినయంగా మనవిచేస్తున్నాను. ఉధాహరణగా చెపుతున్నాను. మేము ఏడవ పంచవర్ష ప్రణాళికా కాలములో వచ్చాము. ఏడవ పంచవర్ష ప్రణాళికలో మరి సాంఘిక సంక్షేమానికి రూ.237 కోట్లు మేము కేటాయిస్తే ఇది అన్ని రాష్ట్రాల కంటే ఎక్కువ. మిగిలిన రాష్ట్రాల కంటే మేము కేటాయించినది సాంఘిక సంక్షేమానికి ఎక్కువని అందరూ హర్షించారు. మరి మీ ప్రభుత్వమే కేంద్రములో ఉందే. అప్పుడు వారు తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని వారు నిర్ణయించారే? మరి దీనికి సమాధానం ఏమిటి? అదే విధంగా 1988-89లో 20 సూత్రాల

ఆర్థిక ప్రణాళిక మరి మీ గత ప్రధానిగారు చేసినటువంటి ఆ ప్రణాళిక ప్రకారం ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానాన్ని వహించింది అంటే ఆ విధంగా 20 సూత్రాల ప్రణాళికను మేము ఏ విధంగా నిర్వహించామో దయచేసి గుర్తు చేసుకోమని నేను సవినయంగా మనవి చేస్తున్నాను. అదే మహిళా సంక్షేమం. మరి మన సమాజములో ఆడబిడ్డలు ఉన్నారు.

ఈనాడు శాసనసభ్యులుగా వారు వచ్చారు. దయచేసి వారు గమనించాలి. ఈనాడు నూటికి 50 శాతం ఆడబిడ్డలు ఉన్నారు. చిన్నతనంలో మరి తల్లిదండ్రుల పెంపకం, యవ్వనం వచ్చినప్పుడు భర్తల యొక్క ఆధిపత్యం, ముసలి తనంలో బిడ్డల యొక్క సానుభూతితో బ్రతకడం కంటే వారికి సరైనటువంటి సంక్షేమం కలిగించాలి. సమాన హక్కులు తల్లిదండ్రుల ఆస్తిలో వారికి ఇవ్వాలని శాసనం చేశాము మేము. అది తప్పంటారా, చెప్పండి. అదే విధంగా 1986-87లో బాల, మహిళా ప్రగతి ప్రాంగణాలు మేము నిర్వహించాము. అందులో ఆడబిడ్డలు ఎవరైతే సమాజం చేత తిరస్కరించబడి తోడులేక, గూడులేక ఉన్నారో, వారందరికీ సరైనటువంటి వృత్తి విద్య పరమైనటువంటి ప్రబోధముతో వారికి సరైనటువంటి జీవన సంక్షేమం అందించే విభాగం ఒకటి. రెండు, మహిళా సోదరీమణులు ఎవరు చేయదగ్గ ఉద్యోగాలతో వారికి 30 శాతం కేటాయించాము. ఆ కేటాయింపులకు అనువైనటువంటి వారికి తర్ఫీదు ఇవ్వడం కోసం రెండవ విభాగం. ఈ విభాగాలు రెండూ కూడా ఏర్పరచబడ్డాయి. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎవరు ప్రారంభించారు? దీని క్రింద ఇవన్నీ కూడా ఎఫిలియేట్ చేయడం జరిగిందని మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను. మరి ఉంచుతారా, తీసేస్తారా? అక్కరలేదనుకుంటారా, కావాలనుకుంటారా? ఏదో తేల్చి చెప్పవలసిన అవసరం ఉంది. ఈ మహిళలను విస్మరించవద్దు. అందరికీ తల్లులు ఉన్నారు. మరి తల్లిదండ్రుల పేరు చెప్పుకొనే వ్యక్తులుగా బ్రతుకుతున్నాము. కాబట్టి, నీ ఆడబిడ్డల సంగతిని నీవే ఆలోచించు, నీ సోదరీమణుల సంగతి ఆలోచించు, నీ తల్లి సంగతి ఆలోచించమని మనవిచేస్తున్నాను.

ఈనాడు సాంఘిక సంక్షేమం అయిన తరువాత వ్యవసాయాన్ని మనము విస్మరించరాదు. ఈనాడు వ్యవసాయానికి సంబంధించినటువంటి రాష్ట్రం మనది. 70 శాతం అందరూ కూడా ఈ వ్యవసాయపు పనుల మీదనే బ్రతుకుతున్నారు. కాబట్టి, ఈనాడు వ్యవసాయం విషయంలో మనము పూర్తిగా బాధ్యతను నిర్వర్తించడం, రైతులను ఆదరించడం, కేవలం రైతులంటే ఏదో శత్రువులుగా భావించడం మనకు మంచిది కాదు. అన్నం పెట్టే దాత చెయ్యి నరుక్కోవడం మన ఆదర్శం కాదు. అది మన సంస్కృతి కాదని ఈ సందర్భముగా నేను మనవిచేస్తున్నాను. అదేవిధంగా అన్నదాత - వ్యవసాయ ప్రణాళిక కేటాయింపులు 1989-90లో రూ.194 కోట్లు ఉంటే ఈ రోజున మీరు రూ.184.93 కోట్లకు దించారే. దీనిని ఏవిధంగా ఆమోదిస్తాము, ఏ విధంగా ఆమోదించమంటారు? కాబట్టి, దయచేసి ఈ విషయం మాకు ఆమోదయోగ్యం కాదు.

వ్యవసాయదారులు. ఎవరైతే అన్నం పెట్టే వారు ఉన్నారో వారిని చూడరో, వారి యొక్క విధానానికి ఏమాత్రం తోడ్పడమో, మన యొక్క ఈ బాధ్యతను మనమే పనికిరానిదిగా చేస్తున్నామని కూడా ఈ సందర్భముగా వారికి నేను సవినయంగా మనవిచేస్తున్నాను. అదే విధంగా రైతు సంక్షేమం క్రింద భూమిశిస్తు రద్దు చేశాము. అది కూడా మనవి చేస్తున్నాను. అదే విధంగా విద్యుచ్ఛక్తి విషయములో వ్యవసాయ ఉత్పత్తులకు వారికి రూ.50 సంవత్సరానికి ఒక అశ్విక శక్తి కాడికి వారికి ఇవ్వడం జరిగింది. ఇది ప్రపంచమంతా, దేశమంతా హరించిన విధానం.

మరి ఈనాడు ఏవో వినవస్తున్నాయి ఈ మాటలు అన్నీ కూడా వస్తున్నాయి. దీనిని ఉంచుతారా, తీసేస్తారా అన్నది నిర్వచించవలసిన అవసరం ఉందని మీకు మనవిచేస్తున్నాను. అదే విధంగా ఏకగవాక్ష విధానం. అప్పుడు కేంద్ర ప్రభుత్వములో మీ వారే ఉన్నప్పుడు ఆనాడు మేము దీనిని ఆమోదించమన్నాము. మూడు సంవత్సరాలు నేను దీని మీద పోట్లాడిన తరువాత చివరకు మీ నాయకుడు ఒప్పుకున్నాడు. ఏకగవాక్ష విధానం ఆదర్శవంతమైనది. దానిని రాష్ట్ర ప్రభుత్వాలు అన్నీ కూడా అమలుచేసే పద్ధతిని మనము చూడాలని వారే అన్నారంటే అది ఏవిధమైన సంక్షేమ విధానమో ఏ విధంగా రైతు ఒకే చోట తీసుకొనేటటువంటి మధ్యకాలిక రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, స్వల్పకాలిక రుణాలు, వారు వాడుకొనేటటువంటి ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు వారికి ఏ విధంగా ఒకే చోట లభ్యం చేయాలి అనేటటువంటి గౌరవనీయమైనటువంటి విధానాన్ని ప్రవేశపెట్టామే, మరి ఈనాడు ఏకగవాక్షం సంగతి ఏమంటారు, ఉంచుతారా, తీసేస్తారా? నీరుపడని బావులకు రైతు ఎక్కడి నుంచి తెస్తాడు? మేము రాయితీలు ఇచ్చాము.

**రైతు ఒకే చోట తీసుకొనేటటువంటి మధ్యకాలిక రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, స్వల్పకాలిక రుణాలు, వారు వాడుకొనేటటువంటి ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు వారికి ఏ విధంగా ఒకే చోట లభ్యం చేయాలి అనేటటువంటి గౌరవనీయమైనటువంటి విధానాన్ని ప్రవేశపెట్టామే, మరి ఈనాడు ఏకగవాక్షం సంగతి ఏమంటారు, ఉ ంచుతారా, తీసేస్తారా?**

ఈనాడు మీరు రాయితీలు ఇస్తారా, తీసేస్తారా? ఇప్పుడే చూశాము. మహబూబ్‌నగర్ జిల్లాలో మీ వారే అడుగుతున్నారు మా సంగతి ఏమిటి, ఆ బావుల సంగతి ఏమిటని? మరి ఈ సంగతి కూడా తేల్చండి. నీరుపడని బావులకు రాయితీలు ఇస్తారా లేక వారి కర్మని ఇళ్లు వాకిళ్లు అమ్మి కట్టమని బలవంతం చేస్తారా? ఒకసారి నిర్వచించాలని మనవిచేస్తున్నాను. అదే విధంగా ప్రకృతి వైపరీత్యాలలో నష్టపోయిన రైతులకు వారు వాడేటటువంటి ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు 50 శాతం సబ్సిడీ రేటుకు వారికి సప్లయి చేశాము. కాబట్టి, ఈనాడు మీరు సప్లయి చేస్తారా, చేయరా? రబీ పంటలో ఒక్క మొక్క చావకుండా బ్రతికించాము. అది మా ఘనత ఈనాడు ఏ విధంగా ఉందో మీకే తెలుసు. నేను వేరే చెప్పక్కరలేదు. రబీ పంట లేదు. త్రాగడానికి

నీరు లేదు. మరి ఈ విధంగా అల్లకల్లోలమై దేశం ఉంటే ఈనాడు మీ మంజూరీలు, కేటాయింపులు అన్నీ కూడా మేము అంగీకరించాలి అంటే ఆత్మ చంపుకొని బ్రతకడం లేదు నేనని మీ ద్వారా స్పష్టం చేస్తున్నాను.

పేద ప్రజానీకానికి, పేద రైతులకు, శ్రమజీవులకు, కష్టజీవులకు పనికిరానటువంటి ఈ ప్రభుత్వం ఎవరికి న్యాయం చేస్తుంది? కలిగిన వారికి పెడతామా? ఈ విషయం మీ ఆదర్శమైతే అదైనా చెప్పండి. మేము అడగడం మానుకుంటాము. మీకు కోపం అక్కరలేదు. దయచేసి ఈ విషయం నిర్వచించాలని మనవిచేస్తున్నాను. అదే విధంగా 1988వ సంవత్సరములో సహకార రుణాలు రూ. 82 కోట్లు సుమారుగా మాఫీ చేసినటువంటి ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిది. అదే విధంగా సకాలములో చెల్లించినటువంటి వారికి ఐదున్నర శాతం వడ్డీ ముదరా ఇవ్వాలి. 10 శాతం వడ్డీలోంచి ఐదున్నర శాతం వడ్డీ ముదరా ఇచ్చే కేవలం నాలుగున్నర శాతం వడ్డీ పుచ్చుకోవాలనేటటువంటి నిర్ణయం చేశాము. ఈనాడు మీరు కాదన్నారే, ఇంతకంటే కిరాతకం ఏమైనా ఉంటుందా? ఈనాడు పారిశ్రామికవేత్తలకు మనము ఇస్తున్నాము. ఎన్నో ఇన్సెంటివ్స్ పెడుతున్నాము. మరి హాలీ డే ఇన్ సేల్స్ టాక్స్ ఇవన్నీ ఇస్తున్నాము? ఎందుకు వారికి ఇస్తున్నాము? ఈనాడు కూడు పెట్టి, నిన్ను బ్రతికించే వాడిని ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నావు? కాబట్టి, ఈ వైఖరిని మేము ఖండిస్తున్నాము. వారు ఈనాడు ప్రవేశపెట్టిన ఈ అప్రాప్రియేషన్ బిల్లును మేము సిద్ధాంతరీత్యా ఆమోదించడం లేద మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను.

అదే విధంగా పట్టాదారు పాస్‌బుక్స్ విషయం తీసుకొందాం. ఈనాడు డబ్బు ఉన్నవాడు బ్రతుకుతున్నాడు. కానీ రైతు కర్మ కాలిందంటే అతనికి ఉన్న ఇల్లూ వాకిలీ తాకట్టుపెడితే తప్ప బిడ్డలకు పెళ్ళిళ్ళు చేయలేడు, బిడ్డలను చదివించుకోలేడు. రైతుకు ఈ విధమైన తాకట్టు బ్రతుకు ఎందుకు పెట్టాం? రైతు సంక్షేమం కోసం తెలుగుదేశం ప్రభుత్వం పట్టాదారు పాస్ బుక్ విధానాన్ని ప్రవేశపెట్టింది. మేము డిసెంబరు 31వ తారీఖులోగా రైతులకు పాస్ బుక్స్ ఇవ్వాలనుకొన్నాం. కానీ నవంబరులో మీరు అధికారానికి వచ్చారు. మీరు ఇవ్వలేకపోయారు. మీ అశక్తతకు ఇది నిదర్శనం, రైతులకు చేసే ద్రోహానికి ఇది నిదర్శనం, ఈనాడు కర్షక జనానికి జరిగే అన్యాయానికి ఇది నిదర్శనం అని మీద్వారా వారికి మనవిచేస్తున్నాను. మీ చిత్తశుద్ధిని నిరూపించండి. మీరు పాస్ బుక్స్ ఇవ్వండి. మేము అంగీకరిస్తాం మీరు చేసే మంచి పనులన్నింటిని ఆమోదిస్తాం. అంతేతప్ప, ఈ విధమైన అప్రజాస్వామిక విధానాలను మేము ఏమాత్రం అంగీకరించేది లేదని మనవిచేస్తున్నాను.

అదేవిధంగా 1983లో వ్యవసాయానికి సంబంధించిన పంప్‌సెట్స్ 5 లక్షల 36 వేలు ఉంటే 1989వ సంవత్సరంలో మీరు అధికారంలోకి వచ్చేనాటికి వ్యవసాయ పంప్‌సెట్ల సంఖ్యను మేము 10 లక్షల 34 వేలకు పెంచాం. రైతుల ఉత్పత్తులను పెంచడానికి ఈ విధంగా కృషి

చేశామంటే తెలుగుదేశం ప్రభుత్వం ఏవిధమైన అంకితభావంతో రైతన్నల సంక్షేమానికి పనిచేసిందో ఈ ప్రభుత్వం వారు దయచేసి గుర్తించాలని మనవిచేస్తున్నాను.

రైతే రాజు కావాలన్న బాపూజీ నిర్వచనాన్ని ఏమంటారు? మీరు కాదంటారా? రైతు మీకు బానిసగా ఉండాలంటారా? రైతు తొత్తుగా బ్రతకాలంటారా? రైతు కష్టజీవిగా నశించాలంటారా? రైతు పేడ పిసుక్కొనే బ్రతకాలంటారా? ఇవన్నీ దయచేసి చెపితే బాగుంటుందు మనవిచేస్తున్నాను. అదేవిధంగా వ్యవసాయోత్పత్తుల విషయంలో 1980-81లో కేవలం 17.93 శాతంగా ఉంటే ఇన్ని పంప్‌సెట్స్ ఎవరైజేషన్ జరిగింది కాబట్టి, ఈనాడు 34.8 శాతానికి పెరిగింది - అంటే ఎవరు లబ్ధి పొందారో దయచేసి మీరు గమనించాలి. కానీ ఈనాడు రైతు జన సంక్షేమం చూడని ఈ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ ఎప్రాప్రియేషన్ బిల్లు మాకు ఆమోదం కాదు. అదేవిధంగా ఈనాడు వ్యవసాయ రంగానికి విద్యుచ్ఛక్తి కొరత ఎలా ఉందో చూడండి. ఎప్పుడూ 18 గంటలకు తక్కువగా రైతులకు మేము విద్యుచ్ఛక్తి సరఫరా చేయలేదు.

*(అంతరాయము)*

1989 వరకు సుమారుగా 18 గంటలు విద్యుచ్ఛక్తి సరఫరా చేశాము. కానీ ఈరోజు 13 గంటలు కూడా సరఫరా చేయలేకపోతున్నారు. ప్రజలకు వ్యవసాయ రంగానికి విద్యుచ్ఛక్తి సరఫరా విషయంలో వారు హామీ ఇవ్వలేకపోతున్నారంటే ఇది వారు చేస్తున్న తీరు ద్రోహం. కాబట్టి ఈ ఎప్రాప్రియేషన్ బిల్లు మాకు అంగీకారం కాదని మా అసమ్మతిని తీవ్రంగా వ్యక్తం చేస్తున్నాము. వారు తెలుసుకోవలసిన విషయాలు చాలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లాలో మాకు కరెంట్ లేదు, మా గోడు వినండి, మాకు సంక్షేమం చేయండి అని ప్రభుత్వాన్ని అర్థించిన వారిని పోలీస్ కాల్పులలో ఇద్దరిని చంపుతారా? దీనికి తగిన సమాధానం చెప్పాలని సవినయంగా మనవిచేస్తున్నాను.

*(అంతరాయము)*

ఈనాడు ఎవరైనా ఒక పరిశ్రమ పెట్టి వారు ఉత్పత్తి చేసిన వస్తువులకు వారి ఇష్టం మేరకు ధరలను నిర్ణయించుకొంటున్న ఈ సందర్భంలో రైతు తాను పండించిన పంటకు తగిన గిట్టుబాటు ధర నిర్ణయించుకోవాలి, రైతుకు గౌరవం కల్పించాలి, గుర్తింపు లభించేటట్టు చేయాలన్న ఉద్దేశంతో కర్షక పరిషత్‌ను ఏర్పాటు చేస్తే దానిని కాదంటున్నారు.

అల్లుడు అయినా ఎం.ఎల్.ఏ కావడానికి ప్రజలు అధికారం ఇచ్చారు. కాదనడానికి లేదు. మనమే సభా గౌరవాన్ని చిన్నచూపు చూస్తున్నాము. మనమే కాలదన్నుతున్నాం. అది దయచేసి గుర్తించాలని మనవిచేస్తున్నాను. ప్రజాస్వామ్యం పట్ల గౌరవం ఉంటే ఆ విధానాన్ని హర్షించాలనీ, గౌరవించాలనీ సవినయంగా నా అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాను. ఇకపోతే ఆ కర్షక పరిషత్‌లో పంటల సమాఖ్యలు అన్నీ కలిసి ఉండాలి, సరైన పంపిణీ విధానంతో వారి సంక్షేమాన్ని వారే

చూసుకోవాలి, ప్రభుత్వపరంగా ఏమీ ఉండకూడదని నిర్ణయించాం. కర్షక పరిషత్, దాని అనుబంధ వ్యవస్థలన్నీ ఒకే చోట ఉండాలని అందుకోసం 600 ఎకరాల భూమిని కేటాయించాం. అందుకు ఏమంటారు? ఈనాడు వ్యవసాయ సలహా సంఘమట, దానికి ముఖ్యమంత్రిగారు ఛైర్మన్, వ్యవసాయ శాఖామాత్యులు డిప్యూటీ ఛైర్మన్ అట. ఈ వ్యవస్థలన్నీ మన కోసమా? లేక ప్రజల కోసమా? ఈనాడు అధికార వికేంద్రీకరణ కావాలి. ప్రజలను ప్రజలుగా చూడాలి. ఈనాడు ప్రజాస్వామ్యానికి మనం కళ్లు అని చెప్పుకొంటూ పెత్తందార్లుగా ఉండి అన్నీ మన నెత్తినే పెట్టుకొని ప్రజలను అవమానపరచడం తగదు, అందుకు నా తీవ్ర తీవ్ర నిరసనను వ్యక్తపరుస్తున్నాను.

ఇక విద్యుచ్ఛక్తి గురించి మీద్వారా ప్రజలకు గట్టిగా చెప్పవలసిన అవసరం ఉంది. మేము ఆ రోజున పరిపాలనా బాధ్యత స్వీకరించే నాటికి విద్యుత్ ఉత్పాదన 3,600 మెగావాట్లు ఉంటే హైడ్రో విద్యుచ్ఛక్తిని కేవలం 2,400 మెగావాట్లుగా నిర్ణయించారు. థర్మల్ విద్యుచ్ఛక్తి 1,200 మెగావాట్లు ఉంది. అయితే యదార్థానికి ఇది సరైంది కాదు. ఎప్పుడైనా ప్రకృతి, విపత్తులు ఏర్పడినప్పుడు, వర్షాలు రానప్పుడు, కరువు కాటకాలు ఏర్పడినప్పుడు విద్యుచ్ఛక్తికి అఘాతం కలగడం మనకు తెలిసిందే. కాబట్టి థర్మల్ పవర్, హైడల్ పవర్ కంటే రెండింతలుగా ఉండాలి. అంతేతప్ప దానిలో సగంగా ఉండకూడదు. తప్పుడు విధానం ఫలితంగా విద్యుచ్ఛక్తి కొరతకు గత పాలక వ్యవస్థలోనే అంకురార్పణ జరిగిందని సవినయంగా మనవిచేస్తున్నాను. ఇక ఆనాడు విద్యుచ్ఛక్తి తలసరి వినియోగం కేవలం 67.2 శాతం ఉంటే ఈ రోజున 128 పర్సెంటు పెరిగింది అంటే విద్యుచ్ఛక్తిని పెంపుదల చేశామో లేదో ఈ అంకెలవల్లే తెలుస్తుంది.

అదే విధంగా ఇదివరకు విద్యుచ్ఛక్తి వినియోగం 5267 ఉంటే ఈనాడు అది 15,643 మెగావాట్స్‌కు పెంచబడింది అంటే విద్యుచ్ఛక్తి ఉత్పత్తి, ఏవిధంగా పెరిగిందో, మేము ఎన్ని పంపుసెట్స్ ఇచ్చామో, ఎన్ని వ్యవసాయ బావులకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామో, అన్ని రంగాల్లో విద్యుచ్ఛక్తి వినియోగం ఏవిధంగా పెంచబడిందో దయచేసి గుర్తించాలాని మనవిచేస్తున్నాను. అదే విధంగా చిన్న పంచాయతీలు ఉన్నచోట వీధి దీపాలకుగానీ, మంచినీటి సరఫరాకుగానీ విద్యుచ్ఛక్తిని సరఫరా చేశాం. ఈనాడు వెనుకబడిన వారికి, షెడ్యూల్డ్ కులాలవారికి – ప్రతి వారికి దీపాన్ని ప్రసాదించడం జరిగింది. ఇలా ఏవిధంగా విద్యుత్ ఉత్పత్తి పెంచబడిందో, వినియోగదారుల సంఖ్య ఏవిధంగా పెరిగిందో గమనించాలని మనవిచేస్తున్నాను. ఇక 1983లో 553 సబ్–స్టేషన్లు ఉంటే తెలుగుదేశం హయాములో వాటి సంఖ్య 1019కి పెంచబడింది. ఈ పెంపుదల శాతం 91.2 అని మీకు సవినయంగా మనవిచేస్తున్నాను. అదే విధంగా 1983 నాటికి ట్రాన్స్‌ఫార్మర్ల సంఖ్య 424 ఉండగా ఇప్పుడు 866కు పెంచబడినాయి. ఇది 140 శాతం పెంపుదల.

దీని విషయంలో సమాధానం ఏమిటి? అదే విధంగా ఆదాయం 1983లో 332 కోట్లు ఉంటే, ఈనాడు 833 కోట్లకు పెంచాము. ఇది 149 శాతం ఆదాయంలో పెంపుదల.

కన్జ్యూమర్స్ – విద్యుచ్ఛక్తిని వాడుకునేవారు 1983లో 28.88 లక్షలు ఉంటే, ఈరోజున 58.80 లక్షల వరకు అంటే, 104 శాతం పెరిగిందని సవినయంగా మనవిచేస్తున్నాను. 4వ ప్రణాళికలో మీ కేటాయింపులు దయచేసి గుర్తించాలి. 7వ ప్రణాళికలో మేము పెట్టాము. 4వ ప్రణాళిక మీ చేతుల్లో ఉన్నది. 5వ ప్రణాళిక మీ చేతుల్లో ఉన్నది. 4వ రెండు వార్షిక ప్రణాళికలు మీరే నిర్వహించారు. 4వ ప్రణాళికలో 42.5 శాతం ఆనాడు నిధులు కేటాయింపు విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి జరిగింది. 5వ ప్రణాళికలో 38.40 జరిగింది.. 2వ వార్షిక ప్రణాళికలో 32.8 శాతం జరిగింది. 6వ వార్షిక ప్రణాళికలో 22.8 శాతం జరిగింది.

ఈనాడు పేదవారికి ప్రణాళికా కేటాయింపులు 21.3 కేటాయించాము. కానీ ఖర్చు చేసింది 25 శాతం ఖర్చు చేశామంటే ఏవిధంగా విద్యుచ్ఛక్తి రంగానికి అత్యధికమైన ప్రాధాన్యత ఇచ్చామో, ఏవిధంగా గుర్తించామో గుర్తుచేస్తున్నాను. మనకు జరుగుతున్నటువంటి అన్యాయం కూడా చెప్పడం మా ధర్మం. కేంద్ర ప్రభుత్వం మీ చేతుల్లో ఉంది అన్నారు. సింగరేణి కాలరీల్లో బొగ్గు ఎంత ఉత్పత్తి అవుతుంది? 11 మిలియన్ టన్నులు ఆనాడు ఉంటే, ఈనాడు 19 మిలియన్ టన్నులు బొగ్గును మేము ఉత్పత్తి చేసే విధానాన్ని పెంచాము ఆనాడు ఎంత లభించింది? ఒక బొగ్గు ముక్క అయినా మనకు విద్యుచ్ఛక్తికి వాడుకోవడానికి లింకేజి ఇచ్చారో మీ ప్రభుత్వాన్ని అడగండి? ఎందుకు ఇవ్వలేదు? ఎందుకు నిర్లక్ష్యం చేయబడింది? మనకు ఉన్నటువంటి నిధులన్ని కూడా ఉపయోగించకుండా మన రాష్ట్రాభివృద్ధికి వాడకుండా ఎందుకు దగాపడ్డాము? అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నది. దయచేసి వారే తెలుసుకుంటే మంచిదని మీకు సవినయంగా మనవిచేస్తున్నాను.

అదే విధంగా, కల్పాకం మొదటి దశలో పూర్తి కేటాయింపు తమిళనాడుకు చేశారు. రెండవ దశలో కేవలం 50 శాతం మాత్రమే అందరికీ పంచి పెట్టారు. రాష్ట్రాలు అన్నింటికి సామాజిక న్యాయం సమానంగా అందచేయాలి. వారు ఓట్లు వేశారు. వీరు వేయలేదు, వారు మా మద్ధతుదారు, వీరు మా మద్ధతుధారులు కారనే పక్షపాతబుద్ధితో ఉంటే రాష్ట్రం అభివృద్ధి ఎట్లా జరుగుతుందో దయచేసి ఆలోచించాలని సవినయంగా మనవిచేస్తున్నాను. అదేవిధంగా మన రాష్ట్రానికి సంబంధించినంత వరకు ఇక్కడ కూడా నేషనల్ థర్మల్ పవర్ ప్రాజెక్టులలో కేవలం 27 శాతం మాత్రమే ఇస్తున్నారు. నోరులేనివారిని చేశారు ఆ సదుపాయాలు మనకు ఇవ్వడంలేదు. అది అడగడం చేతకాదు. ఈ ప్రభుత్వం చేయలేదు, చేయలేదు, చేయలేదు అంటున్నారు. కాబట్టి మీద్వారా మనవిచేస్తున్నాను. దీనిని గమనించాలి అదేవిధంగా తెలుగుదేశం చేపట్టిన కార్యక్రమం 8వ ప్రణాళికలో జరిగిన అన్యాయాన్ని అడగకుండా, మీ కాంగ్రెస్ హయాంలో అన్ని రాష్ట్రాలకు ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువగా ఉత్పత్తి ఇస్తే, దక్షిణాది ప్రాంతానికి మైనస్ 18.1గా నిర్ణయించారు. ఈనాడు విద్యుచ్ఛక్తి ఉత్పత్తిని గుర్తించాలి. అంటే ఏవిధమైనటువంటి న్యాయం జరిగింది?

ఉత్తరాదివారికి 5.4 ప్లస్ అదేవిధంగా తూర్పు ప్రాంతానికి 5.3 ప్లస్. ఈ విధంగా ఆధిక్యత చేశారు. మనకు – 18.1 చేశారు. చిన్న చూపు చూశారు. దయచేసి ఈ విషయంలో ఏ విధమైన రాజకీయాలు వద్దు, మనకు కోపతాపాలు వద్దు. మనకు జరిగిన అన్యాయాన్ని గుర్తించండి, సరైన న్యాయం చేయండని సవినయంగా మనవిచేస్తున్నాను. అంతకంటే ముఖ్యమైన విషయం – నిన్న మొన్న జరిగింది. తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నంత వరకు మా అధికారాన్ని మేము వదులుకోలేము. తెలుగువారి ఆత్మ గౌరవాన్ని పరిరక్షిస్తాము. మీ చేతిలో బచావత్ అవార్డు కమిషన్ ఉన్నది. తిరిగి రివ్యూ చేయవలసిన అవసరం లేదు. దాన్ని అమలు చేయాలి. అమలు చేయగల బాధ్యత కేంద్ర ప్రభుత్వానిది. ఆనాడు కృష్ణానది జలాలు 2,600 టి.ఎం.సి.ల నీటిని – ఆంధ్రప్రదేశ్‌కు 800 టి.ఎం.సి, 700 టి.ఎం.సి.లు కర్ణాటకకు 500 టి.ఎం.సిలు మహారాష్ట్రకు ఇవ్వడం జరిగింది. 75 శాతం డిపెండబిలిటీ మీద ఎప్పుడైనా ప్రకృతి వైపరీత్యాలు వస్తే దెబ్బతినేది ఆంధ్రప్రదేశ్.

**ఈనాడు ఒక్క తెలుగుగంగ విషయమే కాదు ఈనాడు తెలంగాణ ప్రాంతం వారికి వాట్ డు యు ఆన్సర్, శ్రీశైలం లెఫ్ట్ బ్రాంచి కెనాల్‌కు వాట్ డు యు ఆన్సర్, భీమా ప్రాజెక్టు, చిత్తూరు జిల్లా వారికి, గాలేరి-నగరి కెనాల్ వాట్ డు యు ఆన్సర్, హంద్రీ రివర్ కెనాల్ గురించి అయాం ఆస్కింగ్ స్ట్రెయిట్ క్వశ్చన్ 2,000 ఎ.డి. దాకా ఉపయోగించడానికి మనకు అధికారం ఉన్నది.**

ఆంధ్రప్రదేశ్‌కు నష్టం జరుగుతుంది. కాబట్టి, ఎప్పుడు అయినా మిగులు నీరు ఉంటే, ఆ నీరు వృధాగా సముద్రంలోకి పోకుండా వారు ఉపయోగించుకోవడానికి 2000 ఎ.డి. వరకు పరిపూర్ణమైన అధికారము ఇచ్చామన్నారు. ఆ అధికారాన్ని వాడుకోవడానికి అందుకే వారు ఇదివరకు ముఖ్యమంత్రుల సమావేశానికి పిలిచినప్పుడు నేను వెళ్లవలసిన అవసరం లేదన్నాను. వెళ్ళామంటే, ఎన్నో నిబంధనలు పెట్టవచ్చు. గౌరవ ప్రధాని ఏదో కమిషన్ వారు రిపోర్టు మిషతో ఇంటర్‌ఫియర్ అయి ఏమీ ముట్టకూడదు అనవచ్చు. మాకు అటువంటి అనుమానాలు ఉన్నాయి.

కాంగ్రెస్ వారు చేసినటువంటి అన్యాయాలను చూచి ఈ తెలుగుదేశం ప్రభుత్వం ముఖ్యమంత్రుల సమావేశానికి వెళ్లడానికి అవసరం లేదని భావించింది. బచావత్ అవార్డుకు సంబంధించి దాన్ని మీరు ఇంప్లిమెంట్ చేయండని కోరాము. ముఖ్యమంత్రిగారికి చెప్పాను. కేవలం ఇది సీక్రెట్‌గా చెప్పలేదు. అదే విధంగా, ఈనాడు ఒక్క తెలుగుగంగ విషయమే కాదు ఈనాడు తెలంగాణ ప్రాంతం వారికి వాట్ డు యు ఆన్సర్, శ్రీశైలం లెఫ్ట్ బ్రాంచి కెనాల్‌కు వాట్ డు యు ఆన్సర్, భీమా ప్రాజెక్టు, చిత్తూరు జిల్లా వారికి, గాలేరు-నగరి కెనాల్ వాట్ డు యు ఆన్సర్, హంద్రీ రివర్ కెనాల్ గురించి అయాం ఆస్కింగ్ స్ట్రెయిట్ క్వశ్చన్ 2,000 ఎ.డి. దాకా ఉపయోగించడానికి మనకు అధికారం ఉన్నది, మన అధికారాన్ని తాకట్టు పెట్టి కేవలం సిగ్గుమాలిన బ్రతుకు బ్రతకవలసిన అవసరం ఏమిటి? ఇకపోతే, జంటనగరాల నీటి సమస్య. ఆ

రోజున ప్రతిపక్షాల వారందరినీ పిలిచాము. వారందరికీ సమస్య విన్నవించాము. ఏ పాయింట్ అయితే బాగుంటుంది? ఎక్కడనుంచి అయితే జంటనగరాలకు నీరు ఇవ్వడం జరుగుతుందని అడిగాను. అందరం కూడా సుమారు 2, 3 సమావేశాలలో చర్చించాము. చివరకు నా నిర్ణయానికి వదిలి పెట్టారు. కాబట్టి, అక్కంపల్లి రిజర్వాయర్ నుంచి నీరు తీసుకురావాలి అని నిర్ణయించడం జరిగింది. అక్కడ భూమి సేకరించవలసిన అవసరం లేదు ఆ రోడ్డు ప్రక్కన 3 పంపులు వేసి, మూడు దశలలో – మొదటి దశలో 50 కోట్లు, రెండవ దశలో 200 కోట్లు, మూడవ దశలో 150 కోట్లుతో మొత్తం 600 కోట్లుతో నీరు తేవాలని నిర్ణయించడం జరిగింది. పేద రైతులు ఇబ్బంది పడకుండా, భూమిని సేకరించకుండా, సునాయాసంగా అమలు చేయవచ్చునని ఆ కార్యక్రమాన్ని అంగీకరించడం జరిగింది. దానికి పర్యవసానంగా శంఖుస్థాపన చేయడం మా ఆదర్శం కాదంటారా? మేము చేసింది తప్పు అంటారా? దయచేసి చెప్పాలని మనవిచేస్తున్నాను.

ఆనాడు మొదలు పెట్టిన కార్యక్రమం మా వారసులుగా మీరు ఈనాడు నిర్వహించకుండా కేవలం తుడిచి పెడతామంటే ఎట్లా? ఆనాడు ప్రతిపక్షాలవారందరూ ఉన్నారు. మీరు కూడా ఆనాడు ప్రతిపక్షంలో ఉన్నారే, మిమ్మల్ని మీరు అగౌరవ పరుచుకుంటారా? సరైన న్యాయం జంటనగరాల పౌరులకు చేయాలని మిమ్మల్ని వినయపూర్వకంగా అర్థిస్తున్నాను. కాబట్టి, ఈ విషయం గుర్తించండి. కాకతీయ కాలువను 50 కి.మీ. పొడిగించాము. సుంకేశుల రిజర్వాయరు, కె.సి. కెనాల్‌కు కృష్ణానది జలాలు ఇచ్చి, అనంతపూర్ జిల్లాకు 10 టి.ఎం.సి.లు తరలించి ఆ నేలను సుభిక్షం చేయాలని చెప్పడం జరిగింది. ఆ విషయం మీరు చెప్పలేదు. అన్నింటికి మీరు నీరును సప్లయి చేస్తామని ప్రజలకు హామీ ఇవ్వలేదా? ఇందుకేనా ప్రజలు మీకు ఓట్లు ఇచ్చింది? ఏ విధమైన పరిష్కారం సూచించకుండా ఎప్రాప్రియేషన్ బిల్లు మాకు ఆమోదయోగ్యం కాదని మీకు నేను మనవిచేస్తున్నాను. విద్య కూడా ఒక పెద్ద విషయం. ఎందుకంటే, ఎవరైనాసరే వారి భాషమీద వారికి గౌరవం ఉంటుంది. తెలుగదేలయన్న దేశంబు దెలుగేను దెలుగు వల్లభుండ దెలుగొకండ, యెల్లన్నపులు గొలువ నెఱుగవే బాసాడి, దేశభాషలందు, దెలుగులెస్స". ఇటువంటి విద్యకు ప్రత్యేకమైన స్థానాన్ని కల్పించాలి. ఈనాడు పేద ప్రజలు చదువుకోవడానికి క్యాపిటేషన్ ఫీజు రద్దు చేయడం జరిగింది.

అధ్యక్షా, విద్యకు మనం ఇచ్చే గౌరవం, అది అందరికీ విద్యాప్రదాయిని కావాలి. కేవలం జీవితం గడుపుకోవడానికి, బానిస ఉద్యోగ ప్రసక్తితో కూడిన ఒక తప్పుడు భావం కాకూడదు అనేది మా పద్ధతి. కాబట్టే కలిగిన వారి బిడ్డలకే చదువుకునే అవకాశం కాదు, లేని వారు కూడా చదువుకోవాలి. వారి అర్హతలతో వారు గుర్తింపబడాలి. కేవలం వారి సంపదతో గుర్తింపబడకూడదు అనే విధానం మీద, క్యాపిటేషన్ విధానం తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో రద్దు చేసింది మా ప్రభుత్వం అని సవినయంగా మనవిచేస్తున్నాను. ఇప్పుడే మనవి చేశాను, విద్య

అన్నది జీవనభృతిని పెంచే పద్ధతిగా ఉండాలే కానీ, బానిస ఉద్యోగాలు చేసేదిగా కాకూడదు అనే విధానంతోనే వృత్తి విద్యను ప్రవేశపెట్టడం జరిగింది వృత్తి విద్యను ప్రవేశపెట్టిన ఘనత తెలుగుదేశానిది. ఎనిమిది, తొమ్మిది, పది క్లాసులలో వృత్తి విద్యను తప్పకుండా చేయాలి. అప్పుడే పదవ తరగతి చదివిన తరువాత వారి కాళ్ల మీద వారు నిలబడగలరు కనీసం పొట్టపోసుకోగలుగుతారు. అటువంటి విజ్ఞానాత్మకమైన విద్య కావాలి. ఈ బానిస విద్యా విధానంతో మన ప్రజానీకం దగా చేయబడకూడదు అనే భావంతో దీన్ని ఆనాడు ఏర్పాటు చేయడం జరిగిందని మీకు ఈనాడు సవినయంగా మనవిచేస్తున్నాను. మేము రాజకీయాలలోకి వచ్చింది కేవలం ఏవిధంగా కూడా మా ఆత్మలను తాకట్టు పెట్టుకోవడానికి కాదు.

రెసిప్రోకల్ సీట్లను ఆనాడు తీసి వేశాము. నేను ప్రజానీకాన్ని ప్రశ్నిస్తున్నాను. ఈనాడు మేము ఎక్కడికి కూడా, ఇక్కడి నుండి విద్యార్థులను ఏ రాష్ట్రానికి పంపించలేదు. అక్కడి వారికి షెల్టర్ ఇవ్వలేదు. ఈ విధంగా రెసిప్రోకల్ సీట్స్ తీసివేయడం, ప్రభుత్వ విధానానికి సంబంధం లేకుండా, ఒక పద్ధతిలో, ఒక నిర్దిష్టమైన విధానంలో, అర్హత కలిగిన వారికి, ఇంటర్వ్యూస్, ఎగ్జామినేషన్స్ పెట్టాము. లిస్టు జారీ చేయించాము. ఎవరైతే ఆ లిస్టులో వచ్చారో, వారికే ప్రవేశం కల్పించడం జరిగింది. తరువాత, కొంతమంది విజ్ఞులు చెప్పిన తరువాత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రొఫెషనల్ స్టడీస్ అనే దాన్ని పెట్టాము. ఏమిటి దాని సంగతి? అప్పటికే 600 ఎకరాలు కేటాయించాము. ఈనాడు. మన విద్యార్థులు చాలామంది ఇతర రాష్ట్రాలకు వెళ్లి, అక్కడ క్యాపిటేషన్ ఫీజు ఇచ్చి, సీట్లు కొనుక్కుంటున్నారు తెలిసినప్పుడు, మన డబ్బు ఇతర రాష్ట్రాలకు పోతోందని గమనించినప్పుడు అటువంటి విద్యార్థులకు మనమే శిక్షణ ఇద్దాము.

మరో అవకాశం వారికి కలిగిద్దాము. వారికి రిఫ్రెషింగ్ కోర్సు ఆరు నెలలు ఇద్దాము. వారికి కామన్ ఎంట్రెన్సు ఎగ్జామినేషన్ పెడతాము. 50 శాతం వచ్చిన వారికి తిరిగి సీట్లు ఇద్దామనే అభ్యుదయ భావంతో మేము నిర్ణయించాము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రొఫెషనల్ స్టడీస్. దాని విషయం ఏమి చేస్తారు? మీరు విద్యను ఆదరిస్తారా? లేదా? అటువంటి విద్యార్థులను గుర్తించి మన రాష్ట్రంలోనే చదువుకునే అవకాశం, మరో ఛాన్స్ అటువంటి వారికి ఇస్తారా? ఇవ్వరా? ఇటువంటివి ఏవీ నిర్వచించని ఈ ప్రభుత్వం యొక్క, ఈ యొక్క బిల్లును ఆమోదించే విధానం లేదని మేము సవినయంగా మనవిచేస్తున్నాను. ఈ యొక్క ప్రభుత్వ నిబంధనలకు లోబడిన వారికి తప్పకుండా ఇస్తామని మేము చెప్పాము. ఈనాడూ చెబుతున్నామని సవినయంగా మనవిచేస్తున్నాను. ఈ నిబంధనలకు లోబడ్డ ప్రతివారికి అవకాశం కలిగించబడుతుందు నేను మనవిచేశాను. ఇకపోతే, విద్యావిధానంలో ఎన్ని మార్పులు తెచ్చామో గమనించాలి. ఆడియో విజువల్ ఎడ్యుకేషన్ ఈనాడు డ్రాప్ అవుట్స్‌ను తీసివేసి, విద్య అంటే ఆకర్షవంతంగా చేయాలి. విజ్ఞానం ప్రబోధించాలి అనే భావంతో ఆడియో విజువల్ ఎడ్యుకేషన్ ప్రవేశపెట్టాము. మా

ప్రభుత్వం మారిన వెంటనే మీరు ఇచ్చిన గుర్తింపు మాకు అక్కరలేదని, మేము రిజైన్ చేస్తున్నామని రమణగారు, బాపుగారు అన్నట్లు విన్నాము. రమణగారు. బాపుగారు 'మా దగ్గర ఏమీ ఆశించకుండా' మీరు ఎన్నుకున్న విధానం పట్ల మాకున్న అభిమానంతో వారు ఈ యొక్క ఆడియో విజువల్ ఎడ్యుకేషన్‌కు సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. 5వ తరగతి వరకు మీరు తయారు చేయండి. ప్రబోదిద్దామని అన్నప్పుడు ఆమోదించిన వారు, ఇప్పుడున్న ప్రస్తుత ప్రభుత్వం రాగానే వారు రిజైన్ చేసి వెళ్లి పోయారంటే ఏ విధమైన భావాన్ని ఈ ప్రభుత్వం అభ్యుదయ కళాకారుల్లో, అభ్యుదయ సారస్వతవేత్తల హృదయంలో కలిగించారో ఆత్మవిమర్శ చేసుకోవలసిందిగా కోరుతున్నాను. మాకు చెప్పవద్దు. మీరే ఆత్మవిమర్శ చేసుకోండి. మీరు పూర్తిగా ఈనాడు డ్రాప్ అవుట్స్‌ను తీసివేసి సక్రమంగా విద్యను అమలు చేయండని సవినయంగా మనవి చేస్తున్నాను.

అదే విధంగా 1200 మంది సింగిల్ టీచర్స్ ఉన్న దానిలో, ఈనాడు విద్యార్థులు ఎక్కువ అయినారు, డబుల్ టీచర్ స్కూల్ చేయాలన్న భావంతో 8 వందల స్కూల్స్‌లో, మేము ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలన్న విధానానికి కట్టుబడి ఉపాధ్యాయులకు ఉద్యోగాలు ఇచ్చాము. మిగతా స్కూల్స్‌లో మీరు ఇస్తారా? ఇవ్వరా? నిర్దిష్టంగా చెప్పవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ఇంకా మభ్యపెట్టడం మంచిదికాదని నేను సవినయంగా మనవిచేస్తున్నాను.

**ఇకపోతే పరిపాలనా విధానంలో సంస్కరణలు చేసి, అధికార వికేంద్రీకరణ కావాలి. కేవలం పెత్తందారులకు అధికారం కట్టపెట్టకుండా పేదవారి ముందుకు పరిపాలనా యంత్రాంగం వచ్చి వారి ఇంటి తలుపు తట్టాలి. ఆ విధంగా ఈ దేశం యొక్క బాగు కొరకు మాండలిక రాజ్యాంగాన్ని ఈ తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసినది. ఈ మాండలిక వ్యవస్థ అంటే ఏమిటి?**

ఇకపోతే పరిపాలనా విధానంలో సంస్కరణలు చేసి, అధికార వికేంద్రీకరణ కావాలి. కేవలం పెత్తందారులకు అధికారం కట్టపెట్టకుండా పేదవారి ముందుకు పరిపాలనా యంత్రాంగం వచ్చి వారి ఇంటి తలుపు తట్టాలి. ఆ విధంగా ఈ దేశం యొక్క బాగు కొరకు మాండలిక రాజ్యాంగాన్ని ఈ తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసినది. ఈ మాండలిక వ్యవస్థ అంటే ఏమిటి? అన్ని డిపార్టుమెంట్‌లు కలిపి ఈ మండలంలో ఏర్పాటు చేసి ఉన్నత విద్య, ప్రాథమిక విద్య, పోలీస్ స్టేషన్, శాంతిభద్రతలు మొదలగునవి సృష్టించి రాష్ట్రానికి మేలు చేయాలని చూశాము. 330 సమితులు ఉన్న ఈ రాష్ట్రంలో 1104 మండలాలుగా ఏర్పాటుచేసి మహానుభావులు కన్న కలలకు రూపకల్పన చేశాము. అపుడు ఉన్న తహశీల్దారు వ్యవస్థకు బదులు దానిని మూడు మండలాలుగా విభజించినాము. ఇపుడు ఈ సర్వీసులన్నింటికి కూడా యూనిఫైడ్ సర్వీసు సిస్టమ్ కావాలి. ఫైనాన్స్ కమిషన్ వారు వచ్చినప్పుడు మేము ఎక్కడైనా ఎస్టాబ్లిష్‌మెంట్‌కు 25 శాతం కన్నా పెరగకూడదని చెప్పాము. కేంద్రప్రభుత్వము వారు కూడా ఈ విషయంలో

అన్ని రాష్ట్రాల వారిని కన్‌సల్ట్ చేశారు. ఇటువంటి సజెషన్ ఇంతవరకూ ఆంధ్రప్రదేశ్‌లోనే నిర్మాణం అయినట్లు సజెషన్ వచ్చింది. కాబట్టి ఈ విషయమై తీవ్రంగా ఆలోచించాలని కోరుతున్నాను. దీనికి ఎంత ఖర్చు పెడతారు. దానికి ఎంత దుర్వినియోగం చేస్తారు అనేది ఈ ప్రభుత్వం ఆలోచన చేసినట్లు లేదు. అందువల్ల మా ఆలోచనలు వ్యక్తము చేయనిదే ఈ అప్రాప్రియేషన్ బిల్లును ఆమోదించనని చెబుతున్నాను.

డిస్ట్రిక్ట్ ప్లానింగు బోర్డులకు, స్థానిక సంస్థలకు అధికారాలు ఇచ్చాము. ప్రభుత్వం ఈనాడు మహానుభావులు, విజ్ఞుల పర్యవేక్షణలో ఈ ప్రభుత్వ కార్యకలాపాలు జరగాలని డిస్ట్రిక్ట్ ప్లానింగు బోర్డులు పెట్టాము. ఇపుడు మొత్తం దానిని తీసివేసారు. ఇపుడు మరల వాటిని ఉంచుతామన్నారు. అంటే ఉంచుతారా, తీసివేస్తారా, వద్దా, పద్దా, రద్దా ఏమి చేయదలచుకున్నారు. ఇపుడు అందరూ కూడా ఈ అన్ని విషయాలలో మభ్యపెట్టవచ్చును. కానీ ప్రజలకు ఈ ప్రజాస్వామ్యాన్ని ఈ రద్దుల ద్వారా దూరం చేస్తామంటారా? ఏమి చేస్తారో చెప్పండి? ఇపుడు ఈ ప్రాంతీయ ద్వేషాలు మనలో మనలకు తగాదాలు పెట్టి ఏవిధంగా మనలను ఛిన్నాభిన్నం చేస్తాయో ఇదివరకే మనం చూశాము. సెపరేట్ తెలంగాణ కావాలంటే ఎన్నో త్యాగాలు చేసాము. తరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమును సంపాదించుకున్నాము కానీ తరువాత తెలంగాణ పేరుతో ఈ బోర్డుల పేరుతో ప్రాంతీయ భావాలు తిరిగి రెచ్చగొట్టాము. అందువల్ల ఎంతోమంది పేదవారిని, అభాగ్యులను పొట్టన పెట్టుకున్నాము. మీరు మరల ప్రాంతీయ బోర్డులు ఎందుకు ఏర్పాటు చేస్తున్నారు? ఇపుడు ఈ మూడు ప్రాంతాలను విభజించి తెలంగాణకు, రాయలసీమకు, ఆంధ్ర ఏరియాలకు తలొక ముఖ్యమంత్రిని పెట్టండి, ఇటువంటి విధానాలు ఈ ప్రభుత్వం అవలంభిస్తున్నది కాబట్టి మేము ఈ ఎప్రాప్రియేషన్స్ బిల్లును ఆమోదించమని చెబుతున్నాను. ఎందుకంటే ఇది మా తెలుగుదేశం పార్టీ విధానం కాదు. అన్ని వర్గాల వారికి ఈ విధంగా నష్టము చేయడం సబబుకాదని మనవి చేస్తున్నాను. కాబట్టి ఇటువంటి నష్టము చేసే విధానాలు అవలంబిస్తున్నారు కాబట్టి ఈ ఎప్రాప్రియేషన్ బిల్లును మేము పాస్ చేయమని చెబుతున్నాను.

పోతే, ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల స్థాపన విషయంలో వెనుకబడిన జిల్లాలను ఏ విధంగా అభివృద్ధి చేయడానికి వ్యవహరించగలమనేది చూసుకోవాలి. ఆదిలాబాదు, అనంతపురం, శ్రీకాకుళం జిల్లాలు వెనుకబడిన జిల్లాలుగా ప్రకటించాము. మా ప్రభుత్వం ఇండస్ట్రియలిస్ట్‌లకు వివరంగా ఇన్సెంటివ్స్ హాలిడే సేల్స్‌టాక్సు కలెక్షన్స్ స్టాల్ చేసాము. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో పరిశ్రమల శాఖామంత్రిగా ఉన్నప్పుడు కలర్ ట్యూబ్స్ తయారీ కొరకు అప్లికేషన్ పెడితే దానిని యు.పి. వారికి కట్టబెట్టడం జరిగింది. ఆ విధంగా మన ఆంధ్రరాష్ట్ర ప్రజలకు అన్యాయం చేసారు. ఇకపోతే రైల్వే వాగన్స్ ఫ్యాక్టరీ పంజాబ్ వారికి ఇచ్చారు. మనకు ఇస్తామన్న ఫ్యాక్టరీలు మన రాష్ట్రానికి సంపాదించుకోలేకపోతున్నాము. వరంగల్‌లో ఈ వాగన్ రిఫైన్ ఫ్యాక్టరీని ఏర్పాటు

చేసుకోలేకపోయాము. ఆ ఫ్యాక్టరీ ఏర్పాటుకు గాను స్థలం కావాలంటే వెంటనే రెండు వేల ఎకరాలు ఇచ్చాము. అయినా ప్రయోజనం లేకపోయింది. ఇకపోతే అల్యూమినియం కర్మాగారమును తమిళనాడుకు తరలించారు. దానికి కారణం ఏమిటి? రైతులను రాష్ట్రంలో వెనుకబడిన వారుగానే ఉంచారు. వీటన్నింటిని ఆర్థిక శాఖామంత్రి గారు చెప్పలేరు కాబట్టి ఈ ఎప్రాప్రియేషన్ బిల్లును మేము సమర్థించడము లేదు.

ఇక హైదరాబాద్‌ను ఇంటర్ నేషనల్ ఏరోడ్రోమ్ ఏర్పాటుకు కేంద్రంగా చేయాలని కోరినపుడు వారానికి ఒక్కటే ఒక్క ఇంటర్ నేషనల్ ఫ్లయిట్‌ను హైదరాబాద్ నగరంలో ఆగడానికి ఏర్పాటు చేసారు. ఎందుకు ఈ కర్మ మనకు? ఎందుకు ఆంధ్రప్రదేశ్ ప్రజలంటే చిన్నచూపు? తరువాత వైజాగ్‌ను ఫ్రీ ట్రేడ్ జోన్‌గా చేయాలని కోరినాము. దానికొరకు స్థలసేకరణ జరగాలంటే ఒక్కరోజులో దానికి కావలసిన భూమిని ఇచ్చాము. ముఖ్యంగా రాష్ట్రంలో పారిశ్రామిక వాడలలో నివసించే కార్మికులు తమ శ్రమను పెట్టుబడులుగా పెడుతున్నారు. వారు ఇందులో భాగస్వాములు కావాలి. ఎపుడు అయినా ప్రజాస్వామ్యంలో కార్మికులను ఈ పరిశ్రమలలో భాగస్వాములను చేయాలని నా కోరిక. దానికొరకు మా ప్రభుత్వం ఉన్నపుడు ఒక బిల్లును కూడా సభలో ప్రవేశపెట్టడం జరిగింది. ఇపుడు అయినా ఈ కార్మికుల సంక్షేమం కోసం ఈ బిల్లును ఆమోదిస్తారా? అట్లాగా ఆమోదించని పక్షంలో మీరు తెచ్చిన ఈ ఎప్రాప్రియేషన్ బిల్లును మేము ఆమోదించమని మనవిచేస్తున్నాను. ఇక కాకినాడ పోర్టు డెవలప్‌మెంట్ చేయడానికి గాను 130 కోట్ల రూపాయలు మా ప్రభుత్వం ఇచ్చింది. విశాఖపట్నం పోర్టుకు, కాకినాడ పోర్టు అభివృద్ధి ద్వారా కొంత బరువు తగ్గించాలి. కాకినాడ పోర్టును ఇంటర్‌సేషనల్ పోర్టుగా డెవలప్ చేయాలి.

ఈ పోర్టు అభివృద్ధి చేయడానికి గాను ఇంటర్ నేషనల్ కంపెనీల నుంచి టెండర్లు పిలవండి. కానీ ఇపుడు ఏదో నామినేషన్ మీద ఈ వర్క్స్ ఇస్తామంటున్నారు. అటువంటి పని చేయవద్దని మనవిచేస్తున్నాను. మీకు 42 సంవత్సరాలు ఈ దేశాన్ని పాలించిన అనుభవం ఉంది. దానితో మీరు ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకపోతే మేము ఈ తెలుగుదేశం ప్రభుత్వాన్ని మరలా నెలకొల్పగలమని మనవిచేస్తున్నాను. ఇకపోతే మన ముస్లిమ్ సోదరులు ఉన్నారు. వారి విషయంలో చూసుకుంటే మనది మతాతీతమైన రాజ్యాంగం, అంటే సెక్యులర్ స్టేట్. దీనిని అల్పసంఖ్యాకులుగా ఉన్న ముస్లిమ్‌లకు మనము రాజ్యాంగము ద్వారా కొంత రక్షణ కలిగించాము. ఈ తెలుగుదేశం ప్రభుత్వం రాగానే కులీకుతుబ్ షా ప్రాంతాన్ని అభివృద్ధికి గాను రూపాయలు 10 కోట్లు ఇచ్చాము. చార్మినార్ నుంచి రోడ్డు వెడల్పు చేస్తూ బాగు చేయాలని నిర్ణయం తీసుకున్నాము. అదే భావనతో ఎయిడ్ పెంచాము. ఇపుడు దానిని తగ్గించడం ఈ ముస్లిమ్ సోదరులకు అవమానము చేసినట్లు కాదా? అదే విధానంగా గత సంవత్సరం 100 ఉర్దూ స్కూల్స్ ప్రారంభించడం జరిగింది ఈ రెండు పట్టణాలలో. దయచేసి సోదరులందరూ కూడా గమనించాలని మనవి చేస్తున్నాను. అదే

విధంగా రెసిడెన్షియల్ స్కూల్స్ ఒకటి గుంటూరులో, ఒకటి కర్నూలులో, ఒకటి నిజామాబాదులో ఏర్పరచాలని తొలుతగా నిర్ణయం తీసుకోవడం జరిగింది. అది కూడా గుర్తు చేస్తున్నాను. ఇంకో 10 స్కూల్స్ పెట్టండి. వారి బిడ్డలకు సౌకర్యాలు కల్పించండి. వారు కేవలం మైనారిటీ వర్గాలు కాక మన దేశ సంక్షేమం కోసం పాటుపడే మన సహోదరులు అని గుర్తించండి, గౌరవించండి అని సవినయంగా ప్రార్థిస్తున్నాను.

కానీ ఆ నాలుగు ఎప్పుడు నిర్మాణం పూర్తి చేద్దాము? ఏ విధంగా చేస్తాము? మైనారిటీస్ సంక్షేమం నిర్వచించే ఈ విధానాన్ని మేము తీవ్రంగా గర్విస్తామని నేను సవినయంగా మనవిచేస్తున్నాను. అది ఉర్దూ భాషకు గౌరవమా? ఎక్కడ 30 శాతం? వారి జనాభాను బట్టి, ఉర్దూ భాష మాట్లాడే వారుంటే ద్వితీయ భాషగా గౌరవం కల్పించడం జరిగింది. 15 శాతం రూల్ ఉన్నప్పుడు అనంతపురంలో 11 శాతం ఉంటే వారికి కూడా వాడుక భాషగా ఉర్దూ భాషకు గౌరవం కలిగించడం జరిగింది. అదే విధంగా ఉర్దూ భాషను గౌరవిస్తారా, లేదా? మన్నిస్తారా, లేదా? సవివరంగా చెప్పవలసిన అవసరం ఉంది. నమ్మకం, విశ్వాసం అల్పసంఖ్యాక వర్గాల వారిలో కూడా కల్పించాలన్న ధ్యేయం కూడా గుర్తించాలని అనుభవజ్ఞులకు మీ ద్వారా సవినయంగా మనవిచేస్తున్నాను. అదే విధంగా వక్ఫ్ ఆస్తులు, 'అత్త సొమ్ము అల్లుడు ధానం చేసినట్లు' ఎవరికి వారే భుక్తం చేసుకొంటున్నప్పుడు వక్ఫ్ ఆస్తుల యొక్క ఇండెక్స్ తయారు చేయడం, వివరాలు తయారు చేయడం కొరకు రూ. 25 లక్షలు మా ప్రభుత్వం మంజూరు చేసింది. అదే విధంగా వారి ప్రాచీన కట్టడాలు కానీ, మసీదులు కానీ, స్మశానాల రక్షణ కోసం కానీ రూ.20 లక్షలు ఇచ్చాము. మీరు ఈనాడు ఆ డబ్బు మంజూరు చేయండి. ఒకవేళ ఇవ్వకపోతే ఇవ్వక పోయామని చెప్పండి. అమలు చేసే వాళ్ళు ఇప్పుడు మీరు. కాబట్టి మిమ్ములను డిమాండు చేస్తున్నాము. అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమాన్ని గమనించాలని సవినయంగా మనవిచేస్తున్నాను.

ఇకపోతే అఖరుది శాంతిభద్రతలు. ఈనాడు ఎవరో ఒకరు పేరలల్ గవర్నమెంట్ రన్ చేస్తున్నారన్న మాట మాత్రం మేము విన్నాము. కాబట్టి దానిని పూర్తిగా నిర్మూలించవలసిన బాధ్యత, శాంతి భద్రతలు కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వానిదే, సామాన్య మానవుడు ఈనాడు బయటకు వెళ్ళడానికి వీలు లేదు. పల్లెటూళ్లలో శాంతిగా నిద్రపోవడానికి వీలు లేదు. ఆడబడుచులు బయటకు వెళితే మానభంగాలు. ఈ విషయంపైన ఏ వైఖరి తీసుకొంటున్నారు? ఇది వరకు కేవలం కుల కృత్యాలు చేసారు. ఎన్నో దౌర్జన్య విధానమైన పనులు చేసారు. డిపార్టుమెంట్ వారు అన్నింటిని బుక్ చేసారు. ఈ కేసులన్నీ ప్రభుత్వం నిష్పాక్షికంగా ఎవరైనా ఒక్కటే అని ఆనాడు నిర్వహించాము. ఈనాడు రాగానే కేవలం వారి యొక్క ఎంకరేజ్‌మెంట్ కోసం, వాళ్ల యొక్క సంతృప్తి కోసం సుమారు రెండు వేల మందికి పైగా వాళ్ళందరినీ కూడా – హింసావాదులందరినీ సమాజం మీదకు విసిరి వేసారు. ఈనాటి ఈ దుష్కర్మకు ఫలితం అనుభవిస్తారు. ఈనాడు

జరుగుతున్న ఈ దౌర్జన్య విధానాలకు ప్రభుత్వమే కారణం అని స్పష్టం చేస్తున్నాను. మేము కూడా 7 సంవత్సరాలు పరిపాలన చేసాము. పేరు పెట్టి కాంగ్రెస్ వాళ్ళను హింసించమని అనలేదు. ఏ డిపార్టుమెంటుకూ ఆర్డరు ఇవ్వలేదు. మీరు ఈనాడు తెలుగుదేశాన్ని కావాలని హింసిస్తున్నారు.

తెలుగుదేశం కార్యకర్తలందరినీ మీరు అమానుషమైన విధానాలకు గురి చేస్తున్నారు. సమాజం క్షమించదు మిమ్ములను. అధికారం ఈనాడు వచ్చింది. రేపు పోవచ్చు. దానిని మీరు నిలుపుకోలేరు. మీ సిద్ధాంతాలు నిలబెట్టలేవు. మీరు సమాజపరమైన న్యాయం, సంక్షేమం, సమాజానికి అందించినప్పుడే అది నిలుస్తుంది తప్ప కేవలం దౌర్జన్యంతో కాదు. ఎంత మంది అన్యాయం అయ్యారో గతాన్ని స్మృతికి తెచ్చుకోండి. కాలాన్ని గుర్తు చేసుకోండి. ఎన్ని రకాలుగా వ్యవహరించారో? ఎంత అమానుషంగా వ్యవహరించారో, రాక్షసులుగా వ్యవహరించారో? నాశనం అయ్యారు. కాలగర్భంలో కలిసిపోయారు కాబట్టి మీకు హెచ్చరిక చేస్తున్నాను. మీరు ఎంతో పెద్ద ఓట్లతో గెలువలేదు. అది ఏ విధంగా గెలిచారన్నది అప్రస్తుతం. ప్రజలు మీ పట్ల ఉంచిన విశ్వాసాన్ని, నమ్మకాన్ని మీరు దక్కించుకోండి. మీరు ప్రజలను రక్షించండి. శాంతి భద్రతలను కాపాడండి అని మాత్రం నేను మీకు సవినయంగా మనవి చేస్తున్నాను.

*(అంతరాయం)*

సామాజిక న్యాయం లేదు. సమాజం దేవాలయం అనుకొనే విధానం లేదు. ఈనాడు రాజకీయపరమైన దుర్బుద్ధితో కూడిన కుట్ర జరుగుతోంది. తమ దృష్టికి తీసుకు వస్తున్నాను.

బడాయిగడ్డలో గిరిజన యువతుల మీద మానభంగం జరిగితే ఏమి చేసారని ప్రశ్నిస్తున్నాను? ఏమి న్యాయం చేసారు? ఏమి విచారించారు? ఏమి ఇన్వెస్టిగేషన్ జరిపించారు? అదే విధంగా కోదండరామాపురంలో ఒక స్త్రీ నీళ్లకు వెళితే వివస్త్రను చేసి ఊరి వెంట తిప్పామే ఏమిటి దానికి కారణం? ఆడపడుచు అంటే అంత చులకనా? నేను అడుగుతున్నాను. అదే విధంగా కుట్టిమద్దిలో ఘోరకలి. 27 ఇళ్లు దగ్ధం చేసారు. గొడ్డళ్లతో 22 మంది చేతులు నరికారు కోట్ల రూపాయల ఆస్తి నష్టం అయింది. ఎందుకు? ఎవరు తిన్నారు? ఎందుకు ఈ విధంగా నష్టాలు కలుగచేసారు? అశాంతిని రెచ్చగొడుతున్నారు? భద్రత శూన్యం చేస్తున్నారు? దివిసీమలో యువ న్యాయవాది రంగనాథ్‌తో సహా 5 మంది కార్యకర్తలను హత్య చేయడం జరిగింది. అదే విధంగా గుంటూరు జిల్లాలో వాసిరెడ్డి మల్లిఖార్జునరావుతో సహా 9 మందిని హత్య చేసారు. ప్రకాశం జిల్లాలో డాక్టర్ సింగయ్యతో సహా ముగ్గురిని హత్య చేసారు. చిత్తూరు జిల్లా నగరిలో ఈశ్వరయ్యను చంపారు. యానాది కాలనీలో, విధ్వంస కాండ చేసారు. ఇరువురి హరిజనుల మరణానికి కారణభూతం అయ్యారు. ఏమిటి దీనికి కారణం? శ్రీకాకుళం జిల్లాలో మందసలో తెలుగుదేశం మండల కార్యదర్శి నానాజీ పోలీసులచే కాల్చివేయబడ్డాడు. ఆయన ఏమి అన్యాయం చేసాడు పాపం. అదే విధంగా

తాడిపత్రిలో స్వైర విహారం, టి.డి.పి అభ్యర్థి నాగిరెడ్డి మీరు కేసులు బనాయించడం, ఉన్నవాడిని ఉన్నచోట ఉండనివ్వకుండా అన్యాయంగా, అక్రమంగా ఘోరకలిగా – ఆయన చాటుమాటుగా బ్రతికే అవస్థ కలిగించడం, వారి బిడ్డను అపహరించి 6 రోజులపాటు మీ నాన్నను చూపించూ అని ఒక అమాయకుడిని పట్టుకొని అమానుషంగా ఊరిలో తిప్పారు. ఏమిటి? దీనిని సమాజం క్షమిస్తుందా? అని నేను అడుగుతున్నాను. భువనగిరిలో శ్రీమతి ఆకుల జయలక్ష్మిని నడిరోడ్డులో కాంగ్రెస్ కార్యకర్తలు దౌర్జన్యం చేసారు. మహబూబ్‌నగర్ పట్టణంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం మీద దాడి చేసారు. కుర్చీలు, బల్లలు విరిచారు. అక్కడున్న కార్యాలయం ధ్వంసం చేసారు. మనుషులు చాలాలేదా? మీ దౌర్జన్యానికి కార్యాలయాల ఫర్నిచరు కూడా నాశనం చేయాలా? ఈ విధంగా వ్యవహరించే దానికి కారణం ఏమిటి? ఆత్మకూరులో హరిజనుల ఇళ్లు దగ్ధం – కావాలని తెలుగుదేశం జెండా అక్కడ ఉంటే నేను వెళ్ళాను స్వయంగా. ఏమి మీరెవరైనా వెళ్లారా? మీ ముఖ్యమంత్రి వెళ్లారా? వారికి హామీ ఇచ్చారా నేను అడుగుతున్నాను. ఏమి మనకు బాధ్యత లేదా? నేను వెళ్లినప్పుడు కావాలని హరిజనుల ఇళ్లు, తెలుగుదేశం కార్యకర్తల ఇళ్లు నాశనం చేయడం జరిగింది. ఎవరు బాధ్యులు? ఎందుకు ఇంత పాపానికి ఒడిగడతారు? ఎందుకు మీ నెత్తి మీద ఇన్ని వేసుకొంటారు? దయచేసి న్యాయ విచారణ జరిపించండి. న్యాయ విచారణను కోరుతున్నాను.

**ఆత్మకూరులో హరిజనుల ఇళ్లు దగ్ధం - కావాలని తెలుగుదేశం జెండా అక్కడ ఉంటే నేను వెళ్ళాను స్వయంగా. ఏమి మీరెవరైనా వెళ్లారా? మీ ముఖ్యమంత్రి వెళ్లారా? వారికి హామీ ఇచ్చారా నేను అడుగుతున్నాను. ఏమి మనకు బాధ్యత లేధా? నేను వెళ్లినప్పుడు కావాలని హరిజనుల ఇళ్లు, తెలుగుదేశం కార్యకర్తల ఇళ్లు నాశనం చేయడం జరిగింది. ఎవరు బాధ్యులు?.**

ఈనాడు ఎందుకు న్యాయ విచారణ జరిపించడం లేదు? న్యాయ విచారణ అంటే ఎందుకు భయపడుతున్నారు? ఎందుకు హౌస్ కమిటీ అంటే భయపడుతున్నారో వారి భావం అర్థం కావడం లేదని సవినయంగా మనవిచేస్తున్నాను. అదే బతకమ్మ కుంటలో లక్ష్మి అనే యువతి పోలీసుల చేత మానభంగం చేయబడ్డది. మైనర్ బాలికలపై ఆత్యాచారాలు జరుగుతున్నాయి. అంత ఎందుకు సార్, దయచేసి వారిని అడుగుతున్నాను. గతంలో కాంగ్రెస్ మంత్రి, పార్లమెంట్ సభ్యులు గౌరవనీయులైన వెంకటస్వామిగారి మనవడిని ఎత్తుకొనిపోతే కాపాడలేని దిక్కులేని ప్రభుత్వం అయిపోయింది. మరి ఏ విధంగా మమ్మలను దీని విషయంలో ఆలోచించమంటారో చెప్పండని ప్రశ్నిస్తున్నాను. అన్నింటికంటే మించి ఈనాడు తెలుగుదేశం కార్యకర్తగా, ప్రముఖ వ్యక్తిగా, ఆధునిక, విప్లవాత్మక, రాజకీయ విధాతగా ఉన్న సోదరుడు ఇంద్రారెడ్డిగారి మీద కేసులు బనాయించాలని ఎందుకు చూస్తున్నారు? ఎందుకు ఆయనను అరెస్టు చేయాలని ఏ విధంగా వారు భుజాలు తడుముకొంటున్నారు? ఎందుకు అప్రతిష్టపాలు అవుతారు? పోట్లాటల పేరుతో ఏ శక్తిని అణచిపెట్టలేరు.

ఏదైతే అణచాలనుకొంటారో అంతకు ఎన్నో రెట్లు బలంతో పైకి వస్తుంది కానీ ఇలాంటి నాయకులను వారు అణచలేరని సవినయంగా మనవిచేస్తున్నాను. ఒక్కడి స్థానంలో ఎన్నో వేల మంది బయటకు వస్తారు. ఎన్నో వేల మంది ఈ దురంతాలను ఖండిస్తారని కూడా నేను సవినయంగా మనవిచేస్తున్నాను. ఇలాంటి రాజకీయ కక్షల నుంచి విరమించాలి. ఇకపోతే ముఖ్యంగా మనవిచేసేది యాంటీ డిఫెక్షన్ బిల్లు తెచ్చారు. కేంద్ర ప్రభుత్వం వారు అధికారంలో ఉండగానే అప్పటి ప్రధాని, పెద్దవారు తెచ్చారు. మరి ఈనాడు స్థానిక సంస్థలలో యాంటీ డిఫెక్షన్ బిల్లును తీసివేయాలని అనుకొంటున్నారని ఈ పాడు చెవులలో పడింది. మరి దాని సంగతి ఏమిటో చెప్పాలి. అందరినీ కలగాపులగంగా కలుపుకొంటారా? వారి కుండలో కలుపుకొంటారా? వారి విధానం ఏమిటి? దయచేసి చెప్పవలసిందిగా సవినయంగా కోరుతున్నాను. ఇకపోతే అన్యాక్రాంత భూములు అన్నారు.

దాని విషయంలో నిష్పాక్షికంగా చల్లా కొండయ్యగారి కమిషన్‌ను వేశాము. నివేదిక అందించారు. కానీ వెంటనే వచ్చిన ఎన్నికల వలన మేము సభా స్థలంలో టేబుల్ మీద పెట్టలేకపోయాము. వారు పెడతారా, పెట్టమనండి. నిష్పాక్షికంగా ప్రజలకు సంబంధించిన భూములను దురాక్రమణ చేసి భుక్తం చేసుకొన్నారే వారిని ప్రత్యక్షంగా ప్రజల ముందు ఉంచండని నేను సవినయంగా మనవిచేస్తున్నాను. అదే మహబూబ్ మేన్షన్ విషయంలో గత వ్యవస్థ కాలంలో దానిని నైజాం నవాబు నుంచి ఏదో ప్రజల కోసం అని హౌసింగ్ బోర్డ్ తీసుకొన్నది. దానిని వ్యాపారస్తులకు తాకట్టు పెట్టి అమ్ముతున్నారు. మరి 7 సంవత్సరాల కాలం అన్యాక్రాంతం గాకుండా చూసాము. 14,15,16 తేదీలు మూడు రోజులలో అలాంటి కోట్ల రూపాయల విలువ చేసే ఆస్తి వారి ఇష్టం వచ్చినట్లు, వారి స్వంతం అయినట్లు, మరి వ్యాపారస్తులకు, సంపన్న వర్గాలకు భుక్తం చేశారే.

ఈ దగాకోరు విధానాన్ని సమాజం హర్షిస్తుందా? ప్రజలు ఏ విధంగా వీరిని గుర్తిస్తారు నేను ప్రశ్నిస్తున్నాను. అదే పులిమామిడి భూముల విషయంలో 5 వేల ఎకరాల భూములు తమ స్వంతం అయినట్లు ముఖ్యమంత్రిగారు వారి వియ్యంకుడిని అనుభవించే దానికి ఏర్పాటు చేశారని విన్నాము. మరి అలాంటి దానికి ఎందుకు జ్యుడీషియల్ ఎంక్వైరీ వేయరు? అన్యాక్రాంతమైన ఆ భూములను ఎందుకు పేద రైతులకు ఇవ్వరు? మేము డిమాండ్ చేస్తున్నాము. అలాంటి పేద రైతులకు, మనకు తిండిపెట్టే అన్నదాతలకు సరైన న్యాయం జరగాలి. అధికారాన్ని దుర్వినియోగం చేసుకోకూడదు. కేవలం వాళ్ల వారి యొక్క సంక్షేమానికి ఇవ్వకూడదని సవినయంగా మనవిచేస్తున్నాను.

అదే విధంగా బతకమ్మకుంట విషయంలో పేదవారు వారికి శత్రువులు అయ్యారా? ఇండ్లు లేని వారు వీరికి విరోధులు అయ్యారా? ఎందుకు వాళ్ళను మెడబట్టి గెంటించారు? వారి ఇండ్లు

ఎందుకు పడగొట్టించారు? ఆ మాత్రం సానుభూతి లేకుండా ప్రజలను గుర్తింపు లేని ఈ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అప్రాప్రియేషన్ బిల్లు మాకు సుతరామూ ఆమోదయోగ్యం కాదని నేను సవినయంగా మనవిచేస్తున్నాను. ఇకపోతే కండలేరు దగ్గర అక్రమాలు వారికి తెలుసు మహానుభావా! చెట్లు పెట్టామన్న పేరుతో ప్రజల సొమ్మును చెట్టుకు రూ. 9, 10 వేల వరకు భుక్తం చేసుకొంటున్నారే! ఆ మాత్రం ఆపలేరా? ఈ మాత్రం పేదప్రజలను కాపాడలేరా అని బాధతో అడుగుతున్నాను. ప్రజల సొమ్మును ఉన్న వారికే దత్తం చేస్తారా? దురాక్రమణదారులకు మద్దతు ఇస్తారా? ఏమిటి వారు చేసేది? వీటన్నిటి మీద న్యాయసమ్మతమైన విచారణ జరిపి ప్రజలకు న్యాయం కలుగజేయాలని సవినయంగా మనవిచేస్తున్నాను.

ఈ విధంగానే సాగినట్లయితే ఈనాడు ప్రజలకు ఇచ్చిన విశ్వాసాన్ని పూర్తిగా వమ్ము చేశారు. ఈ విధమైన అన్యాయాలకు పాల్పడి, గత చరిత్రనే తిరిగి ప్రజానీకానికి గుర్తు చేస్తారా అని నేను నిష్కర్షగా వారిని అడుగుతున్నాను. వారు సమాధానం చెప్పాలి. చెప్పకుండా మేము బడ్జెట్ ప్రవేశ పెట్టాం, అప్రాప్రియేషన్ బిల్లును ప్రవేశ పెట్టాము అని అంటే అది మూర్ఖంగా, ఏమీ చదవకుండా, ఏమీ తెలియకుండా, మా భావన చెప్పకుండా, ఆమోదించి అయోగ్యమైన ప్రజాప్రతినిధులుగా ఉండలేమని సవినయంగా మనవిచేస్తున్నాను. ఈ అవకాశం ఇచ్చినందులకు తమరికి కూడా ధన్యవాదాలు అర్పిస్తున్నాను.

◆◆

సెప్టెంబర్ 24, 1990

# తెలుగుదేశం మేధస్సులో పుట్టిన బిడ్డ తెలుగుగంగ

*(కృష్ణానది జలాలపై జరిగిన లఘు చర్చలో చేసిన ప్రసంగం)*

**శ్రీ ఎన్.టి. రామారావు:** తెలుగుగంగకు 29 టి.ఎం.సి, గాలేరు - నగరికి 45 టి.ఎం.సి. హంద్రీ-నీవాకు 65 టి.ఎం.సి., ఎస్.ఆర్.బి.సి. ఎక్స్‌టెన్షన్‌కు 20 టి.ఎం.సి, వెలుగొండకు 40 టి.ఎం.సి, భీమాకు 20 టి.ఎం.సి., ఎస్.ఎల్.బి.సి.కి 30 టి.ఎం.సి, కె.సి. కెనాల్‌కు తుంగభద్ర నీరు ప్రత్యామ్నాయంగా కృష్ణానది నుంచి ఇవ్వవలసింది 10 టి.ఎం.సి. నీరు. పైగా జంటనగరాలకు మనం హామీ ఇచ్చిన నీరు. ఇవన్నీ కలిస్తే సుమారు 270 టి.ఎం.సి.ల నీరు అవుతుంది. కేవలం 29 టి.ఎం.సి.ల నీరు, 29 టి.ఎం.సి.ల నీరు అని మాట్లాడుకోవడం వల్ల ఏడు కోట్ల ఆంధ్ర ప్రజానీకానికి ఏవిధమైన న్యాయం చేసినట్లు అవుతుంది? I am demanding through you, Sir. I say that this is not justice, that is not correct and the people shall not have the confidence in the present Government. వారికి విశ్వాసం పోతోంది. కేవలం వారి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారు. ఇష్టం వచ్చిన ప్రాజెక్టులు తీసుకొంటున్నారు. కానీ సర్వతోముఖమైన, సామాజికపరమైన న్యాయం మనకు జరగలేదనే అనుకొంటాను. మీరు తెలుగుగంగ అంటున్నారు. తెలుగుగంగ ఎవరిది? తెలుగుదేశం మేధస్సులో పుట్టిన బిడ్డ తెలుగుగంగ.

1977 అక్టోబరులో ఆంధ్రప్రదేశ్ తమిళనాడు రాష్ట్రాలు అంగీకరించిన ఒక ఆఫ్‌టేక్ పాయింట్ నుంచి లైనింగ్ కాలువ ద్వారా దాదాపు 17 టి.ఎం.సి.ల నీరు మద్రాసు నగరానికి త్రాగడానికి ఇవ్వాలని నిర్ణయం చేయబడిందని కూడా గుర్తు చేస్తున్నాను. ఆ ఆఫ్‌టేక్ పాయింట్‌ను నిర్ణయించేది కూడా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు. 1983లో మేము ఆ నిర్ణయం చేసినప్పుడు రాయలసీమను మర్చిపోలేకపోయాము. అటు తమిళనాడు సోదరులకు 17 టి.ఎం.సి.ల నీరు ఒక ప్రక్క కర్ణాటక వారు 5 టి.ఎం.సి.ల నీరు, మహారాష్ట్రవారు 5 టి.ఎం.సి.ల

నీరు, ఆంధ్రప్రదేశ్ 5 టి.ఎం.సి.ల నీరు ఇవ్వవలసి ఉండగా మన పరువుకోసం మొత్తం మన నెత్తిన వేసుకొని చేశాము. మద్రాసుకు నీరు తీసుకువెళ్ళేటప్పుడు మధ్యన ఉన్న మనవారి సంగతి ఏమిటి? మనవారికి మనం చేసేది ఏమిటి? అదేవిధంగా ఆఫ్‌టేక్ పాయింట్ విషయంలో అప్పుడు వచ్చిన సోదరుడు యం.జి. రామచంద్రన్ గారితో నేను ముచ్చటించి ఆఫ్‌టేక్ పాయింట్ కడప జిల్లాలోని చినముక్కపల్లి దగ్గర ఏర్పాటు చేయడం జరిగింది. ఆఫ్‌టేక్ పాయింట్ విషయంలో ఒక వివరణ తెలియచేయవలసిన అవసరం ఉంది. ఆఫ్‌టేక్ పాయింట్ ఇవతలే వ్యవసాయానికి నీరు వాడుకోవచ్చు.

కాబట్టి రాయలసీమలోని 2 లక్షల 75 వేల ఎకరాల బీడుపడిన భూములకు నీరు అందించి సస్యశ్యామలం చేయాలన్న ధ్యేయంతో ఆనాడు నిర్ణయం చేయడం జరిగిందని మనవిచేస్తున్నాను. దానితోపాటు ఇవన్నీ కూడా తెలుగుదేశం యొక్క మేథస్సులో ఆవిర్భవించిన ప్రాజెక్టులు అని మనవిచేస్తున్నాను. గాలేరు-నగరి 27 పట్టణాల ప్రజలకు మంచి నీళ్లు అందించే పథకం. అదేవిధంగా హంద్రి-నీవా, చిత్తూరుజిల్లాలోని ఎండిపోయిన ప్రదేశాలకు నీరు అందించే ప్రాజెక్ట్. వీటన్నింటిని మరిచిపోయి కేవలం 29 టిం.ఎం.సి.ల నీటితోనే మన జీవితాలను ముడి పెట్టుకోవడం. మన రాష్ట్ర అభ్యుదయాన్ని కోరడం అంత మంచిది కాదన్న విషయం మనవిచేస్తున్నాను. గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారు 14.9.1990న మాకు ఒక ఉత్తరం వ్రాశారు.

**రాయలసీమలోని 2 లక్షల 75 వేల ఎకరాల బీడుపడిన భూములకు నీరు అందించి సస్యశ్యామలం చేయాలన్న ధ్యేయంతో ఆనాడు నిర్ణయం చేయడం జరిగిందని మనవిచేస్తున్నాను. దానితోపాటు ఇవన్నీ కూడా తెలుగుదేశం యొక్క మేథస్సులో ఆవిర్భవించిన ప్రాజెక్టులు అని మనవిచేస్తున్నాను. గాలేరు-నగరి 27 పట్టణాల ప్రజలకు మంచి నీళ్లు అందించే పథకం.**

A number of statements have been appearing in the Newspaper for quite some time regarding the stand of the Government on the Sharing of the Krishna Waters with the States of Karnataka and Maharastra. This has been creating avoidable confusion in the minds of the people. దీని అర్థం ఏమిటి? అసలు ఎవరు కన్‌ఫ్యూజన్ క్రియేట్ చేశారు. ఎన్నో రకాలైన అభిప్రాయాలు వెలిబుచ్చారు. అసలు కన్‌ఫ్యూజన్ చేస్తున్నది ఎవరు? రాయలసీమ శాసన సభ్యుల సమావేశం గురించి మా దగ్గర న్యూస్ పేపర్ కటింగ్ ఉంది. దానిలో మిగులు నీరు మిథ్య అన్నారు. ఏవిధంగా అలా అనగలిగారు. తిరుపతి సమావేశానికి వెళ్లారు. అక్కడ ఏమి జరిగింది. ఎన్నో రకాలైన అపోహలు కలుగుతున్నాయి. అది రాజకీయ మీటింగ్ అన్నారు. అక్కడ ముగ్గురు కాంగ్రెస్ ముఖ్యమంత్రులు కలుసుకొన్నారు. అక్కడ వారు వేరే విషయాలు

మాట్లాడుకొన్నారు. తప్ప అసలు ప్రాజెక్టుల విషయం మాట్లాడలేదని అపోహలు వచ్చాయి. వారు ఏమి మాట్లాడుకున్నారో ఇప్పటికీ తెలియదు. మేము విన్నది చెపుతున్నాను. చదివింది చెపుతున్నాను. ఈవిధమైనటువంటి అపోహలు దానివల్ల వచ్చాయి. ప్రజల్లో ఆందోళన బయలు దేరింది. వార్తాపత్రికల స్పందన వచ్చింది. మిగులు జలాల పంపిణీ ప్రసక్తి జరగలేదని ముఖ్యమంత్రిగారు చెప్పారు.

ఇలా ఒక విధమైన స్టేట్‌మెంట్ వారు ఇవ్వడం జరిగింది. దాని తరువాత 22.8.1990వ తేదీన మైసూరులో సమావేశం. మైసూరు సమావేశానికి చెప్పారు. మిగులు జలాలు పంచే విషయమే లేదు. కానీ అక్కడ ప్రతిపాదనలు చూస్తే మేమందరం నివ్వెరపోయాము. ప్రజలందరూ కూడా విస్తుపోయారు. మిగులు జలాలు ఉన్నాయి. దానిని పంచుకుంటాము. రీషెడ్యూలు ప్రకారంగా మేము దాని విషయంలో నిర్ణయం చేస్తాము అంటే జాతి క్షమించదని మనవిచేస్తున్నారు. అవార్డు ఇచ్చినటువంటి బచావత్ వారే చెప్పారు, రీషెడ్యూలు పనికి రాదని, అది ఏమాత్రం అమలు చేయడానికి వీలులేదు. మిగులు జలాలు పంచుకొనడం అనే ప్రసక్తే లేదు, ఎక్కడ ఎంత ఉంది? ఎన్ని రిజర్వాయర్లు కట్టుకున్నారు అనే వివరాలు తెలియనిదే, అసలు నీరు ఎంత ఉంది? ఎంత పంచుకోవాలనే విషయం నిర్ధారించడం ఏమాత్రం తేలిక పని కాదు. కాబట్టి రీషెడ్యూలును మేము అంగీకరించము. చేయడానికి అది సాధ్యపడదని వారు స్పష్టంగా చెప్పడం జరిగింది.

రీషెడ్యూలును బట్టి మనయొక్క అమలు సిద్ధాంతం కానీ, మన రాష్ట్ర భవిష్యత్తుకు కానీ, మన సర్వసముద్ధరణ కానీ జరగాలని మనవిచేస్తున్నాను. ఇంకొక విషయం మనవిచేస్తున్నాను. వారు మధ్యాహ్నం ఒక స్టేట్‌మెంట్ ఇచ్చారు. అపెక్సుబాడీ ఒకటి నియమించాము అన్నారు. అసలు సమస్యే లేనిది ఈ సమస్యను ఎందుకు సృష్టించారు? అసలు కృష్ణా నదీ జలాల వివాదం అనేది ఎప్పుడో ఉంది. వివాదం ఉంది కాబట్టే బచావత్‌ను నియమించారు. వారు సుప్రీంకోర్టు జడ్జి హోదాలో దాని విషయంలో పూర్తిగా కృషి చేసి పరిష్కారం అందించిన వ్యక్తిగా, విజ్ఞునిగా మీకు మనవి చేస్తున్నాను. మీ వివాదాలు అవసరం లేదు. మేము పరిష్కారం చేస్తున్నాము అనే భావనతో వారు పూర్తిగా స్పందించిన విషయం అందరికీ తెలుసు. నేను ఇదివరకే మనవి చేసాను. ముఖ్యమంత్రిగారు కన్‌ఫ్యూజన్ అని అన్నారు.

తెలుగు దేశం ప్రభుత్వం ఉన్నప్పుడు తెలుగు గంగ మీద మేము విస్పష్టంగా ప్రచురించడం జరిగింది. దానిలో చెప్పనిది లేదు. దాచింది లేదు. మేము చూపనిది లేదు. పూర్తిగా ఏ విధంగా మేము వివరించింది ఒకసారి దయచేసి సభ్యులందరూ ఆ తెలుగు గంగమీద మా వివరణ తెలుసుకోగలిగితే, తెలుసుకునే ఓపిక ఉంటే చూడాలని కోరుతున్నాను. వారికి పూర్తిగా వివరం అవుతుంది. ఏమాత్రం కన్‌ఫ్యూజన్ లేదని గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారికి నేను

తెలియచేస్తున్నాను. కృష్ణానదిలో నమ్మకంగా లభించే జలాలను ఆయా రాష్ట్రాలకు కేటాయించగా మిగిలిన నీటినంతటిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే వాడుకోవచ్చునని ట్రిబ్యునల్ ఆదేశించింది. 75% డిపెండబిలిటీ మీద 100 సంవత్సరాలలో, 75 సంవత్సరాలలో మాత్రమే మనకు నీరు వచ్చే సూచనలు ఉన్నాయి. మిగిలిన 25 సంవత్సరాలలో అతివృష్టి రావచ్చు, అనావృష్టి రావచ్చు, వరద రావచ్చు, కాబట్టి ఏ విధంగా అయినా ఆఖరు రాష్ట్రంగా ఉన్నటువంటి ఆంధ్రప్రదేశ్ దెబ్బతినడానికి అవకాశం ఉంది. పై రాష్ట్రాలవారు కర్ణాటక కాని, మహారాష్ట్ర కానీ వారికి సంక్రమించవలసిన నీరు వారు పట్టుకొని మిగిలిన నీరు వదలి వెడతారు కనుక హెచ్చో, తగ్గో మనమే భరించవలసింది. నష్టమైనా, కష్టమైనా మనమే భరించవలసింది. ఈ విధంగా నష్టపోయేది ఆఖరి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కాబట్టి పూర్తిగా ఆ నీటిని వాడుకునే అధికారం, హక్కు వారు కలిగించడం జరిగిందని నేను చదివిన పంక్తివల్ల మీకు అర్థం అవుతుందని నేను సవినయంగా నమ్ముతున్నాను.

మహారాష్ట్ర, మైసూరు రాష్ట్రాల వారికి ఒక్కొక్కదానికి కేటాయించిన దానికంటే ఎక్కువ జలాలను వాడుకోవడానికి మేము పూర్తిగా నిరోధిస్తున్నాము అన్నది బచావత్ కమిషను ఇచ్చిన అవార్డు. ఇది నా సొంతం కాదు. మిగతా నీటిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వాడుకోవడానికి మేము అనుమతిస్తున్నాము అని వారు చెప్పారు. మనకు ఇచ్చినటువంటి అధికారం ఈ విధంగా విస్పష్టంగా ఉండగా దీనిలో వాదుకోవడాలు ఇవన్నీ ఏమిటో అర్థం కావడం లేదు. మనకు కావలసింది సుమారు 260 టి.ఎం.సి నీళ్ళు ఉండగా కేవలం 29 టి.ఎం.సి నీళ్ళతో తృప్తి పడడం, మిగిలినవన్నీ కూడా ప్రజల సొత్తును పంచిపెట్టడం. ఇది ఏవిధమైన న్యాయమో దయచేసి ఆలోచించాలాని నేను సవినయంగా మనవిచేస్తున్నాను. మిగులు జలాల వాడకంపై ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన స్వేచ్ఛవల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జలాలను పరివాహక ప్రాంతం వెలుపలికి మళ్లించడానికి గానీ, కొత్త నిర్మాణాలు చేపట్టడానికి గానీ, ఆ రాష్ట్రానికి హక్కు కలిగించదనే విషయంపై కర్ణాటక ప్రభుత్వం లేవదీసిన సందేహానికి ట్రిబ్యునల్ సమాధానం ఇచ్చింది. మిగిలి పోయిన జలాలను ఆంధ్రప్రదేశ్ వినియోగించడంపై పరిమితి విధించడంలో ఎట్టి ఆధారం కనిపించడం లేదు.

ఎందుకంటే మిగిలి పోయిన జలాలను ఆంధ్రప్రదేశ్ వినియోగించుకోకపోతే అవి వృధాగా సముద్రంలో కలిసి పోతాయని స్పష్టీకరణలో ట్రిబ్యునల్ పేర్కొంది. కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ తదుపరి నివేదిక నాలుగవ అధ్యాయంలోని ఏడవ స్పష్టీకరణను ఇవ్వడం కూడా జరిగిందని మనవి చేస్తున్నారు. ట్రిబ్యునల్ తీర్పు నిబంధనల ప్రకారం 2,060 టి.ఎమ్.సి.ల పైబడిన మిగులు జలాలను పంపిణీ చేయడానికి వీలు కల్పించలేదు. నివేదికలో మాత్రమే ప్రత్యామ్నాయంగా పథకం – బి అనే పేరుతో ఒక ఐచ్ఛిక పథకాన్ని ట్రిబ్యునల్ రూపొందించింది. ఇందులో ప్రతి జల సంవత్సరంలోనూ నీళ్లు ఎక్కువగా ఉండవచ్చు లేదా తక్కువగా ఉండవచ్చునన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకొని మూడు రాష్ట్రాలు ఏవిధంగా వాటా పంచుకోవచ్చునో ఆలోచించడం జరిగింది.

ఇటువంటి పథకాన్ని కృష్ణా వేలీ అథారిటీ పేరుతో ఒక కేంద్ర సంస్థ ఉన్నప్పుడే అమలు జరుపవచ్చునని ఆ నివేదికలో పూర్తిగా చర్చించడం జరిగింది. కానీ అటువంటి నియంత్రణ సంస్థను ఏర్పాటు చేయకూడదని చివరికి నిర్ణయించడం కూడా జరిగింది. అందుచేత ట్రిబ్యునల్ తుది ఉత్తరువులో అంతిమంగా పొందుపరిచిన పథకం-ఏ క్రింద ఆయా రాష్ట్రాల మధ్య వాస్తవంగా చేసిన జలాల కేటాయింపులకూ, నివేదికలోని పథకం-బి లో చర్చించిన నిబంధనలకు ఏ విధంగానూ సంబంధం లేదు. బి-పథకాన్ని అంగీకరించలేదు.

కాబట్టి దీనిని తమకు మనవిచేస్తున్నాను. పూర్తిగా ఏ-పథకాన్ని బచావత్ ట్రిబ్యునల్ అంగీకరించి మనకు సమర్పించింది. కాబట్టి ఇచ్చినటువంటి అధికారాన్ని మన చేతికి వచ్చినటువంటి అధికారాన్ని ఇంకొకరికి దత్తం చేయవలసిన దుర్గతి మనకు ఏమి పట్టిందో ఆలోచించవలసిందని సవినయంగా మనవిచేస్తున్నాను. ఇదివరకు తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడు, అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంగా వ్యవహరిస్తున్నప్పుడు వారు మసిపూసి మారేడు కాయను చేయడానికి నన్ను ఢిల్లీ రమ్మన్నారు. మూడు రాష్ట్రాలు కలిసి అక్కడ సంప్రదింపులు జరపండని అన్నారు. నేను అన్నాను, బచావత్ కమిషన్ అవార్డు ఇచ్చింది. అమలు చేయవలసింది యూనియన్ గవర్నమెంట్ అని. ఆయనను నియమించింది ఎవరు? యూనియన్ గవర్నమెంట్ ఆయన రిపోర్టు ఇచ్చింది ఎవరికి? యూనియన్ గవర్నమెంట్‌కు మూడు ప్రభుత్వాలు ఎదురు చూస్తున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ఎదురు చూస్తున్నది. It is the duty of the Government of india to implement that Award. నేను రహస్యం చెపుతున్నాను. నేను కనుక పొరపాటున వెళ్ళాననుకోండి. అక్కడ ప్రధానమంత్రి గారు వచ్చి కూర్చుంటారు. మీకు, మీకు ఏవో అనుమానాలు ఉన్నాయి. కాబట్టి ఇంకొక కమిషను చేస్తున్నాను. మీరు ఏమీ చేయకుండా ఊరుకోండి అని అంటారు. చేతకాక చేతులు ముడుచుకొని ఊరుకోమంటారా? కాబట్టి మనకున్నటువంటి అధికారాన్ని వాడుకోవడం జరిగిందని మీకు సవినయంగా మనవిచేస్తున్నాను.

**మన చేతికి వచ్చినటువంటి అధికారాన్ని ఇంకొకరికి దత్తం చేయవలసిన దుర్గతి మనకు ఏమి పట్టిందో ఆలోచించవలసిందు సవినయంగా మనవిచేస్తున్నాను. ఇదివరకు తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడు, అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంగా వ్యవహరిస్తున్నప్పుడు వారు మసిపూసి మారేడు కాయను చేయడానికి నన్ను ఢిల్లీ రమ్మన్నారు.**

*(ఇంటరప్షన్)*

అయితే ముఖ్యంగా ఈ విషయంలో మన ముఖ్యమంత్రిగారి యొక్క ప్రతిభను, విజ్ఞతను నేను తగ్గించడం కాదు కానీ ఈ నిర్ణయం అయిన తరువాత కర్ణాటక అసెంబ్లీలో శాసన సభ్యులందరూ వీరేంద్ర పాటిల్ గారికి జయజయ ధ్వానాలు సలుపుతూ నీవు మగవాడివి,

తెలుగుదేశం నుంచి నీవు రాయితీ తెచ్చుకున్నావు అని అభినందించడం జరిగింది. ఎందుకు జరిగింది. మీకు కావాలని అంటే నేను ఆ పేపరు కటింగు పంపిస్తాను. మాకు ఎనలేనటువంటి ఒక రాయితీని తెచ్చారు. కనుక మీరు మహానుభావులు అనేటటువంటి పొగడ్తలు ఆయన పుచ్చుకున్నాడు. అంటే ఏవిధమైన రాయితీలు వారికి కల్పించడం జరిగింది? మనకున్నటువంటి అధికారాలను వదులుకొని వారికి చేతికి ఎందుకు ఈవిధంగా మనం కళ్లెం ఇవ్వడం జరిగిందని మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను. నేను అప్పుడే చెప్పాను. ప్రాణం పోయినా సరే రక్త తర్పణం చేస్తాము కానీ ఎవరూ కూడా మేము చేపట్టిన పథకాలు ఆపడానికి వీలులేదని కూడా నేను చెప్పడం జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను.

ఎందుకంటే మనకు కావలసింది నీరు. ఇప్పుడు చెప్పారు గౌరవ సభ్యులు. మనకు ధనంకంటే అన్నిటికంటే మించింది ఈనాడు నీరు. కాబట్టి జీవనాధారమైనటువంటి ఆ నీరును తాకట్టు పెట్టడానికి ఏ విధంగాను తెలుగు దేశము ప్రభుత్వము హయాములో ఇచ్చగించలేదని సవినయముగా మనవిచేస్తున్నాను. అటువంటి నీటి పంపకాలు జరుగుతున్నాయని ఈనాడు ఈ సమస్య వచ్చిందని ఇంతవరకు ప్రజలకు గౌరవనీయ ముఖ్యమంత్రిగారు తెలియజేయలేదు. ఇది ప్రజల సమస్య. వారి స్వంత సమస్య కాదు. నా సమస్య కాదు. మీ సమస్య కాదు. ప్రజలకు సంబంధించింది. ఏడు కోట్లు ప్రజానీకము ఎదురు చూస్తున్న సమస్య. అటువంటప్పుడు ఎందుకు ఈ విధంగా ప్రచురించలేదు? ఈ విధంగా అడుగుతున్నారు నన్ను. Take a referendum if they have got guts. నేను ఈ విధంగా అనుకుంటున్నాను. ప్రజలు ఏమి అంటారు. ప్రజలు మాకు ఏమి అనుమతి ఇస్తారు అని అడగండి. ప్రజల అనుమతి మీద చేయండి. అంతే తప్ప కేవలం ఇదివరకు చేసిన మా ప్రయత్నాలు అన్నీ భగ్నం చేసి, తెలుగు జాతి అభ్యుదయాన్ని తాకట్టు పెట్టే విషయంలో మాత్రము మేము అంగీకరించమని సవినయముగా మనవిచేస్తున్నాను.

ఇకపోతే ముఖ్యంగా బచావత్ కమిషను అవార్డు సంగతి తమకు తెలుసు. ఎ. షెడ్యూలు ప్రకారముగా మొత్తం కృష్ణా నదిలో 2060 టి.యం.సి నీరు ప్రవహిస్తున్నదని దానిలో మహారాష్ట్రకు 560 టి.యం.సి కర్ణాటకకు, 700 టి.యం.సి ఆంధ్రప్రదేశ్‌కు, 800 టి.ఎం.సి నిర్ధారణ చేయబడింది. ఆ అవార్డు ఎప్పుడైతే వారు ఇచ్చారో, అప్పటి నుండే అమలులోకి వస్తుందని దానిలో క్లియర్‌గా చెప్పడం జరిగిందని మనవిచేస్తున్నాను. అదివరకు ఉన్నటువంటి ప్రాజెక్టులను కూడా పరిగణనలోకి తీసుకొని పూర్తిగా వాటికి కూడా జలాధారము అందించాలని నిర్ణయం చేయడం జరిగిందని మీకు సవినయముగా మనవిచేస్తున్నాను. అదే విధంగా వారు పూర్తిగా 2000 సంవత్సరము వరకు ఆ నీటిని వాడుకోవచ్చునే అధికారాన్ని సంక్రమింప చేసినప్పుడు ఆనాటి జలవనరుల శాఖ మంత్రి శ్రీ శంకరానంద్ గారు, అలాగే ఆనాటి ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ గారు పార్లమెంట్‌లో ఈ విషయాన్ని ఒప్పుకున్నారు. అదే విధంగా 8-7-86వ తేదీనాడు పార్లమెంట్‌లో రాజీవ్‌గాంధీ గారు కృష్ణా జలాలను సద్వినియోగపరచుకోకుండా

సముద్రములోకి విడిచి పెట్టడం నేరము కూడా ఉద్ఘాటించారు. ఇన్ని హక్కులు కలిగివుండి ఈ రోజు మనము. ఎందుకు వెనక్కు తగ్గుతున్నాము. సోదరుడు వీరప్ప గారు చెప్పిన దానితో నేను ఏకీభవిస్తున్నాను. సమస్యే లేదు. సమస్యే లేని దానికి మనమే సమస్యను ఎందుకు కల్పించుకుంటున్నాం. అధికారము మనది. బచావత్ అవార్డు ఉంది. ముందే మా సోదరుడు మనవిచేశాడు. అవసరమైనటువంటి విధానానికి తెలుగు దేశం పార్టీ మీకు అండగా ఉంటుందని చెప్పాము. కేవలం ఈనాడు నేషనల్ ఫ్రంట్ అనే విధానాన్ని ఎవరు ప్రవచించనక్కర లేదు.

ఇంతవరకు ఎవరూ మిమ్ములను అడుగలేదు. ఈ విషయంలో మా అభిప్రాయం ఎప్పటికప్పుడు చెబుతూ వచ్చాము. జలాల విషయములో పార్టీ ప్రమేయం లేకుండా ఏ విధమైనటువంటి లాలూచీ పడడం జరుగదు. ప్రాణం పోయినా సరే దాని కొరకు ఎవరైతే పాటు పడతారో వారి కృషికి మా అండదండలు అర్పిస్తామని కూడా మనవి చేశాము. ఇప్పుడు సోదరులు మనవి చేశారు. మోడర్నయిజేషను వల్ల కొంత నీరు అని వారు చెప్పవచ్చు. అదే మాట, మేము మోడర్నయిజు చేస్తున్నాము. ఈ రోజున ఇదే అసరాగా తీసుకుని మహారాష్ట్ర నేను చెప్పాను గౌరవనీయ ముఖ్యమంత్రి గారికి ఏ విధంగా వారు నీరును వాడుకుంటున్నారో వాడుకోదలచుకొన్నారో ఒకసారి గమనించండి అని చెప్పడం జరిగిందని మనవిచేస్తున్నాను.

అధ్యక్షా, ఈనాడు ఒకవిషయం తెలియచేస్తాను. తమరు తెలుసుకోవాలి. సభ్యులు తెలుసుకోవాలి. అప్పర్ కృష్ణా ప్రాజక్టుల విషయము. వారు అక్కడ నారాయణపూర్, ఆల్‌మట్టి ప్రాజెక్టులను సిడబ్ల్యుసి అనుమతికి మించి 1670 అడుగుల ఎత్తు నిర్మించవలసింది 1720 అడుగుల ఎత్తు నిర్మిస్తున్నారు దానికి అనుమతించవలసిన రిజర్వాయరు సామర్థ్యం 160 టి.యం.సి నీటికి బదులు 270 టియంసి నిలువ కొరకు కట్టుకోదలిచారు. అంటే వారు గనుక 2 టియంసి నిలువ కొరకు కట్టుకుంటే 3 టియంసి వాడుకోవచ్చు. అంటే 400 టియంసి అదనంగా వారు వాడుకోడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఈ సమాధానం వారు చెప్పవచ్చు. మేము మోడర్నయిజ్ చేసుకుంటాము. ఈ విధంగా నడుచుకుంటాము కాబట్టి మీరు దీని విషయములో ఏ మాత్రము పట్టింపులు పట్టించుకోడానికి వీలులేదు. కాబట్టి అది కాదు మన సమస్య. మనకు ఉన్నది మన చేతిలో ఆధారము. మిగులు జలాలు మనవి. మొత్తం కట్టుకుంటాము ప్రాజెక్టులు. సోదరులు అడిగారు. అష్యూర్డ్ వాటర్ కావాలని, 800 టి.యం.సి.ని పంచుకున్నామా. ఎవరి దగ్గర తీసుకుంటారు, వాటర్ ఈజ్ అష్యూర్డ్ అన్నారు. విజయవాడ దగ్గర ఉన్న రెగ్యులేటర్ 330 టి.యం.సి నీళ్ళు అదనంగా సముద్రములోకి వృధాగా పోతున్నాయని నిరూపించినది.

దానిలో మీకు ఇస్తాము. అందరికీ ఇస్తాము, ఈ ప్రాజెక్టులు అన్నీ కట్టి ఇస్తాము అని మేము చెప్పాము. తప్ప పూర్తిగా ఎవరికీ నీరు ఇవ్వమని మాత్రము చెప్పడం జరగలేదని మనవిచేస్తున్నాను. రేపు 2000 ఎ.డి. దాటిన తరువాత ఈనాడు మీరు అనుభవిస్తున్న నీటిని మీ నోటి నుండి

తీసుకు వెళ్లితే మేము అంగీకరిస్తామా? చేతులు ముడుచుకొని కూర్చుంటామా? ఇన్ని కోట్లు ఖర్చు పెట్టామే ప్రజల డబ్బు. ఇది మా అధికారము మీరు ఇచ్చారు మాకు-2000 ఎ.డి వరకు నీరు వాడుకునే అధికారము మేము వాడుకున్నాము. యు మస్ట్ అప్రూవ్ దిస్ అని వారి గొంతు మీద కూర్చునే అవకాశం మనకు ఉంది. ఈనాడు 2000 ఎ.డి లోపల, ఏ విధంగా ఈ ప్రాజెక్టులు అన్నీ కట్టుకుంటాము. ఏవిధంగా మనము డబ్బు సమకూర్చుకుంటాము అనేది పోయి కేవలము నీళ్ళు పంచుకుంటాము. నీరు పంచుకుంటాము అంటే ఎవరి నీళ్ళు, ఎవరికి పంచుతాము, ఎట్లా పంచుకుంటాము? అని మీకు సవినయంగా మనవిచేస్తున్నాను.

కాబట్టి ఇది చాలా మనకు ఎంతో ప్రాణం మీదకు వచ్చే సందర్భము. చూస్తేనేమో 9, 10 ఏండ్లు మన కళ్ళ ముందు కనబడుతున్నాయి. స్కీమ్సు చూస్తే ఇన్ని ఉన్నవి. ఇన్ని కోట్ల ఖర్చు ఉంది. ఏ విధంగా సమకూరుస్తారు? పాలన చేస్తున్నది మీరు. అధికారము ఉన్నది మీ చేతిలో ప్రజలు అడుగుతున్నారు. నేను ఒక సభ్యుడిగా మిమ్ములను ప్రశ్నిస్తున్నాను. చెప్పండి ఏ విధంగా కేటాయిస్తారు? ఏ విధంగా ఆంధ్రప్రదేశ్‌ను ఉద్ధరిస్తారు? నేను చెప్పిన ప్రాజెక్టులు అన్నీ ఏవిధంగా పూర్తి చేస్తారు? ఏవిధంగా సస్యశ్యామలం చేస్తారు మన భూమిని? ఏ విధంగా ఎండిపోయిన గొంతుక దప్పిక తీరుస్తారు అని అడుగుతున్నాను. కాబట్టి ఇది ముఖ్యమైనటువంటి విషయం తప్ప ఎవరికి ఏ విధంగా పంచుతామని కాదు. మన రాష్ట్రాన్ని ఏ విధంగా అభివృద్ధి చేసుకుంటాము. ఏ విధంగా మనకున్న వనరులను ఉపయోగించుకుంటాము. ఏవిధంగా మన జాతిని సముద్ధరిస్తామనేదే ధ్యేయం తప్ప మరొకటి కాదని మీ ద్వారా ముఖ్యమంత్రి గారికి సవినయముగా మనవి చేస్తున్నాను. ఇకపోతే వారు ప్రతిపాదించిన వాటిలో దేనినీ కూడా తెలుగుదేశము పార్టీ అంగీకరించే విధానం కాదు. అంగీకరించదు అని స్పష్టము చేస్తున్నాను. మనకున్న హక్కును వదలుకొని వారికి బి. షెడ్యూలు ప్రకారము నీరు పంచి ఇచ్చే ఆలోచన చేస్తే అది దేశాన్ని దగా చేసినట్లు అవుతుంది. కాబట్టి ఏ విధంగా కూడా మనకున్నటువంటి హక్కును వదలుకోము. వారిని ఏ విధంగా కూడా నీటిని పంచడానికి అనుమతించమని మా పార్టీ విధానాన్ని మీకు సవినయంగా మనవిచేస్తున్నాను.

కాబట్టి దీని విషయములో ముఖ్యంగా వారు ఆలోచనతో, సమగ్రమైన సమాధానము ఇచ్చి, నాకే కాదు, ఆంధ్రప్రదేశ్ ప్రజానీకాన్ని సంతృప్తి పరచవలసిన బాధ్యత ఉంది. కాబట్టి దీని విషయములో అతి ముఖ్యంగా మనస్సులో నేను అన్న భావనలు ఉంచుకోండి. నా ఆవేశం నాది. ఇంకొకరిది నాకు రాదు. నాది ఇంకొకరికి వెళ్ళదు. కాబట్టి నా ప్రకారము నేను చెప్పాను. దానిలో మంచి తీసుకోండి. సద్భావనతో జాతికి, దేశ పురోగమనానికి మీరు దోహదం చేయండి అని మరీ మరీ వారికి చెబుతూ ఈ అవకాశం ఇచ్చినటువంటి మీకు నా హృదయ పూర్వక అభినందనలు వ్యక్తం చేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

◆◆

అక్టోబర్ 10, 1990

# అమాయకులు దుర్మరణం చెందటం ప్రభుత్వ వైఫల్యంగా అంగీకరించక తప్పదు

*(కాకతీయ రైలులో దారుణ హత్యాకాండపై రూలు - 317 క్రింద జరిగిన చర్చ)*

**శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, ఈనాడు జరిగిన ఘోరకలి మీరు చూచే ఉంటారు. 50 మందికి పైగా అన్నారు. 60 మంది అయ్యారో, 80 మంది అయ్యారో, 100 మంది అయ్యారో కూడా తెలియని స్థితిలో సజీవంగా అమాయకులు దహించి వేయబడ్డారు. ఒక్క ఆకారం కూడా కనిపించకుండా మసి చేయబడ్డారు అంటే ఏ విధమైన ఘోరకలి జరిగిందో ఒకసారి తమ దృష్టికి నేను తీసుకువస్తున్నాను. ఇంతకంటే ముఖ్యమైనటువంటి విషయం మనకు లేదు. ప్రజల ప్రాణాలకు రక్షణ లేదు. సరిగా వారు ఇళ్లకు వెళ్లగలరనే నమ్మకం లేదు. విశ్వాసం లేదు. మరి ప్రభుత్వం వారికి రక్షణ ఇస్తుందనేటటువంటి ధృడనమ్మకం లేని ఈ పరిస్థితిలో దీని విషయములో పూర్తిగా అందరూ కూడా చర్చించి వారి పట్ల మనము చెప్పవలసింది ఏమిటి, ఈనాడు మనము తీసుకోవలసిన విధానం ఏమిటో కూడా నిర్ణయించవలసిందిగా తమకు నేను మనవిచేస్తున్నాను. ప్రభుత్వ విధానం తెలియజెప్పాలి.

**మిస్టర్ స్పీకర్:** రాజుగారు, గవర్నమెంట్ స్టేట్‌మెంట్ కానీ ఇస్తున్నారా ఈ సందర్భములో...

**శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, కేవలం ఇది ఏదో స్టేట్‌మెంట్ ఇస్తామంటే కాదు. డిటెయిల్డ్ స్టేట్‌మెంట్ ఇవ్వడానికి ఎంతమంది పోయారో దయచేసి తమరు ఒకసారి ఆలోచించండి, చర్చించాలని మనవి చేస్తున్నాను. అందరూ కూడా అడ్జర్న్‌మెంట్ మోషన్ ఇచ్చారు. అందరి అభిప్రాయాలు చెప్పనివ్వండి. ఒకసారి చర్చించనివ్వమని కోరుతున్నాను. సుమారుగా 60 మంది పైగా ప్రాణాలు పోయి ఉంటే మరి ముఖ్యమంత్రిగారికి వారి పట్ల ఉన్న శ్రద్ధ ఏమిటి అనేది ఈనాడు రాకపోవడం వల్లనే తెలుస్తోంది. మరి కేవలం ఆఫీసర్స్ ఇస్తారట. ఆఫీసర్స్ వివరాలు

చెప్పడం ఏమిటో నాకు అర్థం కావడం లేదు. ఒక మంత్రివర్యులు వెళ్లి తెలుసుకొని వచ్చి, చచ్చిపోయిన వారిపట్ల సానుభూతి లేదు అంటే ఆ స్టేట్‌మెంట్‌లో మాత్రం పెద్దగా వస్తుందని నేను అనుకోను. కాబట్టి అందరినీ చర్చించనివ్వండి. చర్చించిన తరువాత వారిని స్టేట్‌మెంట్ ఇవ్వనివ్వండి వారి ఇష్టం వచ్చినట్లు. అధికారుల మీద నమ్మకం ఉంది కానీ హౌస్ మీద నమ్మకం లేదు. అధికారులు ఇస్తారు స్టేట్‌మెంట్, దాని మీద వివరాలు చెప్పిన తరువాత స్టేట్‌మెంట్ చెబుతారు వారు తమ సమక్షములోనే అన్నారు. ఏమిటో ఈ నిర్లిప్తత, అసలు అమాయకుల పట్ల ఎందుకు ఈ నిర్లక్ష్యం? పేద ప్రజలను ఎందుకు ఈ విధంగా చూస్తున్నాము మనము?

అధ్యక్షా, ఈనాడు అతి దురదృష్టకరమైన వాతావరణంలో మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉన్నదని ఈ ఒక్క ఘటన వల్ల కాదు. అనేక ఘటనల వల్ల, అనేక సందర్భాల వల్ల మనకు విదితము అవుతున్నటువంటి సత్యంగా నేను సవినయంగా మనవి చేస్తున్నాను. ఇక్కడ, ఇంత ముఖ్యమైన సమస్య. ప్రజలకు జరిగినటువంటి దారుణమైన హింసాకాండను గురించి చర్చిస్తున్నప్పుడు మన లెజిస్లేచరు నాయకులు, ఆయన రాకపోవడం, ఆయన తనకుతానుగా, స్వయంగా ఇటువంటి చర్చను ప్రారంభించి, సానుభూతితో కూడిన విధానంతో మనయొక్క సభను వాయిదా వేయడం అది ఎంతో సమంజసంగా ఉంటుంది. ప్రజలు అంటే ఓట్లు ఇచ్చినప్పుడే ప్రజలు కానీ తరువాత ప్రజలు కారనే నిర్లక్ష్య భావంతో చూడడం అది ప్రజాస్వామ్యం పట్ల మనకు ఉన్నటువంటి అశ్రద్ధా భావమేనని నేను సవినయంగా మనవిచేస్తున్నాను. ఇదివరకు తమకు తెలుసు తమరు అపొజిషన్ బెంచెస్‌లో ఉన్నప్పుడు ఏదైనా ముఖ్యమైన సమస్య వచ్చినప్పుడు నన్ను సభకు తప్పకుండా రమ్మని ఆహ్వానించడం జరిగింది. వచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఇది అతి ముఖ్యమైన సమస్య, ఇంతకు మించిన సమస్య మనకు లేదు. అసెంబ్లీ అంటే అంత గౌరవం. అసెంబ్లీ చర్చకు వస్తునటువంటి అంశం ఎప్పుడూ మనం చూస్తున్నాం.

**ప్రజలు అంటే ఓట్లు ఇచ్చినప్పుడే ప్రజలు కానీ తరువాత ప్రజలు కారనే నిర్లక్ష్య భావంతో చూడడం అది ప్రజాస్వామ్యం పట్ల మనకు ఉన్నటువంటి అశ్రద్ధ భావమేనని నేను సవినయంగా మనవిచేస్తున్నాను. ఇదివరకు తమకు తెలుసు తమరు అపొజిషన్ బెంచెస్‌లో ఉన్నప్పుడు ఏదైనా ముఖ్యమైన సమస్య వచ్చినప్పుడు నన్ను సభకు తప్పకుండా రమ్మ ఆహ్వానించడం జరిగింది. వచ్చిన సందర్భాలు ఉన్నాయి.**

ముఖ్యంగా ఇది మన దగ్గర జరుగుతున్నటువంటి హింసాకాండ, దారుణమైన సంఘటన, హత్య జరిగింది. ఎక్కడ చూసినా దారుణాలు, బందులు, హింసాకాండ అంటే, ఈ విధంగా ప్రజలు ఎక్కడికక్కడే జీవితాలను గుప్పిట్లో పెట్టుకుని బ్రతుకుతున్నారు అంటే, మాకు, మీకు, అందరికీ ప్రభుత్వం ఇచ్చే హామీ ఏమిటి? వారికి ఇచ్చే రక్షణ ఏమిటి? ఏ విధమైన పద్ధతిలో లా అండ్ ఆర్డర్ ఈనాడు అనుమతించబడుతోంది అనేది క్షుణ్ణంగా ఆలోచించవలసిందిగా మీకు

మనవిచేస్తున్నాను. ఈనాడు, ముఖ్యంగా – నిన్న బందు, మొన్న బందు. ఈ రోజు బందు, ఎన్ని రోజులు బందులు జరుగుతున్నాయో తెలియని స్థితిలో ఉంది. ఇదివరకు జరిగిన విషయం కూడా మీకు తెలుసు – గరుగుబిల్లి, విజయనగరం జిల్లాలో పోలీసు వారి సమక్షంలో సుమారు ఏడుగురు దారుణంగా హత్య చేయబడ్డారంటే ప్రతిమల్లాగా పోలీసు డిపార్టుమెంట్ వారు చూస్తూ ఉన్నారు. రక్షక భటులు రక్షణ కల్పిస్తారనే భావంతో ప్రజలు ఉన్నారు.

సరైన భద్రత ప్రజలకు ఇవ్వలేకపోయారు. విఫలం అయినారు అంటే ఏ విధమైన విధానంలో ఈ రాష్ట్రం ఉంది? రాష్ట్ర పరిపాలనుంది అనేది గుర్తించాలని మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను. కాబట్టి, అత్యంత శ్రద్ధతో, భక్తితో మానవత్వ హృదయంతో మనం దీనిని చర్చించవలసిన విషయం ఉంది. సుమారు సాయంత్రం గం. 6.30 ప్రాంతం ఘట్‌కేసర్ సమీపంలోని పోగులగూడా రైల్వే క్రాసింగ్ వద్ద ఇది జరిగింది అంటే, ఏ విధంగా పట్టపగలు ఇంత దారుణం జరిగిందో? ఏ విధంగా రైల్వే పోలీసు, మిగతా వారు రక్షణ చర్యలు తీసుకున్నారు? ఎందుకు బయటకు రాలేకపోయారు? అగ్ని ప్రమాదం నుంచి ఒక్కరు కూడా ఎందుకు తప్పించుకోలేకపోయారు? ఎందుకు నామరూపాలు లేకుండా భస్మరాసిగా మాడిపోయారు? ఇవన్నీ కూడా తీవ్రంగా ఆలోచించవలసిన అవసరం ఉంది. ఇది అత్యంత దారుణమైన విషయం.

రైలు ప్రయాణంలో నమ్మకం లేదు. రోడ్డు మీద ప్రయాణం చేసేటప్పుడు నమ్మకం లేదు. మన జీవితాల మీద మనకే నమ్మకం లేదు. ఈ రకమైన పద్ధతిలో మనం బ్రతుకుతున్నాము. ఏ అమాయకులు ప్రాణాలు పోగొట్టుకున్నారో, ఎవరు ఈ దుర్భల దుర్మరణానికి పాత్రులైనారో, మా పార్టీ తరుపున వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి, సంతాపాలను వ్యక్తం చేస్తున్నాను. ఇప్పుడే ఒక గౌరవ సభ్యులు చెప్పారు. ఎవరి వల్ల జరిగినా, ఎవరి అశ్రద్ధ వల్ల జరిగినా, ప్రభుత్వ వైఫల్యంగా అంగీకరించక తప్పదు. జరిగింది. జరిగినప్పటికీ, ఈనాడైనా, కరుణా హృదయంతో ఎక్స్‌గ్రేషియాను ఇచ్చి, సానుభూతితో వారి కుటుంబ సభ్యులకు శోక నివృత్తి చెయ్యడం ధర్మం అని మనవిచేస్తున్నాను. ఇప్పుడే గౌరవ సభ్యులు అన్నారు. సెంట్రల్ గవర్నమెంట్ బాధ్యత ఉంది అన్నారు. నేను కూడా తగిన శ్రద్ద తీసుకుని, దీని విషయంలో నేను వెళ్లినప్పుడు జరిగిన దారుణం గురించి చెప్పి, మృతుల కుటుంబాల పట్ల వ్యవహరించే విధానంలో ప్రయత్నిస్తాను అని సవినయంగా మనవిచేస్తున్నాను. నాకు ఈ అవకాశం ఇచ్చిన తమకు కృతజ్ఞతలు తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

◆◆

ఆగస్టు 26, 1991

# రైతులపై బనాయించిన కేసులను వెంటనే ఉపసంహరించాలి. ఎరువులను పాత ధరలకే అమ్మే విధంగా చర్యలు తీసుకోవాలి

*(రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందుల ధరల పెరుగుదలపై **304** నిబంధన కింద చర్చ)*

**శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, ఈ రోజున పూర్తిగా రైతాంగము నిర్వీర్యంతో ఈ ప్రభుత్వము చేసిన ఘాతుక చర్యలకు వారి బాధలు చెప్పుకోలేక ఏవిధంగా మూగబోయి ఉన్నారో ఈనాడు మనమందరం గుర్తించిన సత్యం. ఇప్పటికైనా ఈ ప్రభుత్వము సమగ్రంగా ఆలోచన చేస్తారని, రైతులకు న్యాయం కలుగచేస్తారని ఎంతో ఆశ మాకు ఉండింది. 1991 జూలై 24వ తేదీ అర్ధరాత్రిన ఎరువుల ధరలను పెంచారు. తరువాత పన్నులు పెంచారు. ఈ నోట మాకు 1991 జూలై 24వ తేది నాటికి పాత స్టాక్ ఎంత, కొత్త స్టాక్ ఎంత? రిటైల్ డీలర్స్ దగ్గరున్న స్టాక్‌ను ప్రభుత్వము చెప్పించాలి. సెంట్రల్ గవర్నమెంట్, స్టేట్ గవర్నమెంట్ ప్రకారం జరుగుతున్నాయా, లేదా అనేది అధికారులు వెంటనే చర్యలు తీసుకున్నారా అనే అనుమానాన్ని వ్యక్తము చేస్తున్నాను.

అర్ధరాత్రి ఎరువుల ధరలు పెంచడం జరిగిందని బడ్జెట్‌లో ప్రకటించబడింది. ఏ రకమైన స్వార్థ పరులైనటువంటి వారు, వ్యాపారస్తులు దళారులు కేంద్రం పేరు చెప్పుకుంటూ వారు అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. ఏవిధంగా అక్కడ బ్లాక్ మార్కెట్‌లో విక్రయించారో అన్నది ఈ ప్రభుత్వ దృష్టికి రాలేదా? గుమ్మడి కాయల దొంగ అంటే భుజాలు తడుముకున్నట్టుగా చేసిన వారు, చేయించినవారు, బాధ్యులైనవారే దాని విషయంలో నిద్రాణములో ఉన్నారు, మోసము చేద్దాము అనుకుంటే, రైతులను ఈవిధంగా మభ్యపెడుతూ ఉంటే ఏవిధంగా ఈనాడు రైతుకు న్యాయం జరుగుతుందా అని నేను అడుగుతున్నాను. మరి కొత్త స్టాక్స్ కూడా వచ్చాయి, దాని తరువాత ఎంత వచ్చింది, కొత్త స్టాకు పాత స్టాకు ఎంత, వారు ఏవిధంగా ఫెర్టిలైజర్ స్టాకును రైతులకు ఇచ్చారు. ఏవిధంగా ప్రజలకు ముట్టచెప్పబడిందో, మరి రెవెన్యూ అధికారులు ఉన్నారు,

అగ్రికల్చరర్ అధికారులు ఉన్నారు. వ్యవసాయానికి సంబంధించినటువంటి అధికారులు ఉన్నారు. వారికి ఏమీ బాధ్యత లేదా? రైతులు ఏ ఊరిలో ఎంతమంది ఉన్నారన్నది వారికి తెలుసు.

మరి ఇవన్నీ కూడా గమనించకుండా కేవలం నిమ్మకు నీరెత్తినట్లుగా ఈనాడు రైతుల మీద జరిగినటువంటి దౌర్జన్యాలకు కారణభూతులు అవుతూ ఎక్కడికక్కడ పోలీస్ డిపార్ట్‌మెంట్‌ని కూడా ఆసరాగా తీసుకుంటూ ఆ పేదరైతులు, అమాయకులైన. ఆ నోరులేని వారిని ఏవిధంగా బాధపెడుతున్నారో చూడమని నా బాధను వ్యక్తం చేస్తున్నాను మనవిచేస్తున్నాను. అంతేకాకుండా మరి ఈ రోజున ఎవరు ఎన్నివిధాలుగా బ్లాక్ మార్కెట్ చేసి అమ్ముకున్నారో అన్నది అందరికీ స్థానికంగా తెలిసిన సమాచారం. దాని విషయములో ప్రభుత్వం ఏమైనా చర్య తీసుకుందా? ఇప్పుడు సమయం, నెత్తి మీదకు వచ్చింది. నాట్లు అయిపోయాయి. కలుపులు అయిపోయాయి. ఈనాడు ఈతకు సిద్దముగా ఉన్నటువంటి వరి పైరుకు సరైన ఎరువులు వేయవలసిన అవసరం ఉంది. అహర్నిశం రెక్కలు ముక్కలు చేసుకొని దేశానికి ఇంత కూడు పెట్టే అన్నదాత రైతు. మనము లెజిస్ట్రేటివ్ సభ్యులం కావచ్చు, కోటీశ్వరులం కావచ్చు, డబ్బులు మూట కట్టవచ్చు, కానీ మనము బంగారం తినమే. కూడు కావాలే మన పొట్టకు. ఆ కూడును పండించి ఇచ్చేటటువంటి ఆ రైతును మనము గమనించవలసిన అవసరం లేదా అని ఈ సందర్భముగా నేను సవినయంగా మనవిచేస్తున్నాను. ఇంతవరకు ఎవరి దగ్గర ఎంత స్టాకు ఉంది. సన్నకారు, చిన్నకారు రైతులని ఒకమాట వాడారు. ఈనాడు ఏవిధంగా సన్నకారు, చిన్నకారు రైతుల విషయములో మీరు ఒక విభజన చేయగలుగుతారు? మరి 30 శాతం అన్నారు. 30 శాతమే కాదు. గత రికార్డుల వల్ల.

**అహర్నిశం రెక్కలు ముక్కలు చేసుకొని దేశానికి ఇంత కూడు పెట్టే అన్నదాత రైతు. మనము లెజిస్ట్రేటివ్ సభ్యులం కావచ్చు, కోటీశ్వరులం కావచ్చు, డబ్బులు మూట కటవచ్చు, కానీ మనము బంగారం తినమే. కూడు కావాలే మన పొట్టకు ఆ కూడును పండించి ఇచ్చేటటువంటి ఆ రైతును మనము గముంచవలసిన అవసరం లేధా అని ఈ సందర్భముగా నేను సవినయంగా మనవిచేస్తున్నాను.**

ప్రభుత్వం దగ్గర ఉన్న రికార్డ్స్ వల్ల సుమారుగా 70 శాతం చిన్నకారు, సన్నకారు రైతులు ఉన్నారని తేలింది. మరి లెక్కప్రకారం అయితే సుమారుగా మనకు రూ. 230 కోట్ల మొత్తం రాష్ట్రంలోకి లోటు వస్తే, దానిలో సన్నకారు, చిన్నకారు, పోనీ ఆ లెక్క ప్రకారం 70 శాతం అయితే రూ.170 కోట్లు మనకు సబ్సిడీ రావలసి ఉండగా కేవలం రూ. 69.275 కోట్లు మాత్రమే మనకు వచ్చాయని తృప్తి పడడంలో రైతుకి ఏమీ న్యాయం జరగదు. రైతు ఉసురు పోసుకున్నట్లుగా అవుతుందని కూడా ఈ సందర్భముగా మనవిచేస్తున్నాను. కేవలం ఇది అధికారులు, మధ్య దళారీలు వారి జేబులు నింపుకోడానికి, సంచులు నింపుకోడానికి ఏర్పర్చబడ్డటువంటి నిబంధననే కానీ ప్రత్యేకంగా ఎవరైతే పల్లెటూళ్లలో ఉంటూ, భూమిని నమ్ముకొని, నాగలి, మేడి పట్టి మనకు

ఈనాడు కూడు పెడుతున్నారో, రైతు గోడు వినే నాథుడు లేకపోవడం, దాని విషయములో ప్రస్తావించకపోవడం, మేము ఇస్తామని రైతులకు హామీ ఇవ్వకపోవడం, మరొక విధానం అనుసరించడం ద్వారా మీ అందరికీ ఎరువు అందించగలుగుతాము అనేటటువంటిది ప్రభుత్వం సర్క్యులేట్ చేసిన ఈ నోట్లో ఏమాత్రం దీని విషయములో ప్రస్తావించకపోవడం చాలా శోచనీయమని మీకు నేను సవినయంగా మనవిచేస్తున్నాను.

దీనిపట్ల, గతములో జరిగిన దానిపట్ల ఈనాడు ఇంకా ప్రభుత్వానికి నిర్లక్ష్య భావం ఉంది. రైతుమీద ఏమాత్రం సానుభూతి లేదు. రైతాంగాన్ని గుర్తించి గౌరవించేటటువంటి భావన ఈ ప్రభుత్వానికి లేదనేది సుస్పష్టం అవుతోందని ఈ సందర్భముగా మీకు సవినయంగా మనవి చేస్తున్నాను. పోతే, ముఖ్యంగా, అధ్యక్షా మీకు తెలుసు. మనరాష్ట్రం, దేశం 70 శాతం వ్యవసాయక రంగం 70 శాతం రైతులు ఉన్నారు. ఎక్కడికక్కడ అమాయకులుగా మారుమూల కుగ్రామాలలో ఉండి, ఎక్కడికక్కడ కష్టంచేస్తూ, ఈ తెలివిగల సమాజానికి తిండి పెట్టేటువంటిది వారే అన్నది కూడా ఈ సందర్భముగా గుర్తు చేస్తున్నాను. అయితే పూజ్య బాపూజీ చెప్పారు. రైతే రాజు కావాలని అన్నారు. గ్రామాభ్యుదయంలోనే మన దేశాభివృద్ధి ఉన్నదని అన్నారు. పల్లెటూళ్లే మనదేశానికి పట్టు కొమ్మలన్నారు అన్నది కనీసం ఏమైనా అమలు జరిగిందా, గ్రామీణాభివృద్ధి జరిగిందా, రైతులను కనీసం గుర్తించారా, గౌరవించారా అన్నది మరి ఈనాడు మనకు వస్తున్న సందేహముగా మీకు సవినయంగా మనవిచేస్తున్నాను. మరి ముఖ్యంగా తెలుగుదేశం వచ్చేటప్పటికి ఏవిధంగా పరిస్థితులు రాష్ట్రములో ఉన్నాయో మీకు తెలుసు. ఏ వసతులూ లేవు. రోడ్డు, రవాణా సౌకర్యాలు లేవు. స్కూల్స్ లేవు. కేవలం మట్టి పిసుక్కునే రైతు మట్టి పిసుక్కోవడమే వారి గృహచారం వాడి పిల్లకు పెళ్లి చేసుకోలేడు సరిగ్గా. గౌరవంగా వాడి బిడ్డకు కనీసం చదువు చెప్పించుకోలేని స్థితిలో రైతు ఏవిధంగా కాలం దాటిన కొద్దీ దగా చేయబడ్డాడో కూడా నేను మీకు సవినయంగా గుర్తుచేస్తున్నాను.

అదే విధానంగా స్వాతంత్ర్యము వచ్చినప్పటికి కూడా ఆ వర్గాన్ని గుర్తించకపోవడం, అన్ని కులాల వారు ఉన్నారు. రైతులు అంటే, వ్యవసాయం చేసేవారు. ఆ వర్గాన్ని ఏవిధంగా నిర్లక్ష్యం చేశాము. పూర్తిగా మనము అనుసరించినటువంటి విధానంవల్లే ఏవిధంగా ద్రోహం చేయబడ్డారు అన్నది మనకు తెలుస్తోందని కూడా ఈ సందర్భముగా మనవిచేస్తున్నాను. కాబట్టి ఇన్ని అవకతవకలు కాంగ్రెస్ హయాములో జరిగినప్పుడు 35 సంవత్సరాల పరిపాలన అనంతరం తెలుగుదేశం పరిపాలన, బాధ్యతతో కూడినటువంటి పరిపాలనను స్వీకరించినప్పుడు ఏవిధంగా రైతును గుర్తించారో, ఏవిధంగా దేశానికి అండ అయినటువంటి, పట్టుకొమ్మ అయినటువంటి ఒక వ్యక్తిగా, నిస్వార్థంగా, మరి రక్తాన్ని చెమటగా ఓడుస్తున్నటువంటి ఆ రైతుకు ఏవిధంగా సహాయం చేశామో మీకు తెలుసు. మరి ఆ విధంగా రూ.50 – ఏమీ మనము ఎన్నిటికో రిబేట్లు

ఇస్తున్నాము. పవర్ వీడికి ఇస్తే తప్పా? వారు పండించిన కూడు తింటున్నామే. వారికి ఆ మాత్రం కృతజ్ఞత చూపించవలసిన అవసరం మనకు లేదా అని అడుగుతున్నాను రూ. 53 ఒక అశ్విక శక్తి సంవత్సరానికి - వన్ హెచ్.పి. పవర్ పెర్ ఏనమ్. వారికి ఇచ్చాము అంటే కేవలం ఒక వర్గాన్ని గుర్తించాము. వారిని గౌరవించానే తప్ప వారికి ప్రత్యేకంగా ఒరగబెట్టినదిగా మనము భావించవలసిన అవసరం లేదు. ఈనాడు రైతుకు ఇచ్చినటువంటి సంక్షేమ కార్యక్రమాలను ఈ ప్రభుత్వం తీసివేస్తున్నది. ఏం మీకు మాత్రము రైతులు ఓట్లు ఇవ్వలేదా? రైతుల ఓట్లు తీసుకొని ఈనాడు రైతుల పొట్టలు కొట్టడానికి మీరు సిద్ధపడతారా అని ఈ సందర్భముగా నేను అడుగుతున్నాను. అదేవిధంగా 51/2 శాతం రిబేటు. ఎవరైతే సకాలములో తీసుకున్న రుణాలు తీరుస్తారో వారికి ఐదున్నర శాతం వడ్డీ రిబేటు ఇచ్చాము. 10 శాతములో ఐదున్నర శాతం పోతే నాలుగున్నర శాతానికి ఇచ్చాము ఏదీ?

ఈ రోజున ఒక్కమాట ప్రస్తావన లేదే. మరి ఎంతమందికి ఇన్సెంటివ్స్ ఇస్తున్నాము. మరి కేవలం పారిశ్రామిక వేత్తలకు వారి పేరుతో మనము అప్లికేషన్స్ ఎన్ని మంజూరు చేస్తున్నాము? ఈనాడు ధనిక వర్గాలకు, సంపన్న వర్గాలకు ఏవిధంగా తొత్తులుగా మనము ఈనాడు వ్యవహరిస్తున్నామో ఒకసారి ఈ సందర్భముగా గుర్తుకు తెచ్చుకోవాలని మనవి చేస్తున్నాను. మరి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఈనాడు 40 శాతం ధర పెంచారు కానీ ఆ రోజున 50 శాతం సబ్సిడీగా ప్రభుత్వం ఎరువులు, పురుగు మందులు రైతులకు ఇవ్వడం జరిగింది. మరి దానితో ప్రోత్సహించడానికి వారిలో కేవలం నిరాశ, నిస్పృహలు లేకుండా భవిష్యతులో కూడా దండిగా తిండి ధాన్యాలు ఉత్పత్తి చేసేటటువంటి గౌరవం ఇవ్వడానికి, అదేవిధంగా అప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది కేంద్రములో, మరి 1986వ సంవత్సరములో గోదావరి వరద వచ్చి ఖరీఫ్ పంట కొట్టుకుపోయినప్పుడు నేను స్వయముగా వెళ్ళాను. రెండు కోట్ల రూపాయల ఎరువును, అదీ కేంద్ర ప్రభుత్వం వద్దన్నప్పుడు, మా బాధ్యత మీద మేము పంచాము. దాని ఫలితంగా సుమారు రూ. 200 కోట్ల పంట వారు ఉత్పత్తి చేయగలిగారు. అంటే అసలు మనము వారికి పూర్తిగా మద్దతు ఇవ్వాలి. వారిని గుర్తించాలి. గౌరవించాలి అనేటటువంటి ధ్యేయం ఉండాలే కానీ రైతును ఎప్పుడూ కూడా దేశాభ్యుదయం కోసం పని చేసేటటువంటి ఒక శ్రమజీవిగా రైతును మనము గౌరవించాలని మీకు సవినయంగా మనవిచేస్తున్నాను.

అదేవిధంగా నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం వచ్చినప్పుడు 10 వేల రూపాయల వరకు ఉన్న రుణాలను మాఫీ చేయడానికి కేవలం 50 పర్సెంట్ వరకు మన రాష్ట్రప్రభుత్వం హామీ ఇవ్వవలసి ఉండింది. ఆనాడు నాబార్డ్ చెప్పిన ప్రకారం కనీసం నామమాత్రంగానైనా 5.6 కోట్ల మేరకు రాష్ట్రప్రభుత్వం హామీ ఇచ్చినట్లయితే సుమారు 250, 260 కోట్ల రూపాయల వరకు రుణాలు మాఫీ చేయబడడం జరుగుతుందని చెప్పినప్పటికి కూడా ఆ మాత్రానికి కూడా ముందుకు

రాకుండా ఉంది ఈ ప్రభుత్వ విధానం. ఎంతో అనుభవం ఉన్నప్పటికీ, వారి నాయకుడైన పూజ్య బాపూజీ చెప్పినప్పటికీ రైతు మీద ఇసుమంతైనా కూడా ఆదరణ లేకుండా నిర్లక్ష్యం చేస్తున్న ఈ ప్రభుత్వ వైఖరి ఖండించదగింది. రైతులను నిర్లక్ష్యం చేసి, వారి నెత్తిన ఎక్కి సవారీ చేయడం ప్రజాస్వామ్యం కాదు. ఇది రాజకీయం కాదు మనవి చేస్తున్నాను. ప్రజాస్వామ్యంలో ఎవరూ అడగవలసిన విధానం లేదు. ప్రజలచేత ప్రజలకొరకు నడిపించబడే ప్రభుత్వం ఇది, ప్రజల అవసరాలను గుర్తించవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఉండాలి. ఏ వర్గానికి ఏ అవసరాలు ఉన్నాయో గుర్తించి ఎవరూ అడక్కుండానే వారికి సామాజికపరమైన న్యాయాన్ని కలిగించడం ఎంతో ఔచిత్యంగా ఉంటుంది. కేంద్రంలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులకు గల 10 వేల రూపాయల లోపు రుణాలను మాఫీ చేస్తామంటే కూడా ఆ సహాయాన్ని వాడుకొనడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మనవిచేస్తున్నాను. ఇకపోతే మేము కర్షక పరిషత్‌కు 600 ఎకరాల స్థలం ఇచ్చాం రైతే రాజు కావాలన్నాం. దయచేసి ముఖ్యమంత్రి గారు వినాలి. ఆనాడు అధికారుల సలహాతోటే ఆ పనిచేశారా? వారు కూడా ఆమోదించారు.

I am asking - what is wrong in it? ఆనాడు మా ప్రభుత్వం ఉన్నప్పుడు 600 ఎకరాల భూమిని ఇచ్చి కర్షక పరిషత్‌ను స్థాపించాలంటే అందులో ఏమైనా తప్పు ఉందేమో చెప్పండి. ఇది రైతుకు సంబంధించింది. రైతే రాజు కావాలి, రైతు గౌరవంగా బ్రతకాలి, రైతు పండించే పంటకు గిట్టుబాటుధర లభించాలి. వారి సహకారంతో దేశ ప్రగతికి పాటుపడాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన సంస్థను కాదని 600 ఎకరాల భూమిని కూడా అమ్ముకొనేందుకు ఈ ప్రభుత్వం సిద్ధపడుతోందని వింటున్నాం. అదే నిజమైతే అంతకు మించిన దౌర్భాగ్యం, అంతకుమించి రైతుకు జరిగే అన్యాయం ఉండదని కూడా ఈ సందర్భంలో ప్రభుత్వానికి హెచ్చరిక చేస్తున్నాను.

అదేవిధంగా సింగిల్ విండో విధానం విషయం తీసుకొంటే మోహన్ కందాగారు ఆనాడు చెప్పులరిగేలా ఢిల్లీకి తిరిగి ఈ విధానాన్ని తీసుకురావడం జరిగింది. ఈ విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేశాం. రైతుకు తాకట్టు విధానం పోవాలి. ఎక్కే గడపా, దిగే గడపా పోయి పరిమితికి లోబడి గౌరవంగా రుణాలు తెచ్చుకొనేందుకు తెలుగుదేశం ప్రభుత్వ హయాములో ఈ విధానాన్ని అమలుపరిస్తే వీరికి అది కూడా నచ్చడంలేదంటే ఏవిధమైన అప్రజాస్వామిక రైతు వ్యతిరేక విధానాన్ని ప్రభుత్వం అవలంబిస్తోందో దయచేసి ఒక్కసారి ఆలోచించాలని సవినయంగా మనవిచేస్తున్నాను. ఇకపోతే ప్రాజెక్టుల విషయం అందరికీ తెలిసిందే. మరోమారు తమద్వారా సభకు మనవి చేస్తున్నాను. బచావత్ ట్రిబ్యునల్ అవార్డ్ ప్రకారంగా కృష్ణానదీ జలాలను వాడుకొనేందుకు మనకు 2000 ఎం.డి. వరకే అధికారం ఉంది. ఆలోగా ప్రాజెక్టులన్నీ పూర్తిచేసుకోవాలి. లేకపోతే ఒక్క చుక్క నీటిని వాడుకోడానికి కూడా తెలుగువారికి అధికారం

లేదని సుస్పష్టంగా ఉంది. 323 టి.ఎం.సి.ల నీరు సముద్రంలోకి వృధాగా పోతున్నదని తెలిసిన తరువాత ఈ ప్రాజెక్టులన్నీ ఏర్పాటు చేశాము. తెలుగు గంగ, శ్రీశైలం ఎడమకాలువ, జూరాల, భీమా, అదేవిధంగా శ్రీశైలం కుడికాలువ పొడిగింపు, గాలేరు-నగరి, హంద్రీ-నీవా ఈ ప్రాజెక్టులన్ని చేపట్టడం జరిగింది. అధ్యక్షా, అదేవిధంగా వంశధార విషయం మీకు తెలుసు. మీరు శ్రీకాకుళం నివాసులు తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడు ఎన్ని విధాలుగా పాట్లుపడ్డామో తమకు తెలుసు. నేను ప్రచారానికి వచ్చినప్పుడు ఆరోజున నన్ను అడిగారు. నేను చేస్తానన్నాను. అక్కడి ముఖ్యమంత్రిగారితో మాట్లాడడం జరిగింది. ఇది కేవలం 106 ఎకరాల ముంపుకు సంబంధించింది. వారు ఆమోదించారు. మేము కూడా ఆమోదించాం. కానీ ఈనాడు కాంగ్రెస్ వారికి ఎందుకు నోరులేదు. వెనుకబడి ఉన్న శ్రీకాకుళం జిల్లాలో వంశధార రెండవ దశ పని చేయకుండా ఉన్న ఈ ప్రభుత్వ విధానం ఏమిటని ప్రశ్నిస్తున్నాను.

*(అంతరాయము)*

ఇక తెలుగుదేశం ప్రభుత్వ హయాములో భూగర్భ జలాలను వెలికితీసి తెలుగుగడ్డను సస్యశ్యామలం చేయాలన్న భావంతో సుమారు 4 లక్షల 41 వేల హెక్టార్లకు నీటిపారుదల సౌకర్యాలు కల్పించడం జరిగింది. ఏవిధంగా ఆహారధాన్యాల ఉత్పత్తిని పెంచేందుకు ప్రయత్నం చేశామో గుర్తు చేస్తున్నాను. ఇది మాకోసం కాదు మా పార్టీ కోసం కాదు. తెలుగునాట ప్రజల కోసం, నేను రైతుకోసం మాట్లాడుతున్నాను కానీ మా పార్టీ కోసం కాదు. ఏ పార్టీ అయినా ఒక్కటే. వ్యవసాయం చేయడానికి నీళ్లు అక్కరలేధా? కేవలం తెలుగుదేశం పార్టీకి కావాలా?

ఆనాడు రిటైల్ మార్కెట్లో ఉన్న ఎరువంతా హోల్‌సేల్ స్టాక్‌లోకి వెళ్లిపోయింది. తరువాత వాళ్ళు పెద్ద పెద్ద సిటీలలో ముద్రించి మారుమూల గ్రామాలకు పంపించి సరుకంతా అమ్ముకుతిన్నారు. దీనిపై ఇంతవరకూ ప్రభుత్వం ఏమైనా చర్య తీసుకొందామని తమద్వారా ప్రశ్నిస్తున్నాను. బ్లాక్‌మార్కెట్‌ను పెంచేవిధంగా వ్యవహరించింది. రైతులను తీసుకెళ్లి పులి నోటికి బలి చేసిందని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. వారియొక్క న్యాయం కోసం పోరాడిన రైతులను, అయ్యా, ఏవిధంగా శిక్షించారో దయచేయండి.... ఇదివరకు చిలకలూరిపేటలో రైతులను ఒక చోటికి రమ్మని తలుపు వేశారు. ఆఫీసర్లు చెప్పారు - మేము వచ్చి అందరికీ చోట్లు ఇస్తామని చెప్పారు. ఏదో ఇస్తారని, రైతులు వెళ్ళారు. 10 అయింది. 11 అయింది. 12 అయింది. చివరికి ఒంటిగంట అయింది. ఆఫీసర్ అనేటటువంటివాడు, ప్రభుత్వానికి, ప్రభుత్వ విధానాన్ని అమలు చేయవలసిన వాడు వెళ్ళకపోతే ఎట్లా? తిండి కూడా తినలేదు అన్నా, లాఠీఛార్జి చేస్తారా? గోడలు దూకి పారిపోతుంటే, బజారులో కాకులను కాల్చినట్లు కాలిస్తే, ఇద్దరు చనిపోయారు. ఏడుగురికి గాయాలు అయ్యాయి. స్వయంగా నేను చూశాను ఏవిధంగా న్యాయస్థానం వ్యవహరిస్తున్నది? ఏవిధమైన న్యాయం చేస్తున్నది. 'నోరు ఉన్నవాడిదే రాజ్యమా'? వారికి ఏవిధంగా

ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నారు? లక్ష రూపాయలు అందరికీ ఇచ్చినట్లుగానే ఆ పేద రైతులు నోచుకోలేదు. సామాజికపరమైన న్యాయం జరిగి తీరాలని చెప్పి డిమాండు చేస్తున్నాను. పంటలు పండించే రైతులను ఈ ప్రభుత్వం లాఠీలతో అవమానించింది, చంపించింది. ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరించింది. ఏవిధంగా ప్రజల దగ్గరికి వెళ్లే అర్హత ఉంది? ఈనాడు కో-ఆపరేటివ్ ఎలక్షన్స్ పోస్ట్‌పోన్ చేశారు. వీరికి తెలుసు. అక్కడ నుంచి ఏమి వస్తుందో. కాబట్టి ఏవిధంగా ఎన్నివేల మందిని అరెస్టు చేశారో ఒకసారి మీ దృష్టికి తీసుకువస్తున్నాను. ముఖ్యంగా, నిడుమానూరులో రైతులపై లాఠీఛార్జి, ఫక్రయ్య మృతి, 10 మందికి గాయాలు,హుజూరాబాదులో ఎరువుల దుకాణాలపై ఉద్యమం నడిపిన రైతులపై పోలీసులు లాఠీఛార్జి చేశారు. ముగ్గురిని అరెస్టు చేశారు. ఈనాడు ప్రత్యేకంగా మనవిచేస్తున్నాను. మీకు పేదరైతుల మీద విశ్వాసం ఉంటే, మీకు కనుక పేద రైతుల మీద నమ్మకం ఉంటే వారిపైన కరుణ ఉంటే, వారిని చూడండి. హుజూరాబాదు ఎస్.ఐ, సి.ఐ. ఇన్‌ఛార్జ్‌గా...

*(ఇంటరప్షన్)*

అక్కడ ఎరువులు విక్రయించమని అడిగితే ఈ రైతులను మోకాలు మీద దేకించారు. మీ ఛాంబర్‌లోకి రప్పించి ఒకసారి కరుణతో చూడండి ఈ అమానుషాన్ని ఈనాడు డెమోక్రసీ సహిస్తుందా అని అడుగుతున్నాను. మీరైనా మాదారి చూడాలి. సభా అధ్యక్షులు, సభాపరంగా న్యాయం చేయవలసినవారు మీరు, మీకు మేము చెప్పుతున్నాము కాబట్టి...

*(ఇంటరప్షన్)*

**పంటలు పండించే రైతులను ఈ ప్రభుత్వం లాఠీలతో అవమానించింది, చంపించింది. ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరించింది. ఏవిధంగా ప్రజల దగ్గరికి వెళ్లే అర్హత ఉంది? ఈనాడు కో-ఆపరేటివ్ ఎలక్షన్స్ పోస్ట్‌పోన్ చేశారు. వీరికి తెలుసు. అక్కడ నుంచి ఏమి వస్తుందో. కాబట్టి ఏవిధంగా ఎన్నివేల మందిని అరెస్టు చేశారో ఒకసారి మీ దృష్టికి తీసుకువస్తున్నాను.**

In the August House, it is my right to speak on behalf of poor ryots. Nobody can obstruct to it. అధ్యక్షా, విజయవాడ లాఠీఛార్జి 70మంది అరెస్టు, మిర్యాలగూడలో ఎరువులను చీకటి బజారుకు తరలింపుకు వ్యతిరేకంగా ఉద్యమం నడిపితే, రైతులపై పోలీసు లాఠీఛార్జి చేశారు. నర్సారావుపేటలో రైతులపై కాల్పులు జరుపగా ఇద్దరు రైతులకు గాయాలు తగిలాయి. నిజామాబాదులో లాఠీఛార్జి చేశారు. 31న విజయవాడలో రాస్తారోకో సందర్భంగా 200 మంది రైతులను అరెస్టు చేశారు. మిర్యాలగూడలో అనేకమంది క్యూలో నిల్చున్న రైతులను - చీటీలు ఇచ్చే స్థలంలో జరిగిన తొక్కిసలాటలో ఒక రైతు మరణించారు. ఖమ్మంలో లాఠీఛార్జి జరిగినప్పుడు 100 మందిని అరెస్టు చేశారు. హైదరాబాద్ నగరం పొలిమేరలో ఉన్న జీడిమెట్లలో 50 మందిని అరెస్టు చేశారు. చిలకలూరిపేటలో ఇద్దరి

మృతి, 7 మందికి గాయాలు, నల్లగొండ జిల్లాలో వెయ్యిమంది రైతుల మీద ఒకసారి, 19 మంది అరెస్టు, పోలీసు కాల్పుల్లో ఇద్దరికి గాయాలు, ఆగస్టు 19న పాలమూరులో లాఠీఛార్జి, ఆగస్టు 19న వరంగల్లులో లాఠీఛార్జి, కాల్పులు, ఇద్దరికి గాయాలు, ఇవన్నీ చూసిన మీదట ఈ ప్రభుత్వం యొక్క నిర్లక్ష్య విధానానికి, వైఖరికి మేము డిమాండు చేస్తున్నాము. ప్రతిపక్షాలు, ఫ్లోర్ లీడర్స్ అందరి డిమాండ్లు ఏమనగా రైతులపై బనాయించిన కేసులను వెంటనే.....

*(ఇంటరప్షన్స్)*

అధ్యక్షా, రైతులపై బనాయించిన కేసులను వెంటనే ఉపసంహరించాలి. రెండవది, పోలీసు కాల్పులో మృతులైన వారికి, గాయపడిన వారికి అందరికీ ఇచ్చేవిధంగా ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి. ఎరువులు పాత ధరకే అమ్మడానికి, కేంద్రప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవడానికి, నూతన విధానాన్ని ఈ రాష్ట్రప్రభుత్వం లిఖితపూర్వకంగా ఒక తీర్మానాన్ని పంపించాలని తెలియచేస్తున్నాను. అంతవరకు, కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకునే వరకు రాష్ట్రప్రభుత్వం ఎరువులను పాత ధరలకే అమ్మే విధంగా చర్యలు తీసుకోవాలి. అవసరమైతే సబ్సిడైజ్ చేయాలి. ఎందుకంటే, ఎన్నోరకాల సంక్షేమ కార్యక్రమాలను సబ్సిడైజ్ చేస్తున్నాను. ఈనాడు రైతులు, అహర్నిశలు, రెక్కలు ముక్కలు చేసుకునేవారి రక్తం చూస్తారా? చివరికి అవసరమైతే పూర్తిగా రైతులకు ఆ వ్యత్యాసాన్ని సబ్సిడీగా ప్రకటించాలని ఈ సందర్భంగా మా డిమాండు వ్యక్తం చేస్తున్నాము. భవిష్యత్తులో కూడా రైతులమీద ఎటువంటి భారం మోపకుండా ఉండాలి. మీకు తెలుసు పరిశ్రమలవారికి అయితే ఎన్నో ఇన్‌సెంటివ్స్ ఇస్తున్నాము.

*(అధికారపక్ష సభ్యులు అనేకమంది ఒకేసారి లేచి మాట్లాడడానికి ప్రయత్నించారు).*

అధ్యక్షా, అదే పరిశ్రమలకైతే పెద్ద కొడుకుల్లాగా చూస్తున్నాము. డబ్బున్న వారికి ఎంత కట్టబెడుతున్నాము? ఎన్ని ఇన్సెంటివ్స్ వారికి? ముఖ్యమంత్రిగారికి తెలుసు. పరిశ్రమలకి 10 ఇయర్స్ సేల్స్‌టాక్స్ ఎగ్జెంప్షన్ ఇస్తున్నాము. ఫిల్మ్ ఇండస్ట్రీ విషయంలో డిపాజిట్స్ పేమెంట్ మీద ఎందుకు ఇస్తున్నాము. వాటర్ ఛార్జెస్, స్థలం కన్‌సెషన్స్ ఎన్నిరకాలు ఇస్తున్నాము? కూడు పెట్టే రైతుకు ఎందుకు ఇవ్వలేకపోతున్నాము? పాక్షికమైన దగాకోరుతనంగా దీనిని నేను భావిస్తున్నాము. పూజ్య బాపూజీ విధానాలకు వ్యతిరేకం ఇది. రైతులకు అన్యాయం జరగరాదు. మూగవారు అయినంత మాత్రాన, తెలివిలేనంత మాత్రాన, మన వద్దకు రాలేకపోయినంత మాత్రాన, మన తాతలను....

*(ఇంటరప్షన్స్)*

మరచిపోరాదు. మన ముత్తాతలను మరచిపోరాదు. ఎక్కడ పుట్టారో ఆ స్వస్థలాన్ని గుర్తుచేసుకోండి. రైతులను గౌరవించండి అని మీద్వారా ముఖ్యమంత్రిగారికి ప్రత్యేకంగా విజప్తి

చేస్తున్నాను. రైతుల సంక్షేమంకోసం తప్పనిసరిగా ఈ ప్రభుత్వం కృషి చెయ్యాలి. లేకపోతే పరిణామాలు తీవ్రంగా ఉండవచ్చును. ఇప్పటికే రాష్ట్రంలో ఆందోళనగా ఉంది. ఉడుకుతున్నది సమాజం గగ్గోలు పెడుతున్నది. ఒకసారి గమనించాలి. పరిశ్రమలకు ఇంత ఇచ్చిన వారం, ఏం, రైతులకు ఎందుకు ఇవ్వలేకపోతున్నాం? నేను అడుగుతున్నాను. నేను డిమాండ్ చేస్తున్నాను. నా ధర్మం. రైతు బిడ్డగా, రైతు సంక్షేమానికి కృషి చేసేవాడిగా, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా, గత ముఖ్యమంత్రిగా నేను డిమాండ్ చేస్తున్నాను. ఇది చాలా ముఖ్యమైన విషయం ముఖ్యమంత్రి గారే దీనికి సమాధానం ఇవ్వాలి మంత్రిగారు కాదు. పాత రేట్లకే ఎరువులు ఇప్పించాలి.

అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రిగారు కేంద్ర ప్రభుత్వం వద్దకు వెడుతున్నారు కాబట్టి ఈ సందర్భంలో వారి చేతులను బలపరచడం మన ధర్మం. రైతు సమస్యలపట్ల, ఈ శాసనసభ ఎంతో అప్రమత్తంగా ఉందన్న దానికి అనుగుణంగా ఒక తీర్మానాన్ని నేను ప్రతిపాదిస్తున్నాను.

**శ్రీ ఎన్. జనార్దనరెడ్డి:** నేను మనవిచేశాను, తీర్మానం అక్కరలేదు. మీ భావాలతో ఏకీభవిస్తున్నాను. సభా నాయకుడిగా అక్కడ ఈ విషయాన్ని చెపుతానని మనవిచేస్తున్నాను.

**శ్రీ ఎన్. టి. రామారావు:** తీర్మానం చాలా అవసరం

**ఒక గౌరవ సభ్యుడు:** తీర్మానానికి నోటీసు ఇవ్వమనండి..

**శ్రీ ఎన్.టి. రామారావు:** ఇందులో పెద్దగా ముంచుకుపోయింది లేదు పాత ధరలకే ఎరువులు అందజేయాలని తీర్మానం చేయవచ్చు. తీర్మానాన్ని చదువుతాను.

This House resolves...

*(Interruptions)*

**Mr. Speaker:** We must know how to move the resolution under Rule 77.

**Sri N.T Rama Rao:** I am requesting the Chief Minister to just move the resolution.

**Mr. Speaker:** The Government will convey the feelings.

**శ్రీ ఎన్. టి. రామారావు:** రైతులకోసం స్వతంత్ర్యంగా అమాత్రం చేయలేమా? ఆ అధికారం మనకులేదా? పోనీ, ముఖ్యమంత్రిగారినే రిజల్యూషన్ మూవ్ చేయమనండి. I am requesting the Chief Minister to just move the resolution. రిజల్యూషన్ వల్ల వారి చేతులు బలపడతాయి. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని కావేరీ జలాల విషయంలో కర్ణాటక

అసెంబ్లీలో ప్రభుత్వం తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. రైతులకు సంబంధించిన ఈ విషయంలో మాకు ఆ ఘనత అక్కరలేదు, ఆ గౌరవాన్ని ప్రభుత్వమే పొందనివ్వండి. రైతులపట్ల వారికి ఉన్న సద్భావాన్ని ప్రకటించమనండి. ఇందులో తప్పు ఏమిటి? మా ప్రభుత్వ హయాములో రిజల్యూషన్ పాస్‌చేశాం. రిజల్యూషన్ కావాలి.

మేమంతా మద్దతు ఇస్తామంటే ముఖ్యమంత్రిగారు. వద్దంటున్నారు ఏమిటి? సభలో ప్రిసిడెంట్ ఉంది. కో-ఆపరేటివ్ లోన్స్ వైవ్ చేసినప్పుడు కూడా రిజల్యూషన్ పాస్ చేశాం. ముఖ్యమంత్రిగారిని మేము గౌరవిస్తున్నాం. వారు చేసిన పనికి హర్షిస్తున్నాం. రిజల్యూషన్‌ను ప్రవేశపెట్టడానికి అభ్యంతరం ఏమిటి?

**మిస్టర్ స్పీకర్:** సభ ఫీలింగ్స్ చెపుతామన్నారు.

**శ్రీ ఎన్.టి. రామారావు:** 294 మంది ప్రజా ప్రతినిధులు వారిని బలపరుస్తున్నా రైతుల కోసం ఈ తీర్మానాన్ని చేయడానికి అభ్యంతరం ఏమిటి? ఎన్నో పరిశ్రమలకు మనం ఇస్తున్నాం సబ్సిడీలు, అవసరమైతే రైతులకు ఇవ్వాలి. ముఖ్యమంత్రిగారిని పాత ధరలకే రైతులకు ఎరువులను ఇవ్వాలని కోరుతున్నాను. అవసరమైతే సబ్సిడైజ్ చేస్తాము.

అధ్యక్షా, ఈనాడు తెలిసిపోయింది. చెప్పడమే తప్ప చిత్తశుద్ధి లేదు. పెంచిన ధరలకే ఎరువులు కొనాలట? ముందు పెట్టుబడి పెట్టాలట- అసలు తాహతు లేకపోతే ఎక్కడ నుంచి తెచ్చికొంటారు? ప్రభుత్వం తరువాత ఎప్పటికి, ఎక్కడ నుంచి రియంబర్స్ చేస్తుంది? ఇది న్యాయమా? జరుగుతుందా? జరగదు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి లోపించింది. కనీసం తీర్మానాన్ని బలపరుస్తారా అంటే అదీ లేదు దానికి సుముఖంగా లేరు. రైతుల పట్ల ఈ ప్రభుత్వ నిర్లక్ష్య భావానికి నిరసన తెలియచేస్తూ, మా పార్టీ వాకౌట్ చేస్తుంది.

*(తెలుగుదేశం పార్టీకి చెందిన గౌరవ సభ్యులు వాకౌట్ చేశారు.)*

◆◆

సెప్టెంబర్ 10, 1991

# పశువులను కసాయివాళ్ళకు అమ్ముకుని బ్రతికే దుస్థితి వచ్చింది. ప్రభుత్వం కళ్లు తెరవాలి

*(అనంతపురం జిల్లాలోని కరువు పరిస్థితిపై రూలు **304** నిబంధన కింద జరిగిన చర్చ)*

**శ్రీ ఎన్.టి. రామారావు:** ప్రజల సమస్యల విషయంలో, కరువు విషయంలో వాదోపవాదాలు చేయడం సరికాదు మనవిచేస్తున్నాను. ఎప్పుడో ఇదివరకు ధాతనామ సంవత్సరంలో కరువు వచ్చిందన్నారు. చూశాము. ఇప్పుడు ఆ కరువును మించిన పరిస్థితి ఉందని అక్కడివారు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవాలి. సరైన విధానంలో సహాయం అందించవలసిన అవసరం ఉంది. వాతావరణం అనుకూలంగా లేకపోయినా, వర్షాల మీద ఆశతో 6.18 లక్షల హెక్టార్లలో వేసిన వేరుశెనగ మొక్క మొలవలేదు. రూ.150 కోట్ల నుంచి ఎవరి అంచనాలు వారు వేసుకుంటూ రూ.300 కోట్లు, రూ.400 కోట్ల వరకూ కూడా రైతాంగం నష్టపడిందనే విధానం, అలజడి, ఆందోళన అక్కడుందని సవినయంగా మనవి చేస్తున్నాను. వేరుశెనగ మాత్రమే కాదు మిగతా పంటలు కూడా వర్షాభావం వల్ల పూర్తిగా దెబ్బతిన్నాయి. రూ.500 కోట్ల వరకూ ఈ అంచనా ఉంది. ఈ నష్టకరమైన, రైతుకు వచ్చిన ఈ కరువు బాధ అని నేను మనవి చేస్తున్నాను. అనంతపూర్, ధర్మవరం, కనగానపల్లి, రామగిరి మండలాలలో పంటలు పూర్తిగా ఎండిపోయాయి.

అంతేకాకుండా పంచాయతీరాజ్ అధీనంలో గల 171 చెరువులు, నీటిపారుదల శాఖకు చెందిన 484 చెరువులలో ఒక్క చుక్క కూడా నీరులేదు. బావులు, బోర్స్ సైతం, ఇన్నర్ బోర్స్ వేసినా సరే నీటిమట్టము పూర్తిగా తరిగిపోయింది. త్రాగడానికి నీరు ఏమాత్రం కూడా అందించే విధానం లేదనే యధార్థ పరిస్థితి ఉందని సవినయంగా నేను మనవిచేస్తున్నాను. భైరవానితిప్ప ప్రాజెక్టు నుంచి ఆగస్టులో నీరు విడుదల అయినప్పటికీ కూడా అప్పర్ పెన్నార్, చెన్నరాయగుడి ప్రాజెక్టుల క్రిందకు నీరు రాలేదు. వాటిలో పూర్తిగా నీరు అడుగంటింది. గ్రామాలలో వ్యవసాయ

కూలీలు వలస పోతున్నారు. పనులు లేవు. ప్రభుత్వం వారిచ్చిన నోట్‌లో వ్యవసాయ కూలీలకు ప్రస్తుతం సమస్య లేదని ఉంది. ఇకముందు దెబ్బతినవచ్చు అని ఉంది. సెప్టెంబర్‌లో ఉన్నాము. సెప్టెంబర్ మాసంలోనే ఈ విధంగా ఉంటే 'ముందుంది ముసళ్ల పండుగ' ఇంకా వేసవికాలం రాలేదు. వర్షాకాలం తుదిలో ఉన్నాము.

*(ఇంటరప్షన్)*

శీతాకాలం రావాలి. వేసవికాలం రావాలి. అప్పుడు ఏ విధంగా ఉంటుందో మన దౌర్భాగ్య దుర్భర పరిస్థితి అనంతపూర్ జిల్లా ఎప్పుడో ఎడారి కాబోతోంది అన్నది ఈనాడే. ఈ సంవత్సరమే ఇప్పుడే ఎడారిగా మారబోతోందనే పరిస్థితి ఇక్కడుందని సవినయంగా మనవి చేస్తున్నాను. అన్నపూర్ణలాంటి ఈ తెలుగు గడ్డ మీద బిడ్డలందరూ కూడా కరువు రక్కసికి బలై జీవచ్ఛవాలుగా వలసపోవడం చూస్తున్నాము. బళ్ల మీద సంసారాలు పెట్టుకుని వెడుతున్నారు అంటే ఇది మర్యాదా? ప్రతిష్టా? దీని విషయంలో ప్రభుత్వం ఏమాత్రం ఇంతవరకూ నిర్లక్ష్య భావంతో, శ్రద్ధ తీసుకోలేదు. నా పరిపూర్ణమైన అసంతృప్తినీ, బాధనూ వ్యక్తం చేస్తున్నాను.

**పశుగ్రాసం కోసం రైతు మైదుకూరులాంటి దూర ప్రాంతాలకు వెళ్లి ఒక కిలో గడ్డి 3, 4 రూపాయలకు కొనుక్కునే అవసరం వస్తున్న యధార్థ పరిస్థితి మీ దృష్టికి తీసుకువస్తున్నాను. పశుగ్రాసం కొనలేని వాళ్లుఇప్పుడు కొంతమంది చెప్పారు- 4,5,6 వేల రూపాయల ఖరీదుచేసి పశువులను నామమాత్రంగా కసాయివాళ్లకు అమ్ముకుంటున్నారు.**

పశుగ్రాసం కోసం రైతు మైదుకూరులాంటి దూర ప్రాంతాలకు వెళ్లి ఒక కిలో గడ్డి 3,4 రూపాయలకు కొనుక్కునే అవసరం వస్తున్న యధార్థ పరిస్థితి మీ దృష్టికి తీసుకువస్తున్నాను. పశుగ్రాసం కొనలేని వాళ్లు ఇప్పుడు కొంతమంది చెప్పారు– 4,5,6 వేల రూపాయల ఖరీదుచేసి పశువులను నామమాత్రంగా కసాయివాళ్లకు అమ్ముకుంటున్నారు. ధర్మదేవతగా అభివర్ణిస్తున్న పశువులను, పాడిని సంవృద్ధిగా ఇస్తూ పిల్లలకు సంక్షేమం కలిగించే పశువులను ఈనాడు కసాయివాళ్ళకు అమ్ముకుని బ్రతికే దురదృష్టకరమైన పరిస్థితి వచ్చినప్పుడు మరి ఏ విధమైన దుస్థితి ఉందో, ముందు ఏమి జరుగుతుందో ఆలోచించినట్లయితే ఘోరమైన భవిష్యత్తు మన కళ్ళముందు కనిపిస్తుంటే ఒక్కసారి ఆలోచించమని సవినయంగా మనవిచేస్తున్నాను. ఇది కేవలం వారూ, వీరూ అన్న భేదం లేదు. రైతులూ, రైతు కూలీలు అందరూ ఒక్కటే. పేదవాడూ, కలిగినవాడూ ఒక్కటే. అందరికీ పంట పోయింది. వేసిన విత్తనాలు అక్కడే ఎండిపోయాయి. మట్టిలో కలసి పోయాయి. వారు పేదవారు కానీ, సామాన్యుడు కానీ, ఉన్నవారూ, లేనివారూ అన్న భేధాభిప్రాయంతో సమాజాన్ని వీక్షించడం ఏమాత్రం మంచిది కాదన్న సంగతిని సవినయంగా మనవిచేస్తున్నాను.

ఆత్మకూరు, కళ్యాణదుర్గం, కంబదూరు, రామగిరి, కనగాలపల్లి, ధర్మవరం మొదలైన గ్రామాలలో పశుగ్రాసం లభించక పశువులూ, పనులు లేక ప్రజలూ ఈనాడు అలమటిస్తున్నటువంటి దుర్భర దృశ్యాలు గోచరిస్తున్నాయి. సంస్కార రహితమైన పశు కంకాళాలు ఈనాడు కూడా కనిపిస్తున్నాయన్న వార్తలు వస్తున్నాయని కూడా నేను మీకు తెలియజేస్తున్నాను. మల్బరీ ప్లాంటేషన్ పూర్తిగా పోయింది. చేనేత పనివారికి దిక్కులేదు. సిల్క్ ఉత్పత్తి చేసే వారికి ఉపాధి లేకుండా పోయింది. ఈ జిల్లాలో ఈనాడు ఆకలి చావులతో, హాహాకారాలతో ప్రతిధ్వనించే విధానాలు మనకు కనిపిస్తున్నాయి. తీవ్రంగా, అత్యవసర పరిస్థితిగా, క్షామంతో ఎండిపోతున్నటువంటి జిల్లాగా ఆ క్షామానికి సంబంధించిన సంక్షేమ కార్యక్రమాలను, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని నేను అక్కడ హిందూపూర్ నియోజకవర్గ శాసనసభ్యుడిగా ఉన్నటువంటి నేను ఐ యామ్ డిమాండింగ్ ద గవర్నమెంట్. ఇది కేవలం మేము డిమాండ్ చేస్తున్నామంటే మీరు ఒక్కసారి గుర్తించినట్లయితే, గౌరవ సభ్యులందరకూ తెలుసు, ప్రజలకూ తెలుసు, ఇక్కడ ఉండే సభాధ్యక్ష్యులకూ తెలుసు. ఏ విధమైన భావంతో తెలుగుదేశం ప్రభుత్వం 7 సంవత్సరాలలో, అమలుచేసిన విధానాలను కూడా చెప్పవలసిన అవసరం ఉంది.

*(అంతరాయం)*

706 బోర్ బావులకు నిర్మాణం జరిగింది. ఇన్‌వెల్ బోర్ల సంఖ్య 15,243 నిర్మించడం జరిగింది. ఊట చెరువుల సంఖ్య 478కి పెంచడం కూడా జరిగింది. జిల్లాలో సాగులేని లక్ష ఎకరాల భూమికి సాగునీటి సౌకర్యం కల్పించింది తెలుగుదేశం ప్రభుత్వం అని మనవి చేస్తున్నాను. పెన్నా- అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ధర్మవరం కాలువ, యాడికి కాలువ ఉపకాలువ నిర్మాణానికి తెలుగుదేశం ప్రభుత్వం పూనుకున్నది. అంతేకాకుండా కె.సి కెనాల్‌కు కృష్ణా నీరు అందించి ఎడారిగా మారిపోతున్న అనంతపురం జిల్లాకు తుంగభద్ర హై లెవల్ కెనాల్ నుంచి 10 టి.ఎం.సి.లు అందివ్వాలని నిర్ణయం తీసుకున్న ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదేనని మీ స్ఫురణకు తెస్తున్నాను.

పెండేకల్లు రిజర్వాయరు, చాగల్లు, బ్యారేజ్ పనులు చేపట్టింది తెలుగుదేశం ప్రభుత్వం. పెన్నా నదిపై నిర్మించిన రిజర్వాయర్ అంచనాలను సవరించి రూ.18 లక్షలతో పూర్తి చేయడానికి తద్వారా పుష్కలంగా రైతులకు నీరు అందించడానికి కూడా తెలుగుదేశం ప్రభుత్వం కృషి చేసిందని మనవి చేస్తున్నాను. పి.ఎ.బి.ఆర్ కుడికాలువ క్రింద 1990 డిసెంబర్ నాటికి సాగునీటితోబాటు, తాగునీటిని పాక్షికంగా అందించడానికి, 1992 మార్చ్ నాటికి దీని నిర్మాణం పూర్తి ప్రయోజనం కల్పించడానికి కూడా నిర్మాణ సౌకర్యాలు చేపట్టడం జరిగిందని ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నాను. తాడిపత్రి తాలూకాలోని వర్షాభావ ప్రాంతాలలో దాదాపు 50 వేల ఎకరాలలో సాగునీటి సౌకర్యం కల్పించేందుకు సంగ్రహ పథకం చేపట్టింది.

యాడికి కాలువ పనుల ప్రత్యేకతను గుర్తు చేయ సంకల్పించింది. ముదిగుబ్బ మండలంలో అడవి బ్రాహ్మణపల్లి వద్ద నిర్మించదలపెట్టిన మద్దివేలు మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టు నిర్మాణానికి రూ.3 కోట్ల 50 లక్షలు మంజూరు చేయడం కూడా జరిగింది. కాంగ్రెసు ప్రభుత్వం 1978 నుంచి 83 వరకూ జిల్లాలో నీటిపారుదల అభివృద్ధికి రూ.1084.91 లక్షలు వ్యయం చేస్తే, తెలుగుదేశం ప్రభుత్వం 1983 నుంచి 89 వరకూ రూ.2356.25 లక్షలు వ్యయం చేసి ఈ జిల్లాలో కరువువాత పడకుండా రక్షించిందని సగర్వంగా తెలియజేస్తున్నాను. అనంతపురం పట్టణానికి త్రాగునీటి కొరత తీర్చడానికి రూ.2 కోట్లు వ్యయంతో సమగ్ర నీటి సరఫరా పథకం కూడా చేపట్టడం జరిగింది. ఈ పట్టణానికి శాశ్వత నీటి సరఫరా పథకం రూ.100 లక్షలతో ఒక మాస్టర్ ప్లాన్ రూపొందించడం కూడా జరిగింది.

*(అంతరాయం)*

**శ్రీ జె.సి దివాకరరెడ్డి:** కరువు గురించి జరుగుతోందా? గత ప్రభుత్వం గురించి చర్చ జరుగుతోందా? ఏమీ అర్థం కావడం లేదు.

**శ్రీ ఎన్.టి. రామారావు:** అయ్యా, ప్రభుత్వం మర్చిపోయిన దానిని నేను గుర్తుచేస్తున్నాను. ఐ డిమాండ్ ఫర్ ది కంప్లీషన్ ఆఫ్ ఆల్ దీజ్ థింగ్స్. కేవలం నాకోసం చెప్పడం లేదు. అనంతపురం జిల్లాలో ఉన్న సామాన్య ప్రజలకోసం చెబుతున్నాను. త్రాగునీటి కోసం దప్పికతో ఎండిపోయిన గొంతుకల గురించి చెబుతున్నాను. గుంతకల్, తాడిపత్రి, ధర్మవరం, కదిరి, రాయదుర్గం పట్టణానికి సమగ్ర నీటి సరఫరా పథకాలు మాస్టర్ ప్లాన్ కూడా తెలుగుదేశం ప్రభుత్వం చేసింది. తెలుగుదేశం ప్రభుత్వ హయాములో భారీ, మధ్యతరహా పరిశ్రమలు 7 నుంచి 13, చిన్నతరహా పరిశ్రమలు 1586 నుంచి 2002కు పెంచింది. దీనివల్ల వేలాదిమందికి ఉపాధి సమకూరింది. హిందూపూర్ మండల పరిశ్రమల అభివృద్ధి కోసం 760 ఎకరాల స్థలం ప్రత్యేకంగా కేటాయించడం జరిగింది. అక్కడ పరిశ్రమలు నెలకొల్పడానికి రాయితీలు కల్పించడం జరిగింది. శాశ్వత గృహ నిర్మాణాలు ఏవీ? ఎక్కడ ఉన్నాయీ? రూ.16.41 కోట్ల వ్యయంతో 22,751 శాశ్వత గృహాలు వెనుకబడిన తరగతుల వారికి నిర్మించాం.

అధ్యక్షా, ఈ రోజున కేవలం కంఠశోషను వెలిబుచ్చడానికి కారణం ఇవాళ ప్రభుత్వం చేయగలదా అని అడుగుతున్నాను. ఎందుకు ఉద్యోగాలు కల్పించలేకపోతున్నారు? త్రాగడానికి ఎందుకు నీరు ఇవ్వలేకపోతున్నారు? మేము ఆనాడు గాలేరు, నగరి కాలువ ద్వారా 27 కోట్ల ప్రజానీకం త్రాగడానికి మంచినీరు ఇవ్వడానికి తలపెట్టాము. దాని విషయం ఇప్పుడు ఒక్క మాట అయినా మాట్లాడలేదే? ఫలానా కాలానికి మేము పూర్తి చేస్తామని చెప్పలేదే? ఇది ప్రజలను మోసం చేయడం, దగాచేయడం కాదా? అనంతపురం జిల్లా హిందూపురం నియోజకవర్గం

సభ్యుడిగా అడుగుతున్నాను. I am demanding it. why are you neglecting? ఎందుకు వారు దీనిని విమర్శిస్తున్నారు? ఎడారిగా మారబోతున్న ఈ జిల్లాను మనం సముద్ధరించాలనే బద్ధకంకణంతో మాట్లాడుతున్నాను. కానీ కేవలం ఇది నాకోసం కాదు. ఏ ఒక్కరి కోసం కాదని మనవిచేస్తున్నాను.

ఇకపోతే ఇప్పుడు తీవ్రంగా నేను కొన్ని డిమాండ్‌లను సభద్వారా మనవిచేస్తున్నాను.

(1) అనంతపురం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి. ఆ కరువు జిల్లాకు సంబంధించిన సంక్షేమ కార్యక్రమాల్లో అభివృద్ధి పనులన్నీ చేపట్టాలి.

(2) ఉచితంగా పశుగ్రాసం అందించాలి. గతంలో అనంతపురం జిల్లాకు కరువు వచ్చినప్పుడు తెలుగుదేశ ప్రభుత్వం పశుగ్రాసం గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి రైలు మీద పంపించడం జరిగింది. అది గుర్తు చేస్తున్నాను. కాబట్టి అక్కడ పశువుల క్యాంపులు నిర్వహించాలి. పశుగ్రాసం ఉచితంగా సరఫరా చేయాలి. పశువులు చావకుండా.. కసాయివాళ్ల పాలు కాకుండా ఆపాలని డిమాండ్ చేస్తున్నాను. కరువు పనులు వెంటనే చేపట్టాలి. ధర్మవరం, యాడికి కాలువ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు ఉన్నాయి. ఈనాడు తిండిలేక, పంటలేక, గతిలేక బాధపడుతున్న వారికి పూర్తిగా సహాయం ఇవ్వడానికి, వారికి భత్యం చెల్లించడానికి త్వరితగతిన కరువు పనులు చేపటాలి. దీనివలన రెండు విధాలుగా లాభం ఉంటుంది 1. పనిలేని వారికి ఇంత కూడు పెట్టినట్లు అవుతుంది. 2 ఉన్న పనులన్నీ కూడా సత్వరంగా చేయించుకునే అవకాశం కలుగుతుంది. కాబట్టి ఈ అవకాశాన్ని చెడులో మంచిగా, మంచిలో చెడుగా ఎక్కడికక్కడే కూర్చొని మంచిగా ప్రజా సంతుష్టి కోసం, ప్రజా అభ్యుదయం కోసం, రాష్ట్ర హితవుకోసం దీనిని చేపట్టాలని సవినయంగా మనవిచేస్తున్నాను.

కలిగినవారు, లేనివారు, పేదవారు, ధనవంతులు అనే భేదం లేకుండా ఇక్కడ రైతులందరూ బాధ పడుతున్నారు. పంటలు పోయాయి. నోటి దగ్గర కూడు పోయింది. కాబట్టి వెంటనే వారికి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలి. నిత్యావసర వస్తువులను అందరికీ సరఫరా చేయాలి. రెండు రూపాయలకు కిలో బియ్యం సరఫరా చేయాలి. పచ్చ కార్డులు ఉన్నాయా, లేదా అనే విషయం కాదు చావకుండా మనుషులను ఆదుకోవాలి. అభిమానంతో అడగలేదు గదా అన్న భావం లేకుండా అందరికీ అందించాలని ఈ సందర్భంగా నేను డిమాండ్‌ను వ్యక్తం చేస్తున్నాను.

ఈనాడు పంటలు అన్నీ ఎండిపోయి పూర్తిగా విత్తనాలు భూమిలో కలిసి పోయిన వారికి ఉచితంగా విత్తనాలు ఇవ్వాలి. ఎరువులు అందివ్వాలి. ఈ విధంగా వ్యవసాయోత్పత్తులను, ఆహారోత్పత్తులను ప్రోత్సహించాలని మరొకసారి డిమాండ్‌గా తెలియజేస్తున్నాను. పి.ఎ.బి.ఆర్. ధర్మవరం కుడి కాలువ, యాడికి కాలువ, మద్దిలేరు, పెద్దపల్లి, పుట్టకనుమ ప్రాజెక్టు, నిర్మాణానికి

నిధులను అందించి ఈ ప్రాజెక్టులన్నిటినీ కరువు నివారణ ఫండ్ క్రింద చేపట్టి సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నాను. తెలుగుగంగ, గాలేరు-నగరి-హంద్రీ-నీవా ప్రాజెక్టులను సత్వరం పూర్తిచేసి నగరాలకు కనీసం త్రాగేనీటి సౌకర్యం అయినా కలుగజేయాలని నేను సవినయంగా తెలియజేస్తున్నాను. రాయలసీమ ప్రాంతానికి నీటి కొరత నివారించి, సస్యశ్యామలం చేయాలి.

భూగర్భ జలాలను పూర్తిగా వెలికితీసే సదుపాయాలు, సౌకర్యాలను పేద రైతాంగానికి కలిగించాలని నేను డిమాండ్ చేస్తున్నాను. అనంతపురం జిల్లాను ఎడారిగా మారకుండా కాపాడడానికి రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో ఏర్పాటుచేసిన విధంగా ఒక కరువు అభివృద్ధి సంస్థను ఏర్పాటు చేయాలని కూడా నేను డిమాండ్ చేస్తున్నాను. రైతులకు వడ్డీలేని దీర్ఘకాలిక రుణాలు ఇవ్వాలి. వారి దగ్గరవున్న డబ్బు పోయింది. విత్తనాలు మట్టిపాలు అయ్యాయి. ఈనాడు తిరిగి వారు కొనుక్కునే స్థితిలో లేరు కాబట్టి వారికి దీర్ఘకాలిక రుణాలు చెల్లించే విధంగా పూర్తిగా వడ్డీ లేకుండా రుణాలు రైతులకు అందించాలని మరొక డిమాండ్ చేస్తున్నాను. భారీ పరిశ్రమలు వీలుగా ఉంటే తక్షణం ఎప్పుడైనా సరే ఉద్యోగానికి అవకాశం ఉంటుంది. కాబట్టి అలాంటి పరిశ్రమలను పూర్తిగా నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాను.

1972వ సంవత్సరంలో ఈ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించినప్పటికీ ప్రభుత్వం కరువు నివారణకు సక్రమమైన, ప్రత్యామ్నాయమైన పథకాలను ఇంతవరకు అమలు జరపలేదు. ఇప్పటికైనా అందుకు పూనుకోని పక్షంలో భవిష్యత్తులో తీవ్రమైన పరిణామాలు ఏర్పడుతాయి. "చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకొని ప్రయోజనం లేదు." ఇప్పటికే జరిగిన నిర్లక్ష్యానికి ఆలోచించవలసిన అవసరం ఉన్నది. ఒక జిల్లా విషయమే మనం మాట్లాడుతున్నాము. మిగిలిన జిల్లాల్లో కూడా ఏ విధమైన సంక్షోభకరమైన పరిస్థితులు ఉన్నాయో భవిష్యత్తులో ఏ విధంగా ఈ ప్రభుత్వం సమాధానం చెబుతుందో ఆలోచించుకోవాలని నేను సవినయంగా మనవి చేస్తున్నాను.

మరి అనంతపురం జిల్లాలో బంగారు గనులు ఉన్నాయి. బైరైటీస్ ఉన్నాయి, ఇనుప ఖనిజాలు ఉన్నాయి. మరి అక్కడున్న సంపత్తులు పూర్తిగా జిల్లా అభివృద్ధికి వినియోగించే విధానంగా ఒక ఆదర్శవంతమైన జిల్లాగా ఎప్పుడు ఎడారిగా మారుతుందో అనుకున్న జిల్లాను ఏ విధంగా మనం ఈ ప్రజాస్వామ్యంలో తీర్చిదిద్దగలుగుతాము. ఏ విధంగా ఆ జిల్లాను సస్యశ్యామలం చేయగలము అవేశానికి బద్ధులమై మన పేద ప్రజానీకాన్ని, పేద రైతాంగాన్నీ ఉద్ధరించాలని సవినయంగా ప్రభుత్వానికి మనవిచేస్తూ, ఇది కేవలం హాస్యాస్పదంగా, నవ్వులపాలుగా చేసే విధం కాదని హృదయంలో ఉన్న బాధను, తీవ్రమైన ఆందోళనను మా జిల్లా ప్రజలపట్ల మాకు కలిగిన అప్యాయతను, సానుభూతిని కూడా ఈ సందర్భంగా వ్యక్తం చేస్తూ వారిని వెంటనే ఆదుకోవాలని, ఆదుకునే ఆదేశాలు అధికారులకు ఇవ్వాలని కూడా నేను మనవిచేస్తూ, సెలవు తీసుకొంటున్నాను.

◆◆

మార్చి 18, 1992

# అన్నం పెట్టే రైతుకు మీ పాలనలో అన్యాయం జరుగుతోంది

*(చెరకుకు ప్రోత్సాహక ధర ఉపసంహరణపై రూలు 304 నిబంధన కింద జరిగిన చర్చ)*

**శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, ప్రధానంగా రైతులపట్ల ప్రభుత్వ విధానం చూస్తే, ప్రభుత్వం రైతుకోసం ఏమిచేస్తున్నదో స్పష్టమైంది. మీకు తెలుసు, మనది వ్యవసాయ క్షేత్రం, మన జాతీయాదాయంలో 55 శాతం వ్యవసాయరంగం నుంచే వస్తోంది. నూటికి సుమారు 80 శాతం మంది ప్రజానీకం గ్రామాలలో నివసిస్తున్నారు. అలాంటప్పుడు రైతులకు సౌకర్యాలు కల్పించడం, రైతులు అభివృద్ధి చెందేందుకు కృషిచేయడం, వారి సంక్షేమాన్ని గమనించడంపోయి, రైతులకు ఇవ్వవలసిన ప్రోత్సాహకాలు ఇవ్వకుండా కేవలం పరిశ్రమలవారికి, పెట్టుబడిదారి వర్గాలకు ప్రయోజనం కల్పిస్తున్నారే తప్ప రైతును సరైన గౌరవంతో చూడడంలేదని చెప్పడానికి అనేక నిదర్శనాలు ఉన్నాయని మనవిచేస్తున్నాను.

ఈనాడు కేవలం ఉత్పత్తులద్వారా మనకు సుమారు వెయ్యి కోట్ల రూపాయల మేరకు ఆదాయం వస్తున్నప్పుడు చెరుకు ఉత్పత్తుల్ని పెంచడానికి, చెరకును ఉత్పత్తి చేస్తున్న రైతును గుర్తించి, గౌరవించి వారిని ముందుకు నడిపించడానికి తగిన విధానాలను అనుసరించడం ఎంతైనా అవసరమని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. పంటల్ని పండించే రైతుల్ని గుర్తించి వారి సంక్షేమం కోసం, వారి పిల్లల చదువు మొదలుకొని ఆరోగ్యం వరకూ అన్ని విషయాల్లో పరిపూర్ణమైన శ్రద్ధ తీసుకొని సహకారరంగాన్ని అభివృద్ధి చేసే విధానాన్ని అలోచించాలే తప్ప కేవలం అధికారుల్ని వేసి, వారి పెత్తనంలో సహకార రంగం నడవాలంటే ఇది జరిగేది కాదు.

దీనివల్ల రైతుకు పూర్తిగా అన్యాయం జరుగుతోందని సవినయంగా మనవిచేస్తున్నాను. తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడు ఏ సంస్థకైనా నష్టం వస్తే దానిని నడిపించే మేనేజింగ్ డైరెక్టర్‌ను అక్కడినుంచి తొలగించాలని నిర్ణయం తీసుకొన్న విషయాన్ని మీకు గుర్తు చేస్తున్నాను. ఈనాడు ప్రభుత్వం ఆ విధానాన్ని ఎందుకు తీసివేసిందో అర్థం కాదు. అయితే ఈ బదిలీ అనేది నివారణకు

మార్గంకాదు. ఈ చెడును ఇంకోచోటికి బదిలీచేస్తున్నాం తప్ప జరిగే చెడును మనం పూర్తిగా నివారించలేకపోతున్నామన్న విషయాన్ని గౌరవ మంత్రివర్యులకు ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. మీరు రెస్పాన్సిబిలిటీస్ ఇవ్వండి. ఐ.ఏ.ఎస్. ఆఫీసర్లంటే ప్రభుత్వ కార్యకలాపాల్ని నిర్వహించాలేకానీ ఇండియన్ బిజినెస్ సర్వీస్ ఆఫీసర్లుగా కాదని మనవిచేస్తున్నాను. వారిని ఫ్యాక్టరీల మేనేజింగ్ డైరెక్టర్లుగా నియమించడంవల్ల సహకార రంగంలోని ఈ సంస్థలకు నష్టం వస్తోంది దీనికి మీరు ఏం చేయబోతున్నారు? ఏ రకంగా మీరు రైతును గుర్తించబోతున్నారు? ఏవిధంగా వారికి అన్యాయం జరుగుతోందన్న వివరాలు మంత్రిగారి వద్ద ఉంటే వారు తెలియజేస్తే సంతోషిస్తాను. ఇదివరకు ప్రతి ఫ్యాక్టరీకి 5 కిలోమీటర్ల పరిధి వరకు రోడ్లు వేయించాం.

అయితే మీరు ఎన్ని రోడ్లు వేయించారు? ఏవిధంగా రవాణా సదుపాయాలు కల్పించారు? ఈనాడు చెరకు రైతు పరిస్థితి చూస్తే అతనికి ఇవ్వవలసిన 20 రూపాయల సబ్సిడీ తీసివేశారు. 15 రూపాయల ఇన్సెంటివ్ కూడా తీసివేశారే! అసలు ఏవిధంగా రైతు బ్రతుకుతాడు? ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు ప్రకటించిన విషయాన్ని కూడా మీకు గుర్తు చేస్తున్నాను. రైతుకు సబ్సిడీ విధానాన్ని తీసివేశామన్నారు. ఏమిటీ అన్యాయం? అహర్నిశలు రెక్కలు ముక్కలు చేసుకొని దేశానికింత కూడుపెట్టే అన్నదాత. మనం ఈనాడు డబ్బుతో బ్రతకడంలేదు, అన్నం తిని బతుకుతున్నాం, ఈరోజున అలాంటి అన్నం పెట్టే రైతుకు అన్యాయం జరుగుతోందంటే, సబ్సిడీకి కూడా వారు నోచుకోవడం లేదంటే రైతుపట్ల ప్రభుత్వం ఏరకమైన చిన్న చూపుచూస్తోందో మంత్రివర్యులు గుర్తించాలని మనవిచేస్తున్నాను. మీ కాంగ్రెస్ పార్టీ విధాత అయిన మహాత్మాగాంధీ రైతే దేశానికి వెన్నెముక, పల్లెటూళ్లే పట్టుగొమ్మలు అని చెప్పారు.

ఈనాడు అది ఏమై పోయింది? పల్లెటూళ్లు స్మశానాలైపోయాయి. ఈనాడు పంటలు పండించేవాడు, వ్యవసాయ వృత్తి చేసేవాడు గతిలేక చేస్తున్నాడనే విధానంలో వ్యవసాయం రంగం ఉండిపోయిందే తప్ప రైతుకు గౌరవం లేదు. సరైన ఆదాయం రావడంలేదు. వ్యవసాయోత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర లభించడం లేదని అంకెలవల్ల స్పష్టమవుతోందని మనవిచేస్తున్నాను. 1970-71లో 150 రూపాయల ఉన్న వ్యవసాయోత్పత్తుల ధరలు 1992 నాటికి 190 రూపాయలకు అంటే కేవలం 40 రూపాయలు మాత్రం పెంచారు. అధ్యక్షా ఈనాడు ధరల పెరుగుదల ఏవిధంగా ఉందని మిమ్ముల్ని అడుగుతున్నాను. 150 రూపాయలకు, 190 రూపాయలకు మధ్య వ్యత్యాసం ఎంత? ఈనాడు ధరలు ఎలా పెరుగుతున్నాయి, మార్కెట్ ఏవిధంగా ఉంది? పేద ప్రజానీకం ఏవిధంగా బాధపడుతున్నదో గుర్తించి రైతుకు గిట్టుబాటు ధరను పెంచవలసిన ఆవశ్యకతను గుర్తించాలని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. మీరు నిర్దిష్టమైన విధానాన్ని అనుసరించండి. రైతు మారుమూల గ్రామాల్లో ఉన్నాడు. రైతు అమాయకుడు. అతడి గొంతు మూగబోయింది.

ఇక్కడికి వచ్చి మనను అడగలేదు – అని నిర్వచించడం మన దేశాభ్యుదయానికిగానీ, మనకుగానీ మంచిదికాదని మనవిచేస్తున్నాను. ఈ ప్రభుత్వానికి రైతుపట్ల ఏవిధంగా అశ్రద్ధ ఉందో మీకు గుర్తు చేస్తున్నాను. ప్రభుత్వం ఏ ఆధారంపై టన్నుకు 295 రూపాయల ధరను నిర్ణయించిందో చెప్పండి. ఈనాడు మిగతా రాష్ట్రాలలోని పరిస్థితి చూడండి. మన రాష్ట్రం ఒక్కటే కాదు, భారతదేశంలో అనేక రాష్ట్రాలు ఉన్నాయి. అక్కడ వివిధ రకాల పంటల్ని పండించే రైతులు ఉన్నారు. అక్కడి ప్రభుత్వాలు రైతులకు ఏవిధమైన పోత్సాహకాలు ఇస్తున్నాయో, వారిని ఏ రకంగా గౌరవిస్తున్నాయో, చెరకు లాబీలు అభివృద్ధికి ఏరకంగా దోహదపడుతున్నాయో చూడండి. కానీ మన రాష్ట్రంలో ఆ రకంగా ఎందుకు చేయలేకపోతున్నాయో ఒక్కసారి గమనించాలని మనవిచేస్తున్నాను. సోదరుడు వెంకటేశ్వరరావుగారు మహారాష్ట్రలోని పరిస్థితి గురించి చెప్పారు. ఒక్కసారి దయచేసి అక్కడికి వెళ్లిరండి. తెలుగుదేశ ప్రభుత్వ హయాములో ఒకసారి ఇక్కడికి పంపించాం. అందువల్లే ఇక్కడ కర్షక పరిషత్‌ను ఏర్పాటు చేశాం. కానీ అలాంటి పరిషత్‌లు మనకు మంచిది కావు, రైతుకు పెత్తనం ఇవ్వడం మనకు అక్కరలేదు.

అంతా మనమే మింగాలి, మనమే నిర్ణయించాలి, రైతులకు కేవలం గాడ్‌ఫాదర్‌లా మనం ఉండాలన్న ప్రభుత్వ నిరంకుశ విధానమే మనకు ఉండాలి. రైతుకు స్వాతంత్ర్యాన్ని ఇచ్చామా అంటే లేదు. ఈనాడు పిన్నులు తయారుచేసే చిన్న పారిశ్రామిక వేత్తకు సైతం ధరను నిర్ణయించే హక్కు ఇచ్చామే కానీ అలాంటి హక్కు రైతుకు ఇవ్వగలిగామా చెప్పండి? వారు 350 రూపాయలు అడుగుతున్నారే, మనం 293 రూపాయలు ఏ ఆధారంపై నిర్ణయించాం? ఈనాడు రైతు వరకు పండించకపోతే ఎక్కువ ధర చెల్లించి విదేశాలనుంచి దిగుమతి చేసుకొంటామంటారు. ఏమండీ, స్వతంత్ర భారతదేశంలో మన డబ్బంతా ఇతర దేశాలకు గుమ్మరించే బదులు రైతుకు కూసింతైనా ఆధారం కల్పించి అతడిని గౌరవించలేమా అని అడుగుతున్నాను.

**ఈనాడు పిన్నులు తయారుచేసే చిన్న పారిశ్రామిక నేతకు సైతం ధరను నిర్ణయించే హక్కు ఇచ్చామే కానీ అలాంటి హక్కు రైతుకు ఇవ్వగలిగామా చెప్పండి? వారు 350 రూపాయలు అడుగుతున్నారే, మనం 293 రూపాయలు ఏ ఆధారంపై నిర్ణయించాం? ఈనాడు రైతు వరకు పండించకపోతే ఎక్కువ ధర చెల్లించి విదేశాలనుంచి దిగుమతి చేసుకొంటామంటారు.**

ఇదే చెరకు టన్ను ధర ఉత్తరప్రదేశ్‌లో 440 రూపాయలు, బీహారులో 432 రూపాయలు, పంజాబులో 430 రూపాయల నుంచి 490 రూపాయలు చేశారు. అదేవిధానంలో మధ్యప్రదేశ్‌లో 390 రూపాయల నుంచి 450 రూపాయలకు పెంచితే కర్ణాటకలో 360 రూపాయలకు పెంచారు. తమిళనాడులో 300 రూపాయల ధర ఉంది. కానీ ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం 295 రూపాయలేనా? ఇది ఏవిధంగా న్యాయం? ఈనాడు రైతులు శ్రమిస్తున్నారు. కూలీ పెరిగిపోయింది.

ఇలాంటి పరిస్థితుల్లో వారి ఉత్పత్తులకు నిర్ణయించే ధరలు ఇలాగే ఉంటే రైతు పొలం అమ్ముకొని బ్రతకాలే తప్ప పంటమీద ఆధారపడి బ్రతుకుతాడన్నది కలగానే మిగిలిపోతుందని మనవిచేస్తున్నాను. వ్యవసాయదారులకు మేము సబ్సిడీ ఇవ్వము అని స్టేట్‌మెంట్ ఇచ్చారే. ఎందుకు ఈ భ్రమకు లోనవుతున్నారో అర్థంకావడంలేదు. ఈనాడు అనేక మందికి అనేక కన్సెషన్స్ ఇచ్చారే. చిన్న సిమెంటు ఫ్యాక్టరీలకు సేల్స్‌టాక్స్ కన్సెషన్ ఇచ్చారే! అదేవిధంగా ఇతర దేశాలనుంచి 5 కిలోల చొప్పున బంగారం ఉచితంగా తెచ్చుకోవచ్చునంటున్నారే. ఎన్నికోట్ల రూపాయల నల్లధనం ఉన్నా తెచ్చుకోండి. మేము అడగం అని ఇతర దేశాల నుంచి పెట్టుబడిదారులను, సంపన్న వర్గాల వారిని రమ్మని, దేశాన్ని గుత్తకు తీసుకొండని అంటున్నారే! ఆనాడు ఏ నోటితో బ్రిటిష్‌వారి నిరంకుశత్వాన్ని ఎదిరించి మన దేశ పొలిమేరలు దాటించామో ఈనాడు, అదే నోటితో ఈ కాంగ్రెస్ పిలుస్తోంది "రండి, రండి, మా దేశాన్ని ఆక్రమించండి.

ఇక్కడ పరిశ్రమల్ని పెట్టండి" అని పిలుస్తోంది తప్ప ఈనాడు దేశంలో ఆహారాన్ని పండించే రైతుకు మాత్రం ఏ ఆసరా కల్పించలేకపోయిందని మీకు సవినయంగా మనవి చేస్తున్నాను. (తెలుగుదేశం పక్షంనుంచి చప్పట్లు) మనకు స్వతంత్ర్యం ఉంది. ఇక్కడ ప్రతివాడూ పౌరుడే, ప్రతివాడికీ హక్కు ఉంది. సోషల్ జస్టిస్ అంటే సామాజికపరమైన న్యాయం అందరికీ జరగాలి ఎవరు ఏమి ఉత్పత్తి చేసినా, మన దేశాన్ని ఎవరు అభివృద్ధి చేసినా వారందరికీ ఇన్సెంటివ్స్ కల్పించాలి. కానీ కేవలం పెట్టుబడిదారులకు సంపన్న వర్గాలకు, వైట్‌కాలర్‌వారు మాత్రమే ఎప్పుడూ ఈ ప్రభుత్వానికి కనిపిస్తున్నారు. ఏ.సి రూముల్లో కులకడం, మన దగ్గరకు వచ్చి కల్లిబొల్లి కబురు చెప్పి ఇష్టం వచ్చినట్లు రాయితీలు పుచ్చుకోవడం, వారియొక్క గొప్పతనానికి మనం పొంగిపోయి వారికి లోబడిపోవడం – ఇదీ మన దేశానికి పట్టిన అనర్థమని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను.

ప్రభుత్వం యొక్క సవతి తల్లి ప్రేమను చెప్పుతున్నాను. చెరుకు రైతు తక్కువ ఉత్పత్తి చేయాలా? వారి నోటిలో మన్ను కొట్టుకుపోవాలండీ? దీనినే మనం శాసిస్తున్నామా అని మనవిచేస్తున్నాను. ఎన్నో అవకతవకలు ఉన్నాయి. గౌరవ మంత్రిగారికి మనవిచేస్తున్నాను, ఇప్పటికైనా రైతుపట్ల గౌరవం ఉందా? ఒకసారి నిజాం షుగర్ ఫ్యాక్టరీలో జరిగే అన్యాయం చూడండి? ఒక ఫ్యాక్టరీలోలాభం వస్తుంది ఇంకో ఫ్యాక్టరీలో ఏమీ లాభం రావడంలేదు. హళ్లికి హళ్లి సున్నకు సున్నా' తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో నిజాంసాగర్‌లో నీరు లేనప్పుడు చెరుకు ఏవిధంగా కాపాడామో గుర్తుచేస్తున్నాను. బోర్‌వెల్స్ వేసి నీరును సరఫరా చేశాము. మీరు ఎన్ని బోర్‌వెల్స్ వేశారో చెప్పండి? చెరుకు రైతుల చెరుకు పంట నిర్వీర్యమై నిస్తేజమై పోయింది అని ఒకసారి గుర్తు చేస్తున్నాను. ఇటువంటి దైన్యాన్ని కల్పించవలసిన అవసరం ఉందా? వారు పెట్టే కూడు తింటున్నాం. అన్నం పెట్టే చేయిని కరవడం ధర్మం కాదు. మన సంప్రదాయం కాదు, మన ఆచారము కాదు పూర్తిగా రైతు గౌరవాన్ని గుర్తించాలి.

‘రైతు దేశానికి వెన్నముక’ అని తెలుసుకోవాలి. కోట్లు ఉన్నా, కోట్లు తినరు, అన్నమే తింటారు. మంచి చెప్పండి. ఆ రైతుకు కావలసిన సంక్షేమం కల్పించండి? ఈనాడు సోదరులందరూ చెప్పారు. మా కోసం కాదు, రైతుల కోసం చెప్పుతున్నాను. ఏదైనా సరే ఇది మోసం చేసే ప్రభుత్వం. ఇది దేశాన్ని అమ్ముకునే ప్రభుత్వం అని ప్రజలలో రాకముందే గుర్తించండి? తెలుగుదేశం అని ఈర్ష్య అక్కరలేదు రైతు సంక్షేమానికి పూనుకోండి? మంచి పేరే తెచ్చుకోండి? రైతును ఉద్ధరించండి? పూజ్య బాపూజీ, కాంగ్రెస్ నాయకుడు దేశ ప్రగతి కోసం ఆనాడని నిర్ధారించారు. ‘పల్లెటూళ్లుదేశానికి పట్టుగొమ్మలు’ అని పల్లెటూరులో ఉన్న రైతు సంక్షేమాన్ని చూడండి? అని మీద్వారా సవినయంగా మనవిచేస్తున్నాను.

◆◆

మార్చి 23, 1992

# కాంగ్రెస్ పాలనలో ఇప్పటికి 100 మంది చేనేత కార్మికులు చనిపోవడం దారుణం!

*(చేనేత పనివారి సమస్యలపై రూలు 304 క్రింద జరిగిన చర్చ)*

**శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, గౌరవనీయులైన సభ్యులు అతి ముఖ్యమైన విషయం మాట్లాడుతున్నారు. ఒక వర్గం వారికే జరుగుతున్న అన్యాయం కానీ, ఆకలి చావుల విషయం కానీ ఈ హౌస్‌లో చెప్పుకోక ఎక్కడ చెప్పుకోమంటారు? ఇవాళ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నది. తమరికి తెలుసు. ఈనాడు వారు సర్క్యులేట్ చేసిన నోట్‌చూస్తే అదే సెల్ఫ్ ఎక్స్‌ప్లనేటరీ అని కూడా మనవి చేస్తున్నాను. ఈ ఆకలిచావుల విషయంలో వారు మరణాలను ధృవపరుస్తూ, మరణాలు ఆకలి మరణంగా జరగలేదని తెలియజేశారు. ప్రభుత్వం ఏమో అది ముఖ్యంగా వృద్ధాప్యం, దీర్ఘకాల అస్వస్థతవల్ల మరణాలు జరిగాయని అంటున్నది. అక్కడ విరుద్ధంగా జరిగాయి. కేవలం నదిలో దూకి చస్తున్నారు. ఆత్మహత్య అని వారు చెబుతూ ఉంటే వారికి సమయం ఇవ్వకుండా కేవలం తమరు కూడా ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడం మాకు తృప్తికరంగా లేదు సవినయంగా మనవిచేస్తున్నాను. కాబట్టి పూర్తిగా వారి భావాన్ని వ్యక్తీకరించడానికి అవకాశం కల్పించాలి. అది మాకు ఉండే హక్కు. ప్రజా సమస్యలపైన స్పందిస్తున్నాం. కేవలం మా స్వార్థానికి కాదు. అక్కడ ఉన్న చేనేత పనివాళ్ళ కోసం, ఎవరికి వారే నోరుమూస్తూ, ఆదేశాలు ఇస్తే మంచిది కాదు. ప్రజా సమస్యలు చెప్పువ్వండని సవినయంగా మనవిచేస్తున్నాను.

అధ్యక్షా, మన దేశానికి, మన జాతికి ఎంతో ప్రాముఖ్యత, కీర్తి గడించినటువంటి వర్గం ఇది. అనాదిగా వారు చేసిన సేవలు మనం విస్మరించలేము. ఎప్పుడో పాశ్చాత్య దేశాలలో నాగరికత తొంగిచూడక ముందే మన దేశం నుంచి చీనీ చీనాంబరములు రోము నగరానికి పంపినటువంటి సంఘటన మనకు చరిత్రాత్మకంగా ఉంది. అటువంటి కార్మికవర్గానికి, ఆ వ్యవస్థకు ఏ విధంగా సహాయం చేయాలనేది, న్యాయం చేయాలనేది మన ముందు ఉన్న సమస్య.

ఎన్నో వర్గాలకు, వివిధ సంస్థలకు ఆదరణ ఇస్తున్నాం. ఎన్నో ఇన్‌సెంటివ్స్ ఇస్తున్నాము. నిష్పక్షపాతంగా ఆలోచిస్తే – చేనేత పారిశ్రామికులు కూడా వ్యక్తి, శ్రమ మీద ఆధారపడి ఉన్నారు. వారికి ఏదైనా సహాయం కావాలని. వారికి చేయవలసిన అవసరం ఉందనే పరమార్థాన్ని గుర్తించుకోవలసిన అవసరం ఉంది. మీరే అడిగారు ఏమి ఇస్తే ఆ పరిశ్రమ బాగుపడుతుందని అడిగారు. చాలామంది గౌరవసభ్యులు చెప్పారు. వారు చావకుండా వారిని బ్రతికించమని చెప్పారు. వారు ఒక్కటే కోరిక కోరుతున్నారు. వారు ఏ విధంగా చావకుండా బ్రతికించాలంటే – ఆనాడు తెలుగుదేశం ప్రభుత్వం చెప్పింది. సబ్సిడీ విధానంతో 60 లక్షల చీరలు, 50 లక్షల ధోవతులు వీరితో తయారుచేయించడం జరిగింది సగము సబ్సిడీ ధరకే. ఇందులో రెండు ప్రయోజనాలు కలిగించాము. పేదవారికి బట్ట సగము ధరకు అందజేశాము. రెండవది చేనేత కార్మికులకు చేతినిండా పని ఇవ్వడము.

కానీ ఈ ప్రభుత్వము ఈ విధానాన్ని పూర్తిగా నిర్లక్ష్యము చేయడం జరిగింది. చేనేత కార్మికులను పూర్తిగా నిర్లక్ష్యము చేస్తున్నారని మనవిచేస్తున్నాను. అదేవిధంగా అప్పటి తెలుగుదేశం ప్రభుత్వము ఈ బట్టను కొనుగోలు చేయడం గురించి అధికారులకు పండగ పబ్బాలకు చేనేత వస్త్రాలే కొనుగోలు చేయాలనే ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా స్కూళ్లలో చదివే పిల్లలకు ఉచిత విధానంగా ఇచ్చే బట్టల విషయంలో పూర్తిగా ఆ విషయాన్ని పరమార్థంగా ఆలోచించి చేనేత పరిశ్రమలో ఉత్పత్తి అయిన బట్టకే ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. అదేవిధంగా 40,60 కౌంట్ ఉన్న నూలు కావాలి. 120, 140, 150 కౌంట్ ఉన్న నూలుకాదు కావలసింది. విలాసాల గురించి నేసే బట్ట కాదు కావలసింది. 40,60 కౌంట్ గల నూలు బట్టలనే తయారుచేయాలి అని మిల్లుల మీద ప్రభుత్వము వారు ఒత్తిడి తీసుకుని రావాలి. 40 శాతము బట్ట అయినా చేస్తేగానీ, పై కౌంట్ గల నూలు చేయడానికి వీలులేదనే నిబంధనల అమలుచేస్తే తప్ప వారు మాట వినేటట్లు లేరు. వారి లాభాలు వారు చూసుకుంటున్నారే తప్ప చేనేత కార్మికుల సమస్యలు విచారించేలా వారు లేరు. దీని విషయంలో ప్రభుత్వం కట్టుదిట్టాలు చేయాలి. పరిశ్రమలకు ఇన్సెంటివ్స్ ఇస్తున్నారు. సేల్స్ టాక్సులో రాయితీ ఇస్తున్నారు. నీటికి రాయితీ, స్థలానికి రాయితీ ఇస్తున్నారు. అన్నింటికి రాయితీలు ఇచ్చి పోత్సహిస్తున్నారు.

ఆ విధంగా పెట్టుబడి వర్గాలను, సంపన్న వర్గాలను, ఆధునిక వర్గాలను ప్రోత్సహిస్తూ అదే ఆచారంగా చేస్తూ ఉన్నప్పుడు ఈ కార్మికులను ఎందుకు పోషించలేకపోతున్నారనే ప్రశ్న ఈ సందర్భంగా వేసుకోవాలని మనవిచేస్తున్నాను. వారు వాడే నూలు సబ్సిడీ ధరకు ఇవ్వాలి. ఇన్సెంటివ్స్ ఇచ్చి వారినే ఆదుకోవాలి. అది మన ధర్మం అనుకోవాలి. సాటి మానవుడికి, సాటి శ్రమజీవిని పోషించడం మన ధర్మం అనుకోవాలి. అదే స్వతంత్ర భారతదేశం యొక్క విధానం అనుకోవాలి. కేవలం వారికి మెహర్బానీగా చేస్తున్నామని అనుకోవడానికి వీలులేదు. వారు కూడా

స్వతంత్ర్య భారత పౌరులు. వారు కూడా బ్రతకడానికి అధికారం ఉంది. బ్రతికించవలసిన బాధ్యత ఈ ప్రభుత్వానికి ఉంది. ఇప్పటికైనా వారి జీవితాన్ని సంక్షేమ పరిచేందుకు వారికి రసాయనాలు సబ్సిడీ ధరకు ఇవ్వండి. ఎన్ని దుబారా ఖర్చులు చేయడంలేదు? ఎన్ని విధాల ఎంతమందినో పోషిస్తున్నాము. చేనేత కార్మికులను పోషించితే తప్పు ఏమిటని అడుగుతున్నాను. వారు చేనేత వృత్తి మీద ఆధారపడినవారు, వారు శ్రమ మీద ఆధారపడినవారు సార్. వారు మిల్లులతో పోటీచేయలేరు. వారు నేయవలసిన రకాలేమిటో నిర్దేశించండి. టవల్స్, లుంగీలు, మరొకటో అని నిర్ణయించి, ఆ నిర్ణయించినవి మిల్లువారు నేయడానికి వీలులేదని ఆంక్షలు పెట్టండి. ఈ విధముగా చేనేత కార్మికులను ప్రోత్సహించి వారు నేసిన వివిధ వస్త్రాలను ఎప్పటికప్పుడు మిగిలిపోకుండా కొనుగోలు చేస్తూ ఉంటే వారికి ఉపాధికలుగుతుంది. భృతి ఏర్పడుతుంది.

**తెలుగుదేశం ప్రభుత్వ హయాములో ఎన్నోవేల ఇండ్లు కట్టించాము. ఆనాడు మామూలు ఇంటికి 7000 రూపాయలు ఇస్తూ ఉంటే 10 వేల రూపాయలకు పెంచి వీరికి ఇండ్లు కేటాయించడం జరిగింది. వారికి వర్కుషాప్స్ పెట్టాలి. పనిచేసుకునే అవకాశం కల్పించాలి. పనిచేస్తేనే తిండి దొరుకుతుంది. వీరికి అనువైన ఇండ్లు కేటాయించాలాని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను.**

అదేవిధంగా వారికి ఇంటి సౌకర్యాలు కల్పించాలి. తెలుగుదేశం ప్రభుత్వ హయాములో ఎన్నోవేల ఇండ్లు కట్టించాము. ఆనాడు మామూలు ఇంటికి 7000 రూపాయలు ఇస్తూ ఉంటే 10 వేల రూపాయలకు పెంచి వీరికి ఇండ్లు కేటాయించడం జరిగింది. వారికి వర్కుషాప్స్ పెట్టాలి. పనిచేసుకునే అవకాశం కల్పించాలి. పనిచేస్తేనే తిండి దొరుకుతుంది. వీరికి అనువైన ఇండ్లు కేటాయించాలని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. వారు తయారుచేసే వస్త్రాల విషయంలో కొనేవారు లేరు స్టాక్సు మురిగిపోతున్నాయి. గొప్పగా చెప్పుకొంటున్నారు పాత బకాయిలు చెల్లించివేసినామని వారికి ఎన్నాళ్లకు ఇచ్చినారు మీరు? వారు చచ్చిన తరువాత ఇచ్చారు. ఈ డబ్బు ఎవరు కట్టుకుని పోతారు? 60 నుంచి 100 మంది వరకు చనిపోయారు. గౌరవసభ్యులు ఎప్పుడో చెప్పారు. కాలువలో దూకిన సభ్యులను కూడా నివారించకుండా ఈనాడు వారికి డబ్బులు ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నారు. ఎప్పుడో పాత బకాయిలు ఇచ్చినారట, ఎవరు ఈనాడు స్టాక్సు కొనుగోలు చేస్తారు? ఏమై పోయారు వారందరూ? ఎప్పటికప్పుడు బాధ్యత మీద ఆప్‌కో వస్త్రాలు కొనుగోలు చేయాలి. వీరికి సహకార సంఘాలు ఉన్నాయి.

ఎవరైతే పనిచేస్తారో నిర్దుష్టంగా వారికి మెంబర్‌షిప్ ఇవ్వాలి. అంతేగానీ దగాకోరులు, దళారీలు ఈ సంఘంలో చేరడం, పూర్తిగా సంఘం యొక్క ఉద్దేశ్యాలను, సిద్ధాంతాలను నీటిపాలు చేయడం జరుగుతున్నందున నేను ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. ఇటువంటి నిర్దిష్టమైన చర్యలు తీసుకున్నప్పుడు చేనేత కార్మికులు కూడా మన స్వతంత్ర భారతదేశంలో బ్రతుకుతారు,

తింటారు, కాబట్టి, ప్రభుత్వం అమలుచేయాలి. ఆ విధముగా చేస్తామని హామీ ఇవ్వాలి. ఆనాడు సంభవించినటువంటి ఆకలి చావులపట్ల ప్రభుత్వము సానుభూతి ప్రకటించాలి తప్ప, ఏదో రోగము వలన, ముసలితనము వలన చనిపోయారు అని చెప్పి మొసలికన్నీళ్లు కార్చడం, లేకపోతే విమర్శలు చేస్తే, వారిని అవమానపరిచినట్లవుతుంది. ప్రభుత్వం ఇటువంటి దుర్విధానానికి దిగకూడదు. నైతికంగా ప్రభుత్వం అంటే ప్రజలకు సంబంధించినటువంటిది. ప్రజాస్వామ్యం అంటే ప్రజలకు సంబంధించినది. అన్ని వర్గాల ప్రజలు సంక్షేమంగా ఉండేటట్లు చూడవలసిన బాధ్యత స్వీకరించాలని నేను సవివరంగా మనవిచేస్తున్నాను.

ఈ చేనేత కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ఈ సమస్య తీవ్రమైన, ఉద్రిక్తమైన రూపము దాల్చుతుందని మనవిచేస్తున్నాను. ఎప్పుడు ప్రజలు తిరగబడతారో తెలియదు. నేను చెప్పిన విషయాలు పరిగణనలోనికి తీసుకొనకపోతే బయట ఏవిధంగా జరుగుతోందో మాకు తెలియదు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మేము చెప్పినటువంటి సలహాలన్నీ ఒకచోట క్రోడీకరించి చేనేత పరిశ్రమను ఏవిధముగా ఉద్ధరించదలచుకున్నారో ప్రభుత్వము తీసుకునే చర్యలు, నిర్ణయాలు తెలియచేయాలని కోరుతున్నాను. వారి సంక్షేమం కొరకు కార్యక్రమాలు చేపట్టి కృషి చేయడం చాలా అవసరమని తెలియచేస్తూ, ఈ అవకాశం ఇచ్చినందులకు అధ్యక్షుల వారికి ధన్యవాదాలర్పిస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

◆◆

మార్చి 24, 1992

# ముడుపులు తీసుకుని ఈ కాలేజీలు ఇచ్చారని ఘంటాపథంగా అంటున్నారు

*(రాష్ట్రంలో ప్రైవేటు వైద్య, దంత వైద్య కళాశాలను మంజూరు చేయుటపై జరిగిన లఘు చర్చ)*

**శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, అతి ముఖ్యమైన విధానం మీద మనం ఈనాడు చర్చ చేయబోతున్నామని ముందుగా తెలియజేస్తున్నాను. ఇది విధానసభ కాబట్టి విధానాలను పూర్తిగా చర్చించి, సామాజికపరమైన న్యాయం కల్పించడం, వర్గ చైతన్యాన్ని కల్పించేటటువంటి స్పందన కల్పించడం మన ధర్మం కాబట్టి. అది నేను వేరేగా చెప్పనక్కర లేదు. రాజ్యాంగ పరిరక్షణ మన కర్తవ్యం. అన్ని స్థాయిలలో మనం ప్రమాణం చేశాం. అటు శాసనసభ్యులుగానీ, ఇటు స్పీకర్‌గారు కాని, ముఖ్యమంత్రిగారు కానీ అందరూ కూడా ఈ దేశం యొక్క రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని ప్రమాణంచేసి వచ్చాం.

*(ఈ సందర్భంలో ముఖ్యమంత్రి సభ నుంచి వెళ్లిపోయారు).*

If the Chief Minister is not there I will not speak.

గౌరవమంత్రి రోశయ్యగారు చెప్పారు. కానీ ఇది ఒక మంత్రివర్యులకు, ఒక డిపార్ట్‌మెంట్‌కు సంబంధించింది కాదు. ఇది జాతి సమస్య. మన రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ సంబంధించిన సమస్య. అతి ముఖ్యమైన ప్రజా సమస్యపై ఈనాడు మాట్లాడుతున్నాం. కాబట్టి దానికి సరైన గౌరవం ఉండాలి. మేము చెప్పేది గోడలకు కాదు. కాబట్టి వినేవారు లేకపోయినా, వినే ఓపిక వారికి లేకపోయినా ప్రయోజనం లేదు. రాష్ట్రం యొక్క పేరు ప్రఖ్యాతులు కాపాడాలి, సామాన్య మానవుడికి న్యాయం చేయాలనే విచక్షణ వారికి లేనప్పుడు మాట్లాడడం అనవసరం.

**శ్రీ. కన్నా లక్ష్మీనారాయణ, క్రీడలు, యువజన శాఖామంత్రి:** అధ్యక్షా, సినిమాలలో యాక్ట్ చేశాను. ఇంకా సినిమాలలోనే ఉన్నానంటే ఎట్లా?

**శ్రీ ఎన్.టి. రామారావు:** ప్రజాస్వామ్యాన్ని కించపరచవద్దు. నేను సినిమా నటుడినే సినిమా నటుణ్ణని తెలిసే ప్రజలు నాకు అధికారాన్ని ఇచ్చారు. ఈనాడు నా వృత్తినిగానీ, ప్రజల యొక్క ఉద్దేశాన్ని గానీ కించపరిచే అధికారం అధికార సభ్యులకు లేదని మనవిచేస్తున్నాను. Is it the fundamentals of democracy? Let them know it.

*(ముఖ్యమంత్రి సభలోకి ప్రవేశించారు).*

**శ్రీ ఎన్. జనార్ధనరెడ్డి:** ఈ సభలో నేను కూర్చున్నంత సేపు మరి ఎన్నడూ ఏ ముఖ్యమంత్రీ కూర్చోలేదు. నాకు బాగా తెలుసు. గౌరవ ప్రతిపక్ష సభ్యులు మాట్లాడినా, మరొక వ్యక్తి మాట్లాడినా వినాలనే కోరిక ఉంది. నా ఛాంబర్‌లో ప్రతి స్పీచ్, అన్నీ ఉంటాయి. కానీ, ఎన్నడైనా రామారావుగారు, సభా నాయకుడు మాట్లాడితే కూర్చున్నారా అండి?

**శ్రీ ఎన్.టి. రామారావు:** ఐ హేడ్ – నేను కూర్చున్నాను. గో టు ది రికార్డ్.

అధ్యక్షా, ఆశేష ఆంధ్ర ప్రజానీకం దృష్టి అంతా దీనిపైన ఉన్నది. మనకు ఏవిధమైన విజ్ఞత ఉన్నది? ఈ శాసనసభ నిర్వహిస్తూ, శాసనం చేస్తాము. సామాన్య ప్రజానీకానికి న్యాయం కలుగచేస్తామని వారందరూ ఎదురు చూస్తున్నారని కూడా ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. ముందు మన యొక్క ప్రాథమిక బాధ్యతను నిర్వహించాలి. ఏవిధంగా మనం ప్రమాణం చేశాము, ఏవిధమైన ప్రమాణం తీసుకున్నామో కూడా మీకు తెలుసు.

*(ఇంటరప్షన్)*

రాజ్యాంగాన్ని పరిరక్షిస్తూ, ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తూ, పేద ప్రజల యొక్క – సమాజంలో వ్యత్యాసాలను దూరం చేస్తామని మనం చేసిన ప్రమాణాన్ని గుర్తుంచుకోవాలని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. అందుకనే ఇప్పుడున్నటువంటి ఉద్యమం గురించి ప్రత్యేకంగా ఏమీ చెప్పనక్కరలేదని అది తమ ద్వారా తెలియచేస్తున్నాను. పార్టీకి సంబంధించింది కాదు, ముఖ్యంగా ప్రతిపక్షానికి సంబంధించింది కాదు, నిన్న పత్రికా ముఖంగా తెలియచేశాము. ఇది విద్యార్థులు చేస్తున్నటువంటి ఉద్యమం తప్ప రాజకీయపరమైన పార్టీలు నిర్వహించే ఉద్యమం కాదని నేను స్పష్టం చేయడం కూడా జరిగిందని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. ఈనాడు అతి ముఖ్యమైన వర్గము విద్యార్థులు, భావిపౌరులు. విజ్ఞత సంపాదించుకోవడానికి అహర్నిశలు కృషిచేస్తూ ఈ దేశం ప్రతిష్టను కాపాడేవారు బజారులో పడ్డారంటే ఏ విధమైన ఇబ్బందిలో ఈనాడు విద్యార్థి లోకం ఇరుక్కున్నదో ఒకసారి నిష్పక్షపాతంగా గమనించవలసి ఉన్నదని మీకు సవినయంగా

మనవిచేస్తున్నాను. రాజ్యాంగ పరిరక్షణ, రాజ్యాంగ విధానం మనం సమకూర్చవలసిన సౌకర్యాలు. నిన్నగాక మొన్న సుప్రీంకోర్టువారు విచారణ చేసేటప్పుడు నాలుగు అంశాలు మేము ప్రశ్నాపూర్వకంగా వేసుకుని చర్చిస్తున్నామని అన్నారు.

సుప్రీంకోర్టు వారు ఒక ప్రశ్నవేసుకొని, కొన్ని ఇష్యూష్ మీద వారు చర్చ జరిపి, తీర్పు ఇవ్వడం జరిగింది. దానిలో మొదటిది రాజ్యాంగం ప్రకారం మన ప్రజలందరికీ కూడా విజ్ఞత, విజ్ఞానం సంపాదించుకోవడానికి అర్హత కల్పిస్తున్నామా, లేదా ఆలోచించుకోవాలనేది; Is there a right to education granted to the people of India under the Constitution? If so, does the concept of capitation fee influences the same? The charging of capitation fee in consideration of admission to educational institutions is arbitrary, unfair, unjust and as such, violates the equality clause contained in article 40 of the Constitution.

> నిన్నగాక మొన్న సుప్రీంకోర్టువారు విచారణ చేసేటప్పుడు నాలుగు అంశాలు మేము ప్రశ్నాపూర్వకంగా వేసుకుని చర్చిస్తున్నాము అన్నారు. సుప్రీంకోర్టు వారు ఒక ప్రశ్నవేసుకొని, కొన్ని ఇష్యూష్ మీద వారు చర్చ జరిపి, తీర్పు ఇవ్వడం జరిగింది. దానిలో మొదటిది రాజ్యాంగం ప్రకారం మన ప్రజలందరికీ కూడా విజ్ఞత, విజ్ఞానం సంపాదించుకోవడానికి అర్హత కల్పిస్తున్నామా, లేధా అన్నది.

ఇది రాజ్యాంగపరంగా వారికి చర్చించే అంశంగా పూర్తిగా మననం చేసుకోవాలని మనవిచేస్తున్నాను. సుప్రీంకోర్టు తీర్పు ఇస్తూ Supreme Court Judgement No. 2. The Supreme Court has judiciously noticed mushroom growth of ill-equipped, under-staffed and unrecognised educational institutions in Andhra Pradesh, Tamil Nadu, Maharastra, Bihar and other States. Obviously, the field of education is found to be fertile, perrenial and profitable business with least capital outlay. The Court observed. Now, a question has arisen in my mind, sir. The business of the Government has become business.

I am asking one straight question. The business of the Government is business only? If it is business of the Government, it is all right. If it is not business and if it is for the Constitution.... రాజ్యాంగ పరిరక్షణ బాధ్యతతో కూడి, సర్వ ప్రజానీకానికి సమమైన న్యాయం, సరైన ఫలం ముట్టచెప్పడమే ధ్యేయం అయితే, ఈ నిర్ణయాలు మంచివా కావా అనేది పూర్తిగా ఆలోచించి చేయవలసిన బాధ్యత

ఎంతైనా ఉందని ఈ సందర్భంగా సవినయంగా మనవిచేస్తున్నాను. ఈనాడు, ముఖ్యంగా శ్రీకాకుళం నుండి, ఆదిలాబాదు నుండి, నెల్లూరు నుండి, మారుమూల ప్రాంతాల నుండి విద్యార్థులంతా కాలేజీలను వదిలిపెట్టి....

చదువులు వదిలిపెట్టి ఇక్కడకు వచ్చారు. వారిపై ఏమాత్రం మర్యాద లేకుండా లాఠీఛార్జ్ చేసి, భాష్పవాయువును ప్రయోగించి, ఎన్నోవిధాల ఇబ్బందిపెట్టి అవసరం అయితే కాలేజీలను మూసివేస్తామని, పరీక్షలను ఆపివేస్తామని థ్రెటెన్ చేశారు. ఇది మనందరికీ తెలిసిన సత్యం. అంతకంటే అధ్వాన్నం ఈనాడు దానికి పోటీగా - The Government is conducting a rally. ప్రభుత్వం అంటే ఒక వర్గ నాయకత్వం కాదు, ప్రజా నాయకత్వం అని ఇప్పుడే చెప్పారు. ఏడుకోట్ల తెలుగు ప్రజానీకానికి ప్రభుత్వం ప్రాతినిధ్యం వహిస్తున్నది అని. అంతే తప్ప కేవలం ఒక పార్టీ సమస్య వచ్చినప్పుడు ఆ పార్టీకి ఎదురుగా నిలబడడానికి పార్టీని సృష్టించి ఈ విధంగా విద్యార్థి లోకంలో చీలిక తెచ్చి విద్యార్థులను ఇక్కడకు పిలిపించి ఈ విధంగా చేయడం, ర్యాలీ నిర్వహించడం ఇది ప్రభుత్వ విధానం కాదు, కాదు అని చెబుతున్నాను.

*(ఇంటరప్షన్స్)*

సమస్యలను చీలికలవల్ల పరిష్కరించడం కాదు. మీరు పెద్దలు, మీ అబ్బాయిలు, మా అబ్బాయిలు, అందరూ చదువుకుంటున్నారు. ఆలోచించండి. Please, I am appealing to all of you. దయచేసి ఆలోచించండి. ఇది ఒకరి సమస్య కాదు మా పార్టీ, మీ పార్టీ కాదు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు అందరినీ పిలిపించి ఆలోచిద్దాము. వర్గాలు, చీలికలు తెచ్చి ర్యాలీలు నిర్వహించి ఉద్యమంగా మార్చడం మంచిదా, మీరే ఆలోచించండి. ఈ ప్రభుత్వం మీదే. మీరు ఉద్యమం పేరుతో are you not conducting the agitation? I am asking you straight. you answer me.

*(ఇంటరప్షన్స్)*

అధ్యక్షా, దీనికి తార్కాణం చెబుతున్నాను. గౌరవనీయ రాజీవ్‌గాంధీగారు క్యాపిటేషన్ ఫీజు ఉండకూడదని అన్నారు. మీకు తెలిసే ఉంటుంది. ఇప్పుడు ప్రధానమంత్రి శ్రీ పి.వి. నరసింహారావుగారు హ్యూమన్ రిసోర్సెస్ మినిస్టర్‌గా ఉన్నప్పుడు దాన్ని ఆమోదించారు. బలపరిచారు. ఈనాడు ఏమి చేశారు మీ సిద్ధాంతం? ఏ గాలిలో వదిలిపెట్టారు ఏ నీటిలో కలిపారు? ఏ మట్టిలో పాతిపెట్టారు? అదేవిధంగా వెంగళరావుగారు, మీ ముఖ్యమంత్రిగారు 1977లో 1200 మెడికల్ సీట్లు ఉంటే "అనవసరం, నిరుద్యోగం ఎక్కువ అవుతుంది ఇన్ని అవసరంలేదు" అని 900 సీట్లకు కుదించారు. అవునా కాదా? చెప్పండి. ఇంతవరకు ఇన్ని తార్కాణాలు ఉండగా, మనకు తొమ్మిది (9) మెడికల్ కాలేజెస్, ఒక డెంటల్ కాలేజ్ ఉంటే, ఏమి

ముంచుకుపోయిందని 12 మెడికల్ కాలేజెస్, 8 డెంటల్ కళాశాలలు ఇవ్వవలసి వచ్చింది? అంత అవసరం ఏమి ఉన్నది? ఎన్ని సూచనలు వచ్చాయో గుర్తించారా? నేను ముఖ్యమంత్రిగారిని చెప్పవలసిందిగా అడుగుతున్నాను అధ్యక్షా, ఇప్పుడు ఉన్నటువంటి యధార్థాన్ని ఆలోచించినట్లయితే, ఇప్పుడు 172 మెడికల్ కళాశాలలు ఉంటే 20 వేల మంది తర్ఫీదు పొంది, డాక్టర్స్‌గా చెలామణి అవుతున్నవారు బయటకు వస్తూ ఉంటే, నాలుగు లక్షల మంది డాక్టర్లు, ప్రైవేటు ప్రొఫెషనల్స్ కానివ్వండి, ప్రైవేటు ప్రాక్టీసు చేసేవారు కానివ్వండి ఉన్నారు.

లక్ష్మణస్వామి మొదలియార్ గారి రిపోర్టు ప్రకారం, 3500 మందికి ఒక డాక్టరు ఉన్నట్లు నిర్ధారణ అయింది. 6వ పంచవర్ష ప్రణాళిక నాటికి ఇది సాధించాము. 8వ ప్రణాళిక మ- ఎసాయిదాలో 'కొత్తగా డాక్టర్స్ అక్కరలేదు కళాశాలలు కూడా అవసరంలేదు' యునానీ, ఆయుర్వేదం, హెూమియో కళాశాలలు 200 ఉన్నాయి. వాటన్నింటితో కలిపితే సుమారుగా 6 లక్షల మంది డాక్టర్లు తయారవుతారు. అప్పుడు 500 మందికి ఒక డాక్టర్ అవుతాడు ఏ విధంగా కూడా ఇది అంగీకారయోగ్యం కాదని రిపోర్టు ఇచ్చారు ప్లీజ్ గో త్రూ ఇట్. కళాశాలలు అవసరంలేదు, ఇప్పుడు ఉన్న డాక్టర్లే నిరుద్యోగులుగా ఉన్నారు. వారికే సరియగు సదుపాయాలను కలిగించలేకపోతున్నాము. ఉద్యోగాలు లేక వారు ఇతర దేశాలకు వెళ్లి అక్కడ బ్రతకవలసిన అవసరం కలుగుతోంది.

ఇక్కడ మనం ఉన్న ఇబ్బందులను చూస్తూ ఉండగా, ప్రత్యేకంగా కొత్త కళాశాలలు పెట్టడానికి గానీ, మరోదానికి గానీ అవసరంలేదని క్లియర్‌గా రిపోర్టు ఉన్న సంగతి మనవిచేస్తున్నాను. అంతే కాకుండా ఇండియన్ మెడికల్ కౌన్సిల్ వారు ఇదేమాట నిర్దిష్టంగా చెప్పారు. ఏ విధంగా కూడా ప్రభుత్వం చేసేది తాము అంగీకరించడంలేదని వారు చెప్పారు. వారి నుండి ఒక్క కళాశాలకు నా హయాంలో అనుమతి కొరకు తిప్పలు పడవలసి వచ్చింది. 'అది టీచింగ్ హాస్పిటల్స్‌కు ఎఫిలియేట్ చేసే విషయంలో, విజయవాడలో ఇ.యస్.ఐ గవర్నమెంట్, రైల్వే, ఈ మూడు హాస్పిటల్స్ కలిపితే, అప్పుడు పోటాపోటీగా సరిపోయింది. ఎంతో కష్టపడి అంగీకారం పొందవలసివచ్చింది. మీరు ఏ ఆలోచనలో ఇన్ని కళాశాలలకు అనుమతి ఇచ్చారు? 100 మంది విద్యార్థులు ఉంటే, 750 బెడ్స్ ఉండే టీచింగ్ హాస్పిటల్ కావలసివుంటుంది.

ఈనాడు మీరు అనుమతి ఇచ్చిన కాలేజీల విషయంలో ఈ వనరులన్నీ ఉన్నాయా? ఎంత స్థలం ఉంది? బిల్డింగులు కడుతున్నారా? జాయిన్ అయిన వారు ఏమి చేస్తారు? ఎక్కడ కూర్చుంటారు? వసతులు ఏవీ కల్పించకుండా, గబుక్కునే నిర్ణయం చేశామనడం సమంజసం కాదు. There is no proper assessment. సరైన విధానంలో దీన్ని ఆలోచించాలి. అవసరాన్ని గుర్తించాలి చదువు కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లి చదువుకుంటున్న వారు కనబడుతున్నారు తప్ప ఆ డబ్బు ఎక్కడకు పోతుందో గమనించారా? ఆ రాష్ట్రంలో ఉండే

ప్రభుత్వానికి పోవడంలేదు. అక్కడి ప్రజాస్వామ్యానికి పోలేదు. అక్కడ ఉండే దగాకోరులకు, విద్యను అమ్ముకోవడమే వ్యాపారంగా పెట్టుకున్న వారి జేబులు నింపుకోవడానికి పోయిందని సవినయంగా మనవిచేస్తున్నాను.

కాబట్టి, దీని విషయంలో పూర్తిగా మనం ఆలోచించి నిర్ణయం తీసుకోవడం మంచిది. కేవలం ప్రలోభాలకు లోనై ఏమైనా చేశామంటే, అనాలోచితంగా ఏమైనా చేశామంటే మన జాతి భవిష్యత్తుకే తిలోదకాలు ఇచ్చినట్లు అవుతుందని సవినయంగా మనవిచేస్తున్నాను. A new generation of non-academic enterpreneurs... దీనివల్ల విద్యాలయాలు నడపడానికి వచ్చేవారు ఎటువంటి వారవుతారు? కేవలం విద్యను, విజ్ఞానాన్ని అమ్ముకునే వారు అవుతారు కానీ పూర్తిగా గౌరవంతో ఆ విద్యకు, విద్యావిధానానికి ప్రతిష్ఠతెచ్చే వారు మాత్రం కాదని నేను సుస్పష్టంగా మనవిచేస్తున్నాను. శాశ్వతంగా కళాశాలలు ఉంచుకుని పాతుకుని పోతే బాగుంటుందని, ఎన్నికలలో డబ్బుకావాలి కనుక తెచ్చుకోవచ్చునీ. వారి మద్దతులో చేయవచ్చునీ దగుల్బాజీ ఆలోచనలు వస్తున్నాయని ప్రజలు చెప్పుకుంటున్నారు. నేను అనడంలేదు. శాశ్వతంగా కాంగ్రెస్ ఈ గడ్డమీద తిష్టవేయడానికి వారికి పెట్టుబడిదారులు కావాలని, డబ్బు ఇచ్చేవారు కావాలని, గెలిచేది కేవలం కండబలంతో, ధనబలంతో అనే ఉద్దేశంతో ధనబలం తెచ్చుకునే ఏర్పాటు చేసుకునే విధానమనీ ఎంతోమంది అంటూ ఉండగా నేను విన్నాను. ఇది యదార్థం అవునా, కాదా వారే చెప్పాలి. ఈ విధమైన అనుమానాలకు ఆస్కారం ఉందా లేదా?

*(ఇంటరప్షన్స్)*

అయ్యా. ఇది ఈ రాష్ట్రానికి ఈనాడు పట్టిన దౌర్భాగ్యం. ఇంకొకటి అన్నారు. ఇది గురుదక్షిణ కాదు, పొట్టకొట్టే దక్షిణ. అసలు గురువుకి అర్థం తెలుసా. శ్రీరామచంద్రమూర్తి వశిష్ఠుని వద్ద చదువుకున్నారు. దానికి, దీనికి పోలుస్తారా? కృష్ణుడు సాందీపుని వద్ద చదువుకున్నారు. దానికి, దీనికి పోలుస్తారా? క్యాపిటేషన్ గురుదక్షిణకు సమానమట. దయచేసి వినండి. Is it prestigious for us? Is the statement prestigious for us? I am asking. ఈనాడు ఈ ప్రభుత్వ హయాములో మెడికల్ కాలేజెస్ అంటే మెడికల్ స్టోర్స్ కంటే అన్యాయం అయిపోయింది. మరొకటి ముఖ్యంగా గుర్తించాలి. కర్ణాటక ప్రభుత్వం క్యాపిటేషన్‌ను నిర్దేశిస్తూ 1989 జూన్ 5వ తేదీన జారీచేసిన నోటిఫికేషన్‌ను సుప్రీంకోర్టు 1992, జూలై 30న కొట్టేసింది.

కనీసం దానిని చూశారా? సుప్రీంకోర్టు, హయ్యెస్ట్ ఇన్‌స్టిట్యూషన్ మన భారతదేశంలోనే అత్యంత ప్రాధాన్యత వహించిన న్యాయస్థానం. మనం దానిని గౌరవిస్తున్నామా? హైకోర్టుకు అప్పీల్ చేశారన్నారు. చేసుకోవచ్చు. తప్పులేదు. వారు న్యాయం అయిన తీర్పు ఇస్తారు. కర్ణాటకకు సంబంధించిన తీర్పు ఉండగా, అది కర్ణాటకకు చెందింది, ఆంధ్రప్రదేశ్‌కు వేరే తీర్పుకావాలి అని

అనడం అవివేకంగా నేను భావిస్తున్నాను. ఈ దేశం మనది, న్యాయం ఒకటే, ధర్మం ఒకటే ధర్మవిరుద్ధంగా, న్యాయవిరుద్ధంగా కోర్సులు, కోర్టులూ తగాదా పడవని నా పరిపూర్ణమైన, పవిత్రమైన విశ్వాసం. ఆగస్టు, 5వ తేదీన హైకోర్టు డివిజనల్ బెంచ్ దీని విషయంలో కొత్తగా స్థాపించబడిన మెడికల్ అండ్ డెంటల్ కాలేజెస్‌లో విద్యార్థులను చేర్చుకోరాదని హెచ్చరించిందని అన్నారు. ఎందుకు ఆ విధంగా హెచ్చరించిందో ఆలోచించారా? విద్యార్థుల జీవితాలతో ఆడుకోదలచారా? విద్యతో ఆడుకోదలచారా? విద్యార్థులను నీటముంచదలచారా? విద్యావ్యవస్థను నేలలో పాతిపెట్టదలచారా? నేను అడుగుతున్నాను.

రాష్ట్రంలో విద్యార్థి సంఘాలున్నాయి. 30 సంఘాలున్నాయి. మెడికల్ కాలేజ్ విద్యార్థులతో మాట్లాడారా? డాక్టర్లు సలహా ఇచ్చారా? వారిని సంప్రదించారా? డాక్టర్లు, డాక్టర్స్ యూనియన్స్, నిరుద్యోగ డాక్టర్లు ఈ కాలేజీల స్థాపనను తీవ్రంగా ప్రతిఘటించారే? ఉద్యమాలు చేశారే? can't we show our courtesy for them? వారిని పిలిపించలేమా? అడగలేమా? తెలుసుకోలేమా? మనం తప్పులు చేస్తాం. కానీ సవరించుకోవడం మనం ధర్మం. తప్పుచేసే విధానాన్ని నేను బాధపడడం లేదు. తప్పుని తెలిసిన తరువాత, తెలిపేవారు ఉన్న తరువాత, దానిని సవరించుకోవడం చాలా ముఖ్యమైన విషయం. అది దైవత్వానికి సంబంధించిన విషయం. అటువంటిది ఏమైనా చెయ్యగలిగారా అని నేను మీ ద్వారా అడుగుతున్నాను. తమ్ముళ్లూ ఆలోచించండి. మనందరం కూడా ఆలోచిద్దాము. ప్రజలు అంటున్నారు. ముడుపులు తీసుకుని ఈ కాలేజీలు ఇచ్చారని ఘంటాపథంగా అంటున్నారు.

**ప్రజలకు న్యాయం చెయ్యాలి. పెద్దలు మహాత్మాగాంధీ గారిని చెప్పుకుంటున్నాము. శివాజీని చెప్పుకుంటున్నాము. బుద్ధుడిని చెప్పుకుంటున్నాము. ఆ కోవలోకి ఎదగాలని ఎందుకు ప్రయత్నించరు? ప్రజలు ఎన్నుకున్నారు. వారు ఇచ్చిన గౌరవానికి తగినవారం అని ఎందుకు నిరూపించుకోలేము? మంచితనంతో ఎందుకు ప్రవర్తించరు ? స్వార్థంతో ఎందుకు కుళ్ళి చస్తున్నారు?**

*(ఇంటరప్షన్స్)*

పత్రికలలో స్టేట్‌మెంట్స్ వచ్చాయి. కాంగ్రెస్ శాసన సభ్యులే ఈ మాటలు అన్నారు. మేము అనలేదు. వారే అనుకుని భుజాలు తడుముకోవడం ఏమిటి? ఇంత సంక్షోభంలో పడినా కూడా ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదు. బధిరుల ముందు శంఖారావంగా ఉంది. విద్యార్థుల మీద పోలీసులను ప్రయోగిస్తున్నారు. అకడమిక్ ఇయర్ రద్దు చేస్తామని బెదిరిస్తున్నారు. ప్రైవేటైజేషన్ పేరుతో విద్యను కమర్షియలైజ్ చేస్తామంటే ఆశక్తులుగా మేము ఉండి చూడలేము. విద్యార్థులనూ, వారి తల్లిదండ్రులను దోచుకునే విధానానికి స్వస్తి చెప్పాలి. ఈనాడు దేశానికి స్వతంత్ర్యం వచ్చింది. ప్రజాస్వామ్యం వచ్చింది ప్రజలను దోచుకోడానికి కాదు.

ప్రజలకు న్యాయం చెయ్యాలి. పెద్దలు మహాత్మాగాంధీ గారిని చెప్పుకుంటున్నాము. శివాజీని చెప్పుకుంటున్నాము. బుద్ధుడిని చెప్పుకుంటున్నాము. ఆ కోవలోకి ఎదగాలని ఎందుకు ప్రయత్నించరు? ప్రజలు ఎన్నుకున్నారు. వారు ఇచ్చిన గౌరవానికి తగినవారం అని ఎందుకు నిరూపించుకోలేము? మంచితనంతో ఎందుకు ప్రవర్తించరు ? స్వార్థంతో ఎందుకు కుళ్ళి చస్తున్నారు? నేను అడుగుతున్నాను. సుప్రీంకోర్టు జస్టిస్ మిస్టర్ కులదీప్ సింగ్, జస్టిస్ ఆర్.ఎం. సహాయ్ తీర్పులో ఇచ్చిన కొన్ని అభిప్రాయాలను నేను సభ దృష్టికి తీసుకురావలసిన అవసరం ఉంది. అది నా బాధ్యత దయచేసి వినండి. "We hold that every citizen has a right to education under the Constitution."

కాంగ్రెస్ వారు విడుదల చేసిన ఎలక్షన్ మేనిఫెస్టోలో చెప్పారు. ప్రైవేటు విద్యాసంస్థలు ఇప్పుడు వసూలు చేస్తున్న ఫీజులు ఎక్కువ మోతాదులో ఉన్నాయి. వాటిని క్రమబద్ధంచేసి, తగ్గించడం కాంగ్రెస్ ధ్యేయం అని హామీ ఇచ్చారు. అప్పుడు ఈ మాట చెప్పి, ఇప్పుడు ఈ పని చేస్తున్నారు. There is your manifesto, my dear brother. This is your manifesto. I am quoting, Sir. "The State is under obligation to establish educational institutions to enable the citizens to enjoy the said right. It is the duty of the Government to establish those institutions which can fulfil that promise as per the Constitution. The State may discharge its obligation through state-owned or state recognised educational institutions. Charging capitation fee in consideration of admission to educational institutions is a blatant denial of a citizen's right to education under Constitution". రాజ్యాంగపరంగా ఇది విరుద్ధమైన విధానం క్యాపిటేషన్ ఫీ అంటూ ఉండడానికి వీలులేదు. అది ఏ రకంగా వసూలు చేసినప్పటికీ కూడా అడ్మిషన్స్ సందర్భంగా అది క్యాపిటేషన్ ఫీ అవుతుంది. దానికి ఇతర పేర్లతో మభ్యపెట్టడానికి, ప్రజలను మోసం చేయడానికి మాత్రం ప్రయత్నం చేయవద్దు అన్నది స్పష్టంగా చెప్పబడింది.

Indian civilization recognises education as one of the pious obligations to the human society. Sir, Please hear it. This is the thing everybody should hear. Indian civilization recognises education as one of the pious obligations of the human society, to establish and administer educational institutions is considered as a religious and charitable act. Education in India has never been a commodity for

sale. Capitation fee is nothing but a price for selling education. విద్యను అమ్ముకునేటటువంటి ఈ విధానం, ఈ క్యాపిటేషన్ ఫీ అన్నటువంటిది సుస్పష్టం చేయబడింది. the concept of teaching shops is contrary to the constitutional scheme and is wholly abhorrent to the Indian culture and heritage. మన సంస్కృతికి, సాంప్రదాయానికి పూర్తిగా భిన్నం అన్నది వారు చెప్పారు. మీకు ఏమాత్రం కోర్టు మీద స్పీకర్ గారికి సదాభిప్రాయం ఉంటే వినండి.

లేకపోతే మానేయండి అధ్యక్షా, క్యాపిటేషన్ ఫీ వల్ల మెరిట్‌లేని ధనవంతుల పిల్లలు విద్య కొనుక్కుంటారు. మెరిట్ ఉన్నా చదువుకునే అవకాశం లేని పేదవాళ్లకు ఈ సీట్లు లేకుండా చేయడం అంటే ఏమిటో మీరు ఆలోచించమని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. Capitation fees make the availability of education beyond the reach of the poor. పేదవాళ్ళకు అందకుండా ఉండి పైస్థాయిలో ధనవంతుల కోసం ఏర్పడిన దుర్విధానం అని స్పష్టంగా చెప్పబడిందని మనవిచేస్తున్నాను. The said action in permitting capitation fee to be charged by state recognised educational of Article 14 of the Constitution of India. ఈ విధంగా కనుక వాళ్ల ఇష్టం వచ్చినట్లు డబ్బు వసూలు చేసుకోండి అనడం పూర్తిగా వారికున్న బాధ్యతను విస్మరించడమే అవుతుందని సుస్పష్టం చేయబడిందని మనవిచేస్తున్నాను.

The capitation fee brings to the fore a clear class bias of haves and have-nots which enable the rich to take admissions whereas the poor has to withdraw due to financial inability. మన రాజ్యాంగంలో 14వ ఆర్టికల్‌ను తిరస్కరించినట్లు, అతిక్రమించినట్లు అవుతుందని వారు స్పష్టం చేశారు. It enables the rich to take admission wheareas the poor has to withdraw due to their financial inability. A poor student with better merit cannot get admission because he has no money. The rich can purchase the admission. మన స్వతంత్ర్య భారతదేశంలో కూడా కేవలం డబ్బు లేదు కదా అని విజ్ఞతతో పరిగణించకుండా ఒక పేదవాడి బిడ్డకు అర్హత దూరం చేస్తున్నాము. చదువుకునే అవకాశం కలిగించలేకపోతున్నామంటే ఈ స్వతంత్ర్యం ఎవరికోసం? ఈ ప్రభుత్వం ఎవరి కోసం? ఈ ప్రజాస్వామ్యం ఎవరి కోసం? అని అడుగుతున్నాను. వాడికి డబ్బులేదు. వాడికి అర్హత ఉన్నా, విజ్ఞత ఉన్నా సీటు రాదు. ఏ రిచ్ కెన్ పర్చేజ్ ది అడ్మిషన్. వాళ్లు కొనుక్కుంటారు. ఎంత ఫీ అయినా చెల్లిస్తారు. కాబట్టి ఈ దుర్విధానం అమలుపరచబడుతోందని మా బాధగా మనవిచేస్తున్నాను. such a treatment is blatantly unreasonable, unfair and

unjustified. స్వతంత్ర్య భారతదేశంలో ప్రజాస్వామ్యం ఉన్నదని అనుకుంటున్నటువంటి మన ఊహలో, మన భావనలో ఇటువంటిది కళ్ళ ముందు జరుగుతుంటే చూస్తూ కూర్చోవడం అన్నది మన అసమర్థత, చేతగానితనం అవుతుందని మనవిచేస్తున్నాను. Restricting admission to non-meritorious candiates belonging to the richer section of the society and denying the same to the minority is wholly arbitrary, against the constitution and as such cannot be legally permitted. ఏ మాత్రం కూడా ఇది చట్టబద్ధంగా అమలు కావడానికి వీలు లేదన్నది న్యాయపరంగా సుస్పష్టం చేయబడింది. Capitation fee in any form cannot be sustained in the eyes of Law. ఈ విద్యను అమ్ముకునే విధానం ఏ పద్ధతిలో కూడా చెలామణి కావడానికి వీలులేదు. The only method of admission to the medical colleges should be in consonance with fairplay and equity by ways of merit and merit alone.

అర్హత గల విద్యార్థులకు అవకాశం ఇవ్వండి. విజ్ఞత కలిగిన విద్యార్థులందరికీ కూడా మీరు అవకాశం ఇచ్చి వారి భవిష్యత్తు, ఆశాజనకంగా చేయండి. అంతే తప్ప పేదరికం ఉంది. మా పేదరికంలో ఉన్న విజ్ఞత నాశనం చేయబడింది, మేము అసమర్థులుగా పరిగణించబడుతున్నామన్న నిర్వేదానికి మనమే సమాజంలో ఉన్న వర్గానికి కనుక ఆ భావన కలిగించినట్లయితే మన సమాజానికి, మన దేశానికి ఎంతో ద్రోహం చేసినట్లవుతుంది. We therefore, hold and declare the charging of capitation fee by the private educational institutions as a consideration for admission is wholly illegal and cannot be permitted is what the court has said. అదీకాక న్యాయ మూర్తులు రాజ్యాంగంలో ప్రియాంబుల్‌లో భారత ప్రజలు 'వుయ్ ది పీపుల్ ఆఫ్ ఇండియా' అని భారత రాజ్యాంగం వ్రాసింది ప్రజలే సర్. ప్రజల పేరున రక్షించబడింది. We, the people of India మాకు మేము రాసి, లిఖించుకుని ఆమోదించుకున్న విధానం, ప్రజలే ప్రజలకు ఇచ్చుకున్నటువంటి రాజ్యాంగ విధానాన్ని ఏ విధంగా అవమానపరుస్తున్నామో ఒక్కసారి దయచేసి ఆలోచించండి. ఇది బాధతో చెబుతున్నమాట. ఆవేశంతో కాదు. నాకు దీనివల్ల ఒరిగేది లేదు. నా జాతికి తీరని అప్రతిష్ట కలుగుతోందనే భావంతో మాట్లాడుతున్నాను.

సహృదయంతో సద్భావంతో, మన దేశ భవిష్యత్తు, రాష్ట్ర భవిష్యత్తు, పేదవాడి భవిష్యత్తు, ఆలోచించమని సవినయంగా మనవిచేస్తున్నాను. As per Articles 21,38,39(A) and (F), 41 and 45, it becomes clear that the framers of the Constitution made it obligatory for the State to provide education for its citizens. The securing of social justice has been spicifically enjoined as an ob-

ject of the State. సోషల్ జస్టిస్, సామాజిక పరమైన న్యాయం అందరికీ సంక్రమింప జేయడం అన్నదే రాష్ట్ర ప్రభుత్వం యొక్క విద్యుక్త ధర్మం అని తేటతెల్లంగా నిర్వచించబడింది అని మనవి చేస్తున్నాను. It is not permissible in Law for any educational institution to charge capitation fee by whatever name it may be called. ఏ పేరును పెట్టి పిలిచినప్పటికీ కూడా క్యాపిటేషన్ ఫీ వసూలు చేయడం అన్నది రాజ్యాంగ బద్ధంకాదు. అది న్యాయస్థానం అంగీకరించబోదని సుస్పష్టం చేయబడింది. ఇంత సుస్పష్టంగా న్యాయమూర్తులు చెప్పినా ఎందుకు ఆలోచించడం లేదు?

ఇప్పుడు ప్రస్తుతం జరుగుతున్నది ఆలోచించండి. కోర్టు ఏమి తీర్పు ఇచ్చిందో నేను చదివాను మానవతా ధర్మం ఉందా? ఈనాడు ఉన్న అధికారాన్ని అమ్ముకునే బ్రతుకుతున్నారో వారు ఎందుకు ఆలోచించడం లేదని ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాను. తమరి ద్వారా మనవి చేస్తున్నాను. The State Government seems to go to any extent to dishonour the spirit of our Constitution. In its 56th Conference at Cuttack from December 28 to 30 of 1990 Indian Medical Council passed a resolution. ఎంతో బాధతో ఈ రిజల్యూషన్ పాస్ చేసింది. I am quoting it, Sir, It is not my quotation. వారు తీర్మానించిన తీర్మానాలను చదువుతున్నాను. నేను తెలివితేటలతో చెప్పేది కాదు. మునాయిదా చదువుతున్నాను.

**ఏ పేరును పెట్టి పిలిచినప్పటికీ కూడా క్యాపిటేషన్ ఫీ వసూలు చేయడం అన్నది రాజ్యాంగ బద్ధంకాదు. అది న్యాయస్థానం అంగీకరించబోదని సుస్పష్టం చేయబడింది. ఇంత సుస్పష్టంగా న్యాయమూర్తులు చెప్పినా ఎందుకు ఆలోచించడం లేదు? కోర్టు ఏమి తీర్పు ఇచ్చిందో నేను చదివాను. ఉన్న అధికారాన్ని అమ్ముకునే బ్రతుకుతున్నారో వారు ఎందుకు ఆలోచించడం లేదని ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాను.**

దీనిని రాష్ట్ర ప్రభుత్వాలు, అనేక సంస్థలు ప్రైవేట్ మెడికల్ కాలేజీలు ప్రారంభించడానికి అనుమతిస్తోందని ఆయా ప్రభుత్వాలు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సూచనలను, అభిప్రాయాలను తృణీకరిస్తూ, క్యాపిటేషన్ పద్ధతిని మేము గర్హిస్తున్నాము. ఈ వైద్య విధానాన్ని విపణి వీధిలో పెట్టడం వల్ల విద్యాస్థాయి దారుణంగా పడిపోయిందని This is what they have commented by the resolution. on 17th January, 1992 at Patna Medical Conference, Chandigarh Post-Graduate. Institute of Medical Education and Research చెందిన డాక్టర్ పి.సి. రాయ్ నేషనల్ అవార్డు పొందిన డాక్టర్ కె. భుప్ ఈ విధంగా వాపోయారు. ఈ మధ్య కాలంలో ప్రైవేటు కళాశాలలు కుక్క గొడుగుల్లా పుట్టుకొస్తూ, దేశంలో సుమారు 172 కళాశాలల్లో 20 వేల మంది మెడికల్ గ్రాడ్యుయేట్స్‌ను తయారు చేస్తున్నారు. డాక్టర్ ఎ.ఎన్. ముదిలియార్

గారు పాపులేషన్ నిష్పత్తిని బట్టి 3500 మందికి ఒక డాక్టర్‌ను ఇప్పటికే సాధించాము. అంటే ఇతర వైద్య విద్యాలయాలు హోమియో, సిద్ధ ఆయుర్వేద, యునాని ఇవన్నీ తీసుకుంటే మన దేశంలో ఈ రోజున 500 మందికి ఒక డాక్టర్ చొప్పున మనం తయారు చేసుకోగలిగాము.

అందువలన దేశంలో మెడికల్ గ్రాడ్యుయేట్స్ ఇప్పుడు పనిలేక విదేశాలకు వలసవెడుతున్నారని ఇదివరకే మనవిచేసాను. మన దేశం నుంచి 1966-1988 వ సంవత్సరం మధ్యన అమెరికాకు వెళ్లిన హ్యూమన్ క్యాపిటల్ విలువ 50 కోట్ల మిలియన్ల డాలర్లు అని అంచనా వేయబడింది. ప్రతి సంవత్సరం సమారు 8 వేల మంది ఈ దేశం నుంచి ఇతర దేశాలకు వెడుతున్నారు. ఇది మనం ఆలోచించాలని మనవిచేస్తున్నాను. టీచింగ్ షాపులో ప్రవేశించే విద్యార్థులకు ఇది దొడ్డి గుమ్మాన ప్రవేశం. మార్కులు లేకపోయినా పరవాలేదు. మూట ఉంటే చాలు ప్రవేశార్హత ఉందని దొడ్డి దారి తలుపులు తీసే దుర్విధానం, విద్యను అమ్ముకునే అనాగరిక విధానం అని సవినయంగా మనవిచేస్తున్నాను. సుమారు 8 వేల మంది మెడికల్ గ్రాడ్యుయేట్స్, పోస్టు గ్రాడ్యుయేట్స్ ఈనాడు నిరుద్యోగులుగా ఉన్నారు.

మరి మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రత్యేకించి వరల్డ్ బ్యాంక్ ఆర్గనైజేషన్‌తో క్రొత్త వైద్య కళాశాలలు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేసింది. 8వ ప్రణాళికా సంఘం తన ముసాయిదాలో క్రొత్త వైద్య కళాశాలలు ప్రారంభించం కానీ, సీట్లు పెంచడం కానీ ప్రమాదం అని హెచ్చరించింది. దీనిని మనం ఏ మాత్రం కూడా ఖాతరు చేయడం లేదని వారి చర్య వల్లే స్పష్టం అయిందని మనవిచేస్తున్నాను. ప్రతి మెడికల్ కాలేజీకి కనీసం 100 మంది విద్యార్థులకు 750 పడకల హాస్పటల్ ఉండాలి. దానికే ఎంతో తిప్పలు పడ్డామని ఇది వరకే మనవిచేశాను. టీచింగ్ స్టాఫ్ లేదు ఎవ్వరు టీచింగ్ స్టాఫ్‌గా అక్కడ తర్ఫీదు పొందడానికి అంగీకరించడం లేదు. అక్కడ బెజవాడ కళాశాలకు పంపించడానికే ప్రక్కన గుంటూరు నుంచి, ఇక్కడ హైదరాబాద్ నుంచి మా ప్రభుత్వం పంపింది. ఏదో విధంగా ఆ యొక్క రూల్స్‌ను తృప్తిపరచాలనే భావంతో పంపించాము.

ఒక్క కళాశాలకే మేము ఇంత బాధపడితే ఈ రోజు 12 మెడికల్ కాలేజీలు, 8 డెంటల్ కాలేజీలు ఇచ్చారు. ఇంకోటి అడుగుతున్నాను. ఏ మాత్రం ఈనాడు మనం ఆలోచించినా మెడికల్ కాలేజీలు డెంటల్ కాలేజీలు రెండు కూడా కలపవచ్చు. అటువంటిది ఇంకా ఎక్కువ నెంబర్ కళాశాలలు ఇచ్చినట్లయితే ఎక్కువ లాభసాటిగా ఉంటుందనే భావంతో 12:8గా విభజించి ఈ విధంగా ఇచ్చినందుకు ప్రభుత్వం వారి యొక్క నిర్ణయాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాను.

చివరగా All the details are before us. It is left to the Government to take a decision on all these things. కోర్టు ఇచ్చిన తీర్పును వేరియస్ హైలెవల్ ఇన్‌స్టిట్యూషన్స్ వారు చేసిన తీర్మానాలు మాత్రమే సరి కాదు. I appeal and request the

Government to put an end to play with the destinies of the persons, young persons in the professional studies. ఈనాడు భవిష్యత్ దేశ విధాతలుగా రాబోయే వారి భవిష్యత్తును దయచేసి ఆలోచించాలని ముఖ్యమంత్రిగారిని కోరుతున్నాను. ఇది మనం కాదు. మనం ఈ రోజు ఉంటాము. రేపు పోతాము. సంపాదించే మూటల కట్ట మన వెంట పట్టుకుపోము.

కాబట్టి, భవిష్యత్తు దేశం మనది. 'జననీ జన్మ భూమిశ్చ, స్వర్గాదపి గరీయసి, దేశం మీద ఏ మాత్రం గౌరవం ఉన్నా, ప్రజాస్వామ్యం మీద విశ్వాసం ఉన్నా, పేద ప్రజల మీద కరుణ ఉన్నా, సరైన నిర్ణయం తీసుకోమని, వారి పేరు శాశ్వతంగా ఉండి ప్రజల హృదయాలలో మెలగాలని నేను వారిని అర్థిస్తున్నాను I end my speach with words of Mr. H.G. Wells. "We have to put an end to this race between education and catastrophy." వీటి మధ్యన ఉన్న ఈ దగాకోరు విధానాలకు స్వస్తి చెప్పాలని ప్రపంచ మేధావి అయిన హెచ్.జి వెల్స్ చెప్పారు. ఇది ఎప్పుడో చెప్పిన మాట ప్రస్తుత యుగంలో ఉన్నాము. ఆధునికంలో ఉండి మాట్లాడుకుంటున్నాము. ప్రస్తుత సమాజాన్ని చూస్తున్నాం. సమాజ శ్రేయస్సు కోసం అంకితం అవుతామని ప్రజల దగ్గర ఓట్లు తీసుకున్నాం. ఆ ప్రజలకు ఏమి ఇస్తారు? ఏ సామాజికపరమైన న్యాయం వారికి అందజేస్తారు? ఏ విధంగా విజ్ఞతను పోషిస్తారు? ఏ విధంగా చదువుల తల్లిని గౌరవిస్తారు? అది తమరే ఆలోచించాలాని సవినయంగా మనవిచేస్తున్నాను. ఈ అవకాశం ఇచ్చినందులకు నమస్కారాలు తెలియజేస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

◆◆

మార్చి 25, 1992

## ఎవరిది ఈదేశం? ఎవరిది ఆ డబ్బు? పేదవాడిది కాదా?

*(1992-93 సంవత్సర ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పై చేసిన ప్రసంగం)*

**శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధంగా ప్రజాస్వామ్య విధానాలను తృణీకరిస్తూ, మంత్రి మండలి సభ్యులు ఇచ్చే విలువైన సూచనలు గానీ, అభిప్రాయాలను గానీ సేకరించే అవకాశం ఏమీ లేకుండా, రాష్ట్ర గవర్నర్‌గారి అభిప్రాయానికి నివేదించేముందరే బడ్జెట్ పత్రాలను అచ్చువేసి, శాసనసభకు విరామం ఇచ్చి, ఉదయం 10.30 గంటలకు, 11 గంటలకు మధ్య కాలంలో తయారుచేసి, అందరిచేత తగుననిపించి ఏకోన్ముఖంగా ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌గా, ఇది ఒకరి నిర్ణయం మీదనే జరిగిన నిర్ణయంగా దీన్ని నేను అభివర్ణిస్తున్నాను. ఈ ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశ పెట్టడం తొలిసారి కాదు. తెలుగుదేశం ప్రభుత్వం దిగిపోయిన తరువాత. 1990-91, 1991-92, 1992-93 ఈ 3 సంవత్సరాలు కూడా ఫుల్ బడ్జెట్ ప్రవేశపెట్టకుండా గౌరవనీయ ముఖ్యమంత్రిగారే చెప్పారు. ఈ తడవ ఫుల్ బడ్జెట్ ప్రవేశపెడతాము అన్నారు. ప్రజలందరూ ఎదురు చూస్తున్నారు. ఏమి రాయితీలు ఇస్తారోను, ఏమి సంక్షేమ విధానాలు అమలు చేస్తారోను, ఏవిధంగా పేదవారికి, వారి పేదరికాన్ని నిర్మూలిస్తారు? ఏవిధంగా వారికి కృషి చేస్తారు ఏవిధమైన రాయితీలు వారికి ఇస్తారు అనే ఆలోచనల్లో పడి ఏదో వస్తుందని పేద ప్రజానీకం అనుకొంటున్న సందర్భంలోనే ఈ సంవత్సరం కూడా గత రెండు సంవత్సరాలలో వలెనే ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టడం జరిగింది.

ఎంతో హృదయవిదారకమైన విషయంగా నేను మనవిచేస్తున్నాను. ఎందుకంటే ప్రభుత్వ ఆదాయ వ్యయ పట్టికలు ఏమి చెప్పబోతున్నాయో, ఏమి చేయబోతున్నాయో ప్రజలకు తెలియదు ఇదమిద్ధంగా లేనటువంటి ఈ ఆర్థిక విధానంలో వారి జీవితాలతో చెలగాటాలు ఆడేటటువంటి ఈ ప్రభుత్వ విధానాలు అందరూ గ్రహించవలసిన అవసరం ఉందని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. పైగా ఎప్పటికప్పుడు వారు చేసే విధానాలను ఏ మాత్రం గుర్తించకుండా,

అసలు ఇప్పుడు, ఇదివరకటి 7 సంవత్సరాల కాలంలో వ్యవహరించిన ప్రభుత్వము ఆర్థిక విధానంగా రాష్ట్రానికి చెడు చేసిందని, రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిందని ఆరోపణలు కూడా చేశారు. ఈ సందర్భంగా గౌరవసభ్యులకు ఒకసారి మనవిచేస్తున్నాను. యూనియన్ ప్రభుత్వము 42 సంవత్సరాలలో సుమారు 3 సంవత్సరాలు తప్పితే, మిగిలిన కాలమంతా కాంగ్రెస్ పరిపాలించింది. అదేవిధంగా రాష్ట్రములో తెలుగుదేశం ప్రభుత్వం పరిపాలన 7 సంవత్సరాలు మినహాయిస్తే మిగిలిన కాలమంతా కూడా కాంగ్రెస్ వారే పరిపాలించారు అనడంలో ఏమీ అనుమానం లేదు. అది ప్రత్యక్ష నిదర్శనంగా మీకు సవినయంగా మనవిచేస్తున్నాను. వారు చేపట్టి అమలు చేసిన తప్పుడు విధానాలు, ఎవరో చెప్పినట్లుగా ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వము అన్నీ సరిచేస్తూ, దేశాన్ని ఆర్థిక ఊబి నుండి బయటికి లాగబోతున్నది. దేశాన్ని ఉద్ధరించబోతున్నదని చెప్పడం ఎంతో హాస్యాస్పదంగా ఉందని మనవిచేస్తున్నాను.

ఇప్పుడు రాష్ట్రములో, కేంద్రములో ఉన్న పెద్ద మనుషులు ఈనాటి వారు కాదు. ఎప్పటినుండో మంత్రి మండలిలో సభ్యులుగా ఉన్నారు. ఎన్నో బాధ్యతలు నిర్వహించారు. నాయకులుగా వారియొక్క విధానాలను ఎప్పటికప్పుడు వారి పార్టీపరంగా అమలుచేస్తూ వచ్చారు. అయితే ఇవన్నీ విస్మరించి, కేవలం ప్రజలంటే అమాయకులు, మేము చెప్పింది. నమ్ముతారు అని వారిని మభ్యపెట్టడం ఎంతో దురదృష్టకరమైన విధానముగా మనవిచేస్తున్నాను. ఒక నియంత్రణ, సామర్థ్యము లేకుండా వారిష్టము వచ్చినట్లు, పంచవర్ష ప్రణాళికలను రచించారు. 7 పంచవర్ష ప్రణాళికలు అయిపోయాయి. 8వ పంచవర్ష ప్రణాళికలో కాలుపెడుతున్నాము. మనకు రుణము పెరిగిందా? లేకపోతే దేశం అభివృద్ధి పెరిగిందా ఒకసారి చూస్తే ఏవిధంగా దేశానికి అన్యాయం జరిగిందో కాంగ్రెస్ పాలనలోనే ఇది జరిగింది. ఒకసారి దీన్ని స్ఫురణకు తెచ్చుకోమని సవినయంగా మనవిచేస్తున్నాను. మనకు మిగిలింది, కట్టబెట్టింది, దేశానికి ఇచ్చింది డెట్‌ట్రాప్‌లోకి లాగివేయడం. పుట్టబోయే బిడ్డకు కూడా ఈ రుణభారం పంచిపెట్టారు. ఇపుడు మనదేశంలో సరైన అభివృద్ధి జరగాలంటే పారిశ్రామిక విధానం అవలంబించాలి.

మన దేశం ఈ విధమైన ఆర్థిక దుస్థితిలో ఉండడానికి కారణం ఇక్కడ అందరికీ తెలుసు, ఇపుడు ఈ బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ గౌరవనీయులైన ఆర్థికశాఖామాత్యులు తాము తీసుకున్న చర్యలు ఏమిటో చదివి వినిపించారు. ఈనాడు మనం ఒకసారి ఆలోచన చేస్తే, ముందుగా ఈ తెలుగుదేశం ప్రభుత్వం చెప్పినది ఆచరణలో పెట్టినది, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్నదా? ఇదివరకు ఈ స్వాతంత్ర్య ఉద్యమానికి, కాంగ్రెస్‌కు, ఈ దేశానికి గాంధీగారు నాయకత్వము వహించారు. ఆయన విదేశీ వస్తువులను బహిష్కరిస్తే, మీరు ఆ విదేశీ వస్తువులను స్వీకరిస్తున్నారు. ఇప్పుడు ఏ విధానాన్ని అనుసరిస్తున్నా, ఏ పార్టీవారు ఏలుతున్నా వారు నైతిక విలువలు పాటించాలి. వారు ఈ దేశాన్ని ముందుకు తీసుకు పోయేందుకు దేశాన్ని అభివద్ధి పథంలోకి ఏ

విధానాన్ని అనుసరించాలి అనేది చూసుకొని దానిని అమలు చేయాలి తప్ప ఏదో కాంగ్రెస్ పార్టీవారికి అధికారము వచ్చింది కదా అని చెప్పి ఈ దేశాన్ని ఈ విధంగా అప్పుల పాలు చేయడం మంచిది కాదు. ఇపుడు భారత ప్రభుత్వం అయితేనేమి, ఈ రాష్ట్ర ప్రభుత్వము అయితేనేమీ విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నారు. కానీ ఈ భారతమాత పాద కమలాలకు పారాణిపూసి, ఆమెను మనము పూజించుకున్న పవిత్రమైన చరిత్ర మనకు ఉంది. అటువంటి భారత మాతకు ముద్దుబిడ్డలై మీరు 100 కు 100 పాళ్లు విదేశీ పెట్టుబడులు ఈ దేశానికి తీసుకొని వచ్చి ఈ దేశాన్ని ఇతర దేశానికి అంటకట్టే సిగ్గు మాలిన పని మేము చేయలేదు. మేము కూడా విదేశీ పెట్టుబడులను ఆహ్వానించాము కానీ ఈ విధంగా వారు పెట్టిన షరతులకు అంగీకరించి వారిని ఆహ్వానించలేదు.

ఈరోజున మనకు ఉన్న ఆర్థిక పరిస్థితులను చూసుకుంటే మనం విదేశాలతో పోటీబడి, విదేశాలలో వారికి ఉన్న టెక్నికల్ నోహౌతో పోటీపడి ఉత్పత్తులు చేయలేము. కాబట్టి మనము స్వయం ఉపాధిని కల్పించి, శ్రామిక శక్తిని సంఘటితపరచి మన ఆర్థిక విధానాన్ని పటిష్టం చేసుకొని మనకు కావలసిన వస్తువులను మనము తయారుచేసుకునే విధంగా చేస్తేనే గానీ మనం ఈ అప్పులనుండి బయటపడలేము. ఈ విధంగా సిగ్గుమాలిన విధానాలు అవలంభించి మన దేశాన్ని ఇతర దేశాలకు అమ్ముడుపోయేట్లు చేయవద్దని మనవి చేస్తున్నాను. ఇవన్నీ జాగ్రత్తగా ఆలోచించాలని కోరుతున్నాను. అప్రస్తుతమైన విషయాల మీద మన ప్రభుత్వం ఆలోచనను కేంద్రీకృతం చేసి వారి కాలాన్ని వృధా చేసుకున్నారు. ఇప్పుడు ఈ గోల్డ్ కంట్రోలు ఆర్డరును తెచ్చారు.

**మనము స్వయం ఉపాధిని కల్పించి శ్రామిక శక్తిని సంఘటితపరచి మన ఆర్థిక విధానాన్ని పటిష్టం చేసుకొని మనకు కావలసిన వస్తువులను మనము తయారుచేసుకునే విధంగా చేస్తేనే గానీ మనం ఈ అప్పులనుండి బయటపడలేము. ఈ విధంగా సిగ్గుమాలిన విధానాలు అవలంభించి మన దేశాన్ని ఇతర దేశాలకు అమ్ముడుపోయేట్లు చేయవద్దని మనవి చేస్తున్నాను.**

అటువంటి విధానం అవలంభించడంవల్ల ఏమి జరిగింది. మనకున్న బంగారం మనకు దక్కకుండా బస్తాలతో ఇప్పుడు మనం విదేశాలకు విమానాలతో పంపించవలసిన దుర్గతి పట్టించారు. తరువాత ఇతర దేశాల నుండి ఎవరైనా మనదేశం వస్తూ ఉంటే 5 కే.జీ.ల బంగారం తెచ్చుకోవచ్చని అంటున్నారు. ఈ బంగారం ఎవరివద్ద ఉంటుంది? సంపన్నుల వద్ద మాత్రమే ఉంటుంది. అటువంటి సంపన్నులకు మీరు బంగారం తెచ్చుకునే సదుపాయం కలుగజేస్తున్నారంటే గొప్పవారిని మరింత గొప్పవారిని, ధనవంతులను చేస్తున్నారని దీనిని బట్టి తెలుస్తున్నది. మీ సిద్ధాంతాల అర్థం ఏమిటో ఎవరికీ అంతుపట్టడంలేదు. ఇప్పుడు ఈ బంగారం అంతాకూడా బడాబాబుల చేతులలో ఉంది. అటువంటప్పుడు ఈ విధంగా ఉత్తర్వులు జారీచేస్తూ, డబ్బు ఉన్నవారికి మరల డబ్బు కట్టపెట్టే విధానాలు మీరు అవలంభిస్తున్నారు. కాబట్టి ఇవన్నీ ఆలోచన

చేయని విధంగా ఉండి, మనలను అధోగతిపాలు చేసే ఈ బడ్జెట్‌ను నేను వ్యతిరేకిస్తున్నాను. జాతి అభివృద్ధిలేదు. ఆర్థిక అభివృద్ధి లేదు. నైతిక విలువలు లేవు. విధానాలు లేవు, దేశం అంతాకూడా సంపన్నుల చేతిలో పెట్టి వారు ఈ బీదప్రజలను ఇంకా దోచుకునే విధానాలు ఈ ప్రభుత్వం స్వయంగా అవలంభిస్తున్నది. ఇప్పుడు పారిశ్రామిక విధానంలో టెక్నోక్రాట్స్‌ను తయారుచేసుకొని, పారిశ్రామికంగా మనంతట మనం అభివృద్ధి చెందాలంటే మనకు డబ్బులేదు. విద్యావంతులైన యువకులు డబ్బులేక, ఉపాధి కల్పించుకోలేక, తిండిలేక రోడ్లపై తిరుగుతున్నారు. ఈ విధంగా ముందుకూడా కొనసాగితే మన బిడ్డలకు నైతిక విలువలు అంటే ఏమిటో అర్థమే తెలియకుండా పోతుంది. మన బిడ్డల పురోభివృద్ధి పట్ల మనమే నిర్లక్ష్యం చేస్తున్నాము. ఇపుడు ఒక తల్లిగానీ, తండ్రిగానీ, చెల్లెలుగానీ వారు జీవనోపాధిలేక బాధపడకూడదు. మనం చేస్తున్న ఈ రుణాలు చూస్తూ ఉంటే మన బిడ్డలు, మన మనుమలు కూడా తీర్చుకునే పరిస్థితినే మనం కల్పిస్తున్నామని మనం అర్థము చేసుకోవాలి.

ఈనాటి ఈ కాంగ్రెస్ విధానంవల్ల యువకులు, యువతులు ఎంతో బాధలకు గురి అవుతున్నారు. కాంగ్రెస్‌వారు తమ మేనిఫెస్టోలో ఏమి వ్రాసుకున్నారంటే మూడు రోజులలో ఈ ఆర్థిక విధానాన్ని మెరుగుపరుస్తామని, కంట్రోలులో పెడతామని అన్నారు. ఈ విధంగా ప్రజలను ఎందుకు మోసము చేస్తారు? ఇదేనా మన రాజకీయం? ఈ విధంగా దగాపడ్డ తమ్ముళ్లలో ప్రజలు, మోసపోయినవారు ఊరుకోరు. వారు ఈ నైతిక విలువలు పోగొట్టిన రాజకీయ వాదులను తప్పక త్రిప్పికొడతారు. ఇప్పుడు మనదేశము ప్రధానంగా వ్యవసాయ దేశము. అందువల్ల మనము వ్యవసాయ రంగానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ కేటాయింపులు చేయాలి. అట్లాగే కాకుండా మన ఆర్థిక విధానం రోజురోజుకు దిగజారి వ్యవసాయరంగానికి ఏ మాత్రమూ కేటాయింపులు చేయడంలేదు. ఇందువల్ల మన నిత్యావసర వస్తువులు సైతం మన ఉత్పత్తులు మన అవసరాలకు చాలక బియ్యము, గోధుమలు, చక్కెర మనం ఇతర దేశాలనుండి దిగుమతి చేసుకోవలసి వస్తున్నది.

మన గాంధీగారు చెప్పారు. దేశానికి వెన్నెముక ఈ రైతులే అన్నారు. అటువంటి రైతన్నకు మన బడాభూస్వాములు ఏమి చేస్తున్నారు? ముఖ్యంగా కాంగ్రెస్ వాదులమంటూ వీరు ఈ రైతులకు చేసే మేలు ఏమిటి? వారు పండించే పంటలకు కావలసిన ఎరువులకు సబ్సిడీలేదు. ఎలక్ట్రిసిటీ రాయితీలు లేవు. ప్రజాస్వామ్య విధానమా ఇది? కేవలం, మా ఇష్టం వచ్చినట్లు నడిపిస్తాము అంటే, ప్రజలు అంగీకరించరని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. సేల్స్ టాక్స్ రిబేట్ ఇస్తున్నాము. విద్యుచ్ఛక్తికి, రిబేట్ ఇస్తున్నాము. డిఫర్డ్ పేమెంట్స్ మీద సేల్స్ టాక్సు కట్టడానికి అనుమతి ఇస్తున్నాము. అన్ని అనుమతులు ఇచ్చి తిండి పెట్టే రైతును ఎందుకు ఈ విధంగా నిర్లక్ష్యం చేస్తున్నాము? ఒకసారి ఆలోచించాలి అందరూ. It is not criticising anybody. It is not a thing to be discussed and though over by everybody pres-

ent here? అందరూ ఆలోచించవలసిన విషయం. సభ్యులందరూ కూడా నిర్ణయించాలని తమద్వారా మనవిచేస్తున్నాను.

ఇదివరకు ప్రభుత్వం రైతుకు ఏమి ఇచ్చింది – 50 రూపాయలకు కరెంటు ఇచ్చింది. తల్లిని ఏవిధంగా గౌరవిస్తున్నాము. తండ్రిని ఏవిధంగా గౌరవిస్తున్నాం. అమ్మా.. నాకు అన్నం పెట్టమంటే పళ్లెంలో పెడుతుంది. ఎంత పవిత్రంగా చూస్తున్నాము. ఇటువంటి రైతును ఏమాత్రం కూడా గుర్తించకుండా ఉన్నారు. కేవలం వారికి 50 రూపాయలకు హార్స్‌పవర్ తెలుగుదేశం ప్రభుత్వం కల్పించింది. ఈనాడు ఆదాయం పేరిట రాష్ట్రం కుంటుపడుతోందని కుంటిసాకుతో, ఈనాడు ఏదో మారుమూల పొట్ట పోసుకుంటూ బ్రతికే రైతుల మీద ఆంక్షలు పెడుతున్నాము. ఎప్పటికప్పుడు పరిమితులు అని, బ్రతుకు పరిమితం, తిండి పరిమితం, రైతును పరిమితం చేస్తున్నాము. అటువంటి వ్యవసాయరంగాన్ని, వ్యవసాయ దేశమని చెప్పుకుంటూ ఈ రాష్ట్రంలో ఈ రైతుకు తగిన గౌరవం లేనటువంటి విధానాన్ని, నిరంకుశ శాసనాన్ని విధించి వారి ఉసురు పోసుకుంటున్నాము. వారి చెమట తాగుతామండీ? ఈనాడు దురవస్థలు ఎన్నెన్ని పెట్టారో అది ఒకసారి గుర్తించాలనే ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను.

తెలుగుదేశం హయాంలో వారు వాడుకునే పంపులకు ఒక లక్ష కనెక్షన్స్ ఇచ్చాము. గౌరవనీయులైన ముఖ్యమంత్రి చెన్నారెడ్డి గారు చెప్పారు. మేము ఇస్తామన్నారు. ఎన్ని ఇచ్చారు? 4, 5 వేలు ఇచ్చారు. ఎందుకు ప్రజలను దగా చేయడం, మోసంచేయడం? ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు రైతులకు ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు సబ్సిడీ ధరలకే ఇచ్చాము. ఈనాడు మీరు ఏమి ఇవ్వగలుగుతున్నారు? ఈనాడు ఫెర్టిలైజర్ 40 శాతం పెంచారు. పైగా రసీదులు చూపండి, డబ్బు ఇస్తామన్నారు. ఈనాడు రసీదులు చూపిస్తే డబ్బు ఇవ్వలేదు. రూ. 67 కోట్లు తప్ప ఇవ్వలేమని అన్నారు. ఏమిటిది, కేంద్రం చేతుల్లో ఒక బొమ్మగా వ్యవహరిస్తున్నారు. ప్రజలు, రైతులు, కార్మికులు ఎవరు ఉన్నారో వారందరి సంక్షేమాన్ని చూసి మన ప్రజాస్వామ్యాన్ని దక్కించుకోవాలనే బాధతో, సమస్యలను చెపుతున్నాను. లేకపోతే, కేవలం బ్రాంచి ఆఫీసుగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నందున ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. ఈ విధమైన నిరంకుశ శాసనాలు విధిస్తున్నారు. వారే ఓట్లు ఇచ్చారు అందరికీ. అదీ ముఖ్యంగా పేదవాడు వింటున్నాడు. ఆచరణలో చూస్తున్నారు. సమయం వచ్చినప్పుడు తగు విధంగా బుద్ధి చెప్పుతారు. ప్రజాస్వామ్యాన్ని పునద్ధరించుకుంటారు. అది మాత్రం మర్చిపోవద్దని మీద్వారా సవినయంగా మనవిచేస్తున్నాను. ఈనాడు నీటి సమస్యలున్నాయి. కృష్ణా, వివాదం, జల సమస్యపై బచావత్ కమిషన్ అవార్డు ఇచ్చారు. తెలుగుదేశం హయాంలో కూడా చెప్పాను. ఎన్నో ప్రాజెక్టులు ఏర్పరచుకున్నాం.

ముఖ్యంగా తెలుగుదేశం మేధస్సులో ఆవిర్భవించిన ప్రాజెక్టు తెలుగుగంగ శ్రీశైలం ఎడమ కాలువతో నల్లగొండ జిల్లాకు జీవనాధారం కల్పించి అక్కడ ఉండే ప్రజలకు ఆదరణ

కలిగించేటటువంటి ప్రాజెక్టును ఏర్పరచుకున్నాము. జూరాల, భీమా ఇవన్నీ కూడా ఏర్పరచుకున్నాము. కుడికాలువ పొడిగింపు చేశాము. ఇవన్నీ కూడా ప్రజాసంక్షేమం కొరకు చేయబడ్డాయి. పులిచింతల రిజర్వాయరు ఏర్పరచుకుని ఈనాడు కూడా వీటి గురించి ఒక్క మాట చెప్పడం లేదు. ప్రజలందరూ గుర్తించాలి. రెండువేల సంవత్సరంలోగా పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసుకోవాలి. రెండువేల సంవత్సరం నాటికి పూర్తి చేయకపోతే దాంట్లో ఒక్క చుక్క కూడా ముట్టుకోవడానికి వీలులేదు. ఎందుకంటే మన ఆంధ్రప్రదేశ్ ఆఖరి స్టేట్. కృష్ణా జలాల్లో 2000 సంవత్సరం వరకే బచావత్ అవార్డు ఇచ్చారు. అంటే, 800 టి.ఎం.సి. ఆంధ్రప్రదేశ్ వాడుకోవాలని, 700 టి.ఎం.సి.లు కర్ణాటకకు, 560 టి.ఎం.సి.లు మహారాష్ట్ర వాడుకోవాలని వారు నిర్ణయించారు. అప్పుడే 75 పర్సెంట్ డిపెండబిలిటీ మీద పైన అనావృష్టి వల్ల నీరు సరిగా రాకపోతే ఆఖరి రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ నష్టపోవలసి ఉంటుంది. కాబట్టి, దానికి ఆ హక్కు కల్పిస్తున్నాం అన్నారు. వృధాగా సముద్రంలో కలిసి పోతున్నది. 2000 సంవత్సరం వరకు ఇది వాడుకోకపోతే లాభంలేదు. ఈనాడు కేవలం, పార్టీ విధానంలేదు. ప్రజా శ్రేయస్సును, సంక్షేమాన్ని తాకట్టు పెట్టే దుర్వ్యవస్థ మన రాజకీయ నాయకులకు గానీ కోరుకోకూడదు అంటున్నాను.

> **ముఖ్యంగా తెలుగుదేశం మేధస్సులో ఆవిర్భవించిన ప్రాజెక్టు తెలుగుగంగ, శ్రీశైలం ఎడమ కాలువతో, నల్లగొండ జిల్లాకు జీవనాధారం కల్పించి అక్కడ ఉండే ప్రజలకు ఆదరణ కలిగించేటటువంటి ప్రాజెక్టును ఏర్పరచుకున్నాము. జూరాల, భీమా ఇవన్నీ కూడా ఏర్పరచుకున్నాము. కుడికాలువ పొడిగింపు చేశాము. ఇవన్నీ కూడా ప్రజాసంక్షేమం కొరకు చేయబడ్డాయి.**

*(ఇంటరప్షన్స్)*

సర్, వారు నివేదిక ఇచ్చారు. నివేదిక ఇచ్చినప్పుడు తిరిగి దాని మీద చర్చలు జరగడానికి వీలులేదు. మాకు అధికారాన్ని ఇవ్వండి అన్నాను. అందుకు సమావేశానికి వెళ్లను అని కూడా చెప్పడం జరిగింది. ఈనాడు ఏమి చేస్తున్నారు? అయ్యా. ఈ హౌసులో, ఏ పార్టీ వారు అయినాసరే, వారికి నమస్కారం - అందరికీ అప్పీలు చేస్తున్నాను. ఇవాళ 1992లో ఉన్నాము. ఇక 7 సంవత్సరాల కాలం మాత్రమే మన కళ్ల ముందు ఉన్నది. ప్రాజెక్టులను అన్ని తెచ్చుకుంటామా? ప్రభుత్వం ప్రాజెక్టులను ఏర్పరచి ప్రజలకు ఇస్తుందా? గ్లాసెడు మంచినీరు దొరకని పరిస్థితి ఈ రాష్ట్రంలో ఉందని నేను మీకు మనవిచేస్తున్నాను. విజ్ఞప్తి చేస్తున్నాను. ఇది ప్రజా ప్రభుత్వమా? ఆరున్నర కోట్ల ప్రజలు ప్రత్యేకంగా ఇచ్చిన ప్రజా ప్రాతినిధ్యం ఉన్నది ఈనాడు ఏమి చేస్తున్నారు? వారి నోటిలో మట్టి కొడతారా? నీరు లేకుండా చంపుతారా? ఇది మా బాధ్యత, ఇది ప్రొవైడ్ చేస్తామనే మాట బడ్జెట్‌లో చెప్పలేదు. ఎందుకో 2000 ఎ.డి. నాటికి పూర్తిచేస్తామని హామీ ఇవ్వగలరా? చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉందా అని నేను డిమాండు చేస్తున్నాను తమద్వారా. ఇప్పటికైనా మించి పోయింది లేదు. చెప్పవలసిన బాధ్యత ఉన్నది. మీ సంగతి మీరు

ఆలోచించుకోండని నేను మనవిచేస్తున్నాను. ఈనాడు దురదృష్టకరమైన విధానం కళ్ల ముందు జరుగుతున్నది. ఎన్నో వందల కోట్లు ఖర్చుచేశాం. ఎన్నో ఆశలు చూపాము. మేము, వారు, వీరు ఎవరు చేసినా, ఏ పార్టీ చేసినా, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని చేశాము. ప్రజలకు ఏమిటి చెప్పండి? హామీ ఇవ్వాలని అడుగుతున్నాను. ప్రజాస్వామ్యం మీద విశ్వాసం ఉన్నట్లు లేదు. ప్రజల బ్రతుకు మీద ఏ మాత్రం కూడా నమ్మకం ఉన్నట్లు లేదని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. అటువంటిది ఏమి కూడా మసలుకునే విధానం లేకుండా, బడ్జెట్‌లో చెప్పకుండా, కేటాయింపులు పెంచకుండా, కేవలం ఓటాన్ అకౌంట్ పెట్టుకుని, పబ్బం గడుపుకోవడానికి సమర్పించిన బడ్జెట్ తప్ప దీనివల్ల ఏమీ కూడా జనానికి, రాష్ట్రానికి మేలు జరగడం లేదు.

కేవలం ప్రభుత్వం కేంద్ర బ్రాంచి ఆఫీసుగా వ్యవహరిస్తున్నది. ఏమాత్రం తెలుగువారి ఆత్మగౌరవాన్ని, తెలుగువారి అభివృద్ధిని కోరడం లేదు, ఇది ప్రత్యక్ష నిదర్శనము. I am challenging it on the Floor of the House. Let them come out. రెండు వేల ఎ.డి వరకు టైమ్ ఉన్నది. ఏమి చేయగలరు? వందలాది, వేలాది కోట్లు కూడా 'బూడిదలో పోసిన పన్నీరు' లాగా దిగజార్చుకుంటారా? ప్రజల ఆశలన్నీ నట్టేట్లో ముంచుతారా అని ఈ సందర్భంగా కోరుతున్నాను. మన రూపాయి విలువ పడిపోయింది. అయ్యా ఈ విధంగా ఉంటే, అప్పు ఇస్తామన్నారు. అక్కడ గతి లేక అప్పు చేసుకోవడం జరుగుతున్నది. మన రూపాయిని డీవాల్యుయేషన్ చేయడం జరిగింది. దానివల్ల ఎంత అనర్థం వచ్చింది అధ్యక్షా, ఆర్థిక నిపుణులున్నారు. అన్నింటికంటే తెలివిగలవారు ఉన్నారు. అప్పు ఏదో దొరికింది. అంకెలు ఉన్నాయి. ఈ డీవాల్యుయేషన్ ప్రోగ్రామ్ ఏ విధంగా మారిపోతున్నది? 209 కోట్లు లోటు ఉంటుందని.

కాబట్టి, అంకెలను బట్టి చూస్తే, ఈ రూపాయి విలువ డీవాల్యుయేషన్ చూస్తే 2,000కోట్లు అవుతుందని మిమ్మల్ని అడుగుతున్నాను. దయచేసి చెప్పండి? ఎట్లా పూర్తి చేస్తారు. పన్నులు ఏవిధంగా విధిస్తారు? నోరు లేనివారిని ఏవిధంగా చంపుతారు? అసలు తిండి లేక అనాథలు, పేదలు ఏవిధంగా బ్రతుకుతారు? నట్టేటిలో ముంచుతారా అని ఈ సందర్భంగా అడుగుతున్నాను. ఏమిటీ డీవాల్యుయేషన్ ? గతి లేకనే చేస్తున్న నిర్ణయాలు – దీనికి అంగీకరిస్తున్నామంటున్నారా? మాకు ఆత్మ గౌరవం ఉన్నది. ఏవిధంగా అయినాసరే. తలవంచడం మాకు చేత కాదు. చెప్పడం మా ధర్మం అని చెపుతున్నాను. ఒక రీజన్‌తో చెప్పుతున్నాను. చిత్తశుద్ధి ఉంటే, రాజకీయం మాకు కాదు ప్రజాస్వామ్యం కోసం – మంచి ఉంటే, స్వీకరించండి? దీనికి బదులు సమాధానం చెప్పండి? రెండువేల ఎ.డి వరకు పరిష్కారం చేస్తామా? రూపాయి విలువ తగ్గింపువల్ల ప్రాజెక్టు అంచనా పెరుగుతుంది. ధరలకు కారణం ఏమిటి? రూపాయి విలువ తగ్గడం కాదా? 100 రోజుల్లో తగ్గిస్తాము అన్నారు. 100 రెట్లు పెరిగాయి. సామాన్య ప్రజలు ఏ విధంగా బ్రతుకుతారు?

దయచేసి ఒకసారి పరిశీలించాలని, ఈ తప్పుడు ఆర్థిక విధానాల వల్ల ఏవిధంగా, ధరలు తగ్గుతాయి? పేదవారిని నట్టేట్లో ముంచే బదులు ఒకసారి అందరూ ఆలోచించాలని మనవిచేస్తున్నాను.

అధ్యక్షా, అంతకంటే దురదృష్టకరమైన విషయం రాజకీయ దుశ్చర్యలు. ఏమండీ రాజకీయం ఎందుకండి, ప్రజల కోసం కదండి. మరి మొన్ననే కదండి ప్రజల దగ్గరకు వెళ్ళాము ఓట్లు ఇవ్వండి అన్నామే. మా తెలుగుదేశం తరపున కూడా అభ్యర్థులు నుంచున్నారే, మరి ప్రజలు పాపం అమాయకులు ఓట్లు వేశారే తెలుగుదేశం మీద విశ్వాసముతో. ఏమండి ఈ కాంగ్రెస్ వారితో కుమ్మక్కై ఈనాడు ఈ రాజకీయ దుర్విధానాన్ని నడిపి వారికి ఆశలు చూపి, మెరమెచ్చులు చూపి వారిని తప్పుడు దోవ పట్టించి రాజకీయాన్నే భ్రష్టం చేస్తారా అని అడుగుతున్నాను. ఎందుకంటే నా దగ్గర ఆధారాలు ఉన్నాయి. మీకు పంపిస్తాను.

*(కొన్ని కాగితాలు ఉపసభాపతికి పంపించారు)*

చిదంబరం సలహా తీసుకున్నాము అన్నారు. ఇంకొకరు అన్నారు. రెడ్డియ్యగారికి కోటికి పైగా పరిహారం అన్నారు. ఏమిటి అధ్యక్షా, ఇది. ఎవరిది ఈదేశం, ఎవరిది ఆ డబ్బు? కేవలం పేదవాడిది కాదా? అన్నము లేక గతిలేక ఆకలి చావుతో చచ్చేవాడిది కాదా? మనము చేనేత కార్మికులు చస్తున్నారు అంటే అంగీకరించము. రైతుల సమస్యలు ఏమీ మాట్లాడుకోము కానీ మా పార్టీలోకి వచ్చి ఎక్కడికక్కడ మీ అధికారాన్ని మాత్రము పెంపొందించేటటువంటి వారికి కోట్ల రూపాయలు కట్టపెడతాము అనేటటువంటి దుర్విధానములో ఈ దేశాన్ని అమ్ముకుతిన్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎవరు అంగీకరిస్తారని నేను మీకు సవినయముగా మనవిచేస్తున్నాను. This is logic. There is no emotion. I am talking very straight, in an emotional way. నేను ఏమీ ఆవేశపడడం లేదు. చెప్పడములో గట్టిగా చెప్పి ఉండవచ్చును కానీ ఆవేశం కాదు.. ఇది నా ఆవేదన, నాలో రగులుతున్నటువంటి బాధ. ఎన్నాళ్లో మిమ్ములను నమ్మారే, ఏ విధంగా దేశాన్ని భ్రష్టు పట్టిస్తున్నారో, ఏ విధంగా రాజకీయాన్ని దగా చేస్తున్నారో ఒకసారి ఆలోచించమని నేను సవినయంగా మనవిచేస్తున్నాను. ఎందుకు ఈ గతి మీకు పట్టింది? మాకు అధికారం లేకపోతే మేము అపోజిషన్ బెంచెస్‌లోనే కూర్చుంటాము, ప్రజలకు సేవ చేస్తాము అన్నాము. అదే విధంగా మరి ఆ మాత్రం త్యాగం మీలో ఎందుకు లేకపోయింది? కేవలం అధికారం కోసం మీ పదవుల కోసం ఈనాడు దేశాన్ని తాకట్టు పెడతారా, నీతిని తాకట్టు పెడతారా, నియమాన్ని తాకట్టు పెడతారా, ఇదేనా రాజకీయ సిద్ధాంతము.

ఇదేనా కాంగ్రెస్ విధానమని కూడా నేను మీకు సవినయంగా మనవిచేస్తున్నాను. ఇకపోతే, ఇంకోటి మీకు తెలుసు రెండు రూపాయలకు కిలో బియ్యం ఇచ్చాము. అసలు సిద్ధాంతమే అర్థం

చేసుకోలేదు. అన్నీ తప్పుడు విధానాలే 1:1:1 – సివిల్ సప్లయిస్ మినిస్టర్ గారు ఉన్నారో లేదో వారికి నేను చెపుతాను. Telugu Desam Government followed 1:1:1 Formula. మీరు కనుక ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు ఒక వంతు ఇచ్చినట్లయితే, ఒక వంతు ఓపెన్ మార్కెట్లో ఉండాలి, ఒక వంతు బయటకు రవాణా చేసుకోడానికి ఇవ్వాలి. ఇది మేము అనుసరించిన విధానం. ఎందుకంటే ఓపెన్ మార్కెట్లో ఉంటే ధరలు పెరగకుండా ఉంటాయి. అందరికీ బియ్యం అందుబాటులో ఉంటుందని మేము చెప్పాము. మరి ఈనాడు 1:1 అన్నారు. ఒకటి మీకు ఇస్తే ఒకటి అమ్ముకోవచ్చును అంటే ఇంక దేశములో మిగిలేది ఏమిటి మట్టిగడ్డలు. అందుకే ఈ రోజున బియ్యం కిలో రూ.10లకు అమ్ముతున్నదంటే పూర్తిగా ఈ ప్రభుత్వం, దాని యొక్క ఫెయిల్యూర్ – ఈ సిద్ధాంతాలు ఏవిధంగా వమ్ము చేయబడ్డాయి. ఏ విధంగా ప్రజలు ద్రోహము చేయబడ్డారో, వారికి తిండికి కూడా ఇవ్వలేనటువంటి దురదృష్టకరమైన విధానములో ఈనాడు ప్రభుత్వం వ్యవహరిస్తోంది అంటే ఏవిధమైనటువంటి బాధ మా మనస్సులో ఉందో. అన్ని త్యాగాలు చేసి వచ్చామే, పదవుల కోసం కాదు, నీతి తప్పి వ్యవహరించడానికి కాదు, కుళ్ళిపోయిన రాజకీయాలు నడవడానికి కాదు. మరి అటువంటి ఆశలు ఎన్ని వచ్చినా మేము ఏవిధంగా క్రుంగిపోతున్నామో, ఈ కాంగ్రెస్ చేస్తున్నటువంటి ఈ దుర్విధానాల వల్ల అని ఒకసారి తమకు నేను కన్నీళ్లతో మనవి చేస్తున్నాను. మనము తిన్నాము, ఎ.సి. హాలులో కూర్చున్నాము. దర్జాగా మాట్లాడుకుంటున్నాము. పాపం బయట ఆలోచించండి. మండుటెండలో డొక్కమాడి చచ్చిపోతున్నటువంటి ఆ పేద కార్మికుల సంగతి ఒకసారి దయచేసి ఆలోచించండి. వాడు ఏమైనా తింటున్నాడా? ఏమండీ వాడికి కిలో బియ్యం 2 రూపాయలకు ఇస్తే తప్పేంది? అసలు ఒకటి అడుగుతున్నాను. ఈ ప్రపంచ దేశాలలో ఏదైనా నాగరికత ఉన్నది అంటే ఎక్కడ ఉంది నాగరికత, లేనివాడికి ఇంత పెట్టడమే నాగరికత.

అది లేకుండా కేవలం స్వార్థముతో కోట్లకు కోట్లు పెంచుకుంటూ కేవలం ఏమాత్రం కూడా అభిమానం లేకుండా, స్వాభిమానం లేకుండా, ఆత్మగౌరవం లేకుండా, అవినీతికి తొత్తులుగా బ్రతికేటటువంటి రాజకీయములో ఏమాత్రం నీతి ఉందని నేను అడుగుతున్నాను. ఏమిటి ఈ దురదృష్టకరమైన విధానం. ఒక ప్రక్కన వారందరూ కూడా లేక బాధపడుతూ ఉంటే ఇది మీకు న్యాయంగా ఉందా అని మనవిచేస్తున్నాను. ఇది రాజకీయం – ప్రజల కోసం మనము వ్యవహరిస్తున్నటువంటి విధానం కానీ మరొక విధానం కాదు కూడా ఈ సందర్భముగా మనవిచేస్తున్నాను. మనము కిలో రెండు రూపాయలకు పేదప్రజలకు, తమ్ముళ్లకు ఏమి ఇవ్వలేము, భోజనం పెట్టలేము, ఆ మాత్రం త్యాగం చేయలేము, రైతులకు సబ్సిడీ ఇవ్వలేము, వృద్ధులకు పెన్షన్ ఇవ్వలేము, ఆడబిడ్డలకు ఏమాత్రం కరుణ చూపలేము. పేద గర్భిణీ ఆడపడుచులకు త్రాగడానికి ఇన్ని పాలు కూడా ఇచ్చే ఆస్కారం కలిగించమే – ఇదేనా మన రాజకీయం? ఒక ప్రక్కన ఈ విధంగా ప్రజల కోసం It is for the people and by the people. I am

telling it to you, the democracy means it is for the people and by the people. ప్రజల కోసం ప్రజలచే నిర్వహించబడేటటువంటి రాజకీయ విధానమే రాజకీయం. అటువంటిది పోయి ఈనాడు మీకు ఉన్నటువంటి పదవులు, అధికారం కేవలం మీ పార్టీ ప్రాబల్యానికి వాడుకుంటున్నారే ఇది ఎంత అవమానకరమైన విషయం? ఏమి.. మీ పార్టీకి డబ్బు లేదా? ఏమి.. కోట్లానుకోట్లు ఇచ్చేటటువంటి మహానుభావులు అందరూ మీకు వత్తాసు పలుకుతున్నారే. పెద్ద పెద్ద వారందరూ మీరు కోరితే బిల్డింగ్స్ కట్టిస్తారే, కోట్లు ఇస్తారే. మరి ఈనాడు ప్రజల నోళ్ళు ఎందుకు కొడుతున్నారు మీ ప్లీనరీ సమావేశాలకు అని నేను అడుగుతున్నాను. ఈనాడు తిరుపతిలో 25 కోట్లు ఖర్చు పెడతారటండి. ప్రభుత్వ యంత్రాంగము అక్కడే ఉందటండి. చిత్తూరు జిల్లా కలెక్టరుగారు ప్రత్యేకంగా దానికి ఛైర్మనట. పైగా అధికారులు అంతా కూడా అక్కడే ఉన్నారటండి.

43 బుల్ డోజర్స్ అక్కడ ఉన్నాయి. 43 బుల్ డోజర్స్‌తో మరి కలెక్టర్ గారి ఆధ్వర్యములో, హౌసింగ్ బోర్డు - అది ప్లీనరీ సమావేశమో లేకపోతే ప్రజల సమావేశమో నాకు తెలియడం లేదు. అక్కడ వారి కోసం తారు రోడ్డు కావాలట, మరి కాంక్రీటు రోడ్డు కావాలట. రాయి రప్ప ఏమీ లేకుండా నున్నగా, చక్కగా సరిచేయబడాలట, పూర్తిగా దానికి బిల్డింగు కూడా కట్టాలట వీలుగా ఉంటే బడా బడా ఆర్టిస్టలు, సినిమాలో ఉండేటటువంటి ఆర్ట్ డైరక్టర్స్ వారందరినీ మద్రాసు నుండి రప్పించారు. ముఖ ద్వారాలు పూర్తిగా అలంకరించండి. మన వైభవం చాటండని ఎవరిది అని చాటుతారు? ఇదంతా గతిలేని ప్రజల డబ్బు కాదా అని నేను అడుగుతున్నాను. ఆ స్థలం ఎవరిదని అడుగుతున్నాను. అక్కడ ఉండే చెరువును పూర్తిగా ప్రజలకు త్రాగడానికి నీళ్లకైనా ఉపయోగపడే దానిని మీరు కనీసం త్యాగముతో ఇస్తే పేదవారికి 80 గజాలు స్థలం ఇవ్వండి, ఇల్లు లేక చచ్చేవాడికి ఇంత నీడ కల్పించండి, అది పోయి కేవలం మీ పార్టీ కోసం మీకు అధికారం ఉంది కదాని మదోన్మదంతో ఈ విధంగా వ్యవహరిస్తారా, ఇదేనా కాంగ్రెస్ విధానం అని చెప్పి కేంద్రాన్ని కూడా అడుగుతున్నాను. Let the Prime Minister answer me. He is the A.I.C.C. President. ఆయన ఆల్ ఇండియా కాంగ్రెస్ ప్రెసిడెంట్. ఆయన నీతి ఇదేనా అని నేను అడుగుతున్నాను.

ఈ సభా సందర్భముగా నిజాయితీతో మాట్లాడే వాడిని నేను, ఎవరికీ జంకడం లేదు. నేను భారతీయుడిని, ఇది నిజం, సత్యం మీ ముందు పెడతున్నాను. మీరు ఆలోచించండి దయచేసి మీరు సలహాలు చెప్పండి. మీ వారికి ఇదేనా మన విధానం అని. ఇది చరిత్రలో శాశ్వతంగా మీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసినటువంటి దుర్విధానం చిరస్థాయిగా లిఖించబడుతుంది. సిగ్గుతో తలవంచుకోవాలి. మీరందరూ కూడా ప్రజలకు కూడు పెట్టలేని వాళ్లు... I have not referred to him as Prime Minister of India, I have referred to him as President of All India Congress Party.. All India Congress Party President....

అధ్యక్షా, ఇక ధరల సూచిక విషయంలో మనవిచేస్తున్నాను. అగ్రికల్చరల్ కమాడిటిస్ హెూల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్ మార్చి 1991 నాటికి 441.6 పాయింట్లు ఉంటే నవంబరుకు 621.9 పాయింట్లుకు వచ్చింది. అంటే మన రాష్ట్రంలో 29.1 శాతం పెరుగుదల ఉందని మనవిచేస్తున్నాను. అదే ఆల్ ఇండియా లెవల్లో 505.6 పాయింట్ల నుంచి 583.8 పాయింట్లకు పెరిగింది అంటే కేవలం 15.5 శాతం మాత్రమే పెరుగుదల ఉందన్న విషయం గమనించాలి. అట్లాగే కన్‌జ్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఫర్ ఇండస్ట్రియల్ ప్రొడక్ట్స్ మార్చి 91 నాటికి 959 పాయింట్లు ఉంటే డిసెంబర్ 91 నాటికి 1104 పాయింట్లకు పెరిగింది. అంటే పెరుగుదల 15.1 శాతం కానీ ఆల్ ఇండియా లెవెల్లో 991 నుంచి 1109 వరకు పెరిగింది.

ఇది గమనించవలసిన విషయం. అంటే పెరుగుదల 11.9 శాతం మాత్రమే మన రాష్ట్రంలో ఈ విధమైన పెరుగుదల ఎందుకు ఉంది? పెరుగుదలను అరికట్టేందుకు మన రాష్ట్ర ప్రభుత్వం తీసుకొన్న చర్య లేమిటి? అన్ని రాష్ట్రాలతో పోల్చిచూస్తే మన రాష్ట్రం ప్రభుత్వం ధరలను ఎందుకు అదుపులో పెట్టలేకపోయింది? ఇది తలవంచుకోవలసిన విషయమని మనవిచేస్తున్నాను. ఇకపోతే మన రాష్ట్రంలో మార్చి 91లో 675 ఉంటే నవంబరు 91 నాటికి 813కు అనగా 20.4 పర్సెంట్ పెరుగుదల అయితే ఆల్ ఇండియా 850 నుండి 991కి అంటే కేవలం 16.4 శాతం మాత్రమే పెరుగుదల ఉంది. ఇది గమనించాలి. ఇందులో రాజకీయం ఏమీలేదు. ఆల్ ఇండియా లెవల్లో పోలిస్తే, మన రాష్ట్రంలో ఈ రకమైన ధరల పెరుగుదల ఎందుకు ఉందో ఒక్కసారి గమనించాలని మనవిచేస్తున్నాను.

**అన్ని రాష్ట్రాలతో పోల్చిచూస్తే మన రాష్ట్రం ప్రభుత్వం ధరలను ఎందుకు అదుపులో పెట్టలేకపోయింది? ఇది తలవంచుకోవలసిన విషయమని మనవిచేస్తున్నాను. ఇకపోతే మన రాష్ట్రంలో మార్చి 91లో 675 ఉంటే నవంబరు 91 నాటికి 813కు అనగా 20.4 పర్సెంట్ పెరుగుదల అయితే ఆల్ ఇండియా 850 నుండి 991కి అంటే కేవలం 16.4 శాతం మాత్రమే పెరుగుదల ఉంది.**

ఈ విధంగా మనం ధరల పెరుగుదలను అరికట్టలేకపోతే ఏ విధంగా పేద ప్రజానీకం కడుపుమంటతో దహించుకుపోతారో ఒక్కసారి దయచేసి ఆలోచించాలని సవినయంగా మనవిచేస్తున్నాను. పోతే మనం ఒకరి చెప్పుచేతల్లో నడిచేవాళ్లమే తప్ప మన స్వాతంత్ర్యం అంటూ ఎప్పుడో పోయింది. మన డెఫిసిట్ బడ్జెట్ 209 కోట్లు అయినా ఈనాడు రూపీ డీవాల్యుయేషన్ ప్రకారం అది 500 కోట్లు అవుతుందో, 600 కోట్లు అవుతుందో చెప్పలేని పరిస్థితి. ఏ విధంగా మనం దేశాన్ని అధోగతిపాలు చేసి తాకట్టు పెట్టి బ్రతుకుతున్నామో ఒక్కసారి గమనించాలని మనవిచేస్తున్నాను. ఈ 5, 6 వందల కోట్ల రూపాయల లోటును ప్రభుత్వం ఏ విధంగా భర్తీ చేయబోతోంది? మూడున్నర రూపాయలకు కిలో బియ్యం కూడా ఇవ్వరా? బియ్యం ధర ఐదు రూపాయలు చేస్తారా ఆరు రూపాయలు చేస్తారా, అది కూడా చెప్పండి. అన్నీ తీసివేశాం మనకు

పేద ఆడపడుచులు అక్కరలేదు, గ్రామంలోనే పేద ముసలివాళ్లు అక్కరలేదు, వ్యవసాయ కూలీలు అక్కరలేదు, కావాలసిందల్లా మనమూ, మన పొట్టే. ఈ విధంగా చేస్తే పేదలగతి ఏమవుతుందో ఒక్కసారి గమనించాలని మనవిచేస్తున్నాను.

ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రసంగంలో ఏమీ ప్రసాదించబడలేదు. కేవలం ఏదో పబ్బంగడుపుకొనేట్టుగా దీనిని ప్రవేశ పెట్టారు. ఇందులో వారి సిద్ధాంతాలను ఆచరించినట్లుగానీ, వారి హామీలను నెరవేర్చినట్లుగా ఎక్కడా లేదు. మాకు అధికారం ఇచ్చారు. ఇక నోరు మూసుకోండి. మీ నెత్తిన పెద్దమ్మల్లా మేము తైతక్కలాడతాం' అన్న నిరంకుశ విధానమే తప్ప ప్రజా సంక్షేమం ఏమాత్రం గుర్తించబడలేదని సవినయంగా మనవిచేస్తున్నాను. అసలు ఈ దుస్థితికి కారణం ఏమిటి? నిత్యలక్ష్మి తాండవించిన మన రాష్ట్రం, అన్నదాతగా, అన్నపూర్ణగా పేరుపొందిన మన రాష్ట్రానికి ఈనాడు పట్టిన దుర్గతి ఏమిటో ఒక్కసారి ఆలోచించండి. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఉండగా సుమారు 200 కోట్ల రూపాయల మేరకు ఉన్న ఎక్సైజ్ ఆదాయం తెలుగుదేశం ప్రభుత్వ హయాములో 740 కోట్ల రూపాయలకు పెరగడం జరిగింది. కానీ ఈనాటి పరిస్థితి ఏమిటో చెప్పమనండి.

అంకెలు ఇవ్వమనండి సంతోషిస్తాం. ప్రజలు కూడా సంతోషిస్తారు. మేము ఓట్లు వేసిన ప్రభుత్వం ఈనాడు ఆదాయాన్ని పెంచుకొందని ప్రజలు ఆనందిస్తారు. ఎక్సైజ్ ఆదాయం ఎంత ఉందో దయచేసి చెప్పమనండి. అదేవిధంగా ఈనాడు సేల్ టాక్స్ పరిస్థితి ఏమిటి? ఈనాడు సిమెంట్ కంపెనీలకు కూడా సేల్స్ టాక్స్, మినీప్లాంట్స్‌పై కూడా సేల్స్ టాక్స్ వేసే కర్మ ఎందుకు పట్టింది? 50 రూపాయలు ఉన్న సిమెంట్ బస్తాను ఈనాడు బజార్లలో 91 రూపాయలకు అమ్ముతున్నారు. ఈనాడు కోట్లు కోట్లు సంపాదించుకొంటున్న బడా బాబులకు తొత్తులుగా బ్రతకవలసిన అవసరం ఈ రాజకీయానికి ఎందుకు పట్టింది స్వామీ అని అడుగుతున్నాను. కేవలం రాయితీలు అంటే వారికేనా? ఈనాడు రాళ్లు కొట్టుకొని బ్రతికేవారు, చేనేత కార్మికులు, అహర్నిశలు మేడిపట్టి శ్రమించే రైతులు, యంత్రాలలో యంత్రాలలాగా మారిపోయి చెమటోడ్చి పనిచేసే కార్మికులు వీరు కనిపించరా అని అడుగుతున్నాను. నేను రైతు బిడ్డనే. సినిమా నటుడిగా ఉన్నాను. నన్ను పైకి తెచ్చింది తెలుగు జాతి. నేను సినిమా నటుడినని వారికి తెలుసు. కళే సమాజానికి సేవ చేయాలి. ఈ కక్కుర్తి అవినీతి రాజకీయం కాదని ప్రజలు బాగా గుర్తించారు. అందుకే ఈనాడు మమ్ములను ఎం.ఎల్.ఏ.లుగా నిలబెట్టారు, ఎప్పటికైనా తిరిగి 'తెలుగుదేశమే' ఆశాజ్యోతి అని ఈనాడు ప్రజలు కన్నీళ్లు పెట్టుకొని చెపుతున్నారు, అది గుర్తించడం చాలా మంచిదని మీకు మననిచేస్తున్నాను.

విద్యావిధానం విషయంలో గత ప్రభుత్వం ఎన్ని సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించిందో పరిశీలిస్తే తెలుస్తుంది. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చి ఏమి చేస్తున్నారు?

క్యాపిటేషన్ ఫీజు వసూలు చేసుకునే వీలు కల్పిస్తున్నారు. ఆ ఫీజులను పెంచుతున్నారు. విద్యను అమ్ముకునే బ్రతుకుతున్నారని చెబుతున్నారు. ఈనాడు రెగ్యులర్‌గా ఎపాయింట్ చేసుకోవడానికి వీలుగా 10 వేల ఖాళీలు ఉన్నాయి. అట్లాగే టీచర్సు నియామకాల విషయంలో కూడా ఏమీ జరగడంలేదు. ఈ విధంగా జరిగితే పిల్లలకు శిక్షణ ఎక్కడ నుంచి వస్తుంది? వారు ఏ విధంగా పరీక్షలు పాస్ అవుతారు? ఇపుడు ఈ కాలేజీలు అంతాకూడా ప్రైవేట్ ఇండివిడ్యువల్స్ చేతులలో పెడుతున్నారు. మేము మా ప్రభుత్వ హయాములో ఎవరైనా ఈ పరీక్షలలో పాస్ కాని పక్షంలో వారు ప్రైవేట్‌గా కట్టుకోవడానికిగాను, శిక్షణను ఇవ్వడానికి గాను 100 ఎకరాల భూమిని మంజూరుచేసి, బిల్డింగులకు కూడా డబ్బు శాంక్షన్ చేసాము. ఆ 100 ఎకరాల ఏమి అయినాయి. ఆ లాండ్‌ను అంతాకూడా హౌసింగు కాలనీలుగా ఏర్పాటుచేసి మీరు భూములు అమ్ముకొని బ్రతుకుతున్నారు. With regard to educational policy, the government said that emphasis would be shifted from numbers to quality. ఒక్క ప్రక్కన క్వాలిఫైడ్ టీచర్సు ఉద్యోగాల కొరకు పొట్టలుపట్టుకొని తిరుగుతున్నారు.

వారికి ఆదరువులు లేకుండా చేయాలని, మీరు ఉద్యోగాలకు సంబంధించిన ఖాళీలు భర్తీ చేయడం లేదు. మీరు బాధ్యతగల వ్యక్తులు, మీరు బాధ్యతగా ఆలోచించండి. మీరు సరైన విధానాలు అవలంభించి ఈ రాష్ట్రమును నడపాలని కోరుతున్నాను. అదేవిధంగా సాంఘిక సంక్షేమం విషయంలో ఇళ్లస్థలాలకు గాను ఈ సంవత్సరం ఒక రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు. వారికి ఇల్లు లేదు, వాకిలి లేదు, నీడ లేదు ఆశ్రయం లేదు, పెళ్లాం బిడ్డలతో చెట్టు క్రింద, ఫుట్‌పాత్ మీద బ్రతుకుతున్నారు. ఇది ఈనాడు ప్రభుత్వం వారికిచ్చిన కానుకగా తమ ద్వారా మనవిచేస్తున్నాను. కిలో రెండు రూపాయల బియ్యం పథకం ఏమవుతుందో? దేవుడికే తెలియాలి. రూ. 1.25 సబ్సిడీ అంటున్నారు. ఇదేమిటి? నాకు అర్థం కాలేదు. రేపు బియ్యం ధర కిలో రూ. 10 అయితే రూ. 1.25 సబ్సిడీ పోతే రూ. 8.75కు ఏర్పాటు చేస్తారా? నేను స్ట్రెయిట్‌గా ముఖ్యమంత్రిగారిని అడుగుతున్నాను.

సమాధానం చెప్పమనండి. ఎంత ధర అయినా దానిలో రూ. 1.25 సబ్సిడీ తీసేసి మిగతాది కిలో బియ్యం ధరగా నిర్ణయిస్తారా? ఇదేనా పేదలకు వారిచ్చే వరం? ఇదేనా ప్రజలను అమాయకులను చేసి, వారిని మోసం చేసే విధానం? వస్త్రాలు లేవు. పెన్షన్లు లేవు. అన్నీ స్వస్తి. లేవని అనడం మన ఆచారం అయింది ఈనాడు. లేవు అనడం మన జాతి లక్షణం కాదు. సంస్కృతి కాదు. మనకు లేకపోయినా పొట్టలోది తీసిపెట్టాం. అటువంటిది కేవలం ఎవరైతే ఆశ్రయం లేకుండా ఉన్నారో, ఎవరైతే పేదలున్నారో, వారి నోళ్లు కొట్టే విధానానికి, వారి నెత్తురు తాగే విధానానికి ఈనాడు ఈ ప్రభుత్వ విధానాలు ఉన్నాయంటే నా తీవ్ర బాధను, పరితాపాన్ని వ్యక్తం చేస్తున్నాను. ఒక మాట అన్నారు. విద్యా విధానంతో emphasis will be shifted

from numbers to quality అన్నారు. క్వాలిటి అంటూ ఉన్న స్కాలర్ షిప్‌ను తగ్గిస్తారా? క్వాలిటీ పేరుతో విద్యార్థులకు ఇచ్చే ఆశ్రయాన్ని కూడా తగ్గిస్తారా? ఈ పేరుతో నెంబర్‌ను తగ్గిస్తారా? క్వాలిటీ ఎట్లా ఉంటుందండీ? మనమంటే ఎలక్ట్రిక్ దీపాల ముందు కూర్చున్నాము. వారికి గతిలేక దీపం బుడ్డి పెట్టుకుని చదువుకుంటున్నారు బిడ్డలు. ఒకసారి ఒక జడ్జిగారు చెప్పారు. మనం ఫ్యాన్స్ క్రింద ఉన్నాం, వారికి ఫ్యాన్లు లేవు. మనకు బట్టలున్నాయి. వారికి బట్టలు లేవు. ఈ పద్ధతిలో చదువుకుంటున్నారు. వారి విజ్ఞానాన్ని ఎట్లా పెంపొందించాలి? ఈ విధంగానా? ఈ విధంగా క్వాలిటీ అంటే, క్వాలిటీ లేని వారు మన ముందు ఎట్లా నిలబడతారు? ఆ మాత్రం ఇంగితం ఉండనక్కరలేదా? ఆ మాత్రం కన్సిడరేషన్ ఉండనక్కరలేదా? మొన్న అడిగితే రిజర్వేషన్స్ సంగతి ధైర్యంగా చెప్పలేకపోయారే? ఎందుకండీ మాట్లాడతారు? ఎస్.సి, ఎస్.టి, బి.సి.ల రిజర్వేషన్ గురించి అడిగితే మేము ఇస్తాము అని చెప్పే గుండెనిబ్బరం లేకపోయిందే. పేదల పట్ల అంకిత భావం లేకపోయిందే, తెలివి ఉందని వారి ఇష్టం వచ్చినట్లు మాట్లాడతారా? కొటేషన్స్ ఇస్తారా? వారి విద్యా విజ్ఞానానికి నమస్కారం. వారి మోసానికి వారిని తెగనాడుతున్నాం.

> **వస్త్రాలు లేవు. పెన్షన్లు లేవు. అన్నీ స్వస్తి. లేమ అనడం మన ఆచారం అయింది ఈనాడు. లేవు అనడం మా జాతికి లక్షణం కాదు. సంస్కృతి కాదు. మనకు లేకపోయినా పొట్టలోది తీసిపెట్టాం. ఎవరైతే ఆశ్రయం లేకుండా ఉన్నారో, పేదలున్నారో, వారి నోళ్లు కొట్టే విధానానికి, వారి నెత్తురు తాగే విధానానికి ఈనాడు ఈ ప్రభుత్వ విధానాలు ఉన్నాయంటే నా తీవ్ర బాధను వ్యక్తం చేస్తున్నాను.**

పురపాలక సంఘాల రాబడి ఇది మిస్‌మేచట. అంటే ఆదాయానికి, ఖర్చుకు సరిపోవడం లేదు కనుక ఖర్చుకు సరిపడా ఆదాయం పెంచడానికి ఆస్తుల మీదా, ఇళ్ల మీధా పన్నులు పెంచుతారా? వారు చేసే దుర్వ్యాపారాలకు ప్రజలు బలి కావాలా? పేదలు పూరి పాకలో ఉంటున్నారు. మన సంస్కృతి అది, మన మమకారం అది. వారు కోరితే, అటువంటి నీడను ఏర్పాటు చేసుకున్న వారి మీద ఈ విధమైన నిరంకుశత్వంతో వారి ఆస్తుల మీద పన్నులు పెంచుతారా? ఇదేనా ఈ ప్రభుత్వ విధానం? ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పారు. రెండురూపాయలకు కిలో బియ్యం పథకం కొనసాగిస్తామన్నారు. వారు చెప్పిన మాటే. ప్రజలను వంచించడం, దగా చేయడం, ఏరు దాటాక తెప్ప తగలబెట్టడం అవుతుందని ఈ సందర్భంగా వారికి నేను గుర్తు చేస్తున్నాను. రాజకీయంగా నీతి ఉండాలి. అన్నమాట నిలబెట్టుకోవాలి. పేదల సంక్షేమం చూడాలి. కేవలం అధికారంలోకి వచ్చాం కదా, మెజారిటీ ఉంది కధా అని వారి ఇష్టం వచ్చినట్లు వారు మాట్లాడడం కాదు. తప్పుడు నిర్ణయాలు చేయడం కాదని మనవిచేస్తున్నాను. అల్పసంఖ్యాక వర్గాలవారు ఉన్నారు. ఏవండీ రూ.10 కోట్లతో జంటనగరాలకు పర్మనెంట్‌గా వాటర్ వస్తుందా? తెలుగుదేశం ప్రభుత్వ కాలంలో అక్కంపల్లి రిజర్వాయరు దగ్గర నుంచి మూడు అంచెల మీద నీరు తెద్దాం అని ఏర్పాటుచేసి శంఖుస్థాపన కూడా చేయడం జరిగింది రికార్డులు ఉన్నాయి.

కేవలం మసిపూసి మారేడు కాయచేసే విధంగా, బులి బుచ్చకం మాటలు చెబితే నమ్ముతారనే విధంగా రూ.10 కోట్లు పెట్టారు. కృష్ణానదీ జలాల వివాదం 2000 ఎ.డి.తో అయిపోతుంది. రూ.10 కోట్ల ప్రకారంగా చేస్తే ఎన్ని సంవత్సరాలు దీనిని నిర్వహిస్తారు? రూ.7 నుండి రూ.8 వందల కోట్లు అవుతుందని వారే చెప్పారే రూ.10 కోట్ల చొప్పున కేటాయిస్తే 80 సంవత్సరాలు అవుతుంది. అంటే ఇన్ని సంవత్సరాలా? పర్మనెంట్ వాటర్ తేవడానికి ఇదా పద్ధతి? ఇదేనా వారు ప్రజలకు చెప్పేది? చెప్పవలసిన విధానం ఇదా? దయచేసి వారినే ఆలోచించమనండి. వారు కూడా బాధ్యత కలిగిన ప్రజాప్రతినిధులు రేపు వారిని అడిగితే ఎట్లా సమాధానం ఇస్తారు. మంత్రిగారు, జనార్దన్‌రెడ్డిగారు ఉన్నారు. వారికి ఓట్లు ఇచ్చిన ప్రజలు వారిని అడిగితే ఏం సమాధానం చెబుతారు? మంచినీరు ఏదంటే 30 సంవత్సరాల తరువాత ఇస్తానని చెబుతారా? అదే వారి రీతి అయితే చెప్పమనండి.

రెవెన్యూ పరిపాలన ఎంత అస్తవ్యస్థంగా ఉందో మనవిచేస్తాను. అధికార వికేంద్రీకరణ జరగాలి అని 330 సమితులు ఉన్న స్థానంలో 1104 మండలాలను ఏర్పాటు చేయడం జరిగింది. అధికారం అన్నది హైదరాబాద్‌లో కాదు పేద వాడి ఇంటి ముందు నిలవాలి. పేదవాడి తలుపు తట్టాలి. వారి సమస్యలు తెలుసుకుని, పరిష్కరించాలానే భావంతో, ఇటువంటి ఆదర్శ భావంతో ఏర్పాటు చేసిన మండలాలను ఈనాడు 500 బ్లాకులు చేస్తామని ఒకరు, ఇంకొకరు సగం చేస్తామని, మరొకరు తరువాత ఆలోచిద్దామని, నిర్ణయం చేద్దామని అంటున్నారు. ఏమిటీ అనిశ్చిత విషయాలు? ఆల్‌రెడీ ఆ కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. అధికారులను నియమించడం జరిగింది. పనిచేస్తున్నాయి. ఈనాడు ఇతమిద్ధంగా చెప్పి, గౌరవం దక్కించుకోలేక పోతున్నారు అంటే ఏ విధంగా వారి భావనలో, స్ఫూర్తిలో, నిర్ణయాలలో నిశ్చితాభిప్రాయంతో లేదో, సిద్ధాంత బద్ధులు కాలేకపోతున్నారో, ఏ విధంగా ప్రజలను మోసం చేస్తున్నారో తమ్ముళ్లూ మీరే ఆలోచించండి అని మనవిచేస్తున్నాను.

ఆలోచిస్తే వారికే తెలుస్తుంది. ఆనాడు ప్రజాప్రతినిధులను మేము గౌరవించాం. అధికారాలు ఇచ్చాము, పూర్తిగా వారు పర్యవేక్షించారు. డి.ఎస్.సి.లు ఉన్నాయి. కలెక్టరు, జడ్.పి.ఛైర్మన్, వ్యవసాయాధికారులను ఏర్పాటు చేశాము. ఈనాడు ఒకరికి కూడా ఉద్యోగాలు ఇచ్చి, ఏర్పాటుచేసే విధానం లేదే తమ్ముళ్లూ ఎందుకు? టి.డి.పి వారు జిల్లా పరిషత్ ఛైర్మన్లుగా ఉన్నారని కోపమా? చెప్పమనండి తెలుగుదేశం వద్దు, కాంగ్రెస్ పాలిస్తుంది రాష్ట్రాన్ని అంటే అది కూడా చెబితే బాగుంటుంది. ప్రజలున్నారు. వారు నిర్ణయిస్తారు. ఈ విధమైన స్వయం నిర్ణయాలతో, స్వార్థపూరిత నియంతృత్వ నిర్ణయాలతో ప్రజలను, ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేస్తామంటే ప్రజలు వారిని హర్షించరు. ప్రజాప్రతినిధులకు గౌరవించండి, గుర్తించండి. అధికారులకు మనం తొత్తులం కాదు. ప్రజలకు దాసులం, సేవకులం. ఆ ప్రజాప్రతినిధులను గౌరవించడం ఉండాలి. అప్పుడే

మాకూ, వారికీ అందరికీ గౌరవం వస్తుంది. కేవలం బులిబుచ్చకం మాటలు చెప్పడం విధానమా? ఈ అధికారులే మాకు ఆనాడు సలహాలు చెప్పారు. ఇప్పుడు వీరికి చెబుతున్నారు. ఆనాడు మండలాలు కావాలన్నారు వారే. జిల్లా ప్రజాపరిషత్తులకు అధికారాలు ఇవ్వాలని చెప్పింది వారే. ఆ బ్యూరోక్రాట్స్, ఆ సెక్రటరీలే, ఈనాడు వీరికి చెబుతున్నారు. ఏది మంచో ఆలోచించమనండి. మంచిపని చెయ్యమనండి. మనకంటే ఎక్కువ పొద్దుపొడిచిందా వారి ముఖాన? ఈ ప్రభుత్వం వారి విధానాలకు, వారి సిద్ధాంతాలకు, కాంగ్రెస్ పద్ధతులకు తిలోదకాలు ఇవ్వకూడదని సవినయంగా వారికి మనవిచేస్తున్నాను.

కమిషనరేట్ ఆఫ్ టెండర్స్‌ను ఎందుకు పెట్టాం? అక్కడక్కడే కుంభకోణాలు ఏర్పాటయి, ప్రభుత్వాన్ని దోచుకుని తింటున్నారు. 80 శాతం వరకూ పెంపుదలతో టెండర్లు వేయడం ఎవరైనా వేస్తే, వారిని తంతాం. చంపుతాం అని బెదిరించడం. చివరకు వారే తమ స్వంత సొత్తు అన్నట్లుగా దేశాన్ని పంచుకుని తినడం. ప్రజల కోసం ఏర్పాటు చేయబడిన కాలువల తవ్వకం, రోడ్లు వేయడం వంటి కార్యక్రమాలలో కూడా తప్పుడు విధానాలు ఈ విధంగా ఉంటే హైదరాబాద్‌లో కమిషనరేట్ ఆఫ్ టెండర్స్ అని పెట్టడం జరిగింది. టెండర్లు అన్నీ ఇక్కడకు రావాలి. ఇక్కడ నిర్ణయించాలి. ఏది సబబు అనేది చిత్తశుద్ధితో చూడాలి. మీకు తెలుసు అధ్యక్షా. మొన్న టెండర్లలో సుమారు 30 శాతం నుండి 35 శాతం తక్కువకు కొన్ని టెండర్లు వచ్చాయి. వాటిలోనే 80 శాతం నుండి 85 శాతం వరకూ పెంపుదలతో కొన్ని టెండర్లు వచ్చాయి. ఎందుకు వచ్చాయి? వారిదే ప్రభుత్వం. వారే చూశారు ఈ మతలబు? ఎందుకు 30 శాతం నుండి 80 శాతానికి పెంపు జరిగింది? ఎవరు దీనిలో కుమ్మక్కు అయినారు? ఎవరు బాధ్యులు? దయచేసి ఆలోచించాలి. ప్రజల సొమ్ము రక్షించాలి. ప్రజలు అధికారం ఇచ్చారు. వారు పదవిలో ఉన్నారు. పూర్తిగా బాధ్యత వహించి పేదప్రజలకు న్యాయం చేస్తారా? కాంట్రాక్టర్ల కడుపు కొట్టమని మొన్న ముఖ్యమంత్రిగారు అన్నారు అంటే పేదల కడుపులు కొడతారా? ఏమిటిది? ఈ స్టేట్‌మెంట్ నాకు అర్థం కాలేదు.

అదే అడుగుతున్నాను. పేదల కడుపులు కొడతారా? ఇదేనా వారి విధానం? ఇదేనా గాంధీజీ చెప్పింది? ఇదేనా నీతి? వారు అలవరచుకున్న నీతి ఇదేనా అని తమ్ముళ్లను అడుగుతున్నాను. ఇదేనా వారు చెప్పే విధానం అని వారిని నేను సవినయంగా అడుగుతున్నాను. అసలు బడ్జెట్‌లో బాధ్యత కలిగిన వాటి గురించి ఏమీ చెప్పలేదే. లా అండ్ ఆర్డర్ గురించి ఏమిటి? పొద్దున పేపర్ చూస్తే రక్తపాతం, నెత్తుటి మడుగులు పేపర్ నిండా ఎర్ర రంగుతో చూస్తున్నాము, ఎక్కడ చూసినా మానభంగాలు, ఎక్కడ చూసినా హత్యలు, ఎక్కడ చూసినా దోపిడీలు. ఈ మధ్యన పోలీసులు పోలీసులనే చంపుకుంటున్నారట. ఈ విషయం మాకు అర్థం కాలేదు. ఇదేమిటి? ఈ విషయం మాకు అర్థం కావడం లేదు.

వాళ్లలో వాళ్ళకే ఏమిటి? ఎందుకు తగువులాట వచ్చిందో మాకు తెలియడం లేదు. ఈ విధమైన అసంతృప్తి, ఆరాచకత్వం మన రాష్ట్రంలో అట్టుడికినట్లు ఉడికిపోతుంటే తమకేమీ పట్టినట్లు లేదు. కనీసం శాంతిభద్రతల విషయం ఒక్క మాట కూడా వ్రాయలేదు. ఈ ఓటాన్ అకౌంట్ it is the Government's property. It is the Government's obligation to give law and order to the State. అటువంటిది విస్మరించి తమ బాధ్యత కలిగిన విషయం ఒక మాట చెప్పి సామాన్య మానవుడికి రక్షణ కలిగించలేకపోయింది ఈ ప్రభుత్వం. అంటే ఏ విధమైన దురహంకారంతో, ఏ విధమైన దౌర్జన్యంతో, అధికార దర్పంతో వ్యవహరిస్తున్నదో ఈ ప్రభుత్వం అన్నది అందరూ గుర్తించాలి. ప్రజలంతా కూడా గుర్తించాలని తమరిద్వారా మనవిచేస్తున్నాను.

మైనారిటీ సోదరులున్నారు. ఇప్పటికే వారు భయపడుతున్నారు. ఇక్కడ ఏదైనా సరే మాకు రక్షణలేదు అంటున్నారు. తెలుగుదేశం పార్టీ పరిపాలన చేసిన 7 సంవత్సరాల కాలంలో ఒక్క దురదృష్టకరమైన సంఘటన జరగలేదు. ఈనాడు ఎన్ని చావులున్నాయో మీకు తెలుసు. ఎంత మంది ముస్లిం సోదరులు, హైందవ సోదరులు చనిపోయారో దాని విషయంతో ఏమీ లేదు. వారికి మేము చేసిన కార్యక్రమాలు ఎన్నో ఉన్నాయి. 100 ఉర్దూ మీడియం స్కూల్స్ తెరిపించాము. వక్ఫ్ ఆస్తులకు రూ.25 లక్షలు నేను ఇచ్చాను. మా ప్రభుత్వం ఉన్నప్పుడు. 20 లక్షల రూపాయలు ఖబర్‌స్థాన్ మరమ్మతులకు నేను ఇచ్చాను. వారికి పూర్తిగా చదువుకునే అవకాశాలు కల్పించబడ్డాయి ఎన్నో విధాలుగా.

అదేవిధంగా కర్నూలు, గుంటూరు, నిజామాబాదు, హైదరాబాద్‌లో ఆశ్రమ పాఠశాలలు తెరిపించాము. ప్రత్యేకంగా ఉర్దూ చదువుకునే మైనారిటీ సోదరుల కోసం మీరు వారికి ఏమి ఇవ్వదలచుకున్నారు? వారిని ఏ విధంగా రక్షించదలచుకున్నారు? ఏ విధంగా వారికి రక్షణ కల్పించదలచారు.? ఏ విధమైన మత ప్రసక్తి లేకుండా మానవత్వంతో, సోదరత్వంతో వాళ్లను లాలించగలుగుతారు? ఏ విధంగా నమ్మకం కలిగిస్తారని కూడా చెప్పే ఔదార్యానికి ఈ ప్రభుత్వం నోచుకోలేదా? ఈ విధమైన సవతి తల్లి ప్రేమతో సమాజం పట్ల ప్రవరిస్తున్నారో ఒకసారి గుర్తించుకోవాలని నేను సవినయంగా మనవిచేస్తున్నాను. ఈ సభలో కూడా ఏ విధంగా వ్యవహరిస్తున్నారో మీకు తెలుసు. ఏమయ్యా నీవు అభివృద్ధిలోకి రావలసిన వాడివి సీతారాం అంటే మరి ముఖ్యమంత్రిగారి అభిప్రాయం ఆయనను కూడా కాంగ్రెస్ పార్టీలో జాయిన్ కమ్మనా అని అడుగుతున్నాను. పైకి రావలసిన వాడివి, మాలో చేరితే నీకు మంచి ఛాన్స్ ఇస్తాను అని ఆయనను ఆశపెట్టడమా? లేకపోతే ముందర ఉంది ముసళ్ల పండగ అట. ఎన్నో పండగలు మేమూ చూస్తూనే వస్తున్నాము. నాకు 69 నిండి 70వ సంవత్సరం రాబోతోంది. ఈ పండగలన్నీ నేనూ చూసాను. చూద్దామనే నేనూ వచ్చాను రాజకీయానికి. ఈ విధమైన బరితెగింపు మాటలతో

మనుషులను రెచ్చగొట్టడం, తనకున్న అధికారాన్ని దుర్వినియోగం చేయడం కానీ మంచిది కాదు. ఇది అభివృద్ధికి, ప్రజల విశ్వాసానికి కూడా ఏమాత్రం మంచిది కాదు. ఏ విధమైన అభ్యుదయం ఉండబోదని, మీకు నేను మనవిచేస్తున్నాను.

తథాగతుడు మునిగిపోయాడు. బుద్ధుడు ఊపిరాడక నీళ్లలో చనిపోతున్నాడు. నమ్మమంటారా? ఎన్నోసార్లు ఎప్పటికప్పుడు చెబుతున్నారు. ఎన్నోసార్లు వాయిదా వేసారు. అయ్యా మిమ్ములను అడుగుతున్నాను. చెప్పండి. మేము ఏవో బోట్లు తెస్తున్నాము. పైకి లేపుతాము అంటున్నారు. ఏమిటండీ? అసలు అసమర్థత్వాన్ని కప్పిపుచ్చుకోవడానికి చెప్పే దగాకోరు మాటలా ఇవి ఇంకా నమ్ముతున్నారా? ఇంకా ఆశ ఉందా? ప్రజలలో కాంగ్రెస్ ప్రభుత్వానికి పలుకుబడి ఉందని మీరు అనుకుంటున్నారు? ఒక్కసారి దయచేసి వారిని చెప్పుమని కోరుతున్నాను. ఇన్ని విధాలుగా అన్ని వర్గాల వారు అసంతృప్తితో చావలేక బతుకుతున్నారు. ఏమాత్రం పట్టించుకోవడం లేదు. బడ్జెట్ కూడా పూర్తిగా ఇచ్చే ధైర్యం లేదు. ఓట్ ఆన్ అకౌంట్ మూడుసార్లు ఇచ్చారు. వన్స్ ఇటీజ్ ఎక్స్‌క్యూజబుల్. సెకండ్ ఈజ్ ఫాల్ట్. థర్డ్ ఈజ్ మోసం అని దానికి పూర్తిగా అపాదిస్తున్నాను.

ఈనాడు ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించిందంటే వారికి ఆ పార్టీ మీద ఉన్న నమ్మకంతో, విశ్వాసంతో వారికి ఓట్లు వేసి గెలిపించారు. ప్రజలకు తగిన విధంగా వీరు బుద్ధి చెబుతున్నారు. దీనిని ప్రజలు గుర్తించాలని నేను ప్రజల మనిషిగా చెబుతున్నాను. Now this is the trend of the Government. They are neglecting the public issues. వారికి కావలసింది మాత్రం వారు జరుపుకుంటున్నారు. చేసుకుంటున్నారు. సభ కూడా వారి ఇష్టం వచ్చినట్లు వారు నడుపుకుంటున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో అవసరమైన వర్గాల వారికి, వారి సంక్షేమం కోసం పాటుపడడం లేదు. విలువైన కాలాన్ని మనం ఆ విధంగా ఉపయోగించడం లేదు? ఎందుకు ఆ మాట అన్నారు తూలనాడి? నన్ను నోరు మూసుకోమంటాడా ఒక సభా నాయకుడు? అధ్యక్షుల వారు నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు. మీరంతా ఔధార్యంతో విన్నందుకు ప్రతి ఒక్కరికీ నా ధన్యవాధాలు తెలియచేస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

◆◆

సెప్టెంబర్ 3, 1992

# రైతుల నోటి ఎంగిలి కూడు తినే ఈ ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగా గర్హిస్తున్నా!

*(ఎరువుల ధర పెరుగుదలపై జరిగిన లఘు చర్చ)*

**శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, ముఖ్యంగా మన దేశంలో ఏవిధంగా వ్యవసాయమునకు ప్రాముఖ్యత ఉందో అందరికీ తెలుసు. అందులో కాంగ్రెస్ సిద్ధాంతం కూడా అదే. పూజ్య బాపూజీ రైతే దేశానికి వెన్నెముకని అన్నారు. గ్రామీణ వాతావరణం బాగు పడాలంటే పల్లెప్రజల ప్రగతికి వ్యవసాయం పట్టుగొమ్మ. దురదృష్టవశాత్తు స్వాతంత్ర్యము వచ్చిన తరువాత ఏవిధంగా రైతులు, రైతుల సంక్షేమం నిర్లక్ష్యము చేయబడిందో ఈ సందర్భంగా మీ దృష్టికి తెస్తున్నాను. దేశ ప్రగతి కోసము, ప్రజలకు ఆహారం అందించడం కోసము రైతు పండించే ఆహార ధాన్యాల దిగుబడి రోజు రోజుకూ తగ్గిపోతున్నది. ఈ విషయాన్ని మీద్వారా సభకు తెలియజేయడం నా బాధ్యతగా స్వీకరిస్తున్నాను.

రైతుల వెన్నెముక విరిగిపోతున్నది. సామాజిక న్యాయం గానీ, వారి అభివృద్ధికిగానీ సరియైన విధానం గానీ అవలంభించకపోవడం ఈ ప్రభుత్వము యొక్క నిర్లక్ష్య వైఖరికి తార్కాణమని మనవి చేస్తున్నాను. ఖరీఫ్ పంట రాష్ట్రమంతటా ఏవిధంగా పడిపోయిందో మన కళ్లకు స్పష్టంగా కనబడుతున్నది. ఈ స్టేట్‌లో ఇంతవరకు 15 శాతం కూడా నాట్లు పడలేదు. అంటే ఏ విధంగా రైతు నిర్లక్ష్యము చేయబడ్డాడో, ఏవిధంగా ఈ శాసనసభలో దానికి ప్రత్యామ్నాయం లేకుండా మిగతా విషయాలపై ప్రాధాన్యత ఇస్తున్నారో గుర్తించవలసిందిగా కోరుతున్నాను. దానికి తగ్గట్లుగా ప్రకృతి కూడా తిరగపడిపోయింది. ఈ సంవత్సరం సకాలంలో రుతుపవనాలు కూడా రాలేదు. దీనిని గుర్తించవలసిందిగా కోరుతున్నాను. ముఖ్యంగా మనవి చేసేదేమిటంటే ఈ రోజు అత్యంత దారుణమైన సంఘటన జరిగింది. ఉత్తరాదిన అక్కడ ముఖ్యంగా వాడే ఎరువుల మీద కంట్రోల్ ఎత్తివేయలేదు. మనము వాడే కాంప్లెక్స్ ఎరువుల మీద దక్షిణాన వాడే డీఏపీ మీద ఇదివరకు

50 కేజీల బస్తా రు.230 ఉంటే, ఇప్పుడు రూ.460లు చేయబడిందని ఈ సందర్భంగా సభ దృష్టికి తెస్తున్నాను. 17:17:17: 50 కేజీల బ్యాగు రూ.180లు ఉంటే, ఈ రోజు రూ.350లు అయింది. అదేవిధంగా 20:28 50 కే.జీ బస్తా రూ.265లు ఉంటే ఇప్పుడు రూ.500లు అయింది. సూపర్ ఫాస్ఫేట్ 100 కేజీల బస్తా రూ.130లు ఉంటే రూ.270లు అయింది. ఈ విధంగా కంట్రోల్ చేయడం వల్ల ఏవిధంగా మధ్య దళారులు, ఎరువుల బ్లాక్ మార్కెటర్స్, సంపన్న వర్గాల వారు దేశాన్ని దోచుకొంటున్నారో, ఏ విధంగా రైతులకు క్షీణదశ కలిగిస్తున్నారో గుర్తు చేసుకోవలెనని సవినయంగా మనవి చేస్తున్నాను.

ఉత్తరాది నుండి వచ్చే ఎరువులు ముఖ్యంగా నైట్రోజన్ ఎరువులను మనం కాంప్లెక్స్ ఎరువులంటాము. మనము వాడే ఎరువుల మీద కంట్రోల్ ఎందుకు ఎత్తివేశారు? దక్షిణాది రైతులకు దుర్భరమైన వాతావరణాన్ని సృష్టించారని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. ఇక్కడ కంట్రోల్ వుండడం వల్ల 10 శాతం ధరలు పడిపోయాయని సభవారి దృష్టికి తెస్తున్నాను. యూరియా 50 కేజీల బస్తా 10 శాతం పడిపోయింది. సి.ఎ.ఎన్. 50లది రూ.190 నుండి రూ.101కి పడిపోయింది. అమ్మోనియా 50 కేజీలది రూ.185 నుండి ఈ రోజు రూ.101కి పడిపోయింది. దీని విషయం ఆలోచిస్తే, తోడేండ్ల బారికి రైతులను ఎరవేసినట్లుంది. మన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సమాజములో వున్న అమాయక రైతులను దోచుకొనే పరిస్థితిని కల్పించింది. కంట్రోల్ తీసివేసిన ఈ తరుణములో బ్లాక్ మార్కెటింగ్ ఏ విధంగా నడుపుతున్నారో సుస్పష్టంగా మనకు కనబడుతున్నది. మరి ఈనాడు ధరలు చూస్తే ఇదివరకు 40 శాతం టాక్సు పెంచారు ఎరువుల మీద. అప్పటికి పెద్ద ఆందోళన బయలు దేరింది. చిలకలూరిపేటలో ఫైరింగు జరిగింది. ఇద్దరు ముగ్గురు చచ్చిపోయారు. అదే విధంగా రైతులందరూ కూడా వారి నిరసన వ్యక్తం చేశారు.

అది అట్లా ఉంటే ఇప్పుడు నేను చెప్పిన ధరల వల్ల నూటికి నూరు పాళ్లు కూడా ధరల పెరిగాయి అని అంటే ఇప్పుడు ఈ రోజున నూటికి 140 శాతము ధర పెరిగిందన్న సంగతి కూడా మీకు గుర్తు చేస్తున్నాను అధ్యక్షా. అదే విధంగా రైతు పండించిన పంటకు కేవలం 17 శాతము మాత్రమే పెరిగింది గానీ దానికి పోటీగా రైతులకు సరి అయినటువంటి గిట్టుబాటు ధర ఇవ్వబడడంలేదు. ఈ విధమైనటువంటి దురదృష్టకర పరిస్థితులలో రైతులు ఇబ్బంది పడుతున్నారు మీకు నేను మనవి చేస్తున్నారు అధ్యక్షా. అగ్రికల్చరల్ శాఖ ఉంది. విజిలెన్సు అధికారులు ఉన్నారు. ఇతర సిబ్బంది ఉన్నారు. వీరందరూ కూడా కేవలము ఈ బూటకానికి మద్దతునిచ్చేవారే తప్ప రైతుకి మాత్రము న్యాయం చేసేవారు ఎవరూ లేరని మీకు నేను సవినయంగా మనవి చేస్తున్నాను. ఇలాగే ముఖ్యంగా మన దక్షిణాదిలో ఈ ఎరువులకు ధర ఈ విధంగా పెరగడం వల్ల రైతాంగం దెబ్బ తింటున్నారు. నం.1 ఉత్పత్తులు పడిపోతాయి అధ్యక్షా. ఇప్పటికిప్పుడే రైతు నిర్లక్ష్యం చేయబడ్డాడు. డ్రైనేజీ పేర దోచుకోబడ్డాడు. పూర్తిగా కాంట్రాక్టర్లు, దళారీదారులు కేవలం ప్రభుత్వం

చేస్తున్నటువంటి నిర్లక్ష్య విధానాల వల్ల, వారు చేస్తున్నటువంటి అవినీతి కార్యక్రమాల వల్ల ఈనాడు పూర్తిగా డ్రైనేజీ పోయింది. ఈనాడు వారికి సాగుకు నీరు లేదు పంటలు పండించడానికి. క్రితము సంవత్సరము మేము డ్రైనేజేస్ త్రవ్విస్తాం అనేటటువంటి దానితో రైతులు రబీ పంట వేయకుండా ఆపారు అధ్యక్షా. పశ్చిమ గోదావరి జిల్లా, తూర్పు గోదావరి జిల్లా, ఖమ్మం జిల్లా ఇత్యాది జిల్లాలు అన్నీ కూడా వారు ఎంతో ఇబ్బంది పడుతున్నాము. మేము రబీ పంట పండిస్తామని అంటే కాదు.. ప్రపంచ బ్యాంకు నుంచి అప్పు తెచ్చాము కాబట్టి ఈ సంవత్సరం పూర్తి చేస్తాము అన్నారు. అధ్యక్షా అదైనా చేశారా అంటే అదీ లేదు. రైతులకు నీరు లేదు. డ్రైనేజీల త్రవ్వకం లేదు. ఎక్కడికక్కడ కాంట్రాక్టర్లకు, దళారీకోరులకు పెత్తనం ఇచ్చి ప్రపంచ బ్యాంకు నుంచి అప్పు తెచ్చింది అంతా కట్టబట్టే ఈ ప్రభుత్వ విధానాలను తీవ్రముగా మేము ప్రతిఘటిస్తున్నాము అనే సంగతి కూడా ఈ సందర్భంగా నేను మనవిచేస్తున్నాను.

పైగా అధ్యక్షా, రూపాయి విలువ తగ్గించారు, దానిమీద ధరలు అన్నీ పెరిగి పోయాయి ఆలోచించండి తమరే, మరి ఈనాడు ఈ విధమైనటువంటి దురదృష్టకరమైన విధానాలు అన్నీ కూడా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో కానివ్వండి, రాష్ట్రంలో కానివ్వండి ఏమండీ సబ్సిడీ ఇవ్వలేదాండి రాష్ట్ర ప్రభుత్వం. ఇచ్చే అధికారం, ఇచ్చేటటువంటి వనరు రాష్ట్ర ప్రభుత్వానికి ఉందా లేదా అని అడుగుతున్నాను. రెండు రూపాయలకు కిలో బియ్యం ఇవ్వలేదాండి? మరి కేవలం ఎన్ని వందల వేల కోట్ల రూపాయలు ప్రజల ఆస్తులు పేద ప్రజలకు సంక్రమించేది ఏ విధమైనటువంటి అవినీతి విధానాలకు బలి అయి పోయాయో ఒకసారి మానవత్వంతో ఆలోచించమని మనవిచేస్తున్నాను అధ్యక్షా.

**రూపాయి విలువ తగ్గించారు, దానిమీద ధరలు అన్ని పెరిగి పోయాయి ఆలోచించండి తమరే, మరి ఈనాడు ఈ విధమైనటువంటి దురదృష్టకరమైన విధానాలు అన్ని కూడా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో కానివ్వండి రాష్ట్రంలో కానివ్వండి ఏమండి సబ్సిడీ ఇవ్వలేధాండి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే అధికారం ఇచ్చేటటువంటి వనరు రాష్ట్ర ప్రభుత్వానికి ఉందా లేధా అని అడుగుతున్నాను.**

ఎరువుల ధర పెరగడానికి కారణం కేవలం ప్రభుత్వాల నిర్లక్ష్యం. ఈనాడు కేంద్ర ప్రభుత్వం గానీ, రాష్ట్ర ప్రభుత్వంగానీ అనుసరిస్తున్న విధానాలే ఈనాడు రైతుల చావులకు దారి తీశాయి కాబట్టి మీకు నేను మనవి చేస్తున్నాను. అసలు రైతు విషయం ఇంతవరకు ఎవరు మాట్లాడారు? దయచేసి చెప్పండి? మేము ప్రాజెక్టుల సంగతి అడిగితే మాట్లాడరు. సరైన సమాధానం రాదు. 2000 సంవత్సరం లోపల రైతులకు నీరు ఇవ్వడానికి పంట పండించడానికి ప్రాజెక్టుల పని పూర్తి చేస్తారా అని అడిగితే చెప్పే గతి లేని ప్రభుత్వం మన కళ్ల ముందు ఉంది అని మనవిచేస్తున్నాను. ఈ విధంగా రైతు నిరక్ష్యం చేయబడ్డాడు సర్. రైతు దోచుకోబడ్డాడు సర్. ఈనాడు రైతు బ్రతుకేమిటి అని నేను అడుగుతున్నాను. కాబట్టి ముఖ్యంగా ఈనాడు మనం ఒక

తీర్మానం చేయాలి. రైతుకి జరుగుతున్న అన్యాయం గురించి ముఖ్యంగా దక్షిణాదికి జరుగుతున్నటువంటి అన్యాయం గురించి ఈ విచక్షణా విధానం ఎందుకు ఉండాలి? కంట్రోలు ఒక చోట ఎందుకు ఉండాలి? కంట్రోలు తీసి వేయడం మళ్లీ కొన్ని చోట్ల ఎందుకు జరగాలి? నేను తమ ద్వారా ప్రభుత్వానికి మనవిచేస్తున్నాను. ఇప్పటికైనా కొంచెము కళ్లు తెరవండి, రైతులను కాపాడండి. ఈనాడు కంట్రోల్ తీసివేయవలసిన అవసరం లేదు. కంట్రోల్ ఉండాలి ఎరువులకు పూర్తిగా, ఆ కంట్రోల్ ధరకే రైతుకి ఎరువు సప్లయి చేయబడాలి అన్నది ముఖ్యంగా మనం చేయవలసిన తీర్మానంగా, ఏ మాత్రంగా మనకు రైతు పట్ల గౌరవం ఉన్నా సరే మన యొక్క గౌరవాన్ని వ్యక్తం చేయడం ఈనాడు ధర్మం అని కూడా నేను తమ ద్వారా మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, ఈనాడు మన కంట్రోల్‌లో ఉంచాలి ఎరువుల మీద అనేటటువంటిది ఒకటి, రెండు. రాష్ట్ర ప్రభుత్వం అవసరమైతే సబ్సిడీ ఇవ్వాలి. అన్నిటికీ ఇస్తున్నాము మనం. ఈ రోజున మన కళ్ల ముందు మనమే చూస్తున్నాము. ఈ సభ మొదలు పెట్టినప్పటినుంచి వాదోపవాదాలు జరుగుతూనే ఉన్నాయి. మరి ఎంతవరకు కలవారికి సంపన్న వర్గాలకు ఎన్ని కట్టబెట్టాము సర్ ప్రభుత్వం ద్వారా? అదే విధంగా రైతుకి అవసరమైతే ఎవరైతే కూడు పెడుతున్నాడో, ఎవరైతే అన్నదాత ఎవరైతే పోషణకి అవసరమో, అటువంటి రైతుకి అవసరమైతే సబ్సిడీ ఇస్తామని ఈ ప్రభుత్వం ముందుకు రావాలి అని నేను మీ ద్వారా సవినయంగా మనవి చేస్తున్నాను. అది మీ విధి కూడ. నేను రైతు బిడ్డను. నాకు ఆవేశం అంటారేమిటి? మనిషికి ఆవేశం కాకపోతే పశు వుకి ఉంటుందా అని అడుగుతున్నాను. ఆవేశం ఉంది కాబట్టే రైతు తరఫున అడుగుతున్నాను. ధైర్యం ఉంటే సమాధానం చెప్పండి. సబ్సిడీ ఇవ్వగలరా మరి. తీర్మానం చేసి కేంద్రప్రభుత్వం మీద ఒత్తిడి తేగలరా? ఎందుకు ఈ సాంఘికమైనటువంటి దురన్యాయం జరిగింది? 69 కోట్లు ఏమి చేసింది మీ ప్రభుత్వం చెప్పమని అడుగుతున్నాను. కేంద్రం 69 కోట్ల రూపాయలు చిన్నకారు, సన్నకారు రైతులకు ఎరువులకు సబ్సిడీ ఇవ్వమంటే, ఎంత ఇచ్చారు మీరు, ఈనాడు కేవలం రైతుల నోటి ఎంగిలి కూడు తినే ఈ ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగా గర్హిస్తున్నానని మనవిచేస్తున్నాను.

అధ్యక్షా, నేను మనవి చేసేది ఏమిటంటే ఈనాడు ఉన్న విధానాన్ని బట్టి, జరుగుతున్న పద్ధతిని బట్టి రైతు పండించిన పంటను తినే అధికారం మీకు లేదు, వారి సౌఖ్యాన్ని కనుక గుర్తించుకోలేకపోతే వారి పట్ల మన విశ్వాసం ప్రకటించకపోతే ఈ అసెంబ్లీ ఉనికే ప్రశ్నార్థకంగా ఉంటుందని మనవి చేస్తున్నాను. ఈ తీర్మానాన్ని ప్రవేశపెడుతున్నాను. అయ్యా మీ ఇష్టమైతే మద్దతు ఇవ్వండి లేకపోతే తీసి అవతల పారేయండి.

అధ్యక్షా, ప్రతిపక్ష నాయకుడుగా నేను ఈ రిజల్యూషన్ ప్రవేశపెడుతున్నాను. ఈ హౌసులో మీరందరూ రైతు పట్ల గౌరవం ఉంటే తీర్మానాన్ని బలపరచండి. లేకపోతే బలపరచము అని చెప్పండి. “The House, resolves and requests the Government of India

to control the costs of phosphatic and potash fertilisers at the price prior level to 28-8-1992, which have been de-controlled by the Government of India on the recommendation of the Joint Parliamentary Committee, which benefits the North Indian farmers at the cost of the interests farmers of of South India is general and Andhra Pradesh in particular. అధ్యక్షా దీనిని మీకు పంపిస్తున్నాను.

లీడర్ ఆఫ్ ది అపోజిషన్‌గా నేను ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టాను. గవర్నమెంట్ ఆఫ్ ఇండియాకి పంపించమన్నాను. కాబట్టి తీర్మానాన్ని బలపరిచి పంపించవలసిందిగా మరొకసారి అందరినీ కోరుతున్నాను. రాష్ట్ర ప్రభుత్వాన్ని సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాను. కేంద్ర ప్రభుత్వం ఇచ్చినటువంటి ఆ డబ్బును ఎందుకు ఖర్చు పెట్టలేదు? ఎందుకు రైతుకు అన్యాయం జరిగింది అని నేను సభద్వారా సునిశితముగా ప్రశ్నిస్తున్నాను.

నేను చెప్పిన దాంట్లో మూడు పాయింట్స్ అడిగానండి. క్రితము సంవత్సరము సన్నకారు, చిన్నకారు వారికి ఎరువుల సబ్సిడీ కింద ఈ 69 కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసింది. దాని విషయంలో నేను చెప్పాను.

రైతుల పట్ల ప్రేమ చూపించారు, ఆప్యాయత వెలిబుచ్చారు. మరి 69 కోట్లు రైతులకు ఇచ్చారా అని గౌరవ ముఖ్యమంత్రిగారిని నేను అడుగుతున్నాను. తరువాత నా రిజల్యూషన్ మాట ఏమిటి? వారి చేతులు బలపరుస్తాము. మనందరము మన బాధ్యతను నిర్వహించడం కోసం కేవలం ఒక్క వ్యక్తి ఈ శాసనసభను ప్రతిబింబించడంకంటే 294 మంది శాసన సభ్యులు సమిష్టి బాధ్యతతో వారికి పూర్తిగా అండగా నిలుస్తారు కాబట్టి తీర్మానాన్ని దయచేసి ప్రవేశపెట్టాలని మరొకసారి నేను అడుగుతున్నాను. కంట్రోలు తీసివేయడం వల్ల నూరు శాతం ధర పెరిగింది. దానికి కారణం కేవలం అనాలోచితంగా ఈ నిర్ణయాలు చేయడం వల్ల అన్నిటికి సరైన విధానాన్ని అవలంభించకపోవడం వల్ల ఇది జరిగిందని మనం చెప్పడం ధర్మమే. కాబట్టి తీర్మాన పూర్వకంగా ప్రవేశ పెట్టండి. ఆ తీర్మానాన్ని అందరము బలపరుస్తాము. అది మీరు తీసుకువెళ్ళండి, వెళ్లి వారికి ఇవ్వండి, ఇదుగో మా అసెంబ్లీ తీర్మానం అనడంలో మీకు గౌరవం. మాకు గౌరవం, ఈ విధాన సభకు గౌరవం అన్ని సవినయంగా మనవి చేస్తున్నాను.

◆◆

సెప్టెంబర్ 7, 1992

# మనకు అధికారం ఉన్నది పాపాలు చేసిన వారిని, దుర్మార్గులను సమర్థించడానికి కాదు

*(జె.ఎన్.టి.యు. 'ఫెయిర్ గ్రోత్' సంస్థలో పెట్టుబడి పెట్టుటపై రూలు 304 క్రింద జరిగిన చర్చ)*

**శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, ఇది కేవలం ఆదర్శాలు కాకుండా, ఇది పరువు ప్రతిష్టలకు సంబంధించిన విషయం. ఈనాడు ప్రభుత్వము వారు ఒక స్టేట్‌మెంట్ సర్కులేట్ చేశారు. కేవలం అసంఘటితంగా ఉన్నాయని వారిచ్చిన స్టేట్‌మెంట్‌లో వివరాలు సమంజసంగా లేవని, దీనివల్ల వారు ఏమీ సమర్పించుకోలేరని మనవిచేస్తున్నాను. 2 శాతం డబ్బు వస్తుందని, దీన్ని తీసుకొని పోయి అక్కడ డిపాజిట్ చేశామని అన్నారు. కేవలం విద్యాసంస్థలు వ్యాపారార్థకంగా చేయబడ్డాయి. నిన్న, మొన్న డిస్కస్ చేశాము. ఈ క్యాపిటేషన్ విషయంలో కేవలం డబ్బున్న వారికే విద్య అనే విధానాన్ని ఈ ప్రభుత్వము ప్రవేశపెట్టింది. బ్యాంకుల్లో డబ్బు పెడితే వడ్డీ వస్తుందని, ఆ డబ్బులతో విద్యాసంస్థలను నడుపుతామనే ఈ దుర్విధానానికి ప్రజా ప్రభుత్వము వచ్చిందని అంటే, దయచేసి మీరే ఆలోచన చేసుకోండి. ప్రజలను ఏ విధంగా మభ్యపెడుదామా, ఈ స్టేట్‌మెంట్‌లో సత్యమేదో ఇప్పుడు ఆలోచన చేయాలని కోరుతున్నాను, ఈ జె.ఎన్.టి.యు.సి. కానీ, అనంతపురం ఇంజనీరింగ్ కళాశాల గానీ, కాకినాడ కళాశాల గానీ, అక్కడ వసతులు చూస్తే, ఈనాడు ఆధునికంగా ఉన్నటువంటి స్టాండర్డ్స్ ఏ మాత్రం సరిపోవు.

దాన్ని వృథా చేయడం పోయి, మీరు వ్యాపారం, వడ్డీకి పెట్టుకోండని అనడం ఏ విధంగా సమర్థనీయమో ముఖ్యమంత్రిగారు తెలియజేయాలని సవినయంగా మనవిచేస్తున్నాను. ఇదేనా ఆదర్శం? ఇదేనా ప్రజాస్వామ్య ప్రభుత్వము అనుకొంటున్నది? ఇందుకేనా ప్రజలకు విద్యయని చెప్పుకొంటున్నాము? ప్రజలకు విద్య ఇందుకేనా? ఇటువంటి అసమర్థపు కళాశాలలను మనము నడుపుతున్నాము. ఇటువంటి విశ్వవిద్యాలయాలను తప్పుడు విధానాలు చేయడానికి వాడుతున్నారు. ఒకటి ఏమిటంటే ఫెయిర్ గ్రోత్ ఫైనాన్స్ స్కీము ఈ సెక్యూరిటీ స్కాండల్‌కి

సంబంధము లేదు అని అన్నారు. I am very sorry. ఫెయిర్ ఫైనాన్స్ లిమిటెడ్ బెంగుళూరులో ఉన్నటువంటి సంస్థకు ఫెయిర్ గ్రోత్ ఫైనాన్సియల్ సర్వీసెస్ లిమిటెడ్ అనే సంస్థ అనుబంధ సంస్థ. పూర్తిగా సెక్యూరిటీ స్కామ్‌లో ఈ ఫెయిర్ గ్రోత్ ఫైనాన్స్ లిమిటెడ్ బెంగుళూరు వారు చిక్కుకున్నారు. ఇది వెరీ క్లియర్, దీని విషయంలో మభ్యపెట్టవలసిన అవసరం లేదు. అదే కనుక లేకపోతే ఆ గౌరవనీయ మంత్రివర్యులు ఆ స్కామ్‌లో ఉన్నంత మాత్రం చేత, ఈ ఫెయిర్ గ్రోత్ ఫైనాన్స్ కార్పొరేషన్ బెంగుళూరు వారితో సంబంధం ఉండడంవల్ల వారు ఎందుకు రాజీనామా చేశారు? కారణం ప్రజలకు చెప్పవలసినదిగా కోరుతున్నాను. వారికి గౌరవం ఉందనే భావంతో, వారు బుకాయించకుండా, ఈ విషయం బయటికి రాకముందే, ఈ తప్పు తాము తెలుసుకొని రాజీనామా చేశారు. మానవత్వం లేదు. ఆ మానవత్వమే మనకు లేకుండా, ఇంకా చేసిన తప్పులను కప్పి పుచ్చుకోడానికి ప్రయత్నిస్తున్నారని మనవిచేస్తున్నాను. కృష్ణమూర్తిగారు ప్లానింగ్ కమిషన్‌లో ఉన్న ఆయన ఏ విధంగా తప్పు చేశారు? వీరిద్దరూ ఎందుకు రాజీనామా చేశారు? ఇంకా మనం ఎందుకు అవిటి కొమ్మను పట్టుకొని వేలాడుతున్నాము. మనము చేసిన తప్పులను కప్పిపుచ్చుకోడానికి - ఒక తప్పు చేస్తే వంద అబద్ధాలు చెప్పాలి. నేను ఉన్నదే చెబుతున్నాను. లేనిది చెప్పడం లేదు. నేను లేనిది చెప్పడం లేదు.

ఇది ఉన్నదే చెపుతున్నాను. మరి ఆ రోజున తెలుగుదేశం హయాములో డిపాజిట్స్ ఏమిటని ఈ కాంగ్రెస్ పార్టీ వారే మరి ఎందుకు ఆ విధంగా గల్లంతు చేశారని వారిని అడుగుతున్నాను, టి.టి.డి. ఫండ్స్ సబ్ ట్రెజరీలో పెడతాము పేద ప్రజలకు అన్నము పెట్టడానికి, పేద ప్రజల సంక్షేమ కార్యక్రమాలకు దేవుడి సొమ్ము అని, అది కూడా ఒక శాతం ఎక్కువ ఇంటరెస్ట్ వేసి సబ్ ట్రెజరీలో పెడతాము అంటే ఆనాడు ఇక్కడ ఉండే కాంగ్రెస్ వారు ఏదో పోయినట్లు గల్లంతు చేసి ఇది చాలా అన్యాయం, దేవుడి సొమ్ము తింటున్నారు అనే పదజాలం వాడారు ఆ రోజున. మరి ఇది కేంద్ర ప్రభుత్వం అనంతపురం కాలేజీకి లాబొరేటరీకి రూ. 25 లక్షలు ఇస్తే, అది వడ్డీ పెంచుకోమని ఇచ్చారా అని వారిని అడుగుతున్నాను. ఒకవేళ రూ. 25 లక్షలు అందుకే తెచ్చుకున్నారా, మేము వడ్డీ పెంచుకున్న తరువాత కట్టుకుంటామని, మరి ఏ విధంగా మీరు బుకాయిస్తున్నారో దీని వల్లే తెలుస్తోందని మీకు మనవిచేస్తున్నాను.

అధ్యక్షా, ప్రభుత్వం వారు అనుమతి ఇచ్చారా అని నేను అడుగుతున్నాను. మరి దీనికి ఏమిటి సమాధానం. ప్రభుత్వం వారి అనుమతి లేనిదే ఫండ్స్ వేయడానికి వీలులేదు. పైగా నేషనల్ బ్యాంక్స్‌లో ఉన్న డిపాజిట్స్ తీసి ప్రత్యేకంగా వారిష్టము వచ్చినట్లుగా వారు వ్యవహరించారు అంటే, జె.ఎన్.టి.యు. ప్రిన్సిపాల్ గారే చెప్పారు. నాకు ఏమీ తెలియదు. గోపాలరెడ్డిగారు ఇవ్వమంటే ఇచ్చాను అని. మరి ఈ విధంగా అందరూ కూడా ఎవరూ ఏమి చేస్తున్నారో తెలియని పద్ధతిలో ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చి చేయించింది అనేటటువంటి అనుమానం

మాకు కలుగుతోందని మనవిచేస్తున్నాను. అంతేకాదు, వారిచ్చిన స్టేట్‌మెంట్‌లో ఇంకా పబ్లిక్ అండర్ టేకింగ్స్ కొన్ని పెట్టి ఉన్నాయి, అవి పెట్టిన తరువాత ఇది చేయడం జరిగిందని, కాలేజీలు చేస్తున్నాయని అభాండము అంతా వారి మీద వేస్తున్నారు. ప్రభుత్వం అనుమతి లేనిదే, ఇన్‌స్ట్రక్షన్స్ లేనిదే ఎందుకు చేస్తున్నారు? అందుకు ఇప్పుడు నేషనలైజ్డ్ బ్యాంక్స్ స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంకు, కెనరా బ్యాంకులలో ఉన్నటువంటి డిపాజిట్స్ తీసి ప్రత్యేకంగా వడ్డీలు పెంచుకోవడం కోసం ప్రభుత్వం వ్యవహరించిందా అని ఈ సందర్భముగా నేను అడుగుతున్నాను. ఇది సబబు అనుకుంటే ప్రజలకు ఇదే సమాధానం చెపుదాము అనుకుంటే సరే ప్రభుత్వం వడ్డీల కోసమే ఉంది.

అధికారం అంతా వడ్డీల కోసమే వినియోగిస్తోంది అని మీరు చెప్పుకుంటే నేను కూడా అదే విధంగా చెపుతాను. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరిస్తోంది అందుకు మీరు అంగీకరిస్తారా అని అడుగుతాను. విద్యార్థులకు వసతులు లేకుండా నానా ఇబ్బందులుపడి, లేబరేటరీస్ ఫెసిలిటీస్ లేవని కేంద్రానికి మనవి చేస్తే వారు రూ. 25 లక్షలు లేబొరేటరీస్ కోసం ఇస్తే, దానితో మేము వడ్డీలు పెంచుతున్నాము. మా ఇష్టం వచ్చినట్లుగా మేము డిపాజిట్స్ ఇస్తున్నాము అనేటటువంటి విషయాన్ని ప్రభుత్వం తెలియజేస్తోంది. కాబట్టి దీనిని బుకాయించకుండా ఎవరు నేరస్థులో యదార్థం బయటకు తీసుకురండి అక్కడ మంత్రులు రాజీనామా ఇచ్చారు. మరి మెంబర్ ప్లానింగు కమిషన్ రాజీనామా ఇచ్చారు అంటే ఆ మాత్రం రాజీనామా ఇవ్వలేని, నీతి తప్పినప్పుడు, సరైన విధానం సాగనప్పుడు అనేది ముఖ్యమంత్రిగారు ఆలోచించవలసిన విషయంగా నేను మీ ద్వారా మనవిచేస్తున్నాను. చిత్తశుద్ధి, నీతి ఉంటే, ప్రైవేట్ వ్యవస్థలలో ఈ స్కామ్స్‌ను మనము ఎంకరేజ్ చేయకుండా విచారణ జరిపించండి, దోషులను శిక్షించండి Don't defend them.

**విద్యార్థులకు వసతులు లేకుండా నానా ఇబ్బందులుపడి, లేబరేటరీస్ ఫెసిలిటీస్ లేమ కేంద్రానికి మనవి చేస్తే వారు రూ. 25 లక్షలు లేబరేటరీస్ కోసం ఇస్తే, దానితో మేము వడ్డీలు పెంచుతున్నాము. మా ఇష్టం వచ్చినట్లుగా మేము డిపాజిట్స్ ఇస్తున్నాము అనేటటువంటి విషయాన్ని ప్రభుత్వం తెలియజేస్తోంది. కాబట్టి దీనిని బుకాయించకుండా ఎవరు నేరస్థులో యధార్థం బయటకు తీసుకురండి.**

మనము కేవలం పాపాలు చేసిన వారిని, దుర్మార్గులను సమర్థించడానికి కాదు మనకు అధికారం పాపులను శిక్షించడానికి. ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే – అందుకే అనుకుంటున్నాము ప్రజాస్వామ్యం ప్రజల కోసం ఈనాడు వచ్చింది, మన కోసం కాదు, మన వడ్డీ కోసం కాదు, ధనిక వర్గాలకు, సంపన్నులకు తొత్తులుగా వారిని పోషించడం కాదని మీ ద్వారా మనవి చేస్తున్నాను. సరైన పద్ధతిలో మన రాష్ట్రం పరువు కాపాడాలి, రాష్ట్ర గౌరవం

కాపాడాలి. ఈ విధమైన అవకతవకలు జరుగుతూ ఉంటే రూ.91 లక్షలు వారిష్టం వచ్చినట్లుగా డిపాజిట్స్ మార్చి వ్యవహరిస్తూ, ఉంటే ఈ కళాశాలల్లో ఏమీ తెలియని విద్యార్థులకు, అమాయకులకు ఏ విధంగా భవిష్యత్తు కలిగిస్తాము. వారికి సౌకర్యాలు లేవు, సౌకర్యాలకు ఇచ్చిన డబ్బును పెట్టుబడి పెట్టి బ్రతుకుతున్నారు. ఇది ప్రభుత్వం హర్షిస్తుందా అని నేను అడుగుతున్నాను. దయచేసి మీరు సమర్థించకండి. ఏమైనా జరిగితే శిక్షించండి. సరైన విధానములో మన రాష్ట్ర గౌరవాన్ని కాపాడండి. అది మనకు ముఖ్యం కానీ కేవలం ఇది – జరిగినది అంతా చట్టప్రకారమే జరిగింది 3 శాతం డబ్బు కోసం మేము ఈ డబ్బులు అన్నది మన ఆదర్శమా? అదే మన ఆదర్శం, డబ్బే ఆదర్శం కానీ, విజ్ఞానం ఆదర్శం కాదు అనే విధానాన్ని కనుక మీరు నిర్ణయంగా తీసుకుంటే సరే చేసేదేమీ లేదు.

◆◆

సెప్టెంబర్ 17, 1992

# ట్యాంపరింగ్ ఆఫ్ రికార్డ్స్ ఎందుకు చేశారు? రికార్డ్స్ ఎందుకు మార్చారు?

*(రాష్ట్రంలో ప్రైవేటు వైద్య, దంత వైద్య కళాశాలలు మంజూరుచేయుటం గురించి వివరణ కోరిన సందర్భంగా)*

**శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, ఈనాడు హైకోర్టువారు ఏ విధమైన కామెంట్స్ చేశారో ప్రజలందరకు తెలిసింది అధ్యక్షా. పైగా వారు దాంట్లో చెప్పారు కూడా జస్టిస్ శివరామన్ గారు. ఇట్ మస్ట్ బి నోన్ టు ఆల్, అందరికీ తెలియాలి దీంట్లో దాచిపెట్టవలసిన విషయం ఏమీ లేదు దానిని మూడు భాగాలుగా చేసినట్లైతే 'ట్యాంపరింగ్ ఆఫ్ రికార్డ్స్ నెంబర్ వన్', నెంబర్ టు మిస్‌లీడింగ్ ది హౌస్ అండ్, నెంబర్ త్రీ మిస్ లీడింగ్ కోర్ట్ ట్యాంపరింగ్ ఆఫ్ రికార్డ్స్ విషయంలో అది కోర్టు వారు చెప్పినారు, అది నేను చెప్పింది కాదు, మీరు చెప్పింది కాదు, ఏ గౌరవ సభ్యులు చెప్పింది కాదు. అసలు వారు సెప్టెంబరు 8వ తేదీన జిరాక్స్ కాపీ-ఏ ఎక్స్‌పర్ట్ కమిటీ రిపోర్టు దానిని కోర్టు వారికి సమర్పించినపుడు జిరాక్స్ కాపీ కాదు ఒరిజినల్ ఇవ్వాలి అన్నప్పుడు మరి 15వ తారీఖు సమర్పించాము అధ్యక్షా.

అది వారియొక్క ఛాంబర్స్‌లో ప్రత్యేకముగా ఈ అడ్వకేట్ జనరల్ గారు, తరువాత రిజిస్ట్రార్ ఆఫ్ ది హైకోర్టు, మరి వీరు తరపున వాదించే న్యాయవాదుల సమక్షంలో అన్నీ స్క్రూటినీ చేయడం జరిగింది అధ్యక్షా. దానికి దీనికి సంబంధం లేదు. ఒరిజినల్ డాక్యుమెంట్‌కి ప్రభుత్వం వారు కోర్టు వారికి సమర్పించినటువంటి ఈ ఎక్స్‌పర్ట్ కమిటీ రిపోర్టు అనే దానికి సంబంధంలేదని క్లీన్‌గా వారు వారి యొక్క నిర్ణయం తెలియచేశారు. ఇక రెండవది ఇక్కడ మన శాసనసభలో గౌరవనీయులైన ఆరోగ్యశాఖా మంత్రిగారు నేను కామా, ఫుల్‌స్టాప్ దాంట్లో అక్షరం మార్చలేదని చెప్పారు మరి వారేమో పూర్తిగా మార్చారని మా అందరికీ తెలిసింది. ప్రజలందరికీ తెలిసింది, ఏ విధమైన ట్యాంపరింగ్ జరిగిందో దీనివల్ల రికార్డులో స్పష్టమౌతోంది అని తమకు

మనవిచేస్తున్నాను. ఇక రెండవ పాయింట్ మిస్ లీడింగ్ ది హౌస్ ఇక్కడ 14వ తారీఖున ఎక్స్‌పర్ట్ కమిటీ రిపోర్టు పెట్టండి అని అడిగితే, ముందు సభాసమక్షంలో ఉంచండి అని అడిగితే మేము కోర్టు వాళ్లకు ఇచ్చాము కోర్టు అధీనంలో ఉందని చెప్పారు. అధ్యక్షా, ఇక్కడ ప్రొసీడింగ్స్ మరొకటి వారు 15వ తేదీన కోర్టు వారికి ఇచ్చారు. 'నో' వారు 'మిస్‌లీడింగ్ ది హౌస్'. ఒక బాధ్యత కలిగిన మంత్రివర్యుడిగా ఈ రాష్ట్ర ప్రజలందరినీ శాసన సభ్యులను, అవమానకరంగా మిస్‌లీడ్ చేసి తప్పుదోవ పట్టించి సత్యదూరముగా ఈ విషయాన్ని ఉంచారు. కాబట్టి దే మిస్‌లీడ్ ది హౌస్.

అసలు జరిగింది ఒకటి. మేము పూర్తిగా ఎక్స్‌పర్ట్ కమిటీ రిపోర్టు ప్రకారమే పూర్తిగా అమలుచేశామని చెప్పారు అధ్యక్షా. కానీ అక్కడ కొంత భాగమే అమలుచేశారు కొంత అమలుచేయలేదన్నది సుస్పష్టముగా కోర్టు వారు చెప్పారు అధ్యక్షా. ఈనాడు మనకు మూడు భిన్నమైన వ్యవస్థలు ఉన్నాయి. ఒకటి జ్యూడీషియరీ, లెజిస్లేచర్ అండ్ ఎగ్జిక్యూటివ్. ఈ విధంగా ప్రతి వారినీ మిస్‌లీడ్ చేయడానికి తప్పుదోవపట్టించడానికి వారు చేసే దుర్విధానాన్ని కప్పిపుచ్చుకోవడానికి వారు ఇలా ప్రజలను మోసము చేసి, రాష్ట్రాన్ని మోసంచేసి పూర్తిగా ఈ విధమైనటువంటి అసభ్యకరమైన విధానాలలో నడుస్తున్నప్పుడు వారు పూర్తిగా పాలించే అర్హత కోల్పోయారు. కాబట్టి వారికి అధికారం లేదు.. లేదు... లేదు అని స్పష్టముగా చెపుతున్నాను. రెండు, రిపోర్టులు ఇప్పటికైనా సరే తమ సమక్షంలో పెట్టమంటున్నాను. అసలు ఒరిజినల్ రిపోర్టు ఏమిటి, కోర్టు వారికి సమర్పించింది ఏమిటి? దానిలో ఉన్న తేడా ఏమిటి?

**మనకు మూడు భిన్నమైన వ్యవస్థలు ఉన్నాయి. ఒకటి జుడిషియరీ, లెజిస్లేచర్ అండ్ ఎగ్జిక్యూటివ్. ఈ విధంగా ప్రతి వారినీ మిస్‌లీడ్ చేయడానికి, తప్పుదోవపట్టించడానికి వారు చేసే దుర్విధానాన్ని కప్పిపుచ్చుకోవడానికి వారు ఇలా ప్రజలను మోసము చేసి రాష్ట్రాన్ని మోసంచేసి పూర్తిగా ఈ విధమైనటువంటి అసభ్యకరమైన విధానాలలో నడుస్తున్నప్పుడు వారు పూర్తిగా పాలించే అర్హత కోల్పోయారు.**

అధ్యక్షా, ఫేర్ గ్రోత్ ప్రతి దానికికూడా ఏ విధంగా అవినీతికి ఈ ప్రభుత్వం ముడిపడిందో అసలు ఆలోచించాలి అధ్యక్షా. అపోలో ఫేర్ గ్రోత్ వారికి హామీ ఇచ్చినంత మాత్రము చేత ఆ హామీతో శాంక్షన్ చేశారని వారికి కనెక్షన్ లేదా అడుగుతున్నాను. అన్ని విధాలుగా తప్పుదోవలు పట్టించి మీ గౌరవం, మా గౌరవం, ఈ సభా గౌరవం కాపాడవలసిన బాధ్యత మీ మీద ఉంది. ఈనాడు మేము డిమాండ్ చేసేది అన్ని విషయాలు ఇంచుమించు ట్యాంపరింగ్ ఆఫ్ ది హౌస్, మిస్‌లీడింగ్ ది కోర్టు. అన్ని విధాల కూడా కావాలని స్వార్థముతో, ధనకాంక్షతో దుర్విధానంతో కనుక ఈ ప్రభుత్వము పరిపాలించే అధికారం కోల్పోయింది. పరిపాలించడానికి అర్హత లేదు. వెంటనే రిజైన్ చేసి గద్దెదిగాలని ఐ యామ్ డిమాండింగ్ వెరీ క్లియర్లీ ఇప్పటికైనా ఆ రెండు రిపోర్టులు ఏమైనా ఇంగితం ఉంటే మరి టేబుల్ మీద పెట్టమనండి. మనమందరము చదువుదాము. మన బాధ్యత అది. ప్రజలకు చెప్పవలసిన బాధ్యత, ఆ బాధ్యత లేదంటారా? I am the representative of the people. As the

Leader of Opposition, I got the right to demand it. మీకు కనుక ఏమాత్రం గుండె ధైర్యం ఉంటే, నిజాయితీ ఉంటే రిపోర్టులు పెట్టాలని డిమాండ్ చేస్తున్నాను.

It is our duty to inform. Let us continue it. అందుకు నేను సమాధానం చెబుతున్నాను. నా పేరు వచ్చింది కాబట్టి నేను సమాధానం చెబుతున్నాను. ఇదివరలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ వారు ద్రోహచింతనతో శ్రీ ద్రోణంరాజు సత్యనారాయణతో 197 ఆరోపణలు పెట్టించారు. అందులో 190 నా మీద కొట్టి వేశారు. అది మీరు చేసిన తప్పు కాదా అని అడుగుతున్నాను. మిగతా ఏడులోను ప్రైమా ఫేసీ  ఉన్నాయి అన్నారు. అవి రుజువు కాలేదు. కేవలం తెలుగుదేశం పార్టీ మీద ఉక్రోషంతో, మానవత్వంతో నిలబడలేక ప్రజాప్రతినిధులు కాలేక, ఆ విధంగా చేసిన తప్పుడు పని అని నేను సమాధానం చెబుతున్నాను. పెరోల్ అన్నారు. ధర్మము అనుకున్నాము. మేము ఏమీ చేయలేదు. మేము ఏమీ ఫోర్జరీ చేయలేదు. రికార్డ్సు మార్చలేదు. అనాడు నేను తప్పించుకుందామని ఏమీ చేయలేదు. 20 కాలేజీలకు పర్మిషన్సు మీ ఇష్టము వచ్చినట్లుగా మీ సొమ్ము అయినట్లుగా ఇచ్చారు. అందులో మీ మంత్రులకు భాగం లేదా? మీ గుండెల మీద చేయివేసుకుని చెప్పండి. ప్రజల సొమ్ము తిన్నారు. మంత్రులకు భాగం లేదా? మంత్రుల తమ్ముళ్లకు, భార్యలకు భాగం లేధా? మంత్రుల కొడుకులకు సారాయి పాటలలో గానీ, ఇందులో గానీ సంబంధం లేదని చెప్పమనండి.

నేను ముఖ్యమైనవి అడుగుతున్నాను. ట్యాంపరింగ్ ఆఫ్ రికార్డ్స్ ఎందుకు చేశారు? రికార్డ్స్ ఎందుకు మార్చారు? నిజజీవితంలో సామాన్యంగా ఏదైనా రికార్డ్స్ తప్పుగా మార్చినట్లయితే అది ద్రోహం అవుతుందో కాదో తమరు ఆలోచించండి. పైగా కోర్టుకు ఇచ్చిన తరువాత ఇచ్చినటువంటి జిరాక్సు కాపీతో ఒరిజినల్ కంపేరుచేస్తే, దాంట్లో భేదాలున్నాయి. ఫోర్జరీ చేసారు అని, టాంపరింగు చేశారనే అపవాదు. ఆనాడు మీరు చేయలేదా? ఈనాడు చేయలేదా? ఈ కేసు చేయలేదా? ఆ కేసు చేయలేదా? ఇది ఏమి పద్ధతి? ఇదేనా నీతి మీకు? ఇదేనా పరిపాలించే విధానం? ఇదేనా ప్రజలకు సమాధానం చెప్పే విధానం అని అడుగుతున్నాను. ముందు వీటికి ఆన్సరు చేయవలసిందిగా డిమాండ్ చేస్తున్నాను. Tampering is done. Let us see the two records. తరువాత జడ్జిమెంట్ గురించి నేను అడగడం లేదు. అసలు ట్యాంపరింగ్ ఎందుకు జరిగింది. ప్రభుత్వానికి ఈ వ్యవస్థ మీద విశ్వాసం ఉంటే ట్యాంపరింగ్ చేయలేదని చెప్పమనండి. ధైర్యం ఉంటే ట్రూ రికార్డ్స్ పెట్టమనండి.

◆◆

డిసెంబర్ 15, 1992

# మతసామరస్యం మంట కలిసింది. సహోదర భావము కుప్పకూలిపోయింది

*(అయోధ్యలో జరిగిన సంఘటనలపై ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానంపై చేసిన ప్రసంగం)*

**DR. M.V. MYSOORA REDDY:** Sir, I beg to move: That this House unanimously condenms the deplorable incident of demolition of Babri Masjid at Ayodhya which has done great damage to the secular image of our country. The traumatic events have resulted in wide spead communal violence and death of more than thousand persons all over the country. Every responsible democratic and secular minded citizen of this country shares the agony caused by the communal violence in the aftermath of Ayodhya incident.

**శ్రీ ఎన్.టి. రామారావు:** అధ్యక్షా, భారత దేశానికి స్వాతంత్ర్యము వచ్చిన తరువాత, అంతకు ముందు కూడా ఎప్పుడూ లేనటువంటి దురదృష్టకరమైన విధానము – ఈ మత ద్వేషము ఈనాడు దేశాన్ని పెద్ద సంక్షోభములో పడేసింది. ఈ సంగతి గౌరవసభ్యులకు, తమరికి తెలుసు. మన ప్రజాస్వామ్యానికి, లౌకిక వాదానికి, సుప్రీంకోర్టు అస్తిత్వానికి ఈనాడు భంగము వాటిల్లింది. ఆ విధంగా పరిస్థితులు ఏర్పడాయి. దీనికి బాధ్యత ముఖ్యంగా కేంద్రాన్ని అంటే యూనియన్‌ను ఏలుతున్న పార్టీయే బాధ్యతవహించవలసి వుందని ఈ సందర్భంగా గట్టిగా మనవిచేస్తున్నాను. అది కేవలం ఒక బాబ్రీమసీదును రక్షించలేకపోయినటువంటి అసమర్థత ప్రభుత్వము ఈ దేశాన్ని రక్షిస్తుందని అంటే ఎవరికీ విశ్వాసము లేదన్న విషయాన్ని నేను మనవి చేస్తున్నాను. మన రాజ్యాంగ సంక్షోభానికి, మన యొక్క మతసామరస్యానికి, మన సెక్యులర్ విధానానికి ఈ రోజున దేశం రక్తపాతం కావడానికి కూడా పూర్తిగా ఈనాడు ఏలుతున్న కేంద్రములోని కాంగ్రెస్ పార్టీయే బాధ్యత వహించవలసివుందని నేను సవినయంగా మనవిచేస్తున్నాను. మనము నిన్నటివరకు

చెబుతున్నటువంటి, సగర్వంగా చెబుతున్నవంటి, మతసామరస్యం ఈనాడు మంట కలిసింది. సహోదర భావము కుప్పకూలిపోయింది. ఈస్థితిలో ఈనాడు ప్రభుత్వము వారొక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. వారి భావాల ప్రకారం, వారియొక్క అవగాహన ప్రకారం, వారి ఉద్దేశము ప్రకారం వారు ప్రవేశపెట్టారు. మాది కూడా ఒక పార్టీ, అన్ని పార్టీలున్నాయి. మేమందరం మిత్ర పక్షాలుగా ఎదురు పక్షాలుగా ఈనాడు నిల్చున్నాము.

ఈనాడు అందరం సమిష్టిగా దేశంపట్ల మాకున్నటువంటి విధానాన్ని బట్టి, మైనారిటీగా ఉన్నటువంటి ముస్లింలు, సిక్కులు ఇత్యాది మైనారిటీ వర్గాలకు అందరికీ సంబంధించి, మా అభిప్రాయాలను మేము పూర్తిగా ఆలోచన చేసుకొని, మేము కూడా ఒక తీర్మానాన్ని ప్రవేశపెడుతున్నామని మనవిచేస్తున్నాము.

**సహోదర భావము కుప్పకూలిపోయింది. ఈస్థితిలో ఈనాడు ప్రభుత్వము వారొక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. వారి భావాల ప్రకారం, వారియొక్క అవగాహన ప్రకారం, వారి ఉద్దేశము ప్రకారం వారు ప్రవేశపెట్టారు. మాది కూడా ఒక పార్టీ, అన్ని పార్టీలున్నాయి. మేమందరం మిత్ర పక్షాలుగా ఎదురు పక్షాలుగా ఈనాడు నిల్చున్నాము.**

"This House places on record its deep sense of sorrow at the demolition of Babri masjid in Ayodhya by the BJP and other communal forces which have put the secular concept of our nation in jeopardy. This has unleashed communal frenzy resulting in the loss of innocent lives in India and other parts of the world. This communal frenzy was precipitated due to the inaction of the Government of India..

The indecisiveness of the Prime Minister has been highlighted by the President of India in giving a direction to the Prime Minister to act promptly and to uphold the rule of law. The House also condemns the chain reaction resulting the destruction of temples and mosques, loss of property and human lives in our country and abroad. This House demands to uphold the highest traditions set by our forefathers who have achieved freedom for the country and given us Constitution with a concept of Secular Democracy. The Prime Minister should resign.

The House unanimously conveys its deep sympthay to the families of those who have lost their lives and properties. The House appeals to all the political parties, organisations and people to

co-operate in the maintenance of peace, law and order and communal harmony. The House recommends to the Government to reconstruct the places of worship which have become victims to this vandalism. అధ్యక్షా, మనం ఈనాడు మన దేశం యొక్క నైసర్గిక పరిస్థితి, సంస్కృతి అన్నీ కనుక ఒకసారి మననం చేసుకుంటే ఈనాడు మనము ఉండే విధానానికి మన సౌశీల్యానికి ఎంత చరిత్ర వెనుక ఉందో ఒకసారి గుర్తు చేసుకోవడం మంచిదని కూడా మనవిచేస్తున్నాను. ఎంతో మంది మన దేశం మీద దండయాత్రకు వచ్చారు. మరి ఆర్యులు కూడా ఈ దేశములోకి వచ్చినవారే. అలాగే మహమ్మదీయులు వచ్చారు. బ్రిటిష్‌వారు వచ్చారు.

ఇంకా ఎందరో, మరెందరో కూడా వచ్చారు. వారందరూ కూడా తిరిగి దేశం నుంచి ఎవరూ వెళ్లిపోలేదు. వచ్చి ఇక్కడే నిలబడిపోయారు. ఈ దేశములో ఉన్నారు. ఈ దేశం యొక్క సంస్కృతికి, విధానానికి, సమాజ వికాసానికి, సహోదర భావానికి వారందరూ కూడా ప్రతీకలుగా మన దేశములోనే ఉన్నారు. కాబట్టి, ఈనాడు వచ్చినటువంటి మతసామరస్యం అనేది ఈనాటిది కాదు. ఏనాడో, ఎప్పటి నుంచో మన దేశములో ఉన్నటువంటి విధానానికి పరిపూర్ణమైనటువంటి తార్కాణం అని కూడా మీకు గుర్తు చేస్తున్నాను. ఈ బాబ్రీమసీదు విషయములో మరి ఒకప్పుడు రామాలయం ఉండేది. మరి రాముడు ఎప్పుడో త్రేతాయుగములో ఉన్నాడు. ఆ త్రేతాయుగములో ఉన్నటువంటి ఆ అవతార పురుషుడికి చిహ్నముగా, గుర్తుగా పెట్టుకున్నది ఆలయం అన్నారు. ఇదే విధముగా బాబరు చక్రవర్తి వచ్చినప్పుడు అక్కడ నిర్మించినటువంటి మసీదు ఏవిధంగా నిర్మించాడు అనేది నేను చెప్పవలసినది కాదు. మరి ఆ స్థానంలోనే బాబరు చక్రవర్తి మసీదును నిర్మించాడు అనే అభిప్రాయం ఉంది. కాబట్టి మరి ఆనాడు నిర్మించింది బాబ్రీమసీదు.

అందుకే ఇదివరకు పూర్వం మరి జాతీయ కాంగ్రెస్ ఉన్నప్పుడు ఆనాడు This is an introduction to the subject, Sir.. ఆనాడు మరి ఇదే జాతీయ కాంగ్రెస్‌లో హోం మినిస్టర్‌గా ఉన్నటువంటి సర్దార్ పటేల్ జీ – ఆయన అంతకు ముందు కేవలం ఏదో ఉడుకుతూ ఉన్నటువంటి సమస్యను దీనిని ఏ విధంగా అవాలనే భావముతో ఆయన 1949 నాడే ఈ మసీదుకు తాళాలు వేయించడం కూడా జరిగిందని సందర్భముగా గుర్తుకు తెస్తున్నాను. అప్పుడు ఉన్నటువంటి జాతీయ కాంగ్రెస్, ఆ తరువాత జరిగిన పరిణామాలు అందరికీ తెలుసు. కాంగ్రెస్ ఎన్నో రూపాలు దిద్దుకున్నది. కాంగ్రెస్–ఎమ్, కాంగ్రెస్–ఆర్, కాంగ్రెస్–జడ్ – ఈ విధంగా ఛిన్నాభిన్నమై ముక్కలై చెక్కలై ఆనాడు సిద్ధాంతాలకు తిలోదకాలు ఇచ్చింది కూడా అందరికీ తెలుసు. తర్వాత 1986లో రాజకీయ లబ్ధి కోసం, ఓట్ల కోసం రాజీవ్‌గాంధీ గారు తాళాలు తీయించారు. What is the necessity to open it? ఈ సమస్యను బయటపెట్టారు, తాళాలు తీసి విచ్చలవిడిగా దేశం ముందుకు వదలిపెట్టారు ఆనాడు మరి, అధికారం కావాలి, పదవి కావాలి. దాని కోసం ఆ విధంగా ఎప్పటినుంచో మూతపడ్డటువంటి మాన్యుమెంట్‌ను

ఆనాడు తీయించారు. నా ఎలక్షన్ కాంపెయిన్ అయోధ్యలో మొదలు పెడుతున్నాను అన్నారు ఆయన. మరి దీని ఆంతర్యము ఏమిటి? ఎవరు ఈ సమస్యలు బయటకు తీసుకువచ్చారో ఒకసారి గుర్తు చేసుకోవాలని నేను సవినయంగా మనవి చేస్తున్నాను. I am bringing the facts before you. I am not imagining things. ఇవన్నీ జరిగిన విషయాలు మీకు చెపుతున్నాను.

దయచేసి ఆలోచించండి. ఎవరి సమయములో, ఎవరి హయాములో, ఎవరి ప్రభుత్వములో ఈ పరిణామాలు తలెత్తాయో ఈ దేశాన్ని అల్లకల్లోలం చేశాయో ఒకసారి తెలుసుకోవాలని మనవి చేస్తున్నాను. ఆనాడు 1986లో రాజీవ్ గాంధీ గారు నాంది పలికారు. మత వైషమ్యానికి అని నేను ఈ సందర్భముగా మీకు మనవి చేస్తున్నాను. ఇది అవకాశంగా తీసుకొని మత శక్తులు మరి విశ్వహిందూ పరిషత్తు కానివ్వండి, మరి అక్కడ బి.జె.పి కానివ్వండి, అక్కడ ఉన్నటువంటి – ఆర్.ఎస్. ఎస్. కానివ్వండి బజరంగ్ దళ్ కానివ్వండి ఏవిధంగా ఈ...

వారు ఏ విధంగా ఈ సమస్య వచ్చినప్పుడు ఏ సూత్రం ప్రకారం ఎలా ప్రవర్తించారో కూడా మీకందరికీ తెలిసిందే. రాజీవ్ గాంధీ గారు ఆయనే కనుక ఆనాడు తాళాలు తీసి ఉండకపోతే నేను ఏదో దీని విషయములో ప్రత్యేకంగా చేస్తున్నాను, పరిశీలిస్తున్నాను అనకపోతే ఈనాడు సమస్యే లేదు. ఈ సమస్య ఉత్పన్నం అవడానికి కారణం the then Congress (I) and Mr. Rajiv Gandhi.. అదే విషయము మీకు మనవిచేస్తున్నాను. నేషనల్ ఫ్రంట్ విధానం కూడా నేను – I am the Chairman of the National Front. నాకు ఈ విషయం పూర్తిగా తెలుసు. మీకు సవినయంగా మనవిచేస్తున్నాను. ఇప్పుడు ఎవరో గౌరవనీయులు లేచి అడిగారు. అద్వానీ గారికి ఆనాడు బొట్టు పెట్టారు. కాషాయం కట్టారు అన్నారు. ఈనాడు మీరు మా ఇంటికి వచ్చినా అదే అతిథ్యం ఇస్తాను. అది మన రక్తములో ఉన్నది. నేను వస్తాను అని వచ్చాడే కానీ నేను ఆహ్వానించలేదు.

Will you allow me to speak?... The House should hear... మరి ఆనాడు నేను వారిని రమ్మని బొట్టు పెట్టి ఆహ్వానం పంపించలేదు, పిలవలేదు. మీ ఇంటికి వస్తానన్నారు. ఆయన వచ్చాడు. ఏమి తప్పంటారా, మీరందరూ చెప్పండి. మన భారతీయ సంస్కృతి ఒప్పుకుంటుందా, చెప్పండి. మన స్నేహ విధానం అంగీకరిస్తుందా, చెప్పండని అడుగుతున్నాను. వచ్చారు, గౌరవించాను. తరువాత ఏమో ఆలయం విషయములో సుహృద్భావముతో కట్టుకోవచ్చు రామారావుగారు అన్నారు. ఆనాడే నేను ఖండించాను. వార్తా పత్రికలలో Please refer to it. అదే విషయములో – మరి నేను రామ్‌మనోహర్ లోహియా హాస్పిటల్లో ఏదో చికిత్స కోసం ఉన్నప్పుడు ఆనాడు రథయాత్ర కోసం, అదే రథయాత్ర కంటిన్యూ అయింది. మరి అనాడే కనుక వారిని సమర్థించి ఉంటే నేను ఎందుకు పెడతాను ఆ ప్రెస్‌మీట్ అని ఒకసారి విజ్ఞతతో

ఆలోచించమని మనవిచేస్తున్నాను. రథయాత్ర వారు చేస్తున్నప్పుడు నేను As the Chairman of the National Front గా ఉన్నాను.

*(ఇంటరప్షన్స్)*

అధ్యక్షా, ఈ సందర్భముగా మరి తప్పును వివరంగా చెపుతున్నాను. 1989 ఎలక్షన్‌లో అయోధ్యలో శ్రీ రాజీవ్ గాంధీగారు ఎలక్షన్ కేంపెయిన్ మొదలుపెట్టారు, ఈ దేశాన్ని ఉద్ధరిస్తాను అని, అదే మరుసటి రోజున ఫైజాబాదులో ఉపన్యాసములో He reiterated it. ముస్లిములు కష్టపడవద్దు అని, ముస్లిము ఓట్ల కోసం నేను మాస్క్‌ను రక్షిస్తాను అని ఆ మాట అన్నారు. రిఫర్ ది రికార్డ్స్ హియర్. మన దేశం యొక్క మతసామరస్యాన్ని, సర్వమత సమాన భావాన్ని రక్షించడానికి నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ఈ దేశములో చేసినటువంటి కార్యక్రమం. ఏలిన ఏలుబడి అపూర్వం. ఇక్కడ శాశ్వతంగా మిగులుతుంది. రథ యాత్రను నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ఆపితే నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వానికి మద్ధతును ఉపసంహరించుకొంటామని బి.జె.పి బెదిరించినా మేము అంగీకరించలేదు...

అధ్యక్షా, ఆ రోజున మన సభ్యతనూ, సంస్కారాన్ని, జాతి విధానాన్ని కాపాడుకోవడం కోసం నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ఏవిధంగా వ్యవహరించిందో చెప్పుతున్నాను. అనాడు అద్వానీగారు మా ఇంటికి వచ్చినప్పుడు చెప్పాను. ఇది అపండి. ఇది దేశ శ్రేయస్సుకు మంచిది కాదని చెప్పాను. We never appreciated this. దీనిని మేము సమర్థించము అని కూడా చెప్పాను. అదేవిధంగా దేవాలయం విషయంలో రామారావుగారు ఏదో కప్పిపుచ్చారని కాదు. అదే విధంగా మీరు రథయాత్రను ఆపినట్లయితే మేము మీ ప్రభుత్వానికి మద్దతును ఉపసంహరించుకుంటామని వి.పి సింగ్‌గారిని బెదిరించినప్పటికి కూడా దేశ సమగ్రతను కాపాడడం కోసం నిర్దాక్షిణ్యంగా 1991లో రథయాత్రను ఆపడం జరిగింది. How the National Front stopped the Radha Yatra at the cost of the power, you know it. దేశ సంరక్షణకోసం మైనారిటీలైన ముస్లింల కోసం, ఆనాడు శాంతిభద్రతలను కాపాడడం కోసం, సమాజం యొక్క సభ్యతకోసం, వికాసం కోసం ఏవిధంగా ప్రవర్తించామో కూడా ఒకసారి తమకు గుర్తు చేస్తున్నాను.

నేను ఛైర్మన్‌గా అద్వానీగారి ఇంటికి వస్తున్నానని చెప్పి టైం తీసుకొని వారి ఇంటికి వెళ్లడం జరిగింది. అది ఎవరికీ తెలియదు. నేను హాస్పిటల్‌లో బెడ్ మీద ఉండి ఎక్కడికీ వెళ్ళడానికి వీలులేని పరిస్థితిలో కూడా రహస్యంగా కారు తెప్పించుకొని తిన్నగా వారి ఇంటికి వెళ్ళాను. నేను వెళ్లేసరికి ఆయన వేరే నాయకులతో సమావేశం జరుపుతున్నారు. అయినా నన్ను ఎంతో ఔదార్యంతో పిలిచి వారి ఇంట్లో ఉన్న ఒక గదిలోకి తీసుకువెళ్లి మాట్లాడారు. అప్పుడు నేను నిష్కర్షగా మూడు పాయింట్లు చెప్పాను. ఇది దేశానికి సంబంధించిన సమస్య, మతానికి సంబంధించిన సమస్య, దీని గురించి

తొందరపడవద్దు, మత సామరస్యమే మన ధ్యేయం అని చెప్పాను. అందరూ హర్షించే విధంగా నిర్ణయం తీసుకోవాలనే నేషనల్ ఫ్రంట్ తరఫున మూడు పాయింట్ల గురించి సజెస్ట్ చేయడానికి వచ్చానని చెప్పాను.

నేను ఇచ్చిన సలహాలు ఏమిటంటే రాష్ట్రపతిచే సుప్రీంకోర్టు స్పెషల్ బెంచ్‌ను కానిస్టిట్యూట్ చేయించమని చెప్పాను. స్పెషల్ బెంచ్‌ను ఏర్పాటు చేయించి ఏ మాత్రం జాగులేకుండా 30, 40 రోజులలో ఈ సమస్యపై అభిప్రాయం తెలుసుకోవాలని చెప్పాను. సమస్య తీవ్రతను తెలుసుకొని స్పెషల్ బెంచ్ అభిప్రాయాన్ని త్వరలో తెలుసుకోవాలని చెప్పాను. రెండవ పాయింట్, ఇక వివాదంలో ఉన్న స్థలం, ఆ ప్రొహిబిటెడ్ ఏరియాలో ఎవరూ ప్రవేశించడానికి వీలు లేదు, అది ప్రభుత్వ అధీనంలో ఉండాలి. అక్కడ, రాయి తియ్యడానికి, రాయి వెయ్యడానికి వీలు లేకుండా మీరు రక్షించవలసిందిగా కోరడం జరిగింది. ప్రభుత్వం రక్షిస్తుంది. కాబట్టి దీన్ని అంగీకరించండి? మూడవ పాయింట్  ఏ తీర్మానం అయితే, ఏ నిర్ణయం అయితే, ఏ జడ్జిమెంట్ అయితే సుప్రీంకోర్టు స్పెషల్ బెంచ్ ఇస్తుందో దాని విషయంలో అందరూ ఆలోచించాలి.

ఈ మూడు పాయింట్లు చెప్పాను. దేశ శ్రేయస్సుకోసం, నా అంతట నేను, నేషనల్ ఫ్రంట్ ఛైర్మన్‌గా ఐ రికమండెడ్ ది గవర్నమెంట్. నేషనల్ ఫ్రంట్ గవర్నమెంట్ అభిప్రాయం కూడా ఇదే. I impressd on the Government to accept this. మీరు దయచేసి అంగీకరించండి. దేశంలో క్షోభ తెచ్చిపెట్టకండి. మత సామరస్యాన్ని చెడగొట్టకండని చెప్పడం కూడా జరిగింది. కాబట్టి, నేను ఆనాడు చెప్పాను. అటువంటి విధానాన్ని వారు తిరస్కరించారు. ఎంతో బాధతో మీకు వ్యక్తం చేస్తున్నాను. ఆనాడే కనుక వారు అంగీకరించివుంటే, ఈ అనర్థం ఇప్పుడు వచ్చేది కాదు. 1991లో జరిగింది. అప్పుడే కనుక అంగీకరిస్తే, ఇప్పటికే తీర్పును సుప్రీంకోర్టు ఇచ్చేది. అది అందరూ కూడా ఆమోదయోగ్యంగా అంగీకరించివుంటే, మతసామరస్యం చక్కగా ఉండేది.

ఆనాడు ఏమాత్రం కూడా అంగీకరించకపోవడం వల్ల ఈనాడు ఈ సమస్య ఏర్పడిందని మనవిచేస్తున్నాను. I am stressing it again and again. వెంటనే ఆనాడు అద్వానీ గారిని అరెస్టు చేస్తున్నామని చెప్పడం జరిగింది. We never cared for the power, for the position. ఇవాళ ఎంగిలి కూడు తిని అధికారంకోసం, ఆత్మను తాకట్టు పెట్టుకోము. కానీ, నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం అంగీకరించలేదు ప్రభుత్వం పోయినాసరే. మేము పోయినా సరేగానీ, ఆ విధానాన్ని అంగీకరించకుండా వెంటనే అద్వానీగారిని అరెస్టు చేయడం జరిగిందని మనవిచేస్తున్నాను. అదేవిధంగా, అనాడు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ములాయం సింగ్ యాదవ్ ఆనాడు చీఫ్ మినిష్టర్, ఎవరు అయినాసరే, మతానికి సంబంధించిన, ఏ ఆయుధంతో అయినా, దేనితో అయినా గానీ ప్రవేశించడానికి వీలు లేకుండా జాగ్రత్త వహించాలనిహెచ్చరించడం వల్ల ఒక సంఘటన జరగలేదు. ఆనాడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం బాబరీ మసీదును రక్షించగలిగితే ఈనాడు

This Government with all the power and forces... రక్షించలేకపోయింది. దీన్ని తీవ్రంగా ఆలోచించవలసిందిగా మీకు సవినయంగా మనవి చేస్తున్నాను.

ఆనాడు ఎన్నికలు అయ్యాయి. ఎన్నికలు అయినప్పుడు ఏ విధంగా రాజీవ్ గాంధీ గారి హత్యతో కాంగ్రెస్ ఆనాడు గద్దె ఎక్కిందో కూడా తెలుసు. లేనిచో ఎక్కగలిగేదా? But it is a minority Government. ఇంకొక పార్టీ సపోర్టు ఇస్తేగానే అధికారాన్ని నిలుపుకోలేని స్థితిలో ఉంది. బి.జె.పి.ని కలుపుకుని, కలుపుకోకపోతే, డిప్యూటీ స్పీకర్ పోస్టు ఏ గౌరవంతో ఇచ్చారు లోక్‌సభలో?... అదే సిద్ధాంతం అయితే స్పీకర్ మావాడు ఉండాలి. డిప్యూటీ స్పీకర్ ప్రతిపక్షాల వారు ఉండాలి. అదే సిద్ధాంతం అయితే రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ ప్రతిపక్షాలకు చెందిన వారు ఉండాలి. ఏదో ఒక ఆదర్శం ఉండాలి. ఆ విధానం లేకుండానే రాజ్యసభకు వచ్చినప్పుడు మీరు ఏ విధంగా డిప్యూటీ ఛైర్మన్‌ను పెట్టారు. అదే విధంగా మా పక్షానికి డెప్యూటీ ఛైర్మన్ ఇవ్వాలంటే కాదు. మేము కాంగ్రెస్ వారికి, మా పార్టీ వారికి ఇస్తామని ఎందుకు అన్నారు.

*(ఇంటరప్షన్స్)*

అదేవిధంగా అమెరికాలో అద్వానీగారు స్టేట్‌మెంట్ ఇచ్చారు. లాల్ బహదూర్ శాస్త్రిని మించినటువంటి ఒక మహాబలుడు, విజ్ఞుడు ఈ రోజు మనకు ప్రధానిగా వచ్చారు. మరి దీనికి కారణం ఏమిటి? వీరి సిద్ధాంతం కాంగ్రెస్ ప్రధానిని పరిరక్షించడమా? వారికి అండగా నిలవడమా?.....

**ఎన్నికలు అయినప్పుడు ఏ విధంగా రాజీవ్ గాంధీ గారి హత్యతో కాంగ్రెస్ ఆనాడు గద్దె ఎక్కిందో కూడా తెలుసు. లేనిచో ఎక్కగలిగేధా?** But it is a minority Government. **ఇంకొక పార్టీ సపోర్టు ఇస్తేగానే వారు అధికారాన్ని నిలుపుకోలేని స్థితిలో ఉంది. తాకట్టు పెట్టారు. బి.జె.పిం కలుపుకుని, కలుపుకోకపోతే, డిప్యూటీ స్పీకర్ పోస్టు ఏ గౌరవంతో ఇచ్చారు లోక్‌సభలో?...**

అధ్యక్షా, మా అభిప్రాయం ఇది: మేము చెప్పుతున్నాము. ఆనాడు కాంగ్రెస్, బి.జె.పి.ల యొక్క రాజకీయ వివాధాల పర్యవసానమే ఈ సమస్య. దేశ ప్రజలు విస్తుపోయారు. ఏమిటి ఈనాడు బి.జె.పి కేవలం కాంగ్రెస్ జేబులో బొమ్మ అయిపోయిందే ఏమిటి? ఈ విధంగా విఫలం అయ్యారు? పార్టీ సిద్ధాంతం ఇలా ఉంటే నష్టమని భావించి వారి వైఖరి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మారిందని చెప్పవలసి ఉంటుందని మనవి చేస్తున్నాను.

ఆ రోజు అయోధ్యలో బి.జె.పి చేసిన స్టేట్‌మెంట్ చూడండి. మేము కరసేవ చేస్తాము అన్నారు. 6వ తేదీన ఏమిటి? మీకు, ప్రభుత్వానికి విజ్ఞత ఉందా లేదా? అందరూ ఆలోచించాలని మనవిచేస్తున్నాను. అయోధ్యలో ఏ సమస్య వచ్చినా దాన్ని పరిష్కరిస్తారనే భావంతో ఆ రోజు నాలుగు నెలలు వాయిదా వేయించి కరసేవదాకా ఉండండి. తరువాత ఆలోచిస్తామన్నారు. తరువాత నేషనల్ ఇంటిగ్రేషన్ కౌన్సిల్ మీట్ అయినప్పుడు పూర్తిగా ప్రధాన మంత్రిగారికి....

నాలుగు నెలలు గడువు ఇచ్చారు. మేము ఏదో చేస్తాము, నిర్ణయిస్తాము, ఈ సమస్యను పరిష్కరిస్తాము, దేశం కోసం నాలుగు నెలలు మీటింగు చేసి, ప్రధానమంత్రిగారు నిద్రపోయారు. ఇంత అనర్థానికి బాధ్యులు ఎవరని అడుగుతున్నాను. అదే, నేషనల్ ఇంటిగ్రేషన్ కౌన్సిల్‌లో మీరు ఏ నిర్ణయం తీసుకున్నప్పటికి కూడా అది సహృదయంతో దయతో ఆలోచించండి? దేశ క్షేమాన్ని చూడండి? మంచి చేయండి, మతసామరస్యాన్ని నిలపండి, మైనారిటీల శాంతి భద్రతలను కాపాడండి. మీకు అధికారాలు ఇచ్చామని చెప్పారు. ఏమి చేశారు? ఏమి చేయగలిగారు? అప్పుడు నేను వెళ్లకపోవడానికి కారణం అడిగారు కనుక చెప్పవలసిన ధర్మం ఉంది. ఎన్నో పనులు ఉంటాయి. మరునాడు ప్రొద్దున వెళ్లవలసివున్నది. ఒక మానవునిగా వేరే పనులు కూడా కొన్ని ఉంటాయి కదా. దేశం కోసం ఆనాడు మా విధానాన్ని వ్యక్తం చేయడం జరిగింది. ఆనాడు టెలిగ్రాం పంపాను. అయోధ్యలో ఇంత గొడవ జరిగితే ప్రధానమంత్రి వెళ్లలేదు. సమస్య ఏమిటో మరి. దేశానికి ఈ గతి పట్టించాడు ఆ మహానుభావుడు అని చెబుతున్నాను.

అధ్యక్షా, అద్వానీగారు, అందరూ మొదటి నుండి చెబుతూనే ఉన్నారు 'కరసేవ తప్పక జరిగి తీరుతుంది అని. అప్పుడున్న వి.హెచ్.పి, భజరంగ్ దళ్ కానీయండి, ఆర్.యస్.యస్ కానీయండి' మేము మందిరం నిర్మాణానికే వెడుతున్నాము అని కొన్ని స్టేట్‌మెంట్స్ కూడా ఇవ్వడం జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. ఇంత అధికారం ఉంది, ఇంత సేవాతత్పరత ఉండి కాపాడవలసి బాధ్యత ఉండి, ఏమీ చేయలేదు. మేము ఎప్పుడో చెప్పాము. గవర్నమెంట్ అధీనంలో ఉంచి, ప్రొహిబిటెడ్ ఏరియాగా డిక్లేర్ చేసి పరిరక్షించవలసిన బాధ్యత ఉందని నేను చెప్పడం జరిగింది. దానికి అనుగుణంగా చేసి ఉంటే ఈనాడు ఈ అనర్థం జరిగేదా అని అడుగుతున్నాను. 21 బెటాలియన్ల సేనను పంపించాము అన్నారు. అక్కడ అధికారంలో ఉన్నటువంటి బి.జె.పి గవర్నమెంట్ (ఉత్తరప్రదేశ్‌లో) 'మమ్మల్ని అడక్కుండా సైన్యాన్ని ఎలా పంపిస్తారు'. అని అంటే ఈ బెటాలియన్స్ అక్కడకు 8 మైళ్ల దూరంలో నిలబడడం జరిగింది.

ఈ బెటాలియన్స్‌ను అక్కడకు పంపడానికి రూ.80 కోట్లు ఖర్చయింది. ఈ బెటాలియన్స్ మా ఉత్తర్వుల ప్రకారమే పని చేస్తాయని చెప్పారు. ఇంతకంటే విషయం మరొకటి ఉంటుందా? ఆనాడు బి.జె.పి. లీడర్ శ్రీ అద్వానీ, అధ్యక్షుడు జోషిగారు అక్కడ ఉన్నారు ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. వారికి, తమ పార్టీ మీద కంట్రోల్ ఉన్నప్పటికీ వారు తరువాత చెప్పిన విధానాలను బట్టి ఆనాడే అని ఉండవలసింది. ఎందుకు చెప్పి ఉండకూడదు? వారికి అపకీర్తి వస్తుందా? ఆనాడే చెబితే ఈ సమస్య వచ్చి ఉండేది కాదు. ఆనాడు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అయినా మసీదును పరిరక్షించండి అని అనలేకపోయింది. 80 కోట్ల రూపాయల ఖర్చుతో వచ్చిన బెటాలియన్లు 8 మైళ్ల దూరంలో తుపాకులు బారు చేసి చూస్తూ కూర్చున్నారు. అక్కడ ఏ విధంగా జరుగుతుందో ఆనందిద్దాము అన్నట్లుగా.

ఈ సందర్భంగా మరో విషయం గుర్తు చేస్తున్నాము. రక్షణ బాధ్యత ఉంది ప్రధాన మంత్రికి, ఆ భారం, బాధ్యత ఆయనవి. ఆధారం ఉందే, ప్రతిష్ట తన చేతిలో ఉందే, మనందరి ఆత్మగౌరవం నిలబెట్టవలసిన బాధ్యత ఉందే, ఆరోజున డిసెంబర్ 6న ఎంతమంది గుమికూడారో కదా? బాబ్రీమసీదు పడగొట్టే విషయంలో 3 లక్షల మంది కరసేవకులు వెళ్లి అంత పెద్ద డోమ్స్ మూడింటిని నాలుగున్నర, ఐదు గంటల కాలంలో పడగొట్టారంటే ఎంతమంది పని చేయవలసి ఉంటుంది? ఎన్ని పనిముట్లు, పలుగులు, పారలు తీసుకువెళ్లి ఎంతమంది ఏ విధంగా పని చేశారు? ఇంత తెలియని గుడ్డితనంతో ఉందా యూనియన్ ప్రభుత్వం? టి.వి.లో ఎప్పటికప్పుడు చూపిస్తూ ఉన్నారు, బిబిసిలో ఎప్పటికప్పుడు వస్తూ ఉంది. ఈ విధంగా తగాదా అవుతూ ఉన్నదంటూ, ఏ మాత్రం ఇంగితం లేకుండా కేబినెట్ మీటింగ్‌కు పిలవడం ఎందుకండీ? ఆరు గంటల తరువాత పిలుస్తారా ప్రధానమంత్రి? మేము దానికి అంగీకరించాలా? ఇంత జరుగుతూవుంటే, బాబ్రీమసీదును పడగొడుతూవుంటే, పెద్ద పెద్ద రాళ్లను కూలద్రోసి మూడు డోమ్స్‌ను నేలమట్టం చేస్తూ వుంటే ఒక్క తుపాకీ కూడా పేలలేదా? అందరూ చూస్తున్నారు ఆనందంగా.

ఈ విధమైనటువంటి అప్రతిష్ట మనకు రావడానికి కారణభూతులు ఎవరో నిర్దాక్షిణ్యంగా, నిశ్చయంగా ఆలోచించవలసిన అవసరం ఉందని మీకు మనవిచేస్తున్నాను. కనీసం లాఠీఛార్జ్ అయినా చేశారా? నేను అడుగుతున్నాను. 21 బెటాలియన్లను రూ.80 కోట్ల వ్యయంతో పంపించారు. ఎందుకు అధ్యక్షా? ఇంకా విచిత్రం ఏమంటే సాయంత్రం ఐదు గంటలకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ కళ్యాణ్ సింగ్ వారి పని పూర్తి అయిన తరువాత మసీదు కూలిపోయిన తరువాత ఆయన రిజైన్ చేస్తున్నట్లుగా చెప్పారు. అధ్యక్షా, ఈ దేశానికి పట్టిన దౌర్భాగ్యం ఏమంటే, తరువాత ప్రధానమంత్రి, ఐయాం డిస్మిసింగ్ ది గవర్నమెంట్ అని అన్నారు.

ఏమిటీ, మజాకా. నా దేశం అంటే, ఇష్టంవచ్చినట్లు ప్రవర్తించి, అందరి ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టడమేనా? మతవిద్వేషాలను రెచ్చగొట్టి, వేలమంది చావులకు కారణభూతులు కావడమా అధ్యక్షా? ఒక్క మనిషి అసమర్థతవల్ల, ప్రధానమంత్రి సకాలంలో సరైన చర్య తీసుకోకపోవడం వల్ల, అశక్తుడు కావడం వల్ల దేశ ప్రతిష్ట పోయింది. ఈ అనర్థానికి ఆయన అసమర్థతే కారణమని నేను స్పష్టంగా చెబుతున్నాను. ఆయన ఢిల్లీ నుండి వీక్షించారు. ఎ.సి రూంలో కూర్చొని టీ.వి. చూస్తూ చక్కగా జరుగుతోంది పని అని ఆనందించారు. ఏ చర్యా తీసుకోని ప్రధానమంత్రి ఎందుకు మన దేశానికి? నేను చాలా సూటిగా ప్రశ్నిస్తున్నాను. నేను ఏ పార్టీని నిందించడం లేదు. ఏ వ్యక్తిని నిందించడం లేదు, దేశానికి సంబంధించిన ఇష్యూ కాబట్టి చెప్పే అధికారం నాకు ఉంది. రాష్ట్రపతిని ఎవరైనా, ఏవైనా అడుగుతారేమో చెప్పండి. సరైన కాలంలో, సరైన విధానంలో ఈ ప్రభుత్వం చర్య తీసుకోలేదు, రూల్ ఆఫ్ లా పాటించలేదని ఆయన ఉత్తరం వ్రాశారు. నేను సూటిగా ప్రశ్నిస్తున్నాను.

45 సంవత్సరాల స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఏ రాష్ట్రపతి, ఏ ప్రధానమంత్రికి వ్రాయనిది, ఈనాడు గౌరవ రాష్ట్రపతిగారు పూజ్య శంకర్ దయాళ్ శర్మగారు ఎందుకు వ్రాయవలసి వచ్చింది? ఆ జాబు పత్రికలలో ప్రకటించబడింది. దయచేసి అందరూ చూడమని మనవి చేస్తున్నాను. ఇది బాధతో చెబుతున్నాను. దురుద్దేశంతో కాదు. ఎవరికీ ఎవరి మీద ద్వేషం కాదు. దేశ గౌరవం చచ్చిన తరువాత, మన జాతి చచ్చిన తరువాత మీ గౌరవం ఏమిటి? నా గౌరవం ఏమిటి? ఈ విషయంలో నా బాధను వ్యక్తం చేస్తున్నాను.

మనకు అనుభవం ఉంది. ఆదర్శం ఉంది. ఈ విధంగా ఏ వివాదం సంభవించినప్పటికీ, ప్రాణ నష్టం సంభవించనప్పటికీ, దేశ ఖ్యాతి నాశనమైనప్పటికీ కూడా ఎన్.టి. రామారావుకి ఎం.ఎల్.ఏగా ఇక్కడ నుంచి దిగమనే ఖర్మ ఎందుకు పట్టిందండీ? వారి పార్టీ వారే అన్నారు. చెప్పవలసిన వివరాలు చాలా ఉన్నాయి. కానీ టైమ్ లేదు అంటున్నారు. వివరాలకు పోను, సోదరులే చెప్పారు. ఈ ప్రధానమంత్రి అప్పుడే చర్య తీసుకుంటే ఏమీ ఉండేది కాదు. మేము ఈనాడు ఇంత బాధపడే అవసరం ఉండేది కాదు. గుండెలు తెంచుకుని మాట్లాడే అవసరం లేదు. నేను బాధతో మాట్లాడుతున్నాను. మైనారిటిస్ పట్ల సానుభూతితో మాట్లాడుతున్నాను. మా పార్టీ 7 సంవత్సరాల పరిపాలనా కాలంలో ఏం జరిగిందో గుర్తుచేస్తున్నాను. మా పరిపాలనలో న్యాయం, ధర్మం ఇప్పుడు పాటించలేదు. నలుగురి దృష్టిలో ఎంతో చిన్న వారం అయిపోయాము. మన ప్రతిష్ట చచ్చింది.

> **ఒక్క మనిషి అసమర్థతవల్ల, ప్రధానమంత్రి సకాలంలో సరైన చర్య తీసుకోకపోవడం వల్ల, అశక్తుడు కావడం వల్ల దేశ ప్రతిష్ట పోయింది. ఈ అనర్థానికి ఆయన అసమర్థతే కారణమని నేను చెబుతున్నాను. ఆయన ఢిల్లీ నుండి వీక్షించారు. ఏ.సి రూంలో కూర్చొని టీ.వి. చూస్తూ చక్కగా జరుగుతోంది పని అని ఆనందించారు. ఏ చర్యా తీసుకోని ప్రధానమంత్రి ఎందుకు మన దేశానికి?**

ఈ దుష్ఫలితాలు ఇంతటితో ఆగలేదు ఇతర దేశాలకు పాకింది. కాశ్మీరులో, పాకిస్థాన్‌లో ఎన్నో దేవాలయాలు పడగొట్టబడ్డాయి. దీనికి కారణం ప్రధానమంత్రి, ప్రధానమంత్రి, ప్రధానమంత్రి. ఇంతవరకూ కూడా చర్య తీసుకోలేదు. నేను మళ్లీ మళ్లీ చెబుతున్నాను. అందరి మీద గౌరవం ఉంటే, ప్రజల మీద అప్యాయత ఉంటే, "ఇది తెలియకుండా జరిగిన పొరపాటు, మసీదులను పునర్నిర్మిస్తాము, సోదరుల బాధలో భాగస్వాములం అవుతాము" అని ఇంత వరకూ చెప్పకుండా ఉండడం వల్ల మైనారిటీలుగా ఉన్న మన హిందువులు అక్కడ ప్రాణాలు పోగొట్టుకోబడ్డారు. అక్కడున్న మన మతానికి సంబంధించినవి ధ్వంసం చేయబడినాయి. దీనికి కారణం ప్రైమ్ మినిస్టర్ ఆఫ్ ఇండియా.

అంతా అయిన తరువాత, ఇల్లు కాలిన తరువాత బావి త్రవ్విస్తున్నాడట ఒక మహానుభావుడు అక్కడ. అంతా జరిగింది. బాబ్రీమసీదు కూలిపోయింది. తరువాత వీరు ఆ ప్రభుత్వాన్ని డిస్మిస్

చేశారు. అద్వానీ, జోషీలను అరెస్టు చేశారు. ఏమిటీ అన్యాయం? వారు కారణభూతులైతే వారిపై ముందే చర్య తీసుకోవలసింది. అంతా అయిన తరువాత, పని పూర్తిగా అయిన తరువాత, జరగనిచ్చిన తరువాత, ఈ కార్యక్రమం ఎందుకు చేపట్టవలసిందని మనవిచేస్తున్నాను. They have been made as national heros. ఈ అకార్యం వల్ల, జాతి అంతా కూడా తప్పు చేశారు అని చెప్పిన తరువాత, వారిని రక్షించడం కోసం అరెస్టులు చేశామంటున్నారు కానీ జాతికి, దేశానికి జరిగిన అగౌరవం కారణంగా కాదు అని మనవిచేస్తున్నాను. పేర్లు, మరీ మరీ చెప్పక్కరలేదు. ఈ జరిగిన విధానానికి వాపోతున్నాము అన్నారు. I have been betrayed. ప్రధానమంత్రిగారు అన్నారు. ఇది ప్లాన్ ప్రకారంగా జరిగింది అన్నారు.

అయిన తరువాత ఎందుకు చెప్పడం? ఈ ప్లాన్స్ ముందే తెలుసుకోలేరా? He must own the responsibility. మన దేశంలో ఇంటిలిజెన్స్ విభాగం ఏమయింది? చచ్చిందా అని అడుగుతున్నాను. ఇంత ఘోరం జరుగుతుంటే చెప్పలేకపోయారా? ఒక్క వార్త ప్రధానమంత్రి దృష్టికి రాలేకపోయిందంటే ఇది రాజ్యాంగ దోషమా, రాజ్యాంగ అసమర్థతా, ప్రధానమంత్రి ఆశక్తతా? ఇంత కుట్ర జరుగుతుందని నా నోట కాదు. అందరూ అనుకున్నదే ప్లాన్ ప్రకారం జరిగిన ఒక వినాశనమైన విధానం అన్నారు. బి.జె.పి చేసిన మోసం అన్నారు. ప్రధానమంత్రి ఆయన నోటితో అన్నారు. ఏం? మోసం చేస్తుంటే కళ్ళు మూసుకుని కూర్చున్నారా? వెంటనే నివారించవలసిందే. మైనారిటీలను కాపాడవలసిందే. అల్పసంఖ్యాక వర్గాల శాంతి భద్రతలు కాపాడవలసిందే. అది పోయి ప్లాన్ ప్రకారంగా జరిగిందని, దీనికి తాను బాధ్యుడను కాను అని తప్పించుకునేందుకు ఏ మాత్రం వీలులేదు. ఆయన బాధ్యత వహించాలి. పూర్తిగా బాధ్యత వహించాలి. కేవలం కంటితుడుపు కార్యక్రమం – ఐ వాష్‌గా వారిని అరెస్టు చేస్తాం. వీరిని అరెస్టు చేస్తాం అన్నారు.

దీనిపై వారి చిత్తశుద్ధిని శంకించలేని మూర్ఖులం కాదు మేము. లోపల ఏం విషం ఉందో, ఏ ప్లాన్ ప్రకారం జరిగిందో మేము అర్థం చేసుకోగలము. నేను కాదు. ప్రజలంతా కూడా అర్థం చేసుకోగలరు. ఇంత వరకూ జరిగిన అనర్థం గురించి చెప్పాను. ఇది నాకు సంబంధించినది కాదు. నా పార్టీకి సంబంధించింది కాదు. ఇది మన సంస్కృతికి, మన చరిత్రకు 45 సంవత్సరాలు మనం కాపాడుతూ వస్తున్న మత సామరస్యానికి, సెక్యులరిజానికి విఘాతం కలిగించేది. ఈనాడు సెక్యులరిజం మట్టిలో కలిసిపోయింది. ఏ కారణంగానైనా సరే ఇంత పెద్ద సమస్య వస్తే, ఏ విధంగా అభిప్రాయాలు తీసుకోవాలి? ఏ విధంగా తీర్మానం ప్రవేశపెట్టాలి. ఇందుకు కారణ భూతులైన వారిని శిక్షించడం లేకుండా To defend the Prime Minister - it should not be the Party affair - it is a country's affair, it is a social affair - Social integrity between the minorities and other Communities. The Prime Minister should own the responsibility.

మన ఆర్థిక విధానం ఏమవుతుంది? మన ప్రజాస్వామ్యం ఏమవుతుంది? మన పరిశ్రమలు ఏమవుతాయి? మన దేశాన్ని ఎవరు నమ్ముతారు. కోట్లాను కోట్ల రూపాయలు తెచ్చి పరిశ్రమలు పెట్టుకుంటే మసీదునే కాపాడలేని వారు అశక్తులు, దుర్బలులు మీరు, మా పరిశ్రమలు ఎట్లా కాపాడగలరు" అని అడుగరా? ఈ అనర్థానికీ, ఆర్థిక నష్టానికీ ప్రధానమంత్రి బాధ్యత వహించాలి. ఆయన ఆర్థిక విధానాలేమిటో తెలిసిపోయాయి. ఆయన ఆర్థిక విధానాలు మట్టిలో కలిసిపోయాయి. They have flow like paper in the air. గాలిలో కొట్టుకుపోయాయి. ఇందుకు కారణభూతుడైన వాడు 'వారిని పిలుస్తాము. వీరిని పిలుస్తాము' అంటే పిలిచి ఏం అడుగుతారు? అంతా అయింది. వారి హృదయాలు గాయపడ్డాయి. మానవత్వం చచ్చింది. రాక్షసత్వం పెరిగింది. ఇంకా ఆలోచించడం ఏమిటి? కాబట్టి I demand for the resignation of the Prime Minister. He must resign and get down for the prestige of the nation. All the damaged institutions must be rebuilt by the nation.

ఏ మతానికి చెందిన సంస్థలు నష్టపడ్డాయో, దేవాలయాలు కానీ, మసీదులు కానీ, ప్రభుత్వం కట్టి ఇవ్వాలని మేము డిమాండ్ చేస్తున్నాము. ఈ దేశాన్ని సంరక్షిస్తాము. మత సామరస్యాన్ని కాపాడుతాము. సమాజంలో శాంతిని కల్పిస్తాము అని నమ్మకం కలుగజేసే బాధ్యత యూనియన్ గవర్నమెంట్ మీద ఉంది. అది ప్రధాన మంత్రిది. ఇవి మా డిమాండ్స్. ఈ డిమాండ్స్‌తో రిజల్యూషన్ పెట్టాము. దయతో కాంగ్రెస్ పార్టీ అనీ, తెలుగుదేశం అనీ మరొకటనీ కాకుండా తీసుకోవాలి. పోయిన నష్టాన్ని ఏ విధంగా భర్తీ చేసుకోవాలి. పోయిన గౌరవాన్ని, ప్రతిష్టనూ ఎట్లా తిరిగి తెచ్చుకోవాలి అనే పద్ధతిలో ఈ అమెండ్‌మెంట్‌ను గౌరవించి, గుర్తించి, దీనిని రిజల్యూషన్‌గా తీసుకోవాలని మనవిచేస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

◆◆

డిసెంబర్ 24, 1992

## సూచనలు ఇవ్వమన్నారు, నేను సొల్యూషన్ ఇస్తున్నాను. తీర్మానం పెట్టండి!

*(సి.డబ్ల్యూ.సి. వద్ద అపరిష్కృతంగా ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులపై ప్రభుత్వం ఇచ్చిన జవాబుపై చేసిన ప్రసంగం)*

**SRI N.T. RAMA RAO:** Water is going into the sea wastely. It is the right of Andhra Pradesh to use the excess water which is going as waste into the sea. అధ్యక్షా, చాలా ముఖ్యమైనటువంటి సమస్య కేవలం మన అసెంబ్లీ ద్వారా ప్రజలకు మనం చెప్పవలసినటువంటి చాలా అత్యవసరమైనటువంటి వివరము. ఎందుకంటే ఎప్పటినుంచో ఇది ఉంది. ఈనాటిది కాదు. మరి తెలుగుదేశం హయాములో చేశాము. పెండింగు ప్రాజెక్టులు ఎన్ని ఉన్నాయో కూడా మరి ఇప్పుడు అడిషనల్ ఛార్జి వారు జవాబు చెబుతున్నారు. గౌరవనీయులు ముఖ్యమంత్రిగారు ఉండవలసింది. ఎందుకంటే వారి స్థాయిలో ప్రజలకు అష్యూరెన్సు ఇవ్వాలి. కృష్ణా డిస్ప్యూటెడ్ వాటర్స్ బచావత్ అవార్డు ప్రకారంగా 2000 సంవత్సరం తరువాత మనం ఒక చుక్క నీరు కూడా ముట్టుకోడానికి వీలులేదు అధ్యక్షా. అది అందరికీ తెలిసినటువంటి విషయం.

మరి మా హయాములో 323 టి.ఎం.సిల వాటరు వృథాగా సముద్రములోనికి పోతోంది అనేటటువంటి యథార్థము మీద అప్పుడు ప్రాజెక్టులు అన్ని కూడా ప్లాన్ చేయడం జరిగింది. ఎందుకంటే అది ఆంధ్రప్రదేశ్ యొక్క హక్కు, సముద్రములోనికి వృథాగా పోతున్న అదనపు నీటిని వాడుకోవడానికి ఆ సాకుతో, తెలుగుగంగ ఇచ్చినా, లేకపోతే శ్రీశైలము లెఫ్టు బ్రాంచి ఇచ్చినా, లేకపోతే జూరాల ప్రారంభించినా, లేకపోతే భీమా మొదలుపెట్టినా ఇమ్మ కూడా అందుకే అధ్యక్షా. అదే కాకుండా గాలేరు-నగరి, హంద్రీ-నీవా, ఇవన్నీ కూడా మొదలు పెట్టడం జరిగింది. ఎందుకంటే మనం ఈనాడు అధికారంలో ఉన్నాము. పేద ప్రజానీకం ఈనాడు గ్రుక్కెడు నీరు

కూడా త్రాగడానికి వారికి ఆస్కారం లేకుండా ఉంది. వ్యవసాయం సంగతి అలా అట్టే పెట్టండి. మరి ఇవన్నీ ఆలోచించినట్లయితే "అన్నీ ఉన్నాయి అల్లుడి నోట్లో శని" ఉంది అన్నట్టుగా మనకు నీళ్ళు ఉన్నాయి. కానీ ఉపయోగించుకోడానికి అధికారం కూడా ఇచ్చారు. మనం ఎందుకు ఉపయోగించుకోవడం లేదు? మనం ప్రజలకు ఏమి వాగ్దానం ఇవ్వగలం? ప్రజలకు మనం ఏమి చెప్పగలము? పేద రైతులను గానీ, పేద వాళ్ళను గానీ నీళ్లు లేకుండా మాడ్చి చంపుదామా? లేకపోతే ఇదిగో మీరు మాకు అధికారం ఇచ్చారు. మమ్మల్ని ప్రజానాయకులుగా ఎన్నుకున్నారు, మేము 2000 సంవత్సరం లోపల మేము ఈ ప్రాజెక్టుల నుంచి నీరు ఇస్తాము అని చెప్పి ప్రజలకు అస్యూరెన్సు ఇవ్వండి. ఇది పార్టీ పాలసీ కాదు. దీన్ని కేవలం తెలుగుదేశం పార్టీ పరముగా నేను అడగడంలేదు అధ్యక్షా. ప్రజల తరపున నేను అడుగుతున్నాను.

ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున ఆ క్లియరెన్సు తేవలసిన బాధ్యత ప్రభుత్వానిది. ముఖ్యంగా మేము ఉన్నప్పుడే చేశాము. మాకు రైటు ఉంది మేము తీసున్నాము, ఉయ్ ఆర్ గోయింగ్ ఎహెడ్ అని కూడా మేము చెప్పాము. అప్పుడే అన్నారు. ఎందుకు మీకు సమావేశాలు? సమావేశాలతో తేలేది కాదండి. మీ హక్కును ఉపయోగించండి, భారత ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయండి అన్నారు. ప్రభాకరరావుగారూ దయచేసి మీరు అర్థము చేసుకోండి. మిమ్ములను మేము ఏమీ ఈ వేళ డిమాండ్ చేయడం లేదు. ఇది ముఖ్యమైన సమస్య అని మాత్రము నేను చెబుతున్నాను. కాబట్టి ఇది ప్రజలకు మనం అస్యూరెన్సు ఇవ్వవలసిన అవసరం ఉంది. లేకపోతే మన రాష్ట్రాన్ని మనమే నాశనము చేసుకున్నట్లు ఉంటుంది. ఇట్ ఈజ్ హై టైమ్. ప్రక్కన కర్ణాటక, అప్పర్ కృష్ణా, వారు అడ్డు కట్టలు వేసి కట్టుకుంటున్నారు. ఇది మా ప్రభుత్వ హయాములో మేము తీసుకువచ్చాము. అది రికార్డులో ఉంది. అదే విధంగా మేము హామీ ఇచ్చాము. తెలుగుగంగకి ఎప్పుడో లాస్టియరే నీళ్లు ఇస్తాము అన్నాము. శ్రీశైలము లెఫ్టు బ్యాంకు కెనాల్‌కి మేము నీళ్లు ఇస్తాము అని హామీ ఇచ్చాము. ప్రజలకు హామీ ఇవ్వాలని కోరుతున్నాము. ఈ ప్రాజెక్టుల విషయము మీరు అడ్డు తీర్చి దానిని ప్రజలకు అంకితం చేయండి. అదే మేము డిమాండ్ చేస్తున్నాము.

అధ్యక్షా, నేను చెబుతాను. ఎర్రంనాయుడుగారూ, ఇది మన హయాములో జరిగింది, మీరు తెలుగుదేశంలో ఉన్నప్పుడు అది మీకు తెలుసు. మేము ఏమి చేశామో తెలుసు. ప్రభాకరరావు గారూ.. దయచేసి వినండి. జరిగింది నేను చెబుతున్నాను. ఇది ఎన్నిసార్లు నేను హౌసులో చెప్పాను అధ్యక్షా. ఒరిస్సా ముఖ్యమంత్రి పట్నాయక్ గారితో నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మాట్లాడాను. 106 ఎకరాల ముంపుకి ఆయన ఒప్పుకున్నారు. మీరు ఇద్దరు ఒప్పుకుంటే మేము పర్మిషన్ ఇస్తాము అని ఆనాడు రాజీవ్ గాంధీగారు ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు చెప్పడం జరిగింది. అప్పుడు మేము ఇద్దరము కూడా పట్నాయక్ గారు నేను కలిసి ఆనాడు రాజీవ్‌గాంధీగారి దగ్గరికి వెళ్ళాము. 'మేము ఒప్పుకున్నాము' అని చెప్పాము. 'డన్' అని చెప్పాడు ఆయన. ఆయనంతట

ఆయన చెప్పాడు. మరి ఈ 'డన్' అన్నది ఇంతవరకు ఎందుకు రాలేదో నాకు తెలియడం లేదు. దీంట్లో ప్రాబ్లెమ్ లేదు. ప్రభుత్వం మాత్రం అది వెంటనే ఇవ్వమని భారత ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయాలి. మేము ఒప్పుకున్నాము. ప్రభాకరరావుగారికి మీ ద్వారా చెబుతున్నాను దీంట్లో అసలు సమస్యే లేదు. ఇప్పుడు వారికి సూచనలు ఇవ్వమన్నారు. నేను సొల్యూషన్ ఇస్తున్నాను. 'మేము రోడ్డు వేసి పెట్టామయ్యా.. రోడ్డు మీద నడవండి' అంటున్నాము. 106 ఎకరాలు ముంపుకి ఒప్పుకున్నాము. అది రికార్డులో ఉంది. లేట్ ప్రైమినిస్టరు రాజీవ్‌గాంధీ గారు కూడా అది 'డన్' అని చెప్పారు.

అధ్యక్షా, అందరికీ కూడా ప్రాజెక్టులు కావాలనే ఉంది. కానీ ఇందుకు ఒక సూచన. ఈ సభలో ఒక తీర్మానం పెట్టమనండి. మేము బలపరుస్తాము. ప్రధానమంత్రిగారికి పంపుదాము. అయ్యా, ఇంతవరకూ క్లియరెన్స్ రాలేదు. ప్రాజెక్టులు కావాలి. 2000 ఎ.డి దగ్గరకు వస్తోంది. తరువాత దేశమంతా నాశనం అవుతుందని ఏకగ్రీవంగా తీర్మానం ప్రవేశపెడతాము. క్లియరెన్స్ ఇవ్వమని అడుగుదాము. దీనిపై ఆలోచించమనండి. ప్రభుత్వాన్ని ఒక తీర్మానం పెట్టమనండి, ఇది తీవ్రమైన సమస్య. కనుక అట్లాగే చెయ్యడానికి వీలుంటుంది. పెండింగ్ ప్రాజెక్టులన్నిటికీ వెంటనే క్లియరెన్స్ ఇవ్వమని అడుగుదాము.

**అందరికీ కూడా ప్రాజెక్టులు కావాలనే ఉంది. కానీ ఇందుకు ఒక సూచన. ఈ సభలో ఒక తీర్మానం పెట్టమనండి. మేము బలపరుస్తాము. ప్రధానమంత్రిగారికి పంపుదాము. అయ్యా, ఇంతవరకూ క్లియరెన్స్ రాలేదు. ప్రాజెక్టులు కావాలి. 2000 ఎ.డి దగ్గరకు వస్తోంది. తరువాత దేశమంతా నాశనం అవుతుందని ఏకగ్రీవంగా తీర్మానం ప్రవేశపెడతాము.**

ప్రధాన మంత్రిగారికి అప్పీల్ చేయండి. తప్పా? 2000 ఎ.డి. దగ్గరకు వస్తోంది. తీర్మానం పెట్టమనండి. గౌరవం దక్కుతుంది. తెలుగు జాతి గౌరవం కోసం చేద్దాము. తీర్మానం పెట్టమనండి. ఆనాడు తెలుగు ప్రజల యొక్క అభివృద్ధికి గాను మేము పోటీకి పెట్టలేదు. కనీసం తీర్మానం ఇప్పుడు పెట్టలేరా? From the ruling benches the Hon'ble Minister is dictating terms on this problems of water supply we are waling out. తెలుగు ప్రధాని ఉన్నారు. తెలుగు వారిని గౌరవించాలి. ఇది అందరికీ సంబంధించిన సమస్య. దీని మీద తీర్మానం పెట్టాలని అడిగాము. అందరూ భాగస్తులే. ప్రజా సమస్యల విషయంలో ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. పార్టీ పద్ధతులు ఆచరిస్తున్నారు. ఇందుకు నిరసనగా మా పార్టీ వాకౌట్ చేస్తుంది.

*(తెలుగుదేశం పార్టీకి చెందిన గౌరవసభ్యులు వాకౌట్ చేశారు)*

◆◆

ఫిబ్రవరి 17, 1993

## వివాదాస్పదమైన ఫైల్స్ అన్నీ స్పీకర్ ఛాంబర్‌లో ఉంచాలి

*(ప్రభుత్వం కొత్తగా 12 డిస్టిలరీలకు, 12 బ్రూవరీలకు మంజూరుచేసిన అనుమతిని నిలుపుదల చేస్తూ చేసిన ప్రకటనపై వివరణ కోరుతూ...)*

**శ్రీ ఎన్.టి. రామారావు:** నాకు ఉన్నటువంటి అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి ఈ ప్రశ్నోత్తరాల తరువాత అవకాశం ఇచ్చినందుకు అభినందనలు తెలియజేస్తున్నాను. మరి మన కార్యక్రమాలు ప్రజలకోసం, ప్రజా సక్షేమం కోసం, ప్రజలను ఉద్దేశించినవన్న విషయం అందరికీ తెలిసిందే. మరి ఈనాడు మన కార్యక్రమాలకు ఎంతమంది పెద్దలు, స్త్రీలు, ఎలా? ఏమి జరుగుతుందని చూస్తున్నారో, వింటున్నారో మనకు తెలియనిది కాదు. ఈ సభా కార్యక్రమాల గూర్చి ఏమనుకుంటున్నారో మనం గమనించాలి. మనం ప్రజలకోసం ప్రజా ప్రతినిధులుగా ప్రజలనుంచి ఎన్నుకోబడ్డాం. కనుక ప్రజలేమనుకొంటున్నారన్నది తెలుసుకోవడం మన కర్తవ్యం. ధర్మం. మరి ఈ రాజకీయ పరిణామాలను చూసి ప్రాజ్ఞులు, విజ్ఞులు ఎందరో విస్తుపోతున్నారు. ప్రజలందరూ పరిహసిస్తున్నారు. పత్రికలలో ఘోషిస్తున్నారు.

కమిటీ నియామకం. సభాపతి వద్ద రికార్డులు పరిశీలించడం, న్యాయ విచారణకు ఆదేశించడం అనే మూడు ప్రతిపాదనలు సభ ముందుకు వచ్చినపుడు న్యాయ విచారణకే తాను సుముఖంగా ఉన్నానని మంత్రిగారు ప్రకటించారు. ఇక ఆ ప్రయత్నాలు మొదలవుతాయి. ఇలా ఫైళ్లమీద సంతకాలు చేయడం నిబంధనాబద్ధం అవునా, కాదా అనేది ఇక్కడ ప్రశ్న కాకూడదు. మద్యపాన వ్యతిరేక ఉద్యమం సాగుతున్నపుడు ఈ విధంగా ఒక ప్రభుత్వం, ఒక ప్రజాస్వామ్య ప్రభుత్వం, ప్రజా ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వం ఎందుకు తొందరపడవలసి వచ్చిందనేది ప్రతివాడికి వచ్చే సందేహంగా నేను సవినయంగా మనవిచేస్తున్నాను. 17వ తేదీ 'ఈనాడు' (దినపత్రిక) లో ఎంత నయవంచకత్వం అన్నారు. ఇంతకు మించి తెలుగు నిఘంటువులో వేరేమాట ఉంటుందని నేను అనుకోవడం లేదు. మద్యపాన నిషేధంపై కొన్ని మాసాలుగా మాయమాటలతో

రాష్ట్రప్రజానీకాన్ని ఒకవైపు మభ్యపెడుతూ మరొకవైపు గుట్టు చప్పుడు కాకుండా డజను సారా బట్టీలకు, ఇంకో డజను బ్రూవరీలకు ఆబ్కారీ మంత్రి కనుమూరి బాపిరాజు గారు టోకున అంగీకరించడానికి ఎవరు ఆ నిర్ణయం చేశారు? రాష్ట్రప్రభుత్వ అధినేత కోట్ల విజయభాస్కరరెడ్డి గారు ఇంతటి ప్రధానమైన విషయం ఆలస్యంగా తెలుసుకున్నారట. తెలిసి బాధపడ్డారట. 'పెద్దమనిషి బొంకు, పెద్ద చెరువు కంపు' అనే నానుడి వారికి వర్తించదనే అనుకున్నాం. తను బాధపడ్డానూ అన్నారంటే జరగకూడని తప్పు జరిగిందన్న మాట. దానికి పరిహారం ఏమిటి? ఏమి ఇవ్వాలి? తప్పు తెలుసుకున్నారు. బాధ పడుతున్నామన్నారు. అటువంటప్పుడు ఒక మంత్రిగారు చేసిన తప్పును ఏవిధంగా పరిష్కరిస్తారు? అసలు మంత్రిగారే దయచేసి నైతిక విలువలను గుర్తించి పదవి నుంచి తప్పుకోవాలి. ఒక తప్పు చేసినందుకు ముఖ్యమంత్రిగారు కూడా బాధపడుతున్నారు. ఎందుకు బాధపడ్డారు? తప్పు జరిగింది కాబట్టి.

ముఖ్యమంత్రిగారు నాకు బాధ కలిగిందన్నారు. ఎందుకు బాధ కలిగింది? ఏదైనా తప్పుచేస్తేనే కలుగుతుంది. ఈనాడు పర్యవసానంగా ఓ నిర్ణయం తీసుకుంటున్నారు తమరు? మా వాళ్ళను ఎందుకు బహిష్కరిస్తారు? జరిగిన వివరాలు వివరంగా చెప్పడం నా ధర్మం. ఈనాడు వారు తప్పు తెలుసుకున్న తర్వాత తప్పు జరిగిందని ఒప్పుకున్న తర్వాత మళ్లీ ఈ తప్పు ఎందుకు కంటిన్యూ చేస్తున్నారు అని ఈ పత్రిక అడిగింది. నేనూ అడుగుతున్నాను. 'ఆంధ్రజ్యోతి' కూడా అడిగింది. ఎవరూ సమర్థించలేని పని అని. ప్రభుత్వం ఎందుకు సమర్థిస్తోంది? ఏ ప్రజల తరఫున సమర్థించిందని సవినయంగా అడుగుతున్నాను. మంత్రిగారిని సరిచేయడం ధర్మం కాదా? నైతిక విధానం ధర్మం కాదా? పవిత్రమైన పరిపాలన ధర్మం కాదా? పేదరికం నిర్మూలించడం ధర్మం కాదా? అక్రమమైన దానికి ఈ ప్రభుత్వం ఎందుకు పాల్పడింది? తమరేదో నిర్ణయం తీసుకున్నారు.

**రాష్ట్రప్రభుత్వం అధినేత కోట్ల విజయభాస్కరరెడ్డి గారు ఇంతటి ప్రధానమైన విషయం ఆలస్యంగా తెలుసుకున్నారట. తెలిసి బాధపడ్డారట తను బాధపడ్డానూ అన్నారంటే జరగకూడు తప్పు జరిగిందన్న మాట దానికి పరిహారం ఏమిటి? ఏమి ఇవ్వాలి? తప్పు తెలుసుకున్నారు. బాధ పడుతున్నామన్నారు. అటువంటప్పుడు ఒక మంత్రిగారు చేసిన తప్పును ఏవిధంగా పరిష్కరిస్తారు?**

ఈ విషయంలో వారిని ఎందుకు బహిష్కరించారు? డిమాండ్లు పెట్టాం. ఈ ఆధునిక యుగంలో ప్రజాస్వామ్యం పటిష్టంగా పనిచేయాలంటే బలమైన ప్రతిపక్షం ఉండాలి కధా అధ్యక్షా. ఈనాడు లోపల జరిగిన కుంభకోణాన్ని బైటపెట్టాం. 4 డిమాండ్లు కూడా చేశాం. మీరు వాటిని సరిగ్గా గమనించాలని కూడా మనవిచేస్తున్నాను. మొదటి డిమాండు. ఏదైతే ముఖ్యమంత్రి గారికి బాధ కలిగిందో, ఏదైతే వారికి తెలిసో తెలియకో అవగాహన ఉండో ఉండకో ఈ లెటర్ ఆఫ్ ఇండెంట్‌ను ఇచ్చారు. ఆ తప్పు తెలుసుకున్నారు. కాబట్టి, వాటిని వెంటనే రద్దు చేయాలి. రెండవ

డిమాండ్, పెద్ద పెద్దవాళ్ల కందరికీ ఇందులో సంబంధం ఉందని వినికిడి. ఎందుకు మీరు దీనికి పట్టుబడుతున్నారు? న్యాయం ఉంటే, ధర్మం వుంటే, సత్యం వుంటే పట్టుపట్టకండి. మూడవది, మంత్రిగారిని బర్తరఫ్ చేయాలి. ఆయన మొండిపట్టు పట్టి కూర్చున్నాడు. ప్రజాస్వామ్యాన్ని గుర్తించడం లేదు. నీతి లేదు. నియమం లేదు. సత్యం లేదు. ఆయనకు మంత్రిగా ఉండటానికి జరగలేదు.

వివాదాస్పదమైన ఫైల్స్ అన్నీ తమ ఛాంబర్‌లో ఉంచాలని కోరుతున్నాను. నిజంగా ఉన్నప్పుడు భయం ఎందుకు అధ్యక్షా. ఈనాడు జ్యుడీషియల్ ఎంక్వయిరీ అవసరం లేదు. నేను ఫైల్స్ మీద సంతకం పెట్టాను. ఇండిపెండెంట్‌గానే ఇచ్చాను అని చెబుతున్నారు. ముఖ్యమంత్రిగారు సంతకం పెట్టలేదు. ఇంకా జుడీషియల్ ఎంక్వయిరీ ఏమిటి? దీనికి ప్రాచుర్యం ఏమిటి? ఏమి చర్యలు తీసుకుంటున్నారు. మేము ఉన్నది చెప్పాము ఎందుకు మావాళ్లను బహిష్కరించారని నేను మిమ్ములను అడగడం లేదు. ఏమి చేశారు అనడం లేదు. దానికి నేను బాధపడడం లేదు. ప్రజాస్వామ్యం కోసం, ప్రజలకోసం ప్రాణాలు పోయినా సరే తలవంచము, మేము అభ్యర్థించము, ప్రార్థించము అని మనవి చేస్తున్నాను. ఈనాడు 74 మంది మాపక్షం వారు ఉన్నారు.

వెళ్ళను... నేను వెళ్లను, చెప్పి మరీ వెళతాను. అధ్యక్షా, నేను ఏకపక్షంగా అధిక మెజారిటీ కలిగిన ప్రతిపక్షంగా మేము వచ్చాము నేను ఒకరిగానే ప్రతిపక్షం కాలేదు. మా వాళ్లందరూ ఉంటేనే ప్రతిపక్షం అవుతున్నారు.

బలం ఉంటేనే ప్రతిపక్షం అయ్యాను. కాబట్టి ఈనాడు దారుణమైన అవమానం జరిగింది. ప్రజాస్వామ్యానికి అవమానం జరిగింది. కాబట్టి ఈనాడు తీరని అవమానం జరిగింది. ప్రజలకు అవమానం జరిగింది. నేను మీచేత బహిష్కరింపబడను. మీరు నన్ను వెళ్లగొట్టక్కరలేదు. ఈ సభ అర్హతను మీరే నిరూపించాలి అని నేను మనవిచేస్తున్నాను. అమాయకులను, నీతికి, నిజాయితీకి నిలబడే వారిని ఈ విధంగా మీరు బహిష్కరించారు కాబట్టి వారు వచ్చేటంత వరకు కూడా నేను ఈ సభ నుంచి వెళ్లిపోతున్నాను.

◆◆

# సంతాప తీర్మానాలు

మార్చి 12, 1985

# ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ హత్యపై సంతాపం

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి.రామారావు:** అధ్యక్షా, ఇది చాలా దారుణమైనటువంటి సంఘటన. ఈ రోజు నాగరిక ప్రపంచము, మన భారతీయ సంస్కృతి ముఖ్యంగా తలవంచుకోవలసిన సంఘటన అని మీకు సవినయముగా నాభావాన్ని వ్యక్తపరుస్తున్నాను. సిద్ధాంతాలు వేరు కావచ్చు. పార్టీల భేదం కావచ్చు, భావాలు కలియకపోవచ్చు. కానీ హింసా విధానం దేనికి పరిష్కారం కాదు. అది అందరము గర్హించవలసిన విషయమని సవినయముగా మనవిచేస్తున్నాను. ముఖ్యంగా మన ప్రియతమ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీగారు ఎన్నో విధాల మన దేశ ప్రతిష్టకు, రాజకీయ ప్రగతికి ఎంతో దోహదం చేసినటువంటి మహనీయమైన నాయకురాలు.

అటువంటి వారిని ఈ విధమైనటువంటి  దుర్ఘటనతో అంతం చేయడం, ఈ విధమైనటువంటి హింసా విధానముతో హత్య చేయడం అనేది ఎంతో అనాగరికమైనటువంటిదని నేను భావిస్తున్నాను. ముఖ్యంగా ఈ ప్రపంచములోనే మన భారతదేశానికి ఎంతో ఉన్నతమైనటువంటి గౌరవనీయమైనటువంటి స్థానాన్ని కలిగించినటువంటి మహత్తరమైనటువంటి వ్యక్తి ఆమె. అలీన సిద్ధాంతానికి ఒక ఆకృతిని ఇచ్చినటువంటి రాజకీయవేత్త. ఆమె భారతీయ సంస్కృతీ వికాసానికి ఎంతో దోహదం చేశారని చెప్పక తప్పదు. అలీన సిద్ధాంతం మన సంస్కృతికి, చైతన్యవంతమైన మన ఉద్దేశాలకు ప్రతిబింబం అని కూడా మనవిచేస్తున్నాను. అది మన పూజ్య బాపూజీ సిద్ధాంతం కూడా. కేవలం ఏ దేశముతోనో ఏ ప్రభుత్వముతోనో పొత్తు పెట్టుకోకుండా అహింస ద్వారా సత్యాగ్రహ ఉద్యమం ద్వారా స్వాతంత్ర్యం సాధించాము.

ఏ ఒక్క దేశముతోనో పొత్తు పెట్టుకోకూడదు, ఏ హింసా విధానాన్ని మనము ఆవలంభించకూడదని వారు ఆనాడు ఎంతో దీక్షతో, మహత్తరమైనటువంటి త్యాగబుద్ధితో మన సంస్కృతి వికాసాలకు ప్రతిబింబాలుగా ఏర్పాటు చేసిన సిద్ధాంతానికి ఒక రూపకల్పన చేసిన వ్యక్తి

పండిట్ నెహ్రూగారు. దానిని శ్రీమతి ఇందిరాగాంధీగారు బలపరుస్తూ ఎంతో ఉదాత్తమైనటువంటి భావముతో అంతర్జాతీయ పరంగా అలీన సిద్ధాంతాన్ని ప్రచారం చేసి సత్ఫలితాలను సాధించిన మహానాయకురాలు. ఏదైనప్పటికీ ఇటువంటి దురదృష్టకర సంఘటన జరగడం, మన వారే ఇలాంటి ఆకృత్యానికి పాల్పడడం అందరికీ బాధాకరమైనటువంటి విషయము. ఇది జరిగిన వెంటనే దిగ్భ్రాంతి చెందాను. వెంటనే సోదరుడు రాజీవ్ గాంధీగారికి, ఇది జాతికి తలవంపులు, అవమానకరం అని తెలుపుతూ నా బాధను, సానుభూతిని వ్యక్తం చేయడం జరిగింది. ఇది ఎన్నిసార్లు చెప్పినప్పటికీ బాధగానే ఉండిపోతుంది.

మన గుండెల్లో ఆరని ఆవేదన, తీరు బాధగా ఎప్పటికప్పుడు ఉంటుంది. ఏదైనా కాంగ్రెస్ వ్యవస్థకు ప్రతిపక్షముగా ఉంటున్న మేము, తెలుగుదేశము పార్టీవారము. ఈ దేశ సంస్కృతికి, వికాసానికి, నాగరికతకు అందరూ కూడా వారసులు అని మరచిపోలేము. ఎప్పుడూ కూడా ఇటువంటి సంఘటనను, ఇటువంటి హింసా విధానాన్ని తెలుగుదేశము ఆమోదించదు, ఎప్పుడూ కూడా అనుమతించదు, అంగీకరించదు అని ఈ సభాముఖంగా వ్యక్తం చేస్తున్నాను. ఆనాడు జరిగిన దుస్సంఘటన చరిత్రలో మాయని మచ్చగా నిలిచిపోతుందని చెబుతూ ఆ దుర్ఘటన పట్ల నా బాధను, సంతాపాన్ని వ్యక్తపరుస్తూ, నా ఈ బాధను ఈ సభాముఖంగా తెలియపరుస్తూ గౌరవనీయ సభ్యులందరూ ఈ తీర్మానాన్ని ఏకోన్ముఖంగా, ఏకాభిప్రాయముతో ఆమోదించవలసిందిగా ప్రతి ఒక్కరికీ విజ్ఞప్తి చేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

◆◆

ఆగస్టు 12, 1985

# పుచ్చలపల్లి సుందరయ్య గారి మృతికి సంతాపం

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి.రామారావు:** అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ విధానసభ మాజీ సభ్యులు శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య మృతిపట్ల ఈ సభ తన తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ శోకార్తులు అయిన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది.

అధ్యక్షా, అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్యగారు ఏ విధంగా వారి జీవితం అంతా స్వచ్ఛమైన రాజకీయాలకు అంకితము చేశారో ప్రజలందరికీ తెలుసు. వారు జాతీయ పరిధిలోను, అంతర్జాతీయ పరిధిలోను కూడా సమున్నతమైన మహనీయులు. నీతికి నిజాయితీకి నిలబడుతూ సమసమాజాన్ని స్థాపించడానికి వారు ఎంతగా కృషి చేశారో మనందరికీ తెలుసు. వారు రెడ్డి కులములో పుట్టినప్పటికీ తమ పేరులోని రెడ్డిని తీసివేసి కేవలము కామ్రేడ్ సుందరయ్యగారిగానే కులాలకు అతీతంగా వ్యవహరించారు. వారు రాజకీయాలలో నీతికి విలువనిచ్చినటువంటి త్యాగమూర్తి. చిరస్మరణీయులు. ఏ విధమైనటువంటి సౌకర్యాలను కోరకుండా కొన్ని కొన్ని సమయాలలో సైకిలు మీదనే శాసనసభకు వెళ్లిన సంగతి రాజకీయ వాదులకు వారి ప్రవర్తన ఎప్పటికి ఆదర్శంగా ఉంటుందని మనవి చేస్తున్నాను.

జీవితములో అన్ని ఆశలు వదులుకొని కేవలము తమ జీవితాన్ని దేశానికి అంకితం చేసిన మహనీయుడు. స్వంతానికి ఏమాత్రము కూడా ఆస్తిపాస్తులు లేకుండానే నిరుపేదగా మరణించినారు. సంపన్న వంశంలో పుట్టినప్పటికి తన ఆస్తినంతను తన పార్టీకి త్యాగము చేసిన వ్యక్తి ఆయన. నేను వారికి ఈ సభాముఖంగా నా శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను. వారి స్మృతికి చిహ్నంగా ఒక లైబ్రరీని ఏర్పాటు చేయుటకు సి.పి.ఎం. పార్టీకి ప్రభుత్వ పరంగా 2,500 గజాల స్థలాన్ని ఉచితంగా ఇవ్వడం జరిగిందని నేను మీకు సవినయంగా మనవిచేస్తున్నాను. వారు ఒక పార్టీకి సంబంధించినవారు కాదు వారు మొత్తం రాష్ట్రానికి సంబంధించిన వారు, వారి త్యాగం

విషయం ఆలోచిస్తే అది ఎన్నటికి మరువలేనిది. పెళ్ళికి పూర్వమే వారు ఫ్యామిలీ ప్లానింగు ఆపరేషన్ చేయించుకొని తనకు పిల్లలు లేకుండా చేసుకుని తన జీవితాన్ని పూర్తిగా సమాజానికే అంకితం చేసిన మహనీయ త్యాగమూర్తి ఆయన. ఈ రోజున వారు మనమధ్యన లేకపోవడం వారి అమూల్యమైన సలహాలతో మనకు ఆలోచన ఇచ్చే అవకాశం మనకు లేకపోవడం చాలా దురదృష్టకరం. వారి జీవితము మనందరికీ ఆదర్శమని మనవిచేస్తూ ఈ సభ ద్వారా నా ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

◆◆

ఆగస్టు 28, 1985

# శ్రీ ఆరుట్ల రామచంద్రారెడ్డి మృతికి సంతాపం

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి.రామారావు:** అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ విధానసభ మాజీ సభ్యుడు శ్రీ ఆరుట్ల రామచంద్రారెడ్డి గారి మరణం పట్ల ఈ ప్రగాఢ సభ సంతాపాన్ని తెలుపుతూ, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలుపుతూ తీర్మానమును ప్రతిపాదిస్తున్నాను.

అధ్యక్షా, శ్రీ ఆరుట్ల రామచంద్రారెడ్డి గారి సంగతి తెలియని వారు అంటూ లేరు, మన ఆంధ్రప్రదేశ్‌లో వారు తమ జీవితం అంతా కూడా ప్రజా సంక్షేమానికి, స్వాతంత్ర్య పోరాటానికి అంకితం చేశారు. అంతటి ధన్యజీవి, మహానుభావులు, కామ్రేడ్ ఆరుట్ల రామచంద్రారెడ్డి. ఈ విషయం అందరికీ విదితమే. వారిని ఆత్మీయతా భావంతో అందరూ కామ్రేడ్ ఏ.ఆర్. అనేవారు వారు ఏ విధంగా ప్రజా స్వాతంత్ర్య సమరానికి సేవ చేశారో, ఎంతవరకు తెలంగాణ విమోచనం గురించి పాటుపడ్డారో ముఖ్యంగా అందరూ గమనించాలి. 1947 ఆగస్టు 15వ తేదీన మనకు స్వాతంత్ర్యం సిద్ధించింది అంటే పూర్తిగా మన దేశానంతటికీ సంభవించిందా, లేక కొంత ప్రదేశానికే సంభవించినదా అని ఆలోచిస్తే. ఆనాడు తెలంగాణలో నిజాం పరిపాలనలో ఉన్న నిరంకుశ, నియంతృత్వ పరిపాలనా విధానాన్ని చూస్తే, ఆనాడు స్వాతంత్ర్యం సామాన్య ప్రజలకు రాలేదు. ఈ యొక్క నిజాం పరిపాలనలో ఇంకా బలహీన వర్గాల వారు ఆ విధమైన దోపిడీ విధానానికి గురైన వారందరికీ స్వాతంత్ర్యం కావాలనే నినాదాలతో ఆయన ఉద్యమం నడిపారు.

ముఖ్యంగా శ్రీ రామచంద్రారెడ్డిగారు వారి యొక్క శక్తి యుక్తులను సాయుధపోరాటంతో, సామాన్య ప్రజానీకం యొక్క విముక్తిని గురించి, సాయుధుడుగా, వీరుడుగా ఆయన ఆ పోరాటానికి అండదండలుగా నిలచి పోరాడి, అది సఫలీకృతం కావడానికి, సువిశాలమైన మన రాష్ట్ర స్థాపనకు ఎంతో సేవ చేశారు. వారికి నేను నివాళులు అర్పిస్తున్నాను. వారు ఈనాడు ఈ విధంగా కన్నుమూయడం దురదృష్టకరం, తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను గురించి

సమాలోచిస్తూ, పేద ప్రజానీకాన్ని ఉద్ధరించాలని, స్వాతంత్ర్యం మనకు లభింపజేస్తున్న ఫలాలను ప్రతి ఒక్కరూ పంచుకునే అవకాశం కలిగించాలనీ ప్రయత్నం చేస్తున్న ఈ తరుణంలో వారు మన విధానాలను గురించి తృప్తిపడే విధానాన్ని కోల్పోయామే అనే నా విచారాన్ని పరిపూర్ణంగా వ్యక్తం చేస్తున్నాను. వారి జీవితం ఆదర్శం. వారిమార్గం అనుసరణీయం. జైలులో నిర్బందంగా ఉండడమే కష్టం అటువంటిది చేతులకు కాళ్ళకు సంకెళ్ళు వేసి నిర్బంధంలో పెట్టినప్పుడు , వారు పూర్తిగా నిజమైన త్యాగబుద్ధితో, మన స్వాతంత్ర్య సముపార్జనకు ఏ విధంగా ఆత్మార్పణ చేశారో మనం అంతా గమనించదగిన విషయం.

అందరూ సువిశాల భావంతో, ఆదర్శప్రాయమైన ఉద్వేగంతో ఆదర్శప్రాయంగా తీసుకోవాలని నేను నా అభిప్రాయాన్ని మనవి చేస్తున్నాను. వారి సతీమణి శ్రీమతి కమలమ్మ ఆయనకు చేదోడు వాదోడుగా ఉన్నారు. తన భర్త ఎంతో ఆవేశంతో ముందుకు నడవడానికి ఆవేశం ఇచ్చిన ఆడపడుచు ఆ మహానుభావురాలు. ఇంత దురదృష్టకరమైన నష్టం వారికి సంభవించినందుకు వారికి, వారి కుమారునికి ఈ ప్రభుత్వం తరఫున నా హృదయపూర్వక నా సంతాపాన్ని, సానుభూతిని వ్యక్తం చేస్తున్నాను. శ్రీ ఆరుట్ల రామచంద్రారెడ్డి గారికి నా హృదయపూర్వకమైనటువంటి భక్తి శ్రద్ధలతో అంజలి సమర్పిస్తున్నాను.

◆◆

జనవరి 5, 1987

# మాజీ ముఖ్యమంత్రి టి అంజయ్య మృతికి సంతాపం

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి.రామారావు:** అధ్యక్షా, ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టడానికి నాకు ఎంతో బాధగా ఉంది. ఒక ఆదర్శమైన కార్మిక నాయకుడిని, ప్రజా మిత్రుడిని, ప్రతినిధిని ముఖ్యంగా మన ఆంధ్ర రాష్ట్రానికి వన్నె తెచ్చిన మహానుభావుడిని కోల్పోయామనే నా పరిపూర్ణమైన బాధను, సంతాపాన్ని ఈ సందర్భంగా వ్యక్తం చేస్తున్నాను. ఆయన యదార్థానికి తన భౌతిక దేహాన్ని చాలించవలసిన వయస్సుకు రాలేదు. ఇంకా ఎన్నో సంవత్సరాలు ఉండి ఒక ఆదర్శవంతమైన రాజకీయ వాతావరణాన్ని, రాష్ట్రాభ్యుదయానికి కల్గించుటలో దోహదం చేస్తారనుకొంటే వారి మరణం ఒక పిడుగులాగ సంభవించింది. వారి భౌతిక కాయానికి దహన సంస్కారం జరుగుతున్నప్పుడు నేను అక్కడకు వెళ్లాను.

ఆనాడు ఎంతో మంది ప్రజానీకము కుల, మత, వర్గ భేదం లేకుండా పెద్దవారు, చిన్నవారు, కలవారు, లేనివారు అనే భేదం లేకుండా తమ ఆత్మీయునీ, మిత్రునీ, బంధువును తమ వారిని కోల్పోయినట్లుగా బాధాక్రాంతులై ఉన్నారంటే వారు ఏ విధంగా అఖిల ప్రజానీకము తమ ప్రియతను నాయకునికి నివాళులర్పించారనేది తెలుస్తుందని సవినయంగా మనవిచేస్తున్నాను. ఒక పెద్ద కుటుంబములో 1929లో జన్మించారు. టంగుటూరి అంజయ్యగా వారి పేరు ఉన్నప్పటికి పెద్దవారని భావించకుండా 6 అణాల కూలీగా ప్రప్రథమంగా ఆల్విన్ కంపెనీలో చేరి చేసిన కృషిని, శ్రమ జీవనాన్ని మరచిపోకుండా ఎంత పై అంతస్థులోకి వచ్చినా మరచిపోకుండా ఉన్నారంటే వారిలో ఎంత మంచితనం, మానవత్వం జీర్ణించివుందో గమనించవచ్చు. వారి మరణానికి నా హృదయతప్త నివాళులర్పిస్తున్నాను. కాంగ్రెస్ విషయం వచ్చినపుడు ఒక ఉత్తమ, నిస్వార్థ నాయకుణ్ని కోల్పోయారని చెప్పక తప్పదు. స్వాతంత్రోద్యమంలో వారికి ఉన్న సర్వస్వాన్ని ధారపోసి మన దేశానికి స్వాతంత్ర్యం కావాలి, నేను తొలుత భారతీయుడిని, తరువాతే ఆంధ్రప్రదేశ్ వాసిని అనే నినాదముతో ఆనాడు జైలుకు వెళ్ళారు.

ఏవిధమైన కష్టాలు పడినప్పటికి భారత మాత ముద్దుబిడ్డ ఋణాన్ని చెల్లించుకున్నారనేది తమకు తెలిసిన విషయమేయని సవినయంగా మనవిచేస్తున్నాను. 1957లో ప్రప్రథమంగా శాసనసభ్యుడిగా ఎన్నికైనారు. 1972లో పి.వి.నరసింహారావుగారి మంత్రివర్గములో కార్మికమంత్రిగా పని చేశారు. గత జీవితాన్ని మరచిపోకుండా కార్మికుల సంక్షేమానికి కృషి చేసే మహత్తరమైన అవకాశం అంజయ్యగారికి వచ్చింది. అహరహం కార్మిక సంక్షేమానికి కృషి చేసినది వారి జీవితం చూసినపుడు వ్యక్తమవుతుంది. వెంగళరావుగారి మంత్రివర్గములో కార్మికమంత్రిగా పనిచేశారు. 1974లో కేంద్ర కార్మిక మంత్రిగా ఉండి, తెలుగుజాతి ఔన్నత్యాన్ని, గౌరవాన్ని ఇనుమడింప చేసి జాతీయ దృక్పథంతో కార్మికలోకానికి సేవచేసి ఎంతో ఉదాత్తుడిగా వ్యవహరించారు. ఎన్నటికీ మరచిపోలేని పద్ధతిలో సేవ చేశారు.

1980లో వారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయినారు. వెనుకబడిన వర్గాలకు, కార్మిక శాఖకు ఒక క్రొత్త ఊపిరి వస్తుంది, మా మనిషి ముఖ్యమంత్రి అయినారు అని ఎంతో ఉత్సాహంతో అభినందించి వారి సేవను ఆశించడం జరిగిందని వ్యక్తము చేస్తున్నాను. వారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికి ఎంతో మహత్తరమైన, నిరాడంబర వ్యక్తిగా కృషి చేశారు. ఒకసారి మా అమ్మాయి పెళ్ళికి పిలవడానికి వారింటికి వెళ్ళాను. నేను అప్పుడు రాజకీయాలలో లేను. వారు కేవలం బనీను, లుంగీ వేసుకొని ఉన్నారు. రామారావుగారూ, మేడ మీదకు రండి అని సాదరంగా ఆహ్వానించి మాట్లాడిన విషయాన్ని నేను ఇప్పటికీ మరచిపోలేకపోతున్నాను. సామాన్య వ్యక్తిగా తమ జీవితం ఆఖరివరకు రాష్ట్ర శ్రేయస్సుకు తమ జీవితాన్ని అంకితం చేశారనే మహోత్తర విశేషాన్ని వారి విషయంలో ప్రస్తావించక తప్పదు. 1984లో తిరిగి రెండవసారి కేంద్రములో కార్మికశాఖామాత్యులుగా నియమితులయ్యారు. ముందు కేంద్ర మంత్రిగా నియమితులైనప్పుడు ఎంతో పట్టుదలతో నిస్వార్ధ కృషి చేయడంవల్ల మరల రెండవసారి మంత్రి పదవిని స్వీకరించడం జరిగిందున మన వారు గర్వపడ్డారు.

వారు అటువంటి మహనీయులని సవినయంగా మనవిచేస్తున్నాను. అంతకంటే ముఖ్యమైన విషయం. ఒక మంత్రిగానే కాకుండా ఎ.ఐ.సి.సి. ప్రధాన కార్యదర్శి పదవిని నిర్వహించి దాని విషయంలో మనమందరం గర్వించదగిన విషయంగా సవినయంగా మనవిచేస్తున్నాను. ఈర్ష్య, అసూయ, ద్వేషాలకు అతీతమైన వ్యక్తిగా, మంచి తనముతో మూర్తీభవించిన మహనీయులు వారు. వారు ఈనాడు మన మధ్య లేనందుకు నేను ఎంతో బాధ పడుతున్నాను. మన రాష్ట్రానికి మంచి జరిగినపుడు ప్రజలకు మంచి జరుగుతున్నపుడు తాను ఎంతో ఆనందిస్తున్నట్లు అనేక సార్లు చెప్పిన విషయం "రామారావుగారూ ముందుకు సాగిపోండి, మీ ఉద్యమానికి ఎంతో సంతోషిస్తున్నా"నని చెప్పినందుకు నేను నా ప్రత్యేకమైన అభినందన చెబుతున్నాను. కేవలం ప్రతిపక్ష ప్రజా ప్రతినిధిగా, కార్మిక నాయకుడిగా ఉండి నిస్వార్ధ మనస్సుతో అభినందించారు.

నేను మామూలు మానవున్ని, వయస్సులో నేను పెద్ద వాడిని కావచ్చు. నాకు రాజకీయ అనుభవము లేదు. ఎన్నటికీ మరచిపోలేని మహనీయమైన విషయంగా మనవిచేస్తున్నాను. ఎంతో మంచి జరగాలి, రాష్ట్రాభివృద్ధి జరగాలని నూతన సంవత్సరంలో అడుగుపెడుతున్న శుభ సందర్భంలో వారు మరణించినందుకు నా బాధను వ్యక్తం చేస్తూ నా ప్రభుత్వం తరపున, నా తరపున వారి కుటుంబానికి సానుభూతిని తెలియచేస్తున్నాను. వారి ఆత్మ శాంతించాలని నివాళు లర్పిస్తున్నాను. అంజయ్యగారి సంతాప తీర్మానంపైన నా భక్తి భావాన్ని ప్రదర్శించడానికి అవకాశం కల్గించినందుకు ధన్యవాదాలు తెల్పుతూ సెలవు తీసుకొంటున్నాను.

◆◆

జూలై 11, 1987

# మాజీ ప్రధాని శ్రీ చరణ్ సింగ్ మృతికి సంతాపం

**ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి.రామారావు:** అధ్యక్షా, భారతదేశ స్వాతంత్ర్య చరిత్ర ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు జరిగినటువంటి త్యాగాలు, ఆత్మత్యాగాలు లెక్కలేనివి. ఈ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని అమరజీవులైనటువంటి మహానుభావులలో శ్రీ చరణ్ సింగ్ గారు అత్యుత్తమమైన స్థానాన్ని అలంకరించుకోగలిగారని మనవిచేస్తున్నాను. నేను విస్పష్టంగా వారిపట్ల నాకు ఉన్న భక్తి భావాన్ని తెలియజేస్తూ ఎంతో హృదయపూర్వకమైన, బాధాతప్త హృదయంతో వారికి నివాళులు అర్పిస్తున్నాను. వారిపట్ల నాకు ఉన్నటువంటి గౌరవాన్ని తెలియజేస్తున్నాను.

పూజ్య బాపూజీ మనదేశ ప్రగతి పల్లెసీమలలో ఉంది. పల్లెసీమలు దేశానికి పట్టుగొమ్మలు, ఎక్కడైనా అభ్యుదయం జరగాలంటే పట్టణాలు, నగరాలున్నా ముఖ్యంగా పల్లెసీమలలో జరగాలి, దేశం స్వయం పోషకం కావాలి. పూర్తిగా మనకు కావలసిన అవసరాలను మనం ఉత్పత్తి చేసుకొని, తీర్చిదిద్దుకొని మన దేశాన్ని అభ్యుదయ పథంలో పురోగమింప చేయాలనేటటువంటి నినాదాలకు బద్ధుడై నిరాడంబర జీవితతత్వంతో, పూర్తిగా ప్రజా సేవకుడుగా, రైతు జనబాంధవుడుగా, పేదలపట్ల పెన్నిధిగా ఏ విధంగా వారు జీవితాన్ని సమాజానికి నివాళిగా సమర్పించారో అందరూ గుర్తించినటువంటి విషయంగా నాకు ఉన్నటువంటి భక్తి ప్రపత్తులను వ్యక్తం చేస్తున్నాను. ఉత్తరప్రదేశ్‌లో జన్మించి న్యాయవాదిగా అధిక ఆధాయం కలిగిన వృత్తిలో ఉండి కూడా సామాజికపరమైన సంక్షేమం, సామాజికపరమైన న్యాయం అందరికీ అందాలనేటటువంటి దీక్షతో న్యాయాన్ని పరిమితం చేయకుండా పూర్తిగా సమాజానికి దేశవ్యాప్తంగా విస్తరింపజేసినటువంటి మహానుభావుడు, ధన్యజీవుడు ఆయన. అందుకే ఆయన రైతు జన బాంధవుడనిపించుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లో కాని, హర్యానాలో కానీ ఈనాటికీ జాట్లు చరణ్ సింగ్‌ను దేవుడితో సమానంగా కొలుచుకొంటున్నారు. అంటే ఆయన వారి హృదయాలలో చెరగని ముద్ర వేసినటువంటి విధానమేనని, అది వారి అకుంఠితమైనటువంటి సేవా విధానమేనని

నేను ఇంకొకసారి స్మరణకు తెచ్చుకొంటున్నాను. ఆయన మహనీయుడు, నిస్వార్థపూరితుడు ఆయన. ఇన్ని సంవత్సరాలు రాజకీయాలలో ఉండి ఒక్క పైసా కూడా ముట్టని మహానుభావులు ఎవరైనా ఈ దేశంలో ఉంటే ఆ కొద్దిమందిలో వారు ఒకరని మనవి చేస్తున్నాను.

పరిశుద్ధమైన పరిపాలనా విధానం, రాజకీయమైనటువంటి అంకిత భావాన్ని కోరేటటువంటి తెలుగుదేశం పార్టీ పూర్తిగా నిస్వార్థపూరితమైనటువంటి, స్వచ్ఛందపరమైనటువంటి సేవా విధానాన్ని ఎంతో హృదయపూర్వకమైన, అభినందనపరమైనటువంటి స్ఫూర్తితో తీసుకున్నది, గ్రహించినది. ఈనాడు రాజకీయంలో నీతి కావాలి, దగాకోరు విధానం ఏమీ ఉండకూడదు, సమాజానికి అంకితమైనటువంటి నిజమైన రాజకీయ చైతన్యవంతమైనటువంటి సమాజాన్ని సృష్టించగలిగిందే నిజమైన రాజకీయం అన్న భావనకు మేమందరం కలవగలిగామంటే ఇటువంటి కొంతమంది మహానుభావులు దారి చూపించారు కనుకనే. ఆ దారిలో మనమందరం నడవాలి. దేశం అన్నింటికన్నా ముఖ్యమైనది. "జననీ జన్మభూమిశ్చ, స్వర్గాదపి గరీయసి" అన్నట్లుగా మన దేశానికి మనం అంకితం కావాలి, దేశానికన్నా మిన్న అయినది ఈ ప్రపంచంలో ఎక్కడా లేదు, కన్నతల్లి కన్నా ఎక్కువైనది అన్న భావంతో మాకు స్ఫూర్తిని, ఆదేశాన్ని ఇచ్చినటువంటి వ్యక్తి ఆయన. అనుభవశాలిగా, మాజీ ప్రధానమంత్రిగా ఆయనకున్నటువంటి చిత్తశుద్ధిని, శీలాన్ని ముందు గుర్తించి ఆ విధమైనటువంటి అర్హత కల్పించబడింది.

చివరివరకు ఆయన ప్రాణం పోయేవరకు రైతుల కోసం, పేద ప్రజలకోసం ఎన్నో ఉద్ధరణ కార్యక్రమాలు చేబట్టారు, ఆయన గ్రంథాలు రచించారు. ఆ విషయం మీకందరికీ తెలుసు. గ్రామీణ ఆర్థిక సిద్ధాంతపరమైన విధానాలతో కూడినటువంటి వారి విజ్ఞతను రచనల ద్వారా ప్రదర్శించారు. అటువంటి మహానుభావుడు, మహనీయుడు, రాజకీయ స్రష్ట, నీతికీ నిజాయితీకి దర్పణమైనటువంటి వ్యక్తి. తన జీవితాన్ని ఈ రోజున ఒక మంచి అంకితమైనటువంటి విధానానికి ఆయన కర్పూర కళికగా అర్పించగలిగారంటే అంతకుమించి అటువంటి ధన్యజీవులు మరొకరు లేరు. తెలుగుదేశం పార్టీ తరఫున వారి కుటుంబానికి మా ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నాను. వారి కుటుంబ సభ్యులందరికీ ఈ విధంగా తీరని నష్టం కలిగింది. కేవలం ఇది వారి కుటుంబ నష్టమే కాకుండా రాజకీయాలకు కూడా కలిగిన నష్టమని మనవిచేస్తున్నాను. మనం వారి కుటుంబంలోకి చొరబడలేము, వారి మనసులో ఉన్న బాధను తీసివేయలేము. నిజమైన రాజకీయాలు, నిస్వార్థమైన, స్వచ్ఛమైన రాజకీయాలు లేకపోతే ప్రజాస్వామ్యానికి అర్థం లేదు. అటువంటి నాయకులు ఉండాలి. అటువంటి నీతి గుండెల్లో ఉండాలి. మనకు ముందు దారి కావాలి. రాజకీయాల్లో దగాకోరుతనం పోవాలి. శ్రీ చరణ్‌సింగ్ గారి మరణం పట్ల స్మరణతో కూడిన స్పందనతో మా పార్టీ తరఫున మా సంతాపాన్ని, వారి కుటుంబానికి మా సానుభూతిని తెలుపుతున్నాను.

◆◆

మార్చి 13, 1991

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ సభ్యురాలు శ్రీమతి జె. ఈశ్వరీబాయిగారి మృతిపట్ల సంతాపం

**శ్రీ ఎన్.టి.రామారావు:** అధ్యక్షా, సోదరీమణి ఈశ్వరీబాయిగారి విషయం తెలుసుకున్నప్పుడు ఇది రాజకీయాలకు అంకితమైన విషయంగా స్ఫూర్తికి తెచ్చుకుంటున్నాను. వారితో సోదరుడిగా నాకు ఉన్న సన్నిహితత్వం, సమాదరణ విధానం ఎప్పుడూ గుండెలలో మెదులుతూ ఉండే మమకారంగా నాయొక్క గౌరవాన్ని వ్యక్తం చేస్తున్నాను. రాజకీయాలలో అడుగు పెట్టకముందు సారధి స్టూడియోలో 'కలసి ఉంటే కలదు సుఖం' అనే చిత్రానికి నటించడానికి వచ్చినప్పుడు గౌరవనీయురాలు ఈశ్వరీబాయిగారితో నాకు పరిచయం జరిగింది. అప్పుడు గీతారెడ్డి గారికి చిన్న వయస్సు. లంగాలు కట్టుకునే తరుణంలో పరిచయం జరిగిందని మనవిచేస్తున్నాను. ఆ వయస్సులో ఉన్న తన బిడ్డ డాక్టర్ పదవిలో ఔన్నత్యాన్ని సంపాదించాలి. పేద, బలహీన వర్గాల వారికి పూర్తి విధానాన్ని అందివ్వాలనీ, అందుకు మీరు ఆశీర్వదించాలని, పూర్తిగా ఔన్నత్యాన్ని తన బిడ్డలో నేను చూసుకోగలగాలనే ఆశతో జీవించిన వ్యక్తిగా వారి అభ్యుదయ విధానం పట్ల నాకు ఉన్న గౌరవాన్ని మరొక్కసారి ప్రదర్శిస్తున్నాను.

రిపబ్లికన్ పార్టీ వ్యవస్థాపకురాలిగా కేవలం షెడ్యూల్డ్ కులాల ఔన్నత్యానికి ఆనాడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారు కలలుగన్న విధానానికి స్ఫూర్తికి అనుగుణంగా ఏ విధంగా అవమానించబడుతూ అట్టడుగున ఉంటూ అంటరాని వారిగా ఉన్న వారి సంక్షేమానికి కృషిచేస్తూ ప్రత్యేకంగా ఏ విధంగా స్త్రీ సంక్షేమానికి కృషిచేసినదో కూడా అందరూ గ్రహించవలసిన సత్యం. అందరి చేత ఆ విధమైన గౌరవాన్ని పొందిన వ్యక్తిగా, తన కళ్ళముందే తన బిడ్డ చిరంజీవి సౌభాగ్యవతి గీతారెడ్డిని మంత్రిగా చూడగలిగి, ఆమెచేత తన యొక్క విధానానికి అనుగుణంగా సేవలు చేయించగలిగిన ఒక మూర్తిగా వారిని నేను ప్రస్తుతిస్తున్నాను. వారిపట్ల నాకు ఉన్న గౌరవభావాన్ని, సోదరభావాన్ని వ్యక్తం చేస్తున్నాను.

కాబట్టి ఈ భావముతోనే ఇవాళ రాజకీయాలలోకి వచ్చారు. కాబట్టి చిరంజీవి సౌభాగ్యవతి గీతారెడ్డి కూడా వారి తల్లి అడుగుజాడలలో పూర్తిగా సమాజ శ్రేయస్సుకు అంకితం కాగలరని, ఈ నాటికి కూడా 42 సంవత్సరాలు సుమారుగా స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా అంటరాని వారుగా ఉన్న షెడ్యూల్డ్ కులాల వారికి సౌజన్యమూర్తి, సహాయకారిగా, అభ్యుదయ పథగామిగా వ్యవహరించారనీ, వారికి మా తెలుగుదేశం పార్టీ తరపున సంతాపాన్ని తెలియజేస్తూ, వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని వ్యక్తంచేస్తూ, ఇలాంటి ఉత్తమ, ఆదర్శ విధానాలతో పండిన అ జీవితానికి పరమాత్ముడు శాశ్వత శాంతి చేకూర్చాలని హృదయపూర్వకంగా తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

◆◆

సెప్టెంబర్ 10, 1991

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ సభ్యులు శ్రీ రావి నారాయణ రెడ్డి మృతిపట్ల సంతాపం

**శ్రీ ఎన్.టి.రామారావు:** అధ్యక్షా, రావి నారాయణరెడ్డిగారు పెద్దలు, విజ్ఞులు, ప్రజా సేవకులు, ప్రజా ఉద్యమాలకు, వామపక్ష ఉద్యమానికి ప్రాణ ప్రతిష్ట చేసిన గౌరవనీయులు, చిరస్మరణీయులు. తెలంగాణ పోరాటంలో ముఖ్యంగా భూస్వాముల మీద, అప్పుడున్న సంపన్న ధనిక వర్గ వ్యవస్థ మీద, పేదవారి పక్షం ఉండి, అమాయకులుగా గుర్తించబడక అట్టడుగున సమాజం యొక్క దయాభిక్ష మీద ఆధారపడి బ్రతుకుతున్న మూగజీవుల పక్షాన ఆనాడు మహా ఉద్యమం నడిపించిన వ్యక్తిగా జాతి, సమాజం వారికి ఎప్పుడూ నివాళులు అర్పిస్తుంది. జాతి గుర్తించదగిన మహోన్నతమైన నాయకుడుగా రాజకీయాలలో ప్రవేశించి భువనగిరి శాసనసభ్యులుగా ప్రజల యొక్క మమకారాన్ని, అభిమానాన్ని చూరగొన్నారు.

1952వ సంవత్సరంలో నల్గొండ జిల్లా నుండి పార్లమెంట్ సభ్యులుగా నిలబడినప్పుడు ఈ దేశంలోనే అప్పుడు మహోన్నత రాజకీయ స్రష్టగా పేరు పొందిన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ కంటే కూడా ఎక్కువ ఓట్లు సంపాదించిన ఘనత, గౌరవం వారికే దక్కింది. దీనివలన వారి పట్ల ప్రజలకు ఏ విధమైన భక్తి భావం ఉన్నదనేది అర్థం అవుతున్నది. ఏ నిస్వార్థ సేవతో వారు సమాజాన్ని అభ్యుదయ భావాలతో ముందుకు నడిపారో, ఏ విధమైన నిస్వార్థ పరమైన భావంతో సేవ చేశారో మనం గుర్తుంచుకోవాలని నేను మనవిచేస్తున్నాను. ఆ సేవ ఫలితమే ఈనాడు మనందరం కూడా ఇక్కడ ఉండడానికి కానీ, ప్రజాస్వామ్యం బ్రతకడానికి కానీ కారణమైంది. కాబట్టి ఇలాంటి మహనీయులు అమరజీవులై మన ఆత్మలోనే ఉంటారు. వారి స్ఫూర్తి, వారి విధానం, అభ్యుదయ భావాలను, నిస్వార్థ రాజకీయాలను గుర్తు చేస్తూ సమాజానికి అంకితం కావడమే రాజకీయాల యొక్క పరమావధి.

కానీ కేవలం స్వార్థానికి పొట్టపోసుకునే పద్ధతి మంచిది కాదనే దానికి వారి జీవితమే ఒక నిదర్శనము. ఆయన సంపన్న వర్గంలో పుట్టిన వారు అయినా కూడా పేదవాడిగానే కన్ను మూసారు. 'పట్టి, మాటలు కట్టి పెట్టి గట్టి మేల్ తలపెట్టవోయ్, దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్' అనే దానికి నిర్వచనం వారు. పెద్దలు, మహానుభావులు, పూజ్యులు, నిస్వార్థపూరితమైన సాహితీ గానం చేసిన విధానం వారిది. ఏ మాత్రం దాని మీద గౌరవం ఉన్నా, ఈ విధానం మీద నమ్మకం ఉన్నా, రాజకీయం మీద విశ్వాసం ఉన్నా, నిస్వార్థమైన సేవా విధానం మన ఆచరణ ధర్మం కావాలని, గౌరవనీయులైన రావి నారాయణరెడ్డిగారి త్రోవే ఈ రాజకీయ విధానానికి త్రోవ అని మరొకసారి స్మరణకు తెచ్చుకుంటూ, ఇలాంటి పెద్దలు ఎప్పుడూ ఉండాలని కోరుకుంటూ, 'పుట్టిన తరువాత గిట్టడం తప్పదు' కానీ కొంత మంది మాత్రం పూర్తిగా వారు లేని లోటు ఎప్పుడు కనబడుతూ ఉంటుంది.

అలాంటి వారు ఉంటే ఇంకా బాగుంటుందనీ, ఏదైనా మంచి పని మనం చేసినట్లయితే రాజకీయపరంగా ఈ శాసనసభ ద్వారా కూడా ఇంత మంచి పని చేశారు అని మెచ్చుకునే మహత్తరమైన వ్యక్తిని పోగొట్టుకున్నామనే లోటు నా మనస్సులో ఎప్పుడూ ఉంటుంది. కాబట్టి, వారి మరణం పట్ల ప్రగాఢమైన సంతాపాన్ని తెలుగుదేశం పార్టీ తరపున వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు, ముఖ్యంగా వారు పునీతం చేసిన కమ్యూనిస్టు పార్టీకి ఇప్పుడు సిపిఐ పార్టీగా వారు ప్రజా బంధువు అని అంటాను, రాజకీయ స్రష్ట అంటాను, రాజకీయ బంధువు అంటాను కాబట్టి, వారు పోవడం రాజకీయాలకే తీరని లోటు. అలాంటి మహానుభావుడిని పోగొట్టుకున్నందున మరొకసారి ప్రగాఢమైన సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తూ, వారి పట్ల నాకున్న గౌరవ భావాన్ని మా పార్టీకి వారి పట్ల ఉన్న విధానాన్ని కూడా నేను వ్యక్తం చేస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

◆◆

ఫిబ్రవరి 24, 1993

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభ్యులు శ్రీ నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మృతిపట్ల సంతాపం

**శ్రీ ఎన్.టి.రామారావు:** అధ్యక్షా, సోదరులు, గౌరవనీయులు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డిగారు మా తరంలో మాతో కొంత కాలం సహాధ్యాయాన్ని జరిపిన మంచి విజ్ఞుడు, అనుభవం గలవారు, రాజకీయ సృష్ట వారితో నాకు పరిచయం ఉన్నది తెలుగుదేశం పార్టీ వచ్చినప్పటి నుంచే కాదు, అంతకు ముందు నేను సినిమా యాక్టర్‌గా ఉండగా, నా మీద వారికి ఎంతో గౌరవం, అభిమానం ఉండేది. నేను వేసిన పాత్రల వల్లనో, నా మనోగత భావాల వల్లనో కానీ ఆయన నన్ను అభిమానించేవారు. ఎంతో స్ఫూర్తివంతమైన గౌరవం ఉండేది. నాకు ఒక సన్నివేశం ఈ సందర్భంగా గుర్తుకు వస్తోంది. కోటలో వారు ఒక మహాసభను నిర్వహించినప్పుడు, అది రాజకీయ సభ అయినప్పటికీ, దానికి ప్రత్యేకంగా నన్ను, ఆనాటి మహానటి అయిన సోదరీమణి సావిత్రిని ఆహ్వానించారు. అప్పుడు నేను వెడితే వారితో నాకు పరిచయం అయింది. ఏనాటి మాటో ఇది.

సుమారు 25 సంవత్సరాల క్రితం జరిగిన సన్నివేశం. ఆనాడు నిజమైన శ్రీనివాసులు రెడ్డి గారిగా నేను వారిని చూశాను. యువకులుగా, స్ఫూర్తివంతుడిగా, సంఘ ప్రయోజనకారిగా ఆదర్శవంతమైన విధానానికి అంకితమైన వ్యక్తిగా, ఆవేశపరుడిగా, మహావక్తగా వారిలో ఉదాత్తమైన మూర్తిని చూడగలిగాను. కాలానుగుణంగా ఎందుకో తెలుగుదేశం పార్టీ రావడం, దానిలోకి వారుకూడా మా సహాధ్యాయుడిగా ప్రవేశించడం జరిగింది. వారి మీద గౌరవమైన అభిమానం, ఆశ కూడా ఉంది. ఈ విధమైన ఆవేశపరులైన వ్యక్తులు రాజకీయాలకు రావాలి, సరైన విధానంలో సంక్షేమ కార్యక్రమాలు పేదలకు జరగాలి.

సంఘంలో, సమాజంలో ఉన్నటువంటి ఈ యొక్క హెచ్చు తగ్గులు నివారణ కావాలి అనే ఉద్దేశంతో నేను వారు రావడంతో ఎంతో సంతోషించాను. నా మంత్రివర్గంలో వారికి ద్వితీయ

స్థానం కల్పించాను. వారి ఆలోచనలకు, వారి ఊహలకు అనుగుణ్యంగా వారు సమాజానికి సేవలు చేసుకునే విధానం కూడా కల్పించాము. ఈనాడు వారు ఇచ్చిన ఊహలకు కానీ, వారు నడిచిన విధానంలో స్ఫూర్తితో, తెలుగుదనంతో, తెలుగుమూర్తిగా వెలుగొంది, నా అభిప్రాయాలు అమలు చేసిన విధానాలు నేను పంచుకుంటే వారికి నేను ఋణపడ్డానుపిస్తుంది. వారి చివరి వరకూ మాతో లేనప్పటికీ ఆ స్ఫూర్తి మాతో ఉంటుంది.

ఆనాడు కలిగించిన అనుభూతులు, సేవలు తెలుగుదేశం పార్టీ విధానాలకు ప్రాణం పోసిన విధానాలు శాశ్వతంగా ఎప్పటికీ నిలిచిపోతాయి. ఆరోజు మండలాల విధానంలో అధికార వికేంద్రీకరణ కావాలనే భావనతో ఎంతో ఉత్సాహంతో, ఆపేక్షతో నేను నా భావాలను చెప్పగానే వాటిని అమలు చేసే వరకూ ఆయన నిద్రపోలేదు అంటే అతిశయోక్తి కాదు. గ్రామీణ క్రాంతి పథకం మొదలైన కొత్త, వినూత్న పథకాలకు, ప్రయోగాలకు ఎంతో స్ఫూర్తివంతమైన పద్ధతిలో సంక్షేమ కార్యక్రమాలన్నీ కూడా పేద ప్రజలకు అందే విధంగా చెయ్యడానికి వారెంతో సహకరించారు. ఎంతో ఆవేశం నాలో కూర్చారు అని ఈ సందర్భంగా గుర్తుకు తెచ్చుకుంటున్నాను. ఆ మూర్తిని కానీ, ఆ స్ఫూర్తితో ఉన్న అలనాటి రాజకీయ స్రష్టను నేను మరచిపోను.

నా సోదరులు వారు హఠాత్తుగా మరణించారు అనడం పిడుగుపాటుగా నాకు తగిలింది. హస్పిటల్‌లో ఉన్నప్పుడు ఒకసారి వెళ్ళాను. ఆనాడు అపస్మారక స్థితిలో వారు ఉన్నారు. అయినప్పటికీ ఇటువంటి ఘోరం జరుగుతుందని నేను అనుకోలేదు. భవిష్యత్తు, ఆశావంతమైన రాజకీయవేత్తగా ఇంకా మంచి పనులు ఆయనతో చేయిస్తుందని అనుకున్నాను. కానీ ఈనాడు ఈ దురదృష్టకరమైన విధానంగా వారు మన నుంచి విడిపోయారు. హఠాత్తుగా మరణించారు. మనకే కాదు ప్రజలందరికీ కూడా తీరని లోటు. పేదల పట్ల, వారి సంక్షేమం అంటే ఎగిరి ముందడుగు వేసే మంచి ఆవేశపరుడైన వ్యక్తి. అందరూ చూశారు. తమరు గ్రహించారు శాసనసభలో వారు నడుచుకునే విధానం. వారి స్ఫూర్తి, ఏ సమస్య వచ్చినప్పటికీ కూడా అతి పటిష్టవంతంగా, సూటిగా తన భావాలను వ్యక్తం చేసే ప్రక్రియా విధానం ఎప్పటికీ మరచిపోలేము. ఆయన పోవడం ఒక ఆవేశపరుడైన, ప్రజా బంధువయిన ఒక పెద్ద పార్లమెంటేరియన్‌ని పోగొట్టుకున్నామేమోనని నా బాధను వ్యక్తం చేస్తున్నాను.

మా సోదరులంతా కూడా ఆయనను చివరి వరకూ గౌరవిస్తూ వచ్చారు. ఆయన విజ్ఞత, స్ఫూర్తి, ఆవేశం, దీక్ష మీద, ఆయన ప్రజాసేవ మీద తెలుగుదేశం పార్టీ సోదరులు, ఆడపడుచులకు ఎంతో గౌరవం ఉంది. మరి ఈనాడు పోయారంటే ప్రతి ఒక్కరం కూడా ఎంతో దిగులుతోనే ఇక్కడకు వచ్చాం. ఆ మూర్తిని చూసినప్పుడల్లా ప్రతి ఒక్కరు నమస్కారం పెట్టే వాళ్ళు. మరి ఏ విధమైన గౌరవ భావం వ్యక్తి మీద వున్నదో. రాజకీయాలు వేరు అయినప్పటికీ కూడా, పార్టీలు వేరు అయినప్పటికీ కూడా వ్యక్తి గౌరవాన్ని ఎప్పుడూ పోగొట్టుకోని వ్యక్తి ఆయన. వ్యక్తి గౌరవాన్ని

ఎప్పుడూ నిలబెట్టే వ్యక్తి, ఆయన ఇలాంటి మహామనిషి. కేవలం రాజకీయవేత్తే కాదు, మానవత్వం కలిగిన మనిషిగా కూడా ఆయన ఎనలేనంత ఎత్తుకు ఎదుగుతాడనుకున్నాం కానీ అంత ఎత్తుకు వెళ్లలేకపోయారనే బాధ నాలో ఉన్నది. భగవంతుడు గనుక ఆయనకు ఆయుష్షు ఇచ్చినట్లయితే ఎంతో మహోత్తరమైన రాజకీయవేత్తగా, పూర్తి విధాతగా కూడా మన రాష్ట్రానికే కాదు, ఈ దేశానికి కూడా ఎంతో ఉపకరించే వారు. వారు లేని కొరత ఈనాడు రాజకీయానికి ఎంతో జరిగిందని నేను బాధపడుతున్నాను అని సవినయంగా మనవిచేస్తున్నాను.

ఏది ఏమైనప్పటికీ పోయిన వారిని తెచ్చుకోలేము. వారి యొక్క ఘనతను, గౌరవాన్ని గుర్తించడం, వారు చూపిన బాటలో, వేసిన అడుగులో అడుగు వేసుకుంటూ ముందుకు వెళ్లడం మనకు ఆదర్శం. వారి విధానమే మనకు స్ఫూర్తిని ఇస్తుందని ఈ సందర్భంగా తెలియజేస్తూ ఈనాడు ఎంతో దుఃఖ సాగరంలో మునిగిపోయిన వారి సతీమణికి, వారి బంధువులకు, వారి బిడ్డలందరికీ కూడా నా హృదయపూర్వక సంతాపాన్ని తెలియజేస్తున్నాను. ఒక మహనీయమైన మనిషిగా, అనారోగ్యం అయినా లెక్కచెయ్యకుండా ఎటువంటి పరిస్థితులలోనూ ఆగకుండా ఎన్ని అవాంతరాలున్నా, పనులున్నా కూడా శాసనసభకు ప్రాధాన్యతనిచ్చి, ప్రతిరోజూ హాజరవుతూ వచ్చేవారు. ఆయనే ఈ మధ్య ఒక సందర్భంలో ఈ విషయం చెప్పారు. ప్రజా సమస్యల మీద హెచ్చు సంఖ్యలో ప్రశ్నలు వేసిన వారు మరొకరు లేరనుకుంటాను. ఆయనదే లార్జెస్ట్ నెంబర్ అని ఆయన డిప్యూటీ స్పీకరుగా ఉండగా నేను అనుకునేవాడిని. ప్రతి ప్రశ్నా కూడా అర్థవంతంగా ఉండేది. ప్రయోజనకరంగా ఉండేది. ఉపయోగించేట్లుగా ఉండేది.

నియోజకవర్గంలోని ప్రతి సమస్యనూ ప్రశ్నలరూపంగా శాసనసభలో ప్రతిబింబించేట్లుగా ప్రభుత్వ దృష్టికి తేవడం, వాటి పరిష్కారానికి కృషి చెయ్యడం జరిగేది. బెస్ట్ పార్లమెంటేరియన్ అడ్మినిస్ట్రేటర్‌గా, మంత్రిగా ఉండి మంచి దక్షతతో ఉండేవారు. జిల్లా పరిషత్తులో మంత్రిగా రెవ్యూ చేస్తున్నప్పుడు సునిశితంగా పరిశీలించి, చక్కటి సూచనలు ఇచ్చేవారు. నిర్మాణాత్మక సలహాలిచ్చేవారు. ఇటు పార్లమెంటేరియన్‌గా, అటు పరిపాలనా దక్షుడిగా అహర్నిశలూ ప్రజలకు సేవలు చేస్తూ తన ఆరోగ్యాన్ని కూడా త్యాగం చేసిన వ్యక్తి. జబ్బు పడడానికి ముందు 15 రోజులు తన నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని తిరిగి నిర్విరామంగా శ్రమ చేశారు. దాని ఫలితంగా కావచ్చు, సుస్తీ చేసి, దాని నుంచి తేరుకోలేక కన్ను మూశారు. అటువంటి ప్రజాసేవకుడిని, ఆదర్శ పార్లమెంటేరియన్‌ను కోల్పోవడం కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్రానికి, శాసనసభకూ కూడా తీరని నష్టంగా భావిస్తున్నాను. ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానానికి పూర్తిగా ఏకీభవిస్తూ శ్రీనివాసులురెడ్డి గారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

◆◆

# చరిత్ర సృష్టించిన ఎన్టీఆర్ పథకాలు

- దేశంలో తొలిసారి రూ.2కే కిలో బియ్యం. కోటి 20 లక్షల పేద కుటుంబాలకు పంపిణీ.
- దేశంలో తొలిసారి పేదలకు కాంక్రీటు శ్లాబుతో పక్కా ఇళ్ల నిర్మాణం.
- పేదలకు సగం ధరకే జనతా వస్త్రాల పంపిణీ – చేనేత కార్మికులకు చేయూత.
- దేశంలో తొలిసారి వృద్ధాప్య పింఛన్... నెలకు రూ.30.
- దేశంలో తొలిసారి స్థానిక సంస్థల ఎన్నికలలో బీసిలకు 20%, మహిళలకు 9% రిజర్వేషన్లు.
- ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు పెంపు... ఎస్సీ రిజర్వేషన్లు 14% నుంచి 15%కు, ఎస్టీ రిజర్వేషన్లు 4% నుంచి 6%కు పెంపు.
- తొలిసారి పేద విద్యార్థులకు గురుకుల, ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్ల ఏర్పాటు.
- దేశంలో తొలిసారి కేపిటేషన్ ఫీజుల రద్దు – పేద విద్యార్థులకు అత్యున్నత విద్య అందుబాటు.
- తొలిసారి మెడికల్, ఇంజనీరింగ్ విద్యకు కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఎంసెట్) ప్రవేశపెట్టి సామాన్యులకు ఉన్నత విద్య చేరువ చేశారు.
- దేశంలో తొలిసారి మహిళలకు ఆస్తిహక్కు కల్పన.
- దేశంలో తొలిసారి మహిళలకు బహిరంగ ప్రదేశాలలో మరుగుదొడ్ల నిర్మాణం.
- దేశంలో తొలిసారి వ్యవసాయరంగంలో రూ.50లకే హార్స్ పవర్ విద్యుత్.
- వ్యవసాయ రుణంపై దేశంలోనే మొదటిసారి 5.5% వడ్డీ రాయితీ అందజేత.
- దేశంలో తొలిసారి భూమిశిస్తు రద్దు.
- తొలిసారి రైతాంగానికి పట్టాదార్ పాసుపుస్తకాలిచ్చి యాజమాన్య హక్కు కల్పన.
- తొలిసారి ట్రాక్టర్లపై పన్ను తొలగింపు ద్వారా రైతాంగానికి వెసులుబాటు.
- నేషనల్ ఫ్రంట్ ద్వారా దేశవ్యాప్తంగా రైతులకు రూ.11 వేల కోట్ల రుణ మాఫీ.
- సహకార వ్యవస్థలో సింగిల్ విండో సిస్టమ్.. రైతుల అవసరాలన్నీ ఒకేచోట తీర్చేలా..
- తొలిసారి రాష్ట్రంలో మలేషియా నుండి పామాయిల్ మొక్కలను తెచ్చి సాగుకు శ్రీకారం.
- నాగార్జున సాగర్ నుంచి హైదరాబాద్‌కు తాగునీటి తరలింపు.
- తొలిసారి దేశంలో నదుల అనుసంధానం – తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా కృష్ణా, పెన్నా నదుల అనుసంధానం.

- నిజాంసాగర్, శ్రీరాంసాగర్, శ్రీశైలం కుడి-ఎడమ కాలువ, కల్వకుర్తి, నెట్టంపాడు, ప్రియదర్శిని జూరాల, హంద్రీ-నీవా, గాలేరు-నగరి, సోమశిల, కందలేరు, పులిచింతల, మద్దువలస ప్రాజెక్టులతో తెలంగాణ, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధి.
- దేశంలో విప్లవాత్మక సామాజిక సంస్కరణ... పటేల్ - పట్వారీ వ్యవస్థ రద్దు.
- మాండలిక వ్యవస్థ ఏర్పాటుతో ప్రజల వద్దకే పాలన... 330 తాలూకాలను 1104 మండలాలుగా మార్పు.
- తెలుగు గ్రామీణ క్రాంతి పథం - గ్రామాల సర్వతో ముఖాభివృద్ధి...
- దేశంలో తొలి మహిళా యూనివర్సిటీగా.. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఏర్పాటు.
- తొలిసారి తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటు.
- దేశంలో తొలి ఆరోగ్య విశ్వవిద్యాలయం - ఎన్టీఆర్ మెడికల్ అండ్ హెల్త్ యూనివర్సిటీ ఏర్పాటు.
- రాష్ట్రంలోని ప్రతి మండలంలో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు.
- హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మక వైద్య సంస్థ 'నిమ్స్' ఆధునీకీకరణ.
- ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం.
- జోగిని, దేవదాసీల వ్యవస్థ రద్దు - సాంఘిక దురాచారాలకు అడ్డుకట్ట.
- దేశంలో తొలిసారి రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ ఏర్పాటు.
- హైదరాబాద్ పాత నగర అభివృద్ధికి కులీకుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ (కుడా) ఏర్పాటు.
- తెలుగు లలిత కళాతోరణం ఏర్పాటు.. కళలకు, కళాకారులకు ప్రోత్సాహం.
- ట్యాంక్ బండ్‌పై తెలుగు మహనీయుల విగ్రహాలు - బుద్ధుడి విగ్రహం ఏర్పాటు.
- తొలిసారి 'నిత్య అన్నదాన పథకం' ద్వారా తిరుమల వచ్చిన భక్తులకు ఉచిత భోజనం ఏర్పాటు.
- రాష్ట్రవ్యాప్తంగా భారీ బస్ స్టాండ్‌ల నిర్మాణం.
- నేషనల్ ఫ్రంట్ ద్వారా దేశవ్యాప్తంగా మండల్ కమిషన్ సిఫారసుల అమలు.
- సర్కారియా కమిషన్ ఏర్పాటుకు కృషి - కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల స్నేహ, సౌహార్ధ సంబంధాల మెరుగుదల.
- నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ద్వారా డా॥ బి.ఆర్.అంబేద్కర్‌కు మరణానంతరం భారతరత్న ప్రదానం.

◆◆

## సమున్నత చరిత్ర - సజీవ సాక్ష్యాలు



నూతన అసెంబ్లీ భవనాన్ని రాజీవ్‌గాంధీ చేతులమీదుగా ప్రారంభం చేయిస్తున్న ఎన్టీఆర్



నూతన అసెంబ్లీ భవనంలో ప్రధాని రాజీవ్‌గాంధీ, గవర్నర్ కుముద్‌బెన్ జోషి,
సీఎం ఎన్టీఆర్, స్పీకర్ నారాయణరావు



తథాగతుని ఏకశిలకు ఉలితో మెరుగులు దిద్దుతున్న ఎన్టీఆర్.
చిత్రంలో యతిరాజారావు, నర్సింహులు, మాధవరెడ్డి, జానారెడ్డి



తథాగతుని శిలావిగ్రహం హుస్సేన్‌సాగర్ చేరిన సందర్భంలో ప్రసంగిస్తున్న ఎన్టీఆర్



బుద్ధభగవానుడికి పూజలు చేసిన ఎన్టీఆర్





కంచిపీఠం పరమాచార్య శ్రీ చంద్రశేఖర స్వామిజీకి సాదర ఆహ్వానం పలుకుతున్న ఎన్టీఆర్



రామకృష్ణ మఠం నిర్వాహకులు
స్వామి రంగనాథానంద



మదర్ థెరిస్సాతో ఎన్టీఆర్



ముస్లిం సోదరులతో కలిసి నమాజ్ చేస్తున్న ఎన్టీఆర్



బిషప్ ఆశీర్వచనాలు అందుకుంటున్న ఎన్టీఆర్



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎన్టీఆర్




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాల కార్యక్రమంలో
పాల్గొన్న గవర్నర్ శంకర్‌దయాళ్ శర్మ, ఎన్టీఆర్ తదితరులు



పోలీసుల గార్డ్ ఆఫ్ ఆనర్ స్వీకరిస్తున్న ఎన్టీఆర్




హర్యానాలో పోలీసుల గార్డ్ ఆఫ్ ఆనర్ స్వీకరిస్తున్న ఎన్టీఆర్



రాజ్యాంగ నిర్మాత డా॥ బి.ఆర్.అంబేద్కర్‌కు నివాళి



డా॥ బాబూజగ్జీవన్‌రామ్‌తో ఆత్మీయ క్షణాలు




ట్యాంక్‌బండ్‌పై తను ప్రతిష్ఠించిన
కొమరంభీమ్ విగ్రహానికి పూల మాల



మహాత్ముడికి నివాళి



ఉక్కు మనిషి ప్రకాశం పంతులు గారికి
పూల మాల



అమరజీవి పొట్టిశ్రీరాములకు నివాళి. చిత్రంలో చంద్రబాబునాయుడు



గవర్నర్ రామ్‌లాల్ దుశ్చర్యతో కుట్రపూరితంగా ఎన్టీఆర్ అరెస్ట్



బస్సుల్లో ప్రజల వద్దకు వెళ్లడానికి సమాయత్తమైన ఎన్టీఆర్‌కు మద్దతు ఇస్తున్న ఎమ్మెల్యేలు



ఎన్టీఆర్‌కు అడుగడుగునా ప్రజల నీరాజనాలు



చైతన్యరథంపై రాజ్‌భవన్ నుంచి బయలుదేరిన ఎన్టీఆర్




వేలాదిగా తరలివస్తూ మద్దతు పలుకుతున్న ప్రజలతోపాటు ముందుకు సాగుతున్న ఎన్టీఆర్



ప్రజలకు వినమ్రంగా నమస్కరిస్తూ..



ప్రజలకు అభివాదం తెలుపుతున్న ఎన్టీఆర్



తనను పరామర్శించడానికి, మద్దతు పలకడానికి వచ్చిన ప్రజలకు అభివాదం చేస్తూ..



ఎన్టీఆర్‌కు పుష్పం అందిస్తున్న ఓ చిన్నారి



ఓదార్పునిస్తూ కంటతడి పెట్టిన ఓ వృద్ధుణ్ణి సముదాయిస్తున్న ఎన్టీఆర్



అండగా నిలిచిన ఆడపడుచులకు అభివాదం చేస్తున్న ఎన్టీఆర్



దూర ప్రాంతాల నుంచి తనను చూడడానికి వచ్చిన ఆడపడుచులకు,
తమ్ముళ్లకు అభివాదం చేస్తున్న ఎన్టీఆర్





కేంద్రం నియంతృత్వాన్ని సహించేదిలేదని పిడికిలి బిగించి చెబుతున్న ఎన్టీఆర్



చక్రాల కుర్చీ నుంచే కేంద్రంపై సమరశంఖం పూరించిన ఎన్టీఆర్




విమానం నుంచి దిగుతూ ఎయిర్‌పోర్టులో తనను చూడడానికి వచ్చిన వారికి నమస్కరిస్తున్న ఎన్టీఆర్



ఎన్టీఆర్‌కు సంఘీభావం ప్రకటిస్తున్న జాతీయ నాయకులు బిజూపట్నాయక్,
వాజ్‌పేయి, చో రామస్వామి తదితరులు



తనను సెక్రటరియేట్‌లోకి వెళ్లకుండా
అడ్డుకున్న విపక్షనేతల దుశ్చర్యకు నిరసనగా
గేటు ముందే బైఠాయించిన ఎన్టీఆర్




విపక్షనేతగా అసెంబ్లీ ముందు ఫుట్‌పాత్‌పై
కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్టీఆర్



విపక్ష నేతల అప్రజాస్వామిక చర్యకు నిరసనగా రోడ్డుపైనే పడుకున్న ఎన్టీఆర్



రాజీవ్‌గాంధీ హత్య దరిమిలా కాంగ్రెస్ మూకలు తమ సినిమా థియేటర్లపైన,
తెలుగుదేశం సానుభూతిపరుల ఆస్తులపైన దాడి చేసి విధ్వంసం సృష్టించడాన్ని నిరసిస్తూ
ట్యాంక్‌బండ్‌పై నిరసన దీక్షకు దిగిన ఎన్టీఆర్




అమాయక ప్రజల ధన మాన ప్రాణాలతో ఆటలు ఆడుతున్న కాంగ్రెస్ గూండాల దుశ్చర్యలకు
నిరసనగా  ట్యాంక్‌బండ్‌పై నిరసన దీక్షకు దిగి అక్కడే విశ్రమించిన ఎన్టీఆర్



దీక్షకు దిగిన ఎన్టీఆర్‌కు సంఘీభావం తెలిపిన తెలుగుదేశం నేతలు. చిత్రంలో..
కేసీఆర్, ఫరూక్, చిక్కాల రామచంద్రరావు, కోళ్ల అప్పలనాయుడు తదితరులు





ట్యాంక్‌బండ్‌పై దీక్షకు దిగిన ఎన్టీఆర్‌కు సంఘీభావం తెలిపిన ఎంఐఎం అధినేత సలాఉద్దీన్ ఓవైసీ,
దీక్షలో ఉన్న ఎన్టీఆర్‌ను అర్ధరాత్రివేళ అక్రమంగా అరెస్ట్ చేసిన పోలీసులు



విజయవాడలో నిర్వహించిన తొలి కాన్‌క్లేవ్. చిత్రంలో.. రామకృష్ణహెగ్డే, ఎంజీఆర్, ఎల్.కె.అద్వానీ, చంద్రరాజేశ్వరరావు, కొరటాల సత్యన్నారాయణ, హెచ్.ఎన్. బహుగుణ, ఫరూక్ అబ్దుల్లా, మేనకాగాంధీ తదితరులు



రామకృష్ణహెగ్డే, ఎంజీఆర్, మేనకాగాంధీలకు సాదర స్వాగతం పలుకుతున్న ఎన్టీఆర్



ప్రాణమిత్రుడు ఫరూక్ అబ్దుల్లాతో ఎన్టీఆర్



రామకృష్ణహెగ్డే, జ్యోతిబసులతో ఎన్టీఆర్



హర్యానా సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎన్టీఆర్



వాజ్‌పేయి, ఎల్.కె.అద్వానీ, దేవీలాల్‌తో ఎన్టీఆర్



కాంగ్రేసేతర పక్షాలతో భేటీ. చిత్రంలో.. ఎన్టీఆర్‌తోపాటు వాజ్‌పేయి, ఉపేంద్ర, దేవీలాల్, రామకృష్ణహెగ్డే, అజిత్‌సింగ్ తదితరులు




నేషనల్ ఫ్రంట్ సమావేశంలో దేవీలాల్, విపి సింగ్, కరుణానిధి, మహంతతో ఎన్టీఆర్



నేషనల్ ఫ్రంట్ సమావేశంలో రామకృష్ణహెగ్డే, వాజ్‌పేయి, చంద్రశేఖర్, బహుగుణ, దేవీలాల్,
అద్వానీ, విపి సింగ్, బిజూ పట్నాయక్ తదితరులు




నేషనల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో జరిగిన బహిరంగసభలో పాల్గొన్న ఎన్టీఆర్.
చిత్రంలో.. బహుగుణ, విపి సింగ్, దేవీలాల్ తదితరులు



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎన్టీఆర్‌తోపాటు బహుగుణ, విపి సింగ్, దేవీలాల్,
అజిత్‌సింగ్, రామ్‌విలాస్ పాశ్వాన్ తదితరులు



ఆగ్రా బహిరంగ సభలో ప్రసంగిస్తున్న ఎన్టీఆర్



నేషనల్ ఫ్రంట్ సమావేశంలో బిజూ పట్నాయక్, దేవీలాల్, విపి సింగ్, కరుణానిధిలతో ఎన్టీఆర్



హర్యానాలో ఓ అన్నదాతతో కలిసి తేనీరు తాగుతున్న ఎన్టీఆర్



హర్యానాలో ప్రచారం చేయడానికి వెళ్లిన ఎన్టీఆర్.
నులకమంచంపై కూర్చొని సహచర నేతలతో మాటామంతీ



శ్రీమతి ఇందిరాగాంధీకి అభివాదం చేస్తున్న ఎన్టీఆర్



ఎయిర్‌పోర్టులో ఆర్. వెంకట్రామన్‌కు సాదర స్వాగతం పలుకుతున్న ఎన్టీఆర్



జ్ఞానీజైల్ సింగ్‌ను గజమాలతో సత్కరించిన ఎన్టీఆర్



రాజీవ్‌గాంధీ, కుముద్‌బెన్ జోషీలతో ఎన్టీఆర్



సినీనటుడిగా ఉండగా తనను చూసేందుకు తిరుపతి నుంచి వచ్చిన భక్తులతో (అభిమానులతో) ఎన్టీఆర్



రాజకీయాల్లోకి వచ్చినా చెక్కుచెదరని అభిమానం. తిరుపతి వెంకన్న దర్శనానంతరం ఎన్టీఆర్ సందర్శన



రాజకీయంగా జన్మనిచ్చిన తెలుగుదేశం జెండాను ఆవిష్కరిస్తున్న ఎన్టీఆర్



జెండా ఆవిష్కరణను వీక్షిస్తున్న తెలుగుదేశం శాసనసభ్యులు, పార్టీ నేతలు



1994లో ముఖ్యమంత్రిగా ఎన్నికైన ఎన్టీఆర్‌ను కలిసి ఆశీస్సులు పొందుతున్న పార్టీ నేతలు



ఎన్టీఆర్‌ను అభినందిస్తున్న జీఎంసి బాలయోగి, యర్రా నారాయణ స్వామి, లాల్‌జాన్ బాషా, మూర్తి, బోళ్ల బుల్లిరామయ్య, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, చంద్రబాబునాయుడు తదితరులు



ముఖ్యమంత్రిగా ఫైలుపై సంతకం చేస్తున్న ఎన్టీఆర్



శాసనసభలో సభానాయకుడిగా ప్రమాణస్వీకారం




కలెక్టర్ల సమావేశంలో ఎన్టీఆర్, చంద్రబాబునాయుడు



పీవీ నరసింహారావు, కృష్ణకాంత్, రామోజీరావులతో ఎన్టీఆర్



బహిరంగ సభలో ప్రసంగించడానికి సమాయత్తం అవుతున్న ఎన్టీఆర్





ప్రజలకు నేనున్నానంటున్న ఎన్టీఆర్





వివిధ సందర్భాలలో ఎన్టీఆర్ హావభావాలు





కాలగర్భంలో తాలూకాలు, ఫిర్కాలు

# రాష్ట్రంలో రెవెన్యూ మండలాల అవతరణ



ముఖ్యమంత్రి

# మెడికల్ వర్సిటీకి ఆమోదం

Eenadu 03-04-1986

హైదరాబాద్, ఏప్రిల్ 2 (న్యూస్‌టుడే): రాష్ట్రంలో ఉన్న వివిధ వైద్యకళాశాలల మధ్య సమన్వయం సాధించేందుకు వీలు కల్పించే ఆరోగ్యవిజ్ఞానశాస్త్ర విశ్వ విద్యాలయం బిల్లును నేడు శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇటువంటి తరహా విశ్వవిద్యాలయం దేశం మీద ఇదొక్కటే అవుతుం దని వైద్య ఆరోగ్యశాఖమంత్రి డాక్టర్ ఎన్. ఎన్. కోటేశ్వరరావు ...

... సాల్గొంటూ డాక్టర్ వి. సుందరరామిరెడ్డి (కాంగ్రెసు) ఆరోగ్య విజ్ఞాన శాస్త్ర విశ్వ విద్యాలయం ఏర్పాటుకు వీలుకల్పించే బిల్లును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించడం హర్షదాయకమని అన్నారు. ...

... రించుకోవాలని అన్నారు. ప్రపంచంలో ఎక్కడాలేని ఇటువంటి విశ్వవిద్యాలయం ఏర్పాటుచేయడంవల్ల ఆంధ్రప్రదేశ్ గౌరవం ఇనుమడిస్తుందని అన్నారు. కాగా విశ్వవిద్యాలయాన్ని స్థాపించే ముందుగా రాష్ట్రంలో వైద్య ... విశ్వవిద్యాలయం ... ప్రతిష్ఠాకరమైన ఇటువంటి విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ఈ ఏడాది బడ్జెట్‌లో కేవలం రెండుకోట్ల రూపాయలే కేటాయించడం ... లేదని కనీసం 20 కోట్లయినా కేటాయించాలని కోరారు. ఆరోగ్య విజ్ఞానశాస్త్ర విశ్వవిద్యాలయం అన్న పేరు పెట్టడం వల్ల వైద్యశాస్త్రానికి ప్రాముఖ్యం తగ్గించినట్లు ... అందువల్ల వైద్య శాస్త్రాలను కూడా విశ్వవిద్యాలయానికి అనుసంధానం చేయాలని కోరారు. విశ్వవిద్యాలయం కేంద్రస్థానం ఎక్కడ ఏర్పాటు చేసేది ... సందేహాలకు తావిస్తోందని, కొన్ని పత్రికల్లో వచ్చినట్లుగా ఈ విశ్వవిద్యాలయం విజయవాడలో ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోందని ... న్యాయం చేసినట్లవుతుందని సుందరరామిరెడ్డి అన్నారు.

హైదరాబాద్ 26-5-1985 ఆదివారం

# తాలూకాలకు భరతవాక్యం; మండలాలకు నాంది

## మండలాల ఆర్డినెన్సుకు పన్నెండురోజులు బురఖా

## అవినీతి పైరావణం

## మధ్యాహ్న భోజనం స్థానే దుస్తులు, పుస్తకాలు

# స్త్రీలకు ఆస్తిలో హక్కు బిల్లు ప్రతిపాదన

Eenadu 06-09-1985

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (న్యూస్‌టుడే): హిందూ స్త్రీకి ఆస్తిలో సమాన హక్కులు కల్పించే హిందూ వారసత్వ [ఆంధ్రప్రదేశ్ సవరణ] బిల్లు 1985ను రాష్ట్ర న్యాయశాఖ మంత్రి శ్రీ రాజశేఖర్ గౌడ్ నేడు అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. వరకట్న సమస్యను రూపుమాపేందుకు, సంఘంలో స్త్రీకి గౌరవ స్థానాన్ని కల్పించేందుకు ఈ బిల్లును ప్రతిపాదిస్తున్నట్లు న్యాయశాఖమంత్రి శ్రీ ఇ. రాజశేఖర్ గౌడ్ నేడు అసెంబ్లీలో తెలిపారు. ఈ బిల్లును రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన అనంతరం రాజ్యాంగంలోని 254[2] ఆర్టికల్ ప్రకారం భారత రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్ల ఆమోదం కోసం పంపుతారు. హిందూ వారసత్వ చట్టం 1956ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలుపరిచేందుకు ఈ సవరణ చేసినట్లు మంత్రి తెలిపారు.

ఈ సవరించిన చట్టం నేటినుంచి అమలులోకి వచ్చేందుకు నిర్ణయించారు. హిందూ వారసత్వ చట్టం 1956లోని చాప్టర్ రెండు తర్వాత చాప్టర్ రెండు ఏగా సవరించిన కొత్త భాగాన్ని చేర్చారు. సవరించిన చట్టం ప్రకారం సమాన ఆస్తిహక్కుతో పాటు రుణాలు, బాధ్యతలు కూడా స్త్రీకి సంక్రమిస్తాయి. చట్టం అమలులోకి వచ్చిన తేదీకి ముందు వివాహం అయిన స్త్రీలకు ఆస్తి పంపకాలకు ఈ నిబంధన వర్తించదు.

## కారంచేడు ఘటనలో మరో ముగ్గురి అరెస్టు

చీరాల, సెప్టెంబరు 5 (న్యూస్‌టుడే): కారంచేడు సంఘటనకు సంబంధించి మరో ముగ్గురు నిందితులను పోలీసులు నిన్న అరెస్టు చేశారు. యార్లగడ్డ బ్రహ్మయ్య, యార్లగడ్డ పీతాంబరం, యార్లగడ్డ సింగయ్యలను పట్టుకోవడంలో అరెస్టుల సంఖ్య 66కి పెరిగింది. మొత్తం 82మంది నిందితులుగాను ... 65మందిని పోలీసులు అరెస్టుచేశారు. ఇంకా 14మందిని అరెస్టుచేయవలసి ఉందని పోలీసు అధికారికవర్గాలు తెలిపారు.

# అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్








Eenadu 29-04-1983

ఆత్మకూరు తాలూకా వెలిగోడువద్ద బ్యాలెన్సింగ్ రిజర్వాయరుకు శంకుస్థాపన జరిగినప్పటి దృశ్యం

# తెలుగుగంగ పథకంవల్ల నలుగురికీ మేలు

# మాగాణి కానున్న తెలంగాణా

## శ్రీరామసాగర్ ప్రాజెక్టుకు మే 4న శంకుస్థాపన

# అంబేద్కర్ సంస్మరణార్థమే చౌక ధర బియ్యం పథకం

Eenadu 15-04-1983

మా అందాల అన్నకు మల్లెపూదండ

# రాష్ట్రమంతటా సబ్సిడీ బియ్యం సరఫరా

సంచిక : 292 — 31-5-1986 శనివారం — 10 పేజీలు 70 పైసలు

# కార్యదర్శులే ఇక శాఖాధిపతులు
## మంత్రి, కార్యదర్శికి ఒకే ఆఫీసు

పెండింగ్ కేసులపై నెలవారీ నివేదికలు

త్వరలో మళ్ళీ వారానికి ఆరు రోజుల పనివిధానం

ఉద్యోగుల బదిలీలపై తరచుగా నివేదికలు

ప్రభుత్వరంగ అధిపతులుగా సాంకేతిక నిపుణుల నియామకం

# పాలనా సంస్కరణలు: పార్టీలో వ్యతిరేకత

# పాలనావ్యవస్థలో సమూల మార్పులు

క్రోధన నామ
...ది శుభాకాంక్షలు

# తెలుగు జాతికి వెలుగు జ్యోతి



రెండున్నర సహస్రాబ్దాల పురావైభవంతో ప్రసిద్ధి కెక్కిన తెలుగుజాతి చరిత్ర నిండా అపూర్వ సంఘటనలు ఎన్నెన్నో! శౌర్య పరాక్రమ ప్రాభవాలతో, సౌజన్య సౌశీల్య, స్నేహ పరిమళాలతో, లలితకళా వికాస కాంతులతో దేశ దేశాల్లో ప్రసిద్ధి కెక్కిన తెలుగుజాతి సగర్వంగా తలెత్తుకు తిరగగల సంఘటనలనెన్నిటినో సృష్టించింది.

ఇటీవలి కాలంలో అపూర్వ ప్రజాభిమానంతో అఖండ విజయ పరంపరలతో అసాధారణ రీతిలో రాష్ట్ర రథ సారథ్య బాధ్యతను స్వీకరించిన శ్రీయన్. టి. రామారావుగారి నాయకత్వంలో రాష్ట్ర సర్వతోముఖ వికాసానికి, పేదవర్గాల సత్వరాభివృద్ధికి అనేక కార్యక్రమాలు, ప్రగతి పథకాలు, సంక్షేమ చర్యలు ప్రారంభమయ్యాయి.

గడచిన రెండేళ్లలో వివిధ రంగాలలో సాధించిన ప్రగతే అందుకు నిదర్శనం. మరొకసారి రాష్ట్ర ప్రజలు చూపిన అపార విశ్వాసంతో, ఇచ్చిన మద్దతుతో ప్రజాసంక్షేమ దిశగా మరింత నూతనోత్సాహంతో వివిధ కార్యక్రమాలను చేపట్టడానికి సమాయత్తమైంది ప్రభుత్వం.

## గత రెండేళ్ళగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు

- 2 రూ లకే కిలో బియ్యం పథకం వల్ల 98.54 లక్షల కుటుంబాలకు ప్రయోజనం
- పేదల కోసం 1.85 లక్షల పక్కా, యిళ్ల నిర్మాణం. అవిగాక నిర్మాణంలో 90,000 పక్కా, యిళ్ళు.
- 7.18 లక్షల యిళ్ల స్థలాలు పంపిణి.
- 5 లక్షల వృద్ధ వ్యవసాయ కూలీలకు నెలకు రూ. 30 చొప్పున పింఛను
- సంక్షేమ పథకాల వల్ల 13.54 లక్షల బలహీన వర్గాల కుటుంబాలకు ప్రయోజనం.
- గ్రామాల్లో మంచినీటి ఎద్దడి తొలగించడానికి 28,180 నీటి వనర్ల ఏర్పాటు.
- 3,310 గ్రామాలకు, శివారు గ్రామాలకు విద్యుచ్ఛక్తి సౌకర్యం.
- లక్ష పంపుసెట్ల విద్యుదీకరణ
- గ్రామాల్లో 24,000 గ్రామీణ, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు
- గ్రామోదయ విముక్తి పథకాల ద్వారా 21,000 మందికి ప్రయోజనం
- మధ్యాహ్న భోజన సౌకర్యం వల్ల 34.32 లక్షల బడిపిల్లలకు మేలు
- వెనుకబడిన తరగతుల విద్యార్థుల కోసం 859 హాస్టళ్ళు
- జిల్లా కు రెండేసి పెద్యూలు కులాల నివాసిత పాఠశాలలు.
- స్త్రీలకు పురుషులతోపాటు ఆస్తిలో హక్కుకై చర్యలు.
- నెలకు 50 రూ॥ల చొప్పున 49,000 మంది వితంతువుల పింఛన్ల కోసం రూ 294 లక్షల కేటాయింపు (1984 - 85కు).
- మహిళల కోసం ప్రత్యేకంగా ఒక విశ్వవిద్యాలయం ప్రారంభం
- అకువచ్చు రేషను కార్డులున్న పేదవారికి సగం ధరకే చీర, ధోవతి
- బ్రిటిష్ సామ్రాజ్యవాద ప్రభుత్వ వారసత్వంగా వున్న గ్రామోద్యోగ వ్యవస్థ రద్దు
- ప్రజలకు సన్నిహితంగా ప్రభుత్వ పరిపాలనకు వీలుగా రెవిన్యూ మండలాలు.
- గ్రామప్రాంతాల్లో అభివృద్ధి పనుల్లో శ్రమశక్తి పథకం ద్వారా మధ్య దళారీల తొలగింపు.
- ఉద్యోగుల ప్రయోజనార్థం వేతన సంఘ నియామకం
- ప్రజల భాష తెలుగులో ప్రభుత్వ వ్యవహారాల నిర్వహణ

| 1985 - 86 లో | రూ. 1044 కోట్ల వార్షిక ప్రణాళిక |
|---|---|
| • సబ్సిడీ బియ్యం పథకానికి | రూ. 160 కోట్లు |
| • సగం ధరకు నేత చీరలు, ధోవతుల సరఫరాకు | రూ. 4 కోట్లు |
| • పాల సరఫరాదారులకు సబ్సిడీ | రూ. 216.22 లక్షలు |
| • వృద్ధాప్యపు పింఛన్లకు | రూ. 720 లక్షలు |
| • వృద్ధ వ్యవసాయ కూలీల పింఛన్లకు | రూ. 24 కోట్లు |
| • స్వంత రిక్షా పథకం అమలుకు | రూ. 75 లక్షలు |
| • గ్రామీణ నీటి సరఫరాకు | రూ. 25 కోట్లు |
| • గ్రామాల్లో విముక్తి పథకం కోసం | రూ. 5 కోట్లు |
| • పట్టణాల్లో విముక్తి పథకం కోసం | రూ. 7 కోట్లు |
| • సేద్యపు నీటి సౌకర్యానికి | రూ. 225.90 కోట్లు |
| • విద్యుచ్ఛక్తి కోసం | రూ. 200.41 కోట్లు |
| • పెద్యూల్సు కులాల విద్యార్థుల నివాసిత పాఠశాలలకోసం | రూ. 13.07 కోట్లు |
| • వెనుకబడిన తరగతుల ఆర్థిక సహాయ పథకాలకోసం | రూ. 450 లక్షలు |
| • వెనుకబడిన తరగతుల విద్యార్థులకోసం కొత్తగా నిర్మించే వసతి గృహాలు | 50 |
| • మహిళలకోసం కొత్తగా నిర్మించే పాలిటెక్నిక్‌లు | 2 |

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం – ఈ ప్రభుత్వం ప్రజలకే అంకితం

